# చైతన్య భగవద్గీత



4

స్వామి సుందర చైతన్యానంద

చైతన్య భగవద్గీత

# చైతన్య భగవద్గీత

(చతుర్థ సంపుటము)



స్వామి సుందర చైతన్యానంద

# చైతన్య భగవద్గీత

(చతుర్థ సంపుటము)

స్వామి సుందర చైతన్యానంద

చైతన్య భగవద్గీత
స్వామి సుందర చైతన్యానంద
ప్రథమ ముద్రణము : డిసెంబరు 2009........ 15000 కాపీలు.

ప్రతులకు:

1. సుందర చైతన్యాశ్రమం
దుండిగల్ రోడ్,
హైదరాబాద్ - 500 043.
☎ : 08418 - 255777
ఫాక్స్ : 08418 - 255355

2. చైతన్య వానప్రస్థాశ్రమం,
సుందర చైతన్యాశ్రమం
ధవళేశ్వరం - 533 125.
☎ : 0883 - 2417378

3. సుందర చైతన్యాశ్రమం
శాంతిపురం,
విశాఖపట్టణం - 530 016.
☎ : 0891 - 2791079
టైప్ సెట్టింగ్ : ప్రసాద్
ఫోటో డిజైనింగ్ : ప్రవీణ్
సుందర చైతన్యాశ్రమం,
హైదరాబాద్
ముద్రణ : శ్రీ లక్ష్మీ గణపతి బైండింగ్ వర్క్స్, కొవ్వూరు.
☎ : 08813 - 232354, 231575



# చైతన్య భగవద్గీత

స్వామి సుందర చైతన్యానంద

## విషయ సూచిక


గుణత్రయ విభాగ యోగము .......... 5
పురుషోత్తమ ప్రాప్తి యోగము .......... 81
దైవాసుర సంపద్విభాగ యోగము .......... 171
శ్రద్ధాత్రయ విభాగ యోగము .......... 247
మోక్ష సన్యాస యోగము .......... 321


# చైతన్య భగవద్గీత



స్వామి సుందర చైతన్యానంద









శ్లో॥ భారతామృత సర్వస్వమ్

విష్ణో ర్వక్త్రా ద్వినిస్సృతమ్ ।

గీతా గంగోదకం పీత్వా

పునర్జన్మ న విద్యతే ॥

విష్ణు దేవుని ముఖ కమలము నుండి వెలువడిన శ్రీమద్భగవద్గీత
మహా భారతము యొక్క అమృత మయమైన సర్వస్వము.
గీతా గంగోదకాన్ని పానం చేసిన వారికి పునర్జన్మ ఉండదు.






శ్లో॥ గీ కారం త్యాగ రూపం స్యాత్

తత్త్వబోధం త కారకమ్ ।

గీతా వాక్యం ఇదం తత్త్వం

జ్ఞేయం సర్వ ముముక్షుభిః ॥

'గీ' అంటే త్యాగము. 'త' అంటే తత్త్వ జ్ఞానము.
'గీత' అనే మాట లోని ఈ సత్యాన్ని మోక్ష ప్రియు లందరూ గ్రహించాలి.



మేము చేస్తున్న భక్తి ప్రచారం ఈ web sights ద్వారా చేస్తున్నాము
www.telugudevotionalswaranjali.blogspot.in
www.gitamakarandam.blogspot.in
www.sundaravignanagrandalayam.blogspot.in
www.hindudevotionalswaranjali.blogspot.in
OUR VIDEO CHANNELS:
www.youtube.com/user/hindudevotionalo
www.youtube.com/user/Shruthimandiramu
www.youtube.com/user/devotionalswaranjali
PDF BOOKS CHANNEL: www.scribd.com/ysreddy94hyd
E mail ID: ysreddy94hyd@gmail.com
FACEBOOK: YEDAVALLI SUDARSHAN REDDY
pl forward the above links to your friends&relatives
our mediafire folderlinks
www.mediafire.com/?86epi81waeayl
www.mediafire.com/?7900suod857zc
www.mediafire.com/?45h5fdfw4igzi
www.mediafire.com/?606gdhk35zvbc
www.mediafire.com/?ot92fowb91g18
www.mediafire.com/?xw75pfuld2dyy
our uploaded folder links:
www.4shared.com/account/dir/7389418/29f7347/sharing.h
www.4shared.com/account/dir/17611451/d787ef46/sharing.
www.4shared.com/account/dir/10277723/80937010/sharin
www.4shared.com/account/dir/8542654/5e21d7f2/sharing.
www.4shared.com/account/dir/13927785/d05881/sharing.h
www.4shared.com/account/dir/7389329/5bfa0697/sharing.

# చైతన్య భగవద్గీత

## అథ చతుర్దశోఽధ్యాయః - పద్నాల్గవ అధ్యాయము

## గుణత్రయ విభాగ యోగః - గుణత్రయ విభాగ యోగము

**జగత్కారణత్వము**

పుట్టేది ఏదైనా అది క్షేత్ర క్షేత్రజ్ఞుల సంయోగము వల్లనే పుడుతూ ఉంది అని పదమూడవ అధ్యాయంలో తెలుసుకున్నాం *( 13 వ అ - 26 వ శ్లో ).* ఈ రెండిటి సంయోగము వలన సృష్టి ఉత్పన్నమైంది అంటే, జగదుత్పత్తికి క్షేత్రక్షేత్రజ్ఞులే, అంటే ప్రకృతి పురుషులే హేతువులా? అనే ప్రశ్న పుడుతుంది. క్షేత్రక్షేత్రజ్ఞులు స్వతంత్రులై సృష్టికి హేతువు లవుతున్నారా? కాదు. ప్రకృతి పురుషులకు స్వతంత్ర జగత్కారణత్వము లేదు.

క్షేత్రము ఎలా వికారయుతమో *( 13 వ అ - 5, 6 శ్లో ),* క్షేత్రజ్ఞుడు దానిని ఎలా ప్రకాశింప చేస్తున్నాడో కూడా స్పష్టంగా తెలుసుకున్నాం *( 13 వ అ - 33 వ శ్లో ).* కనుక వికారయుతమైన క్షేత్రము ఆది కలది. ప్రకాశ స్వరూపుడైన క్షేత్రజ్ఞుడు ఆది లేని వాడు. వీరిద్దరు స్వతంత్రులై సృష్టి కారణ మయ్యారు అని చెప్పడం నిర్హేతుకం. ఈశ్వరాధీనులైన క్షేత్ర క్షేత్రజ్ఞులకే జగత్కారణత్వము సిద్ధిస్తుంది గాని స్వతంత్రులైన ప్రకృతి పురుషులకు మాత్రం కానే కాదు. ఈ విషయం సుస్పష్టం కావలసి ఉంది.

పుడుతున్న ప్రతిదీ క్షేత్రక్షేత్రజ్ఞుల సంయోగము వల్లనే పుడుతూ ఉంది ***(సర్వమ్ ఉత్పద్యమానం క్షేత్ర క్షేత్రజ్ఞ సంయోగాత్ ఉత్పద్యతే ఇత్యుక్తం)*** అని చెప్పబడింది. అది ఎలా ***(కథం)?*** అనే ప్రశ్న పడినపుడు, ఈశ్వరాధీనులైన క్షేత్రక్షేత్రజ్ఞుల సంయోగము వల్లనే పుట్టేది పుడుతూ ఉంది అని వేదాంతం ప్రవచిస్తూ ఉంటే, ప్రకృతి పురుషులు స్వతంత్రులై జగదుత్పత్తికి హేతువు లవుతున్నారు అని సాంఖ్య మతము చెబుతూ ఉంది. ఇది వాస్తవం కాదు.

అవిద్య చేత, ప్రకృతికి వశమై ఉన్న గుణాలతో పురుషునికి ఏర్పడిన అధ్యాసిక సంబంధమే సంసారానికి కారణము అని మనం తెలుసుకొని ఉన్నాం *( 13 వ అ - 21 వ శ్లో ).* కాని, కొన్ని ప్రధానమైన విషయాలను చర్చిస్తే గాని ఈ విషయం బోధ పడదు. క్షేత్రక్షేత్రజ్ఞుల సంయోగము వల్లనే ప్రతిదీ పుడుతూ ఉంది అన్నప్పుడు, ఈ విధమైన జగత్కారణత్వము స్వతంత్రమా? పరతంత్రమా? ఈశ్వరాధీనమా? ఈశ్వర పరతంత్రమా? అనేది తెలియాలి. ఇది మొదటిది.

వేదాంతము ప్రతిపాదించే ఈశ్వరాధీనులైన క్షేత్రక్షేత్రజ్ఞుల సంయోగమే జగదుత్పత్తి హేతువు అవుతుంది గాని, సాంఖ్యులు ప్రతిపాదించే ఈశ్వర పరతంత్రులైన ప్రకృతి పురుషులు కారు అనేది నిర్ణయించిన తరువాత, ప్రకృతికి వశమైన గుణాలతో పురుషుడికి ఏర్పడిన సంగత్వమే సంసార కారణ మనేది కూడా నిర్ధారణ కావాలి. ఇది రెండవది. ప్రధానంగా ఈ రెండు విషయాలను సుస్పష్టం చేయడానికే ప్రస్తుత అధ్యాయము. అదే గుణత్రయ విభాగ యోగము.

**కాపిల సాంఖ్యము - వేదాంతము**

ప్రకృతికి సంబంధించిన గుణాలు ఒకటి మరొక దానితో కలియడం చేత ఇరవై నాలుగు తత్త్వాలు ***(చతుర్వింశతి తత్త్వాః)*** ఏర్పడ్డాయని సంఖ్యలో లెక్కిస్తారు కనుక వారిని సాంఖ్యులు అన్నారు. ఈ సాంఖ్య

దర్శనాన్ని ఆవిష్కరించిన వాడు కపిల మహర్షి కావడం చేత దీనికి కాపిల సాంఖ్యము అనే పేరు వచ్చింది.

ఈ సాంఖ్యమత బీజాలు శ్వేతాశ్వతరోపనిషత్తు - ఆరవ అధ్యాయంలో ఉన్నాయి. ప్రకృతి పురుషులు స్వయంభువులు అంటారు సాంఖ్యులు. వారిరువురు స్వతంత్రంగా జగదుత్పత్తి హేతువులు అనేది సాంఖ్య సిద్ధాంతము.

ప్రకృతి త్రిగుణాత్మకము. జడరూపము. ప్రకృతి యొక్క త్రిగుణములు ఒక దానితో ఒకటి కలియడం చేత ఇరవై నాలుగు తత్త్వాలు ఏర్పడ్డాయి అంటారు సాంఖ్యులు. అవే చతుర్వింశతి తత్త్వములు. వీటి సమిష్టి రూపమే దృశ్యమాన ప్రపంచము. ఈ ఇరవై నాలుగు తత్త్వాలే దేహము ఉత్పన్నం కావడానికి కారణము.

పురుషుడు నిర్వికారుడు. చేతన స్వరూపుడు. ప్రకృతి వికారయుతము. జడరూపము. ప్రకృతి గుణాత్మకము. పురుషుడు గుణ రహితుడు. వీరిరువురి సంయోగము వల్లనే జగత్తు ఉత్పన్నమైంది అని సాంఖ్యమతము. చతుర్వింశతి తత్త్వములు మరియు పురుషుడు కలిసి ఇరవై ఐదు తత్త్వములు అంటూ వాటిని పంచవింశతి తత్త్వములు అని కూడా వారు పిలుస్తారు. దేహీ దేహములు ఈ ఇరవై ఐదు తత్త్వముల సంయోగమే నని సాంఖ్యుల అభిప్రాయము. వారి దృష్టిలో ప్రకృతి పురుషులు ఇరువురూ సత్యమే.

గుణ రహితుడు, శుద్ధ చైతన్య రూపుడు అయిన పురుషుడు త్రిగుణాత్మకమైన ప్రకృతి సంయోగము వలన గుణ సహితుడుగా తెలుస్తాడు. ఇదే బంధము. పురుషుడు ప్రకృతి బంధము నుండి విడి పడటమే మోక్షము అనేది సాంఖ్యుల సిద్ధాంతము.

జ్ఞానము వల్లనే మోక్షము ప్రాప్తిస్తుంది అని సాంఖ్యులు కూడా చెబుతారు (***జ్ఞానాన్ముక్తిః*** *- సాంఖ్య సూత్రము: 3 - 2*). ఇక్కడ జ్ఞానము అంటే, త్రిగుణాత్మకమైన ప్రకృతి కంటే తాను వేరు అని తెలియడమే.

ప్రకృతిని స్వతంత్ర మైనదిగా, స్వయంభువుగా వేదాంతము అంగీకరించదు. అలాగే, వేదాంతము ప్రతిపాదించే పురుషుడు ఒక్కడే గాని సాంఖ్యము చెప్పినట్లు అనేకులు కారు. ప్రకృతి పురుషుల సంయోగము వల్లనే జగత్తు ఉత్పన్నమైంది అని సాంఖ్యులు చెబితే, బ్రహ్మము నుండే జగత్తు ఉత్పన్నమైంది అని వేదాంతులు చెబుతారు.

## సందర్భము

క్షేత్రక్షేత్రజ్ఞుల సంయోగము చేతనే సృష్టి ఉత్పన్నమైంది అని పదమూడవ అధ్యాయంలో చెప్పబడింది (*13 వ అ - 26 వ శ్లో*). మరి, జగత్కారణంగా తెలుస్తూ ఉన్న ఈ క్షేత్రక్షేత్రజ్ఞులు లేక ప్రకృతి పురుషులు సాంఖ్యులు చెబుతున్నట్లు స్వతంత్రులా? లేక, వేదాంతులు చెబుతున్నట్లు ఈశ్వరాధీనులా? అనే విషయం సుస్పష్టం కావాలి. అది ఈ పద్నాల్గవ అధ్యాయంలో విశద మవుతుంది.

అలాగే, ప్రకృతి గుణాలతో సంగత్వము ఏర్పడటమే పురుషుని సంసారానికి హేతువు అని కూడా చెప్పబడింది (*13 వ అ - 21 వ శ్లో*). ఈ గుణ సంగము కూడా స్పష్టం కావలసి ఉంది.

ఏ గుణము నందు ఏ విధమైన సంగము ఏర్పడుతుంది (***కస్మిన్ గుణే కథం సంగః***) ? అసలు గుణాలు అంటే ఏమిటి? అవి ఏవి (***కేవా గుణాః***)? గుణాలు ఎలా బంధిస్తాయి (***కథం వా తే బధ్నన్తి***)? ఈ గుణాల నుండి విముక్తిని పొందేది ఎలా (***గుణేభ్యః చ మోక్షణం కథం స్యాత్***)? ముక్త పురుషుని యొక్క లక్షణా లేమిటి (***ముక్తస్య చ లక్షణం వక్తవ్యం***)? ఇవన్నీ తెలియ దగినవి. వీటి నన్నిటిని చెప్పవలసిన అవసరం ఉంది. అందుకే ఈ గుణత్రయ విభాగ యోగము అనే పద్నాల్గవ అధ్యాయము ఆరంభ మవుతూ ఉంది.





## గుణ సంగము - గుణాతీతము

వికారాలు, గుణాలు ప్రకృతి సంభవాలని ఇప్పటికే తెలుసుకున్నాం (*13 వ అ - 19 వ శ్లో*). కార్యాన్ని కారణం విడిచి పెట్టదు. కారణాన్ని విడిచి కార్యం ఉండలేదు. ప్రకృతి వలన ఏర్పడిన గుణాలలో ప్రకృతి లక్షణాలే ఉంటాయి. ప్రకృతి బంధహేతువు. కనుక, ప్రకృతి సంభవాలైన గుణాలు కూడా బంధహేతువులే.

గుణము అంటే ముడి లేక త్రాడు అని కూడా అర్థము. ఏదయితే పురుషుని సంసారానికి బంధిస్తూ ఉందో అదే గుణము. ఇలా చూచి నపుడు ఇది గుణమో, దోషమో కూడా అర్థం కాదు. గుణ సంగమే సంసార కారణము (***కారణం గుణసంగోఽస్య***). గుణ సంగం చేత పురుషుడు బద్ధు డయ్యాడు. కనుక గుణ విముక్తితో ముక్తు డవుతాడు.

అర్జునా! వేదము నందలి కర్మకాండ సమస్తమూ త్రిగుణ మిళితమైన సంసారాన్ని గూర్చే చెబుతూ ఉంది. **నిస్త్రైగుణ్యో భవ** - అర్జునా! నువ్వు గుణాల నుండి విడిపడిపో! గుణాతీతుడవు కా! ఆత్మజ్ఞానివి కా! అని గీత - రెండవ అధ్యాయం సాంఖ్యయోగం, నలభై ఐదవ శ్లోకంలో ఆదేశించిన భగవంతుడు, అట్టి స్థితిని పొంది తరించే దెలాగో ప్రస్తుత అధ్యాయంలో బోధిస్తాడు.

## గుణ భేదము - అభేద తత్త్వము

జీవు లందరూ ఒకే చైతన్యము నుండి ఆవిర్భవించి నపుడు, అందరూ ఒకే విధంగా లేకపోవ డానికి, వారి ప్రవర్తనములో వ్యత్యాసాలు గోచరించ డానికి కారణ మేమిటి? కార్యము నందు ఉన్నది కారణమే అయినపుడు, ఒకే కారణము నుండి ఉత్పన్నమైన కార్యాలలో భేదాలు ఎందుకు గోచరిస్తున్నాయి? అనేది చక్కని ప్రశ్న. ఈ ప్రశ్నకు తృప్తికరమైన రీతిలో సమాధానం ఈ అధ్యాయంలో లభిస్తుంది.

జీవుల ప్రవర్తనలో భేదాలు గోచరించ డానికి ప్రకృతి జన్యమైన గుణాలే కారణము కాని ఈశ్వర చైతన్యం కారణం కాదు. గుణభేదాలే కాని, చైతన్యములో భేదాలు లేవు. చైతన్యం సదా అభేదమే. అఖండమే.

విద్యుద్దీపాలు ప్రకాశిస్తూ ఉంటాయి. కొన్ని దీపాలు శ్వేత కాంతితో, కొన్ని అరుణకాంతితో, మరి కొన్ని నీలి వర్ణంతో వెలుగుతూ ఉంటాయి. వివిధ రంగులలో కాంతి విరజిమ్మ బడటానికి ఆయా దీపాల వర్ణములే కారణం కాని విద్యుచ్ఛక్తి కాదు కదా! విద్యుచ్ఛక్తిలో రంగు ఉందా? అలాగే, వ్యక్తులలో తెలుస్తున్న భేదాలకు ప్రకృతి జన్యమైన గుణాలే కారణం కాని, చైతన్యము మాత్రము కాదు.

జీవులలో రూప భేదాలకు, క్రియా రూప భేదాలకు కూడా గుణాలే ముఖ్య కారణము. ఒక గుండ్రని గాజుపాత్రలో నీరు నింపితే, పాత్ర లోని నీరు వలయాకారంగా అగుపిస్తుంది. చతురస్రంగా ఉండే గాజుపాత్రలో నీరు నింపితే ఆ నీరు చతురస్రాకారంలో కనిపిస్తుంది. వాస్తవానికి, ఈ కనిపించే రూపాలన్నీ పాత్రలకు సంబంధించినవే గాని నీటికి సంబంధించినవి కావు. నీటికి రూపము లేదు, ఆకారము లేదు. అలాగే చైతన్యము సదా అరూపమే. రూప భేదాలు, క్రియా రూప భేదాలన్నీ గుణ సంగములే.

## గుణత్రయ విభాగము

మూడు విధాలైన గుణ వికారాలే ఈ సమస్త ప్రపంచము అని తెలుసుకొని ఉన్నాం (***త్రిభిర్గుణ మయైః భావైః***: *7 వ అ - 13 వ శ్లో*). వికారము అంటే మార్పు. గుణాలన్నీ వికారాలే. మార్పు చెందేవే. మార్పు చెందేవి ఏవయినా అనిత్యాలే. విశేషాలే.

విశేషంగా ఏదున్నా దానికి ఆధారంగా సామాన్యం ఉండాలి. విశేష మేదైనా అది సామాన్యంలో ఉంటుందే గాని, సామాన్యం విశేషంలో ఇమడ లేదు.

కెరటం విశేషము. కడలి సామాన్యము. విశేషమైన కెరటం కడలిలో ఉంటుందే గాని, సామాన్యమైన కడలి కెరటంలో ఇమడ లేదు.

గుణ వికారాలతో విశేషంగా ఏ దృశ్య ప్రపంచము మనకు గోచరిస్తూ ఉందో, వాస్తవానికి అదంతా సామాన్యము యొక్క వికారమే. విశేషమే.

కనుక వికారాలుగా తెలిసే గుణ విశేషాలతో కూడిన ఈ ప్రపంచము సామాన్య సత్తా స్వరూపమైన చైతన్యానికి భిన్నంగా లేదు.

కాని, ప్రస్తుతం మన అనుభవం మరో విధంగా ఉంది. మనకు వికారాలు, విశేషాలు తెలుస్తున్నాయే గాని, అవి దేని విశేషాలో ఆ సామాన్యము మనకు అర్థం కావడం లేదు. కారణం, మన బుద్ధి త్రిగుణాలలో తగులుకొని ఉంది. త్రిగుణ మిళితమైన మాయ చేత కప్పబడి ఉంది. మాయ దాట శక్యం కాకుండా ఉంది ***(మమ మాయా దురత్యయా).*** మాయలో చిక్కుకున్న వారు మాయ నుండి బయట పడలేరు. వికారయుత మైన మాయను, విశేషంగా కనిపిస్తున్న ప్రపంచాన్ని, వాటికి మూలమైన సామాన్య సత్తారూప చైతన్యాన్ని అనుభూత మొనర్చుకున్నప్పుడే, ఈ మాయారూప ప్రపంచాన్ని విశేషంగా చూడగలం.

ప్రపంచాన్ని పరిశీలించి, పరీక్షించి అర్థం చేసుకుంటే, ఈ ప్రపంచము గుణమయంగా ఉందని, త్రిగుణమయంగా ఉందని అర్థ మవుతుంది. త్రిగుణములు అంటే సత్త్వ రజ స్తమో గుణాలు. బాహ్య ప్రపంచంలోని వస్తువులలో గాని, మన దేహేంద్రియ మనోబుద్ధులలో గాని ఉన్న వన్నీ గుణమిళితం గానే ఉన్నాయి.

**సత్త్వగుణము**

'సత్' అంటే యథార్థముగా ఉండేది, లేదా సత్యము. దానికి సంబంధించిన భావమే సత్త్వము ***(సతో భావః సత్త్వమ్, తత్ జ్ఞాన హేతుః).*** కనుక సత్త్వం అనేది జ్ఞానానికి కారణము అని తెలుస్తూ ఉంది. సత్త్వం కూడా గుణమే; కాకపోతే సుగుణము. ఇది జ్ఞానానికి, సుఖానికి మార్గాన్ని సుగమం చేస్తుంది ***(జ్ఞాన సుఖ హేతుః).***

సత్త్వగుణము కలవారు సాధుత్వముతో ప్రకాశిస్తారు ***(సత్త్వం సాధుత్వ ప్రకాశనం).*** సత్త్వము జ్ఞాన ప్రధానమైన గుణము కనుక, దీని యందు రజోగుణ తమోగుణాలు నశిస్తాయి ***(సీదంతి అస్మిన్ గుణాదయః ఇతి సత్త్వం).*** కనుక సత్త్వగుణం కల పుణ్యాత్ములు ప్రశాంతంగా, పవిత్రంగా, ప్రకాశంతో శోభిస్తూ ఉంటారు. సత్త్వగుణము నిర్మలత్వాన్ని ప్రసాదిస్తుంది ***(సాత్త్వికం నిర్మలం ఫలం).***

**రజోగుణము**

రజోగుణము కేవలం కర్మ ప్రధానంగా ఉంటుంది. రజస్సు అంటే ధూళి అని కూడా అర్థం. కర్మ ఝాలిన్యాన్ని కలిగించేది, కరిపించేది రజోగుణము. ఇది కామ ప్రధానమైన గుణము. రాగ ప్రధానంగా ఉండే గుణము ***(రజో రాగాత్మకం).*** రజోగుణమే మనిషిని రాగయుక్తుని చేస్తుంది ***(రంజయతీతి రజః).*** రాగమునకు విఘాతం కలిగి నపుడు ఆ రాగమే ద్వేషంగా మారుతుంది. ఈ విధంగా రాగద్వేషాలను కలిగించి రజోగుణము దుఃఖానికి కారణ మవుతుంది ***(రంజయతీతి రజః, తద్దుఃఖ కారణమ్!).*** రజోగుణము దుఃఖ ఫలాన్నే అందిస్తుంది ***(రజసస్తు ఫలం దుఃఖమ్).***

**తమోగుణము**

క్రియా శూన్యతను కలిగించేది తమోగుణము. తమోగుణము వల్లనే సోమరితనము కలుగుతుంది. తమస్సు అంటే చీకటి అని అర్థము. చీకటిలో మనిషికి ఏమీ కనిపించదు. చీకటి కాలంలో మనిషి ఏదీ





చేయలేడు, నిద్రించడము తప్ప. తమోగుణము కలవాడు క్రియాశూన్యుడై, జ్ఞానహీనుడై సోమరిపోతు అవుతాడు. మోహంలో కూరుకు పోతాడు. గ్లానిని పొందుతాడు ***(తము గ్లానౌ).*** తమోగుణమే మోహ కారణము ***(తన్మోహ బీజమ్).*** అధోగతి చెందడానికి తమోగుణమే కారణము.

ప్రకృతి స్వభావాలైన ఈ త్రిగుణముల సమ్మేళనమే మనిషి. ఏ సమయంలో కూడా మనిషి ఈ గుణాల నుండి విడిపడి ఉండ లేడు. కాకపోతే, ఒక్కొక్క సమయంలో ఒక్కొక్క గుణము ప్రధానంగా గోచరిస్తూ ఉంటుంది. ఏ గుణము ప్రధాన భూమికను పోషిస్తూ ఉంటే, దానికి అనుగుణంగా మనిషి ప్రవర్తిస్తూ ఉంటాడు.

కొన్ని సమయాలలో మనిషి చక్కని ఆలోచనలతో, మహోన్నతమైన భావాలతో శోభిస్తూ ఉంటాడు. ఆ సమయంలో అతని మనస్సులో సత్త్వగుణం ప్రధానంగా ఉందని అర్థము. మిగిలిన రెండు గుణాలు అముఖ్యంగా ఉన్నాయని అర్థము.

కొన్ని పరిస్థితులలో మనిషి శక్తిమంతుడై, క్రియాశీలుడై కర్మరంగంలో పరుగులు పెడుతూ ఉంటాడు. ఆ పరిస్థితులలో అతని మనస్సులో రజోగుణం ప్రధానంగా ఉందని, మిగిలిన రెండు గుణాలు అముఖ్యంగా ఉన్నాయని అర్థము.

సాధారణంగా క్రియా శూన్యతను పొంది, నిద్ర, అలసత్వాది లక్షణాలతో కనిపించే వ్యక్తిలో ప్రధానంగా తమోగుణమే ఉంటుంది. మిగిలిన రెండు గుణాలు అముఖ్యంగా ఉంటాయి.

అలాగని ఒక వ్యక్తిలో సదా సత్త్వమే ఉంటుందని, లేదా రజస్సే ఉంటుందని, లేదా తమస్సే ఉంటుందని చెప్పలేము. అవి మార్పు చెందుతూ ఉంటాయి. ప్రకృతి ఎలా మార్పు చెందుతూ ఉంటుందో, ప్రకృతి సంభవాలైన గుణాలు కూడా మార్పు చెందుతూ ఉంటాయి.

ఈ గుణాలను అధిగమించి గుణాతీత స్థితికి చేరి పోవాలి. ఈ సాధన సోపానక్రమంగా సాగాలి. తమోగుణ ప్రధానంగా జీవించే వారు, కర్మరంగంలో ప్రవేశించి, తమస్సు నుండి రజస్సుకు ప్రాకాలి. రజోగుణ ప్రేరితులై కర్మరంగంలో పడి కొట్టుకు పోయేవాళ్ళు, సరళ స్వభావులై, సచ్చింతనాపరులై, రజస్సు నుండి సత్త్వానికి ఎగబ్రాకాలి. సత్త్వగుణ ప్రధానులైన వారు తత్త్వ విచారము ద్వారా జ్ఞానమును సముపార్జించి గుణాతీతులు కావాలి. అదెలాగో తెలిపే అధ్యాయమే గుణత్రయ విభాగ యోగము.

ప్రకృతి, లేదా మాయ అనే తల్లికి కలిగిన ముగ్గురు బిడ్డలే ఈ త్రిగుణాలు. మూడూ మాయా సంభవాలే. మాయా స్వభావాలే. తమోగుణంతో నిద్రించే వాడు కుంభకర్ణుడు. రజోగుణంతో విజృంభించే వాడు రావణుడు. సత్త్వగుణంతో శోభించే వాడు విభీషణుడు. విభీషణుడు రజ స్తమోగుణ స్వభావులైన రావణ కుంభకర్ణులను విడిచి పెట్టి, సత్త్వగుణ ప్రధానుడై భక్తి చేసి, గుణాతీతుడైన శ్రీరాముని చేరి తరించి పోయాడు. ఇదెలాగో ఈ అధ్యాయం బోధిస్తుంది.

గుణయుతుడే కర్త, గుణాతీతుడే అకర్త అనే సమ్యక్ జ్ఞానము ఈ అధ్యాయంలో ఏర్పడుతుంది. కనుక ఈ గుణత్రయ విభాగ యోగము సాధకులకు అత్యంత ఉపయుక్తమైన అధ్యాయము.

కారు నడిపే వాడు, కారు యంత్రానికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానము కూడా కలిగిన వాడైతే, కారు చెడిపోయి, కదలకుండా ఆగిపోయినా, దానిని బాగు చేసుకొని మళ్ళీ ప్రయాణాన్ని సాగించ గలడు. అలాగే, గుణాల చేత ప్రేరితులై, పరుగు లెడుతూ, గుణదోషాల మధ్య అలమటిస్తూ సామాన్యులు ఉంటే, గుణత్రయానికి సంబంధించిన జ్ఞానము కలిగిన సాధకుడు గుణదోషాలను సరి చేసుకొని ఋజు మార్గంలో పయనించి గమ్యాన్ని చేర గలుగుతాడు. ప్రయాణం చేసే వారికి ఇంతకన్నా ఏమి కావాలి ? అయితే చదవండి.

**శ్రీ భగవానువాచ :**

**పరం భూయః ప్రవక్ష్యామి జ్ఞానానాం జ్ఞాన ముత్తమమ్ ।**
**యత్ జ్ఞాత్వా మునయః సర్వే పరాం సిద్ధి మితో గతాః ॥** 1

*పరం-భూయః-ప్రవక్ష్యామి-జ్ఞానానాం-జ్ఞానం-ఉత్తమం*
*యత్-జ్ఞాత్వా-మునయః-సర్వే-పరాం-సిద్ధిం-ఇతః-గతాః*

| | | | | | |
|---|---|---|---|---|---|
| | | | గతాః | = | పొందిరో |
| యత్ | = | దేనిని | పరం | = | శ్రేష్ఠమైన |
| జ్ఞాత్వా | = | గ్రహించి | జ్ఞానానాం | = | జ్ఞానములలో |
| సర్వే | = | సమస్తమైన | ఉత్తమం | = | ఉత్తమ మైనది |
| మునయః | = | మునులు | జ్ఞానం | = | విద్యను |
| ఇతః | = | ఈ సంసారమున | భూయః | = | మరల |
| పరాం | = | ఉత్తమమైన | ప్రవక్ష్యామి | = | చెబుతున్నాను |
| సిద్ధిం | = | సిద్ధిని | | | |

**శ్రీ భగవంతుడు చెబుతున్నాడు :**

**అర్జునా! విద్యలలో శ్రేష్ఠమైన ఉత్తమ విద్యను మళ్ళీ నీకు చెబుతున్నా. ఈ జ్ఞానాన్ని పొందినవారు ఉత్కృష్టమైన మోక్షాన్ని పొందారు.**

### వ్యాఖ్య

అర్జునుని ప్రశ్న కొరకు నిరీక్షించకుండా స్వయంగా భగవంతుడే విషయాన్ని ఆరంభించిన అధ్యాయాలలో ఇదొకటి. స్వయంగా ప్రారంభించడమే గాక, ఈ అధ్యాయంలో ప్రస్తావిస్తున్న విషయం క్రొత్త దేమీ కాదు, పూర్వం చెప్పినదే అని కూడా చెబుతున్నాడు. పూర్వం ఏదైతే చెప్పబడిందో, దానినే ప్రస్తుతం విస్పష్టంగా వివరిస్తున్నాను అంటున్నాడు *(భూయః ప్రవక్ష్యామి)*.

**ఉత్థాప్య ఉత్థాపకత్వము**

భగవద్గీత శ్రీకృష్ణార్జునుల సంవాద రూపంలో సాగిపోతున్న తాత్త్విక విషయము. అర్జునుని సందేహాలను నివారిస్తూ సిద్ధాంతమును ప్రతిపాదిస్తున్న మహోత్తమ గ్రంథము. కనుక అధ్యాయ విషయ ప్రస్తావన అనేది అర్జునుడు లేవనెత్తే ప్రశ్న బీజముపై ఆధారపడి ఇంత వరకు సాగుతూ వచ్చింది. అలా కాకుండా, కొన్ని అధ్యాయాలలో అర్జునుడు ప్రశ్నించక పోయినా, అర్జునుని అంతరంగాన్ని అర్థం చేసుకొని స్వయంగా భగవంతుడే విషయాన్ని ప్రస్తావించి భాషించడము, మరి కొన్ని చోట్ల పూర్వాధ్యాయాలలో విడిచి పెట్టిన విషయాలను తిరిగి లేవనెత్తి ప్రసంగించడం కూడా చూశాం.

కాని, ఈ అధ్యాయారంభములో అర్జునుని ప్రశ్న లేదు. అలాగే అర్జునుని అంతరంగమును అవలోకించి గాని, లేదా పూర్వాధ్యాయాలలో త్యజించిన విషయమును అంది పుచ్చుకొని బోధించడం గాని లేదు. అంటే, విషయం పూర్వాధ్యాయాలలో చెప్పినదే. దానినే మళ్ళీ *(భూయః పునః)* ప్రవచిస్తున్నాడు *(ప్రవక్ష్యామి)* అని అర్థం.

చెప్పిన విషయాన్నే తిరిగి చెప్ప వలసిన అవసర మేమిటి? అలా చెప్పడం వెనుక అసలు సంగతి





ఏమిటి? నిజంగానే ఇక్కడ ఒక సంగతి ఉంది. దానినే శాస్త్రంలో **ఉత్థాప్య ఉత్థాపకత్వ రూప సంగతి** అంటారు. ఉత్థాపకము అంటే లేపడము, లేదా అభిరుచిని కలిగించడము అని అర్థము. ఉత్థాప్యము అంటే, అలా ప్రేరేపించిన దానిని పరిష్కరించడము, లేదా కలిగించిన ఆకాంక్షను పూరించడము అని అర్థము. దీనినే 'ఉత్థాప్యోత్థాపకత్వము' అని అంటారు.

ప్రస్తుతము ఏ జ్ఞానమును భగవంతుడు పూర్వాధ్యాయాలలో అనేక చోట్ల, అనేక విధాలుగా చెప్పి ఉన్నాడో ***( పూర్వేషు అధ్యాయేషు అసకృత్ ఉక్తం )*** దానినే మళ్ళీ ***( భూయః పునః )*** ప్రవచిస్తున్నాడు ***( ప్రవక్ష్యామి )***. కారణము, ఆ జ్ఞానము ఉత్థాప్యము కావడమే. ప్రస్తావించ దగినది, లేదా లేవనెత్త దగినది కావడమే. అందుకనే 'వక్ష్యామి', వచిస్తున్నాను అనకుండా 'ప్రవక్ష్యామి', ప్రవచిస్తున్నాను అంటున్నాడు. సర్వ శ్రేష్ఠమైన విషయం కావడమే అలా ప్రస్తావించడం వెనుక ప్రముఖమైన కారణము. శ్రోత యొక్క బుద్ధిలో రుచిని ప్రేరేపించడం కొరకే ఇలా చెప్పవలసి వస్తుంది ***(శ్రోతృ బుద్ధి రుచ్యుత్పాదనార్థమ్)***. ఇంతకీ పరమేశ్వరుడు ప్రస్తావిస్తున్న జ్ఞానం ఏమిటి? దానిని రెండు విశేషణాలతో చెబుతున్నాడు. ఒకటి **పరం**, రెండవది **ఉత్తమం**.

**పరమాత్మ విషయం**

'పరమ్' అంటే ఉత్కృష్ట మైనది ***(పరమే ఉత్కృష్టే)***. జ్ఞానము ఉత్కృష్ట మైనది అన్నప్పుడు ఏ జ్ఞానము? అనే ప్రశ్న పుడుతుంది. జ్ఞానము ఏదైనా అది స్పష్టతను కలిగిస్తుంది కనుక ఉత్కృష్టమే. కాని, అన్ని జ్ఞానాల లోకి ఏది ఉత్కృష్టంగా చెప్పబడిందో అదే ఇక్కడ 'పరమ్' అని, 'ఉత్తమమ్' అని చెప్పబడుతూ ఉంది ***( సర్వేషాం జ్ఞానానామ్ ఉత్తమమ్ )***. అదే పరంజ్ఞానం లేదా పరావిద్య. దాని కన్నా అన్యమైనవి అపరావిద్యలు.

**ద్వే విద్యే వేదితవ్యే, పరా చైవాపరా చ !**

తెలియ దగిన విద్యలు రెండే ఉన్నాయి. ఒకటి పరవిద్య, రెండవది అపరవిద్య అని ముండకోపనిషత్తులో అంగిరస మహర్షి శౌనకునికి చెబుతాడు.

పరమాత్మకు సంబంధించిన విద్య పరవిద్య. పరవిద్య కాని ఇతర విద్యలన్నీ అపరవిద్యలే. అపర విద్య లన్నీ విషయ సంబంధ మైనవి. పరవిద్య ఒక్కటే 'విషయి'కి సంబంధించినది. కనుక అది ఆత్మ విషయం. పరమాత్మ విషయం. మోక్షమే లక్ష్యముగా గలది.

అపరావిద్య లన్నీ ప్రకృతి, లేదా క్షేత్ర సంబంధ మైనవి. ఇవన్నీ మనస్సు చేత తెలియ బడుతాయి. పరావిద్య పురుష, లేదా క్షేత్రజ్ఞ సంబంధమైన జ్ఞానమును ప్రసాదిస్తుంది. కనుక, మనస్సు చేత కాకుండా మనస్సులో తెలియ బడుతుంది. ఇది చాలా సూక్ష్మంగా గ్రహించ వలసిన విషయము. అందుకే ఈ జ్ఞానమును అన్ని జ్ఞానముల లోకి ఉత్తమమైన జ్ఞానముగా అభివర్ణించడము జరిగింది.

***అహం ఘటం జానామి*** - 'నేను కుండను తెలుసుకుంటున్నాను' అనే వాక్యమును పరిశీలిస్తే, ఇక్కడ కుండకు సంబంధించిన జ్ఞానము మనకు కలగడంలో మూడు విషయాలు చోటు చేసుకొని ఉన్నాయి. (1)'నేను' ***( అహం )*** అనే దానికి సంబంధించిన సంకల్ప విషయము (2) కుండ ***( ఘటం )*** యొక్క రూపానికి సంబంధించిన వృత్తి విషయము (3) ఘటమునకు సంబంధించిన జ్ఞానము కలుగుట ***( జానామి )*** అనే విషయము.

'నేను' అనే వృత్తి, లేదా సంకల్పము ఘటము యొక్క ఆకారమును పొందడము మొదట జరగాలి. ఇక్కడ విషయ భేదము ననుసరించి రెండు జ్ఞానములు అందుతున్నాయి. ఒకటి వృత్తి, రెండవది ఘటాకార

వృత్తి. అంత మాత్రము చేత ఘటజ్ఞానము కలుగుతుందా? ఘట ప్రకాశ ఫలరూపమైన జ్ఞానము కూడా కలగాలి. ఇదే ఫలవ్యాప్తి జ్ఞానము. ఇదే పరమాత్మ చైతన్య రూప జ్ఞానము. ఇదే జ్ఞానాలలో ఉత్తమమైన జ్ఞానము. సర్వులు దర్శింప దగిన పరమాత్మ రూప జ్ఞానము. అదే ఆత్మజ్ఞానము. దానిని దర్శించాలి.

*శ్లో॥ పరాగర్థ ప్రమేయేషు యా ఫలత్వేన సంమతా।*
*సంవిత్సైవేహ మేయోఽర్థో వేదాంతోక్తి ప్రమాణతః॥*

ఆ యా ప్రమేయ విషయాల యందు ఏ యే జ్ఞానము ఫలరూపంగా సమ్మతమో, అట్టి సంవిద్రూప చైతన్యమే ఉపనిషత్ వాక్య ప్రమాణము ద్వారా పొంద దగినది అని సురేశ్వరుల వార్తికము.

ఏ జ్ఞానమును అపరావిద్యల ద్వారా మనం పొందినా, ఆ జ్ఞానము వృత్తివ్యాప్తి, ఫలవ్యాప్తి అనేవి రెండూ ఏర్పడి నపుడే పొందు తున్నాము. కనుక అపరావిద్య లన్నీ ఫలవ్యాప్తి నిచ్చే వృత్తిజ్ఞానాలే కనుక అవి మనస్సు చేత పొందబడు తున్నాయి.

కాని, పరావిద్య దీనికి విలక్షణంగా శోభిస్తూ ఉంది. అపరావిద్యల చేత పొందబడే ఫలరూప జ్ఞానము విషయాలకు సంబంధించిన అజ్ఞానమును నివృత్తి చేస్తూ ఉందే గాని, 'విషయి'కి సంబంధించిన అజ్ఞానమును నివారించడం లేదు. ఘటద్రష్ట ఘటజ్ఞానమును పొందు తున్నాడే గాని, ద్రష్ట యైన తనకు సంబంధించిన జ్ఞానమును పొందలేక పోతున్నాడు. కనుక, స్వరూప అజ్ఞానము నుండి విముక్తిని పొంద లేకున్నాడు. స్వరూప అజ్ఞానమే బంధము. స్వరూప జ్ఞానమే మోక్షము. కనుక స్వరూప జ్ఞానమును పొంద వలసి ఉంది. ఈ జ్ఞానము విషయ జ్ఞానము లాంటిది కాదు. 'విషయి'కి సంబంధించిన జ్ఞానము. మోక్షరూప మైన జ్ఞానము. ఈ జ్ఞానమును గురువు ద్వారానే పొందాలి. గురువు అందించే ఈ జ్ఞానము కూడా ప్రమాణము ద్వారానే అందాలి. అందుకే మోక్ష జ్ఞానానికి శ్రవణమే ప్రధానమైన సాధనగా చెప్పబడింది.

**అప్రమేయ జ్ఞానము**

ఏ జ్ఞానము నైనా మనస్సు ద్వారానే పొందాలి. జ్ఞానమును పొంద డానికి మన వద్ద మరొక సాధనము లేదు. అపరా విద్యలను మనస్సు చేత పొందే విధానాన్ని, జ్ఞాతృ జ్ఞాన జ్ఞేయ భేదము ననుసరించి (***అహం ఘటం జానామి***), వృత్తివ్యాప్తి, ఫలవ్యాప్తి అని తెలుసుకున్నాం. మరి, పరావిద్య అయిన మోక్ష విషయ జ్ఞానమును ఎలా తెలుసుకోవాలి? దేని చేత తెలుసుకోవాలి? మనస్సు చేతనే తెలుసుకోవాలి. మరో మార్గమే లేదు. అందుకనే ***మనసైవానుద్రష్టవ్యం*** - ఆత్మను మనస్సు ద్వారానే తెలుసుకోవాలి అన్నది బృహదారణ్యక శ్రుతి.

మనస్సు ద్వారా తెలుసుకోవడం అంటే వృత్తి జ్ఞానం కలిగి తీరాలి. వృత్తివ్యాప్తి జరిగి (***ఘటాకార వృత్తి***), ఫలవ్యాప్తి జరగడం ద్వారానే ఘట జ్ఞానము కలుగుతూ ఉంది.

ఇలాగే, ఆత్మజ్ఞానము కలగాలి అంటే, మొదట ఆత్మాకార వృత్తి ఏర్పడాలి. ఆత్మ అనే దానికి ఆకారము ఉందా? ఆకారమే లేనపుడు ఆత్మాకార వృత్తి ఎలా ఏర్పడుతుంది? ఆత్మాకార వృత్తి, లేదా బ్రహ్మాకార వృత్తి ఏర్పడ నపుడు, వృత్తి లేకుండా వృత్తి జ్ఞాన మెలా పుడుతుంది?

వృత్తి జ్ఞానము కలగాలి అంటే వృత్తి ఏర్పడక తప్పదు కనుక, ఆత్మ విషయంలో కూడా వృత్తి ఏర్పడక తప్పదు. అదే ఆత్మాకార వృత్తి. ఈ ఆత్మాకార వృత్తి ఏర్పడటానికి ఆత్మ దృశ్యరూపంలో లేదు కనుక, బోధ రూపంలో వృత్తి తయా రవుతుంది. గురువు ఆత్మ యొక్క లక్షణాలను బోధించడం ద్వారా శ్రోత యొక్క బుద్ధిలో ఆత్మాకార వృత్తి జనిస్తుంది. ఈ విధంగా ఆత్మాకారవృత్తి, లేదా బ్రహ్మాకారవృత్తి మనస్సు చేత





కాకుండా మనస్సులో కలుగుతుంది. బుద్ధి చేత చూడ బడేది కాకుండా బుద్ధిలో చూడ బడుతుంది (***మనసా ఏవ అను ద్రష్టవ్యం***).

బుద్ధి చేత చూడబడే విషయాలన్నీ (అపరా) మార్పు చెందుతూ ఉంటాయి. అవి మారుతూ ఉండినా, వాటిని దర్శించే ద్రష్ట యొక్క చైతన్యములో ఏ విధమైన మార్పు లేదు.

కాని, బుద్ధిలో ఏ ఆత్మాకార వృత్తి ఏర్పడిందో (పరా) అది విషయాల వలె మార్పు చెందేది కాదు. అది ద్రష్టకు సంబంధించిన వృత్తి. అట్టి ఆత్మాకార వృత్తిని దర్శిస్తే, ఫలవ్యాప్తి కలిగి ఆత్మజ్ఞానం పుడుతుందా? పుట్టే అవకాశం లేదు. ఆత్మాకార వృత్తిని ఎవరు దర్శించాలి? ఆత్మాకార వృత్తికి ద్రష్ట ఎవరు? ద్రష్ట వేరుగా ఉంటే, అది విషయాకార వృత్తి అవుతుందే గాని, ఆత్మాకార వృత్తి కాలేదు. కనుక, ఆత్మ విషయానికి సంబంధించిన జ్ఞానబోధ వల్ల బుద్ధిలో ఆత్మాకార వృత్తి, లేదా బ్రహ్మాకారవృత్తి ఏర్పడుతుంది.

బుద్ధిలో బ్రహ్మాకార వృత్తి ఏర్పడుతుంది. అంటే, వృత్తివ్యాప్తి జరుగుతుంది. కాని, ఫలవ్యాప్తి జరగదు. ఫలవ్యాప్తి జరగడము అంటే, 'ఇది బ్రహ్మము' (***ఇదం బ్రహ్మ***) అనే జ్ఞానము కలగడము అని అర్థం. మరి, 'ఇది బ్రహ్మము' అనే జ్ఞానం ఎవరికి కలిగింది? ఎవరికి కలిగినా, అది కలిగిన వాడు బ్రహ్మమా? అబ్రహ్మమా? అబ్రహ్మమునకు బ్రహ్మ జ్ఞానము ఎలా ప్రాప్తిస్తుంది? బ్రహ్మమునకే ప్రాప్తిస్తుంది. కనుకనే 'నేను బ్రహ్మము' (***అహం బ్రహ్మ***) అంటాడే గాని 'ఇది బ్రహ్మము' (***ఇదం బ్రహ్మ***) అని అనడు. కారణం, బ్రహ్మోపదేశం వల్ల బ్రహ్మాకారవృత్తి బుద్ధిలో ఏర్పడి నపుడు దానిని తన కన్నా వేరుగా కాకుండా తన స్వరూపం గానే అనుభూతిని పొందుతున్నాడు. ఇదే జ్ఞానవృత్తి. ఈ జ్ఞానవృత్తి అజ్ఞాన వృత్తిని నిర్మూలిస్తుంది. ఈ విధంగా స్వరూప జ్ఞానం ఎవరికి కలుగుతుందో వారు బంధ విముక్త లవుతారు. ఇక్కడే కాస్త జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఇక్కడ పుట్టేది జ్ఞానమే గాని ఆత్మ కాదు. ఆత్మ ఎప్పుడూ ఉన్నదే. అది తెలియక పోవడమే అజ్ఞానము. అదే బంధము. ఆత్మోపదేశం వల్ల ఆత్మజ్ఞానం కలిగితే, ఆత్మ అజ్ఞానము, అజ్ఞాన జనిత బంధము, రెండూ నశిస్తాయి. జ్ఞానం స్వప్రకాశమై తేజరిల్లుతుంది.

కేవలం జ్ఞానరూపోఽహం కేవలం పరమోఽస్మ్యహం

నేను కేవలం జ్ఞానరూపుడను. నేను కేవలం పరముడను (సర్వోత్కృష్టుడను) అని తేజోబిందూపనిషత్తు.

**పరోత్తమం**

పరావిద్య ఒక్కటే మోక్ష ప్రదాయిని. అపరావిద్య లన్నీ విద్యలే అయినప్పటికి అవి మోక్షాన్ని ప్రసాదించ లేవు (***తాని న మోక్షాయ***). కనుకనే మోక్షాన్ని ప్రసాదించే ఈ జ్ఞానాన్ని పరమని, ఉత్తమ మని భగవంతుడు స్తుతిస్తున్నాడు (***ఇదం తు మోక్షాయ ఇతి పరోత్తమ శబ్దాభ్యాం స్తౌతి***). జ్ఞానాలలో ఉత్తమమైన జ్ఞానముగా దీనిని అభివర్ణిస్తున్నాడు.

ఏదైతే ఉత్తమ ఫలాన్ని ఇస్తుందో అదే ఉత్తమ జ్ఞానము. అట్టిది ఆత్మజ్ఞానమే గాని మరొకటి కాదు. మన వద్ద ధనం ఉంటే, అది వస్తువులను పొందడానికి ఉపకరించినట్లు, అపరావిద్య లన్నీ జన్మలను పొందడానికి, నూతన దేహాలను ధరించడానికి ఉపకరిస్తాయి. కాని, ఆత్మజ్ఞానము అనే పరావిద్య, నిద్రలో భయంకర మృగాల చేత పీడింప బడుతున్న వానిని క్షణంలో లేపి, ప్రకాశమును దర్శింప చేసి ప్రమోదమును కలిగించినట్లు, అక్షయ సుఖమును అనుగ్రహిస్తుంది. కనుక, ఇట్టి ఉత్కృష్టమైన ఫలమును ప్రసాదించేది కావడం చేతనే, ఆత్మజ్ఞానము సమస్త జ్ఞానాలలో పరమ మని, ఉత్తమ మని శ్లాఘింప బడింది (***సర్వేషాం జ్ఞానానామ్ ఉత్తమమ్, ఉత్తమ ఫలత్వాత్***).

**అమృత ఫలప్రాప్తి**

ప్రస్తుతము ఉపదేశిస్తున్న జ్ఞానము పరమాత్మకు సంబంధించిన విషయం కావడం చేత *(పరమ్)* అది ఉత్తమమైన ఫలాన్ని ప్రసాదిస్తూ ఉంది *(మోక్షం)*. అదే అమృతఫల సిద్ధి. ఈ అమృత ఫలప్రాప్తిని మునులు పొందుతారు.

మునులు అంటే మననశీలురు అని అర్థం. వారే యతి పురుషులు *(మునయః మననశీలాః)*. మునులు అంటే సర్వజ్ఞులు అని కూడా అర్థం *(మను అవబోధనే, మన్యతే మునిః)*. సర్వ జ్ఞానమును, సర్వాత్మ జ్ఞానమును పొందుతారు కనుక వారు సర్వజ్ఞులు. ఇక్కడే వారు పూర్ణ పురుషు లవుతారు. ముక్తపురుషు లవుతారు. మరొక దానిని తెలుసుకోవాలి అనే స్పృహను కలిగించే జ్ఞానం ఉత్తమ జ్ఞానం కాలేదు. ఏదైతే సమస్త బంధాల నుండి విడిపించి, స్వరూప జ్ఞానమును కలిగిస్తూ ఉందో, అదే అమృత ఫలా న్నందించే పరోత్తమ జ్ఞానము. కనుకనే, ఈ పరమాత్మ జ్ఞానమును పొందిన వారందరు *(యత్ జ్ఞాత్వా, యత్ జ్ఞానం జ్ఞాత్వా ప్రాప్య)* మోక్షమనే ఉత్కృష్ట మైన సిద్ధిని పొందుతారు అంటున్నాడు భగవంతుడు *(పరాం సిద్ధిం గతాః ప్రాప్తాః)*. వారే మునులు. ముక్త పురుషులు. సర్వత్ర బ్రహ్మదర్శనం చేయువారు. జీవన్ముక్తులు.

*జగజ్జీవాది రూపేణ పశ్యన్నపి పరాత్మవిత్ ।*
*న తత్పశ్యతి చిద్రూపం బ్రహ్మవస్త్వేవ పశ్యతి ॥*

పరాత్మను తెలుసుకున్న వాడు ప్రపంచ రూపంలో, ప్రాణుల రూపంలో సమస్తమును చూస్తున్నప్పటికీ, అతడు ఆ దృశ్యజాలమును భేదబుద్ధితో చూడడు. బ్రహ్మవస్తువు గానే దర్శిస్తాడు అన్నది పాశుపత బ్రహ్మోపనిషత్తు.

*ఇట్టి పరోత్తమమైన అమృత ఫలసిద్ధి అందరికీ సిద్ధిస్తుందా? తప్పక సిద్ధిస్తుంది. సందేహించ నవసరం లేదు. వినండి.*

**ఇదం జ్ఞాన ముపాశ్రిత్య మమ సాధర్మ్య మాగతాః ।**
**సర్గేఽపి నోపజాయన్తే ప్రలయే న వ్యథన్తి చ ॥** 2

*ఇదం-జ్ఞానం-ఉపాశ్రిత్య-మమ-సాధర్మ్యం-ఆగతాః*
*సర్గే-అపి-న-ఉపజాయంతే-ప్రలయే-న-వ్యథంతి-చ*

| | | | |
|---|---|---|---|
| ఇదం | = ఈ | ఆగతాః | = పొందిన వారు |
| జ్ఞానం | = జ్ఞానమును | సర్గే అపి | = సృష్టి కాలము నందు కూడా |
| ఉపాశ్రిత్య | = ఆశ్రయించి | న ఉపజాయంతే | = తిరిగి పుట్టరు |
| మమ | = నా యొక్క | ప్రలయే | = ప్రళయకాలము నందు |
| సాధర్మ్యం | = స్వరూపమును | న వ్యథంతి చ | = దుఃఖమును పొందరు |

**ఈ జ్ఞానమును ఆశ్రయించి, నా స్వరూపమును పొందిన వారు సృష్టి కాలమున జన్మించరు. ప్రళయ కాలమున దుఃఖించరు.**

**వ్యాఖ్య**

**జ్ఞాన వైభవము**

జ్ఞానమును పొందిన వారు మోక్షమును పొందుతారు, పూర్ణత్వమును సిద్ధింప చేసుకుంటారు అని పూర్వ





శ్లోకంలో చూశాం. జ్ఞానమును పొందిన వారికి పూర్ణత్వము సిద్ధించింది అంటే, జ్ఞానమును పొందక ముందు వారు పూర్ణ స్వరూపులు కారని అర్థమా? అదే నిజమైతే, పూర్ణ స్వరూపులు కాని వారు అపరిపూర్ణులే కదా? అపరిపూర్ణులు అంటే పరిమితమైన వారే కదా! అలాంటప్పుడు వారికి పూర్ణత్వము ఎలా సిద్ధిస్తుంది?

పరిమిత మైనది అపరిమిత మెలా అవుతుంది? అపరిపూర్ణము పరిపూర్ణ మెలా అవుతుంది? అంతం కలిగినది అనంత మవుతుందా? అయ్యేందుకు అవకాశమే లేదు. అది అసంభవం. అయినా అది సంభవ మైంది అంటే, అంతకు పూర్వం అది అసంభవం కాకుండా ఉండాలి. సంభవ మయ్యే ఉండాలి. అంతకు మించి మరో అవకాశం లేదు. అపూర్ణ మైనది పూర్ణం కాదు. కాలేదు. పూర్ణమైంది అంటే మాత్రం అంతకు ముందు కూడా అది పూర్ణమయ్యే ఉండాలి.

నేను పూర్ణమయ్యే ఉండి, మళ్ళీ పూర్ణుణ్ణి కావాలని ప్రయత్నిస్తున్నాను అంటే, దాని అర్థ మేమిటి? నేను పూర్ణుణ్ణి అనే జ్ఞానం నాకు లేకుండా పోవడమే. నేనే పూర్ణము అని నాకు తెలియక పోవడం చేతనే, జపమాలను మెడ లోనే ఉంచుకొని ఊరంతా వెతికినట్లు, నేను పూర్ణత్వాన్ని పొందాలని ప్రయత్నిస్తున్నాను. ఇదీ సమస్య.

ఇలా అన్వేషించే వ్యక్తి సమస్యలో నిమగ్నమై ఉన్నాడు. నిజానికి ఇక్కడ సమస్య ఉందా? వస్తువును అన్వేషిస్తూ ఆందోళన చెందుతున్నాడు కనుక సమస్య ఉన్నట్లే ఉంది. వాస్తవానికి వస్తువు దూరం కాలేదు కనుక సమస్య లేనే లేదు. లేని సమస్య ఉన్నట్లు తెలుస్తూ ఉంది. ఇదీ ఒక విధమైన సమస్యే. కాకపోతే ఇది కల్పిత సమస్యే గాని, వాస్తవమైన సమస్య కాదు.

సమస్య వాస్తవ మైనపుడు దానిని ప్రయత్నము ద్వారా పరిష్కరించుకోవచ్చు. కాని లేని సమస్య ఉన్నట్లు గోచరించి నపుడు దానిని లేని దానినిగా అర్థం చేసుకోవాలి. అంతేగాని, ఉన్న దానినిగా నిర్ధారణ చేసి కర్మ ద్వారా తొలగించే ప్రయత్నానికి పూనుకోవడం అర్థ రహితం; వ్యర్థం.

నాకు సంబంధించిన జ్ఞానం లేకపోవడమే నా సమస్య అని తేలినపుడు, నాకు సంబంధించిన జ్ఞానము నాకు కలగడమే దానికి ఏకైక పరిష్కారము. జ్ఞానమే అజ్ఞానమును నివృత్తి చేస్తుంది. నాకు సంబంధించిన సత్య జ్ఞానము నాకు కలిగితే, నాకు సంబంధించిన అజ్ఞానము, అట్టి అజ్ఞానము వలన ఏర్పడిన పరిపూర్ణ సిద్ధి కాంక్ష, రెండూ నశించి పోతాయి. కనుక పూర్ణత్వ సిద్ధికి ఏకైక తరుణోపాయము జ్ఞానమే *(జ్ఞానాత్ మోక్షః)*. నేను పూర్ణుడను. ఎప్పుడు? ఇప్పుడే. ఇక్కడే. మరి అప్పుడు, అక్కడ? అప్పుడూ పూర్ణుడనే. ఇప్పుడూ పూర్ణుడనే. అక్కడా పూర్ణుడనే. ఇక్కడా పూర్ణుడనే *(పూర్ణ మదః పూర్ణమిదం)*. అప్పుడు పూర్ణుడనే. కాని, పూర్ణుడను అనే జ్ఞానం లేని వాణ్ణి. ఇదే తేడా. పూర్ణుడ నైన నన్ను పూర్ణుణ్ణి చేసింది జ్ఞాన మొక్కటే. అదే జ్ఞాన మహిమ. కనుక పూర్ణ స్వరూపులై శోభించాలని ఆశించే వారు ఈ జ్ఞానమునే ఆశ్రయించాలి. ఆత్మజ్ఞానమును ఆశ్రయించిన వారు ఆత్మస్వరూపమును తప్పక పొందుతారు.

**జ్ఞానాశ్రయము**

అర్జునా! ఈ జ్ఞానమును ఆశ్రయించిన వారు *(ఇదం జ్ఞానం ఉపాశ్రిత్య)* నా స్వరూపాన్నే పొందుతారు *(మమ సాధర్మ్యం ఆగతాః)* అంటున్నాడు భగవంతుడు. జ్ఞానమును ఎలా ఆశ్రయించాలి? జ్ఞానమును ఆశ్రయించడము అంటే జ్ఞాన సాధనలను ఆశ్రయించడమే. జ్ఞానమును పొందడానికి అనువైన సాధన సామగ్రిని సంపాదించుకోవడమే. జ్ఞానాంగములను సిద్ధం చేసుకోవడమే. కనుక, జ్ఞానమును పొందడమే జ్ఞానాశ్రయము.

వెలుగు ఎన్నో కార్యాలు చేయదు. ఒకే పని చేస్తుంది. అంధకారమును అదృశ్యం చేస్తుంది. అదే

ప్రకాశము యొక్క ఏకైక కార్యము. అలాగే జ్ఞానము కూడా అజ్ఞానమును పోగొట్టడ మనే ఏకైక కార్యమును నిర్వహిస్తుంది. కనుక జ్ఞానమును పొందాలి.

జ్ఞానమును ప్రమ అంటారు. ప్రమను కలిగించేది ప్రమాణం. జ్ఞానము కలగాలి అంటే, జ్ఞానమును కలిగించే ప్రమాణము ఉండాలి. అదే శాస్త్రము. శాస్త్ర ప్రమాణము. శాస్త్రము అంటే వేదము. అదే వేద ప్రమాణము; ఉపనిష త్ప్రమాణము. ప్రమాణము ఉన్నప్పుడు ప్రమ కలగక పోయే అవకాశమే లేదు. కనుక జ్ఞానాన్ని పొందాలని అభిలషించే వారికి శ్రుతియే ప్రమాణము. శ్రుతియే శరణము ***(శ్రుతి రేవ శరణ మితి)***.

కనుక జ్ఞానాశ్రయము అంటే ప్రమాణ విచారమే ముఖ్య విషయముగా గలది అని అర్థము. ప్రమాణ విచార వ్యాపారములో శ్రవణ, మనన, నిదిధ్యాసనలు ప్రధాన మైనవి. వాస్తవానికి శ్రవణమే అత్యంత ముఖ్య మైనది. శ్రవణము అంగి. మనన నిదిధ్యాసనలు అంగములు. ఇవే జ్ఞాన సాధనములు. వీటిని ఆశ్రయించడం అంటే జ్ఞానమును ఆశ్రయించడ మని అర్థము ***(జ్ఞానం ఉపాశ్రిత్య జ్ఞానసాధనమ్ అనుష్ఠాయ ఇత్యేతత్!)***. జ్ఞానము కలిగితే మోక్షం సిద్ధిస్తుంది. బంధము తొలగి పోతుంది. నేను అపరిపూర్ణుడను అనే అజ్ఞానమే బంధానికి కారణం కనుక, నేను పూర్ణస్వరూపుడను అనే జ్ఞానము ప్రమాణం ద్వారా కలిగి నపుడు, అజ్ఞానము, అజ్ఞానము వలన ఏర్పడిన బంధము తొలగిపోయి, అద్వయమైన ఆత్మే నేను అనే అనుభూతి కలుగుతుంది. అదే స్వరూప స్థితి. ఆత్మస్వరూప స్థితి.

**స్వరూప ప్రకాశము**

జ్ఞానమును ఆశ్రయించిన వారు స్వరూపమును పొందుతారు. ఆత్మ, ఆత్మజ్ఞానము రెండు కావు. పరమాత్మ, పరమాత్మ జ్ఞానము రెండు కావు. పరమాత్మ జ్ఞానమును ఆశ్రయించిన వారు పరమాత్మ స్వరూపమును పొందుతారు. అర్జునా! ఈ జ్ఞానమును ఆశ్రయించిన వారు నా సాధర్మ్యాన్ని పొందుతారు ***(మమ సాధర్మ్య మాగతాః)*** అని గీతాచార్యుని మాట.

ఈ సందర్భములో 'సాధర్మ్యం' అనే మాటను జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. 'సాధర్మ్యం' అంటే సమాన మైన ధర్మాలు కలిగి ఉండటం అని కొందరు వ్యాఖ్యానించారు. అది సముచితం కాదు. సాధర్మ్యం అనే దానిని సమాన జాతి రూపాదిమత్త్వముగా గ్రహించడానికి వీలు లేదు.

ఒకే జాతికి సంబంధించిన రెండు వస్తువులలో ఒక దానికి మరొక దానికి మధ్య భేదము తెలుస్తూ ఉండినా, కొన్ని ధర్మాలు, లేదా లక్షణాలు సమానంగా ఉండే టప్పుడు దానిని సాధర్మ్యం అంటారు.

గో గవయముల మధ్య సాధర్మ్యం ఉంది. రెండూ ఒకే జాతికి సంబంధించినవి. ఆవుకు, ఎద్దుకు రెండిటికీ కొమ్ము లున్నాయి. రెండిటికీ తోక లున్నాయి. రెండిటికీ నాలుగేసి కాళ్ళు ఉన్నాయి. ఇవన్నీ సమాన ధర్మాలుగా కనిపించినా, ఆ రెండిటిలో పరస్పరం అనేక భేదా లున్నాయి. క్షీరదానము మొదలు సంతానోత్పత్తి వరకు గో గవయముల మధ్య సాధర్మ్యము లేదు.

పరమాత్మ నిర్గుణము, నిరవయవము, నిర్విశేషము, నిరాకారము. అట్టి అద్వయ పరబ్రహ్మమునకు సమాన జాతి రూపాదికాలు ఎలా సంభవిస్తాయి? కనుక, సాధర్మ్యము అంటే పూర్ణత్వము, లేదా స్వరూపము అనే అర్థమును గ్రహించాలి గాని, సమానధర్మము అనే అర్థమును గ్రహించడానికి వీలు లేదు ***(సాధర్మ్యం మత్స్వరూపతామ్, ఆగతాః ప్రాప్తాః ఇత్యర్థః న తు సమాన ధర్మతాం సాధర్మ్యమ్)***.

సాధర్మ్యం అంటే సమాన ధర్మాలు కలిగి ఉండటం అనే అర్థాన్ని గ్రహిస్తే, జీవేశ్వరుల మధ్య భేద దర్శనము జరుగుతుంది. అలా గ్రహించ బట్టే, కొందరు వ్యాఖ్యాతలు అద్వైతముతో విభేదిస్తూ వ్యాఖ్యలు





నడిపారు. ఈ విధమైన వ్యాఖ్యలు గీతా శాస్త్రానికి ఆమోదయోగ్యాలు కావు. క్షేత్రజ్ఞ ఈశ్వరుల మధ్య భేదాన్ని గీతాశాస్త్రము అంగీకరించదు ***(క్షేత్ర జ్ఞేశ్వరయోః భేదానభ్యుప గమాత్ గీతాశాస్త్రే!)***.

కనుక, 'నా సాధర్మ్యము' అంటే 'నా స్వరూపము' అనే భావము ***(మమ సాధర్మ్యం మద్రూపత్వమ్ ...*** *శ్రీధరుని సుబోధినీ వ్యాఖ్య)*. భగవద్గీత సప్తమాధ్యాయము పద్దెనిమిదవ శ్లోకంలో జ్ఞాని తానే నని భగవంతుడు స్వయంగా తెలిపి ఉన్నాడు కదా ***(జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్)***!

సద్వస్తువులు రెండు ఉండ లేవు. సద్వస్తువు అద్వయమే. సద్వస్తువు అద్వయ మైనపుడు, సద్వస్తు జ్ఞానము కూడా అభేదము, అద్వైతమే గాని భేదము కాలేదు; ద్వైతము కాబోదు.

కనుక బ్రహ్మము అఖండము; బ్రహ్మజ్ఞానము కూడా అఖండమే. అదే పరమాత్మ జ్ఞానము. దానినే 'పరం' అని మొదటి శ్లోకంలో చూశాము. కనుక పరమాత్మను తెలుసుకోవాలని ప్రయత్నించే వాడు తానే పరమాత్మ అని తెలుసుకుంటాడు. *బ్రహ్మవిదాప్నోతి పరమ్* - బ్రహ్మమును తెలుసుకొనే వాడు తానే పరంబ్రహ్మము అని తెలుసుకుంటున్నాడు అని తైత్తిరీయ శ్రుతి అమోఘంగా ప్రవచించింది.

**జ్ఞాన ఫల ప్రశంస**

జ్ఞానమును ఆశ్రయించి, పరమాత్మ స్వరూపమును పొందిన వారు మళ్ళీ జన్మించరు ***(న ఉపజాయన్తే న ఉత్పద్యన్తే)***. అలాగే నశించి దుఃఖించరు ***(న వ్యథన్తి వ్యథాం న ఆపద్యన్తే)***.

***పునరపి జననం, పునరపి మరణం, పునరపి జననీ జఠరే శయనమ్*** అనే సంసార సాగరము నుండి బయట పడి తరిస్తారు. దేహి దేహముతో తాదాత్మ్యం చెంది ఉన్నంత వరకే జననమరణాలు ప్రాప్తిస్తూ ఉంటాయి. ప్రకృతి స్వరూపమైన క్షేత్రము నుండి విడిపడిన క్షేత్రజ్ఞుడు తానే ఈశ్వరుడు అనే జ్ఞానాన్ని పొందడం చేత దేహానికి పరిమితుడు కాడు. జననమరణాలు దేహానికే గాని దేహికి కావు కదా! అందుచేత ఆత్మజ్ఞాని పుట్టడు. అలాగే గిట్టడు. ఈ దివ్య స్థితి నుండి పతన మెరుగడు. ఈ విషయమును వేదము కూడా ప్రవచించింది. ఆత్మజ్ఞానమును దివ్యంగా ప్రశంసించింది.

***య ఏవ వేదాహం బ్రహ్మాస్మీతి స ఇదం సర్వం భవతి, సర్వస్య వశీ, సర్వస్యేశానః సర్వస్యాధిపతిః స న సాధునా కర్మణా భూయాన్, నో ఏవాసాధునా కనీయాన్***, 'నేనే బ్రహ్మమును అని ఎవడైతే తన స్వరూపమును తెలుసుకుంటున్నాడో, వాడు ఈ సమస్త ప్రపంచము తానే అగుచున్నాడు. సర్వమును తన వశము నందు ఉంచుకుంటున్నాడు. సర్వమునకు ప్రభువు తానే అవుతున్నాడు. సమస్తమునకు తానే అధిపతి అగుచున్నాడు. అట్టివాడు పుణ్యకర్మల చేత శ్రేష్ఠుడు కాడు; పాపకర్మల చేత నికృష్టుడు కాడు' అని శ్రుతి ప్రబోధం.

*మొదటి రెండు శ్లోకాలలో జ్ఞానమును స్తుతించిన గీతాచార్యుడు, ఇక పద్నాల్గవ అధ్యాయము యొక్క కేంద్ర విషయమైన గుణత్రయము వైపు దృష్టిని పెడుతున్నాడు. గుణాలు జీవుని ఎలా బంధిస్తున్నాయో తెలిపే ఉద్దేశ్యముతో, ముందుగా క్షేత్ర క్షేత్రజ్ఞ సంయోగము ఎలా భూత కారణమో వివరిస్తున్నాడు.*

**మమ యోని ర్మహద్బ్రహ్మ తస్మిన్ గర్భం దధా మ్యహమ్ ।** 3
**సమ్భవః సర్వభూతానాం తతో భవతి భారత ॥**

*మమ-యోనిః-మహత్-బ్రహ్మ-తస్మిన్-గర్భం-దధామి-అహం*
*సంభవః-సర్వభూతానాం-తతః-భవతి-భారత*

భారత = అర్జునా!

| | | | | | |
|---|---|---|---|---|---|
| మహత్ | = | గొప్పదైన | గర్భం | = | గర్భమును |
| బ్రహ్మ | = | బ్రహ్మ | దధామి | = | ఉంచుతున్నాను |
| మమ | = | నా యొక్క | తతః | = | ఆ కారణము చేత |
| యోనిః | = | కారణము | సర్వభూతానాం | = | సర్వభూతముల యొక్క |
| తస్మిన్ | = | దాని యందు | సంభవః | = | ఉత్పత్తి |
| అహం | = | నేను | భవతి | = | అవుతూ ఉంది |

**అర్జునా! గొప్పదైన ప్రకృతి నాకు గర్భస్థానము. దాని యందు నేను గర్భాధానం చేస్తాను. ఆ విధంగా సర్వప్రాణులు పుడుతున్నాయి.**

### వ్యాఖ్య

స్థావర జంగమాత్మకమైన ప్రాణి సముదాయ మంతా క్షేత్ర క్షేత్రజ్ఞుల సంయోగము వల్లనే పుడుతూ ఉంది అని పదమూడవ అధ్యాయంలో తెలుసుకున్నాం *( 13 వ అ - 26 వ శ్లో ).* సర్వభూతోత్పత్తి హేతుత్వము ఈశ్వరాధీనులైన క్షేత్రక్షేత్రజ్ఞులకే గాని, కాపిల సాంఖ్యము చెప్పినట్లు ఈశ్వర పరతంత్రులైన క్షేత్రక్షేత్రజ్ఞులకు లేదు అని మనం అధ్యాయ పీఠికలో చెప్పుకొనిన విషయాన్ని పరమేశ్వరుడు ఈ శ్లోకంలో సహేతుకంగా వివరిస్తున్నాడు.

**సంబోధనాశయము**

సర్వభూతోత్పత్తి కారణాన్ని వివరిస్తున్న ఈ సందర్భములో అర్జునుని *భారతా!* అని సంబోధించడం గమనించ దగిన విషయం. భరత వంశము నుండి పుట్టిన వాడు కావడం చేత అర్జునుని భారతా! అని పిలుస్తున్నాడు. భవన ధర్మముల తోనే సర్వ ప్రాణులు ఉద్భవిస్తున్నాయి. అర్జునా! నీ జన్మ మెలాగో ఈ జగత్తు యొక్క పుట్టుక కూడా అలాంటిదే నంటూ, జగదుత్పత్తి కారణత్వాన్ని వివరిస్తున్నాడు.

**జననీ జనకులు**

బిడ్డ తల్లి నుండి పుట్టినట్లు, ఈ ప్రపంచము ప్రకృతి, లేదా మాయ నుండి ఉద్భవించినది. మాయయే సర్వ ప్రపంచానికి జన్మస్థానము ***( యోనిః ).*** దీనిని 'నా ప్రకృతి' అంటున్నాడు అచ్యుతుడు ***( మమ యోనిః ).*** అంటే, 'నాకు సంబంధించిన ప్రకృతి' అని అర్థము. పరమేశ్వరుని ఆశ్రయించుకొని మనుగడను సాగిస్తున్న మాయ, లేదా ప్రకృతిని 'నా ప్రకృతి' అంటున్నాడు. ఏడవ అధ్యాయం - పద్నాల్గవ శ్లోకంలో కూడా **మమ మాయా** అనడం జరిగింది. ఇక్కడికే మనకు ఒక విషయం స్పష్ట మైంది. విశ్వోత్పత్తికి ఈశ్వరాధీన మైన ప్రకృతియే కారణం గాని, సాంఖ్యులు చెప్పే ఈశ్వర పరతంత్రమైన ప్రకృతి కాదు అనేది తేటతెల్ల మైంది.

ప్రకృతి, లేదా మాయను గొప్పదైన బ్రహ్మగా అభివర్ణించడం జరిగింది ***( మహద్బ్రహ్మ ).*** ఇక్కడ *బ్రహ్మ* అంటే త్రిగుణాత్మకమైన ప్రకృతి. ***మహత్*** అంటే గొప్పది అని అర్థము. భూతోత్పత్తి కారణంగా తెలుస్తున్న మాయ అటు ***మహత్*** శబ్దము చేత, ఇటు *బ్రహ్మ* శబ్దము చేత కూడా చెప్పబడుతూ ఉంది.

కార్య రూపంగా తెలుస్తున్న ఈ ప్రపంచానికి ప్రకృతి కారణము. తన నుండి పుట్టిన కార్యా లన్నిటి కంటే గొప్పది కావడం చేత, అంటే ఆకాశాది భూతాల కంటే సూక్ష్మ మైనది కావడం చేత ప్రకృతి ***మహత్*** అని పిలువ బడింది ***( సర్వ కార్యేభ్యః బృహత్త్వాత్ ).*** అట్టి మహత్తరమైన ప్రకృతి సర్వ ప్రాణులకు బృంహణముగా ఉంది. అంటే, బృంహణత్వ ధర్మముతో శోభిస్తూ ఉంది. పుట్టిన భూత ప్రపంచ వృద్ధికి కారణం కావడమే





బృంహణత్వ ధర్మము ***( భరణాత్ చ స్వవికారం ).*** గొప్పది కావడమే గాక, సర్వ కార్యాలను, వికారాలను భరించడం వల్ల ప్రకృతి **మహద్బ్రహ్మ** వాచ్యమైంది.

**జగద్బీజము**

జీవోత్పత్తికి జననీజనకులు ఎలా అవసరమో, అలాగే జగదుత్పత్తికి కూడా జననీ జనకులు ఉండాలి. కర్మ బద్ధుడై ధాన్యాది రూపాలలో తన యందు ప్రవేశించి లీనమై ఉన్న జీవుని దేహధారిగా చేయడానికి పురుషుడు స్త్రీ యందు ఎలా గర్భాధానము చేస్తాడో, అలాగే అవ్యక్తంగా ఉన్న ప్రపంచము వ్యక్తం కావడానికి పరమేశ్వరుడు ప్రకృతి యందు గర్భాధానము చేస్తున్నాడు. సృష్టి కార్యాన్ని నిర్వహించడానికి ప్రకృతికి సత్తా స్ఫూర్తులను అనుగ్రహిస్తున్నాడు. ఇక్కడే జగద్బీజము, విశ్వబీజము, ఆది బీజము గోచరిస్తూ ఉంది.

కేవలం జన్మ నిచ్చే తల్లి ఉన్నంత మాత్రాన జీవోత్పత్తి జరగదు. గర్భాధానము చేసే తండ్రి కూడా ఉండాలి. అదే సృష్టి అంటే. ఉపాదాన నిమిత్త కారణాలు రెండూ ఉంటేనే సృష్టి కార్యము జరుగుతుంది. జగద్విస్తార హేతువైన విశ్వబీజమును ఉంచిన భగవంతుడు సర్వభూతోత్పత్తికి నిమిత్త కారణం కాగా, జగద్బీజమును అంకురింప చేసే ప్రకృతి ఉపాదాన కారణమైంది. జగత్తంతా ఉపాదాన కారణమైన ప్రకృతి పరిణామమే అయినా, జగత్తు నందలి జీవజ్యోతి నిమిత్త కారణమైన పరమేశ్వరునికి సంబంధించినది. మాయ, లేదా ప్రకృతి కూడా బ్రహ్మమునే ఆశ్రయించుకొని ఉన్నందున, ఈ సృష్టికి భగవంతుడు అభిన్న నిమిత్త ఉపాదాన కారణంగా తెలుస్తున్నాడు.

తైత్తిరీయ శ్రుతి ప్రవచించినట్లు, 'నేను అనేకంగా అవుతాను' **( బహుస్యాం ప్రజాయే యేతి )** అనే పరమేశ్వర సంకల్పమే హిరణ్యగర్భాది సమస్త భూతముల ఆవిర్భావమునకు ఆదిబీజము అని గ్రహించాలి. అంటే, ప్రపంచము విస్తరించ డానికి కారణమైన చిదాభాసమును లేదా చిచ్ఛక్తిని ప్రకృతి గర్భము నందు పరమేశ్వరుడు నిక్షిప్తం చేస్తున్నాడు ***(తస్మిన్ గర్భం అహం దధామి నిక్షిపామి ).*** ఈ విధంగా సర్వ భూతోత్పత్తి జరుగుతుంది. కేవలం మనం ప్రకృతి సంభవులమే అయితే, పగిలిన కుండ మట్టిగా మారినట్లు, చచ్చిన తరువాత శ్మశానంలో మట్టిలో మట్టిగా కలిసి పోతామే గాని, మోక్షాన్ని పొంద లేము అనే సత్యాన్ని చక్కగా అర్థం చేసుకోవాలి.

స్త్రీ గర్భము నందు పురుషుడు రేతస్సును విడుచుట చేత పిండోత్పత్తి జరిగినట్లు, ప్రకృతి యందు పరమేశ్వరుడు చేతనా రేతస్సును నిక్షిప్తం చేయడం వల్ల సమస్త భూతోత్పత్తి జరుగుతూ ఉంది. ఇక్కడే క్షేత్ర క్షేత్రజ్ఞ సంయోజనము జరిగి హిరణ్యగర్భుని ఉత్పత్తి ద్వారా సర్వభూతోత్పత్తి జరుగుతూ ఉంది ***( క్షేత్రజ్ఞం క్షేత్రేణ సంయోజయామి ఇత్యర్థః సంభవః ఉత్పత్తిః సర్వభూతానాం హిరణ్యగర్భోత్పత్తి ద్వారేణ ).*** ఈ విషయాన్నంతా ఆంధ్ర మహాభారతము - శాంతిపర్వములో పూర్వము వసిష్ఠ మహాముని జనకమహారాజుకు చెప్పిన విషయాన్ని తిక్కనామాత్యుడు ఒక కందములో అందముగా చెబుతాడు.

***క॥ నరనారీ సంబంధము వరుసగదా పురుషునకును బ్రకృతికి నన్యో***
***న్య రమణ మది సర్వజనన కర మిట్టుల శ్రుతులు సెప్పు గారుణ్యనిధీ ॥***

*సర్వ భూతజాలమునకు ప్రకృతియే తల్లి, పరమాత్మయే తండ్రి అనే విషయాన్ని తరువాత శ్లోకంలో కూడా వినిపిస్తున్నాడు.*

సర్వయోనిషు కౌన్తేయ మూర్తయః సమ్భవన్తి యాః । 4
తాసాం బ్రహ్మ మహద్యోని రహం బీజప్రదః పితా ॥

**సర్వయోనిషు-కౌంతేయ-మూర్తయః-సంభవంతి-యాః**
**తాసాం-బ్రహ్మ-మహత్-యోనిః-అహం-బీజప్రదః-పితా**

| | | | |
|---|---|---|---|
| కౌన్తేయ | = అర్జునా! | మహత్ బ్రహ్మ | = గొప్పదైన ప్రకృతి |
| సర్వయోనిషు | = సమస్త యోనులందు | యోనిః | = గర్భస్థానము |
| యాః | = ఏ | అహం | = నేను |
| మూర్తయః | = రూపాలు | బీజప్రదః | = గర్భాధానము చేసే |
| సంభవంతి | = పుట్టుచున్నవో | పితా | = తండ్రిని |
| తాసాం | = వానికి | | |

**అర్జునా! పుడుతున్న ప్రాణు లన్నిటికీ జన్మ నిచ్చే తల్లి ప్రకృతి. నేను బీజ ప్రదానం చేసే తండ్రిని.**

**వ్యాఖ్య**

**మాతృ స్థానంలో ప్రకృతి**

సృష్టి లోని భూతజాలమును పరిశీలించి చూసినపుడు వాటి అవయవ నిర్మాణము, దేహ నిర్మాణ క్రమము ఒకే విధంగా కనిపించడం లేదు. దేహాలు ఏవైనా, అవయవ నిర్మాణం తోనే ఉన్నాయి. ఆ అవయవాలు కూడా ఒక విధంగా లేవు. అనేక రూపాలలో గోచరిస్తున్నాయి. అందుకే వాటిని మూర్తులు అన్నారు ***(మూర్తయః)***. దేహ నిర్మాణంలో సంహతి రూపంలో కనిపిస్తున్న అవయవాలు స్థిరంగా, అంటే ఒకే విధంగా బండిచక్రము లోని ఆకుల వలె లేవు. విభిన్నమైన రీతులలో పెరుగుతూ కొన్ని, మార్పు చెందుతూ మరి కొన్ని ఉన్నాయి. కనుక దేహ నిర్మాణం లోని అంగాలన్నీ అస్పష్టం గానే ఉన్నాయి. అందుకే దేహా లనే మూర్తుల అవయవాలను ***మూర్ఛితాంగ అవయవాః మూర్తయః*** అన్నారు భాష్యంలో ఆచార్యులు. అస్పష్టంగా ఉన్న దేహాంగములు గల మూర్తులు, లేదా పెరుగుటకు, విస్తరించుటకు అవకాశమున్న శరీరావయవాలు గల మూర్తులు అని అర్థము.

మరి దేహాలు, దేహాంగాలు అనేక విధాలుగా ఉండే టప్పుడు అవి వేర్వేరు కారణాల వల్ల ఏర్పడుతున్నాయేమో అనే సందేహము కలిగే ప్రమాదం లేక పోలేదు. దేహాలు వివిధ రూపాలలో, వివిధ మూర్ఛితాంగ అవయవాలతో కనిపిస్తూ ఉండినా, అన్ని మూర్తులు ఒకే కారణం నుండి ఉద్భవిస్తున్నాయి అని ప్రస్తుత శ్లోకము నిర్ణయిస్తూ ఉంది. అన్ని దేహాలకు వాటికి సంబంధించిన కారణ రూపంగా ప్రకృతియే మాతృస్థానంలో ఉంది అంటున్నారు.

**కారణ కార్యాలు**

దేహాలన్నీ కార్య రూపంలో కనిపిస్తున్నాయి. వివిధ జాతుల నుండి ఉత్పన్న మవుతున్నాయి. దేవతలు, పితరులు, మానవులు, పశువులు, మృగాలు మొదలైన సమస్త యోనుల నుండి ఉద్భవిస్తున్నాయి ***( దేవ పితృ మనుష్య పశు మృగాది సర్వయోనిషు )***. కాకపోతే, కొన్ని ప్రాణులు అండజాలు. పక్షి, పాము, చేప మొదలైన వన్నీ గ్రుడ్ల నుండి పుడుతాయి. కనుక అవి అండజాలు. అలాగే చెమట నుండి పుట్టే స్వేదజాలు, భూమిని ఛేదించుకొని పుట్టే ఉద్భిజాలు - ఇలా జరాయుజ, అండజ, స్వేదజ, ఉద్భిజాది భేదాలతో పుడుతూ ఉన్నందున వాటి దేహావయవ నిర్మాణాల వల్ల భేదాలు గోచరిస్తున్నాయే గాని కారణాంతరము ఉండి మాత్రము కాదు. సర్వ భూతములు ఒకే కారణము నుండి సంభవిస్తున్నాయి. ఆ కారణము ప్రకృతియే. కనుక వివిధావయవ నిర్మాణ భేదముతో గోచరిస్తున్న భూతా లన్నిటికి ***( తాసాం మూర్తీనాం )*** గొప్పదైన ప్రకృతియే ***(బ్రహ్మ మహత్)***





కారణంగా ఉంది ***( యోనిః కారణమ్ )***. అర్జునా! పరమేశ్వరుడ నైన నేను ***(అహం ఈశః)*** బీజ ప్రదానము చేసి గర్భాధానము చేసే తండ్రిని ***( బీజప్రదః గర్భాధానస్య కర్తా పితా )***.

**మాతాపితలు**

కారణ భావమును పొందిన ప్రకృతిమాత మాతృ స్థానములో ఉండి సర్వభూతోత్పత్తికి హేతువుగా తెలుస్తూ ఉంది. ఉపాదాన కారణంగా శోభిస్తూ ఉంది. పరమాత్మ పితృ స్థానములో ఉండి బీజ ప్రదానం చేస్తున్నాడు. అందుకనే పరమేశ్వరుని భూతజాలానికి ఆదికర్తగా స్మృతి అభివర్ణించింది ***(ఆది కర్తా స భూతానామ్)***. బీజకర్తగా పరమేశ్వరుడు శోభిస్తున్నాడు. బీజ కారణం ఉంది కనుకనే తాను బీజకర్త అయ్యాడు ***( బీజం మాం సర్వ భూతానాం విద్ధి*** : 7 వ అ - 10 వ శ్లో ).

ఇది అర్థమైతే, సర్వ జీవులకు మాతాపితలు ప్రకృతీ పరమేశ్వరులే. జన్మకు కారణమైన వారు జననీ జనకులు అని భావిస్తూ ఉంటారు. ఇది వాస్తవం కాదు. తల్లిదండ్రులు దేహాన్ని ప్రసాదించడానికి నిమిత్తంగా ఉన్నారు. అంతే. కేవలం స్త్రీ పురుష సంయోగము వల్లనే జీవులు ఉత్పత్తి కారు. అలా అయ్యేటట్లయితే రేత స్సించనం జరిగిన ప్రతి గర్భము నందు జీవోత్పత్తి జరగాలి. అదే సంభవ మైతే సంతాన హీను లెందుకుంటారు? కనుకనే, క్షేత్ర క్షేత్రజ్ఞ సంయోజనాన్ని సర్వజ్ఞుడైన పరమాత్మే ఏర్పాటు చేస్తాడు. ఎవరు ఎక్కడ పుట్టాలో, ఎవరికి పుట్టాలో సర్వజ్ఞుడైన పరమేశ్వరునికే తెలుసు. కనుకనే, భగవంతుని అధీనంలో ఉన్న క్షేత్రక్షేత్రజ్ఞులు సర్వభూతోత్పత్తికి హేతువు లవుతున్నారు. తల్లిగా ప్రకృతి, తండ్రిగా పరమేశ్వరుడు శోభిస్తున్నారు. అర్ధనారీశ్వర తత్త్వం కూడా అదే.

***జగతః పితరౌ వన్దే పార్వతీ పరమేశ్వరౌ*** - విశ్వానికి జననీజనకు లైన పార్వతీ పరమేశ్వరులకు నమస్కారం అంటూ మంగళ శ్లోకాన్ని వినిపించి, మహాకవి కాళిదాసు జగత్కళ్యాణాన్ని వాంఛిస్తూ రఘువంశం అనే మహాకావ్యాన్ని రచించాడు.

***మాతా చ పార్వతీ దేవీ పితా దేవో మహేశ్వరః ।***
***బాంధవాః శివభక్తాశ్చ స్వదేశో భువనత్రయమ్ ॥***

పార్వతీదేవి తల్లి. పరమేశ్వరుడు తండ్రి. ఈశ్వర భక్తులే బంధువులు. స్వదేశమే త్రిభువనములు అన్నారు శ్రీ శంకర భగవత్పాదులు.

భగవంతుడే సమస్త ప్రపంచానికి తండ్రి. వాస్తవానికి ప్రకృతి, లేదా మాయ బ్రహ్మమునే ఆశ్రయించుకొని ఉన్నందున, తల్లిదండ్రు లిరువురు కూడా పరమాత్మయే. ఈ సమస్త జగత్తుకు ఆది తానే. సృష్టికర్త యైన హిరణ్యగర్భుడూ తానే. తానే తల్లి. తానే తండ్రి. తానే కర్త. తానే సృష్టికర్త ( 9 వ అ - 17 వ శ్లో ).

*ఇలా సృష్టింపబడిన జీవులు గుణాల చేత ఎలా బద్ధు లౌతున్నారో చెబుతున్నాడు.*

సత్త్వం రజ స్తమ ఇతి గుణాః ప్రకృతి సమ్భవాః । 5
నిబధ్నన్తి మహాబాహో దేహే దేహిన మవ్యయమ్ ॥

**సత్త్వం-రజః-తమః-ఇతి-గుణాః-ప్రకృతి సంభవాః**
**నిబధ్నంతి-మహాబాహో-దేహే-దేహినం-అవ్యయం**

| | | | |
|---|---|---|---|
| మహాబాహో | = అర్జునా! | రజః | = రజస్సు |
| సత్త్వం | = సత్త్వము | తమః | = తమస్సు |

| | | | |
|---|---|---|---|
| ఇతి | = అనే | దేహినం | = జీవుని |
| ప్రకృతిసంభవాః | = ప్రకృతి వలన పుట్టిన | దేహే | = దేహము నందు |
| గుణాః | = గుణములు | నిబధ్నంతి | = బంధిస్తున్నాయి |
| అవ్యయం | = నాశరహితుడైన | | |

**అర్జునా! జీవుడు నశించే వాడు కాడు. ప్రకృతి నుండి పుట్టిన సత్త్వ రజ స్తమో గుణాలు జీవుణ్ణి దేహంలో బంధిస్తున్నాయి.**

### వ్యాఖ్య

గుణములు ఏవి *(కేగుణాః)?* అవి పురుషుని ఎలా బంధిస్తున్నాయి *(కథం బధ్నన్తి)?* ఈ విషయాలను ప్రస్తుత శ్లోకము నుండి వరుసగా పద్నాలుగు శ్లోకాలలో వివరిస్తున్నాడు.

కార్యము యొక్క స్వభావాన్ని, లక్షణాలను పరిశీలించి నపుడు కారణము యొక్క స్వభావము కూడా మనకు అర్థ మవుతుంది. కార్యములో కారణము కన్నా అన్యమైనది ఉండదు కనుక, కారణ స్వభావమే కార్యములో వ్యక్త మవుతూ ఉంటుంది.

మట్టికుండ కార్య రూపంలో ఉంది. కుండకు మట్టి కారణము. కార్యమైన కుండ రూపంలో ఏదయితే ఉందో, అది వాస్తవానికి మట్టియే. అలాగే ప్రపంచము కార్య రూపంలో ఉంది. ప్రపంచమును పరిశీలించి, పరీక్షించి అర్థం చేసుకుంటే, ప్రపంచము త్రిగుణ మిళితముగా కనిపిస్తుంది. కార్యమైన ప్రపంచములో త్రిగుణాలు గోచరిస్తున్నాయి అంటే, అవి ప్రపంచానికి కారణమైన దానిలో కూడా ఉండి తీరాలి. కారణములో లేనిది కార్యములో ఉండదు. ఉండలేదు.

***త్రిభిర్గుణ మయైః భావైః ఏభిః సర్వమిదం జగత్ మోహితం -*** మూడు గుణముల వికార స్వభావము చేత ఈ ప్రపంచము మోహితమై ఉంది అని విజ్ఞానయోగం లోనే భగవంతుడు ప్రవచించాడు. పరమేశ్వరుని ఆశ్రయించుకొని మనుగడను సాగిస్తున్న గుణ వికారములు గల ప్రకృతి ఈ చరాచర ప్రపంచాన్ని సృష్టిస్తూ ఉంది అని ***(ప్రకృతిః సూయతే స చరాచరమ్)*** రాజవిద్యా రాజగుహ్య యోగంలో చెప్పుకున్నాం. కనుక కార్య రూప ప్రపంచములో కనిపించే గుణాలు, వికారాలు కారణమైన ప్రకృతి నుండే సంభవించాయి ***(వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతి సంభవాన్)*** అని క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగంలో తెలుసుకున్నాం. కనుక భగవంతునికి సంబంధించిన ప్రకృతి, లేదా మాయ గుణమయము ***(దైవీ హ్యేషా గుణమయీ****: 7 వ అ - 14 వ శ్లో ).*

### గుణాలు ప్రకృతి సంభవాలు

అర్జునా! గుణాలు ప్రకృతి సంభవాలు ***(గుణాః ప్రకృతి సంభవాః).*** అవి సత్త్వము, రజస్సు, తమస్సు అనే పేర్లు కలవి ***(సత్త్వం రజస్తమ ఇతి).*** గుణము అనేది పారిభాషిక శబ్దం. వైశేషికులు (కణాద మతానుయాయులు) గుణాలకు, ద్రవ్యములకు భేదమును అంగీకరించారు. రూప రస గంధాదుల వలె ద్రవ్యములను గుణాలు ఆశ్రయించి ఉంటాయి అని అభిప్రాయ పడ్డారు. అంటే, నీలి వస్త్రము అన్నప్పుడు వస్త్రము వేరు, వస్త్రమునకు వేయబడిన నీలివర్ణము వేరు. అలాగే సత్త్వాది గుణాలు ప్రకృతి కన్నా వేరుగా ఉన్నాయి అని అర్థము. కాని, గుణి అయిన ప్రకృతికి, గుణములైన త్రిగుణాలకు భేదం ఆమోదం కాదు ***(న చ గుణగుణినోః అన్యత్వం అత్ర వివక్షితమ్).*** గుణాలు ప్రకృతికి, లేదా మాయకు వేరుగా లేవు.

ఇక్కడ మరొక సందేహము తలెత్తుతుంది. ప్రకృతి త్రిగుణాత్మక మైనపుడు, గుణములు ప్రకృతి కన్నా





వేరుగా లేనపుడు, గుణాలు ప్రకృతి నుండి పుట్టాయి ***(ప్రకృతి సంభవాః)*** అని చెప్పడం ఎలా పొసగుతుంది? అలా ప్రత్యేకంగా లేని గుణాలు పురుషుణ్ణి ఎలా బంధిస్తాయి?

ప్రకృతి, లేదా మాయ గుణమయం. గుణములు ప్రకృతి స్వభావము. కాకపోతే, త్రిగుణములు సామ్యావస్థలో ఉండే టప్పుడు దానిని ప్రకృతి అంటాము. సామ్యావస్థ అంటే మూడు గుణాలు సమానంగా ఉండట మని అర్థము.

అలా త్రిగుణాలు సామ్య స్థితిలో ఉన్నంత వరకు దానిని ప్రకృతి, లేదా మాయ అంటాము. ప్రకృతిలో సమస్థితిలో ఉన్న గుణాలు విషమంగా పరిణమించి నపుడు అవి అంగాంగీ భావంతో కనిపిస్తాయి. ఈ స్థితిలో వాటిని ప్రకృతి సంభవాలు అన వలసి వచ్చింది.

అంగాంగీభావము అంటే, ఒక గుణము ముఖ్య స్థానంలో ఉండి, మిగిలిన రెండు గుణాలు అముఖ్యంగా ఉండటమే అంగాంగీ భావము. ఏ గుణము ప్రధానంగా ఉంటుందో అది అంగి. మిగిలిన రెండు గుణాలు ఏవైతే అప్రధానంగా ఉంటాయో అవి అంగములు. ఇదే గుణాల విషమ స్థితి. కార్య రూపమైన ప్రపంచంలో గుణాలు విషమ స్థితిలో గోచరిస్తూ ఉంటే, కారణమైన ప్రకృతి, లేదా మాయలో గుణాలు సామ్య స్థితిలో ఉంటాయి. అంతేగాని, తార్కికులు అభిప్రాయ పడ్డట్లు గుణాలు ప్రకృతికి భిన్నంగా, వేరుగా ఉండవు. గుణాలు లేకుండా ప్రకృతి ఉండలేదు. సామ్య స్థితిలో ఏవైతే ప్రకృతి స్వభావంగా తెలుస్తూ ఉన్నవో, అవే విషమ స్థితిలో ప్రకృతి సంభవా లవుతున్నాయి. వాస్తవానికి గుణాలు ప్రకృతి రూపాలే. అవే ప్రపంచంలో ఉన్నాయి. అంటే ప్రపంచ మంతా ప్రకృతి మయమే. మాయామయమే. గుణాత్మకమే.

తల వెంట్రుకలను మూడు పాయలుగా చేసి, మూడు పేటలను ఒక దానితో మరొక దానిని పేడుతూ స్త్రీలు జడ వేసుకుంటారు. ప్రకృతి మహిళ జడ లోని మూడు పాయలే త్రిగుణాలు. అవి ఎప్పుడూ వేరుగా లేవు. అర్థం కావడానికే ఉపమానము. ఉపమానము ఏకదేశీయమే గాని సర్వము కాదు.

ప్రకృతి స్వభావంగా సామ్య స్థితిలో ఉండి విషమించిన గుణాలు ప్రకృతి సంభావా లయ్యాయి కనుక, ప్రపంచము లోని కార్యకరణ సంఘాతములో విషమించిన గుణాలే ఉన్నాయి. అటు విశ్వంలో గాని, ఇటు వ్యక్తిలో గాని గుణాలే దోబూచు లాడుతున్నాయి.

ప్రపంచంలో వస్తు రూపంలో విషయాకారంగా ఏ గుణా లున్నాయో, వ్యక్తి యొక్క దేహేంద్రియ ప్రాణ మనోబుద్ధులలో ఆ గుణాలే నిండి ఉన్నాయి. విషయాలు ఇంద్రియ మనస్సులను ఆకర్షించడానికి కూడా గుణములే కారణము ***(గుణా గుణేషు వర్తన్తే****: 3 వ అ - 28 వ శ్లో ).*

వ్యక్తుల మధ్య, వ్యక్తుల స్వభావాల మధ్య, ప్రవర్తనల మధ్య భేదం గోచరించడానికి గుణాలే కారణము. అవే సత్త్వ రజ స్తమో గుణాలు. సత్త్వగుణము జ్ఞాన ప్రధానంగా ఉంటుంది కనుక అది ప్రకాశముతో నిండి ఉంటుంది. రజోగుణము క్రియాత్మకంగా ఉద్యమిస్తూ ఉంటుంది కనుక అది ప్రవృత్తితో కూడి ఉంటుంది. ఈ గుణములు తమోగుణము నిద్ర, అలసత్వాదులతో నిండి ఉంటుంది కనుక అప్రవృత్తిలో పడి ఉంటుంది. ఈ గుణములు మూడూ బంధ హేతువులే. అవి ఎలా బంధిస్తున్నాయో అర్థమైతే వాటి నుండి విడుదల పొందవచ్చు.

### గుణాలు బంధహేతువులు

గుణాలు ప్రాకృతములు కనుక అచేతనములు. అవిద్యాత్మకములు. అందుచేత అవి స్వతంత్రములు కావు, పరతంత్రములు. పరాధీనములు. పురుషుని ఆధారం చేసుకొని మనుగడను సాగిస్తున్నాయి. పురుషుని ఆశ్రయించుకొని అస్తిత్వాన్ని పొందిన గుణాలు పురుషుణ్ణే బంధిస్తున్నాయి. ఎక్కడ బంధిస్తున్నాయి?

ప్రకృతి కార్యమైన దేహేంద్రియాది కార్యకరణ సంఘాతము నందు బంధిస్తున్నాయి ***(దేహినం దేహే నిబధ్నన్తి)***.

ఇది వాస్తవమా? గుణాలు క్షేత్రజ్ఞుణ్ణి నిజంగా బంధిస్తున్నాయా? గుణబంధము సత్యమా? అదే కనుక సత్యమైతే, బంధము సత్యము అని చెప్ప వలసి వస్తుంది. బంధము సత్యమైతే, సత్యమైనది పోదు, నశించదు కనుక బంధము కూడా నశించదు. బంధము నశించని దైతే, మోక్షము అసంభవ మవుతుంది.

పైగా దేహి అవ్యయుడు అని కూడా ప్రస్తుత శ్లోకం లోనే భగవంతుడు చెబుతున్నాడు. అవ్యయుడైన క్షేత్రజ్ఞుని ***(అవ్యయమ్ దేహినమ్)*** గుణాలు క్షేత్రంలో బంధిస్తున్నాయి ***(దేహే నిబధ్నన్తి)*** అంటున్నాడు. అవ్యయుడైన దేహిని, గుణాలకు ఆశ్రయమైన నిర్గుణ స్వరూపుని గుణాలు ఎలా బంధిస్తాయి? గుణ రహితుడైన వానిని గుణాలు బంధించడ మేమిటి?

ఆది లేని వాడు, గుణ రహితుడు, అవ్యయుడు అయిన పరమాత్మ దేహము నందున్నా, కర్మలను చేసే వాడు కాడు, కర్మల చేత అంటబడే వాడూ కాడు అని పూర్వాధ్యాయంలో చెప్పుకున్నాం కదా! *(13 వ అ - 32వ శ్లో).*

కనుక అచేతనము లైన గుణాలు పురుషుని బంధించ లేవు. బంధిస్తున్నట్లు కనిపిస్తాయి, అంతే. బంధించే వాటి వలె అగుపిస్తాయి ***(నిబధ్నన్తి ఇవ)*** అన్నారు భాష్యంలో శ్రీ శంకరులు. బంధించినట్లు కనిపిస్తున్నాయే గాని నిజానికి బంధించడం లేదు. బంధింప బడక పోయినా తాను బంధింప బడినట్లు పురుషుడు భావించడమే బంధ కారణము. ఇదే అజ్ఞానము. కనుక, అజ్ఞానమే బంధము. అజ్ఞానము బంధము కనుక జ్ఞానమే మోక్షము. అందుచేతనే మోక్షానికి ప్రయత్నాలు అవసరం లేదు. నీవు గుణాతీతుడవు అని తెలుసుకోవడం చేతనే నీవు విముక్తిని పొందుతావు అని ఈ అధ్యాయం చివర భగవంతుడే తెలుపుతాడు.

**మాయా బంధము**

బంధమే లేని దేహికి బంధము ఎలా కల్పించ బడుతుంది? అదే మాయ. బంధము అనేది మాయా కార్యము. అదే మాయాబంధము. అసంభవాన్ని సంభవంగా చూపే శక్తే మాయా శక్తి ***(అఘటన ఘటనా పటీయసీ మాయా)***. క్షేత్ర క్షేత్రజ్ఞుల వివేకం లేకపోవడం చేతనే గుణాలు దేహిని బంధిస్తున్నట్లుగా ఉన్నాయి. ***కథం ఏషః బంధః ఆగతః?*** ఈ బంధము ఎలా వచ్చింది? అని ప్రశ్నించి విచారించ గలిగితే కల్పిత బంధమే కనుక, కనుమరు గవుతుంది.

గుణాలు ఏమిటో, వాటి స్వభావ స్వరూపా లేమిటో తెలియ నపుడే గుణాలు క్షేత్రజ్ఞుణ్ణి బంధిస్తాయి. బంధము తొలగాలి అంటే గుణా లేమిటో ముందుగా తెలుసు కోవాలి.

ప్రకృతి సంభవాలైన గుణాలు మూడు; అవే సత్త్వ రజ స్తమో గుణాలు. మోక్షానికి హేతువు కావడం చేత ఉత్కృష్ట మైనది కనుక సత్త్వగుణము ప్రథమంగా చెప్ప బడింది. సర్వ ప్రవృత్తికి హేతువు కావడం చేత రజోగుణము ద్వితీయ స్థానంలో పేర్కొన బడింది. రజస్సు కంటే నికృష్ట మైనది కావడం చేత తమోగుణము చివరగా చెప్పబడింది.

సూర్యునికి చీకటితో సంబంధము లేనట్లు అసంగుడైన క్షేత్రజ్ఞునకు గుణసంగము లేదు. నిష్క్రియుడు, నిర్గుణుడు అయిన క్షేత్రజ్ఞుడు, లేదా దేహి అవ్యయు డైనను ***(అవ్యయమ్ దేహినమ్)***, ప్రకృతి కార్యమైన దేహేంద్రియ కార్యకరణ సంఘాతముతో తాదాత్మ్యం చెందడం చేత, అధ్యాసాపన్ను డవుతున్నాడు. గుణాల చేత బంధింప బడినట్లు గోచరిస్తున్నాడు. ఇదే మాయా బంధము.





సూర్యుడు ఆకాశంలో అచలమై భాసిస్తున్నా, నీళ్ళల్లో ప్రతిఫలించే సూర్యబింబము చలిస్తున్నట్లు కనిపిస్తుంది. వాస్తవానికి ఈ విధమైన చలనము సూర్యునిలో లేదు. జల చలనాన్ని సూర్యుని యందు ఆరోపించడం జరుగుతుంది. ఇదే అధ్యాస. అది కాని దాని యందు అది అనే భావనే అధ్యాస ***(అధ్యాసో నామ అతస్మిన్ తద్బుద్ధిః)***. జల లక్షణమైన చలనాన్ని సూర్యుని యందు ఆరోపించడం చేత సూర్యుడు చలిస్తున్న వాని వలె ఉన్నాడు.

అలాగే రాత్రి పూట ఆకాశంలో మేఘాల మధ్య చంద్రుడు దోగాడుతున్నట్లు కనిపిస్తాడు. వాస్తవానికి అది మేఘ చలనమే గాని చంద్రునిలో చలనము లేదు. మేఘ చలనాన్ని చంద్రుని యందు ఆరోపించడం చేత అచలుడైన చంద్రుడు చలించే వాని వలె ***(ఇవ)*** కనిపిస్తున్నాడు.

అలాగే ఇక్కడ కూడా గుణ ధర్మాలను క్షేత్రజ్ఞుని యందు ఆరోపించడం చేత బంధమే తెలియని దేహి బంధింప బడిన వాని వలె ***(ఇవ)*** కనిపిస్తున్నాడు. చంద్రునికి, మేఘానికి సంబంధమే లేదని తెలియగానే చంద్రుడు అచలుడుగా తెలియునట్లు, ఇది జల చలనము అని అర్థం కాగానే సూర్యుడు చలన రహితుడని తెలిసినట్లు, గుణముల స్వభావము అర్థమైతే, క్షేత్రజ్ఞుడు గుణ రహితుడని, గుణాతీతుడని, నిత్యముక్తుడని, బంధ రహితుడని అర్థ మౌతుంది. అందుకే ఈ గుణత్రయ విభాగ యోగము అనే చతుర్దశాధ్యాయము.

కనుక అప్రవృత్తితో అజ్ఞానములో అలమటించే తమోగుణయుతుడు, ప్రవృత్తితో కూడి కర్మాచరణము నందు ప్రవర్తించి రజోగుణ యుతుడు కావాలి. కర్మలు కామ్య ప్రవృత్తితో సాగి బంధహేతువులు అవుతాయి. కనుక ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలను నిష్కామంగా ఆచరించి బుద్ధిలో సత్త్వగుణాన్ని పెంపొందించు కోవాలి. సత్త్వగుణ ప్రధానుడే జ్ఞానార్హుడై తరిస్తాడు. కనుకనే 'అర్జునా! నిత్య సత్త్వస్థుడవు కా! ***(త్వం నిత్య సత్త్వస్థః భవ! సదా సత్త్వగుణాశ్రితః భవ!)***. ఎల్లప్పుడు సత్త్వగుణాన్నే ఆశ్రయించు' అని భగవంతుడు రెండవ అధ్యాయం - నలభై ఐదవ శ్లోకం లోనే బోధించాడు.

*ఇక గుణాలను వివరించే క్రమంలో మొదట సత్త్వగుణ లక్షణాన్ని చెబుతున్నాడు.*

తత్ర సత్త్వం నిర్మలత్వా త్ప్రకాశక మనామయమ్ ।
సుఖసఙ్గేన బధ్నాతి జ్ఞానసఙ్గేన చానఘ ॥ 6

**తత్ర-సత్త్వం-నిర్మలత్వాత్-ప్రకాశకం-అనామయం**
**సుఖసంగేన-బధ్నాతి-జ్ఞానసంగేన-చ-అనఘ**

| | | | |
|---|---|---|---|
| అనఘ | = అర్జునా! | నిర్మలత్వాత్ | = నిర్మల మగుట వలన |
| తత్ర | = ఆ గుణముల యందు | సుఖసంగేన | = సుఖాభిలాష చేత |
| ప్రకాశకం | = ప్రకాశమును కలిగించేది | జ్ఞానసంగేన చ | = జ్ఞానాభిలాష చేత |
| అనామయం | = దోషాలు లేనిది | బధ్నాతి | = బంధిస్తూ ఉంది |
| సత్త్వం | = సత్త్వగుణము | | |

**అర్జునా! ఈ త్రిగుణాలలో సత్త్వగుణము నిర్మల మైంది. ప్రకాశింప చేస్తుంది. దోషాలు లేనిది. సుఖాసక్తి చేత, జ్ఞానాసక్తి చేత జీవుణ్ణి బంధిస్తుంది.**

**వ్యాఖ్య**

కారణ ప్రకృతిలో సామ్యావస్థలో ఉండే త్రిగుణాలు కార్య ప్రకృతిలో ఎలా విషమిస్తున్నాయో అట్టి

గుణత్రయము యొక్క సమిష్టి కార్యాన్ని వివరించిన భగవంతుడు, ప్రస్తుతము ప్రత్యేకంగా ఒక్కొక్క గుణము యొక్క స్వరూపమును తెలుపుతూ, అది ఎలా బంధ హేతువో కూడా వివరించ డానికి ఉపక్రమిస్తున్నాడు.

**సత్త్వశోభ**

త్రిగుణాలలో మొదటి దైన సత్త్వగుణము నిర్మల మైనది ***(నిర్మలత్వాత్).*** స్వచ్ఛ మైనది. కనుక అద్దము వలె ప్రకాశవంతంగా ఉంటుంది. స్ఫటిక మణి వలె కాంతిమంతమై ఉంటుంది ***(స్ఫటిక మణిః ఇవ ప్రకాశకమ్).*** మురికి ఆవరించిన దర్పణాన్ని శుద్ధి చేసిన తరువాత అది ఎలా ప్రకాశవంతంగా ఉంటుందో, అలాగే రజస్తమో గుణాల చేత మలిన పడిన మనో దర్పణాన్ని సత్త్వగుణము శుద్ధి చేసి ప్రకాశవంతముగా ఉంచుతుంది. అందుచేత, వ్యక్తి మనస్సులో సత్త్వము ప్రధానంగా ఉండే టప్పుడు ఆ వ్యక్తి బుద్ధి వికసించి ఉంటుంది. శుద్ధమైన ఆలోచనలు కదుల్తూ ఉంటాయి. స్మృతి జ్ఞానాలతో చిత్తము తృప్తిగా, ఆహ్లాదంగా, ప్రకాశమానంగా ఉంటుంది.

***ధృతియు సంప్రీతియును ప్రసన్నతయు మరియు***
***నీదృశములగు సత్త్వ గుణోదితములు ॥***

అని సత్త్వగుణ శోభను వర్ణించింది ఆంధ్ర మహాభారతము - శాంతిపర్వము.

సత్త్వగుణ శోభితుడైన వ్యక్తి అనామయుడుగా ఉంటాడు. ఆమయము అంటే ఉపద్రవము, లేదా వ్యాధి అని అర్థము. అనామయము అంటే నిరుపద్రవము అని అర్థము. దేహ సంబంధమైన వ్యాధులు, మనో సంబంధ మైన వ్యథలు బాధించని స్థితియే అనామయ స్థితి. దేహ బాధలు, మనో వ్యథలు లేక పోవడం చేత, సత్త్వగుణము సుఖానికి, జ్ఞానానికి అనువుగా ఉంటుంది కనుక, వ్యక్తి సుఖంగా, ప్రకాశవంతంగా ఉంటాడు ***(అన్తరైః బాహ్యైః వ్యాధిభిః కర్మజైః న పీడ్యత ఇతి అనామయః ).***

స్వచ్ఛమైనది ప్రకాశవంతముగా ఉండటమే గాక, ప్రతిఫలించే లక్షణాన్ని కూడా కలిగి ఉంటుంది. ప్రతిబింబము అనేది ఇటుకలో కాకుండా నీటి లోనే ఎలా ప్రతిఫలిస్తుందో అలాగే జ్ఞానము సాత్త్వికమైన బుద్ధి లోనే నిలుస్తుంది. జ్ఞానం తోనే మోక్షం ప్రాప్తిస్తుంది. కనుక బంధము నుండి విడిపడి ముక్తిని పొంది తరించా లని అభిలషించే ముముక్షువునకు సత్త్వగుణము సహకారిగా ఉంటుంది.

**సత్త్వబంధము - సుఖసంగము**

సంతోషాన్ని, ప్రియత్వాన్ని, ప్రశాంతతను కలిగించే నిర్మలమైన సత్త్వగుణము ఎలా బాధిస్తుంది? బాధించదు కాని బంధిస్తుంది. ఇదే సత్త్వబంధము. జ్ఞాన ప్రతిబంధకము. సత్త్వగుణము ఎలా బంధిస్తుంది? రెండు విధాలుగా బంధిస్తుంది. ఒకటి సుఖసంగము; రెండవది జ్ఞానసంగము. ఇవే బంధాలు. అందాల మధ్య అవరోధాలు.

సత్త్వగుణము సుఖ ప్రధాన మని చెప్పుకున్నాం. ***అహం సుఖీ -*** నేను సుఖిని, నేను సుఖ పడుతున్నాను అనే అనుభవము సుఖం వల్ల కలుగుతూ ఉంది. సుఖము అనేది విషయము. సుఖ విషయానికి సంబంధించిన చిత్తవృత్తియే ఇక్కడ సుఖంగా తెలుస్తూ ఉంది. ఇది సుఖవృత్తియే గాని సుఖ స్వరూపం కాదు. కేవలం అంతః కరణము లోని వృత్తి రూపమే ఇక్కడ సుఖంగా తెలుస్తూ ఉంది. సుఖం, దుఃఖం లాగా బాధించదు. అలాగని బంధం కాకుండా పోదు.

సుఖవృత్తి అంతఃకరణ ధర్మము. విషయానికి సంబంధించినది. మనస్సులో దుఃఖము ఎలా విషయమో సుఖం కూడా అలా విషయమే. దుఃఖము ఎలా నశిస్తుందో, సుఖం కూడా అలాగే నశిస్తుంది. మనస్సులో ఎప్పుడూ దుఃఖమే ఉంటుందని చెప్పలేము; అలాగే ఎప్పుడూ సుఖమే ఉంటుంది అని కూడా చెప్పలేము.





ఒక కారణం వల్ల దుఃఖం కలుగుతుంది. అలాగే ఒక నిమిత్తంగా సుఖం కలుగుతుంది. అందుచేత, మనస్సులో వృత్తి రూపంలో తెలిసే సుఖాలన్నీ నైమిత్తిక సుఖాలు. నిమిత్తాలు దూరమైతే, నైమిత్తిక సుఖాలు పారి పోతాయి. కనుక నశించే ఈ సుఖాలు విషయ రూపాలై క్షేత్ర ధర్మాన్ని కలిగి ఉన్నాయి.

**ఇచ్ఛా ద్వేషస్సుఖం దుఃఖం సంఘాత శ్చేతనా ధృతిః ॥**

కోరిక, ద్వేషము, సుఖము, దుఃఖము, వృత్తి జ్ఞానము, ధైర్యము - ఇవన్నీ వికారయుతము లైన కార్య విషయాలు; క్షేత్ర సంబంధ మైనవి అని పదమూడవ అధ్యాయం ఏడవ శ్లోకం లోనే అర్థం చేసుకున్నాం.

క్షేత్రజ్ఞుడు అసంగుడు. సత్త్వగుణము వలన అసంగుడైన క్షేత్రజ్ఞునికి సంగత్వము ఏర్పడుతుంది. మరొక దానితో సంగత్వము అంటే ద్వైతానుభూతి కలుగుతూ ఉంది. ద్వైత దర్శనము అద్వయ జ్ఞానానికి ప్రతి బంధకము. ఈ విధంగా సుఖసంగమును కలిగిస్తున్న సత్త్వగుణము బంధహేతువు అవుతూ ఉంది.

విషయ జన్య సుఖము ఏదీ నిత్యసుఖం కాదు. నిత్యసుఖము అనేది స్వరూప సుఖమే గాని మనస్సు లోని సుఖవృత్తి కాదు. సుఖవృత్తి మనోధర్మము. విషయ రూపము. సుఖ స్వరూపము 'విషయి'కి సంబంధించింది. ఆత్మలక్షణము. విషయ ధర్మము విషయికి సంబంధించింది కాదు కదా ***( న హి విషయ ధర్మః విషయిణః భవతి)!***

కనుక, తన ధర్మము కానిది, మనోధర్మము అయినది, శబ్దాది ప్రియ వస్తువుల యొక్క అనుభవ సంపర్కము వలన ఏర్పడే నైమిత్తిక సుఖంతో అసంగుడైన క్షేత్రజ్ఞునికి సంగత్వమును కల్పిస్తూ ఉంది కనుక సుఖప్రద మైన సత్త్వగుణము బంధహేతువు అవుతూ ఉంది. అసక్తుడైన పురుషుని యందు ఆసక్తిని, సుఖాసక్తిని కలిగిస్తూ బంధ కారణ మవుతూ ఉంది ***(అసక్తం సక్త మివ కరోతి, అసుఖినం సుఖిన మివ ).*** నాకు అది లభిస్తే సుఖం, నాకు ఇది దూరమైతే సుఖం అనే రాగద్వేషాలను కూడా కలిగిస్తూ ఉంది. కాని, క్షేత్రజ్ఞుడు సుఖ స్వరూపుడు. క్షేత్రజ్ఞుని సుఖం వచ్చేది కాదు; పోయేది కాదు. రాకపోకలు గల సుఖాలు అనిత్యాలు. ఆత్మ సుఖ స్వరూపం. అది నిత్యసుఖం. నిత్యానంద స్వరూపుడైన పురుషునికి అనిత్య సుఖాలతో సంసర్గము ఏర్పడేటట్లు చేస్తూ ఉంది కనుక, ఈ విధమైన సుఖసంగమును కలిగించే సత్త్వగుణము కూడా సుఖమైన బంధమే.

**సత్త్వబంధము - జ్ఞాన సంగము**

సత్త్వగుణము సుఖ ప్రధానమే కాదు; ప్రకాశవంత మైనది కావడం చేత జ్ఞాన ప్రధానము కూడా. నేను జ్ఞానిని, తెలివి గల వాణ్ణి అనే అనుభవం కూడా సత్త్వగుణం వల్లనే కలుగుతూ ఉంది. సుఖము ఎలాగైతే అంతః కరణ వృత్తి అని తెలుసు కున్నామో, అలాగే సత్త్వ ప్రధానమైన జ్ఞానము కూడా వృత్తికి సంబంధించినదే. వృత్తి జ్ఞానమే. కనుక మనోధర్మమే.

ఇది వృత్తి జ్ఞానము కనుకనే జ్ఞానసంగము ఏర్పడుతూ ఉంది. స్వరూప జ్ఞానమైతే సంగత్వము ఎలా సాధ్య పడుతుంది? అంతఃకరణ ధర్మమైన సుఖసంగమును ఎలా జ్ఞాన ప్రతిబంధక మని తెలుసుకున్నామో, అలాగే అంతఃకరణ ధర్మమైన జ్ఞానమును కూడా ప్రతిబంధకము గానే భావించాలి ***(సుఖే ఇవ జ్ఞానాదౌ సంగః మన్తవ్యః ).***

బుద్ధి లోని విషయాన్ని నువ్వు గ్రహిస్తున్నావు. బుద్ధి లోని విషయ జ్ఞానము మారుతూ ఉంది. ఒక వ్యక్తి బుద్ధిలో వైద్య జ్ఞాన ముంది. అతడు వైద్యుడు. మరొక వ్యక్తి మనస్సులో సంగీత జ్ఞాన ముంది. అతడు గాయకుడు. ఒక్కొక్కపుడు గాయకుడు కవి కూడా కావచ్చు. ఒకే వ్యక్తిలో ఉన్నా, కవిత్వమునకు సంబంధించిన

జ్ఞానము వేరు; సంగీతానికి సంబంధించిన జ్ఞానము వేరు. ఇంతకీ వీటిలో ఏది స్వరూప జ్ఞానము? ఏదీ కాదు.

ఏ జ్ఞానా లైనా క్షేత్రజ్ఞుడ వైన నీ మీదే ఆధారపడి ఉన్నాయి. నీ వల్లనే కలుగు తున్నాయి. ఆ జ్ఞానాలు బుద్ధిలో కదలి నపుడు నువ్వు వాటిని తెలుసుకుంటున్నావు. వాటికి సంబంధించిన జ్ఞానము నీకు కలుగుతూ ఉంది. ఆ జ్ఞానము కలిగి నపుడు ***అహం జ్ఞానీ*** - నేను జ్ఞానిని అంటున్నావు.

బుద్ధిలో ఎప్పుడూ ఒకే విషయం ఉండదు. విషయ వృత్తులు మారుతూ ఉంటే విషయ జ్ఞానము కూడా మారుతూ ఉంటుంది. ఒకప్పుడు ఉండి మరొకప్పుడు లేనిది, స్వయంగా ప్రకాశించ లేక మరొక దానిపై ఆధారపడి ప్రకాశించేది మిథ్యా జ్ఞానమే గాని సత్యజ్ఞానము కాదు. సత్య జ్ఞానానంద స్వరూపుడైన క్షేత్రజ్ఞుణ్ణి మిథ్యా జ్ఞానంతో కలిపే సత్త్వగుణము జ్ఞానసంగము చేత అతనిని బంధిస్తూ ఉంది. విషయ జ్ఞానమును విషయి నందు అధ్యసించడమే జ్ఞానసంగము. అధ్యయ జ్ఞాన ప్రాప్తికి ప్రతిబంధకము.

***అహం కర్తా - అహం భోక్తా*** - నేను కర్తను; నేను భోక్తను అనే అనుభవము అవిద్యా కార్యము. ఇది విజ్ఞానమయ కోశమునకు సంబంధించినది. అకర్త, అభోక్త అయిన క్షేత్రజ్ఞుని యందు నేను సుఖిని - నేను జ్ఞానిని అనే అభిమానమును ఆరోపించడము జ్ఞానానికి అవరోధమే కదా! ఈ విధంగా, సుఖప్రదము, శాంతిరూపము, ప్రకాశవంతము అయిన సత్త్వము సుఖ సంగమును, జ్ఞాన సంగమును కలిగించి పురుషునికి బంధకారణ మవుతూ ఉంది. వాస్తవానికి క్షేత్రజ్ఞుడు బంధమే తెలియని వాడు. నిత్యముక్తుడు. కాని, చిత్తము లోని సుఖ జ్ఞానములు అతనికి బంధ హేతువు లవుతున్నాయి. చిత్తమే లేని చిద్రూపునికి సుఖసంగ మెలా ఉంటుంది? జ్ఞానసంగ మెలా కుదురుతుంది?

*బంధమోక్ష విహీనోఽ స్మి శుద్ధం బ్రహ్మాస్మి సోఽ స్మ్యహం ।*
*చిత్తాది సర్వహీనోఽ స్మి పరమోఽ స్మి పరాత్పరః ॥*

నాకు బంధమోక్షాలు లేవు; నేను శుద్ధమైన బ్రహ్మమును; నాకు చిత్తాదులు లేనే లేవు; నేను ఉత్కృష్ట మైన వాణ్ణి; పరమాత్మ స్వరూపుణ్ణి అని మైత్రేయోపనిషత్తు.

*ఇక రెండవది అయిన రజోగుణ స్వభావము ఎలాంటిదో, అది ఎలా బంధహేతువో వివరిస్తున్నాడు.*

**రజో రాగాత్మకం విద్ధి తృష్ణాసఙ్గ సముద్భవమ్ ।**
**త న్నిబధ్నాతి కౌన్తేయ కర్మసఙ్గేన దేహినమ్ ॥** 7

***రజః-రాగాత్మకం-విద్ధి-తృష్ణా సంగ సముద్భవం***
***తత్-నిబధ్నాతి-కౌంతేయ-కర్మసంగేన-దేహినం***

| | | | | | |
|---|---|---|---|---|---|
| కౌంతేయ | = అర్జునా! | తత్ | = | అది |
| రజః | = రజోగుణము | దేహినం | = | జీవుని |
| రాగాత్మకం | = రాగముతో కూడినది | కర్మసంగేన | = | కర్మాసక్తి చేత |
| తృష్ణా సంగ సముద్భవం | = తృష్ణ, ఆసంగములకు కారణము | నిబధ్నాతి | = | బంధిస్తూ ఉంది |
| విద్ధి | = తెలుసుకో! | | | |

**అర్జునా! రజోగుణము రాగాత్మకము. తృష్ణ, ఆసక్తి దీని నుండే పుడుతాయి. కర్మసంగము చేత రజోగుణము జీవుని బంధిస్తుంది.**





## వ్యాఖ్య

### రాగాత్మకం

రంజింప చేస్తుంది కనుక రజోగుణము రాగాత్మకము ***(రజః రాగాత్మకం, రంజనాత్ రాగః)***. రంజనము అంటే అంటుకొనే స్వభావము. అట్టి స్వభావము కలది రాగము. రాగము అంటే రక్తి. రాగమే ఆత్మగా కలది కనుక రజోగుణము రాగాత్మకము. ఇది రంజన స్వభావము కలది. గుడ్డకు రంగు ఎలా అంటుకుంటుందో, అలా అంటుకొనే స్వభావం కలది, రాగాత్మక మైనది రజోగుణము.

సత్త్వగుణము స్వచ్ఛ మైనది, ప్రకాశవంత మైనది అని తెలుసుకున్నాం. స్వచ్ఛంగా ఉన్న శ్వేత వస్త్రముపై రంగును అద్ది నపుడు, శ్వేతవర్ణము ఎలా మరుగున పడి, వేసిన రంగు ప్రధానంగా గోచరిస్తుందో, సత్త్వ ప్రధాన మైన చిత్తము రాగాత్మకం కాగానే నూతనమైన రాగంతో రంజింప చేస్తుంది.

### తృష్ణా సంగ సముద్భవం

రజోగుణము తృష్ణ, ఆసంగములకు కారణము. కనుక అది తృష్ణాసంగ సముద్భవము. తృష్ణ అంటే లేని దానిని పొందాలి అనే కోరిక. అదే ఆశ. తనకు ఏది ప్రియమని మనిషి భావిస్తాడో, దానినే అతడు వాంఛిస్తాడు. ప్రియమైన వస్తువు, లేదా విషయం కంట పడి నపుడు, చెవిలో వినపడి నపుడు, లేదా మనస్సులో మెదిలి నపుడు, ఆ ప్రియ వస్తువుకు సంబంధించిన ఆశ మనస్సులో కదుల్తుంది. ఆశ పడినది లభించినంత వరకు, దానిని పొందాలి అనే కోరిక ఏదయితే మనస్సులో కదుల్తూ ఉంటుందో అదే తృష్ణ. రాగాత్మకము ***(తృష్ణా అప్రాప్తాభి లాషః)***.

తృష్ణ అంటే దప్పిక అని కూడా అర్థం. రాగ మనేది ఒక తీరని దాహం. మనస్సును సదా దహించి వేసే తాపం. ఈ దప్పిక తీరేది కాదు. అలాగే రజోగుణం ఆరేదీ కాదు. మనిషికి ఏది ఉంది, ఏది లేదు అనేది ప్రక్కన ఉంచితే, ఏది ఉన్నా, ఎంత ఉన్నా, ఆ ఉన్నది లేని దానిని స్మృతికి తెచ్చి చిత్తాన్ని ఊపేస్తూనే ఉంటుంది. మనస్సును కుదిపేస్తూనే ఉంటుంది. ఇదే తృష్ణ. తీరని ఆశాదాహం.

వినింది ప్రియమైతే, దానిని చూడాలనే కోరిక కదుల్తుంది. చూడా లనుకున్నది ప్రాప్తిస్తే, దానిని చవి చూడాలని మనస్సు ఉరకలు వేస్తుంది. ఒక వైపు రాగాత్మకంగా రంగులు పడుతూ ఉంటాయి. మరో వైపు ఆశలు పొంగుతూ ఉంటాయి. ఇదంతా తృష్ణ మహిమే.

ఆశించిన వన్నీ మనిషి పొంద లేక పోవచ్చు. కొన్నిటిని పొందినా, ఆ పొందిన వాటిని పోగొట్టుకోక తప్పదు. ఆశించినవి అందుతూ ఉంటాయి. ఒక సమయంలో అందినవి మరొక సమయంలో అదృశ్యమై అందనంత దూరాలకు తరలి పోతూ ఉంటాయి. లేనివి వస్తున్నా, వచ్చినవి పోతున్నా, ఆశ మాత్రం రాకపోకలు లేకుండా స్థిరంగా ఉంటుంది. అదే తృష్ణ.

రెండవది ఆసంగము. ఆసంగము అంటే ఆసక్తి. లేని దానిని పొందాలి అనే కాంక్ష తృష్ణ అయితే, పొందిన దానిని నిలబెట్టుకోవాలి అనే ఆతురతే ఆసంగము ***(ప్రాప్తే విషయే మనసః ప్రీతి లక్షణః సంశ్లేషః)***. అప్రాప్తమైన దాని యందు అభిలాష తృష్ణ అయితే, ప్రాప్తించిన దాని విషయంలో ప్రీతి రూపమైన సంశ్లేషము. అప్రాప్తమైన దాని యందు అభిలాష తృష్ణ అయితే, వచ్చినది పోకుండా స్థిరంగా ఉండాలనే అభిమానమే ఆసంగము. ఈ తృష్ణ, ఆసంగాలు రజోగుణం నుండి పుడతాయి. కర్మల వైపు నడిపిస్తాయి. కర్మ సంగాన్ని, ఫలసంగాన్ని అసంగుడైన పురుషునికి కలిగించి కర్మ చక్రానికి, జన్మ చక్రానికి బంధిస్తాయి. సత్త్వగుణము కలిగించే బంధాన్ని ప్రయత్నంతో త్వరగా తొలగించుకోవచ్చు.

కాని, రజోగుణము సృష్టించే బంధాన్ని తప్పించు కోవడం సులభ సాధ్యం కాదు. అందుచేత సత్త్వగుణ బంధాన్ని తెలుపుతూ పూర్వ శ్లోకంలో ***బధ్నాతి*** అని పలికిన పరమేశ్వరుడు, ప్రస్తుతం రజోగుణము యొక్క బంధాన్ని ప్రస్తావిస్తూ ***నిబధ్నాతి*** అని వక్కాణిస్తున్నాడు. రజోగుణము పురుషుని బహుముఖంగా బంధిస్తుంది.

*చ॥ బలమును శౌర్యమున్ మదముఁ బ్రాభవమున్ సుఖదుఃఖ భాగితా*
*కలనముఁ జెల్మి సేతయును గాంక్షయు నొల్లమి యుం బ్రతాపముం*
*గలహము నీర్ష్యయున్ బహువి కల్పపు భాషలుఁ గామినీ జనం*
*బుల యెడ గాఢ రాగతయు బొంకును నుబ్బు రజః ప్రభూతముల్ !*

బలము, శౌర్యము, మదము, సుఖము, దుఃఖము, కొందరితో సఖ్యము, మరి కొందరితో శత్రుత్వము, కొన్నిటిని ప్రియంగా ఆశించడము, కొన్నిటిని అప్రియంగా ద్వేషించడము, ప్రతాపాన్ని ప్రకటించడము, కలహించడము, ఈర్ష్య చెందడము, వికట భాషణములు, స్త్రీ వ్యామోహము, అసత్యము లాడుట, గర్వమును ప్రదర్శించుట - ఇవన్నీ రజోగుణ లక్షణములే అని ఆంధ్రమహాభారతము - అశ్వమేధ పర్వము.

రజోగుణము చేత ప్రభావితుడైన పురుషుడు, స్వయంగా తాను నిష్క్రియాత్మే అయినా, కర్మసంగమును, ఫలసంగమును పొంది సంసార చక్రానికి బంధింప బడుతున్నాడు.

*ఇక మూడవది అయిన తమోగుణ స్వభావము ఎలాంటిదో, అది ఎలా బంధహేతువో చెబుతున్నాడు.*

**తమ స్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినామ్ ।**
**ప్రమాదాలస్యనిద్రాభి స్త న్నిబధ్నాతి భారత ॥** 8

***తమః-తు-అజ్ఞానజం-విద్ధి-మోహనం-సర్వదేహినాం***
***ప్రమాదాలస్య నిద్రాభిః-తత్-నిబధ్నాతి-భారత***

| | | | |
|---|---|---|---|
| భారత | = అర్జునా! | విద్ధి | = తెలుసుకో! |
| అజ్ఞానజం | = అజ్ఞానము వలన పుట్టిన | తత్ | = అది |
| తమః తు | = తమోగుణము | ప్రమాదాలస్య నిద్రాభిః | = మరపు చేత, అలసత్వము చేత, నిద్ర చేత |
| సర్వ దేహినాం | = సర్వ ప్రాణులకు | దేహినం | = దేహిని |
| మోహనం | = మోహకర మైనది | నిబధ్నాతి | = బంధించు చున్నది |

**అర్జునా! తమోగుణము అజ్ఞాన జనితము. అది సర్వులకు మోహమును కలిగిస్తుంది. విస్మృతి, అలసత్వము, నిద్రల చేత జీవుని బంధిస్తుంది.**

### వ్యాఖ్య

సత్త్వ రజో గుణాల స్వభావ స్వరూపాలను, అవి జీవులను బంధించే విధానమును ఆరు, ఏడు శ్లోకాలలో వివరించిన వాసుదేవుడు మూడవ గుణమైన తమోగుణమును ***( తమః తృతీయ గుణః )*** ప్రస్తుత శ్లోకంలో వివరిస్తున్నాడు.

***గుణాః ప్రకృతి సంభవాః -*** త్రిగుణాలు ప్రకృతి నుండి పుట్టాయి అని తెలిపిన భగవంతుడు, ఈ మూడవ గుణమైన తమోగుణమును ప్రత్యేకించి అజ్ఞానం నుండి పుట్టింది అంటున్నాడు. మూడు గుణాలు అజ్ఞాన కార్యాలే అయినా, ప్రత్యేకించి తమోగుణాన్ని అజ్ఞాన కార్యంగా అభివర్ణించడంలో ప్రత్యేకత ఉంది. అజ్ఞానాన్ని





ఎప్పుడూ విడిచి పెట్టని స్వభావము తమోగుణం లోనే కనిపిస్తుంది కనుక కనిష్ట మైన, నికృష్ట మైన ఈ తమో గుణాన్ని, ఆ రెండిటి కన్నా విలక్షణంగా చెప్పడం జరిగింది. అదే **తు** శబ్ద ప్రయోగము.

### అజ్ఞాన సంతతి

తమోగుణము అజ్ఞానానికి బిడ్డ ***( అజ్ఞానజమ్, అజ్ఞానాత్ జాతం )***. అజ్ఞానము వలన పుట్టిన ఈ తమోగుణము సర్వులను మోహింప చేస్తుంది ***( మోహనం మోహకరమ్, అవివేక కరమ్ )***. మోహము అంటే అవివేకము. వివేకము లోపించిన స్థితి. వివేక హీనులకు ఉన్నది లేనట్లుగా, లేనిది ఉన్నట్లుగా గోచరిస్తుంది. అదే మోహము. అజ్ఞాన జాతం. జ్ఞానము అజ్ఞానము చేత కప్పబడి నపుడు జీవులు మోహమును పొందుతారు అని భగవంతుడు కర్మసన్యాస యోగం లోనే బోధించాడు *(5 వ అ - 15 వ శ్లో)*. ***తన్మోహ బీజమ్ -*** తమోగుణము మోహ కారణము అని అమరసింహుడు కూడా నిర్వచించాడు.

తమోగుణము, అజ్ఞానము ఒక దానిని విడిచి మరొకటి ఎప్పుడూ ఉండ లేవు. రెండు పెనవేసుకొనే ఉంటాయి. ప్రస్తుత శ్లోకంలో తమోగుణము అజ్ఞానం వలన జనించింది అని చెప్పిన భగవంతుడు, ఇదే అధ్యాయం పదిహేడవ శ్లోకంలో అజ్ఞానం తమోగుణము వలన ఏర్పడుతుంది అని చెప్పబోతాడు. ఇలా చెప్పడములో వైరుధ్య మేమీ లేదు. రెండూ కలిసే ఉంటాయి కనుక, దేనికి ఏది కారణమో అర్థం గాని స్థితిలో పరస్పరాధీనమై ఉంటాయని అర్థము.

కోడి గ్రుడ్డు పెడుతుంది. గ్రుడ్డు నుండి కోడి వస్తుంది. కోడి నుండి మళ్ళీ గ్రుడ్డు వస్తుంది. ఇలా అన్యోన్యాశ్రయంగా అజ్ఞాన తమస్సులు తెలుస్తూ ఉంటాయి.

అజ్ఞానము తమోగుణాన్ని ప్రసవిస్తే, తమోగుణము ప్రమాద, ఆలస్య, నిద్రలనే ముగ్గురు బిడ్డలకు జన్మ నిస్తుంది. ఈ ముగ్గురు బిడ్డల సహకారంతో తమోగుణము జీవులను బంధిస్తుంది.

### ప్రమాద - ఆలస్య - నిద్రలు

మొదటిది ప్రమాదము. ప్రమాదము అంటే అవధానము లేకపోవడము అని అర్థము ***( ప్రమాదోఽనవధానతా)***. చేయ గలిగే శక్తి ఉండినా, చేయ వలసిన కార్యమును చేయకుండా ఉండటము అనవధానము. అదే ప్రమాదము. కర్తవ్య విస్మరణము.

ఈ ప్రమాదానికి విస్మృతి కూడా కారణము కావచ్చు. చేయవలసిన కార్యమును మరచి పోవడమే విస్మృతి. ప్రమాదానికి బలమైన కారణము. ఇది తమోగుణ కార్యము. ఇటు వంటి ప్రమాద లక్షణము గల వ్యక్తి గురువు బోధించిన జ్ఞానాన్ని కూడా మరచి పోతాడు. తమోగుణ యుతుడు విన్న దానినే ఎన్నిసార్లు విన్నా నూతనం గానే వింటూ ఉంటాడు. ఇది జ్ఞానానికి ప్రతిబంధకము కనుక జీవునికి బంధహేతువు అవుతుంది.

రెండవది ఆలస్యము. అలసతయే ఆలస్యము. అదే సోమరితనము. ప్రమాదములో స్మృతి భ్రంశము ఉంటుంది కనుక కర్తవ్య విస్మరణము జరుగుతుంది. ఒకవేళ స్మృతి ఉండినా, ఈ అలసత్వము అనే సోమరితనము వల్ల శ్రద్ధ లోపించి కర్తవ్యము ఉట్టి కెక్కుతుంది. చూద్దాం - చేద్దాం అంటూ సోమరి కాలాన్నంతా ఖర్చు పెట్టేస్తాడు. ఈ సోమరితనము తమోగుణము యొక్క రెండవ బిడ్డ.

సత్త్వగుణము ప్రకాశవంతంగా శోభిస్తూ ఉంటే, రజోగుణము ప్రవృత్తిలో ప్రవర్తిస్తూ ఉంటే, తమోగుణము సత్త్వగుణానికి భిన్నంగా ప్రమాద మనే అవివేకంతో, అలాగే రజోగుణానికి వ్యతిరేకంగా సోమరితన మనే అలసత్వముతో సాగుతూ ఉంటుంది.

సత్త్వం లోపించిన కారణంగా జ్ఞాన శూన్యం గాను, రజస్సు లోపించిన కారణంగా క్రియా శూన్యం గాను మారిన తమోగుణ యుతుడు ఇంకేమి చేస్తాడు? ఏమీ చేయలేక మంచ మెక్కుతాడు. అదే నిద్ర.

మూడవది నిద్ర. ఇంద్రియాలన్నీ నిద్రాణంగా ఉండటమే నిద్ర ***( నియతం ద్రాంతి ఇంద్రియాణి అత్ర ఇతి నిద్రా ).*** ఇంద్రియాలు వాడిపోయి, వాలిపోతూ ఉండటమే నిద్ర. తమోగుణ ప్రభావము చేత జీవుడు అతి నిద్రా లోలుడై ఉంటాడు. ఎప్పుడైనా నిద్రే. ఎక్కడైనా నిద్రే. ఏదున్నా నిద్రే. ఏది లేకపోయినా నిద్రే. ఇల్లు, ఆఫీసు అనే తేడా ఉండదు. తమోగుణం ఆవరించాలే గాని పడుకొనే నిద్రించాలనే నియమ మేమీ లేదు. నిలబడి అయినా నిద్రించ గలడు. కూర్చుని కూడా కునుకు తీయ గలడు. బస్సెక్కినా నిద్రే. బండెక్కినా నిద్రే. పట్టె మంచ మెక్కినా, పాడె ఎక్కినా కదలకుండా పడి ఉండటమే. సత్త్వగుణము లాగా కాంతి లేదు. రజోగుణము లాగా కార్యమూ ఉండదు. కాళ్ళు చాచుకొని, కళ్ళు మూసుకొని పడి ఉండటమే. ఈ విధంగా ప్రమాదాలస్య నిద్రలను సంతానముగా కలిగిన తమోగుణములో మునిగిన వాడు తరించే దేముంటుంది? ఈ విధంగా తమస్సు జీవులను బంధిస్తుంది ***( తాభిః, తత్ తమః నిబధ్నాతి ).***

*క॥ తలఁపులు గ్రందుగఁ బొడముట గలగను టేమఱుట భ్రమము గదురట జాడ్యం*
*బలసత యను నీ భావంబులు దామస కోటి యండ్రు బుధులు నరేంద్రా!*

చిత్ర విచిత్రమైన ఆలోచనలు చేయటము, సదా నిద్రాసక్తుడై తూగుతూ, తూలుతూ ఉండటము, సోమరియై, కార్య శూన్యుడై పడి ఉండటము, మూఢ బుద్ధితో మసలుతూ ఉండటము - ఇవన్నీ తమోగుణ లక్షణాలే అని ఆంధ్ర మహాభారతము - శాంతిపర్వము.

సత్త్వగుణాన్ని వివరించే ఆరవ శ్లోకంలో అర్జునుని ***అనఘ!*** పాపరహితుడా! అని సంబోధించాడు. రజోగుణమును గూర్చి చెప్పిన ఏడవ శ్లోకంలో ***కౌన్తేయ!*** కుంతీకుమారా! అని పిలిచాడు. తమోగుణమును తెలియచెప్పే ఈ ఎనిమిదవ శ్లోకంలో ***భారత!*** భరతవంశ కులోద్భవా! అని సంబోధిస్తున్నాడు.

ఏ వ్యసనాలు లేనపుడే సత్త్వగుణము శోభిస్తుంది. కనుక, అవ్యసన పరుడైన పార్థుని ***అనఘ!*** అని ఆరవ శ్లోకంలో సంబోధించాడు ***( అనఘ అవ్యసన ).***

రజోగుణ ప్రేరితుడై కార్య ప్రవృత్తిలో ఉండే వాడు సూక్ష్మబుద్ధి గల వాడై కర్మసంగము లేకుండా ఆచరించ గలగాలి. అందుచేత ***కౌన్తేయ!*** అని పిలిచాడు.

తమోగుణములో పడి అలమటించే వాడు వివేకవంతుడై వెలుగును చూడాలి. దానికి సంకేతంగా, ***భారత!*** అని సంబోధించాడు. 'భా' అంటే ప్రకాశము ***( భాతీతి భా ).*** కనుక తమోగుణము అనే చీకటిలో అలమటించ కుండా సత్త్వ ప్రకాశంలో శోభించా లనేది భావము.

*త్రిగుణముల వ్యాపారాన్ని మళ్లీ సంక్షేపంగా చెబుతున్నాడు.*

**సత్త్వం సుఖే సంజయతి రజః కర్మణి భారత ।**
**జ్ఞాన మావృత్య తు తమః ప్రమాదే సంజయ త్యుత ॥** 9

***సత్త్వం-సుఖే-సంజయతి-రజః-కర్మణి-భారత***
***జ్ఞానం-ఆవృత్య-తు-తమః-ప్రమాదే-సంజయతి-ఉత***

| | | | | | |
|---|---|---|---|---|---|
| భారత | = | అర్జునా! | సుఖే | = | సుఖము నందు |
| సత్త్వం | = | సత్త్వగుణము | సంజయతి | = | చేర్చుతుంది |





| | | | | | |
|---|---|---|---|---|---|
| రజః | = | రజోగుణము | జ్ఞానం | = | జ్ఞానమును |
| కర్మణి | = | కర్మల యందు | ఆవృత్య | = | ఆవరించి |
| సంజయతి | = | చేర్చుతుంది | ప్రమాదే | = | ప్రమాదము నందు |
| తమః తు | = | తమోగుణము | సంజయతి ఉత | = | చేర్చుతుంది గదా! |

**అర్జునా! సత్త్వగుణము జీవుణ్ణి సుఖపడేలా చేస్తుంది. రజోగుణము కర్మలలో దించుతుంది. తమోగుణము జ్ఞానమును కప్పేసి ప్రమాదంలో పడేస్తుంది.**

## వ్యాఖ్య

### గుణ ప్రాబల్యము

ఆరవ శ్లోకం నుండి వరుసగా మూడు శ్లోకాలలో గుణ స్వభావ ప్రాధాన్యతలను వివరించిన భగవానుడు, ప్రస్తుత శ్లోకంలో గుణోత్కర్షను పేర్కొంటూ గుణ ప్రాబల్యాన్ని తెలియ చేస్తున్నాడు. ఏయే కార్యాలలో ఏయే గుణాలకు ఎక్కువ ప్రాముఖ్యమో వివరిస్తున్నాడు.

సత్త్వగుణము సుఖము నందు ఆసక్తిని కలిగిస్తుంది. దుఃఖ స్పర్శ లేకుండా సుఖం వైపు నడిపిస్తుంది. శోక విషాదాలకు అనువైన కారణాలు ఉన్నప్పటికి, సత్త్వగుణము సుఖము వైపే పయనించేలా చేస్తుంది. దుఃఖ శోకాలను మరపించి సుఖంలో రంజింప చేస్తుంది. సుఖాసక్తుని చేస్తుంది ***( సుఖే సంజయతి సంశ్లేషయతి ).***

మనిషిలో సుఖము, వివేకము ఎక్కువ భాగము కనిపిస్తున్నాయి అంటే అతనిలో సత్త్వగుణము ఉత్కర్షంగా ఉంది అని అర్థము. అయినా, అది కూడా త్యజించ దగినదే. వృత్తి జన్య సుఖము స్వరూప సుఖం గాను, వృత్తి జన్య జ్ఞానము వృత్తి రహిత చైతన్యము గాను అనుభవానికి అందాలి. అదే గుణాతీత స్థితి. అట్టి నిస్త్రైగుణ్య స్థితికి చేరాలి అంటే సత్త్వాన్ని కూడా దాటి పోవాలి.

ఇక రెండవది రజోగుణము. ఇది రాగాత్మక మని ఇదివరకే తెలుసుకున్నాం. కనుక, ఒక వైపు సాత్త్విక సుఖ కారణా లున్నా, రజోగుణం వ్యక్తిలో కర్మాసక్తిని కలిగిస్తుంది. సకామ కర్మల వైపు దూసుకు పోయేలా చేస్తుంది. లౌకిక కర్మల యందు గాని, వైదిక కర్మల యందు గాని ఆసక్తిని పెంపొందించి కర్మసంగాన్ని, ఫలసంగాన్ని పెంపొందిస్తుంది ***( రజః కర్మణి సంజయతి ఇతి వర్తతే ).***

మూడవది తమోగుణము. ఇది కప్పివేసే స్వభావం కలది. సత్త్వగుణం వల్ల కలిగే వివేకాన్ని, సుఖాన్ని కప్పివేసి మనిషిని ప్రమాదంలో పడదోస్తుంది. మరపును కలిగించి చెడుపు చేస్తుంది. క్రియాశూన్యుణ్ణి చేస్తుంది.

ప్రారబ్ధాధీనులై జీవులు మనుగడను సాగిస్తున్నారు. చేయవలసిన కర్మలు ఎన్నో ఉంటాయి. ఉన్నాయి. ఎన్ని చేసినా, మరెన్నో ఎదురు చూస్తూ ఉంటాయి. అవన్నీ చేయ దగినవే. అందుకనే, అవి మన కొరకు నిరీక్షిస్తూ ఉంటాయి. మన కొరకు కాచుకొని ఉన్న కర్మలను మనం చేయకపోతే మరెవరు చేస్తారు? చేయడానికి ఆ కర్మ లేమిటో మనకు తెలుస్తాయే గాని, అన్యుల కెలా అర్థ మవుతాయి? ప్రారబ్ధ కర్మ ప్రారబ్ధాధీనుడైన జీవుణ్ణే ప్రేరేపిస్తుంది.. ఈ విధంగా చేయవలసిన కర్మను చేసి విడుదలను పొంద వలసిన అవసరము పురుషునికి ఉండే టప్పుడు, తమోగుణం చేత ప్రభావితుడై, కర్మల యందు ఉదాసీన వైఖరిని అవలంబించి క్రియా శూన్యంగా పడి ఉండటం సబబేనా? ఈ విధంగా తమోగుణము వివేకాన్ని కప్పేసి ప్రమాదంలో పడేస్తుంది. ప్రమాదము అంటే చేయవలసిన కార్యము ఉన్నా దానిని చేయక పోవడము అని అర్థము ***( ప్రమాదః నామ ప్రాప్త కర్తవ్యా కరణమ్ ).***

## గుణ ప్రాధాన్యము

ఫలాన వ్యక్తి సాత్త్వికుడు అంటూ ఉంటారు. అంటే అతనిలో కేవలం సత్త్వగుణమే ఉందని అర్థం కాదు. త్రిగుణాలూ ఉంటాయి. కాకపోతే సత్త్వగుణము ఉత్కృష్టంగా ఉత్కర్షమై ఉంటుంది. మిగిలిన రెండు గుణాలు అప్రధానంగా ఉంటాయి. కనుక ఏ వ్యక్తి లోనూ ఒకే గుణము ఉందని చెప్పలేము. కాకపోతే, అతని ఆలోచనా సరళిని, మనుగడను పరిశీలించి అతనిలో ఏ గుణము ప్రధానంగా ఉందో చెప్ప గలము.

కుంభకర్ణుడు తమోగుణ ప్రధానుడే అయినా, అతనిలో సత్త్వగుణము అసలే లేదని చెప్ప లేము. రావణ పుత్రుడు యుద్ధంలో మరణించి నపుడు, నిద్రిస్తున్న కుంభకర్ణుని అతి కష్టం మీద లేపుతారు. ఆ సందర్భంలో అన్నగారైన రావణాసురుని ముందు నిలబడి కుంభకర్ణుడు వినిపించిన హిత వచనాలను చూస్తే, ఆ భాషణ మెంతో వివేక పూరితంగా కనిపిస్తుంది. సత్త్వగుణ ప్రధానంగా ఉందని అనిపిస్తుంది. కాకపోతే, ఆ క్షణాలలో గోచరించిన సత్త్వగుణము అన్ని కాలాలలో అగుపించదు. కారణం, అప్పుడప్పుడు సత్త్వ రజో గుణాలు తొంగి చూసినా అతనిలో తమోగుణమే ఉత్కర్షమై ఉంది. ఇదే వ్యక్తులలో గుణ ప్రాధాన్యము. వ్యక్తుల ప్రవర్తనలలో అంతరాలన్నీ గుణ భేదాల వల్ల కలిగినవే. మానవుని మూర్తిమత్త్వము త్రిగుణ మిళితమై ఉన్నా, ఒక్క గుణమే వ్యక్త మవుతూ ఉండటానికి కారణము, ఆ వ్యక్తిలో ఆ ప్రత్యేక గుణము ప్రాధాన్యతను సంతరించుకొని ఉండటమే.

*గుణాలు తమ విశేష ప్రాబల్యాన్ని ఎలా ప్రదర్శిస్తాయో చెబుతున్నాడు.*

**రజ స్తమ శ్చాభిభూయ సత్త్వం భవతి భారత ।**
**రజః సత్త్వం తమ శ్చైవ తమ స్సత్త్వం రజ స్తథా ॥** 10

***రజః-తమః-చ-అభిభూయ-సత్త్వం-భవతి-భారత***
***రజః-సత్త్వం-తమః-చ-ఏవ-తమః-సత్త్వం-రజః-తథా***

| | | | | | |
|---|---|---|---|---|---|
| భారత | = | అర్జునా! | సత్త్వం | = | సత్త్వ గుణమును |
| సత్త్వం | = | సత్త్వగుణము | తమః చ ఏవ | = | తమోగుణమును |
| రజః | = | రజోగుణమును | తథా | = | అలాగే |
| తమః చ | = | తమోగుణమును | తమః | = | తమోగుణము |
| అభిభూయ | = | తిరస్కరించి | సత్త్వం | = | సత్త్వగుణమును |
| భవతి | = | అగుచున్నది | రజః | = | రజోగుణమును |
| రజః | = | రజోగుణము | భవతి | = | అగుచున్నది |

**అర్జునా! సత్త్వగుణము రజస్తమోగుణాలను తిరస్కరిస్తుంది. రజోగుణము సత్త్వ తమో గుణాలను అణగ ద్రొక్కుతుంది. తమోగుణము సత్త్వ రజో గుణాలను అదిమేస్తుంది.**

### వ్యాఖ్య

త్రిగుణాలు ఏయే కార్యాలను చేస్తాయో, వాటిని ఎప్పుడు చేస్తాయో వివరిస్తున్నాడు. గుణాలు వాటి వాటి కార్యాలను నిర్వర్తించే టప్పుడు ప్రాధాన్యతలను, ప్రాబల్యాలను సంతరించుకుంటూ అంగాంగి భావముతో ఎలా వర్ధిల్లుతూ ఉంటాయో ప్రస్తుత శ్లోకంలో స్పష్టం చేస్తున్నాడు.





రజస్తమో గుణాలను అణగద్రొక్కి, సత్త్వగుణం ప్రాధాన్యతను సంతరించుకు న్నప్పుడు, జ్ఞానసుఖాలు వృద్ధి చెంది కనిపిస్తాయి (**స్వకార్యం జ్ఞాన సుఖ ద్యారభతే**). సత్త్వగుణం రజ స్తమస్సులను అణచి ఉత్కర్షంగా శోభిస్తూ ఉంటుంది. సత్త్వగుణం అంగిగా ఉంటే, రజస్తమస్సులు అంగాలుగా ఉంటాయి.

అలాగే, సత్త్వ తమస్సులను అణగద్రొక్కి రజోగుణము ఉత్కర్ష మైనపుడు, కర్మాసక్తిని పెంపొందించి, సకామ కర్మలను విస్తరింప చేయడం జరుగుతుంది (**కర్మ తృష్ణాది స్వకార్య మారభతే**). రజోగుణము అంగిగా ఉంటే సత్త్వ తమస్సులు అంగాలుగా ఉంటాయి.

ఇక తమోగుణము ఉత్కర్షంగా ఉండే టప్పుడు, సత్త్వ రజస్సులు తిరస్కరింప బడతాయి. తమోగుణము అంగిగా ఉంటుంది. సత్త్వ రజస్సులు అంగాలుగా ఉంటూ అముఖ్యంగా ఉంటాయి. అప్రధానంగా ఉండే సత్త్వ రజోగుణాలు తమోగుణానికి వశపడి ఉంటాయి. అట్టి సమయాలలో తమోగుణము తన స్వకార్యమైన జ్ఞానావరణాది కార్యమును ప్రారంభిస్తుంది (**జ్ఞానావరణాది స్వకార్య మారభతే**).

గుణాలను, గుణకార్యాలను, వాటి ప్రాబల్య ప్రాధాన్యతలను తెలియ చేయడంలో ముఖ్యోద్దేశము వాటిని అనుసరించ మని కాదు. అవి జ్ఞానానికి ఎలా ప్రతిబంధకాలో గ్రహించి వాటిని దాటి పొమ్మనే అంతర్భావము. కనుకనే, ఈ శ్లోకంలో అర్జునుని భారత! అని సంబోధించాడు. రజ స్తమో గుణాలను అధిగమించి పురుషుడు నిత్య సత్త్వస్థుడు కావాలి (***నిత్య సత్త్వస్థః భవ!***). అలా సత్త్వగుణాన్ని ఆశ్రయించి ఉండటమే గాక, సత్త్వగుణము కూడా బంధహేతువే కనుక, దానిని కూడా దాటి గుణాతీతుడవు కావాలి (***నిస్త్రైగుణ్యో భవ! గుణాతీతో భవ !***) అనే సందేశం కూడా ***భారత!*** అనే పిలుపులో సంబోధ నాశయమై ఉంది. ***భాయాం బ్రహ్మవిద్యాయాం రతః*** అనే వ్యుత్పత్తి ననుసరించి బ్రహ్మవిద్య యందు రమించు వాడు కనుక, అర్జునుని ***భారత!*** అని సంబోధించి, సర్వులూ ఆ స్థితిని అందుకోవా లనే తన దివ్యసందేశాన్ని సర్వ జనావళికి గీతాచార్యుడు అనుగ్రహిస్తున్నాడు.

*ఎప్పుడు ఏ గుణం ఎలా ఉత్కర్షంగా ఉందో ఎలా తెలుసుకోవాలి? వరుసగా మూడు గుణాలను మూడు శ్లోకాలలో వివరిస్తున్నాడు.*

**సర్వద్వారేషు దేహేఽస్మి న్ప్రకాశ ఉపజాయతే ।**
**జ్ఞానం యదా తదా విద్యా ద్వివృద్ధం సత్త్వ మి త్యుత ॥** 11

***సర్వద్వారేషు-దేహే-అస్మిన్-ప్రకాశః-ఉపజాయతే***
***జ్ఞానం-యదా-తదా-విద్యాత్-వివృద్ధం-సత్త్వం-ఇతి-ఉత***

| | | | | | |
|---|---|---|---|---|---|
| అస్మిన్ | = | ఈ | ఉపజాయతే | = | పుడుతుందో |
| దేహే | = | దేహము నందు | తదా | = | అప్పుడు |
| సర్వద్వారేషు | = | సర్వ ద్వారముల యందు | ఉత | = | అధికంగా |
| ప్రకాశః | = | ప్రకాశ మగు | సత్త్వం | = | సత్త్వగుణము |
| జ్ఞానం | = | జ్ఞానము | వివృద్ధం ఇతి | = | వృద్ధి చెందిన దని |
| యదా | = | ఎప్పుడు | విద్యాత్ ఉత | = | తెలుసుకోవాలి |

**అర్జునా! ఇంద్రియాలు శరీర మార్గాలు. ఆ మార్గాలలో జ్ఞానము, ప్రకాశము విస్తరించింది అంటే, సత్త్వగుణం వృద్ధిలో ఉందని తెలుసుకో!**

### వ్యాఖ్య

ఎప్పుడు ఏ గుణము ఉత్కర్షమై ఉద్భవిస్తుందో ఆ గుణమును గుర్తించ డానికి చిహ్నము లేమిటి ***(తస్య కిం లింగమ్)?*** అనే విషయాన్ని ప్రస్తావిస్తూ, ముందుగా మొదటి గుణమైన సత్త్వగుణము యొక్క గుర్తులను చెబుతున్నాడు. మనస్సు జ్ఞాన పూరితంగా, ఇంద్రియాలు స్ఫూర్తి దాయకంగా కనిపించి నపుడు సత్త్వగుణము ప్రవృద్ధమై ఉందని గుర్తించ వచ్చు.

గుమ్మాన్ని చూచి గృహాన్ని ఊహించ వచ్చు అంటారు పెద్దలు. గుమ్మం కళాత్మకంగా ఉంటే, గృహం లోపల ఎక్కడ ఉండ వలసిన వస్తువు అక్కడ ఉంటూ ఇల్లు అందంగా, సుందరంగా అలరిస్తూ ఉంటుంది అని అంటారు. అలాగే, దేహము పురుషునికి భోగాయతనము. ఆత్మ వైభవమును గ్రహించ డానికి ఇంద్రియాలు ద్వారాలు. జ్ఞాన స్వరూపమైన జీవాత్మ ఇంద్రియా లనే ద్వారాల ద్వారా బాహ్యానికి గోచర మవుతుంది. పురుషు నకు ఉపలబ్ధి ద్వారాలే శ్రోత్రాది ఇంద్రియాలు ***(ఆత్మనః ఉపలబ్ధి ద్వారాణి శ్రోత్రాదీని సర్వాణి కరణాని సర్వ ద్వారేషు).***

బాహ్యం లోని శబ్దాది విషయాలు అంతఃకరణము లోనికి ప్రవేశించడానికి శ్రోత్రాది ఇంద్రియాలే ద్వారాలు. రాత్రిపూట ఇంటి లోపల దీపం వెలుగుతూ ఉంటే, ఆ ప్రకాశము ద్వారము వద్దే కనిపిస్తుంది. అలాగే, సత్త్వగుణము ఉద్భూత మైనపుడు ఆంతర్యము వివేకముతో, సుఖముతో విరాజిల్లుతూ ఉంటుంది కనుక, ఈ జ్ఞానసుఖాలు ద్వారా లైన ఇంద్రియాల ద్వారా బాహ్యానికి విరజిమ్మ బడుతూ ఉంటాయి. వాటి ద్వారా సత్త్వగుణము వివృద్ధమై ఉందని గుర్తించ వచ్చు.

చూచేందుకు కళ్ళున్నాయి. కాని, చూచేది మాత్రము మనస్సే. మనస్సులో సత్త్వగుణము ప్రవృద్ధ మైనపుడు కళ్ళు చూడ వలసిన వాటినే చూస్తాయి. అశ్లీలాలను, అనర్థ విషయాలను చూడవు. నేత్ర ద్వారాలు ఇలా వివేక పూరితంగా, శోభాయమానంగా వర్తిస్తున్నాయి అంటే, మనస్సులో సత్త్వగుణము ఉత్కర్షమై ఉందని ఊహించ వచ్చు.

సత్త్వగుణ ప్రభావం చేత నోరు సాత్త్వికాహారాన్నే స్వీకరిస్తుంది. పలుకులు సాత్త్వికంగా ఉండి వివేక యుతంగా ఉంటాయి. వివేకవంత మైన, జ్ఞాన పూరితమైన విషయాలనే చెవులు వింటాయి. గ్రంథ పఠనం జరిగినా, ఉత్తమమైన గ్రంథాలనే చదవటం జరుగుతుంది కనుక, వ్యక్తి లోని ఆలోచనలు, భావాలు విజ్ఞాన యుతంగా ఉంటాయి. ఏయే ఇంద్రియాల ద్వారా ఏయే కార్యాలు జరుగుతూ ఉండినా, ఆయా కార్యాలు సుఖ రూపాలుగా, ప్రకాశ స్వరూపాలుగా గోచరిస్తూ ఉన్నాయి అంటే, అట్టి ఇంద్రియ ద్వారాలను కలిగిన దేహములో వసించే పురుషుని ద్వారా సత్త్వోత్కర్ష వ్యక్త మవుతూ ఉందని అర్థము.

*ఇక వివృద్ధమైన రజో గుణమును గుర్తించే చిహ్నములను వివరిస్తున్నాడు.*

**లోభః ప్రవృత్తి రారమ్భః కర్మణా మశమః స్పృహా ।**
**రజ స్యేతాని జాయన్తే వివృద్ధే భరతర్షభ ॥** 12

***లోభః-ప్రవృత్తిః-ఆరంభః-కర్మణాం-అశమః-స్పృహా***
***రజసి-ఏతాని-జాయంతే-వివృద్ధే-భరతర్షభ***

| | | | | | |
|---|---|---|---|---|---|
| భరతర్షభ | = | అర్జునా! | వివృద్ధే | = | వృద్ధిని పొందినపుడు |
| రజసి | = | రజోగుణము | లోభః | = | లోభము |





| | | | | | |
|---|---|---|---|---|---|
| ప్రవృత్తిః | = | ప్రవృత్తియు | స్పృహా | = | ఆశ |
| కర్మణాం | = | కర్మల యొక్క | ఏతాని | = | ఇవి |
| ఆరంభః | = | ఆరంభము | జాయంతే | = | కలుగుతాయి |
| అశమః | = | అశాంతి | | | |

**అర్జునా! రజోగుణము వృద్ధిని బొంది నపుడు లోభము, వ్యాపకము, కర్మారంభము, అశాంతి, ఆశ మొదలైనవి పుడుతూ ఉంటాయి.**

### వ్యాఖ్య

రజోగుణము అతిశయించి నపుడు కనిపించే చిహ్నాలను చెబుతున్నాడు ***(రజసః ఉద్భూతస్య ఇదం చిహ్నమ్).*** వ్యక్తిలో గోచరించే ఈ చిహ్నాల ద్వారా వ్యక్తి మనస్సులో రజోగుణము వృద్ధిలో ఉందని గుర్తించ వచ్చు.

ఎవరిలో అయితే రజోగుణము ప్రవృద్ధమై ఉంటుందో వారిలో ముఖ్యంగా, ప్రథమంగా లోభ ప్రవృత్తి కనిపిస్తుంది. లోభము అంటే పరుల ధనమును లేదా సంపదను గ్రహించాలనే కోరిక ***(లోభః పరద్రవ్యాది త్సా).*** ఇదొక ధన దాహం. ఒక వ్యక్తి చలిపందిరి వద్ద నిలబడి ఎడతెరపి లేకుండా నీటిని పానం చేస్తూ ఉంటే, ఆ వ్యక్తి అధిక దాహంతో ఉన్నాడని గుర్తిస్తాము. అలాగే ఒక వ్యక్తి పరుల ధనాన్ని ఆశించే కార్యం లోనే నిమగ్నమై ఉన్నాడు అంటే, ఆ వ్యక్తిలో ధనదాహం, లోభగుణం ఎక్కువగా ఉందని గ్రహించ వచ్చు. ఈ లోభము అనే గుణము రజస్సుకు సంబంధించింది కనుక లోభిలో రజోగుణము ప్రవృద్ధమై ఉందని గ్రహించ గలుగుతాము.

లోభి నిరంతరము ప్రోగు చేసుకొనే ప్రయత్నము లోనే ఉంటాడు. పరుల ద్రవ్యమును ఆర్జించుట యందే ఆసక్తిని కలిగి ఉంటాడు. ఆర్జనలో ఎంత ఆసక్తిని కలిగి ఉంటాడో, వ్యయంలో అంతగా అనాసక్తిని ప్రదర్శిస్తూ ఉంటాడు. ఏదైనా రావాలే గాని, ఏదీ పోకూడదు అనేది లోభి సిద్ధాంతము. పరుల ద్రవ్యమును పొందే ప్రయత్నంలో నిత్యాశ ఉండటమే కాదు, అలా తాను ఆశించినది లభించ నపుడు నిరాశ చెందే స్వభావము, పరితపించే లక్షణము కూడా కలిగి ఉంటాడు. పరుల సొమ్ము వస్తూ ఉండాలి. తన సొత్తు పోకుండా ఉండాలి. ఇలాంటి లోభ ప్రవృత్తి ఎవరిలో గోచరిస్తూ ఉంటుందో, వారిలో రజోగుణము సమున్నత స్థాయిలో ఉందని గుర్తించ వచ్చు.

లోభముతో పాటు కర్మ ప్రవృత్తి మెండుగా ఉంటుంది. ఏయే కార్యాలు చేస్తే ధనం ప్రోగవుతుందో అలాంటి కార్యాలను ఆచరించాలనే ప్రవృత్తి పుష్కలంగా కనిపిస్తుంది. ఈ విధమైన ప్రవర్తనము సర్వ సాధారణంగా గోచరిస్తుంది ***(ప్రవృత్తిః ప్రవర్తనం సామాన్య చేష్టా).***

కర్మ ప్రవృత్తి ఉంది కనుక ప్రవాహ రూపంలో కర్మాచరణము జరుగుతూ ఉంటుంది ***(ఆరంభః కర్మణాం).*** లోభము ప్రధానంగా ఉండటం చేత, ఆ కర్మలు కూడా సకామ కర్మలుగా ఉంటాయి. ఫలాసక్తితో నిండి ఉంటాయి. ఆ కర్మల మధ్య మనిషి అలసి పోతూ ఆవేదన చెందుతూ ఉంటాడే గాని ప్రశాంతంగా ఉండ లేడు. వ్యక్తిలో కనిపిస్తున్న ఈ అశాంతి అతిశయించిన రజోగుణానికి అద్దం పడుతుంది. ఈ విధంగా మనస్సు శాంతిని కోల్పోవడమే అశమము. శమము లేని స్థితి ***(అశమః అనుపశమః).***

రజోగుణము ఉత్కర్షమై ఉన్నప్పుడు మనస్సులో రాగద్వేషాలే కదుల్తూ ఉంటాయి. ఇవే కర్మ స్పృహను కలిగిస్తూ ఉంటాయి ***(స్పృహా సర్వ సామాన్య విషయా తృష్ణా).*** ఏది చూచినా అది తనకే కావాలి. తనకే రావాలి. ఇప్పుడు దీనిని సాధించి, ఆ తరువాత దానిని సాధిస్తాను అనే కర్మ స్పృహే సదా ఉంటుంది. ఎప్పుడైతే రజోగుణము వ్యక్తిలో ఉద్భూతమై ఉంటుందో ***(రజసి గుణే వివృద్ధే)*** అప్పుడు ఇంతవరకు మనం చూచిన

లోభాది కర్మ స్పృహాంతం ఆ వ్యక్తిలో గోచరిస్తూ ఉంటుంది *(ఏతాని లింగాని జాయన్తే!)*. ఈ గుర్తులను బట్టి అతడిలో రజోగుణము అతిశయించి ఉందని గ్రహించ వచ్చు.

*ఇక మూడవ దైన తమోగుణము అతిశయించి ఉన్నపుడు చిహ్నాలు ఎలా ఉంటాయో చెబుతున్నాడు.*

**అప్రకాశోఽ ప్రవృత్తిశ్చ ప్రమాదో మోహ ఏవ చ ।**
**తమ స్యేతాని జాయన్తే వివృద్ధే కురునన్దన ॥** **13**

*అప్రకాశః-అప్రవృత్తిః-చ-ప్రమాదః-మోహః-ఏవ-చ*
*తమసి-ఏతాని-జాయంతే-వివృద్ధే-కురునందన*

| | | | | | |
|---|---|---|---|---|---|
| కురునందన | = అర్జునా! | | ప్రమాదః | = | అజాగ్రత్త |
| తమసి | = తమోగుణము | | మోహః ఏవ చ | = | మోహము |
| వివృద్ధే | = వృద్ధి చెందినపుడు | | ఏతాని | = | ఇవి |
| అప్రకాశః | = అజ్ఞానము | | జాయంతే | = | కలుగుతాయి |
| అప్రవృత్తిః చ | = నిర్వ్యాపారం | | | | |

**అర్జునా! తమోగుణము వృద్ధి చెంది నపుడు అవివేకము, సోమరితనము, ప్రమాదము, మోహము కలుగుతూ ఉంటాయి.**

### వ్యాఖ్య

తమోగుణము ఉద్భూత మైనపుడు అప్రకాశము, అప్రవృత్తి, ప్రమాదము, మోహము అనేవి పుడుతూ ఉంటాయి.

**అప్రకాశము**

అప్రకాశము అంటే ప్రకాశము లేక పోవడము. ప్రకాశము అంటే వివేకము, లేదా జ్ఞానము అని సత్త్వ గుణము విషయంలో చెప్పుకున్నాం. దానికి అత్యంత విరుద్ధ మైన అవివేకము, లేదా అజ్ఞానమే అప్రకాశము ***(అప్రకాశః అవివేకః అత్యన్తమ్)***. అదే వివేక భ్రంశము.

బాహ్యంలో సూర్య ప్రకాశము దివ్యంగా భాసిస్తున్నా, ఇంటి తలుపులు, కిటికీలు మూసుకొని కూర్చుంటే, లోపల చీకటి ఉంటుందే గాని వెలుగు ఎక్కడుంటుంది? జ్ఞాన కారణ మున్నా, తమోగుణములో ఉండే వ్యక్తికి జ్ఞానము కలగదు. అదే ఇక్కడ అప్రకాశము. ఒక వైపు ఆచార్యుడు బోధిస్తూ ఉన్నా, అందుకో లేని అధ్యాన స్థితిలో అంతఃకరణ ఉంటుంది.

అవివేకము కారణంగా యుక్తాయుక్త విచక్షణ లోపిస్తుంది. ఇది చేయదగిన కార్యము, ఇది చేయకూడని కార్యము అనే వివేకము తమోగుణంలో ఉండదు. వివేకము లేని కారణంగా వ్యక్తిలో సుఖము ఉండదు. సుఖము, జ్ఞానము లేని కారణంగా వ్యక్తి శక్తిహీను డవుతాడు. వివేక శక్తి లోపించి నపుడు తనకు తానుగా ఏ విషయాన్ని నిర్ణయించ లేడు సరి కదా, ఇతరులు చెప్పినా వినే జ్ఞానము లేకుండా ఉంటాడు. కనుక, ఈ అప్రకాశ దశలో అంతా జ్ఞానాభావమే.

**అప్రవృత్తి**

ప్రవృత్తి అంటే కార్యాచరణము. ఉద్యమ స్ఫూర్తి. అప్రకాశము వల్ల ఉత్సాహం క్షీణించి ఉంటుంది





కనుక ఉద్యమ స్ఫూర్తి కనిపించదు. ఏ పనిని చేయాలని ఉండదు. ఇదే అప్రవృత్తి. పనులు చేయలేక పోవడము ***(అప్రవృత్తిః ప్రవృత్త్య భావః)***. ఉద్యమ రాహిత్యము.

జ్ఞానశుద్ధి లేకుండా కర్మశుద్ధి రాదు. అప్రకాశం కారణంగా జ్ఞానము ఎప్పుడైతే లోపించిందో, వివేక శూన్యత వల్ల అప్రవృత్తి ఏర్పడి కార్యారంభమే జరగదు. అప్రకాశ అప్రవృత్తుల ఫలంగా జ్ఞాన, కర్మల యందు అభావమే అందల మెక్కుతుంది. అంతా స్తబ్దతే.

చేయవలసిన కార్యాలు ఉండినా చేయలేని అసమర్థతే అప్రవృత్తిలో అగుపిస్తుంది. ఏది మొద లెట్టా లన్నా సమస్యే. అన్నీ ఆరంభ ప్రతిబంధకాలే. ఏ కార్యాన్ని చేపట్టాలన్నా తిథి వార నక్షత్రా లంటూ, వాటిలో ఏదో సరిగ లేదని కాలయాపన చేస్తూ కార్యాన్ని కాలానికి నెట్టేసే గుణం అప్రవృత్తి లక్షణం.

అప్రవృత్తి లక్షణము తమోగుణము నుండి ఉత్పన్న మైంది. తమోగుణం వృద్ధి చెందిన వ్యక్తులలో అప్రకాశ కారణంగా వివేకము లోపించి ఉండటం చేత, వీరు మరేవో కారణాల్ని చూపెడుతూ అప్రవృత్తిని కొనసాగిస్తూ ఉంటారు. ఈ విధమైన అప్రవృత్తికి కొందరు వాస్తు శాస్త్రాన్ని కూడా వాడుకుంటారు. గృహ వాస్తు సరిగా లేదనో, గ్రహబలము చాలినంత లేదనో కారణాలను ఏకరవు పెడుతూ స్తబ్దతను కొనసాగిస్తూ ఉంటారు. అలాంటి వారు వాస్తు పండితులు మార్పులు సూచించినా, జ్యోతిష్కులు గ్రహశాంతిని బోధించినా, వింటారే గాని ఆచరించరు. గృహ మార్పు లెందుకు చేయలేదని వాస్తు పండితుడు అడిగితే, అలా చేయలేక పోవడానికి కూడా వాస్తు దోషమే కారణ మేమో అని పండితుణ్ణే తికమక పెడతారు. అలాగే గ్రహాలు భీష్మించుకొని ఉన్నందుకే గ్రహశాంతి సాధ్యం కాలేదని జ్యోతిష్కుణ్ణే సందిగ్ధంలో పడేస్తారు. అప్రవృత్తికి అనేక దారులు. ప్రవృత్తి కారణాలు ప్రవృత్తికి ఉన్నట్లే, అప్రవృత్తి కారణాలు అప్రవృత్తికి ఉంటాయి.

**ప్రమాదము**

ఆరంభ ప్రతిబంధకాలలో అప్రవృత్తి ఎలాంటిదో ప్రమాదము కూడా అలాంటిదే. ప్రమాదము అంటే మరపు. చేయ వలసిన కార్యాన్ని నిరంతరము మరచి పోతూ ఉండటమే ప్రమాదము. అలా అన్నిటినీ మరచి పోయేవాడు ఏ కార్యాన్ని ఆచరిస్తాడు? చేయ గలిగే శక్తి ఉండినా చేయలేని అసమర్థతే ప్రమాదము. ఎవరిలో మరపు, సోమరితనము ఉంటాయో, అలాంటి వారు ఏవేవో చేస్తామని చెబుతూ ఉంటారే గాని ఏవీ చెయ్య లేరు. ఇదంతా ప్రమాదమే. తమోగుణ ప్రభావమే.

**మోహము**

తమోగుణము అతిశయించిన వ్యక్తిలో మూఢత్వము ఉంటుంది. అదే మోహము. వివేకము అసలే లేని స్థితి ***(మోహః ఏవ చ అవివేకః మూఢతా ఇత్యర్థః)***. ఏది చేయదగిన కార్యమో దానిని అవివేకం కారణంగా చేయక పోవడమే గాక, ఒకవేళ చేసినా, మూఢత్వం కారణంగా పొరపాటు చేయడమే జరుగుతుంది. ఉన్న దానిని లేనట్లు, లేని దానిని ఉన్నట్లు వీక్షించే భ్రమయే మోహము. ఈ కారణంగా కార్యాచరణము చేపట్టినా దోషాల తోనే నిండి ఉంటుంది.

ఇంత వరకు మనం చూచిన ఈ తమోగుణ లక్షణాలను దాటినపుడే ఎందులో నైనా ప్రగతిని సాధించ గలము. ఉత్కృష్టమైన స్థాయికి చేరాలని అభిలషించే వారు నికృష్టమైన ఈ అప్రకాశాది తమోగుణ లక్షణాల నుండి విడి పడాలి. అందుకనే ఈ శ్లోకంలో అర్జునుని ***కురునందన*** అని సంబోధించడం జరిగింది. కురు వంశము ఉన్నత మైనది, ఉత్కృష్ట మైనది. ఉత్తమ వంశమున ఉద్భవించిన వాడు తమోద్భూత విషయాలకు దూరం కావాలి అని సూచించడమే ***కురునందన*** సంబోధన లోని ఆంతర్యము.

త్రిగుణములను గురించి ఇంతగా విస్తరించి చెప్పడం కేవలం గుణ ప్రవృత్తులను, గుణ ప్రభావాలను తెలుసుకుంటా రని కాదు. అలా గుణాల వాస్తవికత అర్థమైతే, వాటి నుండి విడిపడి గుణాతీత స్థితికి చేరుతా రనే భావం తోనే గుణచర్చను చేయడం జరిగింది. విని మరచి పోవడం కాకుండా వినిన దానిని ఆచరించ మని తెలిపేందుకే **కురునందన** అన్నాడు. 'కురు' అంటే ఆచరించ మని అర్థము. 'నందన' మంటే సుఖ పెట్టేది, ఆనందింప చేసేది అని అర్థము. గుణాలను అతిక్రమించే కార్యములో సఫలీకృతమై, ఆనందాన్ని అనుభవించ మని సూచించడం కూడా **కురునందన** సంబోధ నాశయమై ఉంది.

*గుణోత్కర్ష వల్ల జీవితంలో ఎలాంటి ప్రభావం ఉంటుందో, మరణకాలంలో గుణోత్కర్ష వల్ల జన్మాంతరాలలో అలాంటి ఫలమే ప్రాప్తిస్తుందని చెబుతున్నాడు.*

**యదా సత్త్వే ప్రవృద్ధే తు ప్రలయం యాతి దేహభృత్ ।**
**త దోత్తమవిదాం లోకా నమలా న్ప్రతిపద్యతే ॥** 14

***యదా-సత్త్వే-ప్రవృద్ధే-తు-ప్రలయం-యాతి-దేహభృత్***
***తదా-ఉత్తమ విదాం-లోకాన్-అమలాన్-ప్రతిపద్యతే***

| | | | | | |
|---|---|---|---|---|---|
| యదా | = | ఎప్పుడు | తదా | = | అప్పుడు |
| సత్త్వే | = | సత్త్వగుణము | ఉత్తమవిదాం | = | ఉత్తమ జ్ఞానుల యొక్క |
| ప్రవృద్ధే | = | వృద్ధి నొందినపుడు | అమలాన్ | = | నిర్మలమైన |
| దేహభృత్ | = | దేహధారి | లోకాన్ | = | లోకములను |
| ప్రలయం తు | = | ప్రళయమును | ప్రతిపద్యతే | = | పొందుతున్నాడు |
| యాతి | = | పొందుతున్నాడు | | | |

**సత్త్వగుణము అతిశయించి నపుడు జీవుడు మరణిస్తే, ఉత్తమ జ్ఞానులు పొందే పుణ్య లోకాలను పొందుతాడు.**

### వ్యాఖ్య

### మతి - గతి

***న అబీజాత్ జాయతే*** - విత్తనం నాటనిదే అంకురము మొల కెత్తదు. ఏదైనా చేస్తేనే వస్తుంది. చేయనిది రావలన్నా రాదు. ఇది చేశాను, ఇది చేస్తున్నాను, ఇది చేయబోతాను అని మనిషి ఆలోచిస్తూ ఉండొచ్చు. నువ్వు చెయ్యా లనుకున్నది చేశావా లేదా అని చూడ కుండా మృత్యువు తన పనిని తాను చేసుకొని పోతుంది. మరణ కాలం ప్రాప్తించ నంత వరకు ఎంతో సహనంతో నిరీక్షించే మృత్యువు, కాలం సమీపిస్తే క్షణం ఆగడానికి కూడా అసహనాన్ని ప్రదర్శిస్తుంది. మనిషి మృత్యుముఖంలో ప్రవేశించే టప్పుడు ఉన్న వన్నీ ప్రేక్షకు ల్లాగా చూస్తూ ఉండి పోతాయి. వెంట వచ్చేవి రెండే. ఒకటి ఆచరించిన కర్మ. రెండవది ఆర్జించిన జ్ఞానం.

భోగాయతనంగా అంత వరకు తోడుగా ఉన్న దేహం మృత్యు ఘాతానికి కూలి పోతుంది. నేల రాలి పోతుంది. చావు దెబ్బ అలాగే ఉంటుంది. దేహం రాలి పోయినా దేహి రాలిపోడు. ఎగిరెగిరి పక్షిలా పారి పోతాడు. ఎక్కడికి పోతాడు? ఏమో! ఎవరు ఎక్కడికి పోవాలో నిర్ణయించేది విధి కాదు; వ్యక్తి. ఎవరు ఎక్కడికి పోవాలో ఎవరికి వారే నిర్ణయించు కుంటారు. ఎవరు ఎలా బ్రతకా లనుకుంటే అలా బ్రతుకుతారు. ఎవరు ఎలా చావా లనుకుంటే అలా చస్తారు. చచ్చిన తరువాత ఎవరు ఎక్కడికి చేరా లనుకుంటే అక్కడికి చేరుతారు.

అంతా భావం లోనే ఉంది. భావంలో ఉన్నదే బ్రతుకులో తాండ విస్తుంది. బ్రతుకులో తాండవించిందే





చావులో తొంగి చూస్తుంది. అదే తరువాత జన్మకు గంతు లేస్తుంది. కేవలం భావంలో ఉంటే చాలదు. భావంలో ఉన్నది బ్రతుకు లోకి రావాలి. బ్రతుకంతా ఏది ఉంటుందో అదే చావులో గోచరిస్తుంది. ఇక్కడ లేనిది ఒక్కసారిగ అక్కడ ఊడి పడదు.

***శ్వః కార్య మద్య కుర్వీత*** - రేపు చెయ్యా లనుకున్నది నేడు పూర్తి చేసుకోవడమే మంచిది అన్నారు పెద్దలు. రేపు మీద చూపు ఉండటం తప్పు కాదు. కాని, రేపు యొక్క రూపు ఎలా ఉంటుందో చూపుకు అందదు. ఊహకు చిక్కదు.

*తీర మెక్కడో కనుచూపుకు కానరాదు*
*భార మైనది పయనించు బ్రతుకు నావ*
*ఎపుడు మునుగునో తెలియదు రక్షించు దేవా!*
*నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా !*

అని నీలకంఠ శతకంలో ఒక విబూది పండు.

మనిషి మనుగడ లోని ప్రవృత్తికి హేతువు, ప్రవర్తనకు కారణము మనస్సు లోని వృత్తులే, గుణాలే. అవే బ్రతుకులో కదులుతూ ఉంటాయి. మరణకాలంలో మనస్సు యొక్క స్థితిని బట్టే ఉత్తర జన్మ నిర్ణయింప బడుతూ ఉంటుంది. అంత్యకాలంలో ఏ గుణము అతిశయించి ఉంటుందో, ఆ గుణానుసారం గానే ఉత్తర స్థానాలు, స్థావరాలు నిర్ణయింప బడుతాయి.

జీవితంలో ఏ గుణము ప్రశస్తంగా, ప్రముఖంగా ఉద్భూతమై ఉంటుందో, ఆ గుణమే మరణకాలంలో ఉత్కర్షంగా ఉంటుంది. అదే ఉత్తర జన్మకు దారి చూపుతుంది.

అర్జునా! సత్త్వగుణము అతిశయించి ఉన్నప్పుడు (*యదా సత్త్వే ప్రవృద్ధే*) మరణమును పొందిన వాడు (*ప్రలయమ్ యాతి*) అతడు ఉత్తమవిదులు ఉండే నిర్మలమైన లోకాలను పొందుతాడు (***ఉత్తమ విదాం తత్త్వవిదాం లోకాన్ అమలాన్ ప్రాప్నోతి***) అంటున్నాడు భగవంతుడు. సంగ రాగాదుల కారణంగా మరణం ద్వారా ఏ ఫలమైతే పొంద బడుతూ ఉందో అదంతా గుణాల వల్లే కలుగుతూ ఉంది అని నిర్ధారణ చేస్తున్నాడు. ఇది కాస్త జాగ్రత్తగా అర్థం చేసుకో వలసిన విషయం.

***యత్కర్మ కురుతే తదభి సంపద్యతే*** - మానవుడు ఏ విధమైన కర్మను ఆచరిస్తాడో దానికి అనుగుణమైన లోకాన్నే పొందుతాడు అనేది శ్రుతి ప్రమాణము. మరి, ఇక్కడ కర్మానుసారము అనకుండా గుణానుసారము అని చెప్పడం ప్రమాణ విరుద్ధం కాదా? అనే శంక తలెత్తే అవకాశము లేక పోలేదు. ఈ సందేహం యుక్తం కూడా. కాకపోతే, జీవించి ఉన్నప్పుడు ఆచరించిన పుణ్యపాప కర్మలకు వశ పడే మరణకాలంలో గుణోత్కర్ష ఉంటుంది. అంతేగాని కర్మఫలాలు, ఫలహేతువులు గుణ జన్యములు అని కాదు.

### సత్త్వ గుణోత్కర్ష

పగలంతా పవిత్రంగా జీవించిన వాడు రాత్రి పూట ప్రశాంతంగా నిద్ర పోతాడు. రాత్రంతా ప్రశాంతంగా నిద్రించిన వాడు ఉదయాన్నే నిర్మలంగా నిద్ర లేస్తాడు. అలాగే, జీవిత మంతా సాత్త్వికంగా జీవించిన వానికి మరణ కాలంలో సత్త్వగుణమే ఉద్భూత మౌతుంది. అంత్యకాలంలో వివేక సుఖాలకు ఆలవాలమైన సత్త్వగుణము అతిశయించి ఉండటం చేత, మరణించిన తరువాత సత్త్వగుణ ప్రధానుడైన ఆ వ్యక్తి జ్ఞానాభిలాషులైన బ్రహ్మోపాసకులు సుఖించే ఉత్తమ లోకాలను పొందుతాడు.

ఉత్తమవిదులు అంటే తత్త్వ జ్ఞానాభిలాషులు. అట్టి వారు సుఖ జ్ఞానాలతో ప్రకాశించే బ్రహ్మాది లోకాలను పొందుతారు అని అర్థము. ఈ లోకాలు నిర్మల మైనవి అంటున్నాడు. నిర్మల మైనవి అంటే పరిశుద్ధ మైనవి, మల రహిత మైనవి అని అర్థము ***(లోకాన్ అమలాన్ మల రహితాన్)***. జన్మ జరాది దుఃఖాలే ఇక్కడ మలము. నిర్మలము అంటే జన్మ, మృత్యు, జరాది దుఃఖాలు, ఆకలిదప్పులు, వ్యాధులు, వృద్ధి క్షయాలు తెలియని లోకాలు అని అర్థము. అక్షర పరబ్రహ్మ యోగంలో దీనినే శుక్లగతిగా అర్థం చేసుకున్నాం.

జీవితకాలంలో ఏ గుణము ప్రవృద్ధమై ఉంటుందో, మరణకాలంలో ఆ గుణమే ఉత్కర్ష స్థితిలో ఉండి ఉత్తర గమనాన్ని నిర్దేశిస్తుంది. బ్రతుకులో సాత్త్విక జీవనాన్ని సాగించిన వాడు మరణకాలంలో ఉద్భూత మైన సత్త్వోత్కర్ష వలన నిర్మలమైన లోకాలను పొంది, కాలానుగుణంగా పునర్జన్మ నెత్తుతాడు. అంతేగాని, సత్త్వగుణోత్కర్షతో మరణించిన వాడు మోక్షమును పొందడు. బ్రహ్మ భావముతో దేహత్యాగం చేసిన వాడే జన్మ రాహిత్యాన్ని పొందుతాడు. ఈ విషయాన్ని ఎనిమిదవ అధ్యాయం - ఐదవ శ్లోకంలో చూశాము.

*మరణకాలంలో సత్త్వగుణోత్కర్ష కాకుండా, రజోగుణ, తమోగుణాలు ఉద్భూతమైతే ఉత్తరయాత్ర ఎలా ఉంటుందో చెబుతున్నాడు.*

**రజసి ప్రలయం గత్వా కర్మసఙ్గిషు జాయతే ।**
**తథా ప్రలీన స్తమసి మూఢయోనిషు జాయతే ॥** 15

***రజసి-ప్రలయం-గత్వా-కర్మసంగిషు-జాయతే***
***తథా-ప్రలీనః-తమసి-మూఢయోనిషు-జాయతే***

| | | | |
|---|---|---|---|
| రజసి | = రజోగుణము వృద్ధి నొంది నపుడు | తథా | = అట్లే |
| ప్రలయం | = మృతిని | తమసి | = తమోగుణము నందు |
| గత్వా | = పొంది | ప్రలీనః | = మృతి నొందిన వాడు |
| కర్మసంగిషు | = కర్మసంగత్వము గల వారి యందు | మూఢయోనిషు | = మూఢ ప్రాణుల యందు |
| జాయతే | = పుడుతున్నాడు | జాయతే | = పుడుతున్నాడు |

**రజోగుణము వృద్ధి నొందినపుడు మరణించు వాడు కర్మాసక్తులైన మానవుల యందు పుడుతాడు. తమో గుణము వృద్ధి చెంది నపుడు చనిపోయిన వాడు మూఢ జీవుల యందు పుడుతాడు.**

**వ్యాఖ్య**

బుద్ధిలో భావాలకు అనుగుణంగా బ్రతుకులో కార్యాలు సాగుతాయి. కార్య రూపం లోకి దిగిన భావాలే అనుభవాలను అందిస్తాయి. భావాలు ఉన్నతంగా ఉంటే భవిష్యత్తు ఉత్కృష్టంగా ఉంటుంది. భావాలు నీచంగా ఉంటే బ్రతుకు పతనావస్థకి దిగజారి పోతుంది.

బుద్ధిలో చూచిన ఆలోచనలే బ్రతుకులో కార్యాలుగా వ్యక్త మవుతాయి. కార్యాలుగా ఆచరింప బడిన వాటి ఫలాలనే బ్రతుకులో చవి చూస్తాము. చేసిన కర్మ ఆగుతుంది. అంతమాత్రాన ఫలం ఆగిపోదు. కర్మను ఆచరించిన వానిని కర్మఫలం నీడలా వెంబడిస్తూనే ఉంటుంది. ఆయా కాలాలలో మొక్కలు పుష్పించినట్లు, ఫలించినట్లు, బ్రతుకులో చూచినవే మరణంలో తొంగి చూస్తాయి. వాటి ఫలాలే ఉత్తర ప్రయాణంలో అందుతూ ఉంటాయి. మరణ కాలంలో సత్త్వగుణం ఉద్భూతం అయిన వారికి మరణానంతరము ఉత్తమ లోకాలు





ప్రాప్తిస్తా యని పూర్వ శ్లోకంలో చూశాము. ఇక మరణకాలంలో రాజస తామస గుణాలు ప్రవృద్ధమైన వారు మరణానంతరము ఎక్కడికి చేరుతారో ప్రస్తుత శ్లోకంలో చూస్తాము.

అర్జునా! రజోగుణము వృద్ధి చెందినపుడు ***(రజసి గుణే వివృద్ధే)*** మరణించిన వాడు ***(ప్రలయం మరణం, గత్వా ప్రాప్య )*** కర్మాసక్తి గల వారి మధ్య పుడుతాడు ***( కర్మసంగిషు జాయతే, కర్మాసక్తి యుక్తేషు మనుష్యేషు జాయతే)*** అంటున్నాడు భగవానుడు.

అలాగే తమోగుణము వివృద్ధ మైనపుడు ***(తమసి వివృద్ధే)*** మరణించిన వాడు ***(ప్రలీనః మృతః)*** మూఢ యోనుల యందు పుడుతాడు ***( మూఢ యోనిషు పశ్వాది యోనిషు జాయతే)***. పశ్వాది యోనుల యందు, అంటే తిర్యగ్జంతువుల యందు పుడుతాడు అని అర్థం.

**రజోగుణోత్కర్ష**

రజోగుణము ప్రవృద్ధ మైనపుడు దేహమును త్యజించిన వాడు కర్మాచరణమునకు అనుకూలమైన మానవ లోకంలో జన్మిస్తాడు. కర్మాచరణము జంతువులలో కూడా కనిపిస్తుంది. కాని, ఇక్కడ చెప్పబడే కర్మ క్షేత్రము ధర్మాచరణ మునకు అనుకూలమైన కర్మ క్షేత్రము కనుక, అతడు విధి నిషేధ కర్మ ఫలానుభవమును పొందే మానవుల మధ్య పుడుతాడు అని అర్థం.

రజోగుణము రాగాత్మక మని తెలుసుకున్నాం. రాగాత్మకము కనుక కర్మసంగము అనివార్యం. రజో గుణము ప్రవృత్తి హేతువు కావడం చేత కర్మాచరణమునకు అనుగుణమైన ప్రదేశం లోనే జన్మించ వలసి ఉన్నందున, రజో గుణము ఉద్భూత మైనపుడు మరణించిన వాడు పుణ్యాపాప కర్మ ఫలానుభవము కొరకు మానవ లోకంలో మానవుడుగా పుడుతాడు.

**తమోగుణోత్కర్ష**

తమస్సు వృద్ధి చెందినపుడు దేహమును త్యజించిన వాడు మూఢ యోనుల యందు, అంటే పశుపక్ష్యాది జంతు ప్రపంచంలో జన్మిస్తాడు. ప్రమాదాలస్య నిద్రాదులే తమోగుణంలో ప్రధానంగా ప్రదర్శింప బడుతూ ఉంటాయి. అక్కడ ప్రకాశానికి సంబంధించిన సత్త్వమునకు గాని, ప్రవృత్తికి సంబంధించిన రజస్సునకు గాని అవకాశము లేనందున, కేవలం మూఢంగా జీవించే మనుగడ కావడం చేత, తిర్యగ్జంతువుల యందు పుట్టడం జరుగుతుంది.

**మరో కోణం**

ఈ సందర్భములో ఆసక్తికరమైన ఒక విషయాన్ని మనం అర్థం చేసుకోవాలి. సత్త్వగుణము ప్రవృద్ధ మైనపుడు మరణించే వారు ఉత్తమవిదుల లోకాలను, అలాగే తమోగుణము ప్రవృద్ధ మైనపుడు మరణించిన వారు మూఢ యోనులను చేరుతారు అనే దానిని వేరొక కోణం నుండి చూచినా దోషం లేదు అని నా అభిప్రాయం.

సాత్త్వికులు ఉత్తమవిదుల లోకాలను చేరుతారు అంటే అవి బ్రహ్మోపాసకులు వసించే బ్రహ్మాది లోకాలు కావచ్చు. లేదా బ్రహ్మచింతనా పరులైన బ్రహ్మవిదులు వసించే సంప్రదాయము గల కుటుంబాలు కావచ్చు. అవి కూడా వివేక, సుఖ స్థానాలే కనుక.

అలాగే తామసికులు తిర్యగ్జంతు ప్రపంచంలో పుడుతారు అంటే, జంతువులు గానే పుట్టాలని లేదు. పశువులు గానే పుట్టాలనీ కాదు. పశు ప్రవృత్తి గల జంతు జీవనానికి అలవాటు పడిన మానవుల యందు జంతు

మానవుడుగా పుట్టినా పుట్ట వచ్చు. జంతువులు సైతం సిగ్గుపడేలా వ్యవహరిస్తున్న మానవుల్ని మనం నేటి సమాజంలో చూస్తూనే ఉన్నాం కదా! వారిని మనుషుల జాతిలో జమ కట్టాలా? లేక జంతువులని సరిపెట్టుకోవాలా? మీరే ఆలోచించండి!

ఇది కేవలం నా అభిప్రాయం. పెద్దగా చర్చించ వలసిన విషయ మేమీ కాదు. మానవుల సూక్ష్మ దేహాన్ని దృష్టిలో ఉంచుకొని చేసిన ఆలోచనే గాని మరొకటి కాదు. ఒకవేళ సంప్రదాయ విదులకు నచ్చకపోతే వారు దీనిని విస్మరించ వచ్చు.

ఇంతవరకు, త్రిగుణాలు ప్రకృతి సంభవాలు అని తెలుసుకున్నాం. ఈ గుణాలు మూడూ దేహిని దేహంలో ఎలా బంధిస్తున్నాయో అర్థం చేసుకున్నాం. అలాగే ప్రత్యేకంగా ఒక్కొక్క గుణం యొక్క లక్షణాలు ఏమిటో, ఒక్కొక్క గుణము పురుషునికి ఎలా బంధ హేతువు అవుతూ ఉందో కూడా చెప్పుకున్నాం. ఆ తరువాత గుణ వ్యాపారాలను సంక్షేపంగా చెప్పుకొని, ఒక్కొక్క గుణం విశేషంగా ఉత్కర్ష మైనపుడు దాని లక్షణాలు ఎలా అభివ్యక్త మవుతాయో గ్రహించాము. ఇక చివరగా, మరణకాలంలో ప్రవృద్ధ మయ్యే గుణాలకు ఎలాంటి ఉత్తర జన్మలు ప్రాప్తిస్తాయో కూడా సహేతుకంగా, సశాస్త్రీయంగా అర్థం చేసుకున్నాం.

*ఇప్పుడు పై శ్లోకాల యొక్క అర్థాన్ని సంక్షేపంగా చెప్పుకుంటే : గుణ ప్రధానంగా కర్మాచరణము జరిగే టప్పుడు కర్మలు కూడా సాత్త్విక కర్మలు, రాజస కర్మలు, తామస కర్మలుగా విభజింప బడతాయి కనుక, ఈ విధమైన త్రివిధ కర్మలకు ఫలితాలు కూడా త్రివిధం గానే ఉండాలి. వాటినే ఇప్పుడు వరుసగా మూడు శ్లోకాలలో, అంటే పదహారు, పదిహేడు, పద్దెనిమిదవ శ్లోకాలలో వివరించ బోతాడు. ఈ విధంగా ఐదవ శ్లోకం వద్ద ఆరంభించిన గుణత్రయ ప్రకరణాన్ని ఏకబిగిన పద్నాలుగు శ్లోకాలలో ప్రవచించి పద్దెనిమిదవ శ్లోకం వద్ద సమాప్తం చేస్తున్నాడు.*

**కర్మణః సుకృత స్యాహుః సాత్త్వికం నిర్మలం ఫలమ్ ।**
**రజస స్తు ఫలం దుఃఖ మజ్ఞానం తమసః ఫలమ్ ॥** 16

***కర్మణః-సుకృతస్య-ఆహుః-సాత్త్వికం-నిర్మలం-ఫలం***
***రజసః-తు-ఫలం-దుఃఖం-అజ్ఞానం-తమసః-ఫలం***

| | | | | | |
|---|---|---|---|---|---|
| సుకృతస్య | = | సుకృతమైన | దుఃఖం | = | దుఃఖము |
| కర్మణః | = | కర్మకు | ఫలం | = | ఫలము |
| సాత్త్వికం | = | సాత్త్వికమైన | తమసః | = | తమోగుణమునకు |
| నిర్మలం | = | నిర్మలత్వము | అజ్ఞానం | = | అజ్ఞానము |
| ఫలం | = | ఫలము | ఫలం | = | ఫలము అని |
| రజసః తు | = | రజోగుణమునకు | ఆహుః | = | చెబుతారు |

**సుకృతములైన సాత్త్విక కర్మలకు నిర్మలత్వము ఫలము. రాజస కర్మలకు దుఃఖమే ఫలము. తామసకర్మలకు అజ్ఞానము ఫలము అని పెద్దలు చెబుతారు.**

### వ్యాఖ్య

గుణ సంబంధమైన భావాలకు ఫలితాలను చెప్పి, ప్రస్తుత శ్లోకంలో గుణ సంబంధమైన కర్మలకు ఫలితాలను చెబుతున్నాడు.





### సాత్త్విక కర్మఫలం

సాత్త్విక కర్మ అంటే పుణ్యప్రదమైన కర్మ, లేదా ధర్మయుత మైన కర్మ. అదే సుకృతం. సుకృతమైన సాత్త్విక కర్మకు ఫలం సాత్త్వికం గానే ఉంటుంది. కనుక అది నిర్మలము. నిర్మలము అంటే మల రహితము. రజ స్తమస్సులు అంటని శుద్ధమైన ఫలమే నిర్మలమైన ఫలము (***సాత్త్వికం ఏవ నిర్మలం ఫలం***).

సుఖ హేతువైన సాత్త్విక కర్మ వివేక యుతము అని పూర్వ శ్లోకాలలో చెప్పుకున్నాం. శ్రద్ధాభక్తులతో ఆచరింపబడే శాస్త్ర విహిత కర్మలు, ధర్మయుతమైన లౌకిక కర్మలన్నీ సుకృతాలే. సాత్త్వికాలే. వివేకయుతాలే. సుఖరూపాలే. ఇలాంటి సుకృత కర్మలు అంతఃకరణ శుద్ధిని కలిగించి ఆంతర్యాన్ని నిర్మలంగా ఉంచుతాయి. నిర్మలమైన సుఖాన్ని ప్రసాదిస్తాయి. కనుక, సాత్త్విక కర్మను ఆచరించిన ధర్మాత్ముడు జీవించి ఉన్నప్పుడు మానవ లోకంలో గాని, మరణించిన తరువాత ఇతర లోకాలలో గాని సాత్త్వికమైన, నిర్మలమైన ఫలాన్నే అనుభవిస్తాడు. కనుక ***సాత్త్వికం నిర్మలమ్ ఫలమ్***.

### రాజస కర్మఫలం

రాజసకర్మ రాగయుత మైంది. ప్రవృత్తిరూప మైంది. ఆశతో కూడింది. లోభంతో నిండింది. నేను చేస్తున్నాను (***అహం కర్తా అహంకారః***) అనే అహంకారంతో కూడినది. విషయాసక్తితో కూడిన రాజస కర్మ పుణ్యపాప మిశ్రితంగా ఉంటుంది. కామ సంకల్పాలతో ప్రవృత్తి రూపంలో సాగే రాజస కర్మ సంతాపాన్ని కలిగిస్తుంది. బ్రతుకును దుఃఖ భూయిష్టంగా మార్చేస్తుంది. కనుక రాజస కర్మకు దుఃఖమే ఫలము (***రజసస్య కర్మణః ఫలమ్ దుఃఖం***).

రాజస కర్మకు దుఃఖమును ఫలితంగా చెబుతున్నాడు అంటే, సుఖం అసలే లేదని కాదు. సుఖం కూడా ఉంటుంది. కాకపోతే, లేశమాత్రంగా ఉంటుంది. దుఃఖం సాగర రూపంలో ఉంటుంది (***సుఖ మల్పం బహు క్లేశః***). బ్రతుకంతా దుఃఖమే నిండి ఉంటుంది కనుక రాజసకర్మ ఫలం దుఃఖము అని చెబుతున్నాడు. అంతేకాదు. రాజసకర్మ ఫలాలు గమనాగమనాలు. ఏ కర్మఫల మైనా అంతే. సకామ కర్మలన్నీ అనిత్య ఫలాలను, దుఃఖఫలాలను అందించి బ్రతుకును సంతాపంతో నింపుతాయి.

### తామస కర్మఫలం

తామసకర్మ అజ్ఞానముతో కూడి ఉంటుంది కనుక, దాని ఫలము కూడా అజ్ఞానమే (***తామసస్య కర్మణః ఫలమ్ అజ్ఞానమ్***). నిద్రాలస్య ప్రమాదాలతో నిండియున్న తమోగుణము జడ మైనది, స్తబ్ధతతో కూడుకున్నది కనుక ఏ తామస కర్మఫల మైనా అజ్ఞానయుతం గానే ఉంటుంది. మూఢత్వమే ఫలం. సామాన్య విషయాల లోనే తామస కర్మలు అవివేక పూరితంగా ఉంటాయి. ఇక ఆత్మ విషయానికి సంబంధించి చెప్పే దేముంటుంది? అవివేకమే ప్రధాన భూమికను పోషిస్తూ ఉంటుంది కనుక, తామస కర్మలలో విధి నియమా లుండవు. అశ్రద్ధ ప్రముఖంగా ఉంటుంది. విచారము అసలే ఉండదు. అట్టి అజ్ఞాన జనితమైన తామస కర్మకు అజ్ఞానమే ఫలము. కనుక, తామస కర్మలను ఆచరించే వాడు జీవించి ఉన్నప్పుడు అజ్ఞానం తోనే అలమటిస్తూ ఉంటాడు. మరణించిన తరువాత కూడా అజ్ఞాన స్థావరాల లోనే కాపుర ముంటాడు.

*గుణాల వల్ల ఇంకా ఏమి జరుగుతుందో, ఏమి కలుగుతుందో చెబుతున్నాడు* (***కించ గుణేభ్యః భవతి?***).

**సత్త్వా త్సంజాయతే జ్ఞానం రజసో లోభ ఏవ చ ।**
**ప్రమాద మోహౌ తమసో భవతో௨జ్ఞాన మేవ చ ॥** 17

*సత్త్వాత్-సంజాయతే-జ్ఞానం-రజసః-లోభః-ఏవ-చ*
*ప్రమాదమోహౌ-తమసః-భవతః-అజ్ఞానం-ఏవ-చ*

| | | | |
|---|---|---|---|
| సత్త్వాత్ | = సత్త్వగుణము వలన | తమసః | = తమోగుణము వలన |
| జ్ఞానం | = జ్ఞానము | ప్రమాద మోహౌ | = ప్రమాదము, మోహము |
| సంజాయతే | = కలుగుతూ ఉంది | అజ్ఞానం ఏవ చ | = అజ్ఞానము |
| రజసః | = రజోగుణము వలన | భవతః | = కలుగు తున్నాయి |
| లోభః ఏవ చ | = లోభగుణము | | |

**సత్త్వగుణము వలన జ్ఞానము కలుగుతుంది. రజోగుణము వలన లోభము కలుగుతుంది. తమోగుణము వలన మరపు, మోహము, అజ్ఞానము కలుగు తున్నాయి.**

## వ్యాఖ్య

మానవులలో భౌతికంగా స్థూల దేహాలన్నీ ఒకే విధమైన పదార్థ సంహతితో అలరారుతున్నా, వ్యక్తుల ప్రవర్తనా సరళిలో, అనుభవిస్తున్న సుఖదుఃఖాలలో అంతరాలు పొడ సూపడానికి బౌద్ధికమైన వ్యత్యాసాలే కారణా లని, అవి కూడా గుణ భేదాల వల్లనే ఏర్పడుతున్నా యని స్పష్టమైంది. గుణత్రయానికి సంబంధించిన సమస్త జ్ఞానము కలిగితే, తమోగుణ ఫలమైన అజ్ఞానము నుండి, రజోగుణ ఫలమైన దుఃఖం నుండి విడిపడి, వివేక సుఖహేతువైన సత్త్వ మార్గంలో చరించి, నిర్మలమైన అంతఃకరణ శుద్ధిని పొంది, తద్వారా ఆత్మజ్ఞాన సముపార్జనం చేసి మనిషి తరించి పోవచ్చు. ఈ కారణం చేతనే గుణత్రయ విశేషాన్ని భగవంతుడు ఇంతగా వివరించి చెప్పవలసి వచ్చింది.

సత్త్వగుణము వల్ల మనిషికి జ్ఞానం ప్రాప్తిస్తుంది *(సత్త్వాత్ సంజాయతే సముత్పద్యతే జ్ఞానం)*. సత్త్వము వల్ల కలిగే జ్ఞానం ఆత్మజ్ఞానం కాదు. నిత్యానిత్య వివేక జ్ఞానము, కార్యాకార్య విచార జ్ఞానము సత్త్వము వల్ల ఏర్పడుతుంది. సదస ద్వివేకము అనేది సత్త్వగుణము లేని వారికి అసంభవము. సత్త్వగుణము వివేక విచారాదు లను కలిగిస్తుంది కనుక, నిర్మలమైన అంతఃకరణమును ప్రసాదిస్తుంది కనుక, ప్రమాణ విచారము చేయ డానికి అనుకూలమైన చిత్తశుద్ధి, చిత్త నైర్మల్యము ఏర్పడుతాయి. పరమాత్మ తత్త్వమును దర్శించ డానికి అవసరమైన వెలుగును సత్త్వము విరజిమ్ముతుంది. అందుచేతనే, ***సత్త్వము ప్రదీప మా పరతత్త్వము గాంచుటకు*** అని అద్భుతంగా ప్రవచించింది ఆంధ్ర మహాభారతము - అశ్వమేధ పర్వము.

సత్త్వగుణము నుండి జ్ఞానము ఉత్పన్న మవుతూ ఉంటే, రజోగుణము నుండి లోభము కలుగుతూ ఉంది ***(రజసః లోభః ఏవ చ)***. విషయాసక్తి, విషయాల యందు తీరని దాహమే లోభము. ఏదొచ్చినా, ఎంతొచ్చినా నివారింప శక్యము గాని ఆశా విశేషమే లోభము. లాభా లెన్ని వచ్చి పడినా పూరింప బడని లోభము మనిషిలో అసంతృప్తిని, ఆవేదనను కలిగించి బ్రతుకును దుఃఖమయం చేస్తుంది.

తమోగుణము నుండి ప్రమాద మోహాలు కలుగుతాయి ***(ప్రమాద మోహౌ చ ఉభౌ తమసః భవతః అజ్ఞానమ్ ఏవ చ)***. ప్రమాద మోహాలు బుద్ధి జాడ్యా లని ఇప్పటికే తెలుసుకున్నాం. అప్రకాశము, అప్రవృత్తి ప్రముఖంగా కనిపించే తమోగుణము వివేక శూన్యమై ఉంటుంది. వివేకము లేనపుడు విపరీత జ్ఞానము ఏర్పడుతూ ఉంటుంది. అదే మోహము. అట్టి మోహ కూపంలో పడ్డ వారికి అంతా అంధకారమే. అదే అజ్ఞానము. తమోగుణ ఫలం.

*గుణ ప్రభావంతో పయన మెటు సాగుతుందో చెబుతున్నాడు.*





**ఊర్ధ్వం గచ్ఛన్తి సత్త్వస్థాః మధ్యే తిష్ఠన్తి రాజసాః ।**
**జఘన్య గుణవృత్తిస్థాః అధో గచ్ఛన్తి తామసాః ॥** 18

*ఊర్ధ్వం-గచ్ఛంతి-సత్త్వస్థాః-మధ్యే-తిష్ఠంతి-రాజసాః*
*జఘన్య గుణ వృత్తిస్థాః-అధః-గచ్ఛంతి-తామసాః*

| | | | |
|---|---|---|---|
| సత్త్వస్థాః | = సత్త్వగుణము నందున్న వారు | తిష్ఠంతి | = ఉంటారు |
| ఊర్ధ్వం | = ఊర్ధ్వమునకు | జఘన్య గుణవృత్తిస్థాః | = నికృష్టమైన గుణప్రవృత్తి గల |
| గచ్ఛంతి | = పోతున్నారు | తామసాః | = తమోగుణము కలవారు |
| రాజసాః | = రజోగుణము గలవారు | అధః | = క్రిందికి |
| మధ్యే | = మధ్యలో | గచ్ఛంతి | = పోతున్నారు |

**సత్త్వగుణము గలవారు ఉత్తమ లోకాలకు పోతున్నారు. రజోగుణము గలవారు మధ్య లోకమును చేరుతున్నారు. నికృష్టమైన తమోగుణము కలవారు నీచ జన్మలలో పడుతున్నారు.**

## వ్యాఖ్య

### సాత్త్వికులు

సత్త్వగుణ ప్రధానులైన వారు సత్త్వస్థులు. అంటే, సత్త్వగుణ కార్యాలైన సుకృత కర్మల యందు వర్తించే వారు. ఏది చేయాలి, ఏది చేయ కూడదు అనే కార్యాకార్య విచక్షణ కలిగి ప్రవర్తించే వారు. వివేకము కలిగిన వారు కావడం చేత యుక్తాయుక్తములను చక్కగా తెలిసి ఆచరించే వారు. సాత్త్వికమైన సుకృతాలను ఆచరించే వారు నిర్మలమైన సాత్త్విక ఫలాన్నే పొందుతారు కనుక ప్రశాంత జీవనాన్ని, పవిత్రమైన మనుగడను కొనసాగిస్తారు. సత్త్వగుణ ప్రధానులైన ఈ సుకృతాత్ములు మరణానంతరము జ్ఞాన, సుఖ నిలయాలైన ఊర్ధ్వ లోకాలను చేరుతారు ***(ఊర్ధ్వం గచ్ఛన్తి దేవ లోకాదిషు ఉత్పద్యన్తే సత్త్వస్థాః)***.

ఊర్ధ్వలోకాలు అంటే దేవతలు వసించే లోకాలు. అక్కడ దేవతల మధ్య అధికంగా వివేకాన్ని పొందుతారు. సుఖాలను అనుభవిస్తారు. ఈ విధంగా పుణ్యఫలాన్ని అనుభవించిన తరువాత, తిరిగి శుచి గల, జ్ఞానము గల కుటుంబాలలో జన్మించి, తీవ్ర ముముక్షువులై ముక్తి మార్గంలో చరిస్తారు. ఇది ప్రకాశ మార్గము.

### రాజసులు

రజోగుణ ప్రధానులైన వారు రాజసులు. అంటే, రజోగుణ లక్షణమైన లోభగుణంతో చరించే వారు. విషయాసక్తితో సకామ కర్మల యందే నిమగ్నమై ఉండేవారు. కర్మావేశం తోనే చరిస్తుంటారు. కనుక, ప్రకాశం లేని కారణంగా కృత్యాకృత్యాలను రెండిటిని ఆచరిస్తారు. ఈ విధమైన ఆచరణము వలన పుణ్యపాపాలు రెండిటిని ప్రోగు చేసుకుంటారు. అల్ప సుఖాలను ఆశించి అనంత శోకాన్ని బ్రతుకులో దించు కుంటారు; బుద్ధిలో నింపుకుంటారు. ఈ విధంగా సుఖ దుఃఖాలలో పరిభ్రమించే రాజసులు, మరణించిన తరువాత తిరిగి మానవలోకం లోనే పుడుతారు ***(మధ్యే తిష్ఠన్తి మనుష్యేషు ఉత్పద్యన్తే రాజసాః)***.

మధ్య లోకము అంటే మానవ లోకము. అటు దేవలోకము కాక, ఇటు నీచ జన్మల లోకము కాక, మధ్య ఉండేది కనుక, మానవులు వసించే ప్రపంచాన్ని మధ్య లోకము అంటారు. పుణ్య పాప కర్మల ఫలితంగా సుఖ దుఃఖాల మధ్య ఊగిసలాడే రాజసులు రంగులరాట్నం లాగా చావుపుట్టుకల మధ్య పరిభ్రమిస్తూ ఉంటారు. ఇది ప్రవృత్తి మార్గము.

**తామసులు**

తమోగుణ ప్రధానులైన వారు తామసులు. నిద్రాలస్య ప్రమాదాలలో నిమగ్నమై ఉండేవారు. అజ్ఞానమే ప్రధాన లక్షణంగా కలిగిన తామసులు, ప్రకాశానికి నోచుకోక, ప్రవృత్తికి పూనుకోక, కునుకు లోనే మునిగి ఉంటారు. అజ్ఞానం లోనే అలమటిస్తూ ఉంటారు. అంతా చీకటే. మనస్సులో చీకటే. మనుగడ లోనూ చీకటే. అలాంటి వారు జీవితకాల మంతా అంధకారంలో పడి అల్లాడుతూ ఉంటారు. మరణానంతరము అటు దేవ లోకాన్ని చేరలేక, ఇటు మానవ లోకానికి నోచుకోక, నీచజన్మ లైన తిర్యగ్జంతువుల యందు పుడుతారు *(జఘన్య గుణః తమః , మూఢాః అధః గచ్ఛన్తి , పశ్వాదిషు ఉత్పద్యన్తే తామసాః )* . తామసులు జ్ఞానహీనులు, మూఢులు కావడం చేత జంతు జన్మలలో పుడుతారు.

గుణాలను బట్టే గమనాలు. ఈ సత్యాన్ని నిజ జీవితంలో కూడా మనం చూడ వచ్చు. సత్త్వగుణ ప్రధాను లైన సుకృతాత్ములు ఆలయాలకు, ఆశ్రమాలకు, ఆచార్యుల వద్దకు వెళ్తూ ఉంటారు. రజోగుణ ప్రధానులైన రాజసులు సినిమాహాళ్ళలో, కాఫీ హోటళ్ళలో, అదే పనిగా టి.వి. ముందు కూర్చుని దర్శన మిస్తూ ఉంటారు. ఇక, తమోగుణ ప్రధానులైన తామసులు మత్తుపానీయాల దుకాణాల వద్ద, అయోగ్యమైన ప్రదేశాలలో కనిపిస్తూ ఉంటారు. మరణానంతరము కూడా ఇలాగే ఉంటారు.

**ప్రయాణంలో పరివర్తన**

మరణానంతరము ఎవరి ప్రయాణాలు వారి కున్నాయి. సాత్త్వికులు సత్త్వస్థులు కావడం చేత ఇహ పరాలలో సత్త్వానికి అనుకూలమైన ప్రదేశాల లోనే ఉంటారు. జ్ఞాన, సుఖాల యందే చరిస్తూ ఉంటారు. నిర్మల మైన అంతఃకరణమును పొంది ఉంటారు కనుక, వీరు శ్రవణ, మనన నిదిధ్యాసల ద్వారా ఆత్మజ్ఞానమును పొంది తరించే ప్రయత్నం చేయాలి.

ఇక రాజసులు ప్రవృత్తి ప్రధానంగా చరిస్తుంటారు కనుక, ఉన్నతంగా చరిస్తే సత్త్వస్థ లవుతారు; దిగ జారితే తామసు లవుతారు. కనుక, రాజసులు జాగరూకులై సత్త్వస్థులు కావడానికి ప్రయత్నించాలి.

చివరగా తామసులు. వీరిది అజ్ఞాన భూమిక కనుక క్రింది అంతస్తు నుండి సూటిగా పై అంతస్తుకు చేరడానికి వీరికి 'లిఫ్టు' సౌకర్యము లేదు. ఒకేసారి తమోగుణం నుండి సత్త్వగుణాన్ని అందుకో లేరు. కాబట్టి, వీరు మధ్య అంతస్తు అయిన రజోగుణమును పొందిన తరువాతే సత్త్వస్థులు కావడానికి ప్రయత్నించాలి. కనుక, ముందు అప్రవృత్తి లక్షణాన్ని త్యజించి, కర్మాసక్తులై ప్రవృత్తి నాశ్రయించి, తద్వారా శుద్ధిపడి సత్త్వస్థులు కావాలి.

**ప్రకృతి బిడ్డలే**

త్రిగుణాలు ప్రకృతి సంభవాలు కనుక, సాత్త్వికులు, రాజసులు, తామసులు ముగ్గురూ ప్రకృతిమాత బిడ్డలే. ప్రకృతి కారణంగా ఆవిర్భవించిన వారే. కారణమైన ప్రకృతి మాతలో ఏ లక్షణా లున్నాయో ప్రకృతి బిడ్డ లైన జీవులలో అవే లక్షణాలు ఉంటాయి. కనుక అందరి లోను త్రిగుణాలే ఉంటాయి. కాకపోతే సాత్త్వికులలో సత్త్వం ప్రధానం గాను, మిగిలిన రెండు గుణాలు అప్రధానం గాను ఉంటాయి. రాజసులలో రజోగుణం ముఖ్యం గాను, మిగిలిన రెండు అప్రధానం గాను ఉంటాయి. తామసులలో తమోగుణము ముఖ్య భూమికను పోషిస్తూ ఉంటే, మిగిలిన రెండు గౌణంగా ఉంటాయి. అంతేగాని, ఎవరి లోనూ ఒక్క గుణమే ఉండదు.

ముగ్గురూ ప్రకృతి పిల్లలే. ప్రకృతి స్త్రీ. 'స్త్రీ' అనేది ఒక పదమే. కాని, అందులో మూడు శబ్దా లున్నాయి.





స, త, ర - ఈ మూడు శబ్దాల సమ్మేళనమే 'స్త్రీ' అనే పదము. అదే ప్రకృతి. 'స' శబ్దం సత్త్వగుణము, 'త' శబ్దం తమోగుణము, 'ర' శబ్దము రజోగుణము. అందుచేత ప్రకృతి బిడ్డలైన అందరి లోను త్రిగుణాలు కలిసే ఉంటాయి.

*త్రిగుణాలకు సంబంధించిన ప్రకరణము ఇంతటితో ముగిసింది. త్రిగుణాలతో ఉన్నంత వరకు ప్రకృతి బంధములో ఉండక తప్పదు. బంధవిముక్తి కావాలి అంటే ప్రకృతి హస్తాల నుండి విడిపడి పురుషుని ఒడిలో కూర్చోవాలి. అదే గుణాతీత స్థితి. మోక్షస్థితి. ఇక ఇప్పుడు, గుణాతీత స్థితిని వివరించ బోతున్నాడు.*

## గుణ విముక్తి - గుణాతీత స్థితి

ఉంది అని భావించినా ఉండనిది, ఉండలేనిది ఏదో అదే మన అనుభవానికి అందుతూ ఉంది. లేనిదే అయితే, అది ఉంది అని ఎందుకు భావిస్తాము? కనుక ఉంది. ఉన్నట్లే ఉంది. ఒకటి కనిపిస్తూ ఉంది. మరొకటి వినిపిస్తూ ఉంది. ఈ లోగా అదే మరోలా అనిపిస్తూ ఉంది.

***ఘటః అస్తి*** - కుండ ఉంది. కుండకు సంబంధించిన జ్ఞానం కూడా ఉంది. ఆ జ్ఞానం తోనే అది కుండ అని చెబుతున్నాం. కుండ సత్య మేనా? కుండకు సంబంధించిన జ్ఞానం సత్యమేనా? అని విచారించి, కుండ సత్యమే అని నిర్ధారణ చేసుకొనే లోగా, అది కుండ కాదని; కేవలం మట్టే అని వినిపిస్తూ ఉంది. కుండ, మట్టి - ఈ రెండిటిలో ఏది సత్యము? దేనికి సంబంధించిన జ్ఞానము సత్యజ్ఞానము అని ఆలోచిస్తూ ఉండగానే మట్టి మట్టి కాదని; అది అణు సముదాయము మాత్రమే అని మనకే అనిపిస్తూ ఉంది. అన్నీ ఇలాగే ఉన్నాయి. అన్నీ మారుతూనే ఉన్నాయి. రూపాంతరం చెందుతూ కరిగి పోతూ ఉన్నాయి. కనుమరు గవుతూ ఉన్నాయి.

ప్రపంచము సమస్తమూ ఇలాగే ఉంది. ప్రపంచమే కాదు; దృశ్యమైన ప్రపంచాన్ని తెలుసుకుంటున్న మన వైపు తిరిగి చూచినా, మన దేహము, ఇంద్రియాలు, ప్రాణము, మనస్సు, మనోవృత్తులు, మనస్సు లోని జ్ఞానము, మనస్సు లోని అజ్ఞానము - అంతా మార్పు చెందుతూనే ఉంది. ఏదీ స్వతస్సిద్ధంగా లేదు. ఏదీ స్వప్రకాశం కాదు. ప్రతి ఒక్కటి మరొక దానిపై ఆధారపడి ఉంది. ఆధారపడి ఉండేది సత్యమెలా అవుతుంది? మిథ్య అవుతుంది. ఇంతకీ సత్య మేమిటి? ఏమో! ప్రస్తుతం మనకు తెలిసే దంతా మిథ్యే. కనుక, ఇప్పుడు మన వద్ద ఉన్న దంతా మిథ్యా జ్ఞానమే. మాయాజ్ఞానమే. అదే ప్రకృతి. త్రిగుణాత్మకమైన మాయా రూపము.

గుణయుతమైన ప్రకృతితో సంబంధాన్ని ఏర్పరచుకున్న పురుషునికి ప్రకృతి జ్ఞానమే కలుగుతుంది. మిథ్యా జ్ఞానమే ఏర్పడుతుంది. మిథ్యాజ్ఞానంతో సంసర్గ మేర్పడిన పురుషుడు ***(మిథ్యా జ్ఞానేన యుక్తస్య)*** సుఖ, దుఃఖ మోహ లక్షణాలు గల సత్త్వ రజ స్తమో గుణాలతో సంగం ఏర్పరచుకొని, ఆ గుణసంగము చేత మళ్ళీ భోగ్యము లైన గుణాల తోనే తాదాత్మ్యం చెంది, ***సుఖీ దుఃఖీ మూఢోఽ హ మస్మి*** - ' నేను సుఖంగా ఉన్నాను, నేను దుఃఖ పడుతున్నాను, నేను ఏమీ తెలియని మూఢుడను' అని భావించడం జరుగుతూ ఉంది. ఈ విధమైన గుణసంగమే సంసార హేతువై జన్మలకు కారణ మవుతూ ఉంది ***(కారణం గుణ సంగోఽ స్య సదసద్యోని జన్మసు:*** *13 వ అ - 21వ శ్లో)* అని పదమూడవ అధ్యాయంలో ప్రస్తావించిన విషయాన్నే ప్రస్తుత అధ్యాయంలో మళ్ళీ అంది పుచ్చుకొని, సత్త్వ రజ స్తమో గుణాలు అనే త్రిగుణాలు ప్రకృతి సంభవా లంటూ ప్రారంభించి *( 14 వ అ - 5 వ శ్లో)*, గుణ స్వరూపము, గుణకార్యము ***( గుణ వృత్తం )***. గుణాలు తమ కార్యాల ద్వారా పురుషుని బంధించడము ***(స్వవృత్తేన చ గుణానాం బంధకత్వం)***. గుణ కార్యాల చేత బద్ధు డైన పురుషునకు ప్రాప్తించే గతి ***( గుణవృత్త నిబద్ధస్య చ పురుషస్య యా గతిః )*** - ఈ విధంగా, బంధహేతువు మరియు అజ్ఞానం వల్ల కలిగే



44

మిథ్యా జ్ఞానా న్నంతటినీ ఇంతవరకు సవిస్తరంగా చెప్పి ***(ఇతి ఏతత్ సర్వం మిథ్యా జ్ఞానమ్ అజ్ఞాన మూల బంధ కారణం విస్తరేణ ఉక్త్వా).*** ఇక ఇప్పుడు, బంధము నుండి విడిపడి మోక్షం పొందడ మనేది సమ్యగ్దర్శనం వల్లనే జరుగుతుంది అనే విషయాన్ని ప్రవచించ డానికి ఉపక్రమిస్తున్నాడు ***(అధునా సమ్య గ్దర్శనాత్ మోక్షః వక్తవ్యః ఇత్యాహ).***

ఇక్కడ మరొక్క విషయాన్ని కూడా మనం విశ్లేషించు కోవాలి. ఉంది - ఉంది అని మనం భావిస్తున్న దంతా ఉన్నది కాదని, మిథ్యామయమే నని అర్థం చేసుకున్నాం. మిథ్య అంటే, కుండ లాగా నామరూపాలతో తెలుస్తూ, మరొక దానిపై ఆధారపడి ఉండేది అని ఇప్పటికే తెలుసుకున్నాం కనుక, అలాంటి జడ వస్తువుకు సంబంధించిన జ్ఞానం కలిగేది ఎవరికి? ***అహం ఘటః*** - 'నేను కుండను' అనే జ్ఞానం కుండకు కలిగే అవకాశ ముందా? కుండ జడం కనుక కుండకు జ్ఞానం కలిగే అవకాశం లేదు. జ్ఞాన మనేది చేతనమై ఉంటుందే గాని, జడం కాదు. అలాంటి జ్ఞానం దేనికి సంబంధించిందై ఉండాలి? ప్రపంచము మొదలుకొని మనస్సు లోని జ్ఞానా జ్ఞాన వృత్తుల వరకు తెలియ బడుతున్న వన్నీ దృశ్యాలే నని, జడరూపాలే నని, నామరూపాది విశేషాలే నని తెలుసుకున్నాం కనుక, ఈ విశేషా లన్నిటికీ ఆధారమై, తనకు మరొక ఆధారము లేని చిదాత్మక మైన సత్తారూప చైతన్యమునకు సంబంధించిందై ఉండాలి. అది ఏ విశేషాలు లేని సామాన్య సత్తా చైతన్యము. అది ఉంది ***(తదస్తి).*** అదే నీవుగా ఉంది. నీవే అది ***(తత్త్వమసి).*** అదే నేనుగా ఉంది. నేనే అది ***(అహం తదేవ).*** అదే నీవు, అదే నేను; కనుక నువ్వే నేను, నేనే నువ్వు ***(త్వమేవాహం).*** అదీ సత్యం. అదే సత్యం.

అది ఉన్నదే. లేదని భావించినా లేకుండా పోయేది కాదు. అది లేదని భావించినా, అలా భావించడానికి ఆధారమైంది అదే. తన ఉనికిని తానే ఎలా నిరాకరిస్తుంది? నిరస్తం కాని దేదో అదే సమస్తం లోనూ ఉంది. నగలో బంగారులా వ్యాపించి ఉంది. మట్టిపాత్రలలో మట్టిలా వ్యాపించి ఉంది. అన్నీ తానే. తాను మాత్రం ఏదీ కాదు. తాను తానే. తనకు దేని తోను సంబంధము లేదు. తన కన్నా అన్యమైనది మరొకటి ఉంటే కదా సంబంధము?

ఏ సంబంధము లేని తాను ప్రకృతితో తాదాత్మ్యం చెంది గుణసంగము ఏర్పరచు కోవడం వల్ల మిథ్యా సంబంధము ఏర్పడి, తనకు బంధహేతువు అయింది. ***అహం కర్తా - అహం భోక్తా.*** నేను కర్తను, నేను భోక్తను అనే అభిమానం ఏర్పడింది. ఈ అభిమానమే సంసారాన్ని తయారు చేసింది.

ఇంతకీ కర్త ఎవరు? భోక్త ఎవరు? గుణాలే కర్తలు. గుణాలే భోక్తలు. గుణాలే కారయితలు. ఇంద్రియాలు కర్తలుగా ఉన్నాయి. ఇంద్రియాలే విషయాలుగా ఉన్నాయి. ఇంద్రియాలు ఇంద్రియ విషయాలలో ప్రవర్తిస్తున్నాయి. ప్రపంచం మొదలుకొని మనోవృత్తుల వరకు సర్వము త్రిగుణ మిళితమైన ప్రకృతియే నని అర్థం చేసుకున్నాం కదా! అలాంటప్పుడు ఇంద్రియాలు గుణాలే కదా! బాహ్యంలో గోచరించే విషయాలు కూడా గుణాలే కదా! ఇప్పుడు భోక్త ఎవరు? భోగ్య మెవరు? అంతా గుణాలే. అయితే, గుణాలే గుణాలను అనుభవిస్తున్నాయి. ఈ విషయాన్ని కర్మయోగం లోనే భగవానుడు నొక్కి వక్కాణించాడు. గుణ, కర్మల విభాగము తెలిసిన తత్త్వవేత్త గుణాలు గుణాలలో వర్తిస్తున్నా యని గ్రహించి తాను తటస్థంగా అసంగుడై ఉంటాడు ***(గుణా గుణేషు వర్తన్త ఇతి మత్వా న సజ్జతే;*** *3 వ అ - 28 వ శ్లో).*

కర్త, భోక్త రెండూ గుణాలే నని, గుణాల కన్నా అన్యమైన కర్త లేడనే జ్ఞానం కలిగిన వాడు, తాను గుణాల కన్నా అన్యమైన వాడని తెలుసుకుంటాడు. తానే సామాన్య సత్తా చైతన్య మని అనుభూతిని పొందుతాడు. గుణసంగమే బంధము. గుణాతీత స్థితియే మోక్షము. గుణబద్ధుడే జీవుడు. గుణ విముక్తుడే దేవుడు.





అతడే జ్ఞాని. సచ్చిదానంద స్వరూపుడు. గుణాతీతుడు. ఈ మోక్ష స్థితిని పొందమనే సాంఖ్యయోగములో భగవంతుడు సూత్రప్రాయంగా బోధించాడు ***(నిస్త్రైగుణ్యో భవార్జున:*** *2 వ అ - 4 వ శ్లో).*

*గుణాతీత స్థితిని పొందిన వారికి సమ్యగ్దర్శనము కలుగుతుంది. అదే మోక్షం. ఈ విషయాన్ని ఇక వివరిస్తాడు.*

**నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్ర ష్టాఽనుపశ్యతి ।**
**గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సోఽధిగచ్ఛతి ॥** 19

***న-అన్యం-గుణేభ్యః-కర్తారం-యదా-ద్రష్టా-అనుపశ్యతి***
***గుణేభ్యః-చ-పరం-వేత్తి-మద్భావం-సః-అధిగచ్ఛతి***

| | | | | | |
|---|---|---|---|---|---|
| ద్రష్టా | = ఆత్మదర్శి | | గుణేభ్యః | = | గుణముల కంటె |
| గుణేభ్యః | = గుణముల కంటె | | పరం చ | = | అతీతముగా |
| అన్యం | = ఇతరుడైన | | వేత్తి | = | తెలిసికొను చున్నాడో |
| కర్తారం | = కర్తను | | సః | = | వాడు |
| యదా | = ఎప్పుడు | | మద్భావం | = | నా భావమును |
| న అనుపశ్యతి | = చూడడో | | అధిగచ్ఛతి | = | పొందుచున్నాడు |

**అర్జునా! ఆత్మజ్ఞాని గుణాల కంటే వేరుగా కర్త లేడని దర్శిస్తాడు. గుణాల కంటే తనను వేరుగా అర్థం చేసుకుంటాడు. అట్టి ఆత్మజ్ఞాని నా స్వరూపాన్నే పొందుతాడు.**

### వ్యాఖ్య

ప్రకృతి సంభవాలైన గుణాలు మోహకాలు. దుర్జయాలు. జన్మకారకాలు. మిథ్యా జ్ఞానానికి సంబంధించినవి. మిథ్యా జ్ఞానము గల పురుషుడు గుణసంగం వల్ల నేను - నాది అనే అహంకార, మమకారా లతో కర్తృత్వాన్ని, భోక్తృత్వాన్ని తన యందు ఆరోపించు కుంటున్నాడు. ఈ విధమైన అధ్యాసయే జన్మకు కారణ మవుతూ ఉంది. ***అహం కర్తా - అహం భోక్తా*** అని పురుషుడు భావించినా వాస్తవానికి కర్త - భోక్త గుణాలే కాని పురుషుడు కాడు. ఈ సత్యాన్ని దర్శించిన వాడే సత్యద్రష్ట. అతడే విద్వాంసుడు.

సత్యజ్ఞానము కలిగిన వాడు కార్యము లైన దేహాలు, కరణము లైన ఇంద్రియాలు పరిణమించిన గుణాలే అని గ్రహిస్తాడు. వాటి కన్నా అన్యంగా, వేరుగా మరొక కర్త ఉన్నాడు అని చూడడు. అన్ని రూపాలలో ఉన్న గుణాలే సమస్త కర్మలకు కారణమై ఉన్నాయి అని అర్థం చేసుకుంటాడు ***(గుణాః ఏవ సర్వావస్థాః సర్వ కర్మాణాం కర్తారః ఇత్యేవం పశ్యతి ద్రష్టా విద్వాన్).*** ఆచార్యుని అనుగ్రహం చేత, శాస్త్ర కృప చేత, ఈశ్వర కరుణ చేత, అంతఃకరణ ప్రసాదం చేత శాస్త్ర ప్రమాణమును విచారము చేసిన పుణ్యాత్ముడు గుణ కార్యాలైన దేహేంద్రియాదులను అర్థం చేసుకుంటాడు. గుణసంగము వలన కలిగే అనర్థాన్ని గ్రహిస్తాడు. సర్వకాల సర్వావస్థల యందు కర్తృత్వ, కారయితృత్వ, భోక్తృత్వ ధర్మాలు గుణాలకు సంబంధించినవే గాని గుణాల కన్నా అన్యంగా మరొక కర్త లేడు; భోక్త ఉండడు అని తెలుసుకుంటాడు. తెలుసుకుంటూ ఉన్నాడు కనుక తెలియబడే గుణాల కన్నా తాను అన్యమైన వాడు. అలాగే గుణ కార్యాలైన దేహేంద్రియాదుల కంటే తనను అన్యమైన వానినిగా తెలుసు కుంటాడు.

***ఘట ద్రష్టా ఘటా ద్భిన్నః*** - కుండను చూచే వాడు కుండ కన్నా వేరుగా ఉన్నాడు. అలాగే గుణద్రష్ట గుణాల

కంటే అన్యంగా ఉన్నాడు. గుణాలు, గుణ కార్యాలన్నీ మార్పు చెందుతున్నాయి (*పరిణామీ భావాత్*). మార్పు చెందే గుణ కార్యాలన్నీ తనకే తెలుస్తున్నాయి. మార్పు చెందే గుణాలే తానయితే, లేక వాటితో అతని సంగత్వము సత్యమే అయితే, అవి మార్పు చెందగానే తానూ మారిపోవాలి కదా! గుణాలు లేని దశలో తానూ లేనివాడే కావాలి కదా! అదే వాస్తవ మైతే, గుణాలు మార్పు చెందాయని, గుణాలు లేకుండా పోయాయని తెలిసింది ఎవరికి? కనుక పురుషుడు గుణమయ ప్రకృతి కాడు.

గుణాలు దృశ్య విషయాలు. గుణాలలో జరిగే వన్నీ తనకు తెలుస్తున్నాయి. తెలుసుకునే వాడు తెలియ బడే వాటి కన్నా అన్యంగా ఉన్నాడు. దృశ్య విషయాలైన గుణాలు, గుణ కార్యాలన్నీ ద్రష్ట యైన చేతన పురుష నికే తెలుస్తున్నాయి. గుణద్రష్ట యైన పురుషుడు గుణాల కన్నా అన్యమైన వాడు కనుక అతడు కర్త కాడు. కాని, గుణ సంగము చేత తానే కర్త నని భావిస్తున్నాడు. ఈ అజ్ఞానమే సంసార హేతువై బంధకారణ మవుతూ ఉంది (*పుంసః సంసార కారణం స్యాత్*).

ఇది కేవలం అధ్యాస. మేఘాలతో, మేఘ చలనాలతో చంద్రునికి ఏ విధమైన సంబంధమూ లేదు. మేఘాలకు అంద నంత సుదూరంలో చంద్రుడు ఉన్నాడు. అయినా మేఘాలు చంద్రుణ్ణి కప్పేశాయి అంటాము. అలాగే మేఘాలు కదిలిపోతూ ఉంటే, చంద్రుడు చలిస్తున్నా డని భావిస్తాము. ఒకదాని లక్షణాలను మరొక దాని యందు ఆరోపిస్తున్నాము. ఇదే అధ్యాస. చంద్రుడు మేఘాలకు అతీతంగా ఉన్నట్లు, పురుషుడు గుణాలకు భిన్నంగా ఉన్నాడు. గుణాలకు అతీతంగా ఉన్నాడు. ఇదే ఆత్మ యొక్క గుణాతీత స్థితి. నిస్త్రైగుణ్య స్వరూపము.

గుణ స్వభావ స్వరూపాలను తెలుసుకొని, గుణాల కంటే అన్యంగా కర్త లేడని గ్రహించి, గుణ ద్రష్ట యైన తాను గుణాతీతు డనే సత్యాన్ని గ్రహించిన వాడు భగవద్భావమునే పొందు తున్నాడు అంటున్నాడు గీతాచార్యుడు (*గుణేభ్యః చ పరం గుణ వ్యాపార సాక్షిభూతం వేత్తి మద్భావం మమ భావం స ద్రష్టా అధిగచ్ఛతి ప్రాప్నోతి ఇతి*).

గుణాలకు, గుణ వ్యాపారాలకు సాక్షీభూతంగా ఉన్న ఆత్మ స్వరూపాన్ని తెలుసుకున్న వాడు **మద్భావం** - నా భావమును పొందుతాడు అంటున్నాడు. నా భావము అంటే నా స్వరూపము అని అర్థము. ఆత్మను తెలుసుకుంటే పరమాత్మ స్వరూపమును ఎలా పొందుతాడు? ఆత్మే పరమాత్మ కనుక.

***మద్భావం మమ భావం వాసుదేవత్వం ఇత్యేవం పశ్యన్*** - 'నా భావం' అంటే వాసుదేవ స్వరూపము అని అర్థం. సర్వమూ వాసుదేవుడే అనే సత్యాన్ని ఏడవ అధ్యాయం లోనే తెలుసుకున్నాం కదా! (*7 వ అ - 19 వ శ్లో*). సమస్తమూ వాసుదేవ పరమాత్మే కనుక ఆత్మయే పరమాత్మ అనే జ్ఞానంతో గుణాతీతుడు పరమాత్మ స్వరూపాన్ని పొంది తరిస్తాడు (*మద్భావం సోఽధి గచ్ఛతి*).

*వాసుదేవ స్వరూపాన్ని ఎలా పొందుతాడో (కథం అధిగచ్ఛతీతి)* చెబుతున్నాడు (*ఉచ్యతే*).

**గుణా నేతా నతీత్య త్రీ న్దేహీ దేహసముద్భవాన్ ।**
**జన్మమృత్యు జరాదుఃఖై ర్విముక్తోఽ మృత మశ్నుతే ॥** 20

***గుణాన్-ఏతాన్-అతీత్య-త్రీన్-దేహీ-దేహసముద్భవాన్***
***జన్మమృత్యు జరా దుఃఖైః-విముక్తః-అమృతం-అశ్నుతే***

| | | | | | |
|---|---|---|---|---|---|
| దేహీ | = జీవుడు | | ఏతాన్ | = | ఈ |
| దేహసముద్భవాన్ | = దేహము కలుగుటకు | | త్రీన్ | = | మూడైన |





| | | | | | |
|---|---|---|---|---|---|
| గుణాన్ | = గుణములను | | విముక్తః | = | విముక్తుడై |
| అతీత్య | = అతిక్రమించి | | అమృతం | = | మోక్షమును |
| జన్మమృత్యు జరా దుఃఖైః | = జన్మము, మృత్యువు, ముసలితనము, దుఃఖముల చేత | | అశ్నుతే | = | పొందుతున్నాడు |

**అర్జునా! దేహానికి త్రిగుణములే కారణము. జీవుడు త్రిగుణాలను దాటు తున్నాడు. జనన మరణాలు, జరా దుఃఖాల నుండి విడిపడు తున్నాడు. మోక్షాన్ని పొందు తున్నాడు.**

**వ్యాఖ్య**

**బంధమోక్షాలు కల్పితాలు**

గుణసంగమే బంధము, గుణ విముక్తియే మోక్షము అంటున్నాము. గుణసంగము వల్ల బంధము ఏర్పడింది కనుక, గుణబంధము నుండి విడిపడితే మోక్షమని భావిస్తున్నాము. గుణబంధము ఎవరికి? పురుషునికి, దేహికి. అంటే, గుణాలు పురుషుని బంధించి నట్లేనా? ఇది వాస్తవ మేనా?

గుణాలు పురుషుని బంధించడము వాస్తవ మైతే, ఇక మోక్ష మనేది కుందేటి కొమ్మే అవుతుంది. మాయా కార్యాలైన గుణాలు మాయకు ఆధారమైన పురుషుని ఎలా బంధిస్తాయి? ప్రకృతి మిథ్యా రూపమని ఇప్పటికే గ్రహించాము. మిథ్యా రూపమైన ప్రకృతి, దాని కార్యాలైన గుణాలతో సత్యరూపు డైన పురుషుని ఎలా బంధిస్తుంది? బంధము వాస్తవమే అయితే, మోక్షము అవాస్తవ మవుతుంది. బంధము అవాస్తవమే అయితే, లేనిదే అయితే, మోక్షము యొక్క ప్రసక్తే లేదు; రాదు.

ప్రకృతి గాని, ప్రకృతి గుణాలు గాని పురుషుని బంధించ లేవు. అంత శక్తి వాటికి లేదు. పురుషుడే స్వయంగా తాను బద్ధు డైనట్లు భావిస్తున్నాడు. వాస్తవానికి ఇది కల్పిత బంధము. తనకు తానుగా కల్పించు కున్నది. లేని దానిని ఉన్నట్లు భావించు కున్నది. భావబంధమే భవబంధ మైతే, భావవిముక్తియే భవ బంధ విముక్తి. ఇదే శాస్త్ర హృదయము. నీకు బంధము ఉంది; నీకు మోక్షమును ప్రసాదిస్తాను అని చెప్పడం శాస్త్ర తాత్పర్యం కాదు. నిన్ను విముక్తుణ్ణి చేస్తాను అంటే, నీకు బంధము ఉంది అని అంగీకరించడమే అవుతుంది. ఆ పని శాస్త్రం చేయదు. అలా చేస్తే అది ప్రమాణం అనిపించుకోదు. కనుక నీకు ముక్తి కలుగుతుంది అని కాకుండా, నువ్వు ముక్తుడవే, నిత్య ముక్తుడవే అని శాస్త్రం చెబుతుంది. ఈ సత్యాన్నే ప్రామాణికంగా నిరూపిస్తుంది. ఇక్కడే ప్రమాణము అప్రమేయంగా, అసమానంగా శోభిస్తుంది.

**దేహాదీ నాత్మత్వే నాభి మన్యతే సోఽభిమాన ఆత్మనో బంధః। తన్నివృత్తి ర్మోక్షః।**

దేహము మొదలైన వానిని (*దేహాదీన్*) తానే అని భావించడం చేత, (*ఆత్మత్వేన అభిమన్యతే*) ఆ అభిమానమే (*సః అభిమానః*) తనకు (*ఆత్మనః*) బంధము (*బంధః*) అవుతూ ఉంది. అట్టి అభిమానము లేక పోవడమే (*తత్ నివృత్తిః*) మోక్షము అవుతూ ఉంది (*మోక్షః*) అన్నది సర్వసారోపనిషత్తు.

కనుక బంధము అనేది కేవలం సంకల్ప మాత్రం చేతనే కలుగుతూ ఉంది (*సంకల్ప మాత్ర సంభవో బంధః*) అని నిరాలంబోపనిషత్తు. బంధము కేవలం సంకల్పము వల్లనే కలిగింది కనుక, సంకల్పము నుండి విడి పడటమే మోక్షము (*నిస్సంకల్పాత్ విముచ్యతే*) అని మహానారాయణోపనిషత్. ఇట్టి మోక్షాన్ని పొందే దెలాగో చెబుతున్నాడు.

అర్జునా! దేహధారి అయిన పురుషుడు (*దేహీ*) దేహానికి కారణాలైన త్రిగుణాలను దాటి (*దేహ*

***సముద్భవాన్ ఏతాన్ త్రీన్ గుణాన్ అతీత్య)***, జననము, మరణము, ముసలితనము, దుఃఖముల నుండి విడిపడి ***(జన్మమృత్యు జరా దుఃఖైః విముక్తః)***, మోక్షమును పొందు తున్నాడు ***(అమృతం అశ్నుతే)***.

**దేహోత్పత్తి బీజాలు**

సత్త్వ రజ స్తమో గుణాలే దేహము ఉత్పన్నం కావడానికి కారణాలు. అందుచేత త్రిగుణాలు దేహ సముద్భవాలు. అంటే, దేహోత్పత్తికి బీజ భూతాలు ***(దేహ సముద్భవాన్ దేహోత్పత్తి బీజ భూతాన్)***. ఈ త్రిగుణాలను జయించాలి, వాటిని దాటి పోవాలి. అప్పుడే మోక్షము సిద్ధిస్తుంది.

మరి, త్రిగుణాలను ఎవరు దాటాలి? దేహియే దాటాలి అంటున్నాడు. దేహి అంటే దేహమును ధరించిన వాడు. దేహంలో ఉండేవాడు. మరి, దేహం లోనే ఉంటూ, దేహోత్పత్తికి కారణాలైన త్రిగుణాలను దేహి ఎలా దాటగలడు? ఒక వస్తువును, లేదా ప్రదేశాన్ని దాటి పోవడము అంటే, దానిని విడిచి ముందుకు పోవడము అని అర్థము. అలాగే దేహానికి కారణాలైన గుణాలను దాటి పోవడము అంటే, దేహము గుణ పరిణామమే కనుక దేహాన్ని దాటి పోవడము అని అర్థము. అంటే, మోక్షము అనేది మరణానంతరమే సంభవము అని భావము.

కాని, ఇక్కడ త్రిగుణాలను దేహి, అనగా దేహవంతుడు, లేదా శరీరధారి దాటి పోతున్నాడు అంటున్నాడు. శరీరమును ధరించిన వాడు గుణాలను దాటి పోతున్నాడు అంటే జీవించి ఉండగానే దాటి పోతున్నాడని అర్థమే గాని ***(జీవన్ ఏవ అతీత్య అతిక్రమ్య)*** మరణానంతరము దాటుతాడని అర్థం కాదు.

ఇదొక అందమైన దూముడి. దారమును, లేదా త్రాడును ముడి వేసిన తరువాత ఒక కొసను పట్టి లాగితే తేలికగా ఊడిపోయే ముడిని దూముడి అంటారు. అలాగాక, దారాన్ని పూర్తిగా మరొక వైపుకు లాగితే, అది చిక్కుముడి పడే అవకాశము ఉంది. అలాగే కొందరు 'దేహి' అనే పదాన్ని పట్టుకొని, దేహ పతనానంతరమే మోక్షము అని భావిస్తూ ఉంటారు. అంతే కాదు, వారి అభిప్రాయాన్ని శాస్త్రోక్తంగా మలచాలనే ప్రయత్నంలో 'విదేహ ముక్తి', అంటే మరణానంతరము కలిగే మోక్షము అని సిద్ధాంతీకరిస్తూ ఉంటారు కూడా. ఇదంతా 'దూముడి'ని 'చిక్కుముడి' గా మార్చుకొనే ప్రయత్నమే.

ఒకవేళ వాళ్ళు అభిప్రాయ పడినట్లు మరణానంతరమే ముక్తి అని సరిపెట్టుకున్నా, అది మరణము, అంటే దేహత్యాగము అవుతుందే గాని మోక్షప్రాప్తి కాదు. దేహ పతనానంతరము బ్రహ్మలోకమును చేరి, అక్కడ బ్రహ్మదేవుని నుండి తత్త్వోపదేశమును పొంది, అక్కడ నుండి మోక్షాన్ని పొందడము అనేది క్రమముక్తి.

ప్రస్తుత శ్లోకంలో పరమేశ్వరుడు ప్రతిపాదిస్తున్నది జీవన్ముక్తియే గాని క్రమముక్తి కాదు. జీవన్ముక్తి అంటే జీవించి ఉండగానే మోక్షప్రాప్తి. జీవించి ఉన్నవాడు దేహి. దేహమును ధరించి ఉన్నవాడే దేహి. అతడు పొందేదే జీవన్ముక్తి ***(జీవన్నేవ ముక్తః)***. అందుచేతనే, అలాంటి వారిని జీవన్ముక్తులు అంటారు.

బావుంది. ఇంతకీ, దేహ సముద్భవాలైన త్రిగుణాలను దేహధారి, లేదా దేహి ఎలా దాటుతాడు? అనే ప్రశ్న అపరిష్కృతం గానే ఉండిపోయింది కదా అనే సంశయం మీకు కలగ వచ్చు. ఆ సందేహానికి అవకాశమే లేదు. ఎందుకో తెలుసా? దేహి త్రిగుణాలను దాటే అవసరమే లేదు. ఎందుకని? అతడు దాటే ఉన్నాడు. క్రొత్తగా దాట వలసింది లేదు. ప్రస్తుత శ్లోక వ్యాఖ్యానంలో 'బంధమోక్షాలు కల్పితాలు' అనే శీర్షిక క్రింద మనం చేసిన విచారములో బంధము అనేది వాస్తవానికి లేనిదే అని, కేవలం కల్పితమే నని తెలుసుకున్నాం. బంధము వాస్తవ మైతే దానిని దాటి పోవాలి. బంధము కల్పిత మైనపుడు, లేని దానిని దాటే దేముంటుంది? లేదు అని అర్థం చేసుకోవాలి. అంతే.

ఘటాకాశము అని మనం చెప్పుకు న్నపుడు, ఆకాశము ఘటానికి పరిమితంగా లేదు. ఘటాకాశము,





మహాకాశము అని రెండు ఆకాశాలు లేవు. ఆకాశము ఒక్కటే. ఆకాశానికి బంధము లేదు. కనుక, ఆకాశానికి మోక్షము రాదు. కుండలో ఉన్నప్పుడు కూడా ఆకాశము అనంతం గానే ఉంది. కుండను సృష్టించి, కుండలో ఆకాశాన్ని ఎవ్వరూ పెట్టలేదు. వాస్తవానికి ఆకాశం లోనే కుండ తయారైంది. నేను ఘటాకాశాన్ని అని కుండ లోని ఆకాశం భావిస్తే, ఆ భావనే ఆకాశానికి బంధము; కల్పిత బంధము. నేను విశాలాకాశాన్నే; అనంతాకాశాన్నే; నాకు బంధము లేనే లేదు అని కుండ లోని ఆకాశం గ్రహిస్తే, అదే మోక్షము. కనుక, అజ్ఞానమే బంధము. అజ్ఞానం బంధము కనుక జ్ఞానం వల్లనే మోక్షం ప్రాప్తిస్తుంది. ***అవిద్యాతమో నివర్తకస్య జ్ఞానస్య దృష్టం కైవల్య ఫల అవసాన త్వం*** - జ్ఞానము అవిద్యను తొలగిస్తుంది కనుక చివరికి అది మోక్షము అనే ఫలాన్ని ప్రసాదిస్తుంది అని శ్రీ శంకర భగవత్పాదులు భగవద్గీత - మోక్షసన్యాస యోగం లోని అరవై ఆరవ శ్లోక వ్యాఖ్యానంలో విస్పష్టం చేశారు.

**బంధ విముక్తి**

అవిద్యా కారణంగా తాను ఘటాకాశ మని కుండ లోని ఆకాశము భావించినా, తాను మహాకాశ మనే జ్ఞానం కలగ గానే, తాను కుండకు పరిమితం కాదని తెలిసి, ఘటబంధము నుండి ఎలా విడి పోవడం జరిగిందో, అలాగే దేహికి తానే పరమాత్మ స్వరూపము అనే జ్ఞానం కలగ గానే, తాను దేహంలో ఉన్నా దేహానికి పరిమితుడు కాడని తెలిసి, సర్వాత్మానుభూతిని పొంది దేహ బంధము నుండి, అవిద్యా బంధము నుండి విడిపోవడం జరుగుతూ ఉంది. దేహంలో ఉన్నా, ఎప్పుడైతే దేహ సంబంధము లేకుండా ఉన్నాడో, దేహ సంబంధమైన లక్షణాల నుండి, వాటి ప్రభావం నుండి కూడా జ్ఞాని విడిపడి పోయాడు అని అర్థం. వేటి నుండి జ్ఞాని విడిపడ్డాడు? జన్మ మృత్యు జరా దుఃఖాల నుండి విడిపడ్డాడు అంటున్నాడు ***(జన్మ మృత్యు జరా దుఃఖైః విముక్తః)***.

దేహముతో తాదాత్మ్యము చెందడమే దేహ బంధము అని, ఈ దేహ బంధానికి స్వరూప అజ్ఞానమే కారణము అని గ్రహించాము. మరి, దేహ బంధము అనేది ఏ దశలో ఏర్పడుతుంది? బాల్యం లోనా? యౌవనం లోనా? వార్ధక్యం లోనా? దేహ బంధము అనేది ఒక దశకు సంబంధించింది కాదు. దేహ మున్నంత వరకు జ్ఞానము లేని వానికి దేహ తాదాత్మ్య ముంటుంది. దేహాత్మ భావ ముంటుంది. అదే బంధము. దేహ బంధము లేక పోవడము అంటే, ఏ దశ లోను దేహాత్మ భావం లేక పోవడము అని అర్థము. దేహము అనేది జనన మరణాలు కలిగి ఉంటుంది. ఆద్యంతాలతో కూడి ఉంటుంది. దేహ సంబంధం దేహికి లేదు అంటే, దేహానికి సంబంధించిన జననమరణాలు దేహికి లేవు అని అర్థము. 'జరా' అంటే ముసలితనము. జననమరణాల మధ్య సంభవించే జీర్ణదశ. జననమరణాల నుండి దేహి ఎప్పుడైతే విముక్తిని పొందాడో, అంతరాలావస్థగా తెలుస్తున్న ముసలితనము నుండి కూడా విడిపడి పోయాడు అని అర్థము. జన్మ మృత్యు జరాదులు దేహ సంబంధమైన దోషాలు. ఈ దోషాల నుండి జ్ఞాని సంపూర్ణంగా విడిపడి పోయాడు.

జన్మ మృత్యు జరాదులను ఎప్పుడైతే దోషాలుగా అర్థం చేసుకున్నామో, దోషాలు ఏవైనా దుఃఖాలను పంచేవే గాని తోషాలను, సంతోషాలను పంచేవి కావు కనుక, జన్మ మృత్యు జరాదులు దుఃఖ దాయకాలు అని తెలుసుకున్నాము. దేహము వ్యాధులతో, వృద్ధాప్యంతో దుఃఖాన్ని కలిగిస్తుంది. ఈ రోజు దేహం ఆరోగ్యంగా ఉండొచ్చు. నేటి ఆరోగ్యం రేపుంటుందని చెప్పలేము. దేహంలో ఎప్పుడు ఏ వ్యాధి మకాం పెడుతుందో ఊహించ లేము. ఇవన్నీ దుఃఖాలే. నేను దేహమును అనే సంకల్పమే దుఃఖము అన్నది తేజోబిందూపనిషత్తు ***(దేహోऽహ మితి సంకల్పం తద్దుఃఖ మితి చోచ్యతే)***.

జన్మ మృత్యు జరా దుఃఖాదులు అన్నప్పుడు, జన్మ మృత్యు జరాదులు దుఃఖదాయకాలు అని అర్థం చేసుకున్నాం. ఇక చివరగా పేర్కొన్న దుఃఖం మనస్సుకు సంబంధించింది. కార్య కారణాలైన దేహేంద్రియాలన్నీ గుణమయాలే నని ముందే అర్థం చేసుకున్నాం కనుక, దేహ సంబంధమైన జననమరణ వృద్ధాప్య బాధలే కాక, మనో సంబంధమైన వ్యథలు కూడా గుణమయాలే. అనాత్మ రూపాలే. అవి కూడా అనంత దుఃఖాన్ని కలిగిస్తాయి. మనస్సే దుఃఖమయం. ఇంతెందుకు? జరాదికాలు కూడా మనస్సే అన్నది వేదం ***( మన ఏవ మహద్దుఃఖం జరాదికమ్ ).***

దేహ మార్పులు ఎలా దుఃఖాన్ని కలిగిస్తున్నాయో, మనో సంబంధమైన రాగాదులు, అభిమాన అహంకారాలు కూడా నిరంతరము మార్పు చెందేవే కనుక అవి కూడా సదా దుఃఖాన్నే కలిగిస్తున్నాయి. వీటన్నిటి నుండి జీవించి ఉండగానే విడి పడటమే విముక్తి ***( జన్మ చ జరా చ దుఃఖాని చ తైః జీవ న్నేవ విముక్తః సన్ విద్వాన్ అమృతం అశ్నుతే ).*** ఇలా విముక్తిని పొందిన వాడు అమృతత్వాన్ని పొందుతున్నాడు. ***మద్భావం సః అధిగచ్ఛతి*** - అతడు నా స్వరూపాన్నే పొందుతున్నాడు అని పూర్వ శ్లోకంలో భగవంతుడు ఏదైతే తెలియ చేశాడో అదే ఈ అమృతత్వము.

**మోక్ష ప్రాప్తి**

అజ్ఞానమే బంధము. కనుక జ్ఞానమే మోక్షము. నీవు అనంతాత్మవు అని తెలియడమే జ్ఞానము. నీవు గుణాతీతుడవు అనేదే నిత్యజ్ఞానము. అనంతానికి బంధ మెలా వస్తుంది? అనంత మనేది దేశకాలాదుల పరిధిలో ఒదిగేది కాదు కనుక, అనంతానికి ఎప్పుడూ బంధము లేదు. ఎక్కడా బంధము లేదు. లేని బంధము ఉన్నట్లు ***( ఇవ )*** అనిపించడమే ఇక్కడ బంధము. అందుకనే దానిని కల్పిత బంధము అన్నాము.

అనంతాత్మ సదా ముక్తమే. దానికి బంధము ఏర్పడే అవకాశమే లేదు. అది నీవే. ఈ సత్యము నీకు తెలిసినా, తెలియక పోయినా నీవు ఆత్మవే. నీవు ఆత్మవు అని నీకు తెలియనంత మాత్రాన నీవు ఆత్మవు కాకుండా పోవు. తెలిసినంత మాత్రాన నువ్వు ప్రత్యేకంగా ఆత్మవు అయ్యేదీ లేదు. నీవు ఆత్మ వనే జ్ఞానం నీకు లేకపోతే నీవు బద్ధుడుగా ఉంటావు. తెలిస్తే? క్రొత్తగా ముక్తుడవు అవుతావా? కావు. ముక్తుడవు అయ్యే ఉన్నావని తెలుసుకుంటావు. అనుభూతిని పొందుతావు. అంతే.

***ఏక స్స న్భిద్యతే భ్రాన్త్యా మాయయా న స్వరూపతః ।***
***తస్మా దద్వైత ఏవాస్తి న ప్రపంచో న సంసృతిః ॥***

సత్యాత్మ అద్వయము. మాయ చేత భిన్నంగా (ద్వైతంగా) తెలుస్తూ ఉంది. విచారించి చూస్తే స్వరూపంలో ద్వైతమే లేదు. ఉన్నది అద్వైత స్వరూపమైన పరమాత్మయే. ప్రపంచమూ లేదు, సంసారమూ లేదు అన్నది అన్నపూర్ణోపనిషత్తు.

ఈ సత్యం అర్థమైతే కర్తగా తాను లేడు; భోక్తగా తాను ఉండడు. పనులన్నీ మాయా రూపాలైన కారణ కార్యాలకు సంబంధించినవే. చూచేది కన్ను. వినేది చెవి. చూడ మనేది, విన మనేది మనస్సు. నేత్ర శ్రోత్రాలు వీక్షించడానికి, వినడానికి శక్తిని ప్రసాదించేది ప్రాణం.

ఈ కార్యాలన్నీ చైతన్య సన్నిధిలో సాగి పోతున్నాయి. క్షేత్రమైన దేదైనా జడమే. జడము మరొక దాని అధీనం లోనే పని చేస్తుంది. దేని అధీనంలో పని చేస్తుందో అది ప్రకాశమై ఉండాలి. సూర్యుని వెలుగులో దేశం ప్రకాశించినట్లు, ఆత్మ ప్రకాశంలో క్షేత్రమైన దేహంలో సమస్త కార్యాలు సాగి పోతున్నాయి. ప్రపంచంలో సాగే కార్యాలన్నీ సూర్యుని ప్రకాశంలో సాగుతున్నా, సూర్యు డెలా సాక్షిమాత్రంగా ఉన్నాడో, దేహం లోని





సమస్త కార్యాలను ఆత్మ ప్రకాశింప చేస్తున్నా, వాస్తవానికి అసంగమై, సాక్షిభూతంగా ఉంది. ఇదే జ్ఞానం.

ఈ జ్ఞానం బుద్ధిలో శోభించాలి అంటే బుద్ధి శుద్ధి పడి ఉండాలి. గుణ మాలిన్యము నుండి విడిపడి ఉండాలి. గుణ వికారాలను దాటి పోవాలి. మోహ రూపమైన తమోగుణం నుండి విడిపడ టానికి పురుషుడు కర్మాచరణములో కాలు మోపాలి. అనుష్ఠానం ద్వారా నిద్రాలస్య మోహాలను దాటి పోవాలి. ఈ విధంగా రజోగుణ ప్రేరితుడై కర్మాచరణంలో కాలు మోపిన వాడు బంధహేతువులు, మలిన పూరితాలు అయిన సకామ కర్మల నుండి క్రమేపి విడిపడి, అభిమాన రహితుడై, ఈశ్వరార్పణ బుద్ధితో కర్తృత్వ భోక్తృత్వాదుల నుండి మెల్లగా పైకి ప్రాకి సత్త్వగుణాన్ని ఆశ్రయించాలి. బుద్ధి సత్త్వ ప్రధానమై నపుడే జ్ఞానార్హ మవుతుంది. తమో రజస్సుల నుండి విడిపడి నిర్మల చిత్తాన్ని పొందడానికి సాధకుడు సత్త్వగుణాన్ని ఆశ్రయించాలి. అలాగని సత్త్వగుణాన్ని కూడా అంటి పెట్టుకో కూడదు. గుణము ఏదైనా గుణమే. ఇనుమైనా, సువర్ణమైనా సంకెల ఏదైనా బంధించేదే. కనుక కాలిలో గ్రుచ్చుకున్న ముల్లు విరిగి నపుడు, దానిని మరొక ముల్లుతో తీసి, ఆ తరువాత రెండు కంటకాలనూ పారేసినట్లు, రజ స్తమస్సు లను దూరం చేసుకోవడానికి సత్త్వాన్ని ఆశ్రయించి, ఆ తరువాత సత్త్వాన్ని కూడా త్యజించాలి ***( కంటకం కంటకే నేవ యేన త్యజసి తం త్యజ ).***

***తే॥ తటినిఁ దగ నుత్తరించు నంతకు బోత మాశ్రయించి తక్కొల్లని యట్లు పురుష***
***దర్శనము సంభవించు నంతకును సత్త్వమూది పిదప దత్సంబంధ ముడగవలయు ॥***

నదీ ప్రయాణంలో నావ నాశ్రయించిన వాడు నదిని దాటి తీరమును చేరగానే పడవను విడిచి పెట్టినట్లు, తానే పురుషుడనే సత్యజ్ఞానము కలిగే వరకు ప్రకృతి రూపమైన సత్త్వగుణము నాశ్రయించి, పురుష దర్శనం కాగానే, సత్త్వగుణాన్ని కూడా త్యజించి గుణాతీతుడై శోభించాలి అని ఆంధ్రమహాభారతము - అశ్వమేధ పర్వము. ఈ విధంగా గుణాధీనమై బద్ధుడైన వాడు గుణాతీతుడై తరించాలి. అదే గుణాతీత స్థితి. స్థితప్రజ్ఞ. జీవన్ముక్త స్థితి.

*త్రిగుణాలను దాటిన వాడు గుణాతీతుడై తన స్వరూపాన్నే పొందుతాడు అని పరమేశ్వరుడు చెప్పగానే, గుణాతీతుని లక్షణాన్ని, అతని ప్రవర్తనమును తెలుసుకోవాలని భావించిన అర్జునుడు పరమేశ్వరుని ప్రశ్నిస్తున్నాడు.*

**అర్జున ఉవాచ :**

కైర్లిఙ్గై స్త్రీన్గుణా నేతా నతీతో భవతి ప్రభో ।
కిమాచారః కథం చైతాం స్త్రీ న్గుణా నతివర్త తే ॥ 21

*కైః-లింగైః-త్రీన్-గుణాన్-ఏతాన్-అతీతః-భవతి-ప్రభో*
*కిం-ఆచారః-కథం-చ-ఏతాన్-త్రీన్-గుణాన్-అతివర్తతే*

| | | | | | |
|---|---|---|---|---|---|
| ప్రభో | = | కృష్ణా! | భవతి | = | అగుచున్నాడు |
| ఏతాన్ | = | ఈ | ఏతాన్ | = | ఈ |
| త్రీన్ | = | మూడు | త్రీన్ | = | మూడు |
| గుణాన్ | = | గుణాలను | గుణాన్ | = | గుణములను |
| అతీతః | = | అతిక్రమించిన వాడు | కథం చ | = | ఏ విధంగా |
| కైః లింగైః | = | ఏ లక్షణము గలవాడు | అతివర్తతే | = | దాటుతున్నాడు |
| కిమాచారః | = | ఎట్టి ఆచారము గలవాడు | | | |

**అర్జునుడు అడుగుతున్నాడు :**

**కృష్ణా! త్రిగుణాలను జయించిన పురుషుని లక్షణ మేమిటి? అతని ఆచార మెలా ఉంటుంది? ఈ మూడు గుణాలను అతడు ఎలా దాటి పోతాడు?**

**వ్యాఖ్య**

జీవించి ఉండగానే ప్రకృతి లక్షణాలైన గుణాలను జ్ఞాని దాటుతున్నాడు అని భగవంతుడు చెప్పగానే, అట్టి జీవన్ముక్తుని గూర్చి వివరంగా తెలుసుకోవాలనే ఆసక్తి అర్జునునిలో ఏర్పడింది. దీపం ఉండగానే ఇల్లు చక్క బెట్టుకొనే వాడు శ్రేష్ఠుడు. అవకాశాన్ని జార విడుచుకొనే వాడు ఎవడైనా అభాగ్యుడే. సత్యరూపుడైన వాసుదేవుడే ప్రబోధించే టప్పుడు సందేహాలను ఎందుకు ఉంచుకోవాలి? అందుకే అర్జునుడు అడుగుతున్నాడు. ముఖ్యంగా గుణాతీతుని విషయంలో అర్జునుడు మూడు ప్రశ్నలను సంధిస్తున్నాడు.

మొదటిది, గుణాతీతుని లక్షణము. ఏ లక్షణాలను బట్టి అతడు గుణాలను అతిక్రమించాడు అని గ్రహించాలి? ***(కైః లింగైః త్రీన్ గుణాన్ అతిక్రాన్తః భవతి)*** అనేది మొదటి ప్రశ్న.

రెండవది, అతని ఆచారము. అతని ఆచార వ్యవహారాలు ఎలా ఉంటాయి ***(కిం ఆచారః)*** ? ఏ విధమైన ఆచారము గల వానిని గుణాతీతుడుగా గుర్తించాలి? గుణాలను దాటి పోయిన జ్ఞాని యొక్క ప్రవర్తన ప్రపంచంలో ఎలా ఉంటుంది? అనేది రెండవ ప్రశ్న.

ఇక మూడవ ప్రశ్న సాధనకు సంబంధించినది. అతడు త్రిగుణాలను ఎలా అతిక్రమించాడు ***(కథం కేన ప్రకారేణ త్రీన్ గుణాన్ అతివర్తతే)*** ? గుణాతీత స్థితిని పొందడానికి ఉపాయ మేమిటో తెలుసుకోవాలనే జిజ్ఞాసే ఈ మూడవ ప్రశ్నలో వ్యక్త మవుతూ ఉంది.

ఈ మూడు ప్రశ్నలలో గుణాతీత స్థితిని పొందడానికి ఏం చేశాడు? పొంది ఎలా ఉన్నాడు? అనేవి ప్రధానంగా తెలుస్తున్నాయి. జీవన్ముక్తులం కావాలని అందరికీ ఉంటుంది. గుణాతీత స్థితిని పొందాలని అందరూ అభిలషిస్తారు. కేవలం అభిలషించి నంత మాత్రాన పొంద లేరు. ఆశించిన దానిని ఎలా అందుకోవాలో కూడా తెలిసి ఉండాలి.

జీవన్ముక్తి అంటే ఏమిటో, గుణాతీత స్థితి ఎలాంటిదో అర్థం కానపుడు అనర్థాలు ప్రాప్తించే అవకాశం లేక పోలేదు. తెలియని కారణంగా ఎవరు ఏది చెప్పినా అదే సత్యమని భావించే ప్రమాదం ఉంటుంది. ఎక్కువ శాతం సత్యజ్ఞానము లేని వారే ఆధ్యాత్మిక మార్గంలో వంచకుల వాతబడి బ్రతుకును భారంగా మార్చుకుంటూ ఉంటారు. కనుక, పార్థుని ప్రశ్న కేవలం పార్థునికే గాక సమస్త ప్రపంచానికి, సర్వ కాలాలకు ఉపయోగ పడేదై ఉంది.

ఈ ప్రశ్నలను కుంతీకుమారుడు ఇప్పుడే, ఇక్కడే, ఈ సందర్భం లోనే ప్రశ్నించ లేదు. ఈ విధమైన ప్రస్తావన, ప్రశ్నా పత్రము రెండవ అధ్యాయంలో కూడా వినిపించాడు. స్థితప్రజ్ఞుని గూర్చి సాంఖ్యయోగములో ఏ విషయా న్నైతే ప్రశ్నించాడో, ఇక్కడ కూడా అదే ప్రశ్నిస్తున్నాడు. స్థితప్రజ్ఞుని లక్షణ మేమి? అతడెలా నివర్తిస్తాడు? ఎలా ప్రవర్తిస్తాడు? అని అక్కడ ప్రశ్నించాడు ***(కా భాషా ? కిం ఆసీత ? కిం వ్రజేత ?)***. గుణాతీతుని లక్షణాలను, ఆచారాన్ని ఇక్కడ అడుగు తున్నాడు. అర్జునుడు ప్రశ్నించిన చోట భగవంతుడు చిత్ర విచిత్రంగా ప్రవచించాడు. అంతేకాదు. అర్జునుడు అడగక పోయినా, అవసరాన్ని, సందర్భాన్ని పురస్కరించుకొని చాలా చోట్ల స్వయం గానే బోధించాడు కూడా.





రెండవ అధ్యాయంలో స్థితప్రజ్ఞుడుగా, పన్నెండవ అధ్యాయంలో భక్తుడుగా, పదమూడవ అధ్యాయంలో జ్ఞానిగా ఎవరి లక్షణాలను వివరించడం జరిగిందో, అలాగే ఇక్కడ కూడా గుణాతీతుని వైభవము వర్ణింప బడుతూ ఉంది.

ప్రస్తుతం అర్జునుడు ప్రశ్నిస్తున్న ఈ శ్లోకంలో భగవంతుణ్ణి *ప్రభో!* అని సంబోధించడం అర్జునుని సంస్కారానికి, సమయస్ఫూర్తికి ప్రతిరూపంలా భాసిస్తోంది.

*ప్రభుః* అంటే ప్రకృష్టమైన వైభవము కలవాడు అని అర్థము ***(ప్రకర్షేణ భవనాత్ ప్రభుః)***. ప్రభు శబ్దానికి మరొక అర్థం కూడా ఉంది. సర్వ కార్యాలలో అతిశయించిన సామర్థ్యం కలవాడు అని కూడా అర్థం ***(సర్వాసు క్రియాసు సామర్థ్య అతిశయాత్)***.

పరమేశ్వరుని ప్రభువు స్థానంలో ఉంచి, ఎప్పుడైతే *ప్రభో!* అని పార్థుడు సంబోధించాడో, అలా సంబోధించ డానికి ముందే తాను భృత్యుని స్థానంలో, దాసుని స్థానంలో నిలబడి పోయాడు. చేతులు జోడించి మరీ నిలబడ్డాడు.

'ప్రభూ! ఏ పుణ్యం చేసుకున్నానో నీకు భృత్యుణ్ణి అయ్యాను. దాసుని దైన్యము ప్రభువు అనుగ్రహం తోనే తీరాలి. భృత్యుని సంశయ మైనా, సంతాప మైనా ప్రభువు కృప వల్లనే తీరాలి. నా భాగ్యం కొద్ది నీవు ప్రకృష్ట మైన ప్రభువువు. పైగా అతిశయించిన సామర్థ్యంతో అనుగ్రహించే దాతవు. నీ లాంటి ప్రభువును పొందిన నేను జ్ఞాన కరువుతో ఉండ వలసిన అవసర మేముంది? అందుకే అర్థిస్తున్నా! ప్రశ్న రూపంలో ప్రార్థిస్తున్నా! నిన్నే నమ్ముకున్న వాణ్ణి. ప్రభూ! కరుణించు. కాపాడు. కలతను తొలగించు. కాంతిని ప్రసాదించు.' ఇదే అర్జునుని ఆంతర్యం.

***కృష్ణ యను పలుకులో ఎంత కమ్మదనము !***
***బాధలలో ఓదార్చు అమ్మతనము***
***నిన్ను మించిన దైవమును కనలేము మేము***
***నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా !***

అనేది అక్కడ చిన్నికృష్ణ శతకంలో ఒక వెన్నముద్ద. ఇక్కడ అర్జునుడు సమర్పిస్తున్న నైవేద్యం.

అర్జునా! చెబుతాను విను ***(కైః లింగైః యుక్తః గుణాతీతః భవతి ఇతి తత్ శ్రుణు)*** అంటూ జ్ఞానామృతాన్ని ప్రేమతో వితరణ చేయడానికి వాసుదేవుడు సిద్ధ మయ్యాడు. మనమూ బుద్ధిగా అందుకుందాం.

**శ్రీ భగవానువాచ :**

ప్రకాశం చ ప్రవృత్తిం చ మోహ మేవ చ పాణ్డవ ।
న ద్వేష్టి సమ్ప్రవృత్తాని న నివృత్తాని కాంక్షతి ॥ 22

***ప్రకాశం-చ-ప్రవృత్తిం-చ-మోహం-ఏవ-చ-పాండవ***
***న-ద్వేష్టి-సంప్రవృత్తాని-న-నివృత్తాని-కాంక్షతి***

| | | | | | |
|---|---|---|---|---|---|
| పాండవ | = | అర్జునా! | మోహం ఏవ చ | = | మోహమును |
| సంప్రవృత్తాని | = | సంప్రాప్తములైన | న ద్వేష్టి | = | ద్వేషింపడు |
| ప్రకాశం చ | = | ప్రకాశమును | నివృత్తాని | = | విడిచి పోయిన వానిని |
| ప్రవృత్తిం చ | = | ప్రవృత్తిని | న కాంక్షతి | = | కోరడు |

**శ్రీ భగవంతుడు చెబుతున్నాడు :**

**అర్జునా! ప్రకాశము గాని, ప్రవృత్తి గాని, మోహము గాని - ఇవి కలిగి నపుడు ద్వేషించని వాడు, తొలగి నపుడు కాంక్షించని వాడు గుణాతీతుడు.**

**వ్యాఖ్య**

గుణాతీతుని యొక్క లక్షణాన్ని, గుణాతీతత్వాన్ని పొందే ఉపాయాన్ని బోధించమని అర్జునుడు గత శ్లోకంలో ప్రార్థించాడు. అర్జునుని ప్రశ్నలకు ప్రతి వచనంగా మొదట గుణాతీతుని లక్షణాన్ని వర్ణిస్తున్నాడు భగవంతుడు.

అర్జునా! సత్త్వగుణ లక్షణమైన ప్రకాశము, రజోగుణ లక్షణమైన కార్యప్రవృత్తి, తమోగుణ లక్షణమైన మోహము - ఇవి ప్రాప్తించి నపుడు ద్వేషించని వాడు ***(న ద్వేష్టి సంప్రవృత్తాని)***, నివర్తించి నపుడు కాంక్షించని వాడు ***(న కాంక్షతి నివృత్తాని)*** గుణాతీతుడు.

**ప్రవృత్తాలను ద్వేషించడు**

గుణాల చేత బద్ధుడైన వాడు గుణయుతుడు. గుణ ప్రభావాల నుండి విడిపడిన వాడు గుణాతీతుడు, లేదా జీవన్ముక్తుడు. ఇరువురూ జీవించే ఉన్నారు. ఇద్దరికీ దేహ ముంది. మనస్సుంది. గుణా లున్నాయి. కాకపోతే, వాటి ప్రభావం వారిపై ఎలా ఉంది అనే విషయంలో గుణాతీతుడు గుణయుతుడి కన్నా విలక్షణంగా శోభిస్తూ ఉంటాడు.

ప్రకృతి సంభవాలైన గుణ కార్యాల యొక్క ప్రభావం మనుషులపై ఉంటుంది. సత్త్వగుణము యొక్క కార్యము ప్రకాశము ***(ప్రకాశం చ సత్త్వ కార్యం)***. రజోగుణము యొక్క కార్యము ప్రవృత్తి ***(ప్రవృత్తించ రజః కార్యం)***. తమోగుణము యొక్క కార్యము మోహము ***(మోహం ఏవ చ తమః కార్యమ్)***.

విషయ జ్ఞానము మరియు విషయ సుఖములకు హేతువై సత్త్వగుణము; లోభము మరియు దుఃఖము నకు కారణమై రజోగుణము; మోహము మరియు మూఢత్వమునకు హేతువై తమోగుణము - ఈ మూడు జీవులను బంధిస్తూ ఉన్నాయని అర్థం చేసుకున్నాము. బంధహేతువు లైన ఈ గుణకార్యాల విషయంలో సామాన్యులకు, సాధకులకు కూడా ద్వేష భావం ఉంటుంది.

తమోగుణము నన్ను బాధిస్తూ ఉంది. దీని చేత నేను మందమతి నయ్యాను ***(మమ తమసః ప్రత్యయః జాతః, తేన అహం మూఢః)***. అలాగే దుఃఖ స్వభావమైన రాజస ప్రవృత్తి నాకు కలిగింది. రజోగుణ కార్యాల చేత ప్రేరేపింపబడి కర్మలలో కూరుకు పోయాను. స్వరూపం నుండి జారి పోయాను. సాధనలో భ్రష్టుడ నయ్యాను ***(రాజసీ ప్రవృత్తిః మమ ఉత్పన్నా దుఃఖాత్మికా, కష్టం మమ వర్తతే)***. అలాగే సత్త్వగుణ కార్యాలైన సుఖ ప్రకాశాలు కూడా నాలో సుఖాసక్తిని పెంచి బాధిస్తున్నాయి ***(తథా సాత్త్వికః గుణః మాం సుఖే చ సంజయన్ బధ్నాతి)***. ఈ విధంగా గుణకార్యాలు సంప్రాప్త మైనపుడు సామాన్యులు లేదా సాధకులు ద్వేషించడం మనకు కనిపిస్తూ ఉంటుంది. ఈ గుణకార్యాలు గుణాతీతునికి ప్రాప్తించి నపుడు అతడు వాటిని ద్వేషించడు. కారణం, వాటి ప్రభావము ఆ మహాత్మునిపై ఉండదు. ఈ లక్షణము ప్రత్యేకంగా ఆత్మజ్ఞాని యందే గోచరిస్తుంది; గుణాతీతుని లోనే కనిపిస్తుంది. ఈ ప్రజ్ఞ అతడిలో స్థిరంగా ఉంటుంది. అందుకే గుణాతీతుడు స్థితప్రజ్ఞుడు.

త్రిగుణాల పరిణామంగా ఏర్పడిన ఇంద్రియ మనో దేహాలు మార్పు చెందుతూ ఉంటాయి. మార్పుల మధ్య మారని తత్త్వం కలవాడు గుణాతీతుడు. దేహం ఉంది కనుక గుణాతీతునికి కూడా ఆకలిదప్పులు





ఉంటాయి. అలాగే దేహానికి అనారోగ్యం ఏర్పడ వచ్చు. ఈ విధమైన ప్రతికూలాలు ప్రాప్తించి నపుడు సామాన్యులు కలత చెందుతుంటారు. గుణ ప్రభావంతో చలించి పోతుంటారు. కాని, గుణాతీతుడు చలించడు. దేహేంద్రియ మనస్సులలో కలిగే గుణ చలనాలు వాటికి సంబంధించినవే గాని తనను స్పృశించ లేవు అనే జ్ఞానంతో శోభిస్తూ ఉంటాడు.

గుణాల చేత బద్ధుడైన వాడు గుణకార్యాలు ప్రాప్తించి నపుడు, అవి ప్రతికూలమైతే, వాటిని మార్పు చేసుకోవడం వల్ల సుఖం కలుగుతుందని భావించి, ఆ ప్రయత్నంలో తల మునక లవుతాడు. కాని, అస్థిర మైన క్షేత్ర కార్యాలు స్వరూప జ్ఞానం గల తన ప్రజ్ఞను చలింప చేయ లేవని గుణాతీతుడైన జ్ఞానికి తెలుసు. యోగికి, జ్ఞానికి ప్రధానంగా ఇక్కడే అంతరము గోచరిస్తుంది.

చిత్తవృత్తులు ప్రతిబంధకాలని భావించి, వాటిని నిరోధించే ప్రయత్నంలో యోగి ఉంటాడు. అదే యోగము ***(యోగ శ్చిత్త వృత్తి నిరోధః*** ; పా 1 - సూ 2 ). ఇలా ఏ వృత్తులు లేని సమాధి కొరకు యోగం ప్రయత్నిస్తూ ఉంటే, వృత్తు లెన్నున్నా తన స్వరూపానికి భంగం లేదు అనే స్థిరప్రజ్ఞ జ్ఞానిలో ఉంటుంది. వృత్తి నిరోధము చేయడానికి వృత్తులపై జ్ఞానికి ద్వేష మేది? అలలను ఆపాలనే ప్రయత్నం సముద్రం ఎందుకు చేస్తుంది? అలల స్వభావాన్ని అవలోకిస్తూ పూర్ణశోభతో అలరారుతూ ఉంటుంది. అంతే. గాలి వీచే టప్పుడు శిరోజాలు చలిస్తాయి. అంతమాత్రం చేత వ్యక్తి చలించి పోతాడా? కేశ చలనానికి తాను వ్యథ చెందుతాడా? గుణ కార్యాలను తమపై ఆరోపించుకొనే వారు గుణబద్ధులు. గుణకార్య ప్రభావాలతో తమకు సంబంధమే లేదనే స్థిరమైన జ్ఞానం కలిగిన వారు గుణాతీతులు. స్వరూప జ్ఞానం నుండి ఎన్నడూ పతనం కాని వారు.

**నివృత్తాలను కాంక్షించడు**

అనుకూలాలు తెలియని వాడు, ప్రతికూలాలు అర్థం కాని వాడు గుణాతీతుడు. కనుక ప్రవృత్తాలను ఎలాగైతే ద్వేషించడో, అలాగే నివృత్తాలను ఆశించడు ***(నివృత్తాని న కాంక్షతి)***.

సత్త్వగుణము ఉద్భూత మైనపుడు మనిషికి సుఖ ప్రకాశాదులు కలుగుతాయి. సత్త్వగుణం వల్ల సంభవించే సుఖ ప్రకాశాదులు దూర మైనపుడు అవి మళ్ళీ కావాలని అందరూ ఆశిస్తారు. అవి లభిస్తే సుఖ ప్రాప్తి కలుగు తుందని భావించడమే అలా ఆశించ డానికి కారణము.

గుణాతీతుడు నివర్తించిన సుఖాలను తిరిగి కాంక్షించడు. కారణం, అతని సుఖం ఒక నిమిత్తంపై ఆధారపడి ఉండేది కాదని అతనికి తెలుసు. తానే సుఖ స్వరూపుడు. తన సుఖం నిత్యసుఖం. రాకపోకలు తెలియని సుఖం. అందుచేత దూరమయ్యే నైమిత్తిక సుఖాలను మళ్ళీ మళ్ళీ పొందాలనే కాంక్ష జ్ఞానిలో ఉండదు.

దేహంలో తానున్నా, తాను దేహానికి సంబంధించిన వాడు కాడు. కనుక, దేహానికి సంబంధించిన ఆకలి దప్పులు, శీతోష్ణాలు, ఆరోగ్య అనారోగ్యాలు, ఆకార వికారాలతో తనకు సంబంధం లేదు.

***దేహం చ నశ్వర మవస్థిత ముత్థితం వా సిద్ధో న పశ్యతి*** - దేహము నశ్వర మని గాని, దేహం కూర్చున్న దని గాని, నిలుచున్న దని గాని ఏ మాత్రం స్పృహ లేకుండా, సదా స్వరూప జ్ఞానంలో ఉండేవాడే గుణాతీతుడు అన్నది వ్యాస భాగవతము.

సుఖదుఃఖా లైనా, జయాపజయా లైనా, మానావమానా లైనా మనస్సుకు సంబంధించినవి. గుణాతీతునికి కూడా మనస్సుంది. తనకు మనస్సుంది. కాని, తాను మనస్సు కాదు. మనస్సు సుఖంగా ఉంటే, అది అలా ఉందని గ్రహించి తనలో ఏ మార్పు లేని వాడు, మనస్సు శోకంతో ఉంటే, అది అలా ఉందని చూస్తూ తాను ఏ వికారానికి లోను కాని వాడు గుణాతీతుడు.

దేహం దేశంలో ఉంది. ప్రదేశంలో ఉంది. మనస్సు దేహంలో ఉంది. ఏ చైతన్య స్ఫూర్తి వల్ల దేహేంద్రియ మనస్సులు చలిస్తున్నాయో, అట్టి ఆత్మ తానే నని ఎరిగిన గుణాతీతుడు దేహంలో ఉన్నాడు; దేహానికి వెలుపల కూడా ఉన్నాడు. మనస్సులో ఉన్నాడు; మనస్సుకు బాహ్యం లోనూ ఉన్నాడు. వాస్తవానికి దేహ మనస్సులే కాదు; దేశకాలాదులు కూడా తన లోనే ఉన్నాయి. అలాంటి మహితాత్మునికి దేనితో సంగత్వ ముంటుంది? తాను ద్వేషించ డానికి తన కన్నా అన్యంగా ఏముంది? ఆశించడానికి తనకి వెలుపల ఏదుంది? ప్రపంచమే అతనికి విస్మృత ప్రాయము. మాయా మాత్రము. ఛాయామాత్రము.

మనిషిని అంటుకొని ఛాయ ఉంటుంది. ఛాయ లేక పోయినా మనిషి ఉంటాడు. మనిషి ఛాయ మట్టిపై పడుతుంది. నీళ్ళపై పడుతుంది. నిప్పుపై పడుతుంది. నీడ మట్టిపై పడినా మనిషి మలిన పడడు. నీడ నిప్పుపై పడినా మనిషి కాలడు. నీడ నీళ్ళల్లో పడినా మనిషి మునగడు. నీడ ప్రభావం మనిషిపై ఉంటుందా? ఛాయా ప్రభావం మనిషిపై ఎలా లేదో, మాయా ప్రభావం కూడా మహాత్మునిపై ఉండదు. అట్టి మహాత్ముడే జీవన్ముక్తుడు, స్థితప్రజ్ఞుడు, గుణాతీతుడు. ఇరవై ఐదవ శ్లోకం చివర ***గుణాతీత స్స ఉచ్యతే*** అనే వాక్యాన్ని ఈ శ్లోకం నుండి ఇరవై నాల్గవ శ్లోకం వరకు అన్వయించుకుంటూ పోవాలి.

## పర ప్రత్యక్షం కాదు - స్వసంవేద్యం

గుణాతీతుని లక్షణాలు అనే ఈ విషయంలో ప్రధానమైన ఒక విషయాన్ని సదా స్మృతిలో ఉంచుకోవాలి. ఇవి ఇతరులు గుణాతీతులా, కారా? అనే దానిని అర్థం చేసుకోవడానికి కానే కాదు. ఎవరి లక్షణాలు వారికి అర్థ మౌతాయే గాని ఇతరులకు ఎలా కనిపిస్తాయి? అవి దేహ లక్షణాలు కావు కదా కనిపించటానికి!

గుణాతీతుని లక్షణాలు ఆత్మ లక్షణాలే కనుక, అవి ఎవరి మట్టుకు వారికి సంవేద్యములే గాని పరులకు తెలిసేవి కావు ***(ఏతత్ పర ప్రత్యక్షం లింగం, కిం తర్హి స్వాత్మ ప్రత్యక్షత్వాత్ ఆత్మ విషయ మేవ ఏతత్ లక్షణమ్).*** ఒక వ్యక్తిలో ఉండే ద్వేషాన్ని గాని, ఆకాంక్షను గాని మరొకడు ఎలా తెలుసుకో గలడు? తెలుసుకో లేడు ***(న హి స్వాత్మ విషయం ద్వేషం ఆకాంక్షాం వా పరః పశ్యతి).*** ఇక్కడ పరమేశ్వరుడు బోధించిన గుణాతీతుని లక్షణాలను అర్థం చేసుకోవడం ఎవరు గుణాతీతులు, ఎవరు గుణాతీతులు కారు, అని న్యాయ నిర్ణయం చేయడానికి కాదు. కనుక, విజ్ఞులు ఆ కార్యానికి పూనుకో కూడదు. ఆకాశంలో పయనించిన పక్షి జాడల్ని దర్శించాలనే ప్రయత్నము, నీటిపై వ్రాతలను చదవాలని చేసే ప్రయత్నము ఎలాంటివో, అన్యులలో గుణాతీత లక్షణాలను అన్వేషించడం కూడా అలాంటిదే. గుణబద్ధుడు గుణాతీతుని లక్షణాలను దర్శించ లేడు. అందుచేత అవి పర ప్రత్యక్షం కాదు, స్వసంవేద్యాలు.

*గుణాతీతుని లక్షణాలను వివరించిన వాసుదేవ పరమాత్మ, అర్జునుడు అడిగిన గుణాతీతుని ఆచారము అనే మరొక ప్రశ్నకు సమాధానము చెబుతున్నాడు.*

ఉదాసీనవ దాసీనో గుణై ర్యో న విచాల్యతే ।
గుణా వర్తన్త ఇత్యేవ యోఽవతిష్ఠతి నేఙ్గతే ॥ 23

***ఉదాసీనవత్-ఆసీనః-గుణైః-యః-న-విచాల్యతే***
***గుణాః-వర్తంతే-ఇతి-ఏవ-యః-అవతిష్ఠతి-న-ఇంగతే***

| | | | |
|---|---|---|---|
| యః | = ఎవడు | ఆసీనః | = ఉన్నవాడై |
| ఉదాసీనవత్ | = తటస్థుని వలె | గుణైః | = గుణముల చేత |





| | | | |
|---|---|---|---|
| న విచాల్యతే | = చలించడో | అవతిష్ఠతి | = ఉంటాడో |
| గుణాః | = గుణములు | న ఇంగతే | = చలింపడో |
| వర్తంతే ఇతి ఏవ | = ప్రవర్తిస్తున్నాయని మాత్రమే | | |

**అర్జునా! ఉదాసీనుని వలె ఉండేవాడు, గుణాల చేత చలించని వాడు, గుణాలు గుణాలలో ప్రవర్తిస్తున్నా యని తెలిసి స్థిరంగా ఉండేవాడు గుణాతీతుడు.**

### వ్యాఖ్య

అర్జునుడు అడిగిన రెండవ ప్రశ్న గుణాతీతుని ఆచారము. ఆచారము అంటే ప్రవర్తనము. దీనికి పరమేశ్వరుని ప్రతివచనము పరమాశ్చర్యంగా ఉంది. ఆచార మెలా ఉంటుంది అని అడిగితే, అసలు ఆచారమే లేదు అంటున్నాడు. ప్రవర్తనే లేదంటున్నాడు. అంటే, ఏ చేష్ట లేకుండా జడ స్వరూపంగా ఉన్నాడా? కాదు. చైతన్య స్వరూపం గానే ఉన్నాడు. ప్రవర్తించడం లేదు. అలాగని జడంగా పడి ఉండటం లేదు. లేదేమో అనుకుంటే, దివ్యంగా ఉన్నాడు ***(అవతిష్ఠతి).*** మరి, ఉండి ప్రవర్తించకుండా ఎలా ఉంటాడు? కదలకుండా ఉంటాడు ***(నేంగతే, న చలతి).*** మరి, కదలకుండా ఉండటము కూడా ప్రవర్తనే కదా! అలా ఉండాలి అనుకొని ఉన్నప్పుడు, అది ప్రవర్తన, లేదా ఆచారము అవుతుంది. లేదా, మరెవరైనా విధిగా అలా ఉండ మన్నప్పుడు అదీ ఆచారమే అవుతుంది. ఈ విధమైన విధి నిషేధాల చట్రంలో ఒదిగి ఉన్నది ఏదైనా ప్రవర్తనే అవుతుంది. కాని, గుణాతీతుని విషయంలో ఈ రెండూ పొసగేలా లేవు. తనను తాను నియంత్రించు కోవడానికి తాను మనోస్థాయిలో లేడు; గుణబద్ధుడు కాడు. అలాగని పరులు నియంత్రించ డానికి తాను విధి నియమాల పరిధిలో లేడు. కనుక, గుణాతీతుని ప్రవర్తనము ఎలా ఉంటుంది అంటే ఏమి చెప్పాలి? అది ప్రవర్తనము కాదు ప్రకాశము అని చెప్పాలి. గుణాతీతునిలో ప్రకాశకత్వమే గాని ప్రవర్తకత్వము లేదు అని చెప్పాలి. చేయడము, చేయక పోవడము అనే రెండిటికి అతీతంగా, ఊర్ధ్వంగా, అందనంత ఉన్నతంగా ***(ఉత్)*** ఉన్నాడు ***(ఆసీనః).*** ఆసీనుడు అంటే కూర్చుని ఉన్నవాడు అని అర్థము. కూర్చోవడ మనేది కూడా 'ప్రవర్తనము లేదు' అనే అర్థాన్నే సూచిస్తుంది. ఏమిటి, ప్రశాంతంగా కూర్చుని ఉన్నారు? పనేమీ లేదా? అనే ప్రశ్నలు మనము విన్నవే. మనమూ అన్నవే. కనుక, క్రియా క్రియలకు అతీతంగా, తటస్థంగా, అసంగుడై అకర్త స్వరూపంగా ప్రకాశించే వాడు ఇక్కడ ఉదాసీనుడుగా దర్శన మిస్తున్నాడు. అతడే గుణాతీతుడు. ప్రకాశమే ప్రవర్తనముగా శోభించే అసమాన, అసదృశ ప్రవర్తనము కలవాడు.

### ఉదాసీనుడు

ఉదాసీనుడు అంటే తటస్థుడు అని మనకు తెలుసు. తటస్థ వైఖరి కలవాడు ఉదాసీనుడు అని చెప్పు కుంటూ ఉంటాము. ఇరువురి మధ్య వివాదము తలెత్తి నపుడు, ఇరు పక్షాలలో ఏ పక్షమూ వహించని వాడు, ఏ పక్షమునూ సమర్థించని వాడు ఉదాసీనుడు ***(యథా ఉదాసీనః న కస్యచిత్ పక్షం భజతే తథా ఉదాసీనవత్ ఆసీనః).***

ఒకరి విషయంలో రాగం లేకుండా, మరొకరి విషయంలో ద్వేషం తలెత్తకుండా ఉండే వాడు ఉదాసీనుడు. అంటే, నా కెందు కొచ్చిందిలే అని మధ్యస్థంగా ఉండే వాడా? ఇదే ఉదాసీనత్వ మైతే, అలాంటి ఉదాసీనుడు జ్ఞాని అవుతాడా? పైగా, అలా భావించడం కూడా ప్రవర్తన క్రిందికే వస్తుంది కదా!

ఇరువురు వ్యక్తులు పరస్పరం కలహించు కోవడం కళ్ళారా చూచిన వ్యక్తిని సాక్ష్యం చెప్పమని అడిగి నపుడు, ఏదీ మాట్లాడకుండా మౌనంగా ఉంటాడు. అలాంటి వ్యక్తి వైఖరిని ఉదాసీన వైఖరి అంటూ ఉంటాము.

ఇది ఉదాసీన మేనా? కావచ్చు నేమో కాని, గుణాతీతుని ఉదాసీనత్వము ఇలాంటిది కాదు. నా కేమి జరుగు తుందో అనే భయము కూడా రాగద్వేషాల వలె గుణమే. తనకు ఏ బాధ కలగ కూడదనే కాంక్ష అతనిలో ఉంది. కాంక్ష అయినా, ద్వేష మైనా అది ప్రవర్తకత్వమే గాని ప్రకాశకత్వము క్రిందికి రాదు.

మేలు జరుగుతుంది అనే విషయములో రాగం, కీడు జరుగుతుంది అనే విషయంలో ద్వేషం ఉండే వాడు ప్రకృతి సంభవాలైన గుణాల చేత బద్ధుడే గాని గుణాతీతుడు కాడు. గుణబద్ధుడు ప్రవర్తకుడు. గుణా తీతుడు ప్రకాశకుడు. కేవలం ప్రకాశ స్వరూపుడు. భాసకునికి భాస్య ధర్మముతో సంబంధము లేనే లేదు. యావత్ప్రపంచాన్ని సూర్యుడు ప్రకాశింప చేస్తాడు. సూర్యుడు భాసకుడు. అతని చేత ప్రకాశింపబడే ప్రపంచము భాస్యము. భాస్య రూపమైన ప్రపంచంలో జరిగే కార్యాలకు భాసకుడైన భానునికి సంబంధ మేముంది? కనుక ప్రపంచంలో నడిచే కార్యాల యందు సూర్యుడు ఉదాసీనుడు. వాటి గుణ దోషాలు అంటని వాడు. అసంగుడు.

ప్రపంచంలో నడిచే కార్యాల నన్నిటినీ సూర్యుడు ప్రకాశింప చేస్తూ ఉండినా, ఆ కార్యాలకు అంటక తాను అసంగుడై ఉన్నట్లు, భాస్యమాన మైన, జడరూపమైన, మాయా మాత్రమైన ప్రకృతిని, ప్రకృతి కార్యాలైన గుణాలను ప్రకాశింప చేస్తున్న సాక్షి రూపుడైన గుణాతీతుడు ఆకాశం వలె అసంగుడై ఉంటాడు. దర్పణ సౌందర్యముతో శోభిస్తూ ఉంటాడు.

తనకు అభిముఖంగా వచ్చిన దేనిని అద్దము గ్రహించదు. అలాగని దేనినీ నిరాకరించదు. అన్నిటిని అందు కుంటుంది. కాని, దేనినీ తనలో ఉంచుకోదు, నిలుపుకోదు. అన్నిటిని ప్రతిఫలింప చేస్తున్నా, అద్దము సదా అసంగమే. ప్రకృతి పరిణామాలైన కారణ కార్యాల నన్నిటినీ ఆత్మ చైతన్యము ప్రకాశింప చేస్తూ ఉండినా, తాను దేని తోను సంగత్వము నొందక ఉదాసీనంగా ఉంటుంది. అదే గుణాతీత స్థితి.

ఆత్మ యైన తాను అసంగ మని, అద్వయ మని, ఉదాసీన మని, ప్రకాశ స్వరూప మని ఆత్మానుభూతిని పొందిన ఆత్మవిదుడు ***(స్వం ఆత్మానం అసంగం ఉదాసీనం పరిజ్ఞాయ)*** తెలుసుకుంటాడు. ఆకాశం ఏ విధంగా నైతే జలానలానిలాదులచే అంట బడదో, అలాగే అసంగుడు, ఉదాసీనుడు అయిన గుణాతీతుడు తాను అనాత్మ ధర్మాలైన గుణాల చేత అంటబడడు అని గ్రహిస్తాడు ***(యథా నభః గగనం, జల, అనల, అనిలాదిభిః న శ్లిష్యతే, తథా ఆత్మవిత్ గుణాతీతః కదాచిదపి కారణ కార్య ప్రకృతి ధర్మైః న లిప్యతే)***. ఆకాశము ఎలాగైతే జల, అగ్ని, వాయువుల చేత అంట బడకుండా అసంగమై ఉంటుందో, అలాగే ఆత్మవిదుడు ప్రకృతి ధర్మాలైన గుణాల చేత అంట బడకుండా ఉంటాడు. స్వరూపము నందే ప్రతిష్ఠితుడై ఉంటాడు. గుణముల చేత విచలితుడు కాకుండా ఉంటాడు. గుణ చలనాలు ఏవైతే గోచరిస్తూ ఉన్నాయో అవన్నీ గుణాలు గుణ విషయాల యందు సంగమించుట వలన కలిగిన వని భావిస్తాడు.

**గుణ పరిణామము - గుణ ప్రవర్తనము**

ఉదాసీనుని వలె ఆసీనుడై, గుణాల చేత చలించని ఆత్మవిదుడు, దేహములో సమస్త కార్యాలు నడుస్తూ ఉండినా, గుణాలు గుణాలలో ప్రవర్తిస్తూ ఉన్నాయి అని భావించి తాను ఆత్మ స్వరూపము నందే అవస్థితుడై ఉంటాడు ***(గుణా వర్తన్త ఇత్యేవ అవతిష్ఠతి)***.

కార్యకరణ విషయాకారముగా, అంటే దేహేంద్రియ విషయ రూపంగా పరిణమించినవి త్రిగుణాలే. ప్రకృతి గుణాలే. సత్త్వగుణము వలన జ్ఞానేంద్రియాలు, అంతఃకరణ చతుష్టయము; రజోగుణము వలన కర్మేంద్రియాలు, పంచప్రాణాలు; తమోగుణము వలన కలిగిన సూక్ష్మ పంచభూతాలు పంచీకరణం చెంది సమిష్టి స్థూల ప్రపంచముగా మరియు స్థూల దేహముగా పరిణమించాయి అని మనకు తెలుసు. కనుక ప్రకృతి





పరిణామంగా ఏర్పడిన వన్నీ గుణాలే. కార్యమైన దేహము, కరణాలైన ఇంద్రియ మనస్సులు కూడా గుణాలే. వీటిని ప్రకాశింప చేస్తూ, వీటికి అంటక అసంగుడై భాసించే గుణాతీతుడు, కార్యకరణ విషయాకారంగా, అంటే దేహేంద్రియ మనస్సులుగా మరియు విషయ రూపంగా పరిణమించిన గుణాలు పరస్పరము అన్యోన్యాశ్రయత్వంతో ప్రవర్తిస్తున్నాయి, అంటే గుణాలు గుణాల యందు ప్రవర్తిస్తున్నాయే గాని నేనేమీ చేయుట లేదు ***(న ఏవ కించిత్ కరోమి)*** అనే స్థితిలో దివ్యంగా శోభిస్తూ ఉంటాడు. గుణ కార్యాలకు అంటని వాడై ఉంటాడు ***(న ఇంగతే న చలతి, స్వరూపావస్థః ఏవ భవతి ఇత్యర్థః)***. స్వరూపస్థితి లోనే ఉంటాడు.

*గుణాతీతుని ఆచారాన్ని తరువాత శ్లోకంలో కూడా వర్ణిస్తున్నాడు.*

సమదుఃఖసుఖః స్వస్థః సమలోష్టాశ్మ కాఞ్చనః ।
తుల్య ప్రియాప్రియో ధీర స్తుల్య నిన్దాత్మ సంస్తుతిః ॥ 24

***సమదుఃఖసుఖః-స్వస్థః-సమలోష్టాశ్మ కాంచనః***
***తుల్య ప్రియాప్రియః-ధీరః-తుల్య నిందాత్మ సంస్తుతిః***

| | | | |
|---|---|---|---|
| సమదుఃఖసుఖః | = సుఖదుఃఖముల యందు సముడు | తుల్యప్రియాప్రియః | = ప్రియాప్రియములను సమముగా చూచువాడు |
| స్వస్థః | = తనలో తానుండు వాడు | ధీరః | = ధీరుడు |
| సమలోష్టాశ్మకాంచనః | = మట్టిగడ్డను, రాతిని, బంగారమును సమంగా చూచువాడు | తుల్యనిందాత్మ సంస్తుతిః | = నిందాస్తుతుల యందు సమబుద్ధి కలవాడు |

**అర్జునా! శోక సుఖాలలో సమంగా ఉండేవాడు, ఆత్మస్థితుడు, సమలోష్టాశ్మ కాంచనుడు, ప్రియాప్రియాలలో సముడు, నిందాస్తుతులలో సమబుద్ధి గల ధీరుడు గుణాతీతుడు.**

**వ్యాఖ్య**

**సమత్వము**

అభేదము సమము. భేదము విషమము. అభేదము వికార రహితము. భేదము వికార యుతము. ఒక కాలంలో అవికారంగా గోచరించినా, మరొక కాలంలో వికారయుత మయ్యేది భేదము. సర్వ కాలముల యందు భేద రహితంగా, వికార రహితంగా ఉండేది సమము ***(సర్వ కాలేషు సర్వ వికార రహితత్వాత్ సమః)***.

వికారాలన్నీ ప్రకృతి లక్షణాలే. కనుక ప్రకృతి యందు భేదము, విషమత్వము గోచరిస్తాయే గాని సమత్వము తెలిసి రాదు. విషమత్వము, లేదా భేదము అనేది దోషము. ఈ విధమైన భేదము, విషమత్వము లేనిది, సమరూప మైనది బ్రహ్మమే గాని గుణయుతమైన ప్రకృతి కాదు. అందుచేత బ్రహ్మమును నిర్దోష మని, సమ మని గీతాచార్యుడు కర్మసన్యాస యోగము లోనే తెలియ చేశాడు ***(నిర్దోషం హి సమం బ్రహ్మ- 5 వ అ - 19 వ శ్లో)***.

ప్రకృతిలో భేద ముంది. గుణభేద ముంది. కనుక ప్రకృతి సంబంధమైన విషయాలలో జ్ఞేయ భేదం అనివార్యం. జ్ఞేయ విషయాలలో భేదము ఉంది కనుక వాటికి సంబంధించిన జ్ఞానములో కూడా భేదం ఉండి తీరుతుంది. ఇదే భేద జ్ఞానము. విషమత్వానికి కారణము. ఈ విధమైన విషమ బుద్ధినే భేద బుద్ధి అంటారు. ఏ బుద్ధిలో విషమత్వము ఉండదో, భేదము తెలిసి రాదో అది సమబుద్ధి. సమబుద్ధి గల వాడు సముడు. అతడే

ఆత్మస్థుడు. గుణాతీతుడు. అభేద జ్ఞానం కలవాడు. అతడినే ఈ శ్లోకంలో భగవంతుడు 'స్వస్థుడు' అంటున్నాడు. అభేద జ్ఞాన స్వరూపమైన తన ఆత్మ యందే ఉండువాడు స్వస్థుడు.

### స్వస్థుడు

తన స్వరూపమైన ఆత్మ యందే ఉండువాడు స్వస్థుడు ***(స్వే ఆత్మని స్థితః స్వస్థః)***. ఆత్మను ప్రసన్నం చేసుకున్న వాడు కనుక స్వస్థుడైన ఆత్మవిదుని ప్రసన్నుడు అన్నారు శ్రీ శంకరాచార్యస్వామి ***(ప్రసన్నః)***. శాంతి తన స్వరూపముగా కలవాడు స్వస్థుడు. ఈ స్వస్థత సదా ఉండేదే కనుక అతడు సుప్రసన్నుడు. నిత్యానంద స్వరూపుడు. ఏ కాలం లోను, ఏ అవస్థ లోను అశాంతి ఎరుగని వాడు, ఆనందము నశించని వాడు.

మన ఆనందము అనుకూల పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. అన్నీ అనుకూలంగా ఉంటేనే మనకు స్వస్థత. అనుకూలాలు ప్రతికూలాలుగా మారి నపుడు అస్వస్థత. అస్వస్థత ఏర్పడి నపుడు అశాంతికి గురైన మనం ఒకప్పుడు నేను శాంతిగా ఉండే వాణ్ణి. ఆ కాలంలో నాకు అస్వస్థత తెలిసేదే కాదు. ఆ పరిస్థితులలో నేను ఎంతో సుఖంగా ఉండేవాణ్ణి అని చెబుతూ ఉంటాము.

కాని, గుణాతీతుడు సదా స్వస్థత లోనే ఉంటాడు. అతనిది నిత్య స్వస్థత. నిత్యానందము. అతని ఆనందము దేశ కాల పరిస్థితులపై ఆధారపడి ఉన్నది కాదు. అప్పుడు సుఖిని, ఇప్పుడు దుఃఖిని అనేది భేద జ్ఞానము. గుణ వికారాలతో కూడుకున్నది. అంతఃకరణమునకు సంబంధించింది. ఈ విధమైన గుణ వికారాలు స్వస్థు డైన ఆత్మస్థునిలో ఉండవు, ఉండలేవు. కనుక, అతడు సదానంద స్వరూపుడు. సుఖదుఃఖాలకు అతీతుడు. గుణాతీతుడు.

### సుఖదుఃఖాలలో సమత్వము

దుఃఖ సుఖాలు ఎవరికి సమంగా గోచరిస్తాయో అతడు దుఃఖ సుఖ సముడు ***(సమే దుఃఖ సుఖే యస్య సః సమ దుఃఖ సుఖః)***. సుఖము దుఃఖము కాదు. అలాగే దుఃఖము సుఖము కాదు. సుఖదుఃఖాలు పరస్పర విరుద్ధములు కనుక, భేదజ్ఞానంతో తెలుస్తున్నాయి. విషమత్వంతో గోచరిస్తున్నాయి. భేద జ్ఞానము ప్రకృతికి సంబంధించినది. గుణయుత మైనది. కనుక సుఖదుఃఖములు అనేవి అనాత్మ ధర్మాలే కాని ఆత్మ ధర్మాలు కావు. రాగం వల్ల ఏర్పడేది సుఖం, ద్వేషం వల్ల కలిగేది దుఃఖం. దేనిపై మనకు రాగ ముందో అది చేరువైతే సుఖం; దూరమైతే దుఃఖం. అలాగే దేనిపై మనకు ద్వేష ముందో అది దూరమైతే సుఖం; చేరువైతే దుఃఖం. ఈ రాగద్వేషాలు అంతఃకరణ ధర్మాలు. అనాత్మ సంబంధ మైనవి. వీటి వల్ల అంతఃకరణములో ఏర్పడే సుఖ దుఃఖానుభవాలు కూడా అంతఃకరణకు సంబంధించినవే. మార్పు చెందేవే. భేద రూపమైనవే. విషమత్వానికి సంబంధించినవే.

అనాత్మ ధర్మాలు, గుణ సంబంధములు అయిన రాగద్వేషాలు ఆత్మ యందు ఉండవు, ఉండ లేవు. ఆత్మ సమ మైనది. సమమైన ఆత్మ యందు విషమత్వానికి అవకాశము లేదు. భేదానికి స్థాన ముండదు. కనుక సుఖదుఃఖా లనేవి గుణస్థునిలో గోచరిస్తాయే గాని స్వస్థునిలో కనిపించవు. సమరూపుడైన ఆత్మస్థునిలో అగు పించవు.

గుణాలు మిథ్యారూపాలు. మిథ్యారూప గుణాలను ప్రకాశింప చేసే ఆత్మ చైతన్యము నిర్వికారము కనుక, అది అంతఃకరణ లోని సుఖదుఃఖానుభవాలను ప్రకాశింప చేస్తుందే గాని వాటి యందు ప్రవర్తించదు. అందుచేత, సుఖమైనా, దుఃఖమైనా తమ విషమత్వము యొక్క ప్రభావాన్ని సమరూపమైన ఆత్మపై చూప లేవు. కనుక, స్వస్థుడు, ఆత్మస్థుడు అయిన గుణాతీతుడు సుఖదుఃఖాల యందు సమంగా ఉంటాడు.





గుణాలు ప్రకృతి అధీనాలు కనుక, నిరంతరము ప్రకృతి లాగే మార్పు చెందుతూ ఉంటాయి. ప్రకృతి మయమైన ఈ ప్రపంచంలో నిరంతరము మార్పులే కనిపిస్తూ ఉంటాయి. చీకటివెలుగులు, ఎండవానలు, శీతోష్ణాలు, ఇవి సదా మారుతూ గోచరిస్తుంటాయి. అలాగే గుణాలు మారుతూ ఉంటాయి. మనస్సు మారుతూ ఉంటుంది. అనుభవాలు మారుతూ ఉంటాయి. ఈ మార్పుల మధ్య భేద వృత్తులే ఉంటాయి. భేద జ్ఞానమే ఉంటుంది.

కాని, గుణాతీతుని యొక్క సమస్థితి అలాంటిది కాదు. అనాత్మ ధర్మాలు తనలో లేనందున మనస్సులో సుఖదుఃఖాలు మారుతున్నా, తనలో ఏ మార్పు లేకుండా గుణాతీతుడు సమస్థితిలో, గుణాతీత స్థితిలో స్వస్థుడై ఉంటాడు.

సుఖం అనే పదంలో 'ఖం' ఉంది. దుఃఖం అనే పదంలో కూడా 'ఖం' ఉంది. **ఖం** అంటే ఆకాశము. సుఖం, దుఃఖం అనే పదాలలో 'ఖం' అనే శబ్దం ఎలాగైతే సమానంగా ఉందో, అలాగే అంతఃకరణ ధర్మాలైన సుఖదుఃఖాల యందు కూడా ఆకాశము వలె గుణాతీతుడు సమంగా ఉంటాడు. అనాత్మ ధర్మా లైన సుఖ దుఃఖాల చేత ఆకాశం లాగా అంటబడకుండా ఉంటాడు.

***న నభో ఘటయోగేన సురా గంధేన లిప్యతే।***
***తథాత్మోపాధి యోగేన తద్ధర్మైః నైవ లిప్యతే॥***

కుండ లోని ఆకాశము కుండ లోని కల్లు వాసన చేత ఎలా అంట బడదో, అలాగే దేహేంద్రియ మనోబుద్ధులనే ఉపాధిలో ఆత్మ భాసిస్తూ ఉండినా, ఉపాధి ధర్మాలైన సుఖదుఃఖాది అనిత్య ధర్మాల చేత అంట బడదు అని శ్రీ శంకరాచార్యస్వామి వివేక చూడామణి గ్రంథంలో రచించారు.

### సమలోష్టాశ్మ కాంచనుడు

దుఃఖ సుఖాలలో సముడుగా ఉన్న గుణాతీతుడు లోష్టాశ్మ కాంచనాలలో కూడా సమత్వమును కలిగి ఉంటాడు. 'లోష్టః' అంటే మట్టిగడ్డ. 'అశ్మ' అంటే రాయి. 'కాంచన' మంటే బంగారు. సమలోష్టాశ్మ కాంచనుడు అంటే మట్టిగడ్డ, రాయి, బంగారమును సమానంగా చూచేవాడు అని అర్థము ***(లోష్టం చ అశ్మా చ కాంచనం చ సమాని యస్య సః సమలోష్టాశ్మ కాంచనః)***. ఆరవ అధ్యాయంలో యోగారూఢుని గూర్చి ముచ్చటించి నపుడు కూడా ఈ సమలోష్టాశ్మ కాంచనుడు అనే విషయాన్ని భగవంతుడు ప్రస్తావించడం జరిగింది *(6 వ అ - 8వ శ్లో)*.

మట్టిగడ్డ అయినా, రాయి అయినా, బంగార మైనా భూమి నుండి ఆవిర్భవించినవే. మహిమ తెలిసిన గుణాతీతునిలో మట్టికి విలువ ఏముంటుంది? అన్నీ వస్తువులే. ఇక విలువ లంటారా? కల్పించుకుంటే ఉంటాయి. విడిపించుకుంటే పోతాయి. రాయి అయినా, మట్టిపెల్ల అయినా, బంగారు ముద్ద అయినా పృథివి సంజాతాలే. ఒకవేళ భూమిలో రాళ్ళ మోతాదులో బంగారు లభ్యమై, బంగారు మోతాదులో రాళ్ళు లభిస్తే, దేని విలువ ఎలా ఉండేదో! అన్నీ మారే విలువలే. వస్తువులకు ఉన్న విలువలు నిత్య మైనవి కావు. మనం ఇచ్చే విలువలను బట్టి అవి వెలుగుతూ ఉంటాయి. వాటిపై మన కుండే ప్రియత్వాన్ని బట్టి వాటి వెలుగులు పెరుగుతూ ఉంటాయి. ప్రియత్వము తగ్గితే విలువలు కూడా తరిగి పోతూ ఉంటాయి.

ఒక స్త్రీ మూర్తి మాంగల్యానికి విలువ కట్టే దెవరు? ఎవరి కుంది ఆ శక్తి? మాంగల్యానికి ప్రతిరూపంగా మంగళసూత్రం శోభిస్తూ ఉంటుంది. ఒక తల్లి మెడ లోని మాంగల్యం సువర్ణ సూత్రంగా ఉంటుంది. మరో తల్లి మెడలో పసుపు త్రాడు ఉంటుంది. ఒక మాతృమూర్తి మెడ లోని సూత్రానికి బంగారు బిళ్ళలు ఉంటే, మరో తల్లి

మెడ లోని సూత్రానికి పసుపుకొమ్ము ఉంటుంది. విలువ దేనికి? వస్తువుకా? లేక మాంగల్యానికా? కళ్ళు మూసుకున్న వారు ఏవైనా చూడగలరు. కనువిప్పు కలిగితేనే ఉన్నది కనిపిస్తుంది. ఉన్నది సత్యము. మన మనస్సులో ఉన్నవి అసత్యాలు. అసత్యాలపై, అనిత్యాలపై గుణ విషయాలపై దృష్టి లేని వాడు జ్ఞాని; సముడు. అతడే గుణాతీతుడు.

**ఆఖ్యాయిక**

ఒక తండ్రికి ఇద్దరు కుమారులు. తండ్రి మరణిస్తూ తన వద్ద ఉన్న పది బంగారు బిస్కెట్లను కుమారులిరువురికి ఐదేసి చొప్పున పంచి ఇచ్చి కన్ను మూశాడు.

తండ్రి మరణించిన కొంత కాలానికి పెద్ద కుమారుడు సన్యసించి సాధువు అయ్యాడు. చిన్న కుమారుడు గృహస్థుడై, ఒక వ్యాపారాన్ని ప్రారంభించి, ధనార్జన చేసి భార్యాబిడ్డలతో కలిసి జీవిస్తున్నాడు.

కొన్ని సంవత్సరాలు గడిచాయి. సాధువుగా మారిన జ్యేష్ఠ భ్రాతను చూడాలనే కోరికతో గృహస్థుడైన సోదరుడు అన్నగారి ఆశ్రమానికి వచ్చాడు. సాధు రూపంలో ఉన్న అన్నగారిని దర్శించాడు. రెండు రోజులు ఆశ్రమం లోనే ఆనందంగా గడిపాడు. తిరిగి ఇంటికి వెళ్ళే సమయంలో సాధు మహాత్మునికి నమస్కరించి ఆశీస్సులను అర్థించాడు.

నాయనా! క్షేమంగా ఉన్నావు కదా? అని ప్రశ్నించాడు సాధువు. ఉన్నాను. తండ్రి గారు ఇచ్చి వెళ్ళిన ఐదు బంగారు బిస్కెట్లను పెట్టుబడిగా పెట్టి వ్యాపారం చేశాను. బాగా గడించాను. భగవత్కృప వల్ల ఆ అయిదు బిస్కెట్లు ఇప్పుడు యాభై అయ్యాయి అన్నాడు.

మరి, ఇప్పుడు తృప్తిగా ఉన్నావా? అని ప్రశ్నించాడు సాధువు. లేదు. ఇంకా ప్రయత్నిస్తున్నాను. ఆ యాభై బిస్కెట్లను వంద చేయాలని ప్రయత్నిస్తున్నాను. నా ఆశ ఫలిస్తే, ఇక ఆ తరువాత అంతా తృప్తే అన్నాడు తమ్ముడు.

వెంటనే సాధువు లేచి లోనికి వెళ్ళి కొంతసేపు గదిలో అటు ఇటు వెతికి, దొరికిన ఐదు బంగారు బిస్కెట్లను తెచ్చి వ్యాపారికి ఇచ్చాడు. ఇవీ ఉంచుకో అన్నాడు.

అదేమిటి? మీ అయిదు బంగారు బిస్కెట్లు నా కిచ్చేస్తున్నారు? అంటూ ఆశ్చర్య పోయాడు గృహస్థుడైన సోదరుడు.

ఫరవా లేదులే, తీసుకో! వాటి అవసరం నా కన్నా నీకే ఉంది. నీవు ప్రస్తావించినంత వరకు అవి నా వద్ద ఉన్నాయని కూడా నాకు జ్ఞాపకం లేదు. నువ్వే ఇప్పుడు వాటిని స్మృతికి తెచ్చావు. నీకు వాటి వల్ల తృప్తి కలుగుతుందని అంటున్నావు కనుక, నువ్వే తీసుకో! నేను ఇలాగే తృప్తిగా ఉన్నాను. నా తృప్తి వాటిపై ఆధారపడి లేదు. అన్నాడు సాధువు.

వీరిరువురిలో ఎవరు భాగ్యవంతులు? ఎవరిది బంగారు జీవితము? తృప్తి అనేది మనకు ఏమి ఉంది అనే దానిపై ఆధారపడి లేదు. మనము ఎలా ఉన్నాము అనే దానిపై ఆధారపడి ఉంది. మరొక దానిపై ఆధారపడ్డ వాళ్ళు తృప్తి చెందిన దాఖలాలు ప్రపంచంలో లేవు. స్వస్థుడైన వానికే నిత్యతృప్తి ఉంటుంది. అతడే నిత్యతృప్తుడు; నిరాశ్రయుడు. తన తృప్తికి మరొకటి అవసరం లేదు. తానొక్కడే చాలు. అతడే గుణాతీతుడు. తన కన్నా అన్యమైన వాటి యందు అతనికి స్పృహ ఉండదు. కనుక వాటి మధ్య భేదం చూడడు. అన్నీ సమమే. అన్నిటినీ సమత్వం తోనే వీక్షిస్తాడు. అందుకే, గుణాతీతుడు సమలోష్టాశ్మ కాంచనుడు.





***న తదస్తి న యత్రాహం న తదస్తి న తన్మయమ్ ,***
***కి మన్య దభి వాంఛామి సర్వం సచ్చిన్మయం తతమ్ ॥***

'నేను లేని దెక్కడ? నేను కానిది ఏముంది? నేను కోరదగింది వేరొకటి ఏదుంది? సమస్తములో వ్యాపించి యున్న సద్రూప చైతన్యము నేనే' - ఇదే ఆత్మవిదుని, గుణాతీతుని అద్వైతానుభూతి అని ఉపనిషత్ ప్రవచించింది.

**ప్రియా ప్రియాలలో సమత్వము**

ప్రియమైన వాటిని, అప్రియమైన వాటిని సమానంగా చూచేవాడు తుల్య ప్రియాప్రియుడు ***(ప్రియం చ అప్రియం చ ప్రియాప్రియే తుల్యే సమే యస్య సః అయం తుల్య ప్రియా ప్రియః ).***

ఇష్ట మైనది ప్రియంగా ఉంటుంది. అనిష్ట మైనది అప్రియంగా ఉంటుంది. ఇంతకీ ఏది ప్రియవస్తువు? ఏది అప్రియ వస్తువు? ఏది సుఖహేతువో అది ప్రియవస్తువు. ఏది దుఃఖహేతువో అది అప్రియ వస్తువు. సుఖదుఃఖా లనే ద్వంద్వాలు మనోకల్పితాలు. ఏది సుఖము? ఏది సుఖ వస్తువు? సుఖ వస్తువు అనేది ఒకటి ఉంటే, అందరూ దాని వెంటే పడేవారు. ఏది సుఖమో, ఏది సుఖహేతువో అర్థం కాకపోవడం చేతనే ఒక్కొక్కరు ఒక్కొక్క దాని వెంటపడి పోతున్నారు.

ఒకరికి సుఖా న్నిచ్చేది మరొకరికి దుఃఖాన్ని పంచుతూ ఉంది. ఇంతకీ అది సుఖమా, దుఃఖమా? రెండూనా? లేక రెండూ కాదా? ఒకరికి సుఖా న్నిస్తుంది కనుక అది దుఃఖం కాదు అని చెప్పాలి. అలాగే మరొకరికి దుఃఖాన్నిస్తూ ఉంది కనుక అది సుఖమూ కాదని అనాలి. సుఖమూ కానిది, దుఃఖమూ కానిది ఏదో అది నిజానికి కానిదే. అయినది కాదు; మన దైనది కాదు. మనది కానిది పరస్థమే గాని స్వస్థం కాదు. గుణస్థమే కాని ఆత్మస్థం కాదు. గుణస్థ మైనవి, ప్రకృతిస్థ మైనవి ఏవైనా అనిత్యమే. వాటిలో ప్రియత్వ మెక్కడుంది? అప్రియత్వం మాత్రం ఎక్కడుంది? ఇది అర్థమైన గుణాతీతుడు ప్రియాప్రియాలు లేని వాడు. ఇతరులకు ఉన్నట్లు అనిపించినా, తనలో విషమత్వము లేదు కనుక సమత్వమే అనుభూతిగా ఉంటుంది. ఇదే సమబుద్ధి. సమబుద్ధి కలవాడు కనుక గుణాతీతుడు ధీరుడు. అంటే, ధీమంతుడు ***(ధీరః ధీమాన్).*** అంటే బుద్ధిమంతుడు. మామూలు బుద్ధిమంతుడు కాడు. సమ బుద్ధిమంతుడు.

**నిందాస్తుతులలో సమత్వము**

నిందాస్తుతులలో కూడా గుణాతీతుడు సముడే. ఇక్కడ నింద అయినా, స్తుతి అయినా పరకృతమే గాని స్వకృతం కాదు; స్వీయకృతం కాదు. ఇతరులు తన విషయంలో చేసే పొగడ్త స్తుతి అయితే, ఇతరులు తన విషయంలో చేసే విమర్శ నింద అవుతుంది. ఈ విధమైన నిందాస్తుతులలో గుణాతీతుడు సమంగా ఉంటాడు. ***తుల్య నిందా సంస్తుతిః*** అంటే అదే ***( తుల్యే సమే నిన్దాత్మ సంస్తుతీ యస్య సః తుల్య నిన్దాత్మ సంస్తుతిః ).***

శ్రుతి లేని పాట ఎవరి వీనులకు విందు? ఎవరి మనస్సుకు పసందు? వివేకం లోపించిన నిందలో పస ఎక్కడుంది? వివేకం లేని స్తుతిలో నస ఉందే గాని పనస ఎక్కడుంది? స్తుతించడాని కైనా, నిందించడాని కైనా తత్సంబంధమైన జ్ఞానం ఉండాలి. రాగద్వేషా లనే దురదల వల్ల ప్రదర్శించే నిందాస్తుతులనే గోకడాలు ఎవరికి తృప్తి నిస్తాయి?

భగవంతుని స్తుతించడం మనకు సాధ్యమయ్యే విషయ మేనా? మన భక్తి కొద్ది మనం ప్రస్తుతించవచ్చు. అందులో దోషం లేదు. కాని దాని వల్ల భగవంతునికి ఒరిగే దేముంటుంది? పరమేశ్వరుని ప్రశంసించ

డానికి కావలసిన పరిపూర్ణ జ్ఞానం మన కుందా? ఇక నింద విషయాని కొస్తే, భగవంతునిలో ఏ దోష ముందని మనం నిందించ గలం? మన పొగడ్తలకు పొంగి పోవడానికి, మన నిందలకు క్రుంగి పోవడానికి అవసరమైన అజ్ఞానం లేనివాడు భగవంతుడు. పొగిడే వ్యక్తి వెనుక, తెగడే వ్యక్తి వెనుక ఉండేది అజ్ఞానమే కదా! అజ్ఞానాన్ని చూచి జ్ఞాని ప్రతిచర్యలతో ప్రతిస్పందిస్తాడా? తనను పొగిడే వ్యక్తి స్తుతుల కన్నా తాను అతీతుడని పరమేశ్వరునికి తెలుసు. అలాగే తనను తెగడే వ్యక్తుల నిందల కన్నా తాను భిన్నుడని కూడా తెలుసు. అజ్ఞాన కార్యాలైన నిందాస్తుతులలో ఉన్నది అజ్ఞానమే కనుక, అజ్ఞానంలో భేద దర్శనమే ముంది? అంతా అజ్ఞానమే కదా! కనుక అజ్ఞాన కార్యాలకు జ్ఞాని చలించడు. అతడే స్వస్థుడు. అతడే గుణాతీతుడు. ఈశ్వరుడే తాను అనే బ్రహ్మాత్మ జ్ఞానము కలవాడు గుణాతీతుడు.

*గుణాతీతుని మరి కొంత ఆచార విషయాన్ని తరువాత శ్లోకంలో కూడా వివరిస్తున్నాడు.*

**మానాపమానయో స్తుల్య స్తుల్యో మిత్రారి పక్షయోః ।**
**సర్వారమ్భ పరిత్యాగీ గుణాతీతః స ఉచ్యతే ॥** 25

***మానాపమానయోః-తుల్యః-తుల్యః-మిత్రారిపక్షయోః***
***సర్వారంభ పరిత్యాగీ-గుణాతీతః-సః-ఉచ్యతే***

| | | | | | |
|---|---|---|---|---|---|
| మానాపమానయోః | = మానావమానముల యందు | యః | = | ఎవడో |
| తుల్యః | = సమబుద్ధి కల వాడు | సః | = | వాడు |
| మిత్రారి పక్షయోః | = శత్రుమిత్ర పక్షముల యందు | గుణాతీతః | = | గుణాతీతుడని |
| తుల్యః | = సముడు | ఉచ్యతే | = | చెప్పబడు తున్నాడు |
| సర్వారంభ పరిత్యాగీ | = కర్తృత్వాభిమానమును త్యజించిన వాడు | | | |

**పార్థా! మానావమానాల యందు సమబుద్ధి గల వాడు, మిత్ర శత్రువులను సమంగా వీక్షించే వాడు, కర్తృత్వాభిమానము లేనివాడు గుణాతీతుడు.**

## వ్యాఖ్య

గుణాతీతుడు ఆత్మజ్ఞాని అని, జీవన్ముక్తు డని ఇప్పటికే మనం అర్థం చేసుకున్నాం. ఆత్మజ్ఞానికి విధి నిషేధాలు లేవు. ఆత్మవిదుడు ఇలా ఉండాలి; అలా ఉండ కూడదు అనే విధానాలను వివరించే సాహసం శాస్త్రం చేయలేక పోయింది. జీవన్ముక్తుడు ప్రపంచం లోనే చరిస్తూ ఉంటాడు. కాని, ప్రపంచం అతనిలో ఉండదు. ప్రపంచం యొక్క ప్రభావం అతనిపై పడదు.

తాను నిత్యానంద స్వరూపుడు; పూర్ణానంద స్వరూపుడు. అతడి ఆనందాన్ని పెంచేవారు లేరు; తగ్గించే వారూ లేరు. అతని ఆనందము నిర్హేతుక మైనది; నిర్నిమిత్త మైనది. తాను ఆనందించ డానికి ఏ కారణమూ అవసరం లేదు. అతని ఆనందము ఒక ప్రత్యేక పరిస్థితిపై ఆధారపడి లేదు. అతడు సదానంద స్వరూపుడు. నిర్వికారుడు. కనుక ఏ వికారములు అంటని వాడు; అసంగుడు.

### మానావ మానాలలో సముడు

ఆదర భావంతో చేసే సత్కారము మానము, లేదా గౌరవము. అనాదర భావంతో చేసే తిరస్కారము అవమానము, లేదా అగౌరవము. సత్కారములో సంతసించడం, తిరస్కారములో పరితపించడం సామాన్య మానవులకు సహజం. సత్కార తిరస్కారాలలో సమంగా ఉండట మనేది సర్వులకు అసహజము. కాని,





గుణాతీతునికి అది సహజ లక్షణము. కనుక జ్ఞాని మానావమానాల యందు సమదృష్టితో ఉంటాడు; సమత్వమును ప్రదర్శిస్తూ ఉంటాడు (***మానావ మానయోః తుల్యః నిర్వికారః***). ఏ విధమైన వికారము లేకుండా నిర్వికారంగా ఉంటాడు. అంటే, మనస్సులో హర్ష విషాదాది వికారాలు లేకుండా ఉంటాడని అర్థం.

పూర్వ శ్లోకంలో నిందాస్తుతులలో సముడుగా కనిపించిన మహాత్ముడే ప్రస్తుత శ్లోకంలో మానావ మానాలలో సముడుగా గోచరిస్తున్నాడు.

నిందలో అనాదరము, స్తుతిలో ఆదరము ఉన్నట్లే, అవమానంలో అనాదరము, మానములో ఆదరము గోచరిస్తున్నాయి. కాకపోతే నిందాస్తుతులు కేవలం వాచకాలు; శబ్దరూపాలు. మానావమానాలు శబ్దరూపాలు కావచ్చు; క్రియారూపాలూ కావచ్చు.

స్తుతులు, సత్కారాలు సర్వులను సంతోష పెడతాయి. నిందలు, తిరస్కారాలు సహజం గానే సర్వులకు సంతాపాన్ని కలిగిస్తాయి. సంతోషాలైనా, సంతాపాలైనా, హర్ష విషాదాలు రెండూ వికారాలే. మనోవికారాలే. వృత్తి విశేషాలే. సర్వులూ వీటి ప్రభావానికి చలిస్తూ ఉంటే, సర్వులకు భిన్నంగా, వృత్తి విశేషాల చేత వికారాన్ని పొందకుండా గుణాతీతుడు విలక్షణంగా ఉంటాడు. నిందాస్తుతులలో, మానావమానాలలో నిర్వికారంగా విలసిల్లుతాడు.

స్వభావము చేత గుణదోషా లనే విరుద్ధ లక్షణాలను కలిగిన మిథ్యా ప్రపంచము నందు, ప్రపంచము లోని వ్యవహారముల యందు వికారము చెందకుండా సదా సమత్వమును దర్శించడమే గుణాతీతుని లక్షణము ***( స్వభావేన విలక్షణే గుణదోష విశిష్టే అస్మిన్ ( మిథ్యా జగతి ) సర్వత్ర సమదర్శిత్వం ( తత్ ) గుణాతీతస్య లక్షణమ్ ).***

### పక్షపాత రహితుడు

వీరు శత్రువులు, వీరు మిత్రులు అనే భేదభావము గుణాతీతునిలో అగుపించదు. శత్రువుల యందు, మిత్రుల యందు గుణాతీతుడు సమభావంతో ఉంటాడు ***( తుల్యః మిత్రారి పక్షయోః ).***

సమత్వ బుద్ధి గల జ్ఞానికి శత్రుమిత్రులు ఎలా ఉంటారు? అసంగుడు, అద్వయుడు అయిన ఆ మహాత్మునికి ఎవరితో సఖ్య ముంటుంది? కలతలు తెలియని నిష్కలునికి ఎవరితో కయ్య ముంటుంది? శత్రుమిత్రులు ఉంటే కదా వారి విషయంలో సమత్వ ముండేది? శత్రుమిత్రులే అర్థం కాకుండా ఉదాసీనంగా ఉండే గుణాతీతునికి *( 14 వ అ - 23 వ శ్లో )* శత్రుమిత్రుల యందు సమబుద్ధిని కలిగి ఉండటము అనేది ఎలా పొసగుతుంది?

గుణాతీతుని లక్షణాలు స్వసంవేద్యాలే గాని పరప్రత్యక్షాలు కావని గుణాతీతుని లక్షణాలను ఆరంభించి నప్పుడే చెప్పుకున్నాం. కొందరు తమ భావంలో ఉదాసీనంగా ఉన్నా, పరుల అభిప్రాయంలో శత్రుమిత్రులుగా అర్థ మవుతూ ఉంటారు ***( యద్యపి ఉదాసీనాః భవన్తి కేచిత్ స్వాభిప్రాయేణ తథాపి పరాభి ప్రాయేణ మిత్రారి పక్షయోః ఇవ భవన్తి ).*** తమ కంటూ శత్రుమిత్రులు లేకపోయినా, పరుల దృష్టిలో, పరుల అభిప్రాయాలలో అలా కనిపిస్తుంటారు. ఈ విధంగా ఆశించక పోయినా, జ్ఞానులకు కూడా శత్రుమిత్రులు ఏర్పడుతూ ఉంటారు. అన్యులు జ్ఞానిలో శత్రువును లేదా మిత్రుని చూచినా, అలా తమను తాము అతనికి శత్రువులుగా, మిత్రులుగా తయారు చేసుకున్నా జ్ఞాని మాత్రము వారి యందు సమదృష్టి తోనే ఉంటాడు ***( ఇతి తుల్యః మిత్రారి పక్షయోః ఇతి ఆహ ).***

అజ్ఞానిని జ్ఞానిగా సామాన్యులు స్తుతించ వచ్చు. అలాగే జ్ఞానిని సామాన్యునిగా భావించి నిందించ వచ్చు. అలాగే సన్మానించ దగిన వారిని అవమానించ వచ్చు. లేదా తద్వ్యతిరిక్తంగా ప్రవర్తించ వచ్చు. మిత్రులను

శత్రువులుగా పరిగణించ వచ్చు. శత్రువులను మిత్రులుగా భావించ వచ్చు. పరిమిత జ్ఞానం కలవారు ఎలా ప్రవర్తించినా ఆశ్చర్యం లేదు. కాని, జ్ఞాని లేదా గుణాతీతుడు వీటికి అతీతుడు. సదా సమత్వంతో శోభించే వాడు. కనుక, అతని సమదృష్టిలో శత్రువులూ ఉండరు. మిత్రులూ ఉండరు. అతనిది సర్వత్ర సమదర్శనమే. ఆత్మ దర్శనమే.

## సర్వారంభ పరిత్యాగి

కర్మలను ఆరంభాలు అంటారు. ఆరంభించ బడతాయి కనుక కర్మలు ఆరంభాలు ***( ఆరభ్యన్తే ఇతి ఆరంభాః కర్మాణి ).*** కొన్ని కర్మలకు ఫలితాలు ఇక్కడే, ఈ లోకం లోనే, మనిషి జీవించి ఉండగానే కనిపిస్తాయి. వాటిని దృష్ట ఫలాలు అంటారు. కొన్ని కర్మలకు ఫలితాలు ఇక్కడ, అంటే జీవించి ఉన్నప్పుడు కాకుండా మరణానంతరము మరొక లోకం లోనో, లేక మరొక జన్మ లోనో అందుతాయి. వాటిని అదృష్ట ఫలాలు అంటారు. ఈ విధంగా దృష్టాదృష్ట ప్రయోజనాలను కలిగించే సమస్త కర్మలను త్యజించిన వాడు సర్వారంభ పరిత్యాగి. అతడే ఆత్మజ్ఞాని. గుణాతీతుడు ***( సర్వాన్ ఆరంభాన్ దృష్టాదృష్టార్థాని పరిత్యక్తుం శీలమ్ అస్య ఇతి సర్వారంభ పరిత్యాగీ ).***

మరి, సర్వ కర్మలను త్యజిస్తే దేహయాత్ర ఎలా సాగుతుంది? అనే సందేహము కలగ వచ్చు. దీనికి ఆచార్యుల వారు భాష్యంలో వివరణ ఇచ్చారు. సర్వారంభ పరిత్యాగి అంటే, దేహాన్ని నిలుపుకోవ డానికి అవసరమైన కర్మలను తప్ప, మిగిలిన సమస్తమైన కర్మలను త్యజించిన వాడు అని అర్థం చెప్పారు ***( దేహధారణ మాత్ర నిమిత్త వ్యతిరేకేణ సర్వ కర్మ పరిత్యాగీ ఇత్యర్థః ).***

చేయవలసిన కర్మను ఆరంభించే ముందు ఎవరి కైనా కర్మాసక్తి ఉంటుంది. ఇది నేను చేయ వలసిన కార్యము అనే భావన ఉంటుంది. అదే కర్తృత్వ భావన. అలాగే, కర్తృత్వ భావంతో ఆచరించిన కర్మకు తాను పొంద వలసిన ఫలమును కూడా ఊహించడము జరుగుతుంది. అదే ఫలాసక్తి, లేదా భోక్తృత్వ భావన. గుణాతీతుడు చేయవలసింది లేదు కనుక కర్మారంభంలో అతనికి కర్మాసక్తి ఉండదు. అలాగే పొంద వలసింది ఉండదు కనుక కర్మారంభంలో ఫలాసక్తీ ఉండదు. ఈ విధంగా సమస్త కర్మల యందు కర్తృత్వ భోక్తృత్వ అభిమానములను త్యజించి, నీటి మీద వ్రాత ల్లాగా కర్మలను నిర్వర్తించడమే సర్వారంభ పరిత్యాగము. అంటే, గుణాతీతునిలో సకామ కర్మలు ఆరంభించ బడవు అని అర్థము. కారణం, అతడు కృతకృత్యుడు; ఆప్తకాముడు.

## లోక సంగ్రహార్థం

ఇక్కడ గమనించ దగిన మరొక ముఖ్య విషయ ముంది. ఆచరించే ప్రతి కర్మకు సామాన్యులు ఫలితాన్ని ఊహిస్తారు. కాని, పూర్ణ పురుషుడైన ఆత్మజ్ఞాని ఆచరించే కర్మలకు అతనిలో ఫలాసక్తి ఉండాలని లేదు. చేయ వలసిన కర్మ ఉండినా, పొంద వలసిన ఫలం లేకుండా ఉండొచ్చు.

ప్రారబ్ధ వశాత్తు జ్ఞాని దేహం ప్రపంచంలో ఉంది కనుక, దేహ ప్రారబ్ధాన్ని అనుసరించి ఆచరించ వలసిన కర్మలను జ్ఞాని ఆ దేహం ద్వారా ఆచరించ వచ్చు. అలాంటి కర్మల విషయంలో ఆచరించే వాడు జ్ఞాని అయినందున, పొంద వలసిన కర్మఫలం తన కంటూ ఏమీ ఉండదు. అలాంటి జ్ఞాని యొక్క కర్మలకు ఫలాలు ప్రాప్తిస్తే, అవి లోకానికి ఉపయోగ పడతాయి. లోక సంగ్రహార్థమే వాటి వినియోగం ఉంటుంది.

జ్ఞానికి విధి నిషేధాలు లేవని ముందే తెలుసుకున్నాం. కనుక, తాను చేయ వలసిన కర్మలు లేక పోయినా, అలాగే పొందవలసిన ఫలితాలు లేకపోయినా, సూర్యుడు ప్రకాశాన్ని విరజిమ్మినట్లు, మేఘాలు అవనిపై వర్షించినట్లు, మొక్కలు పూలు పూసినట్లు, చెట్లు కాయలు కాచినట్లు, గాలులు తిరిగినట్లు, నదులు పారినట్లు,





లోక కళ్యాణార్థం జ్ఞాని కర్మలను ఆచరించ వచ్చు. అవి లోక సంగ్రహార్థం ఆచరించే కళ్యాణకరమైన నిష్కామ కర్మలే గాని ఫలాపేక్షతో ఆచరింపబడే సకామ కర్మలు కావు. అలాంటి పవిత్ర ఆరంభాలు, వాటి ఫలాలు ప్రపంచానికి అందుతాయే గాని జ్ఞానికి కాదు. ఈ సత్యాన్ని ఆవిష్కరించ డానికి పరమేశ్వరుడు గీత - మూడవ అధ్యాయంలో తననే ఉదాహరణంగా స్వీకరించి బోధించాడు.

***నమే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన ।***
***నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి ॥***

'అర్జునా! ముల్లోకాలలో నేను చేయవలసిన కార్య మంటూ లేదు. నేను పొందని దంటూ లేదు. పొంద వలసిందీ లేదు. అయినా, నేను కర్మ లాచరిస్తూనే ఉన్నాను' అన్నాడు గీతాచార్యుడు *( 3 వ అ - 22 వ శ్లో ).*

జ్ఞాని కర్మ చేయవచ్చు; మానేయనూ వచ్చు. చేసినంత మాత్రాన కర్మలు జ్ఞానిని బంధించవు. అలాగని, కర్మలు మానేసిన వారందరూ జ్ఞానులనీ కాదు. కర్మశూన్యులు సోమరులు. కర్మాతీతులే జ్ఞానులు. ఆత్మజ్ఞానులు. వారే గుణాతీతులు.

అర్జునుడు అడిగిన మూడు ప్రశ్నలలో గుణాతీతుని లక్షణాలను ఇరవై రెండవ శ్లోకంలో వివరించిన పరమేశ్వరుడు, గుణాతీతుని ఆచార వ్యవహారాలను గూర్చి ఇరవై మూడవ శ్లోకం నుండి ఇరవై ఐదవ శ్లోకం వరకు వరుసగా వివరించి, ఇక మూడవది అయిన గుణాతీత స్థితిని ఎలా చేరుకోవాలి అనే ప్రశ్నకు సాధనోపాయ మును తరువాత శ్లోకంలో ప్రవచిస్తున్నాడు.

ఇరవై మూడవ శ్లోకం ***ఉదాసీనవ దాసీనం*** నుండి ఇరవై ఐదవ శ్లోకం ***గుణాతీతః స ఉచ్యతే*** వరకు ఏదైతే గుణాతీతునికి లక్షణాయుత మైన ఆచారముగా చెప్పబడిందో అది సాధకుడైన వానికి యత్న సాధ్యము, అంటే ప్రయత్నించి పొంద దగినది అని అర్థము.

*మూడు గుణాలను ఎలా అతిక్రమించాలి? అని అర్జునుడు అడిగిన మూడవ ప్రశ్నకు సమాధానం చెబుతున్నాడు.*

మాం చ యోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే ।
స గుణా న్సమతీ త్యైతా న్బ్రహ్మ భూయాయ కల్పతే ॥ 26

*మాం-చ-యః-అవ్యభిచారేణ-భక్తియోగేన-సేవతే*
*సః-గుణాన్-సమతీత్య-ఏతాన్-బ్రహ్మభూయాయ-కల్పతే*

| | | | | | |
|---|---|---|---|---|---|
| యః | = | ఎవడు | ఏతాన్ | = | ఈ |
| అవ్యభిచారేణ | = | చలించని | గుణాన్ | = | గుణములను |
| భక్తియోగేన | = | భక్తియోగము చేత | సమతీత్య | = | అతిక్రమించి |
| మాం | = | నన్ను | బ్రహ్మభూయాయ | = | బ్రహ్మత్వమునకు |
| సేవతే | = | సేవిస్తాడో | కల్పతే చ | = | అర్హు డవుతాడు |
| సః | = | వాడు | | | |

**అర్జునా! అచంచలమైన భక్తితో నన్ను సేవించే వాడు గుణాలను దాటి పోతాడు. బ్రహ్మత్వమును పొందడానికి అర్హు డవుతాడు.**

## వ్యాఖ్య

త్రిగుణాలను అతిక్రమించేది ఎలా? అనే అర్జునుని మూడవ ప్రశ్నకు భగవానుని ప్రతి వచనమే ప్రస్తుత శ్లోకం. గుణాతీతుని ఆచారంగా ఇంతవరకు వరుసగా మనం చెప్పుకొనిన మూడు శ్లోకాలు జ్ఞాని విషయంలో, అంటే గుణాతీతుని విషయంలో లక్షణాలు గాను, ముముక్షువు అయిన సాధకుని విషయంలో ప్రయత్న పూర్వకంగా ఆచరించ వలసిన సాధనలు గాను అర్థం చేసుకున్నాం. అలాంటప్పుడు మళ్ళీ గుణాతీత స్థితికి ప్రత్యేకంగా ఉపాయాన్ని చెప్పవలసిన అవసర మేముంది? అనే సందేహం కలగ వచ్చు. నిజమే, మనం చెప్పు కున్న వన్నీ సాధనలే. సాధకునికి ఉపాయాలే. కాని, ప్రస్తుతం మనం ఈ శ్లోకంలో గ్రహించేది పూర్వం చెప్పిన వాటి కన్నా విశిష్టమైన విషయం. ***అయం అన్యః గుణాతీత త్వాభ్యుపాయః విశిష్టతరః పూర్వస్మాత్ ఉచ్యతే*** - గుణాతీత స్థితిని పొందటానికి పూర్వం ప్రవచించిన దాని కంటే విశిష్ట తరమైన ఉపాయం ఒకటి చెప్పబడుతూ ఉంది అని దాని అర్థము. ఇది భాష్య వాక్యము. శ్రీ శంకర భాష్య వచనము. కాకపోతే, ఈ వాక్యం కొన్ని ప్రతులలో కనిపిస్తుంది. కొన్ని ప్రతులలో కనిపించదు. రచనా శైలిని బట్టి మాత్రం ఇది ఆచార్యుల వాక్యమే అని విస్పష్ట మవుతూ ఉంది.

'అర్జునా! ఎవడైతే అచంచలమైన భక్తియోగం చేత నన్ను సేవిస్తాడో, వాడు గుణత్రయాన్ని దాటి, మోక్షానికి అర్హు డవుతాడు' అనేది శ్లోకార్థం. గుణాలను అధిగమించి, బ్రహ్మత్వానికి అర్హతను పొందడానికి అచంచల మైన భక్తిని ప్రధానంగా ప్రవచించడం చేత, ఈ సాధన విశిష్టతర మైందని ఆచార్యుల అభిప్రాయం కావచ్చు.

**ఈశ్వర ప్రణిధానము**

భక్తి అంటే భగవంతుని ఆశ్రయించి సేవించడము అని అర్థము. అంటే సగుణ బ్రహ్మోపాసనము ***(భజనం భక్తిః)***. అదే యోగం ***(స ఏవ యోగః)***. అట్టి భక్తియోగంతో పరమేశ్వరుని సేవించే వాడు ***(తేన భక్తియోగేన సేవతే)*** గుణాలను అతిక్రమించి ***(గుణాన్ సమతీత్య)*** బ్రహ్మత్వానికి, లేదా మోక్షానికి అర్హు డవుతున్నాడు ***(బ్రహ్మ భూయాయ మోక్షాయ కల్పతే సమర్థః భవతి ఇత్యర్థః)***.

భక్తి పవిత్ర మైనది. ఉత్కృష్ట మైనది. సరళ మైనది. జ్ఞానపూరిత మైనది. భక్తి లేనిదే ముక్తిని సాధించ డము దుర్లభము. యోగసిద్ధికి కూడా ఈశ్వర భక్తి ప్రధానమని పతంజలి మహర్షి తమ యోగదర్శనంలో అభిప్రాయ పడ్డారు ***(సూ॥ ఈశ్వర ప్రణిధానాద్వా ...*** *సమాధి పాదము ; సూత్రం - 23 )*.

భక్తి ఏదో కాదు; పరమేశ్వరునికి సంబంధించిన జ్ఞానమే భక్తి అనేది తరచుగా మనం చెప్పుకొనే వాక్యం. పరమేశ్వరు డంటే ఏమిటో తెలియని వాడు భక్తి ఎలా చేస్తాడు? చేస్తాడు. కాకపోతే, ఏదోలా చేస్తాడు. ఏదోలా చేస్తే, ఏదేదో చేస్తే పొంద వలసింది ఎలా పొందుతాడు? కనుక, ఈశ్వర జ్ఞానం కలిగిన వాడే ఈశ్వరుని ఆశ్రయించి సేవిస్తాడు. భగవత్కృపకు పాత్రుడై తరిస్తాడు.

మరి, ఈశ్వరుని ఆశ్రయించేది ఎలా? ఈశ్వరుడు ఎక్కడున్నా డని ఆశ్రయించాలి? ఎక్కడో ఉన్నవాడు, ఏ లోకం లోనో ఉండేవాడు భగవంతుడు అయితే, మన జీవిత మంతా అతణ్ణి అన్వేషించే కార్యం లోనే తిరుగుతూ, తరుగుతూ ఉంటుంది గాని కూర్చుని భక్తి చేయడం జరగదు.

చరణము : ***ఆడాడ తిరిగి అలసి పోయాను***
***ఆదుకో స్వామీ!***
***తిరుగుడు తల తిరుగుడు మాని***
***నీ గుడి తిరిగెదను*** ***॥ వినిపించ ॥***





పల్లవి : ***వినిపించ లేదా కోనేటి దేవా***
***కన్నీటి నా గాథ!***
***అడుగు అడుగుకు కొండల స్వామీ***
***దండము గైకొనవా!*** ***॥ వినిపించ ॥***

అని ఆర్తితో నినదించింది చైతన్య గీతం.

భగవంతుడు తిరిగితే దొరికే వాడు కాదు. వెను దిరిగితే దర్శన మిచ్చేవాడు. తిరిగి సాధించ డానికి భగవంతుడు వస్తువు కాదు. వెతికి పట్టుకోవడానికి లేనివాడు కాదు. ఇప్పుడు లేని వాడు కాదు. ఇక్కడ లేని వాడు కాడు. ఇక్కడ లేకుండా భగవంతుడు మరొక చోట ఉండేట ట్లైతే, అతనిని చేరడానికి మనం ప్రయత్నించి ఇక్కడ నుండి వెళ్ళే లోగా అతడు అక్కడ లేకుండా పోవచ్చు. పోవచ్చు ఏమిటి? తప్పకుండా పోతాడు. లేని వాడే అవుతాడు. ఇక్కడ ఉన్నవాడే అక్కడ కూడా ఉండొచ్చు. అంతేగాని, ఇక్కడ లేనివాడు అక్కడ ఉండే అవకాశమే లేదు. కావలసిన వాడు ఇక్కడే దొరికే టప్పుడు, ఇప్పుడే దొరికే టప్పుడు, అలాంటి వాణ్ణి ఆశ్రయించడంలో కష్ట మేముంది? నిజమే. తెలిస్తే కష్టం లేదు. తెలియక పోతే అంతా కష్టమే. తెలియడమే జ్ఞానం. జ్ఞానం కలిగితే భక్తి సులభం. భక్తి సాగితే ముక్తి కరతలామలకం.

అందుకే ముందు పడి అన్వేషించడం కాదు; వెనుదిరిగి దర్శించాలి అంటున్నాను. కదిలిన చోటికే వెళ్ళి కలవాలి. అదే వెను దిరగడ మంటే. ప్రభవించిన చోటికి పయనించడం. నది సముద్రం వైపు సాగినట్లు అందంగా సాగి పోవడము. అదొక అందమైన చలనము. ఆనంద తాండవ నృత్య చలనంలో లయబద్ధంగా సాగిపోయి లయించిపోయే అలౌకిక చలనము. చలించే సాగరం వైపు పయనించే నదీ చలనము. పతి అయిన సాగరుని చేరి నది తన్మయం చెందినట్లు ***(సింధుః సరిద్వల్లభమ్)***, పశుపతిని చేరి భక్తుడు తరించి పోవాలి. అందుకనే, అర్జునా! నన్ను అచంచల భక్తితో సేవించే వాడు ***(మాం చ యోఽ వ్యభిచారేణ భక్తి యోగేన సేవతే)*** బ్రహ్మత్వానికి అర్హు డవుతాడు అంటున్నాడు భగవానుడు.

నన్ను సేవించే వాడు ***(మాం సేవతే)*** అంటున్నాడు. మరి, భగవానుడు ఎక్కడ ఉన్నాడని సేవించాలి? భగవంతుని చిరునామాను శ్రీ శంకరులు భాష్యంలో స్పష్టంగా తెలిపారు. ***మాం ఈశ్వరం నారాయణం సర్వ భూత హృదయాశ్రితం*** - ***మాం*** అంటే నన్ను, సర్వుల హృదయాల లోనే ఉన్న ఈశ్వరుడ నైన నన్ను, నారాయణ మూర్తి నైన నన్ను భక్తితో సేవించే వాడు భక్తుడు. జ్ఞానం కలిగిన భక్తుడు.

భగవంతుడు మన హృదయం లోనే ఉన్నాడు. భగవంతుని ఆశ్రయించాలి అనే భావన ఎక్కడైతే పుడుతూ ఉందో అక్కడే ఉన్నాడు. కదిలే చోటే కరిగి పోవాలి అనే జ్ఞానామృత సందేశాన్ని అక్కడ నుండే అందిస్తున్నాడు. ఈ సందేశాన్ని ఆరాధనా భావంతో అందుకొనే భక్తుడు పరమేశ్వరుని ఆశ్రయిస్తాడు. ఆశ్రయించిన వాడు ఆరాధిస్తాడు. ఆరాధించిన వాడు బ్రహ్మాత్మ స్థితిని పొంద డానికి అర్హు డవుతాడు ***(బ్రహ్మ భూయాయ కల్పతే)***.

భగవంతుడు దేశకాలాదులలో కాకుండా స్వరూపమై ఉన్నందున తాను అనుభవ విషయం కాకుండా జ్ఞానగమ్యమై ఉన్నాడు. విచారించి దర్శించ దగిన వాడే గాని శ్రమించి పొంద వలసిన వాడు కాడు. కనుక, భక్తి అనేది పరమేశ్వరునికి సంబంధించిన జ్ఞానమే అని తెలుసుకున్నాం కాబట్టి భక్తి కలిగితే, ప్రత్యేకించి గుణాలను అతిక్రమించే ప్రయత్నం చేయ నవసరం లేదు. గుణాలు ఉన్నా, గుణాలలో ఉన్నది తానే, గుణాలకు అతీతంగా ఉన్నది కూడా తానే అనే జ్ఞానం కలుగుతుంది. అన్నిటిలో ఉంటూ అన్నిటికీ అతీతంగా ఆకాశము భాసించినట్లు, గుణాలలో ఉంటూ గుణాలకు అతీతంగా భాసించేది ఈశ్వర చైతన్యమే అనే అనుభూతి కలుగుతుంది. ఈశ్వర చైతన్య భావన, లేక బ్రహ్మాకార వృత్తి అఖండముగా బుద్ధిలో నిలవడమే భక్తి.

*మత్కథా శ్రుతి మాత్రేణ మయి సర్వ గుహాశయే ।*
*మనోగతి రవిచ్ఛిన్నా యథా గంగాంభ సోఽ ంబుధౌ ॥*
*అహైతు కృవ్యవహితా యా భక్తిః పురుషోత్తమే ।*
*లక్షణం భక్తి యోగస్య నిర్గుణస్య హ్యుదాహృతమ్ ॥*

'నా కథా శ్రవణము చేసినంత మాత్రముననే, సర్వుల హృదయాలలో చైతన్య స్వరూపముగా భాసిస్తున్న పురుషోత్తముడ నైన నా యందు, గంగాజలము సముద్రములో ప్రవేశించి తద్రూప మైనట్లు, మనస్సు అహైతుకంగా, అవ్యవధానంగా లగ్నం కావడము ఏదైతే ఉందో, అదే నిర్గుణమైన స్వరూప భక్తికి లక్షణము.'

ఈ విధంగా భక్తి వలన బుద్ధిలో అఖండ బ్రహ్మాకార వృత్తి ఏర్పడటం చేత సర్వమును సర్వదా బ్రహ్మాకారముగా దర్శించడం జరుగుతుంది. **సర్వ మిద మహం చ బ్రహ్మైవ** - ఈ సమస్తమైన ప్రపంచము, నేను అంతయు బ్రహ్మమే అనే అనుభూతి కలుగుతుంది. ఈ విధమైన భగవత్ప్రాప్తి రూపమైన బ్రహ్మనిష్ఠ యందు ఎవడైతే స్థిర పడతాడో అట్టివాడు గుణములను, గుణ కార్యములను, గుణ వ్యవహార రూపమైన మాయను అధిగమించి బ్రహ్మానందమును పొందుతాడు.

## అఖండ భక్తి

భక్తి అఖండాకార వృత్తితో పూర్ణ రూప మైనపుడు అన్య భావములు కదిలే అవకాశం లేనందున, ఈ భక్తి అచంచలమై, అవిచ్ఛిన్నమై, జల ప్రవాహం వలె ***(స్రోతసా సమం)*** నిత్యము సాగుతూ ఉంటుంది. దీనినే అవ్యభిచార భక్తి అన్నాడు ప్రస్తుత శ్లోకంలో భగవంతుడు ***(అవ్యభిచారేణ భక్తి యోగేన)***. ఇక్కడ, వ్యభిచార మంటే అన్య వృత్తుల చేత చిత్తము భంగం కావడమే. అలా అన్యవృత్తులు చిత్తమును ఆక్రమించకుండా కేవలం భగవత్ప్రాప్తి రూపమైన అభేద వృత్తి ఉండటమే అవ్యభిచార భక్తి. దీనినే ముఖ్య భక్తి లేక ఏకాంత భక్తి అని అంటారు.

పతనమైన జారస్త్రీ అనేక మంది పురుషుల యందు తన ప్రేమను ఒలకబోస్తూ ఉంటుంది. ఏ పురుషుడు తనను ఆశ్రయిస్తే, తన ప్రేమను అతని పైనే కుమ్మరిస్తుంది. ఈ ప్రేమ వ్యభిచారిణీ భక్తి. అలా కాకుండా, ఒక సాధ్వి యైన స్త్రీ తన మనస్సును పూర్ణంగా భర్త యందే లగ్నం చేసి జీవించడం ఏదైతే ఉందో, అదే అవ్యభిచారమైన ప్రేమ. అవ్యభిచారిణీ భక్తి ***(సాధ్వీ నైజ విభుం)***.

అఖండాకార వృత్తి రూపమైన భక్తి ఏర్పడటం చేత భక్తుడు మాయను దాటుతున్నాడు. ***మా మేవ యే ప్రపద్యన్తే మాయా మేతాం తరన్తి తే*** - అర్జునా! నన్ను ఆశ్రయించిన నా భక్తులు మాయను దాటుతున్నారు అని విజ్ఞానయోగం లోనే భగవంతుడు ప్రబోధించాడు *(7 వ అ - 14 వ శ్లో)*. కనుక భక్తుడు మాయను అవలీలగా, అలవోకగా దాటేస్తాడు. మాయ గుణమయం కనుక మాయను దాటడం అంటే గుణాలను దాటడమే. గుణాతీత స్థితిని అందుకోవడమే. ఈ విధంగా భక్తి బ్రతుకును భగవన్మయం చేస్తుంది. మాయ ఎవరిని ఆశ్రయించుకొని ఉందో, అట్టి అచ్యుతుని అనుగ్రహానికి నోచుకున్న వారిని మాయ ఏం చేస్తుంది? దివ్య కాంతు లీనుతూ, కారాగృహంలో కన్నతల్లికి కన్నయ్య కళ్ళ ముందు సాక్షాత్కరించి నపుడు దేవకీమాత చేతులు జోడించి నమస్కరిస్తూ, తండ్రీ! నువ్వెక్కడ? నే నెక్కడ? జగత్పిత వైన నీకు నేను తల్లిని కావడ మేమిటి? ఇదీ నీ మాయే అనుకుంటాను! నన్ను కృతార్థురాలిని చేయడానికి, మాయను అధీనంలో ఉంచుకొని ఆవిష్కరించిన మహిమే అవి భావిస్తున్నా!





***ఆ॥ విలయకాల మందు విశ్వంబు నీ పెద్ద***
***కడుపులోన దాచు కడిమి మేటి***
***నటుఁడ వీవు, నేడు నా గర్భజుఁడ వౌట***
***పరమపురుష! వేడబంబు గాదె!***

'కన్నయ్యా! ప్రళయ సమయంలో విశ్వమంతా విలీన మైనపుడు, సమస్త జగత్తును నీ కడుపులో దాచుకున్న మేటి నటుడవు నీవు. మాయావివి. అలాంటి పురుషోత్తముడ వైన నువ్వు నా కడుపున పుట్టడమా? ఇంత కన్నా మాయ మరొకటుందా కన్నా?' అని మర్మ మెరుగని మాటను ముకుందుని ముందుంచింది పుణ్య మాత దేవకీ దేవి. మాధవుని మహిమ ముందు మాయను అధిగమించడం ఎంత సులభమో చెప్పకనే చెప్పింది.

పనికి రాని మాయను, పని గట్టుకొని సంసారంలో ముంచేసే మాయను ప్రక్కన ఉంచి, అఖండ వృత్తి రూప భక్తి అనే కార్యాన్ని బుద్ధికి పట్టించిన భక్తులు మాధవుని అనుగ్రహంతో మాయను తప్పక దాటేస్తారు.

***ఉనికి లేనిది జగతి ఉన్న గాని***
***పనికి రానిది సంగతి నీది గాని***
***పూల కవిత లల్లెద నీ పదాల నీడ లోన***
***నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా!***

అని చిన్నికృష్ణ శతకంలో ఒక వెన్నముద్ద.

*గుణాలను గుణ కార్యాలను భగవత్కృప చేత భక్తుడు అధిగమించ వచ్చు. అంతమాత్రాన 'నేనే బ్రహ్మము' అనే మోక్షము ఎలా ప్రాప్తిస్తుంది? చదవండి!*

బ్రహ్మణో హి ప్రతిష్ఠాఽహ మమృత స్యావ్యయస్య చ ।
శాశ్వతస్య చ ధర్మస్య సుఖ స్యైకాన్తికస్య చ ॥ 27

*బ్రహ్మణః-హి-ప్రతిష్ఠా-అహం-అమృతస్య-అవ్యయస్య-చ*
*శాశ్వతస్య-చ-ధర్మస్య-సుఖస్య-ఏకాంతికస్య-చ*

| | | | |
|---|---|---|---|
| అహం | = నేను | ధర్మస్య చ | = ధర్మమునకు |
| అమృతస్య | = అమృత స్వరూపమైన | ఏకాంతికస్య చ | = అచంచలమైన |
| అవ్యయస్య చ | = అవ్యయమైన | సుఖస్య చ | = సుఖమునకు |
| బ్రహ్మణః | = బ్రహ్మమునకు | ప్రతిష్ఠా హి | = ఆశ్రయుడను |
| శాశ్వతస్య | = శాశ్వతమైన | | |

**అర్జునా! అమృత స్వరూపుడు, అవ్యయ రూపుడు, శాశ్వత ధర్మ స్వరూపుడు, చలించని సుఖ రూపుడైన బ్రహ్మమునకు ఆశ్రయము నేనే.**

### వ్యాఖ్య

అచంచలమైన భక్తియోగంతో ***(అవ్యభిచారేణ భక్తి యోగేన)*** ఎవడైతే భగవంతుణ్ణి సేవిస్తాడో, వాడు గుణాలను అతిక్రమించి బ్రహ్మత్వమును పొందడానికి సమర్థు డగుచున్నాడు **(బ్రహ్మ భూయాయ కల్పతే)** అని పూర్వ శ్లోకంలో చెప్పబడింది. భక్తి చేసినంత మాత్రాన బ్రహ్మభూతు డెలా అవుతాడు? అనే సందేహం అక్కడ కలుగుతుంది. ఈ విధమైన సంశయాన్ని నివృత్తి చేయడానికే ఈ అధ్యాయాంత శ్లోకము. నేను ***(అహం)***

బ్రహ్మకు ప్రతిష్ఠను కావడం చేత, బ్రహ్మ నా కన్నా భిన్నం కాక పోవడం చేత, భక్తి చేత గుణాలను అధిగమించిన వాడు బ్రహ్మత్వాన్ని పొందడానికి అర్హు డగుచున్నాడు అనేది ఈ శ్లోకం అందిస్తున్న సంశయ నివృత్తి.

**'అహం' శబ్దార్థము**

భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ తనను 'అహం' శబ్దంతో అనేక చోట్ల నిర్దేశిస్తాడు. ఆయా సందర్భాలను బట్టి 'అహం' శబ్దమును కొన్ని చోట్ల కేవలం నిర్గుణ స్వరూపమైన పరబ్రహ్మముగా, కొన్నిచోట్ల వాసుదేవ నామంతో తెలిసే సగుణ బ్రహ్మముగా ***( అహం వాసుదేవాఖ్యం పరంబ్రహ్మ )*** గ్రహించవలసి ఉంటుంది. ప్రస్తుత శ్లోకంలో ***అహం*** -నేను ***బ్రహ్మణః*** - బ్రహ్మమునకు ప్రతిష్ఠను ***( బ్రహ్మణః ప్రతిష్ఠా )*** అని చెప్పడం జరిగింది. మరి, ఈ సందర్భంలో 'అహం' శబ్దార్థ మేమిటి? 'బ్రహ్మ' శబ్దార్థ మేమిటి?

శ్రీకృష్ణుని వాసుదేవ పరబ్రహ్మముగా చూచి నపుడు 'అహం' శబ్దార్థమును 'ప్రత్యగాత్మ' అని గ్రహించ వలసి ఉంటుంది. కారణం, బ్రహ్మమును అన్యంగా చెప్పి, 'బ్రహ్మమునకు నేను ప్రతిష్ఠను' అని చెప్పడం చేత. బ్రహ్మమును ప్రత్యేకంగా నిర్గుణ పరబ్రహ్మముగా చెప్పడం జరిగింది కనుక, అట్టి నిర్గుణ బ్రహ్మమునకు ప్రతిష్ఠగా చెప్పబడిన 'అహం' శబ్దమునకు అర్థం నిర్గుణ బ్రహ్మము అని చెప్పడం సాధ్య పడదు.

'ప్రతిష్ఠ' అంటే నిలిచే స్థానము, లేదా ఆశ్రయము అని అర్థము. 'దీని యందు ఆశ్రయమును కలిగి ఉంది' అనే వ్యుత్పత్తి చేత 'ప్రతిష్ఠ' అంటే 'నిలిచే స్థానం' అని అర్థము ***( ప్రతితిష్ఠతి అస్మిన్ ఇతి ప్రతిష్ఠా ).*** కనుక, 'అహం' శబ్దముతో తనను భగవద్గీతలో శ్రీకృష్ణుడు రెండు విధాలుగా నిర్దేశించి చెప్పుకోవడం చేత, ఆ రెండు కోణాల నుండి రెండు విధాలుగా ఇక్కడ కూడా 'అహం' శబ్దార్థమును చెప్పవలసింది ఉంటుంది. అంతేకాదు. 'అహం' బ్రహ్మమునకు ప్రతిష్ఠ అనడం వల్ల 'బ్రహ్మ' శబ్దార్థాన్ని కూడా వాటికి అనుగుణం గానే రెండు విధాలుగా చెప్పవలసి ఉంటుంది. అంతకన్నా ముఖ్యంగా, ***బ్రహ్మ భూయాయ కల్పతే***- బ్రహ్మత్వమును పొందుటకు అర్హు డగుచున్నాడు అనేది ఎలాగో కూడా నిర్ధారణ చేయవలసి ఉంటుంది ***( కుతః ఏతత్ ? ).*** కనుక ఈ శ్లోకాన్ని ఆచార్యుల వారి భాష్యానుసారం రెండు కోణాల నుండి వివరించే ప్రయత్నం చేస్తాను.

**అహం ప్రత్యగాత్మా**

మొదటి అర్థాన్ని బట్టి 'అహం' పదానికి ప్రత్యగాత్మ అని అర్థం. ఇలా చూచినపుడు 'నేను (అహం) బ్రహ్మమునకు ప్రతిష్ఠను' అనే అర్థం వస్తుంది. బ్రహ్మము, లేదా పరమాత్మకు ప్రత్యగాత్మ ప్రతిష్ఠ, లేదా ఆశ్రయము అని అర్థం ***(బ్రహ్మణః పరమాత్మనః ప్రతిష్ఠా అహం ప్రత్యగాత్మా).*** ఎప్పుడైతే ప్రత్యగాత్మ పరమాత్మకు ప్రతిష్ఠ అని చెప్పబడిందో, ఇక ఆ తరువాత, ప్రత్యగాత్మయే పరమాత్మ అని నిర్ధారణ చేయవలసి ఉంటుంది.

అదలా ప్రక్కన పెడితే, ప్రత్యగాత్మ 'బ్రహ్మ'కు ప్రతిష్ఠ అన్నప్పుడు, ప్రత్యగాత్మ ఏ 'బ్రహ్మ'కు ప్రతిష్ఠ? అనే ప్రశ్న ఉదయిస్తుంది ***(కీదృశస్య బ్రహ్మణః?).*** దానికి సమాధానంగా అమృతము, అవ్యయము, శాశ్వతము, ధర్మము లేక జ్ఞానయోగ రూప ధర్మము, సుఖ స్వరూపము, నిత్యము అయిన బ్రహ్మమునకు, లేదా పరమాత్మకు ప్రత్యగాత్మ యైన 'అహం' ప్రతిష్ఠ అనే విషయం శ్లోకం లోనే ఉంది.

పరబ్రహ్మము లేదా పరమాత్మ ఆనంద, అమృతాది స్వభావం కలవాడు కావడం చేత, అట్టి పరమాత్మకు ప్రత్యగాత్మ ప్రతిష్ఠ అని ఎప్పుడైతే చెప్పబడిందో, అప్పుడు సమ్యక్ జ్ఞానం చేత ప్రత్యగాత్మ పరమాత్మయే అనేది నిశ్చయ మవుతుంది ***( ఆనంద రూపస్య , అమృతాది స్వభావస్య పరబ్రహ్మణః ప్రత్యగాత్మా ప్రతిష్ఠా! సమ్యక్ జ్ఞానేన పరమాత్మ తయా నిశ్చీయతే).*** ప్రత్యగాత్మ పరమాత్మ కన్నా భిన్నుడు కాడు కనుక, అచంచల భక్తి చేత గుణాతీతుడైన ప్రత్యగాత్మ బ్రహ్మత్వమును, లేదా పరమాత్మత్వమును పొందడానికి అర్హు డగుచున్నాడు అని





చెప్పడం జరిగింది ***( తదేతత్ 'బ్రహ్మ భూయాయ కల్పతే' ఇత్యుక్తమ్ ).*** పూర్వ శ్లోకంలో 'మాం' అని తనను తాను నిర్దేశించుకొనిన గీతాచార్యుడు, ప్రస్తుత శ్లోకంలో 'అహం' అని నిర్దేశించు కుంటున్నాడు. 'మాం' అంటే సర్వభూత హృదయాశ్రితు డైన ఈశ్వరుడు లేదా పరమేశ్వరుడు అని అర్థం చెప్పుకున్నాం. ఇక్కడ 'అహం' అంటే ప్రత్యగాత్మ అని అర్థం చేసుకున్నాం. కనుక, శ్రీకృష్ణుని దివ్య రూపంలో శోభించే ప్రత్యగాత్మ బ్రహ్మకు ప్రతిష్ఠ అని తేలిపోయింది. కనుక, 'అచంచల భక్తి భావంతో శ్రీకృష్ణుని సేవిస్తే, గుణాలను అధిగమించి బ్రహ్మ భావమును పొందడం జరుగుతుంది' అని ఈ శ్లోకానికి మూలమైన బీజ ప్రశ్నకు సమాధానం చెప్పినట్లైంది. కాని, భక్తి చేత గుణాలను అధిగమించి ఉండవచ్చు. దానిని అర్థం చేసుకోగలం. అంతమాత్రాన అది బ్రహ్మ అభిన్నత్వ జ్ఞానానికి ఎలా హేతువైంది? అనే సంశయం మాత్రం ఇంకా స్పష్టంగా తొలగినట్లు లేదు.

బ్రహ్మము మాయోపాధిని పొంది ఈశ్వరత్వముతో శోభిస్తాడని ముందే విస్తారంగా చెప్పుకొని ఉన్నాం. మాయోపాధి కలవాడే ఈశ్వరుడు. ఈశ్వరునికి ఈశ్వరత్వం ఉంటుంది. కనుకనే అతడు సర్వజ్ఞుడు; సర్వాంతర్యామి; సర్వశక్తిమంతుడు. మాయావి అయిన ఈశ్వరుడు మాయాశక్తితో కూడి భక్తులను అనుగ్రహించ డానికి అనేక రూపాలను ధరిస్తాడు.

***అనేన జీవేనాత్మనా అనుప్రవిశ్య నామరూపే వ్యాకరణాని*** - బ్రహ్మమే సర్వ జీవుల యందు ప్రవేశించి, నామరూపాలను వ్యక్తం చేస్తూ ఉపాధుల యందు జ్ఞాతగా తెలుస్తూ ఉంది అని శ్రుతి ప్రమాణము. కనుక, ఘటోపాధి భంగం కాగానే ఘటాకాశమునకు మహాకాశత్వము ప్రాప్తించినట్లు, జ్ఞాత యైన ఆత్మవిదునకు ఉపాధి ఉపరమించ గానే, బ్రహ్మభావము ఉపపన్న మవుతూ ఉంది. జ్ఞాతకు బ్రహ్మమునకు శ్రుతి అభేదమును చెప్పినందున, బ్రహ్మమునకు ప్రతిష్ఠగా తెలుస్తున్న ప్రత్యగాత్మకు బ్రహ్మభావము యుక్తమే అని గ్రహించ వలసి ఉంటుంది. శ్రీకృష్ణుడు అనే ప్రత్యగాత్మ ఈశ్వర శక్తియే. ఈశ్వరుడు, ఈశ్వర శక్తి వేరు కానందున ఈశ్వరశక్తి యైన ప్రత్యగాత్మ బ్రహ్మమే ***( శక్తి శక్తిమతోః అనన్యత్వాత్ ఇత్యభిప్రాయః ).*** ఈ విధంగా 'అహం' శబ్దానికి ప్రత్యగాత్మ అని, 'బ్రహ్మ' శబ్దానికి శుద్ధ బ్రహ్మ మనే అర్థాలను గ్రహించి వ్యాఖ్యానించడం సమంజసము. శ్రుతి సమ్మతము.

**అహం పరమాత్మా**

'అహం' అంటే పరమాత్మ, లేక పరబ్రహ్మము. నిరుపాధిక సత్తా స్వరూపము. నిర్గుణ పరబ్రహ్మము అని అర్థం. 'బ్రహ్మ' శబ్దానికి సవికల్పకము, సాకారము అయిన సగుణ బ్రహ్మము అని అర్థము. కనుక, సగుణ బ్రహ్మము నకు నిర్గుణ పరబ్రహ్మమైన నేను (అహం) ప్రతిష్ఠ, లేదా ఆశ్రయము ***( బ్రహ్మ శబ్ద వాచ్యత్వాత్ సవికల్పకం బ్రహ్మ , తస్య బ్రహ్మణః నిర్వికల్పకః అహమేవ . న అన్యః . ప్రతిష్ఠా ఆశ్రయః )*** అని అర్థము. కనుక సవికార సోపాధిక బ్రహ్మమునకు నిరుపాధిక మైన నేను (అహం) ఆశ్రయము. ఇది రెండవ అర్థము. మరి సవికార బ్రహ్మము ఎలాంటిది?

సోపాధిక బ్రహ్మము, లేదా సగుణ బ్రహ్మము అమృతము. అంటే మరణము లేనిది ***( అమృతస్య అమరణ ధర్మకస్య ).*** అవ్యయము అంటే వ్యయ రహిత మైనది ***( అవ్యయస్య వ్యయ రహితస్య ).*** శాశ్వత మైనది. అంటే నిత్యమైనది ***( శాశ్వతస్య నిత్యస్య ).*** ధర్మ మైనది. అంటే జ్ఞాన నిష్ఠా రూపమైనది ***( ధర్మస్య జ్ఞాన నిష్ఠా లక్షణస్య ).*** అంటే, అనంతానంద స్వరూపము ***( సుఖస్య తజ్జనితస్య ఐకాన్తికస్య ప్రతిష్ఠా అహమ్ )*** అయిన సవికల్పక బ్రహ్మమునకు నిర్వికల్పక బ్రహ్మము నైన నేనే ***( అహమేవ )*** ఆశ్రయము ***(ప్రతిష్ఠా)*** అని అర్థము. అవ్యభిచరితమైన సుఖ స్వరూపము.

కార్య రూపంలో ఏది గోచరించినా, దానికి కార్యారంభము నందు సత్తామాత్రమైన కారణము ఉండి తీరాలి. కార్యము ఏదైనా అది కారణము నందే సుప్రతిష్ఠమై ఉంటుంది. అంటే కారణమునే ఆశ్రయముగా కలిగి ఉంటుంది. కారణ సత్తా కన్నా వేరుగా కార్య సత్తా ఉండ లేదు.

ప్రపంచము కార్య రూపంలో తెలుస్తూ ఉంది. కార్య రూపమైన ఈ మాయా ప్రపంచానికి ఈశ్వరుడైన సగుణ బ్రహ్మము మాయావిగా శోభిస్తూ, మాయను తన అధీనంలో ఉంచుకొని, ఈశ్వరత్వంతో సృష్టి కార్యాన్ని సాగిస్తున్నాడు.

కార్యమైన దృశ్యమాన జగదుత్పత్తికి ముందు కారణ రూపంలో సద్రూప చైతన్యం ఏకమై, అద్వయమై భాసిస్తూ ఉండింది. అది ఏకము, అద్వయము కనుక నిర్గుణము. కార్యరూపమైన జగత్తుకు, కార్యరూప జగద్వ్యాపారాలను సాగించే ఈశ్వరునకు కార్యారంభంలో సద్రూపము, నిర్గుణము, అద్వితీయమైన బ్రహ్మమే ఉండింది. సాకార ప్రపంచానికి, సగుణ బ్రహ్మమునకు నిర్గుణ నిరాకార పరబ్రహ్మమే ఆశ్రయంగా ఉంది ***(సగుణ బ్రహ్మణః అహం నిరాకార పరమాత్మా ప్రతిష్ఠా)*** అనేది రెండవ అర్థము. అచంచలమైన భక్తియోగము చేత సవికల్పక బ్రహ్మమును పొందిన భక్తుడు, కార్యమైన సగుణ బ్రహ్మము తన కాశ్రయమైన నిర్గుణ బ్రహ్మమునకు, లేదా పరమాత్మకు అన్యం కానందున, భక్తి చేత గుణములను అధిగమించిన భక్తుడు బ్రహ్మత్వమునకు అర్హు డగుటయే గాక బ్రహ్మమే అగుచున్నాడు.

***శ్లో॥ సర్వేషా మేవ వస్తూనాం భావార్థో భవతి స్థితః।***
***తస్యాపి భగవాన్ కృష్ణః కి మత ద్వస్తు రూప్యతామ్ ॥***

సమస్తములైన కార్య వస్తువులకు భావార్థమైన పరమార్థ వస్తువు సత్తా రూపంగా ఉంది. కార్య సత్తా కారణ సత్తా కన్నా వేరుగా ఉండలేదు కదా! మరి అట్టి సత్తా రూపుడైన శ్రీకృష్ణ పరమాత్మ కంటే అన్యమైన పారమార్థిక వస్తువు ఏముంది? ***( కిం అతత్ వస్తు ? ).*** కనుక శ్రీకృష్ణుడే 'అహం' శబ్దము చేత సర్వమునకు ప్రతిష్ఠగా శోభిస్తున్నాడు అని భాగవతంలో శుక యోగీంద్రుని అమృత భాషణము.

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే
గుణత్రయ విభాగయోగో నామ చతుర్దశోఽధ్యాయః

**ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు గుణత్రయ విభాగయోగ మనే పద్నాల్గవ అధ్యాయము.**



# చైతన్య భగవద్గీత

## అథ పంచదశోఽధ్యాయః - పదిహేనవ అధ్యాయము

## పురుషోత్తమ ప్రాప్తి యోగః - పురుషోత్తమ ప్రాప్తి యోగము

### సందర్భము

***ఫలమత ఉపపత్తేః -*** కర్మఫలము పరమేశ్వరుని వల్లనే కలుగుతుంది *( బ్రహ్మసూత్రం ; 3-2-38 ).* కర్మలు ఆచరించే వారికి కర్మఫలము, జ్ఞానవంతులకు జ్ఞానఫలము పరమేశ్వరుని వల్లనే కలుగుతూ ఉన్నాయి. ఫలప్రదాత భగవంతుడు కావడం చేత, ఎవరైతే అచంచలమైన భక్తితో పరమేశ్వరుని సేవిస్తారో, వారు భగవదనుగ్రహం చేత బ్రహ్మత్వమునకు అర్హులై మోక్షాన్ని పొందుతారు అని ప్రవచించి పూర్వాధ్యాయాన్ని ముగించాడు గీతాచార్యుడు.

జీవునికి భక్తియోగము వలన బ్రహ్మభావము ఎలా ఏర్పడుతుంది? అనే శంకను నివారిస్తూ, తానే బ్రహ్మమునకు ఆశ్రయము ***(బ్రహ్మణః ప్రతిష్ఠా అహ మేవ)*** అని కూడా చెప్పడం జరిగింది.

గుణయుతుడైన వాడు జీవుడై నరు డయ్యాడు. గుణాతీతుడైన వాడు దేవుడై నారాయణు డవుతాడు. ప్రకృతి తాదాత్మ్యంతో జీవుడు పురుషు డయ్యాడు. గుణయుతమైన ప్రకృతి నుండి విడిపడి పురుషుడైన జీవుడు పురుషోత్తముడు కావాలి. మానవుడు మాధవుడు కావాలి. బద్ధుడు ముక్తుడు కావాలి.

సత్త్వగుణ ప్రధానుడైన సాత్త్వికుడు జ్ఞాన ప్రభావంతో అంతర్ముఖుడు. రజోగుణ ప్రధానుడైన రాజసుడు కర్మ ప్రవృత్తి చేత బహిర్ముఖుడు. తమోగుణ ప్రధానుడైన తామసుడు మోహ ప్రభావం చేత నిర్ముఖుడు. ఈ త్రిగుణాలను భగవ దనుగ్రహం చేత అధిగమించిన వాడు భగవన్ముఖుడు. గుణాతీతుడు. ఇలా గుణాతీతులైన వారు మోక్షాన్ని పొందుతారు ***( మాం ఈశ్వరం యే సేవన్తే తే మదనుగ్రహాత్ జ్ఞాన ప్రాప్తి క్రమేణ గుణాతీతాః మోక్షమ్ గచ్ఛన్తి ! ).*** పరమేశ్వరుని కృప వలన భక్తుడు గుణములను అధిగమించి, జ్ఞానప్రాప్తి క్రమంలో ముక్తిని పొందేటప్పుడు, ఇక పరమాత్మ తత్త్వమును చక్కగా గ్రహించిన వారి విషయం ప్రత్యేకించి చెప్పేదేముంటుంది? అని వ్యాఖ్యానించారు పంచదశాధ్యాయ భాష్య పీఠికలో శ్రీ శంకరాచార్యస్వామి ***(కిము వక్తవ్యమ్ ఆత్మనః తత్త్వ మేవ సమ్యక్ విజానన్తః ).*** ఈ కారణం చేత ఆత్మతత్త్వాన్ని వివరించ డానికి భగవానుడు ఈ పదిహేనవ అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నాడు.

### అధ్యాయ నామ వైభవము

ఇది పదిహేనవ అధ్యాయము. 'పురుషోత్తమ ప్రాప్తి యోగము' అని అధ్యాయ నామము. ఈ నామంలో నాలుగు పదాలు ఉన్నాయి. ఒకటి పురుషుడు; రెండు ఉత్తమము; మూడు ప్రాప్తి ; నాలుగు యోగము. ఈ నాలుగు పదాలు కలిసి 'పురుషోత్తమ ప్రాప్తి యోగము' అయింది. 'పురుషోత్తమ' అనే దానిని సమాస పదంగా గ్రహిస్తే, అధ్యాయ నామం మూడు పదాలతో ఉంటుంది.

పురుషుడు అంటే సాధారణంగా మగవాడు అనే అర్థాన్ని గ్రహిస్తూ ఉంటాము. కాని, 'పురుషః' శబ్దార్థాన్ని గ్రహిస్తే, అది లింగభేదం లేకుండా సర్వ మానవులకు వర్తిస్తుంది.

కార్య రూపంలో ఏది గోచరించినా, దానికి కార్యారంభము నందు సత్తామాత్రమైన కారణము ఉండి తీరాలి. కార్యము ఏదైనా అది కారణము నందే సుప్రతిష్ఠమై ఉంటుంది. అంటే కారణమునే ఆశ్రయముగా కలిగి ఉంటుంది. కారణ సత్తా కన్నా వేరుగా కార్య సత్తా ఉండ లేదు.

ప్రపంచము కార్య రూపంలో తెలుస్తూ ఉంది. కార్య రూపమైన ఈ మాయా ప్రపంచానికి ఈశ్వరుడైన సగుణ బ్రహ్మము మాయావిగా శోభిస్తూ, మాయను తన అధీనంలో ఉంచుకొని, ఈశ్వరత్వంతో సృష్టి కార్యాన్ని సాగిస్తున్నాడు.

కార్యమైన దృశ్యమాన జగదుత్పత్తికి ముందు కారణ రూపంలో సద్రూప చైతన్యం ఏకమై, అద్వయమై భాసిస్తూ ఉండింది. అది ఏకము, అద్వయము కనుక నిర్గుణము. కార్యరూపమైన జగత్తుకు, కార్యరూప జగ ద్వ్యాపారాలను సాగించే ఈశ్వరునకు కార్యారంభంలో సద్రూపము, నిర్గుణము, అద్వితీయమైన బ్రహ్మమే ఉండింది. సాకార ప్రపంచానికి, సగుణ బ్రహ్మమునకు నిర్గుణ నిరాకార పరబ్రహ్మమే ఆశ్రయంగా ఉంది ***(సగుణ బ్రహ్మణః అహం నిరాకార పరమాత్మా ప్రతిష్ఠా)*** అనేది రెండవ అర్థము. అచంచలమైన భక్తియోగము చేత సవికల్పక బ్రహ్మమును పొందిన భక్తుడు, కార్యమైన సగుణ బ్రహ్మము తన కాశ్రయమైన నిర్గుణ బ్రహ్మ మునకు, లేదా పరమాత్మకు అన్యం కానందున, భక్తి చేత గుణములను అధిగమించిన భక్తుడు బ్రహ్మత్వ మునకు అర్హు డగుటయే గాక బ్రహ్మమే అగుచున్నాడు.

శ్లో॥ *సర్వేషా మేవ వస్తూనాం భావార్థో భవతి స్థితః ।*
*తస్యాపి భగవాన్ కృష్ణః కి మత ద్వస్తు రూప్యతామ్ ॥*

సమస్తములైన కార్య వస్తువులకు భావార్థమైన పరమార్థ వస్తువు సత్తా రూపంగా ఉంది. కార్య సత్తా కారణ సత్తా కన్నా వేరుగా ఉండలేదు కదా! మరి అట్టి సత్తా రూపుడైన శ్రీకృష్ణ పరమాత్మ కంటే అన్యమైన పారమార్థిక వస్తువు ఏముంది? ***( కిం అతత్ వస్తు ? )***. కనుక శ్రీకృష్ణుడే 'అహం' శబ్దము చేత సర్వమునకు ప్రతిష్ఠగా శోభిస్తున్నాడు అని భాగవతంలో శుక యోగీంద్రుని అమృత భాషణము.

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే
గుణత్రయ విభాగయోగో నామ చతుర్దశోఽధ్యాయః

**ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు గుణత్రయ విభాగయోగ మనే పద్నాల్గవ అధ్యాయము.**



# చైతన్య భగవద్గీత

## అథ పంచదశోఽధ్యాయః - పదిహేనవ అధ్యాయము

## పురుషోత్తమ ప్రాప్తి యోగః - పురుషోత్తమ ప్రాప్తి యోగము

### సందర్భము

***ఫలమత ఉపపత్తేః*** - కర్మఫలము పరమేశ్వరుని వల్లనే కలుగుతుంది ( *బ్రహ్మసూత్రం ; 3-2-38* ). కర్మలు ఆచరించే వారికి కర్మఫలము, జ్ఞానవంతులకు జ్ఞానఫలము పరమేశ్వరుని వల్లనే కలుగుతూ ఉన్నాయి. ఫలప్రదాత భగవంతుడు కావడం చేత, ఎవ్వరైతే అచంచలమైన భక్తితో పరమేశ్వరుని సేవిస్తారో, వారు భగవ దనుగ్రహం చేత బ్రహ్మత్వమునకు అర్హులై మోక్షాన్ని పొందుతారు అని ప్రవచించి పూర్వాధ్యాయాన్ని ముగించాడు గీతాచార్యుడు.

జీవునికి భక్తియోగము వలన బ్రహ్మభావము ఎలా ఏర్పడుతుంది? అనే శంకను నివారిస్తూ, తానే బ్రహ్మమునకు ఆశ్రయము ***( బ్రహ్మణః ప్రతిష్ఠా అహ మేవ )*** అని కూడా చెప్పడం జరిగింది.

గుణయుతుడైన వాడు జీవుడై నరు డయ్యాడు. గుణాతీతుడైన వాడు దేవుడై నారాయణు డవుతాడు. ప్రకృతి తాదాత్మ్యంతో జీవుడు పురుషు డయ్యాడు. గుణయుతమైన ప్రకృతి నుండి విడిపడి పురుషుడైన జీవుడు పురుషోత్తముడు కావాలి. మానవుడు మాధవుడు కావాలి. బద్ధుడు ముక్తుడు కావాలి.

సత్త్వగుణ ప్రధానుడైన సాత్త్వికుడు జ్ఞాన ప్రభావంతో అంతర్ముఖుడు. రజోగుణ ప్రధానుడైన రాజసుడు కర్మ ప్రవృత్తి చేత బహిర్ముఖుడు. తమోగుణ ప్రధానుడైన తామసుడు మోహ ప్రభావం చేత నిర్ముఖుడు. ఈ త్రిగుణాలను భగవ దనుగ్రహం చేత అధిగమించిన వాడు భగవన్ముఖుడు. గుణాతీతుడు. ఇలా గుణాతీతు లైన వారు మోక్షాన్ని పొందుతారు ***( మాం ఈశ్వరం యే సేవన్తే తే మదనుగ్రహాత్ జ్ఞాన ప్రాప్తి క్రమేణ గుణాతీతాః మోక్షమ్ గచ్ఛన్తి ! )***. పరమేశ్వరుని కృప వలన భక్తుడు గుణములను అధిగమించి, జ్ఞానప్రాప్తి క్రమంలో ముక్తిని పొందేటప్పుడు, ఇక పరమాత్మ తత్త్వమును చక్కగా గ్రహించిన వారి విషయం ప్రత్యేకించి చెప్పే దేముంటుంది? అని వ్యాఖ్యానించారు పంచదశాధ్యాయ భాష్య పీఠికలో శ్రీ శంకరాచార్యస్వామి ***( కిము వక్తవ్యమ్ ఆత్మనః తత్త్వ మేవ సమ్యక్ విజానన్తః )***. ఈ కారణం చేత ఆత్మతత్త్వాన్ని వివరించ డానికి భగవానుడు ఈ పదిహేనవ అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నాడు.

### అధ్యాయ నామ వైభవము

ఇది పదిహేనవ అధ్యాయము. 'పురుషోత్తమ ప్రాప్తి యోగము' అని అధ్యాయ నామము. ఈ నామంలో నాలుగు పదాలు ఉన్నాయి. ఒకటి పురుషుడు; రెండు ఉత్తమము; మూడు ప్రాప్తి ; నాలుగు యోగము. ఈ నాలుగు పదాలు కలిసి 'పురుషోత్తమ ప్రాప్తి యోగము' అయింది. 'పురుషోత్తమ' అనే దానిని సమాస పదంగా గ్రహిస్తే, అధ్యాయ నామం మూడు పదాలతో ఉంటుంది.

పురుషుడు అంటే సాధారణంగా మగవాడు అనే అర్థాన్ని గ్రహిస్తూ ఉంటాము. కాని, 'పురుషః' శబ్దార్థాన్ని గ్రహిస్తే, అది లింగభేదం లేకుండా సర్వ మానవులకు వర్తిస్తుంది.

'పురం' అంటే శరీరము అని అర్థము. శరీరము నందు శయనించి ఉండేవాడు 'పురుషః' (*పురం శరీరం, తస్మిన్ శేతే ఇతి పురుషః*). అంటే, జీవుడు; క్షేత్రజ్ఞుడు. మరి, పురం రాక ముందు పురుషుడు లేడా? నిన్న లేకుండా నేడు వచ్చిన వాడైతే, నేడు ఉండినా రేపు లేకుండా పోయేవాడు అవుతాడు కదా! అలాంటి వాడు పురం లాంటి వాడు అవుతాడే గాని పురుషు డెలా అవుతాడు? కనుక పురంలో, అంటే దేహంలో ఎవడైతే శయనించి ఉన్నాడో, వాడు పురానికి పూర్వము కూడా ఉన్నవాడే. ఆ మాట కొస్తే సృష్టికి పూర్వమే ఉన్నవాడు (*పురా ఏవ ఆసీత్ ఇతి పురుషః*).

పురంలో, అంటే దేహంలో పురుషుడు ఎక్కడ శయనించి ఉన్నాడు? ఊపిరితిత్తుల లోనా? కాలేయము లోనా? లేక హృదయము లోనా? ధ్యాన నిమిత్తం ఉపలబ్ధి స్థానంగా హృదయంలో ఉన్నాడు అని చెప్పుకున్నా (*హృదయ దేశే తిష్ఠతి*). వాస్తవానికి పురుషుడు పురము నంతా పూరించే ఉన్నాడు. ఘటములో ఘటాకాశము ఎక్కడుంది అంటే ఏమి చెప్పగలం? ఘట మంతా పూరించి ఉంది అంటాము. పురుషుడు కూడా దేహ మనే పురంలో ఉన్నాడు అంటే, దేహ మంతా పూరించి ఉన్నాడు అని అర్థము (*పూరయతీతి పురుషః*). అతడే క్షేత్రజ్ఞుడు. అతడే ఆత్మ. అతడిని మించిన ఉత్తమమైన వస్తువు మరొకటి లేదు. అతడే ఉత్కృష్టమైన వాడు.

**పురుషాత్ న పరం కించిత్ సా కాష్ఠా సా పరాగతిః ।**

పురుషుని కంటే ఉత్కృష్ట మైనది ఏదీ లేదు. అదే అన్నిటికీ పరాకాష్ఠ; అదే పరమ గమ్యము అని కఠోపనిషత్ *(1 - 3- 11).*

ఘటంలో ఉంటూ ఘటాన్ని పూరించి ఉన్న ఘటాకాశము ఘటానికి పరిమితమా? ఆకాశం విశాల మైంది. అది కుండకే పరిమితమై ఉండ లేదు. ఆకాశాన్ని కుండ పరిమితం చేయ లేదు. ఆ మాట కొస్తే కుండే ఆకాశంలో తయారైంది. ఆకాశం లోనే ఉంది. కుండలో ఉన్న ఘటాకాశమే కుండకు బాహ్యంలో మహాకాశంగా ఉంది. ఘటాకాశంగా ఉన్నప్పుడు కూడా ఆకాశం విశాలాకాశం గానే ఉంది. మహాకాశం గానే ఉంది.

మరి పురంలో, అంటే శరీరంలో ఉండే పురుషుడు పురానికి పరిమితుడా? కానే కాదు. ఘటాకాశము ఎలాగైతే మహాకాశము అయ్యే ఉందో, అలాగే దేహంలో చైతన్యాత్మగా శోభించే పురుషుడు సర్వత్ర నిండి నిబిడీ కృతమైన సద్రూప చైతన్యము అయ్యే ఉన్నాడు. దేహాన్ని పూరించిన పురుషుడే విశ్వాన్ని పూరించి ఉన్న పురుషోత్తముడు. కుండ ఉత్పత్తికి ముందు కూడా ఆకాశము ఉండనే ఉంది. అలాగే పురం రాక ముందు కూడా పురుషుడు ఉండనే ఉన్నాడు. కుండ పగిలినా ఆకాశం పారి పోదు. పురం రాలిపోయినా, కాలిపోయినా పురుషుడు నశించడు.

ఈ జగత్తు ఆవిర్భవించక ముందు ఏ సద్రూప చైతన్యము అద్వితీయంగా ఉండిందో (*సదేవ సౌమ్య ఇదమగ్ర ఆసీత్ ఏక మేవ అద్వితీయం బ్రహ్మ* - ఛాందోగ్యోపనిషత్తు ) అది జగత్కార్యం జరిగినా ఉంది. ప్రళయంలో జగత్తు విలీనమై పోయినా, ఆ సద్రూప చైతన్యము దివ్యమై అద్వితీయంగా శోభిస్తూనే ఉంటుంది. అదే పరబ్రహ్మము. అదే పురుషోత్తమ స్వరూపము.

చైతన్యము ఒక్కటే గాని రెండు కాదు. పురుష చైతన్యము, పురుషోత్తమ చైతన్యము అని రెండు లేవు. ఘటాకాశము, మహాకాశము అని వ్యావహారికంగా మనం చెప్పుకుంటున్నా, వాస్తవానికి ఆకాశము ఒక్కటే. పురుష చైతన్యము, ఈశ్వర చైతన్యము అని రెండుగా మనం భావించినా, జీవ చైతన్యము, ఈశ్వర చైతన్యము అని రెండు లేవు. చైతన్యము ఒక్కటే. దేహంలో, అంటే పురంలో ఉన్నప్పుడు ఉపాధి స్థాయి నుండి సోపాధిక





చైతన్యము అంటున్నాము. దానినే ఉపాధి వినిర్ముక్తమైనపుడు, నిరుపాధిక చైతన్యము అంటాము. అఖండము, అద్వితీయమైన చైతన్యమే పురుషోత్తమ చైతన్యము.

**పురుషోత్తముడు**

'పురుషోత్తమః' అనేది సమాస పదము. షష్ఠీ సమాసము. పురుషులలో ఉత్తముడు పురుషోత్తముడు (*పురుషాణాం ఉత్తమః పురుషోత్తమః*). షష్ఠీ సమాసములో ఉండే పదానికి *న నిర్ధారణే* అనే వ్యాకరణ సూత్ర నిషేధము ఉంది (*న నిర్ధారణే షష్ఠీ* - పాణినీ వ్యాకరణము ; *2 - 2 - 10* ). 'పురుషోత్తమః' అనే పదం 'షష్ఠీ' లోనే ఉన్నా, ఈ వ్యాకరణ సూత్ర నిషేధము దానికి వర్తించదు.

షష్ఠీలో ఒక పదమును ప్రయోగించి నపుడు, జాతి, గుణ, క్రియల చేత వేరు చేయడము జరిగి నపుడు, మనం ఉదహరించిన వ్యాకరణ సూత్ర నిషేధము వర్తిస్తుంది, లేదా సంభవిస్తుంది. దీనిని సులభంగా అర్థం చేసుకోవ డానికి సోదాహరణంగా చెప్పుకుందాం.

*మనుష్యాణాం క్షత్రియః శూరతమః* - 'మనుష్యులలో క్షత్రియుడు శూరతముడు' అన్నప్పుడు, క్షత్రియుడు మనుష్యులలో ఒకడే అయినా, జాతి చేత, క్షత్రియ జాతి చేత విశిష్టంగా చెప్పబడ్డాడు.

*గవాం కృష్ణాగౌః సంపన్న క్షీరతమా* - గో సమూహాన్ని చూచి, 'ఆవులలో నల్ల ఆవు సంపన్న క్షీరతమము' అన్నప్పుడు, ఆవులలో నల్ల ఆవు ఒకటి అయినా, పాలు పుష్కలంగా ఇవ్వడ మనే గుణము చేత ప్రత్యేకంగా చెప్పబడింది.

*అధ్వగానాం ధావన్ శీఘ్రతమః* - 'బాటసారులలో పరుగు పెట్టేవాడు శీఘ్రతముడు' అన్నప్పుడు, పరుగు పెట్టేవాడు కూడా బాటసారే అయినా, పరుగు పెట్టడ మనే క్రియ వల్ల విశిష్టంగా చెప్పబడుతూ ఉన్నాడు. కనుక, క్షత్రియుడు జాతి చేత, కృష్ణ గోవు గుణము చేత, పరుగు తీసేవాడు క్రియ చేత వేరు చేయబడు తున్నారు. కనుక, ఇలాంటి చోట *న నిర్ధారణే* అనే వ్యాకరణ సూత్ర నిషేధము వర్తిస్తుంది.

జాతి, గుణ, క్రియాదులు లేకుండా సమాసాలు రూపొందించ బడవు. కాని, భగవంతుడు పురుషోత్త ముడు అన్నప్పుడు, భగవంతునితో పోల్చడానికి మరొకరు లేనందున, జాతి, గుణ, క్రియాదులు లేకనే 'పురుషోత్తమః' అనే పదాన్ని సమాసంగా చెప్పవచ్చు. భగవంతుడు ఉత్తముడు అని చెప్పినపుడు, భగవంతుడు లాంటి భగవంతులలో ఆయన ఉత్తముడు అని అర్థం కాదు. కనుక, 'పురుషోత్తమ ప్రాప్తి యోగము' అనే అధ్యాయ నామంలో 'పురుషోత్తమః' అని షష్ఠీ సమాసంగా గ్రహించ బడిన ప్రత్యేకమైన విశిష్ట పదము అద్వితీయ సద్రూప చైతన్యమును సూచిస్తూ ఉంది.

ప్రస్తుతం మనం అధ్యయనం చేయబోతున్న ఈ పురుషోత్తమ ప్రాప్తి యోగము అనే పదిహేనవ అధ్యాయం లోని పద్దెనిమిదవ శ్లోకంలో 'పురుషోత్తమః' పదాన్ని పంచమీ సమాసంగా చూస్తాం (*పురుషాభ్యాం ఉత్తమః*).

**యస్మాత్ క్షర మతీతోఽహం అక్షరాదపి చోత్తమః ।**
**అతోఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః ॥**

'అర్జునా! క్షర రూపమైన సృష్టి కంటె, అక్షర రూపమైన అవ్యక్తము కంటె నేను ఉత్తముణ్ణి కావడం చేత లోకములో, వేదములో కూడా పురుషోత్తముడుగా ప్రసిద్ధిని పొందినాను' అని ప్రవచించడము జరిగింది. క్షరా క్షరాలను భరిస్తూ, ఆ రెండిటికి విలక్షణంగా ఉంటూ, వాటికి అతీతంగా, అధిష్ఠానంగా తెలుస్తూ ఉన్నందున,

తాను పురుషోత్తముడు. ఈ శ్లోక వ్యాఖ్యాన సందర్భంలో దీనిని విస్తరించి చెప్పుకుందాము. కనుక పురుషోత్తముడు పూర్ణరూపుడు అని స్పష్టమౌతూ ఉంది. ఈ ప్రపంచము గోచరిస్తూ ఉన్నా ***(ఇదం)*** పురుషోత్తముడు పూర్ణ రూపుడే ***(పూర్ణ మిదం)***. ఈ దృశ్యమాన జగత్తు ఆవిర్భవించక ముందు కూడా పురుషోత్తముడు పూర్ణ రూపుడే ***(పూర్ణమదః)***. నిర్వికార, నిష్ప్రపంచ రూపుడైన పూర్ణ పురుషుని నుండి ఈ దృశ్యమాన జగత్తు వచ్చినా, తిరిగి లేకుండా పోయినా ***(పూర్ణస్య పూర్ణమాదాయ)*** ఆయన పూర్ణత్వానికి భంగం లేదు; రాదు. పురుషోత్తముడు సదా పూర్ణుడే ***(పూర్ణ మేవ అవశిష్యతే)***. ఈ విధంగా క్షరాక్షర విలక్షణ మైన పురుషోత్తమ తత్త్వమే ఈ పంచ దశాధ్యాయంలో కేంద్ర విషయంగా ఉంది. అందుచేత ఈ అధ్యాయం లోని విషయము అత్యంత రహస్య మైందని, గోప్యతమ మని భగవంతుడే అధ్యాయాంత శ్లోకంలో చెబుతాడు. ఈ అధ్యాయాన్నే సమస్త శాస్త్రంగా పరిగణించి ప్రవచించడం జరిగింది. గీతా శాస్త్రంలో చెప్పబడిన విషయ మంతా ఈ అధ్యాయం లోనే సంక్షిప్తంగా చెప్పబడింది అని ఆచార్యులే భాష్యంలో అభిప్రాయ పడ్డారు ***(సర్వో హి గీతా శాస్త్రార్థః అస్మిన్ అధ్యాయే సమాసేన ఉక్తః)***. ఆచార్యుల వారు అంతటితో ఆగ లేదు. ఈ పంచదశాధ్యాయంలో సంక్షిప్తంగా చెప్పబడింది కేవలం గీతాశాస్త్రమే కాదు; సమస్త వేదార్థ సారమంతా ఈ అధ్యాయంలో పూర్ణమైంది అని కూడా అన్నారు ***(న కేవలం గీతా శాస్త్రార్థ ఏవ, కిం తు సర్వశ్చ వేదార్థః ఇహ పరిసమాప్తః*** - *శ్రీ శంకర భాష్యము)*.

ఇటువంటి పరమార్థ తత్త్వమైన పురుషోత్తమ తత్త్వము మనకు ఈ అధ్యాయంలో ప్రాప్తించబోతూ ఉంది అని చెప్పేందుకే అధ్యాయ నామంలో 'పురుషోత్తమ' పదము తరువాత 'ప్రాప్తి' పదము. ఆ పురుషోత్తమ తత్త్వము ఎలా ప్రాప్తిస్తుందో తెలియ చెప్పే ఉపాయమే తరువాత వచ్చే 'యోగ' పదము. ఆ రెండు పదాలను కూడా వివరంగా చెప్పుకొని (ప్రాప్తి, యోగములను) ఆ తరువాత, పూర్ణావగాహనతో ఆనందంగా అధ్యాయం లోకి ప్రవేశిద్దాం.

## ప్రాప్తము - అప్రాప్తము

మనం ఆశించేది ఏదైనా అది మనకు లేనిదే. మనం ప్రియంగా భావించేది మనకు లేనిది అయినపుడు, దానిని పొందే ప్రయత్నము చేస్తాము. ప్రయత్నంలో పొంద బడితే అది ప్రాప్తము. అంటే లేనిది ప్రాప్తించింది అని అర్థము.

లేనిది అని మనం భావించేది అసలు లేనిదే అయితే మనం ప్రయత్నిస్తే మాత్రం ఎలా ప్రాప్తిస్తుంది? కనుక ప్రాప్తించింది అంటే ఉన్నదే. కాని, మన వద్ద లేనిది. మనకు దూరంగా ఉన్నది. ఈ దూరాలను సృష్టించేవి దేశ, కాల, వస్తు, పరిస్థితులు కావచ్చు.

సంత కెళ్ళి సొరకాయను తెచ్చుకుంటాం. వస్తువుగా సొరకాయ మన కన్నా వేరుగా ఉంది. సొరకాయ ఇంటిలో లేదు. సంతలో ఉంది. అంటే ప్రదేశంలో మనకు దూరంగా ఉంది. కనుక కాలంలో ప్రాప్తిస్తుంది. ఈ విధంగా మనం ఆశించేవి మనకు లేనపుడు ప్రయత్నము ద్వారా పొందుతూ ఉంటాము. అప్రాప్తా లన్నీ ఇలాగే ప్రాప్తిస్తూ ఉంటాయి *(అప్రాప్తస్య ప్రాప్తిః)*.

అదలా ఉంచితే, కొన్ని సమయాలలో ఉన్న వాటినే మనం ఆశిస్తుంటాము. ఉన్నవి లేవు అనుకొని వాటిని పొందే ప్రయత్నం చేస్తూ ఉంటాము. అలా లేవని భావించేవి నొసటనే ఉన్న సులోచనాలు కావచ్చు, భుజంపై ఉన్న తుండుగుడ్డ కావచ్చు, చంకనే ఉన్న గొర్రెపిల్ల కావచ్చు, లేదా మెడలో ఉన్న కంఠాభరణమే కావచ్చు. ఏదైనా సరే, పొందాలి అని అనుకు న్నప్పుడు, లేని సొరకాయను సంత కెళ్ళి తెచ్చుకున్నట్లు, ఉండి కూడా లేనట్లు తెలిసే దానిని ప్రయత్నం ద్వారా పొంద లేము. కర్మ ద్వారా సాధించ లేము. అలాంటి దానిని పొందాలి





అంటే, దానిని మనం పొందే ఉన్నట్లు తెలుసుకోవాలి. అంతే. కారణం, అది పొందబడి ఉన్నదే గాని లేనిది కాదు కనుక ***(ప్రాప్తస్య ప్రాప్తిః)***. అప్రాప్తాలను పొందటానికి కర్మలు చేయాలి. ప్రాప్తాలను పొందటానికి కర్మలు ఉపకరించవు; జ్ఞానమునే ఆశ్రయించాలి.

జ్ఞానం అనేది మన వల్ల నైనా మనకు కలగాలి. లేదా జ్ఞానము కల వారు ఇవ్వడం వల్ల నైనా లభించాలి. ప్రాప్తించే ఉన్న దానిని పొందడానికి స్వప్రయత్నం పనికి రాదు. ఉన్న దానిని లేదని నిర్ణయించుకున్న వాడు, తాను లేదని భావిస్తున్నది లేనిది కాదని, ఉన్నదే నని తనకు తానుగా పునః నిర్ణయించుకో లేడు. తనకు తానుగా తెలుసుకో లేని దానిని ఇతరులు తెలిపితే తెలుసు కుంటాడు. జ్ఞాన మెప్పుడూ ఇలాగే ప్రాప్తిస్తుంది. వెలుగులో చీకటి అదృశ్య మైనట్లు, జ్ఞాన ప్రాప్తిలో అజ్ఞానం అంతరిస్తుంది ***(అవిద్యా యాః నివర్తకం సమ్యగ్దర్శనమ్*** - *గీతాభాష్యం - 13 - 27)*.

## ప్రాప్తమే ప్రాప్తించాలి

మరి, మనం పొందాలి అనుకుంటున్న పురుషోత్తముడు లేని వాడా, ఉన్నవాడా? లేనివాడు పురుషోత్తముడెలా అవుతాడు? ఉన్నవాడే. ఎలా ఉన్నాడు? సర్వమూ తానై అద్వయంగా ఉన్నాడు. పూర్ణుడై ఉన్నాడు ***(పూర్ణత్వాత్)***. అందుచేతనే సర్వోన్నతుడై శోభిస్తున్నాడు ***(ఉత్తమః)***. అంటే, తానొక్కడే ఉన్నాడు. సర్వమూ తానే అయి ఉన్నాడు ***(సర్వం ఖల్విదం బ్రహ్మ)***. ఆ బ్రహ్మమే పురుషోత్తముడు. ప్రాప్తమై ఉన్న పురుషోత్తముడు ప్రాప్తించినట్లు తెలియడం లేదు. ఇదే అజ్ఞానము. జ్ఞానము ద్వారా అజ్ఞానము నివారింప బడితే, మేఘాలు తొలగి పోగానే సూర్యదర్శన మైనట్లు, పురుషోత్తమ ప్రాప్తి సిద్ధిస్తుంది. ఎప్పుడు? ఇప్పుడే, ఇక్కడే. అంతేగాని ఎప్పుడో, ఎక్కడో కాదు. ఎప్పుడో, ఎక్కడో పొందడానికి అది సంత లోని సొరకాయ కాదు; తలకాయ మీదే ఉన్నా లేనట్లు అనిపించిన కళ్ళజోడు లాంటిది. అలాంటిది దేశ కాల నిమిత్తాపేక్ష లేనిది. కర్మాపేక్ష లేనిది. ప్రాప్తించే ఉన్నది. అదే మోక్షము. పురుషోత్తమ తత్త్వము. ఉన్నది అనే జ్ఞానం వల్ల ప్రాప్తించే మోక్షము.

**న దేశ కాల నిమిత్తాపేక్షో మోక్షః కర్మ ఫలవత్ భవితు మర్హతి !**

'మోక్ష మనేది, దేశ, కాల, నిమిత్తాదులపై ఆధారపడి ఉండేది కానందున అది కర్మఫలం కాదు' అన్నారు బ్రహ్మసూత్ర భాష్యంలో శ్రీ శంకరాచార్యస్వామి *( సూ.భా ; 4 - 1 - 13 )*. మోక్షం ఉన్నదే; రానున్నది, కానున్నది కాదు. నీవు మోక్ష రూపుడవే. అది నీకు తెలియాలి, అంతే. కనుక, మోక్ష రూపమైన పురుషోత్తమ ప్రాప్తి స్మారకమే గాని కారకం కాదు. మరి, ప్రాప్తించే ఉన్న నిత్యమోక్షం తెలిసే దెలా? ఆ ఉపాయమే తెలియాలి. అదే జ్ఞానోపాయము. పురుషోత్తమ ప్రాప్తి అనే అధ్యాయ నామంలో 'యోగం' అనే పదము.

## 'యోగ' శబ్దార్థము

'యోగము' అంటే సఙ్గతి లేదా యుక్తి అని అర్థము ***( యోగః సఙ్గతి యుక్తిషు )***. యుక్తి అంటే ఉపాయము అని అర్థము. నిత్యముక్తమైన మోక్షము ప్రాప్తించి ఉన్నదే కనుక, దానిని పొందడము అంటే తెలుసుకోవడమే అనే వాస్తవాన్ని ఇప్పటికే దర్శించాము. కనుక పురుషోత్తముని పొందడానికి ఉపాయము ***(యోగః)*** జ్ఞాన మొక్కటే. మోక్షము అనేది జ్ఞాన గమ్యము. అంటే జ్ఞానము వల్లనే పొంద బడేది అని అర్థము ***(జ్ఞానే నైవ గమ్యతే ఇతి జ్ఞానగమ్యః )***. అంటే, వేదాంత తత్త్వజ్ఞానము చేత ప్రాప్తించేది. పురుషోత్తముడే జ్ఞాన గమ్యము. ఇట్టి తత్త్వ జ్ఞానము ఆచార్యుని బోధ వల్లనే ప్రాప్తిస్తుంది. కాని, ఇక్కడ మన భాగ్య మేమిటంటే, జ్ఞాన గమ్యమైన ఆదిదేవుడే ఆచార్యదేవుడై వచ్చి బోధిస్తున్నాడు. అందుకనే అర్జునుడు అడగక పోయినా అచ్యుతుడు అందించడానికి ఆరంభిస్తున్నాడు.

అడిగితే అడిగిందే లభిస్తుంది. అడగకుండానే లభిస్తూ ఉంది అంటే అవసరమైన దంతా పూర్ణంగా సిద్ధిస్తూ ఉంది అని అర్థం. అదే పురుషోత్తమ ప్రాప్తి. ఆచార్యుల వారు అభిప్రాయ పడినట్లు సర్వ వేదాంత సిద్ధాంత సార సంగ్రహము. అర్జునుని ప్రశ్న కొరకు నిరీక్షించకుండా భగవంతుడే స్వయంగా ఉపక్రమించి ఉద్బోధించిన అధ్యాయాలలో ఇదొకటి ***( అర్జునేన అపృష్ట మపి ఆత్మనః తత్త్వం వివక్షుః ఉవాచ భగవాన్ ).***

## అర్థ సిద్ధ ప్రసంగము

ఏదైతే ప్రాప్తించే ఉందో, సిద్ధించే ఉందో, అట్టి స్వతః సిద్ధమైన పరమాత్మ విషయమే ఈ అధ్యాయంలో ప్రసంగ విషయమై ఉంది. కనుకనే పార్థుని ప్రశ్నతో సంబంధం లేకుండానే, అడగక పోయినా తల్లి బిడ్డ ఆకలి తీర్చినట్లు, దీనదయాళుడు, భక్తవత్సలుడు అయిన పరమేశ్వరుడు తనకు తానుగా ఈ అధ్యాయాన్ని ఆరంభించాడు. ఇక్కడ అడగ వలసింది ఏమీ లేదు. అంతా వినవలసిందే ఉంది. శ్రవణమే సాధనమై ఉంది ***(శ్రవణ మేవ సాధనం ).*** కనుకనే వేదాంతము శరణ్య మైంది ***( శ్రుతి రేవ శరణ మితి ).*** వేదాంత శాస్త్ర మంతా సారభూతంగా ఈ అధ్యాయం లోనే సమాప్త మైంది అని ఆచార్యుల వారి అభిప్రాయాన్ని కూడా మనం చెప్పుకున్నాం. కొందరైతే, భగవద్గీత పదిహేనవ అధ్యాయం వద్దనే సమాప్త మైంది అని కూడా భావించి వ్యాఖ్యానించారు.

గ్రంథము యొక్క ఉపక్రమ ఉపసంహార పద్ధతులలో కొన్ని నియమాలు అనుసరణీయాలు. *అథ* శబ్దాన్ని గ్రంథారంభమును సూచించడానికి ఉపయోగిస్తారు. అలాగే **ఇతి** శబ్దాన్ని గ్రంథ సమాప్తికి ఉపయోగిస్తారు. గ్రంథారంభం లోని ప్రార్థనా సంగతిలో అనుబంధ చతుష్టయమును అనుసరించినట్లే, ఈ 'అథ - ఇతి' శబ్దాలను ప్రయోగిస్తూ ఉపక్రమ, ఉపసంహార విధానాలను అనుసరిస్తారు. ఇది శిష్టాచార సంప్రదాయ విధి.

పదిహేనవ అధ్యాయము ***ఇతి గుహ్యతమం శాస్త్రం*** అంటూ సమాప్తం చేయబడింది. విషయం చూస్తే పురుషోత్తమ ప్రాప్తి అయింది. పైగా అధ్యాయాంత శ్లోకంలో ఈ జ్ఞానం వల్ల కృతకృత్యత లభిస్తుందని ఫలశ్రుతి కూడా చెప్పడం జరిగింది. ఈ కారణం చేతనే పంచదశాధ్యాయమును గీతా శాస్త్రము యొక్క సంక్షిప్త రూప మనే గాక, సర్వ సిద్ధాంత సార సంగ్రహంగా శ్రీ శంకరాచార్యస్వామి అభివర్ణించారు.

మరి, పదిహేనవ అధ్యాయం వద్ద పురుషోత్తమ ప్రాప్తితో గీత సమాప్త మైతే, మిగిలిన మూడు అధ్యాయాల విషయ మేమిటి? అనే సందేహము సాధారణం గానే కలుగుతుంది. పదహారు, పదిహేడు అధ్యాయాలను పరిశిష్ట విషయంగా గ్రహించారు. అంటే, పూర్వాధ్యాయాలలో చెప్పడానికి అవకాశం లేని ముఖ్య విషయాలను ప్రస్తావించి ప్రసంగించడం, లేదా చెప్పిన విషయాలనే విస్తరించి చెప్పవలసిన అవసరాన్ని గుర్తించి వాటిని పునః ప్రవచించడం పరిశిష్టం. ఇకపోతే, చివరి అధ్యాయమైన మోక్ష సన్యాస యోగమును ఉపసంహార విషయంగా గుర్తించి, సింహావలోక న్యాయమును అనుసరిస్తూ, పూర్వ ప్రవచనము నంతా దృష్టిలో ఉంచుకొని బోధించిన పరిసమాప్తి విషయంగా భావించారు.

నా అభిప్రాయంలో ఈ అధ్యాయం వామనమూర్తి దర్శనం చేయిస్తుంది. కేవలం ఇరవై శ్లోకాలే ఉన్నా, వేద సారాన్నంతా అందిస్తుంది. బలి చక్రవర్తి భాగవతంలో చెప్పినట్లుగా,

> క॥ ***ఉడుగని క్రతువుల వ్రతముల బొడుగన జననట్టి పొడవు పొడవున గుఱుచై***
> ***యడి గెడినట నను బోటికి నిడరాదె మహానుభావ! యిష్టార్థంబుల్ ॥***

'ఎన్ని యజ్ఞాలు చేసినా, మరెన్ని క్రతువు లాచరించినా లభ్యం గాని వాడు, ఎంతో పెద్దవాడు, చాలా చిన్నవాడై, పొట్టివాడై పలుకు తున్నాడు. అతడు చెప్పినట్లు చేయడం కన్నా కావలసింది ఏముంటుంది?'





అన్నట్లు, ఆద్యంతము లెక్కడో బ్రహ్మ రుద్రాదులకే అంతుపట్టని వేదనారాయణుడైన పురుషోత్తముడు ఈ అధ్యాయంలో కేవలం ఇరవై శ్లోకాలలో వామనమూర్తిలా చూడ ముచ్చటగా దర్శన మిస్తాడు.

శ్లోకానుక్రమంలో ముందుకు సాగుతూ ఉంటే, ***ఇంతింతై వటుడింతయై.... ప్రభారాశిపై నంతై, చంద్రుని కంతయై .....*** అంటూ ఆకాశంలో సూర్యచంద్రులే అప్రధానులై కనిపిస్తున్న దశలో బ్రహ్మాండాన్నంతా ఆక్రమించిన వామనమూర్తికి ***రవి బింబం బుపమింప బాత్ర మగు ఛత్రంబై*** - సూర్యబింబము గొడుగులా నిలిచి ఉందని ఆంధ్ర మహాభాగవతంలో పోతనామాత్యుడు వర్ణించినట్లు; పురుషోత్తముని శరణుజొచ్చి, అవ్యయ పదమును పొందే స్థితిని అయిదవ శ్లోకంలో చెప్పి, సూర్యచంద్ర నక్షత్రాగ్నులు ప్రకాశించ లేని పురుషోత్తముని దివ్య ధామమును ***న తద్భాసయతే సూర్యో*** అంటూ ఆరవ శ్లోకంలో వర్ణిస్తూ ఉంటే, బ్రహ్మాండాంత సంవర్ధి యైన వామనమూర్తి వైభవము మనస్సులో తళుక్కు మంటుంది. శ్లోక పరంగా చూస్తే అధ్యాయం చాలా చిన్నది. విషయపరంగా చూస్తే చాలా పెద్దది. బ్రహ్మాండాలను తన కుక్షిలో నింపుకున్న పురుషోత్తమునే గర్భం దాల్చిన అధ్యాయ మిది. ఉపోద్ఘాతాన్ని తృప్తిగా చెప్పుకున్నాం. ఇక అధ్యాయం లోకి ప్రవేశిద్దాం. చదవండి.

### శ్రీ భగవానువాచ :

> ఊర్ధ్వమూల మధః శాఖ మశ్వత్థం ప్రాహు రవ్యయమ్ ।
> ఛన్దాంసి యస్య పర్ణాని య స్తం వేద స వేదవిత్ ॥ 1

***ఊర్ధ్వమూలం-అధఃశాఖం-అశ్వత్థం-ప్రాహుః-అవ్యయం***
***ఛందాంసి-యస్య-పర్ణాని-యః-తం-వేద-సః-వేదవిత్***

| | | | |
|---|---|---|---|
| ఊర్ధ్వమూలం | = మూలము పైన గలది | పర్ణాని | = ఆకులు |
| అధః శాఖం | = శాఖలు క్రింద గలది | తం | = దానిని |
| అశ్వత్థం | = అశ్వత్థము | యః | = ఎవడు |
| అవ్యయం | = నశించనిది | వేద | = గ్రహించు చున్నాడో |
| ప్రాహుః | = చెప్పారు | సః | = వాడు |
| యస్య | = దీనికి | వేదవిత్ | = వేదార్థమును తెలిసిన వాడు |
| ఛందాంసి | = వేదములు | | |

### శ్రీ భగవంతుడు చెబుతున్నాడు :

**అర్జునా! ఈ ప్రపంచాన్ని అశ్వత్థ వృక్షము అన్నారు. దీని మూలము పైన ఉంటుంది. శాఖలు క్రిందికి ఉంటాయి. ఇది అంతు లేనిది. వేదాలే దీని ఆకులు. దీనిని తెలుసుకున్న వాడే వేదవేత్త.**

**వ్యాఖ్య**

### భక్తి వైశిష్ట్యము

భగవంతుడు భక్త వశుడు. భగవంతుని వశపరచు కోవడానికి భక్తికి మించిన సాధనం లేదు. ***అన్యస్మాత్ సౌలభ్యం భక్తౌ -*** సాధన లన్నిటి లోకి భక్తి సులభమైంది. సురక్షిత మైంది. సరళమైంది. సమున్నత మైంది. భక్తి నిత్య స్మరణాత్మకం. సదా ధ్యానమయం. సగుణ బ్రహ్మ విషయ మానస వ్యాపారము. భక్తి వ్యాపారానికి కావలసిన పెట్టుబడి అందరి వద్ద ఉంది. యోగానికి ప్రత్యేక లక్షణాలు ఉండాలి. జ్ఞానయోగానికి

ప్రత్యేకమైన సాధన చతుష్టయాది యోగ్యతలు ఉండాలి. మరి భక్తికి ఏమి ఉండాలి? ప్రేమ ఉండాలి. ప్రేమ ఒక్కటే భక్తికి పెట్టుబడి. ప్రేమ లేని మనిషి ప్రపంచంలో ఉన్నాడా? ఎవరు దేనిని ప్రేమిస్తున్నారు, ఎవరిని ప్రేమిస్తున్నారు అనేది వేరే విషయం. ప్రేమించకుండా ఎవరూ ఉండలేరు అనేది మాత్రం నిజం.

అందరూ ప్రేమించే వారే. ప్రేమ అందరి హృదయం లోనూ ఉంది. కాకపోతే, మన హృదయం లోని ప్రేమ ప్రవాహం అనిత్య మార్గాలలో పయనిస్తోంది. అందువల్ల అది లాభదాయకంగా లేదు. పైగా అంతా నష్టదాయకమే. ఎక్కడ లాభముందో, ఎక్కడ నష్టముందో, ఏది శ్రేయస్సో, ఏది ప్రేయస్సో అర్థం కాకపోవడం చేత, ప్రేమకు పూర్ణత్వం కలగక పోగా, అనిత్యాలను ప్రేమించిన దోషానికి భగవ న్మందిరాలుగా ప్రకాశించ వలసిన మానవ హృదయాలు శూన్య కుటీరాలుగా మిగిలి పోతున్నాయి.

భక్తి బ్రతుకును భగవన్మయం చేస్తుంది. భక్తి ఏదో కాదు; భగవంతుని యందు అచంచలంగా నిలిచిన పరమోత్కృష్టమైన ప్రేమయే భక్తి. ప్రేమ అందరిలో ఉంది. ప్రేమించడానికి అందరూ అర్హులే. పండితులలో ప్రేమ ఉంది. పామరుల లోనూ ఉంది. స్త్రీలలో ఉంది, పురుషులలో ఉంది, పిల్లలలో ఉంది, ధనికులలో ఉంది, దరిద్రులలో ఉంది, యోగులలో ఉంది, భోగులలో ఉంది, రోగుల లోనూ ఉంది. ప్రేమ ఎవరిలో లేదు? అందరి లోనూ ఉంది. అమూల్యమైన, పవిత్రమైన ప్రేమ అందరిలో ఉన్నా, అందరూ ప్రేమను వృథా చేసుకుంటూనే ఉన్నారు. పుత్ర, దార, గృహాదుల యందు, బంధు, మిత్ర, వాహనాదుల యందు, ఒక్క మాటలో చెప్పాలంటే, అనిత్యమైన ప్రపంచంలో ప్రేమను పెట్టుబడిగా పెట్టి అందరూ నష్ట జాతకు లవుతున్నారు. కష్టాల కానలలో కాపుర ముంటున్నారు. కన్నీటి కడలిలో మునిగి పోతున్నారు. సంసార మనే ఊబిలో కూరుకు పోతున్నారు. జననమరణాల మధ్య పరుగు పెడుతున్నారు. ఈ తీరు మారాలి. బ్రతుకును బాధలమయం చేసే ఈ రీతి మారాలి. ఈ దుస్థితి తొలగాలి. ఈ దుర్గతి దూరం కావాలి. సద్గతి సమీపించాలి. ప్రాప్తించాలి. దాని కొక్కటే మార్గం. మన హృదయంలో ఉత్పన్నమై నికృష్ట మైన అనిత్య మార్గాలలో పయనించి, ప్రపంచ ఎడారిలో పడి మృగ్యమయ్యే పవిత్ర ప్రేమ జలాలను దారి మళ్ళించి, ఉత్కృష్ట మైన సత్యమార్గంలో పయనింప చేసి, పరమేశ్వరుని దివ్యధామాన్ని చేరే ప్రయత్నంలో జీవు లందరూ కృతకృత్యులు కావాలి. అదే ఏకైక మార్గము. భగవంతుని చేరి తరించే భక్తి మార్గము *(14 వ అ - 26 వ శ్లో)*. జననమరణాల సుడిగుండం నుండి బయట పడి ముక్తిని పొందే ఏకైక ఉపాయము.

***ఆ॥ దీన శుభము లేదు, దివ్య కీర్తియు లేదు, జగతి బుట్టి పుట్టి చచ్చి చచ్చి***
***పొరల నేల మనకు బుట్టని చావని త్రోవ వెదకి కొనుట దొడ్డ బుద్ధి***

ఏముంది సంసారంలో? సుఖము లేదు. శుభము లేదు. సన్మతి లేదు. సద్గతి లేదు. పుట్టడం చావడం, చావడం తిరిగి పుట్టడం. ఎంత కాలం ఈ చక్ర భ్రమణం? వక్ర గమనం? చావుపుట్టుకలు లేని, ద్వంద్వాలు బంధించని, అందమైన, ఆనంద ప్రదమైన మార్గాన్ని వరించి పయనించడమే శ్రేయమని ప్రహ్లాదుడు చెప్పిన సదుపదేశాన్ని, చూపిన సన్మార్గాన్ని అనుసరించడమే సర్వులకు కర్తవ్యం కావాలి. అదే శ్రేయోమార్గం.

## విరక్తి ఉంటేనే భక్తి

ప్రకృతికి వశమైన వాడు పరమాత్మను వశం చేసుకోలేడు. మాయలో పడ్డవాడు మహిమను దర్శించ లేడు. ప్రపంచంపై అనురక్తి కలవాడు పరమేశ్వరునిపై ఆసక్తిని పెంచుకోలేడు.

అన్య విషయ విస్మరణము లేనిదే అనన్య భక్తి కలగదు. అనన్య భక్తి కలవారే భగవంతుని ఆశ్రయిస్తారు. ఆశ్రయించిన వారే ఆరాధిస్తారు. ఆరాధించిన వారే అచ్యుతుని పొంది తరిస్తారు.





పట్టుకున్న దానిని విడిచి పెడితేనే, పట్టుకోదగిన దానిని పట్టుకుంటాము. బంధము తొలగి నపుడే ఎవరి కైనా ముక్తి. అదే మోక్షము. అందరికీ నిత్యమోక్షం కావాలి. మరి, అనిత్య సంసారంలో నిత్యమోక్షం ప్రాప్తిస్తుందా? కనుక సంసారాన్ని దాటిన వారికే నిత్యమోక్షం. ఇంతకీ ఏమిటి ఈ సంసారం? ఎక్కడుంది ఈ సంసారం? ఈ సంసార సాగరాన్ని దాటే దెలా?

ఇక్కడే ఒక చిక్కుముడి ఉంది. గోడ ఉంది కనుక గోడను దాటుతాము. నది ఉంది కనుక నదిని దాటుతాము. మరి, సంసారాన్ని దాటాలి అంటే సంసారం ఉండాలి కదా! ఉందా? ఉంది. ఎలా ఉంది? సత్యంగా ఉందా? లేక సత్యంగా లేకనే ఉన్నట్లు అనిపిస్తూ ఉందా?

సంసారము సత్యమే అయితే, సత్యమైనది నశించేది కాదు కనుక, సంసారం కూడా నశించదు. ఒకవేళ సంసారము లేనిదే అయితే, అసత్యమే అయితే, దానిని ఛేదించ నవసరం లేదు. భేదించ నవసరం లేదు. ఇదీ చిక్కుముడి.

అటు ఉన్నది కాక, ఇటు లేనిదీ కాక, ఉన్న త్రాడులో లేని సర్పము గోచరించినట్లు **(రజ్జుసర్పవత్)**, లేని సంసారము ఉన్న దాని వలె ***(ఇవ)*** భ్రాంతిలో కనిపిస్తూ ఉంది. అలాంటి సంసార సాగరాన్ని ఎలా దాటాలి?

ఉన్నదాని నైతే శ్రమించి దాటాలి. లేనిది ఉన్నట్లుగా అనుభవానికి అందే టప్పుడు, దానిని దాటడము అంటే, అది లేదు అని తెలుసుకోవడమే. పాము లేదు అని తెలుసుకు న్నప్పుడు సర్పభ్రాంతితో పాటు సర్పభయం కూడా తొలగినట్లు, సంసారము లేనిదే, ఇది మిథ్యా ప్రపంచమే అనే జ్ఞానం కలిగితే, సంసార దుఃఖం కూడా దూర మవుతుంది.

మరి, లేకనే ఉన్నట్లు అనిపించే ఈ సంసారం ఎక్కడుంది? ఎలా ఉంది? తెలిసి నపుడే అది నివారించ బడుతుంది. అదొక మహావృక్షంలా ఉంది. మహా విచిత్రంగా ఉంది. మూలం పైన ఉంది. శాఖలు క్రిందికి ప్రాకుతూ ఉన్నాయి. అదొక మాయా వృక్షం. అనాదిగా ఉంది. ప్రవాహ నిత్యత్వంతో అవ్యయంగా తెలుస్తూ ఉంది. ఎంత అవ్యయమైనా వృక్షం కనుక ఒకనాడు కూలి పోయేదే ***(వృశ్చతే ఇతి వృక్షః)***. అందుచేత నేడు ఉన్నా రేపు ఉంటుందని నిర్ధారణ చేయ శక్యం కానిది. అందుకే అది అశ్వత్థమై ఉంది.

సంసారాసక్తి ఎవరిలో అయితే క్షీణిస్తూ ఉంటుందో, వారిలో భగవదాసక్తి వృద్ధి చెందుతూ ఉంటుంది. సంసారముపై వైరాగ్యము జనించి నపుడే బుద్ధి భగవంతుని ఆశ్రయిస్తుంది. కనుక ఎవడు విరక్తుడో వాడే భక్తుడు అవుతాడు. భక్తి చేయడానికి అర్హుడు అవుతాడు ***(విరక్తస్య హి సంసారాత్ భగవత్తత్త్వ జ్ఞానే అధికారః)***. ఎవడు సంసారము నందు విరక్తుడో, వాడికే భగవంతుని తత్త్వజ్ఞానమును పొందుటకు అధికారము. కనుక, భక్తికి ప్రధానమైన వైరాగ్యమును కల్పించడం కోసం సంసారమును వృక్ష రూపక అలంకారము చేత వర్ణిస్తున్నాడు భగవంతుడు.

గుణత్రయమును దాటిన వాడు మోక్షానికి సమర్థు డగుచున్నాడు అని పద్నాల్గవ అధ్యాయం - ఇరవై ఆరవ శ్లోకం. గుణాతీతుడు కావడానికి అచంచలమైన భక్తి ప్రధాన మైనది అని కూడా అక్కడ చెప్పడం జరిగింది. అంటే, భక్తిలో చపలత కలిగి స్థిరత లేని వారు ప్రగతిని సాధించ లేరని, సద్గతిని పొంద లేరని స్పష్ట మౌతూనే ఉంది. మరి, భక్తిలో ఎందుకని అస్థిరత్వము ఏర్పడుతూ ఉంది? స్థిర భక్తి కలగక పోవడానికి కారణ మేమిటి? ఏది ప్రతిబంధకము? ప్రపంచమే. నామరూపాత్మకమైన ప్రపంచమే. నిరంతరము ప్రపంచం స్మృతిలో ఉండటమే పరమాత్మ విస్మృతికి కారణము. పరమాత్మపై అచంచలమైన భక్తి ఏర్పడాలి అంటే అస్థిరమై,

అనిత్యమైన ప్రపంచంపై ఉండే మక్కువ తక్కువ కావాలి. అలా జరగాలి అంటే ప్రపంచము యొక్క నిజరూపం తెలిసి రావాలి. అది అశ్వత్థ మని అర్థం కావాలి.

**అశ్వత్థం**

సంసారముపై విరక్తి జనించడానికి, సంసారానికి వృక్ష రూపాన్ని కల్పించి వర్ణిస్తున్నాడు భగవంతుడు ***(వృక్ష రూప కల్పనయా వైరాగ్య హేతోః సంసార స్వరూపం వర్ణయతి ).*** సంసార వృక్షమును అశ్వత్థ వృక్షంగా వర్ణిస్తున్నాడు. ***అశ్వత్థః*** అంటే రావిచెట్టు అని అర్థము. ***శ్వః*** అంటే రేపు అని అర్థము. రేపు ఉండునది శ్వత్థం. రేపు ఉండనిది అశ్వత్థం. రేపు కూడా ఉంటుంది అని చెప్పడానికి వీలు లేనిది అశ్వత్థం ***( న శ్వః అపి స్థాతా ఇతి అశ్వత్థః ).*** అదే సంసార వృక్షము. మార్పే లక్షణంగా కలది. నశించే స్వభావం కలది. క్షణంలో నశించిపోయే స్వప్నం లాంటిది ***( అశ్వత్థం క్షణ ప్రధ్వంసినమ్ స్వప్నవత్ ).*** అంటే కాలగత మైంది. ఎంతకాలం మనుగడను సాగించినా, ఏదో ఒక కాలంలో లేకుండా పోయేది సంసార వృక్షము. ఖండిస్తే పోతుంది. ఖండించక పోయినా దానంతట అదే ఎండి పోతుంది. కాలంలో కనుమరు గవుతుంది. కనుక అశ్వత్థము క్షణ భంగురము.

వృక్షము ఏదైనా దానికి ఆది ఉంటుంది. ఆది ఉన్న దానికి అంతము ఉండి తీరాలి. సంసారమును వృక్షంతో పోల్చడం చేత దానికి కూడా ఆద్యంతా లున్నాయని చెప్పినట్లే అయింది. వృక్షం కార్య రూపంలో ఉంది కనుక దానికి కారణం ఉండి తీరాలి. సంసారం కూడా కార్యంగా తెలుస్తూ ఉంది కనుక దానికి కూడా కారణం ఉండాలి.

సంసారమును అశ్వత్థ మంటూ వృక్ష రూపక కల్పన చేత వర్ణించినా, సాధారణంగా మనం చూచే వృక్షాలకు ఈ సంసార వృక్షము విలక్షణంగా ఉంది. అసాధారణ వృక్షంగా కనిపిస్తూ ఉంది. ప్రపంచంలో మనం చూచే వృక్షాలకు మూలాలు క్రింద ఉంటాయి. వాటి కొమ్మలు పైకి విస్తరించి ఉంటాయి. కాని, ఈ అశ్వత్థ మనే సంసార వృక్షానికి మూలం పైన ఉంటుంది. కొమ్మలు అధోముఖంగా వ్యాపించి ఉంటాయి. ప్రపంచం లోని వృక్షా లన్నీ ఒక విధంగా ఉంటే, వృక్షా లన్నిటినీ తన లోనే ఉంచుకున్న ప్రపంచ వృక్షము మాత్రము ప్రత్యేకంగా ఉంది.

వృక్షము ఎంత పెద్ద దైనా అది బీజం నుండే ఆవిర్భవించినట్లు, బీజంలో అవ్యక్తంగా ఉన్నదే బాహ్యంలో వృక్షంగా పరిణమించినట్లు, ఈ విశ్వ వృక్షము కూడా ఆదిబీజమైన బ్రహ్మము నుండే ఆవిర్భవించింది. అవ్యక్తము, మాయోపాధిక మైన బ్రహ్మమే ఈ వృక్షమునకు మూలము. అందుచేత సంసార వృక్షానికి మూలము పైన ఉంది ***( ఊర్ధ్వమూలం )*** అని చెప్పబడింది.

మానవుల మైన మన దృష్టి మూడు విధాలుగా ఉంటుంది. మొదటిది బాహ్యదృష్టి , లేదా బయటి చూపు. రెండవది అంతర్దృష్టి , లేదా లోచూపు. మూడవది ఊర్ధ్వ దృష్టి , లేదా పైచూపు.

ఇంద్రియాల ద్వారా మనస్సు బాహ్య ప్రపంచాన్ని వీక్షించడం బాహ్యదృష్టి. ఇది విషయ ప్రపంచాన్ని గ్రహించే వీక్షణం. అలా కాకుండా, ఇంద్రియాల నుండి, ఇంద్రియ విషయాల నుండి విడిపడి కేవలం మనస్సు తనలో తనను అవలోకించు కోవడం అంతర్దృష్టి. దానినే అంతర్ముఖం అంటారు. ఇది మనో ప్రపంచ వీక్షణం. ఇక మూడవది, బాహ్య ప్రపంచ వీక్షణము కానిది, అంతరేక్షణానికి అతీత మైనది. అదే ఊర్ధ్వ దృష్టి అనే బ్రహ్మదృష్టి. ఆకాశం వైపు సాగే దృష్టి. గగన విహారం చేసే దృష్టి. అంతా విచిత్రమై, అద్భుతంగా గోచరిస్తూ, విషయం అగ్రాహ్య మైనపుడు, మనస్సు కందని ఆ విషయాన్ని గూర్చి విస్మయాన్ని వ్యక్తం చేస్తూ ఆకాశం వైపు దృష్టి సారిస్తాము. అనంతాన్ని అవలోకించే ప్రయత్నంలో ఉంటాము. అదే ఊర్ధ్వం.





ఊర్ధ్వం అంటే ఉన్నత మైనది, ఉత్కృష్ట మైనది, శ్రేష్ఠ మైనది అని అర్థం. అంతేగాని పైన అనే అర్థాన్ని మాత్రమే గ్రహిస్తే, మూలమైన ఊర్ధ్వం తెలిసి రాదు. ***ఊర్ధ్వం*** అంటే ఉత్కృష్టము కనుక ***అధః*** అంటే నికృష్టము అని అర్థము.

సాధారణంగా వృక్షము మనకు గోచరిస్తుందే గాని దాని మూలము అంటే బీజము మనకు గోచరించదు. అలాగే ఇక్కడ కూడా ప్రపంచ వృక్షము మనకు కనిపిస్తూ ఉంది. కాని, దాని మూల మెక్కడో మనకు కనిపించడం లేదు. మన చూపు కందనంత ఊర్ధ్వంగా మూలం ఉంది. అదే ఈ విశ్వానికి కారణము. కనిపించే కార్యరూప ప్రపంచానికి కారణము. అదే 'ఆజీవ్యము' అంటే జీవనాధారము. అవ్యక్తమైన మాయాశక్తితో కూడిన బ్రహ్మమే ఈ సంసార వృక్షమునకు ఊర్ధ్వమున ఉండే మూలము. లేదా మూల కారణము ***( ఊర్ధ్వమూలం - ఊర్ధ్వం ఉత్కృష్టం మూల కారణం యస్య ).*** అట్టి కారణము నుండి ఉత్పన్నమైన ఈ విశ్వ వృక్షము 'అవ్యక్త మూల ప్రభవము'.

ప్రపంచ మనే సంసార వృక్షానికి మూలము ఊర్ధ్వంగా ఉంది అని అర్థం చేసుకున్నాం. బ్రహ్మమును ఆశ్రయించుకొని ఉన్న అవ్యక్తమే జగత్కారణమైన ప్రకృతి అని, కారణం కావడం చేత అది మూల ప్రకృతి అని తెలుసుకున్నాం. పరమేశ్వరుని సన్నిధిలో ఈ మూల ప్రకృతి సృష్టి కార్యాన్ని నిర్వహిస్తూ ఉంది *(9 వ అ - 10 వ శ్లో).* పరమేశ్వరుడు బీజ ప్రదాతగా ఉండటం చేతనే అవ్యాకృతమైన ప్రకృతి వ్యాకృతమైన ఈ విశ్వ సృష్టికి కారణ మవుతూ ఉంది *(14 వ అ - 3 వ శ్లో).* ఎప్పుడైతే, ప్రపంచ వృక్షానికి కారణమైన ప్రకృతి బ్రహ్మమును ఆశ్రయించుకొని ఉందో, సర్వోత్కృష్టము, ప్రశస్తమైన బ్రహ్మము ఊర్ధ్వం, అనగా ఉన్నతంగా ఉండటం చేత, ప్రకృతి కూడా ఉన్నతం గానే ఉంది. కారణమైన ప్రకృతి ఊర్ధ్వంగా శోభిస్తున్నందున దాని కార్యమైన జగద్వృక్షము యొక్క శాఖలు క్రిందికి విస్తరించి ఉన్నాయి. అందుచేత మూలము ఊర్ధ్వం గాను, శాఖలు అధోముఖం గాను ఉన్నా యని చెప్పడం జరిగింది ***( ఊర్ధ్వమూలం అధః శాఖమ్ ).*** అంటే, నామరూపాత్మకంగా విస్తరించిన కార్యరూప జగత్తంతయు శాఖా విస్తరణమే అని అర్థము. దీనికి ఉన్నతంగా, ఊర్ధ్వంగా పరమాత్మ శోభిస్తున్నాడు అని భావము.

**ఆగమములే ఆకులు**

అశ్వత్థ మనే ఈ సంసార వృక్షానికి ఆగమములే ఆకులు ***( ఛందాంసి యస్య పర్ణాని ).*** 'ఛందాంసి' అంటే వేదములు.

ఛాదనం అంటే ఆచ్ఛాదనము అని అర్థము. ***ఛాదనాత్ ఛందాంసి -*** ఆచ్ఛాదించు లక్షణము, అంటే కప్పేసే స్వభావం కలవి కనుక అవి 'ఛందాంసి' అని పిలువ బడ్డాయి. అవే వేదాలు.

ఆకులు చెట్టును ఆచ్ఛాదించి దానిని రక్షిస్తూ ఉంటాయి. ప్రాణమును గ్రహించి వృక్షాన్ని పరిరక్షిస్తూ ఉంటాయి. చెట్టుకు ఆచ్ఛాదనంగా ఉంటాయి. బాటసారులకు ఛాయా స్థానీయా లవుతూ ఉంటాయి. నిలువ నీడ నిస్తూ ఉంటాయి.

వేదాలు కూడా సంసార వృక్షాన్ని, ఆకులు వృక్షాన్ని ఆచ్ఛాదించినట్లు ఆచ్ఛాదించి ఉంటాయి. చెట్టును ఆకులు రక్షించినట్లు, వేదోక్త కర్మకాండ ప్రవృత్తిని ప్రేరేపించి, ధర్మాధర్మాలు, తజ్జన్య ఫలాలను బోధిస్తూ సంసార వృక్షాన్ని పరిరక్షిస్తూ ఉంటుంది ***( వేదాః సంసార వృక్ష పరిరక్షణార్థాః ధర్మాధర్మ తద్ధేతు ఫల ప్రకాశనార్థత్వాత్ ! ).***

సంసార వృక్షము లేదా విశ్వ వృక్షంగా తెలిసే ఈ మాయా వృక్షము యొక్క ప్రస్తావన ఉపనిషత్తుల

లోను, మహాభారత పురాణాల లోను అనేక చోట్ల ఉంది. ***ఊర్ధ్వమూలో అవాక్ శాఖః ఏషోఽ శ్వత్థః సనాతనః*** - ఊర్ధ్వమూలత్వము, అధశ్శాఖత్వముగా వర్ణింప బడిన ఈ సంసార మనే అశ్వత్థ వృక్షము సనాతన మైనది అన్నది కఠోపనిషత్తు *(6 - 1)*. ఉత్కృష్టమైన బ్రహ్మము నుండి సంసార వృక్షము ఉద్భవించినా, బ్రహ్మము దీనికి అతీతం గానే, ఉన్నతం గానే భాసిస్తున్నాడు అన్నది శ్వేతాశ్వతరోపనిషత్తు *(6 - 6)*. మహాభారతము అశ్వమేధ పర్వంలో ***అవ్యక్తమూలప్రభవః*** - అంటూ విశ్వ వృక్షాన్ని అద్భుతంగా వర్ణించింది. వర్ణనలో వైచిత్ర్యము వివిధముగా గోచరించినా, కేంద్ర విషయం మాత్రం అంతటా ఒకే విధంగా ఉంది.

కఠోపనిషత్తులో ***అవాక్శాఖ*** అంటే భగవద్గీత ***అధశ్శాఖం*** అని; ఉపనిషత్తు ***సనాతనః*** అంటే, భగవద్గీత ***అవ్యయం*** అని, కేవలం పద మార్పిడులే గాని అర్థ భేదం ఎక్కడా లేదు.

మహాభారతం ***ఆజీవ్యః సర్వభూతానాం బ్రహ్మవృక్షః సనాతనః*** - సమస్త భూతములకు 'ఆజీవ్యం' అంటే ఆధారమైన ఈ బ్రహ్మవృక్షము సనాతన మైనది అని శోభాయమానంగా ప్రవచించింది. అశ్వత్థమును బ్రహ్మ వృక్షంగా అభివర్ణించడము విశిష్టంగా ఉంది. సంసార వృక్ష మనే అశ్వత్థమునకు బ్రహ్మమే అధిష్ఠానంగా ఉన్నందున విశ్వవృక్షాన్ని బ్రహ్మవృక్షంగా వర్ణించాడు వ్యాసుడు. బ్రహ్మవృక్షము కనుక బ్రహ్మవనం లోనే ఉంది అని ఇందులో అద్భుతమైన అంతర్భావము ఉంది. ఈ విషయాన్ని తరువాత వివరిస్తాను.

సంసార వృక్షము నామరూపాలతో ఉంది. నామరూపాలు కలవి ఏవైనా ఆద్యంతాలు కలిగే ఉంటాయి. ఆద్యంతాలు కలవి ఏవైనా కాలగతిలో అగుపించి అదృశ్య మవుతూ ఉంటాయి. ఇలాంటి సంసార వృక్షానికి ఆజీవ్యమైన వాడు బ్రహ్మమే అయినా, ఉన్నతుడైన బ్రహ్మము వృక్షాని కంటే, కాలాని కంటే, రూపాల కంటే అతీతమైన వాడు అని శ్వేతాశ్వతరోపనిషత్తు. అందంగా, అద్భుతంగా పరబ్రహ్మమును అధిష్ఠానంగా పొంది ఆవిర్భవించిన ఈ విశ్వ వృక్షము యొక్క స్వభావ స్వరూపాలు ఎలాంటివో సంక్షిప్తంగా తెలుసుకుందాం.

## వృక్ష స్వభావ స్వరూపాలు

సంసారమును వృక్షంతో పోల్చడము లోనే దాని అనిత్యత్వాన్ని తెలియచేసి నట్లైంది. ఎంత కాలమున్నా ఏదో ఒకనాడు ముక్క లయ్యేదే ***(వృక్షవ ద్వ్రశ్చనాత్)***. ఇకపోతే అందులో అన్నీ అనర్థాలే. జననమరణాలు, జరాశోకాలనే అనర్థాలతో నిండి ఉంటుంది ***(జన్మ మరణ శోకాద్యనేక అనర్థాత్మకః)***. క్షణక్షణానికి మారుతూ ఉంటుంది. ఇది ఇలా ఉంటుంది అని నిర్ణయించే లోగా ఎప్పుడు ఏది ఊడి పడుతుందో, ఎప్పుడు ఏది పాడవుతుందో, ఏది ఎప్పుడు ఎలా ఉంటుందో అర్థం కాకుండా ఉంటుంది ***(ప్రతి క్షణం అన్యథా స్వభావః)***.

ఉన్నట్లే ఉంటుంది. ఆశలు రేపుతుంది. అంతలోనే లేదనిపించి నిరాశను దించుతుంది. నీళ్ళను చూపెట్టి, తీరా దగ్గరకు వెళ్ళే సరికి నీళ్ళు లేవనే సత్యాన్ని చూపెట్టి కన్నీరు పెట్టించే ఎండమావి లాగా మాయను ప్రదర్శిస్తుంది. గగనంలో గోచరించే గంధర్వ నగరం లాగా ఒక క్షణంలో శోభనాకృతిలో కనిపించి, సమీపించే లోగా, ఆకాశాన మేఘాలు విచ్ఛిన్నమై గంధర్వ నగరం అదృశ్య మైనట్లే, కళ్ళ ముందే అగోచర మవుతూ ఉంటుంది ***(మాయా మరీ చ్యుదక గంధర్వ నగరాదివత్ దృష్ట నష్ట స్వరూపత్వాత్)***.

ఎన్ని మాయలు ప్రదర్శించినా అంతిమ దశలో చెట్టు కూలినట్లు కూలి పోయేదే ***(అవసానే చ వృక్షవత్ అభావాత్మకః)***. చివరలో ఎలాగూ చెదలు పట్టి పోయేదే, పోనీ ఉన్నంత వరకైనా సారభూతంగా ఉంటుందా? అదీ లేదు. అరటి బోదె వలె సారహీనమే; నిస్సారమే ***(కదళీ స్తంభవత్ నిస్సారః)***.

అశ్వత్థము అంటే రావిచెట్టు అని ముందే తెలుసుకున్నాము కదా! రావి ఆకులు నిరంతరము చలిస్తూనే ఉంటాయి. అలాగే అశ్వత్థ మైనందుకు ఈ సంసార వృక్షము కూడా కామ కర్మ వాయువుల కారణంగా





నిరంతరము చలిస్తూ ఉంటుంది. కంపన స్వభావంతో ఉంటుంది ***(ఏష సంసార వృక్షో అశ్వత్థో, అశ్వత్థవత్ కామ కర్మ వాతేరిత నిత్య ప్రచలిత స్వభావః)***. ఇవీ సంక్షిప్తంగా సంసార వృక్షము యొక్క స్వభావ స్వరూపాలు.

ఇక ప్రయోజనా లంటారా? ఏమున్నాయి? అశ్వత్థమై పోయె! రావిచెట్టులో పూలు పూయవు. పండ్లు ఉండవు. అంటే జ్ఞాన సుగంధం ఉండదు. మోక్షఫలం దొరకదు. ఇక ఆకు లంటారా? అనుక్షణం అల్లాడుతూ ఉంటాయే గాని అర్థవంతాలు కావు. చలనశీలాలే గాని ఉపయుక్తాలు కావు.

అందరి గూళ్ళు ఈ చెట్టు లోనే. వన్నెచిన్నెలతో చిందు లేసేది ఇక్కడే. వన్నెలాడి చిన్న బోయేదీ ఇక్కడే. అంద మేదో, ఆనంద మెక్కడో, ఎందుకనో మానవులకు అర్థం కావడం లేదు. అనిత్యాలే నిత్యాలుగా శోభించి బ్రతుకుల్ని బుగ్గిపాలు చేస్తున్నాయని ఒక కీర్తనలో త్యాగరాజస్వామి గానం చేశాడు.

*ఎందుకో బాగ తెలియదు*
*అందగాడ! శ్రీరామ! ఈ తను వస్థిరమని*
*ఈ కలిమానవులకు ॥ ఎందుకో ॥*

అని మోహాన్ని మాయం చేసే పనిలో భాగంగా మోహన రాగానికి ఆదితాళాన్ని జత చేసి కీర్తించాడు.

## అవ్యయము

ఈ అశ్వత్థ వృక్షము **అవ్యయము**. 'అవ్యయము' అంటే నశించనిది అని అర్థము. మరి, వృక్షము అన్నప్పుడే నశిస్తుంది అని అర్థం కదా! ఇంతవరకు అశ్వత్థ శబ్దార్థాన్ని మనం అలాగే గ్రహించాము. కాని, ఒక్కసారిగా నశించే స్వభావం గల దానిని అవ్యయం అనడం ఎలా పొసగుతుంది? అనే సందేహం కలుగుతుంది.

ఇక్కడ 'అవ్యయము' అంటే మాయామయము అని అర్థము. అంతేగాని నిత్యమని కాదు. నిత్యమైనది కాక పోయినా, ఆ చెట్టులో నివసించే జీవులకు అది నిత్యము గానే కనిపిస్తోంది. అనిపిస్తోంది. అదే ప్రవాహ నిత్యత్వము అంటే. ఎప్పుడూ ఉన్నట్లే ఉంటుంది. ఎప్పటి నుండి ఉందో అర్థం కాకుండా ఉంటుంది ***(అనాది కాల ప్రవృత్తత్వాత్)***. ప్రవాహము ఏదైనా అలాగే ఉంటుంది.

నదీ ప్రవాహాన్ని తీసుకోండి. నదీ జలాలు ముందుకు పోతూనే ఉంటాయి. నదిలో ఒక కాలు పెట్టినపుడు ఉన్న జలం రెండవ కాలు పెట్టే టప్పటికి ఉండదు. పూర్వ క్షణంలో ఉన్న జలం ముందుకు సాగిపోగా, ఉత్తర క్షణంలో పై నుండి వస్తున్న జల ప్రవాహము దానిని పూరిస్తూ ఉంటుంది. వాస్తవానికి నిరంతరము నదీ జలము మారుతూ ఉండినా, మనకు మాత్రం నది పూర్ణశోభ తోనే గోచరిస్తూ ఉంటుంది. అదే ప్రవాహ నిత్యత్వము.

ఈ ప్రపంచం కూడా ప్రవాహ నిత్యత్వముతో కనిపిస్తూ ఉంది. పోయే వాళ్ళు పోతూ ఉన్నారు. వచ్చే వాళ్ళు వస్తూ ఉన్నారు. పుట్టే వాళ్ళు ఒక వైపు పుడుతున్నారు. గిట్టే వాళ్ళు మరొక వైపు గిడుతున్నారు. ఒక వైపు ఖాళీ అవుతూ ఉంటే, మరొక వైపు భర్తీ అవుతూ ఉంది. పూచేవి పూస్తూ ఉన్నాయి. వాడేవి వాడుతూ ఉన్నాయి. వాలేవి వాలుతూ ఉన్నాయి. రాలేవి రాలుతూ ఉన్నాయి. ప్రాణవాయువు సదా చలిస్తూనే ఉంది. అయినా ప్రాణవాయువు అందక కొందరు నిష్క్రమిస్తూనే ఉన్నారు. కనుక ఈ సంసార వృక్షము అవ్యయము ***(అయం సంసార వృక్షః అవ్యయః)***.

వృక్షము శాఖోపశాఖలుగా విస్తరించినా, ఆకులతో, పువ్వులతో కళకళ లాడినా, ఈ విచిత్ర శోభ అంతా ఒకప్పుడు బీజంలో నిక్షిప్తమై ఉన్నదే. బీజములో లేనిది చెట్టులో ఎలా వస్తుంది? ప్రస్తుతం మహావృక్షముగా తెలిసేది పూర్వం బీజంలో అవ్యక్తంగా ఒదిగి ఉన్నట్లు, ఈ సంసార వృక్షము అనే ప్రపంచం కూడా సృష్టికి

పూర్వము ఊర్ధ్వమూలమైన బీజంలో అవ్యక్తంగా ఉన్నదే. అదే జగద్బీజము. ఊర్ధ్వంగా ఉండే కారణం (***బీజ స్యాన్తరి వాంకురో జగదిదం ప్రాక్ నిర్వికల్పం***).

బీజంలో అవ్యక్తంగా ఉన్నదే వృక్షరూపంలో వ్యక్త మైనట్లు, ప్రళయ కాలంలో జగద్బీజము నందు అవ్యక్తంగా ఉన్న విశ్వమే సృష్టి కార్యంగా వ్యక్త మవుతూ ఉంది. ఇలా అవ్యక్తము నుండి జగత్తు వ్యక్తం కావడమే సృష్టి. ఈ విధమైన సృష్టి ప్రళయాలు చక్ర వలయాలుగా సాగుతూనే ఉంటాయి. ఎన్ని ప్రళయాలు వచ్చాయో, ఎన్ని సృష్టులు ఆరంభ మయ్యాయో, ఇది ఎప్పటి నుండి సాగుతూ ఉందో ఎవరికి తెలుసు? అందుకే దీనిని అనాది అన్నారు.

అనాది అంటే ఆది లేనిది, ఆది లేని దానికి అంత ముండదు, అందుకే ఈ సంసార వృక్షము అవ్యయ మేమో! అని కూడా భావించే వారున్నారు. ఇక్కడ అనాది అంటే ఆది లేనిది అని కాదు. ఆది ఎక్కడో తెలియనిది అని అర్థము. ఎక్కడ ఆరంభమో, ఎక్కడ అంతమో అర్థం కాదు అని భావము. అనాదిగా అనంత దేహాది నామ రూపాలకు ఆశ్రయంగా ఉంది కనుక, విశ్వవృక్షము అవ్యయము (***ఆనాద్య నన్త దేహాది సంతానాశ్రయః సుప్రసిద్ధం***) అని ప్రసిద్ధి.

ఈ విశ్వవృక్షానికి ఆది ఎక్కడో అర్థం కాదు. అంత మెక్కడో అంతు పట్టదు. ఆద్యంతాలు అర్థం కానపుడు, దేనిని మధ్యమంగా గుర్తించాలి? ఎంత అర్థం చేసుకుంటున్నా అనంతం గానే మిగిలి ఉంది. అనంత రూపాలతో నిరంతరం మార్పు చెందుతూ ఉంది. అన్నీ కళ్ళ ముందే ఉన్నాయి. కార్యాలన్నీ కనేందుకే ఉన్నాయి. వినేందుకే ఉన్నాయి. కనిపిస్తూ, వినిపిస్తున్న కార్యాల యొక్క కారణాల లోకి తొంగి చూస్తే మనస్సు మొద్దుబారి పోతోంది. అంతా విచిత్రమే. అన్నీ రహస్యాలే. ఏదీ పూర్ణంగా అర్థం కాదు. ఎవరికీ ఎప్పుడూ అర్థం కాలేదు. ఎందుకని? ఏం చెప్పను? జరిగే వాటికి సంబంధించిన కార్యాలు, వాటికి సంబంధించిన జ్ఞానము, వీటిని తెలుసుకోవాలని ప్రయత్నించే వాడు, అందరూ ఈ చెట్టు లోనే కాపురం ఉంటున్నారు. అందరి గూళ్ళు ఇందు లోనే ఉన్నాయి. మనం ఎక్కడున్నా, ఎలా ఉన్నా, ఏది తెలుసుకున్నా, అంతా వ్యావహారికమే గాని ఏదీ పారమార్థికం కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ ప్రపంచము మిథ్య. సత్యరూపుడైన పరమేశ్వరుని ఆశ్రయించుకొని మనుగడ సాగించే మిథ్యా జగత్తు. మాయా ప్రపంచము. స్వప్నతుల్యము. మాయలో దూరి మాయను ఎలా అర్థం చేసుకోవాలి? కల గనే వాడికి ఇది కల అని తెలిస్తే, ఇక కల ఎక్కడుంది? నిజమే. అది తెలియదు. తెలిసి రాదు. అందుకనే జగత్తు మిథ్యే అయినా అవ్యయం అని చెప్పబడింది. తెలిసిన వారికి మిథ్య. తెలియని వారికి అవ్యయము, అనంతము. జ్ఞానము లేని వారికి ఏది అశ్వత్థ వృక్షమో, భ్రాంతిమయమో, జ్ఞానము కల వారికి అది బ్రహ్మవృక్షము.

**బ్రహ్మ వృక్షము**

సంసార వృక్షానికి బ్రహ్మము అధిష్ఠానం కాబట్టి, బ్రహ్మము చేత అధిష్ఠితమైన అశ్వత్థమునకు బ్రహ్మ వృక్షము అనే పేరు కూడా ఉంది. ఏ జాతి చెట్లు ఆ వనంలో ఉంటాయి. మామిడి తోట అన్నప్పుడు ఆ తోటలో మామిడి చెట్లే ప్రధానంగా ఉంటాయి. కొబ్బరి తోట అంటే కొబ్బరి చెట్లు, మల్లెతోట అంటే మల్లె చెట్లు ఉంటాయని అర్థము. అలాగే ఈ సంసార వృక్షాన్ని బ్రహ్మవృక్షము అన్నప్పుడు అది ఉండే వనము బ్రహ్మవనము అవుతుంది. ఇది చాలా ఆసక్తిదాయక మైన విషయము. అది కూడా చెప్పుకుందాం.

వృక్షానికి సారభూత మైనది బీజమే అని అర్థం చేసుకున్నాం కదా! బ్రహ్మమే మాయ ద్వారా సంసరిస్తూ ఉంది కనుక సంసార వృక్షము ఏర్పడింది. అయినా, సంసారముతో బ్రహ్మమునకు సంసర్గము లేదు. బ్రహ్మము





సాక్షి స్వరూపము (***బ్రహ్మ సాక్షివత్ ఆచరతి***). కనుక సంసారము యొక్క గుణ దోషాలు బ్రహ్మమును అంటవు. బ్రహ్మము అసంగము.

ఇంతవరకు మనం అర్థం చేసుకున్న దానిని బట్టి అశ్వత్థము అని చెప్పబడిన సంసార వృక్షము అనర్థ దాయకము, వ్యామోహ నిలయము, శోకమయము. అంతవరకు బాగానే ఉంది. మరి, అలాంటి దానిని తెలుసుకున్న వాడు వేదవిదుడు అవుతున్నాడు అని చెప్పడమే మ్రింగుడు పడని విషయంగా కనిపిస్తుంది (***యస్తం వేద స వేదవిత్***). ఫరవాలేదు. అదీ తెలుసుకుందాం.

**బ్రహ్మవనము**

బీజంలో ఏ రసం ఉంటుందో, వృక్షంలో అదే రసం ఉంటుంది. వేపచెట్టు చేదు గానే ఉంటుంది. తిక్త రసంతో నిండి ఉంటుంది. నింబ బీజము తిక్త రస పూర్ణంగా ఉంది కనుక, నింబ వృక్షము కూడా తిక్తరస తోనే నిండి ఉంటుంది. నింబఫలము లోని రసం బింబఫలంలో ఉండదు. బింబఫలం లోని రసం నింబఫలంలో ఉండదు.

మరి, అశ్వత్థ మనే సంసార వృక్షమునకు బ్రహ్మము బీజరూపంగా ఊర్ధ్వ మూలమై ఉండే టప్పుడు, జ్ఞానైక రస రూపుడైన బ్రహ్మము నుండి ఉత్పన్నమైన విశ్వ వృక్షము కూడా జ్ఞానానంద స్వరూపం గానే ఉండాలి కదూ? అవును. అందుచేతనే ***సర్వం ఖల్విదం బ్రహ్మ*** - ఈ జగత్తు అంతయూ బ్రహ్మమే. ***బ్రహ్మై వేదం విశ్వ మితి*** - ఈ విశ్వము సమస్తము బ్రహ్మమే. ***వాసుదేవ స్సర్వమితి*** - ఈ సమస్త ప్రపంచము వాసుదేవ స్వరూపమే అని జ్ఞానులు తెలుసు కుంటున్నారు. కనుకనే, ఊర్ధ్వమూలము, అధశ్శాఖలు, వేదపర్ణాలు కలిగి అవ్యయంగా శోభిస్తున్న అశ్వత్థమును ఎవడు తెలుసుకుంటాడో, వాడే వేదవేత్త (***వేదార్థవిత్ ఇత్యర్థః***) అంటున్నాడు. అశ్వత్థ మును అర్థం చేసుకున్న వాడు అశ్వత్థ నారాయణుని అర్థం చేసుకున్న వాడే అవుతున్నాడు. ఎందుకో తెలుసా? అశ్వత్థ మనే విశ్వవృక్షంలో ఉన్నదంతా అశ్వత్థ నారాయణుడే. అందుకే విశ్వము బ్రహ్మవృక్ష మైతే, బ్రహ్మవృక్ష మైన అశ్వత్థమునకు ఆధారమైన, ఆశ్రయమైన బ్రహ్మము బ్రహ్మవనంగా ప్రసిద్ధ మైంది. సర్వ వేదములు బ్రహ్మమునే ప్రతిపాదిస్తున్నాయి కనుక వేదవిదుడు బ్రహ్మవిదుడే అగుచున్నాడు (***సర్వే వేదా యత్పద మామ నన్తి***) అన్నది వేదము.

'వనం' అంటే వననీయము, భజనీయము అని అర్థము. భగవంతుడు ఉపాసించ దగిన వాడు. భజనీయ మైన వాడు కనుక, బ్రహ్మము (***తత్***) వననీయుడు (***వనం***) అన్నది కేనోపనిషత్తు. పరమాత్మ 'తద్వనం' అనే నామంతో ప్రసిద్ధుడు. కనుక బ్రహ్మము 'తద్వనం' అని తెలిసి ఉపాసించాలి అన్నది కేనోపనిషత్తు (***తత్ హ 'తద్వనం' నామ, తద్వనం ఇతి ఉపాసితవ్యం***). ప్రతి ప్రాణి లోను అంతరాత్మ రూపంగా ప్రతిష్ఠింపబడి ఉన్న కారణంగా బ్రహ్మము వననీయము లేదా భజనీయము అని ఈ మంత్రంపై శ్రీ శంకరాచార్యస్వామి వ్యాఖ్యానించారు.

ప్రాణులన్నీ ప్రపంచం లోనే ఉన్నాయి. ప్రాణు లన్నిటిలో ఉన్న ప్రత్యగాత్మ పరమాత్మే అయినప్పుడు, ప్రపంచములో ఉన్నదంతా పరమాత్మే కదా! సంసార వృక్షంలో నిండి నిబిడీకృత మైనది బీజరూపుడు, సారభూతుడు అయిన పరమాత్మే కదా! కనుకనే ఈ సంసార వృక్షమును తెలుసుకున్న వాడు వేదవిదు డవుతున్నాడు. బ్రహ్మవిదుడు అవుతున్నాడు. ఒక వైపు సంసార వృక్షము అనిత్యము కనుక అశ్వత్థము అని అంటూ, మరొక వైపు అవ్యయము మరియు బ్రహ్మవృక్షము కనుక భజనీయము అని చెప్పడం పరస్పర విరుద్ధం కాదా? అనే సంశయం స్ఫురించే ప్రమాదం లేక పోలేదు.

## సత్యమిథ్యలు

బ్రహ్మ మొక్కటే సత్యం. ప్రపంచమునకు బ్రహ్మమే అభిన్న నిమిత్త ఉపాదాన కారణము. కార్యమైన ప్రపంచము కారణమైన బ్రహ్మము కన్నా భిన్నం కాదు. కార్యమైన కుండ కారణమైన మట్టే అయినట్లు, కార్య మైన ప్రపంచము కారణమైన పరమాత్మే. కానీ, కుండ మట్టే అయినా, మట్టి కుండ కానట్లు, మిథ్య యైన ప్రపంచము సత్యమైన పరమాత్మే అయినా, సద్రూపమైన పరమాత్మ మిథ్యా ప్రపంచము కాదు. మిథ్య కూడా బ్రహ్మమే. కాని, బ్రహ్మము మిథ్య కాదు. కనుక ప్రపంచమును ప్రపంచముగా గ్రహించే వాడు వేదవేత్త కాలేడు. ఎందుకంటే, ప్రపంచము ప్రపంచముగా మిథ్య. ప్రపంచం పరమాత్మగా సత్యం. కనుక, ప్రపంచ మును ప్రపంచముగా కాకుండా పరమాత్మగా గ్రహించే వాడే వేదవేత్త. అతడే బ్రహ్మవేత్త. సర్వం బ్రహ్మమయంగా దర్శించి అద్వైతానుభూతిలో ఓల లాడేవాడు.

సత్యమును దర్శించే వారికి ఈ అశ్వత్థ మనే సంసార వృక్షము బ్రహ్మవృక్షమే. కనుక అవ్యయము; భజనీయము.

అలా కాకుండా మిథ్యా దృష్టితో ప్రపంచమును ప్రపంచముగా చూచే వారికి ఈ విశ్వవృక్షము అశ్వత్థమే. ఛేదించ దగినదే. భేదించ దగినదే ***(భిత్వా చ భిత్వా చ)***. కనుక మాయా మోహితులైన వారికి ఈ ప్రపంచము అశ్వత్థ వనము; భ్రాంతిమయము. మహిమ తెలిసిన వారికి ఈ జగత్తు బ్రహ్మవనము; బ్రహ్మమయము. ఈ విషయాన్ని బ్రహ్మసూత్రాలు విస్పష్టం చేశాయి.

***పరాభి ధ్యానాత్తు తిరోహితం తతో హ్యస్య బన్ధ విపర్యయౌ,*** *( బ్ర.సూ. 3 - 2 - 5 )*

అవిద్య చేత కప్పబడిన జీవ స్వరూపం ***(తిరోహితమ్)*** పరమాత్మను ధ్యానించడం చేత ***(పరాభి ధ్యానాత్)*** వ్యక్త మవుతుంది. కనుక జీవునికి ***(అస్య)*** బంధమోక్షాలు ***(బంధ విపర్యయౌ)*** పరమాత్మ వలననే కలుగు తున్నాయి కదా ***(తతోహి)*** అనేది సూత్రార్థం. అంటే, పరమాత్మ స్వరూపం తెలియక పోతే బంధము; తెలిస్తే మోక్షము. అంతే.

*ఈ సంసార వృక్షానికే మరొక విధంగా, అంటే అన్యంగా లేదా విశేషంగా అవయవ కల్పన చేసి చెబుతున్నాడు.*

అధ శ్చోర్ధ్వం ప్రసృతా స్తస్య శాఖా గుణ ప్రవృద్ధా విషయప్రవాలాః ।
అధశ్చ మూలా న్యనుసన్తతాని కర్మానుబన్ధీని మనుష్యలోకే ॥ 2

***అధః-చ-ఊర్ధ్వం-ప్రసృతాః-తస్య-శాఖాః-గుణప్రవృద్ధాః-విషయప్రవాలాః***
***అధః-చ-మూలాని-అనుసంతతాని-కర్మానుబంధీని-మనుష్యలోకే***

| | | | |
|---|---|---|---|
| తస్య | = దాని యొక్క | ప్రసృతాః | = వ్యాపించి ఉన్నాయి |
| శాఖాః | = కొమ్మలు | మూలాని | = మొదళ్ళు |
| గుణప్రవృద్ధాః | = గుణములచే వృద్ధి పొందాయి | కర్మానుబంధీని | = కర్మ సంబంధము కలవి |
| విషయ ప్రవాలాః | = విషయములే చిగుళ్ళు | మనుష్యలోకే | = మానవ లోకములో |
| అధః చ | = క్రిందికి | అధః చ | = క్రిందికి |
| ఊర్ధ్వం | = మీదికి | అనుసంతతాని | = విస్తరించి ఉన్నాయి |





**అర్జునా! సంసార వృక్షము యొక్క కొమ్మలు క్రిందికి, పైకి వ్యాపించి ఉన్నాయి. అవి గుణముల చేత వృద్ధి చెందాయి. విషయాలే వాటికి చిగుళ్ళు . మానవ లోకంలో కర్మ సంబంధాన్ని కలిగించే మొదళ్ళు క్రిందికి అల్లుకొని పోయాయి.**

### వ్యాఖ్య

ఊర్ధ్వమూలత్వాది రూపంలో ప్రథమ శ్లోకంలో వర్ణింప బడిన సంసార వృక్షానికి అన్యమైన అవయవ కల్పనతో అదే వృక్షాన్ని వర్ణిస్తున్నాడు. పూర్వ శ్లోకం కన్నా ఇది భిన్న మైనది.

**శాఖా విస్తరణము**

ఈ సంసార వృక్షము యొక్క శాఖలు ***(తస్య శాఖాః)*** క్రిందికి పైకి ***(అధః చ ఊర్ధ్వమ్)*** విస్తారంగా వ్యాపించి ఉన్నాయి ***(ప్రసృతాః)***.

పూర్వ శ్లోకంలో ఊర్ధ్వం అంటే ఉత్కృష్టమైన పరబ్రహ్మము అని అర్థం చేసుకున్నాం కనుక, దానిని నిత్యంగా ***(నిత్యత్వాత్)***, సర్వకారణంగా ***(కారణత్వాత్)*** శ్రేష్ఠ మైనదిగా ***(మహత్త్వాత్)*** అర్థం చేసుకున్నాం.

అలాగే 'అధః' అంటే క్రిందికి కొమ్మలు కలిగిన సంసార వృక్షంగా, అనిత్య మైనదిగా ***(అశ్వత్థః)***, క్షణాల్లో నశించేదిగా ***(క్షణ ప్రధ్వంసినమ్)*** చెప్పుకున్నాం. కనుక అవ్యక్త మాయా శక్తిమత్వముతో శోభించే బ్రహ్మమును కారణముగా అర్థం చేసుకుంటే, చతుర్ముఖ బ్రహ్మ మొదలుకొని సమస్త సృష్టి కార్యము సంసార వృక్షము లోనే ఉందని అర్థము.

ప్రస్తుత శ్లోకంలో అదే సంసార వృక్షానికి సంబంధించిన భిన్నమైన అవయవ కల్పన చెప్పబడుతూ ఉంది. ఈ విధమైన అవయవ కల్పనలో మానవులు మొదలుకొని స్థావరాంతం వరకు, అంటే వృక్ష లతాదుల వరకు 'అధ' శబ్దార్థము. అలాగే మానవులు మొదలుకొని జగత్కర్త యైన బ్రహ్మదేవుని సత్యలోకం వరకు 'ఊర్ధ్వ' శబ్దార్థము. ఇలా విస్తరించిన ప్రాణులు ఆచరించిన కర్మోపాసనల యొక్క ఫలములే ఈ సంసార వృక్షానికి శాఖలై, అటు ఊర్ధ్వం గాను, ఇటు అధోమార్గం లోను అంతట అపారంగా విస్తరించి ఉన్నాయి. ఈ విధమైన ఉపాసనా కర్మల ఫలాలే 'శాఖా' శబ్దార్థము.

***అవశ్యం అనుభోక్తవ్యం ఫలం కర్మ శుభాశుభమ్*** - ప్రాణులు ఆచరించే శుభాశుభ కర్మల యొక్క ఫలాలను వారు తప్పించుకో లేరు. కర్మను ఆచరించిన వారందరూ ఫలమును అనుభవించ వలసిన వారే. ఆచరింప బడిన కర్మ అనుభవించిన తరువాతే నశిస్తుంది ***(నా భుక్తం క్షీయతే కర్మ)***.

ఉపాధులు కూడా కర్మఫలాలే. ఎవరికి ఏ విధమైన దేహం ప్రాప్తించినా, అది మానవ దేహమైనా, దేవతా శరీర మైనా, పశుపక్ష్యాదుల ఉపాధులైనా, ఆయా ఉపాధులు సంక్రమించ డానికి అనుగుణమైన కర్మలు వారు ఆచరించే ఉంటారు. ఎవరు ఏయే కర్మలు చేశారు? ఏ విధమైన కర్మలను ఆచరించడం వలన ఆ ఉపాధులు సంక్రమించాయి? అనేది వారికి తెలియక పోవచ్చు. తెలియనంత మాత్రాన చేసిన కర్మలు ఆవిరై పోవు. అలా జరిగే టట్లైతే కర్మఫలాలు ఎలా ప్రాప్తించాయి? కర్మఫలంగా దేహా లెలా సంక్రమించాయి? కనుక, ఉపాధుల రూపాలలో కర్మఫలాలే కనిపిస్తున్నాయి.

***శుభై రాప్నోతి దేవత్వం నిషిద్ధైః నారకీం తనుమ్ ।***
***ఉభాభ్యాం పుణ్య పాపాభ్యాం మనుష్యత్వం లభతే నరః ॥***

పుణ్యఫలంగా జీవులు దేవతా శరీరాలను ధరిస్తారు. పాపఫలంగా నరకంలో వసించే దేహాలను పొందుతారు. పుణ్యపాపాల రెండిటి మిశ్రమ ఫలంగా మానవ శరీరాన్ని ధరిస్తారు.

కేవలం పుణ్యఫల విశేషంగా దేవతా శరీరాలు ప్రాప్తిస్తే, కేవలం పాపఫల విశేషంగా నీచ జన్మలు సంక్రమిస్తే, పుణ్యపాప కర్మల మిశ్రమ ఫలంగా మానవ శరీరాలు సంప్రాప్తిస్తాయి.

**మానవ జన్మ దుర్లభము**

జన్మ అంటేనే శరీరమును ధరించుట అని అర్థము. ధరించే శరీరము ఏదైనను, దేహ సంబంధము కలిగి ఉన్నప్పుడే అది జన్మ అవుతుంది (*శరీర సంబంధస్య ఏవ జన్మ శబ్దార్థత్వాత్*). దేహములను ధరించుట కర్మఫల మైనపుడు, సురనర పశ్వాది దేహాలన్నీ కర్మఫలాలే అని అర్థమై పోయింది. అయినా, ఈ విధంగా శరీరాలను పొంది జన్మించే జీవులలో మానవ జన్మయే ఉత్కృష్ట మని చెప్పబడింది (*జనన శీలానాం ప్రాణినాం నరజన్మ మానుష్యకం దుర్లభం ఇతి !*).

కేవలం పాపకర్మ ఫలితంగా ప్రాప్తించే నీచజన్మల కన్నా, పుణ్యపాప కర్మల మిశ్రమ ఫలంగా ప్రాప్తించే మానవ జన్మ ఉత్తమ మైంది అంటే అర్థం చేసుకోగలం. కాని, కేవలం పుణ్యకర్మ ఫలంగా ప్రాప్తించే దేవతా శరీరాలు ఉన్నాయి. అవి కూడా కర్మఫలంగా ప్రాప్తించిన ఉపాధులే కదా! మరి, దేవతా శరీరాల కన్నా కూడా మానవ దేహాలను పొందడం దుర్లభము అనే దానిని ఎలా అర్థం చేసుకోవాలి? అనే శంక ఎవరి కైనా కలుగుతుంది. ఎందుకంటే, మానవుల కన్నా దేవతలు శ్రేష్ఠులు అనేది సామాన్యంగా సర్వులకు తెలిసిన విషయం. అలాంటప్పుడు నరజన్మ ఒక్కటే ఎలా దుర్లభము? అదీ తెలుసుకుందాం (*కిల నరజన్మ దుర్లభ మితి వక్తుం శక్యం*).

నరజన్మ దుర్లభం అన్నప్పుడు, అక్కడ జన్మ వైశిష్ట్యము, ఏ కర్మఫలంగా ఉపాధి సంభవించింది అని గతానికి సంబంధించిన కర్మ విశేషాన్ని బట్టి నిర్ణయించింది కాదు. ఏ ఉత్కృష్టమైన స్థితిని భవిష్యత్తులో సాధించే అవకాశ ముంది అని భావి ప్రగతికి ప్రాధాన్యత నిచ్చి నిర్ణయించింది. అందుచేతనే ఉపాధులలో మానవ శరీరము, లేదా నరజన్మ దుర్లభం అని చెప్పడం జరిగింది. అలా కాకపోయి నట్లైతే, కేవలం పుణ్యఫల విశేషంగా ప్రాప్తించిన దేవతా శరీరమే ఉత్కృష్ట మని, దేవ జన్మయే దుర్లభ మని చెప్పవలసి ఉండేది.

ఉపాధులు కలిగిన జీవులు ఎవరెవరు ఏదేది పొంది ఉన్నారు అనేది అప్రధానమైన విషయం. పొందదగిన వాటిలో ఉత్కృష్ట మైనది మోక్షమే కనుక, మోక్షప్రాప్తికి ఏది అనుకూలమైన ఉపాధి అని విచారించినపుడు, ఆ అవకాశము మానవ ఉపాధిని పొందిన నరజన్మకే ఉంది కనుక, దేహధారులై జన్మ నెత్తిన వారిలో నరజన్మ నెత్తిన మానవులే దుర్లభమైన జన్మను పొందిన వారుగా చెప్పబడ్డారు.

మోక్షప్రాప్తి మానవులకే సాధ్యం. కేవలం పాపకర్మల ఫలంగా ప్రాప్తించిన నీచజన్మ లెత్తిన జీవులకు మోక్ష కాంక్ష ఉండే అవకాశమే లేదు. కేవలం పుణ్యకర్మల ఫలంగా ప్రాప్తించిన దేవతా శరీరాలను ధరించిన స్వర్గలోక వాసులకు మోక్షవాంఛ ఉండినా, అది తీరే అవకాశము లేదు.

పుణ్యఫలంగా దేవతా శరీరాలు ప్రాప్తించాయి కనుక అవి పుణ్యక్షయ మయ్యే వరకు స్వర్గాది భోగాలను అనుభవించే కార్యాలలో నిమగ్నమై ఉంటాయే గాని, సుఖ భోగాలను త్యజించి, వైరాగ్యంతో తత్త్వ విచారం చేసే స్థితిలో ఉండవు. పుణ్య ఫలంగా సంక్రమించిన స్వర్గాది లోకాల లోని భోగాలను అనుభవించిన తరువాత, పుణ్యం నశిస్తుంది కనుక అవి తిరిగి మానవ లోకంలో జన్మించడం జరుగుతుంది. కనుక, దేవతా శరీరాలు పుణ్యఫల విశేషాలు కనుక శ్రేష్ఠ మైనవే అయినా, దేవతలలో మోక్షేచ్ఛ జనించే అవకాశం లేదు. పుణ్యపాప





కర్మల ఫలితంగా ప్రాప్తించిన మానవజన్మను పొందిన వారికే మోక్ష కాంక్ష కలిగే అవకాశ ముంది. ఈ కారణంగా నరజన్మ దుర్లభ మని చెప్ప బడింది.

**నరజన్మ అందమైన కూడలి**

స్వర్గంలో కేవలం సుఖమే ఉంటుంది. సుఖానుభూతి మాత్రమే కలుగుతుంది. నరకంలో కేవలం దుఃఖమే ఉంటుంది. దుఃఖానుభూతి మాత్రమే కలుగుతుంది. స్వర్గవాసులు సుఖాలలో పడి దొర్లుతూ ఉంటారు కనుక వారికి మోక్ష భావనే ఉండదు. నరకవాసులు దుఃఖమగ్నులై ఉంటారు కనుక, దుఃఖ నివృత్తికి పరితపిస్తూ ఉంటారే గాని ఆత్మానాత్మ విచారం చేసే స్థితిలో ఉండరు.

మానవ లోకంలో (*మనుష్య లోకే*) మనుష్యులు మిశ్రమ కర్మఫలంగా సుఖదుఃఖాలు రెండిటిని అనుభవిస్తూ ఉంటారు. సుఖాలు అప్పుడప్పుడూ కలిగినా, అవి అల్పసుఖాలుగా, స్వల్ప సుఖాలుగా, దుఃఖాలయానికి తలుపులు తెరిచే సుఖాలుగా ఉంటాయి (*సుఖ మల్పం బహు క్లేశః*). ఈ విధమైన అనిత్య సుఖాలలో పడి అల్లాడుతూ అసంతృప్తితో ఆవేదన చెందే మనిషి ఏది సుఖము, ఏది అసుఖము, ఏది నిత్యసుఖము? అనే విచారంలో పడే అవకాశము ఉంది. విచారము మొదలైంది అంటే, ఆ తరువాత ఆ ప్రయాణము శ్రేయో మార్గంలో ఉంటుందే గాని ప్రేయో మార్గంలో ఉండదు. స్వర్గ సుఖాలను అనుభవించే దేవతలకు సుఖ భోగాలకు సంబంధించిన స్పృహ ఉంటుందే గాని, వైరాగ్య భావన కలగదు. అంతా విలాసమయమే గాని విరాగము మొలకెత్తే అవకాశమే లేదు.

మానవ లోకంలో సుఖాలు అనిత్యాలుగా తెలుస్తూ ఉంటాయి. దుఃఖాలు సుఖ శూన్యాలుగా అర్థ మవుతూ ఉంటాయి. అటు సుఖాలలో రమించ లేక, ఇటు దుఃఖాలలో గమించ లేక, రెండిటి నుండి విరమించి, విరక్తితో విచారమును కొనసాగించే అవకాశము మానవునికే ఉంది. అందుకే మానవ జన్మ దుర్లభము.

మానవ లోకంలో కర్మాధికారమే కదా ప్రసిద్ధము (*మనుష్య లోకే విశేషతః అత్ర హి మనుష్యాణాం కర్మాధికారః ప్రసిద్ధః*). కర్మాధికారం గల మానవుడు సత్కర్మానుష్ఠానము, ఈశ్వర భక్తి కొనసాగించి చిత్తశుద్ధిని, చిత్త నైశ్చల్యాన్ని పొంది, మోక్ష మార్గంలో విచారం చేసి, జ్ఞానప్రాప్తి ద్వారా జీవన్ముక్తుడై తరించి పోవచ్చు.

లేదా, ప్రాపంచిక విషయ వాసనా సుడిలో పడి, అనిత్య సుఖానుభవానికి అకృత్యాలను ఆచరించి, బ్రతుకును అన్యాయం చేసుకొని, అతి హేయమైన నీచ జన్మలలో పడి పోవచ్చు.

అలా కాకుండా, అనేక పుణ్య కార్యాలను ఆచరించి - లౌకిక మైన ఇష్టాపూర్తములు గాని, లేదా యజ్ఞ యాగాది విశిష్ట కర్మలను గాని విశేషంగా ఆచరించి, పుణ్యమును ఆర్జించి, పుణ్యఫల విశేషంగా సురాది లోకాలను పొంది సుఖించ వచ్చు. దేని కైనా - ముముక్షువుగా మారి మోక్ష సామ్రాజ్యాన్ని అధిష్ఠించాలి అనుకున్నా, పుణ్యకర్మల నాచరించి స్వర్గాది లోకాలను చేరా లనుకున్నా, నీచ మార్గంలో చరించి నికృష్ట యోనులలో పడి దురదృష్టకర మైన బ్రతుకును అనుభవించా లనుకున్నా - అన్ని మార్గాలకు అందమైన కూడలిగా మానవజన్మ ఉంది. అందుకే నరజన్మ దుర్లభ మైంది.

**విస్తరించిన సంసార వృక్షము**

మానవ జన్మ సర్వులకు కూడలి అనే భావనను బొదల దాల్చి, ప్రస్తుత శ్లోకంలో సంసార వృక్ష అవయవ కల్పనను ఊర్ధ్వ అధో శబ్దార్థాలతో వర్ణించడం జరిగింది. ఊర్ధ్వమును, అధో భాగమును రెండిటిని మానవ స్థాయి నుండే గ్రహించి నిర్ణయించడం స్పష్టంగా కనిపిస్తోంది.

మానవులు మొదలుకొని స్థావరాదులైన వృక్ష లతాదుల వరకు క్రిందికి (*అధః*). అలాగే మానవులు

మొదలుకొని హిరణ్యగర్భుడు వసించే బ్రహ్మలోకము వరకు పైకి ***(ఊర్ధ్వం)***, ఈ సంసార వృక్షము యొక్క శాఖలు అపారంగా విస్తరించి ఉన్నాయి అని చెప్పడం జరిగింది. అంటే, కర్మఫలాలు వృక్ష శాఖ ల్లాగా సర్వత్ర వ్యాపించి ఉన్నాయి అని అర్థం ***(యథా కర్మ యథా శ్రుతం జ్ఞాన కర్మ ఫలాని తస్య వృక్షస్య శాఖాః ప్రసృతాః ప్రగతాః)***.

దేవతా జన్మలు, అంటే సుర లోకము నుండి బ్రహ్మ లోకము వరకు ఊర్ధ్వ లోకాలలో వసిస్తున్న దేవత లందరూ వారి వారి పుణ్యఫల విశేషంగా ఆయా లోకాలలో పైకి ప్రాకిన చెట్టుకొమ్మల లాగా వ్యాపించి ఉన్నారు అని అర్థం.

అలాగే జంతువులు, పశుపక్ష్యాదులు, స్థావర జంగమాలతో సహ సమస్త జీవులు క్రిందికి వ్యాపించిన కొమ్మలు, ఊడలు లాంటి వారని అర్థము. మధ్యలో మానవలోక ముంది. ఇలా పైన, క్రింద, మధ్యన వ్యాపించి ఉన్న జీవు లందరూ, కర్మానుసారంగా, శాస్త్రోక్త విధి ననుసరించి, ఫలానుభవానికి ఆయా ప్రదేశాలలో విస్తరించి ఉన్న శాఖలుగా తెలుస్తున్నారు.

పిండి కొద్ది రొట్టె - తిండి కొద్ది దేహం అనే సామెత ఉండనే ఉంది కదా! వృక్షములో కొమ్మలు పెరుగుతూ ఉండటం మనం చూస్తాం. సాధారణ వృక్ష జాతిలో కొమ్మలు ఎరువుతో, జలాలతో వృద్ధి చెందుతాయి. మరి, కర్మఫలాల రూపంలో ఇంతవరకు మనం చూచిన సంసార వృక్ష శాఖలు ఎలా వృద్ధి చెందుతాయి? కొమ్మలు వృద్ధి చెందడము, విస్తరించడము అనేది చిగుళ్ళ మీద ఆధారపడి ఉంటుంది. మరి, ఈ సంసార వృక్షానికి చిగుళ్ళు ఏమిటి? అవి వేటి చేత వృద్ధి చెందుతాయి? సంసార వృక్షం గుణాల చేత వృద్ధి చెందుతుంది ***(గుణ ప్రవృద్ధాః)***. శబ్దాది ఇంద్రియ విషయాలే వాటికి చిగుళ్ళు ***(విషయ ప్రవాలాః)***.

**పెరిగే కొమ్మలు - పూచే చిగుళ్ళు**

గుణాలు ప్రకృతి సంభవాలు. ప్రకృతి సత్త్వ రజ స్తమో గుణాత్మకము. త్రిగుణాలే క్షేత్ర స్థాయిలో వ్యాపించి ఉన్నాయి. కనుక ఊర్ధ్వంగా దేవ శరీరాలలో ప్రసరించి యున్న కర్మఫలా లనే శాఖల యందు గాని, *అధః* ***ప్రసృతాః*** - క్రిందికి, పశ్వాది శరీరాలు మొదలుకొని స్థావరముల వరకు విస్తరించి యున్న కర్మఫలా లనే శాఖల యందు గాని గుణాలే వ్యాపించి ఉన్నాయి. కుండకు ఉపాదానమైన మట్టి, కుండ నంతా వ్యాపించి ఉన్నట్లు, కర్మఫలా లనే శాఖలకు ఉపాదాన కారణ మైన సత్త్వ రజ స్తమో గుణాల చేత శాఖలు వృద్ధి చెందుతాయి. అందుకే అవి గుణ ప్రవృద్ధాలు ***(గుణ ప్రవృద్ధాః - గుణైః సత్త్వ రజ స్తమోభిః ప్రవృద్ధాః స్థూలీకృతాః ఉపాదాన భూతైః)***. ఏ విధంగా అయితే చెట్టుకొమ్మలు జలాల చేత వృద్ధి చెందుతూ ఉంటాయో, అలాగే గుణాల వల్ల కర్మలు వృద్ధి చెందుతూ ఉంటే, వృద్ధి చెందే కర్మల ఫలితంగా జన్మలు విస్తరిస్తూ ఉంటాయి. అంటే, గుణ వికారాలైన కామక్రోధ లోభాదుల చేత, వాటి కార్యాలైన పుణ్యపాపాల వలన సంసార వృక్ష శాఖలు విస్తరిస్తూ పోతాయి. అదే గుణ ప్రవృద్ధము. శాఖా విస్తారమునకు సహకరించేవి చిగుళ్ళు ***(ప్రవాలాః)***.

గుణాల చేత వృద్ధి చెందే శాఖలకు విషయాలే చిగుళ్ళు ***(విషయ ప్రవాలాః - విషయాః శబ్దాదయః ప్రవాలాః)***. గుణాల చేత వృద్ధి చెందే కర్మఫలా లనే శాఖలకు శబ్దాది విషయాలే చిగుళ్ళు. ఇక్కడ ఉపాధులే కర్మల వలన కలిగిన ఫలాలు. అంటే, శరీరాది ఫలాలే ఇక్కడ శాఖలుగా చెప్పబడ్డాయి.

తరువులు పెరుగుతూ ఉంటాయి. శాఖలు విస్తరిస్తూ ఉంటాయి. విస్తరించే శాఖలు లేదా కొమ్మలు క్రొత్త చిగుళ్ళు తొడుగుతూ ఉంటాయి. చిగుళ్ళు కొమ్మలలో చేవను పెంచుతాయి. లివను దించుతాయి. చిగుళ్ళు వేసినంత కాలము కొమ్మలు ఎండిపోవు. పచ్చగా కనిపిస్తూ ఉంటాయి.





అలాగే కర్మఫలాలైన తనువు లనే కొమ్మలు విషయా లనే చిగుళ్ళతో ప్రకాశిస్తూ ఉంటాయి. ప్రవర్తిస్తూ ఉంటాయి. ఉప శాఖలను పెడుతూ విస్తరిస్తూ ఉంటాయి. రెమ్మలతో కొమ్మలు వ్యాపించ డానికి చిగుళ్ళే ప్రధాన కారణము.

కర్మల వలన ఏర్పడిన దేహాది ఫలా లనే కొమ్మలు, విషయా లనే చిగుళ్ళ వల్ల నూతన దేహాదులను పొందుతూ జన్మలలో వ్యాపిస్తూ ఉంటాయి. సంసార వృక్షానికి ప్రాణం పోస్తూ జన్మజన్మలకు నడిపిస్తూ ఉంటాయి. ఇదే జననమరణ సంసృతి, లేదా సంసారము.

తరువులు బ్రతకాలి అంటే జలమే ప్రధానము. అలాగే తనువులు కొనసాగాలి అంటే కర్మే ప్రధానము. సంసార వృక్షానికి కర్మే ప్రధానము. మనిషి దేహము ద్వారా కర్మలు ఆచరిస్తాడు. ఈ కర్మ ప్రభావము చేత పాప పుణ్యాలు సంభవిస్తాయి. ఈ పుణ్య పాప కర్మానుభవానికి నూతన దేహాలను ధరించడం జరుగుతుంది. అవే నూతన జన్మలు. ఆ జన్మలలో కర్మఫలాలను అనుభవించడమే గాక, నూతనంగా మరి కొన్ని కర్మలు చేయడం జరుగుతూ ఉంటుంది.

ఈ విధంగా కర్మ - కర్మఫలము - జన్మ; మళ్ళీ కర్మ - కర్మఫలము - జన్మ; ఈ విధంగా జననమరణ చక్రము తిరుగుతూ ఉంటుంది. ఇదే సంసార చక్రము. నిరంతరం అశాంతి గాలుల్ని వీచే సంసార వృక్షము.

చిగుళ్ళు వేస్తూ ఉంటే కొమ్మలు విస్తరిస్తూ ఉంటాయి. విషయా లనే చిగుళ్ళ వల్ల కర్మలు, కర్మఫలాలు, జన్మలు, జన్మదుఃఖాలు విస్తరిస్తూ పోతాయి. ఈ జన్మలో ప్రాప్తమైన కర్మఫలాలు తరువాత జన్మకు బీజ మౌతాయి. తరువాత జన్మలో విషయ సంబంధంతో ఆచరింపబడే కర్మలు మరో జన్మకు కారణ మౌతూ ఉంటాయి. ఈ విధంగా సంసార వృక్షము విస్తరిస్తూ పోతుంది.

**అవాంతర మూలాలు - కర్మబంధాలు**

సంసార వృక్షానికి ***(అశ్వత్థం)*** కారణ మైనది, మూల మైనది ఊర్ధ్వంగా ఉన్నదని; అదే మాయా యుక్త మైన బ్రహ్మమని; అదే సంసారానికి ఉపాదాన కారణ మని మొదటి శ్లోకం లోనే గ్రహించాము. ఇక ప్రస్తుతం అధ్యయనం చేస్తున్న ఈ రెండవ శ్లోకంలో కర్మఫలానుభవము వలన ఏర్పడిన రాగద్వేషాదులే ధర్మాధర్మ ప్రవృత్తికి కారణా లని తెలుసుకుంటున్నాము. ఇవే అధోమూలాలు. బ్రహ్మము ఊర్ధ్వమూలం కాగా ధర్మాధర్మ ప్రవృత్తి హేతువు లైన రాగద్వేషాలు అధోమూలాలు. వీటిని కర్మానుబంధులు అంటారు. ఇవి బంధహేతువులు. జీవులను బంధిస్తాయి. ఇవే మానవ లోకంలో కర్మానుబంధులుగా ఉంటూ విస్తరిస్తూ పోతాయి ***(కర్మానుబంధీని మూలాని అధః మనుష్య లోకే అనుసంత తాని)***.

రాగద్వేష, అభిమాన, అహంకార వాసనలే ఈ అధోమూలాలు. క్రింది వైపుకు ***(అధః)*** విస్తరించిన మూలాలు. ఊడలు. కర్మానుబంధులు. పుణ్యపాప కర్మలను ప్రేరేపించేవి కనుక ఇవి కర్మమూలాలు. కర్మానుబంధులు, లేక కర్మమూలాలు. అంటే, కర్మలను అనుబంధంగా కలిగిన మూలాలు అని అర్థం. ముందుగా వాసనలు మూలాలుగా ఉంటాయి. ఆ తరువాత కర్మలు వచ్చి వాటిని చేరుతాయి. అందుచేత అవి కర్మానుబంధులు.

ముక్తి నిచ్చే మూలం పైన ఉంది ***(ఊర్ధ్వ మూలమ్)***. బంధించే మూలాలు క్రింద వ్యాపించి ఉన్నాయి ***(అధశ్చ మూలాని)***. మానవ లోకంలో కర్మానుబంధులుగా ఉన్నాయి ***(అధశ్చ మూలాని కర్మానుబంధీని మనుష్య లోకే అను సంతతాని)***. ఇవి అంతటా అల్లుకొని ఉన్నాయి ***(అను సంతతాని అనుప్రవిష్టాని)***. అన్ని వైపుల ప్రగతికి ప్రతిబంధకాలుగా ఉన్నాయి. వీటిని ఛేదిస్తే, ఊర్ధ్వంగా పయనించి మోక్షరూపుడైన బ్రహ్మమును చేరవచ్చు.

అలా కాకుండా విషయా లనే చిగుళ్ళను వృద్ధి చేసుకుంటూ పోతే బ్రతుకు కర్మ సుడిగుండంలో చిక్కుకు పోతుంది. అల్లుకొని పోతున్న కర్మానుబంధు లైన మూలాలలో చిక్కి అన్యాయమై పోవడమా? లేక వాటిని ఛేదించి శ్రేయోమార్గంలో పయనించి మోక్ష సౌధాన్ని చేరి పోవడమా? అనేది ఎవరికి వారు నిర్ణయించు కోవాలి.

*సంసారము దుఃఖాత్మకము, అనర్థ దాయకము కనుక దాని నుండి విముక్తిని పొందాలి. మరి విముక్తిని పొందేది ఎలా? (**కథం విముక్తిః ?**). తరువాత శ్లోకంలో చెబుతున్నాడు.*

న రూప మస్యేహ త థోపలభ్యతే నాన్తో న చాది ర్న చ సమ్ప్రతిష్ఠా ।
అశ్వత్థ మేనం సువిరూఢ మూలం అసఙ్గశస్త్రేణ దృఢేన ఛిత్వా ॥ 3

***న-రూపం-అస్య-ఇహ-తథా-ఉపలభ్యతే-న-అంతః-న-చ-ఆదిః-న-చ-సంప్రతిష్ఠా***
***అశ్వత్థం-ఏనం-సువిరూఢ మూలం-అసంగశస్త్రేణ-దృఢేన-ఛిత్వా***

| | | | |
|---|---|---|---|
| ఇహ | = ఈ లోకము నందు | సంప్రతిష్ఠా న చ | = స్థితి కూడా తెలియడం లేదు |
| అస్య | = ఈ వృక్షము యొక్క | సువిరూఢ మూలం | = పాతుకొన్న వేళ్ళు గల |
| రూపం | = స్వరూపము | ఏనం | = ఈ |
| న ఉపలభ్యతే | = తెలియడం లేదు | అశ్వత్థం | = అశ్వత్థమును |
| తథా | = అలాగే | దృఢేన | = దృఢమైన |
| ఆదిః న | = ఆది కూడా తెలియడం లేదు | అసంగ శస్త్రేణ | = అసంగ మనే శస్త్రము చేత |
| అంతః చ న | = అంతము కూడా తెలియడము లేదు | ఛిత్వా | = ఛేదించి |

**అర్జునా! సంసార వృక్షము యొక్క స్వరూపము ఈ ప్రపంచంలో తెలియడం లేదు. మొద లెక్కడో, నడుమ యేదో, అంత మెక్కడో అసలే తెలియడం లేదు. వేళ్ళు బాగా పాతుకు పోయిన ఈ సంసార వృక్షాన్ని దృఢమైన అసంగ శస్త్రము చేత ఖండించాలి.**

**వ్యాఖ్య**

మొదటి రెండు శ్లోకాలలో సంసార వృక్షము మహాద్భుతంగా వర్ణించ బడింది. కొమ్మలతో, ఆకులతో, చిగుళ్ళతో, ఊర్ధ్వమూల అధశ్శాఖలతో అత్యంత రమణీయంగా రూపకాలంకార వర్ణనతో శోభాయమానంగా నేత్రాలకు విందు చేసి, మనస్సును మైమరపించిన అశ్వత్థమును అవలోకించాలని ఎవరైనా అభిలషిస్తారు. దానిని వాస్తవ రూపంలో మనచే దర్శింప చేసే ప్రయత్నం ఈ మూడవ శ్లోకంలో జరుగుతూ ఉంది.

### చెప్పడానికే ఉంది - చూడటానికి లేదు

అర్జునా! ఇంతవరకు ఏ సంసార వృక్షమును గూర్చి వర్ణించడం జరిగిందో (***యస్తు వర్ణితః సంసార వృక్షః***). దాని రూపము (***అస్య రూపమ్***) ఈ ప్రపంచంలో ఎక్కడా కనిపించదు (***తథా న ఉపలభ్యతే***) అంటూ విస్మయాన్ని కలిగించే వాక్యాన్ని వినిపించాడు వాసుదేవుడు. తాను ఏ విధమైన సంసార వృక్షాన్ని వర్ణించి చెప్పడం జరిగిందో, ఆ విధమైన వృక్ష మేదీ వాస్తవానికి కనిపించడం లేదు అంటున్నాడు. అంటే, దాని అర్థ మేమిటి? అలాంటి వృక్షం అసలు ఉందా, లేదా? ఎవ్వరైనా ఉన్న దానిని వర్ణిస్తారు గాని, లేని దానిని వర్ణిస్తారా? వర్ణించడం జరిగింది కనుక ఉందనే అనుకోవాలి. లేని దైతే ఎలా వర్ణిస్తారు, ఎందుకు వర్ణిస్తారు? వర్ణించ బడింది కనుక ఉన్నదనే విశ్వయించుకుందా మంటే, ఏదైతే వర్ణించ బడిందో అది గోచరించడం లేదని, ఇంకెవరో కాదు, వర్ణించిన వాడే చెబుతున్నాడు. ఇదెక్కడి గందరగోళం? ఇంతకీ, అది ఉన్నదా, లేనిదా?





ఏమో! అదీ చెప్పలేము. ఉందను కుంటే ఉంది. లేదనుకుంటే లేదు. కొందరికి ఉన్నది లేనట్లు తెలుస్తుంది. కొందరికి లేనిది ఉన్నట్లు తెలుస్తుంది. కొందరికి ఉన్నది ఉన్నట్లు తెలియదు. కొందరికి ఉన్నది ఉన్నట్లు తెలుస్తుంది. కనుక ఉండటము, లేక పోవటము అనేది చూచే వాడి మీద ఆధారపడి ఉంటుంది.

ఇంతకీ శ్రీకృష్ణుడు ఉన్న దానిని వీక్షించి వర్ణించాడా, లేక లేని దానిని ఊహించి ప్రవచించాడా? కనిపించిన దానినే వినిపించాడు. ఈ విషయంలో సందేహం లేదు. అదే వాస్తవ మైతే, చూచిన దానిని చెప్పి, చెప్పిన దానిని చూడటం సాధ్యం కాదు అని పలకడ మేమిటి? ఏముంది అక్కడ అంతగా ప్రశ్నలతో గుంజుకోవడానికి? ఉన్నట్లు కనిపించింది వాస్తవమే. లేనిది కూడా వాస్తవమే. కనిపించి నంత మాత్రాన ఉండాలని ఎక్కడుంది? లేని వాటిని ఎన్నిటిని మనం ఉన్నట్లు చూడటం లేదు. అదెలా? ఉన్న వాటిని లేనివిగా చూచినట్లే!

నిద్రలో స్వప్న ప్రపంచాన్ని చూచింది మనం కాదా? చూచిన స్వప్నాన్ని వర్ణించడం దోషమా? అలాగని విన్నవాడు ఊరుకోలేక చూడాలని ఉత్సాహపడి ఊదర పెడితే, నేను వర్ణించి చెప్పింది లేదయ్యా, కనిపించ దయ్యా అని చెప్పడం నేరమా? అలాగే అది కనిపించదు; కారణం, దానికి రూపం లేదు (***న రూపం అస్య***) అంటున్నాడు.

సంసార వృక్షము అంటే విశ్వవృక్షమే కదా! సంసారానికి రూపం లేదు అంటే, ప్రపంచానికి రూపం లేనట్లే కదా! అవును. ప్రపంచానికి రూపం లేదు. ప్రపంచము యొక్క రూపము ఇలా ఉంటుంది అని చెప్పిన వాళ్ళు లేరు. విచారించ నంత వరకే, ఏదో ఒక రూపం మనస్సులో మెదుల్తూ ఉంటుంది. విచారం ప్రారంభించ గానే ఏ రూపమూ లేదని అర్థమై పోతుంది. రూపం లేని దానికి నామం మాత్రం ఎలా ఉంటుంది? నామరూపా లున్నంత వరకే ప్రపంచానికి రూపం ఉంటుంది. అది కూడా నామ మాత్రమే (***వాచారంభణో వికారో నామధేయం***).

### కనిపిస్తుంది - కనుమరు గవుతుంది

సంసార వృక్షము కనిపిస్తుంది. తిరిగి చూచే సరికి కనుమరు గవుతుంది. కనిపిస్తుంది కనుక లేదని చెప్పలేము. కనుమరు గవుతూ ఉంది కనుక ఉందనీ అన లేము. ఉన్నది కనుక సత్యము అని చెప్పడానికి అది ఎప్పుడూ ఉండేది కాదు. పోనీ లేదని నిర్ణయిద్దా మంటే కళ్ళకు కనిపిస్తూ ఉంది. కనుక అసత్య మని చెప్పలేము. అసత్యము కాని దానిని, సత్యము కాలేని దానిని ఏమని నిర్వచించాలి? అనిర్వచనీయ మని చెప్పాలి. అదే మిథ్య. నిర్వచించ డానికి వీలు లేనిది. అదే మాయ. లేకనే ఉన్నట్లు తెలిసేది. కనిపించి కనుమరు గయ్యే స్వభావం కలది. స్వప్న సమానంగా (***స్వప్న***), మృగతృష్ణ లోని జలంతో సమానంగా (***మరీచ్యుదక***), మాయా నిర్మితమైన గంధర్వ నగరంతో సమానంగా (***మాయా గంధర్వ నగర సమత్వాత్***) కనిపించి వెంటనే నశించే స్వరూపం కలది (***దృష్ట నష్ట స్వరూపః***).

కల గనే వాడికి కల ఉంది. ఎంత వరకు? కల గన్నంత వరకు. మేలుకున్న క్షణాన కల లేనిదే. ఎవరికి లేనిది? కల గన్న వాడికి కూడా లేనిదే.

ఎండమావిలో నీరు ఉన్నట్లు కనిపిస్తుంది. వాస్తవానికి అక్కడ నీరు ఎప్పుడూ లేదు. చూచే టప్పుడు కూడా లేదు. వేసవి కాలంలో ఇసుక మైదానాలలో సూర్యకిరణాలు ప్రతిఫలించి నపుడు భ్రాంతి చేత చలనాలు కనిపించి, అవి జల చలనా లైనట్లు అనిపిస్తుంది. అదే ఎండమావి. మృగతృష్ణ. అలాంటి జలాలను పానం చేయాలని మృగాలు భావిస్తాయే గాని వివేకం గల మానవులు భావించరు. ఎండమావులలో దప్పిక తీరు తుందనే ఆశ మృగాలకే ఉంటుంది. అందుకే ఎండమావికి మృగతృష్ణ అనే పేరు వచ్చింది (***మృగాణాం తృష్ణా***

***అస్యా మితి మృగతృష్ణా).*** మృగతృష్ణలో నీరు కనిపించ డానికి అందులో నీరు ఉండటం కారణం కాదు, చూచే వానిలో జ్ఞానం లేక పోవడం కారణము. అదే అజ్ఞానము. అజ్ఞానంలో అస్తిత్వాన్ని కలిగి ఉంది కనుక ఎండమావికి రూపం లేదు. ఉండినా దృష్ట నష్ట స్వరూపంతో ఉంటుంది.

గగనంలో గంధర్వ నగరం లేదు. కల్పించుకొని చూచే వారికి ఉన్నట్లు కనిపిస్తుంది. మేఘాలలో కల్పించ బడిన ఊహాపోహాలే గంధర్వ నగరము. మేఘాల లోనే మతంగాలు. మబ్బుల లోనే మందిరాలు. గాలి వీచ గానే మతంగాలు పతంగాలై ఎగిరి పోతాయి. మందిరాలు మబ్బు తునకలై మాయ మౌతాయి. కల్పనలు కలకాలం ఉంటాయా? క్షణంలో ఉన్నట్లు అనిపిస్తాయి. మరు క్షణంలో లేనట్లు తెలుస్తాయి. దృష్ట నష్ట స్వరూపాలుగా తేలి పోతాయి.

స్వప్నం మనస్సులో వ్యక్తమై కనిపించింది. ఎండమావి వ్యక్తం కాకనే ఉన్నట్లు అనిపించింది. గంధర్వ నగరమును మనస్సు కల్పించుకుంది. ఇవన్నీ అందరి మనస్సులలో లేవు. కల్పించుకున్న మనస్సుల లోనే దృష్ట నష్ట స్వరూపంగా ఉన్నాయి. ప్రపంచానికి ఒక రూపం లేదు. అందుకే ఎవరి ప్రపంచం వారిది.

**ఆనవాలు అగుపించవు**

దృష్ట నష్ట స్వభావం కలిగిన సంసార వృక్షానికి అంత మెక్కడో అర్థం కాదు. స్థితి ఏమిటో తెలిసి రాదు. అలాగే ఆది కూడా అవగతం కాదు ***( న అన్తః పర్యన్తః నిష్ఠా సమాప్తి ర్వా విద్యతే తథా న చ ఆదిః ).***

సంసార వృక్షము అనేది ఉంటే కదా ఆదిని నిర్ణయించడానికి, లేదా అంతాన్ని నిర్ధారించడానికి. లేని వారికి అది ఎలాగూ లేదు. ఉన్నది అనే వారికి కూడా ఒక విధంగా లేదు. దేనిని బట్టి నిర్ణయించాలి? దేనిని ఆధారం చేసుకొని నిర్ధారించాలి?

గోదావరి నాసిక్‌లో ప్రారంభమై బంగాళాఖాతంలో లయిస్తూ ఉంది కనుక నాసిక్‌ను ఆదిగా, సాగరాన్ని సమాప్తంగా చెప్పుకుంటున్నాం. ఆద్యంతాలు అర్థ మవుతూ ఉన్నాయి కనుక నడుమను కూడా ఊహించ గలుగుతున్నాం. అది భగవతికి నిలయమైన బాసర క్షేత్రం కావచ్చు. లేదా భగవంతుడు కొలువై ఉన్న భద్రాచలం కావచ్చు. మరి, సంసార వృక్షాన్ని అలా నిర్ణయించే అవకాశ ముందా? ఈ ప్రదేశం నుండి ప్రారంభమైంది, ఈ కాలంలో మొదలైంది అని ఎవరైనా చెప్పగలరా? చెప్పడానికి ఆ విధంగా ఈ విశ్వ వృక్షము ఎవరి కైనా అర్థమైందా? లేదు. ఇప్పటికి ఏ ఒక్కరూ తెలుసుకో లేదు ***( ఇతః ఆరభ్య అయం ప్రవృత్తః ఇతి న కేనచిత్ గమ్యతే ).***

గోదావరి జలాలకు ఆద్యంతాలు చెప్పగల రేమో గాని ఎండమావుల లోని జలాలకు ఆద్యంతా లెక్కడో ఎవరు చెప్పగలరు? ఆద్యంతాలు అర్థం కానపుడు నడుమ ఎక్కడంటే ఏం చెప్పగలం? ***( న చ సంప్రతిష్ఠా స్థితిః , మధ్యమ్ అన్య న కేనచిత్ ఉపలభ్యతే ).***

మనం ప్రయాణం చేసే టప్పుడు 'ధన్యవాదాలు - మా రాష్ట్రం ఇక్కడ సమాప్తం' అనే బోర్డు కనిపిస్తుంది. అక్కడే మరొక బోర్డు కూడా అగుపిస్తుంది. 'ఆహ్వానము - ఇక్కడ నుండే మా రాష్ట్రం ఆరంభం' అని. ఇలా ఒక దేశానికి, ఒక ప్రదేశానికి ఆది మధ్యాంతాలు తెలుస్తూ ఉంటాయి. కాని స్వప్న ప్రపంచం, లేదా స్వప్న ప్రదేశానికి ఆద్యంతాలు ఎక్కడ అని ప్రశ్నిస్తే సమాధానం ఎవరు చెప్పగలరు? చెప్పడానికి ఎవరికి అర్థ మైందని? ఆద్యంతాలు లేవు కనుక అర్థం కావు. ఆద్యంతాలు ఎప్పుడైతే లేవో, మధ్యమ స్థితి కూడా లేదు. ***ఆదా వన్తే చ యన్నాస్తి వర్త మానేపి తత్తథా !*** ఆరంభము నందు లేనిది, అంతము నందు ఉండనిది, మధ్యలో ఉన్నట్లు





కనిపించినా, అది ఉన్నది కాదు, లేనిదే. కల్పితాలు ఎప్పుడూ అలాగే ఉంటాయి. ఆరోపాలు అలాగే అర్థ మవుతాయి.

మసక చీకటిలో దారిలో పడి ఉన్న త్రాడులో పామును ఆరోపించి చూడటం జరిగింది. భయ భ్రాంతు లకు లోను కావడం జరిగింది. వెలుగులో చూస్తే అక్కడ పాము అనేది లేనే లేదని తెలిసింది. మరి, ఉన్నట్లు అగుపించింది కదా! నిజమే. అలా అగుపించి నపుడు కూడా అక్కడ పాము లేదు. లేకనే ఉన్నట్లు అగుపించింది. పామును త్రాడులో ఆరోపించక ముందు అక్కడ పాము లేదు. త్రాడును తెలుసుకున్న తరువాత కూడా పాము లేదు. ఆద్యంతాలలో అగుపించని పాము, మధ్యలో అగుపించింది అంటే, ఆ ఆరోప సర్పము అవలోకించే సమయంలో కూడా లేనిదే. లేని దానికి ఆద్యంతాలు ఎక్కడున్నా యని చెప్పాలి? అదే విచిత్రమైన సంసార వృక్షము యొక్క స్థితి.

ఈ ప్రపంచము చిత్ర విచిత్రంగా గోచరిస్తూ ఉంటుంది. ఒకరికి కనిపించినట్లు మరొకరికి కనిపించదు. ఆరోపమే కనుక ఎవరు ఎలా ఆరోపించుకుంటే అలా అగుపిస్తుంది. పోనీ, అగుపించిన దానికి ఆరంభము అర్థ మవుతుందా అని ప్రశ్నించుకుంటే, అర్థ మవుతుందనే అనిపిస్తుంది. తీరా విచారిస్తే, ఆదిగా ఏదైతే అర్థ మయిందో దానికి మరొక ఆది ఉన్నట్లు తెలుస్తుంది. ఆది అంటే కారణము.

పండును పరీక్షిస్తే, కాయే పండు అయ్యింది అని అర్థ మవుతుంది. కాయకు పువ్వు కారణము. పువ్వుకు రెమ్మ కారణము. రెమ్మకు కొమ్మ ఆధారము. కొమ్మకు కాండము ఆధారము. ఇంతకీ చెట్టుకు ఏది కారణము? బీజము కారణము. ఆ బీజానికి ఏది కారణము? మరొక చెట్టు కారణము. ఇలా ఎంతైనా చెప్పుకుంటూ పోవచ్చు. ఎన్నైనా చెప్పుకోవచ్చు. సోదె ఎంత చెప్పుకున్నా ఆది మాత్రం అర్థం కాదు. ఉంటే కదా అర్థం కావడానికి! లేని దానికి అంత మెక్కడో చెప్పే దెలా? అనంతాలుగా అనిపించే ఆకాశానికీ, అబ్ధికీ ఆద్యంతా లున్నాయేమో గాని ఈ ఆరోప అశ్వత్థానికి ఆదీ లేదు, అంతమూ అర్థం కాదు. ఇదొక పారం లేని పారావారము. దుస్తరము. ఈ సంసార వృక్షము దురుచ్ఛేదము.

**ఆది ఎక్కడో తెలిసి రాదు**
**అంత మెప్పుడో తెలియదు**
**నడుమ అన్నీ మరపులే**
**క్షణ క్షణానికి మార్పులే**
**ఏది ఉండునో ఏది ఊడునో**
**తెలియని జగతి శోకమయం**
**రామ రామ జయ రాజారామ్**
**రామ రామ జయ సీతారామ్**

అంటూ మాయా వృక్షాన్ని ముట్టుకో వద్దని గుట్టు విప్పింది రామజోగి చిట్కా *( రా.జో.చి. - 6).*

తన కంటూ అస్తిత్వము లేక పోయినా, పని కట్టుకొని మనిషిని ముప్పుతిప్పలు పెట్టే ఈ మాయా సంసార చెట్టు నీడలో ఇంకా ఎన్నాళ్ళు ఈ కాపురం? లేని దానిని ఉన్నదని భ్రమించి ఆశ్రయించాం. లేదని తెలిసిన తరువాత ఇంకా దానిని పట్టుకొని వ్రేలాడట మెందుకు? లేని దానిని లేనట్లే వదిలేస్తే, ఉన్నదానితో కలిసి ఊరేగ వచ్చు.

చెప్పుకోవడాని కైతే బాగానే ఉంది. ఉన్నదో, లేదో అన్నది ప్రక్కన పెడితే, పట్టుకున్న దానిని విడిచి

పెట్టడం చెప్పుకున్నంత సులభంగా లేదు. ఎందుకని? అది బాగా పాతుకు 'పోయింది. దాని మొదళ్ళు చాలా దృఢంగా ఉన్నాయి **( సువిరూఢ మూలం ).** ఆ మాయా వృక్షము భయంకరంగా చలిస్తూ ఉంది. బలమైన గాలులు వీస్తూ ఉంది. దారుణంగా వీస్తున్న బలమైన గాలుల్ని తట్టుకొని నిలిచే శక్తి ఎగిరే మేఘానికి ఉంటుందా? సంసార వృక్షం సృష్టించే వికృత బీభత్సాన్ని తట్టుకొని నిలిచే శక్తి జననమరణ చక్రంలో పడి తిరిగే జీవులకు ఉంటుందా? అవి ఆపితే ఆగే గాలులు కావు. వారించ డానికి, నివారించ డానికి సాధ్యము కాని వికృత వాతవారాశి. మరి మార్గ మేమిటి? తరుణోపాయ మేమిటి? శక్తి చాలని చోట యుక్తిని ఉపయోగించాలి. శ్రుతి వాక్యాన్ని అనుసరించాలి. వృక్షాన్ని కూల్చేసే ప్రయత్నం చెయ్యాలి. అంతే. మరి, అది దురుచ్ఛేదము అన్నారు కదా! దానిని కూల్చే దెలా? అదే యుక్తి. ఉన్న దానిని అయితే, శ్రమించి కూల్చే ప్రయత్నం చెయ్యాలి. లేని దానిని కూల్చే దేముంటుంది, కర్మ ద్వారా రాల్చే దేముంటుంది? లేని దానిని లేదని తెలుసుకొని సాక్షిగా ఉండటమే. ఇదే అసంగము. అసంగ శస్త్రం తోనే మాయా వృక్షము మాయ మవుతుంది. అదే చెబుతున్నాడు.

రూపం లేకపోయినా, ఆది మధ్యాంతాలు ఎక్కడో తెలియక పోయినా, సుస్థిరత లేని ఈ ప్రపంచ వృక్షము **( ఏనం అశ్వత్థం )** యొక్క వేళ్ళు బలంగా పాతుకొని పోయాయి **( సువిరూఢ మూలమ్ సుష్ఠు విరూఢాని మూలాని యస్య ).** కారణం, ఈ వృక్షము చాలా ప్రాచీన మైనది. అనేక జన్మల సంస్కారము చేత బాగా బలపడింది. అలాగని అధైర్య పడ నవసరం లేదు. భీతి చెంద వలసిన పని లేదు. చెట్టు దృఢమైంది అయినపుడు ఆయుధము బలమైంది అయితే సరిపోతుంది. అలాంటి ఆయుధముతో ఈ అశ్వత్థమును **(ఏనం అశ్వత్థం )** ఖండించ వచ్చు అంటున్నాడు. ఈ సందర్భములో మళ్ళీ **ఏనం అశ్వత్థం** అని అశ్వత్థ శబ్ద ప్రయోగము చేయడం అంతర్భావ సూచకము. ప్రపంచ వృక్షము ప్రాచీన మైనదే అయినా అది అశ్వత్థము అని మరచి పోవద్దు అని తెలియ చేయడమే; ధైర్యం చెప్పడమే.

శతాబ్దాలుగా ఒక గదిలో చీకటి ఉండినా, తలుపులు తెరిచి దీపం వెలిగించ గానే అంధకారం అదృశ్య మవుతుందా, లేదా? ఇదీ అంతే. కారణం, ఇది అశ్వత్థము. **శ్వోపి స్థాతుం అనర్హః అశ్వత్థః -** రేపు ఖచ్చితంగా ఉంటుంది అని చెప్పడానికి అర్హత లేనిది అశ్వత్థము. కనుక రేపు ఉంటుందో ఉండదో చెప్పడానికి అవకాశం లేని అనర్థదాయక మైన అశ్వత్థాన్ని నేడే అంతం చేసే ప్రయత్నం చేయ మంటున్నాడు. **శ్వః కార్యం అద్య కర్తవ్యం -** రేపు అంటే భవిష్యత్తులో ఎలాగూ జరిగేదే కనుక దానిని నేడే చేయ మంటున్నాడు. అనాదిగా అంటి పెట్టుకొని అనర్థాన్ని సృష్టిస్తున్న ఈ అశ్వత్థ వృక్షాన్ని అసంగ శస్త్రము చేత ఖండించ మంటున్నాడు.

**సంసార వృక్ష ఖండనము**

భక్తి కల వాడే ముక్తికి అర్హు డవుతాడు. ప్రపంచముపై ఎవరికి విరక్తి, లేదా వైరాగ్యము కలుగుతుందో, వారికే పరమేశ్వరుని విషయంలో భక్తి కుదురుతుంది. కనుక, అనిత్యమైన, అనర్థ దాయకమైన ప్రపంచముపై విరక్తి జనించడానికే సంసారానికి వృక్ష రూపాన్ని కల్పించి వర్ణించడం జరుగుతూ ఉందని ప్రస్తుత అధ్యాయం ప్రారంభ శ్లోక వ్యాఖ్యానం లోనే చెప్పుకున్నాం. ఆ కార్యం ఇక్కడ చక్కగా ముగిసింది. సంసార వృక్ష రూపాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకున్నాం. కనుక, అశ్వత్థ మనే ఈ సంసార వృక్షాన్ని ఖండించడమే మన ముందున్న కర్తవ్యము. అదెలాగో కూడా భగవంతుడే చెబుతున్నాడు.

అర్జునా! వేళ్ళు బాగా పాతుకు పోయిన ఈ సంసార వృక్షాన్ని **( సువిరూఢ మూలం ఏనం అశ్వత్థం )** దృఢమైన అసంగ శస్త్రము చేత ***( అసంగ శస్త్రేణ దృఢేన )*** ఖండించు ***( ఛిత్వా )*** అంటున్నాడు.

అసంగ శస్త్రము అనేది ఒక ప్రత్యేకమైన ఆయుధము కాదు. అసంగమే శస్త్రము. అసంగము అంటే





సంగరాహిత్యము. ***సంగతే విషయేషు అనేన ఇతి సంగః వైషయికో రాగః తదభావో విరాగః అసంగః -*** విషయాలతో కూడి ఉండటము సంగము. అంటే విషయముల యందు రాగము. అట్టి రాగము లేక పోవడము విరాగము. అదే అసంగము. విషయాలలో ఉన్న దోషాన్ని దర్శించడం చేత కలిగే వైరాగ్యము అసంగత్వమునకు దారి తీస్తుంది. ఆహారంలో విషం కలిసి ఉందని తెలిసిన తరువాత అట్టి ఆహారాన్ని ఎవరైనా భుజిస్తారా? ఇదీ అంతే. సంసార వృక్షం లోని దోషాలను దర్శించడం వల్ల ఏర్పడే వైరాగ్యము సంసారానికి అంటకుండా ఉండేలా చేస్తుంది. అదే అసంగము. ఇది విషయ త్యాగము వలన, సంగత్యాగము వలన ప్రాప్తించే ఫలం. కనుకనే, విషయ త్యాగము, సంగత్యాగమును భక్తికి ముఖ్య సాధనములుగా అభివర్ణించాడు నారదమహర్షి ***( సూ॥ తత్తు విషయ త్యాగాత్ సంగత్యాగాచ్చ :*** *నారద భక్తి సూత్రములు - 35 ).* శబ్దాది విషయాల నుండి విడిపడటము విషయ త్యాగ మైతే, వ్యక్తులతో కల్పించుకున్న సంబంధాల నుండి విడి పడటము సంగత్యాగము. అదే అసంగము. మరి, ఏ వ్యక్తుల నుండి విడి పడటము అసంగ మవుతుంది? దీనికి సమాధానము ప్రస్తుత శ్లోకంపై ఆచార్యుల వారు అందించిన భాష్యం లోని నిర్వచనమును చూద్దాం. అసంగ శస్త్రము అంటే, పుత్ర, విత్త లోకైషణాదుల యందు వైరాగ్యమే అసంగము. వాటికి దూరంగా ఉండటమే అసంగము. అదే అసంగ శస్త్రము ***( అసంగః పుత్ర విత్త లోకైషణాదిభ్యః వ్యుత్థానం ).***

ఈ విధంగా అసంగ బుద్ధి ఏర్పడిన వారికే పరమేశ్వరుని యందు భక్తి కలుగుతుంది. భగవంతుని భక్తి అఖండంగా సాగించిన వారే మోక్షాన్ని పొందుతారు. ఈ విషయాన్ని భాగవతం యథాతథం ప్రవచించింది.

***పూని మోక్షార్థి యగు వాడు దీనిఁ దీవ్ర భక్తి యోగంబు చేత విరక్తి బొంది -*** 'ముముక్షువు అంటే మోక్షాపేక్ష కలవాడు. విషయసుఖాల యందు అసంగుడై, అఖండమైన భక్తి యోగాన్ని అనుష్ఠించాలి' అని ఆంధ్రమహా భాగవతం - తృతీయ స్కంధములో భగవానుడైన కపిలుడు తన తల్లి దేవహూతికి జ్ఞానోపదేశం చేశాడు.

సంగత్వములో ప్రధాన మైంది మమకారము. దానికి ఆధారమైంది అహంకారము. అసంగత్వము అనేది మమకార త్యాగముతో ఆరంభం కావాలి. మమకారాన్ని ఎలా త్యాగం చెయ్యాలి? మమకారం అనేది వస్తువు కాదు, తీసి దూరంగా పారవేయటానికి. అది అభిమానము. వివేకము లేక పోవడం చేత ప్రాప్తించిన అభిమానమే మమకారము. కనుక అది వివేక విచారాదుల వల్లనే దూర మవుతుంది. ఆచార్యుల వారు నిర్దేశించినట్లు, మమకార త్యాగము పుత్రదారాదుల నుండే ఆరంభం కావాలి. తన తరువాత తనకు అత్యంత ప్రియంగా అనిపించే వారు, నిత్య సాంగత్యము చేత మమకారాన్ని పోషించే వారు భార్యాపుత్రాదులే కనుక, అసంగ మనేది వారి నుండే ప్రారంభం కావాలి. పుత్రదారాదుల యందు అసంగత్వము అంటే కుటుంబానికి దూరం కావడం అని కాదు. కుటుంబము నందు మమకారము లేకుండా ఉండటము. మోహం లేకుండా కలిసి ఉండటము. వివేకంతో, విచారంతో జీవించడము. వివేకము కలిగి విచారం చేయ గలిగితే, పుత్రదారాదుల యందు మమకారము క్షీణిస్తూ ఉంటుంది. ఒక దశలో లేకుండా పోతుంది.

పుత్రు డెవరు? భార్య ఎవరు? ఈ ప్రశ్నలకు సమాధానాలు అన్వేషించడమే విచారము. వీరిపై మమకారము ఎక్కడ నుండి ఆవిర్భవించిందో, ఆ మూలం వైపుకు పోవడమే విచారము. ఈ విధమైన విచారము యొక్క ఫలితంగా భార్యాపుత్రాదుల యందు మనకున్న మమకారము అధ్యాస జనితమే అని తేలి పోతుంది. కేవలం ఆరోపమే నని అర్థ మవుతుంది.

పెళ్ళి కాక ముందు భార్య ఎవరో తెలియదు. పుట్టక ముందు కుమారు డెవరో తెలియదు. ఒక కాలంలో పెళ్ళి పీటల మీద భార్య చేరువైంది. ఆ తరువాత పుత్రుడు కలిగాడు. వీరంతా కాలంలో మనకు

తోడయ్యారు. మమకారం పెంచుకోవడం వల్ల ప్రియ మయ్యారు (***ప్రియం భవతి***). కాలంలో తోడైన వారందరూ కాలంలో దూర మవుతారు. లేదా మనమైనా వారికి దూర మవుతాము.

దూరమైన క్షణాన ప్రియత్వానికి అర్థ మేమిటి? భార్యాపుత్రులు కలవక ముందు వారు మనకు ప్రియులు కారు. అంటే, వాళ్ళు రాక ముందు మనలో ప్రియత్వం లేదా? ఉండింది. ఎవరి మీద ఉండింది? మన మీదే ఉండింది. మన మీదే మనకు ప్రియత్వం ఉండింది. వాళ్ళు దూరమైన తరువాత మనలో మనకు ప్రియత్వం ఉంటుంది. ఎవరి మీద ఉంటుంది? మన మీదే ఉంటుంది.

కనుక పెళ్ళి కాక ముందు మనమే మనకు ప్రియమైన వాళ్ళం. భార్యాపుత్రులు కలిగిన తరువాత వాళ్ళు మనకు ప్రియంగా కనిపించారు. అనిపించారు. ఇదే మమకారము. వాళ్ళు దూరమైన తరువాత మళ్ళీ మనమే మనకు ప్రియంగా ఉంటాము.

ఇది విచారంలో తేల వలసిన విషయం. ప్రియ వస్తువు, ప్రియ విషయం ఏది? అని ఆలోచిస్తే, ఎవరికి వారే ప్రియం. ఇది సత్యజ్ఞానం. విచార జనిత వివేకము. తనకు తాను ప్రియం కావడం చేత, తనతో సంబంధాన్ని కలిగిన వారు ప్రియంగా అనిపించారు. వారిలో ప్రధానమైన వారు భార్యాపిల్లలు. వాస్తవానికి తానే తనకు ప్రియం. భార్యాపుత్రుల యందు ఉండేది ఆరోపిత ప్రియత్వమే కాని సత్యమైన ప్రియత్వము కాదు. ఈ సత్యాన్నే బృహదారణ్యకోపనిషత్తులో యాజ్ఞవల్క్య మహర్షి దివ్యంగా భాషించాడు.

***న వా అరె జాయాయై కామాయ జాయా ప్రియం భవతి ఆత్మనస్తు కామాయ జాయా ప్రియా భవతి! న వా అరె పుత్రాణాం కామాయ పుత్రాః ప్రియా భవన్తి ఆత్మనస్తు కామాయ పుత్రాః ప్రియా భవన్తి! న వా అరె విత్తస్య కామాయ విత్తం ప్రియం భవతి ఆత్మనస్తు కామాయ విత్తం ప్రియం భవతి!***

భార్య ప్రియంగా ఉంది అంటే భార్య మీద ప్రియత్వము ఉందని కాదు. తన స్వప్రయోజనార్థమే భార్య ప్రియంగా కనిపిస్తూ ఉంది. పుత్రునిపై ఉన్న ప్రియత్వము పుత్రునికి సంబంధించింది కాదు; తనకు సంబంధించింది. విత్తంపై ఉన్న ప్రియత్వము విత్తాన్ని అంటిపెట్టుకొని లేదు. విత్తము తనకు ఉపకరించడం చేత, తనపై తనకు ప్రియత్వము ఉండటం కారణంగా విత్తము ప్రియంగా కనిపిస్తోంది.

ఎవరికి ఏవి ఉపకరిస్తే వాటిపై వారికి ప్రియత్వము జనిస్తూ ఉంటుంది. అవే నిరుపయోగంగా, బ్రతుకులో కంటకంగా మారి నపుడు, ప్రియత్వాలు భార మౌతాయి. ప్రియమైన వాళ్ళు దూర మవుతారు. అవి భార్యాభర్తల మధ్య విడాకులు కావచ్చు. తండ్రికొడుకుల మధ్య తెగతెంపులు కావచ్చు.

ఇప్పుడు ఆలోచించండి! ఏది ప్రియత్వము? ఎక్కడి మమకారము? ఎవరికి ఎవరు? విచారించే వివేకమే గనుక మనిషికి ఉంటే మమకారం క్షణంలో మాయ మవుతుంది. ఎవరూ ఎవరికి ప్రియులు కారని, ఎవరు ఎవరికీ బంధువులు కారని, సంబంధాలన్నీ కల్పితాలే నని తేలి పోతుంది (***విచార్యమాణే న కస్యాపి కశ్చిత్ బంధుః***). ఇక ఆ తరువాత మమకారం ఎక్కడుంటుంది? అదే అసంగము.

స్వప్నంలో కలిసి కాపురం సాగించిన భార్యాపుత్రులు మేలుకున్న తరువాత ఉంటారా? మాయా కాపురం - మాయా దారాసుతులు అని సరిపెట్టు కుంటాం. కల లోని కాపురాలు ఎలాంటివో అర్థమైతే, ఇల లోని కాపురాలు కూడా అలాంటివే అని అర్థ మవుతుంది. ఏవైనా సంసారాలే. అన్నీ మాయా మయాలే. మిథ్యారూపాలే. అసలు సంసారం అంటేనే గొప్ప విచిత్రము. అదొక పెద్ద మాయ (***సంసారస్య వైచిత్ర్యం నామ***). ఈ విధమైన సత్యావగాహనలో సంసారము మిథ్య అని అర్థ మవుతుంది కనుక, అసంగత్వం దానంతట అదే బుద్ధిలో స్థిరపడి పోతుంది. ఈ అసంగ శస్త్రము చేత అనర్థ దాయకమైన సంసార వృక్షాన్ని ఖండించాలి. దృఢమైన





అసంగ శస్త్రము చేత సంసార వ: మాయా వృక్షాన్ని కూకటి వ్రేళ్ళతో సహా పెకలించి వేయాలి (***అసంగ శస్త్రేణ దృఢేన ఛిత్వా సంసార వృక్షం స బీజం ఉద్ధృత్య***).

**అదంతా ఇందుకా?**

ఇప్పుడు చెప్పండి. ఏది సంసార వృక్షము? ఇప్పుడది ఏమై పోయింది? అసలు ఒకప్పుడు ఉండిందా? ఉంటే ఎక్కడ ఉండింది? చెప్పనా! అజ్ఞానంలో ఉండింది. ఎవరి అజ్ఞానంలో? ఎవరిలో అజ్ఞానం ఉంటే వారి లోనే ఉండింది. అజ్ఞానం తొలగితే సంసార వృక్షం ఉంటుందా? ఉండదు. మిథ్యా వృక్షానికి స్వతంత్ర మనుగడ ఎలా ఉంటుంది? మిథ్య మిథ్యగా తెలియనంత వరకే, మాయ మాయగా అర్థం కానంత వరకే సంసార వృక్షము కళకళ లాడుతూ ఉంటుంది. తనను ఆశ్రయించిన వారిని తన ఛాయలో ఆడిస్తూనే ఉంటుంది. అర్థం చేసుకున్న వారికి మాయగా మిగిలి పోతుంది. ఎండమావిగా తెలిసి పోతుంది. వాళ్ళను ఇక ఆడించ లేక తానే ఆగి పోతుంది. అదృశ్యమై పోతుంది. అసంగ శస్త్రము చేత సంసార వృక్షాన్ని ఖండించడ మంటే ఇదే. అజ్ఞానాన్ని అంతం చేయడమే సంసార వృక్షాన్ని సమూలంగా ఖండించడము. లేకనే ఉన్నట్లు అనిపించి అనర్థాన్ని సృష్టించిన మాయామయ మైన సంసార వృక్షమును స్థూలంగా ఖండించింది ఏమీ లేదు. అశ్వత్థ మనే సంసార వృక్షము లేనిదే అని గ్రహించడమే మిథ్యావృక్ష ఖండనము.

మరి, ప్రస్తుత అధ్యాయంలో ఇంతవరకు సంసార వృక్షాన్ని వర్ణించుకుంటూ వచ్చింది దానిని నిర్మూలించడాని కేనా! లేనిదే అని తెలుసుకోవడాని కేనా! లేకుండా పోయేదే అని అర్థం చేసుకోవడాని కేనా! ఇందుకేనా అదంతా? అవును. ఇదొక లీల. రామలీల కాదు; రావణలీల. రావణలీల దగ్ధమైతే, ఆ తరువాత రామలీల శోభాయమానంగా కళకళ లాడుతుంది.

**రావణలీల - మాయా గోల**

మన దేశంలో కొన్ని ప్రాంతాలలో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భములో 'రావణ లీల' అనే ఒక ఆట ఆడతారు. ఎత్తైన రావణాసురుని విగ్రహాన్ని తయారు చేస్తారు. ఆ ప్రదర్శనను తిలకించడానికి జనులు తండోప తండాలుగా వస్తుంటారు.

**ఆఖ్యాయిక**

ఒక చోట రావణలీల క్రీడ జరుగుతూ ఉంది. ఆ వైపే వస్తున్న ఒక సాధువు ఆ క్రీడను పట్టించుకో కుండా, రావణ రూపాన్ని చూడనైనా చూడకుండా తన దారిన తాను పోతూ ఉన్నాడు. ఆ సాధువును ఒక యువకుడు గమనించి, దగ్గరకు వెళ్ళి 'స్వామీ! రావణలీల ఆట అద్భుతంగా సాగుతూ ఉంది. జన మంతా తిలకిస్తున్నారు. మీరా వైపు దృష్టిని కూడా సారించకుండా మీ దారిన మీరు పోతున్నారే!' అన్నాడు.

సాధువు నవ్వి, 'తగలబడే దానిని తిలకించి పులకించే దేముంది, నాయనా!' అంటూ తన దారిన తాను వెళ్ళి పోయాడు.

యువకుడికి అర్థం కాలేదు. ఈ లోగా రావణ విగ్రహానికి అమర్చిన పెద్ద వత్తికి కార్యకర్తలు నిప్పు అంటించారు. అంతే. రావణ విగ్రహం క్షణాల్లో పైకి దూసుకు పోయి పేలి పోయింది. జను లందరూ అరుపులతో, కేరింతలతో చప్పట్లు కొట్టారు. సాధువాక్యం యువకుడికి అప్పుడు అర్థమైంది. వేలాది సొమ్ము వెచ్చించి, రకరకాల హంగులతో రావణ విగ్రహాన్ని రూపొందించింది ఇలా తగలబెట్ట డానికే నన్న మాట! అంతే మరి. సంసార వృక్షాన్ని కూడా రూపకాలంకార వైభవముతో ముచ్చటగా మూడు శ్లోకాలలో ముకుందుడు వర్ణించింది

ఆ చెట్టెక్కి ఊగడానికి కాదు. దానిని అమాంతం పెకలించి వేయడానికి. అదే జరిగింది. అనర్థం అంతరించింది. కాని, అంతటితో సరిపోదు. బ్రతుకు అర్థవంతం కావాలి. ఆత్మవన్తం కావాలి.

*తరువాత శ్లోకంలో అదే విషయం.*

**తత: పదం త త్పరిమార్గితవ్యం యస్మి న్గతా న నివర్తన్తి భూయ: ।**
**తమేవ చాద్యం పురుషం ప్రపద్యే యత: ప్రవృత్తి: ప్రసృతా పురాణీ ॥** 4

***తతః-పదం-తత్-పరిమార్గితవ్యం-యస్మిన్-గతాః-న-నివర్తంతి-భూయః***
***తం-ఏవ-చ-ఆద్యం-పురుషం-ప్రపద్యే-యతః-ప్రవృత్తిః-ప్రసృతా-పురాణీ***

| | | | |
|---|---|---|---|
| తతః | = ఆ తరువాత | ప్రసృతా | = వ్యాప్త మైనదో |
| యస్మిన్ | = దేని యందు | ఆద్యం | = ఆద్యుడైన |
| గతాః | = చేరిన వారు | తం | = ఆ |
| భూయః | = మరల | పురుషం ఏవ చ | = పురుషుణ్ణే |
| న నివర్తంతి | = మరలి రారో | ప్రపద్యే | = శరణు పొందుతాను |
| యతః | = ఎవని వలన | తత్ | = ఆ |
| పురాణీ | = ప్రాచీన మైన | పదం | = స్థానము |
| ప్రవృత్తిః | = ప్రవృత్తి | పరిమార్గితవ్యం | = వెదక దగినది |

**అర్జునా! ఏ స్థానమును చేరిన వారు మళ్ళీ తిరిగి రారో, అనాది యైన ఈ సంసార ప్రవృత్తి ఎవరి నుండి విస్తరించిందో, అట్టి ఆది దేవుడైన పరమాత్మనే ఆశ్రయిస్తున్నాను అనే భావంతో భగవంతుణ్ణి అన్వేషించాలి.**

**వ్యాఖ్య**

### అసంగ శస్త్రము

అనర్థ దాయకము, దురుచ్ఛేదము అయిన సంసార వృక్షమును ఛేదించడ మనేది చెప్పుకున్నంత సులభ సాధ్యము కాదు. కారణం, దాని వేళ్ళు అంతటా పాతుకు పోయి ఉన్నాయి. విషయసంగము చేతనే ఈ వృక్షము శాఖోపశాఖలుగా విస్తరించింది కనుక, అసంగ బుద్ధి ఏర్పడ గానే అది వాడి పోతుంది. అలాగని దానిని విడిచి పెడితే, మళ్ళీ విషయాలనే చిగుళ్ళు (***విషయ ప్రవాలాః***) తొడిగి, కళకళ లాడుతుంది. కనుక దానిని మూలాలతో సహా పెకలించి వేయాలి.

సువిరూఢమైన మూలాన్ని నిర్మూలించడం సాధ్య మేనా? సాధ్యమే. కాని, సుసాధ్యం కాదు. సంసార వృక్షానికి సంబంధించిన అవగాహన పూర్ణంగా ఉంటేనే గాని, దాని మూలాన్ని పెకలించడం, లేదా పెల్లగించడం సాధ్య పడదు. దాని మూలాలను పెకలించడ మంటే మన మూలాలను పెకలించు కోవడమే అనేది ముందుగా మనకు అర్థం కావాలి. మన లోని అభిమానాన్ని, అహంకారాన్ని నిర్మూలించడమే. జన్మజన్మల నుండి పెనవేసు కొని వస్తున్న వాటిని పెల్లగించి దూరం చేసుకోవడమే. అందుకే సుసాధ్యం కాదు అంటున్నాడు.

దేనితో మనం సంబంధాన్ని కలిగి ఉన్నామో, దాని నుండి విడిపడాలి అంటే, దానికి సంబంధించిన అవగాహన మనకు పూర్ణంగా ఉండాలి. సంబంధాలు చాలా విచిత్రంగా ఉంటాయి. అవగాహన లోపించి నపుడే అభిస్నేహాలు తయా రవుతాయి. అభిస్నేహాలు ఎలాగూ ఫలించవు కనుక వియోగాలు ప్రాప్తిస్తాయి. సంయోగాలు,





వియోగాలు రెండిటి లోను అవగాహనా రాహిత్యమే ఉంటుంది. అందుచేతనే, ఒక దాని నుండి విడిపడిన మనిషి వెంటనే మరొక దానితో ముడిపడి పోతుంటాడు. ఒక వియోగము మరొక సంయోగానికి తలుపులు తెరుస్తూ ఉంటుంది. కనుక సంయోగ మైనా, వియోగ మైనా - అది ఏ సంబంధ మైనా, రెండిటికి సంబంధించిన పూర్ణావగాహన లేక పోవడం చేతనే ఒకటి చిగురిస్తే మరొకటి వాడి పోవడము, ఒకటి వాడిపోతే మరొకటి చిగురించడము జరుగుతూ ఉంటుంది. ఇలా సంసార వృక్షము జీవిస్తూనే ఉంటుంది.

అలా కాకుండా సంబంధాలలో - సంయోగానికి, వియోగానికి - రెండిటికీ సంబంధించిన అవగాహన పూర్ణంగా ఏర్పడి నపుడు, వివేక జనిత జ్ఞానము కలుగుతుంది. అట్టి జ్ఞానములో రెండు సంబంధాలూ ఒకేసారి పండుటాకు ల్లాగా రాలి పోతాయి. అదే అసంగము. అట్టి అసంగ శస్త్రము చేత సంసార వృక్షాన్ని సమూలంగా ఛేదించాలి (***అశ్వత్థ మేనం సువిరూఢ మూలమ్ అసంగ శస్త్రేణ దృఢేన ఛిత్త్వా***).

### అసంగ స్వరూపము

అనిత్య విషయాల లోని అసంపూర్ణతను అర్థం చేసుకొని, అనర్థదాయక మైన అనిత్యాల నుండి విరమించడమే అసంగం కాదు. సాధక దశలో అది అసంగమే అయినా, సాధ్య దశలో అదే స్వరూపము. విషయి విషయాల లోనే గాక, వాటి మధ్య ఉండే సంబంధాలతో సహ సర్వములో, సమస్తములో ఏది పరివ్యాప్తమై ఉందో, అట్టి అద్వయ చైతన్య స్వరూప జ్ఞానమును పొంది, తన స్వరూపమే అసంగము అని తెలియడమే అసంగము యొక్క పారమార్థిక నిర్వచనము.

*అసంగోఽహం అసంగోఽహం అసంగోఽహం పునః పునః*
*సచ్చిదానంద రూపోఽహం అహ మేవాహ మవ్యయః ॥*

'నేను అసంగుణ్ణి. నేను అసంగుణ్ణి. నేను మళ్ళీ మళ్ళీ అసంగుణ్ణి. సచ్చిదానంద రూపుణ్ణి. అవ్యయుణ్ణి అయిన నేను నేనే' అని శ్రీ శంకరాచార్యస్వామి బ్రహ్మజ్ఞానావళీ మాలలో అసంగ స్వరూపాన్ని కీర్తించారు.

ఇదే నిజమైన అసంగము. అంటే నిద్రలో ఇష్టం లేని స్వప్నం నుండి విడిపడి, మగతలో మరొక ఇష్టమైన స్వప్నం లోకి దూరడము కాదిది. ఇదొక ప్రబుద్ధ దశ. నిద్ర నుండి మేలుకున్న స్థితి. ప్రియాప్రియ స్వప్నాలు రెండిటి నుండి విడిపడి స్వప్న ప్రపంచముతో తనకు ఏ విధమైన సంగత్వము లేదని గ్రహించి అసంగంగా శోభించే అద్వైత స్థితి.

అసంగ శస్త్రముతో అనిత్య సంబంధాలను ఖండించి, సంసార వృక్షాన్ని పెకలించిన తరువాత, అసంగ స్వరూపమును అన్వేషించి పొందే ప్రయత్నం చెయ్యాలి. ఖండించడ మంటే ఏమిటో పూర్వ శ్లోకంలో చూశాము. స్వరూపానుభూతికి చేయ వలసింది ఏమిటో ప్రస్తుత శ్లోకంలో చూస్తాము.

### తక్షణ కర్తవ్యం

***తతః*** అంటూ నాల్గవ శ్లోకాన్ని ఆరంభించాడు ఆదిదేవుడు. ***తతః*** అంటే 'ఆ తరువాత' అని అర్థము (***పశ్చాత్***). ఏ తరువాత? సంసార వృక్షాన్ని సమూలంగా పెకలించిన తరువాత ఏమి చేయాలి? (***కిం కర్తవ్యం?***). తత్పదమును చేరే ప్రయత్నం చేయాలి. 'పదం' అంటే స్థానము. 'తత్పదం' అంటే 'ఆ స్థానము' అని అర్థము.

ఆ స్థానము ఏది? సంసార వృక్షానికి ఏది మూలమై ఊర్ధ్వంగా ఉందో అదే తత్పదము. బీజ భూతమైన బ్రహ్మపదము. దానిని చేరాలి. అది ఎక్కడుంది? దానిని చేరే దెలా? దానిని అన్వేషించి తెలుసుకో మంటున్నాడు (***తత్ పరిమార్గితవ్యం***). పరిమార్గణము అంటే అన్వేషణము అని అర్థము.

ఈ అన్వేషణము ఎక్కడ జరగాలి? ఏ ప్రదేశంలో అన్వేషించాలి? ఏ ప్రదేశంలో అన్వేషించినా, ఆ ప్రదేశము మళ్ళీ సంసార వృక్షంలో ఉన్నదే. అక్కడే తిరుగుతూ దానికి ఆధారమైన ఉన్నత పదమును ఎలా చేరగలము? సృష్టి కార్యం లోనే తిరుగుతూ సృష్టి కారణాన్ని ఎలా దర్శించ గలము? కనుక 'తత్పదము' ఎక్కడుంది? అని 'ఇదం'లో తిరిగితే అది సిద్ధించదు. కనుక, 'ఇదం' వైపుగా ప్రయాణాన్ని ఆపాలి. అందుకే భగవంతుడు పరిమార్గణం అన్నాడు.

బ్రహ్మపదం అనేది అనంత మైనది. పూర్ణ మైనది. అలాంటి దానిని ప్రయత్నించి పొంద లేము. అది కర్మ సాధ్యం కాదు. కనుక దానిని తెలుసుకోవాలి. అది కర్తవ్యానికి సంబంధించింది కాదు; జ్ఞాతవ్యానికి సంబంధించింది. అందుకే అది మార్గంగా కాకుండా పరిమార్గణంగా వర్ణించ బడింది. పరిమార్గణము అనేది అన్వేషణము. కాకపోతే, ఆచారము ద్వారా కాదు, విచారము ద్వారా. అది కర్తవ్యము కాదు, జ్ఞాతవ్యము ***(పరిమార్గణమ్ అన్వేషణం, జ్ఞాతవ్యం ఇత్యర్థః )***. ఇదే శ్రుతి ప్రబోధము. శ్రుతి ప్రమాణము. పరమ పదమును, లేదా బ్రహ్మ పదమును అన్వేషించాలి. అన్వేషించాలి అంటే ఆచరణము కాకుండా విచారణ మార్గంలో అన్వేషించాలి అని వేద ప్రమాణము. ***సోఽన్వేష్టవ్యః సవిజిజ్ఞాసి తవ్యః*** - దానిని అన్వేషించాలి అంటే, దానిని తెలుసుకోవాలి అన్నది శ్రుతి. ఇక్కడ జ్ఞాతవ్యమే కర్తవ్య మైంది. కర్మ జిజ్ఞాసగా మారింది. కర్మ మాయమై జిజ్ఞాస మార్గ మైంది. అదే పరిమార్గణము.

## జ్ఞాతవ్యమే కర్తవ్యము

లేని దానిని పొందేందుకు ప్రయత్నం అవసరం. కర్మ అవసరం. కర్మ అంటే చేసేది. కనుక అది కర్తవ్యము. కాని, అనంతమైన బ్రహ్మమును పొందటానికి ఏ కర్మ చెయ్యాలి? ఏ కర్మ చేసినా దానికి ఆద్యంతాలు ఉంటాయి. ఆద్యంతాలు కలిగిన కర్మ యొక్క ఫలం కూడా ఆద్యంతాలు కలిగే ఉంటుంది. అంతమయ్యే కర్మ అనంతమైన ఫలితాన్ని ఎలా ఇస్తుంది? కనుక అనంత స్వరూపమైన బ్రహ్మపదము, లేదా మోక్షము అంతమయ్యే కర్మ యొక్క ఫలం కాలేదు. కర్మఫల మేదైనా నశించేదే కనుక, బ్రహ్మపదము కూడా కర్మఫలమే అయితే, బ్రహ్మపదము కూడా నశిస్తుంది. మోక్షము కూడా నశిస్తుంది అని అర్థము. ***కర్తవ్యేన సాధ్యశ్చేత్ మోక్షః అభ్యుపగమ్యతే అనిత్య ఏవస్యాత్*** - కర్తవ్యం చేత, అంటే కర్మ యొక్క ఫలంగా మోక్షము సాధింప బడితే, అట్టి మోక్షము కూడా అనిత్యమే అవుతుంది అని బ్రహ్మసూత్ర భాష్యంలో శ్రీ శంకరులు నిర్ణయించారు *( 1 - 1 - 4 )*.

బ్రహ్మము అనంతము. అనంతమైన బ్రహ్మపదము పూర్ణమై ఉంది. పూర్ణ మైనది నీకు దూరంగా ఎలా ఉంటుంది? పూర్ణానికి దూరంగా, అన్యంగా నీవు ఎలా ఉండ గలవు? బ్రహ్మపదము పూర్ణము, అనంతము కనుక, నీవు దాని కన్నా వేరుగా లేవు. నీవూ పూర్ణం లోనే ఉన్నావు. నీవే పూర్ణము. నీవే బ్రహ్మము. బ్రహ్మమే అయిన నీవు, బ్రహ్మమును ఎలా పొందుతావు?

'నేను బ్రహ్మము' అనే జ్ఞానము లేక పోవడం చేత మనిషి 'నేను జీవుణ్ణి'; పరిమితుణ్ణి అని భావిస్తున్నాడు. భావించి నంత మాత్రాన అనంత మైనది పరిమితం అవుతుందా? కాదు. పూర్ణం గానే ఉంటుంది. కనుక, ఇప్పుడు చేయ దగింది ఏమిటి? అజ్ఞానాన్ని నిర్మూలించడమే. అజ్ఞానం ఎలా నిర్మూలింప బడుతుంది? దానికి విరుద్ధ మైన జ్ఞానం చేతనే నిర్మూలింప బడుతుంది. మరో మార్గం లేదు. చీకటిని వెలుగు ఎలా పోగొడుతుందో, అవిద్యను విద్య అలా అంత మొందిస్తుంది ***( విద్యాఽవిద్యాం నిహన్త్యేవ తేజ స్తిమిర సంఘవత్*** - *శ్రీ శంకరుల ఆత్మబోధ )*.





## శ్రుతి రేవ శరణం

పూర్ణ బ్రహ్మము కర్తవ్య పరిధి లోనిది కాదని, కేవలం జ్ఞాతవ్యమే నని తేలి పోయింది. మరి, దానిని ఎలా తెలుసుకోవాలి? నీకు నీవుగా తెలుసుకొనే అవకాశమే లేదు. నేను పరిమితుణ్ణి, నశించే వాణ్ణి అని నిర్ధారణ చేసుకున్న వాడే నేను అనంతుణ్ణి, అవినాశిని అని ఎలా తెలుసుకో గలడు? కనుక, తనకు తానుగా తెలుసుకో లేని సత్యం తెలిసిన మరొకడు తెలిపి నపుడే తెలుస్తుంది. ఆ తెలిపే వాడే సద్గురువు. సద్గురువు ఎవరికి లభిస్తాడో వాడికే బ్రహ్మము పూర్ణము అనే జ్ఞానం కలుగుతుంది ***( ఆచార్యవాన్ పురుషో వేద )***. కనుక అట్టి జ్ఞానాన్ని పొందడానికి జిజ్ఞాసువు గురువును ఆశ్రయించాలి ***( తద్విజ్ఞానార్థం సః గురు మేవ అభిగచ్ఛేత్*** - *ముండకోపనిషత్తు )*. గురువు జ్ఞానాన్ని బోధిస్తాడు. నీవే బ్రహ్మము అని నీకు అర్థమయ్యే లాగా, నిన్ను నీవు దర్శించే లాగా ప్రామాణికంగా ప్రబోధిస్తాడు.

జ్ఞానమును 'ప్రమ' అంటారు. ప్రమాణం ఉన్నప్పుడే ప్రమ కలుగుతుంది. ఇక్కడ బ్రహ్మజ్ఞానము విషయంలో శాస్త్రమే ప్రమాణము. అదే శ్రుతి ప్రమాణము. వేద ప్రమాణము. వేదాంత వాక్య విచారము. దీనినే ప్రమాణ విచారము అంటారు. శాస్త్రమును ప్రమాణంగా గ్రహించి, నీవు బ్రహ్మము అయ్యే ఉన్నావు అనే జ్ఞానాన్ని గురువు ప్రసాదిస్తాడు. ఆ దివ్య ముహూర్తంలో అద్దంలో ముఖాన్ని చూసుకున్నట్లు, శాస్త్ర జ్ఞానంలో ముముక్షువు తనను తాను దర్శించు కుంటాడు. తానే ఆత్మ. ఆత్మయే బ్రహ్మము అనే అపరోక్ష జ్ఞానాన్ని పొందుతాడు ***( దర్పణే ముఖ దర్శనవత్ శాస్త్రే ఆత్మ దర్శనం )***. ఈ విధంగా బ్రహ్మపదం జ్ఞాతవ్యం. అందుకే ***పరిమార్గితవ్యం*** అన్నాడు. ***పరి*** అనే పదము ప్రమాణమైన శాస్త్రమును ప్రతిపాదించడానికి వాడ బడింది. ***పరిమార్గితవ్యం*** అంటే ప్రమాణ విచారం ద్వారా బ్రహ్మమును అన్వేషించాలి అని అర్థము. ఇది జ్ఞాన మార్గము. సూటి యైన రాజమార్గము.

కనుక విషయ త్యాగము, సంగత్యాగము జరిగి అసంగ బుద్ధి ఏర్పడిన తరువాత, నిశ్చలమైన, నిర్మల మైన బుద్ధితో శ్రవణం చెయ్యాలి. కనుకనే సంగత్యాగము తరువాతే శ్రవణం చెయ్యాలి అనే నియమాన్ని విధించింది శాస్త్రం ***( సన్న్యస్య శ్రవణం కుర్యాత్ )***. కనుక, మోక్షం జ్ఞాన రూపంలో ఉన్నందున, జ్ఞానము వల్లనే మోక్షము ప్రాప్తిస్తుంది. అదే బ్రహ్మపదము. ఆ బ్రహ్మపదము ఎలాంటిదో కూడా చెబుతున్నాడు.

## తత్పదము - పరమ పదము

అన్వేషించి పొంద దగిన ఆ పద మేమిటో చెబుతున్నాడు ***( తత్పదం )***. సంసార వృక్షానికి మూలంగా ఏది ఊర్ధ్వ మని చెప్పబడిందో అదే పదము ***( తత్ పదమ్ )***. ఇక్కడ 'పదము' అంటే మోక్షము అని అర్థము. ***పద్యతే గమ్యతే ముముక్షుభిః ఇతి పదమ్*** - మోక్షమును కోరే ముముక్షువులు పొందేది పదము. దీనినే పరమపదము అంటారు. అంటే అంతకంటే ఉత్కృష్టమైన స్థానము లేదు అని అర్థం. కనుక అది పరమపదము ***( యస్మాత్ ఉత్కృష్టం నాస్తి తత్ పరమపదం )***. దేనిని చేరిన తరువాత మళ్ళీ తిరిగి రారో, అదే ***పదం*** శబ్దము చేత చెప్ప బడింది. అంటే, ఏ బ్రహ్మమును చేరిన తరువాత తిరిగి మళ్ళీ సంసార వృక్ష ఛాయ లోకి రారో, అదే బ్రహ్మ పదము ***( యస్మిన్ పదే గతాః ప్రవిష్టాః న నివర్తన్తే న ఆవర్తన్తే భూయః పునః సంసారాయ )***. అది తిరిగి రాని పోక. అదే పరమపదం.

అందుకనే మన సంస్కృతిలో మరణించిన వారిని పరమపదించారు అంటారు. అంటే, వాళ్ళు పరమ పదమును, లేదా మోక్షమును పొందారని అర్థము. వాళ్ళు మోక్షాన్ని పొందారో లేదో చెప్పే వారికి తెలుసా?



4-8

తెలియదు. కాకపోతే, వారు మోక్షాన్ని పొందాలి అనేది ఆకాంక్ష. మోక్షాన్ని పొందడమే అందరి జీవిత లక్ష్యం కావడం చేత అందరికీ లక్ష్య సిద్ధి ప్రాప్తించాలనే పవిత్ర ఆకాంక్ష. అంతే.

పదం, ధామం అనేవి వేదం లోని పవిత్రమైన పదాలు. పరమపదము, పరంధామము అనేవి జీవి గమ్యాన్ని నిర్దేశించే ప్రమాణ వచనాలు. 'పదం' అన్నా 'ధామం' అన్నా చోటు, లేదా స్థానము అని అర్థము. దానినే 'అయనం' అని కూడా అంటారు. 'పరాయణం' అనే పేరు పరమాత్మకు అలాగే వచ్చింది. 'పరం' అంటే ఉత్కృష్టమైన, 'అయనం' అంటే స్థానము అని అర్థము ***( పరం ఉత్కృష్టం అయనం, స్థానం పునరావృత్తి శంకా రహితం ఇతి పరాయణమ్).*** ప్రతి ఒక్కరు పొంద వలసిన ఉత్కృష్టమైన పదము పరాయణము. అదే బ్రహ్మపదము. అది సాధారణ గమ్యాల వంటిది కాదు. దేనిని పొందిన తరువాత తిరిగి రావడం అంటూ ఉండదో, మరొకటి పొందాలి అనే వాంఛ కలగదో, అదే పరాయణము. పరమాత్మ స్థానము. బ్రహ్మపదము. పరమపదము. ఏ స్థానమును, లేదా గమ్యమును చేరిన తరువాత తిరిగి రావడ మంటూ ఉండదో, అదే మోక్షపదము. భగవంతుడు ప్రస్తుత శ్లోకంలో అదే చెబుతున్నాడు.

**వెను దిరగని వెన్నుని నిలయము**

పరబ్రహ్మ స్థానమే పరమ పదము. ఏ స్థానమును చేరిన తరువాత తిరిగి మళ్ళీ సంసారంలో ప్రవేశించడం జరగదో అదే పరమ పదము. దానినే విష్ణుదేవుని మందిరంగా వేదం అభివర్ణించింది ***( తద్విష్ణోః పరమం పదం).***

ఇక్కడ ఒక్క విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. ఒక స్థానమును చేరడము అంటే, సాధారణంగా ఒక ప్రదేశాన్ని ఒక కాలంలో చేరడము అని మనం అర్థం చేసుకుంటూ ఉంటాం. అందుకనే, పయనము, గమ్యము అనే మాటలు చెవిన పడగానే వెంటనే దేశకాలాదులు తల లెత్తుతాయి. కనుకనే, ఎక్కడికి పోయినా, ఎవరు పోయినా, తిరిగి రావడం అనేది సహజం గానే ఉంటుంది.

పిల్లలు బడికి పోతారు, తిరిగి ఇంటికి చేరుతారు. పెద్దలు కార్యాలయాలకు వెళ్తారు. వెళ్ళినట్లే తిరిగి ఇంటికి చేరుతారు. సంచి పట్టుకొని తిరుపతికి వెళ్తారు. దర్శనమైన తరువాత సంచిలో లడ్డు ప్రసాదం పెట్టుకొని తిరిగి ఇంటికి చేరుతారు. మరణించి కొందరు స్వర్గానికి పోతారు. పుణ్యం క్షీణించ గానే తిరిగి మళ్ళీ భూలోకానికి చేరుతారు. మెట్లెక్కిన వాళ్ళు మెట్లు దిగుతారు. చెట్లెక్కిన వాళ్ళు చెట్లు దిగుతారు. లోని కెళ్ళిన వాళ్ళు బయటి కొస్తారు. అన్నీ ఇలాగే ఉంటాయి. ఇలాంటి వ్యర్థ ప్రయాణాలు తెలియని, అనర్థ ప్రమాణాలు అందుకోలేని దివ్య ధామమే తత్పదము. వేదం చెప్పిన పరమ పదం. పరంధామం. పరాయణం. అది రాక తెలియని పోక. తిరుగు లేని, తిరిగి రాని పోక ***( యస్మిన్ గతా న నివర్తన్తి ).***

పరమేశ్వరుని ధామమే పరంధామము. పరబ్రహ్మ స్థానమే బ్రహ్మపదము. బ్రహ్మ మేమిటో అర్థమైతే, బ్రహ్మపదము అనేది ఎక్కడుందో తెలుస్తుంది.

సృష్టి పరమేశ్వరుని నుండి ఆవిర్భవించింది. సృష్టి కార్యానికి బ్రహ్మము అభిన్న నిమిత్త ఉపాదాన కారణం కావడం చేత, సృష్టి పరమాత్మ కన్నా అన్యంగా లేదు. ఉండ లేదు. సృష్టి రూపంలో పరమాత్మే ఉన్నాడు. సృష్టి ఎక్కడుందో సృష్టికర్త అక్కడే ఉన్నాడు. సృష్టి లేకపోయినా సృష్టికర్త పరబ్రహ్మముగా తన స్వరూపంలో తాను దివ్యంగా భాసిస్తూ ఉంటాడు. అదే ఆదిదేవుని అనంత వైభవం.

బ్రహ్మము అనంత మని ఇప్పటికే పదే పదే చెప్పుకున్నాం. అనంత మైనది ఒక ప్రదేశానికి పరిమితంగా ఉంటుందా? ఒక కాలానికి నియమితమై ఉంటుందా? అనంత మనేది అద్వయము. పూర్ణము. అలాంటిది లేని





చోటే లేదు. అది లేని కాలమే ఉండదు. దేశకాలాదులు దానిని ఆశ్రయించుకునే అగుపిస్తాయి. దేశకాలాదులు లేక పోయినా అది అద్వయ సత్తా స్వరూపంగా ఉంటుంది. అదే అనంతము, పూర్ణము. ఈ పూర్ణము ఎవడికి కలుగుతుందో వాడు తానే పూర్ణ మని తెలుసుకుంటాడు. తానే అనంత మనే అనుభూతిలో ఉంటాడు. ఈ జ్ఞానం లేక ముందు ఆ ప్రదేశాన్ని చేరాలనే ప్రయత్నంలో సాధకుడుగా అగుపించిన వాడు, జ్ఞానము ప్రాప్తించ గానే తాను చేరే ఉన్నాడని, దానిని పొందే ఉన్నాడని, సిద్ధు డయ్యే ఉన్నాడనే జ్ఞానంతో విరాజిల్లుతాడు. జ్ఞానము కలగనంత వరకు బ్రహ్మవిదుడుగా తెలిసిన వాడు జ్ఞానము లభించ గానే, తానే బ్రహ్మ మనే భావనలో ఉంటాడు. ***బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి -*** ఈ విధంగా బ్రహ్మమునకు సంబంధించిన జ్ఞానమును పొందిన వాడు బ్రహ్మమే అగు చున్నాడు. ***బ్రహ్మవి దాప్నోతి పరం -*** బ్రహ్మవిదుడు పరంధామమును పొందుతున్నాడు. బ్రహ్మపదమును పొందుతున్నాడు. తానే బ్రహ్మముగా శోభిస్తున్నాడు అన్నది తైత్తిరీయ శ్రుతి.

**ఆకాంక్ష - ఆశ్రయము**

అట్టి పరబ్రహ్మమును ఆశ్రయించాలి. ఆదిదేవుడు ***(ఆద్యం)***, ఆదిపురుషుడు ***(పురుషం)***, అనాది అయిన సంసార వృక్షము ఏ దివ్యాత్ముని నుండి విస్తరించినదో ***( యతః ప్రవృత్తిః ప్రసృతా పురాణీ )*** అట్టి పరమాత్మనే ***(తం)*** ఆశ్రయిస్తాను; శరణు పొందుతాను ***(ప్రపద్యే)*** అనే భావనతో పరమాత్మను అన్వేషించాలి ***(పరిమార్గితవ్యం)*** అంటున్నాడు.

జ్ఞానాన్ని పొందాలి అంటే జ్ఞానాన్నే ఆశ్రయించాలి. పరమాత్మను పొందాలంటే ఎవరినో, దేనినో ఆశ్రయిస్తే ఉపయోగం లేదు. పరమాత్మనే ఆశ్రయించాలి. అందుకు ఉన్నతమైన, ఉత్కృష్టమైన సాధన భక్తి. సదా పరమేశ్వరుని యందే ఆసక్తిని కలిగి అన్య మెరుగని భక్తి. అనన్య భక్తి ***(సా పరానురక్తి రీశ్వరే -*** శాండిల్య భక్తి సూత్రము ).

పద్నాల్గవ అధ్యాయాన్ని సమాప్తం చేస్తూ, ఎవడైతే భగవంతుని అచంచలమైన భక్తితో సేవిస్తాడో, వాడు త్రిగుణాలను అతిక్రమించి బ్రహ్మత్వానికి, లేదా మోక్షానికి అర్హుడగు చున్నాడు అని పరమేశ్వరుడు బోధించాడు *(14 వ అ - 26 వ శ్లో).*

బ్రహ్మత్వమును పొందడ మనేది సులభ సాధ్యమైన కార్యం కాదు. పరమేశ్వరుని అనుగ్రహం లేకుండా అది సాధ్యం కాదు. ఈశ్వర కృప లేకపోతే, తాత్త్విక ఆలోచనే రాదని అభిప్రాయ పడ్డాడు దత్తాత్రేయుడు ***(ఈశ్వరానుగ్రహాత్ ఏవ పుంసాం అద్వైత వాసనా -*** *అవధూత గీత).*

ప్రపంచం మీద విరక్తి రానిదే పరమాత్మపై ఆసక్తి జనించదు. ఆసక్తి లేని వారికి భక్తి ఎలా కుదురు తుంది? అందుకనే సంసారంపై విరక్తి జనించడానికి, వైరాగ్యం అంకురించడానికి పదిహేనవ అధ్యాయం ప్రారంభం లోనే వృక్ష రూప కల్పన చేత సంసార వృక్షాన్ని వర్ణించడం జరిగింది. భగవత్తత్త్వం విషయంలో అధికారి కావాలంటే వైరాగ్యమే ప్రధాన కారణం కనుక, మొదటి మూడు శ్లోకాలలో వైరాగ్యానికి హేతువైన సంసార వృక్షాన్ని అసమానంగా వర్ణించాడు గీతాచార్యుడు ***( వైరాగ్య హేతోః సంసార స్వరూపం వర్ణయతే ).***

భక్తికి కారణమైన వైరాగ్యాన్ని సంపూర్ణంగా వివరించిన తరువాత, పరబ్రహ్మ మైన పురుషోత్తముని స్వరూప వైభవాన్ని వర్ణించేందుకు ఉపక్రమిస్తున్న సమయంలో పద్నాల్గవ అధ్యాయాంత శ్లోకద్వయాన్ని పది హేనవ అధ్యాయారంభ శ్లోక త్రయాన్ని దృష్టిలో ఉంచుకొని 'ప్రపద్యే' అనే శరణాగత సూచకమైన భక్తి భావ పదాన్ని భగవంతుడు భావగర్భితంగా ప్రయోగించాడు.

ఎవరు ఎంత బోధించినా, ఎవరికి ఎంత ప్రజ్ఞ ఉన్నా, మహిమాన్వితుడైన పరమాత్మను మాటల్లో మడత

పెట్టడం గాని, మనస్సు లోకి మరలించు కోవడం గాని సాధ్యం కాదు. అనంతుణ్ణి వశం చేసుకొనే టంతటి అనంత శక్తిమంతులం మనం కాము. శక్తి చాలని చోట, యుక్తి చేరని చోట భక్తి ఒక్కటే నిరంజనమై శోభిస్తుంది. అందుకే పరమాత్మను ఆశ్రయించాలి. ఆర్తితో సేవిస్తూ, అవగాహనను పెంపొందించుకొని, అద్వైత జ్ఞానాన్ని పొంది తరించాలి. సంసార మూలమై, ఊర్ధ్వంగా భాసిస్తున్న బ్రహ్మ పదమును బ్రహ్మ జ్ఞానము ద్వారా సొంతం చేసుకోవాలి.

మహాభక్తుడు కావడం చేతనే, ప్రహ్లాదునికి ***ఇందు గల డందు లేడని సందేహము వలదు, చక్రి సర్వోప గతుండు*** అనే అద్వైత జ్ఞానము కలిగింది. భక్తి లేకుండా జ్ఞానాన్ని పొందట మనేది గుఱ్ఱం ముందు బండి నుంచి, దానిలో పయనించి గమ్యం చేరే ప్రయత్నం లాంటిది.

వ్యాస భాగవతంలో అద్వైతానుభవ ప్రాప్తికి ప్రహ్లాదుడు వ్యక్తం చేసిన భావము ఎప్పుడూ నా బుద్ధిలో అఖండ దీపంలా వెలుగుతూ ఉంటుంది. అద్వైత మార్గానుయాయులకు భక్తేమిటి? అని ఎవరైనా వ్యాఖ్యానించి నపుడు ఈ శ్లోకము నా మనస్సులో అల లాగా కదుల్తుంది.

శ్లో॥ ***స యదానువృతః పుంసాం పశుబుద్ధి ర్విభిద్యతే ।***
***అన్య ఏష తదాన్యోఽ హ మితి భేద గతా సతీ ॥***

ఎవరికి ఎప్పుడు భగవంతుడు అనుకూలంగా ఉంటాడో ***(అనువ్రతః)***, అప్పుడే అతడు వేరు - నేను వేరు అనే భేద బుద్ధి నశించి, అద్వైత భావన ఏర్పడుతుంది అన్నాడు ప్రహ్లాదుడు.

ప్రహ్లాదుడు భక్తిలో సామాన్యుడా? జ్ఞానంలో సామాన్యుడా? అనిర్వచనీయ మైన భక్తి ద్వారా శ్రీహరి ఒడ నెక్కిన పరమ భాగవతోత్తముడు, అఖండమైన అద్వైత జ్ఞానం చేత అద్వితీయ పరబ్రహ్మముగా శోభించిన ప్రహ్లాదుని పవిత్ర వాక్కుల కంటే ప్రమాణ మేముంది? భక్తి నావలో పయనించిన వారే జ్ఞాన గమ్యాన్ని చేరుతారు. ఈ సత్యాన్ని పోతనామాత్యుని ఆంధ్రభాగవతము అత్యద్భుతంగా, ప్రస్తుతం మనం అధ్యయనం చేస్తున్న శ్లోకానికి వ్యాఖ్యానమా అన్నట్లుగా ప్రవచించింది.

శ్లో॥ ***సంసార జీమూత సంఘంబు విచ్చునే చక్రి దాస్య ప్రభంజనము లేక***
***తాపత్రయా భీల దావాగ్ను లాఱునే విష్ణుసేవామృత వృష్టి లేక***
***సర్వం కషాఘౌఘ జలరాసు లింకునే హరి మనీషా బడబాగ్ని లేక***
***ఘన విపద్గాఢాంధ కారంబు లడగునే పద్మాక్ష నుతి రవి ప్రభలు లేక***
తే॥ ***నిరుపమా పునరావృత్తి నిష్కళంక ముక్తి నిధిఁ గానవచ్చునే ముఖ్యమైన***
***శార్ఙ్గ కోదండ చింతనాంజనము లేక తామరస గర్భునకు నైన దానవేంద్ర ।***

తండ్రీ! దానవేశ్వరా! గొప్ప వాయు ప్రభంజనము లేకుండా కారుమబ్బుల గుంపులు ఎలా చెదరవో, చక్రధారి శ్రీమహావిష్ణువు సేవ లేకుండా సంసార మేఘాలు కూడా తొలగవు.

అరణ్యాలలో రగుల్కొన్న దావానలం వర్షాలు పడక పోతే ఎలా చల్లారదో, శ్రీహరి సేవామృత ధారలు వర్షించ కుండా తాపత్రయాలనే కార్చిచ్చు ఆరదు.

భయంకరంగా ప్రజ్వరిల్లిన బడబాగ్ని లేకుండా సాగర జలాలు ఇంకి పోవడం ఎలా జరగదో, విష్ణుసేవ అనే ప్రళయాగ్ని ప్రజ్వరిల్లనిదే పాప సముద్రాలు కూడా ఇంకిపోవు.

సూర్యకాంతి లేనిదే తిమిరాలు తొలగనట్లు, కేశవ కీర్తన మనే రవికిరణాలు ప్రసరించకుండా అలుముకున్న ఆపదలు అదృశ్యం కావు.





చివరగా, హరిభక్తి అనే జ్ఞానాంజనము లేకుండా నిర్మలమై, నిరుపమానమై, పునరావృత్తి లేని పదమును, పునర్జన్మ లేని మోక్ష ధామమును చేరడం ***(యస్మిన్ గతా న నివర్తన్తి భూయః తత్ పదం)*** బ్రహ్మదేవునికి కూడా సాధ్యం కాదు అని అనుభవామృతాన్ని వర్షింప చేశాడు భక్త ప్రహ్లాద కుమారుడు.

**ఆదిదేవుడే శరణ్యము**

అచంచల మైన భక్తి చేత ఏ దివ్యాత్ముని ఆశ్రయిస్తే, అతని అనుగ్రహం చేత బ్రహ్మపదము ప్రాప్తి స్తుందో, అతడు ఎలాంటి వాడో కూడా తెలియ చేస్తున్నాడు. అతడు ఆద్యపురుషుడు. పురాతనుడు ***(ఆద్యం ఆదౌ భవం ఆద్యం)***, అంటే ఆది నుండి ఉన్నవాడు అని అర్థము.

జగత్తుకు ఆద్యంతా లున్నాయి. నిజమే. ఆ విషయం తెలిసిం దెవరికి? జగత్తు లోని వారి కెవ్వరికీ తెలిసే అవకాశమే లేదు. జగత్తు విలీనం కాగానే, జగత్తు లోని సర్వ ప్రాణులు విలీన మవుతారు. తిరిగి అవ్యక్తం నుండి జగత్తు వ్యక్తమైన తరువాతే లయమైన జీవులు పునః జీవిస్తారు. కనుక జగత్తు యొక్క ఆద్యంతాలను జగత్తు లోని జీవులు చూడ లేరు ( మార్కండేయుని ప్రసక్తి అరుదైన విషయం. అది కూడా ఈశ్వరానుగ్రహం వల్లనే మార్కండేయ మహర్షి ప్రళయాన్ని దర్శించాడు) .

ఎవరికి ఆద్యంతాలు లేవో, జగత్తు యొక్క ఆద్యంతాలను ఎవడు సాక్షిగా వీక్షించాడో అతడికే సృష్టి యొక్క ఆద్యంతాలు తెలుసు. అంటే, జగత్తు యొక్క ఆరంభము లోనే తాను ఉన్నాడు. కనుక అతడు 'ఆద్యం'. ఆద్యపురుషుడు. ఆదినారాయణుడు. ***త్వమాది రన్తో జగతోఽ స్య మధ్యమ్*** - 'హే భగవాన్! ఈ జగత్తుకు ***(అస్య జగతః)***, నీవు ***(త్వం)*** ఆదివి ***(ఆదిః)***, అంతానివి ***(అంతః)***, మధ్య నున్న వాడివి కూడా ***(మధ్యమ్)*** అని వ్యాస భాగవతము.

ఆద్యుడైన భగవానుని పురుషుడు అంటున్నాడు ***(పురుషం)***. ఈ సందర్భములో 'పురుష' పద ప్రయోగము గంభీరమైన భావంతో కూడుకొని ఉంది. ఆద్యుడు అనే పదాన్ని దేనిని సూచించడానికి ప్రయోగించాడో, పురుష శబ్దమును కూడా అదే ఉద్దేశముతో ప్రయోగించాడు. అంతేకాదు. ఒకే అర్థాన్ని సూచిస్తూ రెండు పదాలను ప్రత్యేక స్పృహతో పలికాడు.

ఆద్యు డంటే ఆది యందు, సృష్ట్యాది యందు ఉన్న వాడని అర్థం చేసుకున్నాం. పురుష శబ్దానికి కూడా ఇక్కడ అదే అర్థం. ***పురా ఏవ ఆసీత్ ఇతి పురుషః.*** ఏదీ లేక ముందు, ఏదీ రాక ముందు ఏకమై, అద్వితీయంగా ఎవడు భాసించాడో, అతడే పురుషుడు. కనుకనే ఆద్యుడు. కనుకనే అతని నుండే సంసార వృక్షము ఆవిర్భవించింది అని కూడా ప్రస్తుత శ్లోకం లోనే చెప్పడం జరిగింది ***(యతః ప్రవృత్తిః ప్రసృతా పురాణీ)***. మరి, పురుష శబ్ద ప్రయోగం లోని వైశిష్ట్య మేమిటి?

ఎవరి నుండి సృష్టి ఆవిర్భవించిందో, ఎవరి ధామమును పొందితే తిరిగి సంసారంలో పడటం జరగదో, అట్టి ఆద్యుడు, పురుషుడు అయిన వాని ధామమును ***(తత్ పదం)*** అన్వేషించడానికి, లేదా తెలుసుకోవడానికి ***(పరిమార్గణం)*** అతడిని ఆశ్రయిస్తాను, లేదా ఆశ్రయించి పొందుతాను ***(ప్రపద్యే)*** అంటున్నాడు.

ఎక్కడ అన్వేషిస్తాడు? ఎలా తెలుసుకుంటాడు? పురుషుడుగా తెలుసుకుంటాడు. ***పురం శరీరమ్, తస్మిన్ శేతే ఇతి పురుషః*** - పురం అంటే శరీరము. శరీరములో శయనించి ఉన్నవాడు పురుషుడు. క్షేత్రజ్ఞుడు. కనుక, క్షేత్రంలో శయనించి ఉన్న పురుషుడే క్షీరసాగరంలో శయనించి ఉన్న పురుషోత్తముడు. జీవుడే దేవుడు అని తెలుసుకుంటాడు. జ్ఞాన చక్షువుతో సత్యాన్ని దర్శిస్తాడు. ***అయమాత్మా బ్రహ్మ*** - ఈ ఆత్మయే బ్రహ్మ అనే

మహావాక్యానుభూతిలో తన్మయు డవుతాడు. శ్లోక సారమైన కేంద్ర విషయాన్ని సుస్పష్టం చేయడానికే పురుష శబ్ద ప్రయోగం చేశాడు.

మరి, అట్టి దివ్య ధామమును ఎవరు చేరుతారు? చెబుతున్నాడు.

**నిర్మానమోహా జితసఙ్గదోషా అధ్యాత్మనిత్యా వినివృత్త కామాః ।**
**ద్వన్ద్వై ర్విముక్తాః సుఖదుఃఖ సంజ్ఞై ర్గచ్ఛ న్త్యమూఢాః పద మవ్యయం తత్ ॥ 5**

*నిర్మానమోహాః-జితసంగదోషాః-అధ్యాత్మనిత్యాః-వినివృత్త కామాః*
*ద్వంద్వైః-విముక్తాః-సుఖదుఃఖ సంజ్ఞైః-గచ్ఛంతి-అమూఢాః-పదం-అవ్యయం-తత్*

| | | | |
|---|---|---|---|
| నిర్మానమోహాః | = అభిమానము, మోహము లేని వారు | విముక్తాః | = విముక్తులు |
| జితసంగదోషాః | = సంగత్వ దోషమును జయించిన వారు | అమూఢాః | = మోహం లేనివారు |
| అధ్యాత్మ నిత్యాః | = ఆత్మ చింతనాపరులు | అవ్యయం | = నశించని |
| వినివృత్త కామాః | = కామములు పూర్తిగా తొలగిన వారు | తత్ | = ఆ |
| సుఖదుఃఖసంజ్ఞైః | = సుఖదుఃఖ రూపాలైన | పదం | = పదమును |
| ద్వంద్వైః | = ద్వంద్వముల చేత | గచ్ఛంతి | = చేరుతారు |

**అర్జునా! మోహాభిమానాలు తొలగిన వారు, సంగత్వ దోషం లేని వారు, సదా ఆత్మ చింతనాపరులు, కోరికలు లేని వారు, సుఖదుఃఖ రూపాలైన ద్వంద్వాలను దాటిన వారు, మోహం లేని మహాత్ములు అవ్యయమైన మోక్షమును పొందుతారు.**

**వ్యాఖ్య**

అచంచలమైన భక్తితో భగవంతుని సేవించిన వారు గుణాతీతులై బ్రహ్మత్వానికి అర్హు లవుతున్నారు. అట్టి వారు తీవ్ర వైరాగ్యవంతులై జ్ఞానమార్గంలో బ్రహ్మపదమును అన్వేషిస్తున్నారు. వారి సాధన ఏ అవాంతరాలు లేకుండా, ప్రతిబంధకాలు రాకుండా నదీ ప్రవాహం లాగా (*స్రోతసాసమం*) సాగాలి అంటే దానికి అవసరమైన అర్హతలను, లక్షణాలను ప్రస్తుత శ్లోకంలో వివరిస్తున్నాడు. ఈ సాధనాంతరాలను రెండవ అధ్యాయం లోను, పన్నెండవ అధ్యాయం లోను, పదమూడవ అధ్యాయం లోను సవిస్తరంగా వివరించాడు. వాటినే క్రోడీకరించి, ఒక్క శ్లోకంలో ఇక్కడ వివరిస్తున్నాడు. అదే ఈ అయిదవ శ్లోకము. బ్రహ్మపదమును పొందాలని ఆశించే వారికి ఉండ వలసిన ఐదు లక్షణాలను ఈ ఐదవ శ్లోకంలో వివరిస్తున్నాడు.

**నిర్మాన మోహులు**

మానము, మోహము తొలగిన వారు నిర్మానమోహులు. అంటే, మాన మోహాలు లేని వాళ్ళు. మానము అంటే అభిమానము. అహంకారానికి ప్రతిరూపము. మోహము అంటే అవివేకము, లేక విపర్యయము. అహంకార అవివేకాల నుండి విడిపడిన వారు నిర్మానమోహులు.

మిథ్యారూపము లైన దేహేంద్రియాల యందు 'నేను' అనే అభినివేశముతో కూడిన అహంభావనే మానము. తాను కాని దానిని తానుగా భావించి, దానిని తన గొప్పతనముగా సంభావించుకొని, తనను తాను గౌరవించుకొనే మానసిక స్థితి అభిమానము. అదే మానము (*ఆత్మానం మానయతీతి మానః*).





కొందరికి ఐశ్వర్యం ఉందనే అభిమానము. ఇది ధనాభిమానం. తన కులం గొప్పదని కొందరు పొంగిపోతూ ఉంటారు. ఇది కులాభిమానం. కొందరిలో దానధర్మాది ఔదార్యపు లక్షణాలు ఉంటాయి. అలాంటి వారు గుణాభిమానంతో ఊగిపోతూ ఉంటారు. కొందరిలో ప్రజ్ఞా విశేషము ఉంటుంది. అలాంటి వారు జ్ఞానాభిమానంతో ఆకాశాన్ని చూస్తూ ఉంటారు. కొందరు తాము అందంగా ఉన్నామని మురిసిపోతూ తమను తాము స్తుతించుకుంటూ ఉంటారు. ఇది రూపాభిమానం. మరొక విచిత్రమైన అభిమానం ఉంది. 'నాకు అభిమానం లేదు' అని భావించుకొని, కనిపించిన ప్రతి ఒక్కరికి పని కట్టుకొని చెబుతూ ఉండటం. వీటన్నిటి వెనుక అదృశ్యంగా అహంకారమే ఉంటుంది.

అభిమానం కల వారు వారిని వారు పూజించు కోవడమే గాక, ఇతరులు తమను గుర్తించాలని, గౌరవించాలని తహతహ లాడుతూ ఉంటారు (*మాన పూజాయామ్*). ఈ దౌర్భాగ్యపు చిత్తవృత్తినే వృత్తిగా పెట్టుకొని, ప్రవృత్తిగా మార్చుకొని పరితపిస్తూ శ్రమిస్తుంటారు. ఎలాగైనా ప్రజల దృష్టిలో తాము పడాలి. టెలివిజన్లలో, వార్తా పత్రికలలో, సభా వేదికల మీద ఇలాంటి వారి అభినయాలు, అర్థరహిత అభిభాషణలే మెండుగా కనిపిస్తుంటాయి. విచిత్రమైన ఈ పోకడల వెనుక ప్రజలు తమను గుర్తించాలని, గౌరవించాలనే నీచ గుణమే ఉంటుంది. దీనికి ఫలితం ఏమిటి? ప్రజలు గుర్తిస్తారు. కాని, గౌరవించరు. పైగా అవహేళనంతో, అనాదరంతో వీక్షిస్తుంటారు. అయినా, అభిమానం కల వారు అలాంటివేవి పట్టించుకోరు. అవసరమైతే ఇంకా విపరీతంగా విజృంభిస్తారు. పాడ్యమి పాడైనా విదియ విజయాన్ని అందించక పోతుందా అనే వల్లమాలిన ఆశతో బ్రతుకు తుంటారు.

వీరి దీనత్వం ఎంత దూరం పోతుందంటే, పూజార్హులైన వారి సన్నిధిలో కూడా తమను తాము పొగుడుకుంటూ గొప్పలు చెప్పుకొనే దుస్థితికి దిగజారుతుంది (*ప్రణతి యోగ్యేషు ఉన్నతి కథనం వా మానః*).

అభిమానం విషయంలో ప్రధానంగా మనం అర్థం చేసుకోవలసిన విషయం ఒకటుంది. ఎవరి కైతే తమపై తమకు గౌరవము ఉండదో, ఉండినా సందేహాస్పదంగా ఉంటుందో, అలాంటి వారే ఇతరుల నుండి గౌరవాలను ఆశిస్తారు. అదేమంటే, ఆత్మగౌరవం అంటారు. ఆత్మను తెలుసుకుంటే మనిషి గౌరవింప బడతాడు గాని, ఆత్మాభిమానం అనే మాయా ప్రదర్శనలకు గౌరవాలు లభిస్తాయా? లభించినా నిలుస్తాయా?

రాగాత్మకము, ఆశా రూపమైన ఈ అభిమానము రజోగుణ లక్షణము. ఇది జీవులను కర్మచక్రంలో పడేసి బంధిస్తుందే గాని సాధనలో ముందుకు సాగ నివ్వదు (*తన్ని బధ్నాతి కౌన్తేయ కర్మ సంగేన దేహినమ్ - 14 వ అ - 7 వ శ్లో*). రజోగుణ సంభవమైన ఈ అభిమానంలో పడి అలమటించే వారు ఆనందానికి దూరం కావడమే గాక బాధాపూరిత జీవితాల్ని కొనసాగిస్తూ ఉంటారు (*రజసస్తు ఫలం దుఃఖం*).

అభిమానము రజోగుణ విశేష మైతే, మోహము తమోగుణ విశేషము. అనాత్మ యందు ఆత్మబుద్ధికి కారణ మైంది మోహమే. అదే అవివేకము. వాస్తవంగా లేని సౌందర్యాన్ని, లేని వైభవాన్ని ఆరోపించి చూడటం మోహం. దీనినే శోభనాధ్యాస అంటారు. విపర్యయ జ్ఞాన మంటే ఇదే. ఈ విధమైన అవివేకము ఆత్మ పరిమార్గణంలో గొప్ప ప్రతిబంధకము అని ప్రత్యేకించి చెప్పాలా! అనాత్మను ఆత్మగా అవలోకించే వారు ఆత్మానుభూతిని ఎలా పొందగలరు? కనుక, బ్రహ్మపదమును చేరేందుకు ప్రయత్నించే ముముక్షువులు ముందుగా ఈ మానమోహాల నుండి నిర్గతులై నిర్మానమోహులు కావాలి (*మానశ్చ మోహశ్చ మాన మోహౌ, తౌ నిర్గతౌ యేభ్యః తే నిర్మాన మోహాః*).

## జితసంగ దోషులు

విషయాల యందలి ఆసక్తియే సంగము. సంగము అనేదే ఒక దోషము. దోషగుణము *(సంగ ఏవ దోషః సంగ దోషః)*. ఈ సంగదోషమును ఎవరైతే జయిస్తారో వారు జితసంగులు. జితసంగ దోషులు *(జితః సంగ దోషః యైః తే జిత సంగదోషాః)*.

సంగత్వానికి సంబంధించిన సంగతి చాలా విచిత్ర మైంది. మనకు దేనితో సంగత్వ ముందో, ఎవరితో సంగత్వ ముందో అర్థమే కాదు. అంటే, సంగత్వం లేదని కాదు. ఉన్నా, ఉన్నట్లు తెలియదు. ఉన్నప్పుడు ఉన్నట్లు అర్థం కానిది, దూర మైనపుడు మనస్సుకు దగ్గరై, ఊహించని రీతిల్లో మనస్సును దుమ్ము రేపుతుంది.

ఇలా బాధ పెట్టడానికే నన్ను అంటి పెట్టుకున్నాయా? ఇలా దుఃఖ పెట్టడానికే నాతో కలిసి జీవించారా? అనే ఆక్రందనలు ఏవి దూర మైనపుడు మన నుండి వినిపిస్తాయో, ఎవరు దగ్గర లేకపోతే మనస్సు ఆక్రోశిస్తుందో, వాటిపై, లేదా వారిపై మనకు అత్యాసక్తి ఉంది అని అర్థ మవుతుంది. అదే సంగము. మనస్సును కలతపెట్టే దోషము. ఈ సంగదోషాన్ని ఎవరు జయిస్తారో వాళ్ళే జితసంగ దోషులు.

సంగత్వాన్ని విడిచి పెట్టమని చెప్పకుండా జయించ మంటున్నాడు. జయము అనే మాట ఎప్పుడు విన పడుతుంది? పోరాటం ఉంటేనే. అపజయానికి అవకాశ మున్నప్పుడే. కనుక, విషయ సంగం గాని, కర్మసంగం గాని, మమత్వ సంగం గాని, కర్తృత్వ సంగం గాని సునాయాసంగా లోబడేవి కావు అనే ధ్వని 'జిత' పద ప్రయోగంలో వినిపిస్తూ ఉంది. అభ్యర్థితో ప్రత్యర్థి పోరాడినట్లు నిరంతరము మనల్ని ముంచే ప్రయత్నం లోనే సంగత్వం ఉంటుంది కనుక, ఎలాగైనా దానిని జయించి, సంగత్వము మీద విజయం సాధించిన వారే జితసంగ దోషులు. వారే బ్రహ్మపదము వైపు ప్రశాంతంగా పయనిస్తారు.

## అధ్యాత్మ నిత్యులు

అధ్యాత్మము అంటే ఆత్మజ్ఞానము. పరమాత్మ జ్ఞానము. అట్టి జ్ఞానము నందు నిత్యులు, నిరతులు, నిలుకడ కలిగిన వారు అధ్యాత్మ నిత్యులు. పరమాత్మ జ్ఞానానికి సంబంధించిన విషయాలను చింతించడం లోనే ఆసక్తి కలవారు. భగవ ద్విషయము నందే శ్రవణ నిష్ఠ కలవారు. శ్రవణ తత్పరులు. చింతనా తత్పరులు *(అధ్యాత్మ నిత్యాః పరమాత్మ స్వరూపాలోచన నిత్యాః తత్పరాః)*.

సంగత్వ దోషాన్ని జయించాలి అని మనం పూర్వ లక్షణంలో చెప్పుకున్న విషయం ఫలప్రదం కావా లంటే, సాధకులు అధ్యాత్మనిత్యులై ఉండాలి. పరమాత్మ చింతనా తత్పరులై ఉండాలి.

విషయాలను చింతించే మనస్సు విషయాల యందు సంగత్వమును కలిగి ఉంటుంది. ఏ మనస్సు పరమాత్మ చింతనములో ఉంటుందో, ఆ మనస్సు విషయ చింతనములో ఉండ లేదు. అన్య విషయ విస్మరణము జరుగుతుంది. సదా పరమాత్మ స్మరణమే కొనసాగుతూ ఉంటుంది.

*ఆ॥ విషయ సక్తులైన విబుధా హితుల తోడి, మనకి వలదు, ముక్తి మార్గ వాంఛ ;*
*నాది దేవు విష్ణు నాశ్రయింపుడు ముక్త సంగజనుల గూడి శైశవమున !*

'విషయాసక్తులై సంగత్వ బంధంలో తగుల్కొనిన అవివేకులతో స్నేహం మనకు మంచిది కాదు. బాల్యము నందే మోక్ష మార్గాన్ని ఎన్నుకొని, సత్పురుష సాంగత్యమును పొంది విష్ణుదేవుని ఆశ్రయించండి' అని ప్రహ్లాదుడు ఆంధ్ర భాగవతము - సప్తమ స్కంధంలో గురుకులంలో తోటి విద్యార్థులకు హితోపదేశం చేశాడు.





## వినివృత్త కాములు

నివృత్త కాములు అంటే కామములు, లేదా కోరికలు తొలగిన వారు. **వినివృత్త కామాః** అంటూ వి అనే ఉపసర్గ చేరడం చేత విశేషంగా కోరికలు తొలగిన వారు అని అర్థము **(వినివృత్త కామాః విశేషేణ నిర్లేపేన నివృత్తాః కామాః యేషాం తే వినివృత్త కామాః యతయః)**. వారే యతి పురుషులు.

వినివృత్త కాములు అంటే పూర్తిగా, శేషం లేకుండా కోరికలు తొలగిన వారు. అంటే, తొలగిన కోరికలు కలవారే గాని, కోరికలను తొలగించుకున్న వారు కారు. ఈ అంతరాన్ని సాధకులు జాగ్రత్తగా దర్శించాలి.

మనం కోరికలకు దూరం కావడం, కోరికలు మనకు దూరంగా పోవడం, రెండూ ఒకటి గానే కనిపిస్తాయి. కాని, ఆ రెండిటిలో ఎంతో వ్యత్యాస ముంది. నేడు ఏ కోరిక లైతే మనం కష్టపడి దూరం చేసుకున్నామో, అవి ఒకప్పుడు మనం ఇష్టపడి దగ్గర చేర్చుకున్నవే. ఒకప్పుడు ఇష్టపడిన వాటిని నేడు కష్టపడి దూరం చేసుకోగలమే గాని, ఇష్టాన్ని మనస్సు నుండి దూరం చేసుకోలేము. కోరికలు దూరమైనా, ఇష్టం మనస్సు లోనే తిష్ఠ వేసి ఉండటం వల్ల కోరికలు తిరిగి ఏ క్షణా న్నైనా విజృంభించ వచ్చు. అది ఎలాగో చెప్పేందుకే నేమో ప్రతి ఇంటిలో ఇంగువ కట్టిన గుడ్డ ఉంటుంది.

గుడ్డలో కట్టిన ఇంగువను పారేసినా, గుడ్డ మాత్రం కొంత కాలం వరకు ఇంగువ వాసనను వెదజల్లు తూనే ఉంటుంది. అలాగే కోరికల్ని మనం విడిచి పెట్టినా, అవి మనకు ఇష్టమైన కోరికలే కనుక, కోరికలు దూర మవుతాయే గాని ఇష్టం మాత్రం గుడ్డను అంటిపెట్టుకున్న ఇంగువ లాగా వాసనను విరజిమ్ముతూనే ఉంటుంది. కోరికలు దూర మౌతాయి. ఇష్టాన్ని వదిలేసి పోతాయి. ఈ ఇష్టం దేనికి సంబంధించింది అని ఆలోచించ గానే, 'అది నాది, నాది' అంటూ కోరికలు మళ్ళీ ప్రత్యక్ష మవుతాయి. కనుక కోరికల్ని మనం వదలడం కన్నా కోరికలు మనల్ని విడిచి వెళ్ళడమే శ్రేయము.

కోరికల్ని వదిలి పెట్టిన వారిని పరిశీలించండి. ఈ సత్యం సుస్పష్టంగా కనిపిస్తుంది. కోరికల్ని విడిచిన వాడు కనిపించిన ప్రతి వ్యక్తితో 'నేను అది మానేశాను - ఇది వదిలేశాను' అని చెబుతూనే ఉంటాడు. ఎంత వరకు చెబుతాడంటే, తిరిగి చేపట్టనంత వరకే. వదిలేశాను - వదిలేశాను అని నిరంతరం జపం చేసే వాడు దేనిని వదిలినట్లు? వదలడం గొప్ప కాదు. వదిలాను అనే భావనను వదలడం ముఖ్యం. బంధము భావన లోనే ఉంటుంది.

కనుక, కోరికల్ని వదలడం కాకుండా, కోరికల్ని దాటి పోవాలి. అవి మన నుండి అప్రయత్నంగా జారి పోవాలి. మనం వదిలినవి మనల్ని వదలవు. మనల్ని వదిలి పోయినవి మనల్ని మళ్ళీ పట్టుకోవు. విషయాలు ఎలా అనిత్యాలో, కోరికలు ఎంత దుఃఖ భూయిష్టాలో బుద్ధికి పడితే, ఆ తరువాత కోరికల్ని మనం విడిచిపెట్ట నవసరం లేదు. కోరికలే మనల్ని విడిచిపెట్టి వెళ్తాయి. ఇక్కడ కోరికలు దూరం కావడ మంటే, బంధహేతువు లైన కోరికలు దూరం కావడము అని అర్థం చేసుకోవాలి.

## ద్వంద్వ విముక్తులు

సుఖదుఃఖాలు అనేవి అందరి అనుభవంలో ఉన్నాయి. ఇది సుఖము, ఇది దుఃఖము అనే ఎరుక కలగ టానికి కారణ మైనవి ఏవో వాటిని సుఖదుఃఖ సంజ్ఞములు అంటారు. అవే ప్రియాప్రియాలు, శీతోష్ణాలు, శత్రుమిత్రులు, జయాపజయాలు, మానావమానాలు మొదలైనవి. అట్టి ద్వంద్వముల చేత విముక్తులైన వారు ద్వంద్వ విముక్తులు. అంటే, ప్రియాప్రియాలు సంభవించి నపుడు ఏ విధమైన రాగద్వేషాలు లేని వారు. బాహ్య

ప్రపంచంలో, లేదా జీవితంలో ఏయే మార్పులు జరుగుతున్నా చిత్తములో ఏ వికారమూ లేని వారు (***ద్వంద్వైః ప్రియాప్రియాదిభిః విముక్తాః సుఖదుఃఖ సంజ్ఞైః పరిత్యక్తాః***).

మానమోహాలు లేనివారు, సంగ దోషమును జయించిన వారు, సదా పరమాత్మ స్మరణము నందే ఆసక్తి కలవారు, వైరాగ్యవంతులై సమస్త కోరికల నుండి విడిపడిన వారు, ద్వంద్వములనే గుణ దోషములు లేనివారు అమూఢులు. మూఢులు అంటే మోహము కల వారు. అమూఢులు అంటే మోహం లేని వారు. మోహం నుండి విడిపడిన వారు (***మోహ వర్జితాః***). అట్టి వారు అవ్యయపదము, అంటే పూర్వ శ్లోకంలో మనం చర్చించుకున్న నాశ మెరుగని బ్రహ్మపదమును, పరమపదమును, పరంధామమును చేరుతారు (***గచ్ఛన్తి పదమ్ అవ్యయమ్***).

*ఆ బ్రహ్మపదము ఎలాంటిదో దాని స్వరూపాన్ని వర్ణిస్తున్నాడు.*

**న త ద్భాసయతే సూర్యో న శశాఙ్కో న పావకః ।**
**యద్గత్వా న నివర్తన్తే తద్ధామ పరమం మమ ॥** 6

***న-తత్-భాసయతే-సూర్యః-న-శశాంకః-న-పావకః***
***యత్-గత్వా-న-నివర్తంతే-తత్-ధామ-పరమం-మమ***

| | | | | | |
|---|---|---|---|---|---|
| యత్ | = | దేనిని | న భాసయతే | = | ప్రకాశింప చేయలేదు |
| గత్వా | = | పొంది | పావకః | = | అగ్ని |
| న నివర్తంతే | = | తిరిగి రారో | న భాసయతే | = | ప్రకాశింప చేయలేదు |
| తత్ | = | దానిని | తత్ | = | అది |
| సూర్యః | = | సూర్యుడు | మమ | = | నా యొక్క |
| న భాసయతే | = | ప్రకాశింప చేయలేదు | పరమం | = | ఉత్తమమైన |
| శశాంకః | = | చంద్రుడు | ధామ | = | స్థానము |

**అర్జునా! నా ధామము దివ్య మైనది. అక్కడ చేరితే తిరిగి రావడ మంటూ ఉండదు. ఆ పరంధామాన్ని సూర్యుడు ప్రకాశింప చేయలేడు. చంద్రుడు వెలిగించ లేడు. అగ్ని చూపలేదు.**

**వ్యాఖ్య**

అవ్యయ పదము, బ్రహ్మపదము, బ్రహ్మధామము, పరంధామము, పరమపదము అంటూ అనేక పర్యాయ పదముల ద్వారా ఏ దివ్యధామాన్ని ఇంతవరకు మనం చర్చించామో, ఆ ధామము, అంటే ఆ బ్రహ్మస్థానము యొక్క స్వరూపాన్ని వర్ణిస్తున్నాడు. అది పరమాత్మ స్థానము. సర్వ జీవుల ఏకైక గమ్యము.

**ధామ శబ్దార్థము**

ధామము అంటే చోటు, లేదా స్థానము అనే అర్థాన్ని మనం చెప్పుకున్నాం. ధామము అంటే ప్రకాశవంత మైనది అని కూడా అర్థము. జ్యోతిని ధామ మంటారు (***ధామ జ్యోతిః***). బ్రహ్మపదమును, లేదా పరమాత్మ పదమును పరంధామ మంటారు. అంటే పరమాత్మ ఉండే చోటు. 'ఆ ధామము లేదా స్థానము (***తత్ ధామ***) నా శ్రేష్ఠమైన పదము (***పరమం మమ***)' అంటున్నాడు భగవంతుడు.

**'తత్'** అంటే అది అని అర్థము. 'ధామ' అంటే చోటు, లేదా ప్రకాశము అని అర్థము. 'తద్ధామ' అంటే **'ఆ స్థానము'**, లేదా **'ఆ ప్రకాశము'** అని అర్థము. 'ఆ స్థానము నాది' అంటే స్థానము నా కన్నా వేరుగా ఉంది అని





అర్థము. 'నా ఇల్లు' అంటే నేను వేరు, నా ఇల్లు వేరు అని అర్థం. 'అది నా ఇల్లు' అంటే నా కన్నా వేరుగా, దూరంగా కనిపిస్తున్నది నా గృహము అని భావము.

'ఆ ధామము నా శ్రేష్ఠ ధామము (***తత్ ధామ పరమం మమ***)' అనే వాక్యంలో తాను వేరు - ధామము వేరు అనే భావము ధ్వనిస్తోంది. దూరంగా ఉన్న ధామంతో తన సంబంధమును సూచించినట్లు అవుతుంది (***తత్ ధామ ఇతి వ్యవహితేన ధామ్నా సంబంధః, సంబధ్యతే***). తత్, ధామ అనే రెండు పదాలు కలిసి ఒకే అర్థాన్ని స్ఫురింప చేస్తున్నాయి. అది (***తత్***) ప్రకాశవంత మైనది (***ధామ***). 'రాహువు శిరస్సు' (***రాహోః శిరః***) అన్నప్పుడు, రాహువుకు తలతో పాటు ఇతర అంగాలు కూడా ఉన్నట్లు ధ్వనిస్తుంది. కాని, రాహువుకు శిరస్సే రూపం. కనుక 'రాహువు శిరస్సు' అన్నప్పుడు, రాహువు వేరు - రాహువు శిరస్సు వేరని అర్థం కాదు. అలాగే ఇక్కడ తత్ - ధామ అన్నప్పుడు గాని, మమ - ధామ అన్నప్పుడు గాని వేరుగా కనిపిస్తున్న ఆ రెండు పదాలు ఒక్కటే అని గ్రహించాలి. ఇక్కడ ధామ మనేది ప్రకాశవంత మైనది అనే అర్థంతో చెప్పబడిన పదం (***ధామ తేజో రూప పదం***).

సూర్యుడు ప్రకాశ స్వరూపుడు. కాంతులకు నెలవైన వాడు. సర్వ ప్రకాశాలకు గని వంటి వాడు. అందుకని, సూర్యదేవుణ్ణి ధామనిధి అంటారు (***ధామ నిధిః***). గని అంటే చోటు అని అర్థం. బంగారు గని అంటే బంగారు ఉత్పత్తి స్థానము. బొగ్గు గని అంటే బొగ్గు లభించే స్థానము. ఇక్కడ ఒక్క విషయాన్ని గుర్తించాలి. బంగారు గని అన్నప్పుడు బంగారు వేరు, గని వేరు కనుక, ఆ గనిలో బంగారు లభిస్తూ ఉంది అని అర్థం చేసుకుంటాం. అలాగే బొగ్గు గని అన్నప్పుడు, ఆ గనిలో గని కన్నా వేరైన బొగ్గు అనే వస్తువు లభిస్తూ ఉంది అని అర్థం. మరి, సూర్యుణ్ణి 'ధామనిధి' - ప్రకాశమునకు గని యైన వాడు అన్నప్పుడు, సూర్యుడు వేరు, ప్రకాశము వేరు అని అర్థమా? గనిలో బంగారము ఉన్నట్లు సూర్యునిలో ప్రకాశము ఉందా? అదే వాస్తవ మైతే, గనిలో బంగారము లేని చోటు కూడా ఉంటుంది కదా! మరి సూర్యునిలో ప్రకాశం లేని చోటు ఉన్నట్లేనా? కాదు. గని - బంగారము, గని - బొగ్గు లాగా సూర్యుడు - సూర్యకాంతి వేరుగా లేవు. సూర్యుడే ప్రకాశము. ప్రకాశమే సూర్యుడు. అదే 'ధామనిధి' శబ్దార్థము. కనుక ఎక్కడ సూర్యు డుంటే అక్కడ ప్రకాశం ఉంటుంది. ఉండాలి. కాని, ఈ సత్యానికి భిన్నమైన రూపాన్ని ప్రస్తుత శ్లోకంలో మనం చూడ బోతున్నాం.

**పరంధామం**

అర్జునా! ఏ ధామమును చేరితే తిరిగి రారో (***యత్ ధామ వైష్ణవ పదం గత్వా ప్రాప్య, న నివర్తన్తే***), ఆ ధామమే నా ఉత్కృష్టమైన స్థానము (***తత్ ధామ పదం పరమం మమ విష్ణోః***).

చేరడము అనేది ప్రయాణానికి సంబంధించిన విషయము. ప్రయాణించి ఒక చోట నుండి మరొక చోటికి చేరడము. అదే గంతవ్యం. పోవడ మంటూ జరిగితే తిరిగి రావడ మనేది ఉంటుంది. ఎగిరిన బంతి పైకి లేచినా, తిరిగి మళ్ళీ భూమిపై పడుతుంది (***పతనాన్తాః సముచ్ఛ్రయాః***). గూడు విడిచి గువ్వ గగనంలో విహరించినా, మళ్ళీ తిరిగి వచ్చి గూడును చేరుతుంది. ఊరి కెళ్ళిన వారు తిరిగి ఇంటికి చేరుతారు. కాని వీటన్నిటికి భిన్నంగా, దేనిని చేరితే తిరిగి రావడ మంటూ ఉండదో అదే నా శ్రేష్ఠమైన ధామము అంటున్నాడు భగవంతుడు.

ఏ యాత్ర కెళ్ళినా తిరిగి రావలసిందే. కాశీ క్షేత్రానికి ఎవరైనా వెళ్తూ ఉంటే, కొందరు ఆత్మీయులు తోడుగా వెళ్ళి వాహన మెక్కించి వస్తారు. అది కాశీయాత్ర.

ఒక వ్యక్తి మరణిస్తే, ఆ వ్యక్తిని పాడెపై పడుకోబెట్టి, బంధుమిత్రాదులు శ్మశానం వరకు నడచి వెళ్ళి దహన క్రియలు చేసి వస్తారు. ఇది శవయాత్ర.

వారణాశికి వెళ్ళిన యాత్రికుడు కొంత కాలానికి తిరిగి వస్తాడు. మరి వల్లకాటికి చేరిన వాడు? తిరిగి రాడు అనుకుంటున్నారా? వాడూ వస్తాడు. కొంత కాలం తరువాత తిరిగి జన్మిస్తాడు. స్వర్గానికి వెళ్ళినా, పుణ్యమును అనుభవించిన తరువాత తిరిగి పుట్టుక తప్పదు.

కనుక, ఏ యాత్రలైనా రాకపోకలతో ముడిపడే ఉంటాయి. రాక లేని పోక ఒకే యాత్రలో ఉంటుంది. దానినే ప్రస్తుతం భగవంతుడు చర్చిస్తున్నాడు. అదే బ్రహ్మపదము. పరమాత్మ స్థానము. పరంధామము. అక్కడికి చేరితే తిరిగి రావడ మంటూ ఉండదు. అదెలా? పోక ఉన్నప్పుడు రాక తప్పదు కదా! నిజమే. కాని ఇక్కడ పోవడ మనేది ఉంటే కదా? పోవడమే జరగదు. కనుక, తిరిగి రావడ మనే ప్రసక్తే ఉండదు. ఇదొక విచిత్రమైన యాత్ర. ప్రకాశము వైపు సాగే ప్రయాణము. ప్రయాణము కాని ప్రయాణము.

**పోయేది లేదు - వచ్చేది ఉండదు**

బ్రహ్మ మేమిటో, బ్రహ్మ స్వరూప మేమిటో మనం ఇప్పటికే సవిస్తరంగా చెప్పుకున్నాం. బ్రహ్మము సత్యము, బ్రహ్మము జ్ఞానము, బ్రహ్మము అనంతము (***సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ***). బ్రహ్మము అనంతము. అనంతము అంటే ఏమిటి? దేశ, కాల, వస్తు అపరిచ్ఛిన్నం, అనంతం. అట్టి అనంతమైన బ్రహ్మము చైతన్య స్వరూపము. కనుక, బ్రహ్మము, ఆత్మ వేరు కాదు. ఈ ఆత్మయే బ్రహ్మము (***అయమాత్మా బ్రహ్మ***).

***ఆత్మా అస్తి*** - ఆత్మ ఉంది అనేది వాక్యము. ఏదైనా ఒకటి ఉంది ఈ ప్రపంచంలో అని మనం చెబితే, అది సాపేక్షికంగా ఉంది అని అర్థం. వ్యావహారికంగా ఉంది అని అర్థం. ఏది ఉండినా, అది ఒక ప్రదేశములో ఉంటుంది. అలాగే ఒక కాలంలో ఉంటుంది. ఒక ప్రదేశములో ఉంది అంటే మరొక ప్రదేశంలో లేదు అని అర్థం. అలా దేశ పరిచ్ఛేదానికి లోనైన దేదైనా పరిమిత మవుతుందే గాని అనంతం కాలేదు. అలాగే ఒక కాలంలో కలిగింది ఏదైనా కాల పరిచ్ఛేదంలో పడి మరొక కాలంలో లేకుండా పోతుంది. కనుక అది అంత మవుతుందే గాని అనంతం కాలేదు.

ఇక్కడ ఏదున్నా, అది అక్కడ లేనిదే. ఇక్కడ ఉండి అక్కడ లేనిది అంతటా ఉండేది ఎలా అవుతుంది? అందుకే అది అనంతం కాలేదు. ఇప్పుడున్నది, గతంలో లేనిది, భవిష్యత్తులో ఉండ బోనిది; అలాంటి దేదీ అనంతం కాలేదు.

***యదస్తి తత్ సత్యం*** - ఏది ఉందో అది సత్యము. కాని, ఏది ఉన్నా దేశ కాలాదులకు పరిమితమై ఉన్నందున, నశించే స్వభావము కలిగి ఉంది. నశించేది సత్య మెలా అవుతుంది? త్రికాలము లందు ఏదైతే ఉంటుందో, అది సత్యము (***కాలత్రయేపి తిష్ఠతి యత్ తత్ సత్యం***). ఈ దృశ్యమాన జగత్తులో ఏది ఉన్నా, అది ఉన్నదే గాని సత్యంగా ఉన్నది కాదు. ఏది అనంతంగా ఉందో అదే సత్యము. కనుక అనంతమైన సద్రూప చైతన్యము ఒకటి ఉండే టప్పుడు, దాని కన్నా అన్యంగా మరొకటి ఉండే అవకాశం లేదు. అప్పుడే అది అనంత మవుతుంది. అదే బ్రహ్మము. అదే పరంధామం.

ఇది అర్థమైతే, చెట్టు ఉంది, పువ్వు ఉంది, ఇల్లు ఉంది అని చెప్పినట్లు, బ్రహ్మము ఉంది అని చెప్పడానికి వీలు పడదు. 'బ్రహ్మము ఉన్నది' అనేది కాదు; 'ఉన్నదంతా బ్రహ్మమే' అనేది సత్యం. అదే అనంత స్వరూపము. అనంత సత్యము. దానికి అన్యంగా ఏది ఉన్నా అదంతా మిథ్య. నామరూపాత్మకము. నామరూపాలు కూడా అనంతమైన బ్రహ్మము కన్నా వేరుగా లేవు. కాని, నామరూపాలు లేకపోయినా అనంతమైన బ్రహ్మము నిరస్తం





కాదు. సమస్తం తాను గానే ఉంటుంది. అదే బ్రహ్మము. ఈ ఆత్మయే బ్రహ్మము (***అయమాత్మా బ్రహ్మ***) అని అర్థం చేసుకున్నాం కదా! మరి ఇప్పుడు నువ్వెవరు? అనంతమే. అనంతమైన నీవు లేని దెక్కడ? అనంతమైన నీవు అంతటా ఉన్నావు. అనంతం గానే ఉన్నావు. అనంతంలో అనంతం ప్రయాణం చేయగలదా? మరి ప్రయాణమే లేనపుడు గమ్యం ఎక్కడుంది? గమ్యమే లేనపుడు ఇక చేరే దేముంటుంది? చేరేది లేనపుడు తిరిగి వచ్చే దేముంటుంది? ఇప్పుడర్థ మైందని భావిస్తాను. ఏ ధామాన్ని చేరితే మళ్ళీ వెను దిరిగి రారో అదే నా ధామము అని భగవంతుడు ప్రవచించ డంలో అంతర్భావం ఇదే.

వారణాశికి వెళ్ళిన వాడు తిరిగి స్వగ్రామం చేరుతాడు. వల్లకాటికి చేరిన వాడు తిరిగి మరొక దేహంతో పుడుతాడు. బ్రహ్మమును చేరిన వాడు మాత్రం తిరిగి జన్మించడు. పునర్జన్మ లేని మోక్షమును పొందుతాడు. అదే బ్రహ్మపదము. పరంధామము.

నిద్రించిన వాడు స్వప్నంలో స్వప్న ప్రపంచాన్ని అనుభవిస్తాడు. అతడే మేల్కొనిన తరువాత తిరిగి స్వప్న ప్రపంచం లోకి ప్రవేశిస్తాడా? ప్రవేశించ వలసిన అవసర ముందా? ఏ కల నుండైతే తాను మేల్కొనడం జరిగిందో, ఆ కలలో మధ్యలో విడిచిపెట్టి వచ్చిన కార్యాన్ని తిరిగి కలలో ప్రవేశించి పూర్తి చేసి వచ్చే అవకాశ ముందా? కలలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను చక్కబరచు కోవడానికి మేలుకొన్న వాడు తిరిగి కలలో దూరే వీలుందా? నిద్ర నుండి ప్రబుద్ధమైన తరువాత, 'అయ్యో! చాలా మంది నుండి అప్పు తీసు కున్నాను. ఆ అప్పు లన్నీ తీర్చకుండానే మేలుకున్నానే' అని విచారిస్తాడా? తీర్చాలని ప్రయత్నిస్తాడా? ఆ పని ఎవ్వడూ చేయడు. ఎందుకని? మేలుకోవడం తోనే స్వప్నం లోని సమస్య లన్నీ పరిష్కరింప బడ్డాయి. అప్పు లన్నీ తీరి పోయాయి. కనుక సర్వ సమస్యలకు పరిష్కారం జ్ఞానమే. మేలుకుంటే చాలు. ఆ జ్ఞానంలో స్వప్నము లోని సర్వ సమస్యలు విలీనమై పోతాయి. బ్రహ్మపదమును పొందిన వాడు తిరిగి సంసారంలో ప్రవేశించడు. మేలుకున్న వాడు తిరిగి కలలో ప్రవేశించడం ఎలా జరగదో, పరంధామమును చేరిన వాడు తిరిగి జన్మించడం ఉండదు.

***అహం బ్రహ్మేతి విజ్ఞానాత్ కల్పకోటి శతార్జితమ్ ।***
***సంచితం విలయం యాతి ప్రబోధాత్ స్వప్న కర్మవత్ ॥***

'స్వప్నంలో చేసిన కర్మ లన్నీ మేలుకోగానే విలీనమై అదృశ్య మైనట్లు, వందల కోట్ల జన్మలలో ఆర్జించు కొనిన కర్మల యొక్క ఫలాలన్నీ 'నేనే బ్రహ్మము' అనే జ్ఞాన జాగరణో నశించి పోతాయి'.

ఎన్ని జన్మ లెత్తినా, ఆ జన్మలలో ఎన్ని కర్మ లాచరించినా, మేల్కొన గానే స్వప్న కార్యాలన్నీ అసత్య విషయాలుగా తేలినట్లు, 'నేనే బ్రహ్మము' (***అహం బ్రహ్మేతి***) అనే జ్ఞానము ప్రాప్తించ గానే, అనాదిగా అంటి పెట్టుకొని వస్తున్న సమస్త జన్మలు, కర్మలు సమూలంగా నశిస్తాయి.

ఒక వ్యక్తి స్వప్నంలో విభిన్నమైన కర్మలను ఆచరించ వచ్చు. అవి యజ్ఞయాగాది పుణ్యకర్మలు కావచ్చు. లేదా, భయంకరమైన హత్యలు కావచ్చు. మేలుకున్న తరువాత ఆ కర్మల యందు అతనికి స్పృహ ఉండదు. కారణం, వాటికి అతడు కర్త కాదని తెలుసు. స్వప్నం లోని కర్మాచరణమునకు మేలుకున్న తనకు ఏ విధమైన సంబంధము లేదు అనే జ్ఞానము అతని కుంది. స్వప్న కర్మల విషయంలో తాను అకర్త. మరి కర్త ఎవరు? అనే ప్రశ్న ఉదయించ వచ్చు. స్వప్నము మిథ్య. మిథ్యకు సంబంధించిన కర్మలకు కర్త మిథ్యాత్మ. మేలుకున్న తాను మిథ్యాత్మ కాదు. సత్యాత్మ. మిథ్యాత్మ కర్తగా ఆచరించిన కర్మలకు అకర్త యైన సత్యాత్మకు సంబంధము లేదు కనుక, మిథ్యాత్మ యొక్క కర్మలు సత్యాత్మను అంటవు. సత్యాత్మది బాధిత కర్తృత్వం.

ప్రబుద్ధ మైన వాడు తిరిగి స్వప్నం లోకి ప్రవేశించ లేనట్లు, ఏ దివ్య ధామము చేరిన వారు తిరిగి

సంసారములో ప్రవేశించరో *( యద్గత్వా న నివర్తన్తే )* ఆ పరంధామము తనదే నంటున్నాడు భగవంతుడు *(తద్ధామ పరమం మమ )*. అది సూర్యచంద్రాగ్నులు ప్రకాశించ లేని దివ్య ధామము.

**పరంజ్యోతి - వెలుగులకు వెలుగు**

పరంధామము పరమాత్మ నిలయము. ధామము అంటే తేజోవంత మని అర్థం చేసుకున్నాం. అది ఎలాంటి తేజము అంటే, ఆ ధామమును సూర్యుడు ప్రకాశింప చేయలేడు *( న భాసయతే సూర్యః ఆదిత్యః )*. అలాగే చంద్రుడు *( తథా న శశాంకః చన్ద్రః )*, అగ్ని కూడా *( న పావకః అగ్నిః అపి )* ప్రకాశింప చేయలేరు.

సూర్యుడు ప్రపంచాన్నంతా ప్రకాశింప చేస్తాడు. సూర్యుని ప్రకాశము లోనే ప్రపంచము మన అనుభవానికి అందుతూ ఉంది. రూపము గల ద్రవ్య మంతా సూర్యుని చేతనే భాస్యము, అంటే ప్రకాశింప బడుతూ ఉంది. ప్రపంచము భాస్యము; సూర్యుడు భాసకుడు. ఇదే భాస్య భాసక సంబంధము.

సమస్త ప్రపంచాన్ని ప్రకాశింప చేసే శక్తి కల వాడైనా *( సర్వ అవభాసన శక్తి మత్త్వేఽపి సతి )* , ఆదిత్యుడు ఆదిదేవుని పరంధామమును ప్రకాశింప చేయలేడు *( తత్ పదం న భాసయతి )*. ప్రపంచాన్ని వెలిగించే భానుడు పరమాత్మ ధామమును వెలిగించ లేక వెల వెల పోతున్నాడు.

పరంధామము, లేదా పరంజ్యోతి స్వప్రకాశ చైతన్యము కావడము చేత అది భాసకమే గాని భాస్యము కాదు. స్వయం భాసకమైన తనను ప్రకాశింప చేయడానికి మరొక భాసకము అవసరం లేదు. అంతే కాదు. ఈ పరంజ్యోతి ప్రకాశం వల్లనే సూర్యచంద్రాగ్నులు ప్రకాశిస్తున్నారు. అందుచేత పరమాత్మ ధామము వెలుగులకు వెలుగై పరంజ్యోతి అయింది. సూర్యుడు సూర్యుడుగా వెలుగులను విరజిమ్మడానికి, చంద్రుడు వెన్నెలను వెదజల్లడానికి, అగ్ని వేడిని, వెలుతురును ప్రసరించడానికి పరంజ్యోతియే ఆధారము. తమను ప్రకాశింప చేసే దానిని, ప్రకాశింప బడేవి తిరిగి ఎలా ప్రకాశింప చేస్తాయి? భాస్యాలు భాసకాన్ని ఎలా వెలిగింప చేస్తాయి? కనుక సమస్తమును ప్రకాశింప చేసే స్వయంజ్యోతి స్వరూప మైన పరంధామము వెలుగులకు వెలుగుగా స్తుతింప బడింది *( జ్యోతి ర్జ్యోతిః )*.

*మం॥* ***న తత్ర సూర్యో భాతి న చంద్ర తారకం***
***నేమా విద్యుతో భాన్తి కుతోఽయ మగ్నిః***
***తమేవ భాన్త మనుభాతి సర్వం***
***తస్య భాసా సర్వ మిదం విభాతి ॥***

'అక్కడ సూర్యుడు ప్రకాశించ లేడు. చంద్రతారకలు వెలగ లేవు. మెరుపులు కూడా మెరవ లేవు. ఇక అగ్ని విషయం వేరే చెప్పే దేముంది? అతని ప్రకాశాన్ని అనుసరిస్తూ సమస్తమూ ప్రకాశిస్తూ ఉంది. అతని ప్రకాశం వల్లనే ఈ సమస్తమూ ప్రకాశిస్తూ ఉంది' అన్నది ఉపనిషత్తు. ఇదొక అద్భుతమైన మంత్రము. ఈ మంత్రము కఠోపనిషత్తులో *( 5 - 15 )*, ముండకోపనిషత్తులో *( 2 - 2 - 11 )*, శ్వేతాశ్వతరోపనిషత్తులో *(6-14)* కూడా ఉంది. ఈ మూడు ఉపనిషత్తులపై శ్రీ శంకరాచార్యస్వామి భాష్యము ఉంది. ఈ మూడు ఉపనిషత్తులపై నేను సమగ్రంగా ప్రవచనములు కూడా చేశాను. *

ఆలయాలలో, పూజా మందిరాలలో హారతి వేళ పై మంత్రాన్ని ఉచ్చరిస్తూ మంగళహారతి సమర్పిస్తారు. పురాతన ఆలయాలను మనం సందర్శిస్తే, ఈనాటికీ కొన్ని గర్భాలయాలలో విద్యుద్దీపాలను ఉంచరు. గర్భ గుడిలో చిన్న దీప మొకటి అఖండంగా వెలుగుతూ ఉంటుంది. మనం దైవ దర్శనానికి నిలబడి ఉంటాము.



* పూజ్య స్వామీజీ కఠోపనిషత్ ప్రవచనములు (26 వి.సి.డి.లు), ముండకోపనిషత్ ప్రవచనములు (18 డి.వి.డి.లు), శ్వేతాశ్వతరోపనిషత్ ప్రవచనములు (36 వి.సి.డి.లు) ఆశ్రమంలో లభిస్తాయి.



గుడిలో దేవుడు ఉన్నా మనకు కనిపించడు. కనిపించడం లేదు కనుక, గర్భాలయంలో దేవుడు లేడని మనం వెను తిరిగి వెళతామా? దైవ దర్శనానికి నిరీక్షిస్తూ అక్కడే నిలబడి ఉంటాము.

పూజారి నీరాజనం ఇచ్చినపుడు ఆ కర్పూర కాంతిలో మనకు దైవ దర్శన మౌతుంది. ఈ విశ్వ మందిరంలో విశ్వనాథుడు ఉన్నా, ఉన్నాడని మనకు పరోక్షంగా తెలిసినా, విశ్వనాథుని దర్శనం మాత్రం మనకు కలగదు. ఆలయంలో పూజారి కర్పూర హారతి ఇచ్చినపుడు ఆ వెలుగు లోనే మనకు దైవ దర్శన మైనట్లు, గురువు శాస్త్రాన్ని బోధించి నపుడు, తద్వారా జనించిన జ్ఞాన వెలుగు లోనే మనకు దైవ దర్శనానుభూతి కలుగుతుంది. ఆ అనుభూతిలో సర్వం ఈశ్వరమయంగా, జ్యోతిర్మయంగా తెలుస్తుంది. ఆ పరంజ్యోతి ఒక్కటే జ్యోతులకు జ్యోతిగా, దానికి అన్యంగా భాసించే సూర్య చంద్ర నక్షత్రాగ్ను లన్నీ దానిని అనుసరించి ప్రకాశించేవిగా అనుభవానికి అందుతుంది. ఏది స్వప్రకాశమో అది భాతి. ఏది మరొక వెలుగుపై ఆధారపడి ప్రకాశిస్తుందో అది అనుభాతి. పరంజ్యోతి భాతి. సూర్యచంద్ర నక్షత్రాగ్నులు అనుభాతి ప్రకాశాలు.

దేవతార్చన సమయంలో ఈ మంత్రాన్ని పలుకుతూ నీరాజనం సమర్పిస్తారు. 'భగవాన్! సూర్యచంద్ర తారకలు ప్రకాశించ లేని దివ్య ధామం నీది. అలాంటి నీ సన్నిధిలో నేను వెలిగించే ఈ కర్పూరహారతి ఏ పాటిది? ఈ చిన్ని వెలుగు నా భక్తికి ప్రతీకము. నా హృదయానికి ప్రతిరూపము. కర్పూర కళిక చిన్నదే అయినా, నిన్ను దర్శించడానికి సరిపోతుంది. కర్పూరము నిన్ను దర్శింప చేయడమే గాక, నీ ఆరాధనలో శేషం లేకుండా తనను తాను నీకు అర్పించు కుంటుంది. భగవాన్! నీ దివ్యారాధనలో నా మనస్సును కూడా ఈ కర్పూరం లాగే ప్రకాశించి, పరిమళించి నీలో ఐక్యమై, నిర్విశేషంగా భాసించనీ!' ఈ భావం తోనే పూజా సమయాలలో **న తత్ర సూర్యో భాతి** మంత్రాన్ని భక్తితో పఠిస్తూ హారతిస్తారు. మహాభక్తుడు, సంత్ శిరోమణి భక్త నరసీమెహతా ఈ భావాన్నే ఔదల దాల్చి అందమైన కీర్తనను రచించారు. ఇది చాలా ప్రశస్త మైన కీర్తన.

*పల్లవి :* **దర్శన్ దో ఘున శ్యామ్ నాథ్ మోరె**
**అఖియా ప్యాసీరే !**
*అనుపల్లవి :* **మన్ మందిర్ కి జ్యోతి జగాదో**
**ఘట్ ఘట్ వాసీరే ॥ దర్శన్ ॥**

' హే పరంధామా! మేఘశ్యామా! నీ దివ్య దర్శనానికి నా కళ్ళు దప్పికతో ఎదురు చూస్తున్నాయి. సుందర మైన నీ ముఖారవిందాన్ని దర్శించే భాగ్యాన్ని నాకు అనుగ్రహించు.

సర్వ దేహాలలో ప్రకాశించే జ్యోతి స్వరూపా! నా మనో మందిరాన్ని నీ కాంతులతో నింపు!'

**పానీ పీకర్ ప్యాస్ బుఝావూఁ**
**నైనన్ కో కైసే సమ్ఝావూఁ**
**ఆంఖ్ మి చౌలీ ఛోడో అబ్‌తో**
**మన్ కె వాసీరే ॥ దర్శన్ ॥**

'భగవాన్! జలపానం చేస్తే దప్పిక తీరుతుంది. నేత్ర దాహాన్ని ఎలా తీర్చుకొనేది? భగవంతా! దాగుడు మూతలు ఆడింది చాలు. ఇకనైనా ఆట నాపి నా మదిలో ఉండిపో. నా హృదిలో నిండిపో'.

**దయాదీపం**

బ్రహ్మము అనంతము కనుక స్వతస్సిద్ధము. స్వతస్సిద్ధము కనుక స్వప్రకాశము. స్వప్రకాశ మైనందున బ్రహ్మము భాతి. సూర్యచంద్రాగ్నులు అనుభాతి రూపాలు. అవి ప్రకాశించడానికి బ్రహ్మమే కారణమై ఉంది.

కనుక బ్రహ్మమును అవి ప్రకాశింప చేయలేక పోతున్నాయి. పరమాత్మ అనుగ్రహంతో దినరాజు ప్రకాశిస్తున్నాడు. దివ్య వెలుగులతో ప్రచండంగా శోభిస్తున్నాడు. పరమాత్మ కృపతో నెలరాజు చల్లని వెన్నెలను ఆరబోస్తూ విశ్వాన్ని అలరిస్తున్నాడు. పరమాత్మ దయతో అగ్నిదేవుడు తాను పవిత్రుడై, ఇతరులను కూడా పవిత్రం చేస్తూ పావకు డయ్యాడు ***( పావకః పునాతీతి పూఙ్ పవనే ).***

మరి, పరమాత్మ అనుగ్రహంతో సూర్యచంద్రులు ప్రకాశిస్తున్నారు అంటే, వారి లోని ప్రకాశము వారిది కాదనే కదా అర్థము! ప్రకాశ స్వరూపులు కాని సూర్యచంద్రాగ్నులు పరమేశ్వరుని కృపతో ప్రకాశించే టప్పుడు, పరమేశ్వరుని అనుగ్రహానికి పాత్రుల మైతే, మనం కూడా తేజోమయం కాగలం అనేదే దాని అంతర్భావము.

అవును. పరమేశ్వరుని ఆశ్రయిస్తే, ఎవరైనా ఆయన అనుగ్రహానికి పాత్రులు కాగలరు. ఆయన కృపకు నోచుకున్న చంద్రుడే అందరిపై చల్లని వెన్నెలను కురిపించే టప్పుడు, ఇక పరమాత్మ అనుగ్రహాన్ని గూర్చి ముందు వెనుకలు ఆలోచించడ మెందుకు? దిగిన వారిని పక్షపాతము లేకుండా నది చల్ల బరచినట్లే, ఆశ్రయించిన వారి నందరిని దయామయుడైన భగవంతుడు తప్పక కరుణిస్తాడు.

*ద్వార్ దయాకా జబ్ తూ ఖోలే*
*పంచమ్ స్వర్ మే గూంగా బోలే*
*అంధా దేఖే లంగ్‌డా చల్ కర్*
*పహుంచే కాశీరే* *॥ దర్శన్ ॥*

'పరమేశ్వరా! నీ అనుగ్రహ ప్రసాద ద్వారము తెరుచుకుంటే చాలు. మూగవాడు పంచమ స్వరంలో పాడుతాడు. గ్రుడ్డివాడు చూస్తాడు. కుంటివాడు నడిచి కాశికి చేరుతాడు'.

భక్తితో భగవంతుని ఆరాధించిన వాళ్ళు ఆ దివ్యాత్ముని కృపకు పాత్రులై సూర్యచంద్రుల వలె ప్రకాశిస్తారు. అగ్ని వలె పవిత్రు లవుతారు. కాని, పరమాత్మ జ్ఞానాన్ని పొందిన వారు సాక్షాత్తు పరమాత్మ స్వరూపులై భాసిస్తారు. స్వప్రకాశ స్వరూపులై స్వతస్సిద్ధంగా శోభిస్తారు.

**ఆత్మజ్యోతి - అఖండ జ్యోతి**

అనంతమైన బ్రహ్మపదము స్వప్రకాశ చైతన్యము అని అర్థం చేసుకున్నాం. మరి నీ వెవరు? నీవు ఆత్మవే. నే నెవరు? నేనూ ఆత్మనే. అతడూ ఆత్మే. ఆమె కూడా ఆత్మే. అందరిలో అస్తిత్వముగా శోభిస్తున్నది ఆత్మే. ఆత్మే సద్రూపము. సత్తా మాత్రము. కనుక సద్రూపంగా నేను సదా ఉన్నాను ***( సద్రూపేణ అహం సదా అస్మి ).*** చిద్రూపంగా నేను సదా ప్రకాశిస్తున్నాను ***( చిద్రూపేణ అహం సదా భామి ).*** అందరమూ అలాగే ఉన్నాము. ***అహమస్మి*** - నేను ఉన్నాను. ***త్వమసి*** - నీవు ఉన్నావు. ***తదస్తి*** - అది ఉంది. నేను, నువ్వు, అది - అన్నీ సద్రూపమే. చిద్రూపమే. అందరమూ ఆత్మ స్వరూపమే. ఈ ఆత్మే బ్రహ్మ ***(అయమాత్మా బ్రహ్మ)*** అని అర్థం చేసుకున్నాం కదా! మరి ఆత్మ బ్రహ్మమే అయినపుడు ఆత్మ భాతి అవుతుందా, అనుభాతి అవుతుందా? ఆత్మయే పరమాత్మ కనుక ఆత్మ భాతియే గాని సూర్యచంద్రాగ్నుల వలె అనుభాతి కాదు. అదే వాస్తవ మైతే, అనుభాతి రూపాలైన సూర్యచంద్ర నక్షత్రాగ్నులు భాతి యైన బ్రహ్మముపై ఆధారపడి ప్రకాశించినట్లే, భాతి యైన ఆత్మపై ఆధారపడి వెలుగుతున్నట్లే కదా! అవును. సత్యం అర్థమైతే అంతే. అయితే, సూర్యచంద్రాగ్నులకు ప్రకాశాన్ని ఇవ్వగలిగే శక్తిమంతుడనా నేను? అవును. జ్ఞానం కలిగితే, ఇందులో సంశయాలకు అవకాశమే లేదు. ఆత్మ ప్రకాశము, బ్రహ్మ ప్రకాశము వేరు కావు. అవి రెండుగా లేవు. అంతా అద్వయ ప్రకాశమే. అఖండ జ్యోతి స్వరూపమే.





***యేన ప్రకాశతే విశ్వం యత్రైవ ప్రవిలీయతే,***
***తద్బ్రహ్మ పరమం శాంతం తద్బ్రహ్మాస్మి పరం పదమ్ ॥***

'దేని చేత ఈ ప్రపంచ మంతా ప్రకాశిస్తూ ఉందో, ఈ సమస్తము దేని యందు లయించి పోతూ ఉందో, అట్టి బ్రహ్మము ఉత్కృష్ట మైనది. శాంత మైనది. అది పరమపదము ***( తద్ధామ పరమం మమ ).*** అటువంటి బ్రహ్మమే నేను ***( తద్బ్రహ్మాస్మి )*** ' అని పంచబ్రహ్మోపనిషత్తు.

**స్వప్రకాశ చైతన్యము**

వెలుగులో ఉన్న వాటిని నీవు చూచి తెలుసుకుంటావు. చీకటిలో ఉన్న వాటిని తెలుసుకో గలవా? తెలుసుకో లేవు. చీకటిలో ఏవి ఉన్నవో, ఎక్కడున్నవో, నీకు తెలిసి రాదు. కాని, ఆ చీకట్లో దేనినీ చూడలేని నీవు ఉన్నావా, లేదా? చీకటిలో ఉన్న వాటి విషయంలో నీకు సందేహం ఉండవచ్చు. నీ ఉనికి విషయంలో నీకు సందేహం ఉందా? లేదు. అలాగే నా ఉనికి విషయంలో నాకూ సందేహం లేదు. నా కన్నా వేరుగా ఉన్న వాటిని తెలుసుకోవడానికి నాకు ప్రకాశం కావాలి. కాని, నన్ను నేను తెలుసుకోవడానికి ఏ ప్రకాశము అవసరం లేదు. ఎందుకని? నేనే ప్రకాశ స్వరూపము. నీవూ ప్రకాశ స్వరూపమే.

నే నెప్పుడైతే స్వప్రకాశంగా శోభిస్తున్నానో, మరొక దానిపై ఆధార పడకుండా ప్రకాశిస్తున్నానో, నేను భాతినే కాని అనుభాతిని కాను. భాతిని నే నైనపుడు, అన్యమైన ప్రకాశాలన్నీ అనుభాతి రూపాలే. ఈ విషయంలో అనుభాతి మూర్తులైన సూర్యచంద్ర నక్షత్రాగ్నులు విలక్షణంగా లేరు. వారు కూడా ఆత్మ ప్రకాశము మీదనే ఆధారపడి ప్రకాశిస్తున్నారు.

రాత్రి పూట గాఢాంధకారంలో ప్రపంచం మనకు కనిపించదు. సూర్యోదయం కాగానే సూర్యుని ప్రకాశంలో మనం ప్రపంచాన్ని చూస్తాము. ఒకవేళ నేను అంధుణ్ణి అయితే, ప్రపంచం ప్రకాశంలో ఉన్నా, అది ఎలా ఉందో నాకు తెలియదు. ఎందుకని? నేను చూడలేను కనుక.

దినకరుడు విశ్వాన్ని వెలుగులతో నింపినా, వెలుగులలో ఉన్న ఆ విశ్వాన్ని చూడటానికి నా కళ్ళల్లో వెలుగు ఉండాలి. కళ్ళల్లో వెలుగుంది. కనుకనే, బాహ్య ప్రపంచము ఆ వెలుగులో ప్రతిఫలిస్తూ ఉంది. వస్తువు కళ్ళల్లో ప్రతిఫలించ వచ్చు. అంతమాత్రాన కళ్ళు వస్తువును తెలుసుకో లేవు. చూచేందుకు కళ్ళు ఉన్నాయే గాని కళ్ళు అర్థం చేసుకోలేవు. అర్థం చేసుకునేది మనస్సు. మనస్సు భాతి. నేత్రాలు అనుభాతి. కనుక, మనస్సు కళ్ళను చూచి తెలుసుకోగలదే గాని తమను చూచే మనస్సును కళ్ళు చూడలేవు. మనస్సు వద్దకే వెళ్ళలేని నేత్రాలు ఆత్మను ఎలా సమీపిస్తాయి? ***(న తత్ర చక్షుర్గచ్ఛతి).*** నేత్రాది జ్ఞానేంద్రియాలు ఆత్మను ఎలా సమీపించ లేవో, వాక్కు మొదలైన కర్మేంద్రియాలు కూడా ఆత్మను సమీపించ లేవు ***(న వాక్ గచ్ఛతి).***

మనస్సు జ్ఞానేంద్రియాల ద్వారా విషయ ప్రపంచాన్ని తెలుసుకుంటూ ఉంది. అట్టి మనస్సును ఆత్మ ప్రకాశింప చేస్తూ ఉంది. తనను ప్రకాశింప చేసే ఆత్మను మనస్సు ప్రకాశింప చేయలేదు. మనస్సు ఆత్మను చేరలేదు. కనుక తెలుసుకోలేదు. కనుక మనస్సు అనుభాతి. ఆత్మ భాతి ***(యన్మనసా న మనుతే).*** మనస్సు మొదలుకొని బాహ్యము లోని విషయ ప్రపంచమే గాక, దానిని ప్రకాశింప చేసే సూర్యచంద్రుల వరకు అన్నీ అనుభాతి రూపాలే. ఆత్మ ఒక్కటే భాతి. అక్కడ ఆత్మ పురుషుడు స్వతస్సిద్ధంగా, స్వప్రకాశంగా భాసిస్తూ ఉన్నాడు ***( అత్ర అయం పురుషః స్వయం జ్యోతిః ).*** అదే స్వప్రకాశ చైతన్యము. స్వరూప చైతన్యము. ఆత్మ చైతన్యము. చైతన్యము అద్వితీయము కనుక అదే బ్రహ్మ చైతన్యము. బ్రహ్మపదము. పరమపదము. పరంధామము. ఆ చైతన్య ప్రకాశంపై ఆధారపడి సమస్తమూ ప్రకాశిస్తూ ఉంది ***(తస్య భాసా సర్వ మిదం విభాతి).***

కనుక అనుభాతి రూపాలుగా ప్రకాశిస్తున్న సర్వ తేజస్సులకు చైతన్య జ్యోతి, లేదా పరంజ్యోతి సాక్షియై ఉంది.

## సాక్షీ చైతన్యము

దీపాన్ని నీవు వెలిగించావు. దీపం విషయంలో నువ్వు సాక్షివి. ఎందుకని? దీపం వెలగక ముందు నువ్వు ఉన్నావు. దీపం ఆరిన తరువాత కూడా నీవు ఉంటావు.

బస్సు స్టాప్ వద్ద నువ్వు నిలబడి ఉన్నావు. నేను నీ వద్దకు వచ్చి ఫలానా బస్సు వచ్చిందా? అని అడుగుతాను. వచ్చి వెళ్ళింది అని నువ్వు చెబుతావు. అలా వచ్చి వెళ్ళిన బస్సు విషయంలో నువ్వు సాక్షివి. ఎందుకని? బస్సు రాక ముందు నువ్వు ఉన్నావు. బస్సు వెళ్ళిన తరువాత కూడా నీవు ఉన్నావు.

మనస్సులో వృత్తులు, లేదా సంకల్పాలు కదులుతూ ఉంటాయి. ఒక సంకల్పం మరొక సంకల్పం కాదు. కాని, ఒక సంకల్పం తరువాతే మనస్సులో మరొక సంకల్పము కదుల్తుంది. బస్సులు అనేకము నడుస్తూ ఉన్నా, ఒక దాని తరువాతే మరొకటి వచ్చినట్లు, ఒక సంకల్పం తరువాతే మరొక సంకల్పం వస్తూ ఉంటుంది. అలాగే పోతూ ఉంటుంది. చైతన్యము ఉంటేనే సంకల్పాలు నడుస్తాయి. సంకల్పాలు నడుస్తూ ఉంటే చైతన్యము ఉంటుంది. సంకల్పాలు లేనపుడు చైతన్యము స్వయంగా భాసిస్తూ ఉంటుంది. సంకల్పాలకు ఆద్యంతాలు ఉన్నాయి. వృత్తుల ఆద్యంతాలలో అనంతమైన ఆత్మ చైతన్యము సాక్షీ మాత్రంగా ఉంది. వృత్తులు ఉన్నప్పుడు వృత్తులను ప్రకాశింప చేస్తూ ఉంది. వృత్తులు లేని దశలో వృత్తి రహిత చైతన్యంగా శోభిస్తూ ఉంది. అదే ప్రత్యగాత్మ. బుద్ధి వృత్తులకు సాక్షిగా భాసిస్తున్న అట్టి ప్రత్యగాత్మ నేనే అని తెలుసుకోమన్నది అధ్యాత్మోపనిషత్ ***(జ్ఞాత్వా స్వం ప్రత్యగాత్మానం బుద్ధి తద్వృత్తి సాక్షిణమ్ సోహ మితి)***. మరి, ప్రత్యగాత్మ పరమాత్మ కన్నా భిన్నమా? కాదు. ప్రత్యగాత్మే పరమాత్మ.

పరమాత్మ సదనంలో సూర్యచంద్రాగ్నులు ప్రకాశించలేక పోయారు. ఆత్మే పరమాత్మ కనుక ఆత్మ సన్నిధిలో కూడా ప్రకాశించ లేరు.

కన్ను చూస్తుంది. కంటికి సూర్యుడు అధిష్ఠాన దేవత. వాక్కు పలుకుతుంది. వాచకానికి అగ్ని అధిష్ఠాన దేవత. మనస్సు ఆలోచిస్తుంది. మనస్సుకు చంద్రుడు అధిష్ఠాన దేవత. సూర్యచంద్రాగ్నులు పరమాత్మ సన్నిధిలో ఎలా ప్రకాశించ లేరో అలాగే వాక్, చక్షువు, మనస్సు ఆత్మ సన్నిధిలో ప్రకాశించ లేవు. అనుభాతి రూపాలు కనుక ఆత్మను సమీపించ లేక, పొందలేక వెను దిరుగుతాయి ***(యతో వాచో నివర్తన్తే అప్రాప్య మనసా సహ - తైత్తిరీయోపనిషత్)***.

సూర్యచంద్రాగ్నులు, ఇంద్రియ మనస్సులు పరంధామమును చేరలేక వెనుదిరుగు తున్నాయి. కాని, నువ్వు అలా కాదు. ఆ దివ్యధామాన్ని చేర గలవు. అంతే కాదు. అక్కడికి చేరిన తరువాత తిరిగి రావు. సంసారంలో తిరిగి ప్రవేశించవు ***(యద్గత్వా న నివర్తన్తే)***. ఎందుకని? నీవు అనంతాత్మవు కనుక. పూర్ణాత్మవు కనుక. నీవే బ్రహ్మము కనుక. నీవు తిరిగి రావు. కారణం, నీవు తరలి పోలేదు. నువ్వెక్కడ లేవని పోవాలి? ఏది లేదని, ఏది కాదని తిరిగి రావాలి? నీవే అనంతాత్మవు. ఆనందాత్మవు. 'నేను - నేను' అనే స్ఫురణ ఎక్కడైతే కదులుతూ ఉందో, ఆ హృదయ పద్మములో సాక్షాత్తు ఆత్మ రూపంలో భాసిస్తున్న బ్రహ్మము నీవే ***(హృదయ కుహర మధ్యే కేవల బ్రహ్మ మాత్రం అహం అహం ఇతి, సాక్షాత్ ఆత్మరూపేణ భాతి -*** శ్రీ రమణ మహర్షి ).

ఇది తెలియనంత వరకు ప్రయత్నాలే సాగుతూ ఉంటాయి. కర్మలే కొనసాగుతూ ఉంటాయి. ఎంత కాలం ఇలా ప్రయత్నాలు సాగుతూ ఉంటాయో, అంత కాలం మనం మనకు అంతగా దూరం అవుతూ ఉంటాము. పరమాత్మకు సుదూరంగా పోతూ ఉంటాము. జన్మల్ని తోసుకుంటూ పోతూ ఉంటాము. యుగాలను



ఛేదించుకుంటూ పోతూ ఉంటాము. ఇలా ఇప్పటికే ఎంత దూరం వచ్చేశామో! గుండె గుడి లోనే గోవిందుని పెట్టుకొని, అన్వేషణలో ఎంత అలసి పోతున్నామో! ఉన్నది తెలిసే దెప్పుడో, ఉన్న దానితో కలిసే దెప్పుడో? అదే ప్రశ్నిస్తున్నాడు భక్త నరసీ మెహతా.

**మందిర్ మందిర్ మూరత్ తేరీ**<br>
**ఫిర్ భీ న దేఖూఁ సూరత్ తేరీ**<br>
**యుగ బీతే న ఆయె మిలన్ కీ**<br>
**పూరన్ మాసీరే** **॥ దర్శన్ ॥**

'ప్రభూ! ప్రతి గుడిలో నీ రూప ముంది. ప్రతి గుండెలో నీ స్వరూప ముంది. అయినా, నీ దర్శనం లేకనే, యుగాలు దొర్లి పోయాయి. ఎందుకనో, నిన్ను కలుసుకొనే పున్నమి ఇంకా విరబూయ లేదు'.

వస్తువు లేనిది కాదు. ఉన్నట్లు తెలియనిది. తెలిపితే తెలిసేది. తెలిపే గురుదేవుడు లభిస్తే బ్రతుకు పున్నమి అవుతుంది. అంతవరకు అమావాస్య చీకటిలా పడి ఉంటుంది.

*ప్రత్యగాత్మే పరమాత్మ అని అర్థం చేసుకున్నాం. కనుక జీవు లందరూ ఈశ్వర స్వరూపమే. ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాడు.*

మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః ।<br>
మనః షష్ఠా నీన్ద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి ॥ 7

***మమ-ఏవ-అంశః-జీవలోకే-జీవభూతః-సనాతనః***<br>
***మనః-షష్ఠాని-ఇంద్రియాణి-ప్రకృతిస్థాని-కర్షతి***

| | | | |
|---|---|---|---|
| సనాతనః | = సనాతనుడైన | ప్రకృతి స్థాని | = ప్రకృతి యందున్న |
| మమ ఏవ | = కేవలం నా యొక్క | మనః షష్ఠాని | = మనస్సుతో కూడి ఆరు అయిన |
| అంశః | = అంశము | ఇంద్రియాణి | = ఇంద్రియాలను |
| జీవభూతః | = జీవుడై | కర్షతి | = లాగుతూ ఉంది |
| జీవలోకే | = సంసారము నందు | | |

**అర్జునా! సనాతనమైన నా అంశమే సంసారంలో జీవ రూపంతో ఉంది. ప్రకృతి లోని ఇంద్రియ మనస్సులు ఆరింటిని తన వైపుకు ఆకర్షిస్తూ ఉంది.**

### వ్యాఖ్య

నేను ఉన్నాను ***(అహమస్మి)*** అనే వాక్యములో 'నేను' అనే పదము దేహానికి సంబంధించింది కాదని, ఇంద్రియాలకు సంబంధించింది కాదని, ప్రాణానికి సంబంధించింది కాదని, మనస్సుకు సంబంధించింది కాదని ఇప్పటికే మనం తెలుసుకున్నాం. అలాగే ఈ లోకములో 'నేను' అనే వస్తువు లేదని కూడా అర్థం చేసుకున్నాం. 'నేను' అంటే జీవుడు. చైతన్య రూపుడు.

'నేను' అంటూ నేను పలుకుతున్నాను. నీవూ పలుకుతున్నావు. ఆమె కూడా పలుకుతోంది. ఇలా అనేక మంది 'నేను - నేను' అంటూ ఉన్నారు. మరి ఈ 'నేను' యొక్క లక్షణాలు మనిషి మనిషికి భిన్నంగా ఉన్నాయా? లేవు. ఎందరు పలికినా, ఎవరు పలికినా 'నేను' ఒక్కటే. 'అహం' శబ్దార్థ మొక్కటే. అదే జీవుడు. సద్రూపుడు. ఏక సద్రూపుడు. దేవుడి కన్నా భిన్నం కాని వాడు. జీవుడుగా తెలుస్తున్న వాడు ***(జీవ భూతః)***.

## జీవుడు

జీవ లోకంలో, అంటే సంసారములో జీవుడుగా తెలుస్తున్నది ***(జీవ లోకే జీవ భూతః)*** నా యొక్క సనాతన మైన అంశమే ***(మమ అంశః ఏవ సనాతనః)*** అంటున్నాడు భగవంతుడు. అంశము అంటే, భాగము అని, అవయవము లేదా అంగము అని, ఏకదేశ మని అర్థం. జీవలోకంలో, లేదా సంసారంలో ***(జీవ లోకే జీవానాం లోకే సంసారే)*** భోక్తగా, కర్తగా తెలియ బడుతున్న జీవుడు ***(జీవ భూతః భోక్తా కర్తా ఇతి ప్రసిద్ధః)*** పరమాత్మ యొక్క అంశగా ప్రసిద్ధుడు. అంటే, పరమాత్మ అంశముగా కల్పితుడైన జీవుడు కర్తగా, భోక్తగా ప్రసిద్ధుడు అని అర్థం. అట్టి జీవుడు సనాతనుడు ***(సనాతనః)***.

బ్రహ్మము అనంతము, నిష్కలము అని అర్థం చేసుకున్నాం. నిష్కలము అన్నప్పుడు బ్రహ్మము అఖండమే గాని భాగములు, లేక అవయవములు గల వాడు కాడు. మరి, బ్రహ్మము నిర్విశేషము, నిరవయవము అయి నపుడు, అట్టి పరమాత్మకు జీవుడు ఒక అంగము, లేదా అంశము అనేది ఎలా సముచితము? జీవుడు బ్రహ్మము నందు అంశమైతే, భాగమైతే, అవయవ మైతే, బ్రహ్మము సావయవము అని నిర్ణయించవలసి వస్తుంది. సావయవ మైన దానికి నిత్యత్వము ఉండే అవకాశము లేనందున అది నశించేది అవుతుంది.

ఇంతకీ జీవుడు బ్రహ్మము కంటే అన్యంగా ఉన్నాడా? లేక జీవుడుగా తెలిసేది బ్రహ్మ మేనా? లేక జీవుడు అసలు లేడా? ఈ మూడు ప్రశ్నలు ***మమైవాంశః*** శబ్ద ప్రయోగము వలన ఉత్పన్న మవుతున్నాయి.

జీవుడే లేడు అనే మూడవ ప్రశ్న ఉపపన్నం కానే కాదు. జీవుడు లేడు అని అంగీకరిస్తే ***అహమస్మి*** - నేను ఉన్నాను అని చెబుతూ ప్రత్యక్షంగా కనిపిస్తున్న నిన్నే నిరాకరించినట్లు అవుతుంది. కనుక జీవ అభావ ప్రసక్తి నిర్హేతుకం.

ఇక జీవుడు బ్రహ్మము కన్నా వేరైన వాడా? అనే మొదటి ప్రశ్న. జీవుడు వేరు - బ్రహ్మము వేరు అని చెప్పినట్లైతే, జీవుడు చైతన్య రూపుడా, లేక అచేతనుడా? అని మరొక ప్రశ్న ఉదస్తుంది. జీవుడు అచేతనుడు ఎలా అవుతాడు? జీవుడే గనుక అచేతను డయితే, ***అహం - ఇదం*** - నేను - ఇది; ***అహం - మమ*** - నేను - నాది; అనే జ్ఞానము ఎలా కలుగుతుంది? జీవుడు ఏ చెట్టు లాగో, పుట్ట లాగో, కొండ లాగో, బండ లాగో పడి ఉండాలి. కనుక జీవుడు సచేతనుడే గాని అచేతనుడు కాడు.

జీవుడు సచేతను డైతే, బ్రహ్మము కంటే అన్యంగా ఎలా ఉంటాడు? అలా ఉంటే, బ్రహ్మ చైతన్యము, జీవ చైతన్యము అని రెండు చైతన్యాలు ఉండాలి. రెండు చైతన్యాలు ఉంటే, రెండూ దృశ్యాలే అవుతాయి. దృశ్యా లైతే రెండూ నశించి పోతాయి. నశించేది చైతన్య మెలా అవుతుంది? చైతన్యము ఏకము, అద్వయము. అట్టి చైతన్యము దృశ్యము కాలేదు. కనుక మొదటి పక్షము ననుసరించి చెప్పాలి అంటే, చేతన మైన జీవుడు అద్వయ బ్రహ్మము కంటే అన్యమైన వాడు కాడు.

ఇక మిగిలింది రెండవ ప్రశ్న ఒక్కటే. జీవుడుగా తెలిసేది బ్రహ్మ మేనా? జీవత్వముగా మనం చెప్పుకుంటున్నది బ్రహ్మత్వ మేనా? అవును. అదే యుక్తము.

జీవుడే బ్రహ్మ మైతే, పూర్వ శ్లోకాలలో మనం చెప్పుకున్నట్లు బ్రహ్మము పూర్ణము, అనంతము కనుక, జీవుడు కూడా పూర్ణము, అనంతము అయి ఉండాలి. మరి పూర్ణము, అనంతము అయిన బ్రహ్మమునకు సంసారిత్వము అసంగత మైనపుడు జీవునికి మాత్రం సంసారిత్వము ఎలా సంభవము? అదీ గాక, జీవుడే బ్రహ్మ మైతే, తాను పూర్ణుడు, అనంతుడు అనే జ్ఞానము జీవునికి ఎందుకు లేదు? ఈ ప్రశ్న లన్నీ ఉద్భవిస్తాయి.





దానికి శ్రుతి ప్రతిపాదిత సమాధానం ఉంది. జీవుడు బ్రహ్మమే అయినా, అవిద్య చేత జీవుడుగా తెలుస్తూ ఉన్నాడు. ఈ విషయాన్ని పదమూడవ అధ్యాయంలో కూడా మనం సవిస్తరంగా చర్చించుకున్నాం. ఇది అంగీకారం గానే ఉంది. ప్రామాణికం గానూ ఉంది. కాకపోతే, సనాతనుడైన జీవుడు నా అంశమే, ***మమైవాంశః (జీవభూతః మమ సనాతన అంశః ఏవ)*** అని భగవానుడు చెబుతున్నది ఎలా సమంజసము? జీవుడు బ్రహ్మము యొక్క 'అంశ', అంటే భాగము లేక అవయవము అనేది యుక్తమా? ఇరువురికి 'అంశ - అంశి' భావము సమంజసమా?

పరమాత్మ అవయవ సహితమా? లేక నిరవయవమా? బ్రహ్మమే గనుక అవయవ సహిత మైతే, బ్రహ్మమునకు అవయవ విభాగము ప్రాప్తించదా? అదే జరిగితే ఫలం వినాశమే కదా? మరి, నశించేది బ్రహ్మ మెలా అవుతుంది?

అనంతము, పూర్ణము అయిన బ్రహ్మములో అవయవము, భాగము, ఏకదేశము అంటూ 'అంశ' ప్రసక్తి ఎలా సంభవము? అనంతమైన బ్రహ్మము అద్వితీయము కావడం చేత, అంశ ప్రసక్తి తలెత్తే అవకాశమే లేదు కనుక, బ్రహ్మము నిరవయవము. నిరవయవ మైన బ్రహ్మమునకు జీవుడు అంశ ఎలా అవుతాడు? అంశ కాలేడు. అలాంటప్పుడు ***మమైవాంశో జీవలోకే జీవ భూతః సనాతనః*** అని గీతాచార్యుడు ప్రతిపాదించిన విషయము ఎలా సహేతుకము?. ఎలా సశాస్త్రీయము? ఏకము, అద్వితీయము అయిన బ్రహ్మమునకు అంశాంశి భావము ఎలా ఉపపన్నము?

నిజమే. ఈ వాదము సహేతుకం గాను, సశాస్త్రీయం గాను, పటిష్ఠం గాను ఉంది. కాకపోతే, జీవబ్రహ్మ లకు ఈ అంశాంశి భావము వాస్తవమా లేక కల్పితమా? అనేది ముందు స్పష్టం కావాలి. వాస్తవికంగా అంశాంశి భావము ఉన్న ట్లైతే, అది హేతుబద్ధము కాకపోవడమే గాక, ప్రమాణ విరుద్ధము కూడా అవుతుంది. కనుక జీవబ్రహ్మలకు ప్రస్తుత శ్లోకములో భగవానుడు ప్రతిపాదించిన అంశాంశి భావము కల్పిత మైనది. ఆరోపిత మైనది. అది ఆధ్యాసిక సంబంధమే గాని వాస్తవంగా అద్వితీయ బ్రహ్మమునకు దేని తోనూ ఏ సంబంధమూ లేదు. కనుక, ఆరోపిత అంశాంశి భావము అనుపపన్నం కాదు; శాస్త్ర విరుద్ధమూ కాదు. అహేతుకము, అప్రమాణము అసలే కాదు. అనంతమైన బ్రహ్మమునకు ఉపాధి రీత్యా అంశాంశి భావము ఉపపన్నమే. అదెలాగో విశ్లేషించి అర్థం చేసుకుందాం.

### అంశ అంశి భావము

అద్వితీయమైన బ్రహ్మమునకు వాస్తవిక అంశాంశి భావము సంభవము కాదు. కాని, అవిద్యోపాధితో కూడినపుడు బ్రహ్మమునకు కల్పిత అంశాంశి భావమును చెప్పుట సమంజసమే.

ఆకాశము ఏకము. నిరవయవము. అయినా, కుండ అనే ఉపాధి వైశిష్ట్యము చేత ఘటాకాశము అని చెప్పబడుతూ ఉంది. ఘటాకాశము అని ఒక వైపు చెప్పబడుతున్నా, మరో వైపు మహాకాశము తెలుస్తూనే ఉంది. మహాకాశము నిరవయవంగా, అపరిచ్ఛిన్నంగా గోచరిస్తున్నా, ఘటోపాధి కారణంగా మహాకాశానికి అంశాంశి భావము సంభవిస్తూ ఉంది. మహాకాశము అంశి కాగా, ఘటాకాశము దాని అంశముగా తెలుస్తూ ఉంది. వాస్తవానికి మహాకాశానికి అంశాంశి భావము లేదు.

ఘట నిమిత్తంగా ఉపపన్నమైన అంశాంశి భావము ఘట భంగం జరిగిన తరువాత, నిమిత్తం తొలగి పోయిన కారణంగా మహాకాశాన్ని పొందుతూ ఉంది. ఉపాధి ఉన్నంత వరకు ఆకాశము ఘటాకాశంగా తెలుస్తూ మహాకాశానికి కల్పిత అంశగా అర్థమై, ఉపాధి వినిర్ముక్తం కాగానే మహాకాశాన్ని పొంది కల్పిత అంశాంశి భావము నుండి విడిపడి నిరవయవ, అపరిచ్ఛిన్న స్థితిని పొంది మళ్ళీ తిరిగి రాని స్వరూపాన్ని చేరి పోతుంది

**(యథా వా ఘటాద్యుపాధి పరిచ్ఛిన్నః ఘటా ద్యాకాశః ఆకాశాంశః సన్ ఘటాది నిమిత్తాపాయే ఆకాశం ప్రాప్య న నివర్తతే ఇత్యేవమ్!).** ఇదే విషయాన్ని నిరూపించడానికి ఆచార్యుల వారు బింబ ప్రతిబింబ న్యాయాన్ని కూడా ఉదహరిస్తారు.

సూర్యుడు కూప జలాలలో ప్రతిబింబిస్తాడు. జలంలో ప్రతిఫలించిన ప్రతిబింబము ఎవరిదో కాదు, సూర్యునిదే. సూర్యుని అంశమే. ఈ విధంగా సూర్యునికి అంశాంశి భావము కల్పించ బడింది. బావిలో జలం ఇంకి పోగానే, నిమిత్తం తొలగి పోయిన కారణంగా, ప్రతిబింబము సూర్యబింబమును చేరి, మళ్ళీ తిరిగి రాదు **( యథా జల సూర్యకః సూర్యాంశః జల నిమిత్తాపాయే సూర్య మేవ గత్వా న నివర్తతే ).**

ఘటోపాధి వలన ఏకము, అద్వితీయము అయిన ఆకాశమునకు కల్పిత అంశాంశి భావము ఉపపన్న మైనట్లు, జలోపాధి కారణంగా ఏకమైన సూర్య బింబమునకు ఆరోపిత అంశాంశి భావము సంభవ మైనట్లు, ఘటోపాధి నిర్ముక్తం కాగానే అపరిచ్ఛిన్నమైన ఆకాశమునకు కల్పిత అంశాంశి భావము తొలగి పోయినట్లు, జలోపాధి వినిర్ముక్తం కాగానే ఏకమైన సూర్యబింబమునకు అంశాంశి భావము తొలగిపోతూ ఉంది.

అలాగే పూర్ణము, అనంతము అయిన బ్రహ్మమునకు అంశాంశి భావము అనుపపన్నమే అయినా, బుద్ధ్యుపాధి విశిష్టుడు అయినపుడు, బుద్ధ్యవచ్ఛిన్ను డైన జీవునికి అంశత్వము కల్పించబడి, జీవుడు బ్రహ్మ యొక్క అంశము - **మమైవాంశః ( జీవః మమ అంశః ఏవ )** అనేది సంభవించింది. ఉపాధి వినిర్ముక్తం కాగానే పరిచ్ఛిన్నుడుగా తెలిసిన జీవుడు అనంతుడైన బ్రహ్మము గానే భాసిస్తున్నాడు. బ్రహ్మము నందు కల్పించ బడిన అంశాంశి భావము లేనిదే అగుచున్నది. ఈ విధంగా బ్రహ్మము నందు అంశాంశి భావము ఆరోపితము. ఈ విషయాన్ని క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగంలో విస్తరించి చెప్పుకున్నాం **( అయం అర్థః క్షేత్రాధ్యాయే విస్తరశః ).** జీవుని విషయంలో భిన్నాభిప్రాయాలు ఎన్నో ఉన్నాయి. అన్యులను ప్రక్కన ఉంచితే, సంప్రదాయ గాడిలో నడిచే అద్వైతులలో కూడా అభిప్రాయ భేదా లున్నాయి. ఇది చాలా జటిలమైన విషయము. కనుక, ముముక్షువులకు ఉపకరిస్తుం దని సంక్షేపంగా జీవ నిర్వచనం కూడా అందిస్తాను.

**జీవ నిర్వచనము**

శ్లో ॥ *అధిష్ఠానం చిదాభాసో బుద్ధిః ఏత త్త్రయం యదా ।*
*అజ్ఞానాత్ ఏకవ ద్భాతి జీవ ఇత్యుచ్యతే తదా ॥*

'అధిష్ఠానమైన ఆత్మ చైతన్యము, బుద్ధిలో ప్రతిఫలించిన చిదాభాస చైతన్యము, బుద్ధి అనే ఉపాధి - ఈ మూడు అజ్ఞానము వలన ఒకటిగా గోచరించి నపుడు జీవుడు అని పిలవడం జరుగుతూ ఉంది ' అని శ్రీశంకరాచార్య స్వామి స్వాత్మ ప్రకాశిక అనే గ్రంథంలో నిర్వచించారు.

పై మూడు అంశాలను పరిశీలిస్తే, ఆత్మ చైతన్యము నిర్వికారం కనుక అది జీవుడు అనలేము. చిదాభాసుడు మిథ్య కనుక అతడూ జీవుడు కాడు. ఇక మిగిలింది బుద్ధి. అది ఎలాగూ జడము కనుక జీవుడు కానేరదు. ఈ మూడిటిలో ఏ ఒక్కటి, లేదా ఏ రెండు జీవుడు కాకపోయినా, మూడు కలిసి నపుడు జీవ నామం వినిపిస్తూ ఉంది అనేది ఆచార్యుల వారి అభిప్రాయము. శ్రీ విద్యారణ్యస్వామి వేదాంత పంచదశిలో ఎలా నిర్వచించారో చూడండి.

శ్లో॥ *చైతన్యం యదధిష్ఠానం లింగదేహశ్చ యః పునః ।*
*చిచ్ఛాయా లింగ దేహస్థా తత్సంఘో జీవ ఉచ్యతే ॥*





అధిష్ఠానమైన ఆత్మ చైతన్యము, లింగ దేహము లేదా సూక్ష్మ శరీరము, లింగ దేహము నందు ప్రతిబింబించిన చిదాభాసుడు - ఈ మూడు కలిసి జీవుడు అనబడతాడు అని శ్రీ విద్యారణ్యస్వామి వేదాంత పంచదశి గ్రంథం లోని ద్వైత వివేక ప్రకరణములో తెలియ చేశారు (వేదాంత పంచదశి ; 4 వ అ - 11 వ శ్లో).

శ్రీ శంకరుల నిర్వచనానికి, శ్రీ విద్యారణ్యుల నిర్వచనానికి పరస్పరం అభేదమే. శ్రీ శంకరులు బుద్ధి అన్నారు. శ్రీ విద్యారణ్యులు లింగ దేహము అన్నారు. రెండూ ప్రకృతి పరిణామాలే, గుణ పరిణామాలే. బుద్ధి సూక్ష్మ శరీరానికి, లేదా లింగ దేహానికి సంబంధించిందే కదా! దీనిని శాస్త్రంలో ఆభాసవాదము అంటారు.

ఈశ్వరుడు ఉపాధిలో ప్రవేశించడమే గాక, ఉపాధి మనుగడకు ప్రాణాదులను ప్రేరేపించాడు **(సన్నిధి మాత్రేణ)** అని కూడా శ్రీ విద్యారణ్యులు చెప్పారు **( కృత్వా రూపాంతరం జైవం దేహే ఇతి తాః శ్రుతయః ప్రాహుః జీవత్వం ప్రాణధారణాత్).** ఇదంతా శ్రుతి సమ్మతమే. కొందరు జీవ నిర్వచనంలో ఆభాస వాదమును కాకుండా ప్రతిబింబ వాదమును ప్రతిపాదిస్తారు. భామతీ వ్యాఖ్యాత వాచస్పతి వాదము మరో విధంగా ఉంది. అవన్నీ చర్చించడానికి ఇది సందర్భమే అయినా, ఎందుకో నాకు సానుకూలంగా లేదు. ఎంత తిరిగినా భూమి గుండ్రంగా ఉన్న దన్నట్లు, ఎన్ని చెప్పుకున్నా మళ్ళీ శ్రీ శంకరుల దగ్గరికి రావలసిందే. అదెలాగూ చెప్పాశాను కనుక చాలు అని సరిపెట్టుకుంటున్నా.

ఈ విధంగా దేహంలో ప్రవేశించిన పరమేశ్వరుని అంశ అయిన జీవాత్మ దేహములో అయిదు జ్ఞానేంద్రియాలను, మనస్సుతో కలసి ఆరింటిని తన వైపుకు ఆకర్షిస్తున్నాడు **( మనః షష్ఠాణి ఇంద్రియాణి శ్రోత్రాదీని ఆకర్షతి).** ఇక్కడ ఇంద్రియాలు అనేది ఉపలక్షణం. జ్ఞానేంద్రియాలు అంటే కర్మేంద్రియాలు, పంచ ప్రాణాలు అని కూడా అర్థం. ఇలా సంసారంలో ప్రవేశించిన జీవుడు ఒక దేహాన్ని విడిచి మరొక దేహంలో ప్రవేశించే టప్పుడు, వాటిని వెంట పెట్టుకొని నిష్క్రమిస్తున్నాడు.

అదెలాగో చెబుతున్నాడు.

శరీరం య దవాప్నోతి యచ్చా ప్యుత్క్రామ తీశ్వరః ।
గృహీ త్వైతాని సంయాతి వాయు ర్గన్ధా ని వాశయాత్ ॥ 8

*శరీరం-యత్-అవాప్నోతి-యత్-చ-అపి-ఉత్క్రామతి-ఈశ్వరః*
*గృహీత్వా-ఏతాని-సంయాతి-వాయుః-గంధాన్-ఇవ-ఆశయాత్*

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఈశ్వరః | = | ఈశ్వరుడు | వాయుః | = | గాలి |
| యత్ | = | ఎప్పుడు | ఆశయాత్ | = | సౌరభ స్థానము నుండి |
| శరీరం | = | శరీరమును | గంధాన్ ఇవ | = | గంధము వలె |
| అవాప్నోతి | = | పొందుతాడో | ఏతాని | = | ఈ ఇంద్రియములను |
| యత్ చ అపి | = | ఎప్పుడు | గృహీత్వా | = | గ్రహించి |
| ఉత్క్రామతి | = | విడుస్తున్నాడో | సంయాతి | = | వెళ్తాడు |

**అర్జునా! గాలి పోతూ పోతూ పువ్వుల లోని పరిమళాన్ని వెంట తీసుకొని పోతుంది. అలాగే జీవుడు ఒక శరీరాన్ని విడిచి పెట్టి మరొక శరీరంలో ప్రవేశించే టప్పుడు ఇంద్రియ మనస్సులు ఆరింటిని వెంట పెట్టుకొని పోతాడు.**

## వ్యాఖ్య

దేహాది సంఘాతానికి ప్రభువైన జీవుడు ఎప్పుడైతే ఉత్క్రమిస్తున్నాడో, అంటే పైకి లేస్తున్నాడో అప్పుడు, మనస్సు ఆరవదిగా గల ఇంద్రియాలను ఆకర్షిస్తున్నాడు, లేదా లాగుతున్నాడు అనే అర్థ ప్రాధాన్యాన్ని అనుసరిస్తూ, పూర్వ శ్లోకము యొక్క ద్వితీయ పాదాన్ని ముందుగా గ్రహించి ప్రస్తుత శ్లోకముతో అన్వయించుకోవాలి. అప్పుడు, జీవుడు పూర్వ శరీరాన్ని విడిచి మరొక శరీరాన్ని పొందునపుడు మనస్సు ఆరవదిగా గల ఇంద్రియాలను వెంట పెట్టుకొని వెళ్తాడు అనే భావం స్పష్ట మవుతుంది. ఎలా వెళ్తాడు? ఆ విషయాన్నే సోదాహరణంగా ప్రస్తుత శ్లోకంలో చెబుతున్నాడు.

వెనుకటి శరీరాన్ని విడిచి వేరొక శరీరంలో ప్రవేశించుటకు ఉత్క్రమిస్తున్న సమయంలో దేహాది సంఘాతానికి ప్రభువు ***(ఈశ్వరః)*** అయిన జీవుడు ఇంద్రియ మనస్సులను ఆకర్షిస్తున్నాడు. ఈ సందర్భములో దేహాది సంఘాత స్వామిని ఈశ్వరుడు అంటున్నాడు ***(ఈశ్వరః దేహాది సంఘాత స్వామీ జీవః)***. అంటే, జనన మరణాల విషయంలో ప్రస్తావించ బడుతున్న జీవుడు స్వరూపతః ఈశ్వరుడే. ఈశ్వరుడు చైతన్య రూపుడు కనుక అతనికి జననమరణాలు లేవు. కర్తగా, భోక్తగా జీవుడు వ్యావహారికంగా పిలువ బడుతున్నా, వాస్తవానికి అతడు కర్తా కాడు, భోక్తా కాడు. దేహేంద్రియ మనస్సులతో తాదాత్మ్యం చెంది ఉండటం చేత జీవుడు భోక్త అనే ఆరోపణ జరుగుతోంది.

**ఆత్మేంద్రియ మనోయుక్తం భోక్తే త్యాహు ర్మనీషిణః ॥**

దేహము, ఇంద్రియాలు, మనస్సుతో కూడిన జీవుణ్ణి భోక్త అని చెబుతారు అన్నది కఠోపనిషత్తు. భోక్త కనుక, జీవుడు సంసారి అయ్యాడు. అంటే, దేహేంద్రియ మనస్సులతో తాదాత్మ్యము లేనపుడు జీవుడు భోక్త కాడనే కదా అర్థం? అవును. కానీ, ఈ తాదాత్మ్యము ఆధ్యాసిక మని ముందే చెప్పుకున్నాం కదా! కనుక జీవుడు ఎన్నడూ భోక్త కాలేడు. ఎందుకని? కర్త కాడు కనుక. జీవుడు కేవలం చైతన్య రూపుడే కావడం చేత జీవునికి భోక్తృత్వం లేదు ***(న హి కేవలస్య ఆత్మనః భోక్తృత్వం అస్తి -*** *కఠ భాష్యము )*. జీవునికి భోక్తృత్వము స్వతఃసిద్ధము కాదు. ఆరోపితము. ఒకవేళ కర్తృత్వ భోక్తృత్వాలు జీవునికి స్వభావములే అయితే, స్వభావము నశించదు కనుక జీవుడు నిత్య సంసారి అవుతాడు.

కనుక, ఉపాధి స్థాయి నుండి జననమరణాలు చెప్పబడుతున్నాయే గాని, వాస్తవానికి జీవునికి చావు పుట్టుకలు లేవు. ముక్క లయ్యేది కుండే గాని కుండ లోని ఆకాశం కాదు కదా! కనుకనే, సనాతనుడైన జీవుడు బ్రహ్మము యొక్క అంశమే అని చెప్పడం జరిగింది *(15 వ అ - 7 వ శ్లో)*. కుండను తీసుకొని పోతూ ఉంటే, కుండ లోని ఆకాశాన్ని కూడా తీసుకొని పోతున్నట్లు అనిపిస్తుంది. ప్రయాణం చేసేది కుండే గాని కుండ లోని ఆకాశం కాదు. ఘటాకాశము ప్రత్యేకంగా ఎక్కడుంది పయనించ డానికి? ఘటాకాశము మహాకాశము నుండి వేరైనది ఎప్పుడు? ఘటాకాశమును ఆరోపించడం చేత ఘటం పయనిస్తూ ఉంటే, ఘటాకాశం కూడా చలిస్తూ ఉందని భ్రమిస్తున్నాము. వాస్తవానికి ఘటమే ఆకాశంలో కదులుతూ ఉంది. అలాగే మరణంలో స్థూల దేహము నుండి సూక్ష్మ దేహము విడిపడి మరో శరీరంలో ప్రవేశిస్తూ ఉంటే, జీవుడు ప్రయాణం చేస్తున్నట్లు మనం ఆరోపిస్తున్నాము. జీవుడు ఈశ్వరుడే కనుక రాకపోకలు లేని వాడు. జననమరణాలు తెలియని వాడు. అందు చేతనే ఉపనిషత్తులు జీవుని కర్మాకర్మలను **ధ్యాయతి ఇవ, లేలాయతి ఇవ -** జీవుడు ధ్యానించు వాని వలె, చలించు వాని వలె ఉన్నాడు అని ప్రబోధించాయి. అలాగే జననమరణాల మధ్య కూడా జీవుడు పయనిస్తున్నాడు





అనుకుంటున్నాము. వాస్తవానికి పయనించు వాని వలె ఉన్నాడు. ఇక్కడ 'వలె' **(ఇవ)** అనేది చాలా ప్రధానమైన విషయము. ఇక ప్రయాణం ఎలా సాగుతూ ఉందో చూద్దాం.

**జీవ యానము**

అర్జునా! జీవుడు వెనుకటి శరీరాన్ని విడిచే టప్పుడు గాని ***(ఉత్క్రామతి)***, వేరొక శరీరాన్ని పొందే టప్పుడు గాని ***(అవాప్నోతి)***, గాలి పువ్వుల నుండి సుగంధాన్ని వెంట పెట్టుకొని పోయినట్లు, ఇంద్రియ మనస్సులను వెంట పెట్టుకొని పయనిస్తాడు.

పువ్వులలో సువాసన ఉంది. వాయువు సువాసనను తీసుకొని పోతుందే గాని, పువ్వులను తీసుకొని పోదు. పువ్వులు అక్కడే ఉంటాయి. గాలి సుగంధాన్ని మాత్రమే వెంట పెట్టుకొని పోతుంది. మరణంలో స్థూల దేహము పువ్వు లాగా అక్కడే ఉంటుంది. పువ్వు లోని సౌరభాన్ని గాలి తీసుకొని పోయినట్లు, స్థూల దేహం లోని సూక్ష్మ దేహాన్ని మాత్రమే జీవుడు వెంట పెట్టుకొని పోతాడు.

పుష్పాలు స్థూల శరీరాలు. గంధాలు పుణ్య పాపాది వాసనా యుతమైన సూక్ష్మ శరీరాలు. వాయువు జీవాత్మ. గాలి ఎలాగైతే పువ్వును విడిచి పెట్టి సుగంధాన్ని వెంట పెట్టుకొని పోతుందో, జీవుడు అలాగే స్థూల దేహాన్ని విడిచి పెట్టి సూక్ష్మ దేహాన్ని వెంట పెట్టుకొని వెళ్తాడు. ఇప్పుడు అర్థమైంది అనుకుంటాను. జనన మరణాలలో ప్రయాణం సాగించేది సూక్ష్మ దేహమే గాని జీవుడు కాడు. స్థూల దేహమూ కాదు. స్థూల దేహము శ్మశానంలో అంత మవుతుంది. జీవుడు అంతమయ్యే వాడు కానందున నిత్యుడై ఉంటాడు. సూక్ష్మ దేహము మాత్రం అజ్ఞానము అంతం కానంత వరకు చావుపుట్టుకల మధ్య తిరుగుతూ ఉంటుంది.

మరణానంతరము ప్రయాణము అనివార్యం అని తేలి పోయింది. కాకపోతే, పయన మయ్యేది సూక్ష్మ శరీరము కనుక, స్థూల శరీరం తోడు రాదు. ప్రోగు చేసుకొనిన సంపదలు వెంట రావు. బంధుజనం కలిసి పయనించరు.

*సీ॥ ధరణిలో వెయ్యేండ్లు తనువు నిల్వగ బోదు ధన మెప్పటికి శాశ్వతంబు గాదు*
*దారాసుతాదులు తన వెంట రాలేరు భృత్యులు మృతిని తప్పింప లేరు*
*బంధుజాలము తన్ను బ్రతికించుకో లేదు బలపరాక్రమ మేమి పనికి రాదు*
*ఘనమైన సకల భోగ్యం బెంత గల్గియు గోచి మాత్రం బైన గాంచబోదు*

*తే॥ గీ॥ వెఱ్ఱి కుక్కల భ్రమలన్ని విడచి నిన్ను భజన చేసెడి వారికి పరమ సుఖము*
*భూషణ వికాస శ్రీధర్మ పుర నివాస ! దుష్ట సంహార! నరసింహ! దురితదూర!*

దేహము ఈ లోకంలో వెయ్యేండ్లు ఉండేది కాదు. ధనము ఎవరి దైనా అనిత్యమే. తనువు చాలించి పయనమయ్యే నాడు భార్యాబిడ్డలు వెంట రారు. సేవకు లెందరున్నా మరణాన్ని నివారించ లేరు. బంధువులు బ్రతికించుకో లేరు. శక్తిసామర్థ్యాలు మరణంలో ఉపకరించవు. గొప్ప సంపద లున్నా, పోయే నాడు గోచి కూడా తోడు ఉండదు అని నరసింహ శతకము.

తోడు వచ్చేవి, తోడు నడిచేవి ఇంద్రియాలు అయిదు, మనస్సు ఆరవది ***( మనః షష్ఠానీంద్రియాణి )***. వాటిని పవిత్రంగా ఉంచుకోవాలి. దివ్యంగా మలచుకోవాలి. వెంట వచ్చేవి అవే కనుక, అవి మంగళకరంగా ఉంటే, తరువాత జన్మ శోభాయమానంగా ఉంటుంది. అలా ఇంద్రియ మనస్సులను పవిత్రం చేసుకొనే ప్రక్రియను భాగవతం దివ్యంగా వివరించింది.

**సీ॥** కమలాక్షు నర్చించు కరములు కరములు శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
సుర రక్షకుని జూచు చూడ్కులు చూడ్కులు శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణు నాకర్ణించు వీనులు వీనులు మధువైరి దవిలిన మనము మనము
భగవంతు వలగొను పదములు పదములు పురుషోత్తముని మీది బుద్ధి బుద్ధి

**తే॥ గీ॥** దేవ దేవుని జింతించు దినము దినము చక్రహస్తుని ప్రకటించు చదువు చదువు
కుంభి నీ ధవు జెప్పెడి గురుడు గురుడు తండ్రి హరి జేరుమని యెడి తండ్రి తండ్రి !

అంటూ ఇంద్రియ మనోబుద్ధులను ఎక్కడ నియమిస్తే పవిత్ర మౌతాయో, ఎలా వినియోగించుకుంటే బ్రతుకు భవ్య మౌతుందో తెలుపుతూ ప్రహ్లాదుడు ముముక్షువులకు మార్గ నిర్దేశం చేశాడు.

మరణానంతరము జీవుని వెంబడించి వచ్చేవి ఇంద్రియాలు, మనస్సే కనుక వాటిని ఇప్పుడే, ఇక్కడే పవిత్రం చేసుకోవాలి. కర్మేంద్రియాలైన హస్తాలు దైవపూజలో, భగవత్కార్యాలలో సదా పునీతం కావాలి. భగవంతుని స్మరించేందుకు అనువైన పరమేశ్వర సన్నిధికి, సంత్ పురుషుల సదనాలకు నిత్యము నడక సాగుతూ ఉండాలి. కరచరణాదులు కర్మేంద్రియ సమూహానికి ఉపలక్షణము. ఈ విధంగా కర్మేంద్రియాలను పునీతం చేసుకుంటే, ఉత్తర జన్మలలో కర్మేంద్రియాలన్నీ వాటి వాటి కార్యాలను భగవన్ముఖంగా కొనసాగించి బ్రతుకుకు ధన్యతను చేకూర్చుతాయి.

అలాగే, శ్రోత్రాది జ్ఞానేంద్రియాలను కూడా నిత్యము జ్ఞానగంగలో పవిత్ర మయ్యే లాగా శ్రద్ధ వహించాలి. మహాత్ముల దర్శనంతో, మాధవ సందర్శనంతో నేత్రాలను, దివ్య శ్రవణంతో వీనులను, పవిత్ర భాషణంతో, దివ్య నామ సంకీర్తనముతో నాలుకను పునీతం చేసుకోవాలి.

కర్మేంద్రియ జ్ఞానేంద్రియాలను భగవ త్సంబంధమైన కర్మయోగ, జ్ఞానయోగ సాధనలలో పవిత్రం చేసుకున్నట్లు, మనోబుద్ధులను సదా భగవ చ్చింతనము, ఆత్మవిచారము, దైవ ధ్యానాలతో మంగళకరంగా మార్చుకోవాలి. వైభవోపేతమైన ఈ సాధనల ఫలితంగా ఉత్తర జన్మలు కూడా భగవన్మయ మవుతాయి. ఈ విధంగా దేహ పతనానంతరము వెంట వచ్చే వాటి విషయంలో ప్రతి ఒక్కరు సావధానులై ఉండాలి.

*జీవుడు జన్మాంతర ప్రస్థానంలో ఎందుకని ఇంద్రియ మనోబుద్ధులను తీసుకొని పోతున్నాడో, ఆ విషయాన్ని వివరిస్తున్నాడు.*

శ్రోత్రం చక్షుః స్పర్శనం చ రసనం ఘ్రాణ మేవ చ ।
అధిష్ఠాయ మన శ్చాయం విషయా నుపసేవతే ॥ 9

**శ్రోత్రం-చక్షుః-స్పర్శనం-చ-రసనం-ఘ్రాణం-ఏవ-చ**
**అధిష్ఠాయ-మనః-చ-అయం-విషయాన్-ఉపసేవతే**

| | | | | | |
|---|---|---|---|---|---|
| అయం | = | ఈ ఆత్మ | ఘ్రాణం ఏవ చ | = | ముక్కును |
| శ్రోత్రం | = | చెవిని | మనః చ | = | మనస్సును |
| చక్షుః | = | కంటిని | అధిష్ఠాయ | = | అధిష్ఠించి |
| స్పర్శనం చ | = | చర్మమును | విషయాన్ | = | విషయములను |
| రసనం | = | నాలుకను | ఉపసేవతే | = | అనుభవిస్తుంది |

**అర్జునా! జీవుడు ఇంద్రియ మనస్సులు ఆరింటిని ఆశ్రయించుకొని విషయాలను అనుభవిస్తాడు.**





**వ్యాఖ్య**

ప్రయాణికులు వారికి అవసరమైన వస్తువులను జాగ్రత్తగా వెంట పెట్టుకొని వెళ్తూ ఉంటారు. వారు వెళ్ళిన చోట అవి ఉపయుక్తంగా ఉంటాయనే వెంట తీసుకొని పోతారు. తీరా చేర వలసిన చోటికి చేరిన తరువాత వెంట తెచ్చుకున్న వాటిని వినియోగించుకుంటూ ఉంటారు. అలాగే జన్మాంతరాలలో పయనించే జీవుడు పూర్వ దేహాన్ని విడిచి పెట్టే టప్పుడు ఐదు ఇంద్రియా లను, ఆరవది అయిన మనస్సును వెంట పెట్టుకొని వెళ్ళి, వాటితో కలిసి ఉత్తర దేహంలో ప్రవేశిస్తాడు. తీరా ప్రవేశించిన తరువాత, తన వెంట తెచ్చుకొనిన వాటిని వినియోగించు కుంటాడు. ఇదే ఈ శ్లోకంలో ప్రధాన మైన విషయం.

విషయ ప్రపంచములో చరించే వ్యక్తి కర్మాచరణమునకు బాహ్యం లోని శబ్దాది విషయాలే హేతువులు. ఆ శబ్దాది విషయాలను అనుభవించ డానికి సాధనము లైన శ్రోత్రాది ఇంద్రియాలు, ఆరవది అయిన మనస్సు వ్యక్తిలో ఉన్నాయి. జన్మాంతరాలలో జీవుని వెంబడించి వచ్చాయి. అవే చెవి, కన్ను, చర్మము, నాలుక, ముక్కు, మనస్సు అనేవి (***శ్రోత్రం చక్షుః స్పర్శనం, రసనం, ఘ్రాణమ్, మనః***). శ్రోత్రాది పంచేంద్రియాలలో ఒక్కొక్క ఇంద్రియముతో కలిసిన మనస్సును జీవుడు (***అయం***) అధిష్ఠించి, దేహము నందుండి శబ్దాది విషయ వ్యాపారా లైన వినడము, కనడము, స్పృశించడము, రుచి చూడటము, వాసన చూడటము, ఆలోచించడము మొదలైన విషయాలను అనుభవిస్తూ ఉంటాడు (***ఉప సేవతే***).

శ్రోత్రాది పంచేంద్రియాలతో సంబంధం కలిగిన మనస్సును ఆశ్రయించుకొని, వినాలనే కుతూహలంతో చెవితో చేరి శబ్దాలను వింటాడు. మనస్సును అధిష్ఠించి, చూడాలనే ఆసక్తితో కళ్ళతో కలిసి రూపాలను, రంగు లను వీక్షిస్తాడు. మనస్సులో కొలువై, ఆఘ్రాణించాలనే అభిలాషతో ముక్కుతో కుమ్మక్కై, వాసనలను పీలుస్తాడు. మనస్సులో చేరి, రుచి చూడాలనే అభిరుచితో నాలుకతో జతై రుచులను అనుభవిస్తాడు. మనస్సులో నిలిచి, స్పృశించాలనే స్పృహతో త్వగింద్రియంతో, అంటే చర్మముతో చెట్ట పట్టా లేసుకొని వస్తువులను తాకుతూ ఉంటాడు. ఈ విధంగా మనస్సులో సదా మనుగడను సాగిస్తూ, ఒక్కొక్క ఇంద్రియముతో ప్రత్యేకంగా కలుస్తూ, ఆయా విషయాలను జీవుడు అనుభవిస్తూ ఉంటాడు.

ఇంద్రియ మనస్సుల ద్వారా జీవుడు విషయాలను అనుభవిస్తున్నాడు. కనుక పంచేంద్రియాలు, ఆరవది అయిన మనస్సు జీవునికి భోగ సాధనాలుగా ఉన్నాయి. పనిముట్లుగా ఉపకరిస్తున్నాయి. పని వాడు పనిముట్టు కన్నా అన్యమైన వాడు. అలాగే, జీవుడు ఇంద్రియ మనస్సుల కన్నా భిన్నమైన వాడు.

ఇంద్రియ మనస్సులు సూక్ష్మ శరీరానికి సంబంధించినవి. పూర్వానుభవాలకు సంబంధించిన వాసన లన్నీ సూక్ష్మదేహం లోనే ఉంటాయి. మనస్సు లోనే ఉంటాయి. జీవి నూతన దేహంలో ప్రవేశించే టప్పుడు పూర్వ వాసనలతో నిండి ఉన్న మనస్సుతో కలిసే ప్రవేశిస్తాడు. పూర్వ కర్మలకు సంబంధించిన ఫలాలను కూడా మనస్సే, అనగా సూక్ష్మదేహమే అనుభవిస్తుంది. పుణ్య పాప ఫలాలను భోగిస్తుంది. ఈ సూక్ష్మదేహంతో తాదాత్మ్యం చెందడం చేత జీవుడు భోక్తగా, ద్రష్టగా, శ్రోతగా, జ్ఞాతగా తెలుస్తూ ఉంటాడు. వాస్తవానికి భోక్త మనస్సే గాని జీవుడు కాడు. కనుక సూక్ష్మ శరీరము జీవునికి ఉపాధిగా తెలుస్తూ ఉంది.

**బహిర్ముఖాసక్తి**

శబ్దాది విషయాలన్నీ బాహ్య ప్రపంచం లోనే ఉన్నాయి. పూర్వ వాసన లన్నీ విషయ సంబంధం గానే ఉన్నాయి. దానికి తోడు ఇంద్రియాలు కూడా బాహ్య దృష్టి కలవి గానే సృష్టింపబడి ఉన్నాయి. సృష్టికర్తే అలా సృజించాడు అన్నది వేదం.

మ॥ **పరాంచి ఖాని వ్యతృణ త్స్వయం భూః**

**తస్మా త్పరాజ్ పశ్యతి నాంతరాత్మన్ ,**

బ్రహ్మదేవుడు ఇంద్రియాలను బహిర్ముఖం గానే సృష్టించాడు. అందుచేత మనిషి బాహ్యాన్నే చూస్తాడు. అంతరాత్మను చూడలేడు అన్నది కఠోపనిషత్.

మనం పూర్వ శ్లోక వ్యాఖ్యానంలో చెప్పుకున్నట్లు, ఇంద్రియ మనస్సులను భగవత్కార్యాలలో పవిత్రం చేసుకుంటే, తత్సంబంధమైన తాత్త్విక వాసనలే మనస్సులో నిక్షిప్తమై ఉంటాయి కనుక, బహిర్ముఖ మయ్యే సహజ స్వభావము ఇంద్రియ మనస్సులకు ఉన్నప్పటికీ, పూర్వ వాసనా జనిత పుణ్య సంస్కారం చేత అవి అంతర్ముఖమై, అంతరాత్మ వైపు పయనించే అవకాశం సాధకులకు లభ్య మౌతుంది.

*ఈ విధంగా పరమాత్మ స్వరూపుడైన జీవుడు దేహగతుడై ఉన్నా ఎందుకని మనుషులు గ్రహించలేక పోతున్నారు? చెబుతున్నాడు.*

**ఉత్క్రామన్తం స్థితం వాఽపి భుఞ్జానం వా గుణాన్వితమ్ ।**

**విమూఢా నానుపశ్యన్తి పశ్యన్తి జ్ఞానచక్షుషః ॥** 10

**ఉత్క్రామంతం-స్థితం-వా-అపి-భుంజానం-వా-గుణాన్వితం**

**విమూఢాః-న-అనుపశ్యంతి-పశ్యంతి-జ్ఞానచక్షుషః**

| | | | |
|---|---|---|---|
| ఉత్క్రామంతం | = ఉత్క్రమించే వానిని గాని | విమూఢాః | = అజ్ఞానులు |
| స్థితం వా అపి | = ఉన్న వానిని గాని | న అనుపశ్యంతి | = చూడలేరు |
| భుంజానం వా | = అనుభవించుచున్న వానిని గాని | జ్ఞానచక్షుషః | = జ్ఞానదృష్టి గలవారు |
| గుణాన్వితం | = గుణములతో గూడిన వానిని | పశ్యంతి | = చూస్తారు |

**అర్జునా! వెళ్ళేవాడు, ఉండేవాడు, అనుభవించే వాడు, గుణయుతుడు అయిన జీవాత్మను అజ్ఞానులు తెలుసుకో లేరు. జ్ఞాన నేత్రం కల వారు దర్శిస్తారు.**

### వ్యాఖ్య

ఈ లోకంలో సనాతనుడైన జీవుడు తన అంశయే, తన స్వరూపమే అని భగవంతుడు ఏడవ శ్లోకంలో చెప్పడం జరిగింది. దేహాది సంఘాతానికి ప్రభువైన జీవుడు పూర్వ దేహాన్ని విడిచిపెట్టే టప్పుడు గాని, మరొక శరీరంలో ప్రవేశించే టప్పుడు గాని, పుష్పము నందలి సుగంధమును వాయువు వెంట పెట్టుకొని పోయినట్లు, ఇంద్రియ మనస్సులను వెంట పెట్టుకొని పోతున్నాడు అని ఎనిమిదవ శ్లోకంలో ప్రవచించడం జరిగింది. దేహ గతుడై ఉన్నప్పుడు కూడా మనస్సును అధిష్ఠించి, ఇంద్రియాలతో ప్రత్యేకంగా సంగమిస్తూ, విషయాలను జీవుడు అనుభవిస్తున్నాడు అని తొమ్మిదవ శ్లోకంలో ప్రసంగించడం జరిగింది. ఈ విధంగా దేహాన్ని పరిత్యజించే టప్పుడు గాని ***( ఉత్క్రామన్తం, పరిత్యజన్తం దేహం పూర్వోపాత్తం )***, దేహస్థితుడై ఉన్నప్పుడు గాని ***( స్థితం వా దేహే తిష్ఠన్తం )***, గుణాలతో కూడి విషయాలను అనుభవిస్తు న్నప్పుడు గాని ***( భుంజాన వా శబ్దాదీన్, సుఖదుఃఖ మోహాద్యైః గుణైః అనుగతమ్ )*** - వీటన్నిటిలో జీవుని సన్నిధి సుస్పష్టంగా కనిపిస్తూ ఉండినా ***( అత్యన్త దర్శన గోచర ప్రాప్తం )***. ఎందుకని మానవులు గుర్తించలేక పోతున్నారు? ఎందుకని దర్శించలేక పోతున్నారు? అనేది ఆశ్చర్యకర మైన ప్రశ్న. ఈ సమస్య ప్రస్తుత శ్లోకంలో పరిష్కరింప బడుతూ ఉంది.

భగవంతుడు అందరికీ కావాలి. కాని, భగవంతుణ్ణి అందరూ తెలుసుకో లేరు. మోక్షం అందరికీ కావాలి.





కాని మోక్ష మేమిటో అందరూ అర్థం చేసుకో లేరు. అవసర మైతే అందరికీ ఉంది. కాని తీరే ఉపాయం అందరి వద్ద లేదు. జీవుడు ఆత్మస్వరూపమే కదా! జీవుని అస్తిత్వం అంతటా సుస్పష్టంగా ఉన్నా, ఎందుకని దర్శించ లేక పోతున్నారు? ఈ దుస్థితిని చూచి భగవంతుడు కూడా చలించి పోతున్నాడు అని ఈ సందర్భంలో శ్రీశంకరాచార్యస్వామి అనితర సాధ్యంగా భాష్యంలో ప్రవచించారు. అయ్యో! మానవులకు ఎంత కష్ట మొచ్చి పడింది అని భగవంతుడు జాలి పడుతున్నాడట ***( అహో కష్టం వర్తతే ఇతి అనుక్రోశతి చ భగవాన్! )***.

### సామీప్యమే గాని సందర్శనం లేదు

మరణానంతరము, దేహాంతరమును పొందుతున్న జీవుడు లింగ శరీరమును, లేదా సూక్ష్మ శరీరమును వెంట పెట్టుకొని పోవడం వల్లనే కదా స్థూలదేహం శవంగా పడి ఉంది? జీవుడు సూక్ష్మ దేహాన్ని వెంట పెట్టుకొని పోతున్నాడు అంటే, సూక్ష్మదేహం తన కన్నా అన్య మైనది అని అర్థం కాదా? స్థూలదేహం చలించడానికి కారణమైన లింగ దేహమును ఆకర్షించి ***( కర్షతి )*** వెంట తీసుకొని పోతున్న జీవుడు స్థూలదేహం కన్నా, లింగదేహం కన్నా కూడా విలక్షణుడు అని తెలుస్తూనే ఉన్నాడు కదా? దర్శనీయుడు గానే ఉన్నాడు కదా?

దేహంలో జీవుని యొక్క అస్తిత్వము లింగ శరీరము ఉండటం చేతనే నిరూపించ బడుతుంది. మరొక ఋజువు అవసరం లేదు. అందుకే సూక్ష్మ శరీరాన్ని లింగ శరీరం అన్నారు. లింగం అంటేనే గుర్తు, లేదా చిహ్నము అని అర్థము. జీవుడు ఉన్నాడు అనడానికి లింగ దేహమే గుర్తు ***( లింగ్యతే అనేన ఇతి లింగమ్ )***.

జీవించి ఉన్నప్పుడు చలిస్తూ ఉండిన స్థూలదేహం మరణానంతరం శవమై అచలంగా ఎందుకని పడి ఉంది? లింగ శరీరం స్థూల శరీరం నుండి విడిపడి పోయింది కనుక. సూక్ష్మదేహం స్థూలదేహంతో సంయుక్తమై ఉన్నప్పుడు స్థూలదేహం జీవిస్తూ ఉండింది కనుక జీవుడు ఉన్నాడని స్పష్ట మౌతూ ఉంది. సూక్ష్మదేహం విడిపడి పోగానే మరణం సంభవించింది. కనుక జీవుడు ఉన్నాడా, లేక ఉత్క్రమించాడా? అని తెలుసుకోవడానికి లింగ దేహమే గుర్తు. లింగదేహం ఉంటే జీవుడు ఉన్నాడని అర్థం. లింగదేహం పోతే జీవుడు కూడా స్థూలాన్ని విడిచి పెట్టాడు అని అర్థం. లింగ దేహాన్ని వెంట పెట్టుకొని వెళ్ళా డనేది సుస్పష్టం. మరణానంతరం కూడా జీవాత్మ ఉందని ఇంత స్పష్టంగా తెలుస్తూ ఉన్నా, మరణాన్ని జీవునికి ఆపాదించి అవివేకంతో మనుషులు దుఃఖిస్తున్నారు. అందుచేత జీవుడు ఉన్నట్లు తెలుస్తూ ఉన్నా, విమూఢులై ***( విమూఢాః )*** గుర్తించలేక పోతున్నారు ***( న అనుపశ్యన్తి )***.

*హృదయాకాశ మాత్రస్య వినాశే దేహనాశతః*

*వ్యర్థం భూతాని శోచన్తి నష్ట ఆత్మేతి శంకయా ॥*

హృదయ పుండరీకంలో పరమాత్మ స్వరూపమైన జీవాత్మ ఉండటం చేత దేహము జీవించింది. మరణంలో దేహము నశిస్తూ ఉంది. దేహ నాశము వల్ల హృదయాకాశము నశిస్తుందే గాని, హృదయ స్థితుడు, సనాతనుడైన జీవుడు నశించడం లేదు. దేహమే ఆత్మ అనే భావం దేహాత్మ భావం. ఈ దేహాత్మ భావం వల్లనే దేహము నశిస్తే జీవాత్మ నశించినట్లు మానవులు దుఃఖిస్తున్నారు.

### ఉన్నప్పుడు కూడా లేనట్లే

వెనుకటి దేహము నుండి ఉత్క్రమించి, మరొక దేహంలో లింగ శరీరంతో పాటు ప్రవేశించిన జీవుడు, ఆ దేహంలో శబ్దాది విషయాలను అనుభవిస్తున్నాడు. అలాగే సత్త్వరజస్తమో గుణాలతో కలిసి సుఖదుఃఖ మోహాలను అనుభవంలో అవలోకిస్తున్నాడు. మనస్సును అధిష్ఠించి విషయాలను ఇంద్రియాల ద్వారా అనుభవిస్తున్నాడు ***( మనః ప్రత్యేకమ్ ఇంద్రియేణ సహ అధిష్ఠాయ దేహస్థః విషయాన్ శబ్దాదీన్ ఉపసేవతే )***.

జడమైన ఇంద్రియ మనస్సులు దృశ్యములు. దృగ్రూపుడైన జీవాత్మ చైతన్యము. జీవ చైతన్యం యొక్క ప్రభావం చేతనే జడమైన దృశ్య వర్గము చలిస్తూ ఉంది. చెట్టుకొమ్మలు చలిస్తూ ఉంటే, వాయువు ఉందని గుర్తిస్తున్నామా లేదా? ఫ్యాను తిరుగుతూ ఉంటే, విద్యుచ్ఛక్తి ఉందని గుర్తిస్తున్నామా లేదా? మరి స్థూల, సూక్ష్మ దేహాలు చలిస్తూ ఉంటే, అందుకు కారణమైన జీవాత్మ దేహంలో భాసిస్తున్నాడని గుర్తించ మెందుకని? దీనికి కారణము అవివేకము. వివేకము లేక పోవడము. వివేకము లేని వారు మూఢులు. విమూఢులు. అందుచేత జీవిత కాలంలో స్థూల సూక్ష్మ దేహ వ్యాపారాదులలో జీవాత్మ సుస్పష్టంగా తెలుస్తూ ఉండినా, వివేకము లోపించిన కారణంగా విమూఢులు దర్శించలేక పోతున్నారు ***(విమూఢాః న అనుపశ్యన్తి)***.

## జ్ఞానులకు దర్శనీయం

అవివేకం వల్ల, అజ్ఞానం వల్ల, మూఢత్వం వల్ల జ్ఞానం లేని వారు సుస్పష్టంగా దర్శన గోచర మవుతున్నా జీవాత్మను తెలుసుకోలేక పోతూ ఉంటే, జ్ఞానచక్షువులు గల విజ్ఞానులు ఆత్మను చక్కగా దర్శిస్తున్నారు అంటున్నాడు ***(పశ్యన్తి జ్ఞాన చక్షుషః)***.

విమూఢులు ఆత్మ దర్శనం చేయలేక పోవడానికి అజ్ఞానము కారణము. విజ్ఞానులు ఆత్మను దర్శించ డానికి జ్ఞానమే కారణము. జ్ఞానమును ప్రమ అంటారు. ప్రమను, అనగా జ్ఞానమును కలిగించేది ప్రమాణము. అదే శాస్త్రము. వేదాంత శాస్త్రము. ప్రమాణం ఉన్నప్పుడు ప్రమ కలగక పోవడ మనేది ఉండదు. అట్టి వేదాంత శాస్త్ర జ్ఞానమును గురూపదేశం వల్ల ఎవరైతే గ్రహిస్తారో వాళ్ళకి జ్ఞానం ప్రాప్తిస్తుంది. వారి బుద్ధి జ్ఞానమయ మవుతుంది. వారి దృష్టి జ్ఞానదృష్టిగా మారుతుంది. దీనినే శాస్త్ర పరిభాషలో జ్ఞాన చక్షువు అంటారు. ఇట్టి జ్ఞానచక్షువు గల వారు అంతటా స్పష్టంగా భాసిస్తున్న ఆత్మను సహజంగా దర్శిస్తారు ***(యే తు ప్రమాణ జనిత జ్ఞాన చక్షుషః తే ఏవం పశ్యన్తి జ్ఞాన చక్షుషః వివిక్త దృష్టయః ఇత్యర్థః)***. వీరే వివేకులు. ఆత్మను చక్కగా అవలోకించే వారు.

వివేకులు జ్ఞాన చక్షువు కల వారు కావడం చేత ఆత్మను దర్శిస్తారు. ఈ జ్ఞానం శాస్త్రం నుండి వారికి ప్రాప్తించింది. ఇది ప్రమాణ జనిత జ్ఞానము. మరి విమూఢులు ఆత్మను దర్శించలేక పోవడానికి కారణం అజ్ఞానము అని అంటున్నాము కదా! జ్ఞాన మైతే శాస్త్రము నుండి వస్తుంది. మరి అజ్ఞానం ఎక్కడ నుండి వస్తుంది?

వెలుతురు దీపం నుండి వస్తుంది అని చెప్పగలం. చీకటి ఎక్కడి నుండి వస్తుంది అంటే ఏమి చెప్ప గలం? చీకటి ఎక్కడి నుండో రాదు. ఉంటుంది. రాకుండానే ఉంటుంది. అజ్ఞానం కూడా అంతే. అజ్ఞానం ఎక్కడి నుండో రాదు. ఉంటుంది. రాకుండానే ఉంటుంది. అదెలా? ఎక్కడో ఒక చోట నుండి అజ్ఞానం వచ్చి ఉండాలి. లేదా ఒక సమయంలో కదిలి ఉండాలి అంటారా! ఏమో! ఇది అంతు పట్టని విషయం. అందుకే అజ్ఞానాన్ని అనాది అన్నారు. అనాది అంటే ఆది లేనిది అని అర్థము. ఆది లేని దానికి అంతం కూడా ఉండదు కదా! మరి అజ్ఞానం ఎలా పోతుంది? జ్ఞానం ఎలా వస్తుంది?

చీకటి ఎప్పటి నుండి ఉంది? దాని ఆది ఎక్కడ? తెలియదు. మరి అనాదిగా ఉన్న చీకటి, దీపం వెలిగించ గానే అంతం అవుతుందా లేదా? అజ్ఞానం కూడా అంతే. అజ్ఞానం ఫలాన సమయంలో ఆరంభమైంది అని ఎవరైనా చెప్పారనుకోండి. దాని అర్థ మేమిటి? అంతకు ముందు అజ్ఞానం లేదు అని అర్థం. అప్పుడే అది ఆరంభం అనబడుతుంది. సరే, అజ్ఞానం ఆరంభం కాక ముందు అజ్ఞానం లేదు. మరేముంది? జ్ఞాన ముంది. అంతేనా? అంతే. మరి, జ్ఞాన మున్నప్పుడు, అజ్ఞాన మెలా ఉంటుంది? లేని అజ్ఞానం ఎలా ఆరంభ మౌతుంది?





ఈ ప్రశ్నల సుడిలో దూరడం కన్నా, అజ్ఞానం అనాది అనే వాస్తవాన్ని అంగీకరించి సుడులకు, ముడులకు దూరంగా ఉండటం మంచిది. అజ్ఞానము అనాదే అయినా, జ్ఞానప్రాప్తిలో అంతమై పోతుంది.

*మరి, ప్రమాణ విచార ఫలితంగా శాస్త్ర జ్ఞానాన్ని పొందుటకు ప్రయత్నించిన వారందరికీ ఆత్మదర్శన మవుతుందా? ఏమో! కావచ్చు. కాకపోవచ్చు. చదవండి.*

**యతన్తో యోగిన శ్చైనం పశ్య న్త్యాత్మ న్యవస్థితమ్ ।**
**యత న్తోఽప్యకృతాత్మానో నైనం పశ్య న్త్యచేతసః ॥** **11**

***యతంతః-యోగినః-చ-ఏనం-పశ్యంతి-ఆత్మని-అవస్థితం***
***యతంతః-అపి-అకృతాత్మానః-న-ఏనం-పశ్యంతి-అచేతసః***

| | | | | | |
|---|---|---|---|---|---|
| యోగినః | = | యోగులు | అకృతాత్మానః | = | సంస్కరింప బడని వారు |
| యతంతః | = | ప్రయత్నించు వారు | అచేతసః | = | వివేకం లేని వారు |
| ఆత్మని | = | ఆత్మ యందు | యతంతః అపి | = | ప్రయత్నించు వారైనప్పటికి |
| అవస్థితం | = | ఉన్నటు వంటి | ఏనం | = | ఈ ఆత్మను |
| ఏనం | = | ఈ ఆత్మను | న చ పశ్యంతి | = | చూడలేరు |
| పశ్యంతి | = | చూస్తున్నారు | | | |

**అర్జునా! ప్రయత్నము చేసే యోగులు తమ స్వరూపమైన ఆత్మను దర్శిస్తున్నారు. అభ్యాసపరు లైనను అజ్ఞానులు పరమాత్మను దర్శించలేక పోతున్నారు.**

### వ్యాఖ్య

ప్రమాణ జనిత జ్ఞానము కల వారు జ్ఞానదృష్టి కల వారు. జ్ఞాన నేత్రం కల వారు. అట్టి వారు ఆత్మను దర్శిస్తారు అని పూర్వ శ్లోకంలో చూశాం. కేవలం ప్రమాణ జనిత జ్ఞానము చేతనే ఆత్మజ్ఞానము సిద్ధిస్తుందా అనేది శంక. కొందరు ప్రయత్నించి ఆత్మను దర్శించ గలుగు తున్నారు. కొందరు ప్రయత్నించినా ఆత్మను దర్శించలేక పోతున్నారు. అందుకే ఈ మీమాంస. ప్రయత్నం చేసి ఆత్మ దర్శనం చేసే వారు యోగులు. ప్రయత్నించినా ఆత్మను దర్శించలేని వారు అకృతాత్ములు. అచేతసులు.

మన మేదైనా పొందాలనుకున్నపుడు ఆ పొంద వలసింది మన కన్నా అన్యమైనది, దేశకాలాదులలో దూరంగా ఉన్నది అయినపుడు దానిని యత్నించి కర్మ ద్వారా పొంద వలసి ఉంటుంది. కాని, మనం పొందాలి అనుకున్నది మన కన్నా అన్యమైనది కానపుడు, లేక మనమే అయినపుడు దానిని కర్మ ద్వారా పొందే ప్రసక్తే లేదు. మనం పొందాలి అనుకున్నది మన వద్దే ఉన్నప్పుడు, లేదా మనమే అయినపుడు, దానిని పొందడానికి ఏకైక మార్గము జ్ఞానమే. వస్తువు ఉన్నదే కనుక, ఉన్నది అనే జ్ఞానాన్ని పొందితే సరిపోతుంది. ఇక్కడే శాస్త్రం ప్రమాణ మైంది. *ప్రమాకరణం ప్రమాణం* - జ్ఞానమును కలిగించేది ప్రమాణం కనుక ప్రమాణ జనిత జ్ఞానం మనకు జ్ఞాన చక్షువును ప్రసాదిస్తుంది. తద్వారా ఆత్మదర్శన మవుతుంది.

చూచే కళ్ళు నా కున్నాయి. కనుక ఎవరి ముఖాన్నైనా నేను చూడ గలను. నాకూ ముఖ ముంది. కాని, నా ముఖాన్ని నా కళ్ళతో నేను చూసుకోలేను. ఒకవేళ నా ముఖాన్ని నా కళ్ళ తోనే నేను చూసుకోవాలి అనేది గమక నా అభిమత మైతే, నా ముఖాన్ని ప్రతిబింబించే వస్తువులో దానిని చూసుకోవడం కన్నా మరో మార్గం లేదు. అలా ప్రతిబింబించేది అద్దం కావచ్చు. లేదా ఉదకం కావచ్చు.

నీ సత్య స్వరూపము ఆత్మే. నీవే ఆత్మ. ఆత్మే నీవు. అలాంటప్పుడు నిన్ను నీవు ఎలా దర్శించ గలవు? కనుక నీ స్వరూపాన్ని ప్రతిబింబించేది ఏదైనా కావాలి. అప్పుడే అందులో నిన్ను నీవు దర్శించ గలవు. అలా ప్రతిబింబించే దర్పణమే శాస్త్రము. వేదాంతము. అద్దంలో ముఖం కనిపించినట్లు శాస్త్రంలో మనల్ని మనం దర్శించ గలం ***( దర్పణే ముఖ దర్శనవత్ శాస్త్రే ఆత్మ దర్శనం ).***

ఇక్కడ అతి ప్రధానమైన విషయం ఒకటుంది. మనిషి అద్దాన్ని చూచేది తన ముఖాన్ని చూసుకోవడానికే గాని, అద్దాన్ని చూడటానికి కాదు. అలాగే జిజ్ఞాసువు ప్రమాణ విచారము చేసేది, కేవలం ప్రమాణ విచారం కొరకు కాదు, స్వరూప దర్శనం కోసం. అద్దం మనకు అభిముఖంగా ఉన్నప్పుడు, మన దృష్టిలో ఏ లోపం లేనపుడు ప్రతిబింబ దర్శనము జరగక పోయే ప్రసక్తే లేదు. అలా కాకుండా, దర్పణం పరిశుద్ధంగా ఉన్నా, ముఖానికి అభిముఖంగా అమర్చ బడినా, చూచే వ్యక్తికి చత్వార ముంటే, రూప దర్శనం కాకపోవచ్చు. ఒకవేళ అయినా, అనేక విధాలుగా, వికృతాకారంగా కనిపించ వచ్చు.

### ఆత్మదర్శన యోగులు

అర్జునా! సమాహిత చిత్తులైన యోగులు ***( యోగినః )*** ప్రయత్నశీలురై ***( యతన్తః ప్రయత్నం కుర్వన్తః )*** స్వతస్సిద్ధ మైన ఆత్మను ***( ఆత్మని స్వస్యాం బుద్ధౌ అవస్థితం )*** దర్శిస్తున్నారు ***( పశ్యన్తి ).*** ఏ ఆత్మ స్వరూపమును గూర్చి మనం విచారిస్తున్నామో, ఆ ఆత్మను తమ బుద్ధి యందు 'ఇది నేను' అని దర్శిస్తున్నారు ***( అయమ్ అహమస్మి ఇతి ఉపలభన్తే, ).*** ఆత్మ, ఆత్మజ్ఞానము వేరు కానందున, ఆత్మజ్ఞానము వల్ల ఆత్మ దర్శింప బడుతోంది. ఈ విధంగా శాస్త్రకృప, ఆచార్యకృప, ఆత్మకృప, ఈశ్వరకృప అనే చతుర్విధ కృపలను పొందిన వ్యక్తి, ఇంద్రియ మనస్సులను నియమించి, శ్రవణ మనన నిదిధ్యాసల ద్వారా జ్ఞానసిద్ధి కొరకు యత్నించి ఆత్మను దర్శిస్తాడు. అలా దర్శించే వారే యోగులు.

***శ్లో॥ లక్ష్యైకతాం సమాసాద్య నిర్వికారత యాత్మని ।***
***మనసో నిశ్చలత్వేన స్థితి ర్యోగ ఇతీర్యతే ॥***

'లక్ష్యము నందే ఏకాగ్రతను సాధించి, మనస్సును ఆత్మ యందే నిశ్చలంగా, నిర్వికారంగా నిలపడమే యోగము'. తీవ్రమైన మోక్ష కాంక్ష, పటుతరమైన వైరాగ్యము చేత బాహ్య విషయ విరక్తితో స్వాత్మ యందే సమాహిత చిత్తులైన యోగులు తప్పక ఆత్మను దర్శిస్తారు.

### దర్శన అయోగ్యులు - అకృతాత్ములు

ప్రయత్నించిన యోగులు జ్ఞానార్హులు కావడం చేత ప్రమాణ విచారం చేసి ఆత్మ దర్శనం చేయగలరు. ప్రయత్నం చేసినా యోగ్యత లేని వారు ఆత్మను దర్శించ లేరు. సాధన సంపత్తి లేని అయోగ్యులు శాస్త్ర ప్రమాణమును గ్రహించినా ఫలితాన్ని పొందలేరు. వారి విషయంలో ప్రమాణం ఫలించదు. అలా ప్రయత్నించినా పొందలేని వారు అకృతాత్ములు.

అకృతాత్ములు అంటే సంస్కరింప బడని చిత్తము కల వారు ***( అకృతాత్మనః అసంస్కృత ఆత్మానః ).*** తపశ్శక్తి లేని వారు. ఇంద్రియాలను జయించలేని వారు. దురాచారమును విరమించని వారు. దర్పాభిమానాల చేత కలుషితమైన అంతఃకరణము కల వారు. అశాంత చిత్తులు. ఇలాంటి అచేతస్కులు ***( అచేతసః అవివేకినః )*** ఎంతగా ప్రయత్నిస్తు న్నప్పటికి ***( ప్రయత్నం కుర్వన్తః అపి )*** ఈ ఆత్మను దర్శించ లేరు ***( న ఏనం పశ్యన్తి ).*** బాహ్య విషయ వాసనల చేత కలుషితమై ఉన్నందున వారి చిత్తము వశీకృతం కాదు. అందుచేత ప్రమాణము ఫలించదు.





***మం॥ కుశలా బ్రహ్మ వార్తాయాం వృత్తి హీనా సురాగిణః***
***తే ప్య జ్ఞాన తయా నూనం పునరాయాన్తి యాన్తి చ ॥***

'విషయాల యందు అనురాగము కలిగి, చిత్తమును నిరోధించలేని వారు ప్రమాణ విషయంలో కుశలత్వము కలిగిన వారైనను జనన మరణాల మధ్య తిరుగుతూ ఉంటారే గాని మోక్షాన్ని పొందలేరు' అని తేజోబిందూపనిషత్తు.

*సర్వాత్మకమైన బ్రహ్మపదమును, మోక్ష ధామమును ఉపదేశించుటకు ఉపక్రమిస్తూ వరుసగా నాలుగు శ్లోకాలలో విభూతుల సంక్షేపాన్ని వివరిస్తున్నాడు.*

**య దాదిత్యగతం తేజో జగ ద్భాసయతేఽఖిలమ్ ।**
**య చ్చన్ద్రమసి య చ్చాగ్నౌ త త్తేజో విద్ధి మామకమ్ ॥** 12

***యత్-ఆదిత్యగతం-తేజః-జగత్-భాసయతే-అఖిలం***
***యత్-చంద్రమసి-యత్-చ-అగ్నౌ-తత్-తేజః-విద్ధి-మామకం***

| | | | |
|---|---|---|---|
| యత్ | = ఏ | చంద్రమసి | = చంద్రుని యందున్నదో |
| తేజః | = తేజస్సు | యత్ | = ఏది |
| ఆదిత్యగతం | = సూర్యుని యందు ఉన్నదై | అగ్నౌ చ | = అగ్ని యందున్నదో |
| అఖిలం | = సమస్త | తత్ | = అట్టి |
| జగత్ | = లోకమును | తేజః | = తేజస్సును |
| భాసయతే | = ప్రకాశింప చేస్తున్నదో | మామకం | = నాకు సంబంధించినది అని |
| యత్ | = ఏది | విద్ధి | = తెలుసుకో |

**అర్జునా! సూర్యునిలో ఉండి లోకాన్నంతా వెలిగిస్తున్న ప్రకాశము, చంద్రుని యందున్న వెలుగు, అగ్ని యందున్న తేజస్సు - అంతా నాదే నని తెలుసుకో!**

**వ్యాఖ్య**

అది బ్రహ్మపదము. పరంధామము. సూర్యచంద్రాగ్నులు ప్రకాశింప చేయ లేనిది. ఆ పరమ పదమును చేరిన ముముక్షువులు తిరిగి సంసారంలో ప్రవేశించరు ***( యత్ప్రాప్తాః ముముక్షవః పునః సంసారాభిముఖా న నివర్తన్తే ).*** ఉపాధి భేదాన్ని బట్టి ఘటాకాశము మహాకాశమునకు అంశ మైనట్లు, జీవులు ఆ బ్రహ్మపదానికి అంశరూపులై సంసారంలో పరిభ్రమిస్తున్నారు. అట్టి బ్రహ్మధామము సర్వాత్మకమే గాక సర్వ వ్యవహారాస్పదము కూడా. అంటే, తాను స్వరూపతః దివ్యంగా భాసించడమే గాక, సమస్తమును ప్రకాశింప చేస్తూ సర్వ వ్యవహారము లందు భాసక చైతన్యముగా కూడా ఉంది. ఈ సత్యాన్ని ప్రవచించ డానికి భగవంతుడు ప్రస్తుత శ్లోకం నుండి వరుసగా నాలుగు శ్లోకాలలో విభూతి వైభవాన్ని సంక్షేపంగా బోధిస్తున్నాడు.

### దీప్తి మంతము

దేనిని పొందిన తరువాత తిరిగి సంసారంలో ప్రవేశించరో, దేనిని సూర్యచంద్ర నక్షత్రాగ్నులు ప్రకాశింప చేయలేవో, ***తత్*** - ఆ ధామమే నా పదము అని భగవంతుడు ఆరవ శ్లోకంలో దేనిని గూర్చి ప్రబోధించాడో దానినే ప్రస్తుత శ్లోకంలో ***యత్*** - ఏదయితే అంటూ శ్లోకారంభం చేస్తున్నాడు. అది ఏది? ***( కిం తత్ ?).*** అది దీప్తి, లేదా ప్రకాశము ***( తేజః ).*** ఆ ప్రకాశము సూర్యుణ్ణి ఆశ్రయించుకొని ***( ఆదిత్య గతం ఆదిత్యాశ్రయం )*** సమస్తమైన ప్రపంచాన్ని ప్రకాశింప చేస్తూ ఉంది ***( జగత్ భాసయతే ప్రకాశయతి అఖిలం సమస్తం ).*** చంద్రునిలో,

అగ్నిలో ఉన్న ప్రకాశము కూడా అదే. ఆ తేజస్సు పరమాత్మదే (***తత్ తేజః విద్ధి మామకమ్***). పరమాత్మకు సంబంధించినదే. ఇది, శ్లోక భావం.

బ్రహ్మము ప్రకాశైక స్వరూపము. సమస్తములో ఉన్న ప్రకాశము తానే. స్థావర జంగమాల లోని ప్రకాశ మంతా తానే. అలాంటప్పుడు ***యదాదిత్య గతం తేజః*** అంటూ సూర్యుణ్ణి మాత్రమే ఉదహరిస్తూ ఎందుకు చెప్పవలసి వచ్చింది? విద్యు ద్దీపంలో ఉన్నది తాను కాదా? అనే ప్రశ్న ఇక్కడ ఉత్పన్న మవుతుంది. ఈ విధమైన దోషము బ్రహ్మములో లేదు (***న ఏష దోషః***).

చైతన్య ప్రకాశము సమస్తము నందు ప్రకాశిస్తూ ఉన్నా, ఎక్కడ సత్త్వము అధికంగా ఉంటుందో, అక్కడ చైతన్య జ్యోతిస్సు అధికంగా ఆవిష్కృత మవుతుంది. ఆదిత్యాదులలో అత్యంత ప్రకాశవంత మైన సత్త్వము ఉంది. అందుచేత వాటిలో ప్రకాశము అధికోత్కర్షంతో ఉంటుంది. సమస్త ప్రపంచములో ప్రకాశిస్తున్న చైతన్య జ్యోతి ఆదిత్యాదులలో తరతమ భేదాన్ని అనుసరించి విశేషంగా వ్యక్తం కావడం చేత ఆదిత్యాదులను ఉదాహరణగా చెప్పడం జరిగిందే గాని, చైతన్య ప్రకాశము ఆదిత్యాదులకే పరిమిత మని గాని, అది అన్యత్ర అభాస మని గాని అర్థం కాదు. ఇక్కడ మరొక సూక్ష్మాంశాన్ని కూడా అర్థం చేసుకోవాలి. ఆదిత్యాదులు చైతన్య ప్రకాశాన్ని అధికంగా వ్యక్తం చేయడం వల్ల అలా ఉదహరించడం జరిగిందే గాని, ఆదిత్యాదులలో అధికంగా చైతన్య ప్రకాశం ఉందని కాదు (***న తు తత్రైవ తత్ అధికమ్ ఇతి***). ఈ విశేషాన్ని ముఖ్యంగా గుర్తించాలి.

మన ముఖమును అద్దము ప్రతిబింబించినట్లు కట్టెలు, గోడలు ప్రతిబింబించవు కదా! ఏది స్వచ్ఛమో, సత్త్వ ప్రధానమో దాని యందే ప్రతిబింబము గోచరిస్తుంది. స్వచ్ఛమైన దానిలో స్పష్టంగా తెలిసేది స్వచ్ఛతర మైన దానిలో సుస్పష్టంగా తెలుస్తుంది (***స్వచ్ఛే స్వచ్ఛతరే చ తారతమ్యేన ఆవిర్భవతి***). అంతే గాని సర్వావ భాసకమైన ప్రకాశమును పరిమితం చేయడం సాధ్య పడదు.

**గీతోపనిషత్**

***న తద్భాసయతే సూర్యః*** అంటూ ఆరంభమైన ఆరవ శ్లోకాన్ని కఠ, ముండక, శ్వేతాశ్వతర ఉపనిషత్తుల లోని ***న తత్ర సూర్యోభాతి న చంద్ర తారకం*** అనే మంత్రాన్ని ఉటంకిస్తూ చర్చించడం జరిగింది. గీత ఉపనిషత్తుల సారమని ప్రత్యేకంగా చెప్ప నవసరం లేదు. ఈ ఉపనిషత్ మంత్రం లోని పూర్వార్ధానికి ఆరవ శ్లోకం వ్యాఖ్యానం కాగా, ఉత్తరార్ధానికి (***తమేవ భాన్త మనుభాతి సర్వం తస్య భాసా సర్వ మిదం విభాతి***) ప్రస్తుత శ్లోకం వ్యాఖ్యానము. ఒక వైపు భగవద్గీత ఉపనిష త్సారాన్ని అందిస్తూ ఉంది. మరొక వైపు ఉపనిషత్తులను వ్యాఖ్యానిస్తూ కూడా సాగుతూ ఉంది. ఆదిత్యాదులు తనను ప్రకాశింప చేయ లేవు అని ఆరవ శ్లోకంలో ప్రవచించిన ఆదిదేవుడు, ఆదిత్యాదుల లోని ప్రకాశము తన విభూతియే నని ప్రస్తుత శ్లోకంలో ప్రస్ఫుటం చేస్తున్నాడు.

జీవు లందరూ పరమాత్మ అంశరూపులే కనుక, తమ ఆత్మనే పరమాత్మ స్వరూపంగా భావించాలి అని ఆరవ శ్లోకంలో తెలిపిన గీతాచార్యుడు, ఇప్పుడు, కేవలం అంతరంగము నందే గాక బాహ్యంలో సర్వత్ర నిండి నిబిడీ కృతమైన సర్వాత్మ స్వరూపాన్ని విభూతులలో దర్శించి ఉపాసించే దివ్య సాధనను తెలిపే ప్రయత్నంలో ప్రస్తుత శ్లోకము మొదలుకొని వరుసగా నాలుగు శ్లోకాలలో విభూతి సంక్షేపాన్ని వివరిస్తున్నాడు. దీనిని ఓ విధంగా, విశ్వరూపోపాసనగా సాధకులు భావించ వచ్చు.

**శూషోహవై వార్ష్ణేయ ఆదిత్యేన సమాజగామ**

శోషణ శక్తి కలిగిన (***శూషః***) శ్రీకృష్ణుడు (***వార్ష్ణేయః***) సూర్యునితో కలిశాడు (***ఆదిత్యేన సమాజ గామ***) అని తైత్తిరీయ బ్రాహ్మణము నందు ఉంది.





సూర్య చంద్ర నక్షత్రాగ్నుల లోని దివ్యమైన ప్రకాశమును పరమాత్మ విభూతులుగా భావించి ఉపాసించడం వలన దురిత క్షయమే గాక, అంతఃకరణ శుద్ధి కలిగి, తద్వారా బ్రహ్మజ్ఞానము సిద్ధిస్తుంది. ద్వాదశాదిత్యులలో తాను విష్ణు వని, తేజస్సు గల వాటిలో తాను సూర్యుడని గీతాచార్యుడే సందేశాన్ని అందించాడు కదా! (*10 వ అ - 21 శ్లో*).

*మరి కొన్ని విభూతులను చెబుతున్నాడు.*

గా మావిశ్య చ భూతాని ధారయా మ్యహ మోజసా ।
పుష్ణామి చౌషధీః సర్వాః సోమో భూత్వా రసాత్మకః ॥ 13

***గాం-ఆవిశ్య-చ-భూతాని-ధారయామి-అహం-ఓజసా***
***పుష్ణామి-చ-ఓషధీః-సర్వాః-సోమః-భూత్వా-రసాత్మకః***

| | | | | | |
|---|---|---|---|---|---|
| అహం | = నేను | | రసాత్మకః | = | రస స్వరూపుడగు |
| గాం | = | భూమిని | సోమః | = | చంద్రుడు |
| ఆవిశ్య | = | ప్రవేశించి | భూత్వా | = | అయి |
| భూతాని | = | భూతములను | సర్వాః | = | సమస్తమైన |
| ఓజసా | = | శక్తి చేత | ఓషధీః చ | = | ఓషధులను |
| ధారయామి చ | = | ధరిస్తున్నాను | పుష్ణామి | = | పోషిస్తున్నాను |

**అర్జునా! నేను భూమిలో ప్రవేశించి నా అసమాన శక్తితో సమస్త భూతాలను ధరిస్తున్నాను. రస స్వరూపు డైన చంద్రుణ్ణై ఓషధు లన్నిటిని నేనే పోషిస్తున్నాను.**

**వ్యాఖ్య**

సర్వ్వలను, సమస్తమును ధరించునది ధరణి (***ధారయతి***). సమస్తమును ధరించునది ధరణి అయితే, ధరణిని ధరించు వాడు కనుక భగవంతుడు ధరణీధరుడు (***ధరణీం ధత్తే ఇతి ధరణీధరః***). భూధరుడు, భూపతి. భూమికి అధిష్ఠానంగా శోభించే వాడు. సత్తామాత్రుడు. ***భూః సత్తాయామ్*** - సత్తామాత్ర మైనది భూమి. ***భువనం, సత్తా, మహీవా!*** - సత్తా కలది కనుక ఇది భూమి. ఆ సత్తాయే మహిమ. మహిమ కలది కనుక భూమి మహి అయింది. వాస్తవానికి సత్తారూపుడు భగవంతుడే కనుక, మహిలో మహిమ ఏదైనా సర్వాధారుడైన సర్వేశ్వరునిదే.

**ధారణ శక్తి**

'గాం' అంటే భూమి. భగవంతుడు భూమి యందు ప్రవేశించి తన తేజస్సు చేత సర్వ భూతాలను, స్థావర జంగమాత్మక మగు సమస్తమును ధరిస్తున్నాడు. ఇదే ధారణ శక్తి. ఆధార వస్తువులో అగుపించే ఓజస్సు, లేదా బలం.

భూమికి ధారణ శక్తి ఉంది కనుక, భూమాతను ధరణీమాత అంటాము. ఎంతటి భారాన్నైనా మోసే శక్తి భూమి కుంది. అదే భూశక్తి. శక్తి ఉన్నందునే భూమి నిలబడి ఉంది. శక్తి ఉన్నందునే తిరుగుతూ ఉంది. నిలబడాలన్నా, తిరగాలన్నా శక్తి అవసరం. శక్తి లేకపోతే ఏదైనా, ఎవరైనా కూలబడ వలసిందే. భూదేవికి కులుకు తెలుసే గాని కూల బడటం తెలియదు. చుట్టూ నీరు తడుపుతూ ఉన్నా, యుగాల తరబడి కరగకుండా నిలబడి ఉంది. అంత బరువైన దైనా ఆకాశంలో వేగంగా తిరుగుతూ ఉంది. మట్టిగడ్డ లాగా విరిగి పోలేదు. మట్టికుండ లాగా పగిలి పోలేదు. ఎందుకో తెలుసా! ఇక్కడ, అంటే అవనిలో నిక్షిప్తమై ఉండేది బలమే గాని భారము కాదు. అదే భూమి లోని ఆకర్షణా శక్తి.

మరి, భూమి లోని శక్తి భూమికి సంబంధించిం దేనా? కాదు. అన్నిటిని ధరించే శక్తి భూమి దైతే, భూమిని ధరించే వాడు భగవంతుడు. అతడే సత్తా స్వరూపుడు. సమస్తమును ధరించే వాడు. అతని చేత ధరింప బడేది ధరణి ***(ధ్రియతే)***. కనుక, భూమి లోని బలం భూమిది కాదు, భూపతిది.

మట్టిగోడలో ఏముంది? మట్టే ఉంది. మరి, మట్టిని కుప్ప పోస్తే గోడ లాగా గట్టిగా ఉండ దెందుకని? అలా ఉండే టట్టైతే, ఇంటి చుట్టూ మట్టిగోడ నిర్మించు కోవడం కన్నా మట్టినే గుట్టగా పోసుకుంటే సరిపోతుంది కదా! పోసుకోవచ్చు. అలా పోసుకున్నది గాలికి ఎగిరి పోవచ్చు. వర్షానికి తడిసి కరిగి పోవచ్చు. కాని, గోడ గాలికి ఎగిరి పోదు. వర్షానికి కరిగి పోదు. అది రాశి పోసిన దుమ్మూ కాదు, కుప్ప పోసిన ధూళీ కాదు. నీటితో తడిపిన మట్టితో కట్టిన గోడ. నీటి యొక్క జిగట బలం గోడంతా వ్యాపించి ఉంది. అందుకే గోడ గట్టి దైంది. మట్టి బరువుకి, గోడ బలానికి ఇదే తేడా. మట్టిగా బలం లేనిది గోడగా బల మైనది కావడానికి జిగట బలం కలిగిన జలం గోడంతా వ్యాపించి ఉండటము ఎలా కారణమో, సమస్తాన్ని భరించే శక్తి భూమికి ఉండటానికి భగవానుడు ఓజశ్శక్తితో భూమిలో ప్రవేశించి ఉండటమే కారణము. అర్జునా! ఈ విధంగా నేను భూమిలో ప్రవేశించి ***( గాం పృథివీం ఆవిశ్య )*** నా తేజస్సు చేత, నా బలం చేత ***( ఓజసా బలేన )*** సమస్త భూతాలను, భూతాలను మోసే భూమిని ***(భూతాని జగత్)*** నిలబెడు తున్నాను ***(అహం ధారయామి)***.

వాయువు మేఘాలలో ప్రవేశించి జలాలను ధరిస్తున్నదా, లేదా? విచారించి చూస్తే, మేఘ రూపంలో ఉన్నది వాయువే కదా? వాయువు కన్నా వేరుగా మేఘ మండలానికి ప్రత్యేకమైన అస్తిత్వ మేది? చలించే వాయువును మేఘ రూపంలో నిలిపి ఉంచే బలము ఏదైతే వాయువులో ఉందో అది వాస్తవానికి వాసుదేవుని ఓజస్సే. భగవంతుని తేజస్సే. చల్లని అయఃపిండము, అంటే ఇనుపగుండు వేడిగా, ప్రకాశవంతంగా ఉండ టానికి అయఃపిండము నందు వ్యాపించి ఉన్న అగ్ని తేజము ఎలా కారణమో, అలాగే ఈ విశ్వంలో ఉన్న సత్తా స్ఫురణలకు భగవంతుడే ఆధారము. అదే ధరణిలో ధారణా శక్తి. దైవబలం. ***స దాధార పృథివీం*** - ఆ భగవంతుడే భూమిని ధరించాడు అని తైత్తిరీయ సంహిత. ఈ విధంగా సర్వేశ్వరుడు సర్వాధారుడు.

ఆధార ఆధేయ సంబంధ విషయంలో సూక్ష్మ స్థూలాలను ప్రధానంగా పరిగణన లోకి తీసుకోవాలి. ఎప్పుడైనా, ఎక్కడైనా స్థూలాన్ని సూక్ష్మం ధరిస్తుందే గాని, సూక్ష్మాన్ని స్థూలం ధరించ లేదు.

పృథివి స్థూలం. పృథివి కన్నా జలం సూక్ష్మం. సూక్ష్మమైన జలం స్థూలమైన పృథివిని ధరించ గలదే గాని, స్థూలమైన పృథివి సూక్ష్మమైన జలాన్ని ధరించ లేదు. అలాగే సూక్ష్మమైన జలాన్ని అంతకంటే సూక్ష్మమైన అగ్ని ధరిస్తుంది. అగ్ని కంటే సూక్ష్మమైన వాయువు అగ్నిని ధరిస్తుంది. వాయువు కంటే సూక్ష్మమైన ఆకాశము వాయువును ధరిస్తుంది. అంతేగాని, స్థూలమైన వాయువు సూక్ష్మమైన ఆకాశాన్ని ధరించ లేదు. కనుక వాయువు ఆధేయ మైతే, ఆకాశము ఆధార మైంది. ఆధారము ఎప్పుడూ సూక్ష్మమే. ఆధారంతో పోల్చి చూస్తే ఆధేయం ఎప్పుడైనా స్థూలమే.

ఇలా చూచి నపుడు పంచభూతాలలో ఆకాశము అన్నిటి కన్నా సూక్ష్మము. సర్వభూతాధారము. కాని, పరమేశ్వరుని నుండే ఆకాశం ఆవిర్భవించడం చేత ***( తతః ఆకాశః సంభూతః )*** సూక్ష్మమైన ఆకాశము ఆధేయము కాగా, ఆకాశానికి ఆధారమైన పరమాత్మ సర్వాధారుడుగా శోభిస్తున్నాడు. కనుక పరమాత్మ సూక్ష్మాతి సూక్ష్మ రూపుడు. ఆదికారణ మైన వాడు ***(ఆకాశాదే రపి సూక్ష్మతరమ్)***. తనకు మరొక ఆధారం లేని నిరాధారుడు సృష్టికి సర్వాధారుడు. సర్వ శక్తిమంతుడు.

ప్రాణు లన్నీ జీవించడానికి ప్రాణం ఆధారము. ప్రాణం లేకుండా జీవము కొనసాగదు. ప్రాణం వల్లనే జీవం కొన సాగుతుంది. కాని, పోషణ లేకపోతే, జీవం నిర్జీవ మవుతుంది.





మొక్కలలో ప్రాణం ఉంది. మొక్కలు ప్రాణశక్తితో బ్రతక డానికి సూర్యరశ్మి ఎంతైనా అవసరం. సూర్య రశ్మి సోకకుండా మొక్కను ముంతలో దాచి పెడితే అది చచ్చి పోతుంది. సూర్యరశ్మి వల్ల మొక్కలు బ్రతుకుతాయి. కాని, పోషణ లేకపోతే నిర్జీవ మవుతాయి. నీళ్ళు లేక, భూమి నుండి సత్తువ అందక పోతే మొక్కలు వాడి పోతాయి. ఆకులు రాలి పోతాయి.

మొక్కలకు పోషణ శక్తి చంద్రుని నుండి లభిస్తుంది. అదే ఓషధుల లోని రసం. ఈ విధంగా ఓషధులను పోషించే చంద్రుని లోని రసాత్మక శక్తి పరమేశ్వరునిదే. ఎలాగైతే భూమి లోని ధారణాశక్తి భగవంతునిదో, చంద్రుని లోని పోషణాశక్తి కూడా పరమేశ్వరునిదే.

**పోషణ శక్తి**

భూమిలో ధారణా శక్తిగా ప్రవేశించి సర్వ భూతాలను, సమస్త జగత్తును నిలబెడుతున్న భగవంతుడు, చంద్రునిలో పోషణా శక్తిగా నిలిచి, రస రూపుడైన చంద్రుని ద్వారా ఓషధులను పోషిస్తూ, సర్వ ప్రాణులను రక్షిస్తున్నాడు. సోముడు అంటే చంద్రుడు. చంద్రుడు రస స్వరూపుడు. భూమి మీద పుడుతున్న వరి, గోధుమ మొదలైన ఓషధులలో రసాన్ని, రుచినీ కలిగించే వాడు సోముడు. అన్ని రసాలకు నిలయమైన వాడు సోముడు. రసనిధి. చంద్రుడు. తనలో ఉన్న రసాన్ని ఓషధులలో నింపి, వాటిని రసపూర్ణం చేస్తాడు. అందుచేతనే ఓషధులు రసపూర్ణాలై పుష్టిని, తుష్టిని కలిగిస్తాయి. అర్జునా! సర్వ రస స్వరూపుడైన చంద్రుణ్ణి నేనై ***( రసాత్మకః సోమః భూత్వా)*** సమస్తము లైన ఓషధులను - వరి, యవలు ***( ఓషధీః సర్వాః వ్రీహి యవాద్యాః)***. వృక్ష, లతా, తృణ, గుల్మాదులను నేనే పోషిస్తున్నాను ***( అహం పుష్ణామి)***. ధరించే వాటిలో ధారణా శక్తిగా ఎలా ఉన్నాడో, పోషించే వాటిలో పోషణా శక్తిగా కూడా పరమాత్మే ఉన్నాడు. ధారణ పోషణాది ధర్మ రూపంలో తానే ఉండి జగత్తును సంరక్షిస్తున్నాడు. జగతికి స్థితి కారకు డయ్యాడు. భూమి లోని శక్తి రూపం తానే. ఓషధుల లోని రస రూపం కూడా తానే.

సోముని వల్ల ఓషధులు రసపూర్ణ మవుతున్నాయి. రస పూర్ణమైన ఓషధుల వల్ల ఆహారము లభిస్తూ ఉంది. ఆహారం కారణంగా ప్రాణులు ఉద్భవిస్తున్నాయి. ***ఓషధిభ్యోఽ న్న మన్నా త్పురుషః*** - ఓషధుల వలన అన్నం కలిగింది. అన్నం వల్ల ప్రాణులు పుడుతున్నాయి. అన్నమును సృష్టించే వాడు తానే ***( అన్న స్రష్ట)***. అన్నమును ప్రసాదించే వాడు కూడా తానే ***( అన్నదాత)***. అవన్నీ సోమామృత పుష్టాలు కావడానికి చంద్రుడు కారణం కాదు, సర్వ రస స్వరూపుడైన బృందావన చంద్రుడే కారణము. కనుక సోమ నామధేయము శశాంకు నికే కాదు; శ్యామసుందరునికి కూడా ఉంది. చంద్రుని రూపంలో శోభిస్తూ, ఓషధులను పుష్టిమంతంగా, రస వంతంగా పోషించడం చేత పరమాత్మ సోముడు. అతడే ఘనశ్యాముడు ***( సోమ రూపేణ ఓషధీః పోషయన్ సోమః )***.

రశ్మిమంతుడైన సూర్యునిలో తానే ఉండి జీవనానికి కారణమైన పరమేశ్వరుడు, రస రూపుడైన సోమునిలో తానే ఉండి పోషణకు ఆధార మయ్యాడు. సూర్యునిలో ప్రకాశంగా తాను ప్రవేశించక పోయిన ట్లైతే విశ్వమే అంధకార బంధుర మయ్యేది. చంద్రునిలో రస రూపంగా తాను చేరక పోయి ఉంటే, జీవు లందరూ ఆకలితో మరణించే వారు. అతని వల్లనే వెలుగు. వెలుగులో ఉన్నది తానే. అతని వల్లనే ఓషధులు. ఓషధులలో శక్తి రూపంలో, రస రూపంలో, రుచి రూపంలో ఉన్నది కూడా తానే. ఇదంతా అర్థమైతే, బ్రతుకు తెరువులో భగవంతుడే దర్శన మిస్తూ ఉంటాడు. ఇన్ని విధాల మనలను కరుణించే దయామయుని వైపు ప్రార్థనలు కదుల్తాయి.

*పల్లవి :* **గానలోల! కరుణాల వాల!**

**గాచి బ్రోవు నిరుపమ గుణశీల!** ॥ గాన ॥

*చరణము :* **కన్నులలో వెలుగువు నీవే**

**వెన్నెలలో వెలుతురు నీవే**

**జలమున ప్రాణము జగతిలో జీవము**

**అంతా నీవే! అనంతము నీవే!** ॥ గాన ॥ అని చైతన్యగీతం నినదించింది.

ధారణాశక్తిగా, పోషణాశక్తిగా సర్వమూ తానే అయిన సర్వేశ్వరుడు, జగత్తును ధరించి, పోషించి, పాలించే కార్యంలో దివ్యంగా భాసిస్తున్నాడు. ముల్లోకాలనే కుటుంబాన్ని పాలించే ప్రభు పాత్రను పోషిస్తున్నాడు ( ***స త్రైలోక్య కుటుంబ పాలనా పరః*** ).

కుటుంబాన్ని తండ్రి ఎలాగైతే పాలిస్తూ, పోషిస్తూ ఉంటాడో, అలాగే త్రైలోక్య కుటుంబాన్ని పరమేశ్వరుడు తండ్రి లాగా పోషిస్తున్నాడు. జీవుల భార మంతా తానే వహిస్తున్నాడు. ఈ సత్యాన్ని లోకం గ్రహించ గలిగితే, ధర్మాత్ముడైన తండ్రి సంతానంగా విశ్వం లోని మానవు లందరూ ధర్మబద్ధంగా జీవించ గలుగుతారు. ఇక్కడే సర్వ మానవ సౌభ్రాతృత్వం ప్రాణం పోసుకుంటుంది. విశ్వకళ్యాణం ఆవిష్కృత మవుతుంది.

*రసాత్మకుడైన చంద్రునిలో ప్రవేశించి, రసపూర్ణ ఓషధుల ద్వారా పౌష్టికాహారాన్ని ప్రసాదించిన పరమేశ్వరుడు, దానిని వంట పట్టించే కార్యంలో కూడా తానే మన వెంట ఉన్నాడు. ఇది వైశ్వానర విభూతి.*

**అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహ మాశ్రితః ।**
**ప్రాణాపాన సమాయుక్తః పచా మ్యన్నం చతుర్విధమ్ ॥** **14**

***అహం-వైశ్వానరః-భూత్వా-ప్రాణినాం-దేహం-ఆశ్రితః***
***ప్రాణాపాన సమాయుక్తః-పచామి-అన్నం-చతుర్విధం***

| | | | |
|---|---|---|---|
| అహం | = నేను | ఆశ్రితః | =ఆశ్రయించి |
| వైశ్వానరః | = జఠరాగ్ని | ప్రాణాపాన సమాయుక్తః | =ప్రాణాపానాది వాయువులతో కూడిన వాడనై |
| భూత్వా | = అయి | చతుర్విధం | =నాలుగు విధాలైన |
| ప్రాణినాం | = ప్రాణుల యొక్క | అన్నం | =అన్నమును |
| దేహం | = దేహమును | పచామి | =పచనము చేస్తున్నాను |

**అర్జునా! నేను వైశ్వానర రూపంలో జఠరాగ్నినై ప్రాణుల శరీరాలను ఆశ్రయిస్తాను. ప్రాణాపాన వాయువులతో కలిసి నాలుగు రకాలైన ఆహారాలను పచనం చేస్తున్నాను.**

## వ్యాఖ్య

పరమాత్మ సర్వాత్ముడు అనే దానికి హేత్వంతరమును విభూతి సంక్షేపంగా వివరించే ప్రయత్నంలో భగవానుడు వినిపించిన నాలుగు శ్లోకాలలో ఇది మూడవది. ఈ శ్లోకంలో సర్వులకు అనుభవంలో ఉండే వైశ్వానర విభూతిని వర్ణిస్తున్నాడు.

### వైశ్వానరాగ్ని

మనలో అగ్ని రూపంలో ఉన్నది కూడా భగవంతుడే. అదే వైశ్వానరాగ్ని. ఉదరంలో ఉన్న అగ్నిని వైశ్వానరాగ్ని





అంటారు. అది తానే అంటున్నాడు భగవంతుడు ( ***వైశ్వానరః ఉదరస్థః అగ్నిః అహ మేవ*** ). మనం భుజించిన ఆహారము పక్వం కావడానికి ఉపకరించే జఠరాగ్నియే ఈ వైశ్వానరాగ్ని.

భూమి మీద ఓషధుల జీవనానికి సూర్యుని రూపంలో కారణమై, రసాత్ముకుడైన సోముని రూపంలో ఓషధులలో రసమును, రుచిని కల్పించిన పరమేశ్వరుడు మన కొరకు ఈ విధంగా ఓషధులను పోషించడమే గాక, మనం ఆరగించిన ఆహారాన్ని పచనం చేసే కార్యాన్ని కూడా తానే నిర్వర్తిస్తున్నాడు. బాహ్యంలో ఓషధులు తయారు కావడానికి కారణమైన సూర్యచంద్రులు తానే. ఆ ఓషధులను మనం వంట చేసుకోవడానికి మంట రూపంలో ఉన్న అగ్ని తానే ( ***తత్తేజో విద్ధి మామకమ్*** ). మనం వంట చేసుకొని ఆరగించిన ఆహారాన్ని దేహంలో ఉండి, దానిని పచనం చేసి దేహానికి వంట పట్టించే వైశ్వానరాగ్ని కూడా తానే.

వండిన ఆహారాన్నే మనం తింటాము. తినడం వరకైతే మనం చేయగలం. మరి తిన్న ఆహారం దేహానికి వంట పట్టాలి కదా? దానికి మనం ఏమి చెయ్యగలం? ఏమీ చెయ్యలేము. ఆహారం నాలుక మీద ఉన్నంత వరకే మన నాట్య మంతా. అధరం నుండి జారి ఉదరంలో పడిన తరువాత మనం చేయ గలిగింది ఏమీ లేదు. అక్కడ జరగ వలసింది ఏమిటో కూడా మనకు తెలియదు. అక్కడున్న వాడికి తప్ప. మరి అక్కడెవ రున్నారు? వాసుదేవుడే ఉన్నాడు. ఎలా ఉన్నాడు? వైశ్వానరాగ్ని రూపంలో ఉన్నాడు. ఎందు కున్నాడు? వంట చేయడానికి ఉన్నాడు. వంటకు కావలసిన మంట పెట్టేందు కున్నాడు.

అదేమిటి? వండిన ఆహారాన్నే కదా మనం ఆరగించేది! మళ్ళీ దానిని వండట మేమిటి? నిజమే. మనం వండుకున్న వంట తినడానికి పని కొస్తుంది కాని వంట పట్టడానికి కాదు. మనం భుజించిన ఆహారము తిరిగి పచనం కావాలి. అప్పుడే అది వంట బడుతుంది. ఆ వంటకు ఉపయోగపడే మంట ఏదో అదే వైశ్వానరాగ్ని. దానినే మనము జఠరాగ్ని అంటాము. ఈ అగ్ని అంతర్యంలో ఆహారాన్ని తిరిగి వండి అన్న రసాన్ని తయారు చేస్తుంది. ఆ రసం నుండే రక్తం ఉత్పన్న మవుతుంది ( *రసాద్రక్తం* ).

***అయ మగ్నిః వైశ్వానరో యోఽ యమన్తః పురుషే , యే నేద మన్నం పచ్యతే*** - పురుషునిలో ఉన్న అగ్ని వైశ్వానరాగ్ని. దీని చేత అన్నం పచనము చేయబడుతూ ఉంది అని బృహదారణ్యాక ఉపనిషత్తు ( *5 - 9 - 1* ). పచనము చేయడ మంటే జీర్ణం చేయడ మని అర్థం. మనం తినిన ఆహారము జీర్ణం కాకుండా ఉదరములో అలా ఉండి పోతే ఎలా ఉంటుందో ఒక్కసారి ఆలోచించండి. కనుకనే, మనిషి బ్రతికేది అన్నంతో కాదు, అచ్యుతునితో అనే సత్యాన్ని కష్టించి అయినా అర్థం చేసుకోవాలి. ఓషధుల రూపంలో ఎవడు అన్నాన్ని సృష్టించాడో, వాడే వైశ్వానరాగ్ని రూపంలో ఆహారాన్ని మనకు వంట పట్టిస్తున్నాడు. అన్నమును సృష్టించిన వాడు తానే. అన్నమును భక్షించే వాడు కూడా తానే. **సోమ ఏవ అన్నమ్ అగ్ని రన్నాదః** - అన్న రూపంలో సోముడుగా శోభించిన వాడే అగ్ని రూపంలో వైశ్వానరుడుగా భాసిస్తున్నాడు. సోముడు అన్నము, అగ్ని అన్నాదుడు అన్నది తైత్తిరీయం. అగ్ని సోముల రూపమున ( ***అగ్నీషోమ రూపం*** ) పరమేశ్వరుని ఆరాధించడమే వైశ్వానరోపాసన.

### దేహమే ఆశ్రయము

అన్నవంతుడైన పరమేశ్వరుడు అన్నాదుడు కావటానికి ప్రాణుల దేహాన్ని ఆశ్రయించి ఉన్నాడు ( ***ప్రాణినామ్ ప్రాణవతామ్ దేహం ఆశ్రితః ప్రవిష్టః*** ). దేహము ఏదో కాదు; అన్న వికారమే. అన్నము నుండే ఉత్పన్న మైంది కనుక దానిని అన్న భావనగా చెబుతారు ( ***అన్న భావనః అన్నాత్ ఉత్పత్తిః యస్య సః*** ). అన్నాన్ని సృష్టించిన వాడు, అన్న రూపంలో దేహంలో ప్రవేశించిన వాడు, వైశ్వానరాగ్ని రూపంలో అన్నమును పచనం చేసిన వాడు, అన్న వికారంగా మరొక దేహానికి కారణమైన వాడు - అన్నీ పరమేశ్వరుడే. ఇలా వైశ్వానరాగ్ని రూపంలో దేహమును

ఆశ్రయించుకొని ఉన్న భగవంతుడు ప్రాణాపానాలతో కూడి, మనం భుజించే నాలుగు విధాలైన ఆహార మును పచనం చేస్తున్నాడు.

నిప్పును ఊదితే అది రగుల్కొంటుంది. పొయ్యి లోని అగ్నిని ఊదుతూ ప్రజ్వలింప చేసినట్లు, కొలిమి లోని అగ్నిని కొలిమి తిత్తి ద్వారా రగిలించినట్లు, ప్రాణాపానాలు కొలిమితిత్తి లాగా వాయువును అందించి వైశ్వానరాగ్నిని జ్వలింప చేస్తూ ఉంటాయి. ఉచ్ఛ్వాస నిశ్వాస రూపాలుగా చలిస్తూ, భుజించిన ఆహారాన్ని వైశ్వానరాగ్ని పచనం చేయడానికి ప్రాణాపానాలు సహకారులుగా పని చేస్తూ ఉంటాయి. అంటే, సర్వ ప్రాణుల దేహా లను వైశ్వానరాగ్ని రూపంలో ఆశ్రయించి ఉన్న జఠరాగ్నిని ప్రాణాపానాలు ఉద్దీపింప చేస్తూ ఉంటాయి. అలా ప్రజ్వలింప బడిన వైశ్వానరాగ్ని మనం భుజించే నాలుగు విధాలైన ఆహారమును పచనం చేయడం జరుగుతుంది.

అర్జునా! ప్రాణుల దేహాలను వైశ్వానరుని రూపంలో ఆశ్రయించిన నేను, ప్రాణాపాన వాయువులతో కలిసి ***(ప్రాణాపానాభ్యాం సంయుక్తః)*** నాలుగు రకాలైన అన్నమును జీర్ణం చేస్తున్నాను ***(పచామి పక్తిం కరోమి, చతుర్విధం అన్నం, భోజ్యం, భక్ష్యం, చోష్యం, లేహ్యం చ)***. భోజ్యములు, భక్ష్యములు, చోష్యములు, లేహ్యములు అనేవే నాలుగు విధాలైన ఆహారములు.

**అన్న చతుష్టయము**

మనం తినే ఆహారము నాలుగు రకాలుగా ఉంటుంది. ఈ నాలుగు విధాలైన ఆహారమును వైశ్వానరాగ్ని రూపంలో ఉండి పరమేశ్వరుడే పచనం చేస్తున్నాడు ***(అన్నం చతుష్ప్రకారమ్)***. భక్ష్యములు, భోజ్యములు, చోష్యములు, లేహ్యములు అనేవి నాలుగు రకాల అన్నములు.

దంతముల చేత కొరికి, బాగా నమిలి తినబడే వాటిని భక్ష్యములు అంటారు. వీటినే ఖాద్యములు అని కూడా అంటారు. గారెలు, అరిసెలు, కొబ్బరి ఉండలు, బొబ్బట్లు - ఇవన్నీ భక్ష్యములు. వీటిని చర్వ్యములు అని కూడా అంటారు ***(చర్వ్, చర్వతి, చర్వయతి - తే)***. కొరికి, నమిలి తినబడేవి కనుక అవి చర్వ్యములు.

ఎక్కువగా నమల వలసిన పని లేకుండా, నాలుక చేత అటు ఇటు త్రిప్పి ఆస్వాదించ బడేవి భోజ్యములు. భక్ష్యముల కన్నా మెత్త నైనవి. అన్నము, హల్వా, పొంగలి, కూరలు ఇవన్నీ భోజ్యములు.

నాలుకపై ఉంచుకొని, ఆస్వాదించి మ్రింగేవి చోష్యములు. నమల వలసిన, తినవలసిన అవసరం లేకుండానే ఆస్వాదించ దగినవి. పాయసము, ఐస్‌క్రీమ్ మొదలైనవి చోష్యములు. చోష్యములను పేయములు అని కూడా అంటారు. పేయములు అంటే త్రాగ దగినవి. పాలు, మజ్జిగ, మధుర పానీయా లన్నీ చోష్యములే.

చివరగా నాలుగో రకము లేహ్యములు. నాలుక చేత నాకబడేవి లేహ్యములు. ఇవి కొరికేవి కావు; నమిలేవి కావు; త్రాగేవి కావు. కేవలం చప్పరించి మ్రింగ బడేవి. తేనె, పెరుగు, పచ్చళ్ళు, ఊరగాయలు - ఇవన్నీ లేహ్యములే.

ఈ విధంగా మనం భుజించే నాలుగు రకాలైన అన్నాలను వైశ్వానరాగ్ని రూపంలో ఉండి భగవంతుడే జీర్ణం చేస్తున్నాడు. అంటే, అన్నము, అన్నమును తినే వాడు ఇరువురూ పరమేశ్వరుడే. భోక్త , అగ్ని రూపంలో ఉన్న వైశ్వానరుడు. వైశ్వానరాగ్ని రూపంలో ఉన్నది భగవంతుడే ***(భోక్తా వైశ్వానరః అగ్నిః)***. భోజ్యము, అన్న రూపంలో ఉన్న సోముడు. సోముని రూపంలో ఉన్నదీ పరమేశ్వరుడే. కనుక వైశ్వానర విశేషము విభూతియే. భోజన క్రియ యజ్ఞకార్య మైంది. యజ్ఞ కర్మలో హవిస్సులు మొదలైన అర్పణాదికాలను పరమేశ్వర స్వరూపమైన అగ్ని యందు ఎలా హోమం చేయడం జరుగుతుందో, అలాగే భోజనాదికాలనే హవిస్సును వైశ్వానరాగ్ని అనే బ్రహ్మ స్వరూపము నందు హోమం చేయడం జరుగుతూ ఉంది అని అర్థము ***(అగ్నిః అపి బ్రహ్మ ఏవ యత్ర





హూయతే)***. భోజన క్రియ ఎప్పుడైతే యజ్ఞముగా భావింప బడిందో, మనం ఆరగించే ఆహారము అమృత మైంది. బ్రహ్మమే అయింది. బ్రహ్మఫలం అందిన టైంది ***(యత్ తేన గంతవ్యం ఫలం తదపి బ్రహ్మైవ)***. అందుచేతనే భోజన వేళల్లో ***అహం వైశ్వానరో భూత్వా*** అనే ఈ శ్లోకాన్ని పఠించి, ఆ తరువాత అర్పణ భావంతో ***బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః*** ( 4 వ అ - 24వ శ్లో) అనే శ్లోకాన్ని పలికి, జలాన్ని ఔపాసనం పట్టి ఆహారంపై చల్లు కుంటారు. అన్నశుద్ధి, అర్పణ సిద్ధి కారణంగా ఆహారం అమృత రూప మవుతుంది.

**ఆరాధనా భావము**

భోజ్యమైన అన్నములో సోముని రూపం లోను, భోక్త యైన వైశ్వానరునిలో అగ్ని రూపం లోను, జఠ రాగ్నిలో పచనం చేసే శక్తి గాను, సర్వత్ర బ్రహ్మమే ఉన్నందున, **ఊర్ధ్వ మూలం** అనే ఆరంభ శ్లోకం యొక్క తత్త్వార్థం సిద్ధిస్తూ ఉంది. ***తస్య మధ్యే మహా నగ్ని ర్విశ్వార్చి ర్విశ్వతో ముఖః*** - సర్వత్ర కాంతు లీనుచూ, సర్వతోముఖంగా ఈ దేహంలో గొప్ప అగ్ని ప్రకాశిస్తూ ఉంది అనే వేద ప్రమాణం అనుభూత మవుతూ ఉంది.

భోజన సమయంలో యజ్ఞకార్యం నడుస్తూ ఉన్నందున, ఆరాధనా భావంతో ఆహారాన్ని నైవేద్యంగా సమర్పిస్తూ, కొందరు **బ్రహ్మార్పణం** అనే శ్లోకాన్ని ఉచ్చరిస్తే, కొందరు మొదటి అన్నపు ముద్దను ఉండ చుట్టి ప్రక్కన పెడతారు. ఆ తరువాత దానిని పక్షులకు బ్రహ్మభావంతో సమర్పిస్తారు. ఆహారాన్ని ఆరగించే సమయంలో ఉదరములో వైశ్వానర క్రియ సాగుతూ ఉన్న కారణంగా, బ్రహ్మకర్మకు అంతరాయం కలగ రాదని మౌనంగా భోం చేస్తారు. భోజన మధ్య కాలంలో కృతజ్ఞతా భావంతో పరమేశ్వరుని స్మరించుకుంటూ గోవింద నామాన్ని పలుకుతారు.

ఆహారాన్ని పరమేశ్వరునికి సమర్పిస్తున్నాము కనుక, భోక్త భగవంతుడే కాబట్టి, అర్పించే ఆహారాన్ని సాత్త్వికంగా, పవిత్రంగా ఉండే విధంగా హిందువులు వంట వార్పులు మొదలుకొని, వడ్డన ఆరగింపుల వరకు సాత్త్విక శ్రద్ధను ప్రదర్శిస్తూ ఉంటారు. సాత్త్వికాహారాన్నే భుజిస్తారు. ఏది సాత్త్వికాహారము? అని సందేహించ కండి. ఈ విషయాన్ని శ్రద్ధాత్రయ విభాగ యోగము - ఎనిమిదవ శ్లోకం వచ్చి నపుడు చెప్పుకుందాం.

ఆహారము సాత్త్వికంగా ఉండటమే కాదు. ఆహార సంపాదనా మార్గం కూడా ధర్మబద్ధంగా ఉండాలి. న్యాయార్జితమే నైవేద్య మవుతుంది. అన్యాయార్జితాన్ని అచ్యుతుడు అంగీకరిస్తాడా? ఆరగిస్తాడా? ఒక్కొక్కప్పుడు మనకు తెలియకుండానే సంపాదనలో అధర్మము చోటు చేసుకొనే అవకాశం ఉంది కదా! అలాంటిది కూడా గర్హనీయ మేనా? అనే సందేహము మీకు రావచ్చు. దోషము ఏదైనా దోషమే. కాకపోతే, ఈ విధమైన అన్న దోషము వైశ్వానరోపాసన వల్ల తొలగి పోతూ ఉంది. అన్న రూపంలో ఉన్న సోముడు, అన్నాదుని రూపంలో ఉన్న వైశ్వానరాగ్ని రెండిటిని, అంటే అగ్నిషోమములను పరమేశ్వర స్వరూపంగా భావన చేసే వారికి అన్న దోషం వల్ల కలిగే లోపం అంటదు ***(అగ్ని షోమౌ సర్వమ్ ఇతి పశ్యతః అన్న దోష లోపః న భవతి)***.

ఆరాధనా భావంతో ఆహారాన్ని పరమేశ్వరునికి సమర్పించడం జరిగిన తరువాత, భోక్త పరమేశ్వరుడే కనుక ఆ దోషం మనల్ని అంటదు. ఆ పాపం ఇక మనది కాదు. మరి, మన పాపాన్ని పరమేశ్వరునికి అర్పించి, ఆ దోషం ఆయనకు అంటేటట్లు చేయడం పాపం కాదా? కానే కాదు. ఎందుకని? ఆయన కర్త కాదు. పైగా, అకర్త. మనకు ఏది వాస్తవమో అదంతా ఆ దివ్యాత్ముని దృష్టిలో మిథ్యే.

**సర్వస్య చాహం హృది సన్నివిష్టో మత్తః స్మృతి ర్జ్ఞాన మపోహనం చ ।**
**వేదైశ్చ సర్వై రహమేవ వేద్యో వేదాన్తకృ ద్వేదవి దేవ చాహమ్ ॥** **15**

**సర్వస్య-చ-అహం-హృది-సన్నివిష్టః-మత్తః-స్మృతిః-జ్ఞానం-అపోహనం-చ**
**వేదైః-చ-సర్వైః-అహం-ఏవ-వేద్యః-వేదాంతకృత్-వేదవిత్-ఏవ-చ-అహం**

| | | | | | |
|---|---|---|---|---|---|
| అహం | = | నేను | అహం ఏవ | = | నేనే |
| సర్వస్య చ | = | సమస్త ప్రాణుల యొక్క | సర్వైః | = | సమస్తములైన |
| హృది | = | హృదయము నందు | వేదైః | = | వేదముల చేత |
| సన్ని విష్టః | = | ఉన్నాను | వేద్యః చ | = | తెలియదగిన వాడను |
| మత్తః | = | నా వలన | అహం ఏవ | = | నేనే |
| స్మృతిః | = | జ్ఞాపకశక్తి | వేదాంతకృత్ | = | వేదాంతకర్తను |
| జ్ఞానం | = | జ్ఞానము | వేదవిత్ చ | = | వేదవిదుణ్ణి కూడా |
| అపోహనం చ | = | మరపును | | | |

**అర్జునా! అందరి హృదయాలలో నేను ఉన్నాను. నా వల్లనే స్మృతి, జ్ఞానము , వాటి మరపు కూడా. సమస్త వేదాల చేత తెలియదగిన వాణ్ణి నేనే. నేనే వేదాంత కర్తను. వేదాన్ని తెలిసిన వాణ్ణి కూడా నేనే.**

### వ్యాఖ్య

విశ్వంలో వెలుగులను ఆరబోస్తున్న సూర్య చంద్రాగ్నుల లోని తేజము, సర్వ ప్రాణులను ధరిస్తున్న భూమి లోని ధారణా శక్తి, భూమి మీద సమస్త ఓషధులను రసపూర్ణం చేస్తున్న సోముని రసాత్మక స్వరూపము, ప్రాణుల లోని వైశ్వానరాగ్ని, అన్న - అన్నాద రూపములో విశేషంగా విస్తరించి ఉన్న తన వైభవము - ఇలా భగవానుడు సంక్షేప విభూతులను వివరించడం ద్వారా తన సర్వాత్మకత్వాన్ని నిరూపించడం జరిగింది. విశ్లేషించి అవలోకిస్తే ఇదంతా 'తత్' పదమును నిర్దేశించినట్లు అర్థ మవుతుంది. ఇక వ్యక్తి లోని 'త్వం' పదమును విస్పష్టం చేస్తే జ్ఞానం పరిపూర్ణ మవుతుంది. పురుషోత్తమ తత్త్వము అనుభూత మవుతుంది. కనుక, పన్నెండవ శ్లోకంలో ***యదాదిత్యగతం తేజః*** అంటూ ప్రారంభించిన విభూతుల సంక్షేపాన్ని ప్రస్తుత శ్లోకంలో ఆత్మ విభూతిని, జ్ఞాన విభూతిని, సంప్రదాయ విభూతిని దివ్యంగా ప్రవచించి సమాప్తం చేస్తున్నాడు.

### హృ'దయ'ంలో దయానిధి

'అర్జునా! సర్వ ప్రాణుల ***( సర్వస్య ప్రాణి జాతస్య )*** హృదయంలో ***( హృది బుద్ధౌ )*** నేను ఆత్మరూపంగా ఉన్నాను ***( అహమ్ ఆత్మా సన్ సంనివిష్టః )***'. భగవానుడు ఆత్మరూపంలో ఉండటము అంటే తన స్వరూప మహిమలో శోభించడము అని అర్థము. సచ్చిదానంద స్వరూపంగా భాసించడము అని భావము. ఇదే స్వరూప మహిమ, లేదా స్వరూప వైభవము.

***అహమస్మి*** - 'నేను ఉన్నాను' అని ప్రతి మనిషి చెబుతున్నాడు. ఈ విషయాన్ని అందరూ ఒకే విధంగా చెబుతున్నారు. ఎలా ఉన్నావు? అని తిరిగి ప్రశ్నించి నపుడే, పరిస్థితి క్లిష్టంగా మారుతూ ఉంది. ఎవరి మధ్య ఏకాభిప్రాయం లేదు. ఎందుకని? ఏకమైనది ఏదో, దానికి సంబంధించిన జ్ఞానం లేకపోవడం చేత ఏకాభిప్రాయం లేదు.

'నేను ఉన్నాను' అని శరీరం చెబుతుందా? లేదు. శరీరం చెప్పే టట్లైతే, పిచ్చివాడు మొదలుకొని శవం వరకు అన్ని దేహాలు చెబుతాయి 'నేనున్నాను - నేనున్నాను' అని. దేహం ఉంది. కాని, తాను ఉన్నట్లు దేహానికి తెలియదు. అందుచేత, నేనున్నాను అని దేహం చెప్పదు. పైగా, 'ఇది నా దేహము' అని మనం చెబుతున్నాం. కనుక, 'నేను' అనే భావన ***( అహం భావన )*** దేహంలో లేదు. దేహానికి లేదు.





దేహానికి అహంభావన ఎలా లేదో ఇంద్రియాలకూ లేదు. అవన్నీ విషయాల్ని మనస్సుకు చేర వేసే పరికరాలుగా ఉన్నాయే కాని, విషయాలను తెలుసుకొనే స్థితిలో లేవు. అందుచేత 'నేను తెలుసుకున్నాను' ***(అహం జానామి )*** అని ఏ ఇంద్రియమూ చెప్పడం లేదు.

'నేను ఉన్నాను' అనే జ్ఞానం మనోవృత్తికి మాత్రమే ఉంది అని చాలా మంది మేధావులు కూడా భ్రమిస్తూ ఉంటారు. వృత్తి మనస్సులో ఉంటుందే గాని, వృత్తిలో 'నేను' అనే జ్ఞానం లేదు. స్వరూప జ్ఞానం లేదు. దేహం మొదలు మనస్సు వరకు అన్నీ ఆధేయాలే గాని ఏదీ ఆధారం కాదు. వీటన్నిటికి ఏది అధిష్ఠానంగా ఉందో అదే ఆధారము. సర్వాధారము. స్వప్రకాశము. స్వరూప వైభవము **(స్వమహిమ)**.

ఇంద్రియాలు పరవశ మైతే, మనస్సు నిష్క్రియ మైతే, దేహం కొయ్యమొద్దు లాగా పడి ఉంటుంది. అంతే గాని, 'నేనున్నాను' అని లేచి నడవదు. దేహం స్వతంత్ర శక్తి లేనిది. పరాధీనమై ఉన్నది. ఇంద్రియాలు కూడా విషయాలను గ్రహించ గలవే కాని, విషయాలకు సంబంధించిన జ్ఞానం కలగడానికి అవి మళ్ళీ మనస్సుపై ఆధారపడి ఉన్నాయి. మరైతే, మనస్సుకు స్వయం సత్తా, స్వయం స్ఫూర్తి ఉన్నాయా? లేవు. ఉంటే, గాఢనిద్రలో కూడా మనస్సు విషయ గ్రహణం చేయ గలిగి ఉండాలి. మనస్సుకు సత్తా స్ఫురణలు చైతన్యం వల్ల కలుగుతున్నాయి. దేహేంద్రియ మనస్సులు ఒక దానిపై మరొకటి ఆధారపడి ఉన్నాయి. మరి చైతన్యము దేనిపై ఆధారపడి ఉంది? చైతన్యము ఆధార పడటానికి మరొక చైతన్యము లేదు. చైతన్యము ఏకము, అద్వయమే గాని రెండుగా ఉండ లేదు. రెండు చైతన్యాలు ఉండటం అనూహ్యము, అసంభవము, అశాస్త్రీయము.

మరొక దానిపై ఆధారపడి లేనందున చైతన్యము స్వతఃసిద్ధము. స్వతఃసిద్ధమైన సత్తారూప చైతన్యాన్ని ప్రకాశింప చేయడానికి మరొక చైతన్యము లేనందున అది స్వప్రకాశము. సత్తా స్ఫురణాత్మకమైన ఈ చైతన్యమే ఆత్మ. ***అహం*** స్వరూపము. దేహేంద్రియ మనస్సులకు అధిష్ఠానమైన ఈ చైతన్యాత్మ ప్రతి ప్రాణి హృదయంలో దివ్యంగా ప్రకాశిస్తూ ఉంది ***( హృది సన్నివిష్టః )***.

ఇప్పుడు తత్త్వం స్పష్ట మైందని భావిస్తాను. 'నేను ఉన్నాను' ***( అహమస్మి )*** అని ఎవరు అన్నా, 'నేను ఆత్మ రూపంగా ఉన్నాను' ***( అహమ్ ఆత్మా సన్ సన్నివిష్టః )*** అనేదే పరమార్థం. అట్టి జ్ఞానం వ్యక్తికి లేక పోవచ్చు. జ్ఞానం లేని కారణంగా, ఉన్న దానిని మరొక విధంగా భావించ వచ్చు. అంత మాత్రాన వస్తువు వస్తువు కాకుండా పోదు. ఇది రోజా పుష్పము అనే జ్ఞానం లేని వాడు దానిని చేమంతి అన్నంత మాత్రాన అది చేమంతిగా మారి పోతుందా?

రోజా పుష్పానికి సంబంధించిన జ్ఞానం లేక పోవడం చేత ఇది రోజా పుష్పము అని తెలుసుకోలేక పోయాడు. అంతే. కనుక, అతని వద్ద రోజా పుష్పానికి సంబంధించిన జ్ఞానం లేదు. మరే ముంది? రోజా పుష్పానికి సంబంధించిన అజ్ఞానం ఉంది. అజ్ఞాన కారణంగా రోజా రోజాగా తెలియక పోగా, చేమంతిగా అర్థమైంది. ఇదే అధ్యాస. అది కాని దాని యందు అది అనే బుద్ధి ***( అతస్మిన్ తద్బుద్ధిః )***.

అధ్యాస నివారించ బడదు. అజ్ఞాన నివృత్తి జరిగితేనే అధ్యాస తొలగుతుంది. అజ్ఞానము జ్ఞానము వల్లనే పోతుంది. దేనికి సంబంధించిన జ్ఞానం? ఉన్న దానికి సంబంధించిన జ్ఞానము. అదే ఆత్మజ్ఞానము. సత్య జ్ఞానము. వేదాంత జ్ఞానము.

దీనిని తెలుసుకోవాలి. దీనిని దర్శించాలి అన్నది బృహదారణ్యక శ్రుతి ***( ఆత్మా వా అరె ద్రష్టవ్యః )***. నీవు చైతన్య రూపుడవు, సర్వాత్మవు అని శాస్త్రం ప్రామాణికంగా బోధిస్తూ ఉంది. అది నీవు కానవసరం లేదు. అది నేను అని తెలుసుకుంటే చాలు. ఇదే అర్థం కావలసిన విషయం.

అయ్యా! నువ్వు గాయకుడివి అని గాయకుడు కాని వ్యక్తికి చెబితే, అది విని, ఆసక్తిని పెంచుకొని 'అనగ అనగ రాగ' మంటూ దివారాత్రాలు సాధన చేసి, ఎలాగైతే నేమి సంగీత జ్ఞానాన్ని సముపార్జించుకొని అతడు గాయకుడు కావచ్చు.

అదే విధంగా, నువ్వు ఆత్మవు. నువ్వే బ్రహ్మానివి ***(త్వం బ్రహ్మాసి)*** అని ఒక వ్యక్తికి చెబితే, అతడు బ్రహ్మము కావడానికి ప్రయత్నించా డనుకోండి. కఠోర సాధన చేశా డనుకోండి. అతడు బ్రహ్మము అవుతాడా? కానే కాడు. ఎందుకని? అతడు బ్రహ్మము అయ్యే ఉన్నాడు కనుక. ఎవడైనా లేని దానిని పొందగలడు గాని ఉన్న దానిని ఎలా పొందుతాడు? ఉన్నది అని తెలుసుకుంటాడు. అంతే. అదే జ్ఞానం. నేను ఆత్మ గానే ఉన్నాను అనే జ్ఞానం. ఆత్మజ్ఞానం. ఈ విషయం గురువు చెబుతాడు. అది అవునో కాదో నువ్వు విచారించు కోవాలి ***(అతః విచారః కర్తవ్యః)***. శాస్త్ర విచారం చెయ్యాలి. అది కూడా గురూప సదనం లోనే జరగాలి.

అప్పుడు తెలిసి వస్తుంది. నేను ఆత్మను. చైతన్యాత్మను. క్రొత్తగా సంభవించే వాణ్ణి కాను. సదా సిద్ధమై ఉన్నాను. సద్రూపంగా ఎప్పుడూ ఉన్నాను ***(సద్రూపేణ అహం సదా అస్మి)***. చిద్రూపంగా సదా ప్రకాశిస్తూ ఉన్నాను ***(చిద్రూపేణ అహం సదా భామి)***. సద్రూపముగా, చిద్రూపముగా ఉన్న నేను అనంత స్వరూపముగా విరాజిల్లు తున్నాను. అనంతాత్మ సమస్తము తానై ఉంది. మరి బ్రహ్మము? ఆత్మయే బ్రహ్మము. ఈ ఆత్మయే బ్రహ్మము ***(అయమాత్మా బ్రహ్మ)***.

***సర్వం ఆత్మైవ, తల్లక్ష్యం శుద్ధాత్మ దృష్ట్యా వా యః పశ్యతి స ఏవ బ్రహ్మ నిష్ఠో భవతి*** - 'సమస్తమూ ఆత్మయే. ఈ వాక్యానుసారము పరమాత్మయే లక్ష్యము. ఈ విధంగా ఆత్మ పరమాత్మ స్వరూపము అనే అద్వయ జ్ఞానంతో దర్శించే వాడు బ్రహ్మనిష్ఠుడు' అని మండల బ్రాహ్మణోపనిషత్తు.

**అధిష్ఠానమే సర్వాధారము**

సర్వాత్మయే హృదయస్థమై ఉన్నందున, మనిషి మనస్సులో ఏర్పడే స్మృతి, జ్ఞాన, అపోహనాలు ఆత్మ కారణం గానే కలుగు తున్నాయి. అర్జునా! ఈ కారణంగా ***(అతః)*** నా వల్లనే సర్వ ప్రాణులకు ***(మత్తః ఆత్మనః సర్వ ప్రాణినాం)*** స్మృతి, జ్ఞానము, అపోహనము కలుగు తున్నాయి ***(స్మృతిః జ్ఞానం తదపోహనం చ)***.

మొదటిది స్మృతి. స్మృతులు అంటే జ్ఞాపకాలు. గత అనుభవాలకు సంబంధించిన జ్ఞానమే స్మృతి. రెండవది జ్ఞానము. విషయ ప్రపంచానికి సంబంధించిన పరిజ్ఞాన మంతా జ్ఞానము అని చెప్ప బడింది. అది ఇహ పరాలకు సంబంధించిన ఏ జ్ఞాన మైనా కావచ్చు. ప్రధానంగా జ్ఞానము అంటే వృత్తి రూప జ్ఞానము అని అర్థము. ఇక మూడవది అపోహనము. అంటే వ్యక్తిలో స్మృతి జ్ఞానాలు ఏవైతే ఉన్నవో, అవి లేకుండా పోవడము, స్మృతి జ్ఞానాలను మరచి పోవడము అపోహనము. ఇవన్నీ చైతన్యం వల్లనే సంభవిస్తున్నాయి అంటున్నాడు.

చైతన్యం లేనిదే మనస్సు ఆలోచించ లేదు. చైతన్యము లేనిదే చిత్తానికి స్మృతి రాదు. చైతన్యం లేనిదే బుద్ధిలో జ్ఞానం వికసించదు. జ్ఞానాలకు, స్మృతులకే కాదు, మరపుకు కూడా ***(విస్మృతి)*** చైతన్యమే ఆధారము.

కొందరికి అన్నీ జ్ఞాపక ముంటాయి. కొందరికి కొన్నే జ్ఞాపక ముంటాయి. కొందరికి ఏవీ జ్ఞాపక ముండవు. కొందరికి జ్ఞాపక శక్తి ఉంటుంది గాని, అవసరానికి ఉపయోగ పడకుండా ఉంటుంది.

ఒక యువకుడు ఉద్యోగ నిమిత్తం ఇంటర్వ్యూకి వెళ్తాడు. అక్కడ తనకు ఎదురైన ప్రశ్నలకు చక్కని సమాధానాలు చెప్పి, ఉద్యోగాన్ని సంపాదించి సంతోషిస్తాడు. ఆ యువకుని సంతోషానికి అతని లోని జ్ఞానము, స్మృతియే కారణము.

ఒక అభ్యర్థి పోటీ పరీక్షలో పాల్గొని, పరీక్ష చక్కగా వ్రాసి ఉత్తీర్ణుడై, పెద్ద ఉద్యోగాన్ని సంపాదించి తృప్తి





చెందుతాడు. అతని తృప్తికి అతని లోని జ్ఞానము, స్మృతియే కారణము. ఈ విధమైన జ్ఞానము, స్మృతి బుద్ధిలో ఏర్పడ టానికి ఆత్మ చైతన్యమే కారణము.

ఇక మూడవది అపోహనం. దీనినే కాస్త జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. అపోహనం అంటే మరపు. మరచి పోయేది ఉన్న వాటినా, లేని వాటినా? లేని వాటిని మరచే దేముంటుంది? కనుక ఉన్న వాటినే మరచి పోవాలి. బుద్ధిలో ఉన్న వాటినే మరచి పోవాలి. ఉన్న జ్ఞానము జ్ఞాపకం రాదు. పొందిన అనుభవము స్మృతికి అందదు. అదే అపోహనం. జ్ఞాపకం రాదు; స్మృతికి అందదు అంటే, శాశ్వతంగా మరచి పోయాడని కాదు. అది అపోహనం క్రిందికి రాదు.

బుద్ధి లోని స్మృతి, జ్ఞానములు అవసరమైన సమయాలలో బుద్ధికి అందవు. అదే అపోహనం యొక్క ప్రభావము. 'ఏదో చెప్పాలనుకున్నా నండి, అదే అర్థం కావడం లేదు!' అని కొందరు అంటూ ఉంటారు. మరి కొందరేమో, 'గొంతు లోనే ఉందండి, జ్ఞాపకం రావడం లేదు!' అంటూ ఉంటారు. గొంతులో ఏముంది? గొంతు లోనే ఉంటే శుభ్రంగా చెప్పొచ్చు కదా, పచ్చి వెలగకాయ అని!

అమెరికా వెళ్తున్న ఆత్మీయుణ్ణి కలిసి అతి ముఖ్యమైన విషయం ఏదో చెప్పాలని ఒక వ్యక్తి విమానాశ్ర యానికి వెళ్తాడు. అక్కడికి వెళ్ళిన తరువాత అవీ - ఇవీ మాట్లాడి, చెప్ప వలసిన ముఖ్య విషయాన్ని మరచిపోయి, ఇంటికి తిరిగి వస్తాడు. ఇంటికి వచ్చిన తరువాత జ్ఞాపక మొస్తుంది చెప్పడం మరచి పోయాడని. ఈ లోగా భార్యామణి, 'ఏమండీ, చెప్పి వచ్చారు కదా!' అంటుంది. అంతే. ఇక సమాధాన మేముంటుంది, నీళ్ళు నమలడం తప్ప! అప్పుడు గీత - పదిహేనవ అధ్యాయం అధ్యయనం చేసినందుకు మనం జ్ఞాపకం చెయ్యవలసి వస్తుంది. అయ్యా! నీళ్ళను నమలరు. నీళ్ళు చోష్యములు కదా! పేయము లైన వాటిని అలా నమలడ మేమిటి? నమల వలసినవి భక్ష్యములు కదా! అని అన్న చతుష్టయాన్ని వివరించ వలసి వస్తుంది.

స్మృతికి, జ్ఞానానికి, అపోహనానికి చైతన్యాత్మయే ఆధారము అనేదే ఇక్కడ ప్రధానమైన విషయము. నిజమే, చైతన్యాత్మ అందరిలో సమంగా ఉంది కదా! అలాంటప్పుడు, కొందరికి స్మృతి జ్ఞానాలు చక్కగా ఉండట మేమిటి? కొందరికి అపోహనం ఎక్కువ ఎందుకని? అలా ఉండబట్టే కదా కొందరికి సుఖము, కొందరికి దుఃఖము కలుగుతూ ఉన్నాయి! స్మృతి, జ్ఞాన, అపోహనాల కారణంగా మానవులకు సంభవించే సుఖదుఃఖా లకు చైతన్యమే కారణము అని అంగీకరించ వచ్చా? కూడదు. అది కుదరదు. చైతన్యాత్మ నిష్క్రియము. నిర్మలము. నిష్క్రియాత్మకు కర్తృత్వాన్ని అంటకట్ట డానికి వీలు లేదు. ఆత్మ సదా అసంగము. మరి, వ్యక్తు లలో స్మృతి, జ్ఞాన, అపోహనాది భేదాలకు, తత్ఫలితంగా సంభవించే సుఖదుఃఖాలకు హేతు వేమిటి? అనేది శంక.

ఈ సందేహానికి భాష్యంలో సమాధానం స్పష్టంగా ఉంది. ఎవరైతే పుణ్య కర్మ లాచరించారో, వారికి పుణ్య ఫలంగా బుద్ధి శుద్ధిపడి ఉన్నందున విస్పష్టమైన స్మృతి జ్ఞానాలు ఉంటాయి. ఎవరైతే పాప కర్మలు ఆచరించారో, వారికి పాప ఫలంగా బుద్ధి దూషితమై ఉన్నందున స్మృతి జ్ఞానాలు లోపించడము అనే అపోహనం కలుగుతూ ఉంటుంది ***(యేషాం యథా పుణ్య కర్మిణాం పుణ్య కర్మానురోధేన జ్ఞాన స్మృతీ భవతః తథా పాప కర్మిణాం పాప కర్మాను రూపేణ స్మృతి జ్ఞానయోః అపోహనం చ అపాయనం అపగమనం చ)***.

**వేదితవ్యం**

వేదము లన్నిటి చేత ***(వేదైశ్చ సర్వైః)*** తెలియదగిన వాణ్ణి నేనే ***(అహ మేవ వేద్యః వేదితవ్యః)*** అంటున్నాడు భగవంతుడు.

వేదము అనేది జ్ఞాన భాండాగారము. వేదములు అనేక విషయాలను ప్రతిపాదిస్తాయి. ద్రవ్య సంబంధ మైన యజ్ఞ యాగాదులు వేదంలో చెప్ప బడ్డాయి. కర్మకాండ ఉంది. అలాగే ఉపాసనా కాండ కూడా ఉంది. ఇవి అన్నీ కర్మ ప్రధానంగా ఉంటాయి. ఫలసంగంతో కూడి ఉంటాయి. కర్మఫల ప్రాధాన్యంగా ఉంటాయి. కాని, వేదాల లోని ఉపనిషత్తులు కేవలం జ్ఞాన ప్రధానంగా ఉంటాయి. వేదాలలో ఇదే శ్రేష్ఠమైన జ్ఞానము. పరమాత్మకు సంబంధించిన జ్ఞానము. కనుక ఇదే వేదితవ్యం, అంటే తెలియ దగింది. అట్టి వేదితవ్యుడు తానే అంటున్నాడు గీతాచార్యుడు ***(వేద్యః).*** మోక్షమును పొంద గోరే ముముక్షువులు తెలుసుకోదగిన వాడు పరమాత్మ ఒక్కడే కనుక ఆయన వేదితవ్యుడు. వేద్యుడు ***(నిశ్శ్రేయసార్థిభిః వేదనార్హాత్వాత్ వేద్యః).*** మోక్షము అనేది అమృతత్వ స్థితి అయినందున మోక్షమును పొందిన జీవులు జననమరణాల నుండి విముక్తులై తరిస్తారు. అట్టి మోక్షము జ్ఞానరూపంలో ఉంది. అది పరమాత్మకు సంబంధించిన జ్ఞానము. అదే వేద్యము, వేదితవ్యము, జ్ఞేయము. అర్జునా! దేనిని తెలుసుకుంటే నీవు మృత్యువు నుండి విడిపడి అమృతత్వమును పొందుతావో అట్టి జ్ఞేయమును నీకు బోధిస్తున్నాను అన్నాడు భగవంతుడు *(13 వ అ - 12 వ శ్లో).* అక్కడ ఏదయితే జ్ఞేయంగా చెప్ప బడిందో అదే ఇక్కడ వేద్యంగా చెప్పబడుతూ ఉంది. పరమాత్మ జ్ఞానమును పొందిన తరువాత మరొక జ్ఞానమును పొంద వలసిన అవసరం ఉండదు. కారణం, దానికి మించిన జ్ఞానం లేక పోవడమే *( 6 వ అ - 22 వ శ్లో ).*

## వేదము - వేద్యము

వేదము జ్ఞానమయం. పరమాత్మ జ్ఞానమయుడు. జ్ఞానమును తెలియ చేసేది వేదము. జ్ఞానము ద్వారా తెలియబడే వాడు పరమాత్మ. పరమాత్మ, పరమాత్మ జ్ఞానము వేరు కానందున వేద్యుడైన పరమాత్మ వేదరూపుడు. కనుకనే, 'వేద' నామధేయుడు ***( వేద రూపత్వాత్ వేదః ).*** అంతే కాదు. పరమాత్మ అనుగ్రహం చేతనే వేద జ్ఞానము ప్రాప్తిస్తుంది. అందువలన కూడా ఆయన వేద నామధేయుడు ***(వేదయతీతి వా వేదః).*** వేద నారాయణుడు. భగవానుడు వేద స్వరూపము. వేదము భగవ త్స్వరూపము. సృష్టికి పూర్వము పరమాత్మ ఒక్కడే సద్రూపంగా, ఏకంగా, అద్వితీయంగా భాసించాడు. సృష్టికి పూర్వం పరమాత్మ ఉంటే, ఆయన జ్ఞానం కూడా సృష్టికి పూర్వమే ఉంది. అదే వేదం. పరమాత్మ తన జ్ఞానం తోనే ఈ సృష్టి కార్యాన్ని నిర్వర్తించాడు. కనుక, సృష్టి లోని జ్ఞాన మంతా వేద జ్ఞానమే. ఈ కారణం చేతనే వేదములు అపౌరుషేయములు. జ్ఞానము అనేది తెలియ బడేదే గాని సృష్టింప బడేది కాదు. అందుచేత వేదము ప్రమాణమై మోక్షమును అనుగ్రహించే స్థితిలో ఉంది.

*పల్లవి :* **హైలెస్సా! హైలెస్సా!**
**వేదము నే నని తెలుసా** ॥ హైలెస్సా ॥

*అనుపల్లవి :* **ఎన్నో ఎన్నో చెప్పి ఊరిస్తా**
**మరుక్షణమే బ్రతుకంతా మారుస్తా** ॥ హైలెస్సా ॥

*చరణములు :* **(1) సంసార తిమిరాలు చీలుస్తా**
**అజ్ఞాన జలములు పీలుస్తా**
**రాగద్వేషాలు రాల్చేస్తా**
**శాంతి ప్రేమలు నింపేస్తా** ॥ హైలెస్సా ॥

**(2) స్వర్గం నీకు చూపిస్తా**
**మోక్షం నీకు అందిస్తా**
**అంద మంతా చిందిస్తా**
**ఆనందం నీవే అనిపిస్తా** ॥ హైలెస్సా ॥





అని వేద విజ్ఞాన నౌకలో మనలను కూర్చో పెట్టి, వేద నాదాన్ని వినిపిస్తూ శాంతి విహార యానం చేయించింది చైతన్య గీతిక.

## వేదాంత కర్త

వేదాంతము అంటే ఉపనిషత్తులు. ఉపనిషత్తుల లోని ఆత్మజ్ఞానమే వేదాంత జ్ఞానము. జ్ఞానము ఏదైనా బోధ ద్వారానే అందుతుంది. ఈ విషయంలో వేదాంతము విలక్షణంగా లేదు. జ్ఞానము కలిగిన వ్యక్తి తన జ్ఞానమును తాను అందించి నపుడే మరొకరికి అది అందుతుంది. జ్ఞానము అంటే బోధ. బోధను అందించా లంటే బోధనా విధి కూడా తెలిసి ఉండాలి. ఈ విషయాన్ని ఇప్పటికే మనం విస్తరించి చెప్పుకున్నాం. బోధ ఎంత ప్రధానమో బోధనా విధి కూడా అంత ప్రధానము. విధానము తెలిసి బోధించి నపుడే బోధ శ్రోతకు అందు తుంది. వేదాంతము విషయంలో దీనినే సంప్రదాయము అంటారు.

అదలా ఉంచితే, ఇక్కడ వేద్యమైన పరమాత్మను వేదాంత కర్తగా కూడా అభివర్ణిస్తున్నాడు ***( వేదాంత కృత్).*** వేదాంతము అంటే జ్ఞాన మని చెప్పుకున్నాం. జ్ఞానము సృష్టింప బడేది కాదు. పరమాత్మ విశ్వాన్ని సృష్టించి నట్లు జ్ఞానాన్ని సృష్టించాడా? లేదు. ఆయనే జ్ఞాన స్వరూపుడు. మరి, అటువంటి పరమాత్మను 'వేదాంత కర్త' అనడంలో అర్థ మేమిటి?

***వేదాంత కృత్, వేదాన్తార్థ సంప్రదాయ కృత్ ఇత్యర్థః -*** వేదాంత కర్త అంటే, వేదాంతార్థ సంప్రదాయాన్ని నడిపించడములో కర్త అని భావము. సంప్రదాయ రక్షకుడు అని అర్థము.

మరి, సంప్రదాయ కర్తలు ఋషులు అని తెలుసుకొని ఉన్నాం. అందుచేతనే కదా బోధను ప్రారంభించే ముందు సంప్రదాయ కర్తలైన ఋషులను *బ్రహ్మ విద్యా సంప్రదాయ కర్తృభ్యో* అంటూ స్మరించు కుంటున్నాము. ఋషులు సంప్రదాయ కర్త లైనపుడు *( ఋషిభిః సంప్రదాయ కర్తారః ),* భగవంతుని సంప్రదాయ కర్తగా చెబుతూ ***వేదాంతకృత్*** శబ్దానికి అర్థం చెప్పడం పొసగుతుందా?

సంప్రదాయ కర్తలు జ్ఞాను లైన ఋషులే అనడంలో ఎటువంటి సందేహము లేదు. కాకపోతే, పరమేశ్వరుని అనుగ్రహం చేతనే ఋషులకు సంప్రదాయ స్పృహ కలుగుతుంది కనుక భగవంతుని ***వేదాంత సంప్రదాయ కృత్*** అనడం జరిగింది. ఈశ్వర కృప చేతనే ఋషులు వేదాంత ఉపదేశ కర్త లయ్యారు ***(వేదాంత ఉపదేశ కృత్).*** పైగా తనకు, జ్ఞానికి తేడా లేదని, జ్ఞాని తన ఆత్మే నని గీతాచార్యుడే బోధించాడు కదా! *(7 వ అ - 18వ శ్లో).*

## వేద విదుడు

వేదవిదుడు అంటే వేదము తెలిసిన వాడు. అంతే కాదు వేదార్థమును తెలిసిన వాడు ***( వేదవిత్ వేదార్థ విదేవ చాహమ్ ).*** వేదమును, వేదార్థమును తెలిసిన వారు ఎందరైనా ఉండొచ్చు. కాని, వేదమును, వేదార్థ మును యథావిధిగా, సంపూర్ణంగా, స్పష్టంగా, నిస్సంశయంగా తెలిసిన వాడు భగవాను డొక్కడే ***( యథావత్ వేదం వేదార్థం వేత్తి ఇతి వేదవిత్ ).***

వేద సారాన్ని, వేదాంత సారాన్ని విచారించి అమృతమయ మైన గీతా జ్ఞానమును అందించడం చేత కూడా ఆయన వేదవిదుడు. ***వేదాన్ విన్తే - విచారయతి ఇతి వేదవిత్ -*** వేద విచారము చేసి సార భూతంగా భగవద్గీతను ప్రసాదించిన వాడు కావడం చేత కూడా భగవానుడు వేదవిదుడు.

చివరగా, సంక్షేప విభూతుల లోని ఈ చివరి శ్లోకంలో **ఊర్ధ్వమూలం** అనే అధ్యాయారంభ శ్లోక తత్త్వార్థం సంపూర్ణంగా ఆవిష్కరించ బడింది. శ్లోక పూర్వార్ధం 'త్వం' పద నిర్దేశం కాగా, శ్లోకం యొక్క ఉత్తరార్ధం 'తత్' పద నిర్దేశమై, అఖండార్థ బోధ సఫల మైంది. ఆత్మయే బ్రహ్మము ***( అయమాత్మా బ్రహ్మ )*** అనే వాక్యము

అనుభూత మైంది. సర్వ ప్రాణుల హృదయాలలో ఆత్మరూపంగా తానున్నా నని ప్రకటించుకొనిన పరమాత్మ, సర్వభూతాల హృదయాలలో ఈశ్వర స్వరూపంగా తానే ఉన్నట్లు మళ్ళీ పద్దెనిమిదవ అధ్యాయం అరవై ఒకటవ శ్లోకంలో ప్రకటించి జీవేశ్వరుల మధ్య అభేదాన్ని, అఖండత్వాన్ని స్పష్టం చేస్తాడు.

*భగవంతుడైన ఈశ్వరుని యొక్క విశిష్టమైన ఉపాధుల ననుసరించి విభూతుల సంక్షేపాన్ని గడచిన నాలుగు శ్లోకాలలో బోధించిన గీతాచార్యుడు, ఇప్పుడు క్షరాక్షర ఉపాధుల నుండి వేరు చేయడం ద్వారా, నిరుపాధిక మైన శుద్ధ బ్రహ్మమును నిర్ధారణ చేయాలనే అభిప్రాయంతో తరువాత మూడు శ్లోకాలను చెబుతున్నాడు.*

ద్వా విమౌ పురుషౌ లోకే క్షర శ్చాక్షర ఏవ చ ।
క్షర స్సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే ॥ 16

***ద్వా-ఇమౌ-పురుషౌ-లోకే-క్షరః-చ-అక్షరః-ఏవ-చ***
***క్షరః-సర్వాణి-భూతాని-కూటస్థః-అక్షరః-ఉచ్యతే***

| | | | | | |
|---|---|---|---|---|---|
| లోకే | = | లోకము నందు | సర్వాణి | = | సమస్తమైన |
| క్షరః చ | = | క్షరుడు | భూతాని | = | భూతములు |
| అక్షరః ఏవ చ | = | అక్షరుడు | క్షరః | = | క్షర మనియు |
| ఇమౌ | = | ఈ | అక్షరః | = | అక్షరుడగు పురుషుడు |
| ద్వౌ | = | ఇద్దరు | కూటస్థః | = | కూటస్థుడని |
| పురుషౌ | = | పురుషులు | ఉచ్యతే | = | చెప్పబడ్డాడు |

**లోకంలో పురుషులు ఇద్దరే ఉన్నారు. ఒకడు క్షర పురుషుడు. మరొకడు అక్షర పురుషుడు. సర్వ భూతములు క్షరములు. కూటస్థుడు అక్షర స్వరూపుడు.**

### వ్యాఖ్య

లోకంలో, అంటే సంసారంలో సోపాధిక చైతన్యము ఇద్దరు పురుషులుగా చెప్పబడుతూ ఉంది. ఒకడు క్షర పురుషుడు. మరొకడు అక్షర పురుషుడు. కార్యోపాధి కల వాడు క్షర పురుషుడు. కారణోపాధి కల వాడు అక్షర పురుషుడు.

క్షరము అంటే నశించేది కనుక, నశించే కార్యోపాధి కల వాడు క్షర పురుషుడు ***( క్షరః క్షరతీతి క్షరః వినాశీ).*** అక్షర పురుషుడు అంటే దానికి భిన్నమైన వాడు. కారణోపాధి కల వాడు. కాల ప్రవాహంలో నశించని ఉపాధి కారణో పాధి. అదే భగవంతుని ఆశ్రయించుకొని ఉన్న మాయా శక్తి. త్రిగుణ మిళిత మైంది ***( అక్షరః తద్విపరీతః భగవతః మాయా శక్తిః ).***

క్షరోపాధి గల కార్య పురుషునికి ఉత్పత్తి స్థానం కావడం చేత, అక్షరోపాధి గల కారణ పురుషుడు, లేదా మాయాశక్తి సంసారానికి బీజ భూత మైంది. క్షరోపాధి గల పురుషునికి ఉత్పత్తి బీజము. సంసారులైన ప్రాణుల కామ కర్మాది సంస్కారాలకు అక్షర పురుషుడే ఆశ్రయ స్థానము.

### క్షర పురుషుడు

క్షరము అంటే నశించేది. ఒక కాలంలో కనిపించి మరొక కాలంలో కనుమరు గయ్యేది. వికారయుతమైంది.





కనుక సకల భూతాలు, సర్వ కార్యాలు, ఇవన్నీ నడవటానికి ఆశ్రయమైన దృశ్యమాన జగత్తు - అంతా క్షరమే కనుక అది క్షర పురుషుడు. కార్యోపాధి గల వాడు. అంటే కార్య రూప ప్రపంచంగా గోచరించే వాడు ***(క్షరః సర్వాణి భూతాని సమస్తం వికార జాతమ్ ఇత్యర్థః ).*** ఆద్యంతాలు కలిగి కార్య రూపంలో గోచరిస్తూ, వికారాన్ని పొందుతూ, వినాశ మయ్యే సర్వభూత శరీరాలు క్షర పురుషుని క్రిందికే వస్తాయి.

### అక్షర పురుషుడు

అనేక నామ రూపాలతో, అనేక విధాలుగా ఏదైతే కార్య రూపంలో గోచరిస్తూ ఉందో అట్టి వ్యక్త రూప ప్రపంచము క్షరము. వ్యక్త మయ్యే ఈ కార్య రూప జగత్తుకు కారణమై, ఏదైతే అవ్యక్తంగా ఉందో, అంటే వ్యక్తం కాకుండా ఉందో అదే అక్షరము. అవ్యక్తంగా ఉంటూ జగత్కార్యానికి కారణమైన మాయా శక్తియే అక్షరము. మార్పు లేనిది. కూటస్థము.

కూటస్థము అనే పదాన్ని ఇక్కడ జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. అక్షర పురుషుడు కూటస్థుడు అని చెప్ప బడ్డాడు ***( కూటస్థః అక్షర ఉచ్యతే ).***

పరబ్రహ్మమును 'కూటస్థం' అని, 'అక్షరం' అని ఇదివరకే మనం చెప్పుకొని ఉన్నాం *(12 వ అ - 3 వ శ్లో).* ఇక్కడ మళ్ళీ మాయను 'కూటస్థం', 'అక్షరం' అని చెప్పుకుంటున్నాం. ఈ తేడాను స్పష్టంగా గ్రహించాలి.

పరబ్రహ్మము సర్వాధారమై, సర్వ వికారాలకు ఆశ్రయమై, తాను స్వరూపతః అవికార్యమై ఉండటం చేత కూటస్థం అని చెప్పబడ్డాడు ***( కూటస్థః కూట రూపేణ తిష్ఠతి ఇతి ).*** దాగలి వలె కూటస్థుడు అని కూడా చెప్పుకున్నాం. కాని, ప్రస్తుతం 'అక్షరము', 'కూటస్థము' అనే పదాలకు బ్రహ్మము అనే అర్థాన్ని గ్రహించ డానికి వీలు లేదు.

కార్యమైన జగ ద్రూపంలో గోచరించే క్షర పురుషుడు కాల ప్రవాహంలో కరిగి పోతాడు. వ్యక్త మయ్యే కార్య రూప క్షర పురుషునికి కారణమై, అవ్యక్తంగా ఉండే మాయ ఇక్కడ అక్షరంగా, కూటస్థంగా చెప్ప బడింది.

'అక్షరము' అంటే పరబ్రహ్మము లాగా అవినాశి అని అర్థం కాదు. క్షరము లాగా కాలంలో నశించకుండా అవ్యక్తంగా ఉండి పునః సృష్టికి కారణ మవుతూ ఉంది అని అర్థము. ప్రళయ కాలంలో క్షర పురుషుడు నశించినా, అవ్యక్త మైన మాయ నశించకుండా ఉండి పునః జగత్కార్యానికి కారణం కావడం చేత అది సాపేక్షికంగా అక్షరమే గాని, పారమార్థికంగా అక్షర మైన బ్రహ్మము కాదు. జ్ఞానోదయంలో నశించే మాయ జ్ఞాన స్వరూపు డైన పరబ్రహ్మము లాగా అక్షర మెలా అవుతుంది?

అక్షర మెలాగో కూటస్థమూ అంతే. కూట మంటే మాయ అని, మోస మని, వక్ర మని, కుటిలత్వ మని కూడా అర్థా లున్నాయి ***( కూటః మాయా వంచనా జిహ్మతా కుటిలతా ఇతి పర్యాయాః ).*** మాయలో ఇవన్నీ ఉంటాయి. కనుక 'అక్షరము', 'కూటస్థము' అనే శబ్దాలు పరబ్రహ్మమును సూచించేవే అయినా, ఇక్కడ వాటిని మాయకు అన్వయించు కోవాలి.

ఉపాధులు క్షరమైనా, అక్షర మైనా అవి పరబ్రహ్మమునకు అన్యంగా ఉండ లేవు. క్షరాక్షరాలు రెండూ పరమాత్మకు ఉపాధులే కనుక, ఉపాధులను తొలగిస్తే, కేవలం శుద్ధ చైతన్యమే అద్వయంగా శోభిస్తుంది. **తద్ధామ పరమం మమ** అని ఆరవ శ్లోకంలో భగవంతుడు తెలిపింది ఇదే. ***నేతి నేతి: న హ్యస్మా త్పర మస్తి -*** ఇది కాదు, ఇది కాదు అని అన్నిటిని నిషేధిస్తూ, దాని కంటే పర మైనది లేదు అని ఉపనిషత్తు దేని నైతే ప్రతిపాదించిందో, అదే క్షరాక్షరాలకు విలక్షణ మైన పరమాత్మ తత్త్వము. అదే పురుషోత్తమ తత్త్వము.

*దానినే తరువాత శ్లోకంలో ప్రతిపాదిస్తున్నాడు.*

**ఉత్తమః పురుష స్త్వన్యః పరమాత్మే త్యుదాహృతః ।**
**యో లోకత్రయ మావిశ్య బిభ ర్త్యవ్యయ ఈశ్వరః ॥** 17

***ఉత్తమః-పురుషః-తు-అన్యః-పరమాత్మా-ఇతి-ఉదాహృతః***
***యః-లోకత్రయం-ఆవిశ్య-బిభర్తి-అవ్యయః-ఈశ్వరః***

| | | | |
|---|---|---|---|
| యః | = ఎవడు | అన్యః తు | = అన్యుడైన |
| అవ్యయః | = అవినాశియు | పురుషః | = పురుషుడు |
| ఈశ్వరః | = ఈశ్వరుడు | ఉత్తమః | = ఉత్తముడు |
| లోకత్రయం | = మూడు లోకములను | పరమాత్మా ఇతి | = పరమాత్మ యని |
| ఆవిశ్య | = ప్రవేశించి | ఉదాహృతః | = చెప్పబడ్డాడు |
| బిభర్తి | = భరిస్తున్నాడో | | |

**అర్జునా! నాశము లేని వాడు, ఈశ్వరుడు, ముల్లోకాలలో ప్రవేశించి భరించు ఉత్తమ పురుషుడే పురుషోత్తముడు.**

**వ్యాఖ్య**

పూర్వ శ్లోకంలో మనం చూచిన క్షర అక్షర పురుషుల కంటే భిన్నమైన లక్షణాలు, భిన్నమైన స్వభావం గల ఉత్తము డైన పురుషుని ఈ శ్లోకంలో ప్రవేశ పెడుతున్నాడు. ఇతడు క్షరాక్షరముల కంటే విలక్షణ మైన వాడు ***(క్షరాక్షరాభ్యాం విలక్షణః).*** క్షర, అక్షర ఉపాధుల దోషాల చేత అంటబడని వాడు ***(క్షరాక్షరోపాధి ద్వయ దోషేణ అస్పృష్టః ).*** స్వతంత్రమైన వాడు. ఉపాధుల కన్నా పరముడు కావడం చేత ఉత్తమ పురుషుడు పరమాత్మ అయ్యాడు.

కార్యోపాధికి అంటని వాడు కనుక పరమాత్మ అసంగుడు. కారణోపాధిని నియమించే వాడు కనుక నియామకుడు. అసంగుడు, నియామకుడై నందున కార్యకారణో పాధులకు విలక్షణుడై ఉత్తమ పురుష డయ్యాడు. పరమాత్మ నామధేయు డయ్యాడు ***(పరమాత్మ ఇతి ఉదాహృతః).***

ఆత్మ శబ్దానికి అనేక అర్థా లున్నాయి. దేహమును ఆత్మ అంటారు. ఇంద్రియాలను ఆత్మ అంటారు. మనస్సును ఆత్మ అంటారు. ఇవన్నీ ఆత్మ శబ్దం తోనే వినిపిస్తాయి. ఈ ఆత్మ లన్నీ క్షర మైనవి. క్షర పురుష నకు సంబంధించినవి. పరిమిత మైనవి. పరిచ్ఛిన్న దోషముతో కూడినవి. వీటికి విలక్షణము, పరమైన ఆత్మయే పరమాత్మ ***(పరమశ్చ అసౌ ఆత్మా చేతి పరమాత్మా).*** అన్యములైన ఆత్మల కన్నా భిన్న మైనది ***(అన్యః అత్యంత విలక్షణః ).*** అలాగే వాటి కన్నా ఉన్నత మైనది ***(ఉత్తమః ఉత్కృష్ట తమః ).***

కార్యమైన క్షర పురుషుని కంటే, కారణమైన అక్షర పురుషుని కంటే విలక్షణుడు కావడం చేత పరమాత్మ ***(కార్య కారణ విలక్షణః)*** ఉత్తమ పురుషుడు. క్షరాక్షరములు రెండూ పరమాత్మకు ఉపాధులే కనుక, వ్యక్త మైన కార్య రూప జగత్తును, అవ్యక్తమైన కారణ రూప మాయను - రెండిటినీ తానే భరిస్తున్నాడు. భరించడము అంటే, వాటికి సత్తా స్ఫూర్తి ప్రదాయకంగా ఉన్నాడని అర్థము. క్షరాక్షరాలకు పరమాత్మ వల్లనే సత్తా స్ఫురణలు కలుగు తున్నాయి అని భావము.

క్షరాక్షరాల స్వరూపమే జగత్త్రయము కనుక, పరమాత్మ ముల్లోకాలను సృష్టించి, తానే వాటిలో ప్రవేశించి,





వాటికి సత్తా స్ఫురణలను కలిగిస్తున్నాడు. ఈ విషయాన్ని శ్రుతి కూడా ధృవపరచింది. ***తత్సృష్ట్వా తదేవాను ప్రవిశత్*** - తానే సృష్టించి, తానే అందులో ప్రవేశించి, అంతటా తానే వ్యాపించి ***(ఆవిశ్య).*** లోకత్రయాన్ని ధరిస్తున్నాడు, లేదా నిలుపు తున్నాడు ***(బిభర్తి ధారయతి).***

ఇక్కడ ధరిస్తున్నాడు అంటే, బరువును మోస్తున్నాడు అని అర్థం కాదు. గుడ్డ వంతా నూలు వ్యాపించి ఉన్నట్లు, తన శక్తి చేత సర్వత్ర విస్తరించి ఉన్నాడని అర్థము. మట్టిపాత్రలలో మట్టి వ్యాపించి ఉన్నట్లు, అంతటా వ్యాపించి ఉన్నాడని భావము. ఈ విధంగా విలక్షణుడు కావడం చేత ఉత్తమ పురుషుడైన పరమాత్మ అవ్యయుడు. అంటే వ్యయం లేని వాడు. నాశ మెరుగని వాడు. మార్పు అర్థం కాని వాడు ***(అవ్యయః న అస్య వ్యయః విద్యతే ఇతి అవ్యయః ).*** తనకు మించిన వారు లేనందున తానే ఈశ్వరుడు. నియమించే శీలము కల వాడు. సర్వజ్ఞుడు ***(ఈశ్వరః సర్వజ్ఞః ఈశన శీలః ).***

*ఇంతవరకు ఈశ్వరుడుగా అభివర్ణింప బడిన వాడు పురుషోత్తముడే. ఆ పురుషోత్తముడు తానే అంటున్నాడు భగవంతుడు.*

**యస్మాత్ క్షర మతీతోఽహ మక్షరా దపి చోత్తమః ।**
**అతోఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః ॥** 18

***యస్మాత్-క్షరం-అతీతః-అహం-అక్షరాత్-అపి-చ-ఉత్తమః***
***అతః-అస్మి-లోకే-వేదే-చ-ప్రథితః-పురుషోత్తమః***

| | | | |
|---|---|---|---|
| అహం | = నేను | అతః | = ఆ కారణం చేతనే |
| యస్మాత్ | = ఏ కారణం చేత | లోకే | = లోకము నందు |
| క్షరం | = క్షరమునకు | వేదే చ | = వేదము నందు |
| అతీతః | = అతీతుడనో | పురుషోత్తమః | = పురుషోత్తముడని |
| అక్షరాత్ అపి చ | = అక్షరము కన్నను | ప్రథితః | = ప్రసిద్ధుడను |
| ఉత్తమః | = శ్రేష్ఠుడనో | అస్మి | = అయ్యాను |

**నేను క్షరమును, అక్షరమును రెండింటిని అతిక్రమించి ఉన్నాను. అందుచేత లోకము నందు, వేదము నందు పురుషోత్తముడుగా ప్రసిద్ధుణ్ణి.**

**వ్యాఖ్య**

***బ్రహ్మణో హి ప్రతిష్ఠాఽహం*** అని పూర్వాధ్యాయం చివరి శ్లోకం లోను, ***తద్ధామ పరమం మమ*** అని ప్రస్తుత అధ్యాయం ఆరవ శ్లోకం లోను అభివర్ణించిన తన వైభవమును నిర్ధారించ డానికి తన పురుషోత్తమ తత్త్వమును తానే దర్శింప చేస్తున్నాడు,

అశ్వత్థ మనే పేరు గల సంసార మాయా వృక్షమైన క్షరమును అతిక్రమించి ఉండుట చేత, అలాగే ఈ సంసార వృక్షానికి బీజ భూతమైన ప్రకృతి, లేదా మాయ అనే అక్షరమును అధిగమించి ఉండటమే గాక, దాని కంటే కూడా ఉత్కృష్టమైన వాడు కావడం చేత భగవానుడు పురుషోత్తముడు ***(క్షరమ్ అతీతః అతిక్రాన్తః అక్షరా దపి ఉత్తమః ).***

దేహము క్షరము. దీనినే క్షేత్ర మని పదమూడవ అధ్యాయంలో చెప్పుకున్నాం. అలాగే క్షేత్రాన్ని పురం అని కూడా అర్థం చేసుకున్నాం. పురములో ఉండే వాడు పురుషుడు. పురమైన క్షేత్రము క్షరము కనుక నశిస్తుంది.

పురమును తెలుసుకొనే వాడు పురుషుడు లేదా క్షేత్రజ్ఞుడు. పురుషుడైన క్షేత్రజ్ఞుడు అక్షరము కనుక నశించడు. పురానికి పురుషుడు ఆధారంగా ఉన్నాడు. క్షరమైన పురమును, అక్షర మైన పురుషుని, ఇద్దరినీ ప్రకాశింప చేసే దివ్య చైతన్యం ఏదో అదే పురుషోత్తమ తత్త్వం. క్షరానికి, అక్షరానికి అతీత మైంది. అదే పురుషోత్తమ స్థితి. అదే సత్, చిత్, ఆనందంగా భాసిస్తూ ఉంది. అదే సర్వాధిష్ఠానంగా ప్రకాశిస్తూ ఉంది. ఏకమై, అద్వయమై, అఖండమై, అద్భుతంగా భాసించే దివ్య ప్రకాశైక చైతన్యం అదే.

***దివ్యో హ్యమూర్తః పురుషః స బాహ్యాభ్యంతరో హ్యజః ।***
***అప్రాణో హ్యమనాః శుభ్రో హి అక్షరాత్ పరతః పరః ॥***

'స్వప్రకాశు డైన పురుషుడు ఆకారం లేని వాడు. వెలుపల, లోపల నిండి యున్న వాడు. పుట్టుక లేని వాడు. ప్రాణము లేని వాడు. మనస్సు లేని వాడు. నిర్మలమైన వాడు. అక్షర స్వరూపమునకు అతీతుడు' అన్నది ముండకోపనిషత్తు *( 2 - 1 - 2 )*.

క్షరాక్షరముల కంటె ఉత్కృష్టమైన వాడు కావడం చేత ***( క్షరాక్షరాభ్యాం ఉత్తమత్వాత్ )*** లోకము లోను, వేదము నందును పరమాత్మ పురుషోత్తముడుగా ప్రసిద్ధుడు ***( లోకే వేదే చ ప్రథితః ప్రఖ్యాతః పురుషోత్తమః )***.

ఈ విధంగా పురుషోత్తమ తత్త్వమును తెలుసుకొను వారికి ఫల మేమిటో చెబుతున్నాడు.

**యో మామేవ మసమ్మూఢో జానాతి పురుషోత్తమమ్ ।**
**స సర్వవి ద్భజతి మాం సర్వభావేన భారత ॥** **19**

***యః-మాం-ఏవం-అసమ్మూఢః-జానాతి-పురుషోత్తమం***
***స-సర్వవిత్-భజతి-మాం-సర్వభావేన-భారత***

| | | | | | |
|---|---|---|---|---|---|
| భారత | = | అర్జునా! | జానాతి | = | తెలుసుకుంటున్నాడో |
| యః | = | ఎవడు | సః | = | వాడు |
| అసమ్మూఢః | = | మోహము లేని వాడై | సర్వవిత్ | = | సర్వము తెలిసినవాడై |
| మాం | = | నన్ను | సర్వభావేన | = | సమస్త భావముల చేత |
| ఏవం | = | ఈ విధంగా | మాం | = | నన్ను |
| పురుషోత్తమం | = | పురుషోత్తముడ నైన నన్ను | భజతి | = | పొందుతాడు |

**అర్జునా! మోహము నుండి విడిపడిన వాడు, పురుషోత్తమ స్వరూపమును తెలుసుకున్న వాడు సర్వము తెలిసిన వాడు అవుతాడు. అతడు అన్ని విధాల నన్నే పొందుతాడు.**

**వ్యాఖ్య**

పురుషోత్తమ తత్త్వము అనే అఖండ జ్ఞానము యొక్క ఫలమును చెబుతున్నాడు. సర్వ వేద సారము, గీతా శాస్త్ర సారభూతము అయిన ఈ పదిహేనవ అధ్యాయమును అద్భుతంగా ప్రవచించిన భగవానుడు, అట్టి జ్ఞానము యొక్క ఫలమును విశదం చేస్తున్నాడు.

అర్జునా! పురుషోత్తముడ నైన నన్ను ఈ విధంగా ***( ఏవం )*** తెలుసుకున్న వాడు మోహము నుండి విడిపడు తున్నాడు. ***ఏవం -*** ఈ విధంగా, అంటే, ముందు చెప్పుకున్న విధంగా ***( ఏవం యథోక్తేన ప్రకారేణ )*** తెలుసుకున్న వాడు. అంటే కార్యోపాధిని పొంది నశించేది క్షర మని, కారణోపాధిని పొంది మార్పు చెందనిది





అక్షర మని, కార్యకారణా లైన క్షరాక్షరములకు అన్యము, అతీతము, ఉత్కృష్ట మైనది పురుషోత్తము డని ఎవడైతే తెలుసుకుంటాడో వాడు సర్వమును తెలుసుకున్న వాడు అవుతున్నాడు ***( సర్వవిత్ - సర్వం వేత్తీతి )***.

సర్వమును ఏమని తెలుసు కుంటాడు? సర్వము బ్రహ్మమే అని తెలుసుకుంటాడు. తనతో పాటు సమస్తమూ అద్వయ బ్రహ్మ స్వరూపమే అని తెలుసు కుంటాడు ***( ఇదం సర్వం యదయ మాత్మా -*** బృహదారణ్యక శ్రుతి *; 2 - 4 - 6 )*. సర్వమూ భగవంతుడే అనే సర్వాత్మ బుద్ధి కలిగి ఉంటాడు. అలాంటి వాడికి మోహం ఎలా ఉంటుంది? అందుకే అతడు అసమ్మూఢుడు ***( అసమ్మూఢః సంమోహ వర్జితః )***. ఊర్ధ్వమూలంగా వర్ణింప బడిన పురుషోత్తముని తెలుసుకున్న వాడు సమస్తము తెలిసిన వాడు అవుతున్నాడు ***( సర్వం జానాతి ఇతి )***. సర్వము తెలిసిన సర్వవిదుడు సర్వాత్మ స్వరూపుడైన పురుషోత్తముని యందే లగ్నమైన చిత్తముతో, ఆ సర్వాత్ముణ్ణే పొందుతాడు ***( భజతి మాం సర్వ భావేన సర్వాత్మ చిత్తతయా )***. ఇదే సర్వాత్మ జ్ఞానఫలం. పురుషోత్తమ ప్రాప్తి ఫలం.

ఈ జ్ఞానము సుస్పష్ట మైంది. స్వచ్ఛ మైనది. ఈ జ్ఞానమును పొందిన వాడు నిత్యానంద స్వరూపుడు అవుతున్నాడు. అతడికి ప్రపంచం గోచరించినా అది విస్మృత ప్రాయము. కర్తృత్వము అర్థం కాని వాడు. భోక్తృత్వం పై ఆసక్తి లేని వాడు. గతం అతనిని కలత పెట్ట లేదు. భవిష్యత్తు అతనిలో ఆశలు రేప లేదు. వర్తమానం జ్ఞాన స్నానం చేస్తూ ఉంటుంది.

అతడు సముడు. అతనిలో అంతా సమత్వమే. అతడు సమదర్శి. రాగాలు వినిపించవు. ద్వేషాలు కనిపించవు. నిందలు బాధించవు. స్తుతులు తృప్తి నివ్వ లేవు. అతడు ఆకాశము వంటి వాడు. అతని లోపల, అతని చుట్టూ ఎన్ని కదలి పోతూ ఉన్నా తాను అస్పర్శుడై ఉంటాడు. అసంగుడై ఉంటాడు. మేలుకున్న వాడికి స్వప్న మెలా ఉంటుందో, జ్ఞానికి ప్రపంచం అలా ఉంటుంది. తాను అకర్త గానే చరిస్తాడు. అభోక్త గానే శోభిస్తాడు.

ఆలయంలో భగవంతు డున్నట్లు, జ్ఞాని హృదయాలయంలో పురుషోత్తముడు దేదీప్యమానంగా ప్రకాశిస్తూ ఉంటాడు. ఆత్మజ్ఞానికి జీవత్వం లేదు. అతడే దేవుడు. ఆ మహాత్ముని పొందిన పుణ్య దేహము కదిలే దేవాలయం.

అతనికి ఆత్మ తప్ప మరొకటి కనిపించదు. ఏది కనిపించినా అది ఆత్మ గానే దర్శన మిస్తుంది. అదొక మంగళకర మైన దృష్టి. ఆత్మదృష్టి. సర్వాత్మ దృష్టి. బ్రహ్మదృష్టి. బ్రహ్మాత్మ జ్ఞాన దృష్టి.

***బ్రహ్మ విజ్ఞాన సంపన్నః ప్రతీత మఖిలం జగత్ ।***
***పశ్యన్నపి సదా నైవ పశ్యతి స్వాత్మనః పృథక్ ॥***

'బ్రహ్మజ్ఞాన సంపన్నుడు కనిపించే ప్రపంచమును చూస్తూ ఉండినా, దానిని ఆత్మ కంటే వేరుగా చూడడు' అన్నది వరాహోపనిషత్తు.

ఇక చివరగా, శాస్త్ర స్తుతి చేస్తున్నాడు.

**ఇతి గుహ్యతమం శాస్త్ర మిద ముక్తం మయాఽనఘ ।**
**ఏత ద్బుద్ధ్వా బుద్ధిమా న్స్యా త్కృతకృత్యశ్చ భారత ॥** **20**

***ఇతి-గుహ్యతమం-శాస్త్రం-ఇదం-ఉక్తం-మయా-అనఘ***
***ఏతత్-బుద్ధ్వా-బుద్ధిమాన్-స్యాత్-కృతకృత్యః-చ-భారత***

| | | | | | |
|---|---|---|---|---|---|
| అనఘ | = | పాపరహితుడా! | ఉక్తం | = | చెప్పబడినది |
| భారత | = | అర్జునా! | ఏతత్ | = | దీనిని |
| మయా | = | నా చేత | బుద్ధ్వా | = | తెలుసుకొని |
| ఇదం | = | ఈ | బుద్ధిమాన్ | = | బుద్ధిమంతుడు |
| గుహ్యతమం | = | అతి రహస్యమైన | కృతకృత్యః చ | = | కృతకృత్యుడు |
| శాస్త్రం | = | యోగశాస్త్రము | స్యాత్ | = | అవుతాడు |
| ఇతి | = | ఈ విధంగా | | | |

**అర్జునా! అతి రహస్య మైన శాస్త్రమును నీకు బోధించాను. దీనిని తెలుసుకున్న వాడు బుద్ధిమంతుడు అవుతాడు. కృతకృత్యుడు అవుతాడు.**

**వ్యాఖ్య**

## శాస్త్రం గుహ్యతమం

మోక్ష ఫలాన్ని అందించే పరమాత్మ జ్ఞానాన్ని పూర్వ శ్లోకంలో ప్రస్తావించిన భగవానుడు, ప్రస్తుత శ్లోకంలో అధ్యాయాన్ని ప్రశంసిస్తూ ఉపసంహరిస్తున్నాడు. సాధారణంగా భగవద్గీతను గీతా శాస్త్రం అంటాము. కాని, భగవంతుడు ఈ అధ్యాయాన్నే శాస్త్రముగా పేర్కొనడంలో అధ్యాయ ప్రశంసను చెప్పకనే చెప్పిన ట్లైంది. పరమేశ్వరుడు అర్జుననకు బోధించిన ఈ పురుషోత్తమ తత్త్వము గుహ్యతమము అంటున్నాడు ***(ఇదం ఉక్తం శాస్త్రం గుహ్యతమం)***. గుహ్యము అంటే రహస్యము. గుహ్యతమము అంటే అత్యంత రహస్య మని అర్థము. పరమాత్మకు సంబంధించిన జ్ఞానం కావడం చేత ఇది అతి రహస్య మైంది.

రహస్యము అంటే తెలియనిది అని అర్థము. తెలియనంత వరకే ఏదైనా రహస్యంగా ఉంటుంది. తెలియని దానిని తెలిపిన తరువాత ఇక రహస్య మంటూ ఉండదు. కాని, పరమాత్మ జ్ఞానము అలాంటిది కాదు. లౌకిక విద్యలు ఏవైనా చెబితే తెలుస్తాయి. వేదాంత విద్య చెప్పినా అర్థం కాదు. అర్థమైనట్లే ఉంటుంది. ఏమి అర్థమైంది? అని ప్రశ్నించుకుంటే అర్థం కాలేదనే సమాధానం వస్తుంది. అందుకే అది గుహ్యతమము. పరమాత్మే గుహ్య మైన వాడు. ఆయనకు సంబంధించిన జ్ఞానం కావడం చేత బ్రహ్మవిద్య గుహ్యతమ మైంది.

ఇంతకీ పరమాత్మ స్థావర మెక్కడ? పోనీ, ఉపలబ్ధి స్థానం ఏది? హృదయమే కదా! నేను ప్రాణు లందరి హృదయాలలో ఉన్నాను అని ఈ అధ్యాయంలో భగవంతుడే స్వయంగా చెప్పాడు కదా! మరి, హృదయం లోనే ఉన్నవాడు ఎంత పిలిచినా పలకడు. ఎంత నిరీక్షించినా కనిపించడు. తెలుసుకుందా మంటే అర్థం కాడు. అలాంటి వానిని ఏమనాలి? గుహ్యమైన వాడు అనాలి. వ్యాసుడు అలాగే అన్నాడు. భీష్మాచార్యుల వారి చేత అనిపించాడు ***గుహ్యః*** అని. గుహలో దాగినట్లు హృదయ గుహలో రహస్యంగా ఉన్నందున పరమాత్మను 'గుహ్యుడు' అని అనవలసి వచ్చింది. తానే గుహ్యుడు కావడం చేత తనకు సంబంధించిన జ్ఞానము గుహ్యతమ మైంది. రహస్యంగా ఉండే వాడికి సంబంధించిన జ్ఞానము అత్యంత రహస్య మైంది ***(తత్ గుహ్యతమం గోప్య తమమ్ అత్యన్త రహస్యమ్)***.

వేదాంత జ్ఞానము, అంటే ఉపనిషత్తుల లోని జ్ఞానము అతి రహస్య మైనది. గహన మైనది కనుక రహస్యము. ఉత్కృష్ట మైనది కావడం చేత రహస్యము. గుహ్యమైన, అంటే రహస్యమైన ఉపనిష ద్విజ్ఞానము చేత పొందబడే వాడు కనుక భగవానుడు గుహ్యుడు ***(గుహ్యః రహస్యోపనిషత్ వేద్యత్వాత్ గుహాయాం హృదయా కాశే నిహిత ఇతి వా గుహ్యః)***.





**ఎవరు నీవు ? ఎవ్వరూ ఎరుగ లేరు**
**ఎరిగిన వారు తిరిగి ఎరుక పరచ లేరు**
**ఎదను చేరి సొదలన్నీ విందువయ్యా!**
**నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా !**

అని గోవిందుని గుట్టు విప్పింది చిన్నికృష్ణ శతకము.

గుండె లోనే ఉన్నా గుర్తు తెలియక పోవడము ఒక రహస్య మైతే, అత డెవరో కాదు, నీవే అని ఎంత మొత్తుకున్నా అర్థం కాక పోవడము మరొక రహస్యం. స్వప్రయత్నంతో యత్నించినా, పరుల సహకారంతో ప్రయత్నించినా రహస్యం రహస్యం గానే ఉంటూ ఉంది. అందుచేత ***శ్రుతి రేవ శరణ మితి*** - వేదమే శరణ్యము, వేదాంతమే శరణ్యము అని శాస్త్రాన్ని ఆశ్రయించ వలసి వస్తోంది. శాస్త్రాన్ని గురుముఖతః అధ్యయనం చేసినా రహస్యం అలాగే ఉంది. అందుకే గుహ్యమైన పరమాత్మకు సంబంధించిన శాస్త్రము గుహ్యతమమై కూర్చుంది. అట్టి గుహ్యతమ మైన శాస్త్రాన్ని భగవంతుడు అర్జునునికి బోధించాడు.

రహస్యమై, దుర్విజ్ఞేయమై ఉండటం చేత 'గుహ్యతమం' అనే మాటను చర్విత చర్వణంగా పరమేశ్వరుడు గీతలో వినిపించాడు. గీత పూర్వార్ధము సమాప్త మయ్యే తొమ్మిదవ అధ్యాయం మొదటి శ్లోకం లోను, గీతను సమాప్తం చేస్తూ పద్దెనిమిదవ అధ్యాయం అరవై నాల్గవ శ్లోకం లోను గుహ్యతమం అని చెప్పడమే గాక, మధ్యలో గీతా హృదయంగా భాసిస్తున్న పదిహేనవ అధ్యాయాన్ని సమాప్తం చేస్తూ కూడా అదే మాటను వినిపించాడు. శాస్త్రం ఎంత గుహ్యతమమో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు.

మనం ముందు గానే అధ్యాయ పీఠికలో చెప్పు కున్నట్లు, 'పురుషోత్తమ ప్రాప్తి యోగము' అనే ఈ అధ్యాయములో సమస్త గీతా శాస్త్ర సారమే గాక సమస్త వేదార్థము కూడా సమాప్త మైంది అని శ్రీ శంకరాచార్య స్వామి అభిప్రాయ పడ్డారు ***(సర్వో హి గీతా శాస్త్రార్థః అస్మిన్ అధ్యాయే సమాసేన ఉక్తః, న కేవలం గీతా శాస్త్రార్థ ఏవ, కిం తు సర్వశ్చ వేదార్థః ఇహ పరి సమాప్తః)***. మొదటి శ్లోకం, పదిహేనవ శ్లోకం, పద్దెనిమిదవ శ్లోకం ఈ అధ్యాయము వేదార్థ మనే విషయానికి అద్దం పడుతున్నాయి. అధ్యాయాంత శ్లోకమైన ప్రస్తుత శ్లోకం ***ఇతి*** అంటూ ప్రారంభమై అధ్యాయమును సమాప్తం చేయడము, సంప్రదాయానుసారం శాస్త్ర పరి సమాప్తిని సూచిస్తూ ఉంది. ఇటువంటి అద్భుతమైన, రహస్యమైన విషయాన్ని అర్జునునికి బోధించినట్లు భగవంతుడే స్వయంగా చెబుతున్నాడు. ఈ సందర్భంలో అర్జునుని *అనఘ!* అని, *భారత!* అని సంబోధించడం ముఖ్యంగా గమనించ దగిన విషయం.

అఘము అంటే పాపము. పాప రహితుడు కావడం చేత అర్జునుణ్ణి భగవంతుడు అనఘ! అని సంబోధించాడు. అర్జునుని జీవితంలో అకారాది క్షకారాంతం వరకు కాగడా పెట్టి వెతికినా పాపపు ఛాయలు కనిపించవు. అందుకే, అర్జునుడు అనఘుడు ***(అనఘ! అపాప!)***. అర్జునుడు అనఘుడు కావచ్చు. కాని, ఈ సందర్భములో భగవానుడు అతనిని ఇలా సంబోధించడం ఎంతో భావగర్భితంగా ఉంది. సమస్త వేదాంత సారమైన పురుషోత్తమ తత్త్వాన్ని గ్రహించాలి అంటే, ఆ ప్రయత్నం చేసే వ్యక్తి పాప రహితుడై ఉండాలి అని సూచించడమే దీని అంతరార్థము. శుద్ధి పడిన బుద్ధి లోనే పవిత్రమైన పరమాత్మ జ్ఞానము నిలుస్తుంది.

'భా' అంటే ప్రకాశము ***(భా దీప్తౌ)***. 'రత' అంటే ఆసక్తి అని, రమించడ మని అర్థము. ప్రకాశవంత మైన జ్ఞానము నందు ఆసక్తి కల వాడు, పాప రహితుడై ఉండాలి ***(అనఘ!)***. 'అనఘ' అనే పదం జ్ఞానార్హతను, అధికారిత్వాన్ని సూచిస్తూ ఉంటే, జ్ఞానమును పొందిన తరువాత జ్ఞానద్యుతిలో రమించడము జరుగు తుందని 'భారత!' శబ్దము సూచిస్తూ ఉంది.

అంతే కాదు, అర్జునుడు భరత వంశోద్భవుడు. వ్యక్తిగతంగా చూస్తే పాపరహితుడు. వంశ గతంగా, కుటుంబ నేపథ్యాన్ని చూచినా, ప్రకాశవంత మైన వాడు. కనుకనే పరమాత్మ నుండి పవిత్రమైన జ్ఞానాన్ని ఆలకించాడు. పైగా అనన్య సామాన్యంగా, అనితర సాధ్యంగా సాక్షాత్తు పరమాత్మ నుండే 'అనఘ!' అనే బిరుదును పొంది జన్మను సార్థకం చేసుకున్నాడు.

## శ్రవణ ఫలం

పరమేశ్వరుడు బోధించిన గుహ్యమైన పురుషోత్తమ తత్త్వమును *( ఏతత్ శాస్త్రం యథా దర్శితార్థం )* యథాతథంగా తెలుసుకున్న వాడు *( బుద్ధ్వా )* బుద్ధిమంతుడు అవుతాడు *( స బుద్ధిమాన్ స్యాత్ )*.

జ్ఞానమును పొందిన తరువాత బుద్ధిమంతుడు కావడ మేమిటి? బుద్ధి తోనే కదా జ్ఞానమును సముపార్జిస్తారు? అనే సంశయము కలగ వచ్చు. ఇక్కడ బుద్ధిమంతుడు అంటే వివేకం కల వాడు అని అర్థము. జ్ఞానము కల వాడు అని భావము.

బుద్ధి అందరికీ ఉంటుంది. బుద్ధి ఉన్న వాళ్ళందరూ బుద్ధిమంతులు కారు. ఎవరి బుద్ధిలో వివేకం ఉంటుందో, ఎవరి బుద్ధి జ్ఞాన పూరితమై ఉంటుందో వారే బుద్ధిమంతులు.

'నీకు బుద్ధి లేదు' అని ఒకరు మరొకర్ని తిడుతూ ఉండటం అనేక సార్లు మనం విని ఉంటాము. దాని అర్థ మేమిటి? వాస్తవంగా అతను బుద్ధి లేని వాడే అయితే, ఈ నిందా వాక్యం అర్థం కావలసింది ఎవరికి? బుద్ధి లేని చెట్టుకో, గోడకో, పిల్లికో, నల్లికో అర్థం కాదు కదా! అతనికి బుద్ధి లేదు అనేదే గనుక దూషించే వ్యక్తి యొక్క అభిప్రాయ మైతే, అసలు బుద్ధి లేని దెవరికి? అని విన్న వాళ్ళం మీమాంసలో పడ వలసి వస్తుంది.

బుద్ధి లేని వ్యక్తినే నిందించాడు అనుకుందాం. బుద్ధి లేదు అని అంటే అసలే బుద్ధి లేదని కాదు. పని చేయని బుద్ధి ఉందని అర్థము. పని చేయనిది ఉన్నా, లేకపోయినా పెద్ద తేడా ఉండదు.

శాస్త్రాన్ని బుద్ధిమంతులే వింటారు. అది కూడా శుద్ధ బుద్ధి కల వారే వింటారు. శుద్ధ బుద్ధి కల వారే శాస్త్రాన్ని అర్థం చేసుకో గలుగుతారు. బుద్ధి కలిగి శాస్త్ర హృదయాన్ని అర్థం చేసుకున్న వారు బుద్ధిమంతులు అవుతారు. అంటే జ్ఞానవంతులు అవుతారు *(బుద్ధ్వా బుద్ధిమాన్ స్యాత్ భవేత్!)*. పరమేశ్వరుడు జ్ఞాన స్వరూపుడు. అట్టి మహాద్భుత శక్తిని జ్ఞానం ద్వారా పొంద వలసిందే గాని మరో మార్గం లేదు *(న అన్యథా)*.

క్షర పురుషుడుగా కార్య రూప జగత్తులో సర్వత్ర తానే వ్యాపించి ఉన్నాడు (కుండలో మట్టి లాగా). అక్షర పురుషుడుగా కారణ రూప అవ్యక్తానికి, లేదా మాయకు కూడా తానే ఆశ్రయమై ఉన్నాడు. ఇలా కార్య కారణా లలో ఉన్న పరమేశ్వరుడు, ఆ రెండిటికి విలక్షణంగా తన మహిమలో *( స్వే మహిమ్ని )* పురుషోత్తముడుగా విరాజిల్లు తున్నాడు. అలాంటి వానిని ఎలా అర్థం చేసుకోవాలి? అర్థం చేసుకోవాలి అంటే ఎలాంటి బుద్ధి ఉండాలి?

ఉన్న దంతా పురుషోత్తమ తత్త్వమే అయినపుడు, అది సిద్ధించే ఉంది కదా! అది లేని దెప్పుడు? లేని దెక్కడ? మరి అంతట ఉన్న అద్వయ సత్తా స్వరూపాన్ని ఎలా పొందగలం? సాధ్య వస్తువును పొందగలం గాని సిద్ధ వస్తువును ఎలా పొందాలి? దానిని ఎలా చేరాలి అంటే ఏం చెప్పగలం? జ్ఞానం ద్వారానే పొందాలి. జ్ఞానం తోనే చేరాలి *( జ్ఞానే నైవ గమ్యతే )*. ఉండి తెలియక పోవడం అజ్ఞానం కనుక, అజ్ఞానము జ్ఞానము ద్వారానే తొలగించ బడాలి. మరో మార్గం లేదు.

పరమేశ్వరుని ఎవరైనా అలాగే పొందాలి. ఎవరి కైనా భగవంతుడు హృదయస్థుడు గానే అర్థం కావాలి.





తన ఆత్మ స్వరూపం గానే తెలియాలి. కనుకనే, *సర్వస్య చాహం హృది సన్నివిష్టః* - నేను అందరి హృదయాలలో ఉన్నాను అన్నాడు భగవంతుడు ( 15 వ శ్లో). కొందరి హృదయాల లోనే ఉన్నాను అని చెప్ప లేదు. కనుక, పరమేశ్వర దర్శనాన్ని అభిలషించే వారు, పురుషోత్తమ ప్రాప్తిని పొందగోరే వారు బాహ్యంలో అన్వేషించి పరమాత్మను పొంద లేరు. అంతరంగమున అవలోకించి మాత్రమే పొందగలరు.

## ఆఖ్యాయిక

హిరణ్యకశిపుని ఉగ్ర తపస్సును మెచ్చిన బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై, కోరిన వరాలను అనుగ్రహించిన తరువాత, నాయనా! హిరణ్యకశిపూ! నీవు కోరిన వరాలు సామాన్య మైనవి కావు. గతంలో ఎవ్వరూ ఇలా కోర లేదు. అయినా నిన్ను కరుణించి అనుగ్రహించాను.

*నన్నుం గోరిన వెల్ల నిచ్చితి బ్రవీణత్వంబుతో బుద్ధి సం*
*పన్నత్వంబున నుండు మీ సుమతి వై భద్రైక శీలుండవై !*

'బుద్ధితో ప్రవర్తించు. నేర్పుతో జీవించు. బుద్ధిమంతుడవై, మంగళ స్వభావంతో మసలుకో!' అని పలికి అరవింద సంభవుడు అంతర్హితు డయ్యాడు.

చెప్పిన హిత మంతా ఎటు పోయిందో! మరు క్షణమే సుర లోకంపై దండెత్తాడు హిరణ్యకశిపుడు. సురులను జయించాడు. యక్ష, కిన్నర, గంధర్వ, కింపురుషాదులను ఓడించి ఊర్ధ్వ లోకాలను స్వాధీనం చేసుకుంటూ వచ్చి, చివరగా శత్రువైన శ్రీహరిని జయించాలని వైకుంఠం వైపు తిరిగాడు.

మార్గ మధ్యంలో వైకుంఠం నుండి తిరిగి వస్తున్న నారద మహర్షి ద్వారా విష్ణువు వైకుంఠం లోనే ఉన్నా డని తెలుసుకొని పరమోత్సాహంతో ఆ వైపుకు దూసు కెళ్ళాడు. నారద మహర్షి కూడా వెనుదిరిగి హిరణ్య కశిపుని అనుసరించాడు. తీరా అక్కడి కెళ్ళి చూస్తే విష్ణుమూర్తే కాదు, ఆదిశేషుడు కూడా లేడు. ఇక, అమ్మవారు ఎక్క డుంటుంది?

నారదా! ఎక్కడ నీ హరి? అని నారదుని వైపు కళ్ళెర్ర జేసి చూశాడు హిరణ్యకశిపుడు. అయ్యా! నేను ఇక్కడే చూశాను. ఈ లోగా ఏమయ్యాడో? అని బిక్క మొగం వేశాడు నారదుడు.

చూస్తాను. ఈ చతుర్దశ భువనాలలో నన్ను ఎలా తప్పించు కుంటాడో చూస్తాను అంటూ విష్ణుదేవుని కొరకు భువనా లన్నీ గాలిస్తున్నాడు కశ్యపాత్మజుడు.

ఒక వైపు హిరణ్యకశిపుడు క్రోధంతో అన్వేషిస్తూ ఉంటే, మరో వైపు నారదుడు భక్తితో అన్వేషిస్తున్నాడు. అటు హిరణ్యకశిపునికి విష్ణువు కనిపించ లేదు. ఇటు నారద మహర్షికీ విష్ణుదర్శనం కాలేదు. విసిగి వేసారిన దితి నందనుడు రాక్షస లోకాని కెళ్ళాడు.

నారద మహర్షి పరిస్థితే అగమ్య గోచరంగా ఉంది. అచ్యుతుని కోసం వెతికి వెతికి నారదుడు కూడా అలసి పోయాడు. చివరగా, ఎందుకైనా మంచిది. మళ్ళీ ఒకసారి వైకుంఠానికే వెళ్ళి చూద్దా మని మహర్షి మాధవ సన్నిధానానికి పయన మయ్యాడు. తీరా వెళ్ళి చూస్తే **సిద్ధము సుమతీ** - విష్ణు భగవానుడు సతీ సపరివార సమేతంగా శేషతల్పం మీద పవ్వళించి ఉన్నాడు. మహర్షికి నోట మాట రాలేదు. 'నారదా! అదేమిటి? అదోలా ఉన్నావు? ఏం జరిగింది? అని అమాయకంగా ప్రశ్నించాడు జగన్నాటక సూత్రధారి.

అయ్యా! మహానుభావా! నా విషయం అలా ఉంచండి. తమరు ఇంతకాలం ఎక్క డున్నట్లు? తమరి మకాం ఎక్కడో అర్థం గాక నేను తిరగని చోటు లేదు అన్నాడు నారద మహర్షి.

అదేమిటి? నువ్వు ఒక్కడివే తిరిగినట్లు మాట్లాడుతున్నావు? హిరణ్యకశిపుడు కూడా నీ కన్నా ఎక్కువ గానే తిరిగాడు కదా! అన్నాడు విష్ణుమూర్తి.

నారదా! నేను ఎక్కడున్నా, ఏ లోకంలో ఉన్నా హిరణ్యకశిపుడు నా జాడ కనిపెట్టేస్తాడు. ఎక్కడ దాగితే అతడు కనిపెట్ట లేడో అక్కడ దాగాను అన్నాడు విష్ణుమూర్తి. అదెక్కడ స్వామీ? మీరు దాగింది ఎక్కడ? అని అడిగాడు నారద మహర్షి.

నారదా! నేను దాగింది హిరణ్యకశిపుని హృదయం లోనే. హిరణ్యకశిపుడు అహంకారి. తన కన్నా వేరైన ప్రదేశాలలో అన్వేషిస్తాడే గాని, తనలో తాను తల వంచి, అంతర్ముఖుడై చూడడు. అందుకనే నన్ను నేను దాచుకోవడానికి అదే అనువైన చోటు అని భావించి, అతని హృదయం లోనే ఒదిగి పోయాను అని రహస్యాన్ని విప్పి చెప్పాడు వైకుంఠ పతి.

**కృతకృత్యుడు**

పరమాత్మ జ్ఞానమును పొందిన వాడు కృతార్థు డవుతున్నాడు. ఆత్మయే పరమాత్మ అనే జ్ఞానము మహోన్నత మైంది. పరమాత్మ జ్ఞానమును పొందిన వాడు అంతకు మించి పొంద వలసింది ప్రపంచములో మరొకటి ఉండదు. ***పర*** అంటే ఉత్కృష్ట మైనది అని అర్థము ***(పరః సర్వ భూతేభ్యః ఉత్కృష్టం బ్రహ్మ).*** అట్టి పరమాత్మ జ్ఞానము ప్రాప్తించిన వాడు కృతకృత్యు డవుతున్నాడు.

కృత్యము అంటే కార్యము. కృతం అంటే చేయబడింది. ఏది కర్తవ్యమో అదే కృతం. కర్తవ్యము అంటూ మిగలకుండా చేయ వలసిన కార్యము లన్నీ చేసేసిన వాడు కృతకృత్యుడు ***(కృతం కృత్యం కర్తవ్యం యేన సః కృత కృత్యః).*** ఎలాగైతే స్వప్నంలో చేయ వలసిన కర్తవ్యా లన్నీ మేలుకోగానే చేసినట్లే అవుతున్నాయో, అలాగే భగవ త్తత్త్వాన్ని తెలుసుకుంటే చేయ వలసిన కర్తవ్యా లన్నీ చేసినట్లే అవుతున్నాయి. అట్టి వాడు కృతకృత్యుడు అవుతున్నాడు ***(యత్ కర్తవ్యం తత్ సర్వం భగవత్తత్త్వే విదితే కృతం భవేత్ ఇత్యర్థః).*** ఈ విధంగా సమస్త కర్మలు జ్ఞానములో లయించి పోతున్నాయి *( 4 వ అ - 33 వ శ్లో ).* ఈ విధమైన అత్యంత రహస్యమైన బ్రహ్మాత్మ జ్ఞానమును బోధించి, అర్జునుణ్ణి కృతార్థుణ్ణి చేశాడు కరుణా సముద్రుడైన భగవంతుడు.

'అర్జునా! గుహ్యతమ మైన శాస్త్రాన్ని నీకు బోధించాను. పరమార్థ స్వరూపమైన పురుషోత్తమ తత్త్వమును నా ద్వారా శ్రవణం చేసి నువ్వు కృతార్థుడ వయ్యావు, కృతకృత్యుడ వయ్యావు' అని పలుకుతూ పదిహేనవ అధ్యాయాన్ని పరమేశ్వరుడు సమాప్తం చేస్తున్నాడు ***(ఏతత్ పరమార్థ తత్త్వం మత్తః శ్రుతవాన్ అసి తతః కృతార్థః త్వం భారత ఇతి ).***

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే
పురుషోత్తమప్రాప్తి యోగో నామ పఞ్చదశోఽధ్యాయః

**ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు పురుషోత్తమప్రాప్తి యోగ మనే పదిహేనవ అధ్యాయము.**



# చైతన్య భగవద్గీత

## అథ షోడశోఽధ్యాయః - పదహారవ అధ్యాయము

## దైవాసుర సంపద్విభాగ యోగః - దైవాసుర సంపద్విభాగ యోగము

**చీకటి వెలుగులు**

ఎవరైనా, ఎక్కడైనా, ఎప్పుడైనా వెలుగునే వాంఛిస్తారు. ప్రకాశాన్నే కాంక్షిస్తారు. తేజమునే ఆహ్వానిస్తారు.

చీకటి ఎవరి కైనా చికాకును కలిగిస్తుంది. చిడి పడేలా చేస్తుంది. కనుక, అందరూ వెలుగునే ఆదరిస్తారు. చీకటిని సర్వులూ చీదరించు కుంటారు.

కొందరికే పరిమితం కానిది, అందరూ ఆహ్వానించేది, ఆదరించేది వెలుగే అయినా, చీకటిలో ఉన్న వారికే వెలుగు యొక్క విలువ విశిష్టంగా తెలుస్తుంది. పంజరంలో బంధించ బడిన పక్షికే స్వేచ్ఛా విహారంలో ఉండే హాయి అవగత మవుతుంది. అనారోగ్యంతో అలమటించే వారికే ఆరోగ్యంలో ఉండే సుఖం అర్థ మవుతుంది. జనతకు దూరమై కారాగృహంలో కుమిలే ఖైదీకే జన సమూహంలో ఉండే జవము గోచర మవుతుంది. ఈ కారణం చేతనే, కేవలం వెలుగుల్ని మాత్రమే ఆరబోయడానికి ఆవిర్భవించిన శాస్త్రాలు అప్పుడప్పుడు, అక్కడక్కడ చీకట్లను కూడా చూపెడుతూ చర్చిస్తూ ఉంటాయి. దాని ఉద్దేశ్యం చీకటిలో పయనించ మని కాదు, చింతలలో శయనించ మనీ కాదు. ఏది పొంతమో, ఏది అంతమో పరిశీలించి అర్థం చేసుకోమని. విశ్లేషించుకొని ప్రయాణాన్ని సుగమం చేసుకోమని. శాస్త్రము వెలుగుల బాటలో అక్కడక్కడ నీడల్ని చూపిస్తూ నడక సాగించేది ఇందుకే.

అర్జునా! దుష్టులు, మూఢులు, నీచులు, మాయలో పడిన అవివేకులు - ఆసురీ సంపద కలిగిన ఈ అధములు ***(ఆసురం భావ మాశ్రితాః)*** నన్ను పొంద లేరు అన్నాడు ఏడవ అధ్యాయంలో భగవంతుడు *(7వ అ - 15 వ శ్లో).*

తిమిరంలో దూరి తారాడుతూ, తచ్చాడుతూ ఉన్న ఆసురీ ప్రకృతి కల వారిని విజ్ఞాన యోగంలో ప్రవేశ పెట్టిన భగవానుడు, పునః తొమ్మిదవ అధ్యాయం పన్నెండవ శ్లోకంలో పరామర్శిస్తూ మోహంలో కూరుకు పోతారు అని హెచ్చరించాడు.

పార్థా! వీరి ఆశలు వ్యర్థం. వీరి కర్మలు అనర్థం. వీరి జ్ఞానం అసమర్థం. వీరిది రాక్షసీ ప్రకృతి. ఆసురీ ప్రకృతి. వీరు మోహ కూపంలో పడి పోతారు అంటూ రాక్షసులకు, అసురులకు మధ్య ఉండే స్వల్పమైన అంతరాన్ని కూడా స్పృశిస్తూ రాజవిద్యా రాజగుహ్య యోగంలో మళ్ళీ చీకటి తెరను ముందుకు తెచ్చాడు వాసుదేవుడు *(9 వ అ - 12 వ శ్లో).*

చీకటి బ్రతుకులు ఇలా వ్యర్థ మైపోతూ ఉంటే, కాంతిమయ జీవితాలు ఎలా దేదీప్యమాన మవుతాయో చూడ మంటూ తొమ్మిదవ అధ్యాయం లోనే దైవీ ప్రకృతితో శోభించే మహాత్ములను కూడా పరిచయం చేశాడు.

పాండవా! మహాత్ములు దైవీ ప్రకృతిని ఆశ్రయిస్తారు ***(దైవీం ప్రకృతిం ఆశ్రితాః).*** నేను సర్వ భూతాలకు కారణ మని, నశించే వాడిని కానని వారికి తెలుసు. అందుచేతనే ఏకాగ్రచిత్తులై వారు నన్నే ఆరాధిస్తారు

అదేమిటి? నువ్వు ఒక్కడివే తిరిగినట్లు మాట్లాడుతున్నావు? హిరణ్యకశిపుడు కూడా నీ కన్నా ఎక్కువ గానే తిరిగాడు కదా! అన్నాడు విష్ణుమూర్తి.

నారదా! నేను ఎక్కడున్నా, ఏ లోకంలో ఉన్నా హిరణ్యకశిపుడు నా జాడ కనిపెట్టేస్తాడు. ఎక్కడ దాగితే అతడు కనిపెట్ట లేడో అక్కడ దాగాను అన్నాడు విష్ణుమూర్తి. అదెక్కడ స్వామీ? మీరు దాగింది ఎక్కడ? అని అడిగాడు నారద మహర్షి.

నారదా! నేను దాగింది హిరణ్యకశిపుని హృదయం లోనే. హిరణ్యకశిపుడు అహంకారి. తన కన్నా వేరైన ప్రదేశాలలో అన్వేషిస్తాడే గాని, తనలో తాను తల వంచి, అంతర్ముఖుడై చూడడు. అందుకనే నన్ను నేను దాచుకోవడానికి అదే అనువైన చోటు అని భావించి, అతని హృదయం లోనే ఒదిగి పోయాను అని రహస్యాన్ని విప్పి చెప్పాడు వైకుంఠ పతి.

### కృతకృత్యుడు

పరమాత్మ జ్ఞానమును పొందిన వాడు కృతార్థు డవుతున్నాడు. ఆత్మయే పరమాత్మ అనే జ్ఞానము మహోన్నత మైంది. పరమాత్మ జ్ఞానమును పొందిన వాడు అంతకు మించి పొంద వలసింది ప్రపంచములో మరొకటి ఉండదు. **పర** అంటే ఉత్కృష్ట మైనది అని అర్థము ***(పరః సర్వ భూతేభ్యః ఉత్కృష్టం బ్రహ్మ)***. అట్టి పరమాత్మ జ్ఞానము ప్రాప్తించిన వాడు కృతకృత్యు డవుతున్నాడు.

కృత్యము అంటే కార్యము. కృతం అంటే చేయబడింది. ఏది కర్తవ్యమో అదే కృతం. కర్తవ్యము అంటూ మిగలకుండా చేయ వలసిన కార్యము లన్నీ చేసేసిన వాడు కృతకృత్యుడు ***(కృతం కృత్యం కర్తవ్యం యేన సః కృత కృత్యః)***. ఎలాగైతే స్వప్నంలో చేయ వలసిన కర్తవ్యా లన్నీ మేలుకోగానే చేసినట్లే అవుతున్నాయో, అలాగే భగవ త్తత్త్వాన్ని తెలుసుకుంటే చేయ వలసిన కర్తవ్యా లన్నీ చేసినట్లే అవుతున్నాయి. అట్టి వాడు కృతకృత్యుడు అవుతున్నాడు ***(యత్ కర్తవ్యం తత్ సర్వం భగవత్తత్త్వే విదితే కృతం భవేత్ ఇత్యర్థః)***. ఈ విధంగా సమస్త కర్మలు జ్ఞానములో లయించి పోతున్నాయి *( 4 వ అ - 33 వ శ్లో )*. ఈ విధమైన అత్యంత రహస్యమైన బ్రహ్మాత్మ జ్ఞానమును బోధించి, అర్జునుణ్ణి కృతార్థుణ్ణి చేశాడు కరుణా సముద్రుడైన భగవంతుడు.

'అర్జునా! గుహ్యతమ మైన శాస్త్రాన్ని నీకు బోధించాను. పరమార్థ స్వరూపమైన పురుషోత్తమ తత్త్వమును నా ద్వారా శ్రవణం చేసి నువ్వు కృతార్థుడ వయ్యావు, కృతకృత్యుడ వయ్యావు' అని పలుకుతూ పదిహేనవ అధ్యాయాన్ని పరమేశ్వరుడు సమాప్తం చేస్తున్నాడు ***(ఏతత్ పరమార్థ తత్త్వం మత్తః శ్రుతవాన్ అసి తతః కృతార్థః త్వం భారత ఇతి )***.

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే
పురుషోత్తమప్రాప్తి యోగో నామ పఞ్చదశోఽధ్యాయః

**ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు పురుషోత్తమప్రాప్తి యోగ మనే పదిహేనవ అధ్యాయము.**



# చైతన్య భగవద్గీత

## అథ షోడశోఽధ్యాయః - పదహారవ అధ్యాయము

## దైవాసుర సంపద్విభాగ యోగః - దైవాసుర సంపద్విభాగ యోగము

### చీకటి వెలుగులు

ఎవరైనా, ఎక్కడైనా, ఎప్పుడైనా వెలుగునే వాంఛిస్తారు. ప్రకాశాన్నే కాంక్షిస్తారు. తేజమునే ఆహ్వానిస్తారు.

చీకటి ఎవరి కైనా చికాకును కలిగిస్తుంది. చిడి పడేలా చేస్తుంది. కనుక, అందరూ వెలుగునే ఆదరిస్తారు. చీకటిని సర్వులూ చీదరించు కుంటారు.

కొందరికే పరిమితం కానిది, అందరూ ఆహ్వానించేది, ఆదరించేది వెలుగే అయినా, చీకటిలో ఉన్న వారికే వెలుగు యొక్క విలువ విశిష్టంగా తెలుస్తుంది. పంజరంలో బంధించ బడిన పక్షికే స్వేచ్ఛా విహారంలో ఉండే హాయి అవగత మవుతుంది. అనారోగ్యంతో అలమటించే వారికే ఆరోగ్యంలో ఉండే సుఖం అర్థ మవుతుంది. జనతకు దూరమై కారాగృహంలో కుమిలే ఖైదీకే జన సమూహంలో ఉండే జవము గోచర మవుతుంది. ఈ కారణం చేతనే, కేవలం వెలుగుల్ని మాత్రమే ఆరబోయడానికి ఆవిర్భవించిన శాస్త్రాలు అప్పు డప్పుడు, అక్కడక్కడ చీకట్లను కూడా చూపెడుతూ చర్చిస్తూ ఉంటాయి. దాని ఉద్దేశ్యం చీకటిలో పయనించ మని కాదు, చింతలలో శయనించ మనీ కాదు. ఏది పొంతమో, ఏది అంతమో పరిశీలించి అర్థం చేసుకోమని. విశ్లేషించుకొని ప్రయాణాన్ని సుగమం చేసుకోమని. శాస్త్రము వెలుగుల బాటలో అక్కడక్కడ నీడల్ని చూపిస్తూ నడక సాగించేది ఇందుకే.

అర్జునా! దుష్టులు, మూఢులు, నీచులు, మాయలో పడిన అవివేకులు - ఆసురీ సంపద కలిగిన ఈ అధములు ***(ఆసురం భావ మాశ్రితాః)*** నన్ను పొంద లేరు అన్నాడు ఏడవ అధ్యాయంలో భగవంతుడు *(7వ అ - 15 వ శ్లో)*.

తిమిరంలో దూరి తారాడుతూ, తచ్చాడుతూ ఉన్న ఆసురీ ప్రకృతి కల వారిని విజ్ఞాన యోగంలో ప్రవేశ పెట్టిన భగవానుడు, పునః తొమ్మిదవ అధ్యాయం పన్నెండవ శ్లోకంలో పరామర్శిస్తూ మోహంలో కూరుకు పోతారు అని హెచ్చరించాడు.

పార్థా! వీరి ఆశలు వ్యర్థం. వీరి కర్మలు అనర్థం. వీరి జ్ఞానం అసమర్థం. వీరిది రాక్షసీ ప్రకృతి. ఆసురీ ప్రకృతి. వీరు మోహ కూపంలో పడి పోతారు అంటూ రాక్షసులకు, అసురులకు మధ్య ఉండే స్వల్పమైన అంతరాన్ని కూడా స్పృశిస్తూ రాజవిద్యా రాజగుహ్య యోగంలో మళ్ళీ చీకటి తెరను ముందుకు తెచ్చాడు వాసుదేవుడు *(9 వ అ - 12 వ శ్లో)*.

చీకటి బ్రతుకులు ఇలా వ్యర్థ మైపోతూ ఉంటే, కాంతిమయ జీవితాలు ఎలా దేదీప్యమాన మవుతాయో చూడ మంటూ తొమ్మిదవ అధ్యాయం లోనే దైవీ ప్రకృతితో శోభించే మహాత్ములను కూడా పరిచయం చేశాడు.

పాండవా! మహాత్ములు దైవీ ప్రకృతిని ఆశ్రయిస్తారు ***(దైవీం ప్రకృతిం ఆశ్రితాః)***. నేను సర్వ భూతాలకు కారణ మని, నశించే వాడిని కానని వారికి తెలుసు. అందుచేతనే ఏకాగ్రచిత్తులై వారు నన్నే ఆరాధిస్తారు

అంటూ, రాజవిద్యా రాజగుహ్య యోగం లోనే వెలుగుల తోరణాలను దర్శింప చేశాడు (9 వ అ - 13 వ శ్లో). ఈ విధంగా తొమ్మిదవ అధ్యాయంలో దైవ ప్రకృతి, ఆసురీ ప్రకృతి, రాక్షస ప్రకృతి - ఈ మూడిటిని సూచించాడు.

**ఉభయ ప్రకృతులు**

సాధారణంగా మనకు వెలుగులు బాహ్యంలో విరబూస్తాయి. అందుకే కళ్ళు తెరచి బాహ్యాన్ని చూస్తాము. కళ్ళు మూస్తే అంతా చీకటిగా ఉంటుంది. అంతరంగ మంతా అంధకార మయంగా గోచరిస్తుంది. ఇది వాస్తవ మేనా? కాదు. మనకు అలా తెలుస్తూ ఉందే గాని వాస్తవం అలా లేదు. సత్యం మరో విధంగా ఉంది.

బాహ్యంలో వెలుగులు లేవు. బాహ్య మంతా చీకటిమయం. వెలుగు అనేది లోపలే ఉంది. అది మారని వెలుగు. ఆరని వెలుగు. ఒకవేళ బాహ్యంలో వెలుగులు ఉన్నట్లు అనిపించినా, వాస్తవానికి అవి ఆంతర్యంలో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న ఆత్మ భాస్కరుని జ్ఞాన కిరణాలే ( ***తమేవ భాన్తం అనుభాతి సర్వం, తస్య భాసా సర్వ మిదం విభాతి*** - కఠోపనిషత్ ). ఈ విషయాన్ని పూర్వాధ్యాయం ఆరు మరియు పన్నెండవ శ్లోకాలలో సుదీర్ఘంగా చర్చించి, సుస్పష్టంగా దర్శించాము కనుక ప్రస్తుతం విస్తరించి చెప్పుకో నవసరం లేదని భావిస్తున్నాను.

ఇకపోతే, ఈ భిన్న ప్రకృతులు గల వారి ప్రయాణాలు ఏ దిక్కుగా ఉన్నాయి అని విచారిస్తే, దైవీ సంపద కల వారిది వెలుగు బాట. ఆసురీ సంపద కల వారిది చీకటి దారి. వెలుగు బాటలో పయనించే వారు అంతర్ముఖులై వెలు గున్న చోటికి పయనిస్తూ ఉంటే, చీకటి దారిలో చరించే వారు బహిర్ముఖులై అంధకారంలో అలమటిస్తూ ఉంటారు.

దైవీ సంపద కల వారు వెలుగు బాటలో ఉన్నారు కనుక మెల్ల మెల్లగా చైతన్యం వైపుకు సాగిపోతూ ఉంటారు. ఆసురీ సంపద కల వారు చీకటి దారిలో పడి పోతున్నారు కనుక, మార్గ మేదో అర్థం కాక నామరూపాలను వాటేసుకొని, వాటితో సహవాసం చేస్తూ వాటి మధ్యే జీవిస్తూ ఉంటారు.

దారి తప్పి, అడవిలో కంటకాల మధ్య చిక్కుకున్న వారిని మెల్లగా, ముళ్ళను విడిపించి, చేయి పట్టుకొని నడిపించి, సురక్షితంగా ఇల్లు చేర్చేది దైవ మార్గము. ఇంటిలో క్షేమంగా ఉన్న వారిని బలవంతంగా ఈడ్చుకొని పోయి చీకటి అరణ్యాల లోకి తోసేసేది ఆసురీ మార్గము.

దైవీ ప్రకృతిని ఆశ్రయించిన వారు ఊర్ధ్వ దృష్టి కలిగి ఆదిమూలాన్ని అన్వేషిస్తూ పై పైకి పోతూ ఉంటే, ఆసురీ ప్రకృతిని ఆశ్రయించిన వారు అధోదృష్టిని కలిగి కొమ్మలను పట్టుకొని జారుతూ పతనమై పోతారు. చీకటి గుహలో పడి పరిభ్రమిస్తూ ఉంటారు.

కనుక, జననమరణ సంసార చక్రము నుండి విడిపించి తరింప చేసేది దైవీ ప్రకృతి అయితే, సంసార సుడి గుండంలో పడదోసేది ఆసురీ ప్రకృతి. దైవీ ప్రకృతి మోక్ష హేతువైతే, ఆసురీ ప్రకృతి బంధహేతువు అవుతూ ఉంది ( ***సంసార మోక్షాయ దైవీ ప్రకృతిః నిబద్ధాయ ఆసురీ రాక్షసీ చ*** ). ఇక దేనిని తగిలించు కోవాలో, దేనిని తొలగించు కోవాలో ఎవరికి వారే నిర్ణయించుకోవాలి.

**నిత్య పోరాటము**

రెండు ఉండటం దోషం కాదు. కాని, అవి ఎందు కున్నవో అర్థం కావాలి. కళ్ళు రెండున్నాయి. రెండు కళ్ళు ఒకే పనిని చేస్తున్నాయి. అలా ఉండ గలిగితే రెండు ఉండటం దోషం కాదు. పైగా, ప్రగతికి సోపానా లవుతాయి. అలా కాకుండా రెండు ఉండి, అవి పరస్పర విరుద్ధమైన ప్రకృతులతో కొనసాగే టప్పుడు, ఆ రెండిటిలో ఏది శ్రేయస్సో దానిని ఉంచు కోవాలి. ఏది పతన హేతువో దానితో సంబంధం త్రెంచుకోవాలి.





ఒకవేళ రెండూ కలిసిపోయి ఏకమై ఉంటే; పాలను, నీళ్ళను వేరు చేసి హంస పాలను పానం చేసినట్లు, ఒక దాని నుండి మరొక దానిని వేరు చేసి మోక్ష హేతువు ఏదో దానిని సొంతం చేసుకోవాలి.

పండు సాత్వికాహారము. ఆరోగ్యప్రద మైంది కూడా. అలాంటి ఫలాహారాన్ని స్వీకరించే టప్పుడు కూడా అవసరం లేని దానిని పరిహరించి అవసరమైన దానిని గ్రహిస్తున్నాము. అరటిపండు అయితే, తొక్కను పడేసి పండును తింటున్నాం. మామిడి పండు అయితే, గుజ్జును తిని తొక్కను, పిక్కను పడేస్తున్నాం. తొక్కలు, పిక్కలు పండ్లతో కలిసి ఉన్నా, త్యజించ వలసిన వాటిని త్యజిస్తున్నాం. గ్రహించ వలసిన వాటిని గ్రహిస్తున్నాం. అదే విధంగా, ఒకే వ్యక్తిలో దైవీ ప్రకృతి, ఆసురీ ప్రకృతి రెండూ కలిసిపోయి ఉన్నప్పుడు, వివేకంతో, విచక్షణతో విచారించి, ప్రగతి హేతువైన దైవీ సంపద కొరకు ప్రయత్నించాలి. ఈ కార్యము జరగ నపుడు పరస్పర విరుద్ధ మైన ఆ ప్రకృతుల మధ్య సమరం ఆరంభ మవుతుంది. అందుకే రెండున్న చోట కలహా లుంటాయి. భయా లుంటాయి. బాధ లుంటాయి. బ్రతుకులు భారంగా మారుతూ ఉంటాయి.

ఇవే వ్యక్తి జీవితంలో నిత్య పోరాటా లవుతాయి. ఈ పోరాటాలే ప్రపంచంలో మనకు అనేక చోట్ల గోచరిస్తూ ఉంటాయి. కుళాయిల వద్ద ఉంటాయి. ఇళ్ళల్లో వ్యక్తుల మధ్య ఉంటాయి. కార్యాలయాలలో ఉద్యోగుల మధ్య ఉంటాయి. రాజకీయ పార్టీల మధ్య ఉంటాయి. వీధుల్లో వినిపిస్తాయి. క్లబ్బుల్లో కనిపిస్తాయి. అసెంబ్లీలో అగుపిస్తాయి. సంతలో వింత లనిపిస్తాయి.

కలహాలు ఎక్కడైనా కనిపించ నివ్వండి. అవి పుట్టేది మాత్రం వ్యక్తి లోనే. ఏ నది అయినా ఎక్కడో, ఒక కొండపై నుండి చిన్న ధారగా, లేదా పాయగా ఆరంభ మవుతుంది. ప్రవాహంలో కాలువలు, వాగులు, చిన్న చిన్న నదులు వచ్చి కలుస్తూ ఉంటాయి. ఒక దశలో విశాలమైన ఒక జీవనది కళ్ళ ముందు గంభీరంగా ప్రవహిస్తూ కనిపిస్తుంది.

వ్యక్తిలో పురుడు పోసుకున్న చిన్నపాటి ఘర్షణలు చిలికి చిలికి గాలివాన లవుతాయి. కాల క్రమేణ అవే సమర నదికి ప్రాణం పోస్తాయి. అనేక మంది ప్రాణాలు కోల్పోవ డానికి కారణ మవుతాయి. అది కళింగ యుద్ధము కావచ్చు. కురుక్షేత్ర సమరం కావచ్చు. లేదా రామరావణ సంగ్రామం కావచ్చు. పల్నాడులో పడగ విప్పినా, బొబ్బిలిలో బెబ్బులియై గాండ్రించినా, దాని ఉద్గమ స్థానము మాత్రం వ్యక్తి హృదయమే. సరస మైనా, విరస మైనా అక్కడి నుండే కదలాలి.

హృదయం కదన రంగమైతే, ఇక సంసార చక్రము పరిభ్రమిస్తూనే ఉంటుంది. సంసార సంతాపం తొలగా లన్నా, నిత్య వెలుగులతో బ్రతుకు విరాజిల్లా లన్నా, మోక్ష మార్గం సుగమం కావాలన్నా హృదయంలో రణం ఆగాలి. అప్పుడే సంసార ఋణ విముక్తి కలుగుతుంది.

పల్లవి : **రణమే బ్రతుకంతా**
**ఋణమే జీవన సంత**
**అంతా ఒకటే చింత**
**జగమంతా ఇదే వింత** ॥ రణమే ॥

చరణములు : **(1) పోయే పరువులు చేరే అరువులు**
**కరువులే జీవికి అంతా**
**ఆశల వేడుకలు నిరాశల ఏడుపులు**
**వీడవు జీవిత మంతా** ॥ రణమే ॥

(2) తుది ఊపిరి వీడే లోగా
ఆది ఎక్కడో తెలియాలి
ఆదిదేవుని అండ దొరికితే
రణము లన్నీ విజయాలే
ఋణము లన్నీ వీడుకోలే ॥ రణమే ॥

అంటూ బ్రతుకు ఋణాన్ని, జీవన రణాన్ని కళ్ళ ముందు ప్రదర్శిస్తూ, విజయ యాత్రను సాగించ మని సందేశ మిచ్చింది చైతన్య గీతిక.

## సమరం నుండి సన్నిధికి

కదన కలహాలకు దూరమైన బ్రతుకే కళకళ లాడుతుంది. సంఘర్షణల నుండి విడిపడిన మనస్సే సంతతానంద సంధాయక మవుతుంది. కొట్లాటల రణగొణ ధ్వనుల మధ్య గుడి గంటలు వినిపించవు. కుతంత్రాల కుతకుతల మధ్య మంత్రాలు ఫలించవు. ప్రమాదాల మధ్య ఎక్కడి ప్రమోదాలు? ఏవి ప్రసాదాలు?

ఆదిదేవుని అండ దొరకాలంటే అజ్ఞానం అంతం కావాలి. ఆనంద నిలయంలో అజ్ఞానికి ప్రవేశం ఉండదు. మోహం తొలగితేనే మోక్షము. అసమ్మూఢుడే ఆనంద మోహనుని ఆలయం లోకి ప్రవేశించ గలడు. సత్యాన్ని సందర్శించ గలడు.

**యో మా మేవ మసమ్మూఢో జానాతి పురుషోత్తమమ్!**

'అర్జునా! మోహము నుండి విడిపడిన వాడే క్షరాక్షరముల కంటే అన్యమైన, అతీతమైన, ఉత్తమ మైన పురుషోత్తమ తత్త్వమును పొందుతాడు' - ఇది పూర్వాధ్యాయానికి ముగింపు పలుకుతూ మాధవుడు పలికిన మాట. కనుక ఆసురీ ప్రకృతిని ప్రతి ఒక్కరు దూరం చేసుకోవాలి. దైవీ సంపదను ప్రోగు చేసుకోవాలి. దైవీ సంపదను స్వీకరించాలి. ఆసురీ సంపదను పరిత్యజించాలి (***దైవ్యాః ఆదానాయ ప్రదర్శనం క్రియతే, ఇతరయోః పరివర్జనాయ***). ఈ కార్యాన్ని సాధించ డానికే తొమ్మిదవ అధ్యాయంలో సూచన ప్రాయంగా తెలియ చేయబడిన ఈ ఉభయ ప్రకృతులను విస్తరించి ఈ షోడశాధ్యాయము ప్రారంభింప బడుతూ ఉంది (***ప్రాణినాం ప్రకృతయః నవమే అధ్యాయే సూచితాః ! తాసాం విస్తరేణ ప్రదర్శనాయ అయం అధ్యాయః ఆరభ్యతే !***).

జలక్షీర న్యాయానుసారం ఆసురీ సంపదను విస్మరించి, దైవీ సంపదను స్మరించే వారు, సాధించే వారు పూర్వ అధ్యాయాంత శ్లోకంలో మనం చెప్పుకున్నట్లు బుద్ధిమంతు లవుతారు. కృతకృత్యు లవుతారు (***కృతకృత్యః భవేత్ !***).

కృతకృత్యు లయ్యే వారెవరు? కాలేని వారెవ్వరు? అనే సందేహం కలగటం సహజము. సామాన్యము. తత్త్వజ్ఞాన సముపార్జనకు ఎవడు అర్హుడు? ఎవడు అనర్హుడు? అధికారిని, అనధికారిని గూర్చి విచారిస్తే కదా నిర్ణయ మయ్యేది! ఆ ప్రయత్నం లోనే ఈ అధ్యాయము ఆరంభ మవుతూ ఉంది.

***భారో యో యేన వోఢవ్యః స ప్రాగా తోలితో యదా ।***
***తదా కస్తస్య వోఢేతి శక్యం కర్తుం నిరూపణమ్ ॥***

'ఎవడు ఏ బరువును మోయవలసి ఉన్నా, ముందు దానిని వాడు కదిలించ గలిగితే, అతడు మోయ గలడా, లేదా? అనేది నిర్ణయించ వచ్చు'.

అలాగే, వ్యక్తి అసమ్మూఢుడై కృతకృత్యుడు కావాలంటే ముందుగా దైవీ సంపదను కలిగి ఉండాలి. అట్టి దైవీ సంపదకు సంబంధించిన వివేకాన్ని మొదటి మూడు శ్లోకాలలో అనుగ్రహిస్తున్నాడు ఆదిదేవుడు.





**శ్రీ భగవానువాచ :**

**అభయం సత్త్వసంశుద్ధి ర్జ్ఞానయోగ వ్యవస్థితిః ।**
**దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయ స్తప ఆర్జవమ్ ॥** 1

*అభయం-సత్త్వసంశుద్ధిః-జ్ఞానయోగ వ్యవస్థితిః*
*దానం-దమః-చ-యజ్ఞః-చ-స్వాధ్యాయః-తపః-ఆర్జవం*

| | | | |
|---|---|---|---|
| భారత | = అర్జునా! | దమః చ | = ఇంద్రియ నిగ్రహము |
| అభయం | = భయము లేని స్థితి | యజ్ఞః చ | = యజ్ఞము |
| సత్త్వ సంశుద్ధిః | = చిత్తశుద్ధి | స్వాధ్యాయః | = వేదాధ్యయనము |
| జ్ఞానయోగ వ్యవస్థితిః | = జ్ఞానము, యోగము నందు స్థిరత్వము | తపః | = తపస్సు |
| దానం | = దానము | ఆర్జవం | = ఋజుత్వము |

**శ్రీ భగవంతుడు చెబుతున్నాడు :**

**అర్జునా! అభయము, సత్త్వసంశుద్ధి, జ్ఞానయోగనిష్ఠ, దానశీలము, ఇంద్రియనిగ్రహము, యజ్ఞము, వేదాధ్యయనము, తపస్సు, ఋజుత్వము - ఇవి దైవీ సంపదతో జన్మించిన వారిలో కనిపిస్తాయి.**

**వ్యాఖ్య**

*అధశ్చోర్ధ్వం ప్రసృతాః తస్య శాఖాః* - సంసార వృక్షము యొక్క కొమ్మలు క్రిందికి, పైకి వ్యాపించి ఉన్నా యని పూర్వాధ్యాయంలో చెప్పుకున్నాం. క్రిందికి విస్తరించేది ఆసురీ ప్రకృతి కాగా, పైకి ప్రాకి పోయేది దైవీ ప్రకృతి. అసమ్మూఢుడై కృతకృత్యుడు కావాలని అభిలషించే వాడు క్రిందికి వ్యాపిస్తున్న ఆసురీ సంబంధ మైన శాఖల్ని ఖండించి, ఊర్ధ్వంగా ప్రాకుతున్న దైవీ సంబంధమైన శాఖల్ని పెంపొందించుకుంటూ ఉన్నతంగా చరించి వృద్ధిని సాధించాలి.

మొదటి మూడు శ్లోకాలలో ముందుగా దైవీ సంపదకు సంబంధించిన లక్షణాలను చెబుతున్నాడు. ఈ మూడు శ్లోకాలలో అభయాది దైవ లక్షణాలు ఇరవై ఆరు చెప్పబడ్డాయి. వాస్తవానికి ఈ మూడు శ్లోకాలను కలిపి ఒకేసారి వ్యాఖ్యానించాలి. ఎందుకంటే, ఈ మూడు శ్లోకాలకు సంబంధించిన ఒకే క్రియా పదము మూడవ శ్లోకము ఉత్తరార్ధంలో ఉంది. ***భవన్తి సమ్పదం దైవీం అభిజాతస్య భారత!*** - 'అర్జునా! (ఈ ఇరవై ఆరు లక్షణాలు) దైవీ సంపదతో జన్మించిన వారికి సంభవిస్తాయి' అనే క్రియా పదము కలిగిన వాక్యము ఇరవై ఆరు లక్షణాలు కలిగిన మూడు శ్లోకాలకు కలిపి వర్తిస్తుంది. అవగాహనా సౌలభ్యం కొరకు నేను ఒక్కొక్క శ్లోకాన్ని వేరు చేసి వ్యాఖ్యానిస్తున్నాను. కాకపోతే, మూడవ శ్లోకం చివర వచ్చే క్రియాపదంతో కూడిన వాక్యాన్ని ప్రతి శ్లోకానికి పాఠకులు అన్వయించు కోవాలి. ప్రస్తుతం మొదటి శ్లోకంలో తొమ్మిది లక్షణాలను భగవంతుడు చెబుతున్నాడు. చదవండి.

### (1) అభయం

అభయం అంటే భయం లేక పోవడము (***అభయం అభీరుతా***). ఇంతకీ ఏది భయం? ఏది అభయం? భయం అనేది వ్యక్తి మనస్సు లోని ప్రతిచర్య. ప్రతిస్పందన. అంతేకాని, భయ మనేది ప్రత్యేకంగా ఒకటి లేదు. దుఃఖానికి కారణమైన దానిని చూడటం వల్ల కలిగే బాధయే భయం. అది లేక పోవడము అభయము.

భయపడటానికి ఏదో కారణము ఉంటుంది. అలా ఒక నిమిత్తం వల్ల ఏర్పడేదే భయం. ***బిభేత్యస్మా దితి భయం*** - 'దీని వలన భయపడతారు' అని భయాన్ని నిర్వచించాడు అమరసింహుడు. పారమార్థికంగా భయ కారణము ద్వైతమే నని నిర్ధారణ చేసింది ఉపనిషత్తు.

***యదా హ్యేవైష ఏతస్మి న్నుదర మంతరం కురుతే అథ తస్య భయం భవతి*** - ఎప్పుడైతే పరబ్రహ్మము నందు స్వల్ప మైనను ***(ఉదరం)*** భేదమును ***(అంతరం)*** భావించడం జరుగుతుందో, అప్పుడు భయం కలుగుతుంది అన్నది తైత్తిరీయోపనిషత్. ఎప్పుడైతే రెండవ వస్తువు ఉందో, అదే భయ కారణ మవుతుంది. భేదమే ***(అంతరం)*** భయ కారణము. స్వల్ప భేదమున్నా ***(ఉదరం)*** అది భయాన్ని సృష్టిస్తుంది. అది స్వల్పంగా ఉండి భయాన్ని కలిగించడము లేదు. అది వేరుగా ఉండటం చేత చూచే వాడు స్వల్పంగా, అల్పంగా మారి భయానికి లోనవు తున్నాడు. ఎప్పుడైతే ప్రపంచం చూచే వాని కన్నా వేరుగా తెలుస్తూ ఉందో, తాను కాని ప్రపంచం అనంతంగా అగుపిస్తూ ఉన్నందున, దానిని చూచే తాను స్వల్పంగా మారి పోతున్నాడు. ఇదే భయానికి కారణము. కనుక భేదమే భయ కారణము ***(ద్వితీయాద్వై భయం భవతి)***. భేదము భయ కారణ మైంది కనుక అభేదము అభయ రూపము. కనుక భయం లేని అభయ స్థితి కలగాలి అంటే, అద్వయ రూపుడైన బ్రహ్మము తానే అని తెలియాలి. బ్రహ్మాత్మ జ్ఞానము కలగాలి. ఇదే పారమార్థికంగా అభయ స్థితి. ఇది సిద్ధావస్థ. కాని, ప్రస్తుతము మనము అధ్యయనం చేస్తున్న దైవీ సంపద సిద్ధావస్థకు సంబంధించింది కాదు. సిద్ధావస్థను చేర డానికి, అసమ్మూఢత్వమును సంపాదించు కోవడానికి సంబంధించిన సాధక దశ. సాధక దశలో పారమార్థిక అభయ స్థితిని ఊహించడము సాధ్య పడదు. ఏవి భయ హేతువులో వాటిని అర్థం చేసుకొని, వాటి మూలంగా బుద్ధిలో ఏ విధమైన ప్రతిచర్యలు లేకుండా ఉండటమే ఇక్కడ సాధక దశ లోని అభయ స్థితి.

వ్యావహారికంగా జీవితంలో ఏర్పడే భయాలలో అతి ప్రధాన మైంది మృత్యు భయం. మరణం అనేది ప్రతి మనిషికీ ఉంది. కనుక, మరణ భయం అందరికీ ఉంటుంది. ఇంతకీ మృత్యు భీతి ఎవరికి? చచ్చిన వాళ్ళకా, బ్రతికున్న వాళ్ళకా? చచ్చిన వాడు ఎలాగూ లేడు కదా! లేని వానికి మృత్యు భీతి ఎలా ఉంటుంది? కనుక, ఉన్న వాళ్ళకే మరణ భయం ఉంటుంది. జీవించి ఉన్న వారికే ఉంటుంది. ఎంత వరకు ఉంటుంది? మరణం రానంత వరకు ఉంటుంది. అంటే, జీవించి ఉన్నంత వరకు ఉంటుంది. జీవితాంతం అనుక్షణం వెంటాడుతూ ఉంటుంది అని అర్థం. ఇంక అభయ మెప్పుడు? ఇలాంటి చోటే కాస్త విచారం అవసరమై ఉంటుంది ***(అతః విచారః కర్తవ్యః)***.

ఏదైనా, ఎప్పుడైనా తెలియ నపుడే భయం ఉంటుంది. చీకటిలో మనిషి ఎందుకు భయ పడతాడు? ఏదీ కనిపించదు కనుక. ఏదీ అర్థం కాదు కనుక. బాహ్యంలో వెలుతురు ఉంటే భయం ఎలా ఉండదో, విషయము సుస్పష్టంగా అర్థమైతే, ఆంతర్యంలో, అంటే బుద్ధిలో చీకటి ఉండదు కనుక, భయం ఉండదు. ఇప్పుడు విచారిద్దాం.

మనిషికి మరణ భయం ఎందుకు కలుగుతూ ఉంది? ప్రస్తుతం లేని మరణం భవిష్యత్తులో రాబో తుంది అనేది భయ కారణమా? లేక ప్రస్తుతం ఉన్న తాను భవిష్యత్తులో లేకుండా పోతా డేమో అనేది భయ హేతువా?

తానెప్పుడూ ఉండాలి అనేది మనిషిలో స్వతస్సిద్ధమైన ఆకాంక్ష. తాను లేకుండా పోవడాన్ని మనిషి ఊహించ లేడు, భరించ లేడు, అంగీకరించ లేడు. కనుక మరణం ప్రతి మనిషికి భయ హేతువు అవుతూ ఉంది. ఇంతకీ తాను ఉండే వాడా? పోయే వాడా? మరణ ధర్మం కలవాడా? అమరణ ధర్మ రూపుడా? అనేది ముందుగా స్పష్టం కావాలి.





పుట్టేది ఏదైనా గిట్టేందుకే. జ్ఞానం తప్ప. పుట్టేది ఏదైనా గిట్టేదే అయినపుడు, పుట్టిన శరీరము కూడా ఎలాగైనా, ఎప్పుడైనా గిట్టేదే. మరణ ధర్మం గల దేహం విషయంలో మనిషికి దిగు లెందుకు? తాను మరణ ధర్మం గల దేహమా? లేక దేహియా? తాను దేహియే కాని దేహము కాదు.

చావడానికి పుట్టిన దేహము చచ్చి తీరుతుంది. పుట్టుక తెలియని దేహి, లేదా ఆత్మ ఎప్పుడూ చావదు. చచ్చే దేహాన్ని గూర్చి దుఃఖించ డానికి తాను దేహం కాదు. తానైన ఆత్మను గూర్చి దుఃఖించడానికి ఆత్మకు మరణం లేదు. ఇక దుఃఖం దేనికి? దుఃఖం లేనపుడు భయం ఎక్కడుంది? భయం లేని స్థితి అభయమే కదా! ఇలా విచారించుకొని, భయాన్ని తొలగించుకొని అభయ స్థితిలో ఉండటము కన్నా మించిన భాగ్య మేముంటుంది? అదే సంపద. దైవీ సంపద.

ప్రధాన దుఃఖ కారణమైన మరణ భీతిని ఎలాగైతే విచారంలో నివృత్తి చేసుకున్నామో, అలాగే అవాంతర దుఃఖ కారణాల వల్ల ఏర్పడే భయాన్ని కూడా అవగాహనలో తొలగించుకొని, అభయానుభూతిలో ఆనందంగా జీవన యాత్రను కొనసాగించాలి. అదే దైవీ ప్రకృతి.

ప్రియాప్రియ వియోగ సంయోగ రూపమైన దుఃఖానికి కారణమైన వాటిని వీక్షించడం చేత సంభవించే విషాదమే భయాన్ని కలిగిస్తుంది. ప్రియ మైనది పోతుందేమో, అప్రియ మైనది పోదేమో, లేక వస్తుందేమో అనే ఆలోచనే దుఃఖానికి, తద్వారా భయానికి కారణ మవుతూ ఉంటుంది. దీని నుండి విడిపడటమే అభయము.

ఈ ప్రపంచం ధర్మాలతో నడుస్తూ ఉంది. నియతితో కొనసాగుతూ ఉంది. ఇక్కడ ఎప్పుడు ఏది ఎలా జరగాలో అలా జరుగుతుంది. అలా జరగడం వెనుక కారణా లున్నాయి. కారణా లుండి జరిగే టప్పుడు అవి అనివార్యాలే గాని అసంభవాలు కావు. అసంభవా లైతే ఎందుకు జరుగుతాయి? వీటన్నిటి వెనుక, జ్ఞాన స్వరూపుడు, ప్రేమ మయుడు అయిన పరమేశ్వరుడే ఉన్నాడనే సత్యం అర్థమైతే, భక్తు లైన వారికి భయాలు దూర మౌతాయి. అభయం సంపదయై ఆశీర్వదిస్తుంది.

### భయము - భక్తి

భయ భక్తులు అనేవి ఒక సమాసంగా తెలుస్తూ ఉన్నా, ఒక మూస లోనివి మాత్రం కావు. ఎవరి వలన ఎవరికి భయమో నాకు తెలియదు కాని, ఎవరినీ భయపెట్టని వ్యక్తి, ఎవరి భయానికీ కారణం కానటువంటి వ్యక్తి ఎవరైనా ఉన్నారా అంటే, ఆయన ఎవరో కాదు, భగవంతుడే. పరమేశ్వరుడే. భయ హేతువు కాని వాడు, అభయ ప్రదానం చేసే వాడు ఒక్క భగవంతుడే.

ధర్మ రూపంలో ఉన్నది దైవమే. కర్మస్వేచ్ఛ మనకు ఉంది. కాని కర్మఫలాలను పరమేశ్వరుడే ధర్మ రూపంలో ఉండి మనకు అందిస్తాడు. కర్మ లైతే మన చేతుల్లో ఉన్నాయి కాని, కర్మఫలాలు మన అధీనంలో లేవు. నేడు మనం చేసే కర్మలే మనకు తెలుసు. కాని, కర్మఫలాలు నేటి కర్మలకు మాత్రమే పరిమిత మైనవి కావు. గత జన్మలకు సంబంధించిన కర్మల యొక్క ఫలాలు కూడా నేడు మనకు అందుతూ ఉంటాయి. అందుకనే, జీవితంలో అనుకోని ఫలితాలను చూచి నపుడు మనమే విస్మయం చెందుతూ ఉంటాము.

నేను ఇంత భాగ్యానికి అర్హుడ నేనా? అని ఒక్కొక్కసారి మనల్ని మనమే ప్రశ్నించుకుంటూ ఉంటాము. ఈ నా లాంటి వాడికి ఈ దుర్గతి ఏమిటి? అని కొన్ని సమయాలలో దిగ్భ్రాంతి చెందుతూ ఉంటాము. ఈ ఉత్సాహ నిరుత్సాహాలకు, సుఖదుఃఖాలకు కారణం ఒక్కటే. పరమేశ్వరు డంటే ఏమిటో మనకు తెలియక పోవడమే. పరమేశ్వరునికి సంబంధించిన జ్ఞానం క్షుణ్ణంగా మనకు లేక పోవడమే.



4-12

ప్రియాప్రియా లనేవి మనం సృష్టించు కున్నవి. రాగద్వేషాలు మనం తయారు చేసుకున్నవి. ఇక్కడే భయాలు చేరు వవుతాయి. అభయం అదృశ్య మవుతుంది. ఏది మనకు ప్రాప్తించినా, అది ఈశ్వర ప్రసాద మని మనకు అర్థమైతే, ఏది వచ్చినా అది ప్రియం గానే ఉంటుంది. ప్రియ మైనది దుఃఖాన్ని కలిగించదు. దుఃఖము లేనపుడు భయం ఉండదు. భయం లేని స్థితి అభయమే కదా! అభయ రూపుడైన భగవంతునితో నిత్య సంబంధాన్ని ఏర్పరచు కోవడం వల్ల భయాలు దూర మవుతాయి. అభయం అనుగ్రహించ బడుతుంది. ఇంతకు మించిన సంపద ఏముంది? అందుకే ఇది దైవీ సంపద. భయాన్ని దూరం చేసే భక్తి సంపద.

ప్రపంచంలో సంపద లున్న వారు ఎందరో ఉన్నారు. వారందరు భయాల నుండి దూర మయ్యారా? పై పెచ్చు సంపదలే వారికి సంతాపాలను తెచ్చి పెడుతున్నాయి. సంపదలున్న వారికి తమ సంతానాన్ని చూచినా భయమే. ***పుత్రా దపి ధన భాజాం భీతిః*** - ధనవంతులకి పుత్రుల వల్ల కూడా భయమే అన్నారు భజగోవిందంలో శ్రీ ఆదిశంకరులు. సంపద లన్నీ భయహేతువు లవుతూ ఉంటే, దైవీ సంపద అభయ ప్రదానం చేస్తూ ఉంది. అందుకనే భక్తుల్ని చూచి భయం భయపడుతూ ఉంటుంది.

**మంచి కానిది మాయ యైనది**
**చెరిగి పోవునది భవ బంధము**
**ఒరిగి పోనిది కరిగి పోనిది**
**తరగనిది భక్తి అందము**
**భవ బంధాలు భయ రూపము**
**భక్తి అందాలు అభయము**
**రామ రామ జయ రాజారామ్**
**రామ రామ జయ సీతారామ్**

అని రామజోగి చిట్కా.

భగవంతుడు అభయ రూపుడు. అందుచేత భక్తులు కూడా అభయ స్థితి లోనే ఉండాలి. ఎలా జీవిస్తామో, ఏమౌతామో అనే భయం తెలియని వారు భక్తులు. ఇంత కాలం ఎవరి అనుగ్రహ ప్రసాదంతో జీవించామో, భవిష్యత్తులో కూడా ఆ కరుణా ఛత్రము క్రిందే జీవిస్తాము. ఎలా జీవిస్తామో అనే ఆలోచన ఎందు కొస్తుంది? చీమలు బ్రతుకు తున్నాయి. దోమలు బ్రతుకు తున్నాయి. చేపలు ఈదుతూ బ్రతుకు తున్నాయి. గువ్వలు ఎగురుతూ బ్రతుకు తున్నాయి. అన్నిటిని బ్రతికించే వాడు మన బ్రతుకును చూసుకోడా? ఇదే అభయం. దైవీ సంపద గల వారికి తరగని ఐశ్వర్యము.

## (౨) సత్త్వ సంశుద్ధి

సత్త్వ సంశుద్ధి అంటే అంతఃకరణ శుద్ధి. బుద్ధి శుద్ధి పడి ఉండటము. ఇక్కడ శుద్ధి అని సరిపెట్టకుండా సంశుద్ధి అని ఉపసర్గను చేర్చి చెప్పడం చేత, చక్కగా శుద్ధిపడి ఉండటము అని అర్థము. పరిశుద్ధముగా, అత్యంత నిర్మలంగా ఉండట మని భావము (***సత్త్వస్య అంతఃకరణస్య సంశుద్ధిః***). ఆచార వ్యవహారాల యందు పవిత్రంగా ఉండటమే సత్త్వ సంశుద్ధి. రజోగుణ, తమోగుణ ప్రభావాల నుండి విడిపడి, రాగద్వేషాలు లేని చిత్తమును, విక్షేపము లేని మనస్సును, పరిశుద్ధమైన బుద్ధిని కలిగి ఉండటమే సత్త్వ సంశుద్ధి. ఆంతర్యము ఎప్పుడైతే ఇలా శుద్ధి పడి ఉంటుందో, బాహ్య వ్యవహారాల యందు ప్రవర్తన పవిత్రంగా ఉంటుంది. ఇతరులను మోసం చేయడం, అంటే స్వార్థ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పరులను వంచించడం, మాయ చేసి మోసగించడం, వ్యవహారాలలో అనివార్యంగా అసత్యము పలకడం, ఇవన్నీ అశుద్ధము. ఈ విధమైన





అపవిత్ర వ్యవహారము లేని పరిశుద్ధ జీవనమే సత్త్వ సంశుద్ధికి నిదర్శనము (***సంవ్యవహారేషు పరవంచన మాయానృతాది పరివర్జనం శుద్ధభావేన వ్యవహారః ఇత్యర్థః***). ఇతరులను మోసం చేయడం పరవంచన అయితే, కపట వర్తనముతో, అసత్య భాషణముతో, ఆలోచనకు ఆచరణకు మధ్య అంతరాన్ని సృష్టించుకొని తనను తాను మోసగించు కోవడము మాయా జీవనము. బాహ్యాభ్యంతరాలలో, అంటే మనస్సులో, మనుగడలో ఇలాంటి పరిస్థితి లేకుండా ఉండటమే సత్త్వ సంశుద్ధి. జ్ఞానప్రాప్తికి ప్రధానమైన సుగుణము.

## (3) జ్ఞాన యోగ వ్యవస్థితి

జ్ఞానము నందు (***జ్ఞాన***), యోగము నందు (***యోగ***), స్థిరత్వమును (***వ్యవస్థితిః***) కలిగి ఉండటము జ్ఞానయోగ వ్యవస్థితి. ఇక్కడ 'స్థితి' అనకుండా 'వ్యవస్థితి' అనడం చేత జ్ఞానము నందు, యోగము నందు సుస్థిరత్వమును కలిగి ఉండటాన్ని సూచించడ మైంది. ఆత్మజ్ఞానమును సముపార్జించ దానికి కావలసిన పరినిష్ఠ ఈ లక్షణ వైశిష్ట్యము.

శాస్త్రము ద్వారా, ఆచార్యుని ద్వారా ఆత్మ తత్త్వమును, అనగా జీవ జగత్పరాత్మలకు సంబంధించిన జ్ఞానమును పొందుట, లేదా తెలుసుకొనుటయే జ్ఞానము (***జ్ఞానం శాస్త్రతః ఆచార్యతశ్చ ఆత్మాది పదార్థానామ్ అవగమః***). ఈ విధంగా శాస్త్రాచార్యోపదేశం కారణంగా ప్రాప్తించిన జ్ఞానాన్ని, ఇంద్రియాలను వశ పరచుకొని, మనస్సును నిగ్రహించి అనుభవం లోకి తెచ్చుకోవడమే యోగము (***అవగతానామ్ ఇంద్రియా ద్యుపసంహారేణ ఏకాగ్రతయా స్వాత్మ సంవేద్యతాపాదనం యోగః***).

ఇక్కడ జ్ఞానం అనేది విషయ జ్ఞానము కాదు. అంటే విషయ ప్రపంచానికి సంబంధించిన జ్ఞానము కాదు. విషయికి సంబంధించిన జ్ఞానము. తెలుసుకొనే వానిని గూర్చి తెలిపే జ్ఞానము. ఇది వ్యక్తిగతం కాదు. వ్యక్తి స్వరూప జ్ఞానము. అదేదో మనకై మనం ఊహించు కునేది కాదు. లేదా విచిత్రంగా ఒకనాడు మనకు కలిగే అనుభవమూ కాదు. మరొకరు చెబితేనే ప్రాప్తించే జ్ఞానము. అందుకే ఈ విషయంలో ఆచార్యునిది అగ్రస్థాన మైంది. శాస్త్రం ప్రమాణ మైంది.

ప్రమ అంటే జ్ఞానం. ఏ విషయానికి సంబంధించిన విషయ మైనా జ్ఞానమే. సంగీత శాస్త్రానికి సంబంధించిన విషయ మైతే సంగీత జ్ఞానము. వాస్తుకు సంబంధించిన విషయ మైతే వాస్తు జ్ఞానము. ప్రపంచంలో ఇలాంటి జ్ఞానాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. అవన్నీ స్థిర మైనవి కావు. మార్పు చెందే లక్షణాలు కలవి. అందుచేత అవి బాధితాలు. ఆత్మజ్ఞానము అలాంటిది కాదు. అది అబాధిత జ్ఞానము. ఏ కాలం లోను, ఏ పరిస్థితి లోను, ఏ ప్రదేశం లోను, ఎవరి చేతను నిషేధింప బడుటకు వీలు లేని జ్ఞానము. అట్టి జ్ఞానము ఆచార్యుడు అందించే ప్రమాణం ద్వారానే కలగాలి. మరో మార్గం లేదు. ఈ మార్గమే సంప్రదాయము. శిష్టాచార సంప్రదాయము.

గురుముఖతః అందిన ఆత్మజ్ఞానము స్వరూప జ్ఞానము కావడం చేత, ఆత్మానుభూతి కలగటానికి బాహ్య, అంతరేంద్రియ నిగ్రహము, సంశయ నివృత్తికి మననము కొనసాగించి, చివరగా నిదిధ్యాసనలో స్థిర పడాలి (***వ్యవస్థితిః వ్యవస్థానం తన్నిష్ఠతా***). ఇది యోగము. ధ్యానయోగము. ప్రతిబంధకాలు లేని జ్ఞానమును స్వానుభవానికి తెచ్చుకొనే అంతరంగ సాధన. ఈ విధంగా జ్ఞానము నందు, యోగము నందు వ్యవస్థానం, అంటే తదేక నిష్ఠ ప్రముఖమైన, సాత్త్వికమైన దైవ సంపద (***ఏషా ప్రధానా దైవీ సాత్త్వికీ సంపత్***).

## (4) దానము

ఇవ్వ దగిన దానిని (***దాతవ్యం***) ఇవ్వడము దానము. దానగుణము ఒక విశిష్ట లక్షణము. దైవీ సంపదకు సంబంధించిన లక్షణము. ఈ లక్షణము విశిష్ట మైనది కనుక, దీనిని విశిష్టం గానే అర్థం చేసుకోవాలి.

ఎవరి కైనా ఏదైనా ఇచ్చే టప్పుడు, 'మన మేదో ఉన్న వాళ్ళం, లేని వారికి ఇవ్వ గలిగే శక్తి ఉన్న వాళ్ళం' అనే భావనతో ఇస్తే అది దానం క్రిందికి రాదు. అదొక ప్రదర్శనము మాత్రమే. నిజమే. ఉన్నది కనుకనే ఇస్తున్నాం. లేని దానిని ఎలా ఇస్తాం? కాకపోతే, 'ఇవ్వ వలసింది ఉంది; అది ఇవ్వదగిన వారి కొరకే ఉంది' అనే భావనతో ఇవ్వడమే దానగుణ వైభవం. ఇక్కడే దానము దైవ సంపద అవుతుంది.

దీనంగా బిచ్చగాడు యాచిస్తే, బిచ్చం పెట్టే తల్లులు అంతకన్నా దీనత్వాన్ని ప్రదర్శిస్తూ దానం చేయడం మన సంస్కృతి లోనే చూస్తాం. బిచ్చగానికి దానం చేసి, రెండు చేతులు జోడించి నమస్కరిస్తారు తల్లులు. పెట్టేది బిచ్చ గాడికే అయినా, బిచ్చగాడిలో భగవంతుని చూడటం వల్లనే తల్లులు నమస్కరిస్తారు. ఇది వారి వ్యక్తిగత ఆధ్యాత్మిక సౌజన్యం. కాని, ఇందులో మరొక కోణం కూడా ఉంది. సామాజిక స్పృహ కూడా అంతర్లీనంగా ఉంది. దానం పుచ్చుకున్న వాడు దీనుడుగా వెను దిరిగి పోకూడదు. దీనత్వంతో బిచ్చగాడు యాచించినా, దాత నమస్కార సంస్కారాన్ని ప్రదర్శించి, అతని లోని దీనత్వాన్ని దూరం చేయడం సామాజిక స్పృహతో సాగించిన నిర్వాకము.

ఏది దానం చేసినా, ఎవరు దానం చేసినా, దానం చేసిన వాడికి నష్టము కలుగుతుంది అనేది స్పష్టము. అయినా ఉదారులు దాన గుణాన్ని వీడరు. అది నిజంగా నష్టమే అయితే, కలవారు ఎవ్వరైనా చేతులు ముడుచుకుంటారే గాని దాతృత్వంతో ముందుకు చాచ లేరు. కనుక, దానం చేయడంలో నష్టం లేదు. పైగా, ఏ లాభమూ ఇవ్వలేని సంతృప్తిని దానం ప్రసాదిస్తుంది. అందుకే మన సంస్కృతిలో దానం విశిష్టమైన గుణంగా పరిగణింప బడింది. దానం అంత గొప్పది కనుకనే, కొందరు రాజ్యాలను త్యజిస్తే, మరి కొందరు శరీరాలను సైతం పరోపకారార్థం త్యాగం చేశారు. అలాంటి త్యాగాల ఫలంగా వారు అమృతత్వాన్ని పొంది తరించి పోతే, ప్రపంచం వారిని త్యాగధనులుగా కీర్తించి నీరాజనాలు పడుతూనే ఉంది.

దానం చేయడంలో బాహ్యానికి వస్తు రూపేణ నష్టం కనిపించ వచ్చు గాని, బుద్ధిలో భావ రూపంలో నష్ట మనేదే లేదు. నష్ట పోయా మనే భావన లేక పోవడమే గాక, ఏదో అనిర్వచనీయ మైన తృప్తి, ఆనందము మనస్సులో నిండి పోతాయి. అదే దాన గుణ వైభవము.

*దానం యథా శక్తి సంవిభాగః అన్నాదీనాం* - భోజ్యమైన అన్నము మొదలైన పదార్థములను యథోచితంగా ఇతరులకు పంచి పెట్టడం దానం అని ఆచార్యుల వారు వ్యాఖ్యానించారు.

మన సంస్కృతిలో జ్ఞానదానం తరువాత, అన్నదానముకే ప్రాముఖ్యము. కారణము ఒక్కటే. సంతృప్తి పూర్ణత్వము అనే దానిని ఈ రెండిటి లోనే చూడ గలము. జ్ఞానం ప్రాప్తిస్తే, మనిషి ఆత్మవిదుడై, ఆప్తకాముడై, నిత్యతృప్తు డౌతాడు. అందుచేత జ్ఞానదానానికే అగ్రతాంబూలము.

ఇక అన్నదానం విషయాని కొస్తే, అన్నం జ్ఞానం లాగా నిత్యతృప్తిని పంచలేక పోయినా, ఆ సమయానికి పూర్ణత్వమును ప్రసాదించి, తాత్కాలికంగా నైనా సరే తృప్తి పరచి, మనిషి చేత 'చాలు - తృప్తిగా ఉన్నాను' అని అనిపిస్తుంది. జ్ఞానదాన, అన్నదానాలలో తప్ప మరొక చోట 'చాలు' అనే పదమును విన లేము.

ధనమును ఎంత ఇచ్చినా, మనిషి 'చాలు' అని అనడు. అనుకోడు. మరి కొంత వస్తే బాగుండును అని ఆశిస్తాడు. పదవి వచ్చిందని సంతోష పడినా, అంత కన్నా పెద్ద పదవి వచ్చి ఉంటే బాగుండేది అని అను కుంటాడే గాని, తృప్తి చెందడు. జ్ఞానానికి అందరూ అర్హులు కాక పోవచ్చు. కాని, ఆకలి అందరికీ ఉన్నందున, అన్నాన్ని ఆరగించడానికి అందరూ అర్హులే. కనుక అందరినీ అందరూ తృప్తిపరచ గలిగింది ఒక్క అన్నదానం లోనే. అందువల్ల దానాలలో అన్నదానానికి విశిష్ట స్థానం లభించింది. ఈ కారణం చేతనే ఉదారు లందరూ





కలిసి అన్నదాన సత్రాలు నిర్మించారు. నిత్యాన్నదాన సత్రాలు నేడు కూడా విశేషంగా నడుస్తున్నాయి. సంపన్నులు, వదాన్యులు అన్య ప్రాంతాల కెళ్ళి అక్కడ తీర్థ క్షేత్రాలలో అన్నపూర్ణా సదనాలను ఏర్పాటు చేసి యాత్రికులకు అన్న వసతులు కల్పించి పుణ్యాన్ని ప్రోగు చేసుకుంటూ తృప్తి చెందు తుంటారు. ధనం ఎందరి వద్ద నైనా ఉండ వచ్చు. ధనవంతు లందరూ దానవంతులు కాలేరు. దానప్రియులు కాలేరు. దాన మనేది గుణ ప్రధాన మైనదే గాని ధనప్రధాన మైనది కాదు. అందుచేత దానగుణము దైవ సంపద కల వారి లోనే ఉంటుంది.

దాన మనే ఈ ప్రధాన లక్షణములో ముఖ్యంగా ఒక్క వాస్తవాన్ని సాధకులు గుర్తించాలి. ఇక్కడే దాన క్రియ దైవ దర్శనంగా మారుతుంది. దానం అనేది కేవలం ఒకరు మరొకరికి ఇచ్చేది కాదు. అలా చూస్తే, దానం ఇచ్చే వాడు, దానం పుచ్చుకొనే వాడు ఇద్దరే ఉంటారు. కాని, దానం అనేది ఇచ్చేది కాదు. సమర్పించేది. అలాగే పుచ్చుకొనేది కాదు. ప్రసాదంగా స్వీకరించేది. ఇది దానం విషయములో సంప్రదాయం మనకు నేర్పిన సదాచారము.

దాన మనేది ఇవ్వడము, పుచ్చుకోవడము మాత్రమే అనుకుంటే, ఇచ్చేవాడు, పుచ్చుకొనే వాడు ఇద్దరే ఉంటారు. దానాన్ని సమర్పణంగా భావిస్తే, ఆ ఇరువురితో పాటు మూడవ వ్యక్తి కూడా ఉంటాడు. వాస్తవానికి అతడు వ్యక్తి కాదు, అద్భుతమైన శక్తి. అతడే భగవంతుడు. గ్రహీత, అనుగ్రహీత మధ్య అదృశ్యంగా నిలబడి, ఇచ్చే వానిలో కర్తృత్వాన్ని, పుచ్చుకొనే వానిలో భోక్తృత్వాన్ని లేకుండా చేసి ఉభయులను ఆశీర్వదించే పరమేశ్వరుడు. ఇలా దాన మనే కార్యంలో దైవం ప్రవేశిస్తూ ఉన్నందున, దాన మనేది దైవ సంపదగా పరిగణింప బడింది.

## (5) దమము

దమము అంటే ఇంద్రియ నిగ్రహము. ముఖ్యంగా ఈ సందర్భములో బాహ్యేంద్రియ నిగ్రహము ***(దమః చ బాహ్య కరణానామ్ ఉపశమః )***. ఇంద్రియాలను విషయాల నుండి విరమింప చేయడము. ఇది దమము. మరి, అంతరేంద్రియ నిగ్రహం విషయ మేమిటి అనే సంశయం కలగ వచ్చు. అది శమము. మనో నిగ్రహానికి సంబంధించింది. అది అంతఃకరణ ఉపశాంతి కనుక, దానిని 'శాన్తి' అనే పద్నాల్గవ లక్షణంలో చెబుతాడు ***(అంతఃకరణస్య ఉపశమం శాంతిం వక్ష్యతి )***. హనుమంతుడు రచించిన పైశాచ భాష్యం మాత్రము దమమును అంతఃకరణము యొక్క ఉపరతిగా వ్యాఖ్యానించింది. అందుచేత 'శాంతి' లక్షణాన్ని ఇంద్రియ నిగ్రహంగా అభివర్ణించింది. ఎలాగైనా, ఇంద్రియ మనస్సులు రెండూ నియమింప బడటమే ప్రధానమైన విషయము.

ప్రస్తుతం దమము అంటే శ్రోత్రాది జ్ఞానేంద్రియాలను నియమించడము అని అర్థము. ఇంద్రియాలను, అంటే నేత్రాది ఇంద్రియాలను, కేవలం మాంస, రుధిర చర్మాదుల సముదాయంగా భావించడానికి వీలు లేదు. మనోశక్తి ఈ ఇంద్రియాల ద్వారానే బాహ్యం లోకి ప్రసరిస్తూ ఉంటుంది.

ఇంద్రియాలను ఇంద్రియ విషయాల నుండి వెనుకకు మరలించడమే దమము. యోగశాస్త్రంలో దీనినే ప్రత్యాహార మంటారు. మనస్సులో ఎలాంటి మార్పులు కలుగుతూ ఉంటాయో, అలాంటి మార్పులే ఇంద్రియా లకు కూడా కలుగుతూ ఉంటాయి. కోపము అనేది మనో వికారము. కాని, మనం పరిశీలించి చూస్తే, కోప మొచ్చిన వ్యక్తి కళ్ళు ఎఱ్ఱబడతాయి. ఇంద్రియ మనస్సులు అన్నీ గుణ వికారాలే కనుక, గుణ కార్య మైనది ఏదీ గుణ లక్షణాలైన పరిణామాలకు విలక్షణంగా ఉండ లేదు. కాకపోతే, ప్రత్యక్షంగా మనస్సును నిగ్రహించే అవకాశము లేనపుడు, ముందుగా ఇంద్రియాలను నియమించ గలిగితే, ఆ తరువాత మెల్లగా చిత్తమును నిరోధించ వచ్చు. అందుచేత శమము కన్నా ముందు దమము చెప్పబడింది. దమము అనేది నిగ్రహం కావడం చేత అది దైవ సంపద లక్షణము.

ఇంద్రియాలు ఎప్పుడైనా ప్రేయో మార్గంలో పయనిస్తాయే గాని, శ్రేయో మార్గంలో చరించవు. వాటికి కావలసిన విషయాల్ని కోరుకుంటాయే గాని, మన అవసరాల్ని పట్టించుకోవు. అవి సుఖ పడటానికి ఏవి భోగ్యాలో వాటిని పట్టించుకుంటాయే గాని, మనం హాయిగా ఉండటానికి ఏవి యోగ్యాలో వాటిని గూర్చి చెప్పినా పట్టించుకోవు.

అందుచేత ఇంద్రియాల విషయంలో సాధకులు జాగరూకులై ఉండాలి. పాండిత్యాలు పలాయనం చిత్తగించేది ఇక్కడే.

***లోకము లన్నియుఌన్ గడియ లోన జయించిన వాడ వింద్రియ నీకము జిత్తమున్ గెలువ నేరవు*** - 'తండ్రీ! లోకా లన్నిటినీ క్షణాలలో జయించావు. కానీ, బాహ్య శత్రువుల్ని జయించిన నీవు, నీ అంతశ్శత్రువు లైన ఇంద్రియ మనస్సులను జయించ లేక ఓడి పోయావు' అన్నాడు భాగవతంలో ప్రహ్లాదుడు.

పాము గది లోకి ప్రవేశించిందని తెలియ గానే ఆ గదిలో ఉండే వారు ఎలా జీవిస్తారు? ఇంద్రియాల విషయంలో అందరూ అలా జాగరూకులై ఉండాలి. పాముకు పండిత పామర తారతమ్యం ఉంటుందా? ఇంద్రియాలకూ అంతే. ఈ వాస్తవాన్ని గ్రహించి సర్వులూ ఇంద్రియాలను నియమించి దమమును పాటించాలి. ఇది అందరికీ సాధ్య పడదు. ఎవరి కైతే సాధ్య పడుతుందో వారు దైవీ సంపదను కలిగి యున్నారని అర్థము.

## (6) యజ్ఞము

యజ్ఞము అంటే ఇక్కడ శ్రౌత యజ్ఞములు, స్మార్త యజ్ఞములు, రెండూ అని అర్థము. వేదోక్త మైన అగ్నిహోత్రాది యజ్ఞములు శ్రౌత యజ్ఞములు. అంటే శ్రుతుల చేత ప్రతిపాదించ బడినవి ***(యజ్ఞః చ శ్రౌతః అగ్నిహోత్రాది).***

అలాగే దేవ పూజాదికాలు స్మార్త యజ్ఞాలు. అంటే స్మృతులు, పురాణాదుల చేత ప్రతిపాదించ బడినవి. పూజ, ధ్యానము, జపము, సంకీర్తనము మొదలైన వన్నీ స్మార్తములే. దైవ సంబంధమైన, అలౌకిక మైన ఈ పవిత్ర కార్యాలను అందరూ అనుష్ఠించ లేరు. ఆచరించ లేరు. ఎవరిలో అయితే దైవ సంపద ఉంటుందో వారే యజ్ఞాది కార్యాలు నిర్వహించ గలుగుతారు. కనుక, యజ్ఞము అనే ఈ ఆరవ లక్షణము కూడా దైవీ సంపదలో చేరి పోయింది.

## (7) స్వాధ్యాయము

'అధ్యాయః' అంటే అధ్యయనము, లేదా వేదాధ్యయనము అని అర్థము. 'స్వ' అంటే తాను, లేదా ఆత్మ అని అర్థము. స్వాధ్యాయము అంటే తనకు సంబంధించిన విషయమును అధ్యయనము చేయుట. తనకు సంబంధించిన విషయము అంటే, ఆత్మ విషయమే కనుక, ఆత్మ విషయమును తెలిపే శ్రుతులను, అంటే వేదాలను అధ్యయనం చేయడము స్వాధ్యాయము అవుతుంది ***(ఋగ్వేదాది అధ్యయనం స్వాధ్యాయః).***

ఈ విధంగా స్వాధ్యాయము యొక్క అర్థమును స్వీకరిస్తే, వేదాంతము లైన ఉపనిషత్తులే గాక, ఆత్మ విషయాన్ని ఎరుక పరచే భగవద్గీత, బ్రహ్మసూత్రాలు, రామాయణ, భారత, భాగవత గ్రంథములు, అష్టాదశ పురాణాలు మొదలైన గ్రంథాలను శ్రద్ధతో పఠించడం స్వాధ్యాయమే అవుతుంది.

***పురుషార్థ ఉపదేశత్వాత్ శ్రుతీనామ్*** - మానవుడు సాధించ వలసిన వివిధ పురుషార్థములకు సంబంధించిన సాధనలను శ్రుతులు ఉపదేశిస్తాయి కనుక సర్వులకు శ్రుతులే ప్రమాణములు, శరణ్యములు అన్నారు తైత్తిరీయోపనిష ద్భాష్యంలో శ్రీ శంకరాచార్యులు. కనుక వేదాధ్యయనము ముముక్షువులకు అనివార్యము.





ఆచార్య సన్నిధిలో వేదాధ్యయనమును పూర్తి చేసుకొనిన శిష్యునికి గురువు తైత్తిరీయ శిక్షావల్లిలో ఇలా ఉపదేశించాడు.

***సత్యం వద, ధర్మం చర, స్వాధ్యాయా న్మా ప్రమదః*** - సత్యమునే పలుకు. ధర్మమునే అనుష్ఠించు. స్వాధ్యాయ మును విడువకు అని ఆదేశించాడు. ***స్వాధ్యాయ ప్రవచనాభ్యాం న ప్రమదితవ్యమ్*** - స్వాధ్యాయ ప్రవచనముల నుండి ఎట్టి పరిస్థితుల లోను తప్పుకోకు అని ఆజ్ఞాపించాడు. అంటే స్వాధ్యాయ మనేది అను నిత్యము అవశ్యం అనుష్ఠేయము అని అర్థము. అందుచేతనే శ్రీ ఆదిశంకరులు సాధన పంచకం లోని నలభై ఉపదేశాలలో ప్రథమోపదేశము ***వేదో నిత్య మధీయతాం*** - వేదమును ప్రతి నిత్యము అధ్యయనం చెయ్యాలి అన్నారు.

శ్రుతి, స్మృతి, పురాణాది గ్రంథాలు ప్రామాణికాలు కనుక, అలౌకిక విషయ సంబంధ మైనవి కనుక వాటిని అధ్యయనం చేయడం వల్ల దృష్టాదృష్ట ఫలాలు ప్రాప్తిస్తాయి. వేదాధ్యయనం పూర్తి కాగానే మనస్సు ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. ఇది దృష్టఫలం. వేదాధ్యయనం అలౌకిక కర్మ కనుక, దానికి లభించే అలౌకిక ఫలం, ఈశ్వరానుగ్రహం ఏదైతే ఉందో అది అదృష్ట ఫలం. **స్వాధ్యాయః వేదాధ్యయనం అదృష్టార్థః** అన్నారు భాష్యకారులు శ్రీశంకరులు. స్వాధ్యాయాన్ని అందుకనే బ్రహ్మయజ్ఞముగా అభివర్ణించారు ఆనందగిరి.

ఈ సందర్భములో మీకు ఒక సందేహం అంకురించి ఉంటుంది. పారాయణం అధ్యయనం క్రిందికి రాదా? అని. ఏ పారాయణం? అనేది శంక. దీనిని విస్తరించి చెప్పడం కన్నా, ఆత్మ విషయాన్ని, అంటే బ్రహ్మాత్మ జ్ఞానాన్ని ప్రతిపాదించే శ్రుతి స్మృతి పురాణాదులలో పారాయణానికి అనుకూలంగా ఉన్న వన్నీ అధ్యయనం క్రిందికే వస్తా యనేది నా ప్రగాఢ విశ్వాసము అని నిశ్చయంగా చెప్పగలను.

మరి, విష్ణుసహస్రనామం? విష్ణుసహస్రనామమే కాదు, శివసహస్రనామం, లలితాసహస్రనామం మొదలైన వన్నీ అధ్యయనం క్రిందికి వచ్చే పారాయణాలే. అయితే వ్యక్తులు, అంటే మహాత్ముల చరిత్రలు నిత్యము పఠించడము స్వాధ్యాయ మవుతుందా? కాదు. అలా కావడానికి వీల్లేదు.

ఈ విషయాన్నే ఇటీవల ఒక భక్తుడు నా వద్ద ప్రస్తావిస్తూ, 'నేను చెప్పేది మీరు రచించిన భక్తుల చరిత్రలు గల చంద్రభాగా తరంగాల విషయము స్వామీ!' అన్నాడు. నేను అతనికి స్పష్టంగా వివరించి చెప్పాను. 'చంద్రభాగా తరంగాలు పఠించ దగిన గ్రంథమే గాని పారాయణ గ్రంథము కాదు' అని నొక్కి వక్కాణించాను. 'చంద్రభాగా తరంగాలు గ్రంథంలో మహాత్ముల చరిత్రలు ఉన్నాయి. చదువుకో. అర్థం చేసుకో. అందులో సద్విషయాల్ని గ్రహించు. అనుసరించ దగినవి అనుసరించు. ఆచరించు. అంతేగాని, రోజూ మహాత్ముల గాథల్ని చదవడ మెందుకు? ఒకవేళ నీకు స్మృతి సరిగా లేకపోతే, విషయం జ్ఞాపకం రాకపోతే, మళ్ళీ ఒకసారి గ్రంథాన్ని తెరచి చూసుకో; అదీ నీకు అవసర మనిపిస్తే. అంతేగాని, ప్రతి రోజూ దానిని పారాయణం చేయడం దేనికి? చేస్తే చేసుకో. కాని, నువ్వు ముముక్షువుగా ఏ ఫలితాన్ని ఊహిస్తున్నావో, అది మాత్రం చరిత్రలు పారాయణం చేయడం వల్ల రాదని శాస్త్రీయంగా విశ్వసించే వారిలో నేనూ ఒకణ్ణి' అని చెప్పాను.

ఇది కలియుగం. మాటలే మంత్రాలుగా ప్రచారాలు విరివిగా సాగే కాలం. విచారానికి నోచుకోని విషయాలే బహుళ ప్రచారాలకు నోచుకుంటున్న విషమ సమయం. ముముక్షువు లైన వారు సంప్రదాయ గాడిలో సాగి పోవడమే శ్రేయస్కరం అని నా అభిప్రాయం. అభిమతం. అయినా ఎవరి ఇష్టాలు వారివి. ఎవ్వరూ ఎవరికీ అడ్డు లేరు.

**ప్రమాణ భూతాయాః శ్రుతేః పురుషస్య ఇవ వ్యాజానుపపత్తేః**

'శ్రుతులు, లేదా వేదాలు ప్రమాణ భూతాలు కనుక, మానవుల మాటల లాగా వ్యాజములు కావు' అని

శ్రీశంకరాచార్య స్వామి బృహదారణ్యకోపనిషత్ భాష్యంలో అనుగ్రహ వాక్యాన్ని ప్రసాదించారు *(4 - 4 - 7)*.

'వ్యాజము' అనే పదాన్ని సర్వులూ గ్రహించ డానికి వీలుగా కొద్దిగా విశద పరుస్తాను. **వ్యజ్యతే క్షిప్యతే అనేన ఇతి వ్యాజః -** స్వప్రయోజనాన్ని కాంక్షించి ఒక దానికి బదులుగా మరొకటి చేయుట వ్యాజము. ఇతరులను మోసం చేయుట వ్యాజము. ఇతరులను మోసం చేయడమే ఫలముగా కలిగిన కపట వర్తనము అని అమర సింహుని అమృత వివరణము. కనుక, మోక్షాన్ని ప్రగాఢంగా కాంక్షించే ముముక్షువులకు, మతులను కలిగిన మనుషుల భావాలకు బానిసలు కాకుండా, శ్రుతులను వివరించే యతులను, గురువులను ఆశ్రయించమని సంప్రదాయ సందేశము.

స్వాధ్యాయము పరివర్తనను తెచ్చి ప్రవర్తనను తీర్చి దిద్దడమే గాక బ్రతుకునే అందంగా మలుపు త్రిప్పుతుంది. దానితో పాటు, అధ్యయన పరునిలో ఒక వైపు జ్ఞానాన్ని పెంపొందిస్తూ, మరొక వైపు ఋషి ఋణం నుండి విముక్తుణ్ణి చేస్తుంది. ముముక్షువు మోక్షాలయంలో ప్రవేశించ డానికి ప్రధాన ద్వారము స్వాధ్యాయమే. అందుచేత స్వాధ్యాయము దైవ సంపద అయింది.

**(8) తపస్సు**

తపింప చేసేది తపస్సు ( ***తపతీతి తపః , తప సంతాపే*** ). భగవంతుని కొరకు, మోక్షము కొరకు, ధర్మము కొరకు తపించడం తపస్సు. తపస్సు కాయిక మని, వాచిక మని, మానస మని మూడు విధాలు. ఈ విషయాలను తరువాత అధ్యాయంలో భగవానుడు సమగ్రంగా చర్చిస్తాడు. తపస్సు సర్వ కల్మషాలను పోగొడుతుంది. దేహేంద్రియ మనోబుద్ధులను శుద్ధి చేసి వ్యక్తిని పవిత్రుణ్ణి చేస్తుంది ( ***తపసా కిల్బిషం హన్తి*** ). శ్రీమద్రామాయణము సమస్తమూ తపస్సు యొక్క స్వరూపము. ***తపః స్వాధ్యాయ నిరతం*** అనే శ్లోకం తోనే రామాయణం ఆరంభ మవుతుంది. తపస్సు అనే పదంతో బాలకాండము ప్రారంభమై ***ప్రవర్ధతామ్*** - వృద్ధి చెందు గాక! అనే పదముతో రామాయణము యుద్ధకాండము సమాప్త మవుతుంది. తపస్సు అనేది కేవలం తపించడమే కాదు. తపస్సు జ్ఞాన ప్రధాన మైంది. తపస్సు చేతనే సృష్టి కార్యాన్ని బ్రహ్మదేవుడు చేసినట్లు తైత్తిరీయ శ్రుతి ( ***తపసా బ్రహ్మ విజిజ్ఞా సస్వ*** ). ఏడవ లక్షణమైన స్వాధ్యాయాన్ని, ఎనిమిదవ లక్షణమైన ఈ తపస్సును కలిపి క్రియాయోగంగా యోగదర్శనంలో సూత్రబద్ధం చేశాడు పతంజలి మహర్షి ( ***సూ॥ తపః స్వాధ్యాయేశ్వర ప్రణిధానాని క్రియాయోగః*** - సాధన పాదము - ప్రథమ సూత్రము ). అందుచేత విశిష్ట సాధన అయిన తపస్సు దైవీ సంపదకు సంబంధించినది.

**(9) ఆర్జవమ్**

ఆర్జవము అంటే ఋజు భావము. ఋజు వర్తనము. ఎల్లప్పుడు ఋజుత్వమును కలిగి ఉండటము ఆర్జవము ( ***ఆర్జవమ్ ఋజుత్వం సర్వదా*** ). కుటిలత్వము లేక పోవడమే ఋజుత్వము. ఈ విషయాన్ని క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగంలో అమానిత్వాది జ్ఞాన లక్షణాలను చర్చించి నప్పుడు చెప్పు కున్నాము. ఆలోచనలో గాని, మాటలో గాని, క్రియలో గాని ఏ విధమైన వక్రత లేకుండా ఉండటము ఆర్జవము. త్రికరణ శుద్ధితో వర్తించడము ఋజుత్వము. మాయ తెలియని జీవనము. సరళమైన స్వభావము. కనుక, ఆర్జవము దైవ సంపద.

*దైవీ ప్రకృతికి సంబంధించిన మరో పది లక్షణాలను తరువాత శ్లోకంలో చెబుతున్నాడు.*

**అహింసా సత్య మక్రోధ స్త్యాగః శాన్తి రపైశునమ్ ।**
**దయా భూతే ష్వలోలుప్త్వం మార్దవం హ్రీ రచాపలమ్ ॥** 2





***అహింసా-సత్యం-అక్రోధః-త్యాగః-శాంతిః-అపైశునం***
***దయా-భూతేషు-అలోలుప్త్వం-మార్దవం-హ్రీః-అచాపలం***

| | | | |
|---|---|---|---|
| అహింసా | = అహింసయు | భూతేషు | = భూతముల యందు |
| సత్యం | = సత్యము | దయా | = దయ |
| అక్రోధః | = క్రోధము లేకుండుట | అలోలుప్త్వం | = లోలత్వము లేకుండుట |
| త్యాగః | = త్యాగము | మార్దవం | = మృదుత్వము |
| శాంతిః | = శాంత స్వభావము | హ్రీః | = సిగ్గు |
| అపైశునం | = చాడీలు చెప్ప కుండుట | అచాపలం | = చపలత్వము లేకుండుట |

**అర్జునా! అహింస, సత్యము, క్రోధము లేకుండుట, త్యాగము, శాంతస్వభావము, చాడీలు చెప్పకుండుట, ప్రాణుల యందు దయ, అసంగత్వము, మృదుత్వము, సిగ్గు, చపలత్వము లేకుండుట - దైవీ సంపదతో జన్మించిన వారిలో ఇవి కనిపిస్తాయి.**

**వ్యాఖ్య**

**(10) అహింస**

పీడించడము హింస. అలా పీడించక పోవడం, హింసించక పోవడం అహింస. త్రికరణ శుద్ధిగా పరులను బాధించకుండా ఉండటము అహింస అవుతుంది ( ***అహింసా అహింసనమ్ పీడా వర్జనమ్*** ).

పరులను పీడించకుండా ఉండటము అహింస అంటున్నాము. మరి, తనను తాను హింసించుకో వచ్చా? ఆత్మ పీడనం, లేదా ఆత్మహింస ఉచిత మేనా? కానే కాదు. అహింస అనేది అందుకే వ్రత మైంది. అహింసా పరుడు పరులనే కాదు, తనను కూడా తాను హింసించుకో లేడు. హింసించడ మనే గుణము ఉన్నప్పుడు మాత్రమే తనను తాను హింసించుకో గలడు. తనను తాను హింసించుకొనే వాడు పరులను హింసించకుండా ఎలా ఉంటాడు?

మనిషి లోని ద్వంద్వ వైఖరి బుద్ధిలో ఘర్షణను సృష్టిస్తుంది. వ్యక్తిని దారుణంగా బాధిస్తుంది. అదంతా హింసే. కనుక, అహింసను పూర్ణ స్థాయిలో ఆచరించ గలిగే వాడు జ్ఞాని ఒక్కడే. సాధకులు పరమ పవిత్రమైన ఈ అహింస అనే దైవ లక్షణాన్ని వ్రత రూపంగా స్వీకరించి, త్రికరణ శుద్ధితో అనుష్ఠించాలి.

హింసించడ మంటే కత్తులతో గాయ పరచడమే కాదు, కర్కశమైన వాక్కులతో బాధించడము కూడా హింసే. మనిషిని బాకులతో పొడవ నవసరం లేదు. ఎత్తి పొడుపు మాటలతో బాధించడం కూడా హింసే. మరొక అడుగు ముందు కేస్తే, చేతల ద్వారా, మాటల ద్వారా హింసించడమే కాదు, హింసించాలి అనే భావనను కలిగి ఉండటము కూడా హింసే. మనస్సు లోని సంకల్పాలే మనిషిలో కర్మలుగా వ్యక్త మవుతా యనే సత్యాన్ని సాధకులు మరువ కూడదు.

మనో వాక్కాయ కర్మల ద్వారా ఏ విధమైన హింస జరగకుండా చూసుకోవడము అహింస అవుతుంది. ఇది కేవలం మానవుల విషయం లోనే గాక, సర్వ ప్రాణుల యందును కలిగి ఉండాలి. అప్పుడే అహింసకు పరమార్థం. పశుపక్ష్యాదులనే కాకుండా వృక్ష లతాదులను కూడా కష్టపెట్ట కూడదు. అది కూడా హింసే. వాటిలో కూడా ప్రాణ ముంది అన్నది శాస్త్రం.

నేటి జీవన స్థితి గతులను దృష్టిలో పెట్టుకొని విశ్లేషిస్తే, పర్యావరణ సమస్యలు, వన్యప్రాణి సంరక్షణ

మొదలైన విషయాలపై ఎంతెంత పెద్ద చర్చలు జరుగుతూ ఉన్నాయో మనకు తెలుసు. కాని, మన పూర్వీకులకు ఇవి సమస్యలే కావు. వీటిని గూర్చి చర్చించ వలసిన అవసరమే వారికి లేక పోయింది. కారణం, వారి జీవితాలలో గొప్ప ఐశ్వర్యం ఉండింది. విశిష్టమైన సంపద ఉండింది. అదే దైవ సంపద. అహింసా ప్రవృత్తి. అందుచేతనే, దైవీ ప్రకృతికి సంబంధించిన అహింసను ఉత్తమ మైన ధర్మంగా వేదం అభివర్ణించింది ***(అహింసా పరమో ధర్మః )***.

హింసా ప్రవృత్తి వల్ల మనిషి శాంతిని కోల్పోతాడు. ప్రశాంతతకు దూర మవుతాడు. హితులను అహితులుగా మార్చేది హింస అయితే, అహితుల్ని సైతం హితులుగా, సన్నిహితులుగా చేసేది అహింస. అహింసా వ్రతాన్ని పాలించే మహాత్ముల సన్నిధిలో మానవులే కాదు, జంతువులు సైతం వైరాన్ని మరచి పోతాయి అని యోగ దర్శనంలో అద్భుతంగా ప్రవచించాడు పతంజలి మహర్షి.

**సూ॥ అహింసా ప్రతిష్ఠాయాం తత్సన్నిధౌ వైరత్యాగః** *(2 వ పా - 35 వ సూ )*

వ్యక్తిలో అహింస సుస్థిర మైనపుడు, అట్టి మహాత్ముని సన్నిధిలో సహజ శత్రుత్వము కలిగిన మార్జాల మూషికాదులు, సర్పమయూరాదులు, మయూర శునకాదులు, మృగ వ్యాఘ్రాదులు పరస్పర వైరుధ్యాల కారణంగా ప్రాప్తించిన భయ క్రోధాదుల నుండి సంపూర్ణంగా విముక్తిని పొందుతాయి. అహింసా ప్రవృత్తి వైభవాన్ని చెప్పడానికి ఇంతకు మించి ఏమి కావాలి? అందుకే అహింసను దైవ సంపదగా గీతా శాస్త్రం వర్ణిస్తూ ఉంది.

### (11) సత్యము

ఇక్కడ సత్యము అంటే సత్య భాషణము. యథార్థ భాషణము. ఉన్న దున్నట్లు భాషించడము. కల్తీ లేని, కల్పన గాని విషయాలను మాట్లాడటము. అందులో అసత్యము, అబద్ధము లేకుండా ఉండటము సత్య భాషణము ***( సత్యమ్, అప్రియ అనృత వర్జితం యథా భూతార్థ వచనమ్ )***.

అహింసను సత్యము అంటి పెట్టుకుని ఉంటుంది. ప్రాణులకు ఏ విధమైన హింస కలగకుండా భాషించడము సత్య భాషణము. సత్యము యథార్థంగా ఉండటమే కాదు, ప్రియంగా కూడా ఉండాలి. ప్రియంగా ఉండాలి కదా అని అసత్యాన్ని జోడించ కూడదు. లేనిపోనివి కల్పించ కూడదు. కపోల కల్పితాలు సత్యాలు కాలేవు. సత్య భాషణము అంటే ఏమిటో, అది ఎలా ఉండాలో మన ధర్మ శాస్త్రాలు సుస్పష్టంగా ప్రవచించాయి.

***సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్***
***న బ్రూయాత్ సత్యం అప్రియమ్***
***ప్రియం చ అనృతం న బ్రూయాత్ ॥***

సత్యమునే భాషించాలి. అది కూడా ప్రియంగా ఉండాలి. అప్రియంగా ఉండే దానిని, అది సత్యమే అయినా చెప్పకూడదు (ప్రత్యేకతలు చర్చనీయాంశాలు కావు). ప్రియంగా ఉందని సత్యము కాని దానిని, అసత్యమైన దానిని భాషించ కూడదు.

అనర్థ ఫలాల నిచ్చే విషయాలను ఆచరించడం దేనికి? అసత్య భాషణం అనర్థాన్ని సృష్టిస్తుంది. వ్యక్తి విలువలను హరిస్తుంది. బ్రతుకును ఓటమి వైపు నడిపిస్తుంది. అసత్యపరునికి ఏనాడైనా అపజయం తప్పదు. అందుకనే వేదమాత ***సత్య మేవ జయతే*** అన్నది.

భాషించే విషయము సత్యముగా, ప్రియంగా ఉండటమే గాక, ఉపయుక్తంగా కూడా ఉండాలి. ఇది





చాలా ప్రధానమైన విషయము. ఈ రోజుల్లో ఇద్దరు కలిస్తే చాలు. 'రండి. ఏదో ఒకటి చెప్పుకుందాం' అని మొదలెడతారు. ఇంతకు మించిన దురదృష్టం మరొక టుంటుందని నేను అనుకోను.

చెప్ప వలసింది చెప్పడం కర్తవ్యము. చెప్పుకో దగింది చెప్పుకోవడం ప్రగతి సూచకం. ఏదో ఒకటి చెప్పుకోవడం అప్రస్తుతం. అనర్థ దాయకం. ఏదో ఒకటి చెప్పుకోవాలి. ఇదొక దురద. నోటి దురద. అజ్ఞాన బురద. ఏదో ఒకటి ఏమి చెప్పుకుంటారు? పరులను గూర్చి చర్చించు కోవడం తప్పు! పరులను గూర్చి చర్చించు కోవడానికి మనకు వాళ్ళను గూర్చి ఏమి తెలుసు గనుక? యథార్థం చెప్పాలంటే వాళ్ళను గూర్చి వాళ్ళకే తెలియదు. ఇక మనకు తెలిసే దేముంటుంది? ఇతరుల విషయాలను అలా ఉంచండి. మనల్ని గూర్చి మనకు తెలుసా? మనల్ని గూర్చే మనకు తెలియ నపుడు, ఇతరులను గూర్చి మనకు ఏమి తెలుస్తుంది? తెలియని దానిని పరస్పరం భాషించుకొని పోషించుకొనే దేముంటుంది? ఈర్ష్యలను, అసూయలను వ్యక్తం చేసుకొని బుద్ధుల్ని పాడు చేసుకోవడం తప్పు!

కనుక అప్రస్తుత ప్రసంగాలు అనర్థాలను సృష్టిస్తాయి. అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఋజుత్వంతో భాషించ గలిగితే, అట్టి భాషణము సత్య భాషణం అవడమే గాక, ప్రియం గాను, అందం గాను, ఆహ్లాదకరం గాను ఉంటుంది.

సత్య భాషణము అనేది సామాన్యమైన విషయం కాదు. నాయనా! కాకులకు పెడుతూ ఉండు. ఒక రోజు హంసలు నిన్ను సమీపిస్తాయి అని చెప్పే వారు మన పెద్దలు. సత్య భాషణము కష్టమే అయినా, జాగ్రత్తగా ఆలోచిస్తూ ఆచరించ గలిగితే, అది జీవితంలో అద్భుతమైన ఫలితాలను అందిస్తుంది.

సత్య భాషణం చేసే వ్యక్తికి కాల క్రమేణ వాక్శుద్ధి ఏర్పడుతుంది. ఆ తరువాత, వాక్శక్తి కలుగుతుంది. అతడు ఏది పలికితే అది జరిగి తీరుతుంది. అతడు నోటితో ఆశీర్వదిస్తే చాలు. అన్నీ శుభాలే జరుగుతాయి.

*ఆరోగ్యం ప్రాప్నుహి -* నాయనా! నువ్వు ఆరోగ్యాన్ని పొందెదవు గాక! అని సత్యవాది పలికాడు అంటే, అట్టి ఆశీర్వాదాన్ని అందుకొనిన అదృష్టవంతుడు తప్పక ఆరోగ్యవంతుడు అవుతాడు. సత్య స్వరూపులు, సత్యవాదు లైన కొందరు మహాత్ములు ***దీర్ఘ సుమంగళీ భవ!*** అని నమస్కరించిన తల్లులను ఆశీర్వదిస్తే, ఆ తల్లుల భర్తలు మృత్యు ముఖంలో ప్రవేశించే స్థితిలో పునర్జీవితులై, ఆయురారోగ్యాలతో చాలా కాలం వర్ధిల్లి నట్లు ఎన్నో సత్య కథనాలు మన సంస్కృతిలో ఆవిష్కృత మయ్యాయి.

**సూ ॥ సత్య ప్రతిష్ఠాయాం క్రియా ఫలాశ్రయత్వమ్ ।**

సత్యములో సుప్రతిష్ఠు లైతే, అతని భాషణములు ఫలాశ్రయా లవుతాయి. సత్య ప్రతిష్ఠ కల మహాత్ముల వాక్కులు నిష్ఫలం కావు. అవి అమోఘంగా, అద్భుతంగా ఫలప్రద మవుతాయి అని పతంజలి రాజయోగము.

### (12) అక్రోధము

క్రోధము రాకుండా చూసుకోవడము అక్రోధము. దీనిని కూడా సూక్ష్మంగా అర్థం చేసుకోవాలి. క్రోధము లేకుండా చూసుకోవడము అక్రోధమా? లేక, క్రోధము రాకుండా జాగ్రత్త పడటము అక్రోధమా?

క్రోధము అసలే లేకుండా పోవడ మనేది ఆత్మజ్ఞాని, బ్రహ్మవిదుడైన స్థితప్రజ్ఞునికే సాధ్యం. ప్రస్తుతం మనం దైవీ సంపదకు సంబంధించిన లక్షణాలను గురించి చర్చించు కుంటున్నాం. ఇది సాధనావస్థకు సంబంధించిన విషయమే గాని, సిద్ధావస్థకు సంబంధించింది కాదు. సాధకుడు క్రోధము రాకుండా జాగ్రత్త పడ గలడే గాని, సంపూర్ణంగా క్రోధంపై విజయాన్ని సాధించ లేడు. కనుక క్రోధం కలిగే అవకాశం ఉన్నప్పుడు,

అవగాహనతో, ముందు జాగ్రత్తతో క్రోధాన్ని రానివ్వకుండా చూసుకొని, మనస్సు లోని ప్రశాంతతను భగ్నం కాకుండా రక్షించు కోవడమే ఇక్కడ అక్రోధము.

***పరైః అకృష్టస్య అభిహతస్య వా ప్రాప్తస్య క్రోధస్య ఉపశమనమ్ అక్రోధః -*** ఇతరులు దూషించినా, తిట్టినా, కొట్టినా, బాధించినా, రావడానికి అవకాశం ఉన్న క్రోధాన్ని రాకుండా చేసుకోవడం, లేదా వేగాన్ని తగ్గించు కోవడము, అలా ఉపశమించేటట్లు చూసుకోవడము అక్రోధము. ఈ సుగుణము జీవితంలో తిమిరాన్ని తరిమి తేజస్సును నింపుతుంది. అందుచేత ఇది దైవ సంపద.

***క్రోధః ప్రాణ హరః -*** క్రోధము ప్రాణమును హరిస్తుంది అన్నది శ్రీమద్రామాయణము. అంటే, విషతుల్య మైనది అని అర్థము. క్రోధము పాము కాటు వలె విషయుక్తము. మానవుని మూర్తిమత్వమును క్రోధం చావు దెబ్బ కొడుతుంది. క్రోధం ముందు వెనుకలు చూడదు. పెద్ద చిన్న అని ఆలోచించదు. ఏ భాష మాట్లాడు తుందో అర్థం కాదు. పట్టు తప్పి ప్రవర్తిస్తుంది. ఆ తరువాత మనిషిని పశ్చాత్తాపంతో కుమిలి పోయేలా, కుంచుకు పోయేలా చేస్తుంది.

క్రోధం యొక్క కోరల్లో చిక్కి ఎన్నో కుటుంబాలు ముక్కలై పోయాయి. మరెన్నో సంబంధ బాంధవ్యాలు తెగి పోయాయి. క్రోధము దూరాలను సృష్టిస్తుంది. భారాలను పెంచుతుంది. మనల్ని మనం మరచి పోయేలా చేస్తుంది. మానవత్వాన్ని దెబ్బ కొడుతుంది. మనిషిలో పశుత్వాన్ని తెచ్చి పెడుతుంది. పశువులా ప్రవర్తించేలా శాసిస్తుంది. క్రోధంతో ఊగిపోయే మనిషిలో ఈ లక్షణా లన్నీ స్పష్టంగా కనిపిస్తాయి. 'నాకు కోప మొస్తే నేను మనిషినే కాను' అని కోపోద్రిక్తు డైన మనిషి పలుకుతూ ఉండటం మనం వింటూనే ఉంటాము. క్రోధం వస్తే తాను మనిషిగా మిగల లేడని, పశువును, మృగాన్ని సైతం మించి పోతాడని తానే చెప్పే టప్పుడు, మనకు మరొక నిదర్శనం ఎందుకు?

క్రోధం అసుర లక్షణము. అక్రోధం దైవ సంపద. క్రోధాన్ని ప్రేరేపించే పరిస్థితులు ఆసన్న మైనపుడు అవగాహనతో అక్రోధాన్ని కలిగి, క్రోధం నుండి బయట పడాలి అన్నది శాస్త్రం.

***కృద్ధే స్మేర ముఖావధారణ మథావిష్టే ప్రసాదక్రమో ।***
***వ్యాక్రోశే వినయోక్తి రాత్మ దురితో చ్ఛేదోత్సవ స్తాడనే ॥***

ఇతరులు మనపై కోపాన్ని ప్రకటించి నపుడు వారికి చిరునవ్వుతో కనిపించడం ***( క్రుద్ధే స్మేర ముఖావ ధారణం ),*** పరులు క్రోధంతో వాళ్ళను వాళ్ళు మరచి నపుడు ఊరడించడము లేదా ఓదార్చే ప్రయత్నము చేయడము ***( ఆవిష్టే ప్రసాదక్రమః ),*** పరులు కోపంతో తిట్టి నపుడు వారితో వినయంగా, వినమ్రంగా పలకడము ***( వ్యాక్రోశే వినయోక్తిః ),*** ఒకవేళ అన్యులు కొడితే, గతంలో చేసిన పాపానికి మూల్యం చెల్లించడం జరిగిందని తనను తాను శాంతింప చేసుకోవడం - ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని ఉచితానుచితాలను పరిశీలించి ప్రవర్తించ గలిగితే అక్రోధ మనే దైవ సంపదను సాధించుకో వచ్చు.

## (13) త్యాగము

'త్యజ్' అనే ధాతువు నుండి త్యాగము అనే పదము సంభవించింది. త్యజ్ అంటే విడిచి పెట్టడము, వదిలించు కోవడము, విడిపించు కోవడము ***( త్యజతి, త్యక్త ).*** 'త్యాగః' అంటే విడిచి పెట్టడము, లేదా దానము అని కూడా అర్థము.

ప్రస్తుతము త్యాగము అనే పదానికి దానము అనే అర్థమును గ్రహించ డానికి వీలు లేదు. దానమును





దైవ సంపదలో నాల్గవ లక్షణముగా చెప్పడం జరిగింది కనుక ఇక్కడ త్యాగ మంటే విడిచి పెట్టడ మనే భావమునే గ్రహించాలి అన్నది భాష్యం ***( త్యాగః సన్న్యాసః, పూర్వం దానస్య ఉక్తత్వాత్ ).***

మోక్షము అనేది సాధకులకు ఏకైక గమ్యము. మోక్షము అనే అమృతత్వము త్యాగము లేనిదే సాధ్యం కాదు. అందుచేత, విడిచి పెట్టడము అనే అర్థాన్ని స్ఫురించే త్యాగ లక్షణమును దైవీ సంపదలో చేర్చడం జరిగింది.

***త్యాగే నైకే అమృతత్వ మానశుః -*** త్యాగము అనే ఒక్క దాని చేతనే మోక్షమును పొందుతారు అన్నది కైవల్యోపనిషత్తు. ఇక్కడ త్యాగము అనేది యోగ నిష్ఠాద్వయంలో సమాన పాత్రను ధరించి ఉంది. సర్వసంగ పరిత్యాగము అనేది జ్ఞానయోగ నిష్ఠలో ప్రధాన మైతే, విషయత్యాగము, సంగత్యాగము, కర్మఫల త్యాగము అనేవి కర్మయోగ నిష్ఠలో ప్రధానము. కనుక, ప్రవృత్తి రూపమైన కర్మయోగము నందు గాని, నివృత్తి రూపమైన జ్ఞానయోగము నందు గాని త్యాగము ప్రముఖ పాత్రను పోషిస్తూ ఉంది.

***సూ॥ తత్తు విషయ త్యాగాత్, సంగత్యాగాచ్చ ! -*** విషయాల యందు మమ బుద్ధి లేకుండా ఉండటము, అలాగే వ్యక్తుల యందు అసంగ బుద్ధిని కలిగి ఉండటము త్యాగము అని నారద భక్తి సూత్ర ప్రబోధము *(సూ॥ 35).*

త్యాగము అనేది ఒకే పద మైనా, ముముక్షువులు దానిలో ముఖ్యంగా రెండు విషయాలను దర్శించాలి. ఒకటి విడి పడటము; రెండవది ముడి పడటము. విషయ ప్రపంచము నుండి విడి పడటము త్యాగము అనేది మనకు అర్థమైంది. అలా విడి పడటం దేనికి? పరమాత్మతో ముడి పడటానికి. ఇంతవరకు ప్రపంచమును, వస్తువులను, విషయాలను, వ్యక్తులను, సంబంధ బాంధవ్యాలను ఆశ్రయించుకొనిన బుద్ధి, సమస్త ఆశ్రయా లను విడిచి పెట్టి, పరమాత్మనే అనన్య భావంతో ఆశ్రయించడం జరుగుతూ ఉంది. దీనినే అనన్య భక్తిగా గీతాచార్యుడు తొమ్మిదవ అధ్యాయం లోను *(9 వ అ - 22 వ శ్లో)*, పదకొండవ అధ్యాయం లోను *(11 వ అ - 54 వ శ్లో)* ప్రవచించాడు. సర్వాశ్రయాలను త్యాగం చేసి పరమాత్మనే ఆశ్రయించడం అనన్యత అని నారద మహర్షి కూడా ప్రబోధించాడు ***( సూ॥ అన్యాశ్రయాణాం త్యాగః అనన్యతా -*** *నారద భక్తి సూత్రములు ; 10).*

కనుక అటు కర్మయోగికి గాని, ఇటు జ్ఞానయోగికి గాని త్యాగ లక్షణము అనే దైవ సంపద పుష్కలంగా ఉండాలి. ఈ త్యాగ లక్షణము కర్మయోగంలో కర్మఫల త్యాగంగా గోచరిస్తే, జ్ఞానయోగంలో సర్వసంగ పరిత్యాగముగా కనిపిస్తుంది. కనుక నిష్ఠాద్వయం లోని యోగు లిరువురూ త్యాగులే.

త్యాగి సమస్తములో ఉన్నట్లు కనిపించినా, సమస్తము నుండి విడిపడి ఉంటాడు. అండనే ఉన్నా అంటు కోడు. చెంతనే ఉన్నా చేదుకోడు. ఉన్నదానిపై మక్కువ లేని వాడు, లేని దానిపై కోరిక కదలని వాడు త్యాగి. యోగాసక్తే గాని భోగాసక్తి లేని వాడు. సంసారంలో ఉన్నా తనలో సంసారము లేని వాడు కర్మయోగి అయితే, సన్యాసములో ఉన్నా తాను సన్యసించా ననే భావన అదృశ్యమైన వాడు సన్యాసి. ఇదే త్యాగము. ఈ త్యాగమునే గీత ప్రముఖంగా ప్రబోధిస్తూ ఉంది. గీతార్థమే త్యాగము. 'గీత' అనే పదము లోని అక్షరార్థం కూడా త్యాగమునే సూచిస్తూ ఉంది.

***గీ కారం త్యాగ రూపం స్యాత్ తత్త్వబోధం తకారకమ్ ।***
***గీతావాక్య మిదం తత్త్వం జ్ఞేయం సర్వ ముముక్షుభిః ॥***

'గీ' అంటే త్యాగము. 'త' అంటే తత్త్వ జ్ఞానము. ఈ విధంగా త్యాగమును, తత్త్వ జ్ఞానమును బోధించడమే 'గీత' అనే పదము యొక్క పరమార్థ మని ముముక్షువులు గ్రహించాలి.

త్యాగ మార్గంలో పయనించి, తత్త్వ సౌధాన్ని అధిరోహించి, ఆప్తకాములై, ఆత్మవిదులై తరించి పొండి అనేదే గీతా సందేశము.

**(14) శాంతి**

చిత్తము ఉపశమించడమే శాంతి. విషయాల నుండి విరమించిన చిత్తము ఉపరతిని పొందడమే శాంతి ***( శాంతిః అంతఃకరణస్య ఉపశమః ).*** మనస్సు లోని రాగద్వేషాది మల దోషమే చిత్త అశాంతికి కారణము. రాగద్వేషాలు నిండిన మనస్సు ప్రశాంతంగా ఉండ లేదు. రాగవృత్తి ప్రవృత్తి వైపు పురికొల్పి మనస్సులో అలజడిని రేపుతూ ఉంటే, నివారించే మార్గంలో ద్వేష వృత్తి బుద్ధిని కలత పెడుతూ ఉంటుంది. రాగద్వేషాలను తృప్తి పరచడం ఎవ్వరికీ సాధ్యం కాదు. ఒక రాగవృత్తిని తృప్తి పరిస్తే, దానిని వెంబడించి మరి కొన్ని తలెత్తుతూ ఉంటాయి. ఒక ద్వేష వృత్తిని ఉపశమింప చేస్తే మరి కొన్ని ఉద్యమిస్తూ ఉంటాయి.

మనిషి స్వరూపమే శాంతి. రాగద్వేషాలు మనస్సును ప్రేరేపించి, బహిర్ముఖం గావించి స్వరూపానికి దూరంగా తీసుకొని పోతాయి. అంతటితో ఆగవు. స్వరూప శాంతికి దూరం చేయడమే గాక, ఎక్కడైతే శాంతి లభించే అవకాశమే లేదో అట్టి అనిత్య విషయ ప్రపంచంలో శాంతి కొరకు అన్వేషిస్తూ పరితపించేలా చేస్తాయి. ఆ విధంగా మనస్సును సదా అశాంతికి గురి చేస్తూ ఉంటాయి.

రాగద్వేషాలకు సంబంధించిన వృత్తులు మనస్సులో అశాంతిని సృష్టిస్తూ ఉంటాయి. కలత పెట్టే వృత్తులు లేనపుడు మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. ఆకాశంలో చంద్రుడు చల్లగా ప్రకాశిస్తూ ఉంటాడు. మబ్బులు గగనంలో కదుల్తూ ఉంటాయి. చంద్రుడు మబ్బుల మధ్య దూరి, మళ్ళీ మబ్బుల నుండి బయటికి వస్తున్నట్లు మనకు కనిపిస్తూ ఉంటుంది. చలించేది మేఘాలే గాని చంద్రుడు కాదు. మేఘాలు లేని ఆకాశంలో చంద్రుడు నిశ్చలంగా ప్రకాశిస్తూ కనిపిస్తాడు.

మేఘాలను తొలగిస్తే చంద్రుడు ప్రకాశించినట్లు, అచలమై శోభించినట్లు, రాగద్వేషాలు తటస్థ పడి, వృత్తులు ఉపశమిస్తే చిత్తము విక్షేపమును వదలి శాంతిని పొందుతుంది. అదే చిత్తోపశాంతి. అంతఃకరణ ఉపశమము. కనుక శాంతి అనే దైవ సంపద త్యాగము తరువాత చెప్ప బడింది. రాగద్వేష ప్రేరితమైన మనోవృత్తులను వదలడ మనే త్యాగము జరిగితే, ఆ తరువాత శాంతి అంతఃకరణములో నిలుస్తుంది. కనుకనే ***త్యాగాత్ శాంతిః అనంతరమ్*** - త్యాగము తరువాతే శాంతి ప్రాప్తిస్తుందని పన్నెండవ అధ్యాయంలో ప్రబోధించాడు గీతాచార్యుడు *(12 వ అ - 12 వ శ్లో).*

**(15) అపైశునము**

పరుల దోషాలను, లేదా లోపాలను వారి పరోక్షంలో ప్రస్తావించడం, లేదా ఎత్తి చూపి ఏకరవు పెట్టడము పైశునము. అట్టి పిశునత్వము లేకుండా ఉండటము అపైశునము ***( అపైశునమ్ అపిశునతా, పరస్మై పరరంధ్ర ప్రకటీకరణం పైశునం తదభావః అపైశునం ).*** కొండెములు చెప్పే అలవాటు, చాడీలు చెప్పే గుణము పైశునము. ఇది అసుర లక్షణము. దీనికి విరుద్ధ మైనది అపైశునము. అది దైవీ సంపద. ఋజు వర్తనము.

'నక్క బొక్కలు వెతుకును - కుక్క చెప్పులు వెతుకును' అనేది సామెత. పిశునత్వము అనే దుర్గుణానికి అలవాటు పడిన వాడికి చాడీలే పకోడీలు. ఎవరి విషయమునో తీసికొని వారి పరోక్షములో మరొక వ్యక్తితో వారి ప్రవర్తనమును గూర్చి గాని, వారి వ్యక్తిగత విషయాలను గూర్చి గాని, వారి ఆలోచనా విధానమును గూర్చి గాని నిందలు మోపుతూ చెప్పక పోతే కొందరికి తినింది జీర్ణం కాదు. మరి కొందరికి నిద్ర పట్టదు. ఇదే పైశునము.





ఈ ప్రపంచంలో దోషాలు లేని వారెవరు? ఎవరి దోషాలు వారి కున్నాయి. అలాంటప్పుడు, ఇతరులను ఆడి పోసుకోవడంలో వేడుక ఏముంది? దీనిని కాస్త లోతుగా విచారిస్తే, ఇతరులకు చెడు చేయాలి అనే భావన చాడీలు చెప్పే వ్యక్తిలో ఉన్నట్లు ఎవరి కైనా అర్థ మవుతుంది. ఒకరికి చెడు చేసి మనం పొందే దేముంటుంది? ఏ ప్రయోజనము లేక పోయినా, పైగా దాని వల్ల పరులకు హాని కలుగుతూ ఉంది అని తెలుస్తూ ఉన్నా, ఈ పైశున వృత్తిని మనిషి ఎందుకు సాగిస్తాడు అంటే ఏం చెప్పగలం? ఇతరులు హాయిగా ఉంటే చూచి సహించ లేని మానసిక దౌర్బల్యమే ఈ పిశునత్వానికి పునాది. కనుక అసూయా ద్వేషాలే పైశునము వెనుక ప్రధాన కారణాలుగా తెలుస్తాయి.

కట్టెలో ఉండే అగ్ని కట్టెనే దహిస్తుంది. ఏ వ్యక్తిలో ఈర్ష్యాద్వేషాలు ఉంటాయో, అవి ఆ వ్యక్తి బుద్ధినే పాడు చేస్తాయి. బ్రతుకును నికృష్టంగా మారుస్తాయి. ఇలా చూచి నపుడు, సమస్య ఎక్కడో లేదు. కొండెములు చెప్పే వాడి లోనే ఉంది. ఏ క్షణంలో అయినా అంతఃకరణమును దగ్ధం చేయడానికి సిద్ధంగా ఉండే ద్వేషాగ్నిని ప్రేమ జలంతో ఆర్పుకోవడానికి బదులు, పరులపై చాడీలు చెప్పడ మనే చిదుగులను తోడు చేసుకోవడం వల్ల ఎవరికి నష్టం?

చాడీ లన్నీ చాటు గానే సాగుతాయి. ఎవరిని గూర్చి చెడుగా ప్రచారం జరుగుతూ ఉందో ఆ వ్యక్తికి మాత్రం వినిపించే అవకాశం లేదు కదా! ఇతని మాటల సెగలు అతనిని సోకవు కదా! మరి, ఎవరికి నష్టం? చెప్పే వాడు, వినే వాడు - వీరిద్దరే పైశునములో మునిగి ఉన్నారు కనుక వీరికే నష్టం. ఇద్దరి మనస్సులూ పాడు అవుతాయి.

ఇతరులను గూర్చి చెడుగా మాట్లాడ టానికి మనం చెప్పే చాడీలకు ఋజువు లెక్కడున్నాయి? ఏ ఋజువులు లేక పోయినా పని గట్టుకొని దోషాలను ఆరోపిస్తూ వ్యర్థ వచనాలు పలకడం పైశునము. అసుర లక్షణము.

విచారించి అర్థం చేసుకుంటే, ఇతరులను వారి పరోక్షంలో నిందించడం వెనుక మనలో నిగూఢంగా దాగి ఉన్న ఈర్ష్యాసూయలకు ఋజువులు దొరుకుతాయి. అలా మన దోషాలను మనం చూసుకొని, వాటిని సవరించుకొని శుద్ధి చేసుకొనే కార్యక్రమంలో నిమగ్నమై ఉంటే, అన్యుల దోషాలు మనకు కనిపించవు కూడా. కనిపించ నపుడు ఇక కలవరించే దేముంటుంది? పలవరించే దేముంటుంది? ఏదీ ఉండదు. అపైశునం, అంటే ఇతరుల దోషాలను ఏకరవు పెట్టని లక్షణం ఒక్కటే ఉంటుంది. ఈ విశిష్ట లక్షణం ఎవరిలో ఉంటుందో వారే దైవ సంపద కల వారు.

మోపే వారు నిందలు ఎందరో
మోసే వాడివి కాబోకు
    కాకి కూతలు ఎవరికి మధురము?
    కోకిల రవమే కమనీయము
సహనమె సంపద పగయే ఆపద
సద్గతి కిదియే సోపానము
    రామ రామ జయ రాజారామ్
    రామ రామ జయ సీతారామ్

అని రామజోగి చిట్కా.

## (16) భూతదయ

ఆర్తుల యందు, దీనుల యందు, దుఃఖితుల యందు చూపే కృపయే దయ *(దయా కృపా భూతేషు దుఃఖి తేషు)*. వేడికి పాత్ర లోని పాలు పొంగినట్లు, అవగాహనా వేడికి హృదయం లోని ప్రేమ పొంగడమే దయ. దయ అనేది దైవగుణము. భగవంతుడు దయా స్వరూపుడు. ప్రతి వ్యక్తి హృదయంలో భగవానుడు ఉన్నాడు *(18 వ అ - 61 వ శ్లో)*. ఎలా ఉన్నాడు? దయా రూపంలో ఉన్నాడు. 'హృదయము' అనే నాలుగు అక్షరాల పదంలో మధ్య నున్న రెండక్షరాలు 'దయ'. అది ఈశ్వర స్వరూపము. అది అందరి హృదయం లోనూ ఉంది. అది అర్థం కాక, పరమాత్మకు నాపై దయ లేదు అంటూ ఉంటారు. దయ అనేది వచ్చేది కాదు. ఉన్నదే. మన హృదయంలో దయా రూపంలో భగవంతుడే ఉన్నాడు. ఆయన దయ తోనే గుండె కొట్టుకుంటోంది. ఆయన దయ తోనే కళ్ళు చూస్తున్నాయి. దయ ప్రత్యేకంగా రావడ మేమిటి? వచ్చే ఉంది. వచ్చి మన లోనే ఉంది. అలా ఉందనే జ్ఞానమే మనకు రావాలి.

ఈ విధమైన జ్ఞానము ఎవరికి కలిగితే వారిలో దయా సంపద ఉంటుంది. దయ అనే దైవ సంపద ఉంటుంది. పరమేశ్వరుడు మన హృదయంలో నిలిచి నిర్హేతుకంగా మనపై దయా వృష్టిని కురిపిస్తున్నాడు. దయామయుడు మన లోనే ఉండగా, మనలో దయ లేకపోవడ మేమిటి?

కత్తితో పండు కోసే టప్పుడు, కూరగాయలు తరిగే టప్పుడు కొన్ని సమయాలలో చేతికి గాయమవుతుంది. అలాగే ఏదైనా వేడిగా ఉన్న పాత్రను తెలియకుండా ముట్టుకున్నప్పుడు చేయి కాలుతుంది. అలాంటి సమయాలలో హృదయంలో ఉన్న దయ పైకి ఎలా పొంగుతుందో మనం ప్రత్యక్షంగా వీక్షించ వచ్చు. గాయమైన చేతిని, లేదా కాలిన చేతిని నోటితో చల్లగా, మెల్లగా గాలిని ఊదుతూ అనునయించే దృశ్యాన్ని చూస్తే, వ్యక్తి లోని దయ ఎలా వ్యక్త మౌతూ ఉందో అర్థ మవుతుంది. అదే దయను ఇతరులపై చూప గలిగితే అది భూతదయ అవుతుంది.

ప్రస్తుత శ్లోకంలో ప్రథమంగా మనం అహింస అనే దైవ లక్షణాన్ని చెప్పుకున్నాం. ఇతరులను కష్టపెట్టకుండా ఉండటము అహింస అయితే, ఇతరులను ప్రయత్న పూర్వకంగా సుఖ పెట్టడం దయ అవుతుంది. అహింస, దయ అనే దివ్య గుణాలు మనిషికి రెండు కళ్ళ లాంటివి. అవి మనిషి లోని ప్రేమకు ప్రతిరూపాలు.

మేఘంలో ఉండే జలం వర్షించి నపుడు తారతమ్యాలు చూడకుండా సర్వులను ఎలా సంతృప్తి పరుస్తుందో, హృదయం లోని ప్రేమ దయా రూపంలో వ్యక్త మైనపుడు సర్వ ప్రాణులపై ఒకే విధంగా ప్రసరిస్తుంది. దైవీ సంపద గల పుణ్యాత్ముడు కేవలం మానవులనే కాదు, సర్వ ప్రాణులను తన దయామృతంతో తడుపుతాడు. దీనులపై దయ చూపి వారిని ఆదుకుంటాడు. ఆర్తులను అక్కున చేర్చు కుంటాడు. పశుపక్ష్యాదులను సైతం సేవిస్తాడు. ఆకలితో అలమటిస్తున్న మానవులపై దయను ఎలా ప్రసరింప చేస్తాడో, నీరు లేక ఎండి పోతున్న మొక్కలపై కూడా అదే దయను కురిపిస్తాడు. కనుకనే దయామయు డైన పరమేశ్వరుని రూపంగా శోభిస్తున్న దయను దైవ సంపదగా భావించాలి.

## (17) అలోలుప్త్వం

లోలుప్త్వము అంటే విక్రియ, లేదా మార్పు. అంటే చలించడము అని అర్థము. అలోలుప్త్వము అంటే అవిక్రియ, లేదా వికారము లేని స్థితి. విషయాల మధ్యే ఉన్నా, ఇంద్రియాలు ఏ విధమైన వికారము లేకుండా ఉండటాన్ని అలోలుప్త్వం అంటారు *(అలోలుప్త్వం ఇంద్రియాణాం విషయ సన్నిధౌ అవిక్రియా)*.

అలోలుప్త్వం అనే పదానికి అలోలత్వం అనే పాఠాంతరము కూడా ఉంది. విషయాల యందు ఆసక్తి





ఉండటాన్ని విషయ లోలత్వం అంటాము. స్త్రీ వ్యామోహం ఉన్న వ్యక్తిని స్త్రీ లోలుడు అంటాము. వేణుగానము నందు ఆసక్తి గల వానిని వేణుగాన లోలుడు అంటాము. లోలత్వం, లేదా లోలుప్త్వం అంటే ఇదే. అది లేకుండా ఉండటము అలోలత్వం, లేదా అలోలుప్త్వం. ఇది దైవీ సంపదకు సంబంధించినది.

ప్రేరేపించే విషయాలు ఎదురుగా లేనపుడు వాటి యందు ఇంద్రియ లోలత్వం వ్యక్తికి లేక పోవచ్చు. ఇది సర్వ సామాన్యం. కాని, వికార హేతువు లైన విషయాలు, అంటే ఇంద్రియాలను ప్రేరేపించే విషయాలు కనిపిస్తూ ఉండినా, అంటే వాటిని అనుభవించే అవకాశము అందుబాటులో ఉండినా, అనుభవించడం అనేది అలా ఉంచి, కనీసం మనస్సులో ఏ విధమైన వికారం లేకుండా, ఇంద్రియ నియమం కలిగి ఉండటము అలోలత్వం. ఇది మహిమాన్వితమైన దైవ సంపద. రంభ తన అందచందాలను ఒలక బోస్తూ ప్రేరేపించినా ఏ మాత్రం మొక్కవోని నిగ్రహంతో తిరస్కరించిన శుకబ్రహ్మలో దివ్యంగా శోభించింది ఈ అలోలుప్త్వమే. ఊర్వశి తన సౌందర్యాన్ని ప్రదర్శిస్తూ ఊరించినా, ఉలుకు పలుకు లేక నిరసించిన అర్జునునిలో కనిపించింది కూడా ఈ అలోలత్వమే. ఇది సాధకులు అవశ్యం సాధించ దగిన దివ్య సంపద. దైవీ సంపద.

## (18) మార్దవము

మార్దవము అంటే మృదుత్వము. మృదువైన స్వభావము. క్రౌర్యం లేకుండా ఉండటము మార్దవము *(మార్దవం మృదుతా అక్రౌర్యం)*. సున్నితమైన మనస్తత్వము. పువ్వు లాంటి సున్నితమైన, మెత్త నైన హృదయమును సాధకులు కలిగి ఉండాలి. మాటలలో మృదుత్వం ఉండాలి. మాటలలో మృదుత్వము అంటే, మాటలు ప్రేమ పలుకులై ఉండాలి. కరుణా పూరితంగా ఉండాలి. కఠినంగా, కర్కశంగా భాషించకుండా, సున్నితంగా, మృదువుగా మాట్లాడాలి. అదే మార్దవ మంటే.

ఒక్క మాట లోనే కాదు. మనస్సు కూడా మృదువుగా ఉండాలి. ఆచార వ్యవహారాలలో మృదుత్వము ఉండాలి. మృదువుగా ఉండే పువ్వుల్ని అందరూ ప్రేమిస్తారు. అలాగే మృదు స్వభావులను సర్వులు ఆదరిస్తారు. ఇదే మార్దవము. సర్వామోద మైన దైవీ సంపద.

ఇక్కడ మరొక విషయాన్ని కూడా జ్ఞాపకం పెట్టుకోవాలి. కొందరు మృదువుగా మాట్లాడుతారు. కాని, మనస్సులో చాలా కఠినంగా ఉంటారు. కొందరేమో మాటలో కర్కశంగా ఉంటారు. కాని, వారి మనస్సు చాలా సున్నితంగా ఉంటుంది. అలాంటి వారి విషయంలో, 'పాపం మాట అలా ఉంటుందే గాని మనస్సు చాలా మంచి దండి' అంటూ కొందరు వ్యాఖ్యానిస్తూ ఉంటారు.

మొదటి వారు కపటులు. ఆలోచించ దగిన వారు కారు. ఇక, రెండవ వారు నిష్కల్మషులే గాని, మనస్సుతో పాటు మాటలో కూడా మృదుత్వాన్ని పొంద గలిగితే తప్పక దైవ సంపదను సాధించిన వారు అవుతారు. మృదు స్వభావులే మాధవ ప్రియులు.

## (19) లజ్జ

లజ్జ పడటము కూడా దైవ గుణము అంటున్నాడు. లజ్జ పడటము అంటే సిగ్గు పడటము అని అర్థము. దానినే హ్రీః అంటారు. హ్రీ శబ్దము సిగ్గును సూచిస్తుంది *(హ్రీ లజ్జాయామ్)*.

సిగ్గు అనే గుణము ప్రతి ఒక్కరిలో కొద్దో, గొప్పో ఉంటుంది. ఎందుకు సిగ్గు పడుతున్నారు? అని చూచి నప్పుడే మనిషి మనిషికి అంతరము కనిపిస్తుంది. సిగ్గు పడే వాళ్ళను మనం చూస్తూ ఉంటాము. కాని అది వాంఛనీయమా, కాదా అనేది సిగ్గు పడే వాళ్ళకు తెలుసో, తెలియదో మనకు అర్థం కాదు.

'ఎందుకలా సిగ్గు పడతావు? కొత్త వాళ్ళేవ రున్నారు? అందరూ మన వాళ్ళే కదా! ముందుకు రా!' అంటూ కొందరు వ్యాఖ్యానిస్తూ ఉండటము మనకు వినపడుతూనే ఉంటుంది. 'చాలా మంచి గాత్ర మండి. చక్కగా పాడుతుంది. కాకపోతే కాస్త సిగ్గు ఎక్కువ' అని కొందరు అంటూ ఉంటారు. 'మిమ్మల్ని అడగాలనే మీ వద్దకు వచ్చాడండి. కాని సిగ్గుతో అడగలేక పోయాడు' అని మరి కొందరు చెబుతూ ఉంటారు. పూర్వపు రోజుల్లో అయితే పెళ్ళి చూపులలో, పెళ్ళి పీటల మీద ఇరు వైపుల సిగ్గు తొణికిసలాడుతూ ఉండేది.

మనకు తెలిసిన, మనం చూస్తున్న ఇలాంటి సిగ్గుల ముగ్గుల్ని గూర్చి కాదు భగవంతుడు చెబుతున్నది. గీతాచార్యుడు సిగ్గును, లేదా లజ్జను దైవీ సంపదగా వర్ణిస్తున్నాడు అంటే, అది సామాన్యులలో మనకు కనిపించే సాధారణ మైన సిగ్గు కాదు. దైవ మార్గంలో చరించే ఉన్నతులు ఆంతరంగికంగా అనుభవించే సంకోచానికి సంబంధించిన బిడియము.

అకార్యమును, అంటే చేయ కూడని కార్యమును చేయవలసి వచ్చినపుడు, అట్టి అకార్యాచరణము నందు చిత్తానికి కలిగే సంకోచము ఇక్కడ **హ్రీః** లేక లజ్జగా చెప్పబడుతూ ఉంది. వ్యక్తి ఔన్నత్యాన్ని తెలుపుతూ ఉన్నందున, లజ్జ పడే ఆ ప్రత్యేక పరిస్థితులలో వ్యక్తులలో పరివర్తనకు అవకాశము ఉన్నందున, సిగ్గు పడటం, లేదా లజ్జ పడటము దైవ సంపదగా పేర్కొన బడింది.

'అలాంటి వాడు ఇలాంటి పని చేశాడు. సిగ్గు కూడా లేదు. లజ్జ లేని బ్రతుకు' అనే లోక నిందలు క్రొత్తవి కావు. చేయ కూడనివి చేసి నపుడు, 'ఇలా ఎందుకు చేశానా?' అని సిగ్గు పడటం మానవత్వము. కాని, మనం చూస్తున్న **హ్రీః** అలాంటిది కూడా కాదు. చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకోవడం కాదు. చేయక ముందే సిగ్గు పడి కార్యాచరణము నుండి విరమించడము. అందుకే ఇది దైవ లక్షణము. దోష రహిత జీవనము.

ఆశించి నంతగా సాధనలో పురోగతిని సాధించలేక పోయాను, అనుకున్నంతగా మారలేక పోయాను అని తనలో తాను సిగ్గు పడటము; తన లోని ఔన్నత్యాన్ని గుర్తించిన వారు తనను స్తుతించి నపుడు సంతసించ డానికి బదులుగా, అలాంటి స్తుతుల నుండి సిగ్గుతో తప్పుకోవడము - ఇవన్నీ **హ్రీః** అనే దైవ సంపద క్రిందికే వస్తాయి.

### (౨౦) అచాపలము

చాపలము అంటే చపలత్వము, చంచల స్వభావము అని అర్థము. అట్టి చపలత్వము లేకుండా ఉండటము అచాపలము. చాపలము అంటే చంచలము, అస్థిరము అని అర్థము కనుక ***(చపలశ్చాలోఽస్థిరః)*** అచాపలము అంటే చంచలత్వము లేక పోవడము, స్థిరత్వము కలిగి ఉండటము అని అర్థము.

***అసతి ప్రయోజనే వాక్పాణి పాదాదీనామ్ అవ్యాపారయితృత్వమ్ అచాపలమ్*** - కరచరణాదులతో, వాక్కుతో ఏ విధమైన ప్రయోజనము లేని కార్యాలను చేయకుండా ఉండటము అచాపలము అని శ్రీ శంకర భాష్యము.

మనిషిలో నిర్నిమిత్త వ్యాపారాలు సాగు తున్నాయి అంటే అతనిలో రజోగుణము మోతాదు ఎక్కువగా ఉందని అర్థము. అందుకే చపలత్వము. వ్యర్థ చేష్ట లన్నీ చపలత్వము క్రిందికే వస్తాయి. ఏమిటి అతని అలవాటు? ఒక్క క్షణం కూడా కుదురుగా ఒక చోట కూర్చో డెందుకని? అని పెద్దలు అంటూ ఉండటం మనకు తెలుసు.

కొందరు ఒక చోట ఉండ లేరు. కొన్ని క్షణాలు స్థిరంగా కూర్చోలేరు. ఒకవేళ బలవంతంగా కూర్చో పెట్టినా, కాళ్ళు చేతులు, కళ్ళు కదిలిస్తూ నైనా ఉంటారు. క్షణం కదలకుండా కూర్చోలేని ప్రబుద్ధులు





ధ్యానంలో స్థిరంగా ఎలా కూర్చో గలరు? ఇలాంటి వాళ్ళే, నాకు ధ్యానం కుదరడం లేదండి, మనస్సు నిలవడం లేదండి అంటూ ఉంటారు. ఏం చేద్దాం! బ్రతుకులో లేని నిలకడ భక్తిలో రమ్మంటే వస్తుందా?

వ్యక్తితో సంబంధం లేకుండా, నిర్నిమిత్తంగా, నిష్ప్రయోజనంగా ఇంద్రియాలు వ్యర్థమైన వ్యాపారాలు సాగిస్తున్నా యంటే అది చపలత్వము కాక మరేమిటి? కొందరు కాళ్ళు ఆడిస్తూ ఉంటారు. కొందరు గోళ్ళు కొరుకుతూ ఉంటారు. కొందరు ఏదో తబలా వాయిస్తున్నట్లు కుర్చీ మీదనో, బల్ల మీదనో, మంచం మీదనో వేళ్ళతో కొడుతూ ఉంటారు. అది బాగుండ దేమో, కొందరు నుదుటి మీద, తల మీద మద్దెల వాయించు కుంటూ ఉంటారు. కార్యాలయాల్లో చూడండి. ఈ చపలచిత్తులే కుర్చీల మధ్య అకారణంగా తిరుగుతూ ఉంటారు.

కాళ్ళు చపలము. కళ్ళు చపలము. చేతులు చపలము. వాక్కు చపలము. మనస్సు చపలము. ఏది చూచినా చపలమే. చంచలమే. అన్నీ మర్కట చలనాలే. ఈ విధమైన చపల స్వభావము, చంచలమైన గుణము లేక పోవడము అచాపలము. సుస్థిరత్వము. దైవీ సంపదకు సంబంధించిన ఉత్తమ లక్షణము.

ధ్యానయోగి మనస్సు గాలి లేని చోట దీపం లాగా స్థిరంగా, నిలకడగా ఉండాలి. తత్త్వ చింతనము చేయాలన్నా, తాత్త్విక ప్రవచనము సాగించాలన్నా బుద్ధి అవధానంతో ఉండాలి. ఆత్మ అచలము. ధ్రువము. అలాంటి ఆత్మే తాను అనే ఎరుక చపల స్వభావులకు కలుగుతుందా? గుఱ్ఱము ఎంత శక్తి కలదైనా, ఎంత వేగంగా పరుగు పెట్టే దైనా, దాని కళ్ళకు గంతలు కట్టే నడిపిస్తారు. కారణం, అది చపల జీవి. బలవంతంగా దానిని ఒక గాడిలో పయనింప చేయాలి. అలా కానపుడు అది ఎటైనా పరుగు తీయవచ్చు. నిలకడ లేని బ్రతుకు లన్నీ ఇలాగే ఉంటాయి.

ప్రయోజనం లేకుండా వాక్కును, కరచరణాదులను చలింప చేయకుండా ఉండటాన్ని దైవ లక్షణంగా ఆచార్యుల వారు వ్యాఖ్యానించడాన్ని కొందరు జీర్ణించుకో లేరు. ఇంత స్వల్ప విషయాన్ని దైవీ సంపదగా గుర్తించడ మేమిటి అని సంశయిస్తారు. కానీ, నిశ్చలమైన శ్రవణ మనన నిదిధ్యాసల నుండి, స్థిరమైన ధ్యాన స్థితి నుండి అచలమైన ఆత్మస్థితికి చేరడానికి చపలత్వము ఎంత పెద్ద ప్రతిబంధకమో ఆలోచనాపరులకు, వివేకవంతులకు తెలియనిది కాదు. ప్రపంచంలో అన్నీ చలనశీలాలే. దేహేంద్రియ మనోబుద్ధులలో అన్నీ చలనాలే. ఈ చలనాల నుండి విడిపడి అచలమైన ఆత్మస్వరూపాన్ని పొందాలి అంటే అచాపలము అనే సాత్త్విక దైవీ సంపద అత్యంత ప్రధాన మైనది.

*ఇప్పటికే, దైవీ సంపదకు సంబంధించి ఇరవై లక్షణాలను పూర్తి చేయడం జరిగింది. ఇక మిగిలిన ఆరు లక్షణాలను తరువాత శ్లోకంలో వివరిస్తున్నాడు.*

**తేజః క్షమా ధృతిః శౌచ మద్రోహో నాతిమానితా ।**
**భవన్తి సమ్పదం దైవీ మభిజాతస్య భారత ॥** 3

***తేజః-క్షమా-ధృతిః-శౌచం-అద్రోహః-న-అతిమానితా***
***భవంతి-సంపదం-దైవీం-అభిజాతస్య-భారత***

| | | | | | |
|---|---|---|---|---|---|
| తేజః | = | తేజము | శౌచం | = | శుభ్రత |
| క్షమా | = | ఓరిమి | అద్రోహః | = | ద్రోహము లేకుండుట |
| ధృతిః | = | ధైర్యము | న అతిమానితా | = | గర్వము లేకుండుట |

| | | | | | |
|---|---|---|---|---|---|
| దైవీం | = | దైవ సంబంధమైన | అభిజాతస్య | = | పుట్టిన వానికి |
| సంపదం | = | సంపదను గురించి | భవంతి | = | కలుగుచున్నవి |

**అర్జునా! తేజము, ఓరిమి, ధైర్యము, శుభ్రత, ద్రోహము చేయకుండుట, గర్వము లేకుండుట - దైవీ సంపదతో జన్మించిన వారిలో ఇవి కనిపిస్తాయి.**

## వ్యాఖ్య

### (21) తేజస్సు

తేజస్సు అంటే ప్రకాశము. తిమిర విరోధి. తేజస్సు అంటే ప్రాగల్భ్యము అని భాష్యం. ప్రగల్భత్వమే ప్రాగల్భ్యము. జ్ఞానము వలన ఏర్పడిన నిర్భయత్వమే ప్రాగల్భ్యము. జ్ఞానము ప్రకాశవంత మైంది. అదే తేజము. కేవలం బుద్ధికి సంబంధించింది.

తేజస్సు అనే పదమును అనేక విధాలుగా ఉపయోగిస్తారు. వేదాంతంలో బ్రహ్మ తేజస్సు, బ్రహ్మతేజము, ఆత్మతేజము అనే పదాలు తరచుగా వినపడుతూ ఉంటాయి. కాని, ఆ తేజస్సును దర్శించాలి అనే అత్యుత్సాహంలో కొందరు, 'ఆయన ముఖ వర్చస్సు చూడండి. ఏమి తేజము! బ్రహ్మవర్చస్సు ఉట్టి పడుతోంది' అని చీకటి మాటలు పలుకుతూ ఉంటారు. తేజస్సు ఒక్కటే కాదు. దైవీ సంపదకు సంబంధించిన లక్షణాలన్నీ బుద్ధి ధర్మాలే, బుద్ధి గుణాలే గాని దేహ ధర్మాలు కావు. తేజస్సు అంటే దేహకాంతి కాదు. బుద్ధి ప్రకాశము. ఈ కారణం చేతనే తేజస్సు అనే పదానికి ప్రాగల్భ్యం అనే అర్థాన్ని చెప్పడమే గాక, అది చర్మగత సౌందర్యము, లేదా ప్రకాశము కాదని కూడా భాష్యం నిర్వచించింది ***(తేజః ప్రాగల్భ్యం, న త్వగ్గతా దీప్తిః)***.

తేజస్సు అంటే బుద్ధి సూక్ష్మత. విచార యుక్త వివేకము. బుద్ధి లోని జ్ఞానము. అస్పష్టత లేని స్వచ్ఛమైన జ్ఞానము. చీకటి కోణాలు లేని తేజము. వెలుగుల తోరణాలు ప్రకాశించే వివేక తేజము. ఇది దైవీ సంపద.

### (22) క్షమ

క్షమ అంటే ఓర్పు, లేదా సహనము అని అర్థం చెప్పుకుంటాం. క్షమ అనేది దైవ సంపద. కనుక దానిని విశాలంగా, విశిష్టంగా అర్థం చేసుకోవాలి. గడచిన అధ్యాయాలలో క్షమను గూర్చి విస్తరించి చెప్పుకున్నాం *(12వ అ - 13 వ శ్లో ; 13 వ అ - 8 వ శ్లో)*. ఇక్కడ విశేషించి విశిష్టతను గుర్తించాలి.

ఏదైనా పరాభవం జరిగి నపుడు వ్యక్తి దానిని ఓర్చుకోవచ్చు. అది సహనము, లేదా ఓర్పు అవుతుంది. పరాభవాన్ని వ్యక్తి సహించ వచ్చు. పరాభవించిన వ్యక్తిపై ప్రతిచర్యను గ్రహించక పోవచ్చు. ఇదంతా సహనమే. కాని, నిష్కారణంగా అతడు తనను పరాభవించాడు అనే పరితాపాన్ని మనస్సులో పెట్టుకొని ఉంటాడు. పగ తీర్చుకోకుండా సహించడం వేరు. బుద్ధిలో పగను దాచుకోవడం వేరు. ఇక్కడే, క్షమ గగన విహారం చేస్తూ ఉంటే, సహనం నేలపై నిలబడి విస్మయంతో వీక్షిస్తూ ఉంటుంది.

క్షమ అనేది దైవ గుణము. పరాభవాన్ని భరించడమే గాక, దాని ఫలితాన్ని మనస్సులో దర్శించని అద్భుత మైన అవగాహన. పరాభవించిన వారికి సైతం పరితోషాన్ని కలిగిస్తూ, తాను పరిపూతమై ఉండటము క్షమా గుణ వైభవము.

***అక్రుష్టస్య తాడితస్య వా అన్తః విక్రియానుత్పత్తిః ఉత్పన్నాయాం ప్రశమనం అక్రోధః ఇతి అవోచామ*** - తిట్టినా, ఈడ్చినా, కొట్టినా, ఒక వైపు బాధను, మరొక వైపు పరాభవాన్ని అనుభవిస్తూ ఉండినా, దానికి సంబంధించిన ఏ విధమైన వికారము, కోపము మనస్సులో కలగకుండా ఉండటము క్షమ అవుతుంది. అందుకే అది దైవీ సంపద.





ఈ సందర్భంలో ఒక ప్రధానమైన విషయాన్ని మనం గుర్తించాలి. స్మృతిలో నిలుపు కోవాలి. దైవీ సంపదకు సంబంధించి మనం ఇప్పటి వరకు చెప్పుకొనిన ఇరవై ఒక్క లక్షణాలలో అక్రోధము అనేది పన్నెండవ దైవ గుణము. దానిని గూర్చి ఆ సందర్భంలో విపులంగా చర్చించు కున్నాము కూడా. కాని, అక్రోధము, క్షమ అనే ఈ రెండు లక్షణాలు సమానార్థాలుగా కనిపిస్తున్నాయి. కనుక, ఇది పునరుక్తి అని కొందరు భావిస్తారు. వాటి మధ ఉన్న సూక్ష్మమైన అంతరాన్ని గుర్తించక పోవడమే వారు అలా భావించడానికి కారణము. మనం స్పష్టంగా అర్థం చేసుకుందాం.

ఒకరు పరాభవించి నపుడు మనస్సులో వికారము జనిస్తుంది. క్రోధం పుట్టే అవకాశం ఉంటుంది. అట్టి పరిస్థితిలో అవగాహనతో క్రోధాన్ని నిగ్రహించడము, రాకుండా ఆపడము అనేవి అక్రోధము. ఆ విధంగా మనస్సులో ఏ విధమైన వికారము లేకుండా చేసుకోవడము.

కాని, క్షమ అది కాదు. పరాభవించ బడినపుడు మనస్సులో అసలు క్రోధమే తల ఎత్తకుండా ఉండటము క్షమ. వికారము జనించి ఆపడము కాకుండా, ఏ వికారము సంభవించకుండా ఉండటమే క్షమా గుణము.

క్షమా గుణంలో మరొక విశిష్టత కూడా ఉంది. ప్రతిచర్యకు అనుకూలమైన వికారము బుద్ధిలో లేక పోవడమే గాక, పరాభవించిన వ్యక్తి పరిస్థితిని, మానసిక స్థితిని అర్థం చేసుకొని ప్రతిచర్యకు బదులుగా ఆ వ్యక్తికి పరితోషాన్ని కలిగించే కార్యానికి ఉద్యమించడం కూడా క్షమలో భాగమే.

భూమాతను సహనానికి ప్రతిరూపంగా చెబుతాము. నాగళ్ళతో అవని కుక్షిని దారుణంగా దున్నినా, క్షమాగుణంతో భరించడమే గాక, దున్నిన వారికి ధాన్యాన్ని పంచుతుంది ధరణి. ఆ ధరణి మాత నుండి ఆవిర్భవించినవే కనుక, పండ్లను కత్తులతో కోసినా, కోసిన వ్యక్తికి, ఉపకరించిన కత్తికి ఇద్దరికీ మధుర రసాన్ని త్రాగిస్తాయి. ఇంతటి క్షమాగుణము కలిగిన తల్లి కనుకనే, భూమాతపై పాదం మోపలేక ధరణీ పుత్రులు క్షమించ మని వేడుకొంటూ ఉంటారు. **విష్ణుపత్నీ నమస్తుభ్యం పాదస్పర్శం క్షమస్వమే** - అమ్మా! భూమాతా! హరిసతీ! నీపై కాలు పెడుతున్నందుకు నన్ను క్షమించు. మరో మార్గం లేక ఇలా చేయవలసి వస్తోంది అని ఉదయాన్నే మన మందరము నేల తల్లికి నమస్కరిస్తున్నాము. క్షమా గుణము అంత విశిష్ట మైంది. అందుకే అది దైవీ సంపద.

ప్రతిచర్యను ప్రదర్శించే సామర్థ్య మున్నా, పరాభవించిన వ్యక్తిపై ప్రతాపాన్ని చూపే ప్రయత్నం చేయ కుండా, నిర్వికారంగా ప్రశాంత చిత్తుడై ఉండటము దైవీ సంపద కలిగిన క్షమావంతుని లక్షణము.

### (23) ధృతి

ధృతి అంటే ధైర్యము. కాని, ప్రస్తుతం మనం అధ్యయనం చేస్తున్న దైవీ సంపదలో ధృతిని విస్తరించి చెప్పు కోవాలి. మోక్ష మార్గంలో పయనించే సాధకులకు దృఢ దీక్ష ఉండాలి. ధైర్య స్థైర్యాలు ఉండాలి. దృఢ సామర్థ్యం ఉండాలి. పూర్వాధ్యాయాలలో వీటిని కొంత వరకు అర్థం చేసుకున్నాం. స్థిరమైన నిశ్చయాన్ని పంద్రెండవ అధ్యాయంలో *(14 వ శ్లో)*, దృఢమైన స్థైర్యాన్ని పదమూడవ అధ్యాయం లోను చూశాం *(7 వ శ్లో)*. నిశ్చయ స్థైర్యాలలో సమర్థతను, సమయస్ఫూర్తిని కలిగి వర్తించడము అనే దక్షతను గూర్చి కూడా చెప్పు కున్నాం *(12 వ అ - 16 వ శ్లో)*. వీటన్నిటిలో ధృతి, లేదా అవగాహనతో కూడిన ధైర్యమే ప్రధానంగా ప్రతిఫలిస్తూ వచ్చింది. కాని ప్రస్తుతం, ఈ ఇరవై మూడవ లక్షణమైన ధృతి వీటన్నిటికీ విలక్షణ మైనది. కనుకనే, దైవీ సంపదలో చేర్చ బడింది.

దేహం ధాతు సంయోగముతో ఏర్పడింది. దేహం నియతితో, సంహతితో కొనసాగుతూ ఉంటుంది.

దేహంలో శక్తి ఉంది. ఆ శక్తి స్థిరమైంది కాదు. ఏ కారణం చేత నైనా దేహం శక్తిహీనం కావచ్చు. అశక్తతకు లోను కావచ్చు. అధిక శ్రమతో అలసి నపుడు దేహం బలహీనం అవుతుంది. వ్యాధుల వాత పడ్డప్పుడు, దేహ బాధలు ప్రాప్తించి నపుడు దేహం శక్తిహీన మవుతుంది. ప్రమాదాలు సంభవించి, అంగ వైకల్యం ప్రాప్తించినా దేహం శక్తిని కోల్పోతుంది. గాయాల కారణంగా పటుత్వాన్ని కోల్పోతుంది. అలాంటి సమయాలలో మనిషి లోని ధైర్య, స్థైర్యాలు సహజం గానే సన్నగిల్లుతాయి. అలాగే ఇంద్రియాలు కూడా నిస్సారమై, శక్తిహీన మవుతాయి.

ఇలాంటి ప్రత్యేక పరిస్థితులలో, దేహేంద్రియాలకు ఉపద్రవాలు ప్రాప్తించి అవి బలహీన పడినపుడు, అవి క్రుంగి పోకుండా, వాటిని నిశ్చలంగా నిలిపే అంతఃకరణ వృత్తి విశేషమే ఇక్కడ ధృతి, లేదా ధైర్యము ***(ధృతిః - దేహేన్ద్రియేషు అవసాదం ప్రాప్తేషు తస్య ప్రతిషేధకః అంతఃకరణ వృత్తి విశేషః యేన ఉత్తంభితాని కరణాని దేహశ్చ న అవసీదన్తి,)***. మనస్సులో ఈ విధమైన ధృతి ఉన్నప్పుడు దేహేంద్రియాలు అవసాదమును పొందవు. దీనిని కేవలం మనో ధైర్యంగా స్వీకరించ డానికి లేదు. కర్మఫలాల యందు సంపూర్ణ అవగాహన కలిగి, ధర్మయుత మైన కర్తవ్య దీక్షా పరాయణుడైన వ్యక్తికి ఏర్పడే జ్ఞానపూరిత మైన అంతఃకరణ వృత్తి విశేషమే ఇక్కడ ధృతి శబ్దము చేత తెలియ బడుతూ ఉంది.

### (24) శౌచము

శౌచము అంటే శుభ్రత. శౌచము అనేది రెండు విధాలుగా ఉంటుంది ***( శౌచం ద్వివిధం బాహ్యమ్ అభ్యన్తరం చ )***. బాహ్య శౌచము, అభ్యంతర శౌచము అని శౌచము రెండు రకాలు. బాహ్యము అంటే దేహము, దేహము ధరించే దుస్తులు, దేహము ఉండే పరిసరాలు. ఇవన్నీ శుభ్రంగా ఉంటే బాహ్య శౌచము ఉందని అర్థము.

అభ్యంతర శౌచము అంతఃకరణమునకు సంబంధించినది. చిత్తమును నిర్మలంగా ఉంచు కోవడమే అభ్యంతర శౌచము.

బాహ్యాభ్యంతరాలలో అశౌచము లేకుండా చూసుకోవడమే శౌచము. బాహ్యాభ్యంతరాలు ఎలా అశుద్ధ మవుతాయి? వాతావరణ కాలుష్యము, పరిసర మాలిన్యాల చేత బాహ్య శౌచము పాడవుతుంది. రాగద్వేషా లనే మల దోషము చేత అంతరంగము మలిన పడుతుంది. బాహ్యాభ్యంతరాలు శుద్ధి పడినపుడే వ్యక్తికి సాధన విషయంలో ఉద్యమించే ఉత్సాహం కలుగుతుంది. అందుచేత శౌచమును దైవీ సంపదలో చేర్చడం జరిగింది.

బాహ్యాభ్యంతరాలను ఎలా శుద్ధి చేసుకోవాలి? మృజ్జలాదుల చేత బాహ్య మాలిన్యాన్ని తొలగించు కోవాలి ***( మృజ్జల కృతం బాహ్యమ్ )***. మనస్సును నిర్మలంగా ఉంచుకోవడం చేత అంతశ్శౌచాన్ని పొందాలి ***(అభ్యన్తరంచ మనో బుద్ధ్యోః నైర్మల్యం )***. మనస్సులో వంచన, రాగద్వేషాది కాలుష్యం లేకుండా చేసుకోవడమే అంతఃకరణ శుద్ధి ***( మాయా రాగాది కాలుష్య అభావః )***. బాహ్యాభ్యంతరాలలో శుద్ధి పడటము చేత, పరిశుద్ధ మైన ఆత్మస్వరూ పానుభూతికి మార్గం సుగమం అవుతుంది. అందుచేత, శౌచమును దైవీ సంపదగా పరిగణించడం జరిగింది. ఈ శౌచమును పన్నెండవ అధ్యాయంలో 'శుచి' శబ్దం చేతను *(12 వ అ - 12 వ శ్లో)*, పదమూడవ అధ్యాయంలో 'శౌచం' శబ్దం చేతను *(13 వ అ - 7 వ శ్లో)* చెప్పుకొని ఉన్నాం.

### (25) అద్రోహము

అద్రోహము అంటే ద్రోహ బుద్ధి లేకుండా ఉండటము అని అర్థము. పరులను హింసించాలి, బాధించాలి అనే కోరిక లేక పోవడము అద్రోహము ***( అద్రోహః పరజిఘాంసాభావః, అహింసనమ్ )***. తనకు అపకారము చేసిన వారిపై పగ తీర్చుకోవాలనే ద్రోహబుద్ధి లేక పోవడము అద్రోహము. ద్వేష భావము ద్రోహబుద్ధిని





ప్రేరేపిస్తుంది. ద్వేషమే లేనపుడు ద్రోహ చింతన ఏర్పడే అవకాశం ఉండదు. ద్వాదశాధ్యాయంలో భక్తుని లక్షణా లలో మనం ప్రథమంగా చూసిన ***అద్వేష్టా సర్వభూతానాం*** అనే లక్షణము ప్రస్తుతం మనం చెప్పు కుంటున్న అద్రోహ లక్షణానికి పునాది వంటిది.

### (26) నాతిమానితా

దైవీ ప్రకృతిలో నాతిమానితా చివరిది. అభయంతో మొదలైన లక్షణాలు నాతిమానితా వద్ద పూర్తయ్యాయి. ఇదంతా దైవీ సంపద.

మానితా అంటే గౌరవము. అతిమానితా అంటే అతిశయించిన గౌరవము. నాతిమానితా అంటే అతిశయించిన గౌరవము యొక్క అభావము. ఇది దైవ లక్షణము. దైవీ సంపద ***( నాతిమానితా, అత్యర్థం మానః అతిమానః స యస్య విద్యతే సః అతిమానీ, తద్భావః అతిమానితా, తదభావః నాతిమానితా )***. నేను గొప్పవాణ్ణి, పూజ్యుణ్ణి అనే భావం లేక పోవడము అని అర్థం.

ప్రతి మనిషికి తనపై తనకు గౌరవం ఉండాలి. లేకపోతే, తనను తాను తక్కువగా ఊహించుకొని న్యూనతలో పడి చింతించే అవకాశం ఉంటుంది. అలాగని అతిశయించిన గర్వముతో అభిమానమును ప్రదర్శించడము అనర్థ దాయకము. అనాత్మ వస్తువు నందు ఆత్మ అభినివేశమే ఈ అభిమానానికి కారణము. ఆ తరువాత అదే గర్వమును పురికొల్పుతుంది. ఈ విధమైన గర్వానికి పదవి కారణం కావచ్చు. తెలివి కారణం కావచ్చు. సంపద కారణం కావచ్చు. సౌందర్యము కారణము కావచ్చు. ఈ విధమైన మానిత్వం ఎవరిలో ఉందో అతడు మాని లేదా అభిమాని. అదే అతిశయిస్తే అతిమానిత్వం. ఈ అతిమానిత్వం లేక పోవడం నాతిమానిత్వం. అదే అమానిత్వం. అమానిత్వం కల వాడు అమానీ ***( అనాత్మ వస్తుషు ఆత్మాభిమానః నాస్తి అస్య )***. అనాత్మ వస్తువుల యందు ఆత్మాభిమానం లేని వాడు అమానీ. అభిమానం కల వాడు మానీ. అతిశయించిన మానిత్వం కల వాడు అతిమానీ. అది లేని వాడు నాతిమానీ. అతని స్వభావమే నాతిమానితా. దైవీ ప్రకృతికి సంబంధించిన సుగుణము. సులక్షణము.

ప్రస్తుత అధ్యాయం మొదటి శ్లోకం లోని ప్రథమ లక్షణ మైన **అభయం** మొదలుకొని మూడవ శ్లోకంలో చివరగా చెప్పబడిన ఇరవై ఆరవ లక్షణ మైన **నాతిమానితా** వరకు ఉన్న లక్షణా లన్నీ దైవీ సంపదలో పుట్టిన వానికి కలుగు తున్నాయి. చివరగా అర్జునుణ్ణి ***భారత!*** అని సంబోధించి, అర్జునా! నువ్వు పవిత్రమైన భరత వంశములో ఉద్భవించావు. నువ్వు పవిత్రుడవు. దైవీ సంపదకు యోగ్యుడవు అని సూచిస్తున్నాడు భగవానుడు.

***తం విద్యా కర్మణీ సమార భేతే పూర్వ ప్రజ్ఞా చ -*** ఒక వ్యక్తికి సంబంధించిన విద్య, కర్మ, ప్రజ్ఞ - ఇవన్నీ పూర్వ జన్మల నుండి వెంబడించి వస్తూ ఉంటాయి అని శ్రుతి ప్రమాణము. కనుక దేవతలకు సంబంధించిన దైవీ ప్రకృతితో పుట్టిన వారికి దైవ సంపద పుష్కలంగా ఉంటుంది. అట్టి వారికి భవిష్యత్తులో జీవితము కళ్యాణకరంగా ఉంటుంది ***( దేవానాం సంపదం అభిలక్ష్య జాతస్య దైవ విభూత్యర్హస్య భావి కళ్యాణస్య ఇత్యర్థః హే భారత! )***.

*దైవీ సంపదను ఇరవై ఆరు లక్షణాలతో మూడు శ్లోకాలలో వివరించిన పరమేశ్వరుడు, ఇక ఆసురీ సంపదను ఆరు లక్షణాలతో తరువాత శ్లోకంలో వర్ణిస్తున్నాడు.*

**దమ్భో దర్పోఽభిమాన శ్చ క్రోధః పారుష్య మేవ చ ।**
**అజ్ఞానం చాభిజాతస్య పార్థ సమ్పద మాసురీమ్ ॥** 4

***దంభః-దర్పః-అభిమానః-చ-క్రోధః-పారుష్యం-ఏవ-చ***
***అజ్ఞానం-చ-అభిజాతస్య-పార్థ-సంపదం-ఆసురీం***

| | | | | | |
|---|---|---|---|---|---|
| పార్థ | = | అర్జునా! | పారుష్యం ఏవ చ | = | పరుష వచనము |
| దంభః | = | కపటము | అజ్ఞానం చ | = | అజ్ఞానమును |
| దర్పః | = | గర్వము | ఆసురీం | = | రాక్షస సంబంధమైన |
| అభిమానః చ | = | దురభిమానము | సంపదం | = | సంపదను గూర్చి |
| క్రోధః | = | క్రోధము | అభిజాతస్య | = | పుట్టిన వానికి |

**అర్జునా! దంభము, గర్వము, దురభిమానము, క్రోధము, పారుష్యము, అజ్ఞానము- ఈ లక్షణాలు అసుర సంపద గల వానికి కలుగుతాయి.**

## వ్యాఖ్య

జన్మల ప్రవాహంలో మతి తప్పి, గతి చెడి ప్రయాణం సాగిస్తున్న అయోమయ జీవులం. ఎవరము ఎక్కడ ఎందుకు పుట్టామో తెలియక పోయినా, అందరం పుట్ట వలసిన ప్రదేశం లోనే పుట్టాము. ఉండ వలసిన వ్యక్తుల మధ్యే ఉన్నాము. నేటి మన జన్మల్ని నిర్ణయించింది ఒకనాడు మనం చేసిన కర్మలే. గతంలో ఏమి చేశామో దాని ఫలం గానే నేడు ఉండ వలసిన విధంగా ఉన్నాము. ***పుణ్యః పుణ్యేన కర్మణా భవతి పాపః పాపేన*** - పుణ్య కర్మను ఆచరించిన వాడు దైవీ సంపదతో పుణ్యాత్ముడుగా పుడితే, పాపకర్మను ఆచరించిన వాడు ఆసురీ సంపదతో పాపాత్ముడుగా పుడుతాడు అన్నది వేదం.

దైవ గుణాలను సంపదగా అభివర్ణిస్తే అర్థం చేసుకోవచ్చు. అసుర లక్షణాలను కూడా సంపదగా చెబుతున్నారే అనే సంశయం మీకు కలగ వచ్చు. ఏవయినా జన్మార్జితాలుగా ప్రాప్తించినవే కాబట్టి, ఎవరికి ఏది ఉందో అదే వారి సంపద అనే భావనతో అసుర గుణాలను 'ఆసురీ సంపద' అనడం జరిగింది. దైవీ సంపదతో పుట్టిన వారి సంపదను ఇరవై ఆరు లక్షణాలతో చెప్పుకున్నాం. ఇక ఆసురీ సంపదతో పుట్టిన వారి సంపదను ఆరు లక్షణాలతో చెప్పుకో బోతున్నాం.

### (1) దంభము

ఆసురీ సంపదలో మొదటిది దంభము. పదమూడవ అధ్యాయంలో అమానిత్వాది జ్ఞాన లక్షణాలలో అదంభిత్వ మనే లక్షణానికి విరుద్ధ మైనది దంభము. దంభము అంటే డాంబికత్వము, దంభాచారము, బడాయి ప్రదర్శనము. లేని దానిని ప్రదర్శించే కపట వర్తనము. పేరు కొరకు ప్రాకులాడే మనస్తత్వము. లేని శ్రేష్ఠత్వాన్ని ప్రదర్శించు కోవడం దంభము. వేష, భాష, ఆచారాదులలో వైభవాన్ని ప్రదర్శించుకుంటూ తానే గొప్పవాడని విర్ర వీగడము దంభము.

దంభము అనేది కుటిలత్వము. కపట వర్తనము. మోసపూరిత జీవనము. దైవ సంపదలో ఋజుత్వ ముతో ప్రవర్తించే పుణ్యాత్ములను చూశాము. ఆసురీ సంపదలో బాహ్యాభ్యంతరాలలో భిన్న ప్రవర్తన కలిగిన అహంకారులను చూస్తాము.

దంభము అనే ఈ దుర్గుణాన్ని ఆచార్యుల వారు భాష్యంలో 'ధర్మధ్వజిత్వం' అన్నారు *( దంభః ధర్మ ధ్వజిత్వమ్ ).* ధర్మధ్వజిత్వము అంటే ధర్మ మనే జండాను చేత పట్టుకొని, తానే ధర్మజ్ఞ డైనట్లు, ధర్మాత్ము డైనట్లు, పరులు విశ్వసించే లాగా దంభమును ప్రదర్శించడం అని అర్థం.





డంబాచారులకు ధర్మము అవసరం లేదు. దైవం అవసరం లేదు. మోక్ష మనేది వారి నిఘంటువులో అలభ్య మైన పదము. వారికి ప్రజల మన్నన కావాలి. లోకం వాళ్ళను గుర్తించాలి. గౌరవించాలి. అందుకోసం విచిత్ర వేషధారణ లన్నీ చేస్తారు. అద్భుతమైన అభినయాలను ప్రదర్శిస్తారు.

అనేక సేవా కార్యక్రమాలను చేపడతారు. విశేషంగా ధనాన్ని వెచ్చిస్తారు. ప్రజల ప్రశంసలు అందు కుంటారు. 'త్యాగ ప్రపూర్ణ - సేవా ప్రవీణ' ఇత్యాది బిరుదుల్ని ఎలాగో సంపాదించు కుంటారు. అమాయకు లైన ప్రజలు ఈ సేవ లన్నీ నిజమే నని, వారి కోసమే నని భ్రమిస్తారు. అంతే, ఇక ఆ క్షణం నుండి వారి వ్యాపారం మూడు పువ్వులు - ఆరు కాయలుగా విస్తరిస్తుంది.

మోసాలు ఎంతో కాలం దాగవు. కపటాలు కలకాలం మన లేవు. ఏదో ఒకనాడు గుట్టు బయట పడు తుంది. అప్పుడు లోకం తెలుసు కుంటుంది. ఏమని? ఇంత కాలం వారు సాగించిన నిర్వాక మంతా సేవ కాదని, సేవ పేరుతో సాగిన వ్యాపార మని. వెచ్చించింది త్యాగధనం కాదని, దూరదృష్టితో అధిక లాభాలను ఆర్జించేందుకు పెట్టిన పెట్టుబడి అని.

### ఆఖ్యాయిక

కొన్ని శతాబ్దాల క్రితం జరిగిందని చెప్పుకొనే దంత కథ. పూర్వం ఒక రాజ్యాన్ని శిష్టాచార సంపన్నుడైన రాజు పరిపాలిస్తూ ఉండే వాడు. ఆ రాజుకు ఒక అందమైన కుమార్తె. తన బిడ్డను భక్తుడు, యోగ్యు డైన వానికి ఇచ్చి వివాహం చెయ్యాలని రాజు నిశ్చయించు కుంటాడు.

ఆ రాజకుమారిని ఒక ముసల్మాను ప్రేమించాడు. ఎలాగైనా ఆవిడ్ని వివాహం చేసుకోవాలని సంకల్పించాడు. అంతే. భక్తుని వేషం ధరిం చేశాడు. భక్తిని అభినయిస్తూ పట్టణవాసు లందరి మనస్సుల్ని దోచేసు కున్నాడు.

రాజు కూడా అతనికి వశ పడ్డాడు. స్వాముల వారి రూపంలో ఉన్న ముసల్మానును నగరికి ఆహ్వానించాడు. తన సంస్థానం లోనే విడిది ఏర్పాటు చేశాడు. అతని సదాచారమును, నిత్యానుష్ఠానమును చూచి ముగ్ధుడైన ప్రభువు, రాజకుమారిని అతని కిచ్చి వివాహం చేయడానికి నిశ్చయించు కున్నాడు. రాజకుమారి కూడా యువకుడైన స్వామిని ఇష్ట పడింది. సంబరానికి అందరూ సిద్ధ పడుతున్నారు.

ఇంతలో మంత్రికి ఎందుకనో అనుమానం వచ్చింది. తన అనుమానాన్ని దాచుకోకుండా రాజుకి రహస్యంగా విన్నవించు కున్నాడు. తనకు ఒక అవకాశ మిస్తే వాస్తవాన్ని కనిపెడతా నన్నాడు మంత్రి. రాజుకి మంత్రి అంటే ఎనలేని ప్రేమ, విశ్వాసము. అలాగే నన్నాడు రాజు.

ఒకనాటి అర్ధరాత్రి సమయం. స్వాముల వారు భోం చేసి పవ్వళించి ఉన్నారు. పైగా గుర్రు పెడుతున్నారు. ఒక ఇనుప కడ్డీని నిప్పులో బాగా కాల్చి, నిదుర పోతున్న స్వామి వారి పాదానికి గట్టిగా అంటించాడు మంత్రి. స్వామి వారు 'అల్లా!' అంటూ చివుక్కున లేచి గదంతా గంతు లేశారు. అంతే. మరి పెళ్ళి మాటేమిటి అంటారా? ఏమో, నాకూ తెలియదు. నేను రెండవ లక్షణం వైపు పోతున్నా.

### (2) దర్పము

దర్పము అంటే గర్వము, లేదా మదము. పెద్దలను, పూజ్యులను పరాభవించ డానికి హేతువు ఇదే. మరి దేనిని చూసుకొని మనిషి గర్వ పడతాడు? ***విద్యా ధన స్వజనాది నిమిత్తః ఉత్సేకః దర్పః*** - విద్య, ధనము, స్వజనము మొదలైన విషయాల కారణంగా ఏర్పడిన ఉత్సేకమే దర్పము. ఉత్సేకము అంటే గర్వము.

తాను గొప్ప విద్యావంతు డనే గర్వము. తాను సంపన్ను డనే గర్వము. తనకు విశేషంగా బంధుజన మున్నారనే గర్వము. ఇదంతా అజ్ఞాన జనితము. చీకటి బ్రతుకు. ఏది ఎందు కున్నదో అర్థం గాని అయోమయ స్థితి. అవివేక స్థితి. ఇదంతా సంపదే నని మనిషి విర్ర వీగుతాడు. వాస్తవానికి ఇది ఆసురీ సంపద. సంపద రూపంలో గోచరించే ఆపద.

ఆసురీ సంపద కలిగి గర్వంతో మద మెక్కిన వారికి సుభాషితాలు రుచించవు. చెవిటి వాని ముందు శంఖమును పూరించినట్లే ఉంటాయి. విద్య, ధనము, జనము ఉండటము మంచిదే. ఈశ్వరానుగ్రహం వల్లనే అవన్నీ ప్రాప్తిస్తాయి. అనుగ్రహాలను అనుగ్రహాలుగా స్వీకరించాలే గాని అతిశయించిన గర్వంతో బ్రతుకులను శని గృహాలుగా మార్చుకో కూడదు. ఏవి ఉన్నా, ఈ ప్రపంచంలో ఎంత కాలం ఉంటాయి? అసలు మన మెంత కాలం ఉంటాము? ధన జనాదులు ఉంటే ఉండనీ. తప్పు లేదు. కాని, వాటితో పాటు గర్వాన్ని పెంపొందించు కోవద్దు అంటూ, దర్పానికి వ్యాఖ్యానమా అన్నట్లు భజగోవిందంలో ఆచార్యుల వారు జ్ఞానోపదేశం చేశారు. వివేక వైరాగ్యాలను జోడించి బుద్ధి చెప్పారు.

శ్లో॥ *మా కురు ధన జన యౌవన గర్వమ్*
*హరతి నిమేషాత్ కాలః సర్వమ్ ।*
*మాయా మయ మిదం అఖిలం హిత్వా*
*బ్రహ్మపదం త్వం ప్రవిశ విదిత్వా ॥*
*భజగోవిందం - భజగోవిందం*
*గోవిందం భజ - మూఢమతే ॥ భజ ॥*

'ధన ముందని, జన మున్నారని, యౌవన ముందని గర్వించకు. వీటన్నిటిని ఊడ్చేయడానికి కాలానికి నిమిషం పట్టదు. ఇది మాయా ప్రపంచ మని తెలుసుకో! అనిత్య మని అర్థం చేసుకో! సత్యరూప మైన బ్రహ్మమును తెలుసుకొని తరించి పో!' అని ఆదేశించారు భజగోవిందంలో ఆచార్యులు.

### (3) అభిమానము

అభిమానము అనే పదానికి అతిమానము అనే పాఠాంతరము కూడా ఉంది. తానే శ్రేష్ఠుడు. తానే పూజ్యుడు, అన్యుల కన్నా అధికుడు అనే స్వాభిమానంతో అందరి నుండి మన్ననలను ఆశించే అల్ప గుణమే అభిమానము. కొందరికి తమది గొప్ప కులం అనే కులాభిమానము. కొందరికి తాము అందగాళ్ళము అనే రూపాభిమానము. అలాగే ధనాభిమానము, గుణాభిమానము, వంశాభిమానము, విద్యాభిమానము. కొందరి కేమో తమకు అభిమానమే లేదు అనే అభిమానము. అభిమానం గల వారికి ఆత్మజ్ఞానం కలుగదు. అనాత్మను ఆత్మగా భావించే మూర్ఖులకు ఆత్మజ్ఞానం ఎలా వంట పడుతుంది?

గర్వము, అభిమానము మొదలైన అసుర గుణాలు జ్ఞాన ప్రతిబంధకాలు. *అభిమానస్య జ్ఞాన ప్రతిబంధకత్వాత్ సాకల్యేన తం పరిత్యజ !* - అభిమానము జ్ఞానానికి అవరోధము కనుక, దానిని పూర్తిగా విడిచి పెట్టెయ్యాలి అన్నారు స్వయంప్రకాశ యతీంద్రులు.

### (4) క్రోధము

ఇక నాల్గవది క్రోధము. ఆశించి పొందా లనుకున్నది పొంద లేనపుడు మనిషిలో నిరాశ జనిస్తుంది. అట్టి నిరాశకు కారణ మైన దానిపై కోపం పుడుతుంది. అదే క్రోధము. భయంకరమైన రాక్షస గుణము.





విషయాల యందు కోరికను కామం అంటాము. కోరిక ఫలించకుండా దానికి అవరోధంగా నిలిచిన దానిపై ఏర్పడే చిత్తవృత్తియే క్రోధము. ఈ కామక్రోధాలను పరిత్యజించిన వాడే ధ్యానయోగి అవుతాడు అన్నారు స్వయంప్రకాశ యతీంద్రులు ( ***కామః ఇచ్ఛా విషయేషు, తస్య ప్రతిహతౌ జాతా చిత్తవృత్తిః క్రోధ ఇత్యుచ్యతే, తదుభయ పరిత్యాగే ధ్యానాకారీ భవేత్ !*** ).

క్రోధము దారుణ మైన అసుర లక్షణము. పట్టిందంటే విడిచి పెట్టదు. నిప్పు లేకుండానే తగల బెడుతుంది. నీళ్ళు లేకుండానే నిలువున ముంచేస్తుంది. క్రోధము రాగానే బుద్ధి పట్టు తప్పుతుంది. పెనుగాలికి అరటి చెట్టు ఊగినట్లు, క్రోధ ప్రభంజనానికి అంతఃకరణము చెదిరి పోతుంది. గాలి విపరీతంగా వీచి నపుడు సమస్తమూ ఎలా అగమ్య గోచరంగా ఉంటుందో, అలాగే క్రోధ వాయువు వీచి నపుడు బుద్ధిలో సమ్మోహం ఏర్పడి ( ***క్రోధా ద్భవతి సమ్మోహః*** ), ఏది కృత్యమో, ఏది అకృత్యమో తెలిసి రాదు. ఈ విధంగా అజ్ఞాన రూపమైన క్రోధ రాక్షసి జ్ఞానాన్ని అపహరించుకొని పోతుంది.

శ్లో॥ ***కామక్రోధశ్చ లోభశ్చ దేహే తిష్ఠన్తి తస్కరాః***
***జ్ఞాన రత్నాప హారాయ తస్మాత్ జాగ్రత జాగ్రత !***

కామక్రోధ లోభు లనే ముగ్గురు భయంకర శత్రువులు ఉన్నారు. వారెక్కడో బాహ్యంలో లేరు. మన దేహం లోనే ఉన్నారు. జ్ఞాన మనే రత్నాన్ని అపహరించుకొని పోవడానికి కాచుకొని ఉన్నారు. అందుచేత అందరూ అవధానంతో జాగరూకులై ఉండాలని శాస్త్రం హెచ్చరించింది.

### (5) పారుష్యము

పారుష్యము అంటే పరుష వచనము ( ***పారుష్య మేవ చ పరుష వచనం*** ). ఇతరులను పరుషంగా మాట్లాడి గాయ పరచడము పారుష్యము. దైవీ సంపదలో మనం చెప్పుకున్న మార్దవానికి వ్యతిరేకము ఈ పారుష్యము. పారుష్య మంటే కేవలం పరుష వాక్కులే అని కాదు. పరుషం కాకపోయినా వ్యంగ్య ధోరణిలో విమర్శనాత్మకంగా సాగించే తియ్యటి వ్యాఖ్యానాలు అని అర్థం. అదెలా గంటే . . . .

గ్రుడ్డి వాడు కూర్చుని ఉంటే, అతడు గ్రుడ్డి వాడని తెలిసినా, తెలియనట్లు నటిస్తూ, 'ఏమిటీ! అలా తదేకంగా నన్నే చూస్తున్నారు? మీ కళ్ళు ఎంత అందంగా ఉన్నాయో!' అంటూ గేలి చేయడం పారుష్యము ( ***యథా కాణం చక్షుష్మాన్*** ). అలాగే కురూపిని అందగాడని అభివర్ణించడం ( ***విరూపం రూపవాన్*** ), ఇలాంటి నీచ హాస్యమును నలుగురి ముందు ప్రదర్శించి ఆనందించే పైశాచిక ప్రలాపా లన్నీ పారుష్యమే. ఆసురీ సంపద లోని దుష్ట లక్షణమే.

### (6) అజ్ఞానము

ఆసురీ సంపదలో ఆరవది అజ్ఞానము. ఇక్కడ అజ్ఞానము అంటే అవివేక జ్ఞానం ( ***అజ్ఞానం చ అవివేక జ్ఞానం*** ). అవివేక జ్ఞానము అంటే, ఏది చేయదగింది, ఏది చేయ కూడనిది అనే 'కర్తవ్య - అకర్తవ్య' విషయాల యందు విరుద్ధమైన జ్ఞానం ( ***కర్తవ్య అకర్తవ్యాది విషయ మిథ్యా ప్రత్యయః*** ). ఈ సందర్భములో ఒక్క విషయం జ్ఞాపకం పెట్టుకోవాలి. ఇక్కడ అజ్ఞానము, అవివేకము అనే పదాలున్నా యని, అజ్ఞానము అంటే ఆత్మ విషయానికి సంబంధించిన అజ్ఞానము అని, వివేకము అంటే ఆత్మానాత్మ వివేక మని అర్థం చేసుకో కూడదు. మనం చర్చిస్తున్నది అసుర సంపత్తిని గూర్చిన విషయం. ఆసురీ సంపదలో ఆత్మ ప్రసక్తి అనూహ్యము.

కర్తవ్య, అకర్తవ్యాలను తారుమారు చేసి అర్థం చేసుకొని, ఒక నిర్ణయానికి రావడమే ఇక్కడ అవివేకము. కర్తవ్య, అకర్తవ్యాలలో వివేకం లోపించి ఉన్నందున వాటి విషయంలో అజ్ఞానము ఉంది అని అర్థం. అంతే.

ఇంతవరకు మనం వివరించుకున్న ఆరు లక్షణాలు ఆసురీ సంపద యందు పుట్టిన వారిలో ఉంటాయి ***( అసురాణాం సంపత్ ఆసురీ, తామ్ అభిజాతస్య ఇత్యర్థః ).***

దైవీ సంపదకు సంబంధించిన లక్షణాలను పూర్తి చేస్తూ అర్జునుని ***భారత*** అని మూడవ శ్లోకంలో సంబోధించిన భగవానుడు, ప్రస్తుత శ్లోకంలో ఆసురీ సంపదకు సంబంధించిన లక్షణాలను పూర్తి చేస్తూ **పార్థ** అని సంబోధించాడు.

అటు తండ్రి వైపు చూస్తే, అతనిది దీప్తిమంత మైన భరత వంశము. ఇటు మాతృమూర్తిని చూస్తే, ఆమెది పవిత్రతకు పుట్టినిల్లు. పితృ, మాతృ వంశములు రెండును దైవీ సంపదతో నిండి ఉన్నవే కనుక, అర్జునుడు దైవీ సంపదను మూట గట్టుకొని జన్మించిన వాడే గాని ఆసురీ సంపదకు సంబంధించిన వాడు కాడని స్పష్టం చేసిన ట్లైంది.

*ఈ ఉభయ సంపదల ఫల మేమిటో చెబుతున్నాడు.*

దైవీ సమ్ప ద్విమోక్షాయ నిబన్ధా యాసురీ మతా ।
మా శుచ స్సమ్పదం దైవీ మభిజాతోఽసి పాణ్డవ ॥ 5

***దైవీ-సంపత్-విమోక్షాయ-నిబంధాయ-ఆసురీ-మతా***
***మా-శుచః-సంపదం-దైవీం-అభిజాతః-అసి-పాండవ***

| | | | | | |
|---|---|---|---|---|---|
| పాండవ | = | అర్జునా! | మతా | = | చెప్పబడింది |
| దైవీ | = | దైవ సంబంధమైన | దైవీం | = | దైవ సంబంధమైన |
| సంపత్ | = | సంపద | సంపదం | = | సంపదను గురించి |
| విమోక్షాయ | = | ముక్తి కొరకు | అభిజాతః | = | పుట్టిన వాడవు |
| ఆసురీ | = | రాక్షస సంబంధమైన | అసి | = | అయి ఉన్నావు |
| సంపత్ | = | సంపద | మా శుచః | = | దుఃఖించకు |
| నిబంధాయ | = | బంధము కొరకు | | | |

**దైవీసంపద మోక్షమును, అసురసంపద బంధమును కలిగిస్తాయి. అర్జునా! నువ్వు దైవసంపద గల వాడివి. అందుచేత దుఃఖించకు!**

### వ్యాఖ్య

అధ్యాయారంభంలో వరుసగా మూడు శ్లోకాలలో దైవీ సంపద లక్షణాలను చూశాం. నాల్గవ శ్లోకంలో ఆసురీ సంపదను కూడా తెలుసుకున్నాం. యుక్తా యుక్తాలను అర్థం చేసుకున్నాం. ప్రస్తుత శ్లోకంలో ఉభయ సంపదల ఫల విభాగాన్ని వివరిస్తూ, 'అర్జునా! దైవీ సంపద సంసార బంధము నుండి విముక్తి కొరకు సహకరిస్తుంది. ఆసురీ సంపద సంసార బంధమును దృఢ పరుస్తుంది. పాండు కుమారా! బాధ పడకు. నువ్వు దైవీ సంపద లోనే పుట్టావు' అని అభయ మిచ్చాడు ఆదిదేవుడు.

అర్జునుడు పుణ్యాత్ముడు. ధర్మాత్ముడు. దైవీ సంపదలో పుట్టిన వాడు. దైవీ సంపదలో పుట్టడానికి కావలసిన పుణ్య మేదో అతనికి గతం లోనే ఉంది. దైవీ సంపదలో పుట్టిన ఆ ధర్మాత్ముడు దైవ మార్గం లోనే చరిస్తున్నాడు కనుక, అతని భవిష్యత్తు కూడా కళ్యాణకరం గానే ఉంటుంది. అందుకే, దుఃఖించ వద్దని





పరమేశ్వరుడు అభయ ప్రదానం చేస్తున్నాడు. **పాండవ!** అని సంబోధించి అర్జునుని జన్మ వైశిష్ట్యాన్ని స్పృశిస్తూ అతని దైవీ సంపదను స్వయంగా ప్రస్తుతిస్తున్నాడు.

అర్జునుని విషయం అలా ఉంచితే, మన పరిస్థితి ఏమిటి? ఉభయ సంపదలను అర్థం చేసుకున్నాం. మనది ఆసురీ సంపద అని అన లేము. మనలో కొన్ని లక్షణాలు దైవీ సంపదకు సంబంధించినవి కూడా ఉన్నాయి. అలాగని, దైవీ సంపద కల వారము అని కూడా చెప్ప లేము. మనలో ఆసురీ సంపదకు సంబంధించిన లక్షణాలు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి.

మనం సామాన్యులం. సాధారణ మానవులం. తల పై కెత్తి ఎంత ఎత్తు కైనా చూడ వచ్చు. కాని, మన పాదాలు మాత్రం భూమి మీదనే ఉండాలి. మనలో ఉభయ సంపదలూ ఉన్నాయి. గుణ దోషాలు రెండూ ఉన్నాయి. కేవలం గుణాలే ఉన్న వాళ్ళు, కేవలం దోషాలే ఉన్న వాళ్ళు మానవులలో సాధారణంగా ఉండరు. గుణ దోషాల మిశ్రమం ఉన్న వాళ్ళే అధిక శాతం మానవులుగా జన్మిస్తారు.

***నాత్యన్తం గుణవత్ కించి న్నాత్యన్తం దోషవత్ తథా*** - 'అంతా గుణమయమే అని చెప్పలేము; అలాగని అంతా దోషమయం కూడా కాదు' అని వ్యాస భగవానుడే అభిప్రాయ పడ్డాడు. ఇదీ మన నేపథ్యం.

దైవీ సంపద సంసార బంధ విముక్తికి, ఆసురీ సంపద సంసార బంధానికి సహకరిస్తా యని ఫల విశేషాన్ని చెప్పడం లోనే పొంద వలసింది ఏమిటో, పోగొట్టుకో వలసింది ఏమిటో భగవంతుడు చెప్పకనే చెప్పేశాడు. ఒకవేళ పొంద దగింది మన వద్ద పుష్కలంగా లేకపోతే దానిని ప్రయత్నించి పొందాలని, అలాగే పోగొట్టుకో వలసింది మన వద్ద ఉంటే దానిని గట్టి ప్రయత్నంతో పోగొట్టుకోవాలని స్పష్టంగా చెప్పడం జరిగింది.

### దారేదో? దిశ ఎటో?

దైవీ సంపద సంసార బంధ విమోచనం కొరకు, ఆసురీ సంపద సంసార బంధానికి చెప్ప బడ్డాయి. దీనిని కూడా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. దైవీ సంపద సంసార బంధ విమోచనం కొరకు చెప్పబడింది అంటే, దైవీ సంపద వల్ల మోక్షం ప్రాప్తిస్తుందని కాదు. అలాగే ఆసురీ సంపద సంసార బంధం కొరకు చెప్ప బడింది అంటే, ఆసురీ సంపద వల్ల సంసార బంధము ఏర్పడు తుందనీ కాదు.

సంసార బంధ విమోచనము, లేదా మోక్షము అనేది జ్ఞానం వల్లనే కలుగుతుంది. కేవలం ఆత్మజ్ఞానం వల్ల కలుగుతుందే గాని, దైవీ సంపద వల్ల కాదు. కాకపోతే, జ్ఞానాన్ని పొందడానికి మనిషిలో దైవీ సంపద ఉండి తీరాలి. దైవీ సంపద లేనిదే అంతఃకరణ శుద్ధి ఏర్పడదు. అంతఃకరణ శుద్ధి లేనిదే జ్ఞానం ఉత్పన్నం కాదు. ఈ విధంగా దైవీ సంపద జ్ఞాన సాధనమే గాని, మోక్షానికి సాక్షాత్తు ఏక సాధనం కాదు. దైవీ సంపద ఉన్నా, జ్ఞానం లేకపోతే మోక్షం రాదు ***( జ్ఞానం వినా మోక్షః న సిద్ధ్యతి ).*** జ్ఞానం లేకుండా, కేవలం దైవీ సంపద వద్ద జీవితం ఆగిపోతే, అలాంటి వ్యక్తి స్వర్గాన్ని చేరుతాడేమో గాని మోక్షాన్ని మాత్రం పొంద లేడు.

దైవీ సంపద లేక పోవడమే సంసార బంధానికి కారణ మైతే, దైవీ సంపదను ప్రోగు చేసుకుంటే బంధ నివృత్తి జరుగుతుంది. మోక్షప్రాప్తి కలుగుతుంది. కాని, బంధానికి కారణం అజ్ఞానమే గాని దైవీ సంపద లేక పోవడం కాదు. బంధానికి అజ్ఞానము కారణ మైనపుడు, జ్ఞానమే బంధ విమోచనం కలిగించ గలదు కాని దైవీ సంపద కాదు.

***అవిద్యా కృతత్వాత్ బంధస్య విద్యయా మోక్ష ఉపపద్యతే*** - 'ఆత్మకు సంబంధించిన అజ్ఞానమే బంధానికి కారణ మైనందున, ఆత్మకు సంబంధించిన జ్ఞానమే మోక్షాన్ని కలిగిస్తుంది' అని శ్రీ శంకరులు బ్రహ్మసూత్ర భాష్యంలో విస్పష్టం చేశారు *(సూత్ర భాష్యం ; 3 - 2 - 4).*

ఈ కారణం చేతనే శ్లోకంలో 'మోక్షాయ' అనకుండా, **విమోక్షాయ** అని ఉపసర్గతో కలిపి చెప్పడం జరిగింది. దైవీ సంపద ఉన్న ట్లైతే, జ్ఞానప్రాప్తి ద్వారా మోక్షాన్ని పొందడము సులభము అని చెప్ప డానికే **విమోక్షాయ** అనడం జరిగింది.

ఇక రెండవది ఆసురీ సంపద. దైవీ సంపద మోక్షానికి సహకరించేదే గాని సాక్షాత్తు మోక్ష సాధనం కాదు అని అర్థం చేసుకున్నాం. మరి, అసుర సంపద విషయం ఏమిటి? అది సంసార బంధాన్ని కలిగిస్తుంది కదా! అదీ వాస్తవం కాదు.

మోక్షానికి దైవీ సంపద ఎలా కారణం కాదో, అలాగే బంధానికి కూడా ఆసురీ సంపద కారణం కాదు. దైవీ సంపద మోక్షాన్ని ఇవ్వలేదు. ఆసురీ సంపద బంధాన్ని సృష్టించ లేదు.

అయినా మనకు బంధం లేకపోతే కదా, ఆసురీ సంపద దానిని సృష్టించాలి? మనం బంధం లోనే ఉన్నాము. ఇక, ఆసురీ సంపద ప్రత్యేకంగా సృష్టించేది ఏముంటుంది? బంధాన్ని సృష్టించింది అజ్ఞానము. కనుక బంధానికి అజ్ఞానమే కారణం గాని ఆసురీ సంపద కాదు.

కాకపోతే, దైవీ సంపద జ్ఞానానికి సహకరిస్తూ మోక్షాన్ని సుగమం చేస్తే, ఆసురీ సంపద అజ్ఞానానికి సహకరిస్తూ బంధాన్ని దృఢం చేస్తుంది. ఈ అంతరాన్ని స్పష్టంగా గ్రహించాలి. అందుచేతనే దైవీ సంపద విషయంలో 'విమోక్షాయ' అని ప్రవచించిన పరమేశ్వరుడు, ఆసురీ సంపద విషయంలో 'బంధాయ' అనకుండా 'నిబంధాయ' అంటున్నాడు.

నిబంధము అంటే నియత మైన బంధము అని అర్థము ***(నిబంధః నియతః బంధః నిబంధః)***. అంటే గట్టి బంధము. బంధము అనేది ఎలాగూ అజ్ఞానం వల్ల ఏర్పడి ఉంది. ఆ ఉన్న బంధాన్ని ఈ ఆసురీ సంపద ఇంకా దృఢం చేస్తుంది అని అర్థం. ఈ శ్లోక భావాన్నంతా ఒక్క వాక్యంలో చెప్పాలంటే, బంధము నుండి విడుదల కావాలి అనేదే మన లక్ష్య మైతే, మోక్ష హేతువైన జ్ఞానానికి సహకరించే దైవీ సంపదను వృద్ధి చేసుకోవాలి. అలా కాకుండా, బంధమే అంద మని భావించి, బంధము లోనే ఉండిపో దలచుకుంటే ఆసురీ సంపదనే ఆశ్రయించ వచ్చు; ఇంకా పెంపొందించుకో వచ్చు. ఎవరి అభిమతం వారిది. ఎవరి దారి ఏటో, ఎవరి గమ్యం ఏదో, ఎవరికి వారే నిర్ణయించు కోవాలి.

*చెప్పింది ఏమిటో, చెప్ప బోయేది ఏమిటో సమీక్షిస్తున్నాడు.*

ద్వౌ భూతసర్గౌ లోకేఽస్మి న్దైవ ఆసుర ఏవ చ ।
దైవో విస్తరశః ప్రోక్త ఆసురం పార్థ మే శృణు ॥ 6

*ద్వౌ-భూత సర్గౌ-లోకే-అస్మిన్-దైవః-ఆసురః-ఏవ-చ*
*దైవః-విస్తరశః-ప్రోక్తః-ఆసురం-పార్థ-మే-శృణు*

| | | | | |
|---|---|---|---|---|
| పార్థ | = అర్జునా! | | దైవః | = దైవ సంబంధ మైనది |
| అస్మిన్ | = ఈ | | విస్తరశః | = విస్తారముగా |
| లోకే | = లోకము నందు | | ప్రోక్తః | = చెప్పబడింది |
| దైవః | = దైవ సంబంధ మని | | ఆసురం | = అసురమైన దానిని |
| ఆసురః ఏవ చ | = అసుర సంబంధ మని | | మే | = నా వలన |
| భూతసర్గౌ | = ప్రాణుల పుట్టుకలు | | శృణు | = విను |
| ద్వౌ | = రెండు విధములు | | | |





**అర్జునా! మానవ లోకంలో దైవ మని, ఆసుర మని రెండు విధాలుగా ప్రాణుల పుట్టుక లున్నాయి. దైవీ సంపదను నీకు విస్తారంగా చెప్పాను. ఇక ఆసురీ సంపదను గూర్చి చెబుతాను. విను.**

**వ్యాఖ్య**

మానవ లోకంలో భూత సృష్టి రెండు విధాలుగా ఉంది. మొదటిది దైవం. అంటే, దైవ సంబంధమైన సృష్టి. రెండవది అసురం. అంటే, అసుర సంబంధమైన సృష్టి. సర్గము అంటే సృష్టి. సృజింప బడేవి కనుక అవి సర్గములు ***(సృజ్యతే ఇతి సర్గః సృష్టిః)***. సృష్టి ఆరంభము నందే ఈ రెండు ఉత్పత్తులు జరిగాయి అని అర్థము. ఈ విషయాన్ని శ్రుతులు ప్రామాణికంగా చెబుతున్నాయి. మానవకోటి రెండు విధాలుగా సృష్టింప బడిందని బృహదారణ్య కోపనిషత్తు ప్రవచించింది.

***ద్వయా హ వై ప్రాజాపత్యా దేవాశ్చ అసురాశ్చ*** - ప్రజాపతి, అనగా బ్రహ్మదేవుని వలన పుట్టిన మానవులు దేవతలు, అసురులు అని రెండు విధాలు అన్నది బృహదారణ్యక శ్రుతి *(1 - 3 - 1)*. ఒకవేళ జాతుల ప్రస్తావన వస్తే, సృష్ట్యాదిలో దైవ, అసుర జాతులు రెండే ఉన్నాయని తెలుస్తూ ఉంది. బ్రహ్మసృష్టి ఇంతే. మరి, ఇన్ని జాతు లెలా వచ్చాయి అంటే, బహుశ అది జీవసృష్టి అయి ఉంటుంది.

దైవ సంబంధమైన దైవీ సంపదను గూర్చి ***అభయం సత్త్వ సంశుద్ధిః*** అనే గుణాల నుండి ***అద్రోహో నాతిమానితా*** అనే గుణాల వరకు సుదీర్ఘంగా, సవిస్తరంగా చెప్పడం జరిగింది అంటున్నాడు భగవంతుడు ***(విస్తరశః ప్రోక్తః)***. ఈ ఆదేశాన్ని ఔదల దాల్చి నేను కూడా నా వ్యాఖ్యానాన్ని సవిస్తరం గానే అందించాను. దైవీ సంపదకు సంబంధించిన కేవలం మూడు శ్లోకాలకు ఇంతగా విస్తరించి వ్యాఖ్యానించడం అవసరమా? అని చదివే టప్పుడు ఒకవేళ అనిపించి ఉంటే, ఇక్కడ ఈ ఆదేశం ఉండబట్టే అలా విస్తరించి వ్రాయవలసి వచ్చింది అనే విషయం విజ్ఞులకు ఇప్పుడు స్పష్టమై ఉంటుందని భావిస్తాను.

అర్జునా! దైవీ సంపదను విస్తరించి చెప్పాను. ప్రస్తుతం ఆసురీ సంపదను కూడా వివరిస్తాను అని శ్రీభగవానువాచ. అలా అనడంలో, ఇంతవరకు దైవీ సంపదను సవిస్తరంగా చెప్పాను, కాని ఆసురీ సంపదను సవివరంగా చెప్ప లేదు అనే భావం ధ్వనిస్తూ ఉంది ***(న తు అసురః విస్తరశః)***. అది వాస్తవం.

మీకు ఇక్కడ ఒక సందేహం రావచ్చు. దైవీ సంపదను ఇరవై ఆరు లక్షణాలతో, మూడు శ్లోకాల లోనే చెప్పడం జరిగింది కదా, విస్తరించి చెప్పాను అంటా డేమిటి?

దైవీ సంపదకు సంబంధించినవి ప్రస్తుత అధ్యాయారంభంలో చెప్పిన ఇరవై ఆరు లక్షణాలు మాత్రమే కాదు. రెండవ అధ్యాయం లోని స్థితప్రజ్ఞ లక్షణాలు, పన్నెండవ అధ్యాయం లోని భక్తుని లక్షణాలు, పదమూడవ అధ్యాయం లోని అమానిత్వాది జ్ఞాన లక్షణాలు, పద్నాల్గవ అధ్యాయం లోని గుణాతీత లక్షణాలు, ప్రస్తుత అధ్యాయం లోని 'అభయం' మొదలు 'నాతిమానితా' వరకు చెప్పబడిన ఇరవై ఆరు లక్షణాలు - ఇవన్నీ దైవ లక్షణాలే. ఇంకా సవిస్తరంగా చెప్పక పోవడ మేమిటి? అందుచేత, ప్రస్తుతం ఆసురీ సంపదను విస్తరించి చెబుతున్నాడు. తొమ్మిదవ అధ్యాయంలో **మోఘాశాః మోఘ కర్మాణః** అంటూ నామమాత్రంగా స్పృశించిన ఆసురీ సంపద విషయాన్ని *(9 వ అ - 12 వ శ్లో)* ప్రస్తుత శ్లోకం నుండి వరుసగా పన్నెండు శ్లోకాలలో వివరంగా విశదం చేస్తున్నాడు. ఒక విధంగా చెప్పాలంటే, అభయాది లక్షణాలను వర్ణించిన మొదటి మూడు శ్లోకాలను విడిచి పెడితే, ఈ అధ్యాయ మంతా ఆసురీ సంపద వివరణమే. ఇంతగా విస్తరించి చెప్పడం వెనుక పరమేశ్వరుని అభిమత మేమిటో మనం గ్రహించాలి. ***పార్థ! శృణు*** - అర్జునా! విను! అంటూ బోధించ డంలో ప్రత్యేకత ఏమిటో కూడా మనం గుర్తించాలి. విషయాన్ని వివరిస్తూ ప్రత్యేకించి, 'విను' అని అన్నాడు అంటే, అది

అవశ్యం ప్రముఖంగా విన దగింది అని భావము. ఎందుకు దాని కంత ప్రాధాన్యత? ఆసురీ సంపదే కదా! దానిని విస్తారంగా తెలుసుకొని సాధించే దేముంటుంది? ఆచరించ దగింది కాదు కదా! అనే సంశయం కొందరికి కలుగ వచ్చు.

ఆచరించ దగిన వాటిని తెలుసుకోవడం ఎంత ముఖ్యమో, ఆచరించ కూడని వాటిని తెలుసుకోవడం కూడా అంతే ముఖ్యము. చేయ వలసిన వాటిని తెలుసుకోవడం ఎంత అవసరమో, చేయ కూడని వాటిని తెలుసుకోవడం కూడా అంతే అవసరము. చేయ కూడనివి ఏవో తెలియ నపుడు, చేయ దగినవి అవే నేమో అనుకొని చేసే ప్రమాదం లేక పోలేదు. ఈ అనర్థాన్ని నివారించేందుకు, ఏది ఆసురీ సంపదో తెలుసుకొని, దానిని త్యజించేందుకు వీలుగా ఆసురీ సంపదను భగవంతుడు విస్తరించి చెబుతున్నాడు ***(అతః తత్ పరివర్జ నార్థం ఆసురం)***.

ప్రవృత్తిం చ నివృత్తిం చ జనా న విదు రాసురాః ।
న శౌచం నాపి చాచారో న సత్యం తేషు విద్యతే ॥ 7

*ప్రవృత్తిం-చ-నివృత్తిం-చ-జనాః-న-విదుః-ఆసురాః*
*న-శౌచం-న-అపి-చ-ఆచారః-న-సత్యం-తేషు-విద్యతే*

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆసురాః | = | అసుర స్వభావము గల | తేషు | = | వారి యందు |
| జనాః | = | జనులు | శౌచం | = | శుభ్రత |
| ప్రవృత్తిం చ | = | ప్రవృత్తి మార్గమును గాని | న విద్యతే | = | ఉండదు |
| నివృత్తిం చ | = | నివృత్తి మార్గమును గాని | ఆచారః చ న | = | ఆచారము ఉండదు |
| న విదుః | = | ఎరుగరు | సత్యం అపి న | = | సత్యము కూడా ఉండదు |

**అర్జునా! అసుర స్వభావం కలిగిన మనుషులకు ప్రవృత్తి తెలియదు. నివృత్తి అర్థం కాదు. వారిలో శుభ్రత ఉండదు. ఆచారము ఉండదు. సత్యము అసలే ఉండదు.**

### వ్యాఖ్య

ప్రవృత్తి అంటే ప్రవర్తనము. చేయదగిన కర్తవ్యము నందు ప్రవర్తించడము ప్రవృత్తి. దానికి విపరీతమైన, అంటే చేయకూడని కార్యము నుండి నివర్తించడము, లేదా విరమించడము నివృత్తి. అర్థవంతమైన దాని యందు ప్రవర్తించడము ప్రవృత్తి కాగా, అనర్థ దాయకమైన కార్యము నుండి వెను దిరగడము నివృత్తి అవుతుంది. ఈ విధమైన ప్రవృత్తి నివృత్తులను అసుర సంపద గల వారు ఎరుగరు ***(ప్రవృత్తిం చ నివృత్తిం చ జనాః ఆసురాః న విదుః న జానన్తి)***. శాస్త్రవిహిత విషయము నందు ప్రవృత్తిని గాని, శాస్త్ర నిషిద్ధ విషయము నందు నివృత్తిని గాని ఆసురీ సంపద గల వారు ఎరుగరు. అంటే కర్తవ్యము నందు ప్రవర్తించడము గాని, అకర్తవ్యము నుండి విరమించడము గాని వారికి తెలియదు.

విహిత విషయము నందు జ్ఞానం లేనపుడు, నిషిద్ధ విషయానికి సంబంధించిన పరిజ్ఞానము ఉండ నపుడు, విహితా విహితము లందు విపర్యయ జ్ఞానము చోటు చేసుకొనే ప్రమాదము లేక పోలేదు. ఈ విధమైన మిథ్యా జ్ఞానము చేత ప్రభావితులైన ఆసురీ సంపద కల వారు చేయ వలసింది చేయక పోగా, చేయ కూడని నిషిద్ధ కర్మలను ఆచరిస్తారు. అందువల్ల వీరి ప్రవర్తనము అస్తవ్యస్తంగా ఉంటుంది.

కర్తవ్యమునకు, అకర్తవ్యమునకు సంబంధించిన ఈ ప్రవృత్తి నివృత్తులు శీల ప్రధాన మైనవి. శాస్త్ర





విహిత ప్రవృత్తిలో ప్రవర్తించక, శాస్త్ర నిషిద్ధ విషయము నుండి విరమించక కార్యరంగంలో ప్రవర్తించే వారు విధి నిషేధాలు తెలియని వారైనందున ధర్మ దూరు లవుతారు. వీరు ఆచరించే కర్మ లన్నీ రజ స్తమో గుణ ప్రధానంగా ఉంటాయి కనుక బంధహేతువులుగా ఉంటాయి.

విహితా విహిత విషయాలను శాస్త్రం ప్రబోధించే టప్పుడు ప్రవృత్తి నివృత్తుల విషయంలో వారు జ్ఞానహీనులుగా ఉండటము ఎలా సాధ్య పడుతుంది? అనే సందేహము కలగ వచ్చు. వారికి శాస్త్ర విషయము నందు అప్రమాణ బుద్ధి ఉండటం చేత శ్రద్ధ లేని వారై ఉంటారు. కనుక, వారిలో ధర్మస్పృహ ఉండదు. ధర్మస్పృహ లేని కారణంగా ధర్మాచరణము సాగదు.

**నిప్పు పెట్టిన వ్యక్తిని అయినా**
**ముట్టినచో నిప్పు కాల్చును**
**ధర్మము విడిచి చరించే వారికి**
**లభించదు దేవుని కనికరము**
**ధర్మము నందే వైభవము**
**తప్పిన ధర్మము వైకల్యము**
**రామ రామ జయ రాజారామ్**
**రామ రామ జయ సీతారామ్** అని రామజోగి చిట్కా.

అసుర సంపత్తి గల వారు ప్రవృత్తి నివృత్తులను తెలియక పోవడమే గాక ***(న కేవలం ప్రవృత్తి నివృత్తీ ఏవ న విదుః)*** శౌచము, ఆచారము, సత్యము అనేవి కూడా కలిగి ఉండరు ***(న శౌచం, న అపి చ ఆచారః న సత్యం తేషు విద్యతే)***.

### శౌచము

శౌచము అంటే పరిశుభ్రత ***(శుచిః పరిశుద్ధత్వాత్)***. శుచి అంటే పరిశుద్ధ మైనది. అదే శౌచము. శౌచము రెండు విధాలు. ఒకటి బాహ్య శౌచము. రెండవది అంతశ్శౌచము. మొదటిది బాహ్య శుభ్రత. రెండవది అభ్యంతర శుభ్రత. అసుర సంపద గల వారికి బాహ్యాభ్యంతరాలలో శౌచము ఉండదు.

శౌచము లేదు అంటే, అశౌచము ఉందని అర్థము. మనస్సు లోని ఈర్ష్యాసూయలు, అభిమాన అహంకారాలు అంతరంగమున అశౌచాన్ని కలిగిస్తాయి. ఆంతర్యములో అశౌచాన్ని కలిగించే అశుద్ధ భావాలను తొలగించాలంటే, వాటికి విరుద్ధమైన ప్రేమ త్యాగాలను అలవరచు కోవాలి. ప్రతిపక్ష భావన ద్వారా మనస్సు లోని కల్మషాలను తొలగించు కోవాలి. అలా చేయాలి అంటే శాస్త్ర పరిచయం ఉండాలి. ఆసురీ సంపద గల వారు శాస్త్రము నందు అప్రమాణ బుద్ధిని కలిగి ఉంటారని ముందే అర్థం చేసుకున్నాం కనుక, వారి విషయంలో ప్రమాణం ఫలించదు.

అంతఃకరణము లోని మాలిన్యాన్ని శుద్ధి చేసుకోవడానికి మరొక ఋజు మార్గము ఈశ్వర భక్తి, లేదా ఈశ్వర ప్రణిధానము. ఏ పూజ అయినా, వ్రతమైనా ప్రారంభించే ముందు సంకల్పం చెబుతాము. ప్రతి సంకల్పము ఇలా ప్రారంభ మవుతుంది.

***మమోపాత్త సమస్త దురిత క్షయ ద్వారా శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం అహం శ్రీ వాసుదేవం పూజాం కరిష్యే*** - నేను ఆచరించిన సమస్త పాపములను ప్రక్షాళనం చేసుకోవడం ద్వారా పరమేశ్వరుని అనుగ్రహాన్ని పొందుటకు నేను శ్రీ వాసుదేవుని పూజిస్తున్నాను. ఇదీ సంకల్పం. ప్రార్థనలు, పూజలు, ఏవైనా గాని, భగవత్కృపను, చిత్తశుద్ధిని

పొందటానికి మాత్రమే ఉన్నాయి. ఈ విధమైన ప్రార్థనలు, పూజలు, వ్రతములు ఆచరించడం ద్వారా పాపాలు ప్రక్షాళన మవుతాయి. అంతేకాదు. అవగాహన శుద్ధి పడటం చేత దురిత నివారణ జరిగి అంత శ్శౌచము ఏర్పడుతుంది.

అసుర సంపద గల వారు రజ స్తమోగుణ ప్రధానులై ప్రమాణాన్ని విశ్వసించరు. ప్రమేయమైన పరమేశ్వరునిపై భక్తి కలిగి పూజ, వ్రతాది కార్యాలు నిర్వహించరు. అందుచేత దురితములు మనస్సులో అలాగే ఉండి పోతాయి. అదే అశౌచము. అశౌచములో నిమగ్నమై ఉండే వారిలో శౌచ మెలా ఉంటుంది? అందుచేత, వారికి శౌచము తెలియదు ***(శౌచం న విద్యతే)***.

శౌచము లేని వారిలో అశౌచమే ఉంటుంది. అంతా మాలిన్యమే. అశౌచము వారి నడకలో ఉంటుంది. పలుకులో ఉంటుంది. ఆలోచనలో ఉంటుంది. ప్రవర్తనలో ఉంటుంది. ఆచార వ్యవహారాదులలో కూడా ఉంటుంది. అదే చెబుతున్నాడు.

**అనాచారము**

ఆసురీ సంపద కల వారికి శౌచము ఎలా లేదో ఆచారము కూడా అలాగే ఉండదు. వారు అశౌచులే కారు, అనాచారులు కూడా ***(అనాచారాః)***. సదాచారవంతుడు సత్కర్మానుష్ఠానంలో ఉంటాడు. సదాచారం సద్భక్తికి, సాత్త్విక జీవనానికి దారి తీస్తుంది.

ఆచారహీనుడు పతితు డవుతాడు. ఆచార హీనుణ్ణి వేదాలు కూడా రక్షించ లేవు అన్నది శాస్త్రం ***(ఆచార హీనం న పునన్తి వేదాః)***. నియత జీవనానికి మనిషి అలవాటు పడాలి. అప్పుడే సదాచార జీవనం అలవడుతుంది. రజ స్తమో గుణాల ప్రభావంతో ప్రవర్తించే ఆసురీ మతులకు నియత జీవనము, విహిత జీవనము అలవడదు. అందుచేత వారు ఆచారహీను లవుతారు. అనాచారవంతు లవుతారు.

**అనృతము**

అనృతము అంటే అసత్యము. అనృతవాదులు అంటే అసత్యమే పలికే వాళ్ళు అని అర్థం. వీరు సత్యానికి దూరులు. మాయ మాటలకే అలవాటు పడిన వాళ్ళు కనుక అసత్యవాదులను మాయావులు అన్నది భాష్యం ***(అనృత వాదినః మాయావినః హి అసురాః)***. వీరు ఆసురీ సంపద కల వారు.

సత్యమును పలకాలి అంటే సత్యమును, సత్యము యొక్క విలువను తెలిసిన వారై ఉండాలి. విధి నిషేధాలు పాటించని ఆసురీ సంపన్నులు అయోమయ జీవనానికి అలవాటు పడిన మాయావులు కనుక సత్య భాషణం చేయలేరు. పైగా, నాల్గవ శ్లోకంలో మనం చూచినట్లు పారుష్యము, అంటే పరుష వచనాలకు అలవాటు పడ్డ వాళ్ళు కనుక వారికి సత్యనిష్ఠ ఉండదు.

అసత్యము లేని, అప్రియము కాని యథార్థ భాషణమే సత్య భాషణము ***(అప్రియ అనృత వర్జితమ్ యథా భూతార్థ వచనమ్ సత్యమ్)***. మాయావులైన ఆసురీలు అనృతవాదులు కావున సత్యమును పలక లేరు. పారుష్యము కలవారై నందున ప్రియ భాషణము చేయలేరు.

*అసుర మానవుల శీలమును గూర్చి చెప్పిన భగవంతుడు, వారి ఆలోచనా విధానము ఎలా ఉంటుందో తరువాత శ్లోకంలో వివరిస్తున్నాడు. ఈ ఆలోచనా రూపమే వారి సిద్ధాంతము.*

**అసత్య మప్రతిష్ఠం తే జగదాహు రనీశ్వరమ్ ।**
**అపరస్పర సమ్భూతం కి మన్య త్కామహైతుకమ్ ॥** 8





***అసత్యం-అప్రతిష్ఠం-తే-జగత్-ఆహుః-అనీశ్వరం***
***అపరస్పర సంభూతం-కిం-అన్యత్-కామహైతుకం***

| | | | | |
|---|---|---|---|---|
| తే | = | వారు | కామహైతుకం | = కామ కారణ మైనది |
| జగత్ | = | ప్రపంచము | అపరస్పర సంభూతం | = స్త్రీ పురుష సంయోగము వలన కలిగినది కాకుండా |
| అసత్యం | = | అసత్యము | | |
| అప్రతిష్ఠం | = | ప్రతిష్ఠ లేనిది | అన్యత్ కిం | = వేరుగా ఏముంది? |
| అనీశ్వరం | = | ఈశ్వరుడు లేనిది | ఆహుః | = చెబుతారు |

**అర్జునా! ఈ ప్రపంచము అసత్యము. నిరాధారము. అనీశ్వరము. పరస్పర సంయోగ జనితము. కామమే కారణ మైనది. దీనికి మరొక కారణ మేముంది? అని ఆసురీలు వాదిస్తారు.**

**వ్యాఖ్య**

వింత వింత ఆలోచనలతో బ్రతుకును వికృతంగా మార్చుకుంటూ, వితండ వాదాలు వినిపిస్తూ, విపర్యయ జ్ఞానంతో జీవించే అసుర మానవుల అనర్థ బ్రతుకుల్ని, వారి వ్యర్థమైన ఆలోచనల్ని ప్రస్తుత శ్లోకంలో చెబుతున్నాడు. వారు మాయావులు కనుక, మాయ వారి మనస్సులలో ఎలా ఉందో, మాటలలో ఎలా వ్యక్త మవుతూ ఉందో వినిపిస్తున్నాడు. సిద్ధాంతాల పేరుతో వారు నడిపే స్వార్థపూరిత రాద్ధాంతాలు దయ్యాలు వేదాలు వల్లించి నట్లే ఉంటాయి. విచిత్ర మేమిటంటే, బాహ్యానికి వేదాంతము ఏమి చెబుతూ ఉందో వారు కూడా అదే చెబుతున్నట్లు అనిపిస్తుంది. కాస్త విశ్లేషించి అర్థం చేసుకుంటే, అంతా విపర్యయంగా, అయోమయంగా, మాయామయంగా, మోస పూరితంగా ఉంటుంది.

జగత్తు మిథ్య, లేదా మాయ అంటుంది వేదాంతము. వీళ్ళు కూడా జగత్తును అసత్య మనే అంటారు ***(ఇదం జగత్ సర్వం అసత్యమ్)***. వేదంతము జగత్తును మిథ్య అన్నది అంటే, జగత్తు బ్రహ్మముపై ఆధారపడి ఉంది అని అర్థము. వీరు చెప్పేది అది కాదు. జగత్తు అసత్యము. అంతే కాదు. అప్రతిష్ఠం అని కూడా అంటారు. అంటే, జగత్తుకు ఆశ్రయం లేదు అనేది వారి వాదన. పద్నాల్గవ అధ్యాయం చివర **బ్రహ్మణో హి ప్రతిష్ఠాఽహం అమృతస్య అవ్యయస్య చ** అనే శ్లోకంలో బ్రహ్మమును ప్రతిష్ఠం అనడం జరిగింది. కాని, ఆసురీ సంపద కల వారికి జగత్తు అసత్యము. పైగా అప్రతిష్ఠం; అంటే ఏ ఆధారమూ లేనిది.

జగత్తు అశాశ్వతము, అనిత్యము, మిథ్య అని వేదాంతము ప్రవచించడం వెనుక ఆలోచన వేరు. జగత్తు మాయామయం కనుక మహిమాన్వితుడైన పరమేశ్వరుని పొంది తరించి పోవాలి అనేది వేదాంతావగాహన.

అసుర మానవుల మాటల వెనుక మర్మం వేరే. ప్రపంచము అనిత్యము. అంటే అసత్యము. పైగా ఏ ఆధారము లేనిది. ఇల లేదు - ఈశ్వరుడూ లేడు. ఇదే ప్రపంచము. దేవుడు లేని జగత్తు ***(జగదాహుః అనీశ్వరమ్)***.

దేవుడు లేడు, ధర్మం లేదు. కారణం లేదు, కార్యమూ లేదు. ధర్మం లేదు కనుక అధర్మమూ లేదు. ధర్మాధర్మాలు రెండూ లేవు కనుక యుక్తాయుక్తాలు లేవు. లోకాయతికులే ఉన్నారు. కనిపించేదే లోకము గాని మరొకటి లేదు అని విశ్వసించే వారు లోకాయతికులు. వారే నాస్తికులు. ప్రత్యక్ష ప్రమాణాన్నే అంగీకరిస్తూ ప్రపంచం భోగార్థమే ఉందని నమ్మే నాస్తికులే లోకాయతికులు ***(లోకాయతిక దృష్టి రియమ్)***. లోకం అసత్యం కనుక, దొరికినంత దోచుకోవడం, అనుభవించి అస్తమించడం. ఇదే వారి ఆలోచనా విధానము.

కనుక, ఇక్కడ ఎవరెలా జీవించినా ఫరవా లేదు. జగత్తే అసత్య మైనపుడు, ఇక్కడ ధర్మాధర్మాలే ముంటాయి? ధర్మాధర్మాలను నియమించే ఈశ్వరుడు ఎలా ఉంటాడు? అందుచేతనే వీరు జగత్తును అనీశ్వరం అంటారు.

ధర్మాధర్మాలే లేవు. ఇక కర్మలు, శాస్త్రాలు ఎక్కడి నుండి వస్తాయి? ధర్మకర్మలు తెలియని జగత్తులో జన్మల ప్రసక్తి ఏమిటి? ధర్మాధర్మాలు లేవు. సత్యాసత్యాలు లేవు. విధినిషేధాలు లేవు. ఎవరెలా గైనా జీవించ వచ్చు. సుఖ పడేందుకే ఈ లోకం ఉంది. ఆచారాలు అనర్థ దాయకాలు. అందరమూ స్వేచ్ఛాచారులమే. బ్రతికేది మూడు రోజులు. ముప్పూటలా సాక్కి పోయేలా మెక్కడమే జీవిత పరమావధి. ఉప్పు కూడు తిని ముప్పు తెచ్చుకోవడ మెందుకు? దృష్టి ఎప్పుడూ పప్పుకూడు మీదనే ఉండాలి. అదీ నెయ్యి కలిపిన పప్పుకూడై ఉండాలి. అది ఎలా వస్తుంది అంటారా? దానికి ఆస్తు లెందుకు? ఆర్జన లెందుకు? అప్పు చేసే నేర్పు ఉంటే సరి పోతుంది. మరి అప్పు ఎలా తీర్చాలి? తీర్చ మని ఎవరు చెప్పారు? అడిగే వాడెవడు? తిరిగి ఇచ్చే వాడెవడు? ఎప్పుడైనా అంతమై పోయే వాళ్ళమే. అనుభవిస్తూ ఉందాము. ఎలాగూ ఒకనాడు కళ్ళకు మూతలు పడతాయి కదా! ఈ లోగా నోళ్ళకు మూత లేసుకోవడం ఎందుకు? కడుపులను ఖాళీగా ఉంచుకోవడ మెందుకు? బ్రతికేది మూడు రోజులు. ముందు వెనుకలు చూడటం దేనికి? తిని చస్తే పోతుంది. దొరికి నంత జుర్రేసి టపా కట్టేస్తే సరి పోతుంది. ఎవరు అడుగుతారు? ఏమని అడుగుతారు?

*యావ జ్జీవేత్ సుఖం జీవేత్ ఋణం కృత్వా ఘృతం పిబేత్,*
*భస్మీ భూతస్య దేహస్య పునరాగమనం కుతః ?*

బ్రతికి నంత కాలం సుఖంగా, హాయిగా బ్రతికేయ్! పొరపాటున కూడా నీళ్ళు త్రాగొద్దు. అప్పు చేసైనా నెయ్యి త్రాగు. నెయ్యి త్రాగి బలిసిన కాయాన్ని ఎవరో ఒకరు కాష్ఠంలో పెట్టి కాల్చేస్తారు. క్షణాల్లో బూడిదై పోతుంది. బూడిద మళ్ళీ మనిషై లేచి వస్తుందా? వచ్చి నప్పుడు కదా అప్పుల వాడు వెంట బడేది? అడిగించు కోవడానికి మనం తిరిగి రాము. అడగడానికి ఇచ్చిన వాడు పోకుండా ఉండడు. ముందు వాడే పోయాడా, శుభ్రం - అడిగే వాడే ఉండడు. ఒకవేళ వాడి కన్నా ముందు మనమే పోయామా, వాడు అడగడానికి మనం ఉండము. ఇదే జ్ఞానం. ఇదే శాస్త్రం. ఈ శాస్త్ర జ్ఞానం లేని వాడు ప్రపంచంలో సుఖపడ లేడు. ఇది లోకాయతికుల లౌకిక వాదం.

ఆసురీ సంపద గల ఈ లోకాయతికులు శాస్త్రాన్ని అంగీకరించరు. అంగీకరిస్తే వారి స్వేచ్ఛాచారానికి భంగం వాటిల్లుతుందని భావిస్తారు. సృష్టిని, సృష్టికర్త అయిన పరమేశ్వరుని కూడా అంగీకరించరు. జగత్తుకు కారణంగా ఈశ్వరుడు లేడని చెబుతారు *( అనీశ్వరం జగత్ ఆహుః ).*

సృష్టికర్త లేనపుడు సృష్టి ఎలా ఉత్పన్న మైంది? అని ప్రశ్నిస్తే, సృష్టి అపరస్పర సంభూతము కనుక జగత్కారణము కామమే అని వాదిస్తారు. కామ ప్రేరితులైన స్త్రీ పురుషుల పరస్పర సంయోగము వల్ల సృష్టి కలిగింది అనేది వారి వాదన *( కామ ప్రయుక్తయోః స్త్రీ పురుషయోః అన్యోన్య సంయోగాత్ జగత్సర్వం సంభూతమ్ । ).*

సృష్టికి కారణంగా కంటికి కనిపించని, ఊహకు అనిపించని, ఏవో కపోల కల్పిత లోకాలలో, లేని భగవంతుని కొరకు అన్వేషించడం కన్నా, ప్రత్యక్షంగా కళ్ళ ముందే కనిపిస్తున్న సత్యాన్ని అంగీకరిస్తే సరి పోతుంది కదా అంటారు.

కామ వాసనే సృష్టి హేతువు *( కామ ఏవ ప్రాణినాం కారణమ్ ).* కామం కన్నా సృష్టికి మరొక హేతువు





ఎక్కడ కనిపిస్తూ ఉంది? అని తిరిగి ప్రశ్నిస్తారు *( కి మన్యేః కామ హేతుకమ్ ).* కామమే జగతికి మూలము, కామమే జగత్తుకు ఆధారము ***( కామ మూల మిదం జగత్, కామో విశ్వస్య జగతః ప్రతిష్ఠా ).***

*ఆసురీ ప్రకృతితో పుట్టిన ఈ వ్యర్థ మానవులు లోక కంటకులు. తమ బ్రతుకుల్ని నాశనం చేసుకొనే వీరు లోక వినాశానికి పుడుతూ ఉంటారు అంటున్నాడు.*

ఏతాం దృష్టి మవష్టభ్య నష్టాత్మానోఽల్పబుద్ధయః ।
ప్రభవ న్త్యుగ్రకర్మాణః క్షయాయ జగతోఽహితాః ॥ 9

***ఏతాం-దృష్టిం-అవష్టభ్య-నష్టాత్మానః-అల్పబుద్ధయః***
***ప్రభవంతి-ఉగ్రకర్మాణః-క్షయాయ-జగతః-అహితాః***

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఏతాం | = | ఈ | ఉగ్రకర్మాణః | = | క్రూర కర్మలు చేసే వారు |
| దృష్టిం | = | దృష్టిని | అహితాః | = | హితులు కాని వారు |
| అవష్టభ్య | = | అవలంబించి | జగతః | = | జగత్తు యొక్క |
| నష్టాత్మానః | = | చెడిన మనస్సు గల వారు | క్షయాయ | = | నశింపునకు |
| అల్పబుద్ధయః | = | అవివేకులు | ప్రభవంతి | = | పుడుతున్నారు |

**అర్జునా! అసుర మానవులు నష్టాత్ములు. అల్పబుద్ధులు. క్రూరకర్ములు. లోకానికి హితులు కారు. వీళ్ళు లోక నాశానికే పుడుతారు.**

### వ్యాఖ్య

మనస్సును బట్టే మనుగడ ఉంటుంది. భావాలే బ్రతుకును నిర్దేశిస్తాయి. విధి నిషేధాలు తెలియని ఆసురీలు ప్రపంచంలో కూడా విధి నిషేధాలు లేవని నిర్ణయించారు. ధర్మ దూరులైన ఈ దౌర్భాగ్యులు ప్రపంచానికి దైవాన్ని దూరం చేశారు. జగత్తును అనీశ్వరంగా మార్చేశారు. వారు తమను తాము ఎలా ఊహించు కుంటున్నారో, ప్రపంచాన్ని కూడా అలాగే ఊహిస్తున్నారు. ఇటు తమ లోను, అటు ప్రపంచం లోను సత్యాన్ని అప్రతిష్ఠం చేశారు.

*యథా వయం అనృత ప్రాయాః తథా ఇదం జగత్ అసత్యమ్ -* 'మన మెలా అబద్ధాల రాయుళ్ళమో, ఈ ప్రపంచం కూడా అలా అబద్ధమే, అసత్యమే. అంతా కామ మయమే. ఏ గొప్పతనము లేని ప్రపంచంలో ఉన్నతంగా జీవించాలి అనుకోవడమే గొప్ప పొరపాటు. ఎలా జీవించినా ప్రపంచాన్ని చూసి సిగ్గు పడ వలసింది ఏమీ లేదు. ఒకవేళ తప్పు చేసినా, లజ్జ పడవలసి నంత గొప్ప దేమీ కాదు ఈ ప్రపంచము. తప్పు చేశామని శిక్షించ డానికి భగవంతుడూ లేడు. లేని వన్నీ ఊహించుకొని బ్రతుకును పాడు చేసుకోవడం కన్నా, కామ ప్రధానమైన జగత్తును అనుభవించి సుఖించడమే బ్రతుకుకు పరమావధి' అనే దృష్టిని అవలంబించి ***( ఏతాం దృష్టిం అవష్టభ్య ఆశ్రిత్య ).*** ఆశ్రయించి, మనస్సులను పాడు చేసుకొనిన పాషండులుగా మారి పోయారు *(నష్టాత్మానః నష్ట స్వభావాః ).*

**నష్టాత్ములు**

నష్టాత్ములు అంటే మనస్సులు పాడైన వారు. చెడిన స్వభావం కల వారు. అలౌకిక పవిత్ర సాధనలకు దూరులై భ్రష్టు లైన వారు *( నష్టాత్మానః నష్ట స్వభావాః, విభ్రష్ట పరలోక సాధనాః ).* దారి తప్పిన ఆలోచనల

కారణంగా వారే దగా పడ్డారు. విధి నిషేధ వర్జితులై, కృత్యాకృత్యాలను విస్మరించి బ్రతుకును అన్యాయం చేసుకున్నారు. అనిత్య భోగానుభవానికే ప్రాధాన్యత నిచ్చి చిత్తాన్ని ఛిద్రం చేసుకున్నారు. నష్ట స్వభావు లయ్యారు. నష్ట జీవు లయ్యారు. అలాంటి వారికి విశాల దృక్పథా లెలా ఉంటాయి? బుద్ధి ఎలా సువిశాల మవుతుంది? అందుకే వారు అల్పబుద్ధులు.

## అల్పబుద్ధులు

అల్పమైన విషయముల యందే బుద్ధి కల వారు అల్పబుద్ధులు. తుచ్ఛమైన విషయ భోగాల యందే దృష్టి కేంద్రీకృతమై ఉండే వారు. దృశ్య విషయాల యందే ప్రీతి కలిగిన వారు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాది విషయాలే దృశ్యములు. అవే వారికి ప్రమాణాలు. వాటిని గూర్చి మాత్రమే సదా ఆలోచిస్తూ, అల్పమైన భోగ్య భోక్తృ బుద్ధి మాత్రమే ప్రధానంగా కలిగిన స్వల్పమైన, అల్పమైన బుద్ధి గల వారు (**విషయ విషయా అల్పైవ బుద్ధిః యేషాం తే అల్ప బుద్ధయః**). ఇక్కడ అల్పబుద్ధి అంటే బుద్ధి చిన్నది అని కాదు. చిన్న విషయాలకు అధిక ప్రాధాన్యత నిచ్చి, బుద్ధిని సంకుచితంగా మార్చుకున్న వారు అని అర్థము. ఇంద్రియ విషయ భోగాలే జీవిత సర్వస్వంగా భావించిన బుద్ధి కల వారు. వాళ్ళకు కనిపించిందే ప్రపంచం. బుద్ధికి అందిందే వాస్తవం. వాళ్ళు చూచిందే సత్యం. వీరే నష్టాత్ములైన అల్పబుద్ధులు. యుక్తా యుక్త విచక్షణ కోల్పోయిన వారు. వక్ర బుద్ధులై ఉగ్రకర్ము లైన వారు.

## క్రూర కర్ములు

ఊహను బట్టే ఊడిగం ఉంటుంది. మనస్సు చెడిన అల్పబుద్ధులు విలువలు లేని వారు కనుక, విలువైన, విశిష్ట మైన కర్మలు ఆచరించ లేరు. పాడైన బ్రతుకులు కనుక, ఎంతటి నికృష్ట కార్యాలను ఆచరించడాని కైనా వెనుకాడరు. మోసాలు చేస్తారు. మాయలు చేస్తారు. మనుషుల్ని అపహరించుకొని పోతారు. వారి బ్రతుకులకు అవరోధ మని భావిస్తే అంతం చేస్తారు. హింసకు పాల్పడతారు. ధర్మాధర్మ విచక్షణ లేని వారు కనుక ఎంతటి క్రూరమైన కార్యాల నైనా ముందు వెనుకలు చూడకుండా చేసేస్తారు. అందుకే వారు ఉగ్రకర్ములు (**ఉగ్ర కర్మాణః క్రూర కర్మాణః హింసాత్మకాః**). హింసాపరాయణు లైన ఆసురీలు సమాజ శరీరంలో భయంకరమైన వ్యాధి లాగా వ్యాపిస్తారు. దేశ మనే వృక్షానికి పట్టిన చీడ పురుగులు. ప్రపంచ తరువును తొలిచి తొలిచి, వొలిచి వొలిచి, వాడి పోయేలా చేస్తారు. చెడు చేసి (**అహితః**) చెట్టునే చెడిపేస్తారు (**క్షయం**). చెడగొట్టేస్తారు. అందుకే వీరు లోక కంటకులు.

## లోక కంటకులు

హింసా ప్రవృత్తికి అలవాటు పడి జగత్తు యొక్క వినాశానికి కారణభూతు లైన ఆసురీలు లోక కంటకులు. లోక వినాశానికి కారకులు. ప్రపంచము యొక్క వినాశానికి కారకు లైన వీరు ప్రపంచానికి అహితులు. వీరు జగత్తుకు కేవలం అహితులే కాదు. క్షయ కారకులు కూడా.

**క్షయాయ జగతోఽ హితాః** - అని అందమైన వాక్యాన్ని పలికాడు భగవంతుడు. ఈ వాక్యం దేహలీదీప న్యాయంగా చెప్పబడింది. క్షయము, అహితము అనే పదాల మధ్య, గడప మీద దీపం లాగా జగత్తు ఉంది. అంటే, అటు ఇటు ఉన్న ఉభయ పదాలతో మధ్య పదమైన జగత్తు ముడి పడి ఉంది.

**క్షయాయ జగతః** - ఆసురీ సంపద గల ఈ దుష్టులు, ప్రపంచ వినాశానికి పుడుతూ ఉంటారు (**ప్రభవన్తి**). **అహితః జగతః** - వీరు లోకానికి మేలు చేసే వారు కారు. కనుక లోక కంటకులు. ప్రపంచ శత్రువులు (**జగతః అహితాః శత్రవః**).





ఇక వారి స్వభావాన్ని గూర్చి చెబుతున్నాడు భగవంతుడు.

**కామ మాశ్రిత్య దుష్పూరం దమ్భ మాన మదాన్వితాః ।**
**మోహా ద్గృహీ త్వాసద్గ్రాహా న్ప్రవర్తన్తేఽ శుచివ్రతాః ॥ 10**

**కామం-ఆశ్రిత్య-దుష్పూరం-దంభమాన మదాన్వితాః**
**మోహాత్-గృహీత్వా-అసద్గ్రాహాన్-ప్రవర్తంతే-అశుచివ్రతాః**

| | | | |
|---|---|---|---|
| దుష్పూరం | = తృప్తి చెందని | అశుచి వ్రతాః | = భ్రష్టాచారములు గలవారై |
| కామం | = కామమును | అసద్గ్రాహాన్ | = అశుభ నిర్ణయాలను |
| ఆశ్రిత్య | = ఆశ్రయించి | మోహాత్ | = మోహము వలన |
| దంభమాన మదాన్వితాః | = దంభము తోను, అభిమానము తోను, గర్వము తోను కూడిన వారై | గృహీత్వా | = గ్రహించి |
| | | ప్రవర్తంతే | = ప్రవర్తిస్తూ ఉంటారు |

**అర్జునా! ఆసురీ మానవుల కామము తృప్తి చెందేది కాదు. డాంబికము, అభిమానము, మదము కలిగి ఉంటారు. చెడ్డ పట్టుదలకు పోతారు. భ్రష్టాచారులై ప్రవర్తిస్తారు.**

### వ్యాఖ్య

ప్రపంచానికి మేలు చేయని, చేయలేని ఈ ఆసురీ సంపన్నులు ప్రపంచానికి హాని చేస్తారని పూర్వ శ్లోకంలో చూశాం. అదెలాగో ప్రస్తుత శ్లోకంలో విశదీకరిస్తున్నాడు. వారి స్వభావము వినాశానికి పని కొస్తుందే గాని వికాసానికి పనికి రాదని ఋజువు చేస్తున్నాడు.

## నిండని బావులు

వర్షా కాలంలో బావు లైనా నిండుతాయి కాని, వర్ష రూపంలో భోగాలు వచ్చి పడినా ఆసురీల బుద్ధులు మాత్రం నిండవు. వారి మనస్సులు తృప్తితో ఉండవు. బావులు నిండుతాయి. చెరువులు నిండుతాయి. సముద్రాలు నిండే ఉంటాయి. కాని, వీరి హృదయాలు మాత్రం ఎప్పుడూ నిండవు. తృప్తి చెందవు (**దుష్పూరమ్ అవశ్య పూరణం**). ఎంత అనుభవించినా వారి కామానికి తృప్తి ఉండదు. రావణాసురుడు ఇరవై వేల సంవత్సరాలు బ్రతికాడు. బ్రతుకంతా భోగాల తోనే నిండి పోయింది. కాయ మంతా కామమే. ఎందరు స్త్రీలతో ఆడుకున్నాడో! ఆ దుష్టుడి చేతిలో ఎన్ని మదిర భాండాలు ఖాళీ అయ్యాయో! అతడి ఒడిలో ఎందరు సుందరాంగు లైన భామలు బంతు ల్లాగా దొర్లి పోయారో! అయినా తృప్తి చెందాడా? సంతృప్తి పడ్డాడా? ఇరవై వేల సంవత్సరాల భోగ జీవితంలో కనీసం చివరి ఒక్క సంవత్సరం అయినా తృప్తిగా ఉండ లేక సీతమ్మను కాంక్షించి కాల గర్భంలో కలిసి పోయాడు. రావణు డెవరో కాదు, అసురుడే. ఆయన సంపద ఏదో కాదు, ఆసురీ సంపదే. రావణుడి హృదయం లోని కామ భాండాన్ని నింపడానికి ఇరవై వేల సంవత్సరాలు కేటాయించినా, ప్రపంచం నింప లేని స్థితిలో అశక్యంగా, అసమర్థంగా మిగిలి పోయింది. అందుకనే, కామాన్ని తృప్తి పరచడము అంటే కామాన్ని లేకుండా చేసుకోవడమే అని మహాత్ములు ఆదేశించారు.

కామమును దుష్పూరం అంటున్నాడు భగవంతుడు. దుష్పూరం అంటే పూరింప శక్యము కానిది అని అర్థము. నింప లేనిది అని భావము. కనుకనే కామాన్ని నిత్య శత్రువుగా కర్మయోగంలో భగవంతుడు అభివర్ణించాడు. జ్ఞానాన్ని కప్పేసేది కామమే కనుక, కామం విషయంలో జాగ్రత్త వహించ మని హెచ్చరించాడు కూడా. పైగా అది అనలం, అంటే అగ్ని లాంటిది అన్నాడు. **అలం న విద్యతే ఇతి అనలం.** 'అలం' అంటే చాలు

అని అర్థం. 'అనలం' అంటే చాలు అనేది లేనిది. చాలు అనేది తెలియనిది అని భావం. ఎన్ని వేసినా అగ్ని దగ్ధం చేస్తూనే ఉంటుంది గాని చాలు అని అనదు. అందుచేత అగ్నిని అనలం అన్నారు. అగ్ని ఎలా తృప్తి చెందదో, కామం కూడా అలాగే తృప్తి చెందదు. ఎంత నింపినా కామం నిండదు. అందుకే అది **దుష్పూరం.** ఈ మాటను మూడవ అధ్యాయం లోనే భగవంతుడు ప్రవేశ పెట్టాడు. పన్నెండు అధ్యాయాలు అవిరళంగా ప్రసంగించిన తరువాత మళ్ళీ ఆ పదాన్నే వాడి కామం విషయంలో జాగ్రత్తగా ఉండమని హెచ్చరిక చేస్తున్నాడు ***(దుష్పూరేణ అనలేన చ*** *- 3 వ అ - 39 వ శ్లో).*

## దంభమాన మదాన్వితులు

దుష్పూరమైన కామమును ఆశ్రయించిన ఆసురీలు దంభమాన మదాన్వితు లౌతున్నారు అంటున్నాడు. దంభము, అభిమానము, మదము అనే ఈ అసుర లక్షణాలను పూర్వమే మనం విపులంగా చర్చించుకొని ఉన్నాం. ఇక్కడ వాటిని ప్రత్యేకార్థంతో ప్రస్తావించక పోయినా, సంబంధ విషయము అనేది నిర్వివాదాంశము. కామ ప్రభావం మనిషి స్వభావాన్ని ఎలా దెబ్బ కొడుతుందో ఈ సందర్భములో అవశ్యం అన్వయించు కోవాలి.

ఆసురీ సంపద కల వారికి కామమే ఏకైక జీవిత లక్ష్యము. అసురులకు మన లాగా నాలుగు పురుషార్థాలు లేవు. వారికి ఒక్కటే పురుషార్థం. వాళ్ళ గురువు బృహస్పతి వారికి అలాగే బోధించారు. అదే ప్రమాణంగా సూచించారు.

సూ॥ ***కామ ఏవైకః పురుషార్థః*** - కామ మొక్కటే పురుషార్థము అని బృహస్పతి సూత్రము. బృహస్పతి అనే ఈ సూత్రకారుడు దేవ గురువైన బృహస్పతి కాదు. ఆయన సుర గురువు. బుద్ధిశాలి. ప్రస్తుతం చెప్పక తప్పింది కానందున, మనం చెప్పుకుంటున్న ఈ బృహస్పతి అసుర గురువు. మందమతి.

విషయాల యందు ఆసక్తియే కామము ***(కామః ఇచ్ఛా విషయేషు).*** కామాన్ని ఆశ్రయించి విషయాలను ప్రోగు చేసుకోగానే కామిలో కొన్ని అవాంఛనీయ లక్షణాలు కనిపిస్తాయి. అవే దంభ మాన మదాలు.

తన వైభవాన్ని ప్రపంచంలో చాటింపు వేసుకోవడము దంభము ***(ధర్మధ్వజిత్వం).*** దంభము ఉంది కదా, ఇక అందరూ తనను గుర్తించి గౌరవించాలి అనే జంభము ప్రదర్శింప బడుతూ ఉంటుంది. ఇదే గర్వము, లేదా మానము. ఆ తరువాత తనకు మించిన వారు లేరంటూ తన తలపై తానే దుమ్మెత్తి పోసు కోవడము. అదే మదము. గజము యొక్క లక్షణము. దేహం పెరిగినా బుద్ధి పెరగని కారణంగా నిరంతరం సాగే గజ స్నానము. మదగజ స్నానము.

ఈ నిర్వాక మంతా ఏమిటి? ఏముంది, అంతా అవివేకమే! అవివేక మంటే కేవలం వివేకం లేక పోవడమే కాదు; విపరీత జ్ఞానము కలిగి ఉండటము కూడా అవివేకమే. నష్టాత్ములు, అల్ప బుద్ధులైన కారణంగా, ఉన్న దానిని ఉన్నట్లుగా చూడలేక పోగా, లేని దానిని ఉన్నట్లు చూస్తారు. ఈ విధమైన అవివేకమే మోహము. మోహమే అశుభము. అట్టి అశుభమైన మోహంలో కూరుకు పోయిన వారి మనస్సులలో నిర్ణయాలు ఎలా ఉంటాయి? అశుభం గానే ఉంటాయి. నిర్ణయాలే అశుభంగా ఉన్నప్పుడు, కార్యాలు ఎలా ఉంటాయి? అశుభం గానే ఉంటాయి.

## అశుభ నిర్ణయాలు - అమంగళ కార్యాలు

ఆంతర్యంలో భావ రూపంలో ఉన్నదే బాహ్యంలో కర్మగా వ్యక్త మవుతుంది. భావశుద్ధి లేకుండా కర్మ శుద్ధి రాదు. భావం కర్మాచరణమునకు ముందే ఉంటుంది. భావమే మార్గదర్శి. భావమే మార్గగామి.





మోహ వలయంలో చిక్కుకొని పరిభ్రమించే ఆసురీలు అపవిత్ర మైన భావాలతో నిండి ఉంటారు కనుక, వారి బుద్ధి లోని నిర్ణయాలు కూడా అపవిత్రం గానే ఉంటాయి. బుద్ధి లోని నిర్ణయాలు ఎప్పుడైతే అపవిత్రంగా ఉన్నాయో, బాహ్యంలో కర్మలు కూడా అపవిత్రం గానే సాగుతాయి. అవే ఉగ్రకర్మలు. హింసా యుత కర్మలు. క్రూరకర్మలు ***(గృహీత్వా అశుభ నిశ్చయాన్ ప్రవర్తన్తే లోకే).*** ఇదంతా అశుచి. అందుకనే ఆసురీలను ఏడవ శ్లోకంలో అశౌచులుగా చెప్పుకున్నాం.

ఒకవేళ అశౌచులు పూజలు చేస్తే ఎలా ఉంటాయి? వ్రతాలు చేస్తే, ఎలా ఉంటాయి? సేవా కార్యక్రమాలు చేపడితే అవి ఎలా ఉంటాయి? అన్నీ అశౌచం గానే ఉంటాయి. అపవిత్రులు చేసే కార్యాలు అపవిత్రంగా కాక పవిత్రంగా ఎలా ఉంటాయి? అందుకే ఆసురీలు అశుచివ్రతులు ***(అశుచీని వ్రతాని యేషాం తే అశుచి వ్రతాః).***

*కామాశ్రయు లైన ఆసురీల ఆలోచన, ఆచార వ్యవహారాలను వివరిస్తున్నాడు.*

చిన్తా మపరిమేయాం చ ప్రలయాన్తా ముపాశ్రితాః ।
కామోపభోగ పరమా ఏతావ దితి నిశ్చితాః ॥ 11

***చింతాం-అపరిమేయాం-చ-ప్రలయాంతాం-ఉపాశ్రితాః***
***కామోపభోగ పరమాః-ఏతావత్-ఇతి-నిశ్చితాః***

| | | | |
|---|---|---|---|
| అపరిమేయాం | = అపరిమిత మైనది | కామోప భోగపరమాః | =విషయ భోగాలే ఉత్తమ మనుచు |
| ప్రలయాంతాం | = మృత్యువే అంతముగా గలది | ఏతావత్ ఇతి | =ఇదియే పరమార్థ మనుచు |
| చింతాం | = చింతను | నిశ్చితాః | =నిశ్చయించిన వారై |
| ఉపాశ్రితాః | = ఆశ్రయించిన వారై | | |

**అర్జునా! అసుర సంపద కల వారి చింతకు హద్దు లేదు. మరణం వరకు సాగుతూనే ఉంటుంది. కామోప భోగమే గాని మరొక పురుషార్థము లేదని నిశ్చయించు కుంటారు.**

### వ్యాఖ్య

పరిమితాలకు ప్రాధాన్యత కలిగిన ప్రపంచంలో మనం జీవిస్తున్నాం. ప్రపంచ వ్యవహారాలు ఏవైనా హద్దులకు లోబడే వర్తిస్తూ ఉంటాయి. ఉన్న చోటే కదలకుండా ఉంటుంది రాయి. కదిలిస్తే గాని కదల లేదు. దాని పరిమితం అలా ఉంది. చెట్టు ఉన్న చోటే ఉండినా, కొమ్మలతో, ఆకులతో కదుల్తూ ఉంటుంది. ఉన్న చోట కదుల్తుందే గాని నడిచి మరొక చోటికి పోలేదు. కాని, చెట్టుపై నున్న పక్షి ఎగిరి ఆకాశంలో విహరిస్తుంది. ఎగర లేని మాను కన్నా, ఎగిరే మనిషి కన్నా ఎత్తుకు పక్షి ఎగురుతుంది. కాని, ఆకాశంలో ఎగిరే పక్షి కూడా కొంత ఎత్తు వరకే ఎగురుతుంది. అంతకు మించి ఎగర లేదు. దాని హద్దులు దాని కున్నాయి. ఏవైనా అంతే.

పరుగు అలవాటున్న మనిషి కూడా కొంత వరకే పరుగెత్త గలడు. హద్దు దాటి పరుగెత్త లేడు. ఎంత గొప్ప గాయకుడైనా తన శ్రుతిని మించి పాడ లేడు. ఎంతటి మేధావి మనస్సైనా తన స్థాయిని మించి ఆలోచించ లేదు. అందుకే నేమో కడుపు నిండితే గారెలు కూడా చేదుగా మారుతాయి. పరిమితాలను అధిగమించ లేక, అధిగమించిన క్షణాన ఎదురయ్యే విపరీతాలను తట్టుకో లేక అందరూ అలమటిస్తూ ఉంటే, అందరికీ భిన్నంగా, ఆసురీ సంపద కలిగిన వారు అంతులేని చింతను కొనసాగిస్తూ, అలు పెరుగని విధంగా కామోప భోగాలలో రమిస్తూ ఉంటారు. దివ్యాత్ములు చేరలేని చోటుకి దురాత్ములు చేరి పోతారు అనే ఆంగ్ల సామెత వీరి కోసమే పుట్టిందేమో!

### చింతాసక్తులు

ఆసురీ సంపదకు సంబంధించిన అల్పబుద్ధులు హద్దు లేని చింతను ***( చింతాం అపరిమేయామ్ )*** మరణాంతం, అంటే చివరి శ్వాస వరకు ***(ప్రలయాన్తాం)*** కొనసాగిస్తూనే ఉంటారు. ఇది మామూలు విషయ చింతనము కాదు. అంతమయ్యే వరకు అంతరంగంలో అనంతంగా సాగే హద్దు లేని, అడ్డు లేని విషయ చింతనము. నడుస్తున్నంత సేపు నేలను చూస్తూ తదేక చింతలో సాగిపోతూ ఉంటారు. ఏం చింతిస్తుంటారు? ఏమో, ఎవరికి తెలుసు? అమ్మా! భూమాతా! నువ్వు రతనాల తల్లివి. మాణిక్య మాతవు. నీ కుక్షిలో ఎంత సంపదో! ఎంత నిక్షేపమో! అమ్మా! నీకు ఆక్షేపము లేకపోతే, అవి ఎక్కడున్నాయో నీ ముద్దుబిడ్డ నైన నా కంట పడనీ తల్లీ! అని ప్రార్థిస్తుంటా రేమో!

ఇక నడక ఆపి కూర్చున్నారా! అంతే. దృష్టి పైపైకి పాకి నింగిలో ఒకచోట నిశ్చలంగా నిలబడి పోతుంది. అక్కడ ఏమి దర్శిస్తుంటారో! ఏమి విచారిస్తుంటారో! ఆకాశమా! నీ వెంత విశాల మమ్మా! నా సంపదల్ని కూడా నీ లాగే విశాలం చేసెయ్యి అని వేడుకుంటా రేమో! ఎంత చింతో! ఆ చింతలో కూడా ఎంత వింతో! ఎంత వింత చింత కాకపోతే, చితి పేర్చే వరకు రగులు తుంటుంది? జీవితాంతం చింతించ వలసిన ఏకైక విషయ మేమో! ఈ చింత అంతా దేని గురించి? ఇంకే ముంది? ఒకే లక్ష్యాన్ని గురించి. కామోప భోగమే ప్రధాన లక్ష్యంగా గల చింత ***(కామోప భోగ పరమాః).***

### భోగాసక్తులు

సదా చింతాసక్తు లైన ఆసురీలు కామోప భోగమే ప్రధాన లక్ష్యంగా కలిగి ఉంటారు ***( కామోప భోగ పరమాః).*** కామోప భోగమే పరమ పురుషార్థంగా జీవిస్తారు. కనుక మరణాంతం భోగాసక్తులై విషయ చింతనా పరులై ఉంటారు.

కామములు అంటే భోగ్య వస్తువులు. కోర బడేవి కనుక శబ్దాది విషయాలు కామములు ***( కామ్యన్తే ఇతి కామాః శబ్దాదయః).*** వాటి ఉపభోగమే, అంటే వాటిని అనుభవించడమే జీవితంలో ముఖ్య విషయంగా కలిగిన వారు. కామోప భోగమే పురుషుడు ప్రయత్నించి సాధించ దగినది అని వారి అభిప్రాయము. ఈ విషయంలో నిశ్చితాభిప్రాయం కల వారు. ఒక్క మాటలో చెప్పాలంటే పురుషార్థ నిశ్చయం దృఢంగా ఏర్పడిన వారు.

పురుషార్థ నిశ్చయము అంటే మనం అర్థం చేసుకున్న పురుషార్థ నిశ్చయం కాదు. వారికి అర్థమైన పురుషార్థ నిశ్చయము. మరణం ఆసన్న మయ్యే వరకు ప్రపంచం లోని భోగానుభవంలో సుఖించడమే పరమ పురుషార్థము. అంతే. అంతవరకే ***(ఏతావ దితి).*** ఈ విషయంలో వారికి నిశ్చితాభిప్రాయ ముంది. అంతకు మించి, ఆ తరువాత, అంటే మరణానంతరము పొంద దగింది ఏదీ లేదు అనేది కూడా వారికి నిశ్చితమే.

వారేమిటో వారికి తెలుసు. వారు జీవితంలో పొంద వలసింది ఏమిటో కూడా వారికి తెలుసు. ఈ విషయ మంతా వారి గురువులు సూత్రబద్ధం చేసి మరీ బుద్ధికి బలంగా పట్టించారు. ఆ సూత్రాలే 'బార్హస్పత్య సూత్రములు'.

సూ॥ **చైతన్య విశిష్టః కాయః పురుషః కామ ఏవైకః పురుషార్థః**

'చేతన మైన శరీరమే పురుషుడు. కామమే ఏకైక పురుషార్థము' అని అసుర గురువైన బృహస్పతి ప్రణీతము.

మరి మోక్షము? మరణమే మోక్షము. మరణం తరువాత అనుభవించ డానికి ఏ ఫలమూ లేదు. మరణం





వచ్చే వరకు ఈ ప్రపంచంలో మనము అనుభవించేదే సుఖం. అంతకు మించిన సుఖం మరొకటి లేదు.

మరణమే మహా సమాధి కనుక, మరణానంతరము జీవుడు అనే వాడే లేడు. జీవుడు లేడు కనుక దేవుడూ లేడు. జీవేశ్వరు లిరువురూ లేరు కనుక స్వర్గం లేదు. ఆ హేతువు తోనే నరకమూ లేదు. ధర్మం లేదు. పుణ్యం లేదు. మోక్షం లేదు. మరే ముంది? ఎంత వరకైతే విషయాలను భోగించడము అనేది జరుగుతుందో, అదే ఉంది. ఆ సుఖమే ఉంది ***(ఏతావ దితి).*** ఆ సుఖానుభవమే యోగము. అది దూరం కాకుండా జాగ్రత్త పడటమే క్షేమము. ఇవే ఆసురీల యోగక్షేమాలు.

చివరగా, వీరి జీవనసరళిని, జీవిత గమ్యమును, అనుభవ సారమును సంక్షేపంగా చెప్పుకోవాలి అంటే, ఒకటి, అంతు లేని ఆశాపరులు అయినందున విషయ చింతనను మరణాంతము నిర్విరామంగా సాగిస్తుంటారు. రెండు, కామోప భోగమునే పరమ పురుషార్థంగా నిశ్చయిస్తారు. మూడు, అంతకు మించి ఏమీ లేదని, భోగానుభవమే, అంటే విషయ సుఖమే పొంద దగినది ***(ఏతావ దితి)*** అనే విషయంలో నిశ్చితాభిప్రాయాన్ని కలిగి ఉంటారు.

*మరి, ఈ కామోప భోగాలు ఎలా ప్రాప్తిస్తాయి? ఈ విషయంలో కూడా వారికి పూర్ణావగాహన ఉంది. చదవండి.*

**ఆశాపాశ శతై ర్బద్ధాః కామక్రోధ పరాయణాః ।**
**ఈహన్తే కామభోగార్థ మన్యాయే నార్థసఞ్చయాన్ ॥** 12

***ఆశాపాశ శతైః-బద్ధాః-కామక్రోధ పరాయణాః***
***ఈహంతే-కామభోగార్థం-అన్యాయేన-అర్థసంచయాన్***

| | | | |
|---|---|---|---|
| ఆశాపాశశతైః | = వందల కొలది ఆశాపాశముల చేత | కామభోగార్థం | = కామానుభవము కొరకు |
| బద్ధాః | = బంధింపబడిన వారై | అన్యాయేన | = అన్యాయముగ |
| కామ క్రోధపరాయణాః చ | = కామక్రోధములతో నిండిన వారై | అర్థసంచయాన్ | = ధనము కూడబెట్టుటను |
| | | ఈహంతే | = కోరుతూ ఉంటారు |

**వందలాది ఆశాపాశాల చేత బంధింపబడి ఉంటారు. కామక్రోధాలనే ప్రధానంగా ఆశ్రయించుకొని ఉంటారు. కామభోగాల కొరకు అన్యాయంగా ధనాన్ని కూడ బెడుతూ ఉంటారు.**

**వ్యాఖ్య**

కామోప భోగమే సుఖప్రాప్తి హేతువని, అదే సుఖస్థాన మని భావించి, అంతులేని, అవధి లేని విషయ భోగాసక్తికి సంబంధించిన సుఖాలలో రమిస్తూ ఇదే పురుషార్థము, ఇంతకు మించి పొంద దగింది లేదు అని నిశ్చయించు కొనిన ఆసురీలు ఆశాపాశాల చేత బద్ధు లౌతున్నారు, బందీ లవుతున్నారు అంటున్నాడు భగవంతుడు.

### ఆశాపాశ బద్ధులు

ఆసురీలు బందీ లయ్యారని ఇప్పటికే మనకు అర్థ మైంది. అయితే, వారిని బంధించిం దెవరు? దేనితో బంధించారు? ఆసురీలు పాశ బద్ధులు. త్రాళ్ళ చేత కట్ట బడ్డారు. మరి ఆ బంధన రజ్జువులు ఏమిటి? ఆశలు. ఆశలే పాశాలు. అవి కూడా ఒకటో, రెండో కాదు. వందలాది ఆశ లనే పాశముల చేత కట్ట బడ్డారు అంటున్నాడు భగవంతుడు ***( ఆశా పాశ శతై ర్బద్ధైః ).***

ఆసక్తి కలిగిన అప్రాప్త మైన విషయాల యందు ప్రగాఢ మైన అభిలాషయే ఆశ. మనిషిలో ఒక్క ఆశే ఉండదు. ఎన్నో ఉంటాయి. ఎన్ని ఆశ లుంటే అన్ని పాశా లున్నా యని అర్థము. అవన్నీ ఏకమై మనిషిని దృఢంగా బంధిస్తాయి. కనుకనే వారు వందలాది ఆశ లనే త్రాళ్ళ చేత కట్ట బడ్డారు. అందువల్ల అనేక వైపులకు లాగ బడుతున్నారు. ఒక్క త్రాడైతే, ఎలాగో ప్రయత్నించి త్రెంచుకో వచ్చు. వందలాది త్రాళ్ళను ఒక్క వ్యక్తి విడిపించుకో గలడా? బంధములో ఉండ లేక, బంధాన్ని తొలగించుకో లేక ఆసురీ సంపద గల జీవులు ఈ విధంగా అల్లాడుతూ ఉంటారు.

ఆశలు ఒక విధాన తీరేవి కావు. ఊహల నుండి ఆశలు పుడుతాయి. ఊపిరి పోయేంత వరకు అంటి పెట్టుకొని ఉంటాయి. ఒక వైపు ప్రయత్నంతో కొన్ని ఆశలు తీరుతూ ఉంటే, మరో వైపు క్రొత్త ఆశలు చిగురిస్తూనే ఉంటాయి. అందువల్ల, ఆశలు తీరుతున్నా వాటి సంఖ్య మాత్రం తగ్గదు. వాటికి అంత మెక్కడో అర్థం కాదు. భాగవతంలో వామనమూర్తి బలిచక్రవర్తికి చేసిన ఉపదేశ మదే. ఆశాపాశము పొడవెంతో ఇప్పటికి తెలుసుకున్న వారు లేరు. ఆశల విషయములో ఎవరి కైనా శ్రమలు మిగిలాయే గాని ఫలితాలు సిద్ధించ లేదు అంటాడు.

శా॥ *ఆశాపాశము దా గడున్ నిడుపు : లేదంతంబు రాజేంద్ర ! వా*
*రాశి ప్రావృత మేదినీ వలయ సామ్రాజ్యంబు సేకూరి యుం*
*గాసిం పొందిరి గాక వైన్య గయ భూకాంతాదులు న్నర్థకా*
*మాశం బాయగ నేర్చిరే మును నిజా శాంతంబులం జూచిరే !*

'రాక్షసేంద్రా! బలీ! ఆశ అనే త్రాడు చాలా పొడ వైంది. దానికి అంత మెక్కడో తెలియదు. పూర్వము పృథు చక్రవర్తి, గయుడు మొదలైన భూపతులు సాగర పర్యంతం విస్తరించిన సామ్రాజ్యాన్ని పొంది వైభవంగా పాలించారు. వారు కూడా అవిరళంగా శ్రమించారే గాని, అర్థ కామాల విషయంలో ఆశలను త్యజించలేక పోయారు. ఆశలు నెరవేరింది లేదు. ఆశలు వాళ్ళను విడిచి పెట్టిందీ లేదు' అని పోతనామాత్యుని ఆంధ్ర మహాభాగవతము - అష్టమ స్కంధము.

ఆశాపాశాలను గుర్చి ఆసక్తికర మైన ఒక్క విషయాన్ని మీకు చెప్పాలి. ఆశాపాశాలు అంటే ఆశలే పాశా లని కదా అర్థం! అంటే బంధన పాశాలు. ఒక వ్యక్తిని త్రాళ్ళతో కట్టేసి నపుడు అతడు ఇక కదల లేడు. ఉన్న చోటే పడి ఉంటాడు. అంటే, త్రాళ్ళతో కట్టేస్తే పడి ఉండటం, త్రాళ్ళను విప్పేస్తే పరుగులు తీయడం సహజంగా మనం చూచే విషయం. మన అనుభవంలో ఉండే విషయం. అన్ని పాశాలూ ఇలాగే ఉంటాయి. కాని, ఆశాపాశాలు విచిత్రమైన బంధాలు అంటుంది శాస్త్రం. ఇవి మన అనుభవానికి భిన్నంగా ఉండటమే గాక, చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి కూడా. ఎలాగో చూడండి.

శ్లో॥ *ఆశానామ మనుష్యస్య కాచి దాశ్చర్య శృంఖలా ।*
*యయా బద్ధాః ప్రధావన్తి ముక్తా స్తిష్ఠన్తి పంగువత్ ॥*

'ఆశ అనేది మనిషికి ఆశ్చర్యాన్ని కలిగించే బంధము. విస్మయాన్ని కలిగించే సంకెల. ఎలాగంటే, ఆశా పాశాలచే కట్టేస్తే జనులు పరుగులు తీస్తారు. ఆశాపాశాలను విప్పేస్తే, కుంటి వాళ్ళ లాగా కదలకుండా ఒకే చోట ఉండి పోతారు.'

కట్టేస్తే పడి ఉండటం, విప్పేస్తే పరుగులు తీయడం మన అనుభవంలో ఉన్న విషయం. కానీ, ఆశ అనే త్రాళ్ళ బంధము ఇందుకు విపరీతంగా కనిపిస్తూ ఉంది. 'కట్టేస్తే పరుగులు పెడతారు; విప్పేస్తే కుంటి వాళ్ళ





లాగా కదలకుండా ఉంటారు' అంటోంది శాస్త్రం. అంటే ఆశలలో చిక్కిన వాళ్ళు స్థిరంగా ఒక చోట ఉండ లేరు. ఆశలు విడిపోతే, ఊడిపోతే, దూరమై మాడిపోతే, ఇక ఆశలు తీర్చుకోవడానికి పరుగులు పెట్టాల్సిన అవసరం ఉండదు కనుక ఎక్కడ ఉన్న వారు అక్కడే, తృప్తిగా, ఆనందంగా, నిశ్చలంగా, నిర్మలంగా ఉండి పోతారు.

**కామక్రోధాశ్రయులు**

వందలాది ఆశ లనే త్రాళ్ళ చేత కట్టబడ్డ ఆసురీలకు ఆశ్రయ స్థాన మేదో చెబుతున్నాడు భగవంతుడు. శతాది ఆశా పాశాలచే బద్ధులై, నియంత్రింప బడిన ఆసురీలు (***ఆశాపాశ శతైః బద్ధాః నియన్త్రితాః***) కామక్రోధా లను ఆశ్రయించుకొని ఉంటారు (***కామక్రోధ పరాయణాః***). కామక్రోధాశ్రయులై ఉంటారు. కామక్రోధాలనే ఉత్తమ మైన ఆశ్రయ స్థానాలుగా భావించి, వాటిని ఆశ్రయించుకొని ఉంటారు. అంటే, కామక్రోధాలతో నిండిపోయి ఉంటారని భావము.

ఎవరికి ఏది ఆశ్రయమో దానిని వదిలిపెట్టి వాళ్ళు ఉండ లేరు. కామక్రోధాలను ఆశ్రయంగా పొంది ఉన్నారు అంటే, అవి వారికి, వారి మనుగడకు ఆధారంగా ఉన్నాయని అర్థము. ఆధారాన్ని విడిచి పెట్టి ఎవరైనా ఎలా ఉండ గలరు? కనుక ఆసురీ సంపద కల వారు కామక్రోధాలను ఏ కాలం లోను విడిచి పెట్టి ఉండ లేరు. అవే వారికి ప్రాణవాయువు. వాటిని ఆశ్రయించుకొనే బ్రతుకును సాగిస్తూ ఉంటారు కనుక వారు కామక్రోధ పరాయణులు. పూర్వ శ్లోకంలో మనం చూసినట్లు, ఆసురీలు పరమ పురుషార్థంగా భావించే కామోప భోగానికి కామక్రోధాలే ప్రధాన ఆశ్రయాలు.

విషయాసక్తియే కామము. విషయాలను అనుభవించాలనే ఆశయే కామము (***కామః ఇచ్ఛా విషయేషు***). కామ వాంఛను తీర్చుకొనే ప్రయత్నంలో ఉన్న వ్యక్తికి ఏదైనా విఘాతము కలిగినా, లేదా అతని ప్రయత్నము ప్రతిఘటించ బడినా, తత్ఫలితంగా అతనిలో ఉత్పన్న మయ్యే చిత్తవృత్తియే క్రోధము (***తస్య ప్రతిహతౌ జాతా చిత్తవృత్తిః క్రోధ ఇత్యుచ్యతే***) అనబడుతుంది.

కామం ఫలించ నపుడు, కామం ఫలించడానికి ప్రతిబంధకము ఎదురై నపుడు, ఆ ప్రతిబంధకానికి కారకులైన వారిని నియంత్రించి, తద్వారా ఆశించింది పొందడానికి కామాసక్తులు ఉపయోగించుకొనే ఆయుధమే క్రోధము. తమ వాంఛలను ఈడేర్చుకోవడానికి, విషయాలను ఉపభోగించడానికి ఆసురీలు ఆశ్రయించేది కామక్రోధాలనే గాని ధర్మాధర్మాలను కాదు. అందుచేత వారు కామక్రోధ పరాయణులు.

మరొక్క విషయాన్ని కూడా ఇక్కడ మనం సమన్వయించు కోవాలి. కామక్రోధాలు ఎప్పుడైతే ఆశ్రయా లయ్యాయో, లోభం కూడా అందులో అంతర్భాగమే. ఆసక్తితో విషయాలను సాధించు కోవడం కామ మైనపుడు, అలా ఆశించి, అభిలషించి సాధించుకున్న దానిని ఎవరైనా పోగొట్టు కుంటారా? సంపాదించు కున్నది అనుభవించ డానికే గాని త్యజించడానికి కాదు కదా! కనుక పొందిన వాటిని పోగొట్టుకోవడాన్ని భరించ లేని అశక్తతయే లోభము (***త్యాగా సహిష్ణుతా లోభః***).

కామము ఫలించకుండా ప్రతిబంధకము ఎదురై నపుడు దానిని ఫలింప చేసుకోవ డానికి క్రోధము ఎలా ఉత్పన్న మైందో, పొందిన దానిని పోగొట్టుకోవడాన్ని సహించ లేని స్థితిలో లోభాన్ని కాపాడటానికి కూడా క్రోధము విజృంభిస్తుంది. కనుక క్రోధ మనేది ఇటు కామ సాధనకు, అటు లోభ రక్షణకు రెండిటికి సహకరిస్తుంది.

కామ మనే ఆశ కేమో అంతం లేదు. ఎంత పొందినా లోభము తృప్తి చెందదు. ఎంత ఖర్చు చేసినా క్రోధం ఖాళీ కాదు. ఏదైనా ఖర్చు పెడితే తరిగి పోతూ ఉంటుంది. లేదా కరిగి పోతూ ఉంటుంది. క్రోధం

మాత్రం వినియోగంలో పెరుగుతుందే గాని తరగడ మంటూ ఉండదు. కోపం వచ్చిన వాళ్ళను చూచి నపుడు ఈ సత్యం మనకు అర్థ మవుతుంది. ఆ విషయము క్రోధనులే స్వయంగా చెబుతూ ఉంటారు. 'నాకు కోపం వచ్చి నపుడు తెలుస్తుంది నే నేమిటో!' అంటూ ఉంటారు. నిజమే, క్రోధం అలాంటిదే. వాళ్ళేమిటో తెలియాలి అంటే క్రోధం రావాల్సిందే. అంటే, క్రోధం లేనపుడు వాళ్ళేమిటో వాళ్ళకు కూడా తెలియదని అర్థము. ఈ కామక్రోధ లోభాలను ఆశ్రయించిన అసుర సంపన్నులు, తమ గోతులను తామే త్రవ్వుకొనే కార్యాలలో సదా నిమగ్నమై ఉంటారు. కామక్రోధ లోభాల దారుణ ప్రభావము బ్రతుకుపై ఎలా ఉంటుందో దైవీ సంపద గల మహాత్ము లకు తెలుసు కనుక, వారు కామక్రోధ పరాయణులు కాకుండా పరమేశ్వర పరాయణు లవుతారు (**మత్పరాయణా**). కామక్రోధ లోభాల నుండి విడిపడటానికి పరమేశ్వరుని పాదాలను ఆశ్రయిస్తారు.

***ఎంత ఈదినా కామానికి తృప్తి లేదు***
***ఎంత చేదినా లోభానికి సంతృప్తి రాదు***
***ఎంత వెచ్చించినా క్రోధము తరిగి పోదు***
***నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా !***

అని నీలకంఠ శతకంలో ఒక విబూది పండు.

కామోపభోగమే జీవితంలో ఏకైక పురుషార్థము అని భావించి, విషయాలను ఉపభోగించడమే సుఖ స్థానము అని నిశ్చయించుకొనిన అసుర మానవులు, భోగ్య వస్తువులను సముపార్జించు కోవడానికి అవసర మైన ధనాన్ని ఎలా పొందుతారు? ధన సంపాదనం ఎలా చేస్తారు? అదే చెబుతున్నాడు.

**అన్యాయార్జనము**

కోరికలను తీర్చుకోవడానికి, భోగ్య వస్తువులను అనుభవించడానికి ***( కామ భోగార్థం కామభోగ ప్రయోజనాయ )*** అధర్మ మార్గాలలో పరుల ధనాన్ని అన్యాయంగా ఆర్జించడం ద్వారా ధనాన్ని ప్రోగు చేసుకుంటారు ***( అన్యాయేన అర్థ సంచయాన్ )***. తమ అవసర నిమిత్తమే అయినా శ్రమ పడి సంపాదించు కోవడం అసుర మానవులకు తెలియదు. ఇతరులను శ్రమ పెట్టి సాధించు కోవడమే తెలుసు. న్యాయంగా ఆర్జించడానికి నడుము బిగించరు. అవలీలగా అన్యాయ మార్గాలలో తన్నుకు పోవడానికే తపిస్తూ ఉంటారు. ధర్మ విరుద్ధ మార్గాన, శాస్త్ర విరుద్ధ మార్గాన కపట వంచనాది ఉపాయాల చేత ధనరాశులను ప్రోగు చేసు కుంటారు ***( అర్థ సంచయాన్ )***. ధన సంచయము అని బహువచన ప్రయోగం చేయడం చేత ***( సంచయాన్ - రాసులు )***. ధనము ప్రాప్తించినా, ధన తృష్ణ తీరక పోవడం వల్లనే ధన సంచయము జరుగుతూ ఉంది కనుక, మనం చెప్పుకున్నట్లు ఆశా రూపంగా లోభము వర్ధిల్లుతూనే ఉంది.

కామములను అనుభవించడం అనే ప్రయోజనం కొరకు ఆసురీ సంపద కలిగిన మానవులు అన్యాయ మార్గాలలో చరించి ధనరాశుల్ని ప్రోగు చేసుకుంటూ ఉంటారు. ధర్మం విషయంలో విశ్వాసం లేని వారు కనుక అధర్మ మార్గాలలో స్వేచ్ఛా విహారం చేస్తూ ఉంటారు. ధనార్జనే వీరికి ప్రధాన మైనా, దానిని సాధించు కోవడానికి అనేకము లైన మార్గాలను అనుసరిస్తారు. వ్యాపారు లైతే నల్లబజారును సృష్టిస్తారు. ఉద్యోగు లైతే లంచాల తోనే కంచాలు నింపుకుంటారు. రాజకీయ నాయకు లైతే ఇక చెప్ప నవసరం లేదు. అన్యాయార్జనమే మా అధికార ఏకైక లక్ష్యం అని శపథం చేసి మరీ పదవులలో పాదం పెడతారు. ఇక మరీ నీచు లైతే చోరత్వానికి పాల్పడతారు. అవరోధాలు ఎదురైతే, వాటికి కారణమైన వారిపై కక్ష కడతారు. కూలికి ఖూనీ చేసే క్రూరాత్ము లైతే నేటి సమాజంలో సంతలో సరుకు ల్లాగా అమ్ముడు బోతున్నారు. వీటన్నిటి వెనుక అసుర ప్రవృత్తే ఉంది. రాక్షస నైజమే రాజ్య మేలుతోంది.





*మరి, ఇలాంటి దుర్మార్గ దుశ్చర్యలకు పాల్పడే అసుర మానవుల అభిప్రాయాలు ఎలా ఉంటాయి? వాళ్ల మనస్సులలో ఎలాంటి ఆలోచనలు నడుస్తూ ఉంటాయి? అదీ చెబుతున్నాడు.*

**ఇద మద్య మయా లబ్ధ మిమం ప్రాప్స్యే మనోరథమ్ ।**
**ఇద మ స్తీద మపి మే భవిష్యతి పునర్ధనమ్ ॥** 13

*ఇదం-అద్య-మయా-లబ్ధం-ఇమం-ప్రాప్స్యే-మనోరథం*
*ఇదం-అస్తి-ఇదం-అపి-మే-భవిష్యతి-పునః-ధనం*

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఇదం | = | ఇది | మే | = | నాకు |
| అద్య | = | ఇప్పుడు | ఇదం | = | ఇది |
| మయా | = | నా చేత | అస్తి | = | ఉంది |
| లబ్ధం | = | పొందబడినది | పునః | = | మరల |
| ఇమం | = | ఈ | ఇదం | = | ఈ |
| మనోరథం | = | కోరికను | ధనం అపి | = | ధనము కూడా |
| ప్రాప్స్యే | = | పొందగలను | భవిష్యతి | = | ప్రాప్తిస్తుంది |

**నేను ఇంత ధనం సంపాదించాను. ఈ కోర్కెను కూడా తీర్చు కుంటాను. ఇప్పుడు ఈ మాత్రం ఉంది. మున్ముందు ఇంకా వస్తుంది.**

**వ్యాఖ్య**

అసుర సంపద నాశ్రయించి, ఆశాపాశాలలో చిక్కి, కామక్రోధ పరాయణులై, కామ భోగార్థం అన్యాయ మార్గాలలో ధన సంపాదన చేసే వారి ఆలోచనా విధానమును ఈ శ్లోకంలో భగవానుడు వర్ణిస్తున్నాడు.

'ఇప్పుడు నా వద్ద ఈ ధనం ఉంది. ఈ మాత్రం ధనం సంపాదించాను ***( ఇదానీం ఇదం ద్రవ్యమ్ అస్తి )***. ఇంకా సంపాదిస్తాను. ప్రస్తుతం ఉన్నది నాకు తృప్తి నిస్తూ ఉంది. నా మనోరథం నెరవేరుతుంది. ఇప్పుడు ఇది ఉంది. భవిష్యత్తులో అది కూడా లభిస్తుంది. ఈ నాటికి ఇది. రాబోయే సంవత్సరంలో ఆ ధనం కూడా వస్తుంది ***( ఇదం అపి చ మే భవిష్యతి ఆగామిని సంవత్సరే పునః ద్రవ్యమ్ )***. అప్పుడు ఉండినది, ఇప్పు డున్నది, అప్పుడు వచ్చి చేరేది కలిపితే అంత అవుతుంది. ఇంత ఉంటేనే నేను ఇలా ఉన్నాను. అంత అయితే, అప్పుడు నే నెంతవుతానో? ***తేన అహం ధనీ విఖ్యాతః భవిష్యామి*** - ధనవంతులలో నేను ప్రసిద్ధుణ్ణి అవుతాను'. ఇది అసుర మానవుల ఆలోచనా ధోరణి. ఉన్నది -ఉండ బోయేది, దీని చుట్టే తిరుగుతూ ఉంటాయి వాళ్ళ చిత్తవృత్తు లన్నీ.

'ఈ రోజు పరిస్థితి ఎలా ఉంది? రేపటి పరిస్థితి ఎలా ఉండ బోతుంది? ఆ ఉపాయంతో నేడున్న ధనం ప్రాప్తించింది. ఈ ఉపాయంతో రేపు ఆ ధనం వచ్చి చేరుతుంది. కొడుకు సంపాదించింది ఈ మాత్రం ఉంది. రేపు కోడలు వస్తూ వస్తూ తెచ్చేది ఈ మాత్రం ఉంటే, మొత్తం ఆ మాత్ర మవుతుంది.'

'ఈ నెల బ్యాంకులో ఈ మాత్రం ఉంది. తరువాత మాసంలో ఎలాగైనా ఆ మాత్రం ఉండాలి. బ్యాంకులో వేయడం కన్నా షేర్లు కొంటే మంచి దేమో! బంగారు ధర కూడా రోజు రోజుకీ పెరుగుతూ ఉంది. బంగారు కొని దాచి పెడితే నేడున్నది రెండింతలు అవుతుం దేమో!' ఇదంతా అసుర సంపన్నుని మనోరథం. ఈ సందర్భములో మనస్సుకు సంతోషాన్ని కలిగించే ఈ ఆలోచనా విధానాన్ని ***మనోరథం*** గా భగవంతుడు అభివర్ణించడము విశేషంగా ఆలోచించ దగిన విషయము.

**మన ఏవ రథా యస్య సః మనోరథః -** మనస్సునే రథంగా కలిగింది మనోరథము. అంటే, ఎవరి మనస్సును వాళ్ళు వాహనంగా మలచుకొని శ్రమ లేకుండా, కోరిన విధంగా విహరించడము అని అర్థము. రథములో ఊరేగాలి అంటే, రథము కావాలి, గుఱ్ఱాలు కావాలి, నడిపే సారథి ఉండాలి. గుఱ్ఱాలకు మేత పెట్టాలి. సారథికి జీతం ఇవ్వాలి. పైగా దేశకాలాదులను కూడా పరిగణన లోకి తీసుకోవాలి. ఢిల్లీకి పోవా లనేది సంకల్పం అనుకోండి. రథంలో ఢిల్లీకి చేరడానికి ఎంత సమయం పడుతుంది, ఖర్చు ఎంత, శ్రమ ఎంత? అదే బుద్ధి కారులో కూర్చున్నా మనుకోండి, మరు క్షణం ఢిల్లీలో ఉండొచ్చు. శ్రమ లేదు. సమయం పట్టదు. పెట్రోలు పట్టించ నవసరం లేదు. డ్రైవరును పట్టించుకో నవసరం లేదు. ఇదీ మనోరథం అంటే. గాలిలో తేలి పోయేందుకు అనువైన రథం. మనోరథాలు మనోవీధుల్లో తిరుగుతాయే కాని మహిపై నడువవు. మనస్సు తిప్పే రథాలు మనస్సు లోనే తిరుగుతూ ఉంటాయి. గాలి మనస్సు నిర్మించే మేడలు, నడిపించే రథాలు కూడా గాలి లాగే ఉంటాయి.

మనోరథాలు మిథ్యా రథాలు. సత్య మైనవి కావు. మిథ్యా రథాలైన మనోరథాల కన్నా, మిథ్యా రథాలే అయినా స్వప్నగత రథాలు మేలైనవి అని శాస్త్రం విలక్షణ మైన అభిప్రాయాన్ని వెలి బుచ్చింది.

మనస్సు కల్పించేది మనోరథం. స్వప్నగత రథం కూడా మనస్సు యొక్క సృష్టే కదా! కనుక రెండూ మిథ్యలే. రెండూ సత్యం కాదు. అయినా మనోరథం కన్నా స్వప్నగత రథం అర్థవంతంగా ఉంది అని నిర్వచించింది శాస్త్రం. ఆశ్చర్యంగా ఉంది కదూ? ఈ శ్లోకం చూడండి.

***శ్లో॥ స్వాప్నం సుఖం దుఃఖ మసత్య మేవ తథాఽపి తస్యాఽనుభవ స్తదానీమ్ ।***
***తథైవ శుక్తౌ రజతస్య మిథ్యా మనోరథోతంతు వినాఽభూతిమ్ ॥***

'స్వప్నము లోని సుఖదుఃఖాలు అసత్యములు, మిథ్యా రూపములే అయినా, స్వప్న కాలములో నైనా వాటి అనుభవం ఉంది. అలాగే ముత్తెపు చిప్పలో వెండి ఉన్నది మిథ్యయే అయినా, కనీసం భ్రాంతి సమయములో నైనా అనుభవంగా ఉంది. ఈ రెండు మిథ్యా రూపాలు మనోగతాలే అయినా, సత్యాలు కాకపోయినా, ఆయా కాలాలలో అనుభవ రూపంగా ఉన్నాయి.'

ఇప్పుడు మనోరథము విషయము ఆలోచించండి! ఇది అనుభవము లేకనే మిథ్య. స్వప్న దృశ్యాలు, శుక్తి రజతాలు అనుభవ సహిత మిథ్యా భూతా లైతే, మనోరథం అనుభవ రహిత మిథ్యా భూతము. అన్నీ ఊహాపోహలే. అపోహయుత ఊహలే.

**నిన్నటి విషయము యోచించాలన్నా**
**నేడు ఇక్కడే చేయాలి**
**రేపటి మాట చర్చించాలన్నా**
**ఇక్కడే ఇప్పుడే జరగాలి**
**గతము రాదు - భావి తెలియదు**
**వర్తమానమే వినియోగము**
**రామ రామ జయ రాజారామ్**
**రామ రామ జయ సీతారామ్**

అని రామజోగి చిట్కా.

మాయలు చేసే మనస్సులు ఎన్ని మనోరథాల నైనా సృష్టించుకొని ఊరేగుతాయి. కల్లలో కళ ఎక్కడుంది?





నేడు లేదు. రేపుకు రూపు లేదు. ఈ క్షణమే ఉంది. పోయిన క్షణం మనది కాదు. వచ్చే క్షణం మనది అవుతుందో లేదో చెప్పలేము. ఉన్న క్షణం మనోరథా న్నెక్కి ఊరేగితే, బ్రతుకు ఏం కావాలి? అనే ఆలోచన దైవ సంపద ఉన్న వారికి కలుగుతుందే గాని అసుర సంపద నాశ్రయించుకున్న వారికి కలిగే అవకాశమే లేదు. దైవ సంపద సత్త్వగుణ ప్రధానంగా ఉంటుంది కనుక, విచార యుతమై, వివేక వైరాగ్యాదు లతో నిండి ఉంటుంది. అసుర సంపద రజ స్తమో గుణాలతో కూడి ఉంటుంది కనుక, కామక్రోధాలను ఆశ్రయించుకొని మనోరథంలో ఊరేగుతూ ఉంటుంది.

*మరి ధనాన్నే లక్ష్యంగా చేసుకుని కపోల కల్పితాలతో కాలం గడిపే ఆసురీలు, వారు కలలు గనే కలిమిని ఎలా సాధిస్తారు? ఎలాగైనా సాధిస్తారు. ఏదైనా చేస్తారు. దేని కైనా వెనుకాడరు. ఎలాగో, చూడండి.*

**అసౌ మయా హత శ్శత్రు ర్హనిష్యే చాపరానపి ।**
**ఈశ్వరోఽహ మహం భోగీ సిద్ధోఽహం బలవా న్సుఖీ ॥** 14

***అసౌ-మయా-హతః-శత్రుః-హనిష్యే-చ-అపరాన్-అపి***
***ఈశ్వరః-అహం-అహం-భోగీ-సిద్ధః-అహం-బలవాన్-సుఖీ***

| | | | |
|---|---|---|---|
| అసౌ | = ఈ | అహం | = నేను |
| శత్రుః | = శత్రువు | భోగీ | = భోగిని |
| మయా | = నా చేత | అహం | = నేను |
| హతః | = వధింప బడ్డాడు | సిద్ధః | = సిద్ధుణ్ణి |
| అపరాన్ అపి చ | = ఇతరులను కూడా | అహం | = నేను |
| హనిష్యే | = చంపుతాను | బలవాన్ | = బలవంతుణ్ణి |
| అహం | = నేను | సుఖీ | = సుఖిని |
| ఈశ్వరః | = నియంతను | | |

**ఈ శత్రువును చంపేశాను. మిగిలిన వాళ్ళను కూడా చంపేస్తాను. నేను నియంతను. నేను భోగిని. నేను సిద్ధుణ్ణి. బలవంతుణ్ణి. సుఖిని.**

### వ్యాఖ్య

ధన సంచయము కేవలం భోగార్థమే కాదు. ధనం భోగార్థమే అయితే సంపన్నులు తృప్తిగా జీవించ వచ్చు. ధనం ఇప్పుడు ఉంది అని పూర్వ శ్లోకంలో అంటూనే, భవిష్యత్తులో ఇంకా సంపాదిస్తాను. దానితో నేను ధనవంతుడిగా ఖ్యాతి గడిస్తాను ***(తేన అహం ధనీ విఖ్యాతః భవిష్యామి)*** అని ఊహలు కంటున్నాడు అంటే, ధన సిద్ధితో పాటు ప్రసిద్ధిని కూడా కోరుకుంటున్నాడు అని అర్థం.

ఇదొక పోటీ మనస్తత్త్వము. తానే అధికుడుగా చెలామణి కావాలి అనే దుగ్ధ. ఈ రోజుల్లో, ముఖ్యంగా వాణిజ్య రంగంలో ఈ దుగ్ధ దురద లాగా ప్రాకి పోయింది. వందల కోట్లు ఉన్నా, వేల కోట్లు ఉన్నా, తృప్తి చెందకుండా, ధనికుల రాజ్యంలో నా సంఖ్య ఎంత? మొదటి అంకెను ఎప్పుడు సొంతం చేసుకుంటాను? అనే దురాలోచనతో ధర్మదూరులై, దూర దేశాలన్నీ దొర్లి వచ్చి, చివరికి తన సంఖ్య ఎంతో, తన నంబరెంతో తెలుసుకోవ డానికి కారాగృహంలో కాలు మోపి, అది ఒకటి కాదని, రెండు కూడా కాదని, రెండు వందలూ

కాదని, నాలుగు వందల ఇరవై అని తెలుసుకొని తెల్లబోయి, కటకటా అంటూ కటకటాలు లెక్కెడుతూ నిద్ర లేని రాత్రుల్ని నేలపై పడుకొని గడుపుతున్న వాళ్ళను మనం ఎందరిని చూడటం లేదు? ఎందుకు ఈ ఆసురీ సంపద? దేని కోసం ఈ రాక్షస బ్రతుకు? భోగార్థం అక్షయ ధనాన్ని సంపాదించడమే గాక, సిద్ధితో పాటు ప్రసిద్ధిని పొంద డానికి, విత్తముతో పాటు వైభవాన్ని గడించడానికి ఎంత దారుణాని కైనా ఒడి కడతారు. అవసరమైతే తాము ముందు నిలవడానికి అడ్డున్న వాళ్ళను కడకు నెట్టుతారు. కడ చేర్చుతారు. కడ తేర్చేస్తారు. ఎలాగో చూడండి!

## చంపాను - చంపేస్తాను

'అతణ్ణి ఎవ్వరూ ఎదుర్కోలేక పోయారు. దుర్జయుడైన అతణ్ణి నేను ప్రపంచానికి దూరం చేసేశాను. వాడు నా చేతిలో చచ్చాడు ( ***అసౌ శత్రుః దుర్జయః మయా హతః*** ). వీడి గతే అందరికీ పడుతుంది. ఈ శత్రువును ఎలా వధించానో, మిగిలిన శత్రువు లందరిని కూడా అలాగే చంపేస్తాను ( ***హనిష్యే చ అన్యాన్ అపరాన్ అపి*** ). నా కసికి మసి పట్టదు. నా కత్తికి పదును తగ్గదు. నా మాటకు తిరుగు లేదు. నేను పట్టా నంటే పాడై పోవాల్సిందే. నేను ముట్టానంటే మునిగే వాళ్ళే గాని తేలే వారుండరు. శని ఏడేండ్లు పడతాడు అంటారు. నేను పడితే ఏడేండ్లు కాదు, పద్నాలు గేండ్లు. అది ఋజువు చేయడానికే పద్నాలుగో శ్లోకంలో చేరి పోయాను'.

నిజమే. మరి, ఈ శక్తి నీకు ఎక్కడి నుండి వస్తుంది? ఇదంతా ఎలా చేస్తావు? అని అడిగితే, అతడు ఏమి సమాధానం చెబుతాడో తెలుసా? ***ఈశ్వరోఽహం*** అనేదే అతని సమాధానం. 'నేనే ప్రభువును. సమర్థుణ్ణి. నాతో సమాన మైన వాడు లేడు (***సర్వథాఽపి నాస్తి మత్తుల్యః***). నేనే నియంతను' - ఇదంతా రాక్షస ప్రలాపము. నాకు మించిన వారు లేరు, నేనే ఈశ్వరుణ్ణి అని గర్వించే ఆసురీలు ఇలాగే పలవరిస్తారు. కాలాలు మారుతున్నా, యుగాలు దొర్లుతున్నా ఈ కల్మష చిత్తులు ఇలాగే ప్రేలు తుంటారు. ప్రహ్లాదుని తండ్రి హిరణ్యకశిపుని నోటి నుండి మనకు ఇలాంటి మాటలే విన పడతాయి.

సీ॥ *అస్మదీయం బగు నా దేశమున గాని మిక్కిలి రవిమింట మెరయ వెరచు*
*నన్నికాలము లందు ననుకూలుడై కాని విద్వేషియై గాలి వీవ వెరచు*
*మత్ప్రతాపానల మందీ కృతార్చియై విచ్చలవిడి నగ్ని వెలుగ వెరచు*
*నతి తీక్ష్ణమైన నా యాజ్ఞ నుల్లంఘించి శమనుండు ప్రాణుల జంప వెరచు*
తే॥ *నింద్రు డౌదల నామ్రోల నెత్త వెరచు సమర కిన్నర గంధర్వ యక్ష విహగ*
*నాగ విద్యాధరావలి నాకు వెరచు నేల వెరవవు? పలువ నీ కేది దిక్కు ?*

'ఓరీ, తుంటరీ! నా అనుమతి లేకుండా ఆకాశంలో అతిగా మండటానికి సూర్యుడు భయ పడతాడు. ఏ కాలంలో నైనా వాయువు అనుకూల పవనాలు వీస్తాడే గాని ప్రతికూలంగా వీచడానికి జంకి పోతాడు. నా ప్రతాప మనే అగ్ని ముందు తన ప్రతాపాన్ని చూపలేక అగ్నిదేవుడు మందంగా వెలుగుతాడు. నేను కాదంటే, ప్రాణుల్ని ముట్టుకోవ డానికి కూడా యముడు భయ పడతాడు.

ఇంద్రుడు నా ముందు తల ఎత్త లేడు. సురు లైనా, కిన్నరు లైనా, గంధర్వు లైనా, యక్షు లైనా, పక్షు లైనా, నాగు లైనా, విద్యాధరు లైనా నే నంటే భయ పడతారు. నన్ను ఎదిరించే ధైర్యం ఎవరి కుంది?'

తానే ఈశ్వరు డని గర్వంతో, అహంకారంతో ఊగి పోయాడు హిరణ్యకశిపుడు. అసుర సంపదకు సంబంధించిన వాళ్ళందరూ హిరణ్యకశిపులే. వారి దంతా ఒకే బాట. ఒకే మాట. ఒకే పాట.





'నేను నియంతను. ప్రభువును. నేను భోగిని ( ***అహం భోగీ*** ). భోగా లన్నీ నాకే అందాలి. నా చుట్టే తిరగాలి. నేను సిద్ధుణ్ణి' అనుకుంటాడు. సిద్ధుడు అంటే సమస్తము సిద్ధించిన వాడు అని అర్థము. 'నాకేం తక్కువ? నాకు లేని దేముంది? అన్ని విధాల జీవితంలో సమస్తమూ సిద్ధించిన వాణ్ణి ( ***అహం భోగీ, సర్వ ప్రకారేణ చ సిద్ధః*** ). నాకు సదా విజయమే. సర్వత్ర విజయమే. సర్వదా విజయమే. పుత్రులతో, మనుమలతో, ముని మనుమలతో నేను సంపన్నంగా ఉన్నాను ( ***అహం సంపన్నః పుత్రైః నప్తృభిః న కేవలం మానుషః*** ). నేను మామూలు మనిషిని కాను. బలవంతుణ్ణి. సుఖవంతుణ్ణి. మిగిలిన వాళ్ళందరూ భూమికి భారంగా పుట్టిన వాళ్ళే (***బలవాన్ సుఖీ చ అహ మేవ, అన్యేతు భూమి భారాయ అవతీర్ణాః*** )'.

ఇవి అసుర మానవుని ఊహలు. అనర్థ దాయకమైన ఆలోచనలు. తమను తాము స్తుతించుకుంటూ, పూజించుకునే ఈ అసుర జనులు లోక కంటకులు. మదాంధులు. సమాజ అభ్యుదయానికి అవరోధాలు.

*అనర్థ హేతువైన ఆత్మస్తుతి ఇంకా ఎలా ఉంటుందో వివరిస్తున్నాడు.*

**ఆఢ్యోఽభిజనవా నస్మి కోఽన్యోఽస్తి సదృశో మయా ।**
**యక్ష్యే దాస్యామి మోదిష్యే ఇ త్యజ్ఞాన విమోహితాః ॥** 15

***ఆఢ్యః-అభిజనవాన్-అస్మి-కః-అన్యః-అస్తి-సదృశః-మయా***
***యక్ష్యే-దాస్యామి-మోదిష్యే-ఇతి-అజ్ఞాన విమోహితాః***

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆఢ్యః | = | ఐశ్వర్యవంతుణ్ణి | అస్తి | = | కలదు? |
| అభిజనవాన్ | = | ఉన్నత వంశ సంజాతుణ్ణి | యక్ష్యే | = | యజ్ఞము చేస్తాను |
| అస్మి | = | ఉన్నాను | దాస్యామి | = | దానా లిస్తాను |
| మయా | = | నాతో | మోదిష్యే | = | సంతోషిస్తాను |
| సదృశః | = | సమానుడు | ఇతి | = | అని |
| అన్యః | = | మరొకడు | అజ్ఞానవిమోహితాః | = | అజ్ఞాన మోహితులై |
| కః | = | ఎవడు | | | |

**నేను ఐశ్వర్యవంతుణ్ణి. ఉన్నత వంశంలో పుట్టిన వాణ్ణి. నాతో సమానంగా ఎవ డున్నాడు? యజ్ఞాలు చేస్తాను. దానా లిస్తాను. ఆనందిస్తాను - ఇలా అజ్ఞాన మోహితులై ఉంటారు.**

### వ్యాఖ్య

కేవలం తనను తాను స్తుతించుకుంటూ పోతే, ఏదో నడుమంత్రపు సిరితో ఊగిపోతున్నా డని జనులు భావిస్తారేమో నని, తన నేపథ్యాన్ని కూడా స్తుతించు కుంటాడు. 'నేనే కాదు, మా పూర్వీకులు కూడా సామాన్యులు కారు. మా వంశం, మా జాతి అన్నీ అద్భుత మైనవి, అగ్ర స్థానంలో ఉన్నవే' అంటాడు. 'నేను ఐశ్వర్యవంతుణ్ణి (***ఆఢ్యః***). మా పూర్వీకులు కూడా సంపన్నులే. అలాంటి మహావ్యక్తుల వారసుణ్ణి. సత్కుల ప్రసూతుణ్ణి ( ***అభిజనవాన్*** ). ఈ విషయంలో కూడా నాతో సమానులు లేరు ( ***తేనాపి న మమ తుల్యః*** )'.

## సరి ఎవ్వరు?

'సిరి లోనే కాదు, దేనిలో నైనా నాతో సరి ఎవ్వరు? ( ***కోఽన్యోఽస్తి సదృశో మయా*** ). చెయ్య వలసిం దంతా చేసేశాను. చూడవలసిం దంతా చూసేశాను. ఆస్తులు దించుకున్నాను. అంతస్తులు పెంచుకున్నాను. అధికారాలు అనుభవించాను. అడ్డు నిలిచిన వాళ్ళను శాశ్వతంగా తొలగించాను. సుఖాలు అనుభవించాను.

నా ప్రగతినే కాదు, నా కళ్ళ ముందే నా వాళ్ళ ప్రగతిని కూడా చూశాను. ఇక నాతో సరితూగే వాళ్ళెవ్వరు?'

*శ్లో॥ పద్భ్యాం గతా యౌవనతశ్చ జాతా దారైశ్చ సంయోగ మితాః ప్రసూతాః ।*
*దృష్టా సుతా స్త త్తనయ ప్రసూతిం ద్రష్టుం పునర్వాంఛతి మేఽ న్తరాత్మా ॥*

'బాల్య మంతా హాయిగా గడిపేశాను. యౌవనంలో భార్యల పొందులో అనేక మంది బిడ్డల్ని పొందాను. వాళ్ళు పెరిగి పెద్దవా ళ్ళయ్యారు. వాళ్ళకీ బిడ్డలు కలిగారు. అలా మనుమలను కూడా చూశాను. వాళ్ళ బిడ్డల్ని కూడా ముద్దాడాలని మనస్సు అభిలషిస్తూ ఉంది.

నా లాంటి జీవితం ఎవరి కుంటుంది? అందుకే నాతో సమానులు లేరు అంటున్నాను. ఏ విషయంలో చూచినా నాకు నేనే సాటి' అంటూ తన అసమాన వైభవానికి కారణాలు చెబుతున్నాడు.

## యజ్ఞ దానాలు

ఆసురీ సంపదను ఆశ్రయించిన ఈ అసుర మానవులు కొన్ని కార్యక్రమాలు చాలా విచిత్రంగా చేస్తారు. అవి జ్ఞాన ప్రధానంగా ఉండవు. ధర్మార్థం కూడా ఉండవు. పేరు ప్రఖ్యాతులను ఆర్జించ డానికే ఉంటాయి. సేవ పేరుతో డబ్బు వెచ్చిస్తారు. కాని, అది సేవ కాదని, ఆర్జనకు పెట్టుబడి అని వారికి క్షుణ్ణంగా తెలుసు.

యజ్ఞ యాగాదులు చేయిస్తారు. యాగాలు నిర్వహించడంలో కూడా తమకు తామే సాటి అని చాటింపు వేయించు కుంటారు. 'నేను కాబట్టి అంత విశేషంగా యజ్ఞాన్ని నిర్వహించ గలిగాను *(యక్ష్యే)*' అని గొప్పలు చెప్పుకుంటారు. పెట్టే ఖర్చు పదిలక్ష లైతే, వసూళ్ళు ఇరవై లక్షలు. ఊహ కందని వ్యాపారము!

యజ్ఞాలు చేస్తారు. యాగాలు చేస్తారు. సమారాధనలు, సప్తాహాలు; సప్త సప్తాహాలు - ఇలా ఎన్నని? ఎన్నిటికి అవకాశం ఉంటే అన్ని! సామూహిక పూజలు, పారాయణాలు, ఉత్సవాలు, ఊరేగింపులు, ఆరగింపులు, ఆనంద లీలలు - ఎన్నో, ఎన్నెన్నో! - ఇక సత్యనారాయణ వ్రతం ఉండనే ఉంది. అన్నీ వసూళ్ళే. వితరణలే విరబూస్తాయి. వసూళ్ళు దాక్కుంటాయి.

ఇవి కాకుండా, ప్రత్యేకంగా దానా లుంటాయి. 'నా చేతికి ఇచ్చుకోవడమే గాని పుచ్చుకోవడం తెలియదు. దానం చేయడ మంటే నాకు మహానందము. గుప్తంగా దానం చేయడం నా అభిమతం. నా సంతోషానికి ***(స్వాంతః సుఖాయ)*** దానాలు చేస్తాను. ఆనందిస్తాను ***(దాస్యామి : మోదిష్యే హర్షం చ అతిశయం ప్రాప్స్యామి).*** ఇదీ వరుస. చిత్తశుద్ధి కొరవైన వాళ్ళు, సత్త్వగుణానికి నోచుకోని వాళ్ళు చేసే యజ్ఞదానా లన్నీ ఇలాగే ఉంటాయి. వీటిని చెప్పుకొనే అవకాశం మళ్ళీ పదిహేడవ అధ్యాయంలో ఉంది.

యజ్ఞ యాగాదులు, వ్రత దానాదులు శ్రేష్ఠ మైనవి. వరిష్ఠ మైనవి. కాని, వాటి వెనుక మన అంతరంగ మెలా ఉందో, దానిని బట్టే సత్ఫలితా లైనా, దుష్ఫలితా లైనా, శూన్య ఫలితా లైనా! రావణాసురుడు వేదాధ్యయన తత్పరుడు. అద్భుతమైన యజ్ఞాలు నిర్వహించాడు. సత్త్వం లేని కారణంగా దుర్గతిని నివారించుకో లేక పోయాడు. అసుర సంపదను ఆశ్రయించిన వారి కార్యక్రమా లన్నీ అలాగే ఉంటాయి. కారణం, వారు అజ్ఞాన విమోహితులు ***(అజ్ఞాన విమోహితాః).*** అజ్ఞానం చేత మోహితులు కావడం వల్ల వీరు అనేక విధాలైన అవివేక మార్గాలలో చరిస్తూ ఉంటారు.

గోకుల పుణ్యభూమిలో గోపాలుని రమణులూ ఆశ్రయించారు, రాక్షసులూ ఆశ్రయించారు. గోవిందుని సన్నిధానంలో రమణులు తరించి పోయారు. రాక్షసులు అంతరించారు. ఏం చేద్దాం! చేసుకున్న వారికి చేసుకున్నంత!





*ఎత్తుకొనిన యువతుల పుణ్య మెంతో!*
*ఎత్తుకొని ఎగిరిన అసురుని పాప మెంతో!*
*గాలి రాక్షసుని కూల్చావు జాలి లేక*
*నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా!*

అని చిన్నికృష్ణ శతకంలో ఒక వెన్నముద్ద.

*ఇలాంటి వారు పొందే గమ్య మేమిటో చెబుతున్నాడు.*

**అనేక చిత్త విభ్రాన్తా మోహజాల సమావృతాః ।**
**ప్రసక్తాః కామభోగేషు పతన్తి నరకేఽ శుచౌ ॥** 16

***అనేక చిత్త విభ్రాంతాః-మోహజాల సమావృతాః***
***ప్రసక్తాః-కామభోగేషు-పతంతి-నరకే-అశుచౌ***

| | | | |
|---|---|---|---|
| అనేకచిత్త విభ్రాంతాః | = అనేకములైన మనోభ్రాంతులు కలవారై | అశుచౌ | = అశుద్ధమైన |
| మోహజాల సమావృతాః | = మోహ జాలముచే చుట్టబడ్డ వాళ్ళు | నరకే | = నరకము నందు |
| కామభోగేషు | = కామభోగముల యందు | పతంతి | = పడతారు |
| ప్రసక్తాః | = అధికాసక్తులై | | |

**అనేక విధాలైన ఆలోచనలతో భ్రాంతి చెందుతారు. మోహ జాలంలో చుట్టబడి ఉంటారు. కామ భోగాల యందే ఆసక్తి కలిగి ఉంటారు. అశుద్ధమైన నరకంలో పడతారు.**

### వ్యాఖ్య

మతులే గతుల్ని నిర్ణయిస్తాయి. బుద్ధిని బట్టే సిద్ధి. అసుర జనుల వ్యర్థమైన ఆలోచనల్ని, అనర్థ మైన ఆచారాలను ఎంతో విస్తారంగా చెప్పుకున్నాం. పూర్వ శ్లోకాలలో మనం చెప్పుకున్న అసుర లక్షణాలలో ఏ ఒక్కటి మనస్సును పట్టుకున్నా, మనిషి మనుగడ విషతుల్య మౌతుందని తెలిసి పోయింది. ఇక అన్నీ ఒక వ్యక్తి చిత్తంలో చేరిపోతే, ఆ తరువాత అతడే మౌతాడో! అలాంటి వారి గతి ఎలా ఉంటుందో! ఎలా ఉంటుంది? నరకం లాగే ఉంటుంది!

చేయ కూడని ఆలోచనలు చేసి మనస్సులను పాడు చేసుకున్న వారు ***(అనేక చిత్త విభ్రాన్తాః).*** మోహం అనే వలలో చిక్కిన వాళ్ళు ***(మోహ జాల సమావృతాః)*** కామభోగాల యందే ఆసక్తి కలిగి విషయాలను ఉపభోగించే వాళ్ళు ***(ప్రసక్తాః కామ భోగేషు)***, అశుద్ధ మైన, అపవిత్ర మైన నరకంలో పడి పోతారు ***(అశుచౌ నరకే పతన్తి).***

అజ్ఞాన జనితమైన కల్పిత భావాలే మనిషిని సంసార చక్రానికి బంధిస్తాయి. మోహ జాలంలో తగుల్కొనేలా చేస్తాయి. మోహ మంటే ఏదో కాదు. విపరీత బుద్ధియే మోహము ***(విపరీత బుద్ధిః మోహః).*** అది కాని దాని యందు అది అనే భావన. తాను కాని దాని యందు తాను అనే భావన ***(అతస్మిన్ తద్బుద్ధిః ఇత్యర్థః).*** ఇదే మోహ జాలము. జాలము అంటే వల. కప్పేసే స్వభావం కలది. జ్ఞానమును అజ్ఞానము కప్పేస్తుంది. అందుచేతనే జనులు మోహితు లవుతున్నా రని గీత లోనే చెప్పుకున్నాం *( 5 వ అ - 15 వ శ్లో ).*

మోహంలో కూరుకు పోయిన వారు బంధంలో చిక్కు కుంటారు. ఆ బంధమే అజ్ఞానం. జ్ఞానము అజ్ఞానం చేత కప్ప బడుతుంది.

విపరీత జ్ఞానమే మోహము కనుక, ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు చూచే ప్రమాద స్థితి మోహం వల్ల ప్రాప్తిస్తుంది. తానెవరో తనకు తెలియక పోవడమే మోహానికి కారణము. తనకు తాను తెలియడం లేదు అంటే ఆత్మకు సంబంధించిన అజ్ఞానం ఉందని అర్థము. తానెవరో తనకు తెలియ నపుడు, తాను కాని దానిని తానని భ్రమించే ప్రమాదం లేక పోలేదు. అదే బంధము. అజ్ఞానం వల్ల ఏర్పడింది ***( అత్ర అనాత్మని అహ మితి మతిః అస్య పుంసః ఏషః బంధః ప్రాప్తః ).***

వలలో చిక్కిన చేప ఎలా బయట పడలేదో, అజ్ఞానము చేత మోహ జాలంలో చిక్కిన వారు కూడా బయట పడలేరు. మోహ ప్రభావం చేత విషయ భోగాల యందే మనస్సును లగ్నం చేసి ఉంటారు. కోరికల్ని తీర్చుకొనే ప్రయత్నం లోనే ఉంటారు. కోరికలను తీర్చుకో లేరు. అలాగని కోరికల నుండి విడిపడ లేరు. బ్రతు కంతా ఇలా భోగాసక్తి తోనే గడిపేస్తారు కాని, యోగాసక్తిని పొంద లేరు. అందుచేత, చేయ వలసిన కార్యాలను చేయకుండా, చేయ కూడని వాటిని చేస్తూ ప్రాప్తించిన దుష్ఫలితాలను అనుభవించ డానికి నరకాన్ని చేరుతారు.

*అసుర మానవులు ఆత్మ సంభావితులు కనుక అభివృద్ధికి నోచుకోరు. చదవండి.*

**ఆత్మసమ్భావితాః స్తబ్ధా ధన మాన మదాన్వితాః ।**
**యజన్తే నామ యజ్ఞై స్తే దమ్భే నావిధిపూర్వకమ్ ॥** 17

***ఆత్మసంభావితాః-స్తబ్ధాః-ధనమాన మదాన్వితాః***
***యజంతే-నామయజ్ఞైః-తే-దంభేన-అవిధిపూర్వకం***

| | | | |
|---|---|---|---|
| తే | = వారు | దంభేన | = దంభముతో |
| ఆత్మసంభావితాః | = ఆత్మస్తుతి గలవారు | నామయజ్ఞైః | = నామమాత్ర యజ్ఞముల చేత |
| స్తబ్ధాః | = వినయం లేని వారు | అవిధిపూర్వకం | = అశాస్త్రీయంగా |
| ధన మాన మదాన్వితాః | = ధనము కారణంగా మాన మదాన్వితులు | యజంతే | = యజ్ఞ మాచరిస్తారు |

**అర్జునా! అసుర జనులు ఆత్మస్తుతి కల వారు. ధనం ఉందని మదము, అభిమానంతో ఉంటారు. వారు చేసే యజ్ఞాలు పేరుకు మాత్రమే. అంతా దంభమే. అశాస్త్రీయమే.**

### వ్యాఖ్య

ఆసురీ ప్రవృత్తి కల వారు ఆత్మసంభావితులు. తాము సర్వ సుగుణ సంపన్నుల మని తమను తామే స్తుతించుకొను వారు ఆత్మసంభావితులు. ఇదే ఆత్మస్తుతి. లేని గుణాలు ఉన్నట్లు తమను తాము పొగుడు కుంటూ ఉంటారు. కాని, సత్పురుషుల చేత గుర్తింపు లేని వారుగా ఉంటారు.

అన్నీ తమకే తెలుసని ఆత్మస్తుతి చేసుకుంటూ ఉంటారు. తెలిసిం దేమీ ఉండదు; తెలుసు అనే అహంకారము తప్ప. వారే ఆత్మ సంభావితులు. వారిని వేరొకరు పూజించ నవసరం లేదు. వాళ్ళను వాళ్ళే పూజించు కుంటారు. వాళ్ళే పీట వేసుకుంటారు. వాళ్ళే పూలు తెచ్చుకుంటారు. మంత్రము వారిదే, తంత్రము వారిదే. తీరా చూస్తే వీటన్నిటి వెనుక కుతంత్రమే ఉంటుంది.

వీరి ఆత్మపూజ ఏ స్థాయికి చేరుతుందంటే, పెద్దలను, గురువులను, పూజ్యులను గౌరవించాలన్నా, అభిమానం అడ్డొచ్చి ఇబ్బంది పడుతూ ఉంటారు. ఎవరైనా చూస్తున్నారు అంటే దేవుడికి నమస్కరించాలన్నా





సంశయిస్తారు. అంతా తమకే తెలుసు అనే భ్రాంతిలో ఉంటారు కనుక, ఇతరుల నుండి జ్ఞానమును పొందే అవకాశానికి నోచుకోరు. విశిష్ట గుణాలు తమకే ఉన్నాయని భావించడం చేత గురువుల నుండి జ్ఞానమును పొందే ప్రయత్నం చేయరు. అలా మరొకరి నుండి జ్ఞాన సముపార్జనం చేయడం న్యూనతగా భావిస్తారు. వీరి అహంకార ప్రదర్శనలను చూచిన గురువులు కూడా వీరిని గుర్తించడానికి, వీరికి బోధించడానికి ఇష్ట పడరు ***(ఆత్మ సంభావితాః సర్వ గుణ విశిష్టతయా ఆత్మ నైవ సంభావితాః న సాధుభిః ).***

వీరు ఆత్మస్తుతియే ప్రధానంగా కలిగిన వారు కనుక అహంకారులై ఉంటారు. గర్విత మతులై ఉంటారు. అందుచేత వారు స్తబ్ధులు. స్తబ్ధులు అంటే వినయము లేని వారు. పెద్దల యెడ విధేయత లేని వారు ***(స్తబ్ధాః అప్రణతాత్మానః)*** అని అర్థం. జ్ఞానము వృద్ధి చెందే కొలది వినయం పెరుగుతూ ఉంటే, సత్త్వగుణము ఉచ్ఛస్థితిలో ఉందని అర్థము. జ్ఞానము లేకపోయినా, ఉన్నట్లు అనిపిస్తూ, అహంకారం పెరుగుతూ ఉంది అంటే, సత్త్వగుణము నీచ స్థితికి పడిపోయి, ఒక విధంగా శూన్య స్థితికి చేరి, రజ స్తమో గుణాలు ఉచ్ఛస్థితికి చేరాయని భావము. అసుర జనులు సత్త్వమునకు నోచుకోని కారణంగా ఆత్మసంభావితు లవుతారు. గర్వితులై అవినయంతో ప్రవర్తిస్తూ ఉంటారు. ఆచార విహీనులై ఉంటారు. ఎంత విశిష్టమైన విషయ మైనా, ఇతరులు చెబితే దానిని పట్టించుకోరు. అంతా తమకే తెలుసు అనే అభిప్రాయంలో ఉంటారు కనుక, ఎవరు చెప్పినా వినరు. చెవుడు లేని చెవిటి వాళ్ళు. అభిమాన బధిరాంధక శవాలు. ధనమాన మదాన్వితులు.

మానము అంటే అభిమానము, లేదా గర్వము. మదము అంటే మత్తత. ధనము కారణంగా ఏర్పడిన మానము, మదము గల వారు ధనమాన మదాన్వితులు ***( ధన నిమిత్తః మానః మదశ్చ తాభ్యాం ధనమాన మదాభ్యాం అన్వితాః ).*** వీరి జ్ఞానము యథార్థ జ్ఞానమై ఉంటే, వీరు తప్పక విద్యా వినయ సంపన్నులై ఉండే వారు. కాని, వీరిది మిథ్యాజ్ఞానం కావడం చేత, విద్యా వినయాలకు బదులుగా మానమదాలు చోటు చేసుకున్నాయి.

అభిమాన అహంకారాలు ప్రగతి నిరోధకాలు. ప్రగతి ప్రతిబంధకాలు. అసుర సంపద కల వారిలో ఇవి పూర్ణంగా ఉంటాయి. దైవీ సంపద నాశ్రయించిన కొందరిలో ఈ లక్షణాలు సంస్కార దోషం వల్ల అప్పు డప్పుడు అరుదుగా అగుపించినా, నిర్మూలించ డానికి అనుకూలంగా ఉంటాయి. కాని ఆసురీ సంపద కల వారిలో ఇవి దృఢంగా ఉండి, దుస్సాధ్యంగా, దుర్భేద్యంగా ఉంటాయి.

పూర్వం రాక్షసుల మీద దేవతలు విజయాన్ని సాధించి నపుడు దేవతలు గర్వితులై పరమేశ్వరుని కూడా విస్మరించారు. భగవంతుడు యక్షుని రూపంలో వారి ముందు ప్రత్యక్షమై, వారి గర్వాన్ని నిర్మూలించాడు. వారి లోని వైభవము వారిది కాదని, ఈశ్వర వైభవమే అన్న సత్యాన్ని వారికి సాక్షాత్కరింప చేశాడు. ఈ కథ కేనోపనిషత్తులో ఉంది.

వీరు యజ్ఞ యాగాదులు కూడా చేస్తారు ***( యక్ష్యే)*** అని పూర్వ శ్లోకంలో *(15 వ శ్లోకము)* చెప్ప బడింది కదా! మరి, మానమదాలతో విర్రవీగే వాళ్ళు సాత్త్వికులు ఆచరించే యజ్ఞ యాగాదులను ఎలా ఆచరిస్తున్నారు? అనే శంక ఏర్పడ వచ్చు. దానికి సమాధానం చెబుతున్నాడు. వారు చేసే యజ్ఞాలు పేరుకు మాత్రమే యజ్ఞాలు ***( నామ యజ్ఞైః నామ మాత్రైః యజ్ఞైః ).*** అవి కూడా దంభముతో నిర్వహింప బడుతాయి ***(దంభేన ).*** అవిధి పూర్వక యజ్ఞాలై ఉంటాయి. శాస్త్ర విహిత అంగాలు, విధానాలు లేని యజ్ఞాలను వీరు పేరు ప్రఖ్యాతుల కొరకు ఆచరిస్తారు ***( యజన్తే అవిధి పూర్వకమ్ ).***

*అందుచేత, వీరి పూజా పురస్కారా లన్నీ భగవంతుని దృష్టిలో తిరస్కారాలుగా గుర్తింపబడు తున్నాయి.*

**అహంకారం బలం దర్పం కామం క్రోధం చ సంశ్రితాః ।**
**మామాత్మ పరదేహేషు ప్రద్విష న్తోఽభ్యసూయకాః ॥** 18

***అహంకారం-బలం-దర్పం-కామం-క్రోధం-చ-సంశ్రితాః***
***మాం-ఆత్మ పరదేహేషు-ప్రద్విషంతః-అభ్యసూయకాః***

| | | | |
|---|---|---|---|
| అహంకారం | = అహంకారము | సంశ్రితాః | = ఆశ్రయించిన వారై |
| బలం | = బలము | ఆత్మ పరదేహేషు | = తమ యందు, ఇతరుల యందు |
| దర్పం | = గర్వము | మాం | = నన్ను |
| కామం | = కామము | అభ్యసూయకాః | = అసూయతో చూస్తారు |
| క్రోధం చ | = క్రోధము | ప్రద్విషంతః | = ద్వేషిస్తున్నారు |

**వారు అహంకారమును, బలమును, గర్వమును, కామమును, క్రోధమును ఆశ్రయించి ఉంటారు. వారి లోను, ఇతరుల లోను ఉన్న నన్ను అసూయతో చూస్తున్నారు. ద్వేషిస్తున్నారు.**

### వ్యాఖ్య

ఆసురీ సంపదకు సంబంధించిన వారు అహంకారము, బలము, దర్పము, కామము, క్రోధములను ఆశ్రయించుకొని ఉంటారు.

మొదటిది ***అహంకారం.*** 'నేను - నేను' అనుకోవడమే అహంకారము ***( అహం కరణమ్ అహంకారః ).*** ఉన్న వాటిని, లేని వాటిని తన యందు ఆరోపించుకొని, ఈ ఆరోపిత గుణములతో కూడిన తనను, 'నేను - నేను' అని భావించడము ఏదైతే ఉందో అదే అహంకారము ***( విద్యమానైః అవిద్యమానైః చ గుణైః ఆత్మని అధ్యారోపితైః విశిష్టమ్ ఆత్మానమ్ అహ మితి మన్యతే).*** అదే అవిద్య. దుఃఖభూయిష్ట మైనది. సమస్త దోషాలకు, సర్వ అనర్థాలకు మూల మైనది. పూర్వ శ్లోకాలలో మనం చూచినట్లు తమలో లేని గుణాలను, లక్షణాలను తమలో ఉన్నట్లుగా భావించుకొని, వాటిని ప్రస్తుతించుకుంటూ, తాము గుణవంతుల మని భావించడం కూడా అహంకారమే. నేను ఉన్నత కుల ప్రసూతుణ్ణి. ధర్మరూపుణ్ణి. సర్వశాస్త్ర కోవిదుణ్ణి. ఉత్తమ మైన వాణ్ణి అని చింతించడము అహంకారము క్రిందికే వస్తుంది.

రెండవది ***బలము.*** ఇతరులను తిరస్కరించ డానికి, పరాభవించ డానికి కారణ మైనది బలము. కామముతో, రాగముతో కూడు కున్నది ***( బలమ్ పర అభి భవ నిమిత్తం కామరాగాన్వితమ్ ).*** పరులను అవమానించ డానికి కారణమైన దేహగత సామర్థ్యము బలము. ఇది అసుర జనము యొక్క లక్షణము. ఇదే బలము కామము లేని దైనపుడు, రాగ రహిత మైనపుడు, దైవ గుణముగా శోభిస్తుంది. ఆ స్థితిలో బలం భగవంతుని విభూతిగా ప్రశంసింప బడుతుంది. 'అర్జునా! బలవంతులలో కామరాగ వివర్జిత మైన బలము నేనే నని తెలుసుకో' అని గీతాచార్యుడు విజ్ఞానయోగంలో బోధించాడు *(7 వ అ - 11 వ శ్లో).*

మూడవది ***దర్పము.*** దేని కారణంగా ధర్మాన్ని తిరస్కరించడం, లేదా అతిక్రమించడం జరుగుతూ ఉందో, అట్టి అంతఃకరణ దోషమును దర్పము అంటారు ***( దర్పః నామ యస్య ఉద్భవే ధర్మమ్ అతిక్రామతి సోఽయం అంతఃకరణాశ్రయః దోష విశేషః ).*** చిత్తము నందు ధర్మవిరుద్ధమైన దోష విశేషమే దర్పము. ధర్మదూరులై ప్రవర్తించడము, అధర్మాది కార్యాలను నిస్సంశయంగా ఆచరించడము, ధర్మమూర్తులైన మహాత్ముల ఉపదేశాలను తిరస్కరించడము, ప్రభు ధిక్కారము మొదలైన వన్నీ దర్పములే.





నాల్గవది **కామము.** ఇక్కడ కామం అంటే స్త్రీ సంబంధమైన విషయము నందు ఆసక్తి ***( కామమ్ స్త్ర్యాది విషయం ).*** స్త్రీ సంబంధమైన భోగాసక్తి కామము. ఇట్టి విషయము నందు భోగాభిలాష కామము.

అయిదవది **క్రోధము.** ఇష్ట విషయాభిలాష కామ మైంది కనుక, అనిష్ట విషయ ద్వేషము క్రోధ మవుతుంది. ***క్రోధం చ*** అనెడి పదాలలో ఉన్న 'చ' కారము వల్ల లోభ, మోహ, మద, మాత్సర్యాది బుద్ధి దోషాలన్నీ అన్వయించబడ్డాయి అని అర్థము. ఇన్ని దోషాలను ఆశ్రయించుకొని ఉన్న అసుర మానవులు తనను ద్వేషిస్తున్నారు అంటున్నాడు భగవంతుడు. భగవంతుని ద్వేషించడ మేమిటి? అయినా అసుర మానవులు పరమేశ్వరుని ఎలా ద్వేషిస్తారు?

ఏ పరమేశ్వరు ణ్ణైతే ఆసురీలు ద్వేషిస్తున్నారో, వారిలో ఉన్నది పరమేశ్వరుడే కదా! అంతే కాదు. తమలో ఏ పరమేశ్వర చైతన్యము ఉందో, ఇతరులలో కూడా అదే పరమేశ్వర చైతన్యము శోభిస్తూ ఉంది కదా! అసుర జనులు పరమేశ్వరుని ద్వేషిస్తున్నారు అంటే, తమ లోను, పరుల లోను దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న ఆత్మ చైతన్యాన్ని ద్వేషిస్తున్నా రని అర్థం ***( మాం ఈశ్వరమ్ స్వదేహ పర దేహేషు ప్రద్విషన్తః ).*** అలా ద్వేషించడము అంటే, తమ దేహాలలో, ఇతరుల దేహాలలో ఉన్న బుద్ధులకు, బుద్ధి వృత్తులకు సాక్షిగా వెల్గొందుతున్న ఈశ్వరుణ్ణే ద్వేషిస్తున్నా రని అర్థం. అలాగే, పరమేశ్వరుడు, పరమేశ్వర జ్ఞానం భిన్నం కానందున, ఈశ్వర జ్ఞానాన్ని తిరస్కరించే వారు, అతిక్రమించే వారు ఈశ్వరుని తిరస్కరించిన వారే అవుతున్నారు. ఇదే భగవద్వేషము.

విశ్వంలో ఎటు చూచినా, ఎక్కడ చూచినా ధర్మాలే ఉన్నాయి. ఇదంతా నియతి. నియతి రూపంలో ఉన్నది నియంతే కనుక, ధర్మ రూపంలో ఉన్నది దైవమే. దైవము ధర్మ రూపంలో ఉండే టప్పుడు ధర్మాన్ని అతిక్రమించడము అంటే, ధర్మాన్ని ద్వేషించడమే. ధర్మం దైవం కన్నా వేరుగా లేనందున ధర్మాన్ని దూషించడమంటే దైవాన్ని దూషించడమే. అంతే కాదు, ధర్మ మార్గాన చరించే వారిని పరాభవించడము అంటే, వారిలో చైతన్య రూపంలో ఉన్న పరమేశ్వరుని, వారు ఆచరించే ధర్మం రూపంలో ఉన్న దైవాన్ని పరాభవించినట్లే. ఈ విధంగా అహంకార, బల, దర్ప, కామ, క్రోధాదులను ఆశ్రయించిన అసుర మానవులు, తమ లోను, ఇతరుల లోను ఉన్న పరమేశ్వరుని ద్వేషిస్తున్నారు. పరమేశ్వరుని ద్వేషిస్తూ, పరమేశ్వరుని మార్గంలో పయనించే వారిపై అసూయ పడుతున్నారు ***( తం కుర్వన్తః అభ్యసూయకాః సన్మార్గ స్థానాం గుణేషు అసహ మానాః ).*** పరమేశ్వరుని ద్వేషిస్తూ, ఈశ్వర భక్తులను అసహ్యించుకొనే ఈ అసుర మానవుల వికృత స్వభావాన్ని ఏడు, తొమ్మిది అధ్యాయాలలో పరమేశ్వరుడే ప్రబోధించాడు *(7 వ అ - 24 వ శ్లో ; 9 వ అ - 11, 12 వ శ్లో).*

అహంకార అభిమానాది దుర్గుణాలకు అలవాటు పడిన ఈ అసుర సంజాతము, భక్తులతో చిత్రవిచిత్ర మైన వితండ వాదాలు చేస్తూ ఉంటారు. ఈశ్వరు డంటూ ఉంటే, 'ఆయన నా బుద్ధి వృత్తులకు సాక్షి' అని మీరు చెప్పేది వాస్తవమే అయితే, ఏదీ ప్రస్తుతం నా బుద్ధిలో ఏముందో చెప్ప మనండి. సరే, పోనీ లెండి. పాపం, పరమేశ్వరుడికి తీరిక లేదేమో! మరి, మీరు ఆయన భక్తజనం కదా! ఈశ్వర పరివారం కదా! ఆయన ఏమి చెప్పదలచు కున్నాడో, మీ ద్వారా అయినా చెప్ప మనండి అంటూ కుతర్కాలు చేస్తూ, భక్తులను అవహేళన చేస్తూ, భగవంతుని అవమానిస్తూ మాట్లాడుతూ ఉంటారు. ఇలాంటి వికృత స్వభావులకు సమాధానం వేదం విచిత్రంగా చెప్పింది.

***ఈశ్వరో యది సర్వస్య కారకః కారయాతమామ్ ।***
***అ ద్వైతి వాదినం బ్రూయాత్ సదాఽ ధో యాస్యసి ॥***

'సర్వుల చేత సమస్త కార్యాలు చేయించేది ఈశ్వరుడే అని మీరు చెబుతున్నారు కదా! అయితే, నా చేత ఇప్పుడు చేయించ మనండి, చూద్దాం!' అని వాదించే వితండవాదికి, 'అయ్యా! తమరు ఇలాగే ఉంటే, తమరికి సదా అధోగతే నని ఈశ్వరుడు నీకు చెప్ప మని మాకు చెబుతున్నాడు', అని చమత్కరిస్తూ సమాధాన మిచ్చింది సామవేదము లోని యాస్కశ్రుతి.

ఆసురీ సంపదకు సంబంధించిన మానవుల అసుర లక్షణాలను ఏడవ శ్లోకం నుండి ప్రవాహ రూపంలో వరుసగా పన్నెండు శ్లోకాలలో ప్రసంగించిన భగవానుడు, వాటిని ఇక్కడ, ఈ పద్దెనిమిదవ శ్లోకం వద్ద సమాప్తి చేస్తున్నాడు.

*ఈ విధమైన రాక్షస ప్రవృత్తితో జీవించిన అసుర మానవుల జీవితాల పరిణామా లెలా ఉంటాయి? ఫలితా లెలా ఉంటాయి? వివరిస్తున్నాడు.*

తా నహం ద్విషతః క్రూరా న్సంసారేషు నరాధమాన్ ।
క్షిపా మ్యజస్ర మశుభా నాసురీ ష్వేవ యోనిషు ॥ 19

***తాన్-అహం-ద్విషతః-క్రూరాన్-సంసారేషు-నరాధమాన్***
***క్షిపామి-అజస్రం-అశుభాన్-ఆసురీషు-ఏవ-యోనిషు***

| | | | | | |
|---|---|---|---|---|---|
| అహం | = | నేను | ఆసురీషు | = | అసుర ప్రవృత్తికి సంబంధించిన |
| ద్విషతః | = | ద్వేషించు వారు | సంసారేషు | = | సంసారమున |
| క్రూరాన్ | = | క్రూరులు | అజస్రం | = | సదా |
| అశుభాన్ | = | అశుభులు | యోనిషు ఏవ | = | యోనుల యందు |
| తాన్ | = | ఆ | క్షిపామి | = | ఉంచు తున్నాను |
| నరాధమాన్ | = | నరాధములను | | | |

**అర్జునా! అసుర మానవులు ద్వేషించే స్వభావం గల నరాధములు. క్రూర స్వభావులు. పాప కార్యాలు చేస్తారు. వీళ్ళను సంసారాలలో నీచ జన్మల లోకి నెట్టేస్తాను.**

### వ్యాఖ్య

ప్రాణులలో నిరంతరము కర్మలు నడుస్తూ ఉన్నాయి. ప్రపంచమే ఒక కర్మ సముద్రంగా కనిపిస్తూ ఉంది. సముద్రంలో కనిపించే వన్నీ అలలే. ప్రపంచం లోని ప్రాణులలో గోచరించే వన్నీ కర్మలే. చేతలే.

ఎవరి చేతలు వారివి. ఈ విషయంలో మానవులే కాదు, పశుపక్ష్యాది జంతుజాలము కూడా ఉంది. వాటిలో కూడా కర్మలు సాగుతున్నాయి. జంతువులకు చేతులు లేవు; అయినా చేతలు ఉన్నాయి. చిత్తము లేదు; అయినా సహజాతంగా చేతలు సాగి పోతున్నాయి. అందుచేత వాటికి పుణ్యపాపాలు లేవు. పాలు ఇచ్చిన ఆవుకు పుణ్యం రాదు. తన్నిన ఆవుకు పాపము అంటదు. చిత్తము లేని చేతలకు విలువలు నిర్ణయించ లేము.

మానవుల పరిస్థితి వేరు. ఈశ్వరుడు మనుషులకు చేతు లిచ్చాడు. వాటిని ఎలా వినియోగించు కోవాలో నిర్ణయించు కొనేందుకు చిత్తమును కూడా ఇచ్చాడు. చిత్తముతో చింతించి, చేతులతో ఆచరించు అనేది బహుశ ఆ దివ్యాత్ముని సంకల్ప మేమో! ముఖ్యంగా రెండే విషయాల కొరకు మనిషికి చేతు లున్నాయి.

చెయ్యా లనుకున్నది చేతులతో చేసుకో. చేసిన కర్మల ఫలాలను చేతులతో అందుకో. కర్మలు





చేసేందుకు, చేసిన కర్మల ఫలాలను అందుకునేందుకు మనిషికి పరమేశ్వరుడు చేతు లిచ్చాడు. చేసుకున్న వారికి చేసుకున్నంత అనే నియతిని తానే నియమించాడు. నియంతగా, ఫలప్రదాతగా తానే నియతిలో నిండి ఉన్నాడు.

ఎవరు ఏ కర్మ నాచరిస్తే దాని ఫలితాన్ని వారు పొందుతారు. కర్మ అనే కారణం ఉన్నప్పుడు, ఫలం అనే కార్యాన్ని ఎవ్వరూ ఆప లేరు. కార్యకారణాలు అలాగే ఉంటాయి. కర్మల ఫలితాలే జన్మలలో తొంగి చూస్తాయి. కర్మ కారణంగా జన్మఫలం కార్య రూపాన్ని దాల్చుతూ ఉంది.

***కపూయ చరణా అభ్యాశోహ యత్తే కపూయాం యోని మాపద్యేరన్*** - అన్నది వేదం. నిందిత కర్మలు, అంటే గర్హనీయ మైన దుష్టకర్మలు చేసే వారు ***( కపూయ చరణాః )*** శీఘ్రము గానే ***( అభ్యాశోహ )*** నీచమైన యోనుల యందు ***( కపూయాం యోనిం )*** పుడుతారు; లేదా నీచ యోనులను పొందుతారు ***( ఆపద్యేరన్ ).***

ఎవరు ఏ కర్మలు ఆచరిస్తే, ఆ కర్మల ఫలితాలను అనుభవించ డానికి అనుకూలమైన ప్రదేశాలను అందించే యోనుల యందు వారు పుడుతారు. ఇది ధర్మము. ఇది నియతి. నియతి రూపంలో నియంత యొక్క జ్ఞానమే శోభిస్తూ ఉన్నందున, ఫలితాలు ఆ విధంగా అందుతూ ఉన్నాయి. సత్కర్మ లాచరించి నందుకు ఫలితంగా సద్గతి ప్రాప్తిస్తూ ఉంటే, దుష్కర్మ లాచరించి నందుకు ఫలితంగా దుర్గతి ప్రాప్తిస్తూ ఉంది. ***పుణ్యో వై పుణ్యేన కర్మణా భవతి పాపః పాపేన*** - పుణ్యకర్మ చేత పుణ్యాత్మ డవుతాడు. పాపకర్మ చేత పాపాత్మ డవుతాడు అని బృహదారణ్యక శ్రుతి *(3 - 2 - 17)*. ఈ విషయంలో ఉన్న దంతా ధర్మమే. నిష్పాక్షిక మైన ధర్మమే. ఇందులో భగవంతుని పాత్ర ఏముంది, ధర్మానికి శోభ నివ్వడము తప్ప! జీవులకు ప్రాప్తించే కర్మఫల భేదాలకు కారణాలు జీవులకు సంబంధించే ఉన్నాయి. ఈ గుణ దోషాలు పరమేశ్వరునికి ఎలా అంట కడతారు? ధర్మ వ్యవహారాన్ని, నియతి నిర్ణయాలను సాక్షిగా వీక్షించే భగవంతునికి పక్షపాతాన్ని, రాగద్వేషాలను ఎలా ఆపాదిస్తాము? అందుకే ఈ విషయంలో న్యాయ ప్రస్థానమైన బ్రహ్మసూత్రాలు తిరుగు లేని తీర్పు నిచ్చాయి.

సూ॥ **వైషమ్య నైర్ఘృణ్యేన సాపేక్షత్వా త్తథాహి దర్శయతి।** *(2 - 1 - 34)*

పక్షపాతము, అతి క్రూరత్వం, లేదా జాలి లేక పోవడము ***( వైషమ్య నైర్ఘృణ్యే )*** అనేవి పరమేశ్వరునిలో లేవు ***( న ).*** కారణం, సృష్టింపబడే జీవుల కర్మల ననుసరించి, కర్మఫలంగా జీవులను సృష్టించడం వలన ***(సాపేక్షత్వాత్ ).***

జీవుల కర్మఫలంగా జన్మలు ప్రాప్తించే టప్పుడు పరమేశ్వరునికి రాగద్వేషాలను, వైషమ్య నైర్ఘృణ్యాలను ఎలా ఆపాదిస్తాము? కనుక, అవి ఈశ్వరుని విషయంలో ప్రసక్తాలు కావు ***( వైషమ్య నైర్ఘృణ్యే న ఈశ్వరస్య ప్రసజ్యేత్).*** సరే. జీవుల కర్మానుసారం జన్మలను ప్రసాదిస్తున్నాడు కనుక పరమేశ్వరునికి వైషమ్య నైర్ఘృణ్యాలు లేవని ఒప్పుకుందాం. మరి, సృష్టి విషయంలో దేనిని అపేక్షించి పరమేశ్వరుడు సృష్టి చేస్తున్నాడు అనే శంక రావచ్చు. దానికి కూడా సమాధానం వినండి.

ఏదో ఒక దానిని అపేక్షించే కదా పరమేశ్వరుడు జగత్తును సృష్టించడం జరిగింది! మరి దేనిని ఆశించి, లేదా అపేక్షించి సృష్టిని నిర్మించాడు? ***కిం అపేక్షత ఇతి చేత్*** - దేనిని ఆశించి సృష్టించాడు అని ప్రశ్నిస్తే ***ధర్మాధర్మ వపేక్షత ఇతి వదామః*** - ధర్మాధర్మాలను అపేక్షిస్తున్నాడు అని చెబుతున్నాం. అలా ధర్మాధర్మాలను ఆశించడము రాగద్వేషాల క్రిందికి వస్తుందా? రాదు. కనుక, ధర్మాధర్మాలను అపేక్షించి సృష్టి నిర్వాకాన్ని సాగిస్తున్న పరమేశ్వరుడు ***( సాపేక్షత్వాత్ ).*** జీవులు ఆచరించిన కర్మలకు అనుగుణమైన ఫలితాలను

అందించేందుకు జన్మలను అనుగ్రహిస్తున్నాడు ***( సాపేక్షత్వాత్ ).*** అందుచేత, జీవులకు కర్మఫలాలను ప్రసాదించే విషయంలో పరమేశ్వరునికి రాగద్వేషాది దోషాలు అంటగట్టడం అసంభవం.

కనుక, సృష్టింప బడిన జీవుల ధర్మాచరణమును, కర్మాచరణమును బట్టి సృష్టిలో వైషమ్యాలు గోచరిస్తున్నాయే గాని అది పరమేశ్వరుని అపరాధము కాదు; దోషము కానే కాదు ***( అతః సృజ్యమాన ప్రాణి ధర్మాధర్మాపేక్షయా విషమా సృష్టి రితి న అయం ఈశ్వరస్య అపరాధః ).***

ధాన్యం మొల కెత్తడానికి మేఘం కారణంగా కనిపిస్తూ ఉంది. వరి, గోధుమ, యవలు, జొన్నలు మొదలైన ధాన్యాలు మొలకెత్త డానికి మేఘం సాధారణ కారణంగా కనిపిస్తూ ఉంది. కాని ధాన్యాల లోను, ధాన్యాల లోని గుణాల లోను భేదాలు గోచరించ డానికి ధాన్యాల లోని అసాధారణ శక్తులే కారణం గాని మేఘం కారణం కాదు. ఏయే ధాన్యాలలో ఏయే గుణాలు ఉన్నవో, వాటిని నిర్ణయించేది మేఘం కాదు గదా? అలాగే, ఈశ్వరుడు కూడా జీవుల కర్మఫలాల విషయంలో సాధారణ కారణంగా తెలుస్తూ ఉన్నా, జీవుల లోని వైషమ్యాలకు, జన్మల లోని తారతమ్యాలకు జీవుల అసాధారణ కర్మలే కారణం గాని ఈశ్వరుడు కాదు. కనుక, ఈశ్వరుణ్ణి ధాన్యం విషయంలో మేఘం లాగా అర్థం చేసుకోవాలి ***( ఈశ్వరస్తు పర్జన్య ఇవ దృష్టత్వాత్ ).***

## స్వయంకృత అపరాధాలు

అసుర జీవనానికి అలవాటు పడిన దురదృష్టవంతులు సన్మార్గానికి దూరమైన వాళ్ళు. సాధు ద్వేషులు. దైవ ద్వేషులు. సాధువులను ద్వేషించి, దైవమును దూషించి బ్రతుకును చీకటిమయం చేసుకున్న వాళ్ళు ***(సన్మార్గ ప్రతిపక్ష భూతాన్ సాధు ద్వేషిణః ద్విషతః చ మాం ఈశ్వరం ).***

అసుర మానవులను నరాధములుగా అభివర్ణిస్తున్నాడు. ఉత్తమ మైన మానవ జన్మను పొంది నరోత్తము లుగా శోభించ వలసిన వాళ్ళు, నారాయణ స్వరూపులుగా భాసించ వలసిన వాళ్ళు, నరాధములై నరక నివాస యోగ్యు లయ్యారు. ఎందుకని, నరులు నరాధము లయ్యారు? అధర్మ దోషం చేత నరాధము లయ్యారు ***(అధర్మ దోష వత్త్వాత్ ).*** అధర్మ ప్రవర్తనములో రాటు దేలి క్రూరాత్ము లయ్యారు. దారుణ పాపకృత్యాలకు ఒడిగట్టే దుష్టు లయ్యారు ***( క్రూరాన్ ).*** పురుషోత్తము లయ్యే పవిత్ర మార్గాన్ని నిరసించి, అపవిత్ర మైన, క్రూరమైన, అధర్మ మార్గాలలో చరించి పురుషాధము లయ్యారు. అధములు ఏం చేస్తారు? ఏ కర్మ లాచరిస్తారు? అధము లెవ్వరైనా అశుభం వైపే మొగ్గు చూపుతారు. అశుభ కర్మలనే ఆచరిస్తారు ***( అశుభ కర్మ కారిణః ).*** ఇలాంటి పాప కార్యా లాచరించే క్రూరాత్ములను, నరాధములను, అసూయా ద్వేషాలతో సాధుహింసకు, దైవ దూషణానికి పాల్పడే దురాత్ములను, జనన మరణ రూప సంసారములో నీచ యోనుల యందు పడేస్తాను అంటున్నాడు భగవంతుడు.

భావాన్ని బట్టే బ్రతుకు ***( యద్భావం తద్భవతి ).*** ఈ జన్మలో ఎవరు ఎలా ప్రవర్తిస్తారో, ఆ కర్మలకు అనుగుణమైన ఫలాలను పొందే ప్రదేశాల లోనే వాళ్ళు జన్మిస్తారు. నేటి ఆలోచనలే రేపటి ఆకృతులకు ప్రాణం పోస్తాయి. దుష్టులకు ప్రాప్తించేవి దుష్టజన్మలే కదా! నీచ కార్యాలను ఆచరించి నందుకు ఫలితంగా వచ్చేవి నీచ జన్మలే కదా! భగవంతుడు అదే చెబుతున్నాడు.

శునక సూకరాదుల లాగా అపవిత్ర జీవనం గడిపిన వాళ్ళకు మానవజన్మ యొక్క అవసరం ఏముం టుంది? అందుచేత, శునక సూకరాది జన్మల లోనే జన్మించి మిగిలిన అపవిత్ర జీవనాన్ని కొనసాగిస్తారు. సర్ప వ్యాఘ్రా దుల వలె విషపూరితంగా, క్రూరంగా జీవించిన వాళ్ళు, తరువాత జన్మలలో సర్ప వ్యాఘ్రాదుల యోనుల లోనే జన్మిస్తారు.





విచారించి అర్థం చేసుకుంటే, ఇక్కడ భగవంతుడు ఇచ్చిం దేముంది? వాళ్ళే పుచ్చుకున్నారు. నేరం చేసిన వాళ్ళు ఎలాగైతే శిక్షను అనుభవిస్తారో, అలాగే కర్మలను ఆచరించిన వారు తదనుగుణ మైన ఫలాలను పొందుతారు. చేసిన నేరానికి చట్టబద్ధ మైన శిక్షను ఖైది అనుభవించే టప్పుడు, న్యాయాధిపతి శిక్షించిం దేముంది? శిక్షింపబడ వలసిన వాడే శిక్షింపబడు తున్నాడు. కాకపోతే, పరిమితమైన చట్టాలు, పరిమితమైన జ్ఞానం కలిగిన న్యాయాధిపతి విధించే శిక్ష, కొన్ని సమయాలలో దారి తప్పే ప్రమాదం ఉంది. కాని, సర్వజ్ఞుడు అయిన పరమేశ్వరుడు గాని, ఆయన అమలు పరచే ధర్మం గాని అలా పరిమితాలు కానందున జీవులకు అందే ఫలాలలో అంతరాలు చోటు చేసుకొనే అవకాశమే లేదు. ఈ సత్యాన్ని స్థిర పరుస్తూ, ***అజస్రమ్*** అనే పదాన్ని ప్రయోగించడం జరిగింది. ***అజస్రమ్*** అంటే 'సంతతం' అని అర్థము. పాపకర్మలు చేసే వారిని ఎల్లప్పుడూ పాపయోనుల లోనే పడేస్తాను అని భగవంతుడు అంటున్నాడు. అంటే, ఎంత కాలం పాపం చేస్తారో అంత కాలం వాళ్ళను పాప యోనుల లోనే ఉంచుతాను అని అర్థము. కర్మను బట్టే కర్మఫలము. ఈ విధంగా జీవుల నీచోన్నత ప్రస్థానాలకు పరమేశ్వరుడు కారణంగా తెలుస్తూ ఉన్నాడు.

***ఏష ఉహ్యేవ సాధుకర్మ కారయతి తం య మున్నినీషతే,***
***ఏష ఉ ఏవ అసాధు కర్మ కారయతి య మధో నినీషతే॥***

'పరమేశ్వరుని అనుగ్రహ ప్రసాదమును పొంది ఉన్నతంగా చరింప గోరే వారు సాధు కర్మమును ఆచరిస్తున్నారు. ప్రసాద కారణానికి నోచుకోని వారు అధోగతిని పొందగోరి అసాధు కర్మము నాచరిస్తున్నారు' అని వేదమాత ప్రబోధము.

*ఈ విధంగా నీచ జన్మలలో పడిన అసురీలు ఆ తరువాత ఏమవుతారు? చెబుతున్నాడు.*

**ఆసురీం యోని మాపన్నా మూఢా జన్మని జన్మని ।**
**మా మప్రా ప్యైవ కౌన్తేయ తతో యా న్త్యధమాం గతిమ్ ॥** 20

***ఆసురీం-యోనిం-ఆపన్నాః-మూఢాః-జన్మని-జన్మని***
***మాం-అప్రాప్య-ఏవ-కౌంతేయ-తతః-యాంతి-అధమాం-గతిం***

| | | | | | |
|---|---|---|---|---|---|
| కౌంతేయ | = | అర్జునా! | మాం | = | నన్ను |
| ఆసురీం | = | రాక్షస సంబంధమైన | అప్రాప్య ఏవ | = | పొందకనే |
| యోనిం | = | జన్మము | తతః | = | అంత కంటె |
| ఆపన్నాః | = | పొందిన | అధమాం | = | నీచమైన |
| మూఢాః | = | మూఢులు | గతిం | = | గతిని |
| జన్మని జన్మని | = | ప్రతి జన్మ మందు | యాంతి | = | పొందుతారు |

**అర్జునా! అసుర జన్మమును పొందిన ఈ మూఢులు, ప్రతి జన్మము నందు నన్ను పొందరు సరి కదా, అంత కంటే నీచమైన జన్మల లోకి జారిపోతూ ఉంటారు.**

### వ్యాఖ్య

అసుర మానవులు పాపాల పుట్టలు. దోషాల కట్టలు. మోసాల గుట్టలు. మోహాల బుట్టలు. చేసిన పాపాలే చేయడంలో దిట్టలు. చేసిన పాపాలు, పాప ఫలితాలు మనిషిని ప్రశాంతంగా ఉండ నివ్వవు. చేసిన పాపాలనే పునః పునః చేయిస్తూ ఉంటాయి. రకరకా లైన పాపాలు చేస్తూ ఉంటే రకరకా లైన పాప ఫలితాలు అందుతూ

ఉంటాయి. ఇలా జననమరణాల సుడిలో పడి భేదరూప కర్మఫలాలను అనుభవించడమే సంసారము (*యద్వా సంస్రియన్తే భుజ్యన్త ఇతి సంసారాః*).

ప్రతి జన్మ లోను తమోగుణ ప్రధాను లైన ఈ అసురులు మోహ సాగరంలో పడుతూనే ఉంటారు. వీరిని ప్రస్తుత శ్లోకంలో **మూఢాః**, అంటే అవివేకులు అన్నాడు. అంటే వివేకము లేని వారు (*అవివేకినః*) అని అర్థం. ఏది చెయ్యాలి, ఏది చేయ కూడదు? అనే వివేకము లోపించిన వారు అవివేకులు. వివేకము లేక పోవడం వల్ల ఉన్నతంగా చరించే అవకాశము లేక పోవడము చేత; పూర్వ పాప కార్యాల ఫలంగా ప్రాప్తించిన వాసనల యొక్క ప్రేరణ చేత చేసిన పాపా లనే పునః పునః చేయడము చేత; తమోగుణ ప్రధానులై ఉండటం వల్ల పరమాత్మ కొరకు ప్రయత్నించే అవకాశమే లేక పోవడం చేత (*మాం అప్రాప్య*) : ఈ మూడు కారణాల చేత ప్రతి జన్మ యందు (*జన్మని జన్మని*) అధోగతిని పొందుతూ (*అధః గచ్ఛన్తః*) నికృష్ట జన్మల నుండి నికృష్టతర జన్మలకు, నికృష్టతర జన్మల నుండి నికృష్టతమ మైన జన్మలకు మెల్ల మెల్లగా, పై మెట్టు నుండి జారిన రబ్బరు బంతి లాగా, దిగజారి పతనమై పోతారు. వివేకం లేనందున జీవన విధానంలో మార్పును ఆశించ లేరు. మార్పు లేనందున ప్రగతి సాధ్యం కాదు.

*శ్లో॥ అదత్త దోషేణ భవే ద్దరిద్రం దరిద్ర దోషేణ కరోతి పాపమ్,*
*పాప దవశ్యం నరకం ప్రయాతి పునర్దరిద్రీ పున రేవ పాపీ॥*

పాప యోను లందు పడిన ఈ దురాచారు లైన దుష్టులు, సుడిగుండంలో పడిన క్రిముల లాగా పరిభ్రమిస్తారే గాని బయట పడి తరించే ప్రయత్నం చేయలేరు అంటూ, వారి సమగ్ర చరిత్రను ఈ ఒక్క శ్లోకంలో శాస్త్రం సంక్షిప్తం చేసింది.

సత్కార్యము చేసే సదవకాశం లోపించిన దోషం చేత భౌతికం గాను, భావం లోను దారిద్ర్యం ప్రాప్తిస్తుంది. దరిద్ర దోషం చేత మనిషి పాపాచరణంలో కూరుకు పోతాడు. పాపాలు చేయడం వల్ల తప్పక నరకాన్ని పొందుతాడు. నరకానుభవం తరువాత తిరిగి దరిద్రుడుగా జన్మిస్తాడు. తిరిగి పాపాచరణం ప్రారంభిస్తాడు. ఇది వలయం. విషవలయం. సంసార విషవలయం. ఆసురీ సంపద నాశ్రయించిన వారి సంసార చక్ర భ్రమణం.

*మరి దీనికి తరుణోపాయం ఉందా, లేదా? ఉంటే, అదేమిటి? చెబుతున్నాడు.*

**త్రివిధం నరక స్యేదం ద్వారం నాశన మాత్మనః।**
**కామః క్రోధ స్తథా లోభ స్తస్మా దేత త్త్రయం త్యజేత్॥** 21

*త్రివిధం-నరకస్య-ఇదం-ద్వారం-నాశనం-ఆత్మనః*
*కామః-క్రోధః-తథా-లోభః-తస్మాత్-ఏతత్-త్రయం-త్యజేత్*

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆత్మనః | = | తనకు | క్రోధః | = | క్రోధము |
| నాశనం | = | వినాశ మైనది | తథా | = | అటులనే |
| నరకస్య | = | నరకమునకు | లోభః | = | లోభము |
| ద్వారం | = | ద్వార మైనది | తస్మాత్ | = | అందువలన |
| ఇదం | = | ఇది | ఏతత్ | = | ఈ |
| త్రివిధం | = | మూడు విధములు | త్రయం | = | మూడింటిని |
| కామః | = | కామము | త్యజేత్ | = | విడిచి పెట్టాలి |





**అర్జునా! కామము, క్రోధము, లోభము అనేవి నరకానికి మూడు ద్వారాలు. వినాశాన్ని కలిగించే వీటిని తప్పక త్యజించాలి.**

**వ్యాఖ్య**

అసుర సంపద అనంతంగా కనిపిస్తూ ఉంది. ఇన్ని అసుర లక్షణాలను జయించేది ఎలా? అనంత శాఖలుగా విస్తరించినట్లు అసుర గుణాలు చెప్ప బడ్డాయి. మానవుని ఆయుర్దాయ మేమో అతి స్వల్పము. పైగా అనిశ్చితము. అలాంటప్పుడు ఈ అనంత సంపదను పరిహరించడం సాధ్యమా? అనే శంక ఎవరి కైనా కలుగు తుంది. దానికి పరిష్కారంగా ఆ సముదయ రూపాన్ని సంక్షేపం చేసి సముచితార్థాన్ని ఈ శ్లోకంలో అందిస్తున్నాడు (*సర్వస్యాః ఆసుర్యాః సంపదః సంక్షేపః అయమ్ ఉచ్యతే*). సమస్త అసుర లక్షణా లన్నీ ఈ మూడిటిలో అంతర్గతాలు అంటూ కామక్రోధ లోభాలను సముదితార్థంగా చెబుతున్నాడు.

అసుర సంపదకు సంబంధించిన వాళ్ళు నరకంలో ప్రవేశిస్తారు అని పూర్వ శ్లోకంలో చెప్పుకున్నాం. నరక సౌధంలో ప్రవేశించ డానికి మూడు ద్వారా లున్నాయి. అవే కామ, క్రోధ, లోభములు. అవి ఆత్మ నాశకాలు (*త్రివిధం త్రిప్రకారం నరకస్య ప్రాప్తౌ ఇదం ద్వారం, నాశనమ్ ఆత్మనః*).

ఈ మూడు ద్వారాలు నరకం లోకి అనుమతిస్తాయి. ప్రవేశాన్ని కల్పిస్తాయి. మూడూ వినాశ హేతువులే. వీటిలో పాదం మోపితే బ్రతుకు పాడైనట్లే. ఏ ద్వారంలో కాలు పెట్టినా నరకాగ్నిలో పడి బూడిద కావలసిందే. దుఃఖానుభవాన్ని పొంద వలసిందే. బ్రతుకు బాధల నిలయం కావలసిందే. జీవితము ఇలా నశిస్తూ ఉంది కనుకనే ఆత్మనాశము అంటున్నాడు భగవంతుడు (***యత్ ద్వారం ప్రవిశన్నేవ నశ్యతి ఆత్మా***).

రజోగుణము నుండి పుట్టిన కామక్రోధాలు మనిషికి ప్రబల శత్రువు లని మూడవ అధ్యాయం కర్మ యోగం లోనే భగవంతుడు హెచ్చరించాడు (*3 వ అ - 37 వ శ్లో*). అసుర మానవులు కామక్రోధాలను ఆశ్రయించుకొని ఉంటారు కనుక, వారు కామక్రోధ పరాయణు లని ప్రస్తుత అధ్యాయం లోనే జ్ఞాపకం చేశాడు (*16 వ అ - 12 వ శ్లో*). కాకపోతే, ఇక్కడ కామక్రోధాలకు లోభాన్ని జత చేశాడు. అంతే. ఆ రెండు ఉంటే మూడవది ఉండి తీరుతుంది. అందుకే అక్కడ ప్రత్యేకించి చెప్ప లేదు. ఉగ్రవాదులు రహస్య స్థావరా లను ఏర్పరచుకొని భయంకరమైన దాడులను ఎలా నిర్వహిస్తారో, అలాగే ఉగ్ర కర్మలను పురికొల్పే కామ క్రోధాలు కూడా మనస్సుపై ఆగంతుక దాడులను నిర్వహించి ఆత్మహానిని కలిగిస్తాయి.

అనంతంగా గోచరిస్తున్న అసుర లక్షణాలను సంక్షేపించి కామక్రోధ లోభాలుగా చెబుతున్నాడు.

**కామక్రోధ లోభాలు**

కామక్రోధ లోభాలు మూడూ నరక ద్వారాలు. ఈ మూడు ద్వారాలలో క్రోధం మధ్య ద్వారంగా ఉంది అనేది గమనించ దగిన విషయం. ఇది దేహలీ దీప న్యాయ పరిధిలో ఉంది. క్రోధం ఇటు కామానికి తోడై ఉంటుంది. అటు లోభానికి తోడై ఉంటుంది. అందుకనే, అనుకూలంగా మధ్యలో చేరి పోయింది.

నాకు అది కావాలి అనే ఇచ్ఛ కామం. కామం విజృంభించి నపుడు మనిషికి రెండవ ఆలోచన ఉండదు. కళ్ళున్నా మనిషి గ్రుడ్డి వాడు అయ్యేది కామం ఆవరించి నపుడే. కామ వాంఛ తీరనపుడు, అలా తీరక పోవడానికి ప్రతిబంధకాలను సృష్టించిన వారిపై కలిగేది ఏదో అదే క్రోధము.

కామం ద్వారా సాధించింది ఏదైనా ఇష్టపడి సాధించు కున్నదే. కనుక దానిని వదులు కోవడానికి మనస్సు అంగీకరించదు. ఒకవేళ ఏ కారణం చేత నైనా అది బలవంతంగా దూరం చేయ బడుతూ ఉంటే, దానికి కారణమైన వారిపై క్రోధం తీవ్ర రూపాన్ని దాల్చుతుంది.

అది నాకు కావాలి అనే ఇచ్ఛ కామం. అలా ఆశించింది రాకపోతే కలిగేది క్రోధం. ఒకవేళ ఆశించింది వస్తే అది నాకే ఉండాలి. నా నుండి దూరం కాకూడదు అనేది లోభం. అలా నాకే ఉండాలి అనుకున్నది పోయినా, లేదా పోతూ ఉన్నా కలిగేది క్రోధం. కామలోభాలు అసంతృప్తికి లోనైనపుడు వాటిని ఉపశమింప చేసే కార్యక్రమంలో ఉద్యమించేది క్రోధం. అగ్ని స్వరూపము. నిప్పు లేకుండానే తగల బెడుతుంది.

ఈ మూడిటిని విశ్లేషించి, విచారించి అర్థం చెప్పుకుంటే, మళ్ళీ వీటిని సంక్షిప్తం చేసి ఒక్కటి చెయ్యొచ్చు. అదే కామము. క్రోధ లోభాలు రెండూ కామాన్నే ఆశ్రయించి ఉంటాయి. కామాన్ని నిగ్రహిస్తే క్రోధం పడగ విప్పదు. లోభం కాటు వేయదు. కామించింది వికటిస్తేనే కదా క్రోధం వికృత రూపాన్ని దాల్చేది! కామం కుప్ప పోస్తేనే కదా లోభం కాపలా కాసేది! కనుక, కామం ఒక్కటి ఉద్యోగాన్ని విరమిస్తే చాలు, క్రోధం ఉద్యమాన్ని విరమిస్తుంది. లోభం ఉదాసీనంగా పడి ఉంటుంది. కనుక కామ జయమే ప్రధానము. దీనిని ఒక్క దానిని జయిస్తే మూడిటిని జయించిన వాళ్ళే అవుతారు.

**కామ జయము**

కామాన్ని జయించడం అనుకున్నంత సులభ సాధ్యం కాదు. దానిని తీసి దూరంగా పడేయడానికి అది మన కన్నా వేరుగా లేదు. అదే మనం అన్నంతగా పెనవేసుకొని ఉంది. పరిశీలించి చూస్తే, మనస్సులో అదొక్కటే ఉంది. ఎలా ఉంది అంటే, మనస్సు రూపం లోనే ఉంది. మనస్సుతో మనస్సును లేకుండా చేసుకో గలమా? కామం కూడా అంతే. మనస్సే కామంగా, కామమే మనస్సుగా మారి పోయిన దశలో కామాన్ని మనస్సు జయించడం అనే దానిని ఎలా ఊహించ గలం? మరి, కామాన్ని జయించ లేనపుడు, కామ పూరితమైన చిత్తము పరమాత్మ వైపుకు ఎలా సాగుతుంది?

> **శ్లో॥** *యజ్జీవతో నైవ మనోరథానా మన్తోఽస్తి విజ్ఞాత మిదం మాయాఽద్య ।*
> *మనోరథాసక్తి పరస్య చిత్తం న జాయతే వై పరమార్థ సజ్గీ ॥*

'బ్రతికి ఉన్నంత వరకు కోరికలు మనిషిని విడిచి పెట్టవని నా కిప్పుడు బాగా తెలిసి వచ్చింది. ఎవరి మనస్సు కోరికలలో కూరుకు పోయిందో, వారి మనస్సుకు పరమార్థ విషయము నందు ఆసక్తి కలగదు. ఏం చెయ్యాలి?' అంటూ దిక్కు తోచని స్థితిని విష్ణుపురాణం - సౌభర్యాఖ్యానము ఆవిష్కరించింది. ఈ ఆవిష్కరణలు ఆవేదన చెందడానికి కాదు. నిరాశా నిస్పృహలలో నిశ్చేష్టులు కావడానికీ కాదు. అనర్థాన్ని గుర్తించి, దాని నుండి బయటపడే మార్గాన్ని అన్వేషించ డానికి. కామ జయానికి ప్రయత్నించ డానికి.

కామాన్ని 'ప్రథమ మల్ల నిబర్హణ న్యాయ' పరిధిలో జయించాలి. అంటే, మల్ల యుద్ధములో ఎవడు అగ్రస్థానంలో ఉన్నాడో, ప్రథమ శ్రేణిలో గుర్తింపు పొందాడో, వాణ్ణి జయిస్తే, దేశంలో ఉన్న యోధు లందరినీ జయించి నట్లే. దీనినే 'ప్రథమ మల్ల నిబర్హణ న్యాయము' లేదా 'ప్రధాన మల్ల నిబర్హణ న్యాయము' అంటారు. త్రివిధ నరక ద్వారా లైన కామక్రోధ లోభాలలో అగ్రస్థానం కామానిదే కనుక, కామాన్ని జయిస్తే మూడిటిని జయించినట్లే. నరక ద్వారాలను మూసేసి నట్లే.

కామం అసుర మానవులలో ఉంది. అంటే, దైవ మానవులలో కామం లేదా? వాళ్ళల్లో కూడా ఉంది. కాకపోతే, అసుర జనుల లోని కామం బంధ హేతువు అవుతూ ఉంది. దైవ జనుల లోని కామం మోక్ష హేతువు అవుతూ ఉంది. కారణాన్ని పరిశీలిస్తే, అసుర సంపదలో కామం ధర్మానికి విరుద్ధంగా ఉంది. దైవ సంపదలో కామం ధర్మానికి అవిరుద్ధంగా ఉంది. ఈ కారణం చేత కామం ఒకరికి బంధహేతువు. మరొకరికి మోక్ష హేతువు. ***ధర్మాఽ విరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ!*** - 'అర్జునా! ధర్మానికి విరుద్ధం కాని కామము





నేనే అని తెలుసుకో!' అన్నాడు గీతాచార్యుడు (*7వ అ - 11 వ శ్లో*). సర్వ అనర్థాలకు కారణమైన, సర్వ బంధహేతు వైన కామాన్ని అవగాహనతో త్యజించాలి. అది ఊహించి నంత సులభమైన కార్యం కాదు. కాని, పవిత్రమైన ప్రయత్నాలు తప్పకుండా ఫలిస్తాయి. కాకపోతే, సమయం కొంత ఎక్కువ పట్ట వచ్చు. బహు కాల వాసనలు కదా! బహుకాల ప్రయత్నాల తోనే వశిస్తాయి. అంతేకాని, వశించక పోవడ మనేది ఉండదు. ఈ విషయంలో మన ప్రయత్నాలు విచార రూపంలో, ఆచార రూపంలో దృఢంగా సాగాలి. పరమేశ్వరుని అనుగ్రహం తోడు కావాలి. కనుక, భగవంతుని దయను పొందడానికి అలౌకిక కర్మలైన పూజ, జప, ధ్యాన, స్వాధ్యాయాలను ప్రారంభించాలి. సూర్యునికి అభిముఖంగా పయనించే వారి నీడ ముందుకు రాలేదు. వెనుక బడి పోతుంది. ఆదిత్యునికి అభిముఖంగా పయనించి ఛాయను వెనుక పడేసినట్లు, పరమేశ్వరుని ముందు పెట్టుకొని మాయను, మాయామయ మైన గుణాలు సృష్టించిన కామాదులను వెనుకకు నెట్టేయాలి. మన కృషి భగవత్కృప రెండూ కలిస్తే కామక్రోధ లోభాలు అదృశ్య మవుతాయి. మోక్ష మార్గము సుస్పష్ట మవుతుంది.

*రోగాలతో దేహము నిండిపోయె*
*భోగాలతో మనసు మండిపోయె*
*యోగ మెపుడు యోగ్యు డగుట ఎపుడు?*
*నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా!*

అని నీలకంఠ శతకంలో ఒక విబూది పండు.

భగవ త్ప్రార్థన నిత్యమూ సాగేటట్లు చూసుకోవాలి. కామక్రోధ లోభాలు బ్రతుకును ఎలా కృంగ దీస్తాయో నిరంతరము చింతన చెయ్యాలి. అవి ఎలా అనర్థ దాయకమో ఆలోచిస్తూ ఉండాలి. మెల్లమెల్లగా పూజ, ప్రార్థన, ముఖ్యంగా భగవన్నామ సంకీర్తనము మొదలైన పవిత్ర సాధనలను క్రమం తప్పకుండా ఆచరిస్తూ ఉండాలి. దుర్జన సాంగత్యాన్ని లేకుండా చేసుకోవాలి. సత్పురుష సాంగత్యాన్ని పవిత్రంగా కొనసాగించాలి. ఒక దశలో అనూహ్యమైన పరిణామాన్ని, అద్భుతమైన మార్పును మన జీవితాలలో మనం చూడ వచ్చు. కామం కరిగి పోతూ ఉంటే, ధర్మజ్యోతి దేదీప్యమాన మవుతూ ఉంటుంది. ఒక దశలో కామక్రోధ లోభాలు మనకు తెలియకుండానే మనకు దూరమై పోతాయి. ఆ క్షణంలో మనం మోక్ష మార్గంలో ప్రధాన రహదారిపై ఉంటాము. ఈ విధంగా అనర్థ దాయకాలు, బంధ హేతువులు, అజ్ఞాన రూపాలు అయిన కామక్రోధ లోభాలను పరిత్యజించాలి (***కామాది త్రయం ఏతత్ త్యజేత్***).

*కామాది త్రయాన్ని పరిత్యజించడం అనే పవిత్ర ఆశయాన్ని స్తుతిస్తున్నాడు* (***త్యాగ స్తుతి రియమ్***).

ఏతై ర్విముక్తః కౌన్తేయ తమోద్వారై స్త్రిభి ర్నరః ।
ఆచర త్యాత్మనః శ్రేయ స్తతో యాతి పరాం గతిమ్ ॥ 22

*ఏతైః-విముక్తః-కౌంతేయ-తమోద్వారైః-త్రిభిః-నరః*
*ఆచరతి-ఆత్మనః-శ్రేయః-తతః-యాతి-పరాం-గతిం*

| | | | | | |
|---|---|---|---|---|---|
| కౌంతేయ | = | అర్జునా! | విముక్తః | = | విడువబడిన |
| తమోద్వారైః | = | అజ్ఞాన ద్వారములైన | నరః | = | నరుడు |
| ఏతైః | = | ఈ | ఆత్మనః | = | తనకు |
| త్రిభిః | = | మూడింటి చేతను | శ్రేయః | = | శ్రేయస్సు |

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆచరతి | = | కలిగించు కుంటున్నాడు | గతిం | = | మోక్షమును |
| తతః | = | అందువల్ల | యాతి | = | పొందుతున్నాడు |
| పరాం | = | పరమమైన | | | |

**అర్జునా! కామక్రోధ లోభాలు అజ్ఞాన ద్వారాలు. వాటి నుండి విడి పడిన వాడు శ్రేయస్సును అందుకుంటాడు. అందువల్ల, ఉత్తమ గతి అయిన మోక్షాన్ని పొందుతాడు.**

### వ్యాఖ్య

కామక్రోధ లోభాలు నరక ద్వారాలు. తమో ద్వారాలు. తమస్సు అంటే చీకటి. అజ్ఞానము. తమస్సు లోకి ప్రవేశించాలన్నా ఇవే ద్వారాలు. తమస్సు నుండి బయట పడాలన్నా ఇవే ద్వారాలు. పాపకార్యాలు చేసి కొందరు ఈ చీకట్ల లోకి ప్రవేశిస్తూ ఉంటే, ఇప్పటికే ప్రవేశించి ఉన్న వారు ఈ అజ్ఞాన చీకట్ల నుండి ఎలా బయట పడాలో తెలియక పరితపిస్తున్నారు.

**చీకటి ముసిరిన చింతల నడుమ**
**ఆడిన ఆటలు చాలవా?**
**మృత్యు పాశము వెంట నున్నది**
**సత్య మార్గమును గన లేవా?**
**తెర పడిందా తనువే లేదు**
**మర్మము నెరిగి సాగిపో**
**రామ రామ జయ రాజారామ్**
**రామ రామ జయ సీతారామ్**

అని రామజోగి చిట్కా *(39)*.

కామక్రోధ లోభాలనే నరక ద్వారాల లోకి ప్రవేశిస్తే ఆత్మకు విఘాతం కలుగుతుంది అన్నాడు ***(ఆత్మనః నాశనం)***. కామక్రోధ లోభాలనే నరక ద్వారాల నుండి బయట పడితే ఆత్మ శ్రేయస్సును పొందడం జరుగుతుంది అని ప్రస్తుత శ్లోకంలో చెబుతున్నాడు ***(ఆత్మనః శ్రేయః)***. శ్రేయో మార్గములో చరించడానికి పూర్వం ఏవి ప్రతిబంధకాలుగా ఉన్నవో, వాటి నుండి నరుడు ***(నరః)*** విముక్తుడు కావడం చేత, పూర్వం ఆచరించ లేని వాటిని ఇక ఆచరిస్తాడు అని అర్థము. అలా ఆచరించడం వల్ల ఉత్తమ గతిని, అంటే మోక్షమును పొందుతాడు ***( తదాచరణాత్ యాతి పరాంగతిమ్ మోక్షం అపి ఇతి )***. ముక్తుడు అనకుండా 'వి'ముక్తుడు అనడం చేత, కామాది త్రయమే కాకుండా, వాటికి కారణమైన అజ్ఞానము నుండి కూడా విముక్తు డౌతాడని అర్థము.

ప్రస్తుత శ్లోకంలో నరక ద్వారా లైన కామక్రోధలోభాల నుండి విముక్తుడై, నరుడు శ్రేయస్సును పొందు తాడు అంటూ నరుడు ***(నరః)*** అనే పదాన్ని ఉపయోగించడము వెనుక గీతాచార్యుని భావం సాగర మంత అగాధం గాను, గంభీరం గాను ఉంది.

***నరః*** అంటే నరుడు. ***నరీయతే ఇతి నరః*** - ఎవడైతే నశించడో వాడే నరుడు. నశించడు అంటే అనంతుడు అని అర్థము. మరి, జీవుడైన నరుడు అనంతు డైతే, దేవుడు ఎవరు? అతడూ అనంతుడే. మరి రెండు అనంతాలు ఉంటాయా? ఉండవు. ఉండ లేవు. జీవుడూ అనంతుడే. దేవుడూ అనంతుడే. అనంతము ఏకము, అద్వితీయము. కనుక జీవుడే దేవుడు. దేవుడే జీవుడు. జీవుడు అనంతుడు కనుక నరుడు ***(నరః)***.





దేవుడు కూడా అనంతుడు కనుక అతడూ నరుడే ***(నరః)***. ఇద్దరూ నరులే. కాదు నరుడే. ఇద్దరూ నారాయణులే. కాదు నారాయణుడే. విష్ణుసహస్రనామంలో భగవంతుడికి నరుడు ***(నరః)*** అనే నామం కూడా ఉంది *(246)*.

***నయతీతి నరః ప్రోక్తః పరమాత్మా సనాతనః ఇతి వ్యాస వచనాత్*** - జీవులను నడిపించే వాడు కనుక భగవంతుడు నరుడు. సనాతనుడైన నారాయణుడే నరుడు అని వ్యాస ప్రోక్తము అని భాష్యంలో ఆచార్యుల వారు ఉటంకించారు.

నరుడు నారాయణుడే కనుక, తనను తాను పొందడము కష్ట మేమీ కాదు. వస్తువు ఉన్నదే. ఉన్న దానిని తెలుసుకోవడం కష్టమా? కాకపోతే ప్రమాణం కావాలి. అంతే. ప్రమాణం లభించిన వారికి మోక్షము కరతలా మలకము. ప్రమాణ వ్యతిరేకులకు మోక్షము అంద నంత దూరము. విషయం అర్థమైతే మోక్ష మంత సులభము మరొకటి లేదు. కారణం, అది నీ స్వరూపమే కనుక.

***శ్లో॥ ఆయాస స్తావత్ అత్యల్పః ఫలం ముక్తి రిహైవ తు***
***తథాఽ పి పరమా ద్వైతం నైవ వాంఛంతి మానవాః***

శ్రమ చాలా అల్పము. ఇక ఫలమా? ఇక్కడే, ఇప్పుడే అందుతుంది. అయినా మానవులు అద్వయ స్వరూప మైన మోక్షాన్ని ఎందుకనో కోరుకోరు!

*అసుర సంపదను త్యజించాలన్నా, శ్రేయస్సును పొందాలన్నా, శాస్త్రాన్ని అనుసరిస్తేనే సాధ్య పడుతుంది. మరో విధంగా సాధ్య పడదు. శాస్త్రమే ప్రమాణం కనుక, శాస్త్ర విధిని గ్రహించి బ్రతుకు విధానాన్ని సరి చేసుకోమని ప్రబోధిస్తూ అధ్యాయాన్ని సమాప్తం చేస్తున్నాడు.*

**య శ్శాస్త్రవిధి ముత్సృజ్య వర్తతే కామకారతః ।**
**న స సిద్ధి మవాప్నోతి న సుఖం న పరాం గతిమ్ ॥** 23

***యః-శాస్త్రవిధిం-ఉత్సృజ్య-వర్తతే-కామకారతః***
***న-సః-సిద్ధిం-అవాప్నోతి-న-సుఖం-న-పరాం-గతిం***

| | | | | | |
|---|---|---|---|---|---|
| యః | = | ఎవడు | న అవాప్నోతి | = | పొందడు |
| శాస్త్రవిధిం | = | శాస్త్రవిధిని | సుఖం | = | సుఖము |
| ఉత్సృజ్య | = | విడిచి | న | = | పొందడు |
| కామకారతః | = | తన ఇష్టానుసారము | పరాం | = | ఉత్తమమైన |
| వర్తతే | = | ప్రవర్తిస్తున్నాడో | గతిం | = | మోక్షము |
| సః | = | వాడు | న | = | పొందడు |
| సిద్ధిం | = | సిద్ధిని | | | |

**అర్జునా! శాస్త్ర ప్రమాణాన్ని విడిచి ఇష్టానుసారం ప్రవర్తించే వాడు సిద్ధిని పొందడు. సుఖాన్ని పొందడు. మోక్షాన్ని పొంద లేడు.**

**తస్మా చ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్య వ్యవస్థితౌ ।**
**జ్ఞాత్వా శాస్త్ర విధానోక్తం కర్మ కర్తు మిహార్హసి ॥** 24

**తస్మాత్-శాస్త్రం-ప్రమాణం-తే-కార్యాకార్య వ్యవస్థితౌ**
**జ్ఞాత్వా-శాస్త్రవిధానోక్తం-కర్మ-కర్తుం-ఇహ-అర్హసి**

| | | | |
|---|---|---|---|
| తస్మాత్ | = అందువలన | కర్మ | = కర్మను |
| తే | = నీకు | జ్ఞాత్వా | = తెలుసుకొని |
| కార్యాకార్యవ్యవస్థితౌ | = కార్యాకార్య నిర్ణయము నందు | ఇహ | = ఇక్కడ |
| శాస్త్రం | = శాస్త్రము | కర్తుం | = చేయుటకు |
| ప్రమాణం | = ప్రమాణము | అర్హసి | = తగుదువు |
| శాస్త్రవిధానోక్తం | = శాస్త్రము చెప్పిన విధంగా | | |

**అర్జునా! ఏ కార్యం యుక్తం, ఏ కార్యం అయుక్తం అనే విషయంలో నీకు శాస్త్రమే ప్రమాణము. శాస్త్ర విధి ననుసరించి ఇక్కడ నువ్వు కార్యాలను ఆచరించ వచ్చు.**

### వ్యాఖ్య

ఆత్మ హానిని ***(నాశనం ఆత్మనః)*** కలిగించే నరక ద్వారాలు కామక్రోధ లోభాలు. పతన హేతువు లైన ఈ మూడిటిని త్యజించాలి. నిజమే. మరి, ఈ మూడు ఎక్క డున్నాయి? మన లోనే ఉన్నాయి. మన స్వభావంలో భాగమై ఉన్నాయి. మనం ఇష్ట పడ బట్టే కదా అవి మన స్వభావంగా మారి పోయాయి! అలాంటి వాటిని త్యజించడం సాధ్యమా? త్యజించడము సాధ్యమయ్యే టట్లైతే, ఇంత కాలం ఎందుకని త్యజించ లేక పోయాము? మనకు మనంగా త్యజించ లేక పోవడానికి కారణం ఒక్కటే. ఎలా త్యజించాలో తెలియక పోవడము. జ్ఞానం లేక పోవడము. జ్ఞానం లేని కారణంగా అసుర సంపదను విడిచిపెట్ట లేకపోయిన మనం, జ్ఞానం కలిగితే త్యజించ గలం. మరి, ఆ జ్ఞానం ఎలా ప్రాప్తిస్తుంది? శాస్త్రం ద్వారా ప్రాప్తిస్తుంది. కనుక, అసుర సంపదను త్యాగం చేయా లంటే శాస్త్రమే కారణమై ఉంది.

అలాగే శ్రేయస్సును పొందాలంటే ***(ఆత్మనః శ్రేయః)*** కూడా శాస్త్రాన్నే అనుసరించాలి. ఏది శ్రేయస్సో, ఏది కాదో మనకే తెలిసే అవకాశం లేదు. అలా మనకే తెలిసే అవకాశం ఉంటే, ఇంత కాలం శ్రేయో మార్గాన్ని ఎందుకని అనుసరించలేక పోయాము? దారి తప్పిన వ్యక్తిని దారి తెలిసిన వాడు దారిలో పెట్టగలడు గాని, దారి తప్పిన వాడే దారిలో ఎలా పడగలడు? అలా పడటానికి ప్రమాణ మేమిటి? కనుక, అసుర సంపదను విడిచి పెట్టి ఆత్మ వినాశాన్ని తొలగించుకోవా లనుకున్నా, దైవ సంపదను ఆశ్రయించి, ఆత్మ శ్రేయస్సును పొందా లనుకున్నా శాస్త్రమే హేతువుగా ఉంది. శాస్త్ర ప్రమాణంతో ఈ రెండిటిని సాధించ వచ్చు. మరో విధంగా అవకాశం లేదు ***(శాస్త్ర ప్రమాణాత్ ఉభయం కర్తుం శక్యం, న అన్యథా)***.

ధర్మాన్ని ఆచరించా లంటే ధర్మం తెలిసి ఉండాలి. ఏది ధర్మం? ఎవరి ధర్మం వారిదే నని ఈ రోజుల్లో మాట్లాడుతూ ఉన్నారు. ఎవరి ధర్మం వారిదే కనుక, ఎవరి ఇష్టానుసారం వారు స్వేచ్ఛా విహారం చెయ్యవచ్చు అని అర్థము. అలా గతంలో చేయబట్టే కదా అనర్థాలను కొని తెచ్చుకున్నాం. మళ్ళీ అదే స్వేచ్ఛా ప్రవర్తనమా? ఇలా ఎందుకని మాట్లాడుతాడో తెలుసా? జ్ఞానం లేక పోవడం చేత. ఎవరి ధర్మం వారిది అని ఎందుకంటున్నా డంటే, ధర్మ మంటే ఏమిటో తెలియక పోవడం చేత. ఇష్టాయిష్టాలకు, ధర్మాధర్మాలకు తేడా తెలియక పోవడం చేత. ఈ కారణంగా ఎవరి ఇష్టం వారిది అనడానికి బదులు, ఎవరి ధర్మం వారిది అంటున్నాడు. ఇష్టాయిష్టాలకు శాస్త్రం అవసరం లేదు. ధర్మాధర్మాల విషయంలో శాస్త్రమే ప్రమాణం.





### శాస్త్ర హేతుత్వాత్ ధర్మాధర్మ విజ్ఞానస్య

ఏది ధర్మమో, ఏది అధర్మమో, ఏవి సత్కర్మలో, ఏవి దుష్కర్మలో తెలియా లంటే వేద శాస్త్రమే ప్రమాణము అని శ్రీ శంకరాచార్యస్వామి బ్రహ్మసూత్ర భాష్యంలో విస్పష్టం చేశారు *(బ్రహ్మసూత్రములు ; 3 - 1 - 15 )*.

ఏవి సత్కర్మలు? వాటిని ఎలా ఆచరించాలి? ఏవి దుష్కర్మలు? వాటిని ఎలా త్యజించాలి? ఏవి ప్రగతి హేతువులు? ఏవి పతన కారణాలు? వీటన్నిటికీ సమాధానాలు బుద్ధి నుండి పుట్టవు. శాస్త్రం లోనే అగుపిస్తాయి. ఏది భోజ్యమో, ఏది త్యాజ్యమో శాస్త్రమే చెప్పాలి. అలాంటప్పుడు ఎవడైతే శాస్త్రాన్ని విడిచి పెట్టి ***(యః శాస్త్ర విధిం ఉత్సృజ్య)*** కామ ప్రేరణం చేత స్వేచ్ఛాచరణం సాగిస్తాడో ***(వర్తతే కామ కారతః)***. అట్టి వాడు సిద్ధిని పొందడు ***(నస సిద్ధిం అవాప్నోతి)***. సుఖమును పొందడు ***(న సుఖం అవాప్నోతి)***. మోక్షమునూ పొందడు ***(న పరాంగతిం అవాప్నోతి)***.

శాస్త్రవిధి అంటే విధి నిషేధాల యందు జ్ఞానము అని అర్థము. ఏది కర్తవ్యము? ఏది అకర్తవ్యము అనే జ్ఞానము ***(కర్తవ్యా కర్తవ్య జ్ఞాన కారణం)***. దేనిని ఆచరించాలి, దేనిని ఆచరించ కూడదు అనే విధి నిషేధాలకు సంబంధించిన జ్ఞానము ***(విధి ప్రతిషేధాఖ్యమ్)***.

ఈ జ్ఞానము వ్యక్తి తనకు తానుగా పొందే అవకాశం లేనందున, శాస్త్రమే కారణమైంది. అలాంటి శాస్త్రాన్ని విడిచిపెట్టి ***(ఉత్సృజ్య త్యక్త్వా)***, కామ ప్రేరణతో వర్తించేవాడు ***(వర్తతే కామ కారతః కామ ప్రయుక్తః)*** పురుషార్థ సిద్ధికి యోగ్యత్వాన్ని పొంద లేడు ***(న సః సిద్ధిం పురుషార్థ యోగ్యతామ్ అవాప్నోతి)***. పురుషార్థం విషయంలో యోగ్యత లేని వాడు శ్రేయస్సును ఎలా సాధిస్తాడు?

రోగం ఉందని రోగి ఏది తింటే అది ఔషధ మౌతుందా? ఏదంటే అది ఆరగించి, కొని తెచ్చుకున్న రోగాన్ని, ఏదంటే అది తిని పోగొట్టుకునే అవకాశం ఉందా? రోగి తనకు తానుగా రోగాన్ని పోగొట్టుకో లేడు కనుక, వైద్య విధి ననుసరించి వర్తించాలి. అంటే, వైద్యుడు చెప్పినట్లు వినాలి. ఎందుకని? వైద్యుడికి వైద్యశాస్త్ర జ్ఞానం ఉంది కనుక. శాస్త్ర జ్ఞానమే రక్షిస్తుంది. వ్యక్తిగతంగా అశాస్త్రీయ విధానాలను అవలంబిస్తే హాని కలుగుతుంది ***(నాశనం ఆత్మనః)***.

తనకు తోచిందే న్యాయం, తాను మెచ్చిందే ధర్మం అనుకొని దుర్యోధనుడు వినాశాన్ని కొనితెచ్చు కున్నాడు. మనస్సు చెప్పినట్లు కాకుండా శాస్త్ర మార్గాన చరించి పాండవులు ప్రాతఃస్మరణీయు లయ్యారు. మనకు జ్ఞానాన్ని ప్రసాదించి మన ఉన్నతిని కాంక్షించే శాస్త్రాన్ని ఎట్టి పరిస్థితుల లోను త్యజించ కూడదు. అతిక్రమించ కూడదు. అతిక్రమిస్తే ఏమవుతుంది? అతిక్రమించ డానికి క్షణం చాలు. దాని దుర్భర ఫలితాన్ని అనుభవించ డానికి ఒక్క సంవత్సరం పట్టింది.

లక్ష్మణ రేఖ ఉందా, లేదా? అనే చర్చ ఇక్కడ అప్రస్తుతం. అదలా ఉంచి వాస్తవాన్ని గ్రహించండి. 'వదినా! నువ్వు శాసించినట్లు అన్న కొరకు నేను వెళ్తున్నా. నువ్వు జాగ్రత్తగా ఉండు. ఈ గీత దాటకు' అని చెప్పి లక్ష్మణుడు రాముని అన్వేషిస్తూ పోతే, ఆప్తవాక్యాన్ని అతిక్రమించి గీతను దాటడం వల్లే కదా సీతమ్మ ఆపదల పాలైంది! లంకలో ఒక వార్షికం విషాదాన్ని అనుభవించ వలసి వచ్చింది! శాస్త్రాలు అనుసరించడాని కున్నాయే గాని అతిక్రమించ డానికి కాదు.

మతి చెప్పినట్లు విని దుర్గతిని కొని తెచ్చుకున్నాం. శ్రుతి చెప్పినట్లు ఆచరించి సద్గతి కొరకు ప్రయత్నించాలి. మతి మాయలో పడేస్తుంది. శ్రుతి మహిమలో ఊరేగిస్తుంది. చీకటిలో నడచి పోయే వాడి చేతిలో దీపం ఉండాలి. అజ్ఞాన చీకటిలో చరించే మానవుని చిత్తంలో శాస్త్ర దీపం వెలుగుతూ ఉండాలి.

**మతి గల వాడే మానవుడు**
**మతి పతి యైతే వానరుడు**
**అంతా మతి యైతే శ్రుతి ఎందుకు?**
**శ్రుతి ఉంటేనే యతి ముందుకు**
**మాయలే మతికి రాస్తాలు**
**మహిమలు శ్రుతికి నేస్తాలు**
**రామ రామ జయ రాజారామ్**
**రామ రామ జయ సీతారామ్**

అని రామజోగి చిట్కా.

***వేదాః స్థానాని విద్యానాం*** - వేదాలు విద్యాస్థానాలు, జ్ఞాన నిలయాలు అన్నది యాజ్ఞవల్క్య స్మృతి. కర్తవ్య మేమిటి, అకర్తవ్య మేమిటి అనే విషయంలో శాస్త్రమే మనకు ప్రమాణము. వివిధ పురుషార్థాలను ఎలా సాధించు కోవాలో, ఆ మార్గా లన్నిటినీ సుబోధకం చేస్తుంది శాస్త్రం ***( పురుషార్థోపదేశత్వాత్ శ్రుతీనామ్ )*** అన్నారు తైత్తిరీయోపనిష ద్భాష్యంలో శ్రీ శంకరాచార్యస్వామి.

అందుచేత శాస్త్రవిధిని అనుసరించి, కర్తవ్యాన్ని ఆచరిస్తూ పోవాలి ***( జ్ఞాత్వా శాస్త్ర విధానోక్తం )***. విధి అంటే విధానము. శాస్త్రం చేత చెప్పబడింది శాస్త్రవిధి లేదా శాస్త్ర విధానము ***( విధిః విధానమ్, శాస్త్రేణ విధానమ్ శాస్త్ర విధానమ్ )***. దేవతలకు సైతము లభ్యం కాని కర్మాధికారం మానవులకే ఉంది. ఈ సత్యాన్ని స్పష్టం చేయడానికే ***ఇహ*** పద ప్రయోగము ***( ఇహ ఇతి కర్మాధికార భూమి ప్రదర్శనార్థమ్ )***. భూలోకం లోనే కర్మాధి కారం ఉంది కనుక, శాస్త్రోక్త విధి ననుసరించి, కర్తవ్యాన్ని నిర్వహించి, శ్రేయస్సును పొందమని ఉపదేశిస్తూ దైవాసుర సంపద్విభాగ యోగాన్ని భగవంతుడు సమాప్తం చేశాడు.

**ఓం తత్ సత్**

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే
దైవాసుర సంపద్విభాగయోగో నామ షోడశోఽధ్యాయః

**ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు దైవాసుర సంపద్విభాగ యోగ మనే పదహారవ అధ్యాయము.**



# చైతన్య భగవద్గీత

## అథ సప్తదశోఽధ్యాయః - పదిహేడవ అధ్యాయము

## శ్రద్ధాత్రయ విభాగ యోగః - శ్రద్ధాత్రయ విభాగ యోగము

**ప్రమాణ విషయం**

ఎవరు దేనిని పొందా లనుకున్నా, దానికి సంబంధించిన జ్ఞానం వారికి ఉండాలి. ఉంటుంది. అప్పుడే దానిని పొంద గలరు.

వారు పొందాలి అనుకున్న దొకటి ఉండి, దానికి సంబంధించిన జ్ఞానము వారికి లేనపుడు, సాధారణంగా స్నేహితుడో, బంధువో లేదా మరొకరో చెప్పే ఆప్తవాక్యము మీద విశ్వాస ముంచి, వస్తు ప్రాప్తికి యత్నిస్తూ ఉంటారు. లోకంలో వ్యవహారా లన్నీ ఇలాగే ఉంటాయి.

స్వబుద్ధికి జ్ఞానం లేక పోవడం వల్లనే కదా, పరబుద్ధిని ఆశ్రయించడం జరిగింది? తన జ్ఞానం మీద తనకే విశ్వాసం లేక పోవడం చేత పరులను విశ్వసించడం జరిగింది. వారి మీద కూడా విశ్వాసం లేనట్లైతే, వస్తు ప్రాప్తికి ప్రయత్నం చేయలేడు కదా! ***( లోకేఽపి ఆప్తవాక్యే విశ్వాస అభావే, నైవ తదనుసారేణ ప్రవర్తతే పురుషః )***. లోకంలో ఏ కార్య ప్రాప్తి కైనా, తన జ్ఞానం మీద గాని, లేదా పరుల జ్ఞానం మీద గాని ఆధారపడే ప్రయత్నాలు సాగుతూ ఉంటాయి. కాని, ఈ రెండు ఆధారాలూ కొన్ని సమయాలలో ఆదా చేయడానికి ఉపకరించక పోవచ్చు. అలాంటి పరిస్థితులలో వారి మాటలు, ఊహలు ప్రశ్నార్థకంగా, సంశయాత్మకంగా, పరిశీలనాత్మకంగా విన పడుతూ ఉంటాయి.

'నాకు తెలియక అలా చేసేశాను. అలా చేయకుండా ఉంటే బాగుండేది' - ఈ మాటల వెనుక స్వబుద్ధి అజ్ఞానాన్ని ప్రత్యక్షంగా అంగీకరించడమే జరుగుతూ ఉంది.

'అతనికి అనుభవ ముందని విశ్వసించాను. వాళ్ళకు బాగా తెలుసని అభిప్రాయ పడ్డాను. పాపం! వాళ్ళ తప్పు కూడా లేదు. వాళ్ళకు తోచింది వాళ్ళు చెప్పారు. తెలియనిది ఎవరైనా ఎలా చెబుతారు? నాకే ప్రాప్తం లేదు' - ఈ మాటల వెనుక పరులకు లేని జ్ఞానముతో పాటు, వారి జ్ఞానం విషయంలో తన కున్న అజ్ఞానమును కూడా స్పష్టంగా అంగీకరించడమే జరిగింది.

సామాన్యమైన లౌకిక విషయ వ్యవహారాలే ఇలా ఉండే టప్పుడు, అతీంద్రియ విషయమైన ఆత్మ తత్త్వము నందు మన తలపులు, తర్కాలు, పరుల బుద్ధికి సంబంధించిన ఊహలు ఎంత వరకు సహకరిస్తాయి? వాటి విషయం చెప్పడానికి ఏముంది? ***( కి ముత అతీంద్రియే శాస్త్రార్థే ? )***.

మనపై మనకు విశ్వాసం ఉండాలి. పరులపై కూడా విశ్వాసం ఉంచ వచ్చు. తప్పు లేదు. కాని, బ్రహ్మ జ్ఞానము విషయంలో మన విశ్వాసము పరులపై కాదు, ప్రమాణంపై ఉండాలి. ప్రమను, లేదా జ్ఞానమును కలిగించేది ప్రమాణము కనుక ***(ప్రమాకరణం ప్రమాణం )***. శాస్త్ర ప్రమాణంపై ప్రగాఢమైన విశ్వాసం ఉండాలి. దానినే శ్రద్ధ అంటారు. దేని చేత బ్రహ్మజ్ఞానము పొంద బడుతూ ఉందో, అదే శ్రద్ధ అన్నారు సత్పురుషులు ***('యయా వస్తూపలభ్యతే సా శ్రద్ధా' - ఇతి సద్భిః కథితా, )***. ఎవరికి శ్రద్ధ ఉంటుందో వారు జ్ఞానాన్ని పొందుతారు అని భగవంతుడు గీత - నాల్గవ అధ్యాయం లోనే ప్రబోధించాడు ***( శ్రద్ధావాన్ లభతే జ్ఞానం; 4 వ అ - 39వ శ్లో)***.

మతి చెప్పినట్లు విని దుర్గతిని కొని తెచ్చుకున్నాం. శ్రుతి చెప్పినట్లు ఆచరించి సద్గతి కొరకు ప్రయత్నించాలి. మతి మాయలో పడేస్తుంది. శ్రుతి మహిమలో ఊరేగిస్తుంది. చీకటిలో నడచి పోయే వాడి చేతిలో దీపం ఉండాలి. అజ్ఞాన చీకటిలో చరించే మానవుని చిత్తంలో శాస్త్ర దీపం వెలుగుతూ ఉండాలి.

**మతి గల వాడే మానవుడు**
**మతి పతి యైతే వానరుడు**
**అంతా మతి యైతే శ్రుతి ఎందుకు?**
**శ్రుతి ఉంటేనే యతి ముందుకు**
**మాయలే మతికి రాస్తాలు**
**మహిమలు శ్రుతికి నేస్తాలు**
**రామ రామ జయ రాజారామ్**
**రామ రామ జయ సీతారామ్**

అని రామజోగి చిట్కా.

***వేదాః స్థానాని విద్యానాం*** - వేదాలు విద్యాస్థానాలు, జ్ఞాన నిలయాలు అన్నది యాజ్ఞవల్క్య స్మృతి. కర్తవ్య మేమిటి, అకర్తవ్య మేమిటి అనే విషయంలో శాస్త్రమే మనకు ప్రమాణము. వివిధ పురుషార్థాలను ఎలా సాధించు కోవాలో, ఆ మార్గా లన్నిటినీ సుబోధకం చేస్తుంది శాస్త్రం ***( పురుషార్థోపదేశత్వాత్ శ్రుతీనామ్ )*** అన్నారు తైత్తిరీయోపనిష ద్భాష్యంలో శ్రీ శంకరాచార్యస్వామి.

అందుచేత శాస్త్రవిధిని అనుసరించి, కర్తవ్యాన్ని ఆచరిస్తూ పోవాలి ***( జ్ఞాత్వా శాస్త్ర విధానోక్తం )***. విధి అంటే విధానము. శాస్త్రం చేత చెప్పబడింది శాస్త్రవిధి లేదా శాస్త్ర విధానము ***( విధిః విధానమ్, శాస్త్రేణ విధానమ్ శాస్త్ర విధానమ్ )***. దేవతలకు సైతము లభ్యం కాని కర్మాధికారం మానవులకే ఉంది. ఈ సత్యాన్ని స్పష్టం చేయడానికే ***ఇహ*** పద ప్రయోగము ***( ఇహ ఇతి కర్మాధికార భూమి ప్రదర్శనార్థమ్ )***. భూలోకం లోనే కర్మాధి కారం ఉంది కనుక, శాస్త్రోక్త విధి ననుసరించి, కర్తవ్యాన్ని నిర్వహించి, శ్రేయస్సును పొందమని ఉపదేశిస్తూ దైవాసుర సంపద్విభాగ యోగాన్ని భగవంతుడు సమాప్తం చేశాడు.

**ఓం తత్ సత్**

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే
దైవాసుర సంపద్విభాగయోగో నామ షోడశో౽ధ్యాయః

**ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు దైవాసుర సంపద్విభాగ యోగ మనే పదహారవ అధ్యాయము.**



# చైతన్య భగవద్గీత

## అథ సప్తదశో౽ధ్యాయః - పదిహేడవ అధ్యాయము

## శ్రద్ధాత్రయ విభాగ యోగః - శ్రద్ధాత్రయ విభాగ యోగము

**ప్రమాణ విషయం**

ఎవరు దేనిని పొందా లనుకున్నా, దానికి సంబంధించిన జ్ఞానం వారికి ఉండాలి. ఉంటుంది. అప్పుడే దానిని పొంద గలరు.

వారు పొందాలి అనుకున్న దొకటి ఉండి, దానికి సంబంధించిన జ్ఞానము వారికి లేనపుడు, సాధారణంగా స్నేహితుడో, బంధువో లేదా మరొకరో చెప్పే ఆప్తవాక్యము మీద విశ్వాస ముంచి, వస్తు ప్రాప్తికి యత్నిస్తూ ఉంటారు. లోకంలో వ్యవహారా లన్నీ ఇలాగే ఉంటాయి.

స్వబుద్ధికి జ్ఞానం లేక పోవడం వల్లనే కదా, పరబుద్ధిని ఆశ్రయించడం జరిగింది? తన జ్ఞానం మీద తనకే విశ్వాసం లేక పోవడం చేత పరులను విశ్వసించడం జరిగింది. వారి మీద కూడా విశ్వాసం లేనట్లైతే, వస్తు ప్రాప్తికి ప్రయత్నం చేయలేడు కదా! ***( లోకే౽పి ఆప్తవాక్యే విశ్వాస అభావే, నైవ తదనుసారేణ ప్రవర్తతే పురుషః )***. లోకంలో ఏ కార్య ప్రాప్తి కైనా, తన జ్ఞానం మీద గాని, లేదా పరుల జ్ఞానం మీద గాని ఆధారపడే ప్రయత్నాలు సాగుతూ ఉంటాయి. కాని, ఈ రెండు ఆధారాలూ కొన్ని సమయాలలో ఆదా చేయడానికి ఉపకరించక పోవచ్చు. అలాంటి పరిస్థితులలో వారి మాటలు, ఊహలు ప్రశ్నార్థకంగా, సంశయాత్మకంగా, పరిశీలనాత్మకంగా విన పడుతూ ఉంటాయి.

'నాకు తెలియక అలా చేసేశాను. అలా చేయకుండా ఉంటే బాగుండేది' - ఈ మాటల వెనుక స్వబుద్ధి అజ్ఞానాన్ని ప్రత్యక్షంగా అంగీకరించడమే జరుగుతూ ఉంది.

'అతనికి అనుభవ ముందని విశ్వసించాను. వాళ్ళకు బాగా తెలుసని అభిప్రాయ పడ్డాను. పాపం! వాళ్ళ తప్పు కూడా లేదు. వాళ్ళకు తోచింది వాళ్ళు చెప్పారు. తెలియనిది ఎవరైనా ఎలా చెబుతారు? నాకే ప్రాప్తం లేదు' - ఈ మాటల వెనుక పరులకు లేని జ్ఞానముతో పాటు, వారి జ్ఞానం విషయంలో తన కున్న అజ్ఞానమును కూడా స్పష్టంగా అంగీకరించడమే జరిగింది.

సామాన్యమైన లౌకిక విషయ వ్యవహారాలే ఇలా ఉండే టప్పుడు, అతీంద్రియ విషయమైన ఆత్మ తత్త్వము నందు మన తలపులు, తర్కాలు, పరుల బుద్ధికి సంబంధించిన ఊహలు ఎంత వరకు సహకరిస్తాయి? వాటి విషయం చెప్పడానికి ఏముంది? ***( కి ముత అతీంద్రియే శాస్త్రార్థే? )***.

మనపై మనకు విశ్వాసం ఉండాలి. పరులపై కూడా విశ్వాసం ఉంచ వచ్చు. తప్పు లేదు. కాని, బ్రహ్మ జ్ఞానము విషయంలో మన విశ్వాసము పరులపై కాదు, ప్రమాణంపై ఉండాలి. ప్రమను, లేదా జ్ఞానమును కలిగించేది ప్రమాణము కనుక ***(ప్రమాకరణం ప్రమాణం)***. శాస్త్ర ప్రమాణంపై ప్రగాఢమైన విశ్వాసం ఉండాలి. దానినే శ్రద్ధ అంటారు. దేని చేత బ్రహ్మజ్ఞానము పొంద బడుతూ ఉందో, అదే శ్రద్ధ అన్నారు సత్పురుషులు ***('యయా వస్తూపలభ్యతే సా శ్రద్ధా' - ఇతి సద్భిః కథితా,)***. ఎవరికి శ్రద్ధ ఉంటుందో వారు జ్ఞానాన్ని పొందుతారు అని భగవంతుడు గీత - నాల్గవ అధ్యాయం లోనే ప్రబోధించాడు ***( శ్రద్ధావాన్ లభతే జ్ఞానం; 4 వ అ - 39వ శ్లో)***.

పరమేశ్వరుని యందు, గురుదేవుని యందు, శాస్త్ర విషయము నందు అకుంఠిత మైన విశ్వాసము కలిగి ఉండటమే శ్రద్ధ. శ్రద్ధ గల వారు జ్ఞానాన్ని పొందుతారు. దాని అర్థం శ్రద్ధ లేని వారు పొంద లేరు. పైగా, పరమాత్మను పొంద లేక పతనమై సంసార చక్రంలో పడి పరిభ్రమిస్తూ ఉంటారు.

అర్జునా! శ్రద్ధ లేని పురుషులు (***అశ్రద్దధానాః పురుషాః***) నన్ను పొంద లేక (***మాం అప్రాప్య***) జనన మరణ రూప సంసారంలో పడి పోతున్నారు (***మృత్యు సంసార వర్త్మని నివర్తన్తే***) అని గీత - రాజవిద్యా రాజగుహ్య యోగం మూడవ శ్లోకంలో భగవంతుడు హెచ్చరించాడు కూడా.

## సందర్భము

ఏది కర్తవ్యం, ఏది అకర్తవ్యం? అనే విషయంలో శాస్త్రమే ప్రమాణము. కనుక, శాస్త్రము జ్ఞాన సాధనము (***శాస్త్రం ప్రమాణం జ్ఞాన సాధనమ్***). శాస్త్రాన్ని విస్మరించి, ఇష్టానుసారం కర్మాచరణంలో ఉండే వారికి సుఖం ఉండదు (***న సుఖం***). పురుషార్థ యోగ్యత ఉండదు (***న సిద్ధిం***). మోక్షము ప్రాప్తించదు (***న పరాం గతిమ్***) అని పూర్వ అధ్యాయాంతంలో ప్రవచించిన పరమేశ్వరుడు, శాస్త్రోక్త విధానమును తెలుసుకొని (***జ్ఞాత్వా శాస్త్ర విధానోక్తం***) కర్మాచరణమును సాగించాలని బోధించి పదహారవ అధ్యాయాన్ని సమాప్తి చేశాడు. ఈ ఉపదేశమే పదిహేడవ అధ్యాయానికి ప్రశ్న బీజ మైంది (***'తస్మాత్ శాస్త్రం ప్రమాణం తే' ఇతి భగవ ద్వాక్యాత్ లబ్ధ ప్రశ్న బీజః***).

పదిహేనవ అధ్యాయం పురుషోత్తమ ప్రాప్తి. అదే మోక్ష ప్రాప్తి. దైవీ సంపదలో పుట్టిన వారికే గాని ఆసురీ సంపదలో పుట్టిన వారికి లభ్యం కానిది. కామ క్రోధ లోభాలనే నరక హేతువులను త్యజించి, ఆత్మకు శ్రేయస్సును కలిగించే దైవ మార్గంలో పయనించే వారికే లభ్య మవుతుంది. కనుక, ఆత్మజ్ఞానమును పొంది పురుషోత్తమ ప్రాప్తిని సాధించుటకు పరిహరించ దగినది, ఆత్మకు వినాశమును కలిగించే (***నాశన మాత్మనః***) ఆసురీ సంపదను త్యజించి స్వీకరించ దగినది, ఆత్మకు శ్రేయస్సును కలిగించునది (***ఆత్మనః శ్రేయః***) అయిన దైవీ సంపదను ముముక్షువు పెంపొందించు కోవాలి. ఆసురీ ప్రవృత్తిని దైవ ప్రవృత్తిగా మార్చుకునేందుకు పదహారు, పదిహేడు అధ్యాయాలు సహకరిస్తాయి. ఈ విధంగా సామీప్య సంబంధం ఉండటం చేత, ఈ రెండు అధ్యాయాలు పదిహేనవ అధ్యాయానికి అనుబంధ అధ్యాయాలుగా శోభిస్తున్నాయి.

శ్రద్ధను కేంద్ర విషయంగా కలిగి ఉన్నందున పదిహేడవ అధ్యాయానికి 'శ్రద్ధాత్రయ విభాగ యోగము' అనే పేరు వచ్చింది. అసుర సంపద కల వారు దైవ సంపద లోకి పరివర్తన చెందడానికి శ్రద్ధ ప్రముఖ పాత్రను పోషిస్తుంది. ఇక దైవ సంపద కల వారు ఆత్మజ్ఞానమును పొందడానికి అనువైన పరిణతిని సాధించ డానికి సహకరిస్తుంది. కనుకనే, ***శ్రద్ధా చ బ్రహ్మ విజ్ఞానే పరమం సాధనం*** - బ్రహ్మజ్ఞానమును సాధించుటలో శ్రద్ధ ఉత్కృష్ట మైనది అన్నారు బృహదారణ్యక భాష్యంలో ఆచార్యులు.

మోక్ష మార్గంలో శ్రద్ధ దారి దీపం లాంటిది. అది ప్రకాశిస్తున్నంత కాలము ప్రయాణము సజావుగా సాగుతూ ఉంటుంది. అది ఆరి పోయిందా, ప్రయాణం ఆగి పోయినట్లే.

శ్రద్ధ వల్లనే మోక్షేచ్ఛ కలుగుతుంది. పరమేశ్వరుని గూర్చి తెలుసుకోవాలి అనే జిజ్ఞాస శ్రద్ధ వల్లనే ఏర్పడుతుంది. శ్రద్ధే ముముక్షువుకు జన్మ నిస్తుంది. శ్రద్ధే ముముక్షువును ముక్త పురుషుణ్ణి చేస్తుంది.

ముముక్షువుకు జన్మ నిచ్చి, ముముక్షువు మోక్షరూపు డయ్యే వరకు సాధనలో అనుక్షణం కనిపెట్టుకొని శ్రద్ధ తల్లి లాగా సాధకుని పోషిస్తుంది. కనుక, సాధకు లైన బిడ్డ లందరూ శ్రద్ధామాత ఒడిలో పెరగ వలసిన వారే. శ్రద్ధామాత ఎవరో కాదు. శ్రద్ధామాత శారదా మాతయే. శ్రద్ధ రూపంలో జ్ఞానాన్ని పోషిస్తున్న జ్ఞాన సరస్వతియే శ్రద్ధామాత.





***యా దేవీ సర్వ భూతేషు శ్రద్ధా రూపేణ సంస్థితా,***
***నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥***

అని దేవీ సప్తశతి. శ్రద్ధా రూపిణియై ఆయుష్షు పోసిన జ్ఞాన సరస్వతి విద్యారూపిణియై ఆశీర్వదించి అనుగ్రహిస్తుంది (***యా దేవీ సర్వభూతేషు విద్యారూపేణ సంస్థితా***).

శ్రద్ధ మనస్సుకు సంబంధించింది. మనస్సు ప్రకృతి సంభవ మని మనం ముందే తెలుసుకొని ఉన్నాం. ప్రకృతి గుణమయం కనుక, ప్రకృతి కార్యమైన మనస్సులో కూడా గుణాలే ఉంటాయి. అవే పదమూడు, పద్నాలుగు అధ్యాయాలలో మనం విస్తరించి చెప్పుకున్న సత్త్వ రజ స్తమో గుణాలు. మనస్సులో గుణత్రయమే ఉంది కనుక, మనస్సు లోని గుణ భేదాన్ని బట్టి శ్రద్ధ కూడా మూడు విధాలుగా ఉంటుంది. అవే త్రివిధ శ్రద్ధలు. అంటే, సాత్త్విక శ్రద్ధ, రాజసిక శ్రద్ధ, తామసిక శ్రద్ధ. ఈ మూడు విధాలైన శ్రద్ధలను విస్తారంగా వివరించడం చేత ఈ అధ్యాయానికి 'శ్రద్ధాత్రయ విభాగ యోగము' అనే పేరు వచ్చింది.

***సత్త్వాత్ సంజాయతే జ్ఞానం*** - సత్త్వగుణము వృద్ధి చెంది నపుడు జ్ఞానం పుడుతుంది అని గీతాచార్యుడే చెప్పడం జరిగింది (*14 వ అ - 17 వ శ్లో*). భక్తి జ్ఞానాలు రెండిటికి శ్రద్ధ ప్రధాన మైంది. కర్మయోగంలో చరించి అంతఃకరణ శుద్ధిని పొందా లన్నా, జ్ఞాన మార్గంలో సాగి ఆత్మజ్ఞానాన్ని అందుకోవా లన్నా, శ్రద్ధే ప్రధానంగా ఉంటుంది.

భగవద్గీతలో 'శ్రద్ధ' అనే పదాన్ని భగవంతుడు ఎన్నిసార్లు ఉపయోగించాడో! అప్పటికీ తృప్తి చెందక శ్రద్ధను వివరించి చెప్పడానికి ప్రత్యేకంగా ఒక అధ్యాయాన్నే కేటాయించాడు.

ద్వాదశాక్షరీ మహామంత్ర స్వరూపుడైన గీతాచార్యునికి హృదయమై భాసిస్తున్న ద్వాదశాధ్యాయ మైన భక్తి యోగమునకు ఆద్యంతాలలో శ్రద్ధను ప్రతిష్ఠించి భక్తికి ప్రాణం పోశాడు భగవంతుడు. ఎవరు గొప్ప శ్రద్ధతో (***పరయా శ్రద్ధయా***) కూడిన వారై (***ఉపేతాః***) నన్ను ఉపాసిస్తారో (***మాం ఉపాసతే***), వాళ్ళే యుక్తతములు (***తే యుక్త తమాః***) అంటూ భక్తియోగాన్ని ఆరంభించిన వాసుదేవుడు, శ్రద్ధావంతులై నన్ను ఉపాసించే వారు (***శ్రద్ధ ధానా మత్పరమాః***) నాకు ఇష్టమైన వారు (***మే అతీవ ప్రియాః***) అంటూ అధ్యాయాన్ని సమాప్తి చేశాడు. శ్రద్ధకు పరమేశ్వరు డిచ్చిన ప్రాముఖ్యాన్ని , ప్రాధాన్యతను బట్టి శ్రద్ధ యొక్క ప్రాశస్త్యాన్ని గుర్తించ వచ్చు.

విధి విధానాలు తెలియక, భక్తి శ్రద్ధలకు నోచుకోక, అసుర సంపద నాశ్రయించి అన్యాయమై, బ్రతుకును అనర్థంగా మార్చుకుంటున్న అసుర మానవులు, శ్రద్ధావంతులై పరమేశ్వరుని ఆశ్రయిస్తే, మెల్లమెల్లగా దైవీ సంపదను పొంది, శాస్త్ర జ్ఞానమును అందుకొని, కృతకృత్యులై, ఆప్తకాములై తరిస్తారు. కనుక సాత్త్విక శ్రద్ధను పొంద డానికి ఈ అధ్యాయము కరదీపిక లాంటిది.

***విధి విధానము తెలియని అధమ జన్మ***
***భక్తి శ్రద్ధలు లేని దద్దమ్మ బ్రతుకు***
***మునిగి పోవుచుంటి సంసార మడుగు లోన***
***నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా!***

అని నీలకంఠ శతకంలో ఒక విబుధి పండు.

ఇది శ్రద్ధాత్రయ విభాగ యోగము. పదిహేడవ అధ్యాయము. గుణత్రయ భేదాన్ని అనుసరించి శ్రద్ధాత్రయము, అంటే త్రివిధ శ్రద్ధలు వివరింప బడ్డాయి. వాటితో పాటు త్రివిధ పూజలు, త్రివిధ ఆహారాలు, త్రివిధ యజ్ఞాలు, త్రివిధ తపస్సులు, త్రివిధ దానాలు మొదలైన వన్నీ గుణ భేదాన్ని అనుసరించి స్పష్టంగా

విశదీకరించ బడ్డాయి. అధ్యాయాంతంలో **ఓం తత్ సత్** అనే మంత్ర వ్యాఖ్యానము ఉంది. చివరగా అశ్రద్ధ కార్యాల వల్ల ప్రాప్తించే అనర్థ ఫలాలు కూడా చెప్పబడ్డాయి. సాధకులకు ఈ అధ్యాయము చాలా ఉపయుక్త మైనది.

పూర్వాధ్యాయ సమాప్తంలో పరమేశ్వరుడు శాస్త్ర ప్రమాణాన్ని ప్రతిపాదించడం చేత, అది ఆలకించిన అర్జునుని అంతఃకరణములో ప్రశ్న బీజం పడింది. దానినే పార్థుడు ప్రశ్నిస్తున్నాడు.

**అర్జున ఉవాచ :**

యే శాస్త్రవిధి ముత్సృజ్య యజన్తే శ్రద్ధయాఽన్వితాః ।
తేషాం నిష్ఠా తు కా కృష్ణ సత్త్వ మాహో రజ స్తమః ॥ 1

***యే-శాస్త్రవిధిం-ఉత్సృజ్య-యజంతే-శ్రద్ధయా-అన్వితాః***
***తేషాం-నిష్ఠా-తు-కా-కృష్ణ-సత్త్వం-ఆహో-రజః-తమః***

| | | | | | |
|---|---|---|---|---|---|
| కృష్ణ | = | కృష్ణా! | తేషాం | = | వారి యొక్క |
| యే | = | ఎవరు | నిష్ఠా తు | = | స్థితి |
| శాస్త్రవిధిం | = | శాస్త్ర విధానమును | కా | = | ఎట్టిది |
| ఉత్సృజ్య | = | విడిచి | సత్త్వం | = | సత్త్వమా |
| శ్రద్ధయా | = | శ్రద్ధతో | ఆహో | = | లేక |
| అన్వితాః | = | కూడిన వారై | రజః | = | రజస్సా |
| యజంతే | = | పూజలు చేస్తారో | తమః | = | తమస్సా |

**అర్జునుడు అడుగుతున్నాడు :**

**కృష్ణా! కొందరు శ్రద్ధతో పూజలు చేస్తారు. కాని, శాస్త్ర విధిని అనుసరించరు. వారి నిష్ఠ సాత్త్వికమా? రాజసికమా? తామసికమా?**

**వ్యాఖ్య**

ఎవరైతే శాస్త్రోక్త విధానాన్ని విడిచి పెట్టి, స్వేచ్ఛాచారులై ప్రవర్తిస్తారో ***( యశ్శాస్త్ర విధి ముత్సృజ్య వర్తతే కామ కారతః )***, వారు సిద్ధిని, సుఖాన్ని, మోక్షాన్ని పొందరు అని పూర్వాధ్యాయం ఇరవై మూడవ శ్లోకంలో చెప్పడం జరిగింది. భగవంతుడు చెప్పిన ఈ వాక్యాన్ని కొంత మార్పు చేసి, కామం స్థానంలో శ్రద్ధను ఉంచి అర్జునుడు ప్రశ్నిస్తున్నాడు. ***వర్తతే కామ కారతః*** *(16 వ అ - 23 వ శ్లో)* స్థానంలో ***యజన్తే శ్రద్ధయాన్వితాః*** అనే వాక్యాన్ని ఉంచి, కృష్ణా! ఎవరైతే శాస్త్రోక్త విధానాన్ని విడిచి పెట్టి శ్రద్ధతో కూడిన వారై పూజాదికాలు నిర్వర్తిస్తారో ***( యశ్శాస్త్ర విధి ముత్సృజ్య యజన్తే శ్రద్ధయాన్వితాః )*** వారి నిష్ఠ సాత్త్వికమా, రాజసికమా, తామసికమా? అని ప్రశ్నిస్తున్నాడు.

శాస్త్ర విధిని విడిచి పెట్టి స్వేచ్ఛాచారులైన వారికి సుఖశాంతులు మిగలవు అని పూర్వాధ్యాయంలో చెప్పడం చేత వారిది సాత్త్విక నిష్ఠ కాదని, ఆత్మ శ్రేయస్సుకు ఉపకరించదని తెలుస్తూనే ఉంది. అది దైవ సంబంధ మైనది కాదని కూడా తెలుస్తూ ఉంది. అంతే కాదు. ఆసురీ సంపదకు సంబంధించింది కనుక, అది రజ స్తమస్సులకు సంబంధించి నది కాబట్టి త్యజించ దగినది అనేది కూడా స్పష్ట మవుతూ ఉంది. కాకపోతే,



శాస్త్రోక్త విధానాన్ని విడిచి పెట్టి, కామ ప్రేరణ చేత కాకుండా శ్రద్ధతో ఆచరించే వారి గతేమిటి? అనేది ఈ శ్లోకంలో అర్జునుని ప్రశ్న. ముందుగా ఈ ప్రశ్న కాస్త స్పష్టంగా అర్థం కావాలి.

శాస్త్ర విధి విధానాలను త్యజించే వారు స్వేచ్ఛాచారులు. మరి, ఈ స్వేచ్ఛాచారులు శాస్త్రోక్త విధిని తెలిసి త్యజించారా, తెలియక త్యజించారా? నిజం చెప్పాలంటే రెండిటికీ పెద్ద తేడా లేదు. తెలియడం, తెలియక పోవడం అలా ఉంచితే, త్యజించడ మైతే చేశారు కదా! కనుక, ఎందుకు త్యజించారు - అనే ప్రశ్నే ఇక్కడ సంగతము. కామ ప్రేరణ చేతనే త్యజించారు అనేది సమాధానము. శాస్త్ర విధానాన్ని ఎందుకు త్యజించారంటే, కామయుతులై వర్తించ డానికే త్యజించారు ***( శాస్త్ర విధిం ఉత్సృజ్య త్యక్త్వా వర్తతే కామ కారతః కామ ప్రయుక్తః )***. కనుక, కామ ప్రధానం గానే త్యజించడం జరిగింది కాబట్టి వీరు ఆసురీ సంపదకు సంబంధించిన వారు. అందుచేత వీరి నిష్ఠ సుఖప్రదం కాలేదు. సిద్ధిప్రదం కాలేదు. మోక్షప్రదం కాబోదు.

ప్రస్తుతం ఎవరిని గూర్చి అయితే అర్జునుడు ప్రశ్నిస్తున్నాడో, వారు కూడా స్వేచ్ఛాచారులే. శాస్త్రమును త్యజించిన వారే. కాకపోతే, వారి స్వేచ్ఛాచారము కామ ప్రయుక్తం కాదు. పైగా అది శ్రద్ధాన్వితం. ఈ అంతరాన్ని క్షుణ్ణంగా గ్రహించాలి. శాస్త్ర విధిని విడిచినా, వారు శ్రద్ధను విడువ లేదు. కామ ప్రేరితం కాని, శ్రద్ధాన్విత మైన ఈ నిష్ఠ సాత్త్వికమా, రాజసికమా, తామసికమా? అనేది అర్జునుని ప్రశ్న. ఒక్క మాటలో చెప్పాలంటే శ్రద్ధకు ప్రాధాన్యత అంటూ ఏదన్నా ఉందా, లేదా? అనేదే ప్రశ్నలో ముఖ్యాంశము అని నేను భావిస్తున్నా.

ఈ సందర్భములో మరొక విషయాన్ని అర్థం చేసుకోవడం కూడా ముఖ్యమని నా అభిప్రాయము. కామ ప్రేరితులై ఉన్నందున ఆసురీ సంపదకు సంబంధించిన వారు శాస్త్రాన్ని తెలిసినా, తెలియక పోయినా త్యజించారు అనే విషయాన్ని సులభంగా అర్థం చేసుకో వచ్చు. కాని, కామ ప్రయుక్తులు కాకుండా, శ్రద్ధ కలిగి ఆచరించే వారు ఆస్తిక్య బుద్ధి కలిగిన వారే కదా! మరి అలాంటి వారు శాస్త్రాన్ని త్యజించడ మేమిటి? వారు తెలియక త్యజించారా, లేక తెలిసే త్యజించారా? ఆస్తిక్య బుద్ధి కల వారు, శ్రద్ధ కల వారు తెలిసి ఎలా త్యజిస్తారు? అదెలా సాధ్యం? సాధ్యమే. సాధ్యమైంది కనుకనే దానిని చూసిన అర్జునుడు ప్రశ్నిస్తున్నాడు. సాధ్యము కానిది కనిపించదు. కనిపించని దానిని చూపిస్తూ ఎలా ప్రశ్నిస్తాడు?

కనుక, ఆస్తిక్య బుద్ధి కల వారే, శ్రద్ధ కల వారే ప్రస్తుత శ్లోకంలో శాస్త్రమును త్యజించిన వారు అనేది అంగీకరించ వలసిన విషయము. మరి, ఆస్తిక్య బుద్ధి కల వారు శాస్త్రాన్ని ఎందుకు త్యజిస్తారు? శాస్త్రాన్ని త్యజించిన వారికి ఆచార విషయము ఎలా తెలుస్తుంది? తెలియని దానిని శ్రద్ధతో వారు ఎలా ఆచరిస్తారు? ఒకవేళ అర్జునుడు చెబుతున్నాడు కనుక ఆచరిస్తున్నారని మనం అంగీకరించినా, దేనిని అనుసరించి ఆచరిస్తున్నారు? దీనికి సమాధానం ముందుగా అర్థం చేసుకుందాం.

ఎవరైతే అర్జునుడు చెబుతున్నట్లు శాస్త్ర విధిని విడిచి పెట్టి, శ్రుతి స్మృతి శాస్త్రోక్త విధానాన్ని త్యజించి ***(యే కేచిత్ శ్రుతి స్మృతి శాస్త్రచోదనామ్ ఉత్సృజ్య పరిత్యజ్య )*** దేవతలను పూజిస్తున్నారో, వారు శ్రద్ధ తోనే ఆరాధిస్తున్నారు ***( తే దేవాదీన్ పూజయన్తి శ్రద్ధయా అన్వితాః సంయుక్తాః )***. శ్రద్ధతో ఆచరించే వారు శాస్త్రం తెలిస్తే దానిని త్యజించ లేరు కనుక, శాస్త్రజ్ఞానము లేని కారణం గానే శ్రద్ధతో ఆచరిస్తున్నారు. శాస్త్రం లేనపుడు, శాస్త్ర విధి తెలియ నపుడు, ఆచరించ డానికి విధానము ఎలా తెలుస్తుంది? అనేది అర్థవంత మైన ప్రశ్న. సమాధానం ఏమిటి అంటారా? శాస్త్రము, శాస్త్ర విధి తెలియక పోయినా, ఆస్తిక్య బుద్ధి ఉన్న కారణంగా, పెద్దల ఆచారమును ఆదర్శంగా తీసుకొని, దానిని అనుసరిస్తూ శ్రద్ధతో ఆచరిస్తారు. ఇదంతా శ్రద్ధ వల్లనే సాధ్య పడుతుంది. శాస్త్రము తెలిసినా కూడా శ్రద్ధ లేని కారణంగా ఆసురీ సంపదకు సంబంధించిన వారు శాస్త్రాన్ని

పరిత్యజించి స్వేచ్ఛాచారులై చరిస్తూ ఉంటే, శాస్త్రము తెలియక పోయినా, శ్రద్ధ ఉన్న కారణంగా విషయము తెలిసిన పెద్దల ఆచారమును అనుసరించి, శ్రద్ధతో దేవతలను ఆరాధించే వారిని అర్జునుడు చూపెడు తున్నాడు **(వృద్ధ వ్యవహార దర్శనా దేవ శ్రద్ధధాన తయా యే దేవాదీన్ పూజయన్తి తే ఇహ 'యే శాస్త్ర విధి ముత్సృజ్య యజన్తే శ్రద్ధయాన్వితాః ' ఇత్యేవం గృహ్యన్తే!).** శాస్త్ర విధిని విడిచి పెట్టి, శ్రద్ధతో దేవతారాధనము చేస్తున్నారు అని అర్జునుడు ప్రస్తావించింది పెద్దల మార్గాన్ని అనుసరించే సుకృతాత్ములను గురించే నని స్పష్టమైంది **(మహాజనో యేన గత స్స పంథా).**

ఇక, ప్రస్తుతం మన ముందున్న మీమాంస ఒక్కటే. ఈ విధంగా శాస్త్రాన్ని త్యజించి, పెద్దల మార్గాన్ని శ్రద్ధతో అనుసరిస్తూ ఆచరించే వారి నిష్ఠ సాత్త్వికమా, రాజసికమా, తామసికమా? వారు సత్త్వగుణ ప్రధానులా, లేక రజ స్తమో గుణాలకు సంబంధించిన వారా? ఇదీ అర్జునుని ఆంతర్యం.

*దీనికి భగవంతుడు సమాధానం చెబుతున్నాడు.*

**శ్రీ భగవానువాచ :**

**త్రివిధా భవతి శ్రద్ధా దేహినాం సా స్వభావజా ।**
**సాత్త్వికీ రాజసీ చైవ తామసీ చేతి తాం శృణు ॥** 2

***త్రివిధా-భవతి-శ్రద్ధా-దేహినాం-సా-స్వభావజా***
***సాత్త్వికీ-రాజసీ-చ-ఏవ-తామసీ-చ-ఇతి-తాం-శృణు***

| | | | | | |
|---|---|---|---|---|---|
| దేహినాం | = | మానవులకు | తామసీ చ | = | తామసము |
| స్వభావజా | = | స్వభావముచే పుట్టిన | ఇతి | = | అని |
| సా | = | ఆ | త్రివిధా | = | మూడు విధములు |
| శ్రద్ధా | = | శ్రద్ధ | భవతి | = | అగుచున్నది |
| సాత్త్వికీ | = | సాత్త్వికము | తాం | = | దానిని |
| రాజసీ చ ఏవ | = | రాజసము | శృణు | = | విను |

**శ్రీ భగవంతుడు చెబుతున్నాడు :**

**అర్జునా! స్వభావం వల్ల పుట్టిన శ్రద్ధ మానవులకు మూడు విధాలు. అవే సాత్త్వికము, రాజసము, తామసము. వాటిని గూర్చి వివరంగా విను!**

### వ్యాఖ్య

శాస్త్రోక్త విధానమును అనుసరించకుండా, శ్రద్ధాన్వితులై దేవాదులను ఆరాధించే వారి నిష్ఠ సాత్త్వికమా, రాజసమా, తామసమా? అనేది అర్జునుని ప్రశ్న. అర్జునుడు అడిగిన ఈ ప్రశ్న ఏ ఒక్కరినో ఉద్దేశించి ప్రశ్నించింది కాదు. అలా ప్రశ్నించి ఉంటే, ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పే అవకాశం ఉండేది. ఒకరిని ప్రత్యేకంగా ఉద్దేశించి అడిగింది కాకుండా ప్రశ్న సామాన్యంగా ప్రస్తావించ బడింది *(సామాన్య విషయః అయం ప్రశ్నః).* ప్రశ్న ఎప్పుడైతే సామాన్యంగా ప్రస్తావించ బడిందో; అది కూడా సాత్త్వికమా, రాజసమా, తామసమా? అని అడగటం జరిగిందో, ఏ గుణానికి ఆ గుణాన్ని విభజించి చెప్పనిదే సమాధానం పూర్ణం కాదు. కనుక, పార్థుని ప్రశ్నకు సమాధానం చెప్పాలంటే, శ్రద్ధాత్రయ విభాగము చేయక తప్పదు. అందుచేత, గుణ భేదానుసారంగా, శ్రద్ధాత్రయ



విభాగ పూర్వకంగా ప్రతివచనం పలుకు తున్నాడు పరమేశ్వరుడు. అలా కాకుండా మరో విధంగా చెప్పే అవకాశము లేదు ***(న అప్రవిభజ్య ప్రతివచనమ్ అర్హతి ఇతి).*** అందుకే శ్రద్ధాత్రయ విభాగము.

కాండత్రయంగా మనం చెప్పుకున్న భగవద్గీతలో పదమూడవ అధ్యాయం నుండి తృతీయ కాండ - జ్ఞానకాండ నడుస్తూ ఉంది. **తత్త్వమసి** వాక్య నిర్ణయంలో **అసి** పద నిర్దేశం జరుగుతూ ఉంది. అఖండ పరిపూర్ణ అద్వయ స్వరూపం వైపుకు ప్రయాణం సాగుతూ ఉంది కనుక, ఖండాలను, భాగాలను మిథ్యా రూపాలుగా నిర్ణయించి, అఖండ స్వరూపాన్ని దర్శించే దిశగా బోధ నడుస్తూ ఉంది. అందుచేత ఈ తృతీయ కాండమే విభాగముతో ఆరంభ మైంది. ఇక ఆ తరువాత వరుసగా విభాగాలనే వీక్షిస్తూ ఉన్నాము. క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగము, గుణత్రయ విభాగము, దైవాసుర సంపద్విభాగము, ఇప్పుడు శ్రద్ధాత్రయ విభాగము. ఏ నిష్ఠ యందు శ్రద్ధను గూర్చి అర్జునుడు ప్రశ్నిస్తున్నాడో, మానవుల స్వభావ జనితమైన ఆ నిష్ఠ మూడు విధాలుగా ఉంది అంటూ భగవంతుడు ఈ అధ్యాయంలో ప్రథమంగా అమృత వచనాన్ని వినిపించాడు.

శ్రద్ధ అనేది మనస్సుకు సంబంధించింది. మనం జీవితంలో ఏ విధమైన శ్రద్ధను ప్రదర్శిస్తూ, ప్రకటిస్తూ ఉంటామో, ఆ శ్రద్ధను నిర్ణయించేది మన స్వభావమే. కనుక శ్రద్ధ అనేది స్వభావము నుండి పుడుతుంది ***(స్వభావ జా).*** శ్రద్ధ అనేది మనస్సు ఉన్న మానవులకు సంబంధించిందే గాని, మనస్సుకు నోచుకోని, కేవలం సహజాతాల మీదనే ఆధారపడి జీవించే జంతువులకు సంబంధించింది కాక పోవుట చేత ఇక్కడ మానవులకు ***(దేహినామ్)*** అని ప్రత్యేకించి చెప్పడం జరిగింది.

'అర్జునా! మానవులకు ***(దేహినామ్)*** స్వభావం వల్ల పుట్టిన ***(స్వభావజా)*** శ్రద్ధ ***(శ్రద్ధా)*** మూడు విధాలుగా ఉంటుంది ***(త్రివిధా భవతి).*** అదే సాత్త్వికము, రాజసము, తామసము. దానిని గూర్చి విను ***(తాం శ్రుణు)*** ' అంటున్నాడు భగవానుడు.

కారణము తెలియకుండా కార్యాన్ని ఊహించ లేము. కారణము అర్థం కానపుడు కార్యాన్ని తెలుసు కోవడం సాధ్య పడదు. శాస్త్ర విధిని త్యజించి శ్రద్ధతో దేవతారాధనము చేసే వారి నిష్ఠను గూర్చి అర్జునుడు ప్రశ్నించాడు ***(తేషాం నిష్ఠా తు కా?).*** అది సాత్త్వికమా, రాజసమా, తామసమా? అని తానే ప్రశ్నించాడు ***(సత్త్వ మాహో రజ స్తమః).*** కార్యమైన నిష్ఠను వివరించాలి అంటే కారణమైన శ్రద్ధను చెప్పి తీరాలి.

శ్రద్ధ ఒక్కటే. అయినా, గుణ భేదాన్ని బట్టి అది మూడు రూపాలుగా తెలుస్తూ ఉంది. శ్రద్ధా భేదాన్ని వివరించనిదే నిష్ఠను నిర్ణయించడం సాధ్య పడదు. అందుచేత, సత్త్వ రజ స్తమస్సులు అని మూడు విధాలుగా భిన్న మగుచున్న శ్రద్ధను భగవానుడు వివరించ వలసి వచ్చింది. అందుకనే, త్రివిధ శ్రద్ధలను వివరిస్తూ, వినమంటున్నాడు. 'విను' అని ప్రత్యేకంగా అనడం లోనే విషయ ప్రాధాన్యతను చెప్పకనే చెప్పిన ట్లైంది. మరి, ఈ శ్రద్ధ మూడు విధాలుగా ఉండటానికి కారణ మేమిటో కూడా చెబుతున్నాడు. స్వభావం నుండి పుట్టడం వల్లనే శ్రద్ధ మూడు విధాలుగా తెలుస్తూ ఉంది ***(త్రివిధా త్రిప్రకారా భవతి).***

స్వభావము నుండి పుట్టిన శ్రద్ధ సాత్త్విక మని, రాజస మని, తామస మని మూడు విధాలు ***(స్వభావజా శ్రద్ధా త్రివిధా).*** స్వభావము అంటే తనతో కూడా ఉండేది అని అర్థము ***(స్వేన సహ భవతీతి స్వభావః).*** స్వభావము నుండి పుడుతుంది కనుక శ్రద్ధను స్వభావజం అనడం జరిగింది.

ఎవరి స్వభావం వారిదే. స్వభావమే జీవితంగా కనిపిస్తూ ఉంటుంది. స్వభావమును విడిచి మనిషి ఉండ లేడు. మనిషికి వేరుగా స్వభావం ఉండ లేదు. కనుక మనిషి సంస్కారమే మనిషి స్వభావము. సంస్కారాలే స్వభావాన్ని నిర్ణయిస్తాయి. నేడు మనిషి స్వభావం ఎలా ఉందో, దానిని బట్టే అతని జీవితము నడుస్తూ ఉంటుంది.

ఇప్పుడు అర్థమైంది అనుకుంటాను. మనిషి స్వభావజ మైన శ్రద్ధను బట్టే ఆ వ్యక్తి నిష్ఠ సాగుతూ ఉంటుంది. ఆ నిష్ఠ సాత్త్వికమా, రాజసమా, తామసమా అనేది స్వభావజ మైన శ్రద్ధపై ఆధారపడి ఉంటుంది. మనస్సులో సాత్త్విక శ్రద్ధ ఉంటే బాహ్యంలో నిష్ఠ సాత్త్వికంగా ఉంటుంది. అలాగే రాజస నిష్ఠ అయినా, తామస నిష్ఠ అయినా.

మానవ స్వభావం సంస్కార ప్రభావమే అనేది తేలి పోయింది కదా, మరి ఈ సంస్కారాలు కేవలం ఈ నాటి వేనా, లేక జన్మాంతర కృతాలా? స్వభావాలు పూర్వజన్మ కృత పుణ్యాపుణ్య సంస్కార జనితాలా? నూతనంగా నేడు కొన్ని సంస్కారాలు మనిషికి ఏర్పడ వచ్చు. కాని, స్వభావ మనేది ఈ జన్మ లోనే తయారైంది కాదు. అందుకనే, తనతో కూడా ఉండేది అనే విగ్రహ అర్థాన్ని ముందే తెలియ చేశాను. తాను ఎక్కడుంటే స్వభావము అక్కడే తోడుగా ఉంటుంది.

మనిషి ఉన్నాడు అంటే స్వభావంతో ఉన్నాడు అని అర్థము. మనిషి పుట్టాడు అంటే స్వభావం తోనే పుడుతాడు. పుట్టక ముందు మనిషి ఉన్న వాడే. మనిషి ఉన్న వాడే కనుక అతని స్వభావం కూడా పూర్వ జన్మలో అతనితో కూడా ఉన్నదే. ఉన్నది కనుకనే అతనిని విడిచి పెట్టకుండా, పుట్టే సమయంలో అతనితో కలిసి పుట్టింది. పుట్ట గానే మనిషి ఎందుకు ఏడుస్తాడు? బిడ్డ ఏడవ డానికి స్వభావమే కారణము. గతంలో ఏడ్చిన అనుభవం ఉంది కనుక, బాధానుభవంతో ఏడ్చిన సంఘటనలు గత జన్మలో ఉన్నవే కనుక, పుట్టే సమయంలో ప్రసూతి వాయువుల చేత నెట్ట బడుతూ, దుర్భేద్య మైన యోని ముఖం నుండి బయట పడే టప్పుడు బిడ్డ దిక్కు తోచక రోదిస్తాడు. జనన సమయంలో శిశువును ఏడిపించింది స్వభావమే. పుట్టుక లోనే ఏడిపించింది కనుక చచ్చే వరకు ఏడిపిస్తూనే ఉంటుంది. అంతటితో ఆగదు. తిరిగి పుట్టే టప్పుడు మళ్ళీ కలిసే జన్మకు వస్తుంది. దేహాన్ని అంటి పెట్టుకున్న చర్మం శ్మశానంలో కాలి పోతుంది గాని, మనస్సును అంటిపెట్టుకున్న స్వభావము జీవి ఉన్నంత కాలం జన్మజన్మలకు తోడు గానే ఉంటుంది. అదీ స్వభావ మంటే. దాని నుండి పుట్టేదే శ్రద్ధ.

ప్రాచీన సంస్కారమే స్వభావము. దాని నుండి పుట్టింది కనుక శ్రద్ధ స్వభావజము. మనస్సులో స్వభావ జంగా ఉన్న శ్రద్ధ బాహ్య పరిస్థితుల్ని నిర్ణయిస్తుంది. కనుక స్వభావమును బట్టే సమస్తమూను. స్వభావము సమస్తాన్ని శాసిస్తూ పోతుంది. వేష భాషల్ని నిర్ణయించేది, ఆహార విహారాలను నిర్దేశించేది, సంబంధ బాంధవ్యా లను నిర్ధారించేది అంతా స్వభావమే. ఈ స్వభావము జన్మాది నుండే ఉంది కనుక, జీవితంలో జరిగే వన్నీ స్వభావానికి అనుకూలాలే కావడం చేత, బిడ్డ గర్భంలో ఉన్నప్పుడే, అంటే పుట్టక ముందే పూర్వోత్తరాలు లిఖింప బడతాయి అన్నది శాస్త్రం.

*శ్లో॥ ఆయుః కర్మ చ చిత్తం చ విద్యా నిధన మేవ చ।*
*పంచైతాని విలిఖ్యన్తే గర్భస్థ స్యైవ దేహినః ॥*

ప్రపంచంలో జీవి ఎలా బ్రతకాలి? అతని ఆయుర్దాయ మెంత? అతని కర్మగతు లెలా ఉంటాయి? మనోగతు లెలా ఉంటాయి? అతని చదువు ఎంత మాత్రం ఉంటుంది ? చచ్చిపోయే క్షణ మెప్పుడు? ఇవన్నీ పూర్వోత్తరాలు. ఆయుష్షు, కర్మ, మనస్సు, విద్య, మరణము - ఈ పంచ విషయాలకు సంబంధించిన పూర్వోత్తరాలు. ఆయుష్షు, కర్మ, మనస్సు, విద్య, మరణము - ఈ పంచ విషయాలకు సంబంధించిన నిర్ణయాలు గర్భంలో ఉన్నప్పుడే జరిగి పోతుంది అన్నది శాస్త్రం. ఇక ఆ నిర్ణయాలను అమలు పరచడమే పంచాయతి జీవి గర్భంలో ఉన్నప్పుడే జరిగి పోతుంది అన్నది శాస్త్రం. ఇక ఆ నిర్ణయాలను అమలు పరచడమే జీవితము.

ఏవి ఆశించి జీవుడు జన్మించాడో, వాటి కన్నా అన్యమైన వాటిని ఎలా చేస్తాడు? స్వభావాన్ని అనుసరించే



ప్రవర్తన ఉంటుంది **(స్వభావస్తు ప్రవర్తతే)**. కొందరికి వారి ప్రవర్తన వారికే నచ్చదు. నచ్చని ప్రవర్తనను తలచు కుంటూ నొచ్చుకుంటూ ఉంటారు కూడా.

దొంగతనం అంటే దొంగకు ఇష్టం ఉండదు. కాని, దొంగ ఇష్టంగా చేయ గలిగింది దొంగతన మొక్కటే. అదే స్వభావ మంటే. దొంగతనమే వృత్తిగా పెట్టుకొని జీవించే దొంగ, తన వస్తువుల్ని మరెవరైనా దొంగిలిస్తే భరించ లేడు. అందుకే అంటున్నాను దొంగతనం దొంగకి గిట్టదు అని. సత్యాలు వేరు, స్వభావాలు వేరు. ఇక్కడే బ్రతుకులో ఘర్షణ, జీవికి సంఘర్షణ.

స్వభావాన్ని బట్టి వ్యక్తి ప్రవర్తన ఉంటుంది. స్వభావాన్ని బట్టే కర్మలు, అలవాట్లు, అభిరుచులు, అలంకరణలు, సాధనలు - అన్నీను. ఆంతర్యము లోని స్వభావాన్ని బట్టి బాహ్యంలో నిష్ఠ ఉంటుంది. నిష్ఠ సాత్త్వికమా, రాజసమా, తామసమా? అనే అర్జునుని ప్రశ్నకు సమాధానం ఏమని చెప్పాలి? స్వభావాన్ని బట్టి నిష్ఠ ఉంటుంది. స్వభావము సాత్త్విక మైతే నిష్ఠ సాత్త్వికంగా ఉంటుంది. స్వభావము రాజస మైతే నిష్ఠ రాజసంగా ఉంటుంది. స్వభావము తామస మైతే నిష్ఠ తామసంగా ఉంటుంది.

కర్మలే కాదు, ఫలితాలు కూడా అలాగే ఉంటాయి. జన్మాంతర వాసనలు బ్రతుకును నిర్దేశిస్తూ ఉంటే, జన్మాంతర పుణ్యాపాపాలు ఆయా ఫలాలను నిర్విరామంగా పంచుతూ ఉంటాయి. ఎప్పుడు ఏది వస్తుందో అర్థం కాదు. కర్మలలో ప్రవర్తన ఎలా వింతగా ఉంటుందో, జీవితంలో అందే ఫలితాలు కూడా విచిత్రం గానే ఉంటాయి. కర్మాచరణం లోనే స్వభావాలు తయా రవుతాయి. కర్మాచరణం లోనే ఫలితాలు నిర్ణయింప బడతాయి. ఉన్న స్వభావమే ప్రవర్తనలో బయట పడుతుంది. పొంచి ఉన్న ఫలాలే ముందు కొస్తాయి. ముంచు కొస్తాయి. ఆశించినవి అందక పోవచ్చు. కాని అందే వాటిని ఎవ్వరూ ఆప లేరు. మనవే మనకు వస్తాయి. మనవి కానివి రమ్మన్నా రావు.

సంపదలు కావాలంటారు
ఆపదలు రాకూడ దంటారు
లేనివి రమ్మంటే వస్తాయా?
కానివి వద్దంటే ఆగుతాయా?
చేసిన పుణ్యాలే చెబుతారు
పాపాలను దాచి పెడతారు
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

అని రామజోగి చిట్కా.

**ఆశాదీపం**

స్వభావమును బట్టే నిష్ఠ ఉంటుంది కనుక, ఇక మన బ్రతుకు తెరువు మార దేమో! మన జీవన విధానము మార్పు చెందే అవకాశమే లేదేమో! అని నిరాశా నిస్పృహలకు లోనుగా నవసరం లేదు. స్వభావాన్ని మార్చే శక్తి సామర్థ్యాలు శాస్త్ర జన్య జ్ఞానానికి ఉన్నాయి. ఈ విషయంలో ఎవ్వరూ నిరాశ చెంద నవసరం లేదు. నా స్వభావాన్ని మార్చుకోవాలి. నా బ్రతుకు లోని చీకట్లను దూరం చేసుకోవాలి అని మనిషి ప్రగాఢంగా నిర్ణయించుకుంటే చాలు. స్వభావాన్ని సాత్త్వికంగా ఎలా మార్చుకోవాలో శాస్త్రం తెలియ జేస్తుంది. బోధ యొక్క ముఖ్య ఉద్దేశం, ముఖ్య ప్రయోజనం ఇదే.

స్వభావాన్ని మార్చుకొనే అవకాశం లేకపోతే వాల్మీకి ఎలా ఉద్భవించాడు? తులసీదాస్ ఎలా పరివర్తన చెందాడు? ఎందరో పతితులు పావనాత్ములై తరించారు. నది ప్రవహిస్తూనే ఉంటుంది. కాని దిగిన వారికే తాపం తీరుతుంది. మలిన దేహాలను శుద్ధి చేసేందుకే నిర్మల జలా లున్నాయి. పతితుల్ని పవిత్రుల్ని చేసేందుకే జ్ఞాన జల ముంది. ముఖ్యంగా మనస్సును సత్త్వ గుణంతో నింపుకో గలిగితే, ఇక ఆ తరువాత మెల్ల మెల్లగా అజ్ఞాన చీకటి తెరలు తొలగి పోతాయి. జ్ఞాన వెలుగులు బ్రతుకులో విరబూస్తాయి. ఆ విషయంలో సాధకు లైన ముముక్షువులకు ఈ శ్రద్ధాత్రయ విభాగ యోగము ఎంత గానో ఉపయోగ పడుతుంది.

*జీవితంలో శ్రద్ధ ఎంత ప్రముఖ మైందో చెబుతున్నాడు.*

**సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత ।**
**శ్రద్ధామయోఽ యం పురుషో యో యచ్ఛ్రద్ధ స్స ఏవ సః ॥** 3

***సత్త్వానురూపా-సర్వస్య-శ్రద్ధా-భవతి-భారత***
***శ్రద్ధామయః-అయం-పురుషః-యః-యత్-శ్రద్ధః-సః-ఏవ-సః***

| | | | |
|---|---|---|---|
| భారత | = అర్జునా! | పురుషః | = పురుషుడు |
| సర్వస్య | = సర్వులకు | శ్రద్ధామయః | = శ్రద్ధామయుడు |
| సత్త్వానురూపా | = అంతఃకరణకు తగినట్లుగా | యః | = ఎవడు |
| శ్రద్ధా | = శ్రద్ధ | యత్ శ్రద్ధః | = ఎటువంటి శ్రద్ధ కలవాడో |
| భవతి | = కలుగుతూ ఉంటుంది | సః | = అతడు |
| అయం | = ఈ | సః ఏవ | = అట్టివాడే |

**అర్జునా! వారి వారి మనస్సును బట్టి అందరికీ శ్రద్ధ కలుగుతూ ఉంటుంది. శ్రద్ధే జీవుని స్వరూపము. ఎవరికి ఎలాంటి శ్రద్ధ ఉందో, వాళ్ళు అలాగే ప్రవర్తిస్తూ ఉంటారు.**

### వ్యాఖ్య

పూర్వ శ్లోకంలో దేని నైతే స్వభావం అని చెప్పుకున్నామో అదే ఇక్కడ సత్త్వంగా చెప్పబడుతూ ఉంది. ***సత్త్వాను రూపా*** అంటే అంతఃకరణమునకు తగినట్లుగా అని అర్థం. మనస్సుకు తగినట్లుగా అనుకోండి; సులభంగా అర్థ మవుతుంది. స్వభావము లేదా సత్త్వము మనస్సు లోనే కదా ఉంటుంది! కనుక ఎవరి శ్రద్ధ అయినా వారి మనస్సుకు అనురూపం గానే ఉంటుంది. అదే సత్త్వానురూపం. మనస్సు సాత్త్వికంగా ఉంటే శ్రద్ధ కూడా సాత్త్వికం గానే ఉంటుంది. మనస్సు లోని సత్త్వము, లేదా స్వభావము ఎలాగైతే ఉందో, దానిని అనుసరించే శ్రద్ధ ఉంటుంది. ఈ శ్రద్ధ అన్ని విషయాల లోను ప్రతిఫలిస్తూ ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే జీవుడే శ్రద్ధా మయుడు. మనస్సులో ఏ విధమైన శ్రద్ధ ఉందో, దానికి అనుకూలం గానే జీవుని ప్రవర్తన ఉంటుంది (***శ్రద్ధా మయః అయం పురుషః సంసారీ జీవః***). ఎవరు ఏ విధమైన శ్రద్ధ కలిగి ఉంటారో (***యః యచ్ఛ్రద్ధః***). వారు ఆ శ్రద్ధకు అనుకూలం గానే ప్రవర్తిస్తూ ఉంటారు (***సః స ఏవ, తచ్ఛ్రద్ధానురూప ఏవ సః జీవః***).

## శ్రద్ధయే నిర్ణేత

మనం ప్రపంచంలో ఎలా ఉన్నా, ఎలా ప్రవర్తించినా, ఏది ఎలా ఆచరించినా, వాస్తవానికి దాని నంతా నిర్ణయించేది శ్రద్ధే. శ్రద్ధను బట్టే సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, వైజ్ఞానిక, వాణిజ్య, విద్యా, వ్యాపారాలు





బాహ్య ప్రపంచంలో సాగుతూ ఉంటాయి. వ్యక్తిగత ప్రవర్తన సమస్తమూ శ్రద్ధామయమే. అందుచేతనే పురుషుడు శ్రద్ధామయుడు అన్నాడు భగవంతుడు (***శ్రద్ధామయోఽ యం పురుషః***).

మన మనస్సులో ఏ గుణం ఏ మోతాదులో ఉందో దానిని బట్టి మన శ్రద్ధ ఉంటుంది. ఏ గుణం ప్రముఖంగా ఉంటే, దానికి సంబంధించిన శ్రద్ధే మనలో వ్యక్త మవుతుంది. సత్త్వగుణము ప్రధానంగా ఉంటే, మనలో సాత్త్విక శ్రద్ధ ప్రముఖంగా ఉంటుంది. శ్రద్ధ సాత్త్వికంగా ఉంది కనుక శ్రద్ధను బట్టి కర్మలు కూడా సాత్త్వికం గానే సాగుతాయి. ఇదీ క్రమము.

ఒకవేళ, వ్యక్తిలో తమోగుణము ప్రముఖంగా ఉందనుకోండి. అతని శ్రద్ధ తామసికంగా ఉంటుంది. తామసిక శ్రద్ధ ఉంది కనుక, దానిని అనుసరించి (**సత్త్వానురూపా**) తామస కర్మలే ఆచరింప బడుతాయి. అలాగే రాజసిక శ్రద్ధ కూడా.

తామసిక శ్రద్ధ మనస్సులో ఉన్నప్పుడు, ఆ వ్యక్తి దృక్పథంలో, ఆలోచనా విధానంలో, ఆచారములో - అన్నిటిలో తమోగుణ ప్రవృత్తే ప్రధానంగా ఉంటుంది. మానవీయ విలువల కన్నా జంతు ప్రవృత్తి ప్రముఖంగా ఉంటుంది. ఒక జంతువు తాను జీవించ డానికి మరొక జంతువును బలి తీసుకుంటుంది. కారణం, జంతువులలో తమోగుణమే ఉంది కనుక. అలాగే మానవునిలో కూడా ఆ విధమైన తమోగుణమే ప్రముఖంగా ఉండే టప్పుడు, అతని ప్రవర్తన కూడా తామసిక శ్రద్ధకు అనుగుణం గానే ఉంటుంది కనుక, తామసికులు ఎటువంటి కార్యాని కైనా ఒడి గడతారు.

ముఖ్యంగా నేటి సమాజంలో, ఈ తమోగుణ ప్రవృత్తి ప్రవృద్ధం కావడం చేతనే ఎక్కడ చూచినా మోసాలు, ద్రోహాలు, వంచనలు, హింసలు, హత్యలు, అపహరణలు విరివిగా కనిపిస్తున్నాయి. కారణం, ప్రపంచము తమోభిభూతమై ఉంది కనుక.

## ప్రవర్తనలు - ప్రాధాన్యతలు

మనిషిలో ఏ విధమైన శ్రద్ధ ఉందో, దానికి అనుగుణం గానే అతని జీవన విధానం ఉంటుంది. అతడు మరో విధంగా ఉండాలి అనుకున్నా ఉండ లేడు. అలా ఉండాలి అంటే, అతని కృషి ఎంత గానో ఉండాలి. వ్యక్తిలో విచారం విరబూయాలి. ఆ విచారాన్ని అతనిలో కలిగించడమే గాక, దానిని సక్రమంగా నడిపే వ్యక్తి కూడా తోడు ఉండాలి. నిశ్చయం దృఢంగా ఉంటే వ్యక్తి స్వభావాన్ని దాటి పోగలడు. మనస్సు లోని ప్రాధాన్యత లను మార్పు చేసుకోగలడు. అలా కాక, ఒక వైపు ప్రాధాన్యతలను పూజిస్తూ, మరో వైపు ప్రవర్తనలో పరివర్తనను ఆశించడము గుఱ్ఱం ముందు బండిని ఉంచడమే అవుతుంది.

ప్రాధాన్యత లనేవి బ్రతుకులో ఎంతటి ప్రముఖ పాత్రను పోషిస్తాయో నేను స్వానుభవంలో చూశాను. నా నలభై సంవత్సరాల సేవా జీవనంలో లెక్కకు అందనంత మంది నన్ను కలిశారు. ఆధ్యాత్మికంగా ఉన్నతిని సాధించాలని నన్ను ఆశ్రయించారు. కొందరు పరివర్తన చెందారు. అంటే, తమ ప్రాధాన్యతలను ప్రక్కకు నెట్టి, దేనిని ఆశించి వచ్చారో దానిని సాధించుకొనే క్రమంలో నిమగ్న మయ్యారు అని అర్థం. అలాంటి వర్గం ఒకటి ఉంది.

ఇక రాకపోకల తిరునాళ్ళు అంటారా? ఆ జాతర మరొక వైపు నిరంతరం సాగుతూనే ఉంది. ఏ పక్షి ఎప్పుడు వాలుతుందో తెలియదు. ఏ గువ్వ ఎప్పుడు ఎగిరి పోతుందో అర్థం కాదు. అర్థం కాని వాటికి భాష్యం చెప్ప మంటే ఎవరి తరము? ఎవరు ఎలా ప్రవర్తించినా అలా ప్రవర్తించడము వెనుక వారి స్వభావ ముంది. మనస్తత్త్వ శాస్త్ర కోణం నుండి విశ్లేషిస్తే, వాస్తవానికి ఎవరైనా, వారి వారి స్వభావం చేత కార్యరంగం లోకి

బలవంతంగా నెట్ట బడుతూ ఉంటారే గాని, అలా నెట్టబడి కర్మ లాచరించే వారికి, ప్రవర్తించే వారికి వారు అలా ఎందుకు ప్రవర్తిస్తున్నారో కూడా అర్థం కాదు. అంటే, వారి అంతఃకరణములో నిగూఢంగా పెనవేసుకు పోయిన స్వభావము వారికే అర్థం కాదు అని అర్థం. ఎవరి స్వభావం వారికే తెలియ నపుడు, మరొకరికి తెలిసే అవకాశం ఉందా?

ఉపన్యాసాలు వింటారు. ప్రబోధకుడు కనుక ప్రతిభావంతు డైతే తాత్కాలికంగా ఆవేశంతో స్పందిస్తారు. రజోగుణాన్ని తోడు చేసుకొని పరివర్తన వైపుకు ప్రాకు లాడుతారు. మొత్తానికి ఏదో ప్రయత్నం చేస్తారు. ఇక్కడే ప్రాధాన్యతలు పడగలు విప్పుతాయి. అదే మనిషికి కాళరాత్రి. బ్రతుకులో చీకటి రాత్రి. అలాంటి విషమ పరిస్థితిలో అర్జునుడు కళ్ళేమును కృష్ణుని చేతిలో పెట్టినట్లు, తమ బుద్ధి అనే కళ్ళేమును ఆచార్యుని చేతిలో పెట్టాలి. ఆ తరువాత అతడు సూచించిన మార్గంలో చరించాలి. ఇలా ప్రవర్తించడము కూడా స్వభావం పైనే ఆధారపడి ఉంటుంది. స్వభావాలలో ప్రాధాన్యతలు ఎలా ఉన్నవో దానిని బట్టే జీవన శకటం పయనిస్తూ ఉంటుంది.

కొందరు నన్ను అడుగుతూ ఉంటారు. స్వామీ! పూర్వం మీ వద్ద అతడు ఉండే వాడు. ఆమె ఉండేది. ఇటీవల వాళ్ళు కనిపించడం లేదే అని. నాలో నేను నవ్వుకొనే కొన్ని విషయాలలో ఇదొకటి. ఏం చెప్పేది? శ్రద్ధాత్రయ విభాగ యోగాన్ని బోధించేదా? సాధ్య మేనా? వారి కేదో సమాధానం చెబుతా ననుకోండి. అది వేరే విషయం. కాని, ముఖ్యమైన విషయ మేమిటంటే నన్ను ప్రశ్నించిన ఈ వ్యక్తి మనస్సులో ప్రాధాన్యత దేని కుందో అర్థం చేసుకోండి. ఏదో జ్ఞానార్జన అంటూ వస్తారు. అది స్వభావంలో ఉండదు కనుక, సాత్త్విక శ్రద్ధ లేని కారణంగా, రాజసిక శ్రద్ధే నిండి ఉన్నందున, వారి మనస్సులో ప్రాధాన్యత లౌకిక విషయాలకు ఉంటుందే గాని, పారమార్థిక విషయానికి ఉండదు.

లేని వారు ఎందుకు లేకుండా పోయారో అడిగే వ్యక్తి తెలుసుకొని ఏమి సాధిస్తాడు? ఎవరెవరు లేరు, ఉన్న వారిలో ఎవరెవరు ఎలా ఉన్నారు? ఈ ఆలోచనల కన్నా, ఈ ప్రపంచంలో ఉన్న వారందరూ లేకుండా పోయేందుకే ఉన్నారు అనే తాత్త్విక ఆలోచన చేయ గలిగితే ఇలాంటి అప్రస్తుత ప్రసంగాలకు అవకాశం ఉండదు.

ఇదంతా ఎందుకు చెబుతున్నా నంటే, ప్రాధాన్యతలను పరిశీలించకుండా ప్రగతిని సాధించ లేము. సాత్త్విక శ్రద్ధ లేకుండా ఆధ్యాత్మిక ప్రగతి సాధ్యం కాదు. ఇది స్వానుభవం నుండి చెబుతున్న మాట! ఈ విషయంలో నేను కాయను కాను, పిల్లకాయను కాను. పండి పోయిన వాణ్ణి. నా భవ రోగ చికిత్సాలయంలో ఇప్పటికి ఎందరు రోగుల్ని చూశానో!

ఏ వైద్యు డైనా అందరు రోగుల్ని బాగు చేయ లేడు. అన్ని రోగాలు నయం చేయ లేడు. రోగం నయం కావడ మనేది కేవలం వైద్యుడి మీద, ఔషధం మీద, చికిత్సా విధానం మీదనే ఆధారపడి ఉంది అనుకోవడం భావ్యం కాదు. వాస్తవం చెప్పాలంటే, రోగి మీదనే ఎక్కువ శాతం ఆధారపడి ఉంటుంది. కనుక, వైద్యుడు తన ధర్మాన్ని తాను నిర్వర్తించాలి. అంతే. ఒకవేళ, ఆయుష్షు కారిపోయి రోగి మరణిస్తే, వైద్యుడు మరొక రోగి వైపు దృష్టి సారించాలే గాని, మరణించిన రోగిని తలచుకొని విలపించ కూడదు. ఇవన్నీ జీవన సత్యాలు.

ఆపదలను తట్టుకోలేక ఆశ్రమాలను ఆశ్రయించే వాళ్ళు, ఆరోగ్యాలను పోగొట్టుకొని వచ్చే వాళ్ళు, బాధలను భరించ లేక అరుదెంచే వాళ్ళు, బిడ్డను పోగొట్టుకొని వచ్చే వాళ్ళు - ఇలాంటి ఆర్తులు కొంత కాలం ఆధ్యాత్మిక మార్గంలో ఊరేగుతారు. ఆశ్రమాలలో ఉక్కిరి బిక్కిరి అవుతూ ఉత్సాహాన్ని పారబోస్తూ కనిపిస్తారు.

కొంత కాలం ఉంటారు. బాధలు తీరుతాయి. భయాలు తొలగుతాయి. స్వభావాలు పల్లవిస్తాయి.





ప్రాధాన్యతలు పూత పెడతాయి. పిందె పుడుతుంది. పిచ్చి రేగుతుంది. ఆ తరువాత పలాయనమే ప్రస్థానము.

నా విషయాని కొస్తే, ఎవరైనా ఇతరుల పలాయనాలను, ప్రస్థానాలను నాతో ప్రస్తావిస్తే నేను ప్రతివచనం ఒక్కటే చెబుతాను. తరువు అన్న తరువాత పక్షు లెన్నో వాలుతాయి. వచ్చేవి వస్తూ ఉంటాయి. పోయేవి పోతూ ఉంటాయి. ఈ రాకపోకల తిరునాళ్ళకు, తరువుకు ఏమి సంబంధం?

ఆశ్రయించిన వారికి నీడ నివ్వడానికే తరువు ఉంది. వాలిన పక్షుల్ని తోలకుండా పండ్లు పెట్టేందుకే చెట్టు ఉంది. పండ్లు తిని పక్షులు ఎగిరినా, రెట్ట లేసి గువ్వలు రివ్వు మన్నా చెట్టు పట్టించుకోదు. తరువే పట్టించుకో నపుడు, గురువు పట్టించు కుంటాడా? 'నేనూ తరువు లాగా తటస్థుణ్ణే' అని చెప్పడానికే గురువులు తరువుల క్రింద ఆసీనులై ఉంటారు (***మూలం తరోః కేవల మాశ్రయన్తః***).

ఆత్మబంధువులారా! చైతన్య భగవద్గీత రెండు వేల పుటలను నింపుకున్న గ్రంథము. అయినా అందులో ఒక్క మాట గాని, ఒక్క వాక్యము గాని అసందర్భంగా, అప్రస్తుతంగా ఉండటాన్ని నేను ఊహించ లేను. భరించ లేను. ఇప్పుడు నేను చెప్పిన దంతా సాధకులకు అమృత తుల్యమైన సత్యం. సాధన పరమైన విషయం. కనుక ముందు మనస్సులో ప్రాధాన్యతలు ఎలా ఉన్నవో గుర్తించాలి. ఆ తరువాత అవసర మైతే, పరివర్తన వైపు పయనించే ప్రయత్నం దృఢంగా చెయ్యాలి. అందుకే, కాస్త అనుభవాన్ని జోడించి మరీ చెప్ప వలసి వచ్చింది.

జీవితం బొమ్మలాట కాదు. నవ్వులాట అసలే కాదు. జీవితం అతి స్వల్పం, అనిత్యం; కాదా? అని ప్రశ్నించింది శాస్త్రం. ***అనిత్యం ఖలు జీవితమ్?*** ప్రపంచం మనకు స్థిర నివాసం కాదు. కరుణించే స్వభావం కాలానికి లేదు. అందుకే ఊరి నంటి పెట్టుకొనే వల్లకాడు ఉంటుంది. అందరూ చక్రం తిప్పాలని చిందు లేసే వారే గాని, జనన మరణ చక్రాన్ని ఆపాలని ప్రయత్నించే పుణ్యాత్ము లెందరు?

మనస్సులో ఏది ప్రధానంగా ఉండాలో మనకు తెలిసి రావాలి. ఏది అవసరమో అర్థం కావాలి. అది తెలియక పోతే, నేడు అవసరాలుగా అంతఃకరణలో ఉన్నవి రేపు బ్రతుకునే అంతం చేయ వచ్చు.

విలువలకు విలువ కట్టడం నేర్చుకోవాలి. అప్పుడే బ్రతుకులో వెతలు తొలగుతాయి. వెలుగులు నిండుతాయి. కాలాన్ని వాడు కోవాలి. అంతేగాని కాలంతో ఆడుకో కూడదు. వాడుక లోనే ఉంది వేడుక. బుద్ధి సాత్త్విక మైతే, శ్రద్ధ సాత్త్విక మవుతుంది. సాత్త్విక శ్రద్ధ సాత్త్విక కర్మల్ని ఆవిష్కరిస్తుంది. అదే జరిగితే, బ్రతుకులో ఇక్కట్లు తీరుతాయి. చీకట్లు తొలగుతాయి.

జీవితంలో పురుషార్థ నిశ్చయం జరిగి, ప్రధాన మైంది ఏదో తెలిసి వస్తే స్వభావంలో మార్పు వస్తుంది. సాత్త్విక శ్రద్ధ విరాజిల్లు తుంది. ప్రవర్తనలో పరిపక్వత గోచరిస్తుంది.

**వచ్చిన దెపుడో తెలియదు ఎవరికి**
**పోయే రోజుందని తెలియని దెవరికి?**
**దారాసుతులు ధనదాయాదులు**
**కలిసి రాలేని రోజు అది**
**మట్టిలో కాయము కలవాలి**
**తోడొచ్చే దేమిటో తెలియాలి**
**రామ రామ జయ రాజారామ్**
**రామ రామ జయ సీతారామ్** అని రామజోగి చిట్కా.

స్వభావము అనేది జీవునితో కలిసి పుడుతుంది అని తెలుసుకున్నాం. ప్రాచీన స్వభావాన్ని బట్టి శ్రద్ధ ఉంటుంది. శ్రద్ధకు తగిన విధంగా కార్యాలు ఉంటాయి. కనుక, జీవులు ఆచరించే కార్యాలను బట్టి కూడా కారణమైన శ్రద్ధను ఊహించ వచ్చు. అదే చెబుతున్నాడు.

**యజన్తే సాత్త్వికా దేవా న్యక్ష రక్షాంసి రాజసాః ।**
**ప్రేతా న్భూతగణాం శ్చాన్యే యజన్తే తామసా జనాః ॥** 4

***యజంతే-సాత్త్వికా-దేవాన్-యక్షరక్షాంసి-రాజసాః***
***ప్రేతాన్-భూతగణాన్-చ-అన్యే-యజంతే-తామసాః-జనాః***

| | | | | | |
|---|---|---|---|---|---|
| సాత్త్వికాః | = సాత్త్వికులు | | తామసాః | = | తామసులు |
| దేవాన్ | = దేవతలను | | జనాః | = | జనులు |
| రాజసాః | = రాజసులు | | ప్రేతాన్ | = | ప్రేతములను |
| యక్షరక్షాంసి | = యక్షులను, రాక్షసులను | | భూతగణాన్ చ | = | భూత గణములను |
| యజంతే | = పూజించు చున్నారు | | యజంతే | = | పూజిస్తున్నారు |
| అన్యే | = ఇతరులైన | | | | |

**అర్జునా! సాత్త్వికులు దేవతలను పూజిస్తున్నారు. రాజసికులు యక్షులను, రాక్షసులను పూజిస్తున్నారు. తామసికులు భూత ప్రేతాలను సేవిస్తున్నారు.**

## వ్యాఖ్య

ఒక వ్యక్తి చేసే కర్మను హేతువుగా చేసుకొని అతని మనస్సును తెలుసుకో వచ్చు. దేవతార్చనాది కర్మల్ని ఒక వ్యక్తి నిర్వర్తించే టప్పుడు అతడు ఏ ఉద్దేశ్యంతో చేస్తున్నాడో దానిని బట్టి అతని మనస్సు లోని శ్రద్ధను ఊహించ వచ్చు. అందుచేత, కార్యము అనే లింగం చేత స్వభావమును తెలుసుకో వచ్చు. ఒక వ్యక్తి దేవతా పూజ చేస్తూ ఉంటే, దేవ పూజ అనే కార్య రూపమైన లింగం చేత ***( కార్యేణ లింగేన దేవాది పూజయా )*** అతడి సత్త్వాది నిష్ఠను అనుమాన ప్రమాణం ద్వారా అర్థం చేసుకో వచ్చు ***(సత్త్వాది నిష్ఠా అనుమేయా ఇత్యాహ)*** అని చెబుతున్నాడు.

'లింగము' అంటే హేతువు, లేదా కారణము అని అర్థము. ***లింగ్యతే బుధ్యతే అనేన ఇతి లింగమ్*** - దేని సహాయం చేత మరొక దానిని తెలుసుకోవడం జరుగుతుందో దానిని 'లింగము' అంటారు.

నిప్పుకు పొగ లింగము. పొగను ఆధారం చేసుకొని నిప్పును ఊహిస్తాము. అందుచేత పొగ అనేది నిప్పుకు లింగము. దూరంగా ఒక పర్వతము మీద మనకు పొగ కనపడుతుంది. మనకు కనిపించేది పొగ. కనపడనిది అగ్ని. అయినా పొగ అనే లింగమును ఆధారం చేసుకొని అగ్నిని అనుమానించి నిర్ణయిస్తాము. ***పర్వతో వహ్నిమాన్ ధూమత్వాత్*** - ధూమము కనిపిస్తూ ఉంది కనుక పర్వతముపై అగ్ని ఉంది. ***ధూమత్వాత్*** అనేది అగ్నికి హేతువుగా తెలుస్తూ ఉంది. కనుక ధూమము అనేది అగ్నికి లింగము. అంటే ధూమం యొక్క సహాయంతో అగ్నిని ఊహిస్తున్నాం. అంతే కాదు. ఎక్కడైతే పొగ ఉంటుందో అక్కడ అగ్ని ఉంటుంది ***( యత్ర యత్ర ధూమః తత్ర తత్ర వహ్నిః )***. అంటే నిప్పు లేనిదే పొగ రాదు అనేది విషయము. దీనిని 'కార్యలింగ కానుమానము' అంటారు. అలాగే దేవపూజ అనే హేతువును, లేదా లింగమును ఆధారం చేసుకొని వ్యక్తి యొక్క సత్త్వ నిష్ఠను ఊహించ వచ్చు. అంటే, సాత్త్విక శ్రద్ధ ఉంటేనే దేవపూజ జరుగుతుంది అనేది విషయము.





సత్త్వనిష్ఠ కల వారు సాత్త్వికులు. వారు దేవతలను పూజిస్తారు ***( యజన్తే పూజయన్తి, సాత్త్వికాః సత్త్వ నిష్ఠాః దేవాన్ )***. అంటే, ఎవరైతే దేవతలను పూజిస్తున్నారో ***( కార్యేణ లింగేన దేవాది పూజయా )*** వారి శ్రద్ధ సాత్త్వికమైనది అని అర్థము.

ఈ అధ్యాయారంభంలో అర్జునుడు అడిగిన విషయాన్ని మననం చేసుకుంటే, ఆ ప్రశ్నకు ఇక్కడ సమాధానం లభించినట్లే కదూ! 'శాస్త్ర విధిని అనుసరించకుండా, శ్రద్ధతో దేవాదులను అర్చించే వారి శ్రద్ధ సాత్త్వికమా, రాజసమా, తామసమా?' అని కదా అర్జునుడు ప్రశ్నించాడు? శాస్త్రజ్ఞానము లేక పోయినా, దేవతారాధనము చేస్తూ ఉన్నారు అంటే, స్వభావతః వారి శ్రద్ధ సాత్త్వికమే అని నిశ్చయ మైంది. నేను ముందే చెప్పినట్లు ప్రశ్న సామాన్యంగా ఉండటం చేత, శ్రద్ధాత్రయ విభాగ పూర్వకంగా ప్రతి వచనం చెప్ప వలసి వచ్చింది. అలా చెప్పడం చేతనే ఈ దశలో అర్జునుని ప్రశ్నకు రూఢిగా సమాధానం లభించింది.

సాత్త్వికులు దేవతలను ఆరాధిస్తే, రాజసులు యక్షులను, రాక్షసులను పూజిస్తారు ***( యక్ష రక్షాంసి రాజసాః )***. యక్ష రాక్షసులను పూజించడ మనే కార్యలింగం చేత వారి నిష్ఠ రాజస మని నిశ్చయింప బడుతుంది. అంటే, రాజసిక శ్రద్ధ కల వారు యక్షులను, రాక్షసులను పూజిస్తారు అని అర్థము.

తామసులు ప్రేత భూత గణాలను పూజిస్తారు ***( ప్రేతాన్ భూత గణాన్ చైవ సప్త మాతృకాదీన్ యజన్తే తామసాః జనాః )***. తామసు లైన జనులు ప్రేతాలను, సప్త మాతృకలు మొదలైన భూత గణాలను పూజిస్తారు. ఈ విధమైన పూజా కార్యాలనే లింగం చేత వీరు తామస నిష్ఠ కల వారని నిర్ణయ మవుతుంది. అంటే, తామస శ్రద్ధ కల వారు భూత ప్రేతాలను పూజిస్తారు అని అర్థం.

ఈ సందర్భములో శంకర భాష్యం విలక్షణంగా వ్యాఖ్యానించింది. గుణ భేదాన్ని బట్టి శ్రద్ధా భేదంతో ముగ్గురు మూడు విధాలుగా పూజిస్తున్నా, ఎక్కువ శాతం రాజస, తామస శ్రద్ధ కల వారే ఉంటారని, వేల మందిలో ఏ ఒక్కడో సత్త్వనిష్ఠుడై ఉంటాడని వ్యాఖ్యానించింది.

***కశ్చి దేవ సహస్రేషు దేవ పూజాది తత్పరః సత్త్వనిష్ఠః భవతి*** - వేల మందిలో ఏ ఒక్కడో మాత్రమే దేవారాధన తత్పరుడై ఉంటాడు. చాలా మంది రజోనిష్ఠులు గానో, తమోనిష్ఠులు గానో ఉంటారు ***(బాహుళ్యేన తు రజోనిష్ఠాః తమోనిష్ఠాః చ ఏవ ప్రాణినః భవన్తి )***.

ఆచార్యులు అలా వ్యాఖ్యానించడం వెనుక ఆంతర్యం ఏమిటో బాహాటం గానే తెలుస్తూ ఉంది. ఎక్కువ మంది అనిత్యమైన భోగాలకు, పదవులకు, కీర్తి ప్రతిష్ఠలకు ప్రాకులాడు తున్నారే గాని, పరమ పురుషార్థ మైన మోక్షం కొరకు పరమేశ్వరుని ఎంత మంది ఆరాధిస్తున్నారు?

అర్జునా! వేలాది మంది మనుషులలో ఏ ఒక్కడో మోక్షం కోసం ప్రయత్నిస్తాడు. అలాంటి వారిలో కూడా ఏ ఒక్కడో నా యథార్థ స్వరూపాన్ని తెలుసుకుంటాడు అని గీతాచార్యుడే ఏడవ అధ్యాయంలో చెప్పి ఉన్నాడు కదా *(7 వ అ - 3 వ శ్లో)*. విశిష్టమైన ఫలం కలది కాబట్టి జ్ఞానం దుర్లభము. అట్టి దుర్లభమైన జ్ఞానము కొరకు ప్రయత్నించే వారు కూడా దుర్లభులే మరి!

*రాజస, తామస శ్రద్ధలతో పూజాదికాలు నిర్వహించే వారు ఆసురీ సంపదకు సంబంధించిన వారు. వారు కూడా ఉగ్రమైన తపస్సులు చేస్తారు. అవన్నీ త్యాజ్యములే కాని యోగ్యములు కావని, తరువాత వరుసగా రెండు శ్లోకాలలో చెబుతున్నాడు.*

**అశాస్త్రవిహితం ఘోరం తప్యన్తే యే తపో జనాః ।**
**ద మ్భాహంకార సంయుక్తాః కామరాగ బలాన్వితాః ॥** 5

*అశాస్త్రవిహితం-ఘోరం-తప్యంతే-యే-తపః-జనాః*
*దంభాహంకార సంయుక్తాః-కామరాగబలాన్వితాః*

**కర్షయన్తః శరీరస్థం భూతగ్రామ మచేతసః ।**
**మాంచై వాన్తః శరీరస్థం తా న్వి ద్ధ్యాసుర నిశ్చయాన్ ॥** 6

*కర్షయంతః-శరీరస్థం-భూతగ్రామం-అచేతసః*
*మాం-చ-ఏవ-అంతః శరీరస్థం-తాన్-విద్ధి-ఆసురనిశ్చయాన్*

| | | | |
|---|---|---|---|
| అశాస్త్రవిహితం | = శాస్త్ర విరుద్ధమైన | భూతగ్రామం | = ఇంద్రియ సమూహమును |
| ఘోరం | = భయంకరమైన | అంతఃశరీరస్థం | = ఆంతర్యములో ఉన్న |
| తపః | = తపమును | మాం చ ఏవ | = నన్నును |
| యే | = ఎట్టి | కర్షయంతః | = కృశింప జేయుచున్న వారై |
| జనాః | = జనులు | తప్యంతే | = తపస్సు చేస్తున్నారో |
| దంభాహంకార సంయుక్తాః | = దంభము తోను, అహంకారము తోను కూడిన వారై | తాన్ | = అట్టి |
| | | అచేతసః | = అవివేకులు |
| కామరాగబలాన్వితాః | = కామరాగ బలముతో కూడిన వారు | ఆసుర నిశ్చయాన్ | = అసుర స్వభావము గల వారని |
| | | విద్ధి | = గ్రహించు |
| శరీరస్థం | = శరీరము నందున్న | | |

**అర్జునా! అసుర స్వభావులు దంభముతో, అహంకారముతో ఉంటారు. వీరు కామ రాగ బలాన్వితులు. శాస్త్ర విరుద్ధంగా ఘోరమైన తపస్సులు చేస్తారు.**

**దేహము నందున్న ఇంద్రియాలను శుష్కింప చేస్తారు. శరీరంలో ఉన్న నన్ను కూడా కృశింప చేస్తారు. వీళ్ళు అవివేకులు. అసుర జీవనం కల వారని తెలుసుకో!**

### వ్యాఖ్య

సాత్త్వికులు దైవీ ప్రకృతికి సంబంధించిన వారు. సాత్త్విక శ్రద్ధ కలిగిన దైవీ సంపద కల వారు దేవతలను పూజిస్తారు. ఇక రాజసులు, తామసులు ఆసురీ సంపదకు సంబంధించిన వారు. వారి అసుర ధర్మాన్ని ప్రస్తుతం ఐదు, ఆరు శ్లోకాలలో చెబుతున్నాడు.

శాస్త్రోక్తము కాని, శాస్త్ర విధి విధానమునకు సంబంధించని దారుణమైన తపస్సును అసుర సంపద కలిగిన ఈ రాజస తామసులు ఆచరిస్తారు.

ఏదయితే శాస్త్రము చేత ప్రతిపాదించ బడ లేదో అది అశాస్త్ర విహితము ***(న శాస్త్ర విహితమ్ అశాస్త్ర విహితమ్).*** అసుర జనులు ఆచరించే తపస్సు శాస్త్ర ప్రతిపాదితము కాక పోవడమే గాక ఘోర మైనది కూడా. ఘోర మైనది అంటే పీడాకర మైనది ***(ఘోరం పీడాకారం ప్రాణినామ్).*** తనకు, ఇతరులకు పీడను కలిగించే ఉగ్ర రూప సాధనే ఘోర తపస్సు. రాజస తామస ప్రవృత్తి కల ఆసురీ ప్రకృతికి సంబంధించిన వారు శాస్త్ర విరుద్ధ మైన ఈ ఘోర తపస్సులు ఆచరిస్తారు. ఇవి శాస్త్ర విరుద్ధాలు కనుక నింద్యములు.

ఉగ్ర రూపాన్ని ప్రదర్శించే వీరి తపస్సులు వారికి, లోకానికి కూడా హితకర మైనవి కావు. పైగా, ఇరువురికీ





పీడను కలిగిస్తాయి కనుక అహితములు. గర్హనీయములు. తపస్సు అనేది ఏదైనా మనస్సు లోని పాపాలను, దోషాలను నివారించు కొనేందుకే ఉద్దేశింప బడింది.

***తపతీతి తపః*** - తపింప చేసేది కనుక తపస్సు అన్నారు. భూమి నుండి బంగారును వెలికి తీసి నపుడు దానిని నిప్పులో బాగా కాల్చుతారు. తపింప చేస్తారు. అలా చేయడం వల్ల బంగారు నిష్కల్మషమై, నిర్మలమై, నిగ్గు తీరి దివ్యంగా ప్రకాశిస్తుంది. అలాగే మనస్సు లోని దోషాలను నిర్మూలించుకొని మనస్సును పవిత్రం చేసుకోవడానికి ఉపకరించే పవిత్రమైన సాధనయే తపస్సు. తపస్సు చేత పాపాలు క్షీణింప చేసుకున్న ముముక్షువులు, జ్ఞానప్రాప్తి ద్వారా మోక్షసిద్ధికి ప్రయత్నిస్తారు ***(తపోభిః క్షీణ పాపానాం).*** ఇది సాత్త్వికులు ఆచరించే తపస్సు. దైవీ సంపద కల వారు అనుష్ఠించే తపస్సు. ఈ తపస్సు తేజోవంత మైనది. ఈ విధమైన తపస్సు తాపసులనే గాక, వారిని ఆశ్రయించిన వారికి కూడా స్ఫూర్తిని, దీప్తిని ప్రసాదించి వారి జీవితాలను కూడా తేజోమయం చేస్తుంది. కాని, ప్రస్తుతం మనం చూస్తున్న అశాస్త్ర విహితము, దారుణము అయిన ఈ తపస్సు తాపసులకు, అలాగే ఇతరులకు కూడా పీడనే కలిగిస్తూ ఉంది ***(పీడాకారం ప్రాణినామ్ ఆత్మనశ్చ).***

అసుర జనులు కొందరు తపస్సు పేరుతో కఠోరమైన ఉపవాస దీక్షలు చేస్తూ ఉంటారు. ఉపవాస దీక్షలు పరమోత్కృష్ట మని వారి అభిప్రాయము. ఉపవసించడం ఆరోగ్యానికి మంచిదే కాని, అది ఏదో, ఎప్పుడో అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని చెయ్యాలి. ఏకాదశీ వ్రతాల వంటివి అనుసరించ వచ్చు. అలాగని ఉపవాసాన్నే ఒక ఉగ్ర తపస్సుగా మలచుకొని రోజుల తరబడి నిరాహారంగా ఉండటం, తత్ఫలితంగా దేహేంద్రియ మనోబుద్ధులు శుష్కించి పోతూ ఉంటే, ఈ దారుణాన్ని చూడలేక సన్నిహితులు, బంధువులు పరితపిస్తూ ఉండటం తపస్సు అని శాస్త్రం ఎక్కడా చెప్ప లేదు. అందువల్ల వీళ్ళు ఆచరించే తపస్సు అశాస్త్ర విహితము. ఉపవాసాలే గనుక ఉదార తపస్సులై ఆధ్యాత్మిక ఉన్నతికి సహకరించే టట్లైతే, ముప్పూటలా తిండికి నోచుకోని పేదలు, రోగులు, బిచ్చగాళ్ళు అందరూ తాపసులై, యోగులై తరించి పోయి ఉండే వారు.

మరి, అలాంటప్పుడు ఈ ఆసురీలు ఈ విధమైన ఉగ్ర తపస్సులు ఎందుకు చేస్తారు? ఏముంది! దంభానికి చేస్తారు. అహంకారాన్ని ప్రదర్శించుకోవ డానికి చేస్తారు. అదొక ఆటోపము. దంభము. తనను మించిన వారు లేరు అని ప్రకటించుకొనే జంభము. రాజస తామస ప్రవృత్తి కలిగిన తపస్సు లన్నీ ఇలాగే ఉంటాయి. చేసే వాళ్ళకు ఉపయుక్తం కావు. పరులకూ ఉపకరించవు. పైగా, ఉభయులకూ కీడు చేస్తాయి. పరితాపాన్నే మిగుల్చుతాయి.

కొందరు పది మంది తిరిగే చోట ఒంటి కాలు మీద నిలబడి కఠోరంగా తపిస్తూ ఉంటారు. ఆ తరువాత కొంపలో తైల మర్దనం చేయ లేక కుటుంబీకులు యాతన పడుతూ ఉంటారు.

కొందరు ***తప్త శిలారోహణ తపస్సు***ను కూడలిలో నిలబడి ఆచరిస్తూ ఉంటారు. ఇందులో తపస్సేమీ ఉండదు. అంతా ప్రదర్శనమే. తప్తశిల అంటే బాగా వేడెక్కిన రాయి. ఆ కాలే రాతి మీద కాళ్ళు పెట్టి, కళ్ళు పైకెత్తి చూస్తూ, కదలకుండా నిలబడి ఉండటము తప్తశిలారోహణ తపస్సు. నాకు తెలిసి శాస్త్రంలో ఎక్కడా ఈ దరిద్రం లేదు. అదేదో ఉగ్రమైన భద్ర తపస్సు అని పదుగురి మెప్పు కోసం ఈ దారుణాన్ని భరిస్తారు. మరి, వాళ్ళకు కాళ్ళు మండి పోవా? ఎలా చేస్తారు? ఎందుకు మండి పోవు! కాళ్ళు మండి పోయినా, జన హృదయాలలో వారి కీర్తి నిండి పోవాలి అనేదే వారి దుగ్ధ. కూడలిలో ప్రదర్శన మిచ్చి కొంపకు చేరుతారు. ఇంకే ముంది? కొన్ని రోజుల వరకు కదల లేరు. మంచం లోనే పడి ఉంటారు. కాలిన కాళ్ళకు కొబ్బరి నూనె పట్టించ లేక కుటుంబీకు లంతా దిక్కు తోచని స్థితిలో కూలబడతారు. **మెచ్చుకు పెద్దమామ చస్తే, ఏడ్వలేక ఇంట్లో వాళ్ళు చచ్చారట** అనే సామెత బహుశ ఈ కుహనా తపోధనుల మహిమను చాటేందుకే పుట్టిందేమో!

అందుచేతనే శాస్త్ర విరుద్ధంగా వీరు ఆచరించే దారుణ మైన తపస్సులు దంభాహంకార సంయుక్తాలు అంటున్నాడు. అంటే, డాంభికత్వముతో, అహంకారముతో కూడినవే గాని పవిత్రమైన తపస్సులు కావు అని చెబుతున్నాడు.

అది నిజమే కావచ్చు. కాని, ఇంతటి దారుణమైన, కఠోరమైన కార్యాలు చేయడానికి వారికి అంత శక్తి ఎక్కడిది? ఆ బలం ఎవరిది? అది దైవబలం కాదు, అసుర బలం. అది దైవశక్తి కాదు, రాక్షస శక్తి. తపస్సు పేరుతో వారు అనుభవించే దారుణమైన బాధలను భరించే శక్తి వారికి కామం నుండి వస్తుంది. రాగం నుండి వస్తుంది. అది కామ శక్తి, రాగ శక్తి. అది కామం యొక్క బలం. రాగం యొక్క బలం. అందుకే వారిని కామ రాగ బలాన్వితులు అంటున్నాడు భగవంతుడు. అంటే, వారి బలం కామం చేత, రాగం చేత తయారైనది. అట్టి బలంతో కూడిన వారు కనుక వారు కామ రాగ బలాన్వితులు (**కామశ్చ రాగశ్చ కామరాగౌ, తత్కృతం బలం కామ రాగబలమ్, తేన అన్వితాః కామరాగ బలైః వా అన్వితాః కామరాగ బలాన్వితాః**).

దైవసంపద గల సాత్త్వికులకు భక్తియే బలం. జ్ఞానమే బలం. కాని, అసుర సంపద గల రాజస తామసులకు కామమే బలం. రాగమే బలం. అందుచేత వారు కామ రాగ బలాన్వితులు. ఇది క్షుద్రబలం. భద్రత నివ్వ లేని దరిద్ర బలం. దంభాహంకార సంయుక్తులై, కామరాగ బలాన్వితులై, రాజస తామస శ్రద్ధా ప్రేరితులైన ఆసురీ సంపద గల వారు ఆచరించే ఘోర తపస్సులు శాస్త్ర విరుద్ధాలు. స్వీయ ప్రగతి నిరోధకాలు. పర పీడనాలు.

రావణాసురుడు ఎంత ఘోర తపస్సు చేశాడు? హిరణ్యకశిపుడు ఎంత దారుణమైన తపస్సు నాచరించాడు? వీరిరువురు దేహేంద్రియాలను ఎంతగా శుష్కింప చేసుకున్నారు? బ్రహ్మరుద్రాదుల నుండి ఎన్ని వరాలను పొందారు? చివరికి ఏమి సాధించారు? వాళ్ళ తపః ఫల మేమిటి? ఏముంది! వారికీ సుఖం లేదు, వారిని ఆశ్రయించిన వారికీ మేలు లేదు. అంతా విధ్వంసమే. అంతా వినాశమే.

కఠోరమైన తపస్సు చేసి దివ్యమైన వరాలను పొందిన రావణాసురుడు కామం చేతికి చిక్కి శాశ్వతంగా కన్ను మూసాడు. భయంకరమైన తపస్సు నాచరించి అనితర సాధ్యమైన, విచిత్రమైన వరాలను పొందిన హిరణ్యకశిపుడు క్రోధము చేతిలో దారుణంగా ఓడిపోయి, నరసింహమూర్తి ఒడిలో నఖముల చేత చీల్చ బడి అసువులు బాసాడు.

మహోన్నత మైన ఉగ్ర తపస్సు నాచరించిన ఈ ఉభయులు, రాగద్వేషాది మల దోషాన్నే పోగొట్టుకోలేక పోయారు. చిత్తశుద్ధినే సాధించలేక పోయారు. ఇక మోక్షాన్ని సాధించే దేముంటుంది? మరి, వీళ్ళు ఎందుకని అలా అయ్యారు? ఏముంది, వారు అచేతసులు కావడమే కారణం అంటున్నాడు భగవంతుడు.

అచేతసులు అంటే అవివేకులు (**అచేతసః అవివేకినః**). అంటే వివేకము లేని వారు. ఆలోచనలలో స్పష్టత లేని వాళ్ళు. బుద్ధికి ప్రాధాన్యము నిచ్చే వాళ్ళే గాని బుద్ధిమంతులు, జ్ఞానవంతులు కావాలనే ఆలోచన చేయలేని వాళ్ళు. వివేకం లేని వాళ్ళు కనుక, వారి అనాలోచిత చర్యల వల్ల వాళ్ళు పతనం కావడమే గాక, ఇతరుల ప్రగతిని కూడా పాడు చేస్తారు. దారి తప్పిన వాళ్ళు కనుక, ఏ కారణం చేత నైనా పవిత్రమైన రంగాలకు సంబంధించిన కార్య క్షేత్రాలలో ప్రవేశించారంటే, ప్రజలు పెద్ద సంఖ్యలో పాడై పోతారు.

వివేకం కల వారు తాము ప్రగతిని సాధించడమే గాక, ఇతరులను కూడా ప్రగతి పథంలో నడిపిస్తారు. వివేకం లేని వారు, అంటే మనం చెప్పుకుంటున్న ఈ అచేతసులు; వాళ్ళు నశించడమే గాక, పరులను కూడా నశింప చేస్తారు. కాని, ప్రస్తుత శ్లోకంలో భగవంతుడు విస్మయాన్ని కలిగించే ఒక వాక్యాన్ని వినిపిస్తున్నాడు.



అచేతసులు, అంటే అవివేకులు అర్థ రహితమైన వారి ఘోర తపస్సు వలన వారి దేహంలో ఉన్న ఇంద్రియాలను కృశింప చేసుకోవడమే గాక (**శరీరస్థం భూతగ్రామం కరణ సముదాయమ్ కర్శయన్తః కృశీ కుర్వన్తః**). వారి శరీరాల లోపలే వారి కర్మలకు, బుద్ధికి సాక్షిగా ఉన్న తనను కూడా కృశింప చేస్తున్నారు అంటున్నాడు (**మాం చ ఏవ తత్కర్మ బుద్ధి సాక్షి భూతమ్ అన్తః శరీరస్థం కర్శయన్తః**).

అవివేకులైన ఈ రాజస తామసులు, అశాస్త్ర విహితంగా వారు ఆచరించే ఘోర తపస్సు వల్ల ఇంద్రియ సముదాయాన్ని కృశింప చేస్తున్నారు. ఉపవాస వ్రతాలు మొదలైన కఠోర సాధనల వల్ల వారి దేహాలు నిస్సార మవుతున్నాయి. దేహం లోనే ఉన్న ఇంద్రియాలు కూడా నిర్వీర్య మవుతున్నాయి.

అంతే కాదు. అంత కన్నా లోపల, శరీరంలో చైతన్య స్ఫూర్తిగా పరమేశ్వరుడే హృదయస్థుడై ఉన్నాడు. అట్టి పరమాత్మను కూడా వారు కష్ట పెడుతున్నారు అంటున్నాడు.

ఇంద్రియాలను శుష్కింప చేస్తున్నారు అనే వాక్యాన్ని అర్థం చేసుకో వచ్చు. అర్థం చేసుకున్నాం కూడా. కాని, పరమేశ్వరుని శుష్కింప చేస్తున్నారు అనే దానిని ఎలా అర్థం చేసుకోవాలి? శ్రీ శంకరులు ఎలా అర్థం చేసుకున్నారో అలాగే అర్థం చేసుకోవాలి.

పరమేశ్వరుని కృశింప చేయడము అంటే, పరమేశ్వరుని శాసనాన్ని అతిక్రమించడమే (**మదను శాసన అకరణ మేవ మత్కర్శనమ్** - శంకర భాష్యము).

ప్రమాణ మైన శాస్త్రము జ్ఞాన స్వరూపము. ఆ జ్ఞానము ఈశ్వర జ్ఞానమే. ఈశ్వరుడు, ఈశ్వర జ్ఞానము రెండు కావు. అచేతసులైన అసుర జనులు శాస్త్ర విరుద్ధ మైన తపస్సులను ఆచరించుట చేత, శాస్త్ర ధర్మాలను అతిక్రమిస్తున్నారు. కనుక, పరమేశ్వరుని అతిక్రమిస్తున్నారు.

ఇకపోతే, అశాస్త్ర విహితులైన రాజస తామసులు ధర్మ దూరులు. అధర్మపరులు. ధర్మము ఏదో కాదు, నియతి. నియతి రూపంలో ఉన్నది ఎవరో కాదు, నియంతయే, పరమేశ్వరుడే. కనుక, ధర్మాన్ని అతిక్రమించే ఈ అచేతసులు ధర్మ రూపంలో ఉన్న దైవాన్ని అతిక్రమించిన వారే అయ్యారు. ఈ విధంగా జ్ఞానాన్ని, ధర్మాన్ని తిరస్కరించి, దైవాన్ని తిరస్కరించిన వారయ్యారు. ఆసురీ ప్రకృతికి సంబంధించిన రాజస తామసులు అసుర నిశ్చయం కల వాళ్ళని తెలుసుకో మంటున్నాడు భగవంతుడు (**తాన్ విద్ధి అసుర నిశ్చయాన్**). అలాంటి అసుర జనాన్ని గూర్చి గీత ప్రబోధించడ మెందుకు? అసుర సంబంధమైన ఈ అనర్థ విషయాన్ని మనం ఆలకించడ మెందుకు? అనే సందేహం కలగ వచ్చు. దానిని నివారించేందుకు భాష్యంలో ఆచార్యుల వారు ఒక్క వాక్యం పలికారు. అసుర జనుల నుండి, అసుర ప్రవృత్తి నుండి దూరంగా ఉండ మని సూచించడం కోసమే ఈ ఉపదేశం అని సందేశ మిచ్చారు (**యేషాం తే ఆసుర నిశ్చయాః తాన్ పరిహరణార్థం విద్ధి ఇతి ఉపదేశః**).

*గుణభేదాన్ని బట్టి త్రివిధము లైన పూజలను నాల్గవ శ్లోకంలో ఎలాగైతే చూశామో, అలాగే ఇప్పుడు త్రివిధములుగా తెలుస్తున్న ఆహారము, యజ్ఞము, తపస్సు, దానములను గూర్చి కూడా చెబుతున్నాడు.*

**ఆహార స్త్వపి సర్వస్య త్రివిధో భవతి ప్రియః ।** 7
**యజ్ఞ స్తప స్తథా దానం తేషాం భేద మిమం శృణు ॥**

**ఆహారః-తు-అపి-సర్వస్య-త్రివిధః-భవతి-ప్రియః**
**యజ్ఞః-తపః-తథా-దానం-తేషాం-భేదం-ఇమం-శృణు**

సర్వస్య = సర్వులకు

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆహారఃతు అపి | = | ఆహారము కూడా | తపః | = | తపస్సు |
| త్రివిధః | = | మూడు విధములు | దానం | = | దానమును |
| ప్రియః | = | ప్రియమైనది | తేషాం | = | వాని యొక్క |
| భవతి | = | అగుచున్నది | ఇమం | = | ఈ |
| తథా | = | అటులనే | భేదం | = | భేదమును |
| యజ్ఞః | = | యజ్ఞము | శృణు | = | విను |

**అర్జునా! అందరికీ ప్రియమైన ఆహారము కూడా మూడు విధాలుగా ఉంది. అలాగే యజ్ఞము, తపస్సు, దానము కూడా మూడు విధాలు. వాటి లోని అంతరాన్ని చెబుతా. విను.**

### వ్యాఖ్య

అసుర జనుల నుండి, అసుర ప్రవృత్తి నుండి దూరంగా ఉండటం కొరకు అసుర సంపదను ఎలాగైతే తెలుసుకున్నామో, అలాగే సాత్త్విక, రాజస, తామసులకు ప్రియంగా ఉండే త్రివిధ ఆహారాలను తెలుసుకోవడం చేత, ఎవరు ఏ ఆహారము నందు ప్రీతి కలిగి ఉన్నారో, దానిని బట్టి కార్యలింగము చేత (***కార్య లింగేన***) వారు సాత్త్వికులా, రాజసులా, తామసులా? అని తెలుసుకో వచ్చు. అలా తెలుసుకోవడం చేత, అసుర సంపదను పరిత్యజించాలని పూర్వం ఎలాగైతే చెప్పుకున్నామో, అలాగే ఇక్కడ కూడా రజ స్తమో గుణ లింగాలైన ఆహారాలను ముట్టకుండా, సత్త్వగుణ లింగాలైన ఆహారాలనే స్వీకరించ వచ్చు. అలాగే గుణ భేదాలను బట్టి యజ్ఞ దాన తపస్సులను తెలుసుకొని రాజస తామస యజ్ఞాలను, తపస్సులను, దానాలను పరిత్యజించి సాత్త్విక యజ్ఞాలను, తపస్సులను, దానాలను అనుష్ఠించడం కొరకు ఆహారాది త్రివిధ భేదాలను చెప్పడం జరుగుతూ ఉంది.

జ్ఞానము సిద్ధించాలంటే చిత్తము శుద్ధి పడి ఉండాలి. ఆహారము యొక్క సూక్ష్మాంశమే మనస్సు అవుతుంది. కనుక, మనం తీసుకొనే ఆహారము యొక్క ప్రభావము మనస్సు పై ఉంటుంది. మనం ఎలాంటి ఆహారాన్ని తీసుకుంటామో, అలాంటి బుద్ధే తయారవుతుంది అన్నారు పెద్దలు (***యాదృశం భక్షయేత్ అన్నం బుద్ధి ర్భవతి తాదృశీ***).

ఆహారము అంటే కేవలం అన్నము అనే అర్థాన్నే గ్రహించ డానికి లేదు. బాహ్యము నుండి మన లోకి ప్రవేశించేది ఏదైనా ఆహారమే. మనం పీల్చే గాలి కూడా ఆహారమే. బాహ్యం లోని శబ్దాది విషయాలు మన దేహం లోని శ్రోత్రాది ఇంద్రియాల ద్వారా లోనికి ప్రవేశిస్తూ ఉన్నాయి కనుక అవి కూడా ఆహారం క్రిందికే వస్తాయి. అయినా ఆహారము అన్నప్పుడు అన్న పానీయాలనే ప్రముఖంగా గ్రహిస్తూ ఉంటారు. ఆహారం విషయాన్ని యోగ శాస్త్రమే గాక, జ్ఞానకాండకు సంబంధించిన ఉపనిషత్తులు కూడా ప్రముఖం గానే చర్చించాయి.

***ఆహార శుద్ధౌ సత్త్వశుద్ధిః సత్త్వశుద్ధౌ ధృవాస్మృతిః స్మృతిలబ్ధే సర్వ గ్రన్థీనాం విప్రమోక్షః తస్మై మృదిత కషాయాయ తమసః పారం దర్శయతి.***

ఆహార శుద్ధితో అంతఃకరణ శుద్ధి కలుగుతుంది. అంతఃకరణ శుద్ధి వలన స్మృతి దృఢ మవుతుంది. నిశ్చలమైన స్మృతి చేత అజ్ఞాన ముడు లన్నీ విడి పోతాయి. తద్వారా దోషాలన్నీ దూర మవుతాయి అని భగవంతుడైన సనత్కుమారుడు నారద మహర్షికి ఛాందోగ్యోపనిషత్తులో బోధించాడు (*ఛాం॥ 7 - 26 - 2*).

మహాభారతం - ఉద్యోగ పర్వంలో శ్రీకృష్ణ పరమాత్మ రాయబారాని కేగి నపుడు దుర్యోధనుడు భగవంతుని విందుకు ఆహ్వానిస్తే, పరమేశ్వరుడు అంగీకరించ లేదు. సున్నితంగా తిరస్కరించాడు. ***ద్విషదన్నం న భోక్తవ్యం*** - విద్వేషులు పెట్టే ఆహారాన్ని భుజించ కూడదు అన్నాడు భగవంతుడు.



ఆహారం ఎలాగైతే మూడు విధాలుగా ఉందో, యజ్ఞ దాన తపస్సులు కూడా గుణ భేదాన్ని బట్టి మూడు విధాలుగా ఉన్నాయి. వాటికి సంబంధించిన భేదాన్ని వివరంగా చెబుతున్నాడు.

*ముందుగా సాత్త్విక శ్రద్ధ కల వానికి ఏ విధమైన ఆహారము ప్రియమో చెబుతున్నాడు.*

**ఆయుః సత్త్వ బలారోగ్య సుఖ ప్రీతి వివర్ధనాః ।**
**రస్యాః స్నిగ్ధాః స్థిరా హృద్యా ఆహారాః సాత్త్వికప్రియాః ॥** 8

*ఆయుః-సత్త్వః- బలః-ఆరోగ్యః-సుఖః-ప్రీతిః-వివర్ధనాః*
*రస్యాః-స్నిగ్ధాః-స్థిరాః-హృద్యాః-ఆహారాః-సాత్త్వికప్రియాః*

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆయుః | = | ఆయువు | రస్యాః | = | రస పూర్ణ మైనవి |
| సత్త్వః | = | సత్త్వము | స్నిగ్ధాః | = | చమురు గలవి |
| బలః | = | బలము | స్థిరాః | = | స్థిర మైనవి |
| ఆరోగ్యః | = | ఆరోగ్యము | హృద్యాః | = | మనస్సునకు ప్రియ మైనవి |
| సుఖః | = | సుఖము | ఆహారాః | = | ఆహారములు |
| ప్రీతిః | = | సంతోషము | సాత్త్వికప్రియాః | = | సాత్త్వికులకు ప్రియములు |
| వివర్ధనాః | = | వృద్ధి చేయునవి | | | |

**అర్జునా! ఆయుష్షును, సత్త్వమును, బలమును, ఆరోగ్యమును, సుఖమును, ప్రీతిని వృద్ధి చేసేవి - అలాగే రసపూర్ణ మైనవి, స్నిగ్ధము, స్థిరము, హృద్యము అయిన ఆహారములు సాత్త్వికులకు ప్రియ మైనవి.**

### వ్యాఖ్య

సాత్త్వికులైన వారికి ప్రియమైన ఆహారమును గూర్చి చెబుతున్నాడు. అదే సాత్త్వికాహారము. పది విషయాలతో కూడి ఉన్నది. ఈ ఆహారము ఏమి ఇస్తుందో, ఆరు విషయాలుగా చెప్ప బడ్డాయి. ఈ ఆహారము ఎలా ఉంటుందో, నాలుగు విషయాలలో చెప్పడం జరిగింది. మొత్తం పది విషయాలు.

**ఆయుర్వర్ధనం :-** సాత్త్వికాహారము ఆయుర్దాయమును పెంచేదై ఉండాలి. ఎలాంటి ఆహారాన్ని గ్రహిస్తే దీర్ఘ జీవితం ఉంటుందో అది సాత్త్వికము. దీర్ఘ జీవిత మెందుకు? కాకితో పోటీ పడటానికా? కాదు. ధర్మ, జ్ఞాన సంపాదనార్థం దీర్ఘాయువు ఉండాలి. అలాంటి ఆయుష్షును ప్రసాదించే ఆహారము సాత్త్వికము. ఏది దీర్ఘ కాల జీవనాన్ని ప్రసాదిస్తుందో అది సాత్త్వికాహారము.

**సత్త్వస్థితి :-** సత్త్వము అంటే చిత్త స్థైర్యము. దుఃఖాలు, బాధలు ముంచు కొచ్చినా చెదరని, చెరగని ధైర్యాన్ని, స్థైర్యాన్ని కలిగించే ఆహారము సాత్త్వికాహారము. మనస్సులో ఉద్యమ స్ఫూర్తి, ఉత్సాహ దీప్తి సత్త్వ ప్రధానాలు.

**బలవర్ధకం :-** మనస్సుకు పుష్టి నిచ్చేది సత్త్వ మైతే, దేహానికి పుష్టి నిచ్చేది బలం. అదే ధాతు పుష్టి (**ధాతు ప్రపోషణమ్**). కార్య నిర్వహణము నందు దేహ సామర్థ్యమే బలం. అట్టి బలమును పెంపొందించేది సాత్త్వికము. దేహేంద్రియములకు పుష్టి నిచ్చే ఆహారము.

**ఆరోగ్య ప్రదం :-** ఆహారము ఆరోగ్యాన్ని ప్రసాదించేదై ఉండాలి. అట్టి ఆరోగ్యప్రద మైన ఆహారము సాత్త్వికము. రోగము లేకుండా ఉండటమే ఆరోగ్యము. కనుక సాత్త్వికాహారము ఔషధ లక్షణాలను కూడా కలిగి ఉంటుందని భావము. వ్యాధుల్ని, దేహ బాధల్ని దగ్గరకు రానివ్వని ఆహారము.

**సుఖ వర్ధనం :-** ఆహారము సుఖాన్ని పెంపొందించేదై ఉండాలి. ఆహార సేవనము హృదయాహ్లాదాన్ని కలిగించాలి. భుజించడంలో ఆనందము కలగాలి. తినే కొద్దీ సుఖము, లేదా ఆనందము కూడా పెరుగుతూ ఉండాలి. భోజనానంతరము ఆయాసము లేకుండా ఆనందాన్ని ప్రసాదించేదై ఉండాలి.

**ప్రీతి వర్ధనం :-** తినడానికే కాదు, చూడటానికి కూడా ప్రియంగా ఉండాలి. కొన్ని పదార్థాలను చూడగానే ఆకలి చచ్చి పోతుంది. 'చూడటానికి అలా ఉంటుంది. తిని చూడండి మీకే తెలుస్తుంది' అని వడ్డించే వాళ్ళు చెబుతూ ఉంటారు. కళ్ళే వద్దంటుంటే, ఇక కడుపెలా సాహసిస్తుంది? చూచే కొద్దీ తినా లనిపించాలి. అప్పుడే అది ప్రీతి వర్ధనము. ఇంతవరకు సాత్త్వికాహారము మనకు ఏమి ఇస్తుందో తెలుసుకున్నాం. ఇక ఆ విధమైన ఆహారము ఎలా ఉంటుందో తరువాత నాలుగు విషయాలలో చూద్దాం.

**రసపూర్ణం :-** రసవంత మైనవి. మధుర మైనవి. రసయుక్త మైనవి ***(రసోపేతాః)***. రుచికరమై ఆస్వాదింప దగిన ఫల రసనీయాలు. మధుర రస ప్రధానమైన ఆహారములు ***(రస్యాః)***. సులభంగా జీర్ణమయ్యే పండ్లు, కాయలు మొదలైనవి ***(లఘు పాకం)***.

**స్నిగ్ధములు :-** స్నిగ్ధములు అంటే చమురు కలవి. స్నేహవంతాలు. స్నేహయుక్తాలు ***(స్నేహవన్తః)***. పుష్టి వంతాలు. పాలు, నెయ్యి, వెన్న, పెరుగు మొదలైనవి సహజ స్నేహయుతాలు. ఆగంతుకము లైన ఘృతము మొదలైన వాటితో కలిసిన పుష్టికరమైన పదార్థాలు కూడా స్నిగ్ధములే.

**స్థిరములు :-** స్థిరములు అంటే స్థిర మైనవి ***(స్థిరాః)***. స్థిరమైన పరిణామం కలవి. ఎక్కువ కాలము దేహానికి పుష్టిని, శక్తిని ఇస్తూ ఉపకరించేవి స్థిరములు. అపకారం చేయకుండా, నిదానంగా జీర్ణ మౌతూ శరీరానికి ధార లాగా శక్తిని సమకూర్చేవి ***(చిరకాల స్థాయినో దేహే)***. సారవంత మైనవి. పుష్టి దాయకాలు. దీర్ఘ పుష్టి దాయకాలు.

**హృద్యములు :-** హృదయాహ్లాదములు. హృదయ ప్రియాలు ***(హృద్యాః హృదయ ప్రియాః)***. హృదయంగమములు. శుచి, గంధ, దర్శన ప్రియాలు. మనోహరాలు. దర్శనము తోనే హృదయాన్ని ఆకర్షించేవి. రమణీయాలు. మనస్సుకు ఇంపితాలు.

ఈ విధమైన ఆహారాలు ***(ఆహారాః)*** - అంటే చర్వ్యములైన చోష్య, లేహ్య, పేయాలు సాత్త్వికులకు ప్రియ మైనవి ***(సాత్త్విక ప్రియాః సాత్త్వికస్య ఇష్టాః)***. ఇంతవరకు మనం చెప్పుకొనిన పది విషయాలు ఒకే పదార్థములో లభించే అవకాశం ఉందా? అది కూడా ఆగంతుకాలతో కలవకుండా ఒకే పదార్థములో సహజంగా ఉంటాయా? ఏమో! కొబ్బరిని గూర్చి కొద్దిగా ఆలోచించండి. ఇది నా అభిప్రాయం మాత్రమే. చర్చనీయాంశం కాదు.

*ఇక రాజసులకు ప్రియమైన ఆహారాన్ని చెబుతున్నాడు.*

**కట్వామ్ల లవణాత్యుష్ణ తీక్ష్ణరూక్ష విదాహినః ।**
**ఆహారా రాజస స్యేష్టా దుఃఖశోకామయప్రదాః ॥** 9

***కటు-అమ్ల-లవణ-అత్యుష్ణ-తీక్ష్ణ-రూక్ష-విదాహినః***
***ఆహారాః-రాజసస్య-ఇష్టాః-దుఃఖశోకామయప్రదాః***

| | | |
|---|---|---|
| కటు | = | చేదు |
| అమ్ల | = | పులుపు |
| లవణ | = | ఉప్పు |
| అత్యుష్ణ | = | మిక్కిలి వేడి |
| తీక్ష్ణ | = | కారము |





| | | |
|---|---|---|
| రూక్ష | = | శోషకరము |
| విదాహినః | = | దాహము కలిగించేవి |
| దుఃఖశోకామయప్రదాః | = | దుఃఖమును, శోకమును కలుగజేయునవి అగు |
| ఆహారాః | = | ఆహారములు |
| రాజసస్య | = | రజోగుణము గల వారికి |
| ఇష్టాః | = | ఇష్టములు |

**అర్జునా! చేదు, పులుపు, ఉప్పు, మిక్కిలి వేడి, కారము, రసహీనము, దాహం కలిగించేవి - ఈ విధమైన పదార్థాలు రాజసులకు ప్రియమైన ఆహారాలు.**

**వ్యాఖ్య**

***ఆయుస్సత్త్వ బలారోగ్య*** అంటూ పది విషయాలతో సాత్త్వికులకు ప్రియమైన ఆహారమును గూర్చి చెప్పిన భగవంతుడు, ప్రస్తుత శ్లోకంలో **కట్వామ్ల లవణాత్యుష్ణ** అంటూ ఏడు విషయాలతో రాజసులకు ప్రియమైన ఆహారాన్ని గూర్చి చెబుతున్నాడు. ఈ శ్లోకం **కట్వామ్ల** అంటూ ప్రారంభమైంది. దీనికి **కట్వమ్ల** అని పాఠాంతరము కూడా ఉంది. ఎలాగైనా పఠించ వచ్చు.

చేదు ***(కటుః)***, పులుపు ***(అమ్లః)***, ఉప్పు ***(లవణః)***, అతివేడి ***(అత్యుష్ణః)***, కారము ***(తీక్ష్ణః)***, శోషకరము ***(రూక్షః)***, దాహయుతము ***(విదాహినః)*** - ఈ ఏడు విషయాలు కల ఆహారాలు రాజసులకు ప్రియ మైనవి ***(ఆహారాః రాజసస్య ఇష్టాః ప్రియాః ఇతి)***. ఇవి దుఃఖశోకామయప్రదాలు ***(దుఃఖ శోకామయప్రదాః)***.

***కట్వామ్ల లవణాత్యుష్ణ తీక్ష్ణ రూక్ష విదాహినః*** అనే ఏడు విషయాలలో నాల్గవది అత్యుష్ణము. 'అతి' అనే శబ్దం కలవడం చేత ఉష్ణము అత్యుష్ణ మైంది. ఈ 'అతి' శబ్దాన్ని మిగత ఆరంటికి కూడా అన్వయించు కోవాలి. అప్పుడు అతి చేదు, అతి పులుపు అంటూ అన్నీ అతిగా వ్యవహరిస్తాయి ***(అత్యుష్ణః అతి శబ్దః కట్వాదిషు సర్వత్ర యోజ్యః - అతి కటుః అతి అమ్ల ఇత్యేవమ్)***. ఇందులో ఒక అంతర్భావము కూడా ఉంది. 'అతి' శబ్దాన్ని ఏడు విషయాలకూ అన్వయించు కుంటున్నాము కదా! అతి అనేది ఎక్కడైనా, ఎప్పుడైనా వర్జనీయమే ***(అతి సర్వత్ర వర్జయేత్)***. కనుక, రాజసులకు ఇష్టమైన ఈ ఏడు విషయాలు కూడా విడువ దగినవే గాని వాడుకో దగినవి కావు. ఉపేక్షణీయాలే గాని అపేక్షణీయాలు కావు.

రాజసులు స్వీకరించే ఆహారములో 'అతి' సర్వత్ర దర్శనీయంగా ఉంటుంది. చట్నీలో పులుపు చిక్కగా తెలుస్తూ ఉన్నా, నిమ్మళంగా నిమ్మ చెక్కను పిండుకొని నిండుగా, దండిగా భోం చేస్తూ ఉంటారు. పులుపుతో సరిపెట్టుకోరు. అతి పులుపును ఆదరిస్తారు. పులుపు అతిగా ఉంది కనుక ఉప్పు, కారము కూడా అతి గానే ఉంటాయి.

సాత్త్వికాహారం యోగ్యమై, యోగమయంగా ఉంటే, రాజసాహారం అయోగ్యమై రోగమయంగా ఉంటుంది. కట్వామ్లాలు అతిగా తీసుకోవడం వల్ల జీర్ణక్రియ దెబ్బ తింటుంది. ఉదరాకాశంలో ఊపిరి సలుపని గాలి దుమార మంతా దీని ప్రభావమే. దేహం మీదే కాకుండా మనస్సు పై కూడా దీని ప్రభావం ఉంటుంది. మనస్సులో క్రోధావేశము, చాంచల్యము మొదలైన వన్నీ తీక్ష్ణామ్ల లవణాల ప్రభావమే. చట్నీలు, పచ్చళ్ళు, నిలువ ఉంచిన వ్యంజనములు ఆరోగ్యాన్ని పాడు చేసే రాజసాహారాలే. రాజసాహారా లన్నీ నాలుకకు విందు చేస్తాయి. మనస్సుకు పసందును కలిగిస్తాయి. ఉదరాన్ని మాత్రం పాడు చేస్తాయి. ఆరోగ్యానికి కీడు తెస్తాయి. అతి ఉష్ణం కారణం గానే నరాలు బలహీన పడతాయి. వృద్ధాప్యంలో దేహాంగాల కంపనాలు, కరచరణాదుల చలనాలు - ఇవన్నీ వయసులో అతి వేడి పదార్థాలను, పానీయాలను స్వీకరించడం వల్ల కలిగిన అనర్థాలే. దేహానికి, ఇంద్రియాలకు,

ప్రాణానికి, మనస్సుకు ముప్పు కలిగించ డానికి ముందు వరుసలో ఉండేది ఉప్పే. ధాతు నష్టం మొదలుకొని రక్తపోటు వరకు అంతా ఉప్పు నిర్వాకమే.

రాజసులకు ప్రియమైన ఈ రాజసాహారము చివరగా దుఃఖ శోకామయప్రదము అంటున్నాడు (**దుఃఖ శోకామయప్రదః**).

దుఃఖమును, శోకమును ఆమయమును కలిగించే ఆహారములు కనుక అవి దుఃఖశోకామయ ప్రదాలు (***దుఃఖం చ శోకం చ ఆమయం చ ప్రయచ్ఛన్తి ఇతి దుఃఖ శోకామయప్రదాః***). రాజసాహారాన్ని తీసుకోవడం వల్ల తక్షణ ప్రభావమును చూపేది దుఃఖము. కాలాంతరములో దుర్భరమైన కష్టాన్ని కలిగించేది శోకము. ఇక ఆమయము అంటే రోగము. భుజించ గానే అజీర్ణ ఆయాసాది బాధలే దుఃఖాలు. కాలగతిలో భయంకరంగా బాధించే మధుమేహము, రక్తపోటు మొదలైనవి శోకరూపాలు. చివరగా రోగాల వాత పడటం ఆమయము. ఇవే, రాజసాహారం వల్ల కలిగే దుఃఖశోకామయాలు.

*ఇక తామసులకు ప్రియమైన ఆహారాన్ని గూర్చి చెబుతున్నాడు.*

**యాతయామం గతరసం పూతి పర్యుషితం చ యత్।**
**ఉచ్ఛిష్ట మపి చామేధ్యం భోజనం తామస ప్రియమ్ ॥** 10

***యాతయామం-గతరసం-పూతి-పర్యుషితం-చ-యత్***
***ఉచ్ఛిష్టం-అపి-చ-అమేధ్యం-భోజనం-తామసప్రియం***

| | | | |
|---|---|---|---|
| యాతయామం | = వండిన తరువాత ఒక జాము గడిచినది | అమేధ్యం చ | = అశుద్ధ మైనది |
| గతరసం | = రుచి పోయినది | యత్ | = ఏ |
| పూతి | = దుర్గంధ మైనది | భోజనం | = ఆహారము |
| పర్యుషితం చ | = పాసి పోయింది | తత్ | = అది |
| ఉచ్ఛిష్టం అపి | = ఇతరులు తినగా మిగిలినది | తామసప్రియం | = తామసులకు ప్రియము |

**అర్జునా! పక్వం కాని ఆహారము, రసహీన మైనది, దుర్గంధ మైనది, పాసి పోయినది, ఎంగిలి చేసినది, అశుద్ధ మైనది - ఈ విధమైన ఆహారము తామసులకు ప్రియము.**

**వ్యాఖ్య**

పది విషయాలతో సాత్త్విక ప్రియమైన ఆహారాన్ని, ఏడు విషయాలతో రాజస ప్రియమైన ఆహారాన్ని తెలిపిన పరమేశ్వరుడు, ఆరు విషయాలతో తామస ప్రియమైన ఆహారాన్ని గూర్చి వివరిస్తున్నాడు. యాతయామం, గతరసం, పూతి, పర్యుషితం, ఉచ్ఛిష్టం, అమేధ్యం - ఈ ఆరు విధములైన ఆహారము తామస ప్రియమైనది.

**యాతయామం**

యాతయామము అంటే సరిగ పక్వము కాని ఆహారము అని అర్థము (***మందపక్వం***). కొంచెము పక్వమైనది, లేదా సగం ఉడికినది అని అర్థము. ఇది భాష్యార్థము. శ్రీ శంకరులు చెప్పిన అర్థము.

***యామః*** అనేది కాల విషయము. యామ మంటే ఒక జాము కాలము అని అర్థము. జాము అంటే మూడు గంటల కాలము. ***యాతః*** అంటే గడచినది అని అర్థము. యాతయామము అంటే ఒక జాము, అంటే





మూడు గంటల కాలము గడచినది. వండిన తరువాత మూడు గంటల కాలము నిల్వ ఉంచిన ఆహారము యాతయామ మవుతుంది. వండిన ఆహారము నిల్వ చేసుకొనే పరికరాలు లేని ఆ రోజుల్లో మూడు గంటల కాలము ఆహారము నిల్వ ఉంటే పాడై పోయే అవకాశము ఉండేది. కనుక యాతయామ మైన ఆహారాన్ని ఎవ్వరూ స్వీకరించరు. కాని, అట్టి ఆహారమును తామసులు ప్రియంగా ఆరగిస్తారు.

**గతరసం**

రసం లేనిది గతరసం. రసహీనము. ఏ ఆహారము నందు రసము హరించుకుని పోయిందో అది గతరసం. నిర్వీర్యమైన ఆహారము (***నిర్వీర్యస్య గత రసేన ఉక్తత్వాత్, గతరసం రస వియుక్తం***). సారము లేని ఆహారము. పోషక పదార్థాలు క్షీణించిన ఆహారము. అట్టి ఆహారము తామస ప్రియము.

**పూతి**

పూతి అంటే దుర్వాసనతో కూడినది (***పూతి దుర్గంధం***). దుర్గంధముతో కూడిన ఆహార పానీయాదులను పూతి అంటారు. అంటే కంపు గొట్టే పదార్థాలు. కుళ్ళిన పదార్థాలు, మాంసమత్స్యాదులు, కల్లుసారాలు, అతిశయించి మగ్గిన ఫలాలు - ఇవన్నీ దుర్గంధము తోనే ఉంటాయి. తినడానికి, త్రాగడానికి యోగ్యం కాకుండా ఉంటాయి. కాని, తామసులకు అవే ప్రియంగా ఉంటాయి.

**పర్యుషితం**

వండిన ఆహారమును ఒక రాత్రి నిల్వ ఉంచితే, దానిని పర్యుషితం అంటారు. రాత్రి వండిన ఆహారాన్ని నీళ్ళల్లో ఉంచి, ఉదయాన్నే అట్టి ఆహారాన్ని చల్ది అన్నంగా ఆరగిస్తూ ఉంటారు. ఈ విధమైన ఆహారము పర్యుషితం అనబడుతుంది. ఈ చల్ది అన్నమును భోం చేసిన వారు కప్పను మ్రింగిన పాము ల్లాగా మత్తుగా కనిపిస్తారు. అవకాశము వచ్చినప్పుడల్లా కునుకు తీస్తూ ఉంటారు. తామసులకు ప్రియ మైనది కనుక తమో గుణ ప్రధానమై మత్తును కలిగిస్తుంది. ఇదే కాదు, మత్తును కలిగించే దేదైనా తామసికాహారమే.

**ఉచ్ఛిష్టం**

ఇతరులు తినగా మిగిలిన ఆహారాన్ని ఉచ్ఛిష్టము అంటారు (***ఉచ్ఛిష్టమ్ భుక్త శిష్టమ్***). అలాంటి దానిని వాస్తవానికి తిన కూడదు.

***యజ్ఞ శిష్టా శిన స్సన్తో ముచ్యన్తే సర్వ కిల్బిషైః -*** యజ్ఞ శిష్టము, లేదా యజ్ఞ శేషమైన ఆహారాన్ని ఎవరు భుజిస్తారో, వాళ్ళు సమస్త కల్మషాల నుండి విడి పడతారు అని శ్రీ భగవానువాచ *(3 వ అ - 13 వ శ్లో).*

***యజ్ఞశిష్టామృత భుజో యాన్తి బ్రహ్మ సనాతనమ్ -*** యజ్ఞశిష్టంగా, లేదా యజ్ఞ శేషంగా మిగిలిన ఆహారము అమృత తుల్యము. అట్టి అమృతాహారాన్ని భుజించే వారు సనాతన మైన బ్రహ్మపదమును పొందుతారు అని గీతాచార్యుని ప్రబోధము *(4 వ అ - 31 వ శ్లో).*

యజ్ఞాల చేత సంతృప్తి చెందిన దేవతలు భోగ్యములను అనుగ్రహిస్తారు. దేవతలు అనుగ్రహించిన వాటిని తిరిగి కృతజ్ఞతా భావంతో వారికి సమర్పించకుండా ఎవడైతే స్వార్థంతో తానే అనుభవిస్తాడో, అతడు ఎవరో కాదు, దొంగ అని భగవద్గీతే అన్నది (***స్తేనః ఏవ తస్కరః ఏవ, సః దేవాది స్వాపహారీ*** *- 3 వ అ - 12 వ శ్లో).*

పరమేశ్వరుని అనుగ్రహంగా ప్రాప్తించిన ఆహారాన్ని పరమేశ్వరునికి సమర్పించకుండా భుజించ కూడదు. పరమేశ్వరునికి సమర్పిస్తే అది యజ్ఞశేష మవుతుంది. అమృత మవుతుంది. మరి, ఇతరులు భుజించిన ఆహారాన్ని, అనగా ఉచ్ఛిష్టాన్ని పరమేశ్వరునికి ఎలా సమర్పించ గలము? సమర్పించకుండా మన మెలా

భుజించ గలము? కనుక, యజ్ఞ శేషాన్ని భుజించాలే గాని, భుక్త శేషాన్ని, అనగా ఉచ్ఛిష్టాన్ని భుజించ కూడదు. కాని, అట్టి ఉచ్ఛిష్టమైన ఆహారమే తామసు లకు ప్రియంగా ఉంటుంది. కారణం, వారు దైవదూరులు, అశాస్త్ర విహితులు కనుక.

**అమేధ్యం**

అమేధ్యము అంటే యజ్ఞార్హము కానిది ***( అమేధ్యమ్ అయజ్ఞార్హమ్ ).*** పూజార్హము కానిది. నివేదింప తగనిది. పరమేశ్వరునికి సమర్పించకుండా ఆహారాన్ని ఆరగించ కూడదు అని ఇప్పుడే తెలుసు కున్నాం. సమర్పించ డానికి అయోగ్యమైన దానిని కూడా తినకూడదు అనేది ప్రస్తుత విషయం. అంటే పూజార్హాలు, యజ్ఞార్హాలు కాని కలంజాదులను భుజించ కూడదు అని అర్థము. సమర్పించకుండా భుజిస్తే దొంగ లవుతాము *(3 వ అ - 12 వ శ్లో).* అలాగని పూజకు అనర్హమైన దానిని ఎలా సమర్పించ గలము? సమర్పించ లేము. మరి, నివేదించని దానిని ఎలా ఆరగించ గలము? ఆరగించ లేము. అందుకే అవి నిషేధాలు. మచ్చుకు కలంజాదు లన్నా మనుకోండి. మాంసాన్ని మాధవుడికి అర్పించ గలమా? కనుక మాంస భక్షణం చేయ కూడదు అని భావం (దయ చేసి పాఠకులు కన్నప్పలు కాకండి. వట్టి పాపానికి కళ్ళు పోతాయి). కనుక అమేధ్యాలు, అంటే యజ్ఞార్హాలు కాని ఆహారాన్ని భుజించ కూడదు. కాని, తామసులకు అవే ప్రియమైన ఆహారము ***( ఈదృశం భోజనం తామస ప్రియమ్ ).***

## ఆహార సమీక్షణము

అన్నం లేనిదే జీవి లేడు. జీవితం లేదు. మనిషి జీవించడానికి అన్నం అవసరం. బ్రతికినంత కాలం మనిషి అన్నం తింటూనే బ్రతకాలి. బ్రతికున్న మనిషికి అన్నం జీవనంగా ఉపయోగ పడుతుంది. అంతే కాని, అన్నం మనిషిని బ్రతికించ లేదు. అన్నం చావును ఆప లేదు.

అన్నం విషయంలో భారతీయ సంస్కృతి పాశ్చాత్య దేశాల అవగాహనకు విలక్షణంగా శోభిస్తోంది. బ్రతక డానికి ఆహారం అవసరం. అవసరమైన ఆహారం రుచిగా, శుచిగా, ఆరోగ్యకరంగా ఉండాలి. ఇది పాశ్చాత్యుల అవగాహన. జీవితంలో పాశ్చాత్యులు తమ కాలాన్ని ఎక్కువ శాతం అన్నానికే వినియోగిస్తారు. ఆహార సంపాద నకు, వంట వార్పులకు, తినడానికి - ఎక్కువ శాతం వారి కాలం ఇలాగే వినియోగ మవుతుంది. భౌతికంగా అవసరాన్ని తీర్చే ఆహారం మానసికంగా కూడా తృప్తి పరచేదిగా ఉండాలి అనేది వాళ్ళ అవగాహనలో భాగం కావడం చేత రుచులు ప్రాధాన్యతను పొందుతాయి. ఇది స్థూలంగా పాశ్చాత్య జీవన విధానంలో ఆహారానికి ఉన్న స్థానము.

కాకపోతే, కొన్ని ప్రత్యేక సందర్భాలలో ఆహార పానీయాలను తాత్త్విక కోణంలో ఊహించడం కూడా ఉంది. ఈ దృక్పథం మతపర మైంది. విశ్వాసానికి సంబంధించింది. అది కూడా ఎప్పుడో అరుదైన సందర్భాలకే పరిమితంగా ఉంటుంది. కొన్ని మతాలలో దైనందిన కార్యక్రమంలో కూడా సంకల్ప మాత్రంగా ఉన్నా, అది మనం ఇక్కడ విశ్లేషించ దగిన స్థాయికి సంబంధించింది కాదు. విస్మరించ దగిందే. ప్రత్యేక సందర్భాలలో ఆహారాన్ని తాత్త్విక కోణంలో వాళ్ళు దర్శించినా, దినసరి కార్యక్రమంలో సంకల్ప మాత్రంగా విశ్వసించినా, అదంతా అశాస్త్రీయము, హేతు భిన్నం కావడం చేత దానిని ఇక్కడ మనం విశ్లేషించ నవసరం లేదని భావిస్తున్నాను.

భారతీయ సంస్కృతిలో అన్నానికి ప్రశస్త మైన స్థానం ఉంది. అన్నం కేవలం రుచికి, ఆరోగ్యానికి, జీవనానికి మాత్రమే కాదు. చిత్తశుద్ధికి, మోక్షసిద్ధికి కూడా ఉపకరించే పవిత్ర సాధనంగా భారతీయులు





దర్శించారు. అందుచేతనే ఆహారాన్ని అన్నం అని, భోజనం అని పవిత్రంగా పిలుచు కున్నారు. అన్నమును కేవలం ఆకలిని పోగొట్టి ఆరోగ్యాన్ని రాబట్టే పదార్థంగా కాకుండా, అన్నంలో సారభూతమైన దానిని గుర్తించి, ఆ సారభూతమైన దానిని సృష్టి స్థితి లయ కారణము, సత్తా స్ఫూర్తి ప్రదాయకమైన పరమేశ్వర స్వరూపంగా దర్శించడము కూడా జరిగింది. అద్భుతమైన ఈ శాస్త్రీయ తాత్త్విక అవగాహనలో అన్నం బ్రహ్మ స్వరూపంగా దర్శన మిచ్చింది.

***అన్నం బ్రహ్మేతి వ్యజానాత్*** - అన్నమును బ్రహ్మముగా తెలుసుకో అని తైత్తిరీయ శ్రుతిలో భృగువు ప్రబోధము *(3 - 2).*

***అద్యతే భూతైః ఇతి అన్నమ్*** - భూతముల చేత తినబడేది అన్నము. అంటే, అన్నరూపుడైన బ్రహ్మము జీవులలో ప్రవేశించి జీవుల్ని పోషిస్తూ ఉన్నాడు. ఇది ఒక అర్థము. మరొక అర్థాన్ని కూడా తెలుసుకుందాము.

***అత్తి చ భూతాని ఇతి అన్నమ్*** - భూతములను తినునది కనుక అన్నము. అన్న రూపంలో జీవనమై ప్రాణ రూపుడుగా ఉండి పోషించే బ్రహ్మమే దారి తప్పి, అయోగ్యమైన ఆహారాన్ని హద్దు మీరి భుజించి నపుడు జీవులను భక్షిస్తున్నాడు. ఈ విధంగా అన్న రూపంలో ఉన్న పరమేశ్వరుడు జీవులను రక్షిస్తూ ఉన్నాడు. అలాగే జీవుల్ని భక్షిస్తూ ఉన్నాడు. ఇది అన్నము శబ్దార్థము. ఇలా అన్నమును బ్రహ్మ స్వరూపంగా భావించడం చేత భారతీయ సంస్కృతిలో జీవించే వారికి అన్నము పవిత్ర మైనది.

జీవితం విలువైనది. ప్రశస్త మైనది. పవిత్ర మైనది. అట్టి జీవితము యొక్క మనుగడకు కారణమైన అన్నము కూడా పవిత్ర మైనదే. అలాగే భగవంతుడు పూజనీయుడు. అన్న రూపంలో ఉన్నది సత్తా రూపుడైన పరమేశ్వరుడే కనుక అన్నము కూడా పూజార్హమే. ఇది భారతీయుల అవగాహన. పాశ్చాత్యుల ఊహలకు అందని వాస్తవము.

కనుకనే, భారతీయులు అన్నాన్ని క్రింద పడ నివ్వరు. అసందర్భం కాదని భావించి నా వ్యక్తిగత మైన విషయం ఒకటి చెబుతాను. అది నా బాల్యదశ. భోజన సమయంలో కుటుంబము లోని వాళ్ళందరమూ ఒకే చోట ఒకే పంక్తిలో కలిసి భోం చేసే వాళ్ళం. మాతో పాటు పంక్తిలో మా నాన్నగారు కూడా కూర్చునే వారు. ఆయన గారిది భయంకరమైన క్రమశిక్షణ. ఆయన అంటే ఇంట్లో అందరికీ భయమే.

పద్మాసనంలో పీట మీద కూర్చున్నది మొదలు, ఎడమ చేయి క్రింద పెట్టడం, అన్నం మెతుకులు నేలపై పడటం, తుమ్మి నపుడు సంకల్పం చెప్పి వేళ్ళపై నీళ్ళు చల్లుకోవడం, చివరగా లేచి వెళ్ళి చేతులు శుభ్రం చేసుకొని తుడుచుకోవడం వరకు ఏదీ ఆయన దృష్టిని దాటి పోయేది కాదు. అడుగడుగునా అన్నీ ఆంక్షలే. దారి తప్పితే అక్షింతలే.

అన్నం మెతుకులు పొరపాటున క్రింద పడితే చాలు, వణికి పోయే వాళ్ళం. ఆ విషయంలో నేను చాలా జాగ్రత్తగా ఉండే వాణ్ణి. ఇంకెవరైనా పొరపాటున క్రింద పడేశారా! మా నాన్న గారు ఆదిశేషుడు పడగ విప్పినట్లే చూచేవారు. ఆయన పేరులో కూడా ఆ నామమే ఉండటం కారణ మేమో! క్రింద పడిన మెతుకుల్ని తిరిగి పళ్ళెంలో వేసుకొనే వరకు కళ్ళు ఆర్పేవారు కారు. 'అన్నంతో బ్రతుకు తున్నావు. అన్నం పరబ్రహ్మ స్వరూపం. అన్నాన్ని మట్టిపాలు చేస్తావా!' అని గద్దించే వారు.

బాల్యం కావడం చేత ఆ మాటలకు అర్థ మేమిటో, ఆ మాటల వెనుక పరమార్థ మేమిటో అప్పట్లో తెలిసేది కాదు. భయమో, భక్తో తెలియదు గాని నాకు బాగా జ్ఞాపక ముంది. నే నెప్పుడూ అన్నం క్రింద పడేయ లేదు. మా నాన్నగారి చేత ఆ విషయంలో తిట్టించుకో లేదు.

మన పవిత్ర భారతీయ సంస్కృతిలో సదాచారాలను పిల్లలకి బాల్యం లోనే పెద్దలు వంట పట్టించే వారు. ఆ సదాచారాల వెనుక సర్వాత్మ భావం ఎలా దాగి ఉందో ఆ పిల్లలే పెద్దలైన తరువాత గుర్తించే వారు.

బాల్యంలో నా మనస్సును గట్టిగా పట్టుకున్న సంస్కారము ఈ నాటికీ నాకు దూరం కాలేదు. ఇప్పుడు కూడా నేను భోజనం చేసే టప్పుడు ఆకు దాటి అన్నపు మెతుకు అవనిపై పడదు. ఆశ్రమంలో నాకు వడ్డించే టప్పుడు పొరపాటున మా ఆశ్రమవాసులు ఆకుకు దూరంగా మెతుకులు పడేస్తే, ఇప్పటికీ వాటిని ఎత్తి కళ్ళ కద్దుకొని ఆకులో వేసుకోవడం నన్ను వీడని ఆచారము. అది చూచి వాళ్ళు కూడా జాగ్రత్తగా వడ్డిస్తూ ఉంటారు.

పూర్వపు రోజుల్లో ఈ పద్ధతులు, ఆచారాలు ప్రతి ఇంటి లోను ఉండేవి. ఈ రోజుల్లో ఎక్కడా కనిపించని కారణంగా, ఆకులలో అన్నం వడ్డించినట్లు తెల్లని కాగితాల మీద నల్లని అక్షరాలను వడ్డించ వలసి వస్తోంది.

అన్నమును బ్రహ్మ స్వరూపంగా దర్శించడం చేత ఆహారమును నిందించడాన్ని మన పెద్దలు అంగీకరించరు. పైగా అట్టి నిందను గర్హిస్తారు. ***అన్నం న నింద్యాత్, తద్వ్రతమ్*** - అన్నమును నిందించ కూడదు. అది వ్రతము అన్నది తైత్తిరీయోపనిషత్ *(3 - 7)*.

అన్నం భగవ దనుగ్రహంగా మనకు లభిస్తుంది. అన్న రూపంలో భగవంతుడే ఉన్నాడు. అన్నాన్ని చిన్న చూపు చూస్తే, అలా చూచిన వాడి కనుచూపు పోతుంది అనే వాళ్ళు మన పెద్దలు. మనకు ప్రాతః స్మరణీయులు.

కాని, ఈ రోజుల్లో అన్నాన్ని చిన్న చూపు చూడటమే కాదు, భోజన సమయాలలో కొన్ని కుటుంబాలలో పళ్ళెములే రెక్క లొచ్చి ఎగురుతూ ఉంటాయి. అక్కడికి చేరింది ఈ రోజు మన సంస్కృతి. అన్నం మెతు కైనా పళ్ళెం నుండి క్రింద పడితే సహించని పుణ్యాత్ములకు వారసులమైన మనం పళ్ళెములను అన్నంతో సహా విసిరి కొట్టే స్థాయికి ఎదిగాము. ఎంత దురదృష్టం!

ఈ దురదృష్టాలు, దురాచారాలు ఎందుకని ఆవిష్కృత మౌతున్నాయి? ఏముంది! రుచి లేదని కొందరు. ఆశించింది పళ్ళెం లోకి రాలేదని ఇంకొందరు. ఈ రెండే కారణాలు కనబడు తున్నాయి. వాస్తవానికి ఈ రెండూ మన సంస్కృతిలో మన పూర్వీకులకు తెలియని విషయాలే.

మనది రుచి చూచే సంస్కృతే గాని రుచిని ఆశించే సంస్కృతి కాదు. ఇది మొదట అర్థం కావాలి. ***స్వాద్వన్నం న తు యాచ్యతాం*** - స్వాదు అన్నం అంటే రుచికరమైన భోజనము. రుచికరమైన ఆహారాన్ని ఆశించకు అన్నారు ఆచార్యులు. అంతే కాదు. ఏది ప్రాప్తిస్తే దానిని సంతోషంగా, తృప్తిగా ఆరగించ మన్నారు ***(విధి వశాత్ ప్రాప్తేన సంతుష్యతాం )***.

ఏది మనకు లభిస్తే అదే మనది. అది అలా ప్రాప్తించడం వెనుక ఎంతో నేపథ్యం ఉంది. నియతి ఉంది. నియంత నిర్ణయా లున్నాయి. అందే వన్నీ కర్మఫలాలే. కర్మఫల ప్రదాత పరమేశ్వరుడు. మన కర్మలకు ఫలితాలే మనకు అందుతున్నాయి. రావలసినవే వస్తున్నాయి. లేనివి రమ్మంటే ఎలా వస్తాయి? ఇవన్నీ జీవన సత్యాలు. ఇవి అర్థం కాక పోవడం చేత, మన సంస్కృతికి మనం దూరం కావడము చేత సంతోషించ వలసిన చోట సంతాపానికి గురి అవుతున్నాం. మతి చెడిన వాళ్ళ లాగా ప్రవర్తిస్తున్నాం. మనస్సు లోని చాంచల్యము కారణంగా పళ్ళెములే పక్షులై గాలిలో ఎగురు తున్నాయి.

***అన్నం న పరిచక్షీత*** - అన్నమును పడేయకు. అన్నమును నిరాకరించకు అని వేదమాత ఆదేశం. అన్నమును విసిరి వేయడ మంటే అన్న రూపుడైన పరమేశ్వరుని విసిరి వేయడం కాదా? ఎవరు చేస్తారు ఈ పని? కంసుడు చేస్తాడు. శిశుపాలుడు చేస్తాడు. ఖరుడు చేస్తాడు. శూర్పణఖ చేస్తుంది. వాళ్ళది ఆసురీ సంపద. వారిలో సత్త్వగుణం లేదు. అందుకే వాళ్ళు అలా చేస్తారు. కాని, మనం అలా చెయ్యలేము. చెయ్య కూడదు. అన్నమును దూరం చేసుకో కూడదు. శ్రమించి అన్నాన్ని ప్రోగు చేసుకోవాలి.





***అన్నం బహు కుర్వీత తద్వ్రతమ్*** - అన్నాన్ని ఎక్కువగా పొంది, దానిని వినియోగించడం జీవితంలో వ్రతం కావాలి అన్నది ఉపనిషత్తు. దాని అర్థం ఎక్కువగా అన్నదానం చేయ మని. పరమేశ్వరుడు అందరి వాడు. అందరిలో ఉన్న వాడు. అందరిలో ఉన్న వాడి ముచ్చటను అందరితో కలిసి అవలోకించి, అనుభవించి, ఆనందించి, తరించ మనేదే ఉపనిషత్తు సందేశము లోని కేంద్ర విషయము.

అన్నంతో మనం బ్రతుకు తున్నాం. అన్నంలో సార రూపంగా పరమేశ్వరుడే ఉన్నాడు. అన్నమును అనుగ్రహించేది, తినిన అన్నాన్ని వంట బట్టించేది కూడా పరమేశ్వరుడే. ఈ విషయాలన్నీ పూర్వాధ్యాయా లలో తృప్తిగా చెప్పుకున్నాం. అన్నం విషయంలో అన్ని విధాల పరమేశ్వరుడే దర్శనీయ మవుతున్నాడు. కనుక అన్నము దైవ ప్రసాదము. ఈశ్వర ప్రసాదము.

నైవేద్యము పెడితేనే ప్రసాదము ప్రాప్తిస్తుంది. ధనం లేనిదే నైవేద్యం తయారు కాదు. నైవేద్యానికి ఉపకరించేది కనుక ఆ ధనం కూడా ధర్మ సంపాదనై ఉండాలి అని మన పెద్దలు ఆలోచించే వాళ్ళు. ధర్మ బద్ధంగా జీవించి, ధనమును సంపాదించి, శుచిగా దేహాన్ని, ప్రసన్నంగా మనస్సును ఉంచుకొని వంట తయారు చేసి, ఆరాధనా భావంతో ఆహారాన్ని ప్రసాదంగా స్వీకరించి, ఈ వ్యవహారాన్నంతా ఆత్మోన్నతికి, ఆత్మ సాక్షాత్కారానికి సాధనగా వినియోగించుకొనే వాళ్ళు. అందుచేత, ఆహార విషయంలో నైవేద్యము - ప్రసాదము అనే దివ్యమైన భావాలు భారతీయులకు ఉండేవి. కనుక, యోగ్యమైన, యోగమునకు ఉపయుక్త మైన, ఆరోగ్యకరమైన, ఆనంద దాయకమైన ఆహారాన్నే భారతీయులు గ్రహించే వారు. ఆహారం విషయంలో ఇది భారతీయులకు ఉండే అవగాహన.

**అన్నం శాకాహారము**

శాకాహారమా, మాంసాహారమా? ఏది తీసుకోవాలి? అని కొందరు అదేదో బ్రహ్మ పదార్థ మన్నట్లు అడుగుతూ ఉంటారు. అన్నము, లేదా ఆహారము అంటే మన సంస్కృతిలో శాకాహార మనే అర్థం. ఆహారము అంటేనే శాకాహారము. మాంసాహారము అనే దానిని వేదిక మీదికి తీసుకొని రావడం చేత, శాకాహారమా, మాంసాహారమా? అనే మీమాంస తలెత్తింది.

***ఓషధీభ్యః అన్నమ్, అన్నాత్ పురుషః*** - ఓషధుల నుండి అన్నం పుడుతుంది. అన్నం నుండి పురుషుడు జన్మిస్తాడు. కనుక మొక్కల నుండి, చెట్ల నుండి మనకు లభించేదే అన్నము.

కొందరు జల్ప వితండాలలో తలలు దూర్చి, మాకు శాకాహారము గిట్టదు. మేము కూరగాయలు ముట్టము. ఆకుకూరలు తినము. కాయలు, పండ్లు మాకు రుచించవు. మాకు మాంసమే కావాలి. మేము మాంసాహారులం, మత్స్యాహారులం అంటూ గంతు లేస్తూ ఉంటారు. అలాంటి వారికి తెలియని సత్యం ఒకటుంది. వారు కూడా శాకాహారులే గాని మాంసాహారులు కారు అని.

అదేమిటి? మేము మాంసమే తింటాము. సరే. అలాగే అనుకుందాం. ఈ రోజు మీరు ఏమి తిన్నారు? మాంసమే భుజించాము. ఏమి మాంసం? మేక మాంసం. మేక ఏమి తింటే దానికి మాంసం పట్టింది. మేక ఆకులు తింటుంది. అంతే కదా! మేకలు ఆకులు తింటాయే గాని మాంసం తినవు కదా! అవును.

మేకలు ఆకులు తింటాయి. అవి తినే ఆహారం వల్ల వాటిలో మాంసం తయా రవుతుంది. మేక లోని మాంసానికి మూల మేమిటి? ఆకులే. అదీ విషయం. ఆ ఆకుల్నే ప్రత్యక్షంగా గ్రహించే వాళ్ళు శాకాహారులు. అవే ఆకుల్ని మేక మాంసం రూపంలో పరోక్షంగా గ్రహించే వాళ్ళు మాంసాహారులు. శాకాహారు లైనా, మాంసాహారు లైనా ఇరువురికీ మూల పదార్థ మొక్కటే. ఓషధులు. ఓషధులే అన్నం. అన్నం నుండే జనం.

## ఆహార ప్రియత్వము - గుణభేదము

ఆత్మ సాక్షాత్కారానికి ప్రయత్నించే ముముక్షువులకు ఆత్మవిచారానికి ముందుగా అన్న విచారానికి ఎంత ప్రాధాన్యత ఉందో ఈ ఆహార సమీక్షణములో అర్థం చేసుకున్నాం. భోజన మీమాంస లేకుండా బ్రహ్మ మీమాంస వంట పట్టదని ఇప్పటికే మనకు అర్థమై పోయింది.

***ఆహార శుద్ధేః సత్త్వశుద్ధిః*** - అంతఃకరణ శుద్ధి లేనిదే ఆత్మవిచారము చేయలేము. అంతఃకరణ శుద్ధి ఆహారశుద్ధి ద్వారా ఏర్పడుతూ ఉంది కనుక ఆధ్యాత్మిక చింతనాపరులకు ఆహారము సాధన పరంగా విచారాంశ మైంది.

గుణ భేదాన్ని దృష్టిలో ఉంచుకొని ఆహార లక్షణాలను వివరిస్తూ సాత్త్విక, రాజస, తామస ఆహారాలను భగవంతుడు విశదం చేయడం జరిగింది. ఈ మూడు విధాలైన ఆహారాలను స్వీకరించడములో ఎవరికి ఏ విధమైన శ్రద్ధ ఉంటే వారికి ఆ విధమైన ఆహారము ప్రియంగా ఉంటుంది. గుణాలు త్రివిధములు కనుక ఆహారమును కూడా శాస్త్రీయంగా త్రివిధాలుగా క్రమబద్ధీకరించడం జరిగింది.

శ్రద్ధను బట్టే ఆహారం రుచిస్తుంది. సాత్త్విక శ్రద్ధ ఉండే వారికి సాత్త్వికాహారం ప్రియంగా ఉంటుంది. రాజస శ్రద్ధ కల వారికి రాజసాహారము ప్రియంగా ఉంటుంది. తామస శ్రద్ధ కల వారికి తామసాహారం ప్రియంగా ఉంటుంది. గుణ భేదాన్ని అనుసరించే ఆహార ప్రియత్వంలో భేదాలు గోచరిస్తాయి. శ్రద్ధ ఇక్కడ ప్రధాన భూమికను పోషిస్తూ ఉంది. కనుక సాత్త్వికుల విషయం వచ్చినపుడు, **సాత్త్విక ప్రియాః** - సాత్త్వికులకు ప్రియమైన ఆహారము అని, రాజసుల విషయంలో, **రాజసస్య ఇష్టాః** - రాజసులకు ఇష్టమైన ఆహారము అని, తామసుల విషయంలో, **తామస ప్రియమ్** - తామసులకు ప్రియమైన ఆహార మని భగవంతుడు బోధించడము జరిగింది.

ఈ సందర్భంలో ప్రధానమైన విషయం, చక్కగా అర్థం చేసుకొని బుద్ధిలో స్థిరంగా ఉంచుకో దగిన విషయం ఏమిటంటే, సాత్త్విక శ్రద్ధ కల వారికి సాత్త్వికాహారం, రాజస శ్రద్ధ కల వారికి రాజసాహారం, తామస శ్రద్ధ కల వారికి తామసాహారం ప్రియంగా ఉండొచ్చు. అలాగని రాజసాహారం తినే వాళ్ళు రాజసులని, తామసాహారం తినే వాళ్ళు తామసులని, సాత్త్వికాహారం తినే వాళ్ళు సాత్త్వికులని చెప్పడానికి వీలు లేదు. పారమార్థిక దృష్టిలో దీనిని కొలతబద్ధగా స్వీకరించే వాళ్ళకు శాస్త్రం వంటపట్ట లేదని అర్థం.

సాత్త్వికులు సాత్త్వికాహారం ప్రియంగా తీసుకోవచ్చు. కాని, సాత్త్వికాహారం తీసుకొనే వాళ్ళందరూ సాత్త్వికులు అనడానికి వీలు లేదు. అలాగే రాజస తామస ఆహారాలు కూడా. సాత్త్వికాహారాన్ని గ్రహించే వాళ్ళలో ఎంతో మంది మోసగాళ్ళు ఉన్నారు. హంతకు లున్నారు. నువ్వు గర్హించే పచ్చళ్ళు, ఉల్లిపాయలు తినే వాళ్ళలో సాత్త్విక జీవనం గడిపే వాళ్ళు, నిరంతరం ధ్యానమగ్నులై ఉండే వాళ్ళు ఎందరో ఉన్నారు. కనుక, శ్రద్ధాత్రయ విభాగ యోగాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఆహార భేదాన్ని, గుణ భేదాన్ని, శ్రద్ధా భేదాన్ని తెలుసుకోవడం ఎందుకో తెలుసా? మనం ఎలా ఉన్నాము అని పరిశీలించుకొని, పరీక్షించుకొని, అవసర మైతే సరిదిద్దు కోవడానికే గాని, ఇతరుల విషయంలో న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించడానికి మాత్రం కాదు. అది సాధ్యం కాదు కూడా. కనుక, గుణ భేదాలను, ఆహార భేదాలను సమన్వయిస్తూ ఇతరులను నిర్ణయించడం శాస్త్ర సమ్మతమైన విషయం కాదు. ఇది అర్థం కాని వారే పరుల్ని ఆహార దృష్ట్యా ఖండిస్తూ ఉంటారు.

ఆహారం యొక్క ప్రభావం మనస్సుపై ఉంటుంది. ఆహారం యొక్క సూక్ష్మాంశమే మనస్సు కనుక. సాత్త్వికాహారం సత్త్వ సంపద కల వారికి ప్రియంగా ఉండటమే గాక, తత్త్వ విచారానికి సహకరిస్తుంది కూడా.





కనుక, సాత్త్వికాహారాన్ని స్వీకరిస్తూ సత్త్వ ప్రధానంగా మనం జీవించాలి. ఆరాధనా భావంతో అన్నాన్ని స్వీకరించాలి. పరులతో పంచుకోవాలి. సాధకులము కనుక మనము తీసుకునే ఆహారము మనస్సు మీద దుష్ప్రభావాన్ని చూపకుండా జాగ్రత్త పడాలి.

### ఆఖ్యాయిక

ఇదొక దంత కథ. ***ఆహార శుద్ధౌ సత్త్వశుద్ధిః*** - అనే అంశము వచ్చినపుడు వేదికల మీద నుండి ప్రబోధకులు ఈ కథను వినిపిస్తూ ఉంటారు. వాస్తవమా, కాదా? జరిగిందేనా, కాదా? అనే మీమాంసలో తల దూర్చకుండా విషయాన్ని స్వీకరిస్తే, చాలా ఉపయుక్తంగా ఉంటుంది.

ఓఘవతీ నదీ తీరాన బాణశయ్యపై పవ్వళించి ఉన్నాడు భీష్మాచార్యుడు. దేహం లోని రక్త మంతా కారి పోయింది. ప్రాణం అల్లాడుతూ ఉంది. పంజరం నుండి ఏ క్షణ మైనా పక్షి ఎగిరి పోవచ్చు. అట్టి విషమ పరిస్థితిలో ఎముకల గూడులో దీపంలా వెలుగుతున్న భీష్మాచార్యుని హృదయం జ్ఞానగంగా ప్రవాహంతో పరవళ్ళు త్రొక్కుతూ ఉంటే, ధర్మ ప్రవచనాలు ప్రవాహ రూపంలో కదిలి ధర్మరాజు చెవులను, చిత్తాన్ని మంగళ స్నానం చేయించాయి. ధర్మమేఘమై దివ్య బోధలను వర్షించిన భీష్మాచార్యుడు, ప్రాణ త్యాగానికి, పరలోక గమనానికి మనస్సులో సిద్ధ పడుతున్నాడు.

ఇంతలో ద్రౌపది ముందుకు వచ్చింది. మహాత్మా! భీష్మ పితామహా! మీ ధర్మ ప్రవచనాలతో మహి పులకరించింది. మానవాళి కృతజ్ఞతా భావంతో తల వంచుతూ ఉంది. మీకు ప్రణామం. పునః పునః నా ప్రణామం.

మహాత్మా! ప్రస్తుతం ఇక్కడ ధర్మబోధ చేసిన మీరేనా ఆనాడు హస్తినలో రాజకొలువులో ఆసీనులై ఉండింది? నిండుసభలో స్త్రీని వలువలు ఊడదీసి పరాభవిస్తున్న వేళ ఈ ధర్మబోధలు ఎటు పోయాయి? బాణాలపై పడుకొని ప్రాణాలు అల్లాడుతున్న ఈ స్థితిలో ధర్మ ప్రసంగాలు వినిపించిన మీరు, ఆనాడు సర్వ శక్తిమంతులై ఉండి, సముచి తాసనంపై కూర్చుని ఉండి కూడా నోరు మెదపలేక పోయారు. ఈ ధర్మబోధలు ఆనాడు ఏమయ్యాయి? అని ప్రశ్నించింది.

పాండవులతో సహ సర్వులూ దిగ్భ్రాంతి చెందారు. అమ్మా, ద్రౌపదీ! మంచి ప్రశ్న వేశావు. ఇలాంటి ప్రశ్నను ధర్మరూపిణి వైన నువ్వు తప్ప మరొకరు వేయ లేరు. నా సమాధానం కూడా ఆలకించు తల్లీ! అంటూ దీర్ఘ శ్వాస తీసుకొని, అతి కష్టం మీద ప్రాణాన్ని నిలబెట్టుకొంటూ భాషించాడు భీష్మాచార్యుడు.

తల్లీ! నువ్వు చెప్పింది అక్షరాల నిజం. ఇప్పుడు ఇక్కడ ఉన్న నేనే అప్పుడు అక్కడ ఉండినాను. కాని, ఇప్పుడు ప్రాణోత్క్రమణ స్థితిలో ఉన్నా, నా బుద్ధి దీపంలా ప్రకాశిస్తూ ఉంది. ఇదే బుద్ధి ఆనాడు, అక్కడ పాగసూరి మసకబారి పోయి ఉండింది.

అమ్మా! దుష్టుడు, దుర్మార్గుడు అయిన దుర్యోధనుడు పెట్టిన అన్నం తిన్నందుకు నా బుద్ధి పనిచేయ లేదు. అశుద్ధమై పోయింది. కలుషితమై పోయింది. అందుకే అక్కడ మాట్లాడలేక పోయాను. రణరంగంలో పుణ్యాత్ముడు, ధర్మాత్ముడు అయిన నా బిడ్డ అర్జునుడు కురిపించిన బాణాలు నా దేహాన్ని చిల్లుల కుండగా మార్చేశాయి. నా లోని పాప రుధిర మంతా కారి పోయేలా చేశాయి. ఇప్పుడు కేవలం నా ప్రాణదీప మొక్కటే ఆరేందుకు సిద్ధంగా ఉంది. పాపపు కూడు వల్ల ఏర్పడిన రక్తం కారి పోగా, మిగిలి ఉన్న శుద్ధ బుద్ధితో ప్రవచించ గలిగాను' అని పలికి గాంగేయుడు కన్ను మూశాడు. ఆహారం మనస్సు పై ఎలాంటి ప్రభావాన్ని చూపుతుంద గ్రహించ డానికి ఈ కథ ఒక ఉదాహరణ.

త్రివిధ ఆహారాలను ప్రవచించిన పరమేశ్వరుడు, ప్రస్తుతం త్రివిధ యజ్ఞాలను గూర్చి చెబుతున్నాడు.

**అఫలాకాంక్షిభి ర్యజ్ఞో విధిదృష్టో య ఇజ్యతే ।**
**యష్టవ్య మేవేతి మనః సమాధాయ స సాత్త్వికః ॥** 11

***అఫలాకాంక్షిభిః-యజ్ఞః-విధిదృష్టః-యః-ఇజ్యతే***
***యష్టవ్యం-ఏవ-ఇతి-మనః-సమాధాయ-సః-సాత్త్వికః***

| | | | |
|---|---|---|---|
| విధిదృష్టః | = శాస్త్రసమ్మత మైనది | యః | = ఏ |
| యష్టవ్యం ఏవ ఇతి | = యజ్ఞము చేయుటయే విధిగా | యజ్ఞః | = యజ్ఞము |
| మనః | = మనస్సును | ఇజ్యతే | = చేయబడుతుందో |
| సమాధాయ | = నిశ్చయించి | సః | = అది |
| అఫలాకాంక్షిభిః | = ఫలాపేక్ష లేని వారి చేత | సాత్త్వికః | = సాత్త్విక మైనది |

**అర్జునా! ఫలాపేక్ష లేనిది, శాస్త్రోక్త మైనది, చేసి తీరాలి అనే కర్తవ్యాన్ని మనస్సుతో నిశ్చయించుకొని ఆచరించేది సాత్త్విక యజ్ఞము.**

### వ్యాఖ్య

గుణభేదాన్ని బట్టి ఆహార ప్రియత్వము ఉంటుంది అని చెబుతూ త్రివిధ ఆహారాన్ని తెలిపిన భగవంతుడు, భావనలను బట్టే భక్తి ఉంటుందని, ఉద్దేశ్యాలను అనుసరించే ఆరాధనలు ఉంటాయని తెలియ చెప్పడానికి వరుసగా త్రివిధ యజ్ఞాలను వివరిస్తున్నాడు ***(యజ్ఞం త్రివిధః ఉచ్యతే)***.

యజ్ఞాలు మూడు విధాలు. సాత్త్విక యజ్ఞము, రాజస యజ్ఞము, తామస యజ్ఞము. ఈ మూడు యజ్ఞాలను వరుసగా మూడు శ్లోకాలలో చెబుతున్నాడు. ప్రస్తుతం మొదటి శ్లోకంలో సాత్త్విక యజ్ఞాన్ని గురించి చెబుతున్నాడు.

భగవంతుడు యజ్ఞరూపుడు. కనుక, భగవ ద్భావన కలిగి ఈశ్వరార్పణ బుద్ధితో చేసే ఏ కర్మ అయినా యజ్ఞమే అవుతుంది. యజ్ఞము అనగానే వేదోక్త మైన అగ్నిహోత్రాది యజ్ఞములే అని భావించ డానికి అవకాశం లేదు. నిత్య నైమిత్తికాది కార్యాలలో ఈశ్వర భావనతో ఆచరించే వన్నీ ఆరాధనా రూపాలై యజ్ఞాలు అనబడతాయి. ఈశ్వరుడు ధర్మ రూపంలో ఉన్నాడు కనుక, దైవ స్పృహతో ధర్మాచరణం చేయడం కూడా యజ్ఞమే. ముందు త్రివిధ యజ్ఞాలను గూర్చి తెలుసుకున్న తరువాత, చివరగా యజ్ఞ విశ్లేషణములో ఈ విషయాలన్నీ చర్చించు కుందాము. ప్రస్తుతం సాత్త్విక యజ్ఞాన్ని గూర్చి తెలుసుకుందాము.

గుణభేదాన్ని బట్టి ఆహార విషయం లాగే, యజ్ఞము కూడా మూడు విధాలుగా ఉంటుంది. సాత్త్విక శ్రద్ధతో ఆచరించేది సాత్త్విక యజ్ఞము. అంటే, సాత్త్విక యజ్ఞము సాత్త్విక శ్రద్ధ కల వారికి ప్రియ మైనది అని అర్థం. సాత్త్విక యజ్ఞములో ప్రధానంగా నాలుగు విషయా లుంటాయి. నాలుగు చక్రాలతో రథం కదిలినట్లు, నాలుగు అంగాలతో సాత్త్విక యజ్ఞ రథం కదుల్తుంది. అవి (1) ఫలాసక్తి లేక పోవడము (2) శాస్త్ర దృక్పథము (3)కర్తవ్యతా దృష్టి (4) సమాధాన చిత్తం.

#### ఫలము నందు అనాసక్తి

సాత్త్విక యజ్ఞము ఫలాకాంక్ష లేనిదై ఉంటుంది. యజ్ఞము కర్మ సంబంధ మైనది. కనుక, ఫల సంబంధమై





ఉంటుంది. కర్మ ఉన్న చోట కర్మఫలం ఉంటుంది. కనుక, కర్మాచరణంలో ఉండే వారు రెండు విధాలుగా ఉంటారు. కర్మఫలము నందు ఆసక్తి కల వారు ***(ఫలా కాంక్షిభిః)***. కర్మఫలము నందు ఆసక్తి లేని వారు ***(అఫలా కాంక్షిభిః అఫలార్థిభిః)***. రెండవ కోవకు సంబంధించిన వారు సాత్త్విక యజ్ఞమును నిర్వహిస్తున్నారు.

కర్మఫలము ఏదైనా అనిత్యమే నని వారికి తెలుసు. ధర్మార్థ కామాల వల్ల ప్రాప్తించే ఇహలోక సుఖాలు, పరలోక భోగాలు అనిత్యాలని తెలిసి, వాటి యందు త్యాగ బుద్ధిని కలవారై నందున, వారికి కర్మ ఫలాసక్తి ఉండదు. ఇతరులకు ఉపయోగపడే కర్మల నాచరిస్తూ, సమాజ అభ్యుదయానికి తమ వంతు కృషి చేస్తూ, సర్వులను తృప్తి పరుస్తూ , అట్టి యజ్ఞకర్మ చేత దృష్ట ఫలమైన ప్రశాంతతను అనుభవించే వారు చేసే కర్మ లన్నీ సాత్త్విక యజ్ఞాలే అవుతాయి. స్వార్థమే తెలియని యజ్ఞకర్మలు అంతఃకరణ శుద్ధిని కలిగిస్తాయి.

#### శాస్త్ర దృష్టి

స్వార్థం లేదు అని విధి విధానాలను విస్మరించ కూడదు. సాత్త్విక యజ్ఞాలు శాస్త్రోక్తం గానే ఉండాలి. మనం ఆచరించే కర్మ శాస్త్ర విహితమా, శాస్త్ర రహితమా అని చూసుకుంటూ చేయాలి. దృష్టిని శాస్త్రము నందు ఉంచి, తదనుగుణంగా కర్మలను ఆచరించాలి. అప్పుడే అది సాత్త్విక యజ్ఞము అవుతుంది. శాస్త్రోక్త విధి విధానాలను అనుసరిస్తూ ఆచరించేదే సాత్త్విక యజ్ఞము. దానినే 'విధి దృష్టం' అనడం జరిగింది. 'విధి దృష్టం' అంటే శాస్త్రం లోని విధిని వీక్షించడము, దాని ప్రకారము యజ్ఞాచరణమును నిర్వహించడము అని అర్థము ***(విధి దృష్టః శాస్త్ర చోదనా దృష్టః)***.

#### కర్తవ్యతా దృష్టి

ఇది నేను చేయదగిన కర్మ, చేయ వలసిన కర్మ, కనుకనే చేస్తున్నాను అనే భావనచే ఆచరించేది ఇక్కడ కర్తవ్యతా నిష్ఠ. అదే కర్తవ్యతా దృష్టి. దీనిని కర్మయోగంలో మనం అర్థం చేసుకున్నాం.

కర్మ చేసే వారు ప్రయోజనాన్ని ఆశించకుండా చెయ్యరు. ఏ కర్మ చేయాలన్నా, ఇది చేస్తే నాకు ఏమొస్తుంది? అది వింటే నాకు ఏమొస్తుంది? దర్శనం వల్ల నాకు ఏమి ప్రయోజనం? ప్రవచనం నాకు ఏ ఫలాన్ని ఇస్తుంది? ఇదంతా ఫలాసక్తి గొడవ. ఈ విధమైన ఫలదృష్టిని విడిచి, ఇది నేను చేయవలసిన కర్మ, నా కొరకు నిరీక్షిస్తున్న కర్మ, నేను అవశ్యం ఆచరించ దగిన కర్మ అనే దృష్టితో ఫలాపేక్ష లేకుండా కర్మను ఆచరించడం ఇక్కడ కర్తవ్యతా దృష్టి.

***నియతం కురు కర్మత్వం కర్మజ్యాయో హ్య కర్మణః*** - అర్జునా! తప్పకుండా చేయ వలసిన కర్మను ***(నియతం కర్మ)***. తప్పక ఆచరించాలి. కర్మ శూన్యత కంటే, కర్మాచరణమే శ్రేష్ఠము అని కర్మయోగంలో పరమేశ్వరుడు తెలియ చేశాడు (*3 వ అ - 8 వ శ్లో*). అదే ప్రస్తుతం మనం చెప్పుకుంటున్న కర్తవ్యతా నిష్ఠ. ***యష్టవ్యం ఏవ*** - ఈ యజ్ఞ కార్యము చేయ వలసిందే, చేసి తీరవలసిందే అనే దృఢ సంకల్పమును కలిగి ఉండాలి ***(యష్టవ్యం ఏవేతి యజ్ఞ స్వరూప నిర్వర్తన మేవ కార్యం ఇతి)***. ***యష్టవ్యం*** అనేది కర్మాచరణములో సదా మన బుద్ధిలో స్థిరంగా నిలవాలి.

మహాభారతంలో పాండవులు అనుభవించే కష్టాలను కళ్ళారా చూసి కన్నీటి పర్యంతమైన ద్రుపద నందిని ఒకనాడు ధర్మరాజును ప్రశ్నించింది. ధర్మం - ధర్మం అంటూ మీరు ధర్మాన్నే నమ్ముకున్నారు. ధర్మ కార్యాలే చేస్తున్నారు. ధర్మాచరణంలో ఉన్నందుకు ఫలం కష్టా లేనా? కన్నీళ్ళేనా? అని అడుగుతుంది. ధర్మరాజు ఏమి సమాధానం చెప్పాడో వినండి. అక్కడ మీకు ***యష్టవ్యం*** కనిపిస్తుంది. అఫలాకాంక్ష కూడా గోచరిస్తుంది ***(న ఫలాకాంక్షీ)***.

**నాహం ధర్మ** ఫలాకాంక్షీ **రాజపుత్రీ చరామ్యుత**
**దదామి దేయమిత్యేవ యజే** యష్టవ్య **మిత్యపి**

రాజపుత్రీ! ఫలాకాంక్షతో నేను ఏదీ చెయ్యలేదు. ఫలాసక్తి లేకుండానే నిర్వర్తించాను (**అఫలాకాంక్షీ**). చెయ్యాలి కనుక చేస్తున్నాను (**యష్టవ్యం**). ఇవ్వాలి కనుక ఇస్తున్నాను (**దేయం**). కర్తవ్యతా నిష్ఠ కాని, ఫల దృష్టి నాకు లేదు. కోరనిది ఏదైనా ఎలా వస్తుంది? అనే భావంతో భాషించాడు ధర్మనందనుడు. ఇక్కడ ద్రౌపదిని 'రాజపుత్రీ' అని సంబోధించడం ఆలోచించ దగిన విషయం. ఫలాసక్తితో చేసే కర్మలు రాజస కర్మలే గాని సాత్త్విక కర్మలు కావు అనే భావ స్ఫృహ 'రాజపుత్రీ' అనే సంబోధనలో ఉంది. రాజసకర్మ ఎలా ఫలాసక్తితో ఉంటుందో తరువాత శ్లోకంలో చూడ బోతాము.

**సమాధాన చిత్తం**

సమాధాన చిత్తము అంటే నిశ్చయమైన బుద్ధి. బుద్ధి లోని నిశ్చయము చేత చిత్తములో ప్రశాంతమైన స్థితి నెలకొంటుంది. అదే చిత్త సమాధానము. ఇంతకీ బుద్ధి లోని నిశ్చయ మేమిటి?

ఇది నేను చేయదగిన కర్మ కనుక చేస్తున్నాను (**యష్టవ్యమ్**). ఆ చేసే దేదో దానిని శాస్త్రోక్తంగా చేస్తున్నాను (**విధి దృష్టః**). యజ్ఞకర్మను ఆచరించడములో నాకు ఫలాసక్తి లేదు (**అఫలాకాంక్షిభిః**). కనుక, ఈ విధమైన యజ్ఞకర్మ ద్వారా 'నేను సాధించ వలసిన పురుషార్థము ఏదీ లేదు' అనేదే నిశ్చయ బుద్ధి (**మనః సమాధాయ, న అనేన పురుషార్థః మమ కర్తవ్యః ఇత్యేవం నిశ్చిత్య సః సాత్త్వికః యజ్ఞః ఉచ్యతే**).

అన్య పురుషార్థాలు లేవు అంటే ధర్మ, అర్థ, కామ పురుషార్థ ప్రయోజనాలు తనకు అవసరం లేదని అర్థము. మోక్ష మొక్కటే తాను ఆశించేది అనేది సుస్పష్టము.

కనుక, యజ్ఞకర్మకు రెండు ప్రయోజనాలు ఉంటాయి. ఒకటి ఫల భోగము. ఈ లోకానికి సంబంధించి గాని, పర లోకానికి సంబంధించి గాని ప్రాప్తించే ఫలాల యందు ఆసక్తి కలిగి యుండటము. సాత్త్విక యజ్ఞమును ఆచరించే వారికి ఇది వర్తించదు. వారు కర్మఫలాసక్తి లేని వారు కనుక ఈ విధమైన ప్రయోజనము వారికి సంబంధించింది కాదు.

రెండవది అంతఃకరణ శుద్ధి. యజ్ఞకర్మ ఏదైనా అలౌకిక కర్మే కనుక, ఫలాసక్తి లేనపుడు అది అంతః కరణ శుద్ధ్యర్థమై ఉంటుంది. అలా శుద్ధి పడిన అంతఃకరణము ప్రశాంతతను అనుభవిస్తుంది. అదే దృష్ట ఫలమైన చిత్త సమాధానము.

సాత్త్విక యజ్ఞములో ఇంతవరకు మనం తెలుసుకున్న నాలుగు విషయాలను పరిశీలిస్తే, ప్రథమ షట్కంలో, ముఖ్యంగా మూడవ అధ్యాయం నుండి ఐదవ అధ్యాయం వరకు కర్మయోగాన్ని గూర్చి మనం చెప్పుకున్న విస్తారమైన విషయాన్నంతా ఈ నాలుగు విషయాలు సారభూతంగా అందించాయి.

*ఇక రాజస యజ్ఞాన్ని వివరిస్తున్నాడు.*

**అభిసన్ధాయ తు ఫలం దమ్భార్థ మపి చైవ యత్ ।**
**ఇజ్యతే భరతశ్రేష్ఠ తం యజ్ఞం విద్ధి రాజసమ్ ॥** 12

*అభిసంధాయ-తు-ఫలం-దంభార్థం-అపి-చ-ఏవ-యత్*
*ఇజ్యతే-భరతశ్రేష్ఠ-తం-యజ్ఞం-విద్ధి-రాజసం*





| | | | |
|---|---|---|---|
| భరతశ్రేష్ఠ | = అర్జునా! | ఇజ్యతే | = చేయబడుతుందో |
| యత్ | = ఏది | తం | = ఆ |
| ఫలం | = ఫలమును | యజ్ఞం | = యజ్ఞము |
| అభిసంధాయ తు | = వాంఛించి గాని | రాజసం | = రాజస యజ్ఞముగా |
| దంభార్థం అపి చ ఏవ | = దంభము కొరకు గాని | విద్ధి | = తెలుసుకో! |

**అర్జునా! ఫలాన్ని ఆశించి చేసేది, ఆడంబరానికి ఆచరించేది రాజస యజ్ఞము.**

**వ్యాఖ్య**

ఫలాకాంక్షతో (**అభిసంధాయ ఉద్దిశ్య**) చేసే యజ్ఞము, దంభమును ప్రదర్శించుకోవ డానికి (**దంభార్థమ్**) చేసే యజ్ఞము రాజస యజ్ఞము. ఫలాకాంక్ష లేకుండా నిర్వహించేది సాత్త్విక యజ్ఞమైతే, దానికి భిన్నంగా ఫలాసక్తితో నిర్వహించేది రాజస యజ్ఞము. శాస్త్ర విధి ననుసరించి సాత్త్విక యజ్ఞాలు సాగుతాయి. అంటే సాత్త్విక యజ్ఞములో శాస్త్ర దృష్టితో యజ్ఞ కార్యాలు నిర్వహించడం జరుగుతుందే గాని వ్యక్తిగతంగా, స్వార్థ పూరితంగా నిర్వహించడము జరగదు.

రాజస యజ్ఞాలు స్వార్థ పూరితంగా ఉంటాయి. వాటిని నిర్వహించే వారికి ఫలాసక్తే ప్రధానంగా ఉంటుంది. ఇహలోక సుఖాలు, స్వర్గలోక భోగాల మీదే దృష్టి ఉంటుంది. వారిలో మోక్షాపేక్ష లేనందున ముముక్షుత్వం ఉండదు. అక్కడ అర్థ కామాలే ప్రధాన పాత్రను పోషిస్తాయి కనుక చిత్తశుద్ధికి అవకాశము లేదు.

రాజస శ్రద్ధ కలిగి, రాజస ప్రవృత్తితో యజ్ఞ కార్యాలను నిర్వహించే వారి దృష్టి కేవలం ఫలితము పైనే ఉంటుంది. వారి దృష్టి ఫలితంపై ఉండటమే గాక, అందరి దృష్టిని ఆకర్షించాలనే దుగ్ధ కూడా వారిలో ఉంటుంది. ఇదే దంభము లేదా డంబాచారము. డాంబికుని స్వభావము.

ఈశ్వర ప్రీత్యర్థం సాత్త్వికులు యజ్ఞాలు నిర్వహిస్తారు. అంతఃకరణ శుద్ధిని విడిచి మరొక ఫలితాన్ని ఆశించరు.

తమ స్వార్థం కొరకు ఫలాపేక్షతో రాజసులు యజ్ఞ కార్యాలను ఆచరిస్తారు. పది మంది తమను గుర్తించాలని, గౌరవించాలని అభిలషిస్తారు. లోకం దృష్టిలో, లోకుల దృష్టిలో తాము గొప్పగా ఉండాలనే తాపత్రయమే గాని, భగవంతుని దృష్టిలో పడాలనే శుభేచ్ఛ వారిలో జనించదు. అందుచేత, ఆడంబరాలతో కార్యాలు నిర్వహిస్తారు. అనిత్య ఫలాలను పొందుతారు. బ్రతుకులను అనర్థంగా మార్చుకుంటారు. ఎందు కంటే, ఈ విధమైన స్వార్థపూరిత యజ్ఞాల కారణంగా, అహంకారయుత కార్యాల వలన పరమాత్మను ఎవ్వరూ పొంద లేరు. పరమేశ్వరుని పొందడానికి ఇవేవీ సాధనలు కాలేవు (**భగవ త్ప్రాప్తి మార్గ అబాహ్యత్వాత్**). ఈ సందర్భములో భగవంతుడు అర్జునుని ***భరతశ్రేష్ఠా!*** అని సంబోధించడము గమనించ దగింది. అర్జునుడు భరత కులశ్రేష్ఠుడు కావడం చేత ప్రకాశవంతమైన సాత్త్విక యజ్ఞములు ఆచరించే శక్తి సామర్థ్యాలు కల వాడే గాని, రాజస యజ్ఞా లకు సంబంధించిన వాడు కాదని యజ్ఞ యోగ్యతా సూచకంగా 'భరతశ్రేష్ఠా!' అని సంబోధించడం జరిగింది.

దక్షుడు యజ్ఞమును నిర్వహించాడు. అర్జునుడు యుద్ధం చేశాడు. పరమేశ్వరుని విస్మరించి, అహంకారంతో విజృంభించి దక్షుడు యజ్ఞమును నిర్వహించిన యజ్ఞభూమి రణభూమిగా మారింది. అర్జునుడు సాగించిన యుద్ధము యజ్ఞ మైంది. పరమేశ్వరుని ధిక్కరించి యజ్ఞమును నిర్వహించి నందుకు దక్ష యజ్ఞము

ధ్వంస మైంది. పరమేశ్వరుని ముందు పెట్టుకొని అర్జునుడు యుద్ధం చేస్తే అది యజ్ఞ మైంది. గీతా బోధతో జ్ఞానయజ్ఞ మైంది. అలాగే త్రిపురా సంహారంలో అసుర పురాలు మూడూ ఎలా దగ్ధమై పోయాయో కూడా మనకు తెలియనిది కాదు. అహంకారులకు ఎక్కడైనా, ఎప్పుడైనా పతనమే. భక్తులకు ఎప్పుడైనా, ఎక్కడైనా శ్రేయస్సే.

*కక్ష కట్టినందుకు దక్ష యజ్ఞము ధ్వంస మాయె*
*అసుర పురములు మూడును భస్మ మాయె*
*నిన్ను పూజించు వారికే పరమ పదము*
*నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా!*

అని నీలకంఠ శతకంలో ఒక విబూది పండు.

*ఇక తామస యజ్ఞాన్ని వివరిస్తున్నాడు.*

విధిహీన మసృష్టాన్నం మన్త్రహీన మదక్షిణమ్ ।
శ్రద్ధావిరహితం యజ్ఞం తామసం పరిచక్షతే ॥ 13

***విధిహీనం-అసృష్టాన్నం-మంత్రహీనం-అదక్షిణం***
***శ్రద్ధావిరహితం-యజ్ఞం-తామసం-పరిచక్షతే***

| | | | | | |
|---|---|---|---|---|---|
| విధిహీనం | = | విధిరహిత మైనది | శ్రద్ధావిరహితం | = | శ్రద్ధ లేనిది |
| అస్పృష్టాన్నం | = | అన్నదానము లేనిది | యజ్ఞం | = | యజ్ఞము |
| మంత్రహీనం | = | మంత్రయుతము కానిది | తామసం | = | తామస మని |
| అదక్షిణం | = | దక్షిణ లేనిది | పరిచక్షతే | = | చెబుతారు |

**పార్థా! విధి విధానము లేనిది, అన్నదానము లేనిది, మంత్రయుతము కానిది, దక్షిణ లేనిది, శ్రద్ధ లేనిది తామస యజ్ఞము.**

### వ్యాఖ్య

తమోగుణ ప్రధానులు తామస యజ్ఞాలను నిర్వహిస్తారు. ప్రస్తుత శ్లోకంలో తామస యజ్ఞము ఐదు విషయాలతో చెప్ప బడింది. వాస్తవానికి ఇవన్నీ యజ్ఞానికి విశేషణాలుగా ఉన్నాయి. విధిహీనం, అస్పృష్టాన్నం, మంత్రహీనం, అదక్షిణం, శ్రద్ధా విరహితం - ఇవే తామస యజ్ఞం లోని ఐదు ప్రధాన విషయాలు.

విధిహీన యజ్ఞము, అస్పృష్టాన్న యజ్ఞము ('అమృష్టాన్నం' అనే పాఠాంతరము ఉంది), మన్త్రహీన యజ్ఞము, అదక్షిణ యజ్ఞము, శ్రద్ధా విరహిత యజ్ఞము - ఈ ఐదు విశేషణాలతో కూడిన యజ్ఞము తామస యజ్ఞము.

### విధిహీనం

విధిహీనము అంటే శాస్త్ర విధికి భిన్న మైనది అని అర్థము. శాస్త్రంలో ఏ విధి విధానాలున్నవో వాటికి విపరీత మైనది విధిహీనము ***(యథా చోదిత విపరీతమ్).*** శాస్త్ర విధిని ఉల్లంఘించి, అతిక్రమించి ఆచరింప బడేది విధిహీనము. యజ్ఞమును నిర్వహించ వలసిన పద్ధతి శాస్త్రంలో చెప్ప బడింది. శాస్త్రోక్త మైన యజ్ఞమును శాస్త్రవిధిని అనుసరించి ఆచరించి నపుడే, దానిని ఆచరించినట్లు అవుతుంది. విధిని విస్మరించి ఆచ రించేది యజ్ఞ మెలా అవుతుంది? విధిని అనుసరించడము లేదు అంటే శ్రద్ధ సరిగా లేదని అర్థము. శ్రద్ధ లేని యజ్ఞాలు శుద్ధి లేనివి. సిద్ధిని ప్రసాదించ లేనివి. అట్టివి తామస యజ్ఞాలు అనబడుతాయి.





### అస్పృష్టాన్నం

సృష్టాన్నం అంటే అన్నదానము. అస్పృష్టాన్నం అంటే అన్నదానము లేనిది. ఏ యజ్ఞములో అయితే అన్నదానము జరగదో అది అస్పృష్టాన్న యజ్ఞము ***(న సృష్టం న దత్తం అన్నం యస్మిన్ యజ్ఞే సః అసృష్టాన్నః తమ్ అసృష్టాన్నం).*** అన్నదానము శ్రేష్ఠమైన దానంగా చెప్ప బడింది. ముఖ్యంగా యజ్ఞ కార్యాలలో అన్నదానము చేయడం పరమ పవిత్రమైన కార్యమని శాస్త్రాలు చెబుతాయి. అన్ని దానాలలో జ్ఞాన దానము తరువాత అన్నదానానికే విశిష్టమైన స్థానం ఇవ్వ బడింది. అట్టి పవిత్రమైన అన్నదానము లేకుండా సాగే యజ్ఞము తామస యజ్ఞము.

### మన్త్రహీనం

మంత్రహీనము అంటే అసలే మంత్రము లేనిది అని అర్థం కాదు. స్వర దోషాలతో, ఉచ్చారణ దోషాలతో కూడిన మంత్రాలతో ఆచరింపబడే యజ్ఞము మంత్రహీనము ***(మన్త్రతః స్వరతః వర్ణతః వియుక్తం మన్త్ర హీనమ్).*** యజ్ఞానికి మంత్రము ప్రాణము లాంటిది. మననము చేసే వారిని రక్షించేది మంత్రము ***(మననాత్ త్రాయతే ఇతి మంత్రః).***

మంత్రము రక్షిస్తుంది అంటే, మంత్రము భగవంతుని స్వరూపము అని అర్థము. ఎలా? రక్షించే శక్తిమంతుడు భగవంతు డొక్కడే. కనుక, మంత్రము రక్షిస్తుంది అంటే మంత్రము భగవంతుని స్వరూపము.

ధర్మరూపంలో భగవంతుడు ఎలా ఉన్నాడో, మంత్రరూపంలో కూడా అలాగే ఉన్నాడు. కనుక, భగవంతుడు మంత్రరూపుడు. మంత్రము భగవ త్స్వరూపము. వేదము, వేద నారాయణుడు ఒక్కటే. వేద మంత్రము కూడా వేద పురుషుని కన్నా అన్యంగా లేదు. వేద మంత్రాలలో వేదమయు డైన పరమేశ్వరుడే ఉన్నాడు. కనుకనే భగవంతునికి 'మంత్రః' అని కూడా పేరు. **ఋగ్యజు స్సామ లక్షణః మంత్రః** - ఋగ్యజు స్సామ ముల రూపములో ఉండే వాడు కనుక భగవంతుడు 'మంత్ర' నామధేయుడు. అంతే కాదు. ఈ మంత్రాల చేత అర్థ మయ్యే వాడు కావడం చేత కూడా పరమేశ్వరుడు 'మంత్రః' అనే పేరుతో కీర్తింప బడ్డాడు ***(మన్త్ర బోధ్యత్వా ద్వా మన్త్రః).***

యజ్ఞము మంత్రహీనంగా ఉంది అంటే అనీశ్వరంగా ఉంది అని అర్థము. మంత్రానికి, మంత్ర రూపుడైన మహేశ్వరునికి నోచుకోని యజ్ఞము తామస యజ్ఞము.

### అదక్షిణం

దక్షిణలు ఏ యజ్ఞములో సమర్పించడం జరగదో అది అదక్షిణ యజ్ఞము. శాస్త్రము చెప్పిన విధంగా దక్షిణలు సమర్పింప బడని యజ్ఞము అదక్షిణ యజ్ఞము ***(అదక్షిణం ఉక్త దక్షిణా రహితం).***

దక్షిణలు ఇవ్వడము అంటే ద్రవ్యాదులు సమర్పించడం అని అర్థము. సమర్పణము అనేది త్యాగానికి సూచకము. త్యాగం లేదు అంటే లోభము ఉందని అర్థము. లోభముతో కూడిన యజ్ఞము ఎప్పుడూ లాభించదు. లోభము అపవిత్ర మైనది. త్యాగము పవిత్ర మైనది. త్యాగ రూపము, పవిత్రము అయిన దక్షిణ సమర్పణము లేకుండా నిర్వహింపబడే యజ్ఞము అదక్షిణ యజ్ఞము. కనుక అది తామస యజ్ఞము.

### శ్రద్ధా విరహిత యజ్ఞము

శ్రద్ధ లేకుండా చేయబడే యజ్ఞము శ్రద్ధా విరహిత యజ్ఞము ***(శ్రద్ధా విహీనం శ్రద్ధా విరహితం యజ్ఞం).*** శ్రద్ధ లేనిదే ఏ కార్యమూ ఫలించదు. యజ్ఞాది పవిత్ర కార్యాలలో శ్రద్ధ ప్రముఖమైన స్థానమును ఆక్రమించి

ఉంది. యజ్ఞ సాధనాలలో ఏదైనా లోపిస్తే శ్రద్ధ దానిని పూరిస్తుంది అంటారు పెద్దలు. కాని, అట్టి శ్రద్ధే లోపించి నపుడు ఇక ప్రత్యేకంగా చెప్పే దేముంటుంది? అలా ప్రధానాంగ మైన శ్రద్ధ లేకుండా ఆచరించే యజ్ఞము తామస యజ్ఞము.

శ్రద్ధ లేకుండా యజ్ఞాన్ని ఎవరైనా ఎలా నిర్వహిస్తారు? యజ్ఞంలో ఋత్విజులతో పాటు అనేక మంది యజ్ఞమును వీక్షిస్తూ ఉంటారు కదా? నిజమే. తామస యజ్ఞాన్ని నిర్వహించే వారు స్వభావత: శ్రద్ధ లేని వారైనా శ్రద్ధ ఉన్నట్లు అభినయిస్తూ యజ్ఞమును నిర్వహిస్తుంటారు. చూచే వాళ్ళకి వారు శ్రద్ధతో యజ్ఞమును నిర్వహిస్తున్నట్లే ఉంటుంది. వాస్తవానికి తామస యజ్ఞాన్ని నిర్వహించే వారికి ఏ శ్రద్ధ ఉండదు. అలా లేకనే ఉన్నట్లు ప్రదర్శించే కుహనా శ్రద్ధను తామస శ్రద్ధ అంటారు.

## యజ్ఞ సమీక్షణము

యజ్ఞము అనేది సువిశాల మైన భావార్థాలతో కూడిన పదము. భగవంతుడే యజ్ఞ రూపంలో ఉన్నాడు అన్నది తైత్తిరీయ సంహిత *(యజ్ఞోవై విష్ణుః 2 - 5 - 5 )*. యజ్ఞము అనగానే అగ్నిహోత్రముతో కూడిన వేదోక్త యజ్ఞమే మనస్సులో మెదుల్తుంది. వేద విధి ననుసరించి ఆచరించే యజ్ఞాలు ఎక్కువ శాతం ఫల భోగార్థమే ఉంటాయి. అవి ఇహ లోక భోగాలు కావచ్చు. లేదా, స్వర్గలోక భోగాలు కావచ్చు.

వైదిక యజ్ఞాలన్నీ పుణ్యాన్ని ఉద్దేశించి, తద్వారా స్వర్గాన్ని కాంక్షించి ఉంటాయి. కాని, నిష్కామంగా ఆచరింపబడే యజ్ఞాలు చిత్తశుద్ధిని కాంక్షించి, తద్వారా మోక్షాన్ని ప్రధానంగా చేసుకొని ఉంటాయి. అలా చూచి నపుడే అనేక యజ్ఞాలు ప్రతిపాదించబడి ఉన్నాయి.

పరమేశ్వరుని ఆరాధించి, అంత:కరణ శుద్ధిని పొందుటకు ఉపకరించే అనేక సాధనలు యజ్ఞములుగా పిలువ బడ్డాయి. ఈశ్వర బుద్ధితో పరోపకారార్థం ఆచరించే సేవా కార్యాలు కూడా యజ్ఞములు అనబడ్డాయి.

ఒకే వ్యక్తి కూర్చుని వేదాధ్యయనం చేస్తే అది స్వాధ్యాయ యజ్ఞ మైంది. జపసాధన చేస్తే అది జపయజ్ఞ మైంది. గీతలో జ్ఞానమునే యజ్ఞముగా గుర్తించి జ్ఞానయజ్ఞం అనడం జరిగింది. దానం చేయడం యజ్ఞ మైంది. తపస్సు చేయడం కూడా యజ్ఞ మైంది.

**యజ్ఞార్థా త్కర్మణోఽ న్యత్ర లోకోఽ యం కర్మబంధనః**

భగవంతుని కొరకు *(యజ్ఞార్థాత్)* ఆచరించే కర్మ కంటే అన్యమైన కర్మలను ఆచరించే వాడు ఈ లోకంలో కర్మబంధంలో చిక్కు కుంటాడు అని శ్రీకృష్ణ పరమాత్మ గీత - కర్మయోగంలో తెలియ జేశాడు *(3వ అ - 9 వ శ్లో).*

సాత్త్వికయజ్ఞము అంత:కరణ శుద్ధిని ప్రసాదిస్తుంది. రాజసయజ్ఞము చిత్తశుద్ధిని ప్రసాదించ లేక పోయినా పుణ్యాన్ని అనుగ్రహిస్తుంది. తామస యజ్ఞము అటు అంత:కరణ శుద్ధిని ఇవ్వలేదు, ఇటు పుణ్యాన్ని పంచలేదు. శ్రమను, ఆయాసాన్ని కలిగించి దుఃఖాన్ని పెంచుతుంది.

ఫలార్థం యజ్ఞ కర్మలు చేసే వారు సకాములు. అంత:కరణ శుద్ధి కొరకు యజ్ఞకర్మ లాచరించే వారు నిష్కాములు. కోరికల నుండి విడి పడిన వారు కావడం చేత సకాములు కాని వారు; అంత:కరణ శుద్ధిని పొందియే ఉన్న వారు కనుక నిష్కాములు కానటువంటి సన్యాసులు - సర్వ కర్మ వినిర్ముక్తులై నైష్కర్మ్యము నందే ఉంటూ కర్మ యందు అకర్మను, అకర్మ యందు కర్మను దర్శిస్తూ ఉంటారు. అట్టి జ్ఞానులు సర్వ





కర్మలను చేసిన వారే అవుతున్నారు **(కృత్స్న కర్మకృత్)**. ఆత్మజ్ఞాని అయిన మహాత్ముడు అన్నీ పొందే వున్న ఆప్తకాముడు కావడం చేత సర్వ కర్మల నుండి, సర్వ యజ్ఞాల నుండి విడిపడి ఉంటాడు. తానే యజ్ఞ స్వరూపుడై శోభిస్తాడు.

*త్రివిధ యజ్ఞాలను విస్తరించి చెప్పిన గీతాచార్యుడు త్రివిధ తపస్సులను గూర్చి చెబుతున్నాడు.*

**దేవ ద్విజ గురు ప్రాజ్ఞ పూజనం శౌచ మార్జవమ్ ।**
**బ్రహ్మచర్య మహింసా చ శారీరం తప ఉచ్యతే ॥** 14

**దేవద్విజగురు ప్రాజ్ఞ పూజనం-శౌచం-ఆర్జవం**
**బ్రహ్మచర్యం-అహింసా-చ-శారీరం-తపః-ఉచ్యతే**

| | | | |
|---|---|---|---|
| దేవద్విజగురు ప్రాజ్ఞ పూజనం | = దేవతలను, బ్రాహ్మణులను, గురువులను, పండితులను పూజించుట | అహింసా | = హింస లేకుండుట |
| | | శారీరం | = దేహ సంబంధమైన |
| శౌచం | = శుభ్రత | తపః | = తపస్సుగ |
| ఆర్జవం | = ఋజుత్వము | ఉచ్యతే | = చెప్పబడింది |
| బ్రహ్మచర్యం | = బ్రహ్మచర్యము | | |

**అర్జునా! దేవతలను, బ్రాహ్మణులను, గురువులను, జ్ఞానులను పూజించుట; శుచిత్వము, ఋజుత్వము, బ్రహ్మచర్యము, అహింస కలిగి ఉండుట - వీటిని శారీరక తపస్సు అన్నారు.**

### వ్యాఖ్య

యజ్ఞము, దానము, తపస్సు అను ఈ మూడు సాధనలు మనుషులను దోష విముక్తుల్ని చేస్తాయి. పవిత్రుల్ని చేస్తాయి. కనుక, యజ్ఞ, దాన, తపస్సులను విడిచిపెట్ట కూడదు. తప్పక ఆచరించాలి ***(న త్యాజ్యం కార్య మేవ తత్ )*** అని పద్దెనిమిదవ అధ్యాయం - అయిదవ శ్లోకంలో భగవానుడు బోధించడం జరిగింది. ఇంతవరకు యజ్ఞ, దాన, తపస్సులలో యజ్ఞమును గూర్చి తెలుసుకున్నాం. త్రివిధ యజ్ఞాలను బోధించిన గీతాచార్యుడు ప్రస్తుతం తపస్సును గూర్చి ప్రవచిస్తున్నాడు.

తపస్సు పవిత్ర మైనది. అది భగవంతుని స్వరూపము. బ్రహ్మదేవుడు తపోధనుడై, తపోమయుడై, తపో హృదయంతో సృష్టి కార్యాన్ని నిర్వర్తించి నట్లు ***(తపోఽ తప్యేత)*** తైత్తిరీయ శ్రుతి. సమస్తమైన కల్మషాలను పోగొట్టే తపస్సు ***(తపసా కిల్బిషం హన్తి)*** మూడు విధాలుగా చెప్పబడింది ***(తపః త్రివిధమ్ ఉచ్యతే)***.

త్రివిధ తపస్సులు అంటే మూడు రకాలైన తపస్సులు. అవే శారీరక తపస్సు, వాచిక తపస్సు, మానసిక తపస్సు. శరీరం ద్వారా చేసేది శారీరక తపస్సు. వాక్కు ద్వారా చేసేది వాచిక తపస్సు. మనస్సు ద్వారా చేసేది మానసిక తపస్సు. గుణ ప్రాధాన్యతను బట్టి మళ్ళీ శారీరక తపస్సు సాత్త్విక, రాజస, తామస తపస్సులుగా మూడు విధాలుగా తెలుస్తుంది. అలాగే వాచిక, మానసిక తపస్సులు కూడా. ఈ విధంగా తొమ్మిది రకాలుగా విభజింప బడిన నవవిధ తపస్సులను భగవంతుడు ప్రవచిస్తున్నాడు. ముందుగా శారీరక తపస్సును గూర్చి చెబుతున్నాడు. దీనినే కాయక తపస్సు అని కూడా అంటారు.

శారీరక తపస్సులో ప్రధానంగా రెండు విషయాలు తెలుస్తున్నాయి. తపస్వి ఏం చేయాలి? తపస్వి ఎలా ఉండాలి? ఈ రెండు విషయాలు ప్రస్తుత శ్లోకంలో ప్రధానంగా చెప్ప బడ్డాయి. తపస్వి చేయ వలసింది పూజాదులు. తపస్వి ఉండ వలసింది శుచిత్వాదులతో. పూజలో ఎవరిని పూజించాలి? ఈ విషయాన్ని నాలుగు రకాల

పూజల ద్వారా తెలిపి, తపస్సు చేసే సాధకుడు ఎలా ఉండాలి అనే విషయాన్ని శుచిత్వాదుల రూపంలో నాలుగు విధాలుగా చెబుతున్నాడు. ముందుగా నాలుగు పూజలను తెలుసుకుందాము.

## పూజా వైశిష్ట్యము

### దేవ పూజనం

దేవతా మూర్తులను పూజించడము దేవ పూజనము. బ్రహ్మ, విష్ణు, మహేశ్వర, సూర్య, అగ్ని, దుర్గ, గణేశాది దేవతలను పూజించడము దేవ పూజనము. పూజను తపస్సు అని ఎప్పుడైతే చెప్పడం జరిగిందో అది నియమంగా ఆచరించ దగింది అని అర్థము. ఆదిలో తపస్సు సంకల్ప యుతంగా ఉంటుంది. ఆ తరువాత నియమబద్ధంగా సాగుతుంది. అలాగే దేవతారాధనము అనే ఈ తపస్సు కూడా వ్రత పరిపాలనం లాగా నిత్యమూ క్రమం తప్పకుండా ఆచరించాలి. నిత్యపూజగా మారితేనే పూజ తపస్సు అవుతుంది.

పూజ పవిత్రమైన సాధన. పూజలో వాక్కు, మనస్సు కూడా సంబంధాన్ని కలిగి ఉన్నా, పూజ అనేది ప్రధానంగా దేహ సంబంధ మైనదే కావడం చేత దీనిని శారీరక తపస్సు, లేదా కాయక తపస్సు అనడం జరిగింది.

పూజ శారీరకం, లేదా కాయకం. దీపారాధన, పుష్పాలంకారము, చందన కుంకుమాది ధారణము, వస్త్రాలంకారము, దీప, ధూప, నైవేద్య సమర్పణము, నీరాజన, నమస్కారాదులు - ఈ సమస్తము దేహ నిర్వాకమే. పూజ అనేది స్వామి భృత్య న్యాయ పరిధిలో ఉంటుంది. కనుక, భక్తునిలో దైన్యము, అహంకార రాహిత్యము మొదలైన సాత్త్విక లక్షణాలు చోటు చేసుకుంటాయి.

### ద్విజ పూజనమ్

***ద్విజ*** శబ్దానికి అనేక అర్థాలు ఉన్నాయి. బ్రాహ్మణుడు, పక్షి, పాము, క్షత్రియుడు, దంతము - ఇలా ఎన్నో అర్థా లున్నాయి. ఇది జన్మ సంబంధంగా చెప్ప బడింది. రెండు జన్మలు, రెండు జాతులుగా తెలియడం చేత ***( ద్విజన్మన్, ద్విజాతిః )*** 'ద్విజ' శబ్దమును ఉపయోగించడము జరిగింది.

ముందు అండముగా జన్మించి, ఆ తరువాత పిల్లగా పుట్టడం, ఇలా రెండు జన్మ లెత్తడం చేత పక్షి ***ద్విజ*** అనబడింది. తల్లి గర్భం నుండి మనిషి పుట్టడం ఒక జన్మ అయితే, గాయత్రీ మంత్రోపదేశంతో అవిద్యా తిమిరం నుండి బయట పడి ఆత్మ వెలుగులో రమించడం మరొక జన్మ అనే భావనతో ***ద్విజ*** అంటే బ్రాహ్మణుడు అనడం జరిగింది. ఈ విషయంలో మీమాంస అవసరం లేదు. బ్రహ్మజ్ఞానము కలవాడు బ్రాహ్మణుడు అన్నది శాస్త్రం ***(బ్రహ్మ జ్ఞానేన బ్రాహణః).*** బ్రహ్మజ్ఞాని కాకపోయినా, బ్రహ్మజ్ఞానానికి ప్రయత్నించే పవిత్రాత్ముడు కూడా బ్రాహ్మణుడే అని భావించ వచ్చు. జన్మ బ్రాహ్మణుడా, కర్మ బ్రాహ్మణుడా? అనే చర్చ అనవసరం. జన్మతః, అంటే జాతి పరం గానే బ్రాహ్మణుడు అని నిర్ధారణ చేయాలి అంటే కుదరదు. ఆచారాన్ని ప్రక్కన పెట్టినా, దేవుడే లేడు అనే నాస్తిక భావాలను కలిగిన బ్రాహ్మణులు చాలా మంది ఉన్నారు. వారి దేహంపై జంధ్యము కనబడదు, వారి మనస్సులో జపం ఉండదు. కనుక బుద్ధి బ్రాహ్మణుడే బ్రాహ్మణుడు కాని జన్మ బ్రాహ్మణుడు కాడు. బ్రాహ్మణత్వము జన్మతః సిద్ధించేదే అని భావించే వారు, వారు విశ్వసించే దానిని, వినిపించే దానిని వారి ప్రవర్తనములో ఇతరులకు దర్శింప చేయాలి. కనుక సాత్త్విక జీవనము ద్వారా, ప్రశాంత ప్రబోధాల ద్వారా జనతను జాగృతం చేసే ద్విజులను పూజించడము కూడా శారీరక తపస్సే. ఇది సంప్రదాయా నికి విరుద్ధము కాదు. సంప్రదాయంలో సంప్రాప్తమైన సదాచారము.





### గురు పూజనమ్

గురు పూజనము అంటే ఆచార్య సేవనము. సద్గురు సేవనము. తన బోధల ద్వారా, ప్రవచనముల ద్వారా శిష్యుని లోని అజ్ఞాన చీకట్లను పారద్రోలే ప్రకాశ స్వరూపుడు సద్గురువు. గురుపూజలో గురువును మానవ మాత్రుడుగా మనం భావించడం లేదు. గురువులో దేవుణ్ణి చూస్తూ ఆచార్యుణ్ణి గురుదేవుడు అంటూ, గురువును బ్రహ్మగా, విష్ణువుగా, మహేశ్వరుడుగా వీక్షించడమే గాకుండా, సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపంగా ***(గురు రేవ పరంబ్రహ్మ)*** దర్శించి సేవించడము జరుగుతుంది. ఆర్ష సంస్కృతిలో ఆచార్యునికి, ఆదిదేవునికి భేదం లేదు. నీవే బ్రహ్మము అని బోధించే గురుదేవుడు తాను బ్రహ్మము కాకుండా పోతాడా? కనుక గురుసేవ పరమ పవిత్రమైన కాయక తపస్సుగా అభివర్ణించ బడింది.

***గుకార స్త్వంధ కారో వై రుకార స్తన్నివర్తకః,***
***అంధకార నిరోధిత్వాత్ గురు రిత్యభి ధీయతే॥***

'గు' అనే అక్షరము అంధకారమును సూచిస్తుంది. 'రు' అనే అక్షరము దానిని నివారించేది అని చెప్ప బడింది. అజ్ఞానము అనే అంధకారమును నిరోధించే వాడు కనుక ఆచార్యుడు 'గురు' శబ్ద వాచ్య డయ్యాడు.

### ప్రాజ్ఞ పూజనము

'ప్రజ్ఞా' అంటే బుద్ధి, వివేకము, మేధస్సు, పాండిత్యము. ప్రజ్ఞ కల వాడు ప్రాజ్ఞుడు. పండితుడు. వివేక వంతుడు. బుద్ధిమంతుడు. అట్టి వానిని సత్కరించడమే ప్రాజ్ఞ పూజనము. బ్రహ్మజ్ఞాని కాకపోయినా, ఆచార్య స్థానంలో లేక పోయినా, సదసద్వివేకము, శాస్త్ర జ్ఞానము కలిగి; సత్ప్రవర్తన, సదాచారాది సుగుణములు గల సాత్త్వికుడు, సాధు పురుషుడు ప్రాజ్ఞుడు. అలాంటి పెద్దలకు నమస్కరించడం, వారి వద్ద వినమ్రులై వివేక వంతులు కావడము సాధకుల కర్తవ్యము. అలాంటి ప్రాజ్ఞ పూజనము కూడా శారీరక తపస్సు క్రిందికే వస్తుంది.

ఇంతవరకు కాయక తపస్సులో తపస్వి దేహంతో ఏమి చేయాలి అనే దానికి నాలుగు విధాలైన పూజలు చేయాలి అని తెలుసుకున్నాం. ఇక తపస్వి ఎలా ఉండాలి అనే విషయాన్ని నాలుగు విధాలుగా చెప్పుకుందాం.

## ప్రవర్తనా వైభవము

### శౌచము

శౌచము అంటే శుచిత్వము. శుభ్రత. పవిత్రత. వాస్తవానికి శౌచమును బాహ్య మని, అంతర మని రెండు విధాలుగా చెప్పుకోవాలి. కాని, ప్రస్తుతం మనం అధ్యయనం చేస్తున్నది శారీరక తపస్సును గూర్చి కనుక, శౌచమును కూడా అంతవరకే వీక్షించి అర్థం చేసుకోవాలి. అంతశ్శౌచాన్ని తరువాత చెప్పుకుందాం. పూర్వా ధ్యాయాలలో చెప్పుకున్నాం కూడా.

***శారీర మాద్యం ఖలు ధర్మ సాధనమ్*** - ధర్మమును, లేదా పురుషార్థమును సాధించడానికి శరీరము సాధనమై ఉండటం చేత దానిని పరిశుద్ధంగా ఉంచుకోవాలి. మనం నివసించే ప్రదేశము, ధరించే దుస్తులు, ఉపయోగించే వస్తువులు, నిత్య జీవితంలో మనం వాడుకునే ప్రతి వస్తువు శుభ్రంగా, పరిశుద్ధంగా ఉండటమే శౌచము.

బాహ్య కాలుష్యము అంటకుండా ఉండటమే శౌచము కనుక, మనము పీల్చే గాలి, త్రాగే నీరు,

భుజించే ఆహారము, తిరిగే వాతావరణము - అన్నీ పరిశుద్ధంగా ఉండేటట్లు జాగ్రత్త పడాలి. శరీరాన్ని స్నానాదుల చేత శుభ్రం చేసుకున్నా, కలుషిత మైన గాలిని పీల్చితే ఆరోగ్యం దెబ్బ తింటుంది. మలిన జలాన్ని పానం చేస్తే కాయక్లేశము సంభవిస్తుంది. ఆరోగ్యం పాడైతే, సాధన కుంటు పడుతుంది. కనుక కాయక తపస్సులో ఈ శౌచమును చేర్చడం జరిగింది.

**ఆర్జవము**

ఆర్జవము అంటే ఋజుత్వము. సరళత్వము. నిజాయతితో కూడిన ప్రవర్తనము. ఆలోచనకు, ఆలాపనకు, ఆచరణకు మధ్య ఎక్కడా అంతరము లేని స్థితి. అంటే, త్రికరణ శుద్ధిగా జీవించడము. అదే ఋజుత్వము లేదా ఆర్జవము.

*శ్లో॥ యథా చిత్తం తథా వాచః యథా వాచః తథా క్రియా,*
*చిత్తే వాచి క్రియా యాంచ సాధూనాం ఏక రూపతా ॥*

మనస్సులో ఏది ఉందో మాటలో అదే వినిపించాలి. మాట ఏది చెప్పిందో క్రియ దానిని చేసి చూపాలి. మనస్సు, మాట, మనుగడ సాధువుకు ఒకే విధంగా, ఏక రూపంగా భాసిస్తాయి. దీనినే శాస్త్రం ఆర్జవము అంటుంది. అంటే త్రికరణ శుద్ధితో జీవించడము అని అర్థము.

**బ్రహ్మచర్యము**

బ్రహ్మచర్యము అనే పదానికి విశేషార్థము ఉన్నా, మనం చర్చించేది కాయక తపస్సును గూర్చి కనుక, దేహానికి పరిమితమై అర్థం చేసుకోవడమే సముచితంగా ఉంటుంది. అలా చూచి నపుడు, బ్రహ్మచర్యము అంటే మైథున వైముఖ్యమే అని చెప్పుకోవాలి. ఇది సాధకులకు అత్యంత ప్రముఖమైన విషయము.

***మరణం బిందు పతేన జీవనం బిందు రక్షణాత్*** - వీర్య పతనమే మరణము. వీర్య రక్షణమే జీవనము అన్నది యోగశాస్త్రము. కనుక కాయక తపస్సులో బ్రహ్మచర్యమును అవలంబించడము అంటే, కేవలం మైథున క్రియ నుండి విరమించడమే కాదు. అలా విరమించడానికి అనువైన వాతావరణమును ముందు మనస్సులో సృష్టించు కోవాలి. ఇది కాయక తపస్సు కదా, ఇందులో మనస్సు యొక్క ప్రమేయ మేమిటి అనే సందేహం మీకు కలగ వచ్చు. దేహమే కాయక తపస్సులో ప్రధానము అనేది వాస్తవ మైనా ఇంద్రియ మనస్సులను పూర్తిగా ప్రక్కన పెట్టే అవకాశం లేదు. అవి అన్యోన్యాశ్రయాలు అనే విషయాన్ని విస్మరించడానికి వీలు లేదు.

బ్రహ్మచర్యము భంగ పడేది మైథున కార్యము లోనే అయినా, మైథునానికి ముందే ఒక్కొక్క స్థాయిలో అది శిథిల మౌతూ వస్తుంది. ఈ ప్రారంభ శిథిలావస్థలను నివారించుకుంటూ వస్తేనే అంతిమంగా మైథున కార్యాన్ని నిరోధించి బ్రహ్మచర్యమును పరిరక్షించు కోవడం సాధ్య పడుతుంది.

*స్మరణం కీర్తనం కేలిః ప్రేక్షణం గుహ్య భాషణమ్*
*సంకల్పోఽ ధ్యవ సాయశ్చ క్రియా నిర్వృత్తి రేవ చ,*
*ఏత న్మైథున మష్టాంగం ప్రవదన్తి మనీషిణః ॥*

బ్రహ్మచర్యమును భంగ పరచి తపస్సును భగ్నం చేసే మైథున కార్యానికి ఎనిమిది అంగాలున్నా యన్నారు పెద్దలు, పరమ యోగులు. ఇవన్నీ నిగ్రహింప బడితేనే బ్రహ్మచర్యము సాధ్య పడుతుంది.

ప్రేమికులు ఒకరి నొకరు స్మరించడము ***(స్మరణం)***. వారిని గూర్చి పరోక్షంలో ప్రస్తావించి, వారిని గూర్చి చెప్పుకొని సంతోషించడం ***(కీర్తనం)***. ఒకరితో ఒకరు కలిసి తిరగడం ***(కేలిః)***. అదే పనిగా ఒకరి





నొకరు చూసుకుంటూ ఉండటం ***(ప్రేక్షణం)***. పరస్పరం రహస్యంగా మాట్లాడు కోవడం ***(గుహ్య భాషణమ్)***. సంగమించాలని సంకల్పించడం ***(సంకల్పః)***. సంకల్పించిన దానిని నిర్ధారణ చేసుకోవడం ***(అధ్యవసాయః)***. నిరోధించడానికి, నిగ్రహించడానికి వీలు లేని పరిస్థితిలో సంగమించడము ***( క్రియా నిర్వృత్తిః)***. ఈ ఎనిమిది బ్రహ్మచర్యమును భగ్నం చేసే మైథునాంగములు. ఈ అష్టాంగ మైథునాన్ని కష్టపడి త్యజించడమే బ్రహ్మ చర్యము. అదే శారీరక తపస్సు.

**అహింస**

ఎవరినీ హింసించకుండా ఉండటము అహింస. మానవులు ఆచరించ వలసిన ధర్మాలలో అహింసకు అగ్రస్థానం ఇచ్చింది వేదము. ఈ విషయాన్నే ధర్మశాస్త్రాలు పని కట్టుకొని, పని పెట్టుకొని ప్రబోధించాయి. ***అహింసా పరమో ధర్మః*** - అహింస ఉత్తమ మైన ధర్మము అన్నది శాస్త్రం.

***వాఙ్మనః కాయైః భూతానాం అనభిద్రోహః*** - వాక్కు ద్వారా గాని, మనస్సు ద్వారా గాని, కాయము ద్వారా గాని ఎవ్వరికీ ఏ విధమైన కష్టం కలిగించడం గాని, ద్రోహం తల పెట్టడం గాని చేయకుండా ఉండటమే అహింస అన్నది యోగశాస్త్రం.

పరుషమైన వాక్కుల ద్వారా ప్రత్యక్షంగా ఇతరులను హింసించకుండా ఉండటం అహింస. అంతే కాదు, విష ప్రచారాల ద్వారా పరోక్షంగా అన్యులను హింసించకుండా ఉండటము కూడా అహింసే.

కాని, ప్రస్తుత శ్లోకంలో 'అహింస' అనే దానిని కాయక తపస్సుగా చెప్పడం చేత, దేహం ద్వారా హింసించ కుండా ఉండాలి అనేది ముఖ్య విషయంగా ఉంది. ఇతరులను శారీరకంగా బాధించడం హింస. ఇతరులను కొట్టడము హింస. హింస పెట్టడం ఎలా తపో భంగమో, హింస పడటం, లేదా హింసింప బడటం కూడా తపో భంగమే. ఈ పరిస్థితులు సంభవించకుండా సాధకులు జాగ్రత్త పడాలి.

కాయక తపస్సులో అహింసకు సంబంధించి ఈ మాత్రం అవగాహన సరి పోతుంది. అంతేగాని, ఒక చెంప మీద కొడితే రెండో చెంప చూపించు - అదే అహింస అనే స్థాయికి ఎదగ నవసరం లేదు.

ఒక చెంప మీద కొట్టిన వాడు రెండవ చెంప మీద కొట్టడానికి సంశయిస్తాడా? పైగా దెబ్బ తినింది చాలక, రెండవ చెంపను కూడా చూపించడ మెందుకు? అదే మన్నా లాకర్‌లో దాచబడిన ధనమా, తీసి చూపించ డానికి? లేక కొట్ట గానే రెండు ముక్కలై అటు ఇటు పడే కొబ్బరికాయ చిప్పలా చెంప లంటే!

ఆధ్యాత్మిక విషయాలలో అతిశయాలు అవరోధాలే గాని అభివృద్ధికి సోపానాలు కావు. ప్రతి విషయాన్ని ఆవేశంతో ముడిపెట్టి అర్థం చేసుకోవడం కాదు. వివేకంతో, విచక్షణతో విచారించి అర్థం చేసుకోవాలి.

*ఇక, వాచిక తపస్సును గూర్చి చెబుతున్నాడు.*

అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్।
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే ॥ 15

*అనుద్వేగకరం-వాక్యం-సత్యం-ప్రియః-హితం-చ-యత్*
*స్వాధ్యాయాభ్యసనం-చ-ఏవ-వాఙ్మయం-తపః-ఉచ్యతే*

అనుద్వేగకరం = ఉద్వేగకరము కానిది
సత్యం = సత్య మైనది
ప్రియః = ప్రియ మైనది
హితం చ = హిత మైనది
యత్ = ఏ
వాక్యం = వాక్యము

| | | | |
|---|---|---|---|
| స్వాధ్యాయాభ్యసనం చ ఏవ | = వేదాధ్యయనము | తపః | = తపస్సుగ |
| వాఙ్మయం | = వాక్సంబంధమైన | ఉచ్యతే | = చెప్పబడింది |

**పార్థా! పరులను నొప్పించనిది, సత్య మైనది, ప్రియ మైనది, హితకర మైనది, స్వాధ్యాయమును అభ్యసించుట - ఈ విధమైన పలుకును వాచిక తపస్సు అంటారు.**

**వ్యాఖ్య**

దేవ, ద్విజ, గురు, ప్రాజ్ఞులను సేవించుట ద్వారా; శౌచము, ఆర్జవము, బ్రహ్మచర్య, అహింసాది సాధనలను ఆచరించుట ద్వారా కాయక తపస్సును అనుష్ఠించిన సాధకులు, దేహ సంబంధమైన దోషాలను తొలగించుకొని శుద్ధి పడుతున్నారు. మోక్షానికి సిద్ధ పడుతున్నారు. కాయక తపస్సును గూర్చి ఇంతవరకు వివరించిన పరమేశ్వరుడు ఇప్పుడు వాచిక తపస్సును గూర్చి చెబుతున్నాడు.

సాధకుని నోటి నుండి ఏ విధమైన వాక్యము వినిపిస్తుందో దానిని బట్టి అతని తపస్సు తెలుస్తుంది. వాక్కు అగ్ని బీజం. వంటకు మంటలా ఉపకరిస్తుంది. అదే ఉగ్ర రూపాన్ని దాల్చి దగ్ధం చేస్తుంది. కనుక సక్రమంగా వినియోగించుకుంటే, వాక్కు తపోరూపమై అమృతాన్ని పంచుతుంది. దారి తప్పి అక్రమంగా ఆలపిస్తే వాక్కు పతన హేతువై విషాన్ని విరజిమ్ముతుంది.

మనం ఎవరితో మాట్లాడినా, ఆ మాట వెనుక ఒక ఉద్దేశ్యం ఉంటుంది. ఉండాలి. హేతువు లేకుండా ఏదంటే అది మాట్లాడటం పిచ్చివాడికే సాధ్యం. సాధారణంగా ఒక వ్యక్తి మరొక వ్యక్తితో మాట్లాడే టప్పుడు ఏదో ఒక విషయాన్నో, లేదా అనుభవాన్నో తెలియ చేసేందుకే మాట్లాడుతాడు. అదే వాక్య ప్రయోజనము ***( పర ప్రత్యయ నార్థం ప్రయుక్తస్య వాక్యస్య ).***

విషయ జ్ఞానాన్ని, లేదా అనుభవాన్ని పంచుతూ మాట్లాడే టప్పుడు ఆ వాక్యాలు వినే వారిలో వివేకాన్ని వృద్ధి చేయాలి, విచారాన్ని కలిగించాలి, అవగాహనను పెంచాలి. అంతే గాని, ఉద్వేగాన్ని కలిగించ కూడదు. అశాంతిని రేకెత్తించ కూడదు. సంశయాన్ని కల్పించ కూడదు. సంతాపాన్ని దించ కూడదు.

మాటలు చల్లగా ఉండాలే గాని, వేడిని పుట్టించ కూడదు. పంట పండినట్లు ఉండాలే గాని మంట పెట్టినట్లు ఉండ కూడదు. తృప్తిని కలిగించాలే గాని అసంతృప్తిని పంచ కూడదు. శాంతిని కలిగించాలే గాని అశాంతిని పెంచ కూడదు. ఇలా మాట్లాడటం స్థూలంగా చెప్పాలంటే వాచిక తపస్సు అవుతుంది. దీనిని శాస్త్రీయంగా, ప్రామాణికంగా అర్థం చేసుకోవాలి అంటే, కొన్ని లక్షణాలను అవశ్యం చెప్పుకొని అర్థం చేసుకోవాలి. ప్రస్తుత శ్లోకంలో భగవంతుడు అదే చెబుతున్నాడు. వాచిక తపస్సు ఎలాంటిదో విశదం చేస్తున్నాడు.

## అనుద్వేగకరం - సత్యం - ప్రియహితం వాక్యం

మనం పలికే మాట, లేదా వాక్యము వినే వారికి ఉద్వేగాన్ని కలిగించకుండా ఉండాలి. దుఃఖాన్ని కలిగించ కుండా ఉండాలి ***( అనుద్వేగకరం ప్రాణినామ్ అదుఃఖకరం వాక్యం ).*** అట్టి వాక్యము అసత్య వచనం కాకూడదు. సత్య వాక్కు గానే ఉండాలి ***( వాక్యం సత్యం ).*** ఉద్వేగము కలిగించని సత్య వాక్యము ప్రియం గాను, హితం గాను ఉండాలి ***( ప్రియం చ తత్ హితం చ ప్రియ హితం ).*** వినగానే సుఖాన్ని కలిగించేది, కర్ణపేయంగా ఉండేది ప్రియం. పరిణామ దశలో శ్రేయస్సును కలిగించేది హితం. అవే ప్రియహితాలు. దృష్టాదృష్ట ప్రయోజనాలు. ప్రియం దృష్ట ఫలం. హితం అదృష్ట ఫలం. అది స్వర్గం కావచ్చు. లేదా మోక్షం కావచ్చు. తక్షణమే సుఖాన్ని కలిగించేది ప్రియం. భవిష్యత్తులో శుభాన్ని కలిగించేది హితం. ప్రథమంగా వాచిక తపస్సులో ఇంతవరకు మనకు స్పష్టంగా అర్థం కావాలి. అప్పుడే అది వాఙ్మయ తపస్సు అవుతుంది.





అనుద్వేగకరం, సత్యం, ప్రియం, హితం - అనే ఈ నాలుగు ధర్మాల చేత వాక్యం విశేషింప బడుతూ ఉంది. అంటే ఈ నాలుగు ధర్మాలు వాక్యంలో ఉండ వలసిన విశేషాలు. అనుద్వేగకరం, సత్యం, ప్రియం, హితం అనే ఈ నాలుగు విశేషణాలు వాక్యంలో సమ ప్రాధాన్యం కలిగి ఉన్నాయి. కనుక ఈ నాలుగు ధర్మాలు వాక్యంలో సమస్థితిలో ఉండి తీరాలి. విశేషణాలైన ఈ నాలుగు ధర్మాలకు సముచ్చయాన్ని చెప్పడం కోసం చ శబ్దము ప్రయోగింప బడింది ***( విశేషణ ధర్మ సముచ్చయార్థః 'చ' శబ్దః ).*** ఈ నాలుగు ధర్మాలు వాక్యంలో సమంగా కలిస్తేనే అది వాఙ్మయ తపస్సు అవుతుంది. అవధానంతో అర్థం చేసుకోండి. అందుకే 'చ' శబ్ద ప్రయోగము. విశేషణ ధర్మాలైన అనుద్వేగకరాదులు విశేష్యమైన వాక్యముతో సముదితాలే గాక, ఆ నాలుగు విశేషణాలకు కూడా పరస్పరము సముచ్చయము ఉంది అని తెలుపడానికే 'చ' శబ్ద ప్రయోగము.

కాస్త వివరిస్తాను. మన భావాన్ని మాట ద్వారా ఒకరికి తెలియ చేసి నపుడు ఆ వాక్యంలో అనుద్వేగకర, సత్య, ప్రియ, హితము లనే లక్షణాలు నాలుగు సమంగా కలిసి ఉండాలి. అప్పుడే అది వాఙ్మయ తపస్సు అవుతుంది. ఈ నాలుగు ధర్మాలలో ఒకటవది లోపించినా, రెండవది లోపించినా, మూడవది లోపించినా అది వాచిక తపస్సు కాలేదు.

అంటే మన వాక్యము సత్యమే అయినా, అనుద్వేగకరం, ప్రియం, హితం అనే మూడు ధర్మాలలో ఒకటవది లోపించినా, రెండవది లోపించినా, మూడవది లోపించినా, ఆ పలికిన వాక్యము సత్యమే కావచ్చు. కాని, అది వాఙ్మయ తపస్సు కాలేదు.

ప్రియ వాక్యము నైనా, హితవాక్యము నైనా, అనుద్వేగకర వాక్యము నైనా ఇలాగే అర్థం చేసుకోవాలి. ఒక దానితో పాటు మిగిలిన మూడు సముచ్చయమై ఉంటేనే అది వాచిక తపస్సు అవుతుంది. ఏ ఒక్కటి లోపించినా, లేదా నాలుగు కలిసి సమంగా ఉండక పోయినా, అది సత్య వాక్యం కావచ్చు. ప్రియ వాక్యం కావచ్చు. హిత వాక్యం కావచ్చు. లేదా అనుద్వేగకర వాక్యం కావచ్చు. అంతేగాని, అలాంటి వాక్యం వాఙ్మయ తపస్సు క్రిందికి రాదు. మరి అలా వాక్య నిర్మాణం చేయడం సాధ్య మేనా? ఇంతకీ వాఙ్మయ తపస్సుకు సంబంధించిన వాక్యం ఎలా ఉండాలి? విశేషణ చతుష్టయంతో కూడిన వాక్యము నెలా ఉచ్చరించాలి? శ్రీ శంకరాచార్య స్వామి ఉదాహరణకు ఒక వాక్యాన్ని అందించారు. ఇలా మాట్లాడ గలిగితే, మన మాట లన్నీ వాచిక తపస్సులే అవుతాయి.

***శాన్తో భవ! వత్స! స్వాధ్యాయం యోగం చ అనుతిష్ఠ! తథా తే శ్రేయో భవిష్యతి!*** ఇది విశేషణ చతుష్టయ ముతో కూడిన వాక్యము. వాచిక తపస్సు.

'నాయనా! శాంతముగా ఉండెదవు గాక! స్వాధ్యాయమును, యోగమును అనుష్ఠించు. అలా చేస్తే నీకు శ్రేయస్సు కలుగుతుంది'. ఇది వాక్యార్థం. చతుర్విధ విశేషణ సముచ్చయార్థంతో విశిష్టమైన వాక్యము, విశేషణ విశేష్యత్వముతో వాఙ్మయ తపస్సుగా ఎలా విరాజిల్లుతూ ఉందో చూడండి.

నాయనా! ప్రశాంతంగా ఉండు ***(వత్స! శాన్తో భవ!).*** ఈ మాట ఎంత హాయిగా ఉంది. ఆహ్లాదకరంగా ఉంది. మన మైతే, 'చాల్లే ఊరుకో!', అంటాము. పాండిత్యము, ప్రకోపము మరీ ఎక్కువైతే 'ఇక నోరు ముయ్యి!' అంటాము. ఇది ఎంత కటువుగా ఉంది? మనం పలికిన వాక్యం దుఃఖాన్ని కలిగిస్తూ ఉద్వేగకరంగా ఉంటే, ఆచార్యుల వారి వాక్యం ఎంత అందంగా, ఆనందంగా, అనుద్వేగకరంగా ఉందో చూడండి ***( అనుద్వేగకరం ).*** 'నాయనా! స్వాధ్యాయాన్ని , కర్మయోగాన్ని ఆచరించు' ***( స్వాధ్యాయం యోగం చ అనుతిష్ఠ! ).*** ఈ వాక్యము వినడానికి ప్రియంగా ఉంది ***( ప్రియం ).*** అంతే కాదు. భవిష్యత్తులో హితాన్ని కలిగిస్తుంది ***( హితం ).*** 'ఇలా చేస్తే

నీకు శ్రేయస్సు కలుగుతుంది' (*తథా తే శ్రేయో భవిష్యతి !*). ఈ వాక్యం అనుద్వేగకరము, సత్యము, ప్రియము, హితము కూడా. ఇలా వాక్య నిర్మాణం చేస్తూ, చతుర్విధ విశేషణ సముచ్చయార్థముతో భాషించ గలిగితే అది వాఙ్మయ తపస్సు అవుతుంది.

వాచిక తపస్సు అనేది ప్రధానంగా అనుద్వేగకరము, సత్యము, ప్రియము, హితము అనే నాలుగు స్తంభాల మీద నిలబడిన సౌధము. నాలుగు చక్రాల మీద నడిచే రథము.

**అనుద్వేగకరం**

సత్యము కఠినం గానే ఉంటుంది. కఠోరం గానే ఉంటుంది. 'నేను అబద్ధం ఆడలేను. ఇతరులకు కష్టం కలుగుతుందని నేను సత్యం మాట్లాడకుండా ఉండలేను' అని చాలా మంది అంటూ ఉంటారు. సత్యమును పలికే మనం మన మాటల ద్వారా పరులను బాధించ గల మేమో గాని, సత్యానికి బాధించడం తెలియదు. సత్యము సుఖ పెట్టేదే గాని దుఃఖ పెట్టేది కాదు. కష్ట పెట్టడం తెలియని సత్యాన్ని ఎలా భాషించాలో తెలియక ఇతరులను మన భాషణం ద్వారా కష్టపెట్టి, ఆ దోషాన్ని సత్యానికి అంటగట్టి, నిజం చేదుగా ఉంటుంది, సత్యం కటువుగా ఉంటుంది అని మాట్లాడటం ధర్మం కాదు.

మనం సత్యాన్నే పలకాలి. సత్య భాషణము వ్రతము లాంటిది. వ్రతాన్ని సంయమనంతో ఆచరించాలి. ప్రశాంతంగా ఆచరించాలి. ఆవేశాలను, ఉద్రేకాలను ప్రక్కన పెట్టాలి. వ్రతాన్ని ఎలా ప్రియంగా ఆచరిస్తామో, సత్య భాషణమును కూడా అలా ప్రియంగా అభ్యసించాలి.

మనం ఏమి మాట్లాడు తున్నాము అనేది ఎంత ప్రధానమో, ఎలా మాట్లాడు తున్నాము అనేది కూడా అంతే ప్రధానము. మనం ఏమి మాట్లాడు తున్నాము, ఎవరితో మాట్లాడు తున్నాము, ఎక్కడ మాట్లాడు తున్నాము, ఎప్పుడు మాట్లాడు తున్నాము, ఎలా మాట్లాడు తున్నాము - ఈ ఐదు విషయాలను మనస్సులో ఉంచుకొని మాట్లాడితే తప్పకుండా మనకు వాచిక తపస్సు అలవడుతుంది. వాఙ్నియమము కుదురుతుంది.

వాఙ్నియమము కుదిరితే, మనం మాట్లాడే వాక్యాలలో, మాలలో మాణిక్యాల లాగా పదాలు పొదగ బడతాయి. మాటల కనుగుణంగా కంఠధ్వని అనుకూలిస్తుంది. వినే వారికి వినసొంపుగా ఉంటుంది. మనసుకు కష్టం లేకుండా ఉంటుంది (*అనుద్వేగకరం*).

**సత్యము**

ఎవరినీ కష్ట పెట్ట కూడదని, అనుద్వేగకరంగా భాషించాలని అసత్యాన్ని భాషించ డానికి వీలు లేదు. మనం ఎవరితో మాట్లాడు తున్నామో, ఎవరికి బోధిస్తున్నామో, లేదా సలహా ఇస్తున్నామో అది వారికి ఉపయోగ పడాలనే కదా, మనం మాట్లాడేది? సత్యం మేలు చేస్తుంది. అసత్యం ఎలా మేలు చేస్తుంది? కనుక, అనుద్వేగకర మైన వాక్యము సత్యంగా ఉండేటట్లు చూసుకోవాలి. మన మాట మన మనస్సుతో విభేదించ కూడదు. అప్పుడే అది సత్యమైన మాట.

కాని ఇక్కడ మరొక సూక్ష్మమైన అంశము ఉంది. మనం ఏది మాట్లాడు తున్నామో అది మన మనస్సులో ఉన్నదే. పైగా అనుద్వేగకరంగా కూడా మాట్లాడు తున్నాము. మనస్సుకు, మాటకు భేదం లేకుండానే భాషి స్తున్నాము. మనస్సులో ఉన్నదే చెబుతున్నాము. కాని, మన మనస్సులో ఉన్నదే తప్పుడు సమాచార మైతే, సత్య విషయం కాని దైతే, అప్పుడు ఏమి చేయాలి? మనస్సులో ఉన్నదే చెబుతున్నాము కనుక సత్యమే పలుకు తున్నాం. కాని, మనస్సుకు తెలిసింది ఏదో అది సత్యం కాదు. అప్పుడు అది సత్య భాషణం ఎలా అవుతుంది?





ఒక వ్యక్తి విజయవాడ రైల్వే ప్లాట్‌ఫారం మీద తొందర తొందరగా పరుగులు పెడుతూ, అయ్యా! వాల్తేరు వెళ్ళే రైలు ఏ ప్లాట్‌ఫారమ్ మీద ఉంది? అని నిన్నే ప్రశ్నించాడను కుందాం. పావుగంట క్రితం అది రెండవ నెంబరు ప్లాట్‌ఫారమ్ మీద ఉండటం నీవు ప్రత్యక్షంగా చూశావు కనుక, మరో ఆలోచనకు అవకాశం లేకుండా రెండవ నెంబరు ప్లాట్‌ఫారం మీద ఉందండి అని చెప్తావు. అతడు వెళ్ళి ఆ బండిలో కూర్చుంటాడు. బండి బయలుదేరి వెళ్తుంది.

కాని, అది వాల్తేరు వెళ్ళే రైలు కాదు. చెన్నై వెళ్ళే రైలు. ప్రయాణం చేసే వ్యక్తి ఇపుడు ఎక్కడికి చేరా లని? అతని కష్టానికి, బాధకి బాధ్యు లెవరు? నువ్వే. నువ్వు వాదించ నవసరం లేదు. నువ్వు చెప్పింది సత్యమే అని మేమూ అంగీకరిస్తున్నాము. కాకపోతే, పావుగంట క్రితం నువ్వు చూచి నపుడు అది రెండవ నెంబరు ప్లాట్‌ఫారమ్ మీదనే ఉండింది. ఆ తరువాత కొద్ది సేపటికి ప్రకటన వెలువడటం, వాల్తేరు రైలు ఒకటవ నెంబరు ప్లాట్‌ఫారమ్ మీదికి వెళ్ళడం, చెన్నై రైలు రెండవ నెంబరు ప్లాట్‌ఫారమ్ మీదికి రావడం జరిగింది.

నువ్వు సత్యమే చెప్పావు. కానీ నీ చేత చెప్ప బడింది సత్యం కాదు. తెలిసి నువ్వు తప్పు చేయలేదు. కాని, అది క్షంతవ్యం కాదు. ఒప్పు చేయాలి అనుకున్నప్పుడు క్షుణ్ణంగా తెలుసుకొని చెయ్యాలి. నేను సత్యాన్నే పలికాను. పైగా అనుద్వేగకరంగా పలికాను అని నువ్వు అనుకోవచ్చు. మనస్సులో ఉన్న దానిని మార్పు లేకుండా చెప్పినంత మాత్రాన అది సత్యం కాదు. ముందుగా మన మనస్సులో ఉన్నది సత్య మేనా? అనే దానిని నిర్ధారణ చేసుకొని ఆ తరువాత, ఆ వాక్యాన్ని ప్రశాంతంగా అనుద్వేగకరంగా భాషించాలి (*అనుద్వేగకరం వాక్యం సత్యం*). ఈ సత్యాన్ని ఆవిష్కరించ డానికి శ్రీ శంకరాచార్యస్వామి భగవద్గీత - పదహారవ అధ్యాయంలో ***అహింసా సత్య మక్రోధః*** అనే రెండవ శ్లోకంపై భాష్యం చెబుతూ ***అప్రియానృత వర్జితం యథా భూతార్థ వచనమ్*** అని సత్యాన్ని వ్యాఖ్యానించారు. 'ప్రియంగా ఉండాలి, అసత్యం కాకుండా ఉండాలి, ఉన్న దున్నట్లు ఉండాలి' అన్నారు. కనుక, మనస్సులో ఉన్న దానిని చెప్పడమే కాకుండా, అది సత్యామో, కాదో తెలుసుకొని మరీ చెప్పాలి.

**ప్రియం**

అనుద్వేగకరము, సత్యమైన విషయమును ప్రియంగా పలకాలి. చెప్పే వ్యక్తి ఉద్వేగాన్ని కలిగించకుండా సత్యాన్ని భాషించ వచ్చు. కాని, వినే వ్యక్తి దానిని ఎలా స్వీకరిస్తున్నాడు అనేది కూడా చాలా ముఖ్యం. నువ్వు చెప్పేది సత్య మైనంత మాత్రాన వినే వాడు ఎందుకు వింటాడు? తనకు ప్రియమైన దైతేనే వింటాడు. ప్రపంచంలో ఎన్నో సత్యమైన విషయాలు ఉన్నాయి. వాటన్నిటి అవసరం అందరికీ ఎలా ఉంటుంది? ఎవరికి ఏది ఇష్టమో, ఏది ప్రియమో దానినే వాళ్ళు వింటారు. ఒకవేళ నువ్వు చెప్పేది ఎదుటి వాడికి అవసర మైనదే అనేది నీ అభిప్రాయ మైతే, దానిని అతడు గ్రహించ డానికి నువ్వు ప్రియంగా భాషించ వలసి ఉంటుంది. అప్పుడే అతడు దానిని స్వీకరిస్తాడు. కనుక, అనుద్వేగకరము, సత్యమైన విషయ మైనా దానిని ప్రియంగా వినిపించాలి (*అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియం*).

**హితం**

ప్రియంగా ఉంటుందని హితకరం కాని దానిని పలుక కూడదు. ప్రియ మైనది ఏదో అది హితకరంగా కూడా ఉండాలి. సినిమాకు పోదామా! అని ఒక వ్యక్తితో చెబితే అతనికి ప్రియంగా ఉంటుంది. కాని, అది హితం కాదు. మధుమేహ రోగికి లడ్డు పెడితే అతనికి ప్రియం గానే ఉంటుంది. కాని, అది అతనికి హితం కాదు. కనుక అనుద్వేగకరము, సత్యము, ప్రియము అయిన మాట హితకరంగా ఉండాలి (***అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియ హితం చ***). ఇలా భాషించడము వాచిక తపస్సు.

**సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్ న బ్రూయాత్ సత్యం అప్రియమ్ ,**
**ప్రియం చ నానృతం బ్రూయాత్ ఏష ధర్మః సనాతనః ॥**

'సత్యాన్నే పలకాలి. ప్రియంగా పలకాలి. సత్యమే అయినా అప్రియ మైన దానిని పలుక కూడదు. ప్రియంగా ఉందని అసత్యమునూ పలుక కూడదు. ఇదే సనాతన ధర్మము' అని మనుధర్మ శాస్త్రము. అలాగే పోరు ఎప్పుడూ లాభం కాదు. పొందు ఎన్నడూ నష్ట పోదు. నోరు మంచి దైతే ఊరు మంచిది అన్నారు మన పెద్దలు. కాకి చేసిన కీడే ముంది? కోయిల చేసిన మేలు మాత్రం ఏముంది? పలుకు లోనే ఉంది పరమార్థం. తెలిసి పలికితే అదే పరార్థం.

**పలుకుట తెలియని అవివేకి**
**పలవరిస్తాడు విస్తారముగా**
**పలుకుల మర్మము తెలిపే జ్ఞాని**
**ప్రవచిస్తాడు విపులముగా**
**రెండూ కాని సామాన్యుడు**
**మితముగ పలకాలి హితముగా**
**రామ రామ జయ రాజారామ్**
**రామ రామ జయ సీతారామ్**

అని రామజోగి చిట్కా.

## స్వాధ్యాయ అభ్యసనం

విశేషణ చతుష్టయ సముచ్చయ వాక్యమే వాఙ్మయ తపస్సు అని విస్తరించి చెప్పుకున్నాం. ఉదాత్త అనుదాత్తాది స్వర చతుష్టయముతో కూడిన వేదమునకే వేదత్వము. అలాగే అనుద్వేగకరాది నాలుగు విశేషణా లతో కూడిన వాక్కునకే తపో రూపత్వము.

సత్య భాషణము ఎలా వాచిక తపస్సో మనకు అర్థ మైంది. అంతటితో శ్లోకం లోని పూర్వార్థమునకు భాష్యం చెప్పిన ట్లైంది. వాఙ్మయ తపస్సుకు రెండవ విభాగం ఉంది. అదే స్వాధ్యాయ అభ్యసనం. వేదమును, అందులోను స్వశాఖ అధ్యయనా భ్యాసమును కూడా వాఙ్మయ తపస్సు అంటారు ***(స్వాధ్యాయో అధ్యేతవ్యః)***. ఎవరు ఏ వేద శాఖకు చెందిన వారో, ఆ శాఖను నిత్యము అధ్యయనం చేయాలి అనేది వేద నిర్ణయము. ఇదే స్వాధ్యాయము. ఈ విధమైన స్వాధ్యాయము కూడా వాచిక తపస్సే అవుతుంది ***(స్వాధ్యాయ అభ్యసనం చైవ యథావిధి వాఙ్మయం తపః ఉచ్యతే)***.

*త్రివిధ తపస్సులలో కాయక, వాచిక తపస్సులను విస్పష్టం చేసిన పరమేశ్వరుడు, చివరి దైన మానసిక తపస్సును గూర్చి చెబుతున్నాడు.*

**మనఃప్రసాద స్సౌమ్యత్వం మౌన మాత్మవినిగ్రహః ।**
**భావసంశుద్ధి రిత్యేత త్తపో మానస ముచ్యతే ॥** 16

***మనఃప్రసాదః-సౌమ్యత్వం-మౌనం-ఆత్మవినిగ్రహః***
***భావసంశుద్ధిః-ఇతి-ఏతత్-తపః-మానసం-ఉచ్యతే***

మనఃప్రసాదః = మనస్సు ప్రశాంతత నొందుట





సౌమ్యత్వం = ప్రసన్నత్వము
మౌనం = మౌనము
ఆత్మవినిగ్రహః = మనోనిగ్రహము
భావసంశుద్ధిః = అంతఃకరణ శుద్ధి
ఇతి ఏతత్ = ఇది అంతా
మానసం = మనః సంబంధమైన
తపః = తపస్సుగ
ఉచ్యతే = చెప్పబడింది

**అర్జునా! ప్రసన్నమైన మనస్సు, శాంతస్వభావము, మౌనము, ఆత్మనిగ్రహము, అంతఃకరణశుద్ధి - ఇదంతా మానసిక తపస్సు అన్నారు.**

### వ్యాఖ్య

కాయమునకు సంబంధించిన తపస్సును కాయక తపస్సని, వాక్కుకు సంబంధించిన తపస్సును వాచిక తపస్సు అని తెలుసుకున్నాం. అలాగే మనస్సుకు సంబంధించిన తపస్సు మానసిక తపస్సు. అదేమిటో ఈ శ్లోకంలో తెలుసు కుంటాము. మానస తపస్సు ప్రధానంగా ఐదు విశేషాలతో కూడి ఉంది. అవి (1) చిత్త ప్రసాదము (2) సౌమ్యత్వము (3) మౌనము (4) ఆత్మ వినిగ్రహము (5) భావ సంశుద్ధి. ఈ ఐదు లింగములై మానస తపస్సును తెలియ చేస్తాయి.

శరీరం మోయ గలిగినంత బరువునే మోస్తుంది. వాక్కు కొంత సమయమును మించితే మాట్లాడ లేదు. కాని, మనస్సు అలా కాదు. మనిషి మోయలేనంత భారాన్ని మనస్సు మోస్తుంది. తాను బరు వెక్కుతున్నా, మరో వైపు బరువు నెత్తుకొనే కార్యం లోనే మనస్సు నిమగ్నమై ఉంటుంది. కాకపోతే, బరువెక్కే మనస్సును మోయలేక మనిషే కూల బడుతూ ఉంటాడు.

కళ్ళు రూపాలనే నింపు కుంటాయి. చెవులు శబ్దాలనే అందు కుంటాయి. ముక్కు గాలితో పాటుగా వాసనలనే పీల్చుకుంటుంది. కాని, మనస్సు అలా కాదు. ప్రపంచా న్నంతా తన లోకి దించుకుంటుంది. దించుకోవడం సులువే. కాని, ఉంచుకోవడం అనుకున్నంత సులువైన పని కాదు.

ఎంతో కాలంగా ఎన్నెన్నో మనస్సులో చేరి పోయాయి. ఏవి ఎక్కడ ఉన్నవో తెలియ నంతగా దూరి పోయాయి. ఇంటిదొంగ ల్లాగా తయారయ్యాయి. ఎప్పుడు ఏం పోగొట్టు కుంటామో తెలియదు. ఎవరిని తప్పు పట్టాలో అర్థం కాదు. తప్పు ఒప్పులను ప్రక్కన బెడితే, మనస్సు ముప్పులో ఉంది అనేది మాత్రం అందరికీ తెలుసు. మనస్సు బాగుంటేనే మనుగడ బాగుంటుంది. మనస్సు చెడిపోతే మనుగడ మారణహోమ మవుతుంది. మరి ఇప్పుడేమి చేయాలి? ఏముంది, మనస్సును సరి చేసుకోవాలి అంతే! ఇది మానసిక తపస్సు.

మనస్సు సరి పడి ఉండాలి అంటే, దానిని పురి పెట్టే విషయాలను మనస్సు నుండి కదిలించాలి, బయటకు తరలించాలి. అవి మనస్సును కలత పెట్టకుండా ఉండాలి అంటే, వాటి స్వస్థాన మేదో విచారించాలి. ఆలోచించి విచారించ గలిగితే అవన్నీ వలస పక్షులే నని అర్థ మవుతుంది. అర్థం కానంత వరకే ఏదయినా సమస్య. అర్థ మైన క్షణాన సమస్య ఎక్క డుంటుంది? అది ఎక్కడ ఉండ దగినదో అక్కడికే పంప బడుతుంది. మనస్సు లోని బరువు తగ్గుతుంది. భారం తగ్గిన మనస్సు తేలిక పడుతుంది. అశాంతికి దూర మవుతుంది. ప్రశాంత తకు చేరు వవుతుంది. ఇదే చిత్త ప్రసాదము. ప్రసాద చిత్తము. మానస తపస్సు లోని మొదటి విశేషము.

## చిత్త ప్రసాదము

చిత్త ప్రసాదము అంటే, చిత్తము ప్రశాంతతను పొందడము అని భావము. మనస్సును స్వచ్ఛంగా ఉంచు

కోవడమే మనసు యొక్క ప్రశాంతత, లేదా మనస్సు యొక్క ప్రసాదము (***మనసః ప్రసాదః మనసః స్వచ్ఛ ప్రశాన్తిః స్వచ్ఛ తాపాదనం మనసః ప్రసాదః***). విషాదం లేని స్థితి ప్రసాదం. వికారం లేని స్థితి ప్రసాదం. తనలో తాను తానుగా తెలిసే ప్రశాంతత. నిర్మలత్వము. నిశ్చలత్వము. మనస్సులో ప్రసాదం ఏర్పడితే ఏం జరుగుతుంది (***ప్రసాదే సతి కిం స్యాత్ ఇతి***)?

మనస్సు ప్రసాదమయ మైతే అంతరంగము ఆనంద నిలయ మవుతుంది. శోకా లన్నీ కనుమరుగవుతాయి. బాధలన్నీ తీరి పోతాయి. బరువు లన్నీ దిగి పోతాయి. దుఃఖా లన్నీ దూర మవుతాయి.

**ప్రసాదే సర్వ దుఃఖానాం హాని రస్యోప జాయతే**

ప్రసాదం ప్రాప్తించ గానే మనస్సు లోని సర్వ దుఃఖములు నశించి పోతాయి *(2 వ అ - 65 వ శ్లో)*. ప్రసన్న చిత్తము కలిగిన వెంటనే బుద్ధి నిలకడను పొందుతుంది. అంతవరకు చంచలంగా ఉన్న బుద్ధి స్థిరంగా, స్థిమితంగా ఉంటుంది. ఇదంతా ఈశ్వరారాధన లోనే ప్రాప్తిస్తుంది. ప్రాప్తించింది.

***మధుర హృదయాన కురిసింది స్తుతుల వాన***
***పరుగు లెత్తాయి దోషాలు మనసు లోన***
***మరువ లేను నీ దయ ఎన్ని జన్మ లైనా***
***నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా!***

అని నీలకంఠ శతకంలో ఒక విబూది పండు.

**సౌమ్యత్వము**

సౌమ్యత్వము అంటే సౌమనస్యము. ప్రసన్నమైన ముఖ వర్చస్సు అనే కార్యానికి కారణమైన అంతఃకరణ వృత్తియే సౌమ్యత్వము. ముఖంలో స్పష్టంగా తొంగి చూచే అంతఃకరణ సౌందర్యము (***సౌమ్యత్వం సౌమనస్యమ్ ఆహుః ముఖాది ప్రసాద కార్య అంతఃకరణస్య వృత్తిః***). రాగద్వేషాలు తటస్థ పడిన దశలో మనస్సులో ఏర్పడే ప్రశాంతత ముఖము లోను, నేత్రముల లోను గోచరించడమే సౌమ్యత్వము. క్రౌర్యానికి కారణమైన పరిస్థితులు చిత్తములో లేనపుడు, మనస్సు అక్రూర మైనపుడు, కామక్రోధాల నుండి విడిపడి నపుడు సౌమ్యత్వము కనిపిస్తుంది (***అక్రూరః సౌమ్య ఉచ్యతే***). మనస్సుకు ముఖము ముకురము లాంటిది అనే ఆంగ్ల సామెత కూడా ఉంది. మనస్సు లోని భావాలే ముఖంలో ప్రతిఫలిస్తూ ఉంటాయి.

మనిషికి తీవ్రంగా కోపం వచ్చినపుడు, కళ్ళు ఎర్ర బడటము, పెదవులు చలించడము, ముచ్చెమటలు పోయడము, ముఖము ఉగ్రంగా మారడము లాంటివి ఎలా ప్రత్యక్షంగా గోచరిస్తాయో, అలాగే మనస్సులో ప్రశాంతత నిండి నపుడు, అదే ప్రశాంతత, లేదా ప్రసన్నత ముఖంలో కూడా గోచరిస్తుంది. అదే సౌమ్యత్వము.

పద్నాల్గవ శ్లోకంలో కాయక తపస్సును గూర్చి మనం చర్చించి నపుడు, శౌచమును బాహ్యాభ్యంతర మని చెప్పుకుంటూ, కాయక తపస్సు బాహ్య శౌచ మని తెలుసుకున్నాం. అభ్యంతర శుచిని గూర్చి తదనంతరం చర్చిద్దా మని చెప్పుకున్నాం. ఆ సందర్భము ఇదే నని జ్ఞాపకం చేస్తున్నాను.

అంతః శౌచము వలన మనస్సు స్వచ్ఛంగా ఉంటుంది. ఖేదము లేని కారణంగా మనస్సు ప్రియత్వ ముతో ఉంటుంది. ఆ ఆనందమే ముఖంలో వ్యక్త మవుతుంది. ఈ విషయాన్ని పతంజలి యోగదర్శనం కూడా ధ్రువ పరచింది.

సూ॥ **సత్త్వశుద్ధి సౌమనస్య ఏకాగ్ర్యేన్ద్రియ జయ ఆత్మదర్శన యోగ్యత్వాని చ** - (సాధన పాదము - 41 వ సూ)





చిత్తశుద్ధి, సౌమనస్యము (సౌమ్యత్వము), ఏకాగ్రత, ఇంద్రియ జయము, ఆత్మదర్శన యోగ్యత్వము - ఇవన్నీ క్రమంగా సిద్ధిస్తాయి అని పతంజలి యోగదర్శనము.

**మౌనము**

మౌనము అంటే వాక్కును నియమించడము. వాక్కును నిగ్రహించడమే మౌనము. అలాంటప్పుడు అది వాచిక తపస్సు అవుతుంది గాని, మానస తపస్సు ఎలా అవుతుంది? అనే సందేహము కలుగుతుంది.

మనస్సును నిగ్రహించ గలిగితేనే వాఙ్నిరోధము జరుగుతుంది. మనస్సు సంకల్పించిన దానినే వాక్కు మాట్లాడుతుంది. మనస్సు మూగబోయిన క్షణాన మాటలు కూడా మూగబోతాయి.

ఆకస్మిక సంఘటన జరిగి వ్యక్తి దిగ్భ్రాంతి చెంది నపుడు గాని, లేదా వ్యక్తి విషాదంలో నిమగ్న మైనపుడు గాని, మనం ఎంత కుదిపినా మాట్లాడ లేక మౌనంగా ఉండి పోతాడు. అలాంటి సన్నివేశాలలో అతని చేత మాట్లా డించడం ఎవ్వరికీ సాధ్యం కాదు. ఎందుకని మాట్లాడడు? మాటలు రాకనా? కాదు, మనస్సు లేక. సంకల్పించే మనస్సు సంతాపంలో కూరుకు పోయింది కనుక, మనస్సులో సంకల్పాలు కదలడం లేదు. మనస్సు సంకల్ప రహితం కావడం చేత, మాట్లాడటానికి విషయం లేక, మాటలు మూగ బోతాయి.

ట్యాప్ త్రిప్ప గానే నీళ్ళు వస్తున్నాయి అంటే ట్యాంక్‌లో నీళ్ళు ఉన్నాయి కనుక. ట్యాంక్‌లో నీళ్ళు లేనపుడు, ట్యాప్ త్రిప్పినంత మాత్రాన నీళ్ళు వస్తాయా? మాటలు కూడా అంతే. మనస్సును నిగ్రహిస్తేనే వాక్కును నియమించడం జరుగుతుంది.

వాక్కు కార్యం. మనస్సు కారణం. కార్యమైన వాక్కును నియమించడం అంటే కారణమైన మనస్సును నియమించడం అవుతుంది. కనుక వాచామౌనము అంటే మనఃసంయమ పూర్వక మనే అర్థం. అందువల్ల కార్యమైన వాచామౌనము చేత కారణమైన మనస్సంయమము చెప్పబడుతూ ఉంది (***మౌనం వాక్సంయమోఽపి మనస్సంయమ పూర్వకః భవతీతి కార్యేణ కారణ ముచ్యతే మన స్సంయమః మౌన మితి***).

**ఆత్మ వినిగ్రహము**

ఇక్కడ ఆత్మ అంటే మనస్సు. ఆత్మ వినిగ్రహము అంటే, మనస్సును నిగ్రహించుట అని అర్థము (***ఆత్మ వినిగ్రహః మనో నిరోధః***). సర్వేంద్రియముల నుండి మనస్సును వెనుకకు మరల్చి అంతర్ముఖం చేయడము మనో నిరోధము.

మనస్సును నియమించడ మనేది సులభమైన కార్యము కాదు. మనస్సు ఎక్కడి కైనా వెళ్తుంది. ఎక్కడైనా నిలుస్తుంది. కాని, భగవంతుని వైపుకు నడవదు. తపస్సులో నిలవదు. అలా నిలబడని మనస్సును నిగ్రహించి, ధ్యేయ వస్తువుపై నిలపడమే మనో నిగ్రహము.

మనస్సును నిగ్రహించాలి అనే దెవరు? మనస్సే కదా! ఇక్కడే ఉంది సమస్య అంతా. దొంగ దొంగను పట్టుకోవడమా! ఇది సాధ్య మయ్యే పనేనా? అందుకే మనస్సును నిగ్రహించడము ఎవ్వరికీ సాధ్య పడటం లేదు.

మనస్సు పరుగులు పెట్టడం సమస్య కాదు. అలా పరుగులు పెట్టడం మనస్సుకు సహజ లక్షణము. మనస్సు బహిర్ముఖమై పలు చోట్లకు పరుగు లిడితే నష్టం లేదు. కాని, దాని మార్గాన్ని ఇష్టపడి గాని; లేదా అది కష్ట మని భావించి దానిని నిగ్రహించ డానికి గాని, మనస్సు వెంట బడి మనం పరుగు లెట్టడమే అసలైన సమస్య.

తిరిగే మనస్సును తిరగనీ. దాని వెంట బడి పోకుండా దానిని సాక్షిగా వీక్షిస్తూ ఉండిపో గలిగితే, పోలీసు పరీక్షిస్తూ ఉంటే, దొంగ నిశ్చలంగా ఏ కార్యము లేకుండా ఉండి పోయినట్లు, మనస్సును మనం వీక్షిస్తే, మనస్సులో నడిచే సంకల్పాలను పరీక్షించ గలిగితే, మనస్సు చలించదు. చక్కగా నియమింప బడుతుంది. నిశ్చలంగా ఉండి పోతుంది. మనో నిగ్రహానికి ఇది రాజమార్గము. మనస్సును అలా నిరోధించడము మానస తపస్సు అవుతుంది.

**మాట వినని మనసును**
**నియమిస్తేనే యోగము**
**మనసే మనసును నియమించునా**
**విలపించే శిశువే లాలించునా?**
**తిరిగే మనస్సును తిరగనీ**
**చూస్తూ సాక్షిగా ఉండిపో**
**రామ రామ జయ రాజారామ్**
**రామ రామ జయ సీతారామ్**

అని రామజోగి చిట్కా.

### భావ సంశుద్ధి

ఇతరులతో వ్యవహరించే టప్పుడు కపటము లేకుండా, మాయ లేకుండా ప్రవర్తించడము భావ సంశుద్ధి ***( భావ సంశుద్ధిః పరైః వ్యవహారకాలే అమాయవిత్వం భావ సంశుద్ధిః ).*** దీనినే పూర్వం మనం 'ఆర్జవం'గా చెప్పుకున్నాం. ఇదంతా మానస తపస్సు ***( ఇతి ఏతత్ తపః మానసమ్ ఉచ్యతే ).***

*త్రివిధ తపస్సులను తెలిపిన పరమేశ్వరుడు గుణ భేదాన్ని బట్టి వాటిని మళ్ళీ మూడుగా విభజించి చెబుతున్నాడు. మొదట సాత్త్విక తపస్సును గూర్చి చెబుతున్నాడు.*

**శ్రద్ధయా పరయా తప్తం తప స్త త్త్రివిధం నరైః ।**
**అఫలాకాంక్షిభి ర్యుక్తైః సాత్త్వికం పరిచక్షతే ॥** 17

***శ్రద్ధయా-పరయా-తప్తం-తపః-తత్-త్రివిధం-నరైః***
***అఫలాకాంక్షిభిః-యుక్తైః-సాత్త్వికం-పరిచక్షతే***

| | | | | | |
|---|---|---|---|---|---|
| అఫలాకాంక్షిభిః | = | ఫలమును కోరని వారు | తత్ | = | ఆ |
| యుక్తైః | = | యోగముతో కూడిన వారు | త్రివిధం | = | మూడు విధములైన |
| నరైః | = | నరుల చేత | తపః | = | తపస్సును |
| పరయా | = | ఉత్తమమైన | సాత్త్వికం | = | సాత్త్వికముగ |
| శ్రద్ధయా | = | శ్రద్ధతో | పరిచక్షతే | = | చెబుతున్నారు |
| తప్తం | = | ఆచరింప బడిన | | | |

**అర్జునా! ఫలాపేక్ష లేని వారు, యోగయుక్తులు, ఉత్తమ మైన శ్రద్ధతో మూడు విధాలైన తపస్సులను ఆచరిస్తారు. అవి సాత్త్విక తపస్సులు.**



### వ్యాఖ్య

కాయక, వాచిక, మానస తపస్సు లనే త్రివిధ తపస్సులను వరుసగా మూడు శ్లోకాలలో తెలిపిన తరువాత, ఆ తపస్సులు గుణ భేదము చేత మళ్ళీ త్రివిధము లని చెబుతూ, ఆ మూడు విధాలైన సాత్త్విక, రాజస, తామస తపస్సులను గూర్చి చెబుతున్నాడు. ప్రస్తుతం ఈ శ్లోకంలో సాత్త్విక తపస్సును గూర్చి వివరిస్తున్నాడు.

కాయక, వాచిక, మానస తపస్సులు ఉత్కృష్టములు. ఈ త్రివిధ తపస్సులను ఉత్తమ మైన శ్రద్ధతో ***(శ్రద్ధయా పరయా ),*** ఫలాసక్తి లేకుండా ***( అఫలా కాంక్షిభిః ),*** సమాహిత చిత్తులై ***( యుక్తైః )*** ఆచరించడము సాత్త్విక తపస్సు.

### ఆస్తిక్య బుద్ధి

సాత్త్విక తపస్సు ఉత్తమ మైన శ్రద్ధతో కూడి ఉంటుంది. ఉత్తమ మైన శ్రద్ధతో ఆచరింప బడుతుంది. ఇంతకీ దేని యందు ఉత్తమ మైన శ్రద్ధ? శాస్త్రము దేనిని ప్రతిపాదిస్తూ ఉందో దాని యందు ఆస్తిక్య బుద్ధిని కలిగి ఉండటము ఉత్తమ మైన శ్రద్ధ. అంతే కాదు. శాస్త్ర విషయము నందు ఆస్తిక్య బుద్ధిని కలిగి ఉండాలి అంటే ముందు శాస్త్రం అర్థమై ఉండాలి కదా! మరి శాస్త్రం ఎలా అర్థ మవుతుంది? ఎవరికి వాళ్ళుగా శాస్త్రాన్ని తెలుసుకొనే అవకాశం లేదు కదా! ***( స్వతః అప్రాప్తం ).*** అలాంటిది ఆచార్యోపదేశము వల్లనే అవగత మవుతుంది. కనుక శాస్త్రము నందు ఎలాంటి ఆస్తిక్య బుద్ధి ఉందో, శాస్త్రాన్ని ఉపదేశించే గురువు నందు కూడా అదే విధమైన ఆస్తిక్య బుద్ధిని కలిగి ఉండటము శ్రద్ధ అన బడుతుంది ***( శ్రద్ధయా ఆస్తిక్య బుద్ధ్యా, పరయా ప్రకృష్టయా, తప్తమ్ అనుష్ఠితమ్ ).***

ఈ శ్రద్ధ స్వల్ప మైంది కాదు. అల్ప మైంది కాదు. గొప్పదైన శ్రద్ధ. ఉత్తమ మైన శ్రద్ధ ***( పరయా ).*** పూర్ణమైన శ్రద్ధ. గమ్యము చేరే వరకు చెదరని శ్రద్ధ. లక్ష్యం సిద్ధించే వరకు చలించని శ్రద్ధ. ఇట్టి ఉత్కృష్ట మైన శ్రద్ధతో సాత్త్విక తపస్సు నాచరించే వారు ఫలాకాంక్ష లేని వారు. యోగముతో కూడిన వారు.

### అఫలాసక్తులు

మోక్ష కాములైన సాధకులు కర్మఫలాల యందు ఆసక్తి లేని వారు అనే విషయాన్ని గీతాబోధ ప్రారంభం నుండి చెప్పుకుంటూనే ఉన్నాము. వీరు మోక్షమునే ఏకైక ప్రయోజనముగా భావించి కర్మలను ఆచరిస్తున్నారు కనుక, ఇహ, పరలోక భోగాల యందు త్యాగబుద్ధిని కలిగి ఉన్నారు. ఫలాసక్తి లేని వారుగా తెలుస్తున్నారు.

కర్మల యందు ఫలాసక్తి లేకుండా, కేవలం అంతఃకరణ శుద్ధి కొరకే కర్మలను ఎలా ఆచరిస్తున్నారో, తపస్సు కూడా కర్మే కనుక, తపస్సు విషయంలో కూడా ఫలాసక్తి లేని వారై ఉన్నారు ***( అఫలా కాంక్షిభిః ఫలా కాంక్షా రహితైః ).*** కేవలం అంతఃకరణ శుద్ధియే ప్రయోజనంగా కలిగిన వారు. ధర్మార్థ కామాల యందు ఆసక్తి లేని వారు. కనుకనే వారు యోగయుక్తులు.

### యోగయుక్తులు

యుక్తులు అంటే యోగయుక్తులు. సమాహిత చిత్తులు ***( యుక్తైః సమాహితైః ).*** ఏకాగ్ర చిత్తులు. మనస్సులో ఏ విధమైన వికారము లేని వారు. అట్టి చిత్తముతో తపస్సు నాచరించే వారు కావడం చేత వారు యోగయుక్తులు. కాయక తపస్సు అయినా, వాచిక తపస్సు అయినా, మానస తపస్సు అయినా, నిర్వికారమైన మనస్సుతో ఆచరిస్తారు కనుక వారు యోగయుక్తులు. ఈ విధమైన తపస్సు సాత్త్విక తపస్సు అన బడుతుంది ***( యత్ ఈదృశం తపః సాత్త్వికం పరిచక్షతే శిష్టాః ).***

ఇక రాజస తపస్సును గూర్చి చెబుతున్నాడు.

**సత్కారమాన పూజార్థం తపో దమ్భేన చైవ యత్ ।**
**క్రియతే తదిహ ప్రోక్తం రాజసం చల మధ్రువమ్ ॥** 18

**సత్కారమాన పూజార్థం-తపః-దంభేన-చ-ఏవ-యత్**
**క్రియతే-తత్-ఇహ-ప్రోక్తం-రాజసం-చలం-అధ్రువం**

| | | | |
|---|---|---|---|
| సత్కార | = సత్కారము కొరకు | తత్ | = అది |
| మాన | = గౌరవము కొరకు | ఇహ | = ఈ లోకము నందు |
| పూజార్థం | = పూజ కొరకు | చలం | = నిలకడ లేనిదిగా |
| దంభేన చ ఏవ | = కేవలము డంబము చేత | అధ్రువం | = అస్థిర మైనదిగా |
| యత్ | = ఏ | రాజసం | = రజోగుణ సంబంధ మైనదిగా |
| తపః | = తపస్సు | ప్రోక్తం | = చెప్పబడింది |
| క్రియతే | = చేయబడుతుందో | | |

**అర్జునా! సత్కారం కోసం, సన్మానం కోసం, గౌరవాల కోసం డంబాచారంతో చేసే తపస్సు రాజస తపస్సు. ఆ తపస్సు చంచల మైంది. అస్థిర మైంది.**

**వ్యాఖ్య**

ఫలాసక్తి లేకుండా, కేవలం అంతఃకరణ శుద్ధి కొరకు ఆచరించే తపస్సు సాత్త్విక మైతే, కేవలం ఫలాసక్తియే ప్రధానంగా కలిగి చిత్తమును మలినం చేసుకొనే విధంగా ఆచరించే తపస్సు రాజస తపస్సు.

ఈ తపస్సు మోక్షార్థం కాదు. చిత్తశుద్ధికీ కాదు. మరి దేనికి? సత్కార మాన పూజార్థమే ఈ రాజస తపస్సు (*సత్కార మాన పూజార్థం*).

సత్కారము అంటే సాధుకారము. ఇతడు గొప్ప తపస్వి, గొప్ప సాధువు అని పది మంది గుర్తించి స్తుతించడము సాధుకారము (*సత్కారః సాధుకారః, సాధుః అయం తపస్వీ ఇతి ఏవం అర్థం*). దీనినే సత్కార వాంఛ అంటారు. ఇది సత్కార కాంక్ష. పదుగురు గౌరవించాలనే తపన.

ఎంత గొప్ప వాడండి! ఎంత గొప్ప తపస్వి అండి! అని పది మంది పొగిడితే గాని మనస్సు తృప్తి చెందదు. ఈ సత్కార వాంఛ ఎందుకు కలుగుతుంది? తనపై తనకు సద్భావం లేదు కనుక. సాధుభావం లేదు కనుక.

సత్కారం లాగే సన్మాన కాంక్ష. ఇక్కడ సన్మానము అంటే పాదపూజలు చేయించు కోవడం, అందరి చేత నమస్కారాలు పెట్టించు కోవడం - ఇదంతా సన్మాన కాంక్ష.

పెద్ద వాళ్ళను చూచి నపుడు గౌరవ సూచకంగా లేచి దగ్గరకు వెళ్ళి నమస్కరిస్తాము. దీనిని 'ప్రత్యుత్థానము' అంటారు. అలా అందరూ తనకు అభిముఖంగా వచ్చి గౌరవించాలని, ప్రత్యుత్థాన అభివాదనములు సమర్పించాలని ఆశిస్తూ, వాటిని పొందడానికి ఆచరించే తపస్సు రాజస మవుతుంది (*మానః మాననం ప్రత్యుత్థానాభివదనాని, తదర్థం పూజా, తదర్థం చ తపః సత్కార మాన పూజార్థం*). అది కూడా డంబాచారమే. వేషభాష అలంకారాలతో గొప్ప తపస్వి అయినట్లు అగుపించడము. దండ ధ్వజ కమండలాదులు ధరించడము, ఉచితాసనాదులు అలంకరించడము - ఇవన్నీ దంభము కొరకే. ఇదంతా రాజస తపస్సు.





ఈ విధమైన రాజస తపస్సు చంచల మైనది (**చలం**). అనిత్య మైనది (**అధ్రువమ్**). ఈ విధమైన తపస్సుకు పార లౌకిక ఫలము ఎలాగూ లేదు, రాదు. పోనీ, ఇహ లోకానికి సంబంధించినవి అయినా వస్తాయా అంటే, అవి కూడా రావచ్చు, రాక పోవచ్చు. ఒక వేళ వచ్చినా క్షణికమే. అనిత్యమే (**సర్వం దుఃఖం దుఃఖం, సర్వం క్షణికం క్షణికం**).

ఇక తామస తపస్సును గూర్చి వివరిస్తున్నాడు.

**మూఢగ్రాహే ణాత్మనో యత్పీడయా క్రియతే తపః ।**
**పర స్యోత్సాదనార్థం వా త త్తామస ముదాహృతమ్ ॥** 19

**మూఢగ్రాహేణ-ఆత్మనః-యత్-పీడయా-క్రియతే-తపః**
**పరస్య-ఉత్సాదనార్థం-వా-తత్-తామసం-ఉదాహృతం**

| | | | |
|---|---|---|---|
| మూఢగ్రాహేణ | = మూర్ఖపు పట్టుదల చేత | తపః | = తపస్సు |
| ఆత్మనః | = ఆత్మ యొక్క | క్రియతే | = చేయబడుతుందో |
| పీడయా | = పీడచే గాని | తత్ | = అది |
| పరస్య | = ఇతరుల యొక్క | తామసం | = తామస తపస్సని |
| ఉత్సాదనార్థం వా | = నాశనము కొరకు గాని | ఉదాహృతం | = చెప్పబడుతుంది |
| యత్ | = ఏ | | |

**అర్జునా! మూర్ఖపు పట్టుదలతో తనకు, లేదా ఇతరులకు వినాశాన్ని కలిగించ డానికి చేసే తపస్సును తామస తపస్సు అంటారు.**

**వ్యాఖ్య**

గుణ భేదాన్ని బట్టి సాత్త్విక తపస్సును, రాజస తపస్సును వివరించిన గీతాచార్యుడు ప్రస్తుత శ్లోకంలో తామస తపస్సును గూర్చి చెబుతున్నాడు.

తపస్సు అనేది తాపాన్ని, సంతాపాన్ని కలిగిస్తుంది. తపింప చేస్తుంది కనుక అది తపస్సు (**తపతీతి తపః**). తపింప చేసేది ఏదైనా సంతాపాన్ని, దుఃఖాన్ని కలిగించేదే (**తప సంతాపే**). మీకేం తెలుసండి? ఆ ఉద్యోగాన్ని సంపాదించ డానికి నే నెంత తపస్సు చేశానో! అని ఇతరులు అనడం మనం వింటూ ఉంటాము. ఉద్యోగానికి తపస్సు చేయడ మేమిటి? ముక్కు మూసుకొని కూర్చుంటే ఉద్యోగా లొస్తాయా! నిజమే. కాని, ఇక్కడ తపస్సు అంటే, ఇంట్లో కూర్చుని తపస్సు చేశాడని కాదు. ఉద్యోగాన్ని సంపాదించ డానికి కాళ్ళు అరిగే లాగా తిరిగాడని అర్థం. నోరు వాచే లాగా అందరిని ప్రాధేయ పడ్డాడని భావము. ఇదంతా కష్టమే కదా? అందుకే తపస్సు అన్నాడు.

తపస్సు అనేది శ్రమతో కూడింది అయినపుడు ఫలితం లేని దైతే ఎవడు శ్రమిస్తాడు? శ్రమకు ఫలితం ఉండాలి. ఉంటుంది. సాత్త్విక, రాజస తపస్సులు ఏ ఫలితాన్ని ఆశించి సాగుతాయో చూశాము. మరి, తామస తపస్సు యొక్క ఫలిత మేమిటి? తమోగుణ ప్రధానులై, తామసిక శ్రద్ధతో తామస తపస్సు నాచరించే వారు పొందే ఫలం ఏమిటి? ఈ శ్లోకంలో అదే కేంద్ర విషయం. వినండి.

తనను తాను పీడించు కోవడానికి, అంటే బాధ పెట్టు కొనుటకు చేసే తపస్సును (**ఆత్మనః పీడయా యత్తపః క్రియతే**). లేదా ఇతరులను పీడించడానికి, లేదా ఇతరుల వినాశానికి చేసే తపస్సును (**పరస్య**

**ఉత్పాదనార్థం వా )** తామస తపస్సు అంటారు. ఒక్క వాక్యంలో చెప్పాలంటే, స్వవినాశం, పరవినాశం ఈ రెండే తామస తపస్సు యొక్క ప్రయోజనాలు.

తపస్సు చేసిన వాళ్ళు ఏవేవో అద్భుత మైనవి సాధించారని, సాధిస్తారని విన్నాం. అంతే గాని తపస్సు చేసి దీపాలు ఆర్పేసుకునే వాళ్ళను ఇక్కడే చూస్తున్నాం. ఇలాంటిది తపస్సు ఎలా అవుతుంది? తపస్సులా అనిపించే తమస్సు. అంతే.

ఇదేదో చాలా విడ్డూరంగా ఉందే! పరులను పాడు చేసే వాళ్ళ విషయాన్ని అర్థం చేసుకోగలం. కాని, స్వవినాశాన్ని, స్వయం వినాశాన్ని బుద్ధి ఉన్న వాళ్ళు ఎవ్వరైనా కాంక్షిస్తారా? అనే సందేహం మీకు రావచ్చు. మీ సంశయానికి సమాధానం మీ వాక్యం లోనే ఉంది కదా! బుద్ధున్న వాళ్ళు కాంక్షిస్తారా? అంటే, బుద్ధి లేని వాళ్ళు కాంక్షిస్తారనే కదా దాని అర్థం? వాళ్ళే ఈ తామస తపస్సు రాయుళ్ళు. మూఢులు. మూర్ఖులు. మూఢ నిర్ణయాలు తీసుకునే వాళ్ళు. మూర్ఖంగా ఆచరించే వాళ్ళు. అలాంటి వాళ్ళు తమ మూఢ నిర్ణయాలతో **( మూఢ గ్రాహేణ అవివేక నిశ్చయేన )**. అవివేక నిశ్చయాలతో తెలియక తమను తాము నశింప చేసుకుంటారు. తెలిసి ఇతరులకు వినాశాన్ని కలిగిస్తారు. ఈ విధమైన తపస్సును తామస తపస్సు అంటారు.

## స్వపీడనం

తామస తపస్సు మూఢంగా ఆచరించేది కనుక దారుణంగా ఉంటుంది. అదే ఉగ్ర తపస్సు. భయంకర మైనది. ఆహారం లేకుండా శరీరాన్ని శుష్కింప చేసుకునేది. శీతోష్ణాలను భరిస్తూ దుర్భరమైన కాయ క్లేశంతో ఆచరించేది. ఇంద్రియాలను శోషింప చేసేది. నిద్ర పానీయాదులను సైతం విసర్జించి, మనస్సును క్షోభకు గురి చేస్తూ, అసహజమైన జీవన మార్గంలో ప్రాణాల్ని సైతం కలత పెట్టే బీభత్సమైన తపస్సు తామస తపస్సు.

ఎవరైనా తమను తాము ఇలా పీడించు కుంటారా? వీళ్ళు మాత్రం ఎందుకని ఇలా దుఃఖాన్ని అనుభవిస్తున్నారు? అవివేకం చేత. అవివేకముతో కూడిన నిర్ణయాల వల్ల ఇలా అన్యాయమై పోతున్నారు **(అవివేక నిశ్చయేన )**.

ఏమి చేయాలి? ఎలా చేయాలి? అది చేయదగిం దేనా, కాదా? ఈ విధమైన విచారము లేకుండా, దారి తప్పిన ఆలోచనలతో స్వార్థ పూరితమైన బుద్ధితో, వినాశ మార్గాలలో చరిస్తూ ఘోరమైన తామస తపస్సులను ఆచరిస్తారు. దేహేంద్రియ మనస్సులను శుష్కింప చేసుకొంటూ వీరూ దుర్భర దుఃఖాన్ని అనుభవిస్తారు. ఈ తపస్సు వెనుక ఉన్నదంతా మూఢత్వమే, మూర్ఖత్వమే కనుక ఇతరుల వినాశానికి కూడా కారణ మవుతారు.

## పర పీడనం

రావణాసురుడు ఎంత ఘోరమైన తపస్సు చేశాడు! చివరికి ఏమైంది? అతని తపః ఫలము ఎవరి మేలుకు ఉపకరించింది? తన వినాశానికి, పరుల వినాశానికి ఉపయోగ పడింది. అందుకే అది తామస తపస్సు.

తాను చేసిన ఉగ్ర తపస్సు ఫలంగా ఎన్నో భయంకరమైన అస్త్ర శస్త్రాలను రావణుడు సంపాదించాడు. వాటి వల్ల ఏం జరిగింది? అస్త్ర శస్త్రాలు రావణుడి వద్ద నేనా ఉండేది? శ్రీరాముడి వద్ద లేవా? హనుమంతుని వద్ద లేవా? విభీషణుడి వద్ద లేవా? ఆయుధాలకు బాధించడం తెలియదు. అస్త్రశస్త్రాలకు హింసించడం అర్థం కాదు. వాటిని పట్టుకున్న చేతులే చెడును చేస్తాయి. మారణహోమాలను సృష్టించేది మనుషులే కాని, ఆయుధాలు కాదు. అసుర మానవుల చేతిలో మారణాయుధాలు చేరితే లోకం ఏమవుతుందో ఆనాటి రావణాది రాక్షసుల





నుండి ఈ నాటి రాక్షస ఉగ్రవాదుల దాకా నిరూపించ బడుతూనే ఉంది. అప్పుడూ వినాశమే. ఇప్పుడూ వినాశమే. తామస తపస్సు ఏ రూపంలో సాగినా అది స్వపీడనం గానో, పర పీడనం గానో పరిణామం చెందక తప్పదు. తామస తపఃఫలాలు ఆగంతుకుల చేతుల్లో అణుబాంబు ల్లాగే ఉపయోగ పడతాయి. నేడు ఆ ఫలితాలు యంత్ర రూపంలో కనిపిస్తే, ఆనాడు మంత్ర రూపంలో, శబ్ద రూపంలో వినిపించాయి. అదే తేడా. మంత్ర రూపంలో ఆనాడు వినపడుతూ వినాశాన్ని సృష్టించాయి. యంత్ర రూపంలో నేడు కనపడుతూ కల్లోలాన్ని సృష్టిస్తున్నాయి.

ఈ సందర్భములో ఒక్క సత్యాన్ని మనస్సుకు పట్టించాలి. తామస యజ్ఞాలు, తామస తపస్సులు, తామసాహారాలు, ఇక చెప్పబోయే తామస దానాలు - ఇవన్నీ చెప్పడంలో ముఖ్యోద్దేశ్యము, ఎట్టి పరిస్థితుల లోను ఆ నీడల్లో విశ్రమించ వద్దని సూచించడమే. ఒకవేళ రజోగుణ, తమోగుణాలు మనలో ఉంటే, వాటిని శ్రమించి అయినా పోగొట్టుకోనే ప్రయత్నం చేయాలి. ప్రార్థనల ద్వారా పరమేశ్వరునికి దగ్గర కావాలి. వేడికి మనం దగ్గ రవుతూ ఉంటే, చలి మనకు దూర మైనట్లు, పరమేశ్వరుని భక్తి చేస్తూ ఉంటే తామస, రాజసాలు మనస్సును విడిచిపెట్టి పోతాయి.

*అపచారాలకు ఆలవాల మైతి*
*అనాచారాలే అలవాట్లుగా మారి పోయె*
*నీ కృప ఉన్న క్షణములో అవి పారిపోవా!*
*నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా!*

అని నీలకంఠ శతకంలో ఒక విబూది పండు.

*యజ్ఞ, తపస్సుల భేదాల్ని తెలియ చేసిన భగవంతుడు, గుణ భేదాల్ని బట్టి త్రివిధ దాన భేదాల్ని వివరించడం ప్రారంభిస్తున్నాడు. మొదట సాత్త్విక దానమును చెబుతున్నాడు.*

దాతవ్య మితి య ద్దానం దీయతేఽనుపకారిణే ।
దేశే కాలే చ పాత్రే చ త ద్దానం సాత్త్వికం స్మృతమ్ ॥ 20

*దాతవ్యం-ఇతి-యత్-దానం-దీయతే-అనుపకారిణే*
*దేశే-కాలే-చ-పాత్రే-చ-తత్-దానం-సాత్త్వికం-స్మృతం*

| | | | | | |
|---|---|---|---|---|---|
| దేశే | = | దేశము నందు | దానం | = | దానము |
| కాలే చ | = | కాలము నందు | దీయతే | = | ఇవ్వబడు చున్నదో |
| పాత్రే చ | = | తగిన పాత్ర యందు | తత్ | = | ఆ |
| అనుప కారిణే | = | ప్రత్యుపకారము చేయలేని వాని కొరకు | దానం | = | దానము |
| దాతవ్యం ఇతి | = | ఇవ్వదగినదే యని | సాత్త్వికం | = | సాత్త్విక మని |
| యత్ | = | ఏ | స్మృతం | = | చెప్పబడింది |

**అర్జునా! దానము చేయ దగింది అని నిశ్చయించుకొని, ప్రతిఫలాపేక్ష లేకుండా, దేశ కాల పాత్రలను గుర్తించి చేసే దానము సాత్త్విక దానము.**

### వ్యాఖ్య

గుణ భేదాన్ని బట్టి మూడు విధము లైన తపస్సులను గూర్చి చెప్పుకున్నాం. అలాగే దానము కూడా

సాత్త్విక మని, రాజస మని, తామస మని మూడు విధాలుగా ఉంది. ముందుగా సాత్త్విక దానమును గూర్చి చెబుతున్నాడు.

దానము అంటే ఇవ్వ వలసింది, ఇవ్వ దగినది అని అర్థము ***(దాతవ్యం ఇతి దానమ్)***. ఎవరికి ఇవ్వ దగింది దానము? ప్రత్యుపకారము చేయని, చేయ లేని వానికి ఇవ్వ దగింది దానము ***(అనుపకారిణే)***. త్యాగ రూపమైన ఈ దానము ఎక్కడ ఇవ్వ దగింది? ఎప్పుడు ఇవ్వ దగింది? ఎలా ఇవ్వ దగింది? అనే ప్రశ్నలకు సమాధానంగా దేశ, కాల, పాత్రాదులను అనుసరించి ఇవ్వ దగింది ***(దేశ కాలే చ పాత్రే చ)*** అని చెప్పబడుతూ ఉంది. ఈ విధమైన దానము సాత్త్విక దానము.

**దానము - ధర్మము**

దానము అనే విషయాన్ని ముచ్చటించే టప్పుడు 'దానధర్మాలు' అంటూ సమాస పదాన్ని సహజంగా వాడుతూ ఉంటాము. ఇచ్చేది దానం, చేసేది ధర్మం. చేసేది అంటే ఆచరించేది. ఈ రెండిటిని ఏకం చేసి చెప్పు కుంటాము.

ఒకరికి ఇచ్చేది దానం. తాను స్వయంగా ఆచరించేది ధర్మం. దానాన్ని ఇవ్వగలం గాని ధర్మాన్ని ఎలా ఇవ్వగలం? తల్లిదండ్రులను పూజించడము బిడ్డగా నా ధర్మము. కనుక నేను పూజా విధిని నిర్వహిస్తాను. ఆచరిస్తాను. దానిని ఇవ్వడ మెలా? అలాంటప్పుడు దానధర్మాలు అని ఎందుకు అంటున్నాము? ఇది అర్థ మైతేనే దానం ఏమిటో, ప్రధానంగా సాత్త్విక దానం ఏమిటో అర్థ మవుతుంది.

చేసేది దానమే. కాని, దానిని తన ధర్మంగా గుర్తించి చేయాలి. నువ్వు చేసేది దానము. నీ చేత దానం చేయించేది ధర్మము. కనుక తన ధర్మంగా గుర్తించి చేసేదే దానము. నేను ఉన్న వాణ్ణి. లేని వాడికి దానం చేస్తున్నాను అని కాకుండా, దానం చేయడం నా ధర్మం అనే దృఢ భావనతో చేసినపుడు, దానాన్ని పుచ్చుకొనే వాడు లేని వాడు కాడు. నీ ధర్మాన్ని నీవు ఆచరించ డానికి అవకాశం ఇచ్చే 'పుణ్యం' ఉన్న వాడుగా నీకు కనిపిస్తాడు. ఇక్కడే దానకర్మ దైవకర్మగా మారుతుంది. 'కృష్ణార్పణం - రామార్పణం - శివార్పణం' అనే పవిత్ర వాక్యాలు వేదమంత్రాల లాగా వీనులలో ధ్వనిస్తాయి.

ఎవరు ఎవరికి ఏది ఇచ్చినా తమ వద్ద ఉన్నదే ఇస్తారు. లేనిది ఎలా ఇస్తారు? ఆ ఉన్న దేదో, అది మన వద్ద ఎందు కుంది? అని ప్రశ్నించుకుంటే, ఇవ్వ దగింది కనుక ఉంది ***(దాతవ్యం)***. పెట్టుకొనేందుకు ఉంది. పరులకు పెట్టుకొనేందుకు ఉంది అనేది అర్థం అవుతుంది. ఇది అర్థం కానపుడు, దాచి పెట్టుకొనేందుకు ఉంది అన్నట్లు అర్థ మవుతుంది.

ఉన్నది మనది కాదు. పరులకు పెట్టుకున్నదే మనది. దానగుణము లేని వారు ధన మున్నా లేని వారే. ఇవ్వ లేనిది మన వద్ద ఉంది అంటే, ఆ ఉన్నది ఏదైనా అది మనది కాదు. మన దైతే ఎందుకు ఇవ్వ లేము? ఇచ్చే శక్తి మన కున్నప్పుడే అది మన దవుతుంది. మన దైనపుడే దానిని మనం ఇవ్వ గలము. మన వద్ద ఉండి, మనది కానిదిగా ఉండినది, మన చేత ఇవ్వబడి పరుల వద్ద మనదిగా, మన 'పుణ్యం'గా శోభిస్తుంది. ఇదే దాన వైభవం. కనుకనే ఇచ్చేది దానం. ఇప్పించేది ధర్మం ***(దాతవ్యం)***. ఇవే దానధర్మాలు.

**సమర్పణ భావం**

దానం ఎలా చేయాలి? శ్రద్ధతో చేయాలి. అశ్రద్ధతో చేయ కూడదు అన్నది ఉపనిషత్తు ***(శ్రద్ధయా దేయం అశ్రద్ధయాఽ దేయం)***. శ్రద్ధతో దానకర్మను ఆచరించడము అంటే, సమర్పణ భావంతో ఇవ్వడము అని





అర్థము. పుచ్చుకొనే వ్యక్తిలో ఆ వ్యక్తిని మించి మరేదో దర్శిస్తూ చేసి నపుడే దాన కర్మ సమర్పణ భావముతో ముడిపడి ఆరాధనగా శోభిస్తుంది. ఈశ్వరారాధనగా భాసిస్తుంది.

ప్రపంచంలో పంచి పెట్టడానికి ప్రపంచానికి మనం ఏమి తీసుకొని వచ్చాం? తల్లి గర్భం నుండి రిక్త హస్తాలతో వచ్చాం. ఏమీ లేని వాళ్ళం అంటూ ఏడుస్తూ మరీ వచ్చాం. విన వలసిన వాడు మన ఏడుపును విన్నాడు. దయ తలచి మన జీవితంలో వెలుగులు పూయించాడు. వేడుకలను ఆవిష్కరించాడు. దాని ఫలితంగా ఏదో ఉన్న వాళ్ళంగా ఈ రోజు ఉన్నాం. ఇచ్చిన వాణ్ణి మరచి పోకుండా, అతడు ఇచ్చిన దానిని పుచ్చుకోవడంతో పాటు, ఇచ్చే గుణాన్ని కూడా అక్కడి నుండే, అతని నుండే అంది పుచ్చుకోవాలి. అప్పుడే సంపదలలో సమర్పణలు చోటు చేసుకుంటాయి. మనం ఎవరికి ఏది ఇచ్చినా, మనం పుచ్చుకున్నదే ఇస్తున్నాము అనే ధర్మ స్పృహ ఉంటుంది. అంతేకాదు. ఇచ్చిన వాడికే తిరిగి సమర్పించు కుంటున్నాము అనే దైవ స్పృహ కూడా తోడుంటుంది. ఇక్కడే ఇచ్చే వన్నీ సమర్పణలు అవుతాయి. దానాలు ధర్మాలుగా శోభిస్తాయి.

**హారతి కర్పూరం**

పువ్వులు పంచే మొక్కకు, పండ్లు పెట్టే చెట్టుకు ఎవరైనా నీళ్ళు పోస్తారు. ఆ పని కూడా చేయకుండా కేవలం పువ్వులు కోసుకునే బుద్ధులను, కాయలు ఏరుకునే ప్రబుద్ధులను గూర్చి నేను మాట్లాడటం లేదు. వారు చర్చనీయులు కారు. వారికి చోటు లేని చర్చ ఇది.

కాని, నీళ్ళు పోసే వారు కూడా, అలాంటి ప్రబుద్ధులు కాకపోయినా, త్యాగులని మాత్రం చెప్ప లేము. ఎందుకని? పూలు పూయని మొక్కలకు, కాయలు కాయని చెట్లకు వీళ్ళు నీళ్ళు పోస్తారా? ప్రత్యుపకారం ఆశించి సాగే చర్యలు త్యాగానికి ప్రతిరూపా లెలా అవుతాయి? ఏ విధమైన ప్రత్యుపకారాన్ని ఆశించకుండా, మొక్కలకు, చెట్లకు నీళ్ళు పోయాలి అంటే, వ్యక్తి ఉన్నతుడై ఉండాలి. ధర్మరూపుడై ఉండాలి. అప్పుడే చేయ గలడు. అలాంటి కార్యాన్ని ఒక్క మేఘమే చేయ గలదు. ఎత్తైన ప్రదేశమున ఊరేగే మేఘమే చేయ గలదు. కనుక ధర్మ మేఘాలై శోభించే వారే వర్ష రూపంలో దానాలు చేస్తారు. ఇవన్నీ ప్రతిఫలం ఆశించని పవిత్ర కార్యాలు. హారతి కర్పూరాలు. కర్పూర హారతులు. ఆకాశంలో పక్షి జాడ ల్లాంటివి. ప్రవహించే గంగా జలాలపై వ్రాయబడిన ప్రణవాక్షరాల వంటివి. కనుకనే, ప్రత్యుపకారమును ఆశించకుండా చేయ దగింది కనుక దానిని సాత్త్విక దానము అంటున్నాడు భగవంతుడు ***(దాతవ్యం ఇతి యద్దానం దీయతే అనుపకారిణే)***.

**గ్రహీత - అనుగ్రహీత**

ఇచ్చే వాడు దాత. పుచ్చుకొనే వాడు గ్రహీత. దాన మిచ్చే వాడు ఇవ్వ దగిందే ఇస్తున్నాడు అని తెలుసు కున్నాం. అలాంటప్పుడు దాత ప్రత్యుపకారాన్ని ఎలా ఆశిస్తాడు? ప్రత్యుపకారాన్ని ఆశించి చేసేది దాన మెలా అవుతుంది? వ్యాపార మవుతుంది. చేసే దానము పెట్టుబడి కాగా, ప్రత్యుపకార ఫలం ఆదాయ మవుతుంది. ఇక్కడ దాన క్రియ ఎక్కడుంది? కనుక ప్రత్యుపకారము చేయని, చేయలేని వానికి ***(ప్రత్యుపకార అసమర్థాయ)*** ఇచ్చి నపుడే అది దానం అవుతుంది. మరి, ప్రత్యుపకారం చేసే శక్తి గల వారికి, వారి అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని చేసేది దానకర్మ కాదా? అవుతుంది. కాకపోతే, పుచ్చుకొనే వాడికి ప్రత్యుపకారం చేసే శక్తి ఉన్నా, ఇచ్చే వాడు ఫలాపేక్ష లేకుండా ఇచ్చి నపుడే అది దాన మవుతుంది ***(సమర్థాయాపి నిరపేక్షం దీయతే)***.

ఈ విధమైన దానకర్మలో సర్వత్ర ధర్మ స్పృహే ఉంటుంది, దైవ భావనే నిండు కుంటుంది కనుక, ఇటు దాత హృదయం ఆనంద రస ప్లావిత మవుతుంది, ఆహ్లాదంతో తృప్తి చెందుతుంది; అటు దానమును స్వీకరించిన వ్యక్తి గ్రహీతగా కాకుండా అనుగ్రహీతగా కనిపిస్తాడు.

## దాన ధర్మాలు - దేశకాలాలు

దానధర్మాలు ఎక్కడ చేయాలి? ఎప్పుడు చేయాలి? ఎవరికి చేయాలి? ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని చేసి నపుడే అవి సాత్త్విక దానాలు అవుతాయి. ఏ కార్యాని కైనా సమయాలు, నియమాలు ఉంటాయి. వాటిని దృష్టిలో పెట్టుకొని ఆచరించి నపుడే కార్యాలు పూర్ణ రూపంతో శోభిస్తాయి. ముఖ్యంగా దాన ధర్మాల వంటి పవిత్ర కార్యాలు పవిత్రమైన ప్రదేశాలలో, పుణ్య కాలాల లోనే పూర్ణత్వాన్ని సంతరించు కుంటాయి.

మొదటిది దేశము. దేశము అంటే ప్రదేశము అని అర్థం. దానాలు ఏ ప్రదేశాలలో చేస్తే యుక్తము? పుణ్య ప్రదేశాలలో ఆచరించడం శ్రేయస్కరము అన్నది శాస్త్రం. ఏవి ఆ పుణ్య ప్రదేశాలు? కురుక్షేత్రము మొదలైన ప్రదేశాలు అన్నారు భాష్యకారులైన శ్రీ శంకరులు ***(దేశే పుణ్యే కురుక్షేత్రాదౌ)***. 'కురు క్షేత్రాదౌ' అనడం వల్ల కురుక్షేత్రం లోనే చేయాలని అర్థం కాదు. కురుక్షేత్రం అనేది ఉపలక్షణం మాత్రమే. దైవ సన్నిధిలో చేయడం శ్రేష్ఠము అనేదే దాని ఉద్దేశ్యము.

కురుక్షేత్రంలో భగవంతుడు గీతను బోధించాడు కనుక, ఆ ప్రదేశం పుణ్య ప్రదేశ మైంది. జ్ఞానమయ మైంది. కనుక అక్కడ త్యాగ పూరితమైన దానకర్మను నిర్వర్తించడం ప్రశస్తము. పవిత్రము.

అలా చూచి నపుడు గీతా ప్రబోధాలు జరిగే ప్రదేశా లన్నీ కురుక్షేత్రాలే. జ్ఞాన క్షేత్రాలే. అక్కడ నిర్వహించే దానా లన్నీ పవిత్ర మైనవే. ఆలయ ప్రదేశాలు, ఆశ్రమ ప్రదేశాలు, కాశీ ప్రయాగాది క్షేత్రాలు, గంగా యమునా ఇత్యాది నదీ తీరాలు - ఇవన్నీ దానయోగ్య ప్రదేశాలే.

వరద ముప్పుకు గురైన ప్రాంతాలు, కరువు కాటకాలు సంభవించిన ప్రదేశాలు, విద్యాలయాలు, వైద్య శాలలు - ఇవన్నీ దాన యోగ్య ప్రదేశాలే. కారణం, ఆయా ప్రదేశాలలో దానమును గ్రహించ డానికి యోగ్యు లైన వారు లభిస్తారు. కనుక, అక్కడ చేసిన దానం సత్పాత్ర దానమై సత్కర్మగా శోభిస్తుంది.

దానయోగ్య ప్రదేశాల లాగే దానయోగ్యమైన కాలాలు కూడా ఉన్నాయి. ఆయా కాలాలలో నిర్వహించే దానాలు సాత్త్వికాలై భాసిస్తాయి. ఆ కాలాలు ఏవి అంటారా? సంక్రాంతి మొద లైనవి అన్నారు ఆచార్యులు ***(కాలే సంక్రాన్త్యాదౌ )***. అంటే, ఉత్తరాయణ పుణ్య కాలము, గ్రహణ సమయాలు, పర్వదినాలు, అలాగే జీవితంలో ప్రధానమైన జనన, మరణ, వివాహాది తిథులు మొదలైన కాలాలలో దానధర్మాలను నిర్వహించ వచ్చు. అవన్నీ ప్రశస్త మైనవే. ప్రాధాన్యత కలిగినవే.

దేశము, కాలము తరువాత పాత్ర విషయము. ఎవరికి దానం చేయాలి? ఈ ప్రశ్న లోనే ఎవరికి దానం చేయ కూడదు? అనేది కూడా అంతర్లీనంగా ఉంది. దానిని కూడా శాస్త్రం విస్పష్టం చేసింది.

దానము సత్పాత్రమై ఉండాలి. జ్ఞానులు, సాధువులు, వృద్ధులు, బిచ్చగాళ్ళు, రోగులు, వికలాంగులు, పేద విద్యార్థులు - వీరందరూ దాన యోగ్య గ్రహీతలే. ఇదంతా సత్పాత్ర దానమే. ఇక ఎవరికి దానం చేయ కూడదు? అనే విషయాన్ని సందర్భాను సారంగా ఇక్కడ ప్రస్తావించానే గాని, ఆ ప్రసంగ మంతా తరువాత రాజస తామస దానాలను చర్చించే టప్పుడు వివరిస్తాను.

## ఆత్మ సమర్పణము

కాకులను పిలిచి తినిపిస్తూ ఉండు, ఒకనాడు పిలవకుండానే హంస లొస్తాయి ఆరగించడానికి అనే వారు మన పెద్దలు. మనం చేసే దానాలు చిన్నవే అయినా, ఒకనాడు ఆ దానక్రియల వెనుక ఉండే త్యాగ గుణము విస్తరించి, విశాలమై, మహాత్యాగానికి, ఆత్మ సమర్పణమునకు, అటుపై మహోన్నతమైన మోక్ష సన్యాసానికే దారి తీస్తుంది. అందుచేత దాన గుణము మన సంస్కృతిలో దివ్య గుణమై శోభించింది.





దానము అంటే ధనమే కానవసరం లేదు. 'ఇవ్వ దగింది' అని మనస్సుతో నిశ్చయించుకొని ఇచ్చే దంతా దానమే అవుతుంది. కొందరు అన్నదానం చేస్తారు. కొందరు వస్త్రదానం చేస్తారు. కొందరు గోదానం చేస్తారు. కొందరు భూదానం చేస్తారు. కొందరు గృహదానం చేస్తారు. కొందరు సువర్ణదానం చేస్తారు. దానాలలో కన్యాదానం శ్రేష్ఠ మైనదని చెబుతారు. అన్నిటి కన్నా ఉన్నతమైన, మహోన్నత మైన దానము జ్ఞానదానము. జ్ఞాన దానమునకు మించిన విశిష్ట దానము మరొకటి లేదు.

'నాది' అని భావించి నంత కాలము దేనినీ త్యాగము చేయ లేము. 'నాది' అనేది మమకారము. మమకారమే బంధము. నిర్మమకారమే మోక్ష రూపము అన్నది శాస్త్రం ***( మమేతి బధ్యతే జంతుః నిర్మమేతి విముచ్యతే )***. ముందు మమకారం తొలగితే, ఆ తరువాత అహంకారం తొలగుతుంది. 'నాది' అనేది ముందుగా పోతే, 'నేను' అనేది తరువాత పోతుంది. 'నాది' అనేది కర్మయోగంతో పోతుంది. 'నేను' అనే దానిని జ్ఞానము నశింప చేస్తుంది. 'నేను' అనే దేహాత్మ భావాన్ని ఒకనాడు త్యాగం చేయాలి అంటే, ముందుగా ఈ పవిత్రమైన సాత్త్విక దానాలను అలవరచు కోవాలి. ఈ కారణం గానే కాశికి పోయి ఏమి విడిచి వచ్చావు? అని అడుగుతూ ఉంటారు. కాయలను, పదార్థాలను గంగలో త్యాగం చేస్తూ, ఒకనాడు కాయమును, దేహాత్మ భావనను జ్ఞాన గంగలో త్యాగం చేస్తా రనేదే మనీషుల మనోభావం. అందుకే ఈ సాత్త్విక దానము.

**కాశి గంగలో కాయ విడిచితే**
**కైలాసము క్రిందికి దిగి రాదు**
**కాయముపై మమకారము తొలగితే**
**కన్నుల ముందే కైవల్యము**
**న్యాయము తెలిసిన త్యాగములో**
**పండును బ్రతుకు ఇది సత్యము**
**రామ రామ జయ రాజారామ్**
**రామ రామ జయ సీతారామ్**

అని రామజోగి చిట్కా.

*ఇక, రాజస దానాన్ని వివరిస్తున్నాడు.*

యత్తు ప్రత్యుపకారార్థం ఫల ముద్దిశ్య వా పునః ।
దీయతే చ పరిక్లిష్టం తద్దానం రాజసం స్మృతమ్ ॥ 21

***యత్-తు-ప్రత్యుపకారార్థం-ఫలం-ఉద్దిశ్య-వా-పునః***
***దీయతే-చ-పరిక్లిష్టం-తత్-దానం-రాజసం-స్మృతం***

| | | | |
|---|---|---|---|
| ప్రత్యుపకారార్థం | = ప్రత్యుపకారము కొరకు గాని | దీయతే చ | = ఈయబడు చున్నదో |
| పునః | = మరల | తత్ | = ఆ |
| ఫలం | = ఫలమును | దానం తు | = దానము |
| ఉద్దిశ్య వా | = ఉద్దేశించి కాని | రాజసం | = రాజస మని |
| పరిక్లిష్టం | = అతి కష్టముతో | స్మృతం | = చెప్పబడినది |
| యత్ | = ఏది | | |

**అర్జునా! ప్రత్యుపకారాన్ని ఆశిస్తూ, ఫలాపేక్షతో, దుఃఖ పడుతూ చేసే దానము రాజస దానము.**

**వ్యాఖ్య**

చేయ వలసింది, చేయ దగింది దానము అనే స్థిర నిశ్చయంతో చేసేది, ప్రత్యుపకార ఫలాన్ని ఆశించకుండా చేసేది, దేశకాల పాత్రలను దృష్టిలో ఉంచుకొని చేసేది సాత్త్విక దానము అని తెలుసుకున్నాం. ప్రత్యుపకారాన్ని ఆశించి చేసేది, ఫలాన్ని ఊహించి చేసేది, ఖేదంతో కూడినది రాజస దానము అని ప్రస్తుత శ్లోకంలో భగవంతుడు చెబుతున్నాడు.

దానక్రియ రెండిటి లోను ఒకటి గానే కనిపిస్తున్నా, ఉద్దేశ్యాలను, మనోభావాలను దృష్టిలో పెట్టుకొని ఆలోచించి నపుడు సాత్త్విక దానానికి, రాజస దానానికి ఆకాశానికి భూమికి ఉన్నంత అంతరం ఉంది. సాత్త్విక దానము నిస్వార్థమైన దైతే, రాజస దానము ఫలాపేక్షతో కూడింది. చెయ్య దగింది కనుక చేయాలి అని చేసేది సాత్త్విక దాన మైతే, చేయ వలసి వచ్చిందే అనే బాధతో, భారంతో చేసేది రాజస దానము.

**ప్రత్యుపకారము - ప్రతిఫలము**

నేను అతనికి దానం చేస్తాను - సమయం వచ్చి నపుడు అతడు నాకు ప్రత్యుపకారం చేస్తాడు అని ప్రతిఫలాన్ని ఆశించి చేసే దానమును రాజస దానము అంటారు. నిజం చెప్పాలి అంటే, ఇక్కడ దాన మెక్క డుంది? దాన మనే ముసుగులో వ్యాపారం నడుస్తూ ఉంది. చూచే వారికి దాత - దానము అనేవి కనిపిస్తాయి. వాస్తవానికి అక్కడ దాత - దానము లేవు; వ్యాపారి - వ్యాపారము మాత్రమే ఉన్నాయి.

ప్రత్యుపకారాన్ని ఆశించి చేసే దానాన్ని వ్యాపారం అనాలి. లేదా లంచము అనాలి. వ్యాపార మైనా, లంచ మైనా, తన కేదో లాభం కలుగుతుంది అనే భావనతో చేసేదే. ఆ భావనతో చేసే టప్పుడు దానము వ్యాపార మైనా కావాలి, లేదా లంచ మైనా కావాలి. అంతేగాని, దానము మాత్రం కాలేదు. ప్రత్యుపకారాన్ని ఆశించి చేసేవే గనుక దానా లైతే, ఎన్నికలలో అభ్యర్థులు ప్రజలకు పంచి పెట్టే వన్నీ దానాలే అవుతాయి. వాటిని పుచ్చుకోవడ మైతే చేస్తారు గాని, అవి దానాలని ప్రజలు అంగీకరిస్తారా? మరి, దానాలు కానప్పుడు వాటిని ఏమనాలి? ఏమో! ఇచ్చే అభ్యర్థి లైనా చెప్పాలి, లేదా పుచ్చుకొనే ప్రజ లైనా చెప్పాలి. అవి దానా లని ఇరువురూ అంగీకరించరు. ఎందుకని? ఇరువురికీ తెలుసు అవి దానాలు కావని, పెట్టుబడులే నని. ఏ రూపాలలో నైనా అవి పెట్టుబడులే.

అవి చెంబులు కావచ్చు, చీరలు కావచ్చు. ఆట వస్తువులు కావచ్చు, తోట పరికరాలు కావచ్చు. వెండి బరిణెలు కావచ్చు, బంగారు ఉంగరాలు కావచ్చు. కొనేందుకు పచ్చనోట్లు కావచ్చు, కప్పుకొనేందుకు రగ్గులు కావచ్చు. వస్తువులు ఏవైనా, అన్నీ పెట్టుబడులే. దురాలోచనతో, దూరాలోచనతో చేసే దౌర్భాగ్యపు వ్యాపారాలే. ఒకవేళ ఇలాంటి కుహనా త్యాగులు చేసే కుటిల దానా లంటూ ఉంటే అవి రాజస దానాలే అవుతాయి. ప్రత్యుపకారాన్ని ఆశించి చేసే దానాలు. ఒక కాలంలో ఇచ్చేది మరొక కాలంలో తిరిగి అందుతుంది అనే ఆకాంక్షతో చేసే దానము రాజస దానము ***( యత్తు దానం ప్రత్యుపకారార్థం కాలేతు అయం మాం ప్రత్యుప కరిష్యతి ఇత్యేవ మర్థం ).*** కొందరు ప్రత్యుపకారం జరగదు అని తెలిసినా, మరో విధంగా ఫలాసక్తులై చేస్తారు. అవీ రాజస దానాలే.

**ఫలాకాంక్ష - స్వర్గము**

చేసిన దానానికి జీవిత కాలంలో ప్రత్యుపకారం అందుతుంది అనే భావనతో దృష్ట ఫలాన్ని ఆశించి





చేసేది రాజస దానము. అలాగే, చేసిన దానానికి జీవిత కాలంలో ప్రతిఫలం అందదు అని అర్థ మవుతూ ఉండినా, మరణానంతరము ప్రాప్తించే స్వర్గాది అదృష్ట ఫలాన్ని ఉద్దేశించి ఆచరించే దానాలు కూడా రాజస దానాల క్రిందికే వస్తాయి ***( ఫలం వా అస్య దానస్య మే భవిష్యతి అదృష్టమ్ ఇతి తదుద్దిశ్య పునః దీయతే చ ).*** ఇహంలో కాకపోయినా, పరంలో నైనా ప్రత్యుపకార ఫలం ప్రాప్తిస్తుందని భావించి చేసేవి కనుక పుణ్యకార్యాలు కూడా రాజస దానాలే.

మరి కొందరు విచిత్రంగా దానాలు చేస్తారు. ప్రత్యుపకార ఫలం అందదు అని వారికి తెలుసు. స్వర్గ ప్రాప్తి విషయంలో వారికి ఆశ ఉండదు. స్వర్గం ఒకటి ఉందని వారు నమ్మరు. అయినా అప్పుడప్పుడు పది మంది చూచే విధంగా, వంద మందికి తెలిసే విధంగా చిన్న చిన్న దానాలు పెద్ద పెద్ద ఆర్భాటాలతో, ఆడంబరాలతో చేస్తూ ఉంటారు.

వీరు నిత్య జీవితంలో ఏదో ఒక విధంగా సమాజాన్ని వంచించి ధనార్జన చేస్తారు. పెద్ద ఎత్తున ప్రజలను మోసం చేసి, విశేషంగా ధనాన్ని ఆర్జిస్తారు కనుక, సమాజ దృష్టిలో మరో విధంగా చిత్రింప బడతారు. ఆ కళంకాన్ని తొలగించుకోవా లని, పది మంది తన లోభత్వాన్ని చర్చించ కూడదని, చేసిన అకృత్యాలను దానాల ముసుగులో కప్పి పెట్ట వచ్చు నని భావించి, పుస్తకాలు లేని గ్రంథాలయాలు, ఉపాధ్యాయులు లేని పాఠశాలలు, వైద్యులు లేని ఆసుపత్రులను నిర్మించి, చాపంత గదికి చేటంత అక్షరాలతో శిలాఫలకాన్ని తగిలించి, ఖర్చులో ఖర్చు అని తమకు తాము సర్ది చెప్పుకొని, బిరుదు లిచ్చే వ్యాపార సంస్థలకు రహస్యంగా కొంత సొమ్ము ముట్ట చెప్పి, దానకర్ణ లేదా దానదుర్యోధన వంటి బిరుదులతో సన్మానం చేయించుకొని, ఏదో అలా సంతోష పడి పోతుంటారు. ఇది ఎలాంటి దానం? ఇదీ రాజసమే. ముందుగా మనం చూచిన ఇద్దరు ప్రత్యుపకార ఫలాన్ని ఆశించి చేసిన వారు. ఈ దాన దుర్యోధనులు ముందే ఫలాన్ని అందుకొని, దానం పేరిట ప్రత్యుప కారంగా ఏదో కొంత ముట్ట చెబుతారు. కనుక, ఇదీ రాజస దానమే.

ఈ విధంగా ఫలాకాంక్షతో, ప్రత్యుపకారార్థం రాజస దానాలు చేసే వారు దాన కర్మలో తృప్తి చెందరు. సంతోష పడరు. సంతృప్తికి నోచుకోరు. అయ్యో! ఎందుకు దానం చేశాను? తెలిసి ఎందుకు నష్ట పోయాను? చెయ్యక తప్పింది కాదు గాని, చెయ్యకుండా తప్పుకోనుంటే చాలా బాగుండేది. అయినా, అంత ఇవ్వకుండా ఉండాల్సింది, ఆలోచించ లేక అనవసరంగా అన్యాయమై పోయాను అని చేసిన దానానికి లోలోన కృంగి పోతూ ఉంటారు. ఈ విధంగా దుఃఖ భావంతో, దుఃఖ భారంతో ఇచ్చే దానాలు కూడా రాజస దానాలే ***(పరిక్లిష్టం ఖేద సంయుక్తం).*** లోభి కనుక పొరపాటున దానం చేస్తే, ఆ తరువాత అంతా ఆవేదనే. అంతా దుఃఖమే.

**ఆఖ్యాయిక**

పూర్వము ఆదర్శవంత మైన ఒక చిన్న గ్రామము ఉండేది. గ్రామస్థు లందరూ తమకు తామే కొన్ని ఆదర్శా లను ఏర్పాటు చేసుకొని, వాటికి అనుగుణంగా జీవిస్తూ ఉండేవారు. ఆ గ్రామంలో ఎవరి ఇంట్లో వివాహం జరిగినా, గ్రామస్థు లందరూ వచ్చి ఆ రోజు అక్కడే భోజనం చేయాలి. అది నియమం. అలా జరుగుతూ ఉండేది. ఎవరి కైనా ఆర్థిక ఇబ్బందు లుంటే గ్రామస్థు లందరూ చేతులు కలిపి కార్యం నెరవేర్చే వారే గాని సంప్రదాయ ఉల్లంఘనమునకు అంగీకరించే వారు కారు.

ఆ గ్రామంలో కృపణాచారి ఒకడు ఉండేవాడు. అతనికి ఒక్కగా నొక్క కుమార్తె. అమ్మాయి పెళ్ళి నిశ్చయ మైంది. గ్రామంలో ఉన్న ఆస్తిపరులలో కృపణాచారి కూడా ఒకడు. అమ్మాయి వివాహం తిరుపతిలో చేస్తా నని మొక్కు కున్నట్లు భార్యతో చెబుతాడు.

భర్త వ్యవహారం భార్యకు బాగా తెలుసు. మహా లుబ్ధుడైన కృపణాచారి గ్రామస్థులకు భోజనాలు పెట్టడం ఇష్టం లేకనే, కాసులు ఖర్చు చేయడానికి మనస్సు అంగీకరించకనే తిరుపతి యాత్ర పెట్టాడని అర్ధాంగికి అర్థమై పోయింది.

భర్త ప్రయత్నాన్ని ఆమె త్రిప్పి కొట్టింది. కావలసినంత డబ్బు ఉంది. పైగా ఒక్కగా నొక్క కూతురు. 'లోభత్వానికైనా ఒక హద్దు ఉండాలి. ఇరవై సంవత్సరాలుగా అందరి గృహాలలో వివాహ సందర్భాలలో భోజనాలు చేస్తూ, మన బిడ్డ విషయం వచ్చే సరికి తిరుపతి కొండెక్కి కూర్చుంటా నంటే ఏం బావుంటుంది?' అంటూ భర్తను ఛీ కొట్టింది.

ఇక కృపణాచారికి తప్పింది కాదు. పెళ్ళి ఊళ్ళోనే జరగా లని భార్య పట్టు పట్టడంతో కృపణాచారి తన అమ్మాయి వివాహాన్ని గ్రామం లోనే జరిపించ డానికి నిశ్చయించుకున్నాడు. వివాహ సన్నాహాలు ప్రారంభ మయ్యాయి.

పెళ్ళి రోజు సమీపిస్తూ ఉంది. సంప్రదాయాను సారము భార్యాభర్త లిద్దరూ వెళ్ళి గ్రామస్థు లందరినీ పెళ్ళికి ఆహ్వానించారు.

ఇక ఆ రోజే పెళ్ళి. బంధువు లందరూ వచ్చేశారు. గ్రామస్థు లందరూ హాజరయ్యారు. పెళ్ళి ఘనంగా జరిగింది. భోజనాలు వడ్డించ వలసిన సమయం వచ్చింది. ఆహార పదార్థా లన్నీ సిద్ధ మయ్యాయి. అందరూ పంక్తిలో ఆసీను లైన తరువాత, వడ్డన జరిగిన పిమ్మట యజమాని సతీ సమేతంగా అందరికీ నమస్కరించాలి. 'అతిథులారా! ఆత్మీయులారా! తృప్తిగా భోజనం చేయండి' అని యజమాని పలకాలి. ఆ తరువాతే అందరూ భుజించడం ప్రారంభిస్తారు. అది ఆ గ్రామంలో సంప్రదాయము.

అందరూ భోజనానికి ఆసీను లయ్యారు. ఆకులలో ఆహార పదార్థా లన్నీ వడ్డించారు. కాని, అక్కడెక్కడా యజమాని కనుచూపు మేరలో కనిపించ లేదు. యజమాని భార్య భర్తను వెతుకుతూ అటు, ఇటు పరుగులు పెట్టింది. చివరికి కృపణాచారి జాడను కనిపెట్టింది. పాకశాల ప్రక్కన సరుకులు నిల్వ ఉంచే గదిలో బియ్యపు బస్తాల వెనుక నక్కి బిక్క మొగంతో కూర్చుని ఉన్నాడు.

'భోజనాలు వడ్డిం చేశారు. మీరు ఇక్కడ కూర్చున్నా రేమిటండీ! రండి, ఆహ్వానం పలకాలి. అందరూ నిరీక్షిస్తున్నారు' అన్నది అర్ధాంగి. కృపణాచారికి ఏమి చెయ్యాలో తోచ లేదు. భార్యను ప్రాధేయ పడుతూ, 'నేను రాలేను. మన ఇంట్లో ఒకేసారి అంత మంది భోజనం చేయడం నేను చూడలేను. నువ్వు వెళ్ళు. వెళ్ళి నా బదులు నువ్వే ఆహ్వానం పలికేయ్! అందరూ భోజనం చేసి వెళ్ళిన తరువాత నాకు చెప్పు. నేను వస్తాను' అన్నాడు.

అది విని భార్య నిర్ఘాంత పోయింది. భర్తపై చిర్రుబుర్రు లాడింది. 'ఎలాగూ భోజనాలు తయారయ్యాయి. అయిన ఖర్చేదో అయి పోయింది. మీరు రానంత మాత్రాన ఖర్చై పోయిన సొమ్ము తిరిగి వస్తుందా? పోయిన సొమ్ముతో పాటు పరువు కూడా పోతుంది. ఈ విషయం గ్రామస్థులకు తెలిస్తే, వారికి బాధ కలిగి మనల్ని గ్రామం నుండి బహిష్కరించ వచ్చు కూడా. లేవండీ!' అంటూ ఎలాగో భర్తకు నచ్చ చెప్పి తీసుకొని వచ్చి, భోజనాలు జరిగే చోట అతని ప్రక్కనే నిలబడి, ఆహ్వానం పలక మని భర్తతో మెల్లగా చెప్పింది. ఇక భర్తకు తప్ప లేదు. కృపణాచారి ఆహ్వానం పలకడం ప్రారంభించాడు.

'అతిథులారా! మా ఆహ్వానాన్ని మన్నించి, మా ఇంటికి వచ్చి, మా అమ్మాయి వివాహ మహోత్సవంలో పాల్గొన్నందుకు మీ అందరికీ మా దంపతులము కృతజ్ఞతతో నమస్కరిస్తున్నాము. మేము ఇచ్చే ఈ విందును ఆరగించి వధూవరులను ఆశీర్వదించండి. మమ్మల్ని కృతార్థుల్ని చేయండి. తృప్తిగా భోజనం చేయండి' అన్నాడు కృపణాచారి. ఆహ్వాన వాక్యం అదే. అంతే.





అందరూ ఆరగించ డానికి ఆరంభించారు. కృపణాచారి రెండవ సారి మళ్ళీ ఆహ్వాన వాక్యం వినిపించాడు. మూడవ సారి కూడా వినిపించాడు. అందరికీ ఆశ్చర్యం వేసింది. మూడు సార్లు చెప్పడ మేమిటి? అని. మొదటి ఆహ్వాన వాక్యం ముగియ గానే అక్కడి నుండి కదిలి స్వయంగా భోజన ఏర్పాట్లు చూస్తున్న భార్య, భర్త మళ్ళీ మళ్ళీ ఆహ్వానం పలకడం విని కంగారు పడింది. విషయం అర్థం గాక గబగబా భర్తను సమీపిస్తూ ఉంది. ఈ లోగా కృపణాచారి నాల్గవసారి ఆహ్వానం పలకడం ప్రారంభించాడు. ఈ సారి అతని పలుకులో ఏదో వైచిత్ర్యం ధ్వనించింది.

'మేము ఇచ్చే ఈ విందును ఆరగించి, మమ్మల్ని ఆశీర్వదించండి. తృప్తిగా భోజనం చేయండి. తృప్తిగా భోజనం చేయండి. తృప్తిగా భోజనం చేయండి' అని మూడు సార్లు మళ్ళీ పలికి,

'అయ్యా! బియ్యము కిలో ముప్పై రూపాయలు. కందిపప్పు కిలో ఎనభై రూపాయలు. తృప్తిగా భోజనం చేయండి. భోజనం చేయండి. బంగాళా దుంపలు కిలో ఇరవై ఎనిమిది రూపాయలు. వంకాయలు కిలో ముప్పై రూపాయలు. తినండి, తినండి. తృప్తిగా తినండి.

పంచదార కిలో యాభై రూపాయలు. ఆవుపాలు లీటరు ఇరవై రూపాయలు. జీడిపప్పు కిలో మూడు వందల యాభై. పాయసం త్రాగండి. తృప్తిగా త్రాగండి. తనివిదీర జుర్రండి.

అయ్యా! లడ్డూలు కిలో రెండు వందల రూపాయలు. కిలోకి ఇరవై రెండు లడ్డూలు తూగుతాయి. తినండి, తినండి. తృప్తిగా తినండి. భోజనం చేసిన తరువాత, అరటి పండు ఇస్తూ ఉన్నాము. ఒక్కొక్కరు ఒక్కొక్కటి తృప్తిగా తినండి. తిన్న ఆహారం బాగా జీర్ణ మవుతుంది. అరటిపండ్లు డజను ఇరవై ఐదు రూపాయలు. తినండి, తినండి. తృప్తిగా తినండి. వడ్డించిన అరిటాకు రెండు రూపాయలు. తినండి, అంటూనే ఉన్నాడు.

భార్య అక్కడికి వచ్చి, భర్తను బలవంతంగా లోనికి తీసుకొని వెళ్ళింది. గదిలో కూర్చోబెట్టి, భర్తతో 'ఏమిటండీ ఇదంతా?' అని అడిగింది. అంతే. భర్త భోరున విలపించాడు. 'నా జీవితంలో ఇలాంటి రోజు ఒకటుంటుం దని నేను కలలో కూడా ఊహించ లేదు. ఆ భయంకర దృశ్యాన్ని చూచి నా గుండె చెరువై పోయింది' అన్నాడు. భార్య నవ్వుతూ, 'వాళ్ళ ఇళ్ళ కెళ్ళి మెక్కి నపుడు ఏమైంది ఈ జ్ఞానం? ఈ అనుభూతి? ఈ జ్ఞానానుభూతి?' అంది.

*ఇక భగవంతుడు తామస దానాన్ని చెబుతున్నాడు.*

**అదేశకాలే యద్దాన మపాత్రేభ్య శ్చ దీయతే ।**
**అసత్కృత మవజ్ఞాతం త త్తామస ముదాహృతమ్ ॥** 22

*అదేశకాలే-యత్-దానం-అపాత్రేభ్యః-చ-దీయతే*
*అసత్కృతం-అవజ్ఞాతం-తత్-తామసం-ఉదాహృతం*

| | | | | | |
|---|---|---|---|---|---|
| అదేశకాలే | = | అనుచిత దేశకాలము లందు | దానం | = | దానము |
| అపాత్రేభ్యః చ | = | అయోగ్యులకు | దీయతే | = | ఇవ్వబడు చున్నదో |
| అసత్కృతం | = | సత్కారము లేకుండా | తత్ | = | అది |
| అవజ్ఞాతం | = | అవమాన పూర్వకంగా | తామసం | = | తామస మని |
| యత్ | = | ఏ | ఉదాహృతం | = | చెప్పబడింది |

**అర్జునా! అయోగ్య మైన దేశ కాలాదులలో అపాత్రులైన వారికి తిరస్కార భావంతో, అవమాన పూర్వకంగా చేసే దానము తామస దానము.**

**వ్యాఖ్య**

యోగ్యము కాని ప్రదేశములో, అనుచిత కాలములో, అపాత్రులైన వారికి ఇచ్చే దానము తామస దానము (*అదేశ కాలే, అపాత్రేభ్యశ్చ యద్దానం దీయతే*). అలాగే సత్కారమునకు నోచుకోనిది (*అసత్కృతమ్*), అవమాన పూర్వక మైనది (*అవజ్ఞాతం*) ఏదో, అట్టి దానము తామస దానము (*తత్ తామసం ఉదాహృతమ్*).

**అశుచి ప్రదేశము**

అదేశము అంటే దానమునకు అయోగ్య మైన ప్రదేశము. దానము పవిత్ర మైనది కనుక శుచి లేని ప్రదేశము నందు ఇవ్వ కూడదు. కాని, తామసులు అలాంటి ప్రదేశాల లోనే దానం చేస్తారు. అందుచేత వారిది తామస దానము.

ఎవరికి ఏదుందో దానినే దానం చేస్తారని పూర్వ శ్లోకాలలో చెప్పుకున్నాం. ఎవరు ఎక్కడ ఉంటారో అక్కడే దానం చేస్తారు అనేది ప్రస్తుత శ్లోకంలో గ్రహించాలి. తామసులు చేసేది తామస దానము. తామసులు అపవిత్ర మైన ప్రదేశాలలో చరిస్తారే గాని పవిత్రమైన ప్రదేశాలలో చరించరు. అపవిత్రమైన స్థలాలలో ఉండే వారు, దానం చేసే అవసరమే వస్తే, అపవిత్రమైన, అశుచి స్థలము లందే గాక మరొక చోట ఎలా చేస్తారు? అలా అశుచి ప్రదేశాలలో చేసే దానము తామస దానము (*అదేశ కాలే అపుణ్యే దేశే*).

కల్లు దుకాణాల వద్ద దానం చేస్తే, దానమును గ్రహించిన వాడు, ఆ గ్రహించిన దానాన్ని దేనికి వినియోగిస్తాడు? అందుచేత అయోగ్య ప్రదేశాలలో చేసే దానము దాతను, గ్రహీతను, ఇద్దరినీ పాప పాశంతో ముడి వేస్తుంది. కనుక అది తామస దానము.

**అపుణ్య కాలము**

అశుచి ప్రదేశంలో ఎలా దానం చేయ కూడదో, అశుచి కాలంలో కూడా అలాగే దానం చేయ కూడదు. అపుణ్య కాలంలో, అశుచి సమయంలో దానం చేస్తే, అది తామస దాన మవుతుంది (*అకాలే పుణ్య హేతుత్వేన అప్రఖ్యాతే*).

దానం చేయడానికి కాలం అయోగ్యం కాదు. కాకపోతే, దానం పుచ్చుకొనే వాడి కాలం బాగ లేనపుడు ఇవ్వబడిన దానం వ్యర్థ మవుతుంది. సద్వినియోగం కాక పోగా, దుర్వినియోగ మవుతుంది.

**పాత్ర యోగ్యత్వము**

దానము సత్పాత్రముగా ఉండాలి. అపాత్ర దానము అయోగ్యము. అయోగ్యుడైన అపాత్రునికి దానం చేయడము తామస దాన మవుతుంది (*అపాత్రేభ్యః చ మూర్ఖ తస్కరాదిభ్యః*). మూర్ఖులకు, చోగులకు చేసే దానము తామస దాన మవుతుంది. వీరందరూ సోమరిపోతులు. వారికి దానం చేయడం వల్ల సోమరులను ప్రోత్సహించినట్లే అవుతుంది. సమాజ అభ్యుదయ నిరోధకులైన సోమరులను ప్రోత్సహించ కూడదు. అట్టి వారికి చేసే దానము తామస దానమే.

ఎవరికి మనం ఏది ఇచ్చినా అది వారికి ఉపయోగ పడాలి. వారు దానిని ఉపయోగ పరచు కోవాలి. అలా వినియోగించుకోలేక పోవడమే గాక, దుర్వినియోగం చేసుకొనే వారికి దానం చేయ కూడదు. ఒకవేళ చేస్తే, అది తామస దాన మవుతుంది.





త్రాగుబోతుకు దానం చేస్తే, ఆ తరువాత వాడి త్రాగుడు వాడు పుచ్చుకొనే దానం పైనే ఆధారపడి ఉంటుంది. జూద గాడికి దానం చేస్తే, వాడు దానిని జూదంలో పోగొట్టు కుంటాడు. అందుచేత అది అపాత్ర దానము అవుతుంది. పాత్రోచితం కాని దానం వినాశ హేతువు కనుక, అట్టి దానము తామస దాన మవుతుంది.

**అసంప్రదాయము**

అయోగ్యులైన వారికి, అంటే అపాత్రులకు మనము ఏది ఇచ్చినా అది దానం క్రిందికి రాదు. ఒకవేళ వస్తే, అది తామస దానము అవుతుంది. ఎందుకంటే, అది సంప్రదాయానికి భిన్నంగా ఉంది కనుక.

దానము అనేది ప్రశస్త మైనది, పవిత్ర మైనది అని ఇప్పటికే చాలా చెప్పుకున్నాం. దానం అంత విశిష్ట మైనది కనుకనే, దానాన్ని సమర్పించే టప్పుడు పూజాదికాలు నిర్వహించి మన పూర్వీకులు ఇచ్చే వాళ్ళు. సత్కరించకుండా ఇచ్చేది దానం కానే కాదు.

సత్కరించడము అంటే, గౌరవ ప్రదమైన సంభాషణము, పాద ప్రక్షాళన, పూజాదులను నిర్వహించడము (*సత్కృతమ్*). సత్కారము లేనిది అసత్కారము (*అసత్కృతమ్*).

ధర్మరాజు రాజసూయ యాగములో పాద ప్రక్షాళన నమస్కారాదులు నిర్వహించి ఆ తరువాత దానాలు ఇచ్చాడు. ఇంతెందుకు? బిచ్చగాడికి దానం చేసినా తల్లులు నమస్కరిస్తూ ఉండటం మనం చూస్తాము. ఇది మన సంప్రదాయము. ఈ సంప్రదాయానికి భిన్నంగా సాగే దానము దానమే కాదు. అయోగ్యు లైన వారికి, అపాత్రు లైన వారికి చేసే టప్పుడు వారిని ఎవరైనా సత్కరిస్తారా? సత్కరించరు. కనుక, అసత్కృతమైన ఆ దానము తామస దానమే.

**లేనిది సత్కారము - ఉన్నది చీత్కారము**

సత్కారము లేని దానము అయోగ్య మైనది. సత్కారము లేక పోగా చీత్కారముతో కూడు కున్నది దానము కానే కాదు. సన్మాన పూరితంగా సాగ వలసిన దాన క్రియ అవమాన పూర్వకంగా సాగడం గర్హణీయం. అందుచేత, అసత్కార చీత్కారాది లక్షణాలతో కూడు కున్నది కావడం చేత దీనిని తామసదానము అన్నారు.

అయోగ్యులకు దానం చేసే టప్పుడు వారిని ఎవ్వరూ సత్కరించరు కనుక ఆ దానము అసత్కార యుతము (*అసత్కృతమ్*). అలాంటి వారికి గౌరవ పూర్వకంగా ఎవరు దానా లిస్తారు? చీత్కారము తోనే ఇస్తారు. అవమాన పూర్వకం గానే ఇస్తారు. విసిరి కొట్టడము, తిట్టుకుంటూ ఇవ్వడము - 'ఇదిగో, తీసుకుపో. మళ్ళీ నీ ముఖం నాకు చూపకు' అని నిందిస్తూ, అవమానిస్తూ ఇస్తూ ఉంటారు. అందుచేత తామస దానము అవమానముతో కూడినది (*అవజ్ఞాతం పాత్ర పరిభవ యుక్తం*).

ఈ విధంగా అశుచి ప్రదేశాలలో, అపుణ్య కాలాలలో, పాత్ర యోగ్యత లేని వారికి, సత్కార రహితంగా, అనమాన పూర్వకంగా అర్పించే దానము ఏదో, అది తామస దానము (***యత్ దానం తత్ తామసమ్ ఉదాహృతమ్***).

*చివరగా, పవిత్రమైన యజ్ఞ దాన తపస్సులు ఫలించే ఉపాయాన్ని సూక్ష్మీకరిస్తున్నాడు.*

**ఓం తత్స దితి నిర్దేశో బ్రహ్మణ స్త్రివిధః స్మృతః ।** 23
**బ్రాహ్మణా స్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా ॥**

*ఓం-తత్-సత్-ఇతి-నిర్దేశః-బ్రహ్మణః-త్రివిధః-స్మృతః*
*బ్రాహ్మణాః-తేన-వేదాః-చ-యజ్ఞాః-చ-విహితాః-పురా*

| | | |
|---|---|---|
| బ్రహ్మణః | = | బ్రహ్మము యొక్క |
| నిర్దేశః | = | నిర్దేశము |
| ఓం ఇతి | = | ఓం అని |
| తత్ ఇతి | = | తత్ అని |
| సత్ ఇతి | = | సత్ అని |
| త్రివిధః | = | మూడు విధములుగ |
| స్మృతః | = | చెప్పబడినది |
| తేన | = | దాని చేత |
| బ్రాహ్మణాః | = | బ్రాహ్మణులు |
| వేదాః చ | = | వేదములు |
| యజ్ఞాః చ | = | యజ్ఞములు |
| పురా | = | పూర్వము |
| విహితాః | = | నిర్మింప బడినవి |

**అర్జునా! 'ఓం తత్ సత్' అనే ఈ మూడు మంత్రాలు బ్రహ్మ నిర్దేశాలు. పూర్వం వీటి తోనే బ్రహ్మ బ్రాహ్మణులను, వేదాలను, యజ్ఞాలను సృష్టించాడు.**

## వ్యాఖ్య

ఆహార, యజ్ఞ, దాన, తపస్సులు గుణ భేదాలను బట్టి త్రివిధము లని వివరించి, మళ్ళీ వాటి స్వభావ స్వరూపాలను వేరు వేరుగా విస్తరించి చెప్పడం జరిగింది. త్రిగుణాలలో రజోగుణ, తమోగుణాలు త్యాజ్యము లని చెప్పడం చేత సాత్త్విక మైనవే గ్రాహ్యము లని సుస్పష్ట మైంది.

ఆహారము నొక్క దానిని విడిచి పెడితే, మిగిలిన యజ్ఞ, దాన, తపస్సుల ఫలము అదృష్టమే గాని దృష్టము కాదు. అనుమాన ప్రమాణం చేత అముఖ్యమైన దృష్ట ఫలాన్ని ఊహించ గలిగినా, ప్రధానమైన ఫలము మాత్రము అదృష్టమే అనుటలో సందేహము లేదు.

సాత్త్విక శ్రద్ధ కలిగి యజ్ఞ, దాన, తపస్సులను నిర్వర్తించినా, శాస్త్ర జ్ఞానము లేని కారణంగా *(17 వ అ - 1 వ శ్లో ; అర్జునుని ప్రశ్న)* వాటిలో దోషాలు తలెత్తే ప్రమాదం లేక పోలేదు. లోపాలు ఏర్పడే అవకాశాన్ని త్రోసిపుచ్చ లేము. అలా యజ్ఞ, దాన, తపస్సులలో దోషం ఉన్నప్పుడు ఫలం రాక పోవచ్చు. ఫలం అదృష్టం కావడం చేత అది వచ్చిందో రాలేదో తెలుసుకొనే అవకాశం కూడా లేదు. అలాంటప్పుడు ఈ వైకల్యమును, లేదా వైగుణ్యమును తొలగించుకొనే దెలా? దోష పరిహారం ఏమైనా ఉందా? ఉంటే, ఏమిటది? దానికి సమాధానం గానే, దోష పరిహారార్థం భగవంతుడు ఈ శ్లోకంలో ఉపాయం చెబుతున్నాడు.

యజ్ఞ, దాన, తపస్సుల లోని వైగుణ్యమును తొలగించి, వాటికి సాద్గుణ్యమును, అంటే మంచి గుణాన్ని ఆర్జించడం కొరకు ఉపాయాన్ని ఉపదేశిస్తున్నాడు ***( యజ్ఞ దాన తపః ప్రభృతీనాం సాద్గుణ్య కరణాయ అయమ్ ఉపదేశః ఉచ్యతే ).***

ఉచ్ఛిష్టం కానిది, దోషం లేనిది ప్రపంచంలో ఒక్కటే ఉంది. అదే బ్రహ్మము. బ్రహ్మము కన్నా అన్యంగా ఏదున్నా అదంతా ఉచ్ఛిష్టమే. దోష యుతమే. బ్రహ్మ మొక్కటే సమము. బ్రహ్మమే నిర్దోషము ***( నిర్దోషం హి సమం బ్రహ్మ: 5 వ అ - 19 వ శ్లో).***

యజ్ఞ, దాన, తపస్సుల విషయములో అనుష్ఠానంలో ఎక్కడ ఏ దోషము కదిలినట్లు అనుమానం కలిగినా, దోష రహితమైన పరమాత్మను ఉచ్చరిస్తే, ఆ దోషము పరిహార మవుతుందని చెబుతున్నాడు. పరమాత్మ మంత్రోచ్చారణముతో దోషం పరిహరింప బడుతుంది. ఆ మంత్రమే ***ఓం తత్ సత్ .***

ఓంకారములో మూడు అక్షరా లున్నట్లే, బ్రహ్మ నిర్దేశ మైన ఈ మంత్రములో మూడు పదాలు ఉన్నాయి. ఈ మూడు బ్రహ్మ నిర్దేశాలు. విచిత్ర మేమిటంటే, ఈ మూడు నిర్దేశ పదాలు కలిసి ఏక మంత్రమై బ్రహ్మమును నిర్దేశిస్తాయి. అలాగే ఒక్కొక్క పదము కూడా దేనికి అదే పూర్ణరూపంతో బ్రహ్మమును నిర్దేశిస్తుంది.





నిర్దేశము అంటే నామము, లేదా పేరు అని అర్థము. ***ఓం తత్ సత్*** అనే మూడు పదాలు కలిసి, 'సత్యం జ్ఞానం అనంతం' లాగా భగవంతుని నిర్దేశిస్తాయి. లేదా, దేని కదే నిర్దేశ మవుతాయి. ప్రస్తుతం ఇది నామ నిర్దేశం.

***నిర్దిశ్యతే అనేన ఇతి నిర్దేశః*** - దేని సహాయం చేత ఒక వస్తువు తెలియ బడుతుందో, అలా తెలుసు కునేందుకు సహకరించేది నిర్దేశము అవుతుంది ***( న్యాయ లింగేన ).*** ***ఓం తత్ సత్*** అనే బ్రహ్మ నామము నిర్దేశమై నందున బ్రహ్మము నిర్దేశ్య మైంది. ఇది 'ప్రతిపాదక ప్రతిపాద్య' సంబంధము. నామము ***(ఓం తత్ సత్)*** ప్రతిపాదకము. బ్రహ్మము ప్రతిపాద్యము. ప్రస్తుతము బ్రహ్మమునకు మూడు విధాలైన నామ నిర్దేశం జరిగింది ***(త్రివిధః నామ నిర్దేశః బ్రహ్మణః ).*** ఈ మూడు విధాలైన నిర్దేశమే ***ఓం తత్ సత్.***

***ఓం తత్ సత్*** అనేది పరమాత్మ స్వరూపమును గూర్చిన నిర్దేశము. ***నిర్దేశః*** అనేది ఏకవచన ప్రయోగం కావడం చేత, ***ఓం తత్ సత్*** అనేది బ్రహ్మ ప్రతిపాదక నామము అనేది స్పష్టము.

యజ్ఞ, దాన, తపస్సులలో కర్మాచరణంలో ఏదైనా లోపం జరిగినట్లు మీకు అనిపిస్తే, వెంటనే ***ఓం తత్ సత్*** అనే బ్రహ్మ నిర్దేశాన్ని, లేదా బ్రహ్మ నామాన్ని ఉచ్చరిస్తే, వెంటనే ఆ దోషం, లేదా లోపం పరిహరింప బడుతుంది. ఇది శ్లోక హృదయం.

***ఓ మితి బ్రహ్మ*** - ***ఓం*** అనేది బ్రహ్మము అని తైత్తిరీయ శ్రుతి. కనుక ఓంకారము బ్రహ్మమునకు నామ నిర్దేశము.

***తత్త్వమసి*** - తత్ (బ్రహ్మము) త్వం (నీవు) అసి (అయి ఉన్నావు) అని ఛాందోగ్య శ్రుతి వలన ***తత్*** పదము బ్రహ్మమునకు నామ నిర్దేశము.

***సదేవ సోమ్యేదం*** - సృష్టికి పూర్వము ***సత్*** ఒక్కటే ఉండింది అని శ్రుతి ప్రతిపాదించడం చేత ***సత్*** అనేది బ్రహ్మమునకు నామ నిర్దేశ మైంది. ఇప్పుడు ఈ మూడిటిని కలిపి అర్థం చేసుకుంటే, ***ఓం తత్ సత్,*** అనేవి మూడు కూడా బ్రహ్మము యొక్క నామములే కనుక, బ్రహ్మ నామత్రయోచ్చారణము సర్వపాప, సర్వ దోష ప్రాయశ్చిత్త మని స్పష్ట మవుతూ ఉంది. కనుక, యజ్ఞ, దాన, తపస్సులను సాత్త్విక శ్రద్ధతో ఆచరించే వారు, శాస్త్ర విధిని విడిచి పెట్టి చేయడం చేత గాని ***( శాస్త్ర విధిమ్ ఉత్సృజ్య ).*** తంత్ర, మంత్ర, స్వర, వర్ణాది లోపము చేత గాని ఏర్పడిన వైగుణ్యము ప్రయోజనానికి అవరోధమును కల్పించకుండా, యజ్ఞ, దాన, తపస్సులను ఆచరించు నపుడు, సంశయము ఉత్పన్న మైనప్పుడల్లా ***ఓం తత్ సత్*** అనే బ్రహ్మ నామమును ఉచ్చరిస్తే సర్వమునకు సాద్గుణ్యము సాధింప బడి సర్వము సఫల మవుతుంది.

*ఇక 'ఓం తత్ సత్' అనే మూడు పదాలను, ఒక్కొక్క దానినే తీసుకొని వర్ణింప బోతున్నాడు. మొదట 'ఓంకారము'ను వివరిస్తున్నాడు.*

తస్మా దో మి త్యుదాహృత్య యజ్ఞ దాన తపః క్రియాః ।
ప్రవర్తన్తే విధానోక్తాః సతతం బ్రహ్మవాదినామ్ ॥ 24

***తస్మాత్-ఓం-ఇతి-ఉదాహృత్య-యజ్ఞదానతపః క్రియాః***
***ప్రవర్తంతే-విధానోక్తాః-సతతం-బ్రహ్మవాదినాం***

| | | |
|---|---|---|
| తస్మాత్ | = | అందువలన |
| బ్రహ్మవాదినాం | = | బ్రహ్మవాదుల యొక్క |
| విధానోక్తాః | = | శాస్త్రోక్తము లైన |
| యజ్ఞదానతపఃక్రియాః | = | యజ్ఞములు, దానములు, తపస్సులు అనే కర్మలు |

| | | | |
|---|---|---|---|
| ఓం ఇతి | = ఓం అని | సతతం | = సదా |
| ఉదాహృత్య | = చెప్పి | ప్రవర్తంతే | = ప్రవర్తించు చున్నవి |

**అర్జునా! బ్రహ్మవేత్తలు శాస్త్రోక్తము లైన యజ్ఞ దాన తపస్సులను 'ఓం'ను ఉచ్చరిస్తూనే ఆచరిస్తారు.**

**వ్యాఖ్య**

***ఓం తత్ సత్*** అనే త్రివిధ నామ నిర్దేశంలో ప్రథమంగా 'ఓం' కారమును గూర్చి విస్పష్టం చేస్తున్నాడు. 'ఓం' ఒక్కటే నామ నిర్దేశం కావడం చేత ***( తస్మాత్ )*** ఓంకారమును ఉచ్చరించి ***( ఓం ఇతి ఉదాహృత్య )*** వేదవాదులైన బ్రహ్మమూర్తులు యజ్ఞ, దాన, తపస్సుల యందు ప్రవర్తించే వారు.

'ఓం' అని పలికి యజ్ఞాది కార్యాలను ప్రారంభించి, యజ్ఞము పూర్తి కాగానే 'ఓం' కారమును ఉచ్చరించి సమాప్తం చేసే వారు. ఈ విధంగా ఆద్యంతముల యందు బ్రహ్మ నిర్దేశమైన 'ఓం' కారమును ఉచ్చరించి, యజ్ఞాంగములకు సాద్గుణ్యమును సాధించుకొని ప్రకర్షమున బ్రహ్మ కర్మలలో వర్తించే వారు.

***ఓమితి ఏత దక్షరం ఇదం సర్వం -*** ఈ సమస్త ప్రపంచము ఓంకారమనే అక్షర పరబ్రహ్మము. ***భూతం భవ ద్భవిష్య దితి సర్వం ఓంకార ఏవ -*** భూత, భవిష్య ద్వర్త మానము లన్నియు ఓంకారమే అని మాండూక్య శ్రుతి. 'ఓం'కారము బ్రహ్మ నిర్దేశ వాచకము. కనుక, పరమాత్మ సర్వులను రక్షించునట్లు, ప్రణవ రూపమైన ఓంకారము కూడా ఉచ్చరించే వారిని రక్షిస్తుంది.

***ఓంకారః - అవతి భూతానీమ్ ఓం.*** సర్వ భూతములను రక్షించునది ఓంకారము. 'ఓం' అనేది 'అవ్' ధాతువు నుండి పుట్టింది. ***అవ రక్షణే*** అనే వ్యుత్పత్తి వల్ల సర్వులను రక్షించేది ఓంకారము. బ్రహ్మము నిర్దేశ్యము. ఓంకారము నిర్దేశము. కనుక ఓంకారము, లేదా ప్రణవము బ్రహ్మమునకు పేరు, లేదా నిర్దేశము ***( తస్య వాచకః ప్రణవః ).***

సృష్టి ప్రారంభములో ***ఓం తత్ సత్*** అనే నామత్రయ పూర్వకంగా బ్రాహ్మణ, వేద, యజ్ఞముల విధానము గోచరించుట చేత, ఈ అభిధాన త్రయంలో 'ఓం' అనే నామమును ఉచ్చరించిన తరువాతే యజ్ఞాది క్రియలు ఆచరిస్తారు. ***ఓమితి బ్రహ్మ ప్రసౌతి , ఓమితి శస్త్రాణి శంసన్తి , ఓమితి ప్రతిగిరం ప్రతి గృణాతి , ఓమితి సామాని గాయన్తి*** - అని వేదపారగుల క్రియలన్నీ ఓంకారము తోనే ప్రారంభ మౌతున్నా యని శ్రుతి ప్రబోధము.

*ఇక బ్రహ్మ నిర్దేశమైన 'ఓం తత్ సత్' లో రెండవ పదమైన 'తత్'ను వివరిస్తున్నాడు.*

**త ది త్యనభిసంధాయ ఫలం యజ్ఞ తపః క్రియాః ।**
**దానక్రియాశ్చ వివిధాః క్రియన్తే మోక్షకాంక్షిభిః ॥** 25

***తత్-ఇతి-అనభిసంధాయ-ఫలం-యజ్ఞ తపః క్రియాః***
***దానక్రియాః-చ-వివిధాః-క్రియంతే-మోక్షకాంక్షిభిః***

| | | | |
|---|---|---|---|
| మోక్షకాంక్షిభిః | = మోక్షాపేక్ష గల వారి చేత | వివిధాః | = వివిధములైన |
| తత్ ఇతి | = అది అని | యజ్ఞతపఃక్రియాః | = యజ్ఞతపః కర్మలు |
| ఫలం | = ఫలమును | దానక్రియాః చ | = దాన క్రియలును |
| అనభిసంధాయ | = అభిలషించక | క్రియంతే | = ఆచరింప బడుచున్నవి |

**అర్జునా! కోరికలకు దూరమైన ముముక్షువులు 'తత్' అనే పదాన్ని ఉచ్చరిస్తూ, కర్మఫలాన్ని ఆశించకుండా వివిధములైన యజ్ఞ, దాన, తపః క్రియలను ఆచరిస్తారు.**





**వ్యాఖ్య**

***తత్*** అనే సర్వనామ పదము బ్రహ్మ యొక్క నామము. 'తత్' అభిధానము. బ్రహ్మ అభిధేయము. 'తత్త్వమసి' మహావాక్యంలో 'తత్' పదము బ్రహ్మ నిర్దేశము. కనుక బ్రహ్మనామ మైన ***(బ్రహ్మాభిధానం)*** 'తత్' పదమును ఉచ్చరించి, కర్మఫలమును ఆశించకుండా ***( ఫలం అనభిసంధాయ )*** యజ్ఞక్రియలను, తపః క్రియలను, దానక్రియలను ముముక్షువులు అంతఃకరణ శుద్ధికై ఆచరిస్తూ ఉంటారు ***( క్రియన్తే మోక్ష కాంక్షిభిః ముముక్షుభిః ).***

'తత్' పదము ***ఓం తత్ సత్*** అనే బ్రహ్మ నిర్దేశమునకు ఉప లక్షణము. ***ఓం తత్ సత్*** అనే మూడు నామములు బ్రహ్మ నిర్దేశములు కావడం, బ్రహ్మ వాచకములైన ఈ మూడు నామములు వేదాదులకు కారణము కావడం, సృష్ట్యారంభమున బ్రహ్మదేవుడు ఈ మూడు బ్రహ్మ నామములను పలికి సృష్టి కార్యమును నిర్వర్తించడము వలన, పరమ పవిత్రమైన ఈ మూడు నామాలకు 'తత్' శబ్దము ఉపలక్షణం కావడం చేత యజ్ఞ, దాన, తపః కర్మలను ప్రారంభించు సమయము లోను, అలాగే వాటిని పరిసమాప్తం చేసే కాలం లోను 'తత్' శబ్దమును కామనా రహితులైన ముముక్షువులు అంతఃకరణ శుద్ధి కొరకు పలుకుతున్నారు. కనుక 'తత్' అను బ్రహ్మ నామము అతి ప్రశస్త మైనది. యజ్ఞాది క్రియల నిర్వహణములో ఏ విధమైన దోషము ఉండినా, లోపము చోటు చేసుకున్నా, ఏ విషయమై సంశయము కలిగినా, వెంటనే 'తత్' అనే బ్రహ్మ నామమును ఉచ్చరించుట చేత వైగుణ్యము పరిహరించ బడి సాద్గుణ్యము సాధించ బడుతుంది. ఉచ్చరించుట ***(ఉచ్చార్య)*** అనే విషయమునకు సమన్వయ నిమిత్తము పూర్వ శ్లోకము లోని ***ఉదాహృత్య*** అనే పదాన్ని గ్రహించి అన్వయించు కోవాలి.

*ఇక బ్రహ్మ నిర్దేశమైన 'ఓం తత్ సత్' లో మూడవ బ్రహ్మాభిధాన మైన 'సత్' ను వివరిస్తున్నాడు.*

**సద్భావే సాధుభావే చ స ది త్యేత త్ప్రయుజ్యతే ।**
**ప్రశస్తే కర్మణి తథా సచ్ఛబ్దః పార్థ యుజ్యతే ॥** 26

***సద్భావే-సాధుభావే-చ-సత్-ఇతి-ఏతత్-ప్రయుజ్యతే***
***ప్రశస్తే-కర్మణి-తథా-సత్-శబ్దః-పార్థ-యుజ్యతే***

| | | | |
|---|---|---|---|
| పార్థ | = అర్జునా! | తథా | = అటులనే |
| సద్భావే | = సత్తు యనెడి భావము నందు | ప్రశస్తే | = ప్రశస్తమైన |
| సాధుభావే చ | = మంచిది యనెడి భావము నందు | కర్మణి | = కర్మ మందును |
| సత్ ఇతి | = సత్ అనెడి | సత్ శబ్దః | = సత్ అను శబ్దము |
| ఏతత్ | = ఇది | యుజ్యతే | = వాడబడు చున్నది |
| ప్రయుజ్యతే | = వాడబడు చున్నది | | |

**అర్జునా! సద్భావము నందు, సాధు భావము నందు 'సత్' అనే పదము ప్రయోగింప బడుతుంది. అలాగే ఉత్తమ మైన కర్మలలో కూడా ప్రయోగింప బడుతుంది.**

**వ్యాఖ్య**

బ్రహ్మ నిర్దేశ వాచకమైన ***ఓం తత్ సత్*** నామము లోని 'ఓం', 'తత్' శబ్దాలను ఎలా వినియోగించుకోవాలో

తెలుప బడింది ***(ఓం తచ్ఛబ్దయోః వినియోగః ఉక్తః)***. ఇప్పుడు సచ్ఛబ్దం యొక్క వినియోగం చెప్పబడుతూ ఉంది ***(ఇదానీం సచ్ఛబ్దస్య వినియోగః ఉచ్యతే)***.

సచ్ఛబ్దము యొక్క ప్రాశస్త్యమును వరుసగా రెండు శ్లోకాలలో చెబుతున్నాడు. ***సత్*** అనేది బ్రహ్మ వాచకము. ఉనికిని తెలిపే శబ్దము. ***ఘటః సన్, పటః సన్, దేవదత్తః సన్*** - కుండ ఉంది, వస్త్రము ఉంది, దేవదత్తుడు ఉన్నాడు. ఈ ఉండటము అనేది 'సత్' శబ్దానికి సంబంధించింది. ఏదయితే ఉందో అది 'సత్' ***(యదస్తి తత్ సత్)***. ఆ 'సత్' పదము ఎప్పుడూ ఉంది. ఏది ఉండినా దానిలో 'సత్' ఉంది. ఏదీ లేనపుడు, సృష్ట్యారంభమున కూడా 'సత్' ఉంది. 'సత్' ఒక్కటే అద్వితీయంగా ఉంది.

***సదేవ సోమ్యేద మగ్ర ఆసీత్*** - నాయనా! ఈ సృష్టికి పూర్వము 'సత్' మాత్రమే ఉండింది అని ఛాందోగ్య శ్రుతి. ప్రస్తుత శ్లోకంలో ***సదిత్యేతత్*** అనే వాక్యాన్ని జాగ్రత్తగా పరిశీలించాలి. ***ఏతత్*** - అట్టిది, అంటే ***తదేతత్*** - అట్టి అది, ***సదితి*** - ఈ సత్‌గా ఉంది. సృష్టికి పూర్వము ఏది 'సత్' గా ఉండిందో, ఇప్పుడు ఏది ఉన్నా, అంటే లేకుండా ఉన్నది వచ్చినా ***(సద్భావే)***. లేక ఉన్నది బాగున్నది అని చెప్పవలసి వచ్చినా ***(సాధు భావే)***. 'సత్' అనేదే ప్రయోగింప బడుతూ ఉంది ***(ప్రయుజ్యతే)***.

లేనిది వచ్చి ఉండటము 'సద్భావము'. ఉన్నది బాగా ఉండటము 'సాధు భావము'. ఇది సుస్పష్టం కావాలి. సంతానము లేని వారికి పుత్రుడు జన్మించాడు. జన్మించిన పుత్రుడు ఉన్నాడు. పుట్టిన తరువాత ఉన్నవాడు, పుట్టక ముందు లేడు. లేని వాడు వచ్చి ఉన్నాడు. ఇది 'సద్భావం'. సత్ యొక్క ఉనికిని చాటుతూ ఉంది ***(సద్భావే అసతః సద్భావే)***.

ఒక అసాధువు ఉన్నాడు. అంటే, చెడు ప్రవర్తన కలిగిన వాడు. అలాంటి వాడు పరివర్తన చెంది మంచి వాడుగా మారి పోయాడు. సాధు వయ్యాడు. ఇది 'సాధుభావం' ***(అసద్వృత్తస్య అసాధోః సద్వృత్తతా సాధుభావః)***. అసాధువుగా ఉన్నప్పుడు ఉండట మనేది ఉంది. సాధువుగా మారిన తరువాత కూడా ఉండట మనేది ఉంది. ఇదే ***సదిత్యే తత్.***

'సద్భావము' నందు, 'సాధు భావము' నందు ఎలాగైతే సచ్ఛబ్ద ప్రయోగము జరుగుతూ ఉందో, అలాగే మంగళకరము లైన వివాహాది కర్మల యందు ***(ప్రశస్తే కర్మణి)*** కూడా సచ్ఛబ్దము ప్రయోగింప బడుతూ ఉంది. ఈ సచ్ఛబ్దము మన ప్రస్తుత విషయమైన యజ్ఞ, దాన, తపస్సులలో కూడా ప్రయోగింప బడుతూ ఉంది.

*ఈ విషయాన్ని తరువాత శ్లోకంలో విస్పష్టం చేస్తున్నాడు.*

**యజ్ఞే తపసి దానే చ స్థితిః సదితి చోచ్యతే ।**
**కర్మ చైవ తదర్థీయం సదిత్యే వాభిధీయతే ॥** 27

***యజ్ఞే-తపసి-దానే-చ-స్థితిః-సత్-ఇతి-చ-ఉచ్యతే***
***కర్మ-చ-ఏవ-తదర్థీయం-సత్-ఇతి-ఏవ-అభిధీయతే***

| | | | | | |
|---|---|---|---|---|---|
| యజ్ఞే | = | యజ్ఞము నందు | ఉచ్యతే | = | చెప్పబడు చున్నది |
| తపసి | = | తపస్సు నందు | తదర్థీయం | = | వాటి కొరకైన |
| దానే చ | = | దానము నందు | కర్మ ఏవ చ | = | కర్మయు |
| స్థితిః చ | = | ఉనికియు | సత్ ఇతి ఏవ | = | సత్ అనియే |
| సత్ ఇతి | = | సత్ అని | అభిధీయతే | = | చెప్పబడు చున్నది |



**అర్జునా! యజ్ఞ, దాన, తపస్సులకు సంబంధించిన నిష్ఠ కూడా 'సత్' అనే చెప్ప బడుతుంది. బ్రహ్మ సంబంధ మైన కర్మలు కూడా 'సత్' అనే చెప్ప బడుతున్నాయి.**

**వ్యాఖ్య**

పూర్వ శ్లోకంలో ఆరంభించిన సచ్ఛబ్ద వినియోగము ఈ శ్లోకంలో కూడా కొనసాగుతూ ఉంది. యజ్ఞ, దాన, తపస్సులలో ఏ నిష్ఠ ఉందో అది 'సత్' అని చెప్పబడుతూ ఉంది ***(యజ్ఞే తపసి దానే చ స్థితిః సత్ ఇతి ఉచ్యతే)***. ఇది శ్లోకము యొక్క పూర్వార్థము.

స్థితి అంటే అవస్థానము, నిలకడగా ఉండటము అని అర్థము. సందర్భమును బట్టి తత్పరత్వము అని కూడా చెప్పుకోవచ్చు. యజ్ఞకార్యముల యందు ***(యజ్ఞే యజ్ఞ కర్మణి)***, తపస్సు నందు ***(తపసి యా స్థితిః)***, దానము నందు ***(దానే చ యా స్థితిః)*** నిలకడగా ఉండటము అనేది 'సత్' శబ్దము చేత చెప్ప బడింది ***(సదితి ఉచ్యతే)***. అంటే, యజ్ఞ, దాన, తపస్సుల నిర్వహణము నందు దోషాదులు ప్రాప్తించి నపుడు, ఆ యజ్ఞ, దాన, తపస్సులకు సాద్గుణ్యమును సాధించ టానికి 'సత్' శబ్దమును ఉచ్చరిస్తారు. 'సత్' అనే అభిధానము పరమాత్మనే అభిధేయముగా, ఫలముగా కలిగి ఉంది.

యజ్ఞ, దాన, తపస్సుల కొరకు చేసే కర్మను కూడా 'సత్' అనే పిలుస్తున్నారు. కారణం? ఆ కర్మ లన్నీ పరమేశ్వరునే ఫలంగా ఉద్దేశించి అన్య ఫలాభి సంధి లేకుండా ఆచరింపబడే యజ్ఞ, దాన, తపస్సుల నిమిత్తమై ఉండటం చేత ***(కర్మ చ ఏవ తదర్థీయం సత్ ఇత్యేవ అభిధీయతే)***. ఇది శ్లోకము యొక్క ఉత్తరార్థము.

యజ్ఞ నిర్వహణము నందు ఆచరింపబడే సర్వ కర్మలు 'సత్' అనే పిలువ బడతాయి. శ్రీధరస్వామి రచించిన సుబోధినీ టీకలో ఆకర్షణీయంగా, అలంకార ప్రియంగా ఒక వాక్యాన్ని ఉపయోగించడం జరిగింది.

***పూజోపహార గృహాంగణ పరిమార్జనోపలేపన రంగమాలికాది క్రియలు*** సిద్ధించడానికి బ్రహ్మ వాచకము లైన ***ఓం తత్ సత్*** అనే నామములను ఉచ్చరించాలి. ఇవన్నీ పరమాత్మ నిమిత్తము ఆచరింపబడే కర్మలు కనుక, పరమేశ్వరునే ఫలంగా ఉద్దేశించి చేయబడుతూ ఉన్నాయి కనుక 'సత్' శబ్దము చేత చెప్ప బడ్డాయి అంటారు. ఇంతకీ ఆ దీర్ఘ సమాస మేమిటో అది కూడా చెప్పుకుందాము.

యజ్ఞాది పూజా కార్యాలకు ఉపహారంగా ***గృహాంగణ పరిమార్జనము*** (యాగశాలను చిమ్మడము, నీళ్ళు చల్లడము), ***ఉపలేపనము*** (అలకడము), ***రంగమాలికాది క్రియలు*** (ముగ్గులు పెట్టడము, మాలికలు అల్లి అలంకరించడము) - ఇవన్నీ చేయడము కూడా 'సత్' అనే చెప్ప బడింది అన్నారు. అంటే, అన్నీ ఈశ్వరార్థం నిర్వహించే క్రియలు కావడం చేత, అవి కూడా ఈశ్వర స్వరూపమే అని భావము. కనుక, ఈశ్వర సంబంధమైన కార్యాల ఆద్యంతముల యందును 'సత్' శబ్దమును ఉచ్చరించడము మంగళకరము. మధ్యలో దోషా లున్నట్లు సంశయం కలిగితే 'సత్' శబ్దోచ్చారణం వల్ల దోషాలు పరిహరింప బడతాయి.

**తచ్ఛబ్దానాం సన్నిధే ర్బ్రహ్మ ప్రీతే స్తద్రూపత్వా జ్జనితం బ్రహ్మ తస్య ।**

బ్రహ్మవాచక శబ్దము చేత యజ్ఞాదుల యందు సన్నిధి ప్రాప్తించడము వలన ***(తచ్ఛబ్దానాం సన్నిధేః)***. బ్రహ్మప్రీతి కలగటం కారణంగా ***(బ్రహ్మ ప్రీతేః)***. వారు బ్రహ్మ స్వరూపులే కావడం చేత ***(తద్రూపత్వాత్)*** వారికి బ్రహ్మత్వము నిష్పన్న మవుతూ ఉంది; సిద్ధిస్తూ ఉంది ***(జనితం బ్రహ్మ తస్య)*** అని శ్రీ హనుమద్భాష్యము.

*చివరగా, యజ్ఞాదు లన్నిటి లోను ప్రధాన మైనది శ్రద్ధే అనే విషయాన్ని ధ్రువ పరుస్తూ శ్రద్ధాత్రయ విభాగ యోగాన్ని సమాప్తం చేస్తున్నాడు.*

అశ్రద్ధయా హుతం దత్తం తప స్తప్తం కృతం చ యత్।
అస దిత్యుచ్యతే పార్థ న చ త త్ప్రేత్య నో ఇహ ॥ 28

*అశ్రద్ధయా-హుతం-దత్తం-తపః-తప్తం-కృతం-చ-యత్*
*అసత్-ఇతి-ఉచ్యతే-పార్థ-న-చ-తత్-ప్రేత్య-నో-ఇహ*

| | | | | | |
|---|---|---|---|---|---|
| పార్థ | = | అర్జునా! | తత్ | = | అది |
| అశ్రద్ధయా | = | శ్రద్ధ లేకుండా | అసత్ ఇతి | = | అసత్తు అని |
| హుతం | = | చేయబడిన హోమము | ఉచ్యతే | = | చెప్పబడు చున్నది |
| దత్తం | = | ఇవ్వబడిన దానము | ప్రేత్య | = | పరలోకము నందు |
| తప్తం | = | చేయబడిన | నో | = | ఫలము నివ్వదు |
| తపః | = | తపస్సును | ఇహ చ | = | ఈ లోకము నందు |
| కృతం చ | = | చేయబడిన | న | = | ఫలితము నివ్వదు |
| యత్ | = | ఏది కలదో | | | |

**అర్జునా! శ్రద్ధ లేకుండా చేసే యజ్ఞ, దాన, తపస్సులు 'అసత్' అనే చెప్ప బడుతాయి. అది ఇహానికి ఉపయోగ పడదు. పరానికి పనికి రాదు.**

### వ్యాఖ్య

యజ్ఞ, దాన, తపస్సులు; స్తుతి, నమస్కారాది కార్యాలు శ్రద్ధాన్వితాలు కనుక వాటిలో ఉన్నది 'సత్' అని గ్రహించాము. శ్రద్ధతో చేసే వన్నీ సద్రూపా లైనపుడు, అశ్రద్ధతో చేసి నపుడు, అవే అసద్రూపాలు అవుతాయి. చివరగా, ఈ శ్లోకంలో పరమేశ్వరుడు అదే చెబుతున్నాడు. అశ్రద్ధతో చేసే యజ్ఞ, దాన, తపస్సులు, స్తుతి నమస్కారాదులు 'అసత్' అని చెప్ప బడతాయి ***(అశ్రద్ధయా కృతమ్ అసత్ ఇతి ఉచ్యతే)***.

'సత్' సన్నిధిలో సాగే వన్నీ సత్కర్మలు. అసద్రూప మైనవి అసత్కర్మలు. సత్కర్మలు మంగళకరము. అసత్కర్మలు అమంగళకరము. సత్కర్మలు మోక్ష ప్రదములు. అసత్కర్మలు బంధహేతువులు. కారణం, అసత్కర్మలు పరమేశ్వరుని పొందడానికి సాధన మార్గాలు కావు. వాటిని శ్రమించి చేసినా ఫలితం ఉండదు. పరమేశ్వరుని మార్గానికి భిన్న మైనవి కనుక మరణానంతరము ఫలం ఉండదు. సాధు పురుషుల చేత నిందింప బడినవి కనుక ఇహ లోకానికి కూడా ఉపకరించవు ***(తత్ ప్రేత్య న, ఇహ చ న)***.

శ్రద్ధను ప్రస్తావిస్తూ అధ్యాయారంభంలో అర్జునుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా తన బోధను అధ్యాయం నిండా నింపి, రజ స్తమస్సులను, అశ్రద్ధను పరిత్యజించి, సాత్త్విక శ్రద్ధతో యజ్ఞ, దాన, తపస్సు లను ఆచరించే వాడు అంతఃకరణ శుద్ధిని పొంది మోక్ష సాధనమైన జ్ఞాననిష్ఠకు అర్హు డవుతాడు అని చెబుతూ శ్రద్ధాత్రయ విభాగ యోగాన్ని భగవానుడు సమాప్తం చేస్తున్నాడు.

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే శ్రద్ధాత్రయ విభాగయోగో నామ సప్తదశోఽధ్యాయః

**ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు శ్రద్ధాత్రయ విభాగ యోగ మనే పదిహేడవ అధ్యాయము.**



# చైతన్య భగవద్గీత

## అథ అష్టాదశోఽధ్యాయః - పద్దెనిమిదవ అధ్యాయము

## మోక్షసన్న్యాస యోగః - మోక్షసన్న్యాస యోగము

**మహద్భాగ్యం**

గీతా భవనంలో చివరి అంతస్థుకు చేరాము. ఇది పద్దెనిమిదవ అధ్యాయము. సంత్ జ్ఞానదేవ్ మాటల్లో చెప్పాలి అంటే కలశాధ్యాయము. అంటే శిఖరాధ్యాయము అని అర్థము.

గీతా జ్ఞానగంగా ప్రవాహం ఒంపు సొంపులను ఒలక బోస్తూ, పదిలంగా ఒక చోట, పరవళ్ళు త్రొక్కుతూ మరొక చోట, దూసుకుంటూ, తోసుకుంటూ ఇంకొక చోట, అలా అలా అలలతో తేలుతూ తూలుతూ సాగి, సాగరంలో ప్రవేశించే చోట నది విశాలంగా కనిపించి నట్లు, అనంత జ్ఞానామృత సాగరంలో ప్రవేశించే ఈ సంగమ స్థానం వద్ద, గీతా జ్ఞానగంగా స్రోతస్విని డెబ్బై ఎనిమిది శ్లోకాలతో నిండిన విశాలమైన మోక్ష సన్యాస యోగంగా దర్శన మిస్తూ ఉంది.

గీతా జ్ఞాన జల ప్రవాహంలో మునుగుతూ తేలుతూ, శుద్ధి పడుతూ, ముక్తికి సిద్ధ పడుతూ, మనం కూడా ఈ మహా ప్రవాహంతో కలిసి పయనించాం. అనంతానంద పయోధిని దర్శించేందుకు, తరించేందుకు, తద్రూప మయ్యేందుకు పరవశించి పరవళ్ళు త్రొక్కుతున్నాం.

గీతా జ్ఞాన జలాలు ప్రసన్న గంభీరమై, ఎంతో అగాధమై ప్రవహిస్తున్నా, ఆ పవిత్ర జలాలలో ప్రవేశించిన వాడు మునిగి పోయిన దాఖలాలు లేవు. ఈత రాని వాడు కూడా మునగకుండా తేలియాడే పవిత్ర అగాధ ప్రవాహాలు గీతా జ్ఞాన జలాలు.


ఏనాడు ఏ పుణ్యం చేసుకున్నామో! గీతా జ్ఞాన గంగలో మునక వేశాం. ఏయే జన్మలలో ఏయే సుకృతాలు దాచ బడ్డాయో! వాటన్నిటి ఫలితంగా గీతా గంగోదకాన్ని తృప్తి తీరా పానం చేశాం. బాహ్యాభ్యంతరాలలో జ్ఞాన జలంతో దివ్యానందాన్ని అనుభవించాం.

ప్రయాణం చివరి దశకు చేరింది. దశలు తెలియని, దిశలు అర్థం గాని మహర్దశ వైపు ప్రయాణం సాగి పోతోంది. ఇది తిరిగి రాని పోక. ఆగదు ఈ ప్రయాణం దివ్యానంద మహాసాగరంలో ప్రవేశించే దాక.

విశ్వానికి వీడుకోలు పలికే సమయ మిది. జన్మలకు చెల్లు చీటి వ్రాసే కాల మిది. గీతా జ్ఞాన జలాలను పానం చేసిన తరువాత ఇంకెక్కడి జన్మలు? ఎక్కడున్నాయి కర్మలు? ***గీతా గంగోదకం పీత్వా పునర్జన్మ న విద్యతే*** - గీతా జ్ఞాన గంగాజలాన్ని పానం చేసిన తరువాత జన్మలు ఉండవు. కర్మలు మిగలవు. ఈ భాగ్యానికి అందరమూ నోచుకున్నాం. గీతామాత బిడ్డల మైనందుకు తల వంచి తల్లికి నమస్కరిస్తూ, తల్లి ఒడిలో కఁతేరి పోతున్నాం.

**అధ్యాయ అభిధాన ప్రసక్తి**

ఇది పద్దెనిమిదవ అధ్యాయము. మోక్ష సన్యాస యోగము. ఇంతవరకు కర్మఫలాలను విడిచి పెట్టడం చూశాం. సర్వ కర్మలను విడిచి పెట్టడం చూశాం. సర్వ ధర్మాలను విడిచి పెట్టడానికి సిద్ధ పడుతున్న దశలో ఇక విడిచిపెట్ట వలసింది, సన్యసించ వలసింది మోక్షమునే అనే విప్లవాత్మక నినాదంతో ఈ అధ్యాయం మన





శ్లో॥ యః శృణోతి చ గీతార్థం
కీర్తయత్యేవ యః పరమ్ ।
శ్రావయేచ్చ పరార్థం వై
స ప్రయాతి పరం పదమ్ ॥

గీతార్థమును శ్రవణం చేసేవాడు, గీతా జ్ఞానమును ప్రవచించేవాడు,
గీతా హృదయాన్ని విప్పి చెప్పేవాడు పరంధామమును పొందుతాడు.



చైతన్య భగవద్గీత

# చైతన్య భగవద్గీత



స్వామి సుందర చైతన్యానంద



శ్లో॥ భారతామృత సర్వస్వమ్
విష్ణో ర్వక్త్రా ద్వినిస్సృతమ్ ।
గీతా గంగోదకం పీత్వా
పునర్జన్మ న విద్యతే ॥

విష్ణు దేవుని ముఖ కమలము నుండి వెలువడిన శ్రీమద్భగవద్గీత
మహా భారతము యొక్క అమృత మయమైన సర్వస్వము.
గీతా గంగోదకాన్ని పానం చేసిన వారికి పునర్జన్మ ఉండదు.



అశ్రద్ధయా హుతం దత్తం తప స్తప్తం కృతం చ యత్ ।
అస ది త్యుచ్యతే పార్థ న చ త త్ప్రేత్య నో ఇహ ॥ 28

*అశ్రద్ధయా-హుతం-దత్తం-తపః-తప్తం-కృతం-చ-యత్*
*అసత్-ఇతి-ఉచ్యతే-పార్థ-న-చ-తత్-ప్రేత్య-నో-ఇహ*

| | | |
|---|---|---|
| పార్థ | = | అర్జునా! |
| అశ్రద్ధయా | = | శ్రద్ధ లేకుండా |
| హుతం | = | చేయబడిన హోమము |
| దత్తం | = | ఇవ్వబడిన దానము |
| తప్తం | = | చేయబడిన |
| తపః | = | తపస్సును |
| కృతం చ | = | చేయబడిన |
| యత్ | = | ఏది కలదో |
| తత్ | = | అది |
| అసత్ ఇతి | = | అసత్తు అని |
| ఉచ్యతే | = | చెప్పబడు చున్నది |
| ప్రేత్య | = | పరలోకము నందు |
| నో | = | ఫలము నివ్వదు |
| ఇహ చ | = | ఈ లోకము నందు |
| న | = | ఫలితము నివ్వదు |

**అర్జునా! శ్రద్ధ లేకుండా చేసే యజ్ఞ, దాన, తపస్సులు 'అసత్' అనే చెప్ప బడుతాయి. అది ఇహానికి ఉపయోగ పడదు. పరానికి పనికి రాదు.**

### వ్యాఖ్య

యజ్ఞ, దాన, తపస్సులు; స్తుతి, నమస్కారాది కార్యాలు శ్రద్ధాన్వితాలు కనుక వాటిలో ఉన్నది 'సత్' అని గ్రహించాము. శ్రద్ధతో చేసే వన్నీ సద్రూపా లైనపుడు, అశ్రద్ధతో చేసి నపుడు, అవే అసద్రూపాలు అవుతాయి. చివరగా, ఈ శ్లోకంలో పరమేశ్వరుడు అదే చెబుతున్నాడు. అశ్రద్ధతో చేసే యజ్ఞ, దాన, తపస్సులు, స్తుతి నమస్కారాదులు 'అసత్' అని చెప్ప బడతాయి (*అశ్రద్ధయా కృతమ్ అసత్ ఇతి ఉచ్యతే*).

'సత్' సన్నిధిలో సాగే వన్నీ సత్కర్మలు. అసద్రూప మైనవి అసత్కర్మలు. సత్కర్మలు మంగళకరము. అసత్కర్మలు అమంగళకరము. సత్కర్మలు మోక్ష ప్రదములు. అసత్కర్మలు బంధహేతువులు. కారణం, అసత్కర్మలు పరమేశ్వరుని పొందడానికి సాధన మార్గాలు కావు. వాటిని శ్రమించి చేసినా ఫలితం ఉండదు. పరమేశ్వరుని మార్గానికి భిన్న మైనవి కనుక మరణానంతరము ఫలం ఉండదు. సాధు పురుషుల చేత నిందింప బడినవి కనుక ఇహ లోకానికి కూడా ఉపకరించవు (*తత్ ప్రేత్య న, ఇహ చ న*).

శ్రద్ధను ప్రస్తావిస్తూ అధ్యాయారంభంలో అర్జునుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా తన బోధను అధ్యాయం నిండా నింపి, రజ స్తమస్సులను, అశ్రద్ధను పరిత్యజించి, సాత్త్విక శ్రద్ధతో యజ్ఞ, దాన, తపస్సు లను ఆచరించే వాడు అంతఃకరణ శుద్ధిని పొంది మోక్ష సాధనమైన జ్ఞాననిష్ఠకు అర్హు డవుతాడు అని చెబుతూ శ్రద్ధాత్రయ విభాగ యోగాన్ని భగవానుడు సమాప్తం చేస్తున్నాడు.

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే శ్రద్ధాత్రయ విభాగయోగో నామ సప్తదశోఽధ్యాయః

**ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు శ్రద్ధాత్రయ విభాగ యోగ మనే పదిహేడవ అధ్యాయము.**



# చైతన్య భగవద్గీత

## అథ అష్టాదశోఽధ్యాయః - పద్దెనిమిదవ అధ్యాయము

## మోక్షసన్న్యాస యోగః - మోక్షసన్న్యాస యోగము

### మహద్భాగ్యం

గీతా భవనంలో చివరి అంతస్థుకు చేరాము. ఇది పద్దెనిమిదవ అధ్యాయము. సంత్ జ్ఞానదేవ్ మాటల్లో చెప్పాలి అంటే కలశాధ్యాయము. అంటే శిఖరాధ్యాయము అని అర్థము.

గీతా జ్ఞానగంగా ప్రవాహం ఒంపు సొంపులను ఒలక బోస్తూ, పదిలంగా ఒక చోట, పరవళ్ళు త్రొక్కుతూ మరొక చోట, దూసుకుంటూ, తోసుకుంటూ ఇంకొక చోట, అలా అలా అలలతో తేలుతూ తూలుతూ సాగి, సాగరంలో ప్రవేశించే చోట నది విశాలంగా కనిపించి నట్లు, అనంత జ్ఞానామృత సాగరంలో ప్రవేశించే ఈ సంగమ స్థానం వద్ద, గీతా జ్ఞానగంగా స్రోతస్విని డెబ్బై ఎనిమిది శ్లోకాలతో నిండిన విశాలమైన మోక్ష సన్యాస యోగంగా దర్శన మిస్తూ ఉంది.

గీతా జ్ఞాన జల ప్రవాహంలో మునుగుతూ తేలుతూ, శుద్ధి పడుతూ, ముక్తికి సిద్ధ పడుతూ, మనం కూడా ఈ మహా ప్రవాహంతో కలిసి పయనించాం. అనంతానంద పయోధిని దర్శించేందుకు, తరించేందుకు, తద్రూప మయ్యేందుకు పరవశించి పరవళ్ళు త్రొక్కుతున్నాం.

గీతా జ్ఞాన జలాలు ప్రసన్న గంభీరమై, ఎంతో అగాధమై ప్రవహిస్తున్నా, ఆ పవిత్ర జలాలలో ప్రవేశించిన వాడు మునిగి పోయిన దాఖలాలు లేవు. ఈత రాని వాడు కూడా మునగకుండా తేలియాడే పవిత్ర అగాధ ప్రవాహాలు గీతా జ్ఞాన జలాలు.

ఏనాడు ఏ పుణ్యం చేసుకున్నామో! గీతా జ్ఞాన గంగలో మునక వేశాం. ఏయే జన్మలలో ఏయే సుకృతాలు దాచ బడ్డాయో! వాటన్నిటి ఫలితంగా గీతా గంగోదకాన్ని తృప్తి తీరా పానం చేశాం. బాహ్యాభ్యంతరాలలో జ్ఞాన జలంతో దివ్యానందాన్ని అనుభవించాం.

ప్రయాణం చివరి దశకు చేరింది. దశలు తెలియని, దిశలు అర్థం గాని మహర్దశ వైపు ప్రయాణం సాగి పోతోంది. ఇది తిరిగి రాని పోక. ఆగదు ఈ ప్రయాణం దివ్యానంద మహాసాగరంలో ప్రవేశించే దాక.

విశ్వానికి వీడుకోలు పలికే సమయ మిది. జన్మలకు చెల్లు చీటి వ్రాసే కాల మిది. గీతా జ్ఞాన జలాలను పానం చేసిన తరువాత ఇంకెక్కడి జన్మలు? ఎక్కడున్నాయి కర్మలు? *గీతా గంగోదకం పీత్వా పునర్జన్మ న విద్యతే* - గీతా జ్ఞాన గంగాజలాన్ని పానం చేసిన తరువాత జన్మలు ఉండవు. కర్మలు మిగలవు. ఈ భాగ్యానికి అందరమూ నోచుకున్నాం. గీతామాత బిడ్డల మైనందుకు తల వంచి తల్లికి నమస్కరిస్తూ, తల్లి ఒడిలో కడతేరి పోతున్నాం.

### అధ్యాయ అభిధాన ప్రసక్తి

ఇది పద్దెనిమిదవ అధ్యాయము. మోక్ష సన్యాస యోగము. ఇంతవరకు కర్మఫలాలను విడిచి పెట్టడం చూశాం. సర్వ కర్మలను విడిచి పెట్టడం చూశాం. సర్వ ధర్మాలను విడిచి పెట్టడానికి సిద్ధ పడుతున్న దశలో ఇక విడిచిపెట్ట వలసింది, సన్యసించ వలసింది మోక్షమునే అనే విప్లవాత్మక నినాదంతో ఈ అధ్యాయం మన

ముందు కొచ్చింది. మోక్షాన్ని కూడా విడిచి పెట్టేస్తే, ఇక ఆ తరువాత విడిచి పెట్టే దుండదు. పట్టు కొనేదీ ఉండదు. అందుకే ఇది మోక్ష సన్యాస యోగ మైంది.

అదేమిటి? మోక్షాన్ని ఆశించి కదా భగవద్గీతను ఆశ్రయించాం! మోక్షప్రాప్తి కొరకు కదా గీతను అధ్యయనం చేస్తున్నాం! మరి మోక్షాన్ని సన్యసించడం అంటే మోక్షాన్ని చక్కగా విడిచి పెట్టేయడమే కదా! దానికి భగవద్గీత ఎందుకు? గీత నాశ్రయించక ముందు అందరం చేసింది అదే కదా! అనే సంశయం మీకు కలగ వచ్చు. కలగాలనే అలా అన్నాను. నేను అనడం కాదు. ఆ భావం తోనే ఆదిదేవుడు ఉన్నాడు. ఆ భావాన్నే ఆచార్యదేవుడు భాష్యంలో వినిపించాడు.

మోక్ష మనేది ప్రాప్తించే ఉందా? లేక, ప్రాప్తించ బోతోందా? ప్రాప్తించ బోతోంది అంటే మాత్రం అది మోక్షం కాదు. ఎందుకని? ప్రాప్తించ బోతూ ఉంది కనుక. ఏదైతే ప్రాప్తించ బోతూ ఉందో అది ప్రస్తుతం లేనిది. ఇప్పుడు లేనిది మరు క్షణంలో ప్రాప్తిస్తుంది అంటే, ఆ ప్రాప్తించేది ఏదైనా కాలగత మైనది. పరిచ్ఛిన్నంగా ఉన్నది. కాలగత పరిచ్ఛేదానికి సంబంధించింది ఏదీ మోక్షం అయ్యే అవకాశం లేదు. ఎందుకని? కాలగత మైనది నశించి పోతుంది కనుక. మోక్షం కూడా కాలంలో ప్రాప్తించే దైతే మోక్షము కూడా కాలంలో నశించి పోతుంది. నశించేది మోక్ష మెలా అవుతుంది? అదలా ఉంచండి. ఇంతకీ మీరు కోరేది అలా నశించే ముక్తి నేనా?

కాదు. కానే కాదు. మీకు నిత్య ముక్తి కావాలి. నిత్య మోక్షం కావాలి. ఏ ఉపద్రవాలు తెలియని స్థితికి మీరు చేరి పోవాలి. అదే నిత్యమోక్షము. మరి అలాంటిది కాలంలో ఎలా సంప్రాప్త మవుతుంది? నిత్యమై ఉండేదే నిత్యమోక్షము. నిత్యమై ఉండేది ఇప్పుడు కూడా ఉన్నట్లే కదా! మరి ఉన్న దానిని పొందాలనే ఉబలాటం ఏమిటి? ఇదీ సమస్య.

మోక్షం ఉన్నదే. కాని, ఉన్నట్లు తెలియకుండా ఉంది. ఉన్నా, లేనట్లే అనిపిస్తూ ఉంది. బావుంది. ఇప్పుడు చెప్పండి! మనకు కావలసింది మోక్షమా? మోక్షము ఉన్నదే అని తెలియ చేసే జ్ఞానమా? ఆలోచించండి.

లేని దైతే శ్రమించి కర్మ ద్వారా పొంద వచ్చు. ఉన్న దానిని ప్రయత్నించి పొందే దేముంటుంది? ఉన్నది అని తెలిస్తే సరి పోతుంది. అలా తెలియడమే జ్ఞానము. ఈ పని జ్ఞానం ఒక్కటే చేయ గలదు. మరొక సాధనకు ఇది సాధ్యం కాదు. కనుక మోక్షానికి జ్ఞానమే ఏకైక సాధనము ***(బోధః సాక్షాత్ మోక్షైక సాధనమ్)***.

**బంధమోక్షాలు**

మోక్షము అంటే ముక్తి కదా! దేని నుండి ముక్తి? బంధము నుండి. బంధ మేమిటి? దుఃఖాన్ని కలిగించేది ఏదైనా బంధమే. మరి, ముక్తి? బంధము నుండి విడి పడటమే ముక్తి. మళ్ళీ చిక్కుముడి పడింది.

బంధం ఉంది అంటే మోక్షం లేదు. పరస్పర విరుద్ధమైన బంధమోక్షాలు కలిసి ఎలా ఉంటాయి? చీకటి వెలుగులు ఒకే కాలంలో, ఒకే దేశంలో ఉన్నాయని చెప్పడం ఎంత విడ్డూరమో, బంధమోక్షాలు కలిసి ఉంటాయి అనుకోవడం కూడా అంతే విడ్డూరము.

అలాంటప్పుడు మనం ఎక్కడున్నాం? బంధంలో ఉన్నామా? నిత్యమోక్షంలో ఉన్నామా? ఇది సూటి ప్రశ్న.

మనం మోక్షరూపులు గానే ఉన్నాం. అలా కాదు అనుకుంటే మాత్రం మోక్షాన్ని మనం మరచి పోవచ్చు. ఇక బంధ మేమిటి అంటారా? లేనిదే బంధము. లేకనే ఉన్నట్లు కనిపించేది బంధము. కనుక, బంధము అనేది కల్పితము.



ఉన్న దాని యందు లేని దానిని కల్పించడమే బంధము. నేను కాని దాని యందు నేను అనే భావనే బంధము ***(అనాత్మని అహ మితి మతిః బంధః)***. నేను కాని దాని యందు నేను అనే భావన ఎందుకు కలిగింది? అజ్ఞానం వల్ల కలిగింది ***(అజ్ఞానాత్ ప్రాప్తః)***. ఉన్నది ఉన్నట్లు తెలియక పోవడం అజ్ఞానము. అంటే, ఉన్న దానికి సంబంధించిన జ్ఞానము లేక పోవడము అజ్ఞానము.

ఉన్నది ఉన్నట్లు తెలియ నపుడు లేనిది ఉన్నట్లు గోచరించే ప్రమాదం ఉంది. త్రాడు త్రాడుగా తెలియ నపుడు త్రాడులో పాము కనిపించి భయశోకాదులను కలిగించే అవకాశం ఉంది. ఉన్న దానికి సంబంధించిన జ్ఞానం లేనపుడు ఉన్నది ఉన్నట్లు తెలియక పోవడం అజ్ఞాన మైతే, ఉన్న దానిలో లేని దానిని ఆరోపించి చూడటం అధ్యాస అవుతుంది.

***అధ్యాసో నామ అతస్మిన్ తద్బుద్ధిః*** - అది కాని దాని యందు అది అనే బుద్ధి అధ్యాస అని శ్రీ శంకరుల బ్రహ్మసూత్ర భాష్యము.

ఇక్కడే కాస్త జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఉన్నది ఉన్నట్లు తెలియక పోవడము అగ్రహణము, లేదా అజ్ఞానము. లేనిది ఉన్నట్లు గోచరించడము అన్యథా గ్రహణము, లేదా అధ్యాస. అధ్యాస వల్లనే భయశోకాదులు.

ఇప్పుడు మనకు ఏమి కావాలి? భయశోకాదులు తొలగాలి. దానికి మనం ఏమి చెయ్యాలి? కారణమును తెలుసుకొని దానిని తొలగించుకుంటే కార్యాలైన భయశోకాదులు పోతాయి. బావుంది. ఇంతకీ తొలగ వలసింది అధ్యాసయా? లేక అజ్ఞానమా?

మనకు భయశోకాదులు అధ్యాస వల్ల కలుగు తున్నాయని స్పష్టంగా తెలుస్తూ ఉంది. త్రాడు తెలియక పోవడం అనే అజ్ఞానం వల్ల మనకు భయశోకాలు కలగ లేదు. ఉన్న త్రాటిలో లేని పామును చూడట మనే అధ్యాస వల్లనే మనకు భయశోకాదులు కలిగాయి. అవి పోవాలి అంటే అధ్యాస పోవాలి అనుకుంటాం. అందరూ అలాగే అనుకుంటారు. ఏది పోవాలి, ఏది పోతుంది, ఎలా పోతుంది? - అదంతా ముమ్ముందు తెలుసు కుంటాము. కాని, ఏది పోయినా, ఎలా పోయినా, పోగొట్టే శక్తి మాత్రం ప్రమాణానికే ఉంది. ఒక్క వేదాంత శాస్త్రానికే ఉంది. అలాంటి శాస్త్ర ప్రమాణము అధ్యాసను నివారించే కార్యంలో లేదు. ఇది స్పష్టంగా అర్థం కావాలి అని పదే పదే చెబుతున్నాను ***(అధ్యాస నివారణార్థం న శాస్త్ర పఠనం)***. ఎందుకని? వినండి చెబుతా.

అధ్యాసను తొలగించడము అంటే, నాయనా! అది పాము కాదు అని బోధ చేయడం. పాము అనే భావనను తొలగించడం చేత పాము ఉందనే భ్రాంతి వల్ల ఏర్పడిన భయ శోకాదులు నివర్తింప బడతాయి. అంత మాత్రాన అతని సమస్య తీరిందని చెప్ప లేము.

పాము కాదని అతడు అంగీకరించ వచ్చు. ఆ తరువాత, దానిని నీటిధారగా భావించ వచ్చు. గుడ్డ పీలికగా భావించ వచ్చు. భూమి పగులుగా భావించ వచ్చు. మరో విధంగా కూడా భావించ వచ్చు. అర్థమైందా! కారణాన్ని తొలగించకుండా అవాంతరాలను, ఆరోపితాలను తొలగించి సాధించే దేమీ ఉండదు. కనుక, అధ్యాసను నివారించడం కొరకు శాస్త్రం లేదు. మరి, శాస్త్రం ఎలా ప్రమాణము? ఈ క్రింది వాక్యాన్ని జాగ్రత్తగా అవలోకించండి.

### అధ్యాస నివారణార్థం న శాస్త్ర పఠనం; వస్తు నిర్ధారణార్థం శాస్త్ర పఠనం

'ఆరోపితాన్ని తొలగించేందుకు శాస్త్రం లేదు; అజ్ఞానాన్ని నివారించేందుకు శాస్త్రం ఉంది'. అజ్ఞానము నివారింప బడాలి అంటే జ్ఞానం కలగాలి. దేనికి సంబంధించిన జ్ఞానం? ఉన్న దానికి సంబంధించిన జ్ఞానము.

ఉన్నది త్రాడు. ఇది త్రాడు అనే జ్ఞానం కలిగితే, త్రాడుకు సంబంధించిన అజ్ఞానము నశిస్తుంది. అజ్ఞానము నశించ గానే, అజ్ఞానము వలన ఏర్పడిన అధ్యాస కూడా అదృశ్య మవుతుంది. ఈ విధంగా శాస్త్రము ప్రమాణమై మన ప్రధాన సమస్యను పరిష్కరిస్తూ ఉంది.

బంధము కల్పితము అయితే, బంధము నుండి విడి పడటము కూడా కల్పితమే కదా! బంధము లేని దైనపుడు, లేని దాని నుండి మోక్షాన్ని పొందడ మేమిటి? ఇదే బంధ విముక్తి. బంధ విముక్తి అంటే బంధము నుండి విడి పడటము కాదు. బంధమే లేదని తెలుసు కోవడము. ముక్తి అనేది ప్రత్యేకంగా పొందేది కాదు. నేను నిత్య ముక్తుడను అయ్యే ఉన్నాను అని అర్థం చేసుకోవడం. ఈ విధమైన జ్ఞానంతో పారమార్థిక దృష్టి ఏర్పడితే, ఆ తరువాత బంధము లేదు. ముక్తీ లేదు. బంధము ఉంటేనే ముక్తి. బంధము లేని నీకు ముక్తి ఎలా వస్తుంది? మోక్ష మెలా వస్తుంది? నీవు నిత్యముక్తుడవు. బంధముక్తులకు అతీతుడవు. కనుక నువ్వు ముముక్షువూ కాదు; మోక్షాన్వేషణ లోనూ లేవు.

నువ్వు ముముక్షువు అయితేనే మోక్షాన్ని కోరుతావు. మోక్షాన్ని ఎందుకు కాంక్షిస్తున్నావో తెలుసా? నిన్ను నీవు బద్ధుడిగా భావించు కుంటున్నావు కనుక. నిజంగా నీకు బంధ ముందా? లేదని ఇప్పుడే కదా అర్థం చేసుకున్నాము! మరి, బంధం లేనపుడు ముక్తి మాత్రం ఎలా ఉంటుంది? కనుక నీకు బంధమూ లేదు, ముక్తీ లేదు. బంధముక్తులు రెండిటికీ నీవు అతీతమైన వాడివి.

*బంధ ముక్త్యతీతం పరం సుఖం ,*
*విందతీహ జీవస్తు కేవలః ॥*

'బంధముక్తులకు అతీత మైనది, అనంత మైనది, ఆనంద స్వరూప మైనది అయిన అఖండాత్మను, ఇక్కడే ఇప్పుడే అది కూడా తన స్వరూపము గానే జ్ఞాని తెలుసు కుంటాడు' అని రమణమహర్షి ఉపదేశ సారము.

*న నిరోధో న చోత్పత్తిః న బద్ధో న చ సాధకః ,*
*న ముముక్షుః న వై ముక్తః ఇత్యేషా పరమార్థతా ॥*

నిరోధము లేదు, ఉత్పత్తి లేదు; బద్ధుడు లేడు, సాధకుడు లేడు; ముముక్షువు లేడు, ముక్తుడు లేడు - ఇదియే పరమార్థ తత్త్వము అన్నది అమృతబిందూపనిషత్తు. ఈ ఉపనిషత్తు మంత్రాన్ని శ్రీ శంకరుల పరమ గురువులైన శ్రీ గౌడపాదాచార్యులు తమ మాండూక్య కారికా భాష్యంలో వ్రాశారు. ఈ మంత్రము గౌడపాదుల కారిక గానే ఎక్కువ ప్రాచుర్యాన్ని పొందింది.

నీవు మోక్ష రూపుడవు. సత్య జ్ఞానానంద స్వరూపుడవు. నిత్య ముక్తుడవు. బంధము లేని వాడివి. బంధమే తెలియని వాడివి. ఎప్పుడూ బద్ధుడవు కావు. ఇప్పుడూ బద్ధుడవు కావు. మరి బంధ మెందు కొచ్చింది?

మం॥ మోక్షాపేక్షా సంకల్పో బంధః

నాకు మోక్షము కావాలి అనే ఆలోచనే బంధము అన్నది నిరాలంబోపనిషత్తు. ముక్తుడవే అయి ఉన్న నీకు బంధ మెలా వస్తుంది? ఎలా ఉంటుంది? ఉంది అనుకుంటే ఉంటుంది. లేదు అనుకుంటే? లేకుండా పోతుంది.

బంధము ఎప్పుడైతే లేదో మోక్షము కూడా లేదు. బంధము లేనిదే అని అర్థమైంది కదా! ఇక బంధ ప్రసక్తి ఎందుకు? వదలి పెట్టేయ్! వదిలేశావా? ఇదే బంధ సన్యాసము. బంధమే లేనపుడు ఇక మోక్ష మెవరికి?



మోక్షమూ లేదు. ఇదే మోక్ష సన్యాసము. ఇదీ యోగమే. మోక్ష సన్యాస యోగము. గీతలో పద్దెనిమిదవ అధ్యాయము.

**ఆఖ్యాయిక**

సుదూరం నడచి అలసి పోయిన ఒక బాటసారి దారిలో కనిపించిన ఒక నదిని సమీపించాడు జలపానం చేయడానికి. దోసిలి లోకి నీళ్ళు తీసుకున్నాడు. అతడు నీటిని పానం చేస్తున్న చోటే నదీ తీరంలో ఒక పెద్ద వృక్షం శాఖోపశాఖలుగా విస్తరించి ఉంది. ఒక కొమ్మ చివర బల్లి ఒకటి ఉంది. ఆ బల్లి ప్రతిబింబము బాటసారి దోసిలి లోని నీటిలో ప్రతిఫలించింది. తీరా నీటిని నోటిలో పోసుకుంటున్న సమయంలో బల్లిని దోసిలిలో అతడు అస్పష్టంగా చూశాడు. ఈ లోగా నీళ్ళు నోటిలో పోసుకోవడం, మ్రింగేయడం జరిగింది. కాని, బల్లి ప్రతిబింబాన్ని బింబము గానే బాటసారి భ్రమించాడు.

ఆ క్షణం నుండి అతడికి దిగులు పట్టుకుంది. బల్లి కడుపులో ఉంది. బ్రతుకు ఏమవుతుందో! ఇదే ఆవేదన. ఇదే ఆలోచన. ఎందరు వైద్యులకు చూపెట్టినా, అతనిలో అలాంటి దోష మేమీ లేదని చెబుతారు. అయినా, అతని మనస్సు శాంతించడం లేదు. రోజు రోజుకి మనిషి కృశించి పోతున్నాడు.

చివరగా, ఒక వైద్యుడు ఇతణ్ణి బాగా పరీక్షించి చూశాడు. ఇతడి సమస్య ఆ వైద్యుడికి అర్థమై పోయింది. నాయనా! నువ్విక బాధ పడకు. నీ అదృష్టం కొద్దీ నా చేతిలో పడ్డావు. ఇలాంటి వాటిని ఎన్నిటినో నేను నయం చేశాను. రెండు నెలలు బాధ పడ్డావు. ఒక్క రోజు నిదానించు. నిరీక్షించు. నీ సమస్య పరిష్కరింప బడుతుంది. అని చెప్పి వెళ్ళాడు వైద్యుడు.

మరునాడు చికిత్స ప్రారంభ మైంది. వైద్యుడు తాను తెచ్చిన రసాన్ని రోగి చేత త్రాగించాడు. ఐదు నిముషాలు గడిచింది. అంతే. రోగికి డోకు వచ్చింది. నిమిషం కాగానే మళ్ళీ వమన మైంది. ఇలా ఐదు నిముషాల్లో మూడు నాలుగు సార్లు వాంతి చేసుకోవడం జరిగింది. ఐదవసారి వమనం కాగానే, వైద్యునితో సహా కుటుంబీకు లందరూ 'కక్కేశాడు - వచ్చేసింది' అని చప్పట్లు చరుస్తూ ఆనందంతో గంతు లేశారు. రోగి కళ్ళు తెరిచి చూశాడు. అతడు వాంతి చేసుకున్న వమన పదార్థంలో బల్లి చచ్చిపడి ఉంది.

రోగి హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు. ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయ్యాడు. వైద్యుణ్ణి అభినందించాడు. పెద్ద గానే సంభావన అందించాడు.

'డాక్టరు గారూ! ఎంతిచ్చినా మీ ఋణం తీర్చుకో లేను. నాకు పునర్జన్మ నిచ్చారు. బ్రతుకుతా నని నేను అనుకోలేదు. అంతా మీ చలువ. ఎందరో వైద్యులు నాకు వైద్యం చేశారు. ఎంతో ఖర్చు చేశాము. ఎవ్వరూ నా రోగాన్ని బాగు చేయలేక పోయారు. మీరు బాగు చేశారు. మీకు ఎలా కృతజ్ఞతలు తెలియ చేయాలో నాకు అర్థం కావడం లేదు' అన్నాడు రోగి.

వైద్యుడు రోగి మాటలకు సంతసించి, 'నాయనా! నీ దురదృష్టం వల్ల బల్లి నీ కడుపు లోకి వెళ్ళింది. నీ అదృష్టం బాగుండి నువ్వు నా చేతిలో పడ్డావు. ఇలాంటి వైద్య చికిత్సలో నేను ఆరితేరిన వాణ్ణి కనుక బల్లిని బయట పడేయ గలిగాను' అన్నాడు వైద్యుడు.

'డాక్టరు గారూ! మీరు ఈ మందు నిన్ననే ఇచ్చి ఉంటే, నా సమస్య ఇరవై నాలుగు గంటల ముందే పరిష్కరింప బడేది కదా?' అని విచిత్రమైన ప్రశ్న వేశాడు రోగి.

వైద్యుడు నవ్వుతూ, 'నాయనా! నేను మాత్రం కావాలని ఆలస్యం చేశానా? అది సామాన్యమైన ఔషధమా!

దానిని తయారు చేయడానికి ఆ మాత్రం సమయం పడుతుంది. అది మూలికా వైద్యం. వేసవి కాలమైతే ఆ మూలికలు (బల్లులు) ఎక్కడ అంటే అక్కడే విరివిగా దొరుకుతాయి. శీతాకాలం కావడం చేత వాటి కోసం అన్వేషించ డానికి సమయం పట్టింది. ఎలాగో దొరికింది. పట్టేశాను. నీ సమస్య పరిష్కృత మైంది' అని చెప్పి వైద్యుడు సంభావన పుచ్చుకొని నిష్క్రమించాడు.

ఇంతకీ రోగికి సమస్య ఉందా? పరిష్కారం అవసరమా? ఉంది అనుకుంటే ఉంది. రెండు నెలల కాలం చెక్కు చెదరకుండా బల్లి కడుపులో కదుల్తూ ఉంటుందా? ఉందనుకునే వారికి ఉంటుంది. ఇదే బంధం.

మరి, బల్లి బంధం నుండి రోగి విడుదల పొందినట్లే కదా! అతనికి బంధ విముక్తి జరిగినట్లే కదా! ఇదే మోక్షము. బంధము ఆరోపితము. స్వకల్పితము. మోక్షము వైద్యుని చాతుర్యము. బల్లిని పట్టుకొచ్చి వమన పదార్థంలో పడేసి, రోగి కడుపులో నుండి పడింది అని చెప్పడం, రోగి శాంతించడము - ఇదే మోక్షము. వాస్తవానికి బంధమూ కల్పితమే. మోక్షమూ కల్పితమే. అంతా రోగి చిత్తము లోనే ఉంది. బంధ మైనా, మోక్ష మైనా చిత్తవృత్తుల లోనే పెనవేసు కుంటుంది. జీవి నిత్యముక్తుడు. బంధమోక్షాలు మనో కల్పితాలు.

మం॥ **చిచ్చైత్య కలితో బంధః తన్ముక్తిః ముక్తి రుచ్యతే ॥**

చిత్తవృత్తులలో తగులు కోవడమే బంధము. వాటి నుండి విముక్తిని పొందడమే మోక్షము అని మహానారాయణోపనిషత్తు.

## పద్దెనిమిదవ అధ్యాయము

***విముక్తశ్చ విముచ్యతే*** - ఎవడు నిత్య ముక్తుడో, వాడే కల్పిత బంధము నుండి విడిపడి ముక్తు డవుతున్నాడు అని ఉపనిషత్తు. ముక్తుడే ముక్తు డవుతున్నాడు అని దాని అర్థం. ఈ విషయానికి అద్దం పట్టిన గీతా శాస్త్రము యొక్క తాత్పర్యము పద్దెనిమిదవ అధ్యాయంలో సమాప్తం కావాలి. అంతేకాదు. సమస్త వేదార్థం కూడా ఇదే కనుక, పదిహేనవ అధ్యాయం పీఠికలో మనం చెప్పుకున్నట్లు వేదార్థాన్ని కూడా ఇక్కడ సంపూర్ణము గావించ వలసి ఉంది. ఇదే ప్రధాన విషయంగా ఈ అధ్యాయము ప్రారంభించ బడుతూ ఉంది ***( సర్వస్యైవ గీతా శాస్త్రస్య అర్థః అస్మిన్ అధ్యాయే ఉపసంహృత్య సర్వశ్చ వేదార్థః వక్తవ్య ఇత్యేవ మర్థః అయం అధ్యాయః ఆరభ్యతే ).***

సమస్త మైన కర్మలు, నదులు సాగరంలో విలీన మైనట్లు, జ్ఞానము నందే విలీన మౌతాయని గీతాచార్యుడు బోధించాడు *(4 వ అ - 33 వ శ్లో)*. సర్వ భావాలు ఉపసంహరింప బడే ఈ పద్దెనిమిదవ అధ్యాయము పూర్ణ రూపమై విలసిల్లుతూ ఉంది. పద్దెనిమిది సంఖ్య ఆర్ష విజ్ఞానంలో పూర్ణ రూపము. పద్దెనిమిది సంఖ్య ప్రాశస్త్యాన్ని శాస్త్రంలో అనేక చోట్ల మనం చూడ వచ్చు.

వేదాంతము అనబడే ఉపనిషత్తులలో ప్రథమం అని చెప్పబడే ఈశావాస్యోపనిషత్తు పద్దెనిమిది మంత్రాలతో శోభిస్తూ, పద్దెనిమిదవ సంఖ్య వైభవాన్ని చెప్పకనే చెప్పింది.

నాలుగు వేదాలలో దివ్యంగా కీర్తింప బడిన పురుష సూక్తము పద్దెనిమిది మంత్రాలతో శోభిస్తూ ఉంటే, ఆగమ శాస్త్రానుసారం దేవాలయానికి పద్దెనిమిది మెట్లు గోచరిస్తున్నాయి. పద్దెనిమిది మెట్లు ఎక్కితే పరమేశ్వరుని, లేదా పరమేశ్వరి దర్శన మవుతుంది. అలాగే పద్దెనిమిది సాధన సోపానాలను అధిరోహిస్తే జీవుడు బ్రహ్మానుభూతిని పొందుతున్నాడు అన్నది శాస్త్రం.

***దృశ్యం దేహం చ వాగాది శ్రోత్రాదీంద్రియ పంచకమ్ ,***
***ప్రాణాది పంచకం చైవ తథాన్తః కరణ మేవ చ ॥***





***ముక్తి సాధస్య సోపానాః అష్టాదశ ఇతీరితాః***
***ఏతాన్క్రమేణ చారుహ్య బ్రహ్మభూయాయ కల్పతే ॥***

దృశ్యమైన విషయ ప్రపంచము ఒకటి, దేహము ఒకటి, కర్మేంద్రియాలు ఐదు, జ్ఞానేంద్రియాలు ఐదు, ప్రాణాలు ఐదు, అంతఃకరణ మనే మనస్సు ఒకటి - ఈ పద్దెనిమిది ముక్తి సాధన సోపానాలు. వీటిని క్రమంగా దాటిన వాడు తానే బ్రహ్మము అని తెలుసుకుంటాడు. ఈ పద్దెనిమిది సోపానాలు ప్రకృతి, లేదా క్షేత్ర స్వరూపము. దానిని దాటిన వాడు తానే క్షేత్రజ్ఞు డని, పురుషుడని తెలుసు కుంటాడు. అతని వైభవమే పద్దెని మిది మంత్రాలలో పురుష సూక్తంగా కీర్తించ బడింది.

పురుష సూక్తంలో పద్దెనిమిది మంత్రాలతో కీర్తించ బడిన పురుషుడే గీతలో పద్దెనిమిది శ్లోకాలతో స్థితప్రజ్ఞుడుగా కీర్తింప బడ్డాడు.

గీతలో అధ్యాయాలు పద్దెనిమిది అయితే, గీతను తన గర్భమున దాచుకున్న మహాభారతము పద్దెనిమిది పర్వాలతో శోభిస్తూ ఉంది. ఏ కురుక్షేత్ర యుద్ధభూమిలో గీత బోధించ బడిందో, ఆ మహాభారత యుద్ధము పద్దెనిమిది రోజులు నడిచింది. అంతేకాదు, ఆ రణరంగంలో ఇరు వర్గాల లోని అక్షౌహిణులు కూడా పద్దెనిమిదే. అసలు అక్షౌహిణి అనేదే పద్దెనిమిదవ సంఖ్యతో విరాజిల్లుతూ ఉంది.

ఒక అక్షౌహిణి అంటే యుద్ధ రంగమున చతురంగ బలాల సంఖ్య. చతురంగ బలాలు అంటే రథ, గజ, తురగ, పదాతులు. పదాతులు అంటే పదములతో, అంటే సదా కాళ్ళతో నడిచే వాళ్ళు, లేదా కాల్బంట్లు అని అర్థము.

ఒక అక్షౌహిణిలో రథాలు ఇరవై ఒక్క వేల ఎనిమిది వందల డెబ్భై ఉంటాయి. గమ్మత్తు ఏమిటంటే, ఈ మొత్తం అంకెలను కూడితే అది మళ్ళీ పద్దెనిమిది అవుతుంది **(21,870 = 18)**.

రథాల లాగే గజములు, అంటే ఏనుగులు కూడా ఇరవై ఒక్క వేల ఎనిమిది వందల డెబ్భై ఉంటాయి. ఇది కూడా పద్దెనిమిది వస్తుంది.

ఇక ఒక అక్షౌహిణిలో అరవై ఐదు వేల ఆరు వందల పది గుఱ్ఱాలు ఉంటాయి. వాటిని కూడినా పద్దెనిమిదే వస్తుంది **(65,610 = 18)**. ఇక చతురంగ బలాలలో చివరిది పదాతులు, లేదా కాల్బంట్లు. ఒక లక్ష తొమ్మిది వేల మూడు వందల యాభై పదాతు లుంటాయి. ఈ అంకెలను కూడినా పద్దెనిమిదే వస్తుంది **(1,09,350 = 18)**.

***అంబ! త్వా మను సందధామి*** - అమ్మా! నిన్ను పదే పదే ధ్యానిస్తున్నాను అని ఏ గీతామాతను 'అంబ' అని కీర్తిస్తున్నామో, అట్టి గీతమ్మ పద్దెనిమిది అధ్యాయాలను కలిగి ఉంటే, మహేశ్వరి అయిన అంబ పద్దెనిమిది హస్తాలతో శోభిస్తూ ఉంది.

సృష్టికి అభిన్న నిమిత్త ఉపాదాన కారణంగా శోభిస్తున్న పరమాత్మ నిమిత్త కారణంగా భగవంతుడని, ఉపాదాన కారణంగా భగవతి అని కీర్తింప బడుతున్నా, వీరి పురాతన వైభవాన్ని నిత్య నూతనంగా వర్ణించి, వివరించి చెప్పే పురాణాలు కూడా పద్దెనిమిది. పురాణాలే కాక ఉప పురాణాలు కూడా పద్దెనిమిది. అసలు మహాభారతానికి 'జయ' అనే పేరు ఉండటానికి కారణం కూడా సాంఖ్య విధి ననుసరించి పద్దెనిమిది సంఖ్యయే.

సంఖ్యా శాస్త్రాన్ని అనుసరించి ('క - ట - ప - యాది - సంజ్ఞా') 'జ' అక్షరానికి సంఖ్యా విలువ ఎనిమిది కాగా, 'య' అక్షరానికి ఒకటి సంఖ్యా విలువ. సంస్కృత అక్షరాలకు సంఖ్యా విలువను కనుగొనిన తరువాత,

సంఖ్యాశాస్త్ర విధిని అనుసరించి, అంకెలను త్రిప్పి పఠించాలి. అది సంఖ్యా విధి. 'జ' అక్షరానికి ఎనిమిది, 'య' అక్షరానికి ఒకటి రావడం చేత రెండిటిని కలిపితే ఎనభై ఒకటి వస్తుంది. దానిని త్రిప్పి చదివితే పద్దెనిమిది అవుతుంది. ఈ విధంగా 'జయ' గ్రంథము అని చెప్పబడే మహాభారత గ్రంథమే పద్దెనిమిది సంఖ్యతో శోభిస్తూ ఉంది. ఇలాంటి పద్దెనిమిది సంఖ్యా వైభవము విలసిల్లే మోక్ష సన్యాస యోగము అనే పద్దెనిమిదవ అధ్యాయము వద్ద ప్రస్తుతం మనం చేతులు జోడించి నిలబడి ఉన్నాం.

**అధ్యాయ సంగతి**

భగవద్గీత లోని పద్దెనిమిది అధ్యాయాలలో శ్లోకపరంగా చూస్తే ఇదే పెద్ద అధ్యాయము. ఈ అధ్యాయ 'సంగతి'ని, అంటే అధ్యాయ విషయాన్ని ప్రత్యేకించి చెప్పుకోవడానికి ఇక్కడ క్రొత్తగా చెప్పిందంటూ ఏమీ లేదు. గడచిన అధ్యాయాలలో చెప్పిన విషయాన్నే సారభూతంగా ఈ అధ్యాయంలో తెలియ చేయడం జరిగింది ***(సర్వేషు అతీతేషు అధ్యాయేషు ఉక్తః అర్థః అస్మిన్ అధ్యాయే అవగమ్యతే)***. అందుచేత దీనిని సంక్షిప్తగీత అని అంటారు. ఈ అధ్యాయాన్ని ఏకాధ్యాయీ గీత అని కూడా అంటారు. అంటే, గీతా తాత్పర్య మంతా ఈ ఒక్క అధ్యాయం లోనే లభిస్తుంది అని అర్థము. గడచిన అధ్యాయాల లోని విషయము నంతా సంక్షిప్తం చేసి, సింహావలోకన న్యాయము ననుసరించి భగవంతుడు బోధించడం జరిగింది.

**సింహావలోకనము**

ఒక విషయాన్ని ప్రవచించిన తరువాత, దానిని ఉపసంహరించే సమయంలో చెప్పిన విషయా న్నంతా సంక్షేపంగా పునరాలోచన చేయడాన్ని సాధారణంగా 'సింహావలోకనము' అంటారు. ఇది సంకుచితమైన నిర్వచనము. దీనిని ఆంగ్లంలో 'రికాపిచ్యులేషన్' అంటారు. దీనికి, సింహావలోకనానికి భూమ్యాకాశాల కున్నంత అంతరం ఉంది.

సింహావలోకనము అనేది న్యాయము. న్యాయము అంటే, సత్య నిర్ణయము చేయుటకు సహకరించే వాదము అని చెప్పుకో వచ్చు. ఒక విషయాన్ని సమగ్రంగా పరిశీలించి విశ్లేషించడం ద్వారా మనస్సు ఆ విషయాన్ని నిర్ణయించుటకు శక్తిని పొందుతుంది. అలా సత్య నిర్ణయము నందు మనస్సుకు సహకరించేది న్యాయము.

అస్పష్ట మైనది న్యాయము ద్వారా సుస్పష్ట మవుతుంది. వేదాంత శాస్త్రము కేవలము వాదానికి, మేధస్సుకు అంతు చిక్కేది కాదు. ***నాయమాత్మా ప్రవచనేన లభ్యః న మేధయా న బహునా శ్రుతేన*** - కేవలం ప్రవచనాల చేత ఆత్మ పొంద బడేది కాదు. ధారణా శక్తి వల్ల గాని, అనేక విధాల శ్రవణం చేయడం వల్ల గాని ప్రాప్తించదు అని ముండకోపనిషత్తు *( 3 - 2 - 3)*.

ప్రవచనాలకు, మేధస్సుకు అందని ఆత్మజ్ఞానము సంప్రదాయము తెలిసిన గురువు ప్రామాణికంగా బోధించి నపుడే అర్థ మవుతుంది. ***నైషా తర్కేణ మతి రాపనేయా ప్రోక్తాన్యే నైవ సుజ్ఞానాయ ప్రేష్ఠ*** - ప్రేష్ఠా! నాయనా! ఆత్మజ్ఞానము తర్కము చేత పొంద బడదు. ఆత్మసాక్షాత్కారము పొందిన వాడు ఉపదేశించి నపుడే అది అర్థ మవుతుంది అని కఠోపనిషత్తు *(2 - 9)*. కేవలం వాదానికి లభ్యం కాని ఆత్మజ్ఞానము, సద్గురువు ప్రామాణికంగా వాదాన్ని తోడు చేసుకొని బోధించి నపుడే అర్థ మవుతుంది. గురుబోధకు వాదం సహకరిస్తుంది. వాదానికి న్యాయాలు ఉపకరిస్తాయి. ఇక్కడే న్యాయానికి న్యాయం చేకూరుతుంది.

**ఉక్తం** అంటే చెప్ప బడింది. **అనుక్తం** అంటే చెప్ప వలసిన విషయంలో కొంత చెప్ప వలసి ఉన్నది. ఈ విషయాలను మదిలో ఉంచుకొని సింహావలోకన సమయంలో బోధకుడు బోధించాలి. అప్పుడే **ఉక్తం** స్ఫూర్తిని నింపుకొని **సూక్తం** అవుతుంది.



దీనిని శాస్త్రంలో 'అనువాద ప్రక్రియ' అంటారు. చెప్ప వలసింది పూర్ణంగా చెప్పడం జరిగిందా? లేక చెప్ప వలసింది ఇంకా ఏదైనా మిగిలి ఉందా? చెప్పిన విషయంలో కూడా స్పష్టత కోసం మరి కొంత చెప్ప వలసినది ఏమైనా ఉందా? ఈ విషయాలన్నీ మనస్సులో మదింపు వేసుకొని బోధను సమాప్తి చేసే సమయంలో అంతవరకు ప్రవచించిన విషయాన్ని సంక్షేపంగా పునః బోధించడము అనువాదము అంటారు. ఈ విధమైన ప్రక్రియను ప్రకాశింప చేసేదే సింహావలోకన న్యాయము.

పద్దెనిమిదవ అధ్యాయము, గడచిన అధ్యాయాలలో ప్రవచించిన విషయాన్నంతా సంక్షేపంగా సింహావలోకన న్యాయ పరిధిలో బోధిస్తుంది అని చెప్పిన విషయం ఇప్పుడు అవగత మైందని భావిస్తాను. మరి కొంత స్పష్టత కోసం దీని అర్థాన్ని కూడా చెప్పుకుందాం.

'సింహావలోకనము' అనగానే ఇందులో మనకు రెండు పదాలు తెలుస్తున్నాయి. ఒకటి 'సింహము'. రెండవది 'అవలోకనము'. అవలోకనము అంటే 'చూచుట' అని అర్థము. సింహావలోకనము అంటే సింహము చూచినట్లు చూడటము అని అర్థము.

గేదె తల వంచుకొని ముందుకు నడుస్తుంది. గుఱ్ఱం తలను పైకెత్తి పరుగు పెడుతుంది. గోమాత తలను ఊపుకుంటూ కదుల్తుంది. కాని, వెనుకకు తిరిగి చూస్తూ నడిచేది సింహము ఒక్కటే. ఇదే సింహావలోకనము. ఈ విషయాన్ని న్యాయముగా నిర్ణయించి, సంప్రదాయ కర్త లైన మహర్షులు బోధనా ప్రక్రియను, లేదా బోధనా విధిని సుగమం చేశారు.

నది ప్రవహిస్తూ ముందుకు సాగినట్లు, విషయాన్ని ప్రసంగిస్తూ ముందుకు సాగే బోధకుడు శ్రోతలను ప్రభావితం చేయ లేడు. ప్రభావితం చేయ లేడు సరి కదా, మనస్సును సందేహాలతో నింపేస్తాడు. తాను బోధించిన విషయము శ్రోతలకు అర్థ మైందా లేదా అనే విషయంలో వక్తకు సందేహం ఉండ కూడదు. ఈ పరిస్థితి తలెత్తకుండా వక్త బోధనా దశ లోనే జాగ్రత్త పడాలి. సింహావలోకన న్యాయాన్ని అనుసరిస్తూ ప్రసంగించాలి.

సింహావలోకనం అనేది విషయ మంతా పూర్తి అయిన తరువాత ప్రయోగించ వలసిన ప్రక్రియ కాదని ఇప్పటికే మీకు అవగతమై ఉంటుందని భావిస్తున్నాను. బోధ పూర్తి అయిన తరువాత సింహావలోకనము ఎలాగూ జరగాలి. కాని, బోధ సాగుతున్న సమయంలో కూడా సమన్వయ ప్రక్రియగా నడుస్తూనే ఉండాలి.

బోధ యొక్క కేంద్ర విషయం ఒక్కటే అయినా, అది అనేక ఉప విషయాలను వివరిస్తూ ముందుకు సాగుతుంది. వాటి మధ్య ఎక్కడెక్కడ అవసరమో అక్కడక్కడ సింహావలోకన న్యాయాన్ని అనుసరిస్తూ శ్రోతకు విషయాన్ని సుగ్రాహ్యం చేస్తూ పోవాలి. ఇది పునరుక్తి కాదు. ఇక్కడ మరొక న్యాయం ముడిపడి ఉంది. అది అర్థ మైతే పునరుక్తి లేదని తెలుస్తుంది. అదే 'స్థూణ ఖనన న్యాయము'. 'స్థూణ' అంటే స్తంభము. 'ఖననము' అంటే పాతి పెట్టడము. ఒక స్తంభమును, అది రాతి దైనా, కొయ్య దైనా, స్తంభమును పాతే టప్పుడు అది గట్టిగా పాతుకున్నదా, లేదా అని తెలుసుకోవడానికి, పాతిన స్తంభాన్ని అటు ఇటు కదిపి చూస్తాము. దృఢంగా పాతుకు పోయి కదలకుండా ఉంటే వదిలేస్తాము. కాస్త కదిలితే, మళ్ళీ దానిని దృఢంగా పాతుకునేలా చేస్తాము. దీనిని 'స్థూణ ఖనన న్యాయము' అంటారు. ఈ న్యాయాన్ని అనుసరించి బోధ మధ్యలో సింహావలోకనము జరుగుతూ ఉండాలి. ఇందులో పునరుక్తి దోషము లేనే లేదు. వేదాంత శాస్త్రము గహన మైనది, గుహ్య మైనది. బోధ విషయంలో వక్త అనుసరించే పద్ధతులే శ్రోత మనస్సులో వెలుగులను ప్రసరింప చేస్తాయి.

**ప్రశ్న బీజము**

త్యాగము, సన్యాసము - ఈ రెండు విషయాల యొక్క యథార్థ స్వరూపాన్ని చెప్ప మని అర్జునుడు

అడగటంతో ఈ చివరి అధ్యాయం ప్రారంభ మవుతూ ఉంది ***( అర్జునః తు సంన్యాస త్యాగ శబ్దార్థయోః ఏవ విశేషం బుభుత్సుః ఉవాచ ).***

త్యాగము అంటే కర్మఫల త్యాగము. సన్యాసము అంటే సర్వ కర్మ త్యాగము. ఈ రెండిటి లోనూ త్యాగ ధర్మమే ఉంది. కాకపోతే, ఒకటి కర్మలను ఆచరిస్తూ ఫలసంగం లేకుండా ఉండటము. రెండవది, కర్మలనే పూర్తిగా త్యజించడము. ఈ రెండు విషయాలు, గీతాబోధ ప్రారంభ మైనప్పటి నుండి శ్రీకృష్ణుడు చెబుతూనే ఉన్నాడు. అర్జునుడు అడుగుతూనే ఉన్నాడు.

***యోగస్థః కురు కర్మాణి*** - అర్జునా! యోగస్థుడవై కర్మల నాచరించు *(2 వ అ - 47 వ శ్లో)* అన్నాడు భగవంతుడు. ఇది కర్మఫల త్యాగము.

***సర్వ కర్మాణి మనసా సంన్యస్యాస్తే సుఖం వశీ!*** - సర్వ కర్మలను మనస్సుతో సన్యసించి, ఏదీ చెయ్యకుండా సుఖంగా ఉండు *(5 వ అ - 13 వ శ్లో)* అని బోధించాడు. ఇది కర్మసన్యాసము.

ఇంతకీ, చేయ వలసినది కర్మ త్యాగమా? కర్మఫల త్యాగమా? కర్మసన్యాసమా? లేక కర్మలలో సన్యాసమా? ఈ ప్రశ్న ప్రారంభం నుండి అర్జునుని మనస్సును కలత పెడుతూనే ఉంది. ఆ మాట అర్జునుడు అనేశాడు కూడా.

కృష్ణా! కర్మల కంటే జ్ఞానమే శ్రేష్ఠము అనేది నీ అభిప్రాయ మైతే, భయంకరమైన యుద్ధకర్మ లోకి నన్ను ఎందుకు దించుతున్నావు? జ్ఞానం శ్రేష్ఠము అంటావు. కర్మను ఆచరించు అంటావు. ఒక దానిని శ్రేష్ఠంగా స్తుతిస్తావు. మరొక దానిని ఆచరించ మంటావు. కలగాపులగం చేసి నీ మాటలతో నా బుద్ధిని కలవర పెడుతున్నావు అన్నాడు అర్జునుడు *(3 వ అ - 2 వ శ్లో).*

దీనికి సమాధానంగా నాలుగు, ఐదు అధ్యాయాలను భగవానుడు ప్రవచించిన తరువాత, అర్జునుడు మళ్ళీ అదే ప్రశ్నను కొద్దిగా మార్పు చేసి అడిగాడు. కృష్ణా! కర్మ సన్యాసాన్ని గూర్చి చెబుతావు. మళ్ళీ కర్మయోగాన్ని గూర్చి చెబుతావు. ఈ రెండిటిలో ఏది శ్రేయస్కరమో ఆ ఒక్క దానినే నా కోసం నిశ్చితంగా చెప్పు అని అడిగాడు *(5వ అ - 1 వ శ్లో).*

ఈ ప్రశ్నకు సమాధానం చెబుతూ ఆ రెండూ వేరుగా లేవు. ఒక్కటే. అవి వేరని పిల్లలు చెబుతారు. పండితులు చెప్పరు. ఈ రెండిటిలో ఏ ఒక్క దానిని ఆచరించినా, రెండిటి యొక్క ఫలం పొందినట్లే అవుతుంది అన్నాడు భగవంతుడు *(5 వ అ - 4 వ శ్లో).*

***శ్రద్ధావాన్ భజతే యో మాం***
***స మే యుక్త తమో మతః*** - ఎవడైతే శ్రద్ధావంతుడై నన్నే సేవిస్తాడో అట్టి యోగి మిక్కిలి శ్రేష్ఠుడు అని నా అభిప్రాయము అన్నాడు భగవంతుడు *(6 వ అ - 47 వ శ్లో).* ఇది కర్మఫల త్యాగము.

***ఉదారాః సర్వ ఏవైతే***
***జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్*** - అందరూ శ్రేష్ఠులే అయినా, జ్ఞాని సాక్షాత్తు నేనే అని నా అభిప్రాయం అని బోధించాడు *(7 వ అ - 18 వ శ్లో).* ఇది మళ్ళీ కర్మసన్యాసము.

ఇక్కడ మళ్ళీ ఏదో కలవరం ఆరంభ మైంది. పూర్వం నిష్ఠాద్వయమైన కర్మయోగ, కర్మసన్యాసాలలో ఏది శ్రేష్ఠము? అని ప్రశ్నిస్తూ వచ్చిన అర్జునుడు, పన్నెండవ అధ్యాయారంభంలో కాస్త మార్గాన్ని మార్చి, అదే తరతమ భేదాన్ని అంతరంగ సాధనల మధ్య లేవనెత్తి, సగుణోపాసన శ్రేష్ఠమా, నిర్గుణోపాసన శ్రేష్ఠమా? అని ప్రశ్నించాడు. అంటే, మూడవ అధ్యాయమైన కర్మయోగం నుండి ఏ సందేహా న్నైతే శ్రీకృష్ణుని ముందుంచి



అర్జునుడు ప్రశ్నిస్తున్నాడో, దానినే పన్నెండవ అధ్యాయంలో మరొక కోణంలో, అంటే ఉపాసనా కోణంలో ప్రశ్నించాడు. ప్రశ్నించే పద్ధతులు, ప్రశ్నించే విధానాలు మారుతూ ఉన్నాయే గాని, ప్రశ్న మారడం లేదు. అదే ప్రశ్న.

ప్రస్తుతం గీతా ప్రవచనం చివరి ఘట్టానికి చేరింది. ఈ దశలో కూడా పదాలను మార్చి అదే ప్రశ్నను అర్జునుడు మళ్ళీ సంధిస్తున్నాడు. కాని, పూర్వం ప్రశ్నించిన విధానానికి, ప్రస్తుతం ప్రశ్నిస్తున్న పద్ధతికి ఏదో తేడా ఉందని పరిశీలిస్తే అర్థ మవుతుంది.

'కృష్ణా! కర్మయోగ మేమిటి? కర్మసన్యాస మేమిటి?' లేదా, 'కృష్ణా! కర్మయోగ, కర్మసన్యాసాలలో ఏది శ్రేష్ఠము?' అని ఇలా ప్రశ్నిస్తూ వచ్చిన అర్జునుడు, ప్రస్తుతం ప్రశ్న బీజం అదే అయినా, త్యాగ సన్యాసాలను, వాటి తత్త్వాలను వేరు వేరుగా తెలుసుకోవాలని భావించి ప్రశ్నిస్తున్నాడు. మహాద్భుతమైన ఈ గీతా శాస్త్రంలో ప్రథమ శ్రోత అయిన అర్జునుని చివరి ప్రశ్న ఇదే కావడం చేత, స్పష్టత కోసం సూటిగా ప్రశ్నిస్తున్నాడు. ***తత్త్వ మిచ్ఛామి వేదితుమ్*** - 'వాటి తత్త్వాన్ని, అంటే యథార్థ స్వరూపాన్ని తెలుసుకోవడానికి ఇష్ట పడుతున్నా!' అని సూటి గానే అర్థించాడు. ఆ మాటల్లో వినయ, జిజ్ఞాసలతో పాటు ఆదర భావం కూడా తొంగి చూస్తోంది. ఇది పద్దెనిమిదవ అధ్యాయానికి ప్రశ్న బీజం.

గీతాశాస్త్రాన్ని సంపూర్ణంగా సింహావలోకనం చేస్తూ గీతాసారాన్ని పునః బోధించడానికి భగవంతునికి అనువు గానే అర్జునుని ప్రశ్న ఉంది. ఉపదేశానికి, అసమానుడైన ఆదిగురువు ఉద్యమిస్తున్నాడు. అర్జునుని నిమిత్తంగా చేసుకొని గీతామృతాన్ని మనందరి చేత గుటగుట త్రాగించ డానికి గోవిందుడు ఉద్యుక్తు డవుతున్నాడు.

ఆత్మబంధువులారా! చైతన్య భగవద్గీతా రచన చివరి దశకు చేరింది. రెండు వేల పుటల వ్యాఖ్యాన గ్రంథము పద్దెనిమిది వందల పుటలలో, పదిహేడు అధ్యాయాలను పూర్తి చేసుకొని 'సమాప్తం' అనే దశకు చేరుకుంటూ ఉంది. ఇప్పటి వరకు నడచిన వ్యాఖ్యను అవలోకిస్తే, ఇది నేనే వ్రాశానా? లేక, సాధారణమైన వెదురు ముక్కను వేణువుగా మలచుకొని విశ్వమోహన రాగాలను ఆలపించిన వాసుదేవ మూర్తి, ఈ వ్యాఖ్యానాన్ని ఓపికగా కూర్చుని వ్రాయగల నని భావించి, ఆయన పాదాలనే నమ్ముకున్న నన్ను ఇలా కరుణించాడా? అని నాలో నేను ఏదో అవు తున్నాను. మాట లన్నీ కాగితాల మడతలలో చేరి పోయాయేమో, మౌనాన్ని మాత్రమే నాకు మిగిల్చి నన్ను మూగవాణ్ణి చేశాయి. పదిహేడు అధ్యాయాలు అద్భుతంగా, అమోఘంగా పూర్తి అయ్యాయి. ఇంతవరకు కురిపించిన కరుణామృతాన్ని ఈ అధ్యాయం ముగిసి, గ్రంథం సమాప్త మయ్యే వరకు అలాగే నాపై వర్షింప చేయమని శ్రీవాసుదేవ భగవానుని త్రికరణ శుద్ధిగా హృదయంతో ప్రార్థిస్తూ, అష్టాదశాధ్యాయ వ్యాఖ్యానానికి కలం కదిలిస్తూ, ముందుగా నవనీత చోరునికి అత్యంత ప్రియమైన ఒక వెన్నముద్దను నివేదించు కొని, ఆరగించ మని అభ్యర్థించి, ప్రార్థించి, ఆ తరువాత మోక్షసన్యాస యోగము యొక్క వ్యాఖ్యానాన్ని ప్రసాదంగా భక్తులకు అందిస్తాను.

***బ్రతుకు నిచ్చిన నీ దివ్య భావ మెరిగి***
***మనసులో రాగాల జల్లు కురిసి***
***పలికెదను నోరార లోలోన తేనె లూరి***
***నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా!***

అని చిన్నికృష్ణ శతకంలో ఒక వెన్నముద్ద.

**అర్జున ఉవాచ :**

సంన్యాసస్య మహాబాహో తత్త్వ మిచ్ఛామి వేదితుమ్ ।
త్యాగస్య చ హృషీకేశ పృథ క్కేశినిషూదన ॥ 1

*సంన్యాసస్య-మహాబాహో-తత్త్వం-ఇచ్ఛామి-వేదితుం*
*త్యాగస్య-చ-హృషీకేశ-పృథక్-కేశినిషూదన*

| | | | |
|---|---|---|---|
| మహాబాహో | = గొప్ప బాహువులు గలవాడా! | తత్త్వం | = తత్త్వమును |
| హృషీకేశ | = కృష్ణా! | పృథక్ | = వేర్వేరుగ |
| కేశినిషూదన | = కేశియను రాక్షసుని సంహరించిన వాడా! | వేదితుం | = తెలిసికొనుటకు |
| సంన్యాసస్య | = సన్యాసము యొక్క | ఇచ్ఛామి | = కోరుచున్నాను |
| త్యాగస్య చ | = త్యాగము యొక్క | | |

**అర్జునుడు అడుగుతున్నాడు :**

**కృష్ణా! సన్యాసము యొక్క స్వరూపాన్ని, అలాగే త్యాగము యొక్క స్వరూపాన్ని వేరు వేరుగా తెలుసుకోవా లనుకుంటున్నా!**

### వ్యాఖ్య

ఈ ప్రపంచం విచిత్ర మైంది. అంతకన్నా విచిత్ర మైంది మానవ జీవితము. అందరము ప్రపంచం లోకి వచ్చిన వాళ్ళమే. ప్రపంచంలో ఉన్న వాళ్ళమే. ఈ ప్రపంచం ఏమిటో మనకు తెలియదు. మనం ఎక్కడ నుండి ఈ ప్రపంచం లోకి వచ్చామో, ఎందు కొచ్చామో ఒక పట్టున తెలిసి రాదు.

ప్రపంచం లోకి ప్రవేశించడ మనే ప్రథమ ఆగమనమే అర్థం కాలేదు కనుక, ఇక ప్రపంచంలో ఉన్నంత కాలం సాగే ప్రస్థాన మంతా అగమ్య గోచరం గానే ఉంటుంది. ఎక్కడి కెక్కడికో వెళ్తాం. ఏదేదో చేస్తాం. ఏదో చెయ్యాలని వెళ్తాం. మరొకటి చేసి వస్తాం. చూసి రావాలనే వెళ్ళినా కాల్చి వచ్చే వాళ్ళూ ఉంటారు. కాల్చాలని వెళ్ళ లేదు. కాని, కాలంలో అన్నీ అలా తగల బడుతూ ఉంటాయి.

అర్జునుడు కురుక్షేత్రంలో ప్రవేశించాడు. ఏదో చెయ్యాలని ఉద్యమ స్ఫూర్తితో ప్రవేశించాడు. చేసే పనిని చూచే ప్రయత్నంలో ఉభయ సేనల మధ్య నిలిచాడు. అంతే. నీరసించి పోయాడు. చెయ్య వలసింది, చెయ్య దగింది కళ్ళ ముందే ఉన్నా, దానిని విడిచి పెట్టి మనస్సులో ఉన్న దానిని చూచే కార్యంలో నిమగ్న మయ్యాడు. అంతా తారుమారైంది. అస్తవ్యస్తమై పోయింది.

నామరూపాలతో కూడిన ప్రపంచం కళ్ళ ముందు ఉంది. కురుక్షేత్రంలో అర్జునుని నిర్వాక మంతా దాని తోనే ముడిపడి ఉంది. కురుక్షేత్రానికి రాక ముందు కూడా మనస్సు నంతా అదే ఆవరించి ఉండింది. తీరా ప్రవేశించిన తరువాత ఎందుకో, దాని ప్రాధాన్యత సన్నగిల్లింది. ఒక దశలో అది అంత ప్రధాన మైనది కాదేమో అనిపించింది. మరొక దశలో అప్రధానమై పోయింది.

అప్రధానమైన దానిని అర్థం చేసుకున్నా, దానితో సమర్థవంత మైన సంబంధాన్ని కొనసాగించినా సాధించే దంటూ ఏమీ ఉండదు అనేది కూడా మనస్సులో ఏదో ఓ మూల దాగి ఉంది. ఈ దృశ్యా లన్నిటి వెనుక అదృశ్యంగా ఉన్న ఏదో ఒక దాని వైపు అస్పష్టంగా మనస్సు చలిస్తోంది. ఆ వైపే చరిస్తోంది. ఇది దరి ఎక్కడో తెలియని ప్రయాణము. దారి ఎటో అర్థం కాని ప్రయాణము. అంతా అయోమయం. ఇన్ని అయోమయాలు, అస్పష్టాల మధ్య అదృష్టం కొద్ది నడిపించే వాడు నరుడికి తోడుగా ఉన్నాడు. అతడే కేశవుడు. వైపరీత్యాల నుండి దారి మళ్ళించి దరి చేర్చే కైవర్తకుడు (*కైవర్తకః కేశవః*).

సంవాదము చోటు చేసుకుంది. నామరూపాల తోనే చర్చ ఆరంభ మైనా, చర్చా విషయం మరో వైపుకు దారి తీసింది. అనిత్యమైన నామరూపాల నుండి వెను దిరిగి ఆ నామరూపాల వెనుక దాగి ఉన్న సత్యం వైపు అర్జునుని దృష్టి మళ్ళింది. మళ్ళిన తరువాత అర్థమైంది అది అంత సులభంగా అర్థ మయ్యేది కాదని, పరమ గుహ్య మని, రహస్యాల లోకి రహస్యమైన దని, ఇంద్రియ మనస్సులకు గోచరం కాని విషయ మని. అలాంటి రహస్య మైన విషయం బోధనా విషయ మైంది. కనుకనే, ఆ రహస్య జ్ఞానము ఉపనిషత్తు అయింది. దానినే బోధించడం జరిగింది. అదే గీత. భగవద్గీత. నారాయణుడు నరుడికి చేసిన బోధ.

మరొక విచిత్ర మేమిటంటే, వినిపించింది గీత అయినా అది మనకు 'గీతలు'గా విన పడింది. బహువచనంగా వినిపిస్తోంది. ***ఇతి శ్రీమద్భగవ ద్గీతాసు ఉపనిషత్సు*** - పైగా అది ఒక ఉపనిషత్తు కాదు. అందుకే, ఉపనిషత్తులు (**ఉపనిషత్సు**), అంటూ బహువచనంగా చెప్ప బడింది. అంటే, అనేక ఉపనిషత్తులు ఒక చోట సమాగమ మయ్యాయి. ఎక్కడ? ఆ సమాగమ స్థాన మేది? అదే భగవద్గీత. కాని, మళ్ళీ ఇక్కడ ఒక ఆసక్తికర మైన విషయం దాగి ఉంది. అనేక మైన ఉపనిషత్తులు గీతలో సమాగమం కాగానే, ఏకమైన గీత కూడా బహు వచనంతో భాసిస్తోంది. ***శ్రీమద్భగవద్గీతాసు*** - 'భగవంతుని గీతలు'గా బహువచనంలో వినిపించడం జరిగింది. అనేక శాస్త్రాలు, నదులు సాగరంలో ప్రవేశించినట్లు గీతలో ప్రవేశించాయి. ప్రతి శ్లోకము ఒక ఉపనిషత్తై ప్రకాశిస్తోంది. అందుచేత భగవద్గీతలు, ఉపనిషత్తులు (***భగవద్గీతాసు ఉపనిషత్సు***) అంటూ బహువచనంలో వినిపిస్తున్నాయి. ఈ కారణం చేత భగవద్గీత సర్వశాస్త్ర సారభూత మైంది (***సర్వశాస్త్రమయీ గీతా***). అందుచేత, గీతాబోధ అసమాన వైభవంతో అనన్య సామాన్యంగా సాగింది.

గీతలో ఎన్నో సత్యాలు బోధింప బడ్డాయి. ఊహాపోహలకు అతీతంగా, ఎన్నో మహిమాన్విత మైన విషయాలు ముచ్చటించ బడ్డాయి. బోధ సమస్తమూ సర్వాశ్చర్య మయంగా సాగింది. సమాప్త దశకు చేరింది. విన్న దెంతో! కాని, విన్న దంతా మళ్ళీ సారభూతంగా ఆలకించాలని అర్జునుడు అభిప్రాయ పడ్డాడేమో! సన్యాసము యొక్క, త్యాగము యొక్క యథార్థ స్వరూపాన్ని విడివిడిగా చెప్పమని అర్థించాడు. ఇంతవరకు తాను విన్న దంతా అదే. గీతార్థ మంతా ఆ రెండిటి లోనే ఉంది. గీతకు మూల గ్రంథాలైన ఉపనిషత్తులలో కూడా అదే సారభూతమైన విషయము.

***త్యాగే నైకే అమృతత్వ మానశుః*** - ఒక్క త్యాగము వల్లనే అమృతత్వము, లేదా మోక్షము సిద్ధిస్తుంది అని ఉపనిషత్తు. ఇది ఫలత్యాగము.

***సంన్యాస యోగాత్ యతయః శుద్ధ సత్త్వాః*** - సన్యాస యోగము చేతనే యతులు శుద్ధసత్త్వులై పరబ్రహ్మమును పొందుతారు అని కైవల్య శ్రుతి. ఇది సన్యాసము.

ఫలత్యాగము, సన్యాసము అనే రెండు విషయాలనే ప్రధానంగా ప్రస్తావిస్తూ అటు మూలాలైన ఉపనిషత్తులు, ఇటు ఉపనిషత్సార మైన భగవద్గీత, రెండూ ఏక కంఠంతో ప్రవచించాయి.

మరి, ఈ సన్యాస త్యాగ శబ్దాలు ఘట పటాల వలె భిన్నములా? భిన్న జాతీయ అర్థవంతములా? లేక, బ్రాహ్మణ పరివ్రాజక శబ్దాల వలె ఏకజాతీయ అర్థముతో, ఏకవాక్యతగా ఉన్నవా?

ఘటము వేరు, పటము వేరు. కుండ వస్త్రము కాదు. వస్త్రము కుండ కాదు. అలా ఫలత్యాగము, కర్మసన్యాసము, రెండు వేరా? లేక, బ్రాహ్మణుడు సన్యసించి పరివ్రాజకు డైనట్లు ఒకే విషయానికి సంబంధించిన రెండు రూపాలా?

కర్మయోగము, కర్మసన్యాసము భిన్న జాతీయాలు కావు. ఫలత్యాగము, లేదా కర్మయోగము ఉపాయ మైతే, కర్మసన్యాసము, లేదా జ్ఞానయోగము ఉపేయము. ఫలత్యాగమును హేతువుగా కలిగిన జ్ఞానయోగము, లేదా జ్ఞాననిష్ఠ సాక్షాత్తు మోక్ష సాధనం. బ్రాహ్మణుడు పరివ్రాజకు డైనట్లు, కర్మయోగ నిష్ఠ జ్ఞానయోగ నిష్ఠలో కలిసి, అఖండ చైతన్యం వైపు సాగి విలీనమై పోతుంది. ఉపనది జీవనదిలో కలిసి సాగరంలో విలీన మైనట్లు, ఫలత్యాగము జ్ఞానము వైపు చరించి, ఆ తరువాత ఏకంగా అఖండ చైతన్యంలో విలీనం కావడం జరుగుతోంది.

కృష్ణా! హృషీకేశా! సన్యాసము యొక్క యథార్థ స్వరూపాన్ని తెలుసుకోవాలని అభిలషిస్తున్నాను ***(సంన్యాసస్య తత్త్వం వేదితుమ్ ఇచ్ఛామి)***. 'హే మహాబాహో! కేశిసూదనా! త్యాగము యొక్క యథార్థ స్వరూపాన్ని కూడా తెలుసుకోవాలని ఇష్ట పడుతున్నాను ***(త్యాగస్య తత్త్వం వేదితుమ్ ఇచ్ఛామి)***. ఈ రెండిటిని వేరు వేరుగా ***(పృథక్)*** తెలుసుకోవా లనుకుంటున్నాను.' ఇదీ, అర్జునుని ప్రశ్న. అధ్యాయ ప్రారంభానికి ప్రశ్న బీజము. భగవద్గీతలో పార్థుని చివరి ప్రశ్న.

***సర్వ కర్మ ఫలత్యాగం తతః కురు యతాత్మవాన్*** - మనస్సును నియమించి కర్మఫలాలను విడిచి పెట్టమని ఫలత్యాగాన్ని ప్రబోధించిన భగవంతుడు *(12 వ అ - 11 వ శ్లో; 18 వ అ - 2 వ శ్లో)*, ***సంన్యాస యోగ యుక్తాత్మా విముక్తో మా ముపైష్యసి*** - సన్యాస యోగ యుక్తుడవై చివరకు నన్నే పొందుతావు *(9 వ అ - 28 వ శ్లో)* అని అన్నాడు. కనుక, సన్యాసము యొక్క యథార్థ స్వరూపమును, త్యాగము యొక్క యథార్థ స్వరూపమును వేర్వేరుగా తెలుసుకోవాలని, అది కూడా వాటి యథార్థ స్వరూపాన్ని (తత్త్వాన్ని) తెలుసుకోవాలని ప్రశ్నించాడు అర్జునుడు.

తత్త్వము అంటే యథార్థ స్వరూపము. ***తస్య భావః తత్త్వమ్*** - అంటే దాని యొక్క ధర్మమే తత్త్వము. యథార్థ స్వరూపము ***(యథాత్మ్యమ్)***.

పదిహేడవ అధ్యాయంలో త్రివిధములైన శ్రద్ధను వివరించడం జరిగింది. అలాగే ఆహార, యజ్ఞ, దాన, తపస్సులను అనుష్ఠించే వారిని కూడా వారి వారి శ్రద్ధను బట్టి మూడు విధాలుగా అర్థం చేసుకున్నాం. మరి ఫలత్యాగ, కర్మసన్యాసాలకు కూడా ఈ త్రివిధము ఉందా? ఉంటే, దానిని కూడా తెలుసుకుందా మని అభిలషించా డేమో, మొత్తానికి సమస్త గీతా శాస్త్రాన్ని సింహావలోకనంగా దర్శించుటకు అనుకూలంగా ప్రశ్నించాడు అర్జునుడు.

## సంబోధనమే సర్వసిద్ధి మంత్రం

చివరి ప్రశ్నను సంధిస్తున్న పార్థుడు తన ప్రశ్నలో పరమేశ్వరుని మూడు విధాలుగా సంబోధించాడు. ***హృషీకేశా! కేశినిషూదనా! మహాబాహో!*** అని పిలుస్తున్నాడు. భగవానుని ఒకే చోట మూడు విధాల సంబోధించ వలసిన అవసరం ఉందా? ఉండబట్టే అలా సంబోధించి ఉంటాడు. అవసరం లేకుండా సంబోధిస్తే, అది అనర్థమే కదా! భగవద్గీతలో అనర్థాలకు, అసందర్భాలకు అవకాశం లేదు.

'***కేశినిషూదనా!***' అనేది శ్రీకృష్ణునికి పేరు. కేశి అనే అశ్వరూప రాక్షసుని వధించడం చేత శ్రీకృష్ణునికి కేశి అనే పేరు కలిగింది. కేశి అనే పేరు గల అసురుణ్ణి వధించిన వాడు ***(కేశి నామానం అసురం హతవాన్ ఇతి)***.



బాలకృష్ణుడు గోకులంలో పెరుగుతు న్నప్పుడు, కంసభూపతి బాలకృష్ణుని వధించ మని కేశి అనే అశ్వరూప రాక్షసుణ్ణి పంపాడు. బాలకృష్ణుడు కేశి రాక్షసుని వధించాడు. అందుచేత, శ్రీకృష్ణుడు కేశినిషూదను డని కీర్తింప బడ్డాడు.

పదహారవ అధ్యాయంలో మనము చూచిన అసుర గుణాలకు ప్రతినిధియే ఈ కేశి అనే అసురుడు. అసుర ప్రవృత్తి అంతం కానిదే దైవ లక్షణాలు ఏర్పడవు. భగవంతుని అనుగ్రహం ద్వారా మన లోని అసుర గుణాలను అంతం చేసుకోవాలి. ఇది కర్మయోగం వల్ల సాధ్య పడుతుంది. ఇదే కర్మయోగ నిష్ఠ. అర్జునుడు ప్రశ్నించిన త్యాగానికి సంబంధించిన విషయం. కనుక పరమేశ్వరుని కృప చేత మనస్సు లోని అసుర ప్రవృత్తిని అంతం చేసుకొని అంతఃకరణ శుద్ధిని పొంది, జ్ఞాననిష్ఠకు సిద్ధిని పొంద గలము.

కేశినిషూదనా! అని సంబోధిస్తూనే, ***హృషీకేశా!*** అని కూడా సంబోధించడం జరిగింది. హృషీకేశుడు అంటే ఇంద్రియాలకు ప్రభువు. హృషీకాణి అంటే ఇంద్రియాలు. వాటికి ప్రభువు కనుక భగవంతుడు హృషీకేశుడు ***(హృషీకాణి ఇంద్రియాణి తేషాం ఈశః హృషీకేశః)***. అంటే, ఇంద్రియాలు, మనస్సు వాటి వాటి వ్యాపారాలలో వ్యవహరించ డానికి శక్తి నిచ్చే దాత తానే. ఇంద్రియ మనస్సులు ఆయన వశం లోనే ఉంటాయి కనుక ఆయన హృషీకేశుడు ***(ఇంద్రియాణి యస్య వశే వర్తన్తే)***. ఇంద్రియాలు ఇంద్రియ విషయాల నుండి అన్ని విధాల నిగ్రహింపబడి నపుడే జ్ఞానము సుస్థిరంగా ఉంటుంది అని రెండవ అధ్యాయం స్థితప్రజ్ఞ లక్షణాలలో చెప్పడం జరిగింది *(2 వ అ - 68 వ శ్లో)*. ఇది జ్ఞానయోగ నిష్ఠ. అర్జునుడు ప్రశ్నించిన త్యాగానికి సంబంధించిన విషయం.

హృషీకేశుడు అంటే మరొక అందమైన అర్థం కూడా ఉంది. కేశ అంటే కిరణములు అని అర్థం ***(కేశా రశ్మయః)***. కిరణాలు సూర్యచంద్రుల నుండి కదులుతాయి. పరమాత్మ సూర్యుని రూపంలో ఉండి ఆయన కిరణాల ద్వారా మానవాళిని నిద్ర లేపి కార్యోన్ముఖుల్ని చేస్తాడు. అలాగే చంద్రునిలో ఉండి, శీతల శశి కిరణాల ద్వారా సర్వ జీవులను చల్లగా నిద్ర పుచ్చుతాడు. ఈ విధంగా సూర్యచంద్రుల రూపాలలో ఉంటూ తన కిరణాల ద్వారా జీవులకు సుఖాన్ని పంచి పెడుతూ ఉన్నందున ఆయన హృషీకేశుడు ***(యస్య వా సూర్య రూపస్య చంద్ర రూపస్య జగత్ప్రీతికరా హృష్టాః కేశా రశ్మయః సః హృషీకేశః)***.

సూర్యుని ప్రకాశం వల్ల మనం కార్య రంగంలో ప్రవర్తిస్తాము. ఇది ప్రవృత్తి. కర్మమార్గము. చంద్రుని ప్రకాశం వల్ల మనం కార్యాల నుండి విరమించి నిద్రిస్తాము. అంతర్ముఖుల మవుతాము. ఇది నివృత్తి. జ్ఞానమార్గము. సన్యాసము. సూర్యోదయంతో కర్మలలో ప్రవేశించిన మనం, సూర్యాస్తమయం అయ్యే సరికి కర్మల నుండి విరమిస్తాము. చంద్రోదయంతో సర్వ కర్మల నుండి విడిపడి విశ్రమిస్తాము. ఈ రెండూ సూర్యచంద్రుల రూపంలో ఉన్న పరమేశ్వరుని వల్లనే సిద్ధిస్తున్నాయి.

అలాగే పరమేశ్వరుని అనుగ్రహం చేత ప్రవృత్తిలో చరించి అంతఃకరణ శుద్ధిని పొందిన మనం, నివృత్తిలో విశ్రమించి, లేదా సన్యసించి తద్రూపుల మవుతాము. ఈ రెండు వేరు వేరుగా లేవు. ఈ రెండు మార్గాలు శ్రేష్ఠములే. గొప్పవియే. రెండు పరమేశ్వరుని రూపాలే. అందుచేత భగవంతుణ్ణి హృషీకేశా! కేశినిషూదనా! అని సరిపెట్టుకోకుండా, ***మహాబాహో!*** అని కూడా పిలిచాడు పార్థుడు.

ఇంతవరకు భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునుని మహాబాహో! అని అనేక చోట్ల సంబోధిస్తూ వచ్చాడు. ఇక్కడే ప్రథమంగా అర్జునుడు శ్రీకృష్ణుని మహాబాహో! అని అనడం జరిగింది. తనను శ్రీకృష్ణుడు ఏ అర్థంతో 'మహాబాహో!' అని పిలిచాడో, అదే భావంతో అర్జునుడు పరమేశ్వరుని సంబోధించి ఉంటాడని నేను అనుకోను.

ఇక్కడ కర్మయోగ, జ్ఞానయోగాలను పరమేశ్వరునికి రెండు భుజాలుగా అర్జునుడు దర్శిస్తున్నా డని నాకు అనిపిస్తోంది. భగవాన్! మహాబాహు వైన నీ కరుణ మాపై ఉంటే మేము కూడా కర్మయోగము నందు సిద్ధి ద్వారా జ్ఞానయోగ ప్రాప్తికి యోగ్యుల మవుతాము అని భావిస్తూ అర్జునుడు అలా సంబోధించి ఉండ వచ్చు.

*సన్యాస, త్యాగ శబ్దాలను సుస్పష్టం చేయడానికి గీతాచార్యుడు నోరు విప్పాడు.*

**శ్రీ భగవానువాచ :**

కామ్యానాం కర్మణాం న్యాసం సంన్యాసం కవయో విదుః ।
సర్వకర్మఫలత్యాగం ప్రాహు స్త్యాగం విచక్షణాః ॥ 2

*కామ్యానాం-కర్మణాం-న్యాసం-సంన్యాసం-కవయః-విదుః*
*సర్వకర్మఫలత్యాగం-ప్రాహుః-త్యాగం-విచక్షణాః*

| | | | |
|---|---|---|---|
| కవయః | = జ్ఞానులు | విదుః | = తెలుసుకున్నారు |
| కామ్యానాం | = కామ్యమైన | విచక్షణాః | = వివేకవంతులు |
| కర్మాణాం | = కర్మల యొక్క | సర్వకర్మఫలత్యాగం | = సకల కర్మల యొక్క ఫలమును త్యజించుటను |
| న్యాసం | = విడుచుటను | త్యాగం | = త్యాగము అని |
| సంన్యాసం | = సన్యాస మని | ప్రాహుః | = చెబుతారు |

**శ్రీ భగవానుడు చెబుతున్నాడు :**

**అర్జునా! కామ్య కర్మలను త్యజించుట సన్యాస మని కొందరు పండితులు చెబుతారు. సర్వ కర్మల ఫలములను త్యజించుట త్యాగ మని మరి కొందరు వివేకులు చెబుతారు.**

వ్యాఖ్య

గడచిన అధ్యాయాలలో సన్యాస, త్యాగ శబ్దములు అక్కడక్కడ వినిపించాయి. వాటిని గూర్చి చెప్పడం జరిగింది. అయినప్పటికీ వాటి విషయంలో ఒక స్పష్టత ఏర్పడని కారణం చేత, సన్యాస, త్యాగాలను వేరు వేరుగా, విస్పష్టంగా తెలుసుకోవాలని భావించి, సన్యాసము, త్యాగము - ఆ రెండిటి యొక్క యథార్థ స్వరూపాన్ని వేరువేరుగా చెప్పమని అర్జునుడు ప్రశ్నించడం చేత భగవంతుడు విస్పష్టార్థ నిమిత్తమై ఆ రెండిటి తత్త్వాన్ని నిర్వచిస్తున్నాడు.

వేదములో చెప్పబడిన అగ్నిహోత్రాది కర్మలు మొదలు అశ్వమేధ, పుత్రకామేష్టి యాగముల వరకు ఏయే కామ్యకర్మలు ఉన్నవో వాటి నన్నిటినీ పరిత్యజించడము సన్యాస శబ్దార్థము. ఏవయితే అనుష్ఠించ డానికి ఉన్నవో (అనుష్ఠేయములు) వాటిని అనుష్ఠించక పోవడము సన్యాస శబ్దార్థ మని కొందరు పండితుల అభిప్రాయము (*అనుష్ఠేయత్వేన ప్రాప్తస్య అననుష్ఠానం*).

పుత్ర కామేష్టి యాగము ఉందనుకోండి. అది అనుష్ఠించ దగినదే అయినా, అధిక సంతానం గల వారికి దాని అవసరం లేదు. కనుక ఆచరించినా, ఆచరించక పోయినా దోషం లేదు.

కామ్యకర్మలను త్యజించడము సన్యాసము. అదలా ఉంచితే, తనకు విహితము లైన నిత్య నైమిత్తిక కర్మల ఫలములను త్యజించుట త్యాగ శబ్దార్థము. అంటే, విహిత కర్మ త్యాగంతో ప్రత్యవాయ దోషం ప్రాప్తిస్తుంది కనుక, ఆశ్రమ విహితమైన నిత్య నైమిత్తికాది కర్మలను ఆచరిస్తూ కామ్య కర్మములను త్యజించడము





సన్యాస మని, తనకు శాస్త్రవిధి ననుసరించి ప్రాప్త మౌతున్న నిత్య నైమిత్తిక కర్మల ఫలములను త్యజించడము త్యాగమని పండితులు అభిప్రాయ పడుతున్నారు (*తం ప్రాహుః త్యాగ శబ్దార్థం విచక్షణాః పండితాః*).

కామ్యకర్మలను త్యజించడం అనినా, కర్మఫలమును త్యజించడ మనినా, పరిశీలించి చూస్తే రెండిటి అర్థం ఒక్కటి గానే అగుపిస్తుంది. ఎందుకంటే, సన్యాస, త్యాగ శబ్దాలకు త్యజించడము ఒక్కటే ప్రధానంగా అర్థ మవుతోంది (*సర్వథాऽ పి త్యాగమాత్రం సంన్యాస త్యాగ శబ్దయో ఏకః అర్థః*).

మరి, నిత్య నైమిత్తిక కర్మలకు ఫలం ఎక్కడా చెప్పబడ లేదు కదా! అనేది ఒక సందేహం. ప్రతి రోజు సంధ్యావందనాది నిత్య కర్మానుష్ఠానం సాగుతోంది. వివాహ మైతే, అగ్నిహోత్రాది నిత్యకర్మ కూడా ఉంటుంది. ఇవన్నీ నిత్యకర్మలు.

అనుదినము సాగే నిత్యకర్మలే కాకుండా సందర్భాను సారంగా సంప్రాప్త మయ్యేవి నైమిత్తికాలు. పితృ దేవతల కొరకు ఆచరించే కర్మలు, గ్రహణ కాలాలలో ఆచరించే కర్మలు, శ్రాద్ధ కర్మలు, సంక్రాంతి మొదలైన పర్వ దినాలలో అర్పించే పితృ తర్పణాలు మొదలైన వన్నీ నైమిత్తికాలు. ఈ విధమైన నిత్య నైమిత్తికాది కర్మలకు సంబంధించి ప్రాప్త మయ్యే ఫలాలను త్యజించడము త్యాగమని కొందరు పండితుల అభిప్రాయము. ఇక్కడ నిత్య నైమిత్తికాదులకు ఫలం ఉందా అనే ప్రశ్న తలెత్తుతుంది. ఫలమే లేనపుడు త్యాగ మేమిటి? అనేది సందేహం. ఇదెలా ఉందంటే, గొడ్రాలు స్త్రీ బిడ్డను త్యాగం చేసినట్లే ఉంది (*యథా వంధ్యాయాః పుత్ర త్యాగః*). వంధ్యకు సంతానమే ఉండదు కదా! ఆవిడ బిడ్డ నెలా త్యాగం చేస్తుంది? నిత్య నైమిత్తికాది కర్మలకు ఫలమే లేనపుడు, ప్రాప్తించని ఫలాన్ని త్యాగం చేసే దేముంటుంది?

ఈ సంశయానికి అవకాశం లేదు. నిత్య నైమిత్తికాదులకు కూడా ఫలం ఉందని ప్రస్తుత అధ్యాయం లోనే భగవంతుడు చెబుతాడు (*12 వ శ్లో*). సన్యాసులకు మాత్రమే కర్మఫల సంబంధం ఉండదని చెబుతాడు. అదంతా ఆ సందర్భములో చర్చిస్తాము.

*కర్మల విషయంలో మరి కొన్ని అభిప్రాయాలను తెలుపుతున్నాడు.*

త్యాజ్యం దోషవ దిత్యేకే కర్మ ప్రాహు ర్మనీషిణః ।
యజ్ఞదాన తపఃకర్మ న త్యాజ్య మితి చాపరే ॥ 3

*త్యాజ్యం-దోషవత్-ఇతి-ఏకే-కర్మ-ప్రాహుః-మనీషిణః*
*యజ్ఞదానతపఃకర్మ-న-త్యాజ్యం-ఇతి-చ-అపరే*

| | | | |
|---|---|---|---|
| ఏకే | = కొందరు | అపరే | = మరి కొందరు |
| మనీషిణః | = వివేకవంతులు | యజ్ఞదానతపఃకర్మ | = యజ్ఞము, దానము, తపస్సు అనెడి కర్మము |
| కర్మ | = కర్మను | న త్యాజ్యం ఇతి చ | = విడువగూడ దని |
| దోషవత్ | = దోషము వలెను | ప్రాహుః | = చెప్పిరి |
| త్యాజ్యం ఇతి | = విడువదగిన దని | | |

**అర్జునా! కర్మ దోష పూరిత మైంది కనుక విడిచి పెట్టాల్సిందే అంటారు కొందరు వివేకులు. మరి కొందరు పండితు లేమో యజ్ఞ దాన తపస్సులను విడిచిపెట్ట కూడదు అంటారు.**

వ్యాఖ్య

కర్మ చేయ దగింది కాదు, విడువ దగింది అని కొందరి అభిప్రాయము (*త్యాజ్యం త్యక్తవ్యం కర్మ*).

కర్మను ఎందుకు వదలాలి? కర్మ బంధహేతువు కనుక సమస్త కర్మము విడువ దగినదే అని వారి అభిప్రాయము. ఇది సాంఖ్య దృష్టి గల వారి అభిప్రాయము. కర్మలో దోష మెలా ఉంది? కర్మ బంధహేతువు కనుక దోష యుతము ***(బంధ హేతుత్వాత్)***.

పరమేశ్వరుని నియమాలను, నియతిని అనుసరించి మన కర్మలకు ఫలితాలు అందుతూ ఉంటాయి. మనం ఆచరించే కర్మకు ఫలితము ఆ కర్మ స్వభావమును బట్టే ఉంటుంది. దాని కన్నా అన్యమైన ఫలాన్ని ఆశిస్తే మిగిలేది నిరాశే. ఇదే కర్మ దోషము.

కర్మను బట్టే ఫలము. కర్మ పరిమితంగా ఉంటే ఫలం కూడా పరిమితం గానే ఉంటుంది. అంతే గాని, పరిమిత కర్మకు అనంత ఫలం వచ్చే అవకాశం లేదు.

ఏ కర్మ కూడా మరొక కర్మ కాలేదు. ఏ ప్రయత్నమూ మరొక ప్రయత్నము కాలేదు. ఏ కర్మకు ఆ ఫలితమే వస్తుంది కనుక, అనేక మైన కర్మలను ఆచరించడము వల్ల అనేక ఫలాలను పొందగల మేమో గాని, అనంత ఫలాన్ని మాత్రం పొంద లేము.

మనిషి అనంతానందాన్ని ఆశిస్తున్నాడు. అంతమయ్యే దోష గుణం గల కర్మ అనంత సుఖాన్ని ప్రసాదించ లేదు. కనుక కర్మ అనేది త్యాజ్యము ***(త్యక్తవ్యం)***. అంటే త్యజించ దగింది అని కొందరి అభిప్రాయము. కర్మల ద్వారా పొందే ఫలాలతో అనంతం కావాలని ఆశించడము ఎవరి కైనా, ఎప్పుడైనా నిరాశనే దించుతుంది. కనుక, కర్మ అజ్ఞానులకు సంబంధించింది అన్నారు భాష్యకారులు ***(అవిద్వ ద్విషయం కర్మ*** *: - 66 వ శ్లో)*. అజ్ఞానమే బంధము. కనుక అజ్ఞాన జనితమైన కర్మ బంధ హేతువుగా తెలుస్తూ ఉంది. ఎప్పుడైతే కర్మ బంధానికి కారణ మైందో, అది ముక్తికి కారణ మెలా మవుతుంది? ఈ విషయాన్నే బృహదారణ్య కోపనిష ద్భాష్యంలో ఆచార్యుల వారు నిర్ధారణ చేశారు.

***యదేవ ప్రవృత్తి కారణం తదేవ నివృత్తి కారణం న భవతి !*** - ఏదైతే బంధానికి కారణ మైందో, అది మోక్షానికి కారణం కాలేదు అన్నారు. కనుక, కర్మ దోషయుతమై ఉంది కాబట్టి అది త్యాజ్యము.

కొందరు ఈ అభిప్రాయంతో ఏకీభవించడం లేదు. దేహమును ధరించిన వాడు కర్మలను పూర్తిగా విడవడం సాధ్యం కాదని భగవంతుడే చెప్పి ఉన్నాడు *(11 వ శ్లో)*.

అద్వయాత్మను కర్మ ద్వారా పొందే అవకాశం లేదు. వస్తువు సిద్ధించి ఉన్నదే గాని, లేకుండా నూతనంగా పుట్టు కొచ్చేది కాదు. వస్తువు అనంతంగా, అద్వయంగా శోభించే టప్పుడు, అనంతాత్మను విచారం ద్వారా పొంద వలసిందే గాని కర్మ ద్వారా పొంద లేము ***(వస్తు సిద్ధి విచారేణ)***.

పొందబడే ఏ జ్ఞాన మైనా పొందే వ్యక్తి యొక్క అర్హత మీద ఆధారపడి ఉంటుంది. ఈ విషయంలో ఆత్మజ్ఞానం విలక్షణంగా లేదు. ఆత్మజ్ఞానమును పొందడ మనేది కేవలం విచారం మీదనే ఆధార పడి ఉంది అని తెలుసుకున్నాం. విచారించేది మనస్సు. అట్టి మనస్సు, లేదా బుద్ధి ఆత్మవిచారానికి యోగ్యతను కలిగి ఉండాలి. యోగ్యత అనేది చిత్తశుద్ధి. చిత్తశుద్ధి ఉంటేనే విచారంలో వస్తుసిద్ధి ప్రాప్తిస్తుంది.

చిత్తశుద్ధి రావాలి అంటే కర్మోపాసనలను ఈశ్వర బుద్ధితో ఆచరించాలి. మనో మాలిన్యం నిర్మూలించ బడాలి. అంటే, యజ్ఞ, దాన, తపస్సులను ఆచరించాలే గాని త్యజించ కూడదు. దోషయుతం కనుక, కర్మలను సంపూర్ణంగా త్యజించాలి అని కొందరు అభిప్రాయ పడుతూ ఉంటే, చిత్తశుద్ధి హేతువు లైన యజ్ఞ, దాన, తపస్సులను త్యజించ కూడదని మరి కొందరు అభిప్రాయ పడుతున్నారు ***(యజ్ఞ దాన తపః కర్మ న త్యాజ్య మితి చ అపరే)***.





*ఇలా పండితుల నుండి భిన్నాభిప్రాయాలు వ్యక్త మవుతూ ఉంటే, పరమేశ్వరుడు తన నిశ్చితాభిప్రాయ మేమిటో తెలియ జేస్తున్నాడు.*

**నిశ్చయం శృణు మే తత్ర త్యాగే భరతసత్తమ ।**
**త్యాగో హి పురుషవ్యాఘ్ర త్రివిధః సమ్ప్రకీర్తితః ॥** 4

***నిశ్చయం-శృణు-మే-తత్ర-త్యాగే-భరతసత్తమ***
***త్యాగః-హి-పురుషవ్యాఘ్ర-త్రివిధః-సంప్రకీర్తితః***

| | | | | | |
|---|---|---|---|---|---|
| భరతసత్తమ | = | అర్జునా! | శృణు | = | విను |
| తత్ర | = | ఆ | పురుషవ్యాఘ్ర | = | అర్జునా! |
| త్యాగే | = | త్యాగ విషయము నందు | త్యాగః | = | త్యాగము |
| మే | = | నా యొక్క | త్రివిధః | = | మూడు విధములుగ |
| నిశ్చయం | = | నిర్ణయమును | సంప్రకీర్తితః హి | = | చెప్పబడింది కదా! |

**అర్జునా! త్యాగం విషయంలో నా నిశ్చయం విను. పురుష శ్రేష్ఠా! త్యాగము మూడు విధాలుగా చెప్పబడింది కదా!**

## వ్యాఖ్య

సన్యాసములో త్యాగ గుణమే ప్రధానమై ఉండటం చేత, సన్యాస మంటే కామ్యకర్మ త్యాగ మని కొందరు, సర్వకర్మ ఫల త్యాగమే సన్యాస మని మరి కొందరు, దోషయుత మైన కర్మను త్యజించడమే సన్యాస మని ఇంక కొందరు, కామ్య నిషిద్ధ కర్మ త్యాగమే సన్యాస మని మరి కొందరు - ఇలా పండితులు వారి వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అర్జునుడు అడిగిన ప్రశ్నకు విషయమైన త్యాగ శబ్దార్థ మైన సన్యాసము నందు భగవంతుడు తన నిశ్చితాభిప్రాయమును చెబుతున్నాడు.

అర్జునా! కర్మసన్యాస, కర్మఫల త్యాగాలలో ఇమిడి యున్న త్యాగం విషయంలో ***( తత్ర త్యాగే త్యాగ సంన్యాస వికల్పే యథా దర్శితే)*** నా నిశ్చయాన్ని విను ***(మే నిశ్చయం శ్రుణు)*** అంటున్నాడు భగవంతుడు.

***త్యాగః హి*** - త్యాగ, సన్యాస శబ్దాల చేత ఏ అర్థము చెప్ప దగినదో అది ఒక్కటే అనే అభిప్రాయంతో 'త్యాగః హి' అని అంటున్నాడు. ఈ విధమైన త్యాగము గుణ భేదం చేత మూడు విధాలు ***(త్రివిధః తామసాది ప్రకారైః)***. ఇది శాస్త్ర సంప్రదాయము ***(సంప్రకీర్తితః శాస్త్రేషు సమ్యక్ కథితః)***. మూడు విధాలుగా తెలియ బడుతున్న ఈ త్యాగము ఆత్మజ్ఞానం లేని వాడు, అవివేకి, కర్మాధికారి అయిన కర్మిష్ఠునికి మాత్రమే సంభవ మవుతుంది. ఆత్మజ్ఞానం కల వానికి ఇది సంభవించదు. అందుచేత ఈ తత్త్వమును తెలుసుకోవడము అందరికీ సాధ్యము కాదు ***(ఇతి అయం అర్థః దుర్ జ్ఞానః తస్మాత్ అత్ర తత్త్వం న అన్యః వక్తుం సమర్థః)***. దీనిని గ్రహించడము చాలా కష్టము కనుక దీనిని చెప్పడానికి నా కన్నా మరొకడు సమర్థుడు కాడు. కనుక, అర్జునా! ఈ విషయంలో, ఇది పరమార్థమైన శాస్త్రానికి సంబంధించిన విషయం కావడం చేత, ఈశ్వరుడ నైన నా నిశ్చయాన్ని ఆలకించు ***( తస్మాత్ నిశ్చయం పరమార్థ శాస్త్రార్థ విషయమ్ అధ్యవసాయం ఐశ్వరం శ్రుణు )*** అంటున్నాడు భగవంతుడు. విను ***(శృణు)*** అని ప్రత్యేకంగా భగవంతుడు చెబుతున్నా డంటే శ్రవణంలో అవధానం అవసర మని సూచించడము జరుగుతూ ఉంది. విషయం ఏకోన్ముఖంగా సాగే టప్పుడు విషయం

సుగ్రాహ్య మవుతూ ఉంటుంది. అలా కాకుండా, భిన్నాభిప్రాయాలు గోచరించే చోట అవధానం అధికంగా ఉండాలి.

ప్రమాణ విషయము నందు పరమేశ్వరుడు తన నిశ్చయాన్ని చెబుతూ ఉన్నందున, శ్రోతను సావధానంగా ఉంచడానికి ***భరతసత్తమ! పురుషవ్యాఘ్ర!*** అని అర్జునుని సంబోధించాడు భగవంతుడు. సంప్రదాయ ప్రవర్తకులైన భరత వంశీయులలో శ్రేష్ఠుడు కావడం చేత అర్జునుణ్ణి 'భరతసత్తమ!' అని సంబోధించాడు (***భరత సత్తమ భరతానాం సాధుతమ***).

*భగవంతుని నిశ్చయ మేమిటో చెబుతున్నాడు.*

**యజ్ఞ దాన తపః కర్మ న త్యాజ్యం కార్యమేవ తత్ ।**
**యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్ ॥** 5

***యజ్ఞదానతపఃకర్మ-న-త్యాజ్యం-కార్యం-ఏవ-తత్***
***యజ్ఞ-దానం-తపః-చ-ఏవ-పావనాని-మనీషిణాం***

| | | | |
|---|---|---|---|
| యజ్ఞ దాన తపః కర్మ | = యజ్ఞము, దానము, తపస్సు అనే కర్మ | యజ్ఞః | = యజ్ఞము |
| న త్యాజ్యం | = విడువ దగినది కాదు | దానం | = దానము |
| తత్ | = అది | తపః చ ఏవ | = తపస్సు |
| కార్యం ఏవ | = చేయ దగిందే | మనీషిణాం | = వివేకవంతులకు |
| | | పావనాని | = పవిత్ర మైనవి |

**అర్జునా! యజ్ఞము, దానము, తపస్సు అనేవి చేయ దగినవే కాని విడువ దగినవి కావు. యజ్ఞ, దాన, తపస్సులు బుద్ధిమంతుల్ని పవిత్రం చేస్తాయి.**

**వ్యాఖ్య**

కర్మలు అజ్ఞాన జనితములు; జ్ఞాన ప్రతిబంధకాలు; కనుక, కర్మలను సమూలంగా త్యజించాలి అని కొందరు వెలిబుచ్చిన అభిప్రాయాలను మనం చూశాం. కాని, భగవంతుడు తన నిశ్చయాన్ని వినిపిస్తూ, యజ్ఞ, దాన, తపః, కర్మలను త్యజించ కూడదు అంటున్నాడు. పైగా వాటిని ఆచరించి తీరాలి అంటున్నాడు. ఇలా ఎందుకు అంటున్నాడంటే, యజ్ఞ, దాన, తపస్సులు వివేకవంతులకు పవిత్రతను చేకూర్చుతాయి అని చెబుతున్నాడు.

అంతఃకరణ శుద్ధి లేనిదే ఆత్మజ్ఞానము సిద్ధించదు అని ఇప్పటికే తెలుసుకున్నాం. యజ్ఞ, దాన, తపస్సులు అంతఃకరణము ఎలా శుద్ధి చేస్తాయో పూర్వాధ్యాయాలలో కూడా చెప్పుకున్నాం. అలాంటి పవిత్ర కార్యాలను త్యజించ వలసిన అవసర మేముంది? అందుచేత, వాటిని విడిచి పెట్టకూడదు అని అంటున్నాడు (***న త్యాజ్యమ్ న త్యక్తవ్యం***). అంతటితో ఆగ లేదు. వాటిని చేసి తీరాలి అంటున్నాడు (***కార్యం కరణీయమ్ ఏవ తత్***).

ఇక్కడ యజ్ఞములు అంటే వేద పరమైన శ్రౌత యజ్ఞాలే కాదు; స్మార్త యజ్ఞాలు కూడా అన్వయింపబడతాయి. ఈశ్వరారాధనార్థం చేసే స్మార్త కర్మ లన్నీ యజ్ఞాలే అవుతాయి. పూజ, ధ్యాన, సంకీర్తన, జపాదులన్నీ యజ్ఞాలే. ఇవన్నీ సాధకుని మనస్సును శుద్ధి చేస్తాయి.

యజ్ఞ, దాన, తపస్సులు, వాటిని ఆచరించే వారందరికీ చిత్తశుద్ధిని కలిగిస్తాయా? చెప్పలేము. అందుచేతనే,



వివేకవంతుల బుద్ధిని శుద్ధి చేస్తాయి అన్నాడు. వారే మనీషులు. మనీషులు అంటే ఫలాసక్తి లేని వారు అని అర్థము. అట్టి వారిని, అంటే కర్మఫలాల యందు ఆసక్తి లేక, కేవలం మోక్షార్థమే పవిత్ర కార్యాలను ఆచరించే వారిని; అంతఃకరణ శుద్ధ్యర్థమే నిర్వర్తించే వారిని యజ్ఞాది కర్మలు పవిత్రుల్ని చేస్తాయి. అంతఃకరణ శుద్ధిని ప్రసాదిస్తాయి (***పావనాని విశుద్ధి కరాణి మనీషిణాం ఫలానభి సంధీనామ్***).

మోక్షం ఎవరి కైతే పురుషార్థం కాదో, వారి దృష్టి పరమేశ్వరునిపై ఉండదు. తమ కార్యాలు సిద్ధించడానికి మనుషుల్ని ఎలాగైతే వినియోగించు కుంటారో, అలాగే భగవంతుణ్ణి కూడా అర్థ కామాల ప్రయోజనార్థం వినియోగించు కుంటారు. వారు యజ్ఞ, దాన, తపస్సులు ఆచరించినా, అవి విషయ ప్రయోజనార్థం ఉంటాయే గాని భగవత్ప్రీత్యర్థం ఉండవు. వారి సాధనలలో విషయం ఈశ్వరుడు కాడు. విషయాల కొరకు ఈశ్వరుడు. ఇదే పెద్ద తేడా.

కనుక, కర్మయోగ, కర్మసన్యాసాలలో పరమేశ్వరుడే ధ్యేయమై ఉండటం చేత, విషయాసక్తి, కర్మఫలాసక్తి లేని వారి కర్మలకు ఫలితంగా చిత్తశుద్ధి ప్రాప్తిస్తుంది. యజ్ఞ, దాన, తపస్సులు చేసే వారందరికీ చిత్తశుద్ధి ఏర్పడే టట్లైతే, రావణ, హిరణ్యాకశిపాదులకు చిత్తశుద్ధి ప్రాప్తించి ఉండేది. ఎవరైతే పరమ పురుషార్థమైన మోక్షమునే కాంక్షించి యజ్ఞాది త్రివిధ కర్మలను ఆచరిస్తారో, వారే అంతఃకరణ శుద్ధిని పొందుతారు (***పావనాని మనీషిణామ్***). ఈశ్వరుని విడిచి మరొక దానిని ఆశించే వారిని అవి శుద్ధి చేయ లేవు. కారణం, వారి దృష్టి చిత్తశుద్ధిపై లేదు కనుక.

శ్రౌత, స్మార్త, యజ్ఞాలే గాక దానము కూడా బుద్ధిని శుద్ధి చేస్తుంది. ధనాన్ని అనేక విధాలుగా సంపాదిస్తాము. తెలిసో, తెలియకో ధనం అన్యాయార్జితంగా ఉంటుంది. దేహం శుద్ధి పడటానికి స్నానం చేస్తాము. బుద్ధి శుద్ధి పడటానికి ధ్యానం చేస్తాము. విత్తము శుద్ధి పడటానికి ఏమి చేయగలం? దాన మొక్కటే చేయ గలము. దానం వల్ల ధనం శుద్ధి పడుతుంది. దేశకాలాదులను అనుసరిస్తూ, ఈశ్వరార్పణ బుద్ధితో పాత్రోచిత దానం చేస్తే అట్టి పవిత్రమైన దాన కార్యము అంతఃకరణమును పవిత్రం చేస్తుంది.

యజ్ఞ దానాలు మోక్షార్థం చేసి నపుడు చిత్తశుద్ధికి ఎలా సహకరించాయో, అలాగే తపస్సు కూడా కల్మషాలను పోగొట్టి బుద్ధిని పవిత్రం చేస్తుంది.

***తపోభిః క్షీణ పాపానాం శాంతానాం వీత రాగిణామ్***
***ముముక్షూణాం అపేక్ష్యోయం ఆత్మబోధో విధీయతే***

తపస్సు చేత మనస్సు లోని పాపాలను పోగొట్టుకున్న వాళ్ళు, రాగద్వేషాల నుండి విడి పడిన ప్రసన్న చిత్తులైన ముముక్షువులకు పరమ పురుషార్థ సిద్ధి అయిన మోక్షమునకు ఆశించ దగిన ఆత్మజ్ఞానము బోధింపబడుతూ ఉంది అన్నారు ఆత్మబోధ గ్రంథంలో శ్రీ ఆదిశంకరాచార్య స్వామి.

***తపో హి స్వాధ్యాయః*** - స్వాధ్యాయము కూడా తపస్సే అన్నది శాస్త్రము. స్వాధ్యాయము జ్ఞాన ప్రధానం కనుక బుద్ధి శుద్ధి పడుతుంది.

*కనుక, కర్తవ్యా లైన యజ్ఞ, దాన, తపస్సుల విషయంలో భగవంతుడు తన నిశ్చయాన్ని విశదం చేస్తున్నాడు.*

**ఏతా న్యపి తు కర్మాణి సఙ్గం త్యక్త్వా ఫలాని చ ।**
**కర్తవ్యా నీతి మే పార్థ నిశ్చితం మత ముత్తమమ్ ॥** 6

***ఏతాని-అపి-తు-కర్మాణి-సంగం-త్యక్త్వా-ఫలాని-చ***
***కర్తవ్యాని-ఇతి-మే-పార్థ-నిశ్చితం-మతం-ఉత్తమం***

| | | | | | |
|---|---|---|---|---|---|
| పార్థ | = | అర్జునా! | కర్తవ్యాని ఇతి | = | చేయ దగినవి అని |
| ఏతాని | = | ఈ | మే | = | నా యొక్క |
| కర్మాణి అపి తు | = | కర్మలను కూడ | నిశ్చితం | = | నిశ్చితమైన |
| సంగం | = | ఆసక్తిని | ఉత్తమం | = | ఉత్తమమైన |
| ఫలాని చ | = | ఫలమును | మతం | = | అభిప్రాయము |
| త్యక్త్వా | = | విడిచి | | | |

**అర్జునా! యజ్ఞ, దాన, తపస్సులు చేయ దగినవి అనేదే నా అభిప్రాయం కూడా. కాకపోతే, ఆసక్తిని, ఫలాపేక్షను విడిచి పెట్టాలి.**

## వ్యాఖ్య

యజ్ఞ, దాన, తపస్సులను విడిచి పెట్టకూడదు. తప్పక ఆచరించాలి. బుద్ధిమంతులైన వారిని, ముముక్షువు లైన వారిని అవి పావనం చేస్తాయి అని పూర్వ శ్లోకంలో బోధించిన భగవానుడు, వాటిని ఎలా ఆచరించాలో ప్రస్తుత శ్లోకంలో చెబుతున్నాడు. అంతే కాదు. ముముక్షువులు కాని వారికి అవి ఎలా చిత్తశుద్ధిని కలిగించ లేవో కూడా పరోక్షంగా స్పష్టం చేస్తున్నాడు. కర్మల విషయంలో తన నిశ్చయాన్ని చెబుతానని నాల్గవ శ్లోకంలో ఆరంభించిన ప్రసంగాన్ని ప్రస్తుత శ్లోకంతో సమాప్తం చేస్తున్నాడు. ***నిశ్చయం శృణు*** అని నాల్గవ శ్లోకంలో 'నా నిశ్చయం విను' అన్నాడు. 'ఇది నిశ్చిత మైన, ఉత్తమ మైన నా అభిప్రాయము' అని ప్రస్తుత శ్లోకంలో నిశ్చయాన్ని పునరుద్ఘాటి స్తున్నాడు ***( మే నిశ్చితం మత ముత్తమమ్ ).***

అర్జునా! యజ్ఞ, దాన, తపః కర్మలు సంగత్వమును విడిచి ***( సంగం త్యక్త్వా )*** ఫలాకాంక్షను త్యజించి ***( ఫలాని త్యక్త్వా )*** చేయ దగినవి ***( కర్తవ్యాని ).*** ఇది ఉత్తమ మైన నా నిశ్చితాభిప్రాయము అంటున్నాడు.

కర్మలు చెడ్డవీ కావు, మంచివీ కావు. ఉద్దేశ్యాన్ని బట్టి రూపం దాల్చుతాయి. ఏ భావనతో చేస్తామో దానిని బట్టి ఫలం ఉంటుంది. ఏవైతే ముముక్షువునకు చిత్తశుద్ధిని కలిగిస్తున్నాయో, అవే కర్మలు కర్మసంగంతో, ఫల సంగంతో ఆచరించే వారికి బంధహేతువు లవుతున్నాయి ***( సా సంగస్య ఫలార్థినః బన్ధహేతవః ఏతానపి కర్మాణి ముముక్షోః కర్తవ్యాని ఇతి ).***

ఈ విషయంలో కొందరికి అభ్యంతరాలు ఉంటాయి. ఎందుకంటే, ఇది చాలా సూక్ష్మమైన విషయం. నీరు శుద్ధి కార్యానికి ఉపకరిస్తుంది కదా! అది ఎవరి దేహమున ఉన్న మాలిన్యా న్నయినా పోగొడుతుంది. ఇతడు ముముక్షువు, అతడు మొద్దు, ఇది ఎద్దు అని చూస్తుందా! శుద్ధి కార్యానికి ఉపకరించే నీరు ఎవరి నైనా, దేని నైనా శుద్ధి చేస్తుంది. మరి, యజ్ఞ, దాన, తపస్సులు అంతఃకరణ శుద్ధికి ఉపకరించే టప్పుడు, కర్మసంగం ఉంటే ఏమి? ఫలాభిసంధి ఉంటే ఏమి? వాటి కార్యాలను అవి చెయ్యాలి కదా? చిత్తశుద్ధికి, ఫలాభి సంధికి సంబంధ మేమిటి? అనే శంక కొందరిలో ఉంటుంది. ఇది చాలా ఆసక్తికరమైన విషయము.

యజ్ఞ, దానాది పవిత్ర కర్మలను కామ్యకర్మలుగా ఆచరించినా, అవి ధర్మరూపాలే కనుక శుద్ధిని కలిగిస్తాయి. కాకపోతే, ఆ శుద్ధి ఫలము దేనిని ఉద్దేశించి మనం యజ్ఞాది కర్మల్ని ఆచరించామో, ఆ కర్మఫల భోగానికి ఉపకరిస్తుందే గాని, జ్ఞానానికి ఉపకరించదు. ఇది అసలు విషయం.



కర్మ చేసిం దెవరో అతడికే కర్మఫలం అందాలి. ఏ భావనతో కర్మ చేస్తాడో తత్సంబంధమైన ఫలమే అందాలి. అర్థకామాలు, లేదా ధర్మానికి సంబంధించిన భావనను బుద్ధిలో ఉంచుకొని, వాటి నిమిత్తము యజ్ఞ, దాన, తపః కర్మలు ఆచరిస్తే , వాటి ఫలితంగా పుణ్యాన్ని పొందుతాడేమో గాని, మోక్షార్థం అంతఃకరణ శుద్ధిని ఎలా పొందుతాడు? అసలు మోక్ష భావనే అతనికి లేదు కదా! యజ్ఞాది కర్మల వల్ల చిత్తశుద్ధి కలిగినా, అది భోగార్థమే గాని మోక్షార్థము ఉపకరించదు అనేది సశాస్త్రీయమైన అవగాహన. భావన ఒక్కటై నపుడు అనుభవము మరొకటి ఎలా అవుతుంది? మతిని బట్టే కదా గతి? ఈ విషయాన్ని వార్తికాకారులైన సురేశ్వరులు ఒక అందమైన శ్లోకంలో ఉదాహరణంగా చెబుతారు.

***కామ్యేఽ పి శుద్ధిరస్త్యేవ భోగ సిద్ధ్యర్థ మేవ సా ।***
***వి ద్వరాహాది దేహేన నహ్యైన్ద్రం భుజ్యతే ఫలమ్ ॥***

కామ్య కర్మ యందు కూడా శుద్ధి కలుగుతుంది. ఆ శుద్ధి భోగసిద్ధి కొరకే. ఊరపంది శరీరముతో ఇంద్రలోక భోగాలను అనుభవించడం సాధ్య పడుతుందా? అన్నారు.

**కర్తవ్యాలు**

యజ్ఞ, దాన, తపః కర్మలు ముముక్షువులను పావనం చేస్తాయి కనుక అవి కర్తవ్యాలు. అంటే చేయ దగినవి ***( కర్తవ్యాని అనుష్ఠేయాని ).*** ఇవి త్యజించ దగినవి కావు. ఆచరించ దగినవి. ఆచరించ గలిగే అదృష్టాన్ని భగవంతుడు మనకు ప్రసాదించి ఉన్నందున అవశ్యం ఆచరించ దగినవి.

యజ్ఞము పవిత్ర కర్మే కావచ్చు. దానం పవిత్ర కర్మే కావచ్చు. తపస్సు కూడా పవిత్రమే కావచ్చు. ఆరోగ్యం లేకపోతే యజ్ఞము చేయగలమా? ధనం లేకపోతే దానం చేయగలమా? కళ్ళు లేకపోతే స్వాధ్యాయం చేసే దెలా? మూగవాడు సంకీర్తన చేయగలడా? చేతులు లేకుండా పుట్టిన వాడు రామకోటి వ్రాయ గలడా? ఇలా ఎందరు లేరు ఈ ప్రపంచంలో? దురదృష్టాలు విలయ తాండవం చేస్తున్న ప్రపంచంలో కర్తవ్యాలు నిర్వహించే భాగ్యం కలగడం భగవంతుని కృప కాదా? భగవత్కృప ఉన్నా, చేయకుండా ఉండటమా? చెయ్య వలసినవి, చెయ్య దగినవి చేయ నపుడు, ఆ తరువాత ఏమి చేయాలని? చెయ్య కూడనివి చెయ్యాలనా? అలా చేసే కదా జన్మ లన్నీ వృథా అయ్యాయి!

కనుక, కర్తవ్యాలను తప్పక ఆచరించాలి ***( కర్తవ్యాని కర్మాణి కరణీయాని ).*** కర్మసంగం లేకుండా, ఫలసంగం లేకుండా ఆచరిస్తే, అవి చిత్తశుద్ధిని కలిగించి ముక్తి మార్గాన్ని సుగమం చేస్తాయి. యజ్ఞ, దాన, తపస్సులు కర్తవ్యాలు. వాటిని ఫలసంగం లేకుండా, కర్మసంగం లేకుండా ఆచరించాలి. ఇది పరమేశ్వరుని ఉత్తమ మైన, నిశ్చయ మైన అభిప్రాయము; కాదు ఆజ్ఞ.

*కనుక, యజ్ఞ, తపో, దానాది కర్మలను అజ్ఞానులు త్యజించ కూడదు. ఒకవేళ త్యజిస్తే, అది తామస త్యాగ మవుతుంది.*

**నియతస్య తు సంన్యాసః కర్మణో నోపపద్యతే ।**
**మోహా త్తస్య పరిత్యాగ స్తామసః పరికీర్తితః ॥** 7

***నియతస్య-తు-సంన్యాసః-కర్మణః-న-ఉపపద్యతే***
***మోహాత్-తస్య-పరిత్యాగః-తామసః-పరికీర్తితః***

నియతస్య తు = విధియుక్త మైన

| | | | | | |
|---|---|---|---|---|---|
| కర్మణః | = | కర్మ యొక్క | తస్య | = | దాని యొక్క |
| సంన్యాసః | = | పరిత్యాగము | పరిత్యాగః | = | విడచుట |
| న ఉపపద్యతే | = | తగదు | తామసః | = | తామస మని |
| మోహాత్ | = | మోహము వలన | పరికీర్తితః | = | చెప్పబడింది |

**అర్జునా! నిత్య కర్మను విడిచి పెట్టడం మంచిది కాదు. ఎవరైనా అజ్ఞానము వలన విడిచి పెడితే అది తామస త్యాగము అవుతుంది.**

### వ్యాఖ్య

**నియత కర్మాచరణము**

నియత కర్మలను త్యజించ కూడదు. నియత కర్మ అంటే విధియుక్త మైన కర్మ. విహిత కర్మ. శాస్త్ర విహిత కర్మ. నిత్య నైమిత్తికాది రూపమై, అవశ్యం ఆచరించ దగిన కర్మ. అట్టి నియత కర్మ యొక్క పరిత్యాగము ***(నియతస్య కర్మణః సంన్యాసః)*** సరి యైనది కాదు. యుక్తం కాదు ***(న ఉపపద్యతే)***. త్యజించ వలసింది నిషిద్ధ కర్మలనే గాని నియత కర్మలను కాదు.

పూర్వ వాసనలు ఒక వైపు, ప్రస్తుత విషయాకర్షణలు మరొక వైపు మానవుని ప్రేరేపిస్తూ కర్మ సుడి గుండం లోకి దించుతూ ఉంటాయి. ఏది యుక్తం, ఏది అయుక్తం అనేది కర్మల విషయంలో నిర్ణయించుకొని, నిర్ధారించుకొని ఆచరించడం అందరికీ సాధ్యం కాదు. బాల్యంలో బిడ్డకు యుక్తమైన ఆహారాన్ని తల్లి అందించి నట్లు, కర్మల విషయంలో శాస్త్రమాత యుక్తమైన నియత కర్మలను విధించి మన బ్రతుకులను ఉద్ధరిస్తూ ఉంది. బాల్యంలో తల్లి పెట్టింది ఎలా ఆరగించామో, అలాగే శాస్త్రం చెప్పినట్లు, విధి యుక్త కర్మలను ఆచరించాలి.

శ్రుతిమాత శాస్త్రోక్తంగా, ప్రత్యక్షంగా, స్పష్టంగా నియత కర్మ విధిని తెలియ చేస్తూ ఉంటే, ప్రకృతి మాత పరోక్షంగా కర్మ విధులను నియమిస్తూ ఉంటుంది. ప్రకృతి నిర్ణయాలు శాస్త్ర విహితం గానే ఉంటాయి. కాకపోతే, వాటిలో మన ఇష్టాయిష్టాలు మిళిత మైనపుడే విషమిస్తాయి.

మనిషి నిత్యము ఆచరించే కర్మలలో భోజన, స్నానాదులు కూడా ఉన్నాయి. 'నువ్వు భోం చెయ్యి' అని ఒకరు చెప్ప నవసరం లేదు. తన ఆకలే తాను ఆరగించేటట్లు చేస్తుంది. తిన మని మనిషికి చెప్ప నవసరం లేదు. తినకుండా తానే ఉండ లేడు. స్నానం చేయకుండా మనుగడను సాగించ లేడు. ఇలాంటివి నిత్య కర్మలే. నిత్యము ఆచరించే కర్మలే. వీటిని ప్రత్యేకించి శాస్త్రము చెప్ప నవసరం లేదు.

భుజించడానికి శాస్త్రము అవసరం లేదు. ఏది భుజించాలి? అనేది చెప్పడానికి శాస్త్రం కావాలి. ఆకలి మనిషికి ఉంది. జంతువుకూ ఉంది. మాంసము బాహ్యంలో ఆహారంగా కనిపిస్తూ ఉంది. ***కలంజం న భక్షయేత్*** - నువ్వు మాంసాన్ని భుజించ కూడదు అని శాస్త్రము మనిషికే చెబుతుంది. జంతువుకు చెప్పదు. కనుక ప్రకృతి నిర్ణయించే కార్యాలలో కూడా శాస్త్ర ప్రమేయం ఉండి తీరాలి. శాస్త్రము నరులకే గాని వానరులకు కాదు.

***శ్రుతయో యత్ర వర్తన్తే తత్ర వర్తన్తి వై నరాః ।***
***మతయో యత్ర వర్తన్తే తత్ర వర్తన్తి వానరాః ॥***

శ్రుతులు చెప్పినట్లు ప్రవర్తించే వారు నరులు. మతులు చెప్పినట్లు వర్తించే వారు వానరులు అని కూడా శాస్త్రమే చెప్పింది.



***చలనాత్మకం కర్మ*** - కర్మ చలించే స్వభావం కలది అని స్థూల నిర్వచనము. మనలో ఏ విధమైన చలనాలు జరిగినా అవన్నీ కర్మలే. కొన్ని మన అధీనంలో ఉంటాయి. కర్మలు మనవే అయినా, కొన్ని మన అధీనంలో ఉండవు.

శ్వాసించడం కర్మ కాదా? శ్వాస క్రియ కర్మే. కాని, మన ప్రయత్నం లేకుండా సాగి పోతోంది. రోజుకు ఇరవై ఒక్క వేల ఆరువందల సార్లు నాసికాలు శ్వాసిస్తూ ఉన్నా, ఆ అలసటను మనం అనుభవించడం లేదు. అవి మన కర్మలే అయినా, మన ప్రమేయం లేకుండా సాగి పోతున్నాయి. శ్వాసలు కూడా ప్రయత్నంతో చేయ వలసిన పరిస్థితే ఉంటే, మన జీవిత మంతా మరో పని లేకుండా శ్వాసించ డానికే సరి పోయేది. ఆ పని దయామయు డైన పరమేశ్వరుడు తన అమృత హస్తాల లోకి తీసుకోవడం వల్ల మన చేతులు వేరే పనులలో నిమగ్న మయ్యాయి. మన చిత్తాలు వేరే విషయాలలో లగ్న మయ్యాయి. కాని, మన ప్రమేయం లేకుండా శ్వాసక్రియ సాగి పోతున్నా, దుర్గంధముతో వాయువు వీచి నపుడు, మనం ప్రయత్నించి శ్వాసించడం ఆపు తున్నాము. అది ప్రాణ నిరోధమే. కాని, నీలో ప్రాణక్రియ, లేదా శ్వాసక్రియ నీ ప్రమేయం లేకుండానే సాగు తున్నా, నీకు పరమేశ్వరుడు ప్రాణం ప్రసాదించి నందుకు ప్రాణాన్ని యామించి, నియమించి, నిరోధించి, విధి యుక్తంగా నీవు ప్రాణాయామం చేయాలి అని శాస్త్రం చెబుతుంది. ప్రాణాయామము పవిత్రమైన సాధన. అందుచేత ***ప్రాణాయామే వినియోగః*** అని పూజలో కూడా చెబుతున్నాం. చేస్తున్నాం. ప్రాణాయామము ఆరోగ్య ప్రదమే గాక, ఆనంద దాయకము, ఆధ్యాత్మిక ప్రగతి సోపానము కూడా.

ఇలా కొన్ని కర్మలు ప్రకృతి నిర్ణయాలుగా ఉన్నా, శాస్త్ర ప్రవేశంతో విహితంగా, యుక్తంగా తీర్చబడు తున్నాయి. కొద్దిగా మన ప్రమేయం కూడా ఉంది. ఆ విషయంలో కూడా శాస్త్రము మనకు హితం చెబుతూనే ఉంది.

శ్వాసక్రియ అయితే మన ప్రమేయం కొద్దిగా ఉందనేది అర్థ మవుతూ ఉంది. జీర్ణక్రియ విషయాని కొస్తే, అక్కడ మన ప్రమేయమే లేదు. జీర్ణక్రియ మనదే. ఎవరి జీర్ణక్రియ వారిదే. ఎవరు భుజించిన ఆహారము వారి లోనే జీర్ణ మవుతూ ఉంది.

కాని, ఎవరి జీర్ణక్రియ అయినా, వారి ప్రమేయం లేకుండా సాగి పోతూ ఉంది. ఏది జీర్ణ మైందో తెలియదు. ఏది జీర్ణం కాలేదో తెలియదు. ఆహారం ఎలా రక్తంగా మారుతూ ఉందో శాస్త్రజ్ఞులకే అంతు పట్టడం లేదు. ఇదంతా పరమేశ్వరుని కృపతో సాగి పోతోంది. మన ప్రమేయం లేని చోట భగవంతుని అదృశ్య హస్తం పని చేస్తోంది. అక్కడ నేను ప్రవేశించలేక పోయినా, అక్కడ ప్రవేశించి పచనం చేస్తున్న పరమేశ్వరుని పవిత్ర హస్తాలను నేను గౌరవించాలి. ఆరాధించాలి. పవిత్రంగా పూజించాలి. అపవిత్రమైన మద్య మాంసాదులను అక్కడ ఉంచడం ధర్మం కాదు అని శాస్త్రమాత చెబుతోంది. నాకు భగవంతుడు బుద్ధిని ప్రసాదించింది శాస్త్రమాత విహిత వచనాలను ధిక్కరించడానికా? కానే కాదు. అందుచేత విహిత కర్మలను, నియత కర్మలను పరిత్యజించ కూడదు ***(నియతస్య కర్మణః పరిత్యాగః న ఉపపద్యతే)***.

**తామస త్యాగము**

శుద్ధి అనేది ఎక్కడ అవసరం? ఎవరికి అవసరం? ఎక్కడ అశుద్ధం ఉంటుందో, మలినం ఉంటుందో, అక్కడే శుద్ధి కార్యం జరగాలి. ఎవరిలో అపవిత్రత చోటు చేసుకుంటుందో అక్కడే పవిత్ర కార్యాలు సాగాలి. చీకటి ఉన్న చోటే వెలుగు కావాలి. రావాలి. మరి పవిత్రత అవసరమైన చోట పరిత్యాగము సమంజస మేనా? అలా ఎవరైనా పరిత్యజిస్తే, వారికి యుక్తాయుక్తాలు తెలిసి రావడం లేదని భావం, అదే మోహ మంటే. మోహవశులై,

విహిత విహీనులై చరించే వారు చేసే పరిత్యాగము సాత్త్విక మైనది కాదు. అందులో వైగుణ్యమే కాని సాద్గుణ్యము లేదు. అలాంటి మోహ ప్రేరిత త్యాగాన్ని తామస త్యాగము అంటున్నాడు భగవంతుడు (***మోహాత్ అజ్ఞానాత్ పరి త్యాగః తామసః పరికీర్తితః***).

కర్మను విడిచిన ప్రతి వ్యక్తి త్యాగి కాడు. వాస్తవం చెప్పాలంటే, త్యాగి కర్మలను త్యజించడు. కర్మలను విడిచి పెట్టడు. కర్మలే అతణ్ణి విడిచి పెట్టి దూరంగా వెళ్తాయి. వాడిన పూలు తమంతట తాము రాలి పోయినట్లు, త్యాగి నుండి కర్మలు దూర మవుతాయి.

త్యాగ బుద్ధి లేక పోయినా త్యాగం చేయడ మనేది తామస కార్యము. మోహ జనితము. అజ్ఞానము వలన ప్రాప్తము. అజ్ఞానం చేత కలుషిత మైన వ్యక్తి, రాగద్వేషాల చేత మలిన పడిన చిత్తము శుద్ధి కర్మల చేత పవిత్రం కావాలి. అపవిత్రమైన వానికే పవిత్రత యొక్క అవసరం ఉంది (***అజ్ఞస్య పావనత్వస్య ఇష్టత్వాత్***). అవసరం ఒక వైపు ఉండినా, మరో వైపు ఆచరణమును త్యజించడం ఏమిటి? అడుసు ఎందుకు త్రొక్కావు? అని అడగడం లేదు. కాళ్ళు ఎందుకు శుభ్రం చేసుకోవు? అనేదే ప్రశ్న. ఇదంతా అజ్ఞానము. మోహము. మోహంతో చేసే త్యాగము కనుక ఇది తామస త్యాగము. మోహము అంటే తమస్సే కాబట్టి (***మోహః చ తమః ఇతి***).

*ఇక రాజస త్యాగాన్ని గూర్చి చెబుతున్నాడు.*

**దుఃఖ మి త్యేవ యత్కర్మ కాయక్లేశ భయా త్త్యజేత్ ।**
**స కృత్వా రాజసం త్యాగం నైవ త్యాగఫలం లభేత్ ॥** 8

***దుఃఖం-ఇతి-ఏవ-యత్-కర్మ-కాయక్లేశభయాత్-త్యజేత్***
***సః-కృత్వా-రాజసం-త్యాగం-న-ఏవ-త్యాగఫలం-లభేత్***

| | | | |
|---|---|---|---|
| కాయక్లేశభయాత్ | = శరీరాయాస భీతి వలన | రాజసం | = రాజసమైన |
| దుఃఖం ఇతి ఏవ | = శోకదాయక మైనదే యని | త్యాగం | = త్యాగమును |
| యత్ | = ఏ | కృత్వా | = ఆచరించి |
| కర్మ | = కర్మమును | త్యాగఫలం | = త్యాగ ఫలమును |
| త్యజేత్ | = త్యజిస్తున్నాడో | న లభేత్ ఏవ | = పొందనే పొందడు |
| సః | = వాడు | | |

**అర్జునా! ఎవడు శరీరానికి కష్ట మని, దుఃఖం కలుగు తుందని భయపడి కర్మను విడిచి పెడతాడో ఆ త్యాగము రాజస త్యాగము. అతడు త్యాగ ఫలమును పొంద లేదు.**

### వ్యాఖ్య

పూర్వ శ్లోకంలో తామస త్యాగిని చూశాం. అతని త్యాగం వెనుక అజ్ఞానము ఉంది. కనుక తెలియక, తెలివి లేక త్యాగం చేసిన వాడు తామస త్యాగి. అతని త్యాగము తామస త్యాగము.

ఇప్పుడు అష్టమ శ్లోకంలో కష్టాలను ఆరబోస్తూ, నిష్ఠూరంగా ప్రవేశిస్తున్న వ్యక్తి రాజస త్యాగి. ఇతనిది రాజస త్యాగము. తామసత్యాగి తెలియక, అజ్ఞానం చేత త్యాగం చేస్తాడు. రాజస త్యాగి తెలిసే త్యాగం చేస్తాడు. అదే వారిద్దరి మధ్య తేడా.

తెలిసి ఎందుకు త్యాగం చేస్తాడు? ఏం చెప్పగలం! సహస్ర దురదృష్టాలు, అనంతకోటి దరిద్రాలు. ఇతడు కష్టాలకు జడిసి కర్మల్ని త్యాగం చేస్తాడు. ఈయన కూడా త్యాగే, రాజస త్యాగి. రోగం ఉందని తెలిసి,



ఔషధం యొక్క అవసరాన్ని కూడా గుర్తించి, మందు చేదు కనుక పుచ్చుకోను అని ఔషధాన్ని త్యాగం చేసే వాడు ఎలాంటి వాడో, ఈ రాజస త్యాగి కూడా అలాంటి వాడే.

ఈ కర్మ చేయడం కష్టము. దుఃఖప్రదము. దీనిని చెయ్య లేము. ఇది మన వల్ల కాదు. దీని వల్ల ఇటు దేహానికి కష్టము, అటు ఇంద్రియాలకు కష్టము. ఇంత కష్టపడి చేయడం దేనికి? వదిలేయడం మంచిది కదా! సులభ మైంది చేసుకుంటే సరి పోతుంది కదా! ఇలా సరిపెట్టు కుంటాడు. ఈయనే రాజస త్యాగి.

### త్యాగ హేతువు

ఈ కర్మ చేయడం కష్టం (***దుఃఖ మిత్యేవ***) అని కర్మను వదిలేస్తాడు. బావుంది. ఇంతకీ కష్టం ఎవరికి? దేహానికి. శరీరానికి కష్టం అనే భయంతో కర్మను త్యాగం చేయడం రాజస త్యాగము (***కాయ క్లేశ భయాత్, శరీర దుఃఖ భయాత్ త్యజేత్ పరిత్యజేత్***). శరీరానికి కష్ట మైతే తనకే కష్టము అనే భావన కలిగిన వాడు రాజస త్యాగి. తానే శరీర మనే భావన, అంటే దేహాత్మ భావన దృఢంగా కలిగిన వాడు. శరీరాన్ని ప్రాణం కన్నా ఎక్కువగా ప్రేమించే వాడు. దేహం ఉండబట్టే కదా ప్రాణం ఉంది అనే దౌర్భాగ్యపు ఆలోచనతో ఉండే వాడు. కనుక, రాజస త్యాగి కాయ క్లేశానికి భీతి చెంది కర్మల్ని త్యజిస్తాడు. ఆధ్యాత్మిక సాధనలు కర్తవ్యాలు అని తెలుసు. తెలిసినా చేయడు. ఎందుకని? మీరే అడగండి. చక్కగా సమాధానం చెబుతాడు. చేతలు ఉండవన్న మాటే గాని మాటలకు కరువే లేదు, కొదవే లేదు.

అయ్యా! పూజ చేయ రెందుకని? అని అడిగా మనుకోండి. 'చెయ్యాలనే ఉంటుందండీ! కాని, ఎక్కువ సేపు కూర్చోలేను. ఎవరో చేయి పట్టి లేపినట్లే ఉంటుంది' అంటాడు.

మరి, ధ్యానం చేయ వచ్చు కదా? అని అడిగితే, 'పూజ కన్నా ధ్యానం మేలే ననుకోండీ. కాని అదేమిటో అర్థం కాదు. ధ్యానానికి కూర్చుంటే చాలు, నిద్ర పిలిచినట్లే వస్తుంది' అంటాడు.

పోనీ, గ్రంథాలు పఠించ వచ్చు కదా! 'నిజమే, మీరు చెప్పింది వాస్తవమే. ఇంతెందుకు? నా బీరువా నిండా పుస్తకాలే. పుస్తకా లైతే ఉన్నాయి గానీ, మస్తకమే ఎందుకో పని చేయదు. చదవా లంటేనే అదోలా ఉంటుంది. బాల్యం నుండి నా ఖర్మ ఇంతే. ఇంకేం చదువుతాను లెండి! అందుకే మా పిల్లలకు చెబుతూ ఉంటాను. వెధవల్లారా! మీరైనా చదివి బాగు పడండ్రా అని.' ఇదీ విషయం. వెధవ సలహా ఒకటి.

### కష్టాలే కాంతులు

కష్ట పడితేనే ఏదైనా వస్తుంది. ఎవరు ఏది సాధించినా కష్టపడే సాధించారు. కష్ట పడకుంటే ఏదీ రాదు; నిద్ర కూడా. పగటి పూట శ్రమించిన వాడే రాత్రి పూట హాయిగా విశ్రమిస్తాడు. నిద్ర పోతాడు. పడకపై పడుకొని నిద్ర పట్టక కష్టపడే వారందరూ పగటి పూట శ్రమించని వారే. శ్రమిస్తేనే దేని నైనా సాధించ గలం.

***సాధనమున పనులు సమకూరు ధర లోన*** అన్న వేమన, తింటూ ఉంటే ఒక దశలో వేప తీయగా మారుతుంది అంటాడు. అదలా ఉంచండి గానీ, ***శ్రేయాంసి బహు విఘ్నాని*** - శ్రేయస్సును కలిగించే కర్మలకు అవరోధాలు అధికం గానే ఉంటాయి అనేది మాత్రం వాస్తవం. మందు చేదుగా ఉన్నా ఆరోగ్యాన్ని ప్రసాదించి నట్లు, ముందు కష్టంగా ఉన్నా, తరువాత సుఖాన్ని పంచే లక్షణం విధాయక కర్మలకు ఉంటుంది. ఈ విషయానికి సంబంధించిన చర్చ కూడా ఈ అధ్యాయం లోనే ముమ్మందు రాబోతుంది. అప్పుడు విశదంగా వివరిస్తాను. ఏది ఏమైనా సుఖాలు కష్టాల నుండే పుట్టు కొస్తాయి అనేది అక్షర సత్యం. 'వ్యసనం నుండే వ్యవస్థ పుట్టు కొస్తుంది' అనే ఒకానొక రాజకీయ సిద్ధాంతానికి, ఈ సత్యానికి సంబంధం లేదు. పైగా, వైరుధ్యం ఉంది అని సవినయంగా మనవి చేస్తున్నా.

**న సుఖాత్ లభతే సుఖమ్** - సుఖా లెప్పుడూ సుఖాల నుండి రావు. కష్టాల నుండే వస్తాయి. దుఃఖాల నుండే పుడుతాయి. విషాదాలే వికాసాలకు బాటను నిర్మిస్తాయి. వెతలే బ్రతుకు బాటలో దివిటీలుగా వెలుగుతాయి.

పద్మాలు పద్మాల నుండి పుట్టవు. పంకం నుండి పుడుతాయి. పంకజాలై పరిమళాలతో పరిఢవిల్లుతాయి. జీవితంలో శ్రమించి అర్థం చేసుకో వలసిన సత్యం ఒకటుంది. అసలు కష్ట మనేదే ప్రపంచంలో లేదు. భరించ లేనివే బాధలుగా తెలుస్తాయి. కష్టా లున్నాయని, కష్టా లొచ్చాయని కలత చెందకుండా, నలత పడకుండా, సహనంతో సమయాలను నెట్ట గలిగితే, విషాలు విరుగు డవుతాయి. అమృతాలు ఆవిర్భవిస్తాయి.

వేకువ జామున నిద్ర లేవడ మంటే చాలా మందికి దుర్భరంగా ఉంటుంది. అదొక్కటి తప్ప మరే దైనా చెప్పండి అన్న వారిని నేనే చాలా మందిని చూశాను. కాని, నా అనుభవం అందరికీ తెలిసిందే అయినా, తెలియని వారితో పంచుకుంటున్నాను. బ్రహ్మ ముహూర్తంలో నిద్ర లేవడంలో ఉండే తృప్తిని మరొక సమయంలో ఇంతవరకు నేను అనుభవించ లేదు. ఈ వాక్యాలను కూడా ఉదయం మూడు గంటల సమయం లోనే వ్రాస్తున్నాను. అందుకే అంటున్నాను. కష్టాలు ప్రత్యేకంగా లేవు. పిలిస్తే మాత్రం తప్పకుండా వస్తాయి అని. కష్టాలు, భయాలు అంటూ బ్రతుకుల్ని బుగ్గిపాలు చేసుకో కూడదు. కెరటాల మధ్యే కడలి స్నానం చేయాలి. వేదనల మధ్యే సాధనలు సాగాలి. అప్పుడే రాజస త్యాగాలు ఆగుతాయి. సాత్త్విక త్యాగాలు తరువాత శ్లోకం లాగా కదుల్తాయి.

**బ్రతుకంతా రోదన ఆయె**
**సాధన సాగే క్షణమేది?**
**వెలుగు లన్నీ వెతలాయె**
**వేదన తీరే దారేది?**
**పరుగిడు కాలం ఆగదు**
**సాధన తెలిసి సాగాలి**
**రామ రామ జయ రాజారామ్**
**రామ రామ జయ సీతారామ్**

అని రామజోగి చిట్కా.

ఇక సాత్త్విక త్యాగాన్ని వివరిస్తున్నాడు.

కార్య మిత్యేవ యత్కర్మ నియతం క్రియతేఽర్జున ।
సఙ్గం త్యక్త్వా ఫలం చైవ స త్యాగః సాత్త్వికో మతః ॥ 9

**కార్యం-ఇతి-ఏవ-యత్-కర్మ-నియతం-క్రియతే-అర్జున**
**సంగం-త్యక్త్వా-ఫలం-చ-ఏవ-సః-త్యాగః-సాత్త్వికః-మతః**

| | | | | | |
|---|---|---|---|---|---|
| అర్జున | = | అర్జునా! | సంగం | = | అభిమానమును |
| నియతం | = | నియతమైన | ఫలం ఏవ చ | = | ఫలమును కూడా |
| యత్ | = | ఏ | త్యక్త్వా | = | విడిచి |
| కర్మ | = | కర్మము | క్రియతే | = | ఆచరించ బడుతుందో |
| కార్యం ఇతి ఏవ | = | చేయవలసినదియే నని | సః | = | అట్టి |
| త్యాగః | = | త్యాగము | మతః | = | నిర్ణయము |
| సాత్త్వికః | = | సాత్త్విక మైనది యని | | | |



**అర్జునా! విహిత కర్మ చేయ దగిందే నని తెలుసుకొని, అభిమానాన్ని, కర్మఫలాన్ని త్యజించి ఆచరిస్తే అది సాత్త్విక త్యాగ మవుతుంది.**

**వ్యాఖ్య**

**దైవ నియతి - ధర్మ నిరతి**

కర్మ చేయ దగింది. చేయ వలసినది ***( కార్యం కర్తవ్యమ్ ఇతి )***. ఇది శాస్త్ర విధి లాగా కనిపిస్తుంది. శాసనం లాగా అనిపిస్తుంది. విశ్వ యంత్రాంగంలో తన స్థాన మెక్కడో మనిషికి అవగత మైతే, ఇంతవరకు శాస్త్ర విధిగా అనిపించింది ఇప్పుడు విధ్యుక్త ధర్మంగా కనిపిస్తుంది. ఇది అవగాహన వల్ల ఏర్పడుతుంది. అవగాహన చిగురించడం చేత విశ్వ యంత్రాంగం లోని నియతిని భగ్నం చేసే కార్యాలు తాను ఆచరించ కూడనివి అని అర్థం చేసుకుంటాడు. వాటిని నిషిద్ధ కర్మలుగా గుర్తించి త్యజిస్తాడు. అలా త్యజించడం వ్యక్తి ప్రయోజనం కొరకై చేసినట్లు కనిపించదు. విశ్వ ప్రయోజనానికి చేసినట్లు కనిపిస్తుంది. కాని, బాగా ఆలోచిస్తే వ్యక్తి ప్రయోజనం విశ్వ ప్రయోజనం పైనే ఆధారపడి ఉంది అని తెలుస్తుంది. వ్యక్తి మనస్సులో స్పష్టత వచ్చినపుడు విశ్వంలో నియతి, నియతి రూపంలో నియంత ఎలా ఉన్నది అర్థ మవుతుంది. అంతవరకు కార్యాలను కర్తవ్యాలుగా ***(కర్మాణి కర్తవ్యాని )*** ఆచరించాలి. అది ఒక వైఖరిగా, కర్మ వైఖరిగా ప్రారంభంలో గోచరించినా, ఒక దశలో అది సహజమై, కర్తవ్యంగా, ధర్మంగా అర్థ మవుతుంది.

కార్యం ఎప్పుడైతే చేయ వలసిందై ఉందో, అలాంటి చేయ దగిన కర్మను చేయ వలసిందే గాని త్యజించ డానికి వీలు లేదు. కర్మత్యాగం మన చేతిలో లేక పోయినా, ఫలత్యాగం మన చేతిలో ఉంటుంది. కర్మను ఫలాసక్తితో చేయ వచ్చు. లేదా ఫలాకాంక్ష లేకుండ కూడా చేయ వచ్చు.

చేయ వలసిన కర్మను ***( కార్యం కర్మ )***, అనగా కర్తవ్యమును కర్మసంగం లేకుండా ***( సంగం త్యక్త్వా )***, ఫలాసక్తి లేకుండా ***( ఫలం త్యక్త్వా )*** చేయడము సాత్త్విక త్యాగము అనబడుతుంది ***( స త్యాగః సాత్త్వికో మతః )*** అని తన నిశ్చయాన్ని భగవంతుడు తెలియ చేస్తున్నాడు.

నేను చేస్తున్నాను ***( అహం కరోమి )*** అనే అహంకారంతో కర్మను ఆచరించి నపుడు అది నా కర్మ అవుతుంది. ఇదే సంగము, కర్మసంగము. చేయ వలసిన కర్మ ఉండే టప్పుడు, అది నా కర్తవ్య మైనపుడు, ఈశ్వర శాసనంగా అది నాకు ప్రాప్తించి నపుడు, దానిని ఆచరించడానికి అవసరమైన సాధనా లన్నీ సమకూర్చ బడినపుడు, వీటన్నిటిలో ఉన్న నియతి రూపంలో నియంత అయిన పరమేశ్వరుడే శోభించే టప్పుడు, ఇక నా కర్మ ఎక్క డుంది? నేనే చేసే దేముంటుంది? ధర్మాన్ని, కర్తవ్యాన్ని ఆచరిస్తున్నాను. అంతే. విశ్వ యంత్రంలో నా స్థానంలో నేను ఉండి, నా కర్తవ్యాన్ని నేను నిర్వహిస్తున్నాను. అది కూడా నేనుగా చేయడం లేదు. ఈశ్వరుని సేవకుని లాగా చేస్తున్నాను ***( ఈశ్వర భృత్యవత్ అహం కరోమి )***. ఈ భావనతో కర్తవ్యాన్ని ఆచరించడం వల్ల కర్మసంగము త్యాగం చేయ బడుతుంది.

భృత్యుడు కర్మ చేసే వాడే గాని కర్మసంగము లేని వాడు; ఫలసంగమూ లేని వాడు. స్వామి అనుగ్రహించిన దానిని ప్రసాదంగా స్వీకరించే వాడు భృత్యుడు. యదృచ్ఛా లాభ సంతుష్టుడు. కనుక చేయ దగిన కార్యమును కర్తవ్యముగా, ధర్మముగా నిర్వర్తించే వాడు విధ్యుక్త కర్మలనే ఈశ్వర శాసనంగా భావించి ఆచరిస్తాడు. శాస్త్ర విధిని అనుసరించి ఆచరిస్తాడు కనుక రాగద్వేషాల నుండి విడిపడి ఉంటాడు.

***శ్రుతి స్మృతిభ్యాం సుజనో నియమ్యతే*** - సత్పురుషుడు శ్రుతి, స్మృతి నియమానుసారం వర్తిస్తున్నాడు అన్నది శాస్త్రం. కనుక కామ్యకర్మల నుండి విడిపడి నిత్య నైమిత్తిక కర్మలను సంగమును, ఫలమును త్యాగం చేసి ఆచరించే వాడు అంతఃకరణ శుద్ధిని పొందు తున్నాడు.

నిత్య కర్మలకు శాస్త్రము ఎక్కడా ఫలాన్ని చెప్పక పోయినా, భగవ ద్వచనాను సారం నిత్య కర్మలకు కూడా ఫలము కల దని ముందు శ్లోకాల లోనే చెప్పుకున్నాం. అదే అంతఃకరణ శుద్ధి. కాని విధ్యుక్త కర్మలను, కర్మసంగం లేకుండా, ఫలసంగం లేకుండా ఆచరించే భక్తుడు, లేదా కర్మయోగి చిత్తశుద్ధిని కూడా కాంక్షించడు. శాస్త్ర విధి ననుసరించి కర్మలను ఆచరిస్తాడు. శాస్త్ర రూపములో ఉన్నది పరమేశ్వరుడే కనుక, ఈశ్వర శాసనంగా స్వీకరించి ఆచరిస్తాడు. ఇదే శ్రద్ధ. ఇది సాత్త్విక శ్రద్ధ కావడం చేత, అతని సంగ త్యాగము, ఫలత్యాగము సాత్త్విక త్యాగంగా చెప్ప బడ్డాయి ***(స త్యాగః సాత్త్వికో మతః)***.

## సంశయ నివృత్తి

***కర్మ పరిత్యాగః త్రివిధో మతః*** - కర్మ త్యాగము మూడు విధాలు అని నిర్దేశించిన విషయాన్ని కదా భగవంతుడు వివరిస్తున్నాడు ***( త్యాగః త్రివిధః సంప్రకీర్తితః హి : 18 వ అ - 4 వ శ్లో)*** ! మరి తామస, రాజస త్యాగముల యందు కర్మ త్యాగమును చెప్పి, మూడవది అయిన సాత్త్విక త్యాగము నందు కర్మను త్యజించ డము గాకుండా, సంగ త్యాగమును, ఫలత్యాగమును చెప్పడం ఎలా సమంజసం? అనేది శంక. అది ఎలా అసమంజసమో చెప్పి శంకను స్థిర పరచడానికి ఒక ఉదాహరణము కూడా ఉంది. వినండి.

***'త్రయో బ్రాహ్మణాః ఆగతాః*** - ముగ్గురు బ్రాహ్మణులు వచ్చారు. ***త్రయో బ్రాహ్మణాః భోజయితవ్యాః*** - ముగ్గురు బ్రాహ్మణులు భోజనం చేయడానికి వచ్చారు. ***తత్ర షడంగ విదౌ ద్వౌ*** - ఆ ముగ్గురిలో ఇద్దరు షడంగాలు తెలిసిన వాళ్ళు. ***క్షత్రియః తృతీయః ఇతి తద్వత్*** - మూడవ వాడు మాత్రము క్షత్రియుడు' అన్నట్లుంది. ముగ్గురు బ్రాహ్మణులు భోజనార్థం వచ్చారు అన్నపుడు మూడవ వాడు క్షత్రియు డెలా అవుతాడు?

అలాగే, కర్మ త్యాగము మూడు విధాలు అని చెప్పి, అజ్ఞానము చేత కర్మను త్యజించడము తామస త్యాగ మని, శరీర కష్టానికి భయపడి కర్మను త్యజించడము రాజస త్యాగమని చెప్పి, సాత్త్విక త్యాగము దగ్గరకు వచ్చే సరికి అసలు కర్మ త్యాగము అనేదే లేదని, విహిత కర్మలను తప్పక చెయ్యాలని, అది కూడా కర్మసంగమును, ఫలసంగమును విడిచి పెట్టి చేయాలి అనడం, ముగ్గురు బ్రాహ్మణులలో మూడవ వాడు క్షత్రియుడు అని చెప్పినట్లు లేదా? అనేది పూర్వ పక్షము.

***న ఏవ దోషః*** - అలా చెప్పడంలో దోషం లేదు. కారణం, రెండిటి లోను - కర్మత్యాగము లోను, ఫలత్యాగము లోను త్యాగమే సామాన్య ధర్మంగా ఉంది కనుక. వాస్తవానికి త్యాగ మంటే కర్మత్యాగం కాదు. ఫలత్యాగమే త్యాగము. ఎందుకంటే, నేను ముందే చెప్పినట్లు కర్మ అనివార్యం కనుక, కర్మత్యాగం మన చేతిలో లేదు. ఫలత్యాగమే మన చేతిలో ఉంది. ప్రారబ్ధం చేతిలో కీలుబొమ్మలై వర్తించే మనకు, కర్మ అధీనంలో ఎలా ఉంటుంది? ఈ సందర్భంలో జాగ్రత్తగా అర్థం చేసుకోవలసిన విషయ మేమిటంటే, నాల్గవ శ్లోకంలో తన నిశ్చయాన్ని చెప్పడానికి పరమేశ్వరుడు ఆరంభించి నపుడు ***త్యాగః త్రివిధః*** - త్యాగము మూడు విధాలు అంటూ సన్యాసమును, లేదా త్యాగమును చర్చనీయాంశముగా పేర్కొన్నాడే గాని కర్మసన్యాసము అనే దానిని ఎక్కడా చర్చనీయాంశంగా స్వీకరించ లేదు.

*సాత్త్విక త్యాగి అయిన అంతఃకరణ శుద్ధి గల ప్రసన్నునికి ఆత్మనిష్ఠ ఎలా కలుగుతూ ఉందో చెబుతున్నాడు.*



**న ద్వేష్ట్యకుశలం కర్మ కుశలే నానుషజ్జతే ।** 10
**త్యాగీ సత్త్వసమావిష్టో మేధావీ ఛిన్నసంశయః ॥**

***న-ద్వేష్టి-అకుశలం-కర్మ-కుశలే-న-అనుషజ్జతే***
***త్యాగీ-సత్త్వసమావిష్టః-మేధావీ-ఛిన్నసంశయః***

సత్త్వ సమావిష్టః = సత్త్వగుణ సమేతుడు
మేధావీ = జ్ఞానవంతుడు
ఛిన్న సంశయః = సంశయ రహితుడు
త్యాగీ = త్యాగశీలుడు
అకుశలం = బంధ హేతువైన
కర్మ = కర్మమును
న ద్వేష్టి = ద్వేషింపగ:
కుశలే = సత్కర్మ యందు
న అనుషజ్జతే = ఆసక్తిని పొందడు

**అర్జునా! సత్త్వగుణం కల వాడు, మేధావి, సంశయ రహితుడు, త్యాగశీలుడు బంధహేతు వైన కర్మలను ఎన్నడూ ద్వేషించడు. సత్కర్మల యందు ఆసక్తి చూపడు.**

### వ్యాఖ్య

పూర్వ శ్లోకంలో మనం చూచినట్లు కర్మసంగాన్ని, ఫలసంగాన్ని త్యజించి, నిత్యకర్మల చేత సంస్కరింప బడిన సాత్త్విక త్యాగి యొక్క బుద్ధి శుద్ధి పడుతుంది. అలా శుద్ధి పడిన బుద్ధి విశుద్ధమై, ప్రసన్న మవుతుంది. మల దోషము నుండి విడిపడి నందున విశుద్ధ మైతే, సంస్కరింప బడినందున ప్రసన్న మైందని భావము. అట్టి బుద్ధి ఆత్మసాక్షాత్కారానికి సమర్థ మవుతుంది ***(విశుద్ధం ప్రసన్నం ఆత్మావలోకన క్షమం భవతి)***. ఈ విధమైన ఆత్మనిష్ఠ ఎలా ప్రాప్తిస్తుందో ప్రస్తుత శ్లోకంలో స్పష్టం చేస్తున్నాడు. ఎవడైతే కర్మసంగమును, ఫలసంగమును విడిచి పెట్టి, నిత్యకర్మానుష్ఠానం వల్ల బుద్ధిని శుద్ధి చేసుకుంటాడో అతడే త్యాగి, సత్త్వ సమావిష్టుడు.

#### సత్త్వసమావిష్టుడు

మనస్సులో రజ స్తమస్సులను, వాటి కార్యాలకు సంబంధించిన సంస్కారమును దూరం చేసుకొని, కేవలం నిత్యానిత్య వస్తు వివేక జ్ఞానానికి ఉపకరించే సత్త్వగుణముతో బుద్ధిని పరిపాకం చేసుకుని, అట్టి బుద్ధితో కూడి యున్న వాడు సత్త్వసమావిష్టుడు. ఆత్మానాత్మ జ్ఞాన హేతువైన సత్త్వముతో సమాయుక్తుడు అని అర్థము ***( సత్త్వసమావిష్టః - యదా సత్త్వేన ఆత్మానాత్మ వివేక విజ్ఞాన హేతునా సమావిష్టః సంవ్యాప్తః సంయుక్తః ఇత్యేతత్)***. అందుచేత సత్త్వసమావిష్టుడు మేధావి అవుతాడు.

#### మేధావి

మేధావి అంటే స్థిరమైన బుద్ధి కల వాడు. ప్రబోధ సమయము నందే తాను బ్రహ్మ మనే బ్రహ్మాత్మ జ్ఞానమును పొందిన వాడు. ఆత్మజ్ఞాన రూపమైన బుద్ధిని, లేదా ప్రజ్ఞను మేధ అంటారు. మేధా రూపమైన బుద్ధి బలంతో శోభించే వాడు మేధావి ***( మేధయా ఆత్మజ్ఞాన లక్షణయా ప్రజ్ఞయా సంయుక్తః )***.

మేధావి అంటే, బహుగ్రంథ ధారణ సామర్థ్యం కల వాడు అని కూడా అర్థము. బుద్ధి లోని ఈ ధారణా శక్తియే బుద్ధి బలం. అదే బుద్ధి లోని తేజస్సు. వాస్తవం చెప్పాలంటే అదే బ్రహ్మ తేజస్సు. పరమాత్మ తేజము. ఈ సత్యాన్ని ***తేజ స్తేజస్వినా మహమ్*** అని గీత విజ్ఞాన యోగంలో భగవంతుడు ప్రబోధించాడు. మేధావి అయినందున సంశయ రహితుడు అవుతాడు. మనస్సులో సంశయాలనే సంకటాలను దూరం చేసుకున్న వాడు అవుతాడు.

**ఛిన్న సంశయుడు**

ఆత్మ సంబంధమైన సుస్థిర జ్ఞానము కల వాడు మేధావి అన్నప్పుడు, అట్టి మేధావి ఆత్మజ్ఞానంతో ప్రకాశిస్తూ ఉంటాడు కనుక, అతని బుద్ధిలో అజ్ఞాన జనితమైన సంశయాలు ఎలా ఉంటాయి? అందుచేత అతడు ఛిన్న సంశయుడు. అవిద్యాకృత సంశయాల నుండి విడిపడిన వాడు ***(అవిద్యాకృతః సంశయః ఛిన్నః ఛిన్న సంశయాః)***.

అజ్ఞాన కృతమైన సంశయాలు ఛిన్న మయ్యాయి అంటున్నాడు. అలా ఛిన్నమైన సంశయాలు ఏ అజ్ఞానానికి సంబంధించినవి? మోక్షానికి సాక్షాత్తు సాధనము కర్మమా? ఉపాసనమా? జ్ఞానమా? యోగమా? జ్ఞానకర్మ సముచ్చయమా? అలాగే, జీవబ్రహ్మలు భిన్నులా? లేక అభిన్నులా? సత్యము ద్వైతమా? లేక అద్వైతమా? జగత్తు సత్యమా? లేక మిథ్యయా? మోక్షము ధ్యాన గమ్యమా? లేక జ్ఞాన గమ్యమా? ఇవన్నీ సంశయాలే.

ఒక్క మాటలో చెప్పాలంటే, ప్రమేయగత సంశయము, ప్రమాణగత సంశయము అనే ప్రధాన సంశయాలు మనస్సు నుండి తొలగి పోయిన మేధావి ఛిన్నసంశయుడు. సంశయ విచ్ఛిన్నము అనేది జ్ఞాన లక్షణము. పరమాత్మ సాక్షాత్కారము తోనే శోభించే లక్షణము.

***భిద్యతే హృదయ గ్రంథిః ఛిద్యన్తే సర్వ సంశయాః***
***క్షీయన్తే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే ॥***

పరమాత్మ సాక్షాత్కారముతో అజ్ఞాన ముడి విడి పోతుంది. సందేహా లన్నీ పటాపంచ లవుతాయి. కర్మ లన్నీ నశించి పోతాయి అని ముండకోపనిషత్తు *(2 - 2 - 9)*.

సర్వ జ్ఞానము ప్రాప్తించిన వారికే సంశయాలు సంపూర్ణంగా నశిస్తాయి. అంటే, ఏ విషయం లోను సంశయాలు లేకుండా ఉండాలి. అన్ని విషయాలు తెలిసి ఉండాలి. ప్రతి విషయము ప్రత్యక్షంగా దర్శనీయమై ఉండాలి. అలాంటి వాడే ఛిన్న సంశయుడు.

***కరతలామలక వత్ సర్వం సాక్షాత్కృత వతః క్వాపి నాస్తీతి ఛిన్నసంశయః*** - అరచేతిలో అమలకం లాగా సమస్తము ఎవరికి సాక్షాత్కృతమై ఉంటుందో అతడు ఛిన్న సంశయుడు.

ఛిన్న సంశయుడైన మేధావి సత్త్వసమావిష్టుడు కావడం చేత, విషయ ప్రపంచం అతనిపై ప్రభావాన్ని చూప లేదు. అలాగే కర్మల ప్రభావం కూడా అతనిపై ఉండదు. కారణం, అతడు రాగద్వేషాల నుండి విడిపడి పోయాడు. కనుకనే సత్త్వ సమావిష్టుడు.

సత్కర్మ యందు సంతసించడం, ఆసక్తిని కలిగి ఉండటం, అసత్కర్మ యందు, అంటే బంధ హేతు వైన కర్మ యందు ద్వేషాన్ని కలిగి ఉండటం - సాధారణంగా మానవ స్వభావం కర్మల విషయంలో ఇలా ఉండటం మనం చూస్తూ ఉంటాము. కాని, సత్త్వ సమావిష్టుడు కర్మల విషయంలో దానికి భిన్నంగా వ్యవహరిస్తాడు.

అకుశలమైన కర్మను ద్వేషించడు. అకుశల కర్మ అంటే కామ్యకర్మ, అశోభన కర్మ అని అర్థము ***(అకుశలం అశోభనమ్ కామ్యం కర్మ)***. కామ్యకర్మ జన్మను ప్రసాదించి సంసార కారణ మవుతూ ఉందని దానిని ద్వేషించడు ***(న ద్వేష్టి)***.

అలాగే నిత్యకర్మ అంతఃకరణ శుద్ధిని కలిగించి జ్ఞాననిష్ఠకు హేతువు అవుతూ ఉందని కుశలకర్మ యందు, శోభన కర్మ యందు ఆసక్తిని పెంచుకోడు. నిరాసక్తుడై ఉంటాడు ***(న అనుషజ్జతే)***.



అనుకూలాలను, ప్రతికూలాలను కర్మలలో చూడటం లేదు అంటే, అతడు ప్రియాప్రియాలకు అతీతమై ఉన్నాడు. అతనికి ఆత్మ ఒక్కటే ప్రియవస్తువై ఉంది. అతడు విధి నిషేధాలకు అతీతుడు. కృతకృత్యుడు కావడం చేత కర్తృత్వ, భోక్తృత్వాది అభిమాన రహితుడు.

*త్యాగిని గూర్చి తరువాత శ్లోకంలో చెబుతున్నాడు.*

**న హి దేహభృతా శక్యం త్యక్తుం కర్మా ణ్యశేషతః ।** 11
**యస్తు కర్మఫలత్యాగీ స త్యాగీ త్యభిధీయతే ॥**

***న-హి-దేహభృతా-శక్యం-త్యక్తుం-కర్మాణి-అశేషతః***
***యః-తు-కర్మఫలత్యాగీ-సః-త్యాగీ-ఇతి-అభిధీయతే***

| | | | |
|---|---|---|---|
| దేహభృతా | = శరీరధారికి | యః తు | = ఎవడైతే |
| అశేషతః | = సంపూర్ణముగ | కర్మఫల త్యాగీ | = కర్మఫలములను విడుచు చున్నాడో |
| కర్మాణి | = కర్మలను | సః | = వాడు |
| త్యక్తుం | = విడుచుటకు | త్యాగీ ఇతి | = త్యాగి యని |
| న శక్యం హి | = సాధ్యము గాదు | అభిధీయతే | = చెప్పబడు చున్నాడు |

**అర్జునా! దేహమును ధరించిన వాడు కర్మలను సంపూర్ణంగా విడవడం సాధ్యం కాదు. కర్మఫలాన్ని ఎవడు విడిచి పెడతాడో వాడే త్యాగి.**

**వ్యాఖ్య**

దేహమును ధరించిన వానిని దేహభృత్ అంటారు. అంటే, దేహమే ఆత్మ అనే దేహాత్మ భావము కలిగిన వాడు, లేదా దేహాభిమానము కల వాడు దేహభృత్ ***(దేహాత్మ అభిమాన వాన్ దేహభృత్ ఇతి ఉచ్యతే)***. ఇతడు అవివేకి.

వివేకవంతుడు తాను దేహము అని భావించడు. వివేకము, అంటే ఆత్మానాత్మ వివేకము. అట్టి వివేకము కల వివేకి, ఆత్మే తాను, దేహము తాను కాదనే వివేక జనిత జ్ఞానం కల వాడు కనుక అతడు దేహభృత్ కాడు. ఆత్మ పుట్టేది కాదు, చచ్చేదీ కాదు అనే జ్ఞానము కలిగిన వాడు *(2 వ అ - 21 వ శ్లో)* కావడం చేత అతడు కర్తృత్వాభిమానము లేని వాడై ఉంటాడు. అతడు దేహమును కలిగి ఉన్నా, తాను దేహము అనే భావం లేకుండా ఉంటాడు. అలాంటి వానికే సర్వ కర్మ సన్యాసం సాధ్య పడుతుంది కాని దేహభృత్తుకు సాధ్యం కాదు. దేహాభిమాన రహితుడై, పరమార్థ దర్శనం చేయ గలిగిన వానికే కర్మసన్యాసం శక్య మవుతుంది ***(పరమార్థ దర్శి నైవ అదేహ భృతా దేహాత్మ భావ రహితేన అశేష కర్మసంన్యాసః శక్యతే కర్తుమ్)***.

కాని, దేహభృత్తు 'నేనే కర్తను' అనే కర్తృత్వాభిమానంతో ఉంటాడు కనుక, అతడికి సర్వకర్మ సన్యాసము సాధ్యము కాదు. అలాంటి వాడు విహిత కర్మాచరణం చేస్తూ కర్మఫల త్యాగమును అలవరచుకోవాలి. కనుక, ఆత్మజ్ఞానం లేని ఏ అవివేకి, నిత్యకర్మలను ఆచరిస్తూ ఫలాభిసంధిని త్యజిస్తాడో, అతడు కర్మలను ఆచరించినా, ఫలత్యాగము చేయడం చేత త్యాగి అని చెప్ప బడ్డాడు ***(నిత్యాని కర్మాణి కుర్వన్ కర్మఫలత్యాగీ త్యాగీ ఇత్యభి ధీయతే)***.

కనుక త్యాగి అంటే, విషయాలను త్యజించిన వాడు అని కాదు. కర్మలను త్యజించిన వాడు అని కూడా

కాదు. కర్మఫలాలను త్యాగం చేసిన వాడు అని అర్థం. కర్మలను విడిచి పెట్టిన వాడు కర్మలను విడిచిన వాడు అవుతాడే గాని మనస్సు లోని ఫలాశను విడిచి పెట్టిన వాడు కాడు.

నిత్య కర్మలను ఆచరిస్తూ, కర్మఫలాలను త్యాగం చేయడం చేత, త్యాగికి కర్మల యందు ద్వేషమూ ఉండదు. రాగమూ ఉండదు. వీటిని నేను త్యజించాను అనే భావన కూడా ఉండదు. రాగద్వేషాలను త్యజించి కర్మల యందు శుద్ధి పడటమే గాక, ఏ త్యాగ గుణం చేత ఆ రెండిటిని త్యజించడం జరిగిందో, ఆ త్యాగ గుణం చేతనే నేను త్యజించాను అనే భావాన్ని కూడా త్యజించిన వాడు త్యాగి అవుతాడు. సత్యాసత్యాలను, ధర్మాధర్మాలను అధిగమిస్తాడు.

***ఉభేసత్యానృతేత్యక్త్వా యేన త్యజసి తత్త్యజ*** - సత్యాసత్యాలను త్యజించి, దేని చేత వాటిని త్యజించడము జరిగిందో, దానిని కూడా త్యజించు అన్నది ఉపనిషత్తు ***(యేన త్యజసి తత్ త్యజ)***. త్యజించాను అనే భావనను త్యజించడమే నిజమైన త్యాగము అని ఉపనిషత్ అభిప్రాయ పడింది.

*ఇక, సర్వకర్మ పరిత్యాగము యొక్క ప్రయోజనాన్ని చెబుతున్నాడు.*

**అనిష్ట మిష్టం మిశ్రం చ త్రివిధం కర్మణః ఫలమ్ ।**
**భవ త్యత్యాగినాం ప్రేత్య న తు సంన్యాసినాం క్వచిత్ ॥** 12

***అనిష్టం-ఇష్టం-మిశ్రం-చ-త్రివిధం-కర్మణః-ఫలం***
***భవతి-అత్యాగినాం-ప్రేత్య-న-తు-సంన్యాసినాం-క్వచిత్***

| | | | |
|---|---|---|---|
| అనిష్టం | = ఇష్టము కానిది | అత్యాగినాం | = త్యాగులు కాని వారికి |
| ఇష్టం | = ఇష్ట మైనది | ప్రేత్య | = మరణానంతరము |
| మిశ్రం చ | = మిశ్రమ మైనది | భవతి | = కలుగుతుంది |
| త్రివిధం | = మూడు విధములైన | సంన్యాసినాం తు | = సన్యాసులకు |
| కర్మణః | = కర్మలకు | క్వచిత్ | = ఎప్పుడును |
| ఫలం | = ఫలము | న భవతి | = కలుగదు |

**ఇష్టము, అనిష్టము, మిశ్రమము అనే మూడు విధాలైన కర్మఫలము త్యాగులు కాని వారికి మరణానంతరము కలుగుతుంది. సన్యాసులకు ఎప్పుడూ కలగదు.**

### వ్యాఖ్య

న్యాసము అంటే త్యాగము. సన్యాసము అంటే సరియైన త్యాగము ***(సమ్యక్ న్యాసః ఇతి సంన్యాసః)***. ఫల త్యాగములో గాని, కర్మత్యాగములో గాని త్యాగమే ప్రధానంగా ఉంది కనుక, ఏది సన్యాసము చేత పొంద బడుతుందో అదే కర్మయోగము చేత కూడా పొంద బడుతుంది అని మనం పూర్వమే చెప్పుకొని ఉన్నాము *(5వ అ - 5 వ శ్లో)*.

ఆత్మజ్ఞానం లేకుండా, నిత్య కర్మలను ఆచరిస్తూ, ఫలత్యాగము చేసే వాడు కర్మయోగి. ఆత్మజ్ఞానియై, దేహాభిమానం లేని వాడై, కర్మల నాచరించినా, తనను అకర్తగా భావించే వాడు సర్వ కర్మ సన్యాసి.

ఇరువురిలో కూడా త్యాగము ప్రధానంగా తెలుస్తూ ఉంది. అదే న్యాసము. కర్మయోగిలో న్యాస ముంది. జ్ఞానిలో సన్యాస ముంది. కనుక, జ్ఞానిది పరమార్థ సన్యాసము. ముఖ్య సన్యాసము. అలా చూచి నపుడు



ఆత్మజ్ఞానం లేని కర్మయోగిది గౌణ సన్యాసము. కర్మఫల త్యాగము ఇరువురికీ సమానంగా ఉన్నా, ఒకటి ముఖ్యము, మరొకటి గౌణము అని ఎలా చెప్ప బడుతోంది? అందుచేత, మరొక విశేషము చెప్ప వలసి ఉంది. ఫలత్యాగము సన్యాస మని ఎలా చెప్ప బడుతుంది? అది ప్రస్తుత శ్లోకంలో విస్పష్ట మవుతుంది.

**ఫలత్రయము**

జీవుల కర్మఫలాలు మూడు విధాలుగా ఉంటాయి. ఈ ఫలాలే మరణానంతరము జన్మలను నిర్ణయిస్తాయి. అంటే, సర్వకర్మ ఫలత్యాగము చేయని కర్మిష్ఠులు ఆచరించే పుణ్య పాప కర్మలకు దేహ త్యాగానంతరము ప్రాప్తించే ఫలాలు అని అర్థము.

మొదటిది అనిష్ట ఫలం. అది నరకము కావచ్చు. లేదా జంతు జన్మ కావచ్చు. ఈ ఫలాన్ని ఎవ్వరూ ఇష్ట పడరు కనుక ఇది అనిష్టం. ఇష్ట పడనిది, కష్ట మైనది ఎందుకు ప్రాప్తిస్తుంది అంటే, దీనికి సంబంధించిన కారణ మైన కర్మను పూర్వం ఇష్టంతో ఆచరించారు కనుక. అధర్మ కార్యాలకు, పాప కర్మలకు ఫలితంగా అనిష్ట ఫలం మరణానంతరం లభిస్తుంది ***( అనిష్టం నరక తిర్యగాది లక్షణం )***.

రెండవది ఇష్టఫలం. దేవతల రూపాన్ని పొందే స్వర్గం. ధర్మకార్యాలను, ఇష్టాపూర్త పుణ్య కర్మలను ఆచరించిన దానికి ఫలమే ఇష్టఫలం. ఎవరికీ కష్టం కానిది. సుఖ రూప మైనది. దుఃఖ రహిత మైనది ***( ఇష్టం దేవాది లక్షణం )***.

మూడవది మిశ్రమ ఫలం. ఇష్టానిష్టములు కలిసిన ఫలం. అంటే ధర్మాధర్మాల వలన ప్రాప్తించిన పుణ్య పాప ఫలాలు. పుణ్యం ఇష్టఫలం. పాపం అనిష్ట ఫలం. ఈ రెండూ ప్రాప్తించడానికి ఈ రెండిటికి సంబంధించిన ధర్మాధర్మ కార్యాలను, పుణ్యపాప కర్మలను పూర్వం ఆచరించడమే కారణము. దీని ఫలితంగా శుభాశుభాలను, సుకృత దుష్కృతాలను కలిసి ఒకే దేహంలో అనుభవించ డానికి మానవ జన్మము ఫలంగా ప్రాప్తిస్తుంది ***(మిశ్రమ్ ఇష్టా నిష్ట సంయుక్తం మనుష్య లక్షణం చ )***.

**ఫల రూపము**

అసలు ఫలము అంటే ఏమిటి? దాని స్వభావ స్వరూపా లేమిటి? ఫల నిర్వచన మేమిటి? వినండి. ఏ ఫలమైనా అల్పమే, స్వల్పమే గాని అనంతము కాదు. ఇది ముందుగా అర్థం కావాలి. దీనినే సంస్కృతంలో **ఫల్గు** అంటారు. ఫల్గు అంటే స్వల్పం. స్వల్ప మైంది ఏదైనా పరిమితమే కనుక ఒక కాలంలో అగుపించి మరొక కాలంలో అదృశ్య మవుతుంది. అదే ఫల మంటే. కనుక ఫల నిర్వచనములో రెండే విషయాలు ఉన్నాయి. అవే ఫలం అల్పం, ఫలం అదర్శనం ***( ఫల్గుతయా లయం అదర్శనం గచ్ఛతీతి ఫలం ఇతి ఫల నిర్వచనమ్ ! )***.

క్షణక్షణానికి మారే లక్షణం కర్మకు ఉంది. కర్మలో ఏ లక్షణము ఉందో, ఫలంలో అదే లక్షణం ఉంటుంది. మిశ్రమ కర్మ ఫలంగా ప్రాప్తించేది మానవ జన్మ కనుక క్షణక్షణం మానవులలో అనియత స్వభావాన్ని స్పష్టంగా చూడ వచ్చు.

నిన్న ఉన్నట్లు నేడు ఉండరు. మొన్న తిన్నట్లు రేపు తినరు. నేడు చేసేది నిన్న చెయ్యలేదు. ఉదయం ఒక లాగా ఉంటారు. సాయంత్రం మరోలా ఉంటారు. ఎవరు ఎప్పుడు ఎలా ఉంటారో ఎవరికీ అర్థం కాదు. ఒకరు అర్థం కాకపోతే వచ్చే నష్టం పెద్దగా లేక పోవచ్చు. కాని, తమకు తామే అర్థం కారు. ఇదొక విచిత్రం. ఫలాల ప్రతిరూపం.

పైగా, నే నెప్పుడు ఎలా ఉంటానో, ఎప్పుడు ఏం చేస్తానో నాకే తెలియదండీ! అనేది కొసమెరుపు. ఒక

వికృతపు విరుపు. ఇలా ఎందుకు జరుగుతుందో తెలుసా? ప్రారబ్దాలు ప్రత్యక్షాలు కావు కనుక. వెనుక అదృశ్యంగా ఉండి, మనుషుల్ని ముందుకు నెట్టే ప్రారబ్దాన్ని చూసే సందర్భం, ఆపే అవకాశం మనిషికి లేదు కనుక.

ఈ ఫలాలన్నీ త్యాగులు కాని వారికే ప్రాప్తిస్తాయి. జ్ఞానులు కాని వారికే లభిస్తాయి. అంతే గాని, ఫలత్యాగం చేసిన వారికి ప్రాప్తించవు. సర్వకర్మ సన్యాసులకు సంభవించవు (*న తు సంన్యాసినాం క్వచిత్*). తాను అకర్త అని భావించే సర్వకర్మ సన్యాసికి కర్మఫలం ఎలా అందుతుంది? నిజమే. అంతవరకు బాగుంది. మరి, కర్మయోగి, గౌణ సన్యాసి విషయ మేమిటి? కర్మయోగి కూడా త్యాగియే కనుక చిత్తశుద్ధి ద్వారా తాను కూడా ఒక దశలో తప్పక సర్వ కర్మ సన్యాసి అవుతాడు. అలా కావాలి అనేదే భగవంతుని అభిమతం.

*సర్వకర్మ సన్యాసం జ్ఞానికే గాని అజ్ఞానికి కాదు. అదే చెబుతున్నాడు.*

పఞ్చైతాని మహాబాహో కారణాని నిబోధ మే ।
సాంఖ్యే కృతాన్తే ప్రోక్తాని సిద్ధయే సర్వకర్మణామ్ ॥ 13

***పంచ-ఏతాని-మహాబాహో-కారణాని-నిబోధ-మే***
***సాంఖ్యే-కృతాంతే-ప్రోక్తాని-సిద్ధయే-సర్వకర్మణాం***

| | | | | | |
|---|---|---|---|---|---|
| మహాబాహో | = అర్జునా! | | ఏతాని | = ఈ |
| సర్వకర్మణాం | = సర్వకర్మల యొక్క | | పంచ | = అయిదైన |
| సిద్ధయే | = సిద్ధి కొరకు | | కారణాని | = కారణములను |
| సాంఖ్యే | = జ్ఞాన సంబంధమైన | | మే | = నా వలన |
| కృతాంతే | = సిద్ధాంతము నందు | | నిబోధ | = తెలుసుకో! |
| ప్రోక్తాని | = చెప్పబడిన | | | |

**అర్జునా! కర్మలు సిద్ధించడానికి వేదాంతము నందు అయిదు కారణాలు చెప్ప బడ్డాయి. అవి నీకు చెబుతా. విను.**

### వ్యాఖ్య

పరమార్థమును దర్శించిన సన్యాసులకే సర్వ కర్మ సన్యాసము సాధ్యము అని తెలుసుకున్నాం. సర్వ కర్మ సన్యాసులు కావడం చేత వారికి ఇష్టానిష్ట మిశ్రమ రూప త్రివిధ కర్మఫలము సంభవించదు అని కూడా తెలుసుకున్నాం.

దేహధారులైన వారికి సర్వకర్మ సన్యాసము శక్యము కాదు. దానికి హేతు వేమిటి? కర్మకు కారణాలైన అధిష్ఠాన పంచకము నందు తాదాత్మ్యాభిమానమే. ఈ విషయాన్ని వరుసగా నాలుగు శ్లోకాలలో చెబుతున్నాడు. సర్వ కర్మలు సిద్ధించడానికి ఐదు కారణాలు ఉన్నాయని చెబుతూ ఉన్నాడు. ఏవైతే కర్మసిద్ధికి కారణాలుగా చెప్పబడు తున్నాయో అవే ఆత్మస్వరూప మని, స్వస్వరూప మని భావించడం చేత అజ్ఞానికి సర్వకర్మ సన్యాసము సాధ్య పడటం లేదు.

కర్మ లన్నీ సుఖార్థమే ఉన్నాయి. కాని సుఖ మనేది స్వరూప విషయమే గాని, స్వరూపము నందు ఆరోపించ బడిన మిథ్యా సంబంధ మైనది కాదు. కర్మసిద్ధికి కారణాలైన ఐదు విషయాలు అవిద్య చేత ఆత్మ యందు



ఆరోపించబడి ఉన్నవి కనుక, ఆరోపితాలకు ఆధారమై, అధిష్ఠానమై, అకర్తగా శోభిస్తున్న ఆత్మే తానని తెలుసుకొని ఉన్నందున, ఆత్మజ్ఞాని యైన సన్యాసికి సర్వ కర్మ సన్యాసము సాధ్య మవుతూ ఉంది.

కర్మ వైదిక మైనా, లౌకిక మైనా, దానిని ఆచరించ డానికి, ఫలమును పొందటానికి, ప్రస్తుతం చెప్ప బోయే ఇవి (***ఏతాని***) ఐదు కారణాలుగా చెప్ప బడ్డాయి (***పంచ ఏతాని కారణాని***). అర్జునా! ఇవి నా నుండి తెలుసుకో (***నిబోధ***) అంటున్నాడు. అర్థం చేసుకో మంటున్నాడు.

'నిబోధ' - అర్థం చేసుకో! అనడంలో లోతైన భావ ముంది. ఇక్కడ విషయం మారిందని తెలియ చేయడానికి 'నిబోధ' - అర్థం చేసుకో అంటున్నాడు. అంతేగాక, దీనిని అర్థం చేసుకో అని చెప్పడంలో 'ఆ అయిదు విషయాల మధ్య ఉన్న అంతరాన్ని తెలుసుకోవాలే గాని, వాటిపై మనస్సును నిలపకూడదు' అనేది కూడా అంతరార్థం.

తెలుసుకో దగిన కర్మసిద్ధి హేతువు లైన ఈ అయిదు కారణాలు ఏ శాస్త్రంలో ప్రతిపాదించ బడ్డాయో ఆ శాస్త్రమును సాంఖ్యము (***సాంఖ్యే***) అంటారు. సాంఖ్యము అంటే వేదాంతము. **కృతాన్తే** అనేది దానికి పర్యాయ పదము.

కృతము అంటే కర్మ అని అర్థము (***కృత మితి కర్మ ఉచ్యతే***). దానికి పరిసమాప్తి ఎక్కడో, అంటే ఈ కర్మ ఎక్కడ అంతమును పొందుతుందో, విలీన మవుతుందో అది కృతాంతము (***తస్య అంతః కృతస్య పరి సమాప్తిః యత్ర స కృతాంతః***). అదే సాంఖ్యము. పరిశుద్ధమైన ఆత్మతత్త్వ విజ్ఞానము. అదే వేదాంతము. వేదాంతము నందు కర్మ సిద్ధికి హేతువులుగా చెప్ప బడుతున్న ఐదు కారణాలను వివరిస్తున్నాడు. కర్మ లన్నీ తిరిగి అకర్త యైన ఆత్మ యందే విలీన మౌతున్నాయి.

*ఆ ఐదు కారణాలను వివరిస్తున్నాడు.*

అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్ ।
వివిధాశ్చ పృథ క్చేష్టా దైవం చైవాత్ర పఞ్చమమ్ ॥ 14

***అధిష్ఠానం-తథా-కర్తా-కరణం-చ-పృథగ్విధం***
***వివిధాః-చ-పృథక్-చేష్టాః-దైవం-చ-ఏవ-అత్ర-పంచమం***

| | | | | |
|---|---|---|---|---|
| అధిష్ఠానం | = దేహమును | | పృథక్ | = వేర్వేరైన |
| తథా | = అలాగే | | చేష్టాః చ | = క్రియలు |
| కర్తా | = కర్తయు | | అత్ర | = వీని యందు |
| పృథగ్విధం | = వివిధములైన | | దైవం చ ఏవ | = దైవమును |
| కరణం చ | = ఇంద్రియములను | | పంచమం | = అయిదవ కారణము |
| వివిధాః | = నానా విధములైన | | | |

**అర్జునా! శరీరము, కర్త, ఇంద్రియాలు, వివిధ ప్రాణ చేష్టలు, ఐదవది దైవము - ఈ ఐదు కర్మ కారణాలు.**

### వ్యాఖ్య

సర్వ కర్మలకు కారణములైన ఐదు విషయాలను చెబుతున్నాడు. అవి (1) అధిష్ఠానము (2) కర్త (3)కరణము (4) ప్రాణ చేష్టలు (5) దైవము. కర్మలు సిద్ధించడానికి ఈ ఐదు కారణములు.

**(1) అధిష్ఠానము**

అధిష్ఠానము అంటే ఆధారము, లేదా ఆశ్రయము అని అర్థము. కర్మ హేతువు లైన వాటన్నిటికి అధిష్ఠానము, అంటే ఆశ్రయ స్థానమై ఉన్నందున శరీరము అధిష్ఠానము. ఏ కర్మ అయినా ఇక్కడ నుండే ప్రారంభం కావాలి. ఏ కర్మ అయినా ఇక్కడే సిద్ధించాలి. అందుచేత దీనిని భోగాయతనం అని కూడా అంటారు. ఇచ్ఛా, ద్వేష, సుఖ, దుఃఖ, జ్ఞానాదులు అభివ్యక్తం కావడానికి ఆశ్రయ మైనది కావడం చేత శరీరము అధిష్ఠానము ***(అధిష్ఠానం ఆశ్రయం శరీరం ).***

**(2) కర్త**

ఉపాధి లక్షణంతో, అవిద్యా కల్పితమైన భోక్తయే కర్త ***( తథా కర్తా ఉపాధి లక్షణః అవిద్యా కల్పితో భోక్తా).*** కర్త అంటే అహంకారము ***( అహం కర్తా అహంకారః ).*** అంతఃకరణ రూప చైతన్యము. చిదాభాస చైతన్యము. బుద్ధి యందు చైతన్యము యొక్క ప్రతిబింబము పడుట వలన 'నేను' అనే అహం వృత్తి పుడుతుంది. అదే అహంకారము. జీవ స్వరూపము ***( చిచ్ఛాయా ఉ వేశతో బుద్ధౌ భానం అహం కృతిః ).***

**(3) కరణం**

శబ్దాదుల జ్ఞానం కలగడానికి సాధనా లైన శ్రోత్రాది ఇంద్రియాలు కరణం అని చెప్ప బడ్డాయి. శ్రోత్రాది పంచ జ్ఞానేంద్రియాలు, త్వగాది పంచ కర్మేంద్రియాలు, మనోబుద్ధులు వెరసి పన్నెండు ఇంద్రియాలు కరణాలు.

విషయ జ్ఞానాన్ని పొందడానికి, తిరిగి కర్మలు ఆచరించడానికి శరీరాన్ని ఆశ్రయంగా పొంది ప్రవర్తించే ఇంద్రియాలే కరణాలు. సంకల్పించే మనస్సు, నిశ్చయించే బుద్ధి కూడా అంతఃకరణాలే కనుక, ఈ పన్నెండు ఇంద్రియాలు కరణాలు ***( కరణం చ నానా ప్రకారం ద్వాదశ సంఖ్యం ).***

**(4) ప్రాణ చేష్టలు**

వివిధములైన ప్రాణచేష్టలు నాల్గవది. అంటే, వాయు సంబంధమైన ప్రాణాపానాది దశవిధ వాయువులు ***(వివిధాః చ పృథక్ చేష్టాః వాయవీయాః ప్రాణా పానాదయః ).***

**(5) దైవము**

చక్షురాది ఇంద్రియ వ్యాపారాలకు అధిష్ఠాన దేవతా రూపంలో ఉన్న దైవాలు అధిష్ఠాన దేవతలు. ఈ అయిదింటిని అధిష్ఠానాది పంచకము అంటారు. ఈ ఐదే సర్వ కర్మలకు హేతుభూతమై ఉన్నాయి.

*మానవుడు త్రికరణములతో, అంటే వాఙ్మనః కాయములతో చేసే ఏ కర్మ కైనా ఈ ఐదే కారణ మని చెబుతున్నాడు.*

**శరీర వాఙ్మనోభి ర్యత్కర్మ ప్రారభతే నరః ।**
**న్యాయ్యం వా విపరీతం వా పఞ్చైతే తస్య హేతవః ॥ 15**

***శరీరవాఙ్మనోభిః-యత్-కర్మ-ప్రారభతే-నరః***
***న్యాయ్యం-వా-విపరీతం-వా-పంచ-ఏతే-తస్య-హేతవః***

| | | | |
|---|---|---|---|
| న్యాయ్యం వా | = న్యాయబద్ధముగ గాని | యత్ | = ఏ |
| విపరీతం వా | = అన్యాయముగ గాని | కర్మ | = కర్మను |
| శరీర వాఙ్మనోభిః | = శరీరము, వాక్కు, మనస్సుల చేత | నరః | = నరుడు |



| | | | |
|---|---|---|---|
| ప్రారభతే | = ప్రారంభిస్తున్నాడో | పంచ | = అయిదును |
| తస్య | = ఆ కర్మమునకు | హేతవః | = కారణములు |
| ఏతే | = ఈ | | |

**అర్జునా! మనోవాక్కాయాల చేత మనిషి ఆరంభించే కర్మ, అది న్యాయ సమ్మత మైనా, దానికి విపరీత మైనా, దానికి ఈ ఐదు కారణాలుగా ఉంటాయి.**

**వ్యాఖ్య**

**సాధనాలు - కారణాలు**

మానవులు ఆచరించే కర్మలు కాయకం, వాచికం, మానసం అని త్రివిధములుగా ఉంటాయి. న్యాయమైన కార్యమైనా, లేక దానికి విపరీతమైన దైనా; శాస్త్ర విహితమై ధర్మ సమ్మతమైన కార్యమైనా, లేక అశాస్త్రీయంగా అధర్మ యుతమైన కార్యమైనా - అది ఈ మూడిటిలో ఏదో ఒకటై ఉంటుంది.

మనిషి చేసే కర్మ కాయకం, వాచికం, మానసం అని మూడు విధాలు. దేహం ద్వారా చేసే కర్మ కాయకం. వాక్కు ద్వారా చేసే కర్మ వాచికం. మనస్సు ద్వారా చేసే కర్మ మానసం. ఈ విధమైన కర్మలకు - అవి ధర్మ యుతాలైనా, లేక ధర్మానికి భిన్నమైన వైనా, పూర్వ శ్లోకంలో మనం చూచిన ఐదు విషయాలే కారణాలుగా ఉన్నాయి ***( పంచ ఏతే యథోక్తాః తస్య సర్వస్య ఏవ కర్మణః హేతవః కారణాని ).***

మానవులు ఏ కార్యం చేసినా శరీరము, వాక్కు, మనస్సు అనే మూడింటి సహాయం తోనే చేయాలి. అది న్యాయ మైనది కావచ్చు. లేదా దానికి అన్య మైనది, అంటే విపరీతమైన దైనా కావచ్చు. ఏదైనా, ఈ మూడిటితో కలిసే చేయాలి. వీటిలో ఒకటి ప్రధానంగా ఉండి, మిగిలిన రెండు అముఖ్యంగా ఉండ వచ్చు. ఎలా ఉన్నా, ఈ మూడిటి ద్వారానే ఏ కార్యమైనా ఆరంభించ బడాలి. ***ప్రవృత్తిః వాగ్బుద్ధి శరీరారంభః*** అని గౌతమ మహర్షి న్యాయ దర్శనంలో సూత్రీకరించాడు.

ఒక వ్యక్తిని స్తుతించడము, లేదా నిందించడము వాక్కుతో చేసే కర్మ. ఆ కర్మను చేయాలి అని ఆలోచించడము మానసకర్మ. ఒకరిని కొట్టడము, లేదా ఒకరికి పెట్టడము కాయక కర్మ. ఇతరులను గూర్చి చెడుగా ఆలోచించడము మానసకర్మ అయితే, నిందించడము వాచక కర్మ కాగా, శారీరకంగా బాధించడము కాయక కర్మగా స్థూలంగా వ్యక్త మవుతుంది. ఇలా ప్రతి విషయంలో ఈ మూడు ప్రధానం గానో అప్రధానం గానో కలిసే ఉంటాయి.

శరీరము, వాక్కు, మనస్సు అనే ఈ మూడిటి చేత మానవుడు కర్మను ఆచరించినా, అలా ఆచరింప బడిన ఏ కర్మ కైనా పూర్వ శ్లోకంలో మనం చూచిన అధిష్ఠానాది ఐదు విషయాలు కారణాలుగా ఉన్నాయి. సాధనాలు మూడే అయినా, కారణాలు ఐదుగా తెలుస్తూ ఉన్నాయి.

**ఆత్మ అకర్త**

ఇక్కడ ప్రధానంగా ఒక్క విషయాన్ని మనం బుద్ధిలో స్థిర పరచుకోవాలి. దేహము, వాక్కు, మనస్సు ఈ మూడిటి చేతనే కర్మలు సాగుతున్నాయి. కార్య నిర్వహణములో ఈ మూడే కనిపిస్తున్నాయి. వీటిలో ఆత్మ ఎక్కడైనా కర్తగా కనిపిస్తూ ఉందా? లేదు. కాని, త్రివిధ కర్మల విషయంలో ఆత్మ గోచరించక పోయినా, ఆత్మ ఉందా, లేదా?

ఇంధనము లేకుండా ఇంజను నడుస్తుందా? ఆత్మ స్ఫూర్తి లేకుండా శరీర వాఙ్మనస్సులు ప్రవర్తించ

గలవా? మరి, ఈ మూడు కర్మలను నిర్వర్తించడానికి స్ఫూర్తి నిచ్చిన ఆత్మ ఈ మూడు విధాలైన కార్యాలలో ప్రత్యక్షంగా లేదు. అలాగని ఆత్మ లేనిది అని అన గలమా?

ఆత్మ ఉంది. ఎలా ఉంది? అకర్తగా ఉంది. మూడు విధాలైన కర్మలతో సంబంధం లేకుండా విలక్షణంగా ఉంది. కర్మలను శరీరము, వాక్కు, మనస్సు - ఈ మూడే నిర్వర్తిస్తున్నాయి.

***యద్ధి మనసా ధ్యాయతి తద్వాచా వదతి తత్కర్మణా కరోతి*** - ఏది మనస్సుతో ఆలోచించ బడుతూ ఉందో, అదే వాక్కు చేత చెప్ప బడుతూ ఉంది. అదే శరీరం చేత చేయ బడుతూ ఉంది. ఆత్మ అకర్తగా ఉంది. సాధనాలలో ఆత్మ యొక్క ప్రమేయాన్ని ఊహించలేక పోతున్నాము. పోనీ, కారణాలలో అయినా ఆత్మ ఉందా? అదీ లేదు.

అధిష్ఠానం మొదలైన ఐదు విషయాలే కారణాలుగా తెలుస్తున్నాయి. ఆ అయిదింటిలో ఆత్మ లేదు. అధిష్ఠానము, కర్త, కరణము, ప్రాణచేష్టలు, దైవము - ఈ ఐదు మాత్రమే కారణాలుగా తెలుస్తున్నాయి కాని ఆత్మ ఎక్కడా కారణంగా తెలియడం లేదు.

అధిష్ఠానాది ఏ ఐదు విషయాలు కారణాలుగా తెలుస్తున్నాయో, ఆ ఐదిటిలో ఏ ఒక్కటి లోపించినా కార్య నిర్వహణము జరగటం సాధ్యం కాదు.

**కర్త మిథ్య**

కర్మ త్రివిధము లైనా, అది న్యాయమైనా తద్విపరీత మైనా, ఇంతకీ కర్త ఎవరు? ఆత్మ అకర్త అని తేలి పోయింది. పోనీ కర్మకి ఐదు కారణాలు చెబుతున్నారు కదా, ఈ ఐదు కారణాలలో కర్త ఎవరు? చెప్ప లేము.

అధిష్ఠానంగా చెప్ప బడుతున్న శరీరమును కర్త అని చెప్ప గలమా? నిజమే ***శరీర మాద్యం ఖలు ధర్మ సాధనమ్*** అని కాళిదాస మహాకవి చెప్పినట్లు, ఏది సాధించాలన్నా శరీరం సాధనంగా ఉంది అనే సత్యాన్ని నిరాకరించ లేము. అలాగని, శరీరాన్ని కర్తగా ధ్రువీకరించ గలమా? శరీరమే గనుక కర్త అయితే, ఇక శవం నుండి కర్తృత్వాన్ని ఎప్పుడూ తొలగించ లేము. అయినా, కర్తృత్వము శవానికి అంటకట్టడం ఊహ కందని విషయము కదా!

శరీరము చేతనంగా ఉండినా, బుద్ధిలో గనుక చేతనత్వము లేకపోతే, శరీరము ద్వారా కర్మలు సాగవు. బుద్ధి చేతనత్వంతో పని చేస్తూ ఉండినా, కరణాలైన ఇంద్రియాలు, కార్యమైన దేహము లేకపోతే కర్మ సాధ్యం కాదు. అలాగని, ప్రాణశక్తి లేకుండా, దేహేంద్రియ మనస్సులు పని చేయ గలవా? పని చేయ లేవు.

మరి, ఈ అయిదింటిలో కర్త ఎవరు? కర్త అనేది ఏకవచనం కదా! కర్త అనే వాడు ఒకడే ఉంటాడు గాని ఐదు మంది కర్తలు ఎలా ఉంటారు? పోనీ, కారణాలుగా తెలుస్తూ ఉన్న అధిష్ఠానాది విషయాలు ఐదూ కలిసి కర్త అంటారా? అదే వాస్తవ మైతే, కర్త కర్మను నిర్వహించే టపుడు, అట్టి కర్మకు ఫలం కూడా ఉంటుంది కదా! ఆ ఫలాన్ని అనుభవించే భోక్త ఎవరు? ఐదూ కలిసి అనుభవిస్తాయి అంటారా? కర్మాచరణములో భాగస్వామి యైన నేత్రేంద్రియము ఫలప్రాప్తి సమయంలో లేదనుకోండి అప్పుడు ఆ ఫల భాగము ఎవరి కందాలి?

అంధుడు దొంగతనం చేయ గలడా? చేయ లేడు. మరి దొంగతనం చేసే సమయంలో చూచే కదా చేశాడు? నిజమే. దొంగకు కళ్ళు ఉన్నాయి. దొంగతనం చేసిన తరువాత ప్రమాదంలో కళ్ళు పోయాయి. కర్మ ఫలప్రాప్తి సమయంలో దొంగ అంధుడుగా ఉన్నాడు. మరి ఐదు మంది కర్తలకు ఫలం అందాలి కదా? ఇప్పుడు లేని నేత్రేంద్రియానికి ఫలం అందే దెలా? ఒకవేళ, కళ్ళు ఉండినా, పన్నెండు ఇంద్రియాలకు ఫలాన్ని ఎలా పంచాలి? పంచే వారెవరు?



దీనిని బట్టి మనకు ఏమి అర్థ మవుతూ ఉంది? శరీరాది ఐదు విషయాలు కారణాలుగా ఉన్నాయే గాని, వీటిలో ఏ ఒక్కటీ కర్త కాదు. ఇవి పరస్పరాధీనంగా ఉండటం చేత ఏదీ స్వయంగా కర్త కాలేదు. పైగా అన్నీ జడాలే. ఒకటి మరొక దానిపై ఆధారపడి ఉంది అంటే అది మిథ్యాభూతము అని పూర్వాధ్యాయాలలో చెప్పుకొనే ఉన్నాం. కనుక ఆత్మ అకర్త. కర్త మిథ్య. ఈ సత్యాన్ని మనస్సుకు పట్టించ డానికే ప్రస్తుత శ్లోకము.

*ఇది అర్థం కాక పోవడం చేత, అకర్త అయిన ఆత్మను కర్తగా చూస్తారు. చదవండి.*

**తత్రైవం సతి కర్తార మాత్మానం కేవలం తు యః ।** **16**

**పశ్య త్యకృత బుద్ధిత్వా న్న స పశ్యతి దుర్మతిః ॥**

***తత్ర-ఏవం-సతి-కర్తారం-ఆత్మానం-కేవలం-తు-యః***

***పశ్యతి-అకృత బుద్ధిత్వాత్-న-సః-పశ్యతి-దుర్మతిః***

| | | | |
|---|---|---|---|
| తత్ర | = ఆ విషయమున | యః | = ఎవడు |
| ఏవం సతి | = ఇలా వుండగ | పశ్యతి | = గాంచు చున్నాడో |
| కేవలం | = కేవలము | సః | = ఆ |
| ఆత్మానం తు | = ఆత్మనే | దుర్మతిః | = అజ్ఞాని |
| కర్తారం | = కర్తగా | న పశ్యతి | = చూడలేకున్నాడు |
| అకృతబుద్ధిత్వాత్ | = అశుద్ధ బుద్ధి గలవా డగుట చేత | | |

**అర్జునా! కర్మ విషయం ఇలా ఉంటే, బుద్ధి సంస్కరింప బడని వాడు ఆత్మను కర్తగా చూస్తున్నాడు. వివేకం లేని అతడు సత్యాన్ని దర్శించ లేక పోతున్నాడు.**

### వ్యాఖ్య

కర్మ విషయం ఈ విధంగా ఉంటే ***(తత్ర ఏవం సతి)*** - అంటే పూర్వ శ్లోకంలో మనం చూచినట్లు కర్మకు అధిష్ఠానాది ఐదు కారణాలు ఉన్నట్లు తెలుస్తూ ఉంటే - ఆ విషయాన్ని విడిచి పెట్టి, అసంగము, అకర్త అయిన ఆత్మను కర్తగా ఎవడైతే భావిస్తూ ఉంటాడో ***( కేవలం ఆత్మానం కర్తారం పశ్యతి )*** వాడు దుర్మతి ***(దుర్మతిః )***. ఎవని బుద్ధి కలుషితమై ఉందో, సంస్కరింప బడకుండా ఉందో అతడే దుర్మతి ***( అకృత బుద్ధిత్వాత్ )***. బుద్ధి అసంస్కృతమై ఉన్నందున, అతడు సత్యాన్ని దర్శించ లేక పోతున్నాడు. అటు కర్మ విషయాన్ని అర్థం చేసుకోలేక పోతున్నాడు. ఇటు ఆత్మ స్వరూపాన్ని గ్రహించ లేక పోతున్నాడు.

ఉన్నది ఉన్నట్లుగా తెలియ నపుడు, ఆ ఉన్నది మరొకటిగా తెలిసే అవకాశం ఉంది. ఉన్న దానిలో లేని దానిని ఆరోపించే పరిస్థితిని కూడా నిరాకరించ లేము ***(రజ్జుసర్పవత్)***. ఒకటి ఆరోపించ బడింది అంటే, అలా ఆరోపించడానికి, మరొకటి సిద్ధంగా ఉన్నప్పుడే అది సాధ్య పడుతుంది. రజ్జువు ఉన్నది కనుకనే దానిలో సర్పాన్ని ఆరోపించడం జరిగింది. అసలు రజ్జువే లేకపోతే, సర్పాన్ని ఆరోపించే ప్రశ్నే తలెత్తదు.

రజ్జువు ఉన్నంత మాత్రాన ఆరోపించడము జరగదు. ఉన్న రజ్జువు మనకు తెలియక పోతే సర్పాన్ని రజ్జువులో ఆరోపించ గలమా? కనుక వస్తువు ఉంది. అలా ఉన్నట్లు తెలుస్తూ కూడా ఉంది. కాకపోతే, ఉన్నది ఉన్నట్లుగా తెలియడం లేదు.

వస్తువు తెలుస్తూ, దాని యథార్థ జ్ఞానము కూడా మనకు కలిగితే, ఆరోపానికి అవకాశము లేదు. వస్తువు తెలుస్తూ ఆ వస్తువు మరొక వస్తువుగా అర్థ మైనపుడే ఆరోపము జరుగుతుంది.

***ఆత్మా అస్తి*** - ఆత్మ ఉంది. ఆత్మ ఏమిటి? ఎవరు? నువ్వే ఆత్మ. నువ్వు ఉన్నావు ***( త్వమసి )***. నువ్వు సదా ఉన్నావు అనే జ్ఞానం నీకు ఉంది ***( అహం సదా అస్మి )***. నేను ఎప్పుడూ ఉన్నాను అనే జ్ఞానం అందరికీ ఉంది. ఆ ఉన్న దేదో అది ఆత్మే. ప్రతి వాడూ ఆత్మస్వరూపుడే.

తాను ఉన్నట్లు ప్రతి మనిషికి తెలుసు. కాని, ఆత్మగా ఉన్నట్లు తెలియదు. ఈ సత్యము అర్థమైతే, ఆత్మ అసంగము కనుక తానూ అసంగుడే అవుతాడు. దేనికీ అంటని వాడుగా శోభిస్తాడు. తాను ఉండి, తాను ఆత్మ అనే జ్ఞానం లేనపుడు, నేను కర్తను, నేను భోక్తను, నేను సంసారిని అని భావించడం జరుగుతూ ఉంటుంది. ఆత్మ యందు అనాత్మను ఆరోపించడం జరుగుతుంది.

***తత్ర*** - కర్మ విషయము నందు కూడా కర్మకు అధిష్ఠానాది ఐదు కారణాలు తెలుస్తూ ఉంటే, బుద్ధి హీనుడు ఆత్మను కర్తగా చూస్తున్నాడు. అసంగమైన ఆత్మకు కర్తృత్వాన్ని ఆపాదిస్తున్నాడు.

ఆత్మకు కర్తృత్వము ఉండే టట్లయితే, ఆత్మ కర్త అని నిశ్చయించే టట్లైతే, ఆత్మ ఉన్న చోట కర్మ వ్యవహారము నడుస్తూ ఉండాలి. ఆత్మ ఎప్పుడూ ఉండేదే కనుక, సుషుప్తిలో, అంటే గాఢనిద్రలో కూడా ఆత్మ ఉంది. మరి ఆత్మ నిద్రలో కూడా ఉండే టప్పుడు, అక్కడ కార్యాలు ఎలా నిరోధించ బడ్డాయి?

సుషుప్తిలో ఆత్మ తన స్వరూపంలో ఉంది ***( స్వ మపీతో భవతి )***. కాని కర్తృత్వము లేదు. కర్మ లేదు. దీనిని బట్టి కర్మ గాని, కర్తృత్వాదులు గాని అన్య ధర్మాలే గాని ఆత్మ ధర్మాలు కావని తెలుస్తూ ఉంది.

కర్తృత్వాదులు దేని ధర్మాలో అది సుషుప్తిలో లేదు. కనుక, కర్తృత్వాదులు సుషుప్తిలో గోచరించడం లేదు. అంతమాత్రాన ఆత్మ లేకుండా లేదు. కర్త ఆదమరచి గాఢంగా నిద్రించినా, స్వతస్సిద్ధమై, స్వప్రకాశ మైన ఆత్మ మాత్రం నిద్రించకుండా మేలుకొనే ఉంది. నిత్య జాగరణ లోనే ఉంది. తాను నిద్రించకుండా, నిద్రించే వాటిని ప్రకాశింప చేస్తూ ఉంది ***( అసుప్తః సుప్తా నభిచాక శీతి, ఏష సుప్తేషు జాగర్తి )***. కనుక కర్తృత్వ మనేది అన్య ధర్మమే గాని ఆత్మధర్మము కాదు. అన్య ధర్మాన్ని ఆత్మ యందు ఆరోపించడం బుద్ధి హీనత. అట్టి బుద్ధిహీనుణ్ణి 'దుర్మతి' అంటున్నాడు భగవంతుడు.

ఎవరి బుద్ధి అయితే సంస్కరింప బడలేదో అతడు దుర్మతి, లేదా దుర్బుద్ధి. దుర్మతి అలా ఎందుకు చూస్తున్నాడు? అకర్త యైన ఆత్మను కర్తగా ఎందుకు చూస్తున్నాడు? బుద్ధి సంస్కరింప బడని కారణం చేత అలా చూస్తున్నాడు. ఆచార్యుడు ఉపదేశించే వేదాంత జ్ఞానము చేత సంస్కరింప బడని బుద్ధి కల వాడు దుర్మతి ***( వేదాంత ఆచార్యోపదేశ న్యాయైః అకృత బుద్ధిత్వాత్ , అసంస్కృత బుద్ధిత్వాత్ )***. ఈ కారణం చేత అసంగమైన ఆత్మకు కర్మసంగాన్ని కల్పిస్తున్నాడు. కేవలాత్మకు కర్తృత్వాన్ని ఆపాదిస్తున్నాడు. వీడు చూస్తున్నా చూడని వాడే ***( పశ్యన్నపి చ న పశ్యతి )***. కనిపిస్తూ ఉండినా, కనిపించే దానిని మరొక విధంగా చూచే వాడు దుర్మతి.

ఆకాశంలో ఒకే చంద్రుడు ప్రకాశిస్తున్నా, నేత్ర దోషం కల వాడికి అనేక చంద్రులు కనిపిస్తూ ఉంటారు ***(యథా తైమరికః అనేకం చంద్రం )***. అంతమాత్రాన ఆకాశంలో అనేక చంద్రులు లేరు.

నేత్ర దోషం లేక పోయినా, మనస్సులో స్పష్టత లేని వాడు మనస్సు లోని అస్పష్ట విషయాన్నే ఇంద్రియాల ద్వారా చూస్తాడు. ఆకాశంలో చంద్రుడు నిశ్చలంగా ఉంటాడు. మేఘాలు పరుగులు పెడుతూ ఉంటాయి. కాని, బుద్ధిలో స్పష్టత లేని అజ్ఞాని, మేఘాల పరుగును చంద్రునికి ఆపాదించి, 'చంద్రుడు మేఘాల లోకి పోతున్నాడు, వస్తున్నాడు' అని మాట్లాడుతుంటాడు. ఇదంతా ఆరోపమే ***( యథా వా అభ్రేషు ధావత్సు చంద్రం ధావన్తం )***. దుర్మతి కల్పించిన కర్తృత్వమే గాని ఆత్మకు కర్తృత్వం లేదు.



*దుర్మతిని గూర్చి విన్నారు కదా! ఇక సుమతిని గూర్చి వినండి.*

17

**యస్య నాహంకృతో భావో బుద్ధి ర్యస్య న లిప్యతే ।**
**హత్వాపి స ఇమాన్ లోకా న్న హన్తి న నిబధ్యతే ॥**

***యస్య-న-అహంకృతః-భావః-బుద్ధిః-యస్య-న-లిప్యతే***
***హత్వా-అపి-సః-ఇమాన్-లోకాన్-న-హంతి-న-నిబధ్యతే***

| | | |
|---|---|---|
| యస్య | = | ఎవనికి |
| అహంకృతః | = | నేనే కర్త యనెడి |
| భావః | = | భావము |
| న | = | లేదో |
| యస్య | = | ఎవని యొక్క |
| బుద్ధిః | = | బుద్ధి |
| న లిప్యతే | = | అంటదో |
| సః | = | వాడు |
| ఇమాన్ | = | ఈ |
| లోకాన్ | = | లోకము నందు |
| హత్వా అపి | = | చంపినను |
| న హంతి | = | చంపినవాడు కాదు |
| న నిబధ్యతే | = | బద్ధుడును కాడు |

**అర్జునా! నేను కర్తను అనే భావం లేని వాడు, కర్మఫలమునకు అంటని బుద్ధి కల వాడు లోకంలో చంపినా చంపిన వాడు కాడు. అతడు దేని చేతను బద్ధుడు కాడు.**

## వ్యాఖ్య

***అనిష్ట మిష్టం మిశ్రం చ*** - అంటూ పన్నెండవ శ్లోకములో మూడు విధాలైన కర్మఫలాలు త్యాగులు కాని వారికి మరణానంతరము కలుగుతాయి అని చెప్పి, శ్లోకం యొక్క నాల్గవ పాదంలో ***న తు సంన్యాసినాం క్వచిత్*** - సన్యాసులకు ఎప్పుడూ కలగవు అని చెప్పడం జరిగింది. త్రివిధ కర్మఫలాలను పదమూడవ శ్లోకం నుండి వరుసగా నాలుగు శ్లోకాలలో వివరించిన పరమేశ్వరుడు, చివరి పాదంలో సన్యాసులకు కలగవు అని చెప్పిన విషయాన్ని ప్రస్తుత శ్లోకంలో వ్యాఖ్యానిస్తున్నాడు.

### అసంగాత్మ

ఆత్మ అసంగము. అసంగాత్మకు దేహ, ఇంద్రియ, మనోబుద్ధులతో ఏ విధమైన సంబంధము లేదు. ఈ సత్యము అర్థం కాని వాడు దుర్మతి. అర్థమైన వాడు సుమతి. అధిష్ఠానాది ఐదు విషయాలు కర్మ కారణా లుగా తెలుస్తూ ఉండినా, అధిష్ఠానాది ధర్మాలను ఆత్మ యందు ఆరోపించి తానే కర్త అని భావించు వాడు దుర్మతి. దేహేంద్రియాలు వికారయుతా లని, వాటికి సత్తా స్ఫురణలను కలిగించేది ఆత్మే యని, ఆత్మ ఎప్పుడు అసంగం గానే ఉందని, ఆకాశం లాగా నిర్లిప్తమై ఉందని, అట్టి ఆత్మ తానే అని తెలిసి అసంగాత్మగా, అకర్తగా శోభిల్లే వాడు సుమతి. 'ఆత్మ లేకుండా కర్త లేడు. కాని, ఆత్మ కర్త కాదు; అకర్త' అనే జ్ఞానం కల వాడు సుమతి. ఆత్మలో కర్తృత్వము లేదు.

అహం భావన అన్నా, కర్తృత్వ భావన అన్నా ఒక్కటే. ఆత్మలో అహం భావన లేదు. అహం భావనకు ఆధారమైన చైతన్యమే ఆత్మ. కనుక ఆత్మలో కర్తృత్వం లేదు. ఆత్మ అకర్త.

ఆత్మను ఈ విధంగా తెలుసుకున్న సుమతి తాను కూడా అకర్తే అనే భావంతో ఉన్నందున, కర్మల చేత అంట బడడు. అతని బుద్ధిలో కర్మ లేపము ఉండదు ***( బుద్ధిః అన్తఃకరణం యస్య ఆత్మనః ఉపాధిభూతా న లిప్యతే సః సుమతిః సః పశ్యతి )***. అతడే సుమతి. అతడు సర్వత్ర ఆత్మనే దర్శిస్తాడు.

**అభోక్తాత్మ**

ఆత్మ కర్త కాదు, అకర్త అని తెలిసిన వాడు ఆత్మలో కర్తృత్వ భావన, అంటే అహం భావన లేదని తెలుసు కుంటాడు. ఎవరికి కర్తృత్వ భావన ఉంటుందో, వారికే భోక్తృత్వ భావన ఉంటుంది. ఆత్మ కర్త కాదు అని తెలిసిన సుమతికి, ఆత్మ భోక్త కూడా కాదని తెలుసు. కర్తృత్వ బుద్ధి లేని ఆత్మ యందు భోక్తృత్వ బుద్ధి ఉండే అవకాశమే లేదు. అందుచేత, ఆత్మ కర్తృత్వ, భోక్తృత్వముల చేత అంట బడదు కనుక ఆకాశం లాగా ***(యథా నభః)*** అసంగమై ఉంటుంది. నిర్లిప్తమై ఉంటుంది. ఇట్టి ఆత్మజ్ఞానము కల వాడు వధించినా కూడా వధించని వాడే ***(హత్వాఽపి న హన్తి న నిబధ్యతే)***. కారణం, ఏ కర్మ కూడా అతనిని బంధించ లేదు కనుక. జ్ఞాని నిజంగా చంపుతాడని దాని అర్థం కాదు. అతడు ఏమి చేసినా చేయని వాడే అని అర్థము. సాక్షీమాత్రుడు అని భావము. అతడు చేసినా, చేయక పోయినా ఆత్మరూపుడు కనుక, సదా ముక్తుడే. జీవన్ముక్తుడే.

ప్రస్తుతము మనం అధ్యయనం చేస్తున్న ఈ శ్లోకము వరాహ ఉపనిషత్తు మంత్రమునకు ప్రతిరూపంగా ఉంది. ఈ శ్లోకంలో 'సుమతి'గా చెప్పబడ్డ వాడు ఉపనిషత్తులో జీవన్ముక్తుడుగా కీర్తింప బడ్డాడు. శ్లోక, మంత్రాల ప్రథమ పాదములలో మార్పు లేనే లేదు.

*యస్య నాహం కృతో భావో బుద్ధిర్యస్య న లిప్యతే ।*
*కుర్వతోఽపి కుర్వతో వాఽపి స జీవన్ముక్త ఉచ్యతే ॥*

ఎవరికి అహం భావన లేదో, ఎవరి బుద్ధి నిర్లిప్తమై ఉందో, అతడు కర్మ చేసినా జీవన్ముక్తుడే. కర్మ చేయక పోయినా జీవన్ముక్తుడే అని వరాహోపనిషత్తు *( 4 - 25 )*. గీత ఉపనిషత్తుల సారం అనడానికి ఇవి నిదర్శనాలు.

*ఇక, కర్మ ప్రవృత్తికి కారణాలను వివరిస్తున్నాడు.*

**జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధా కర్మచోదనా ।**
**కరణం కర్మ కర్తేతి త్రివిధః కర్మసంగ్రహః ॥** 18

***జ్ఞానం-జ్ఞేయం-పరిజ్ఞాతా-త్రివిధా-కర్మచోదనా***
***కరణం-కర్మ-కర్తా-ఇతి-త్రివిధః-కర్మసంగ్రహః***

| | | | | | |
|---|---|---|---|---|---|
| కర్మచోదనా | = కర్మవిధి | | కర్మసంగ్రహః | = | కర్మ యొక్క సంగ్రహము |
| జ్ఞానం | = జ్ఞానము | | కరణం | = | సాధనము |
| జ్ఞేయం | = జ్ఞేయము | | కర్మ | = | కార్యము |
| పరిజ్ఞాతా | = తెలుసుకొను వాడు | | కర్తా | = | చేయువాడును |
| ఇతి | = అని | | ఇతి | = | అని |
| త్రివిధా | = మూడు విధములు | | త్రివిధః | = | మూడు విధములు |

**అర్జునా! జ్ఞానము, జ్ఞేయము, జ్ఞాత - ఈ మూడు కర్మ ప్రవృత్తికి కారణాలు. అలాగే కరణము, కర్మ, కర్త - ఈ మూడు క్రియా సంబంధములు.**

**వ్యాఖ్య**

కర్మాచరణము నందు ప్రధానంగా రెండు విషయాలు ఉన్నాయి. మొదటిది కర్మ చోదనము. రెండవది కర్మ సంగ్రహము. కర్మవిధిని ఆవిష్కరించే దానిని చోదనము అంటారు. అదే కర్మ చోదనము. అంటే, కర్మ



ప్రవృత్తికి కారణము. అంటే, కర్మను ప్రవర్తింప చేసేది. అదే కర్మచోదనము ***( చోదనేతి క్రియాయాః ప్రవర్తకం వచనమ్ )***. ప్రవర్తకమే చోదన శబ్దార్థము.

జ్ఞానము, జ్ఞేయము, జ్ఞాత - ఈ మూడు కర్మచోదనము. ఏ విషయానికి సంబంధించిన జ్ఞాన మైనా దేని చేత అయితే తెలియ బడుతుందో అది జ్ఞానము ***( జ్ఞాయతే అనేన ఇతి జ్ఞానమ్ )***.

ఏ కర్మ చేయాలన్నా దానికి సంబంధించిన జ్ఞానం ముందుగా మనకు ఉండాలి. దీనినే జ్ఞానము అంటారు. మనకు ఏది కావాలో అది ముందుగా తెలిస్తే, ఆ తరువాత దానిని పొందేందుకు మనం కర్మను ఆచరిస్తాము. ముందు జ్ఞానము. తరువాత కర్మ. గీత ముఖపత్రమే అది కదా! ముందు జ్ఞానరూపంగా కృష్ణుడు. వెనుక క్రియా రూపంగా అర్జునుడు.

మనకు ఏమి కావాలో తెలియ నపుడు దానిని పొందే ప్రయత్నం చేసే దెలా? కనుక ముందు కర్మ చోదనము. తరువాత కర్మ సంగ్రహము. కర్మాచరణమునకు జ్ఞానము అంతరంగ రూపము. కర్మ బాహ్య రూపము.

జ్ఞానము ద్వారా పొంద బడేది జ్ఞేయము. జ్ఞేయమును జ్ఞానము ద్వారా గ్రహించే వాడు జ్ఞాత. జ్ఞానము, జ్ఞేయము, జ్ఞాత - ఈ మూడు ఉంటేనే కర్మ ప్రవర్తక మౌతుంది కనుక, ఇవి కర్మ చోదనము అనబడ్డాయి. ఇవి ఉంటేనే కర్మవిధి.

ఆ తరువాత కర్మసంగ్రహము. ఇవి కర్మాచరణమునకు ఆశ్రయాలు. కర్మ ప్రవృత్తికి కర్మచోదనము కారణము. కర్మ భోగానికి ఈ కర్మసంగ్రహము కారణము. జ్ఞానము, జ్ఞేయము, జ్ఞాత కర్మచోదన మైతే, కరణం, కర్మ, కర్త కర్మసంగ్రహ మనిపించు కుంటాయి.

పద్నాల్గవ శ్లోకంలో **పంచైతాని** అని చెప్పబడిన కర్మ కారణాలలో అధిష్ఠానాన్ని కరణం లోను, దైవమును కర్త లోను కలిపితే, ఆ తరువాత కర్త, కరణము, కర్మ - ఈ మూడే ఉంటాయి. వాటినే కర్మసంగ్రహముగా ప్రస్తుత శ్లోకంలో భగవంతుడు చెబుతున్నాడు.

అలాగే కర్మచోదనములో తెలియ బడేది జ్ఞేయ మైతే, తెలియ చేసేది జ్ఞానము. తెలుసుకొనే జ్ఞాత అవిద్యోపాధిక జీవుడు. ఈ విధంగా కర్మాచరణము నందు కర్మచోదనము జ్ఞానరూపం గాను, కర్మసంగ్రహము క్రియారూపం గాను తెలుస్తూ ఉన్నాయి.

*జ్ఞానము, కర్మ, కర్తల గుణ భేదాన్ని ప్రవచిస్తున్నాడు.*

**జ్ఞానం కర్మ చ కర్తా చ త్రిధైవ గుణభేదతః ।**
**ప్రోచ్యతే గుణసంఖ్యానే యథావ చ్ఛృణు తా న్యపి ॥** 19

***జ్ఞానం-కర్మ-చ-కర్తా-చ-త్రిధా-ఏవ-గుణభేదతః***
***ప్రోచ్యతే-గుణసంఖ్యానే-యథావత్-శృణు-తాని-అపి***

| | | | |
|---|---|---|---|
| గుణసంఖ్యానే | = గుణాలను ప్రతిపాదించే సాంఖ్యశాస్త్రము నందు | త్రిధా ఏవ | = మూడు విధములు గనే |
| జ్ఞానం | = జ్ఞానము | ప్రోచ్యతే | = చెప్పబడు చున్నది |
| కర్మ చ | = కర్మమును | తాని అపి | = వానిని కూడా |
| కర్తా చ | = కర్తయును | యథావత్ | = యథార్థముగ |
| గుణభేదతః | = గుణభేదము ననుసరించి | శృణు | = ఆలకించు! |

**అర్జునా! జ్ఞానము, కర్మ , కర్త అనేవి గుణ భేదాన్ని బట్టి మూడు విధాలని సాంఖ్యము చెప్పింది. అది కూడా యథార్థంగా విను.**

**వ్యాఖ్య**

కర్మల విషయంలో, జ్ఞాత - జ్ఞేయము - జ్ఞానములను కర్మలను ప్రవర్తింప చేసే కర్మచోదనముగా; కర్మతో ప్రత్యక్ష సంబంధం కలిగిన కరణం - కర్మ - కర్తలను కర్మ సంగ్రహముగా పూర్వ శ్లోకంలో చూశాం. కర్మ సిద్ధికి హేతువులుగా చెప్ప బడిన ఈ ఆరింటిని కలిపి విషయ ప్రధానంగా మూడు చేయడం జరిగింది. గుణ భేదాన్ని బట్టి జ్ఞానము, కర్మ, కర్త అని మూడు విధాలుగా విభజించి చెప్పింది కపిలుని సాంఖ్య శాస్త్రము. దానిని కూడా వినిపిస్తున్నాడు భగవంతుడు.

**సాంఖ్యము - గుణ విభాగము**

ప్రస్తుత శ్లోకంలో జ్ఞానము - కర్మ - కర్త, ఈ మూడు విషయాలనే భగవానుడు సారభూతంగా ప్రస్తావించడం జరిగింది. పూర్వం మనం చెప్పుకొనిన కర్మసిద్ధి హేతువులైన ఆరింటిలో జ్ఞేయము జ్ఞానంలో కలిసి పోయింది. కరణము కర్మ లోను, జ్ఞాత కర్త లోను కలిసి పోవడం జరిగింది. తత్ఫలితంగా జ్ఞేయము - కరణము - జ్ఞాత అవ్యక్తమై, అదృశ్యమై, జ్ఞానము - కర్మ - కర్త మనకు చర్చనీయాంశ మైనవి ***( త్రిధా ఏవ ప్రోచ్యతే కథ్యతే).*** ఈ విషయము గుణములను ప్రతిపాదించే సాంఖ్య శాస్త్రము నందు చెప్ప బడింది. ఈ సాంఖ్యము భగవద్గీతలో చెప్పబడిన సాంఖ్యము కాదు. షడ్దర్శనాలలో ఒకటైన సాంఖ్యము. కపిల మహర్షి ప్రతిపాదించిన గుణ ప్రధానమైన సాంఖ్య శాస్త్రము.

కపిల మహర్షి సాంఖ్య సిద్ధాంత కర్త. బ్రహ్మదేవుని పుత్రుడు అని చెబుతారు. కాని, భాగవతంలో దేవహూతి కర్దముల పుత్రుడుగా చెప్ప బడ్డాడు. తల్లి యైన దేవహూతికి తత్త్వోపదేశం చేసి, ఆమెకు ముక్తిని ప్రసాదించిన మహితాత్ముడు. కపిలుడు తన తల్లికి ముక్తిని ప్రసాదించిన ప్రదేశమునే 'మాతృగయ' అంటారు. రామాయణంలో కూడా సగర పుత్రుల విషయము నందు కపిలుని ప్రస్తావన ఉంది. సాంఖ్య సిద్ధాంత కర్త అయిన కపిలుడు ఆ కపిలుడు కాదని శ్రీ శంకరుల లాంటి పెద్దలు అభిప్రాయ పడ్డారు.

సాంఖ్యులు అద్వైతులు కారు. ద్వైతులు. పారమార్థికంగా అద్వయ బ్రహ్మ నిర్దేశము నందు సాంఖ్య, వేదాంతములకు సిద్ధాంత పరంగా భేద మున్నప్పటికీ, కపిలుని 'గుణ సంఖ్యాన శాస్త్రం' గుణాల విషయంలో, భోక్త విషయంలో ప్రామాణికమే. అది వేదాంతులకు కూడా అంగీకారమే. కనుక, కపిలుని 'గుణ సంఖ్యాన శాస్త్రము'ను వేదాంతులు గ్రహించారు. ఆ విషయంలో సాంఖ్య, వేదాంతములకు విరోధము లేదు ***( తస్మాత్ కాపిల శాస్త్ర మపి ఉపాదీయతే ఇతి న విరోధః ).*** మహాసిద్ధుడైన కపిల ముని భగవదంశ సంభూతు డని చెబుతారు. సిద్ధులలో కపిలముని నేనే *(10 వ అ - 26 వ శ్లో)* అని గీతాచార్యుడే చెప్పడం చేత, కపిలుడు ఎంతటి గొప్ప వాడో ఊహించ వచ్చు. మరొక ఆశ్చర్యకరమైన విషయ మేమిటంటే, విష్ణుసహస్ర నామంలో భగవంతుడికి **మహర్షిః కపిలాచార్యః** అనేది ఒక పేరు. సవిశేషణ ఏకనామం *(531 నామం).* గుణాలను, గుణ వ్యాపారాలకు సంబంధించిన విషయాలను ప్రామాణికంగా నిరూపించడంలో కపిలుని సాంఖ్యము సమున్నత మైన స్థానాన్ని సముపార్జించు కున్నది. ప్రస్తుతం మనం చూడ బోతున్న జ్ఞానము - కర్మ - కర్తలను కూడా గుణ భేదాన్ని అనుసరించి త్రివిధము లుగా నిర్ణయించి నిరూపించడం జరుగుతూ ఉంది.

*ప్రథమంగా జ్ఞానమును గూర్చి చెబుతున్నాడు. గుణ భేదాన్ని బట్టి మూడు విధాలైన జ్ఞానములలో మొదటి దైన సాత్త్విక జ్ఞానమును గూర్చి చెబుతున్నాడు.*





**సర్వభూతేషు యే నైకం భావ మవ్యయ మీక్షతే ।**
**అవిభక్తం విభక్తేషు తద్ జ్ఞానం విద్ధి సాత్త్వికమ్ ॥** 20

***సర్వభూతేషు-యేన-ఏకం-భావం-అవ్యయం-ఈక్షతే***
***అవిభక్తం-విభక్తేషు-తత్-జ్ఞానం-విద్ధి-సాత్త్వికం***

| | | | | | |
|---|---|---|---|---|---|
| విభక్తేషు | = | విభక్తములైన | యేన | = | ఏ జ్ఞానము చేత |
| సర్వభూతేషు | = | సర్వభూతముల యందును | ఈక్షతే | = | గాంచుచున్నాడో |
| అవిభక్తం | = | విభక్తము కానట్టి | తత్ | = | ఆ |
| అవ్యయం | = | నశించ నట్టి | జ్ఞానం | = | జ్ఞానము |
| ఏకం | = | ఏకమైన | సాత్త్వికం | = | సాత్త్విక జ్ఞాన మని |
| భావం | = | భావమును | విద్ధి | = | తెలుసుకో! |

**అర్జునా! భిన్నము లైన సర్వ ప్రాణుల యందు అఖండమై, నాశ రహితమైన, ఏకమైన ఆత్మ భావమును జ్ఞానంతో ఎవడు చూస్తున్నాడో, అతని జ్ఞానము సాత్త్విక జ్ఞానము.**

**వ్యాఖ్య**

జ్ఞాన, కర్మ, కర్తలు మూడు విధాలని ప్రవచించి, మళ్ళీ ఆ మూడింటి గుణ భేదాలను వివరించడం జరుగుతుంది. జ్ఞానము త్రివిధము అని చెబుతూ, ప్రథమంగా సాత్త్విక జ్ఞానమును వివరిస్తున్నాడు.

**సాత్త్విక జ్ఞానము**

వేరు వేరుగా కనిపిస్తున్న సర్వ భూతముల యందు ***(విభక్తేషు)*** ఏకమైన వస్తువును ***(అవిభక్తం)***, నాశ రహితంగా ***(అవ్యయం)*** ఉన్న దానిని చూచే జ్ఞానము ***(ఈక్షతే జ్ఞానమ్)*** సాత్త్వికము ***(సాత్త్వికమ్ విద్ధి)*** అని తెలుసుకోమంటున్నాడు.

ఇక్కడ భావ శబ్దం వస్తువును తెలుపుతుంది. ఏకమైన ఆత్మ వస్తువును బోధిస్తుంది ***(ఏకం భావం వస్తు, ఏకమ్ ఆత్మవస్తు ఇత్యర్థః ).*** భిన్న రూపాలైన దేహాదులలో ఏ భావ రూపమైన ఆత్మ ఏకంగా, అభిన్నంగా, అఖండంగా భావింప బడుతూ ఉందో, అట్టి ఆత్మ అవ్యయము ***(అవ్యయమ్).*** అంటే, దేహాలు నశించినా, నశించకుండా ఏదైతే ఉందో అది అవ్యయము. అదే నాశ రహితమైన ఆత్మ.

ఒక వస్తువు నాశమును పొందాలి అంటే, దాని స్వభావ స్వరూపాలలో నైనా పరివర్తన జరగాలి. అంటే పరిణామం ఏర్పడాలి. లేదా, దానిలో కొన్ని ధర్మాలైనా మార్పు చెందాలి. అప్పుడే అది వ్యయ మవుతుంది. అలాంటి ఉభయ పరిణామాలు తెలియనిది, లేనిది అవ్యయము. అట్టిది ఆత్మ ఒక్కటే గాని, మరొకటి కాదు. అట్టి ఆత్మను సాక్షాత్కరించుకొనే జ్ఞానము సాత్త్విక మైనది.

భూతములు అంటే పుట్టినవి అని అర్థము. జనన ధర్మము కలవి. ప్రభవములు ***(భవన్తి).*** పుట్టినవి ఏవైనా నశించక తప్పదు. దేహా లన్నీ పుట్టినవే. ఒక దేహము మరొక దేహము కాదు. దేహా లన్నీ నశించి పోయేవే.

కుండలు అన్నీ పుట్టినవే. ప్రతి కుండకు ఉత్పత్తి ఉంది. ఉత్పన్న మైనవి ఏవైనా నశించి తీరుతాయి.

కుండలు అనేకము లున్నాయి. అన్నీ మట్టికుండలే. కుండ లన్నిటిలో ఆకాశం ఉంది. ఒక కుండ మరొక కుండ కన్నా భిన్నంగా ఉంది. కాని, ఒక కుండ లోని ఆకాశము మరొక కుండ లోని ఆకాశం కన్నా భిన్నంగా ఉందా? కుండలు వేరైనా కుండలలో ఉన్న ఆకాశం ఒక్కటే ***(అవిభక్తం విభక్తేషు)***.

శరీరా లన్నీ వేరు వేరుగా ఉన్నాయి. ఒక శరీరం మరొక శరీరం కాదు. అన్ని శరీరాలకు పుట్టుక ఉంది. అన్ని శరీరాలకు వినాశము ఉంది. కాని, శరీరా లన్నిటిలో, కుండలలో ఆకాశం లాగా ఏ ఆత్మ చైతన్యం ఉందో, అది అన్ని శరీరాల లోను ఉంది. ఉంది కనుకనే, శరీరా లన్నీ చలిస్తున్నాయి. మరి, దేహాలలో ఉన్న ఆత్మకు దేహం ఉందా? లేదు. ఉంటే అదీ నశించేదే. ఆత్మ అవ్యయంగా ఉంది. అంటే, తనకు శరీరం లేకుండా శరీరా లన్నిటిలో భాసిస్తూ ఉంది ***(అశరీరం శరీరేషు)***.

దేహాలు అనేకంగా ఉంటాయి. ఆత్మ ఏకము. దేహాలకు పుట్టుక ఉంది. ఆత్మకు పుట్టుక లేదు. దేహాలు నశిస్తాయి. ఆత్మ నశించదు. దేహాలు విభక్తాలు. ఆత్మ అవిభక్తము. దేహాలు ఎప్పుడూ ఉండవు. ఆత్మ సదా ఉంటుంది. ఆకాశం లాగా నిరంతరం ఉంటుంది ***(వ్యోమవత్ నిరంతరం ఇత్యర్థః)***. ఈ విధమైన అద్వయాత్మను దర్శించే జ్ఞానము సాత్త్విక జ్ఞానము ***(తత్ జ్ఞానం అద్వైతాత్మ దర్శనమ్. సాత్త్వికం సమ్యగ్దర్శనం విద్ధి)***. అద్వైత దర్శనమే సాత్త్విక మైన సమ్యగ్దర్శనము. ద్వైత దర్శనా లన్నీ భేద దర్శనాలే కనుక, వాటిని రాజసములు, లేదా తామసములుగా గుర్తించాలి. అవి సంసారాన్ని సాక్షాత్తు నివృత్తి చేయడానికి సమర్థ మైనవి కావు ***(యాని ద్వైత దర్శనాని అసమ్యగ్భూతాని రాజసాని తామసాని చేతి న సంసారో చ్ఛిత్తయే భవన్తి !)***. 'సాక్షాత్' అనే పదాన్ని వాడటం భాష్యకారు లైన శ్రీ శంకరుల విశాల హృదయానికి అద్దం పడుతుంది. సాక్షాత్తు సమర్థం కావు అంటే, 'పరంపరయా' కావచ్చు అనేది ధ్వనిస్తోంది. అంటే, శుద్ధి ద్వారా ప్రాప్త మని భావం. ద్వైత చీకట్లలో మనిషి లేని వాటిని తట్టుకొని పడుతూ ఉంటాడు. అద్వైత వెలుగులో మేలుకుంటే, తట్టుకోవ డానికి, ముట్టుకోవ డానికి, పట్టుకోవ డానికి రెండవ వస్తువే ఉండదు. అంతా తానే. తన స్వరూపమే. అద్వయమైన ఆత్మ స్వరూపమే.

**వస్తు వొక్కటే వెలుగు ఒక్కటే**  
**చూచే కళ్ళు రెండున్నాయి**  
**సత్య మొక్కటే జ్ఞాన మొక్కటే**  
**దృగ్దృశ్యములు రెండైనాయి**  
**ఎన్ని ఉన్నా కల ఒక్కటే**  
**మేలుకొంటే తానొక్కడే**  
**రామ రామ జయ రాజారామ్**  
**రామ రామ జయ సీతారామ్**

అని రామజోగి చిట్కా.

ఇక రాజస జ్ఞానాన్ని చెబుతున్నాడు.

**పృథక్త్వేన తు యద్ జ్ఞానం నానాభావా న్పృథగ్విధాన్ ।**  
**వేత్తి సర్వేషు భూతేషు తద్ జ్ఞానం విద్ధి రాజసమ్ ॥** **21**

**పృథక్త్వేన-తు-యత్-జ్ఞానం-నానాభావాన్-పృథగ్విధాన్**  
**వేత్తి-సర్వేషు-భూతేషు-తత్-జ్ఞానం-విద్ధి-రాజసం**





| | | |
|---|---|---|
| సర్వేషు | = | సమస్తమైన |
| భూతేషు | = | భూతముల యందు |
| పృథగ్విధాన్ | = | వేరు వేరు విధములు గానున్న |
| నానాభావాన్ | = | వివిధ భావములు గల వానిని |
| యత్ | = | ఏ |
| జ్ఞానం | = | జ్ఞానము |
| పృథక్త్వేన తు | = | వేర్వేరుగా నుండు వానినిగ |
| వేత్తి | = | తెలిసికొను చున్నదో |
| తత్ | = | ఆ |
| జ్ఞానం | = | జ్ఞానమును |
| రాజసం | = | రాజస జ్ఞానముగ |
| విద్ధి | = | తెలుసుకో |

**అర్జునా! సర్వ భూతముల యందు, భేద భావం చేత వేరు వేరుగా ఉన్న ఆత్మను, భేద రూపంతో ఎవడు తెలుసు కుంటున్నాడో, అతని జ్ఞానము రాజస జ్ఞానము.**

**వ్యాఖ్య**

శరీరాలు వేరు వేరుగా తెలుస్తూ ఉన్నా, అన్ని శరీరాలలో ఆత్మ అభిన్నంగా, అఖండంగా శోభిస్తూ ఉంది అనే జ్ఞానము సాత్త్విక జ్ఞానము. అలా కాకుండా, శరీరాలు వేరు వేరుగా ఉన్నట్లే, ఆ శరీరాల లోని ఆత్మ కూడా వేరు వేరుగా, భిన్నత్వంతో ఉంది ***(పృథక్త్వేన భేదేన)*** అనే జ్ఞానము రాజస జ్ఞానము. సాత్త్వికము అద్వైతమును దర్శిస్తూ ఉంటే రాజసము ద్వైతమును పెనవేసుకొని ఉంది.

ఒక్కొక్క దేహానికి ఒక్కొక్క ఆత్మ ఉందనేది రాజస జ్ఞానము. రాజస జ్ఞానము కల వారు కుండలు ఎలా వేరు వేరుగా ఉన్నవో, కుండల లోని ఆకాశము కూడా అలా వేరు వేరుగా ఉందని భావించే వారు.

దేహాలు వేరు వేరుగా ఉన్నాయి. అలాగే ఆత్మ కూడా వేరు వేరుగా ఉంది. దేహాలు ఎన్ని ఉన్నాయో ఆత్మలు అన్ని ఉన్నాయి. ప్రతి దేహము మరొక దేహంతో ఎలా విడి పడి ఉందో, ప్రతి ఆత్మ మరొక ఆత్మతో అలా విడి పడి ఉంది అని రాజస జ్ఞానము కల వారు భావిస్తారు.

ఎంత చెట్టుకు అంత గాలి అని పెద్దలు చెప్పినట్లు, ప్రతి బుద్ధికి దానికి తగిన తర్కం దాని కుంటుంది. అశాస్త్రీయంగా ఆత్మ భిన్నత్వాన్ని ప్రతిపాదించే ద్వైతులు రాజస జ్ఞానంతో దానిని హేతుబద్ధం చేయాలని ప్రయత్నిస్తారు.

నేను ఆకలితో ఉన్నాను. నా స్నేహితుడు కూడా ఆకలితో ఉన్నాడు. నేను భోం చేశాను. నా స్నేహితుడు భోం చేయ లేదు. నా ఆకలి తీరింది. మరి, అతడు ఆకలి తోనే ఉన్నాడు కదా! అందరిలో ఉండే ఆత్మ ఒక్కటే అయితే, అఖండమే అయితే, నా ఆకలి ఎప్పుడైతే తీరిందో, నా స్నేహితుడి ఆకలి కూడా తీరాలి కదా! నేను నీళ్ళు త్రాగితే నా దాహం తీరింది కనుక, నీవు నీళ్ళు త్రాగకున్నా నీ దప్పిక తీరాలి కదా! అప్పుడే ఇద్దరిలో ఒకే ఆత్మ ఉందనేది సత్య మవుతుంది కదా! అనేది వారి వాదన.

ఆకలిదప్పులు ప్రాణ ధర్మములు అనేది కూడా అర్థం గాని ప్రబుద్ధులకు ఏమి చెప్పగలం? ఎవడు అలసి పోయాడో వాడు నిద్రిస్తాడు గాని, ఒకడు నిద్రించాడని అందరూ నిద్రిస్తారా? అలసి పోయేది దేహం. దేహ ధర్మాన్ని ఆత్మ యందు ఆరోపించడం చేత ఈ భేద జ్ఞానము, అంటే ద్వైత జ్ఞానము ఏర్పడుతూ ఉంది. ఈ జ్ఞానము రాజస జ్ఞానము. వీరికి ద్వైతమే సత్యము. భేదమే జ్ఞానము.

ఈ భేదజ్ఞానము ఎంత వరకైనా విస్తరిస్తుంది. ఇదొక పెద్ద భ్రాంతి. ద్వైత భ్రాంతి. వాస్తవంగా చెప్పాలంటే ఇది జ్ఞానమే కాదు. జ్ఞానమును 'ప్రమ' అంటారు. ఇది ప్రమ కాదు, భ్రమ. భ్రాంతి. భ్రమతో కూడిన ఈ రాజస జ్ఞానానికి అడుగడుగునా భేద దర్శనమే. అణువణువున ద్వైత దర్శనమే. ఈ ద్వైత భ్రమ ఒక విధంగా ఉండదు. దీనిని కుదించి, మదింపు వేసి **పంచభ్రమలు** అన్నది శాస్త్రం. ఇదే భేద పంచకము.

జీవుడు వేరు, ఈశ్వరుడు వేరు (జీవేశ్వర భేదం). ఒక జీవుడు మరొక జీవుని కన్నా వేరైన వాడు కనుక జీవు లందరూ వేరువేరుగా ఉన్నారు (జీవజీవ భేదం). ఒక వ్యక్తి కుర్చీలో కూర్చుని ఉన్నాడు. కుర్చీ వేరు, కూర్చున్న వ్యక్తి వేరు. కుర్చీ జడం. కూర్చున్న వాడు జీవుడు (జీవ జడ భేదం). కుర్చీలో కూర్చున్న వ్యక్తి వార్తాపత్రిక చదువు తున్నాడు. కుర్చీ ఎలా జడమో, పత్రిక కూడా అలా జడమే. పత్రిక కుర్చీ కాదు, కుర్చీ పత్రిక కాదు (జడజడ భేదం). అలాగే జడ ప్రకృతి కన్నా ఈశ్వరుడు అన్యమైన వాడు కనుక జడము వేరు ఈశ్వరుడు వేరు (ఈశ్వర జడ భేదం). ఇది భేద పంచకము. పంచభ్రమ స్వరూపము.

ఈ భేదమే బంధానికి కారణము. భేదమే బంధము. అభేదమే మోక్షము. ద్వైతము భ్రాంతి. అద్వైతము శాంతి.

రాజస జ్ఞానంతో భేద దర్శనం చేసే వారికి ప్రకృతి దర్శనమే గాని, పురుష దర్శనం ఉండదు. క్షేత్ర అవగాహనే గాని క్షేత్రజ్ఞ జ్ఞానము ఉండదు. మాయా దర్శనమే గాని మహేశ్వర దర్శనము జరగదు. రాజస జ్ఞానము గల వ్యక్తులు ఎవరిని చూచినా వారి లోని గుణ దోషాలను దర్శిస్తారే గాని ఆత్మను దర్శించ లేరు కనుక, గుణ భేదాల వల్ల వారికి ద్వైతానుభవం కలుగుతుందే గాని అద్వైతానుభూతి కలిగే అవకాశమే లేదు.

ఇక్కడ ఒక్క విషయాన్ని అర్థం చేసుకోవాలి. ఏ జ్ఞానం వేరు వేరుగా ఆత్మను తెలుసుకుంటూ ఉందో ***(యద్ జ్ఞానం పృథక్త్వేన వేత్తి)*** అది రాజస జ్ఞానము అని శ్లోకంలో ఉంది. అంటే, 'జ్ఞానము తెలుసుకుంటూ ఉంది' అనే అర్థం ధ్వనిస్తుంది. అలా గ్రహిస్తే జ్ఞానానికి కర్తృత్వాన్ని ఆపాదించినట్లు అవుతుంది. జ్ఞానము తెలుసుకుంటుంది అంటే జ్ఞానము కర్త అవుతుంది. కనుక, జ్ఞానము తెలుసు కుంటుంది అంటే జ్ఞానము కల వాడు తెలుసు కుంటున్నాడు అని అర్థం. కర్త జ్ఞానము చేత గ్రహిస్తున్నాడు అని తాత్పర్యము ***( జ్ఞానేన వేత్తి ఇతి అన్వయః ).***

*ఇక తామస జ్ఞానాన్ని వివరిస్తున్నాడు.*

**యత్తు కృత్స్నవ దేకస్మి న్కార్యే సక్త మహైతుకమ్ ।**
**అతత్త్వార్థవ దల్పం చ త త్తామస ముదాహృతమ్ ॥** 22

***యత్-తు-కృత్స్నవత్-ఏకస్మిన్-కార్యే-సక్తం-అహైతుకం***
***అతత్త్వార్థవత్-అల్పం-చ-తత్-తామసం-ఉదాహృతం***

| | | | | | |
|---|---|---|---|---|---|
| యత్ తు | = | ఏదైతే | అతత్త్వార్థవత్ | = | యథార్థము కానిది |
| ఏకస్మిన్ | = | ఏకమైన | అల్పం చ | = | స్వల్ప మైనది |
| కార్యే | = | కార్యము నందు | తత్ | = | అది |
| కృత్స్నవత్ | = | సంపూర్ణము నందు వలె | తామసం | = | తామస జ్ఞానముగ |
| సక్తం | = | ఆసక్త మైనది | ఉదాహృతం | = | చెప్పబడింది |
| అహైతుకం | = | హేతువు గానిది | | | |

**హేతువు లేనిది, తత్త్వము కానిది, అల్ప మైనది, సమస్తము ఒకే దాని యందు ఒదిగి ఉన్నట్లు భావించే జ్ఞానము తామస జ్ఞానము.**

**వ్యాఖ్య**

సాత్త్విక జ్ఞానమును, రాజస జ్ఞానమును వివరించిన గీతాచార్యుడు, చివరగా తామసాన్ని వివరిస్తున్నాడు.





ఆ రెండిటి కన్నా తామసము విలక్షణ మైనది అని విశదం చేయడానికి **తు** పద ప్రయోగం చేసి, సాత్త్విక జ్ఞానానికి, రాజస జ్ఞానానికి భిన్నంగా తామసాన్ని చూపిస్తున్నాడు. సాత్త్విక జ్ఞానము, రాజస జ్ఞానము అని పూర్వ శ్లోకాలలో తెలిపిన భగవానుడు, ప్రస్తుత శ్లోకంలో తామస జ్ఞానము అనకుండా, తామసము అనడం ప్రయోగమే నని చెప్పాలి. తామస గుణంలో జ్ఞానం ఉంటే కదా తామస జ్ఞానం అనడానికి! కనుక దానిని జ్ఞానముగా పరమేశ్వరుడు అంగీకరించడం లేదు. అందుచేత తామస జ్ఞానము అనకుండా, తామసము అని సరి పెట్టేశాడు ***( తత్ తామస ముదాహృతమ్ ).***

సాత్త్విక జ్ఞానము పారమార్థిక మైనది. అది పూర్ణ దృష్టి. ఆత్మదృష్టి. సమస్తమును ఒకే వస్తువుగా, ఆత్మగా దర్శించే సమదృష్టి.

రాజస జ్ఞానము వ్యావహారిక మైనది. అది పాక్షిక దృష్టి. గుణదృష్టి. భేదభావ దృష్టి. ద్వైత దృష్టి. అనేకాత్మ దృష్టి

తామస జ్ఞానము సంకుచిత మైనది. అది శూన్యదృష్టి. అల్పమునే సమస్తముగా భావించే నికృష్ట దృష్టి. దేహాత్మ దృష్టి. అజ్ఞాన దృష్టి.

అగాధ మైన సాగరాన్ని ఏకంగా, అఖండంగా దర్శించే సుజ్ఞానము సాత్త్విక జ్ఞానము. అలల మధ్య భేదాన్ని దర్శించి, భిన్నంగా వ్యవహరించే వ్యావహారిక జ్ఞానము రాజస జ్ఞానము. ఒక అలనే సాగరంగా భావించే సంకుచిత మైన అజ్ఞానము తామసము. తామసము అహైతుకము, అతత్త్వము, అల్ప ఫలదాయకము.

**అహైతుకమ్**

తమోగుణము జ్ఞానరహిత మైనది. పైగా, అజ్ఞానంతో కూడింది కనుక హేతుబద్ధంగా ఉండదు. దేహమే ఆత్మ, ప్రతిమే దేవుడు అని తామసులు వాదిస్తూ ఉంటారు ***( కృత్స్నవత్ సమస్తవత్, ఏకస్మిన్ కార్యే దేహే బహిః వా , సక్తమ్ ఏతా వానేవ ఆత్మా ఈశ్వరోవా న అతః పరమ్ అస్తీతి ).*** దేహానికి మించి ఆత్మ లేదు. బాహ్యంలో విగ్రహాన్ని మించి దేవుడు లేడు. ఇదీ, వారి వాదము.

దేహమే తాను. దేహమే ఆత్మ అని చార్వాకుల లాగా వాదిస్తూ ఉంటారు. **స్వప్న మహా మద్రాక్షం -** నేను కల గన్నాను అని అతడే అంటాడు. మరి, నీవు దేహమే అయితే, 'నేను కల గన్నాను' అని ఎలా చెబుతావు? కలను చూచింది దేహమా? దేహము నిద్రిస్తూ, శ్వాసిస్తున్న శవం లాగా అక్కడే పడి ఉంది కదా! అలాంటి దేహం స్వప్నాన్ని ఎలా దర్శిస్తుంది?

ఈ విధమైన హేతువు లేని విషయాన్నే తామసులు ప్రతిపాదిస్తూ ఉంటారు. కనుక, వారి వాదము అహేతుకము. యుక్తి రహితము. న్యాయ వర్జితము ***( అహేతుకం హేతు వర్జితం నిర్యుక్తికమ్ ).***

**అతత్త్వము**

తత్త్వము అంటే యథార్థ మైనది. అదే తత్త్వార్థము. యథార్థము. అట్టి తత్త్వార్థము ఏ జ్ఞానానికి విషయంగా ఉంటుందో, అంటే ఏ జ్ఞానం చేత తత్త్వార్థము గ్రహింప బడుతుందో, అదే తత్త్వము, లేదా తత్త్వవంతము. అలా తత్త్వము కానిది అతత్త్వము. తత్త్వవంతము కానిది అతత్త్వవంతము ***( న తత్త్వార్థవత్ అతత్త్వార్థవత్ ).*** ఎందుకని అతత్త్వము అంటే, అహేతుక మైనది కనుకనే అతత్త్వము అనేది సుస్పష్టమైన హేతువు.

**అల్ప ఫలం**

ఆత్మను దేహానికి పరిమితం చేసి అల్పంగా ఊహించడం చేత, ఈశ్వరుణ్ణి బాహ్యంలో ప్రతిమకు

పరిమితం చేసి స్వల్పంగా భావించడం చేత, విషయమే అల్ప ప్రధానం కలది అయింది. అల్పమైన విషయానికి అల్ప ఫలం ఉంటుందే గాని అనంతమైన ఫలం ఎలా ప్రాప్తిస్తుంది? అందుచేత ఇది అల్ప ఫలమైనది. తామసులైన వారికి ఈ విధమైన జ్ఞానము ఉంటుంది ***(తామసానాం హి ప్రాణినామ్ అవివేకినాం ఈదృశం జ్ఞానం దృశ్యతే)***.

*త్రివిధ జ్ఞానములను ఉపదేశించిన భగవానుడు త్రివిధ కర్మలను తెలియ చేస్తున్నాడు.*

**నియతం సంగరహిత మరాగద్వేషతః కృతమ్ ।**
**అఫల ప్రేప్సునా కర్మ య త్త త్సాత్త్విక ముచ్యతే ॥** 23

***నియతం-సంగరహితం-అరాగద్వేషతః-కృతం***
***అఫలప్రేప్సునా-కర్మ-యత్-తత్-సాత్త్వికం-ఉచ్యతే***

| | | | |
|---|---|---|---|
| యత్ | = ఏ | అఫల ప్రేప్సునా | = ఫలా పేక్ష లేని వాని చేత |
| కర్మ | = కర్మము | కృతం | = చేయబడినదో |
| సంగరహితం | = సంగత్వము లేనిది | తత్ | = అది |
| నియతం | = నియమిత మైనది | సాత్త్వికం | = సాత్త్విక మని |
| అరాగద్వేషతః | = రాగద్వేషములు లేకుండునది | ఉచ్యతే | = చెప్పబడు చున్నది |

**ఫలాసక్తి లేకుండా, సంగత్వము లేకుండా, రాగద్వేష రహితంగా ఆచరింపబడే నిత్యకర్మ సాత్త్విక మని చెప్పబడింది.**

### వ్యాఖ్య

గుణ భేదాన్ని బట్టి మూడు రకాలైన కర్మలను వివరిస్తూ, ముందుగా సాత్త్విక కర్మను గూర్చి చెబుతున్నాడు.

నియత కర్మలు అంటే నిత్య కర్మలు అని అర్థము ***(నియతం నిత్యం)***. నిత్య నైమిత్తికాది కర్మలను నియత కర్మలు అంటారు. సంగత్వము లేకుండా ***(సంగ రహితం)***, రాగద్వేషాల చేత ప్రేరేపించ బడకుండా ***(అరాగ ద్వేషతః)***, ఫలాసక్తి లేకుండా ***(అఫల ప్రేప్సునా)*** నిత్య కర్మ ఏదైతే చేయ బడుతుందో ***(యత్ కర్మ కృతమ్)*** అది సాత్త్విక కర్మగా చెప్ప బడుతుంది ***(తత్ సాత్త్విక ముచ్యతే)***.

#### సంగ రహితము

కర్మాచరణమునకు ముందు కర్మాసక్తి ఉంటుంది. జ్ఞాన స్పృహ లేకుండా కర్మ స్పృహ కలగదు. 'ఇది నాకు కావాలి' అనే స్పృహ మనస్సులో ఏర్పడుతుంది. ఆ తరువాత 'ఇది నేను చేయాలి' అనే ఆసక్తి కలుగుతుంది.

ఇది ఉపాదేయము, అంటే పొంద దగినది. ఇది హేయము అంటే పొంద దగనిది. ఈ భావాలు మనిషిలో ఉంటాయి. ఇవే ఆశలకు, నిరాశలకు కారణాలు అవుతూ ఉంటాయి. ఏవి ఉపాదేయాలని మనము భావిస్తామో, వాటిని పొందాలి అనుకుంటాము. దీనినే ఆసక్తి అంటారు. ఇదే సంగం. కర్మసంగం. అటువంటి ఆసక్తి లేకుండా, కర్మసంగం లేకుండా ఆచరింపబడే కర్మ సంగరహిత మైనది. అంటే ఆసక్తి లేనిది. కర్తవ్యంగా ఆచరించ దగినది ***(సంగరహితమ్ ఆసక్తి వర్జితమ్)***.





కర్మాసక్తి కర్తృత్వాభిమానాన్ని కలిగిస్తుంది. అహంకారాన్ని కదిలిస్తుంది. 'నాకు కావాలి' అనే ఆసక్తి ఉంది కనుక, 'నేను చేయాలి' అనే అహంభావన ఏర్పడుతుంది. కర్మాసక్తి జీవులను కర్మఫలంతో ముడి వేసి కర్మ చక్రానికి బంధిస్తుంది.

ఫలాపేక్ష లేకుండా, కర్తృత్వాభిమానమును త్యజించి, నిత్య నైమిత్తికాది కర్మలను కర్తవ్యాలుగా స్వీకరించి, ఆత్మ లాభార్థము ఆచరించడములో కర్మసంగము ఉండదు కనుక అది సాత్త్విక కర్మ అవుతుంది.

ఇక్కడ మరొక విషయాన్ని జ్ఞాపక ముంచుకోవాలి. ఆసక్తి దోషం కాదు. ఆసక్తిలో దోషం లేదు. మనకు దేనిపై ఆసక్తి ఉంది? అనే దానిని బట్టి ఆసక్తి యుక్తమా, అయుక్తమా అనేది నిర్ణయించ బడుతుంది.

ప్రపంచము మీద ఆసక్తి పెరిగితే అది బంధ హేతు వవుతుంది. అదే ఆసక్తి పరమేశ్వరునిపై పెరిగితే అది ముక్తి సాధక మవుతుంది. సాత్త్విక కర్మ వ్యావహారిక కర్మల యందు ఆసక్తి లేకుండా ఉంటుందే గాని, పారమార్థిక విషయము నందు అత్యాసక్తితో ఉంటుంది. ప్రపంచముపై విరాగమును పెంచుకుంటూనే, పరమాత్మపై విశేష మైన రాగాన్ని దించు కుంటుంది. బంధ హేతువులపై విరక్తి , మోక్ష హేతువుపై ఆసక్తి కలగడం కూడా సాత్త్విక కర్మ లక్షణమే.

*బంధ మనుకొంటిని అనుబంధమంతా*
*రక్త సంబంధము కూడా విరక్తి దించె*
*ఆసక్తితో నిన్ను చేరితి విముక్తి కొరకు*
*నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా!* అని నీలకంఠ శతకంలో ఒక విబూది పండు.

#### రాగద్వేష వియుక్తము

ఇష్టాయిష్టాల చేత ప్రేరేపించబడి ఆచరింపబడే కర్మలు రాగద్వేష యుతాలు. అందుకు భిన్నంగా, అంటే రాగద్వేషాల చేత ప్రేరేపించ బడకుండా, రాగద్వేషాల నుండి విడిపడిన కర్మలు అరాగ ద్వేషయుతాలు *(అరాగ ద్వేషతః కృతమ్)*.

కర్తవ్యాలే ప్రధానంగా చేసుకొని కర్మాచరణము చేసే సాత్త్వికులు సంగరహితులై ఉంటారు. ఇష్టాయిష్టాలను కాకుండా, ధర్మాధర్మాలను దృష్టిలో పెట్టుకొని కర్మలను ఆచరిస్తూ ఉంటారు. అలాంటి వారి కర్మలు శాస్త్ర చోదితాలు, శాస్త్రోక్తాలై ఉంటాయి. వారి కర్మలు ఇష్టాయిష్టాలపై, అంటే రాగద్వేషాలపై ఆధారపడి ఉండవు.

మరి, ఇష్టం లేనపుడు కర్మాచరణము ఎలా జరుగుతుంది? అనే సందేహము కలగ వచ్చు. ఏది తనకు ఇష్టమో అది ధర్మంతో విభేదించే టప్పుడు, అలాంటిది సాత్త్విక కర్మ కాదు కనుక, దానిని అభిలషించడు. అలాగే, శాస్త్ర ప్రతిపాదిత విషయంతో, అంటే శాస్త్రము నిషేధించిన విషయాన్ని తాను అభిలషించే టప్పుడు వ్యక్తిలో ఘర్షణ ఏర్పడుతుంది. కాని, ఇలాంటి రాగద్వేషాలకు అవకాశం లేని కర్మ ఏదయితే ఉందో అది సాత్త్విక కర్మ అవుతుంది.

#### అఫల ప్రేప్సువు

సంగ రహితంగా, రాగద్వేష రహితంగా ఆచరింపబడే కర్మలో ఫలాసక్తి ఉండే అవకాశం లేనందున, ఫలాభిసంధి లేకుండా ఆచరించే కర్త యొక్క కర్మ సాత్త్విక కర్మ అవుతుంది. ఫలము నందు ఆపేక్ష కల వాడు ఫలప్రేప్సువు. అలా కర్మ ఫలాపేక్ష లేకుండా, ఏది ప్రాప్తించినా ప్రసాదంగా స్వీకరించే కర్త చేత చేయబడే కర్మ సాత్త్విక కర్మ. అట్టి కర్మను ఆచరించే నిష్కామ కర్మయోగి అఫల ప్రేప్సువు.

చేయ దగిన నిత్యకర్మను ఫలాపేక్ష లేకుండా, కర్మసంగం లేకుండా, రాగద్వేషాలకు అతీతంగా ఆచరించడము; కర్మ యొక్క ఫలము ఎలా వచ్చినా దానిని ప్రసాదముగా స్వీకరించడము, చేయ దగిన కర్మను చేయగలిగా ననే తృప్తి, పొంద దగినదే ప్రాప్తించింది అనే సంతృప్తి సాత్త్విక కర్మను ఆచరించే వారిలో దివ్యంగా శోభిస్తూ ఉంటుంది.

తాను ఆచరించే కార్యాల వెనుక ఫలాపేక్ష లేదు అంటే, స్వర్గప్రాప్తి కామన కూడా లేదని భావము. ఇక్కడ సాత్త్విక కర్మ లాచరించే వాడు ముముక్షువు కావడం చేత కేవలం అంతఃకరణ శుద్ధ్యర్థమే కర్మాచరణము ఉంటుంది. కనుక, కర్మసంగమునకు అవకాశ ముండదు. అలాగే ఈశ్వర ప్రీత్యర్థం ఆచరిస్తాడు కనుక రాగద్వేషాలు తలెత్తవు. ఇట్టి కర్మ సాత్త్విక కర్మ.

*ఇక రాజస కర్మను గూర్చి చెబుతున్నాడు.*

**యత్తు కామేప్సునా కర్మ సాహంకారేణ వా పునః ।**
**క్రియతే బహులాయాసం తద్రాజస ముదాహృతమ్ ॥** 24

***యత్-తు-కామేప్సునా-కర్మ-సాహంకారేణ వా పునః***
***క్రియతే-బహులాయాసం-తత్-రాజసం-ఉదాహృతం***

| | | | |
|---|---|---|---|
| యత్ | = ఏ | బహులాయాసం | = విశేష ప్రయాసతో |
| కర్మ తు | = కర్మము | క్రియతే | = చేయబడు చున్నదో |
| కామేప్సునా | = కోరికలు గల వాని చేత | తత్ | = ఆ కర్మము |
| సాహంకారేణ వా పునః | = అహంకారము గల వాని చేత గాని | రాజసం | = రాజస కర్మముగ |
| | | ఉదాహృతం | = చెప్పబడింది |

**అర్జునా! కోరికలు గల అహంకారి చేత అధికమైన ఆయాసముతో చేయబడే కర్మ రాజస కర్మ**

**వ్యాఖ్య**

ఫలాకాంక్ష లేకుండా, రాగద్వేష రహితంగా, అహంకారం లేకుండా ఆచరింప బడేది సాత్త్విక కర్మ అయితే, ఫలాకాంక్ష గల వాని చేత, అహంకారముతో కూడిన వాని చేత, వ్యయ ప్రయాసలతో, ఆయాస పూరితంగా ఆచరింపబడే కర్మ రాజస కర్మ అవుతుంది. సాత్త్వికుడు నిరహంకారియై, ఫలాసక్తి లేకుండా ఆచరిస్తే, రాజసుడు అహంకారియై, ఫలాసక్తితో ఆచరిస్తాడు. అలాంటి వాని చేత ఆచరింపబడే కర్మను రాజస కర్మ మని చెబుతారు (***కామేప్సునా, సాహంకారేణ, బహులాయాసం యత్కర్మ క్రియతే తద్రాజసమ్***). పూర్వ శ్లోకంలో మనం చెప్పుకొనిన సాత్త్విక కర్మకు పూర్తిగా విరుద్ధమై ఉండటం చేత, దీనిని సాత్త్విక కర్మ నుండి వేరు చేయడానికి **తు** శబ్దం ప్రయోగించడం జరిగింది.

**కామేప్సునా కామ్యత ఇతి కామః -** ఫలమును పొందాలి అనే కోరిక చేత (**కామేప్సునా**) ఆచరింప బడే కర్మ రాజస కర్మ అవుతుంది. ఈ కర్మ వెనుక కర్మి ఆశించే ఫల మేమిటి? ఏదైనా కావచ్చు. తన సుఖాన్ని వాంఛించి కావచ్చు. తన వారి సుఖాన్ని అభిలషించి కావచ్చు. లేదా, స్వర్గ సుఖాలపై వ్యామోహంతో పరలోక సుఖాన్ని ఆశించి కావచ్చు. వీటిలో ఏదైనా, లేదా కొన్ని అయినా, లేదా అన్నీ అయినా, వాటిలో అనిత్యమైన లౌకిక సుఖాభిలాష ఉందే గాని పారమార్థిక చింతనము మాత్రము లేదు. ఇహ పర సుఖాలను అభిలషించేది రాగము. దాని నుండి విడి పడితేనే విరాగము. విరాగము కల వాడే విరాగి. విరాగి యొక్క భావమే వైరాగ్యము



(***విగతః రాగః విరాగః విరాగస్య భావః వైరాగ్యమ్***). వైరాగ్యము అంటే ఇహ పర లోక భోగముల యందు కోరిక లేకుండా ఉండటము అని అర్థము (***ఇహ స్వర్గ భోగేషు ఇచ్ఛా రాహిత్యం***). ఈ విధమైన వైరాగ్యము వివేకము నుండి పుడుతుంది. నిత్యానిత్య వస్తు వివేకము వలన కలుగుతుంది.

రాజస కర్మలలో వివేక వైరాగ్యాలకు స్థానమే లేదు. అవి కామయుతాలు. అహంకార పూరితాలు. నేను ఈ కర్మను చేస్తున్నాను; నేనే చేస్తున్నాను; నేనే చేయ గలను అనే అభిమాన ఆడంబరాలతో కూడిన అహంకార పూరితమైన కర్మ రాజస కర్మ.

అంతే కాదు. కర్త చేత చాలా శ్రమతో చేయ బడేది. వ్యయ ప్రయాసలు, అధిక శ్రమలతో కూడి ఉండేది. అదే రాజస కర్మ (***క్రియతే బహులాయాసం కర్త్రా మహతా ఆయాసేన నిర్వర్త్యతే తత్ కర్మ రాజసమ్ ఉదాహృతమ్***).

బహులాయాసంతో నిర్వర్తించ బడే ఈ కర్మల వెనుక అహంకారము బలంగా ఉంటుంది. దాని ప్రభావమే బహుళాయాసము. రాజస కర్త పరుల ముందు తన దర్పాన్ని ప్రదర్శించుకొనే ప్రయత్నంలో యజ్ఞ యాగాది కర్మలను నిర్వర్తిస్తాడు. వేష, అలంకరణాదుల చేత పదుగురిలో తాను ప్రకాశించాలి. అందరూ తనను గుర్తించాలి. గౌరవించాలి. 'ఎంత గొప్ప కార్యాన్ని నిర్వహించాడండీ!' అని వేనోళ్ళ పొగడాలి. అతడు రాగానే అందరూ లేచి నిలబడాలి. నమస్కరించాలి. తన కంటూ ఒక సముచితాసనం ఉండాలి. ఇదంతా ఆడంబర ప్రదర్శనమే. అంతా బహుళాయాసమే. తమ మీద తమకు గౌరవం లేని వాళ్ళే ఇలాంటి ప్రదర్శనల కొరకు పాటు పడుతుంటారు.

**ఎవరో మెచ్చాలని భావిస్తే**
**అక్కడే ఘర్షణ ఆరంభము**
**ఒకరిని మరొకరు నచ్చకపోతే**
**నచ్చని మనసే నొచ్చుకొను**
**నీకు నీవుగా తృప్తిపడాలి**
**అదియే జీవన సౌందర్యము**
**రామ రామ జయ రాజారామ్**
**రామ రామ జయ సీతారామ్**

అని రామజోగి చిట్కా.

*ఇక తామస కర్మను వివరిస్తున్నాడు.*

**అనుబన్ధం క్షయం హింసా మనవేక్ష్య చ పౌరుషమ్ ।**
**మోహా దారభ్యతే కర్మ యత్త త్తామస ముచ్యతే ॥** 25

***అనుబంధం-క్షయం-హింసాం-అనవేక్ష్య-చ-పౌరుషం***
***మోహాత్-ఆరభ్యతే-కర్మ-యత్-తత్-తామసం-ఉచ్యతే***

| | | | |
|---|---|---|---|
| అనుబంధం | = వెంటబడి వచ్చేది | పౌరుషం చ | = సామర్థ్యమును |
| క్షయం | = హానియును | అనవేక్ష్య | = గ్రహించక |
| హింసాం | = హింసయును | మోహాత్ | = అవివేకము వలన |

| | | | | | |
|---|---|---|---|---|---|
| యత్ | = | ఏ | తత్ | = | అది |
| కర్మ | = | కర్మము | తామసం | = | తామస కర్మ మని |
| ఆరభ్యతే | = | ఆరంభింప బడుతూ ఉందో | ఉచ్యతే | = | చెప్ప బడుతుంది |

**అర్జునా! తరువాత కలిగే పరిణామాన్ని, నష్టాన్ని, హింసను, ముఖ్యంగా తన సామర్థ్యాన్ని చూసుకోకుండా ఏ కర్మ ప్రారంభించ బడుతుందో అది తామస కర్మ.**

### వ్యాఖ్య

కోరి వినాశాన్ని కొని తెచ్చుకునే బుద్ధి ప్రమాదకర మైనది. ప్రయత్నాలు ఏవైనా ప్రమోదాన్ని కలిగించాలే గాని ప్రమాదాన్ని సృష్టించ కూడదు. లాభ దాయకంగా ఉండాలే గాని నష్ట దాయకంగా ఉండ కూడదు. మనకు నష్టము కలిగినా పరులకు మేలు జరిగితే, ఆ కర్మ జన హితంగా గుర్తించ బడుతుంది. ఆత్మకు ప్రియంగా ఉంటుంది. అటు జన శ్రేయస్సుకు బదులు జన క్షోభకు కారణ మవుతూ, ఇటు వ్యక్తి హితాన్ని కూడా దెబ్బ తీసే కర్మ అజ్ఞానంతో కూడింది. దానినే తామస కర్మ అంటారు. అది అవివేకం వల్ల ***(మోహాత్)*** ఆరంభ మవుతుంది. తమోగుణం చేత ఆచరింప బడుతుంది. అందుచేత, దానిని తామస కర్మ అన్నారు ***(మోహాత్ అవివేకతః ఆరభ్యతే కర్మ యత్ తామసం తమో నిర్వృత్తమ్ ఉచ్యతే)***. అనుబంధమును, క్షయమును, హింసను, పౌరుషమును దృష్టిలో ఉంచుకోకుండా ఆచరించే కర్మ తామసము. తమోగుణ ప్రధానము.

**అనుబంధము**

తరువాత ఉండ బోయేది, లేదా ప్రాప్తించ బోయే దానిని అనుబంధము అంటారు. ఒకటి జరిగిన తరువాత, దాని ప్రభావంగా రూపు దాల్చేది అనుబంధము. కర్మాచరణము అనంతరము ఏర్పడే పరిణామము అనుబంధము ***(అనుబంధం పశ్చాత్ భావి యత్ వస్తు సః అనుబంధః ఉచ్యతే)***.

కర్మ జరగడానికి అనేక కారణాలు ఉంటాయి. అవి ఏవైనా కావచ్చు. వాటిలో ప్రారబ్ధం కూడా ఒకటి కావచ్చు. కాని, మనం చేసే కర్మ యొక్క అనుబంధము ఎలా ఉంటుంది అని పూర్వాపరాలు ఆలోచించకుండా చేయబడే కర్మ తామస కర్మ అవుతుంది. కర్మలను ప్రేరేపించే కారణాలు ఎంత బలీయంగా ఉన్నా, వాటిని మదింపు వేసుకొని ఆచరించ డానికే భగవంతుడు మనిషికి బుద్ధిని ప్రసాదించాడు. బుద్ధి ఉండి ప్రయోజనం లేదు. అది పని చేయాలి. వివేకంతో ఆలోచించాలి. వివేకము లేని బుద్ధిలో అవివేకం ఉంటుంది. అవివేకమే మోహము. బుద్ధి మోహంలో మగ్నమై నపుడు కార్యాచరణకు సరియైన నిర్ణయాలు జరగవు. చేయ కూడనివి చేయడము, చేయ వలసినవి త్యజించడము జరుగుతుంది. ఆచరణ మైతే పూర్తి అవుతుంది. కాని, దాని అనుబంధము కొన సాగుతుంది. అనేక కష్టాలను, నష్టాలను పంచుతూ ముందుకు సాగుతుంది.

'అలా చేయకుండా ఉండ వలసింది. సరిగా ఆలోచించలేక పోయాను. అలా మాట్లాడకుండా ఉండ వలసింది. ఏమిటో! నా రోజులు బాగా లేవు' అనే మాటలు లోకంలో తరచు వినపడుతూ ఉంటాయి. రోజులు బాగ లేవు అని ఈ రోజు మాట్లాడు తున్నాం. కాని, ఈ రోజు బాగలేక పోవడము అనేది అనుబంధము మాత్రమే. ఆచరించిన రోజే బాగ లేని రోజు. దాని ఫలితంగా ఈ రోజు కూడా అశుభమే ప్రాప్తించింది.

అన్నీ తెలిసి చేయడానికి మనం సర్వజ్ఞులం కాము. కాని, చేసేది ఏదైనా, అది సముచిత మైనదా, కాదా అని ఆలోచించే అవకాశం లేని వాళ్ళము మాత్రం కాము. అవకాశం ఉండి ఏమి ప్రయోజనం? వినియోగించు కొనే నేర్పు, ఓర్పు ఉండాలి. దానిని పౌరుషము అంటారు. అదే పురుషాకారము. ఆత్మ సామర్థ్యము.



**పౌరుషము**

యాత్ర సుఖంగా, క్షేమంగా, శుభప్రదంగా సాగాలి అంటే యాత్రికుడు యాత్రకు ముందే దానికి సంబంధించిన విషయా లన్నీ ఆలోచిస్తాడు. ఆర్థికంగా పుష్కల మేనా? ఆరోగ్యము అనుకూల మేనా? ప్రతిబంధకాలు ఏ ముంటాయి? వాటిని ఎలా అధిగమించాలి? తనకు హాని కలిగే పరిస్థితులు ఏవైనా ఉన్నాయా? తన ప్రయాణం ఇతరులకి దుఃఖాన్ని కలిగిస్తుందా? ఇవన్నీ ఆలోచించిన తరువాతే యాత్రను ప్రారంభిస్తాడు.

జీవన యాత్రలో కూడా ప్రతిది అలా మదింపు వేసుకో గలగాలి. అప్పుడే అనుబంధము అనుదిన ప్రతిబంధకము కాకుండా ఉంటుంది. దీనినే సంస్కృతములో 'పౌరుషము' అంటారు. అంటే పురుషాకారము. పురుష సామర్థ్యము. 'నేను ఈ కార్యాన్ని చక్కగా చేయ గలుగుతాను' అనే ఆత్మస్థైర్యము ***(పౌరుషం పురుషాకారం, శక్నోమి ఇదం కర్మ సమాపయితుమ్ ఇత్యేవమ్ ఆత్మ సామర్థ్యమ్)***. ఈ విధంగా తన శక్తి సామర్థ్యాలను పరీక్షించుకోకుండా ఆచరించే కర్మ తామస కర్మ అవుతుంది. అవివేకంతో కూడినది అవుతుంది. అలాంటి అజ్ఞాన జనిత కార్యానికి అనుబంధం అశుభంగా ఉంటుంది. దుర్భరంగా ఉంటుంది.

అశక్తు డైన వాడు అసలు ఆరంభించడు. శక్తి కల వాడే ఆరంభిస్తాడు. శక్తి ఉందా, లేదా అనేది కాకుండా ఆ శక్తి సమర్థవంత మైన దేనా? అనేదే ముఖ్యం. శక్తిలో సామర్థ్యం ఉంటే అంతా శుభమే. అలా కాకుండా చాలని శక్తి, సరిపోని సామర్థ్యం ఉంటే, అప్పుడు అనుబంధం ఎలా ఉంటుంది? అనుదిన ప్రతిబంధకం గానే ఉంటుంది. చాలని శక్తి ఉండటం దోషం కాదు. సరిపోని సామర్థ్యం ఉండటం శాపం కాదు. శక్తి చాలదని, సరిపోదని గుర్తించ లేక పోవడమే దురదృష్టం. ఇలాంటి పరిస్థితుల లోనే అనుబంధం ప్రగతికి ప్రతిబంధక మవుతుంది. దీనికి ప్రధాన కారణం తమోగుణం. తమో గుణం వల్ల ఏర్పడిన అవివేకము, లేదా మోహము.

కురు సామ్రాజ్యంలో దుర్యోధనుడు ఒక వెలుగు వెలిగాడు. కాని తన పౌరుషాన్ని మదింపు వేసుకో లేని కారణంగా కురుక్షేత్రంలో కాలు మోపాడు. ఏం జరిగింది? అనుబంధాన్ని అవలోకించ లేక అశ్రువులు రాల్చాడు. సంజయుడి ముందు సంతాపంతో రోదించాడు. మడుగులో తల దాచుకో వలసిన పరిస్థితిని అనుబంధం కల్పించింది. పౌరుషం లేక గాంధారీ నందనుడు ఇలా అయ్యాడా? కాదు. తన పౌరుషాన్ని తాను అంచనా వేయలేక అలా అయ్యాడు. కారణం? మోహం మభ్య పెట్టింది. తమస్సు కప్పేసింది. తేజస్సు కనుమరు గైంది.

అనుబంధాలు అనుసరిస్తూనే ఉంటాయి. దీనికి సంబంధించిన అవగాహన కార్యారంభం లోనే ఉండాలి. ఆకులు పట్టుకోవడము అనునయమే. చేతులు కాలడం లోనే దారుణం జరిగి పోతుంది. మడుగులో దాగిన దుర్యోధనుని బయటికి ఈడ్చే ప్రయత్నంలో ధర్మరాజు పౌరుషాన్నే ప్రథమంగా ప్రశ్నించాడు.

***కృతే తత్ పౌరుషం యాతం ?*** - దుర్యోధనా! ఏమైంది నీ పౌరుషం? అని ప్రశ్నించాడు. అంటే, దుర్యోధనుడు పౌరుషం లేని వాడు అని కాదు. తన పౌరుషం సరి పోదని తెలియని వాడు. మోహగ్రస్తుడు.

దుర్యోధనుని వద్ద అస్త్ర శస్త్రా లున్నాయి. ఎందరో వీరులు తన వైపు నిలబడి పోరాడటానికి సిద్ధంగా ఉన్నారు. భీష్మ, ద్రోణ, కర్ణాదుల వద్ద భయంకరమైన అస్త్ర శస్త్రా లున్నాయి. కాని, భీకరమైన కురుక్షేత్ర రణ రంగంలో అసమాన పరాక్రమవంతు లైన పాండు సుతులను ఎదుర్కొని పోరాడటానికి అవి సరిపోతాయా? వారితో సరి తూగే సామర్థ్యం తన సేనకు ఉందా? ఈ విషయంలో దుర్యోధనుడు ఊహించడానికి శక్తి హీను డయ్యాడు. తాను కార్యారంభంలో ఊహించ లేని పౌరుషాన్ని అనుబంధంలో అజాత శత్రువు ప్రశ్నించాడు.

***కృతే కుతా స్తతా యాతా?*** - దుర్యోధనా! నీ అస్త్రవిద్యా వైభవం అంతా. ఎక్కడ చచ్చింది? అని ధర్మరాజు అనుబంధంలో ప్రశ్నించాడు. ధర్మరాజు సంధించిన వాగ్బాణాలు దుర్యోధనుని గుండెల్ని ముక్కలు

చేశాయి. అభిమానాన్ని అంగుళం అంగుళం రేకుల్ని వొలిచినట్లు తొలిచేశాయి. అభిమానం చచ్చి పోయింది. పౌరుషం చావు దెబ్బ తినింది. అనుబంధం ప్రాణాల్ని పీల్చేసింది.

*వన మేవ గమిష్యామి వసానో మృగ చర్మణీ ।*
*న హి మే నిర్జన స్యాస్తి జీవితేఽ ద్యస్పృహో విభో ॥*

'ధర్మరాజా! అందరినీ పోగొట్టు కున్నాను. నాకు జీవితేచ్ఛ నశించింది. రాజ్య కాంక్ష లేదు. స్వర్గ స్పృహ లేదు. ఎవరి కోసం రాజ్య భోగాలను కాంక్షించానో వారందరూ రణావనిలో పండుటాకు ల్లాగా రాలి పోయారు. నేను మృగచర్మం ధరించి అడవులకు పోతాను. మునివృత్తిని స్వీకరించి మోక్షార్థినై జీవిస్తాను' అంటూ ఇంకా ఎంతో, ఎంతెంతో మాట్లాడాడు గాంధారీ నందనుడు.

ఉత్తర గోగ్రహణంలో భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, కృపుడు, దుశ్శాసనుడు, శకుని, అశ్వత్థామ, వికర్ణుడు, చిత్రసేనుడు - ఇంత మంది యోధులతో కలిసి విరాట నగరాన్ని దుర్యోధనుడు ముట్టడించి నపుడు ఒక్క అర్జునుని చేతిలో అందరూ పరాభవించ బడ్డారు కదా! ఒక్క అర్జునుణ్ణే ఎదిరించ లేని యోధులు, పంచ పాండవులను, ఏడు అక్షౌహిణుల సేనను ఎదిరించి పోరాడ గలరా? పౌరుషాన్ని, అనుబంధాన్ని అర్థం చేసుకోలేక పోవడమే దుర్యోధనుని దుర్గతికి కారణము.

అనుబంధం ప్రమాద భరితంగా మారిన తరువాత దుర్యోధనుడు ఏ మాటలు పలుకు తున్నాడో, యుద్ధం ఆరంభం కాక ముందు అర్జునుడు అవే మాటలు పలికాడు.

***న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ*** - కృష్ణా! నాకు విజయంపై ఆశ లేదు. రాజ్యకాంక్ష లేదు. సుఖాభిలాష లేదు.

***స్వజనం హి కథం హత్వా సుఖినః స్యామ మాధవా!*** - కృష్ణా! తన వాళ్ళను చంపుకొని ఎవరైనా ఎలా సుఖపడ గలరు? అని అర్జునుడు శ్రీకృష్ణుని ప్రశ్నించాడు. అవే మాటలు దుర్యోధనుడు పలికాడు. నా వాళ్ళందరూ పోయిన తరువాత రాజ్యం నా కెందుకు అంటాడు. ఈ బుద్ధి ఆరంభంలో ఏమైంది? అదే ప్రస్తుత శ్లోకంలో మనం చూస్తున్న పౌరుషము. అది లేని కారణంగా బ్రతుకు ముక్కలై పోయింది. దానినే ఈ శ్లోకంలో అనుబంధంగా మనం అర్థం చేసుకుంటున్నాం.

అనుబంధం మొదలుకొని పౌరుషం దాకా కలిగే పరిణామాలను, ప్రభావాలను ఊహించకుండా ***( ఇతి ఏతాని అనుబంధాదీని అనపేక్ష్య పౌరుషాన్తాని )*** మోహంతో, అవివేకంతో ఆరంభించ బడే కర్మ తామస కర్మ అవుతుంది ***( మోహాత్ ఆరభ్యతే కర్మ యత్ తామసం ఉచ్యతే ).*** అనుబంధం మొదలు పౌరుషం దాకా తామస కర్మకు సంభవించే దుష్పరిణామా లేమిటి? అశుభా లేమిటి? చెబుతున్నాడు. అవే ***క్షయం - హింసాం.***

**క్షయ హింసలు**

అనుబంధాన్ని ఆలోచించకుండా, పౌరుషాన్ని ఊహించకుండా ఆరంభించే తామస కర్మకు ప్రాప్తించే పరిణామాలు దుఃఖ భూయిష్టంగా ఉంటాయి. అవే క్షయ హింసలు అనే ద్వంద్వం.

క్షయము అంటే నష్టము. తామస కర్మ శుభ ఫలితాన్ని ఇవ్వదు కనుక, దానిని ఆచరించడం వల్ల రెండు నష్టాలు కలుగుతాయి. ఒకటి శక్తి క్షయము, రెండు ధన క్షయము ***( క్షయం యస్మిన్ క్రియమాణే శక్తి క్షయః అర్థక్షయః వా స్యాత్ తం క్షయమ్ ).*** ఈ రెండూ అనుబంధంగా తామస కర్మకు ప్రాప్తించిన ఫలాలు. కర్మకు భవిష్యత్తులో ప్రాప్తించే అవర్థాలు. వీటిని ఊహించి కర్మను ఆరంభించాలి. అలా ఊహించడము తామసులకు సాధ్యం కాదు. కనుక, అనుబంధంగా ప్రాప్తించే దుష్ఫలితాలను అనుభవించ వలసి వస్తుంది.



ఆలోచన లేకుండా, ముందు వెనుకలు చూడకుండా, తామస ప్రవృత్తితో కర్మారంభం చేసిన కారణంగా ఈ రెండు దుష్ఫలితాలను దుర్యోధనుడు అనుభవించాడు. ప్రియ మిత్రుడైన కర్ణునితో సహా ఎందరినో పోగొట్టు కున్నాడు. రాజ్యాన్ని పోగొట్టు కున్నాడు ***( అర్థ క్షయః ).*** చివరికి తానే అశక్తుడై నశించి పోయాడు ***( శక్తి క్షయః ).*** ఇదంతా క్షయం. ఇక రెండవది హింస.

హింస అంటే బాధ. బాధ అనేది ఎవరి దైనా బాధే. ఎవరి కైనా బాధే. తనదీ బాధే. పరులదీ బాధే. కాని, ప్రస్తుతం ఈ సందర్భంలో హింస అంటే పరులకు, లేదా ప్రాణులకు తన వల్ల కలిగే దుఃఖము ***( హింసాం ప్రాణి పీడామ్ ).*** తాను ఆచరించే కార్యాల వల్ల పరులకు హాని కలగకుండా ఉండాలి. పరులను బాధ పెట్టే కార్యాన్ని ఆచరించే అర్హత ఎవ్వరికీ లేదు. అందుకే ***హింసాం న కుర్యాత్*** - హింసను చేయ కూడదు అన్నది ధర్మ శాస్త్రం. ***అహింసా పరమో ధర్మః*** - అహింసయే ఉత్కృష్ట మైన ధర్మం అని అభివర్ణించింది వేదం. ఇదే మహాభారత సారము. తమోగుణ ప్రేరితుడై, అవివేకంతో దుర్యోధనుడు ఆరంభించిన తామస కర్మకు ఎందరు బలై పోయారు! ఎన్ని మంగళసూత్రాలు తెగి పోయాయి! ఎన్ని కుటుంబాలు రోదించాయి! ఒక్క మనిషి సుఖ పడటానికి అంత మారణహోమం జరగాలా? ఇవన్నీ ముందే ఆలోచించి ఉంటే, దుర్యోధనుడు కురుక్షేత్రంలో కాలు పెడతాడా? కాలు పెట్టడ మేమిటి! కదనరంగంలో దుర్యోధనుడు రెచ్చి పోయిన తీరు చూస్తే తమస్సు అతని బుద్ధిని ఎంతగా మూసేసిందో అర్థ మవుతుంది. తమోగుణంలో ఉండే వాడు ముందు వెనుకలు ఆలోచించడు. తాను ఎంత దారుణాని కైనా వెనుకాడడు. నేను ఇతరులను హింసిస్తున్నాను కదా! ఇతరులు ఇలాగే నన్ను హింసిస్తే నేను సహించ గలనా? అని ఆలోచించడు. తమోగుణము ఆలోచించే అవకాశా న్నివ్వదు.

**ఏది నచ్చదో ఇతరులు చేసిన**
**అది ఇతరులకు చెయ్యబోకు**
**ఇతరులు ఏది చేసిన సుఖమో**
**అది ఇతరులకు చేసి చూపు**
**బాగు తెలిసి బ్రతుకుటయే**
**మహాభారతములో సారము**
**రామ రామ జయ రాజారామ్**
**రామ రామ జయ సీతారామ్**

అని రామజోగి చిట్కా.

*త్రివిధ జ్ఞానాలను, త్రివిధ కర్మలను వివరించిన గీతాచార్యుడు ఇక ఇప్పుడు, త్రివిధ కర్తలను తెలియ చేస్తాడు. చదవండి.*

ముక్తసఙ్గోఽ నహంవాదీ ధృత్యుత్సాహ సమన్వితః ।
సిద్ధ్యసిద్ధ్యో ర్నిర్వికారః కర్తా సాత్త్విక ఉచ్యతే ॥ 26

***ముక్తసంగః-అనహంవాదీ-ధృత్యుత్సాహ సమన్వితః***
***సిద్ధ్యసిద్ధ్యోః-నిర్వికారః-కర్తా-సాత్త్వికః-ఉచ్యతే***

| | | |
|---|---|---|
| ముక్తసంగః | = | సంగత్వము నుండి విడిపడిన వాడు |
| అనహంవాదీ | = | అహంకార రహితుడు |
| ధృత్యుత్సాహ సమన్వితః | = | ధైర్యము తోను ఉత్సాహము తోను కూడిన వాడు |

సిద్ధ్యసిద్ధ్యోః = కార్యము సిద్ధించినను, సిద్ధించక పోయినను
నిర్వికారః = వికారము చెందనివాడు నగు
కర్తా = కర్త
సాత్త్వికః = సత్త్వగుణము కల వాడుగ
ఉచ్యతే = చెప్పబడు చున్నాడు

**అర్జునా! ఫలసంగం లేని వాడు, నిరహంకారి, ధైర్యశాలి, ఉత్సాహవంతుడు, కార్యము సిద్ధించినా, సిద్ధించక పోయినా నిర్వికారంగా ఉండే వాడు సాత్త్విక కర్త.**

## వ్యాఖ్య

గుణ భేదాన్ని బట్టి త్రివిధము లైన కర్తలను గూర్చి వరుసగా చెప్పడానికి ఉపక్రమించి, ముందుగా సాత్త్విక కర్తను గూర్చి వివరిస్తున్నాడు. ప్రతి ఒక్కరికి కర్మ చాలా ప్రధాన మైంది. కనుక, కర్మ చేసే కర్త ఎలా ఉండాలో తెలుసుకొని, తదనుగుణంగా జీవించ డానికి ఈ కర్తృ ప్రకరణము ఎంత గానో ఉపకరిస్తుంది.

మనస్సును బట్టే మనుగడ ఉంటుంది. ఒక మనిషి జీవితంలో ఏ విధమైన వైభవము గోచరించినా, అది అతని మనస్సు లోని వికాసమే అయి ఉంటుంది. సాత్త్విక కర్త అంటే సాత్త్విక మైన కర్మను ఆచరించే వాడు అని అర్థము. జ్ఞానం లేకుండా కర్మ నెలా ఆచరిస్తాడు? మనస్సు లోని పవిత్రతే కర్మలలో తొంగి చూస్తుంది. ఎవరి కైనా, ఎప్పుడైనా మనస్సు లోని ఆలోచనలే మనుగడలో ప్రతిఫలిస్తూ ఉంటాయి. మనస్సు సాత్త్వికంగా ఉంటే మనస్సు లోని జ్ఞానము కూడా సాత్త్వికం గానే ఉంటుంది. అట్టి మనస్సు గల వ్యక్తి జీవితంలో చేసే ఆలోచనలు, ఆచరించే కర్మలు కూడా సాత్త్వికం గానే ఉంటాయి. ఈ శ్లోకంలో నాలుగు లక్షణాలను ప్రధానంగా భగవంతుడు చెబుతున్నాడు. ఈ నాలుగు లక్షణాలు ఎవరిలో ఉంటాయో అతడే సాత్త్విక కర్త *(కర్తా సాత్త్విక ఉచ్యతే)*. సాత్త్విక కర్త యొక్క విశిష్ట మైన గుణ చతుష్టయాన్ని తెలుసు కుందాము.

### ముక్త సంగుడు

సంగము అంటే ఆసక్తి అని పూర్వ శ్లోకాలలో చెప్పుకున్నాం. ఎవడైతే ఆసక్తి నుండి, లేదా సంగము నుండి విడి పడ్డాడో అతడు ముక్త సంగుడు *(ముక్తసంగః ముక్తః పరిత్యక్తః సంగః యేన సః ముక్తసంగః)*. ఫలాభిసంధిని త్యజించిన వాడు.

సాత్త్విక కర్త కర్మలను ఆచరిస్తాడు గాని కర్మసంగము లేకుండా ఆచరిస్తాడు. కర్తృత్వాభిమానము లేని వాడై ఉంటాడు. రాగద్వేషాలు లేని వాడు కనుక, 'ఈ కర్మే చేయాలి - ఆ ఫలితమే రావాలి' అనే ఆలోచన లేకుండా, 'ఈ కర్మ చేయ దగినది, ఇది నా కర్తవ్యము' అని భావించి శాస్త్ర విహిత కర్మలను సంగత్వం లేకుండా ఆచరిస్తాడు.

ఏదేదో చేయాలనే ఊహలు ఎలాగైతే ఉండవో, ఏదేదో పొందాలనే ఆశలు కూడా ఉండవు. కనుకనే అతడు ముక్తసంగుడు. తాను చేయ వలసింది అంటూ ఏదో దానిని ధర్మబద్ధంగా నిర్వర్తిస్తాడు. అంతే కాదు. తాను పొంద వలసిం దేమిటో, పొంద దగిన దేమిటో, అది తప్పక అందుతుంది అనే స్థిరమైన అభిప్రాయాన్ని కలిగి ఉంటాడు.

ఈ రోజు ఉన్న వన్నీ మనం ఆశిస్తేనే వచ్చాయా? ఈ రోజు ఈ స్థితిలో ఉంటామని మనలో ఎవర మైనా పూర్వం ఆలోచించామా? ఆశించామా? గీతా వ్యాఖ్యానం వ్రాస్తా నని గతంలో నేను ఊహించానా? దీనిని చదువుతా మని మీరు మాత్రం కలలు కన్నారా?

మనకు అంద వలసినవి అందుతూనే ఉంటాయి. వాటిని ఎవ్వరూ ఆప లేరు. మనకు ఉండ వలసిన వన్నీ ఇప్పటి వరకూ ఉన్నాయి. భవిష్యత్తులో కూడా ఉంటాయి. ఇలా ఉంటామని, మనకు ఇవన్నీ ఉంటాయని



గతంలో మనం ఆలోచించ లేదు కదా! మనం ఆలోచించ లేదని నేడున్నవి అదృశ్య మౌతాయా? నేడున్న వన్నీ గతంలో మనం ఆశించినవి కానపుడు, భవిష్యత్తులో ఏవేవి ఉండాలో వాటిని మాత్రం ఇప్పుడు ఆలోచించడ మెందుకు?

జరిగేది జరిగి తీరుతుంది. వచ్చేవి వచ్చి తీరుతాయి. మనం రాక ముందే మన ఆహారం అవనికి చేరి పోయింది. మనం వస్తా మని తెలిసి మనకు సంబంధించిన జలాలను మేఘాలు వర్షిం చేశాయి. బావులు, చెరువులు, నదులు వాటిని నిలువ చేసి ఉంచాయి. మనం పుట్టక ముందే ఊయల తయారైంది. మనల్ని పంపడానికి ఉన్న పాడె వస్తేనే మనం నిష్క్రమిస్తాము.

కళ్ళు చూడ వలసిన దృశ్యా లన్నీ ముందే ప్రదర్శింపబడి ఉన్నాయి. కాళ్ళు సంచరించ వలసిన ప్రదేశా లన్నీ మన కొరకు నిరీక్షిస్తూ ఉన్నాయి. ప్రయాణాలకు, ప్రదర్శనలకు టిక్కెట్లన్నీ రిజర్వు చేయబడే ఉన్నాయి. ఆసుపత్రులు ఎన్నున్నా, మన పడక ఎక్కడుందో, ఆ ఆసుపత్రి లోకే మనం ప్రవేశిస్తాము. ఇలా ప్రారబ్ధం తన పనిని తాను చేసుకుంటూ పోతుంది.

నేను ప్రారబ్ధాన్ని అనుసరిస్తూనే నేడు ఇక్కడ ఉన్నాను. జీవించి ఉన్నాను. ఎంత వరకు ఉండమని చెబితే, అంత వరకు జీవిస్తూ ఉంటాను. జీవిస్తున్నాను అంటే, చేయ వలసింది ఉంది కనుకనే జీవిస్తున్నాను. నేను ఏది చేయాలో అది నా కొరకే ఉంటుంది. నా దైన దానిని, నా కొరకున్న దానిని నేను చేయక పోతే మరెవరు చేస్తారు?

నేను చేయ వలసిన కర్మ నా కొరకు ఎలాగైతే నిర్ణయింపబడి ఉందో, దానిని చేయడానికి అనువైన, అనుగుణమైన పరిస్థితులు కూడా నా కొరకు సృష్టింపబడే ఉన్నాయి. వస్తువు లన్నీ సిద్ధం చేయబడి ఉన్నాయి. ముడి సరుకంతా ఓ మూల నా కోసం పడి ఉంది.

నా కార్యాలు నా కొరకు ఎదురు చూస్తున్నాయి. వాటిని చేసేందుకు కరచరణాదులు నాకు ప్రసాదించ బడ్డాయి. కార్యాలు ఎలా చేయాలో ఆలోచించే మనస్సు నాకు తెలియకుండానే నా లోనే ఉంచ బడింది.

ఏదైనా నాకు నేనుగా ఒక్కడినే చేయలేను. ఎందరో సహకరించాలి. అలా సహకరించే వాళ్ళందరు నా కన్నా ముందే వచ్చి ఉన్నారు. నాకు సహకరించ మని వారికి ఇప్పటికే వర్తమానాలు అందాయి. నేను కర్తృత్వము లేకుండా కర్మ చేస్తాను. భగవంతుని చేతిలో మురళి లాగా పనుల్ని నేను ముట్టు కుంటాను. వేణువుకు వాయువు సహకరించినట్లు, నాకు ఎందరో సహకరిస్తారు. ఇంతవరకు ఎలా సహకరించారో, ఇక ముందు కూడా అలాగే సహకరిస్తారు. గతంలో సహకరించిన వాళ్ళే సహకరించాలని లేదు. ఎవరైనా సహకరించ వచ్చు. ఎప్పు డెప్పుడు ఎవరెవరు సహకరించాలో వాళ్ళు సహకరించి తీరుతారు. ఇదంతా నియతి. నియంత నియమించిన పద్ధతి. ఇంత జరిగే టప్పుడు, ఇంతగా జరిగే టప్పుడు, ఈ కర్మలలో నాకు సంగ మెందుకు? కర్మసంగ మెందుకు? ఇలా అర్థం చేసుకున్న వాడు సాత్త్విక కర్త. ముక్త సంగుడు.

### అనహంవాది

అహం అంటే నేను. అహంవాది అంటే నేను అని పలికే వాడు. అనహంవాది అంటే నేను అని పలకని వాడు *(అనహం వాదీ న అహం వదన శీలః)*. నేను చేశాను అని చెప్పని వాడు. తాను సంభావితు డనే ఆలోచనే లేని వాడు. ఆలాపనే తెలియని వాడు. మాట లోనే కాదు, మనస్సులో కూడా 'నేను ఇది చేశాను' అనే భావం లేని వాడు అనహంవాది. కనుక, తనను తాను శ్లాఘించు కొనడం అర్థం కాని వాడు. గర్వ మేమిటో తెలియని వాడు.

అంటే, అతడు ఏమీ చేయడా? ఎందుకు చేయడు! అన్నీ చేస్తాడు. దానధర్మాలు చేయడా? చేస్తాడు. అప్పుడే మనుకుంటాడు? నేను ధర్మం చేశాను, అని అనుకోడా? అనుకోడు. 'అందించే అవకాశం నాకు ఇవ్వ బడింది. ఇచ్చిన దానిని అందుకొని నన్ను అనుగ్రహించే వ్యక్తిని కూడా నాకు ఇవ్వడం జరిగింది. అంతా భగవ దనుగ్రహం' అనుకుంటాడు.

ఉన్న దానినే కదా దానం చేసేది! ఉన్న దేదైనా వచ్చిందే కదా! వచ్చి ఉన్నదే కదా! ఎవరు పంపితే వచ్చింది? నా వెంట నేను తెచ్చుకో లేదు కదా? ఎవరో పంపితేనే కదా వచ్చింది. ద్రవ్యాన్ని పంపిన దెవరో, గ్రహీతను పంపింది కూడా అతడే.

గ్రహీతలు గ్రహిస్తున్నారు. అనుగ్రహీతలు అనుగ్రహిస్తున్నారు. మధ్యలో తీర్థపు గిన్నె చేత పట్టుకొని ఆరాధనా భావంతో నేను నిలబడి ఉన్నాను. సమర్పణ భావంతో సంతసిస్తున్నాను. ఎనలేని సంతృప్తిని పొందు తున్నాను. దప్పిక గొన్న మేకకు చెంబుడు నీళ్ళు త్రాగిస్తే, మేఘాన్ని చూచి దణ్ణం పెట్టవలసిన వాణ్ణి. ప్రాణాన్ని మోసుకొచ్చి నాసికా సంతర్పణం చేస్తున్న గాలి ఋణం ఎలా తీర్చుకోవాలో అర్థం కాని వాణ్ణి. నీళ్ళకు ఖరీదు కట్టే శక్తి లేని వాణ్ణి. నిప్పును ముట్టుకొనే సాహసం లేని వాణ్ణి. భూమిని కొలిచే సామర్థ్యం లేని వాణ్ణి. నింగి లోకి తొంగి చూసే ధైర్యం లేని వాణ్ణి. అన్నీ నన్ను కరుణిస్తున్నాయి. అందరూ నన్ను అనుగ్రహిస్తున్నారు. కృతజ్ఞతతో కదిలి పోతున్నాను. భక్తితో నమస్కరిస్తూ ఉన్నాను.

నా కున్నవి రెండు చేతులే. అవి ఏం చేయ గలవు? ఎంతని చేయ గలవు? నేను ఎన్నో చేసి ఉండ వచ్చు. ఎంతెంతో చేసి ఉండ వచ్చు. అవన్నీ నా రెండు చేతులకు సాధ్య మవుతాయా? ఎన్నో చేతులు నా రెండు చేతుల్ని కాసాయి. ఎన్నో చిత్తాలు నా చిత్తాన్ని మోసాయి.

అందుకోవడానికి మాసాలు, సంవత్సరాలు సరిపోయాయి. అందించ డానికి క్షణాలే మిగిలాయి. నిమిషాలే ముందు నిలిచాయి. ఎంత ఋణగ్రస్తుణ్ణో. పట్టేందుకే ఉన్నాయి నా రెండు చేతులు. పెట్టేందుకు ఎక్కడ నుండి వస్తాయి?

పాడే నేర్పు నాకు ఉండొచ్చు. పాట వినే ఓర్పు శ్రోతలకు ఉండాలి కదా! పాడ మని పాట నిచ్చిన వాడే ఆ పాటను వినే వాళ్ళను కూడా దగ్గరకు చేర్చుతాడు. ఆనందంగా వినే వాళ్ళు లభించడం నా అదృష్టం కాదా? వినే వాళ్ళు లేనపుడు నాకు పాటెందుకు? పాటను వ్రాసే మాటెందుకు? మాటను కదిపే రాగ మెందుకు?

రచించే భాగ్యాన్ని ప్రసాదించా డని మురిసి పోనా? చదివే వాళ్ళు ఉన్నారనే అదృష్టానికి పొంగి పోనా? చదివే వాళ్ళు లేనపుడు వ్రాసి ఏమి ఉపయోగం? నోటికి మాటను అందించే దెవరు? మాటకు ప్రాణం పోసే దెవరు? గుండెలలో అమృతాన్ని ఒలికించే దెవరు? వీనులకు విందు చేసే దెవరు? ఎక్కడిది ఈ జగన్మోహన శక్తి? ఎవరిదీ విశ్వమోహన యుక్తి?

నాకు తెలియదు. నాకు తెలిసిం దల్లా ఒక్కటే. ఇవేవీ నావి కావని. వీటిని కంటూ, వింటూ; కనింది చాలక కంటూనే ఉండాలని, వినింది సరిపోక వింటూనే ఉండాలని అర్రులు చాచే వాణ్ణే గాని, అహంకారిగా మిగిలే వాణ్ణి కాను. అహంవాదిగా వెలిగే వాణ్ణి కాను. అనహంకారిని. అనహంవాదిని.

*కననీర కరుణాకర కమలనాథా!*
*కానరార గాంచెదను నా తనివి తీర!*
*చేర్చుకోర నన్ను నీ మనము లోన*
*నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా!* అని చిన్నికృష్ణ శతకంలో ఒక వెన్న ముద్ద.



## ధృత్యుత్సాహ సమన్వితుడు

ధృతి అంటే ధైర్యము. ధారణము. నిలకడ. ఆటంకాలు ఎదురైనా, ఆరంభించిన కార్యాన్ని ఆపకుండా కొనసాగించే ధారణకు సంబంధించిన అంతఃకరణ వృత్తి విశేషము ధృతి.

ఉత్సాహము అంటే ఉద్యమము. ప్రయత్నము. కర్మాచరణము నందు ఇచ్ఛా వేగము ఉద్యమము. ఈ కార్యాన్ని ఎలాగైనా నెరవేర్చాలి, తప్పక ఆచరించాలి అనే నిశ్చయముతో కూడిన ప్రయత్నమే ఉద్యమము.

సాత్త్విక మైన ధైర్యము, సాత్త్విక మైన ఉత్సాహము ఎవరి యందు నిలకడగా ఉంటాయో, అతడు ధృత్యుత్సాహ సమన్వితుడు ( ***ధృతిః ధారణమ్ ఉత్సాహః ఉద్యమః తాభ్యాం సమన్వితః సంయుక్తః ధృత్యుత్సాహ సమన్వితః*** ). ఒక్క మాటలో చెప్పాలంటే, ఎవరిలో పిరికితనము లేదో, నిరుత్సాహము ఉండదో, అతడే సాత్త్విక కర్త.

అయితే, ఈ ధృత్యుత్సాహాలలో ఫలాకాంక్ష ఉండదు. ధైర్యముతో, ఉత్సాహంతో ఆచరించే కార్యా లన్నీ అంతఃకరణ శుద్ధ్యర్థమే ఉంటాయి. ఈశ్వర ప్రీత్యర్థమే చేయ బడతాయి.

ధృత్యుత్సాహాలు దుర్యోధనునిలో ఉన్నాయి. కౌరవు లందరూ ధైర్యోత్సాహాల తోనే ఊరేగారు. అవే ధైర్యోత్సాహాలు పాండవులలో కూడా ఉన్నాయి. కాకపోతే, కౌరవుల లోని ధైర్యోత్సాహాలు విధ్వంసక చర్యలకు ఉపకరించాయి. కారణం, అవి సాత్త్విక ధైర్యోత్సాహాలు కావు. రాజస, తామస సంబంధమైన ధృత్యుత్సాహాలు. కాని, పాండవుల ధైర్యోత్సాహాలు విధాయక చర్యలు గానే కొనసాగాయి. కారణం, వారి ధృత్యుత్సాహాలు సాత్త్వికాలు.

## సిద్ధ్య సిద్ధులలో నిర్వికారుడు

ఆచరించిన కర్మకు ఫలం సిద్ధించినా, సిద్ధించక పోయినా తనలో ఏ మార్పు లేకుండా నిర్వికారంగా ఉండే వాడు సిద్ధ్య సిద్ధులలో సముడు. హర్షశోకాలు లేని వాడు. ఆశించిన ఫలము సిద్ధించింది అనే హర్షము గాని, ఫలము సిద్ధించ లేదు అనే శోకము గాని లేని వాడు ( ***క్రియ మాణస్య కర్మణః ఫలసిద్ధౌ అసిద్ధౌ చ సిద్ధ్య సిద్ధ్యోః నిర్వికారః*** ).

చెట్టుకు కాసిన ప్రతి కాయ ఫల మవుతుందని చెప్ప లేము. అలాగే, మనిషి ఆచరించే ప్రతి కర్మ సత్ఫలితాన్నే ఇస్తుందని చెప్ప లేము. కర్మ కర్మఫలంగా రూపాంతరం చెందడానికి నియతి ఉంది. ఈ అంతరాలలో అనుకూలాలు ఉంటాయి. ప్రతికూలాలూ ఉంటాయి.

అన్నీ అనుకూలిస్తే, తగు పాళ్ళలో అన్నీ సమకూరి నపుడు వంట రుచిగా తయారైనట్లు, కర్మకు సత్ఫలితం అందుతుంది. అలా కాకుండా నియతి విషమించి నపుడు, అంటే ప్రయత్నాలు నియతికి భిన్నంగా సాగి నపుడు ఫలితాలు తారుమారౌతూ ఉంటాయి.

అలాంటప్పుడు అనుకున్న ఫలాలు రావచ్చు. లేదా, వాటికి భిన్నమైన ఫలితాలు రావచ్చు. ఇవే సిద్ధ్య సిద్ధులు. అంటే సిద్ధించిన ఫలితాలు, సిద్ధించని ఫలితాలు.

సాధారణంగా ఆశించిన ఫలితాలు సిద్ధించి నపుడు ఆనందించడము, వికటించి నపుడు దుఃఖించడము మానవులకు పరిపాటి. కర్మల విషయంలో కర్త లందరూ అలాగే ఉంటారు. కాని, సాత్త్విక కర్త వారికి విలక్షణ మైన వాడు. కర్మఫలము సిద్ధించినా, సిద్ధించక పోయినా, అతని లోని సమస్థితి చెడదు. హర్షశోకాలకు అతడు

లోను కాదు. ఎందుకని? అతడు కర్మల విషయంలో ముక్తసంగుడై ఉండటము ఒక కారణము. మరొక్క కారణం, ఫలప్రాప్తి విషయంలో అతనికి ఉండే అవగాహన.

ఫలం సిద్ధించి నపుడు పరిస్థితులన్నీ అనుకూలంగా ఉన్నాయి కనుక సిద్ధి ప్రాప్తించింది అనుకుంటాడు. ఫలం వికటించి నపుడు, పరిస్థితులు నియతికి ప్రతికూలంగా ఉండటం చేత సిద్ధి ప్రాప్తించ లేదు అని అర్థం చేసుకుంటాడు. అందుచేత, ఫలసిద్ధిలో పొంగిపోడు. ఫల అసిద్ధిలో క్రుంగి పోడు.

అనుకూలాలలో ఫలం సిద్ధించి నపుడు నిర్వహణములో ధర్మమే ఉంది. ప్రతికూలాలలో ఫలం సిద్ధించ నపుడు కూడా నిర్వహణములో ధర్మమే ఉంది. ధర్మ నియతిలో వ్యక్తి పాత్ర ఏముంది? అనుకుంటాడు.

మరొక ప్రధాన మైన విషయ మేమిటంటే, కర్మలలో ఇష్టాయిష్టాలు ఉండే టప్పుడు, ఫలాలు వికారాన్ని కలిగిస్తాయి. అంటే, రాగద్వేషాల చేత ప్రేరేపించబడి కర్మల నాచరిస్తే, రాగానికి అనుకూలమైన ఫలం సిద్ధించి నపుడు సంతోషించడము, ప్రతికూల మైన ఫలం సిద్ధించి నపుడు దుఃఖించడము జరుగుతుంది. రాగము విషయములో ఎలాగో, ద్వేషము విషయము లోనూ అంతే.

కాని, సాత్త్విక కర్త రాగద్వేషాల చేత ప్రేరేపించ బడి కర్మల నాచరించే వాడు కాదు. శాస్త్ర విహిత కర్మలను కర్తవ్యాలుగా భావించి ఆచరించే వాడు. ఫలాభిసంధి లేని వాడు. కనుక, అతడు ఫలప్రాప్తి సమయంలో నిర్వికారంగా ఉంటాడు ***( నిర్వికారః కేవలం శాస్త్ర ప్రమాణ ప్రయుక్తః న ఫలాను రాగాదినా యుక్తః యః సః నిర్వికారః ఉచ్యతే , ఏవం భూతః యః సః సాత్త్వికః ఉచ్యతే ).*** అట్టి నిర్వికారు డైన కర్త సాత్త్వికకర్తగా చెప్ప బడతాడు. సాత్త్విక కర్త కర్మయోగిగా గోచరిస్తున్నాడు. గీత మూడు, నాలుగు, ఐదు అధ్యాయాలలో ఏ కర్మయోగమును గూర్చి మనం తెలుసుకున్నామో, అదే యోగ స్థితి సాత్త్విక కర్తలో గోచరిస్తూ ఉంది.

ముక్తసంగుడై ఉండటం, అనహంవాదిగా శోభించడము, ఫలప్రాప్తి సమయంలో నిర్వికారుడై ఉండటము - ఈ లక్షణాలను చూచి సాత్త్విక కర్తను ఆత్మజ్ఞానిగా భావించి చాలా మంది వ్యాఖ్యానిస్తూ ఉంటారు. అది అవగాహనా రాహిత్యమే. సాత్త్విక కర్త కర్మయోగియే గాని జ్ఞాని కాడు. దీనికి వాదమే అనవసరము. కర్త అన్నప్పుడే జ్ఞాని కాదని అర్థం. జ్ఞాని అకర్తయే గాని కర్త కాడు కదా!

అనిత్యాలను అర్థం చేసుకుంటూ, నిత్య సత్యాలను బుద్ధికి పట్టిస్తూ, ఏది ఉండినా, ఏది ఊడినా, వాటి వెనుక నియతిని, నియతి రూపంలో ఉన్న నియంతను దర్శిస్తూ కర్మల నాచరించే సాత్త్విక కర్త అంతఃకరణ శుద్ధిని పొంది, తద్వారా జ్ఞానప్రాప్తికి సిద్ధ మవుతాడు.

**వెలుగు నీడ - పగలు రేయి**
**సంపదల వెనుక ఆపదలు**
**పగిలేది కుండ వాడేది దండ**
**చితుకును బ్రతుకు అతక కుండా**
**పోయే వాటిని పోనిపోనీ**
**ఉండే సత్యము వెలగనీ**
**రామ రామ జయ రాజారామ్**
**రామ రామ జయ సీతారామ్**

అని రామజోగి చిట్కా.

ఇపుడు రాజస కర్తను గూర్చి చెబుతున్నాడు.





## రాగీ కర్మఫలప్రేప్సు ర్లుబ్ధో హింసాత్మకోఽ శుచిః ।
## హర్షశోకాన్వితః కర్తా రాజసః పరికీర్తితః ॥ 27

***రాగీ-కర్మఫలప్రేప్సుః-లుబ్ధః-హింసాత్మకః-అశుచిః***
***హర్షశోకాన్వితః-కర్తా-రాజసః-పరికీర్తితః***

| | | | | | |
|---|---|---|---|---|---|
| రాగీ | = | రాగము గలవాడు | హర్షశోకాన్వితః | = | హర్షశోకములతో గూడిన వాడు |
| కర్మఫలప్రేప్సుః | = | కర్మఫలము నాశించే వాడు | కర్తా | = | కర్త |
| లుబ్ధః | = | లుబ్ధుడును | రాజసః | = | రాజసుడని |
| హింసాత్మకః | = | హింసా స్వభావము గలవాడు | పరికీర్తితః | = | చెప్పబడినాడు |
| అశుచిః | = | శుచిత్వము లేనివాడు | | | |

**అర్జునా! రాగము గలవాడు, ఫలాపేక్ష గలవాడు, లోభి, హింసాప్రవృత్తి గలవాడు, శుచిత్వము లేనివాడు, హర్షశోకములతో గూడిన వాడు రాజసకర్త.**

### వ్యాఖ్య

పూర్వ శ్లోకంలో సాత్త్విక కర్త లక్షణాలను అర్థం చేసుకున్నాం. దానికి భిన్నమైన లక్షణాలు కలిగిన వాడు రాజస కర్త.

కర్మ ఫలాల యందు ఆసక్తి కల వాడు ***( రాగీ ).*** ఇతరుల ధనము నందు అపేక్ష కల వాడు, తన ధనాన్ని విడువడానికి ఇష్ట పడని వాడు ***( లుబ్ధః ).*** ఇతరులను పీడించే, హింసించే స్వభావము కల వాడు ***(హింసాత్మకః ).*** పవిత్రతకు నోచుకోని వాడు, అంటే బాహ్యాభ్యంతరాలలో శుచి లేని వాడు ***( అశుచిః ),*** కర్మఫలాలు ప్రాప్తించి నపుడు వికారం చెందే వాడు, అంటే అనుకూలాలలో సుఖమును, ప్రతికూలాలలో దుఃఖమును పొందే వాడు ***( హర్ష శోకాన్వితః )*** - ఇటువంటి గుణాలు గల కర్త రాజస కర్త అని చెప్ప బడ్డాడు ***(యః కర్తా సః రాజసః పరికీర్తితః ).***

పూర్వ శ్లోకంలో మనం చూచిన సాత్త్విక కర్త జ్ఞాని కాడని, కర్మయోగి మాత్రమే నని చెప్పు కున్నాము. ఈ శ్లోకం లోని రాజస కర్త కూడా కర్మయోగి కాడు. కేవలం కర్మి మాత్రమే.

**రాగి**

రాగి అంటే రాగము కల వాడు. రాగము ద్వేషానికి ఉప లక్షణము. రాగము ఉన్నప్పుడు ద్వేషము ఉండి తీరుతుంది. రాగము అంటే కామము. ద్వేషము అంటే క్రోధము. మనుషులలో రాగద్వేషా లుంటాయి. రాగ ద్వేషాలు విజృంభించి నపుడు అవి కామక్రోధాలుగా వ్యక్త మవుతాయి.

రాగము అంటే ఆసక్తి. ఎవరికి ఆసక్తి ఉంటుందో అతడు రాగి ***( రాగః అస్య అస్తీతి రాగీ ).*** రాగద్వేషాల కారణం గానే కర్మాచరణం చేసే వాడు రాజస కర్త. ఇక్కడ రాగము, లేదా ఆసక్తి అన్నప్పుడు, ఏ విషయము నందు ఆసక్తి అనే ప్రశ్న పుడుతుంది. అందుకు పుత్ర కళత్ర ధనాదుల యందు, అలాగే స్వర్గప్రాప్తి యందు రాగము అని సమాధానము వస్తుంది. కనుక, రాజస కర్త ఇటు లౌకిక కర్మల నాచరించినా, అటు యజ్ఞ యాగాది వైదిక కర్మల నాచరించినా, ఫలార్థము ఆచరిస్తాడే గాని, మోక్షార్థం మాత్రం కాదు. రాజస కర్తకు ధర్మార్థ కామా లనే త్రివర్గముల యందే ఆసక్తి, లేదా రాగము.

కర్మఫలము నందే ఆసక్తి కల వాడు కనుక రాజస కర్త అయిన రాగి కర్మఫల ప్రేప్సువు. కర్మఫలమునే అర్థించు వాడు కర్మఫల ప్రేప్సువు (**కర్మఫలప్రేప్సుః కర్మ ఫలార్థీ**).

**లుబ్ధుడు**

లోభ గుణము కల వాడు లుబ్ధుడు. ధనాశ కల వాడు. కాని, 'లుబ్ధ' శబ్దము కేవలం ధనాశ మాత్రమే కాదు. తన ధనంపై తనకు ఆశ ఉండటం దోషం కాదు. కాని, లుబ్ధునికి పరుల ధనం మీద కూడా ఆశ (**లుబ్ధః పర ద్రవ్యేషు సంజాత తృష్ణః**). తన ధనం తనదే కదా! అది ఎలాగూ ఉంది. పరుల ద్రవ్యం కూడా లభించాలి అని ఆశ పడే వాడు లుబ్ధుడు.

పరుల ధనమును ఆశించడంలో ఎంత ఉత్సాహం ఉంటుందో, తన ధనాన్ని ఖర్చు చేయడంలో అతనికి అంత నిరుత్సాహం ఉంటుంది.

సాధారణంగా ద్రవ్య వినియోగానికి తీర్థ క్షేత్రాలు పవిత్ర స్థానాలని భావిస్తాము. పుణ్య ప్రదేశాలలో చేసే దాన ధర్మాలు జీవునికి శ్రేయస్సును కలిగిస్తా యని శాస్త్రాలు చెబుతున్నాయి. శాస్త్ర జ్ఞానం తనకు ఉండినా తీర్థాది పవిత్ర క్షేత్రాలలో కూడా ధనాన్ని త్యాగం చేయ లేని దృఢ స్థితి లోభిలో ఉంటుంది. అదే లుబ్ధుని ప్రత్యేకత (**తీర్థాదౌ చ స్వద్రవ్య అపరిత్యాగీ లుబ్ధః**). తాను త్యాగం చేయక పోవడమే కాదు, చేసే వాళ్ళను కూడా చేయ నివ్వడు. అంతే కాదు. కూడ బెట్టడమే గాని అనుభవించడము అనేది ఉండదు. లోభము బ్రతుకులో ఎన్నడూ లాభం కాదు. లోభి ఎప్పుడైనా నష్ట పోయే వాడే. ఇది దేశకాలాదులు మారినా మారని సత్యం. కామ లోభాలు బ్రతుకునే హరిస్తాయి.

**ఆఖ్యాయిక**

పూర్వం ఒక గ్రామ పొలిమేర్లలో పెద్ద కొండ ఒకటి ఉండేది. ఆ కొండకు సంబంధించిన ఆశ్చర్యకర మైన ఒక ఇతివృత్తం ఆ ప్రాంతంలో దంత కథ లాగా వ్యాపించి ఉండింది.

ఆ కొండలో ఏదో ఒక చోట, ఒక ప్రత్యేకమైన సమయంలో ద్వారం తెరుచుకున్నట్లు కొండ తెరుచుకుంటుం దని, అలా తెరుచుకొనిన గిరి ద్వారము కొంత సమయము మాత్రమే తెరుచుకొని ఉండి, ఆ తరువాత పూర్వం లాగే మూసుకు పోతుందని, గిరి ద్వారము తెరుచుకోవడం అదృష్టవంతులకే కనిపిస్తుందని, అలా చూచిన వారు లోనికి వెళ్తే అక్కడ అమూల్యమైన మణులు, మాణిక్యాలు, వజ్రాలు, రత్నాలు గుట్టలు గుట్టలుగా పడి ఉంటాయని, వాటిని తెచ్చుకో వచ్చని, అలా పూర్వ మెప్పుడో తెచ్చుకున్న అదృష్ట వంతులు కొందరు ఉన్నారని - ఈ విధమైన దంత కథ ప్రచారంలో ఉండింది.

కొండ సమీపాన ఉన్న గ్రామంలో ఒక జమీందారు ఉండే వాడు. ఆ గ్రామంలో ఆయనే అందరి కన్నా ఐశ్వర్యవంతుడు. ప్రతి రోజు ఉదయం గుఱ్ఱపు స్వారి చేస్తూ, గిరి ప్రాంతానికి వెళ్ళి వస్తూ ఉండే వాడు.

ఒక రోజు జమీందారు స్వారి చేస్తూ కొండ సమీపానికి రాగానే, అక్కడ గిరి ద్వారము తెరుచుకొని ఉండటం చూశాడు. తానెప్పుడో చిన్నప్పుడు వినిన దంత కథ గుర్తు కొచ్చింది. ఆ ప్రాంతంలో తానే ఐశ్వర్యవంతుడు కనుక, అదృష్టవంతు డైన తన కొరకు గిరి ద్వారము తెరుచుకుంది అని భావించి, గుఱ్ఱాన్ని దిగి వేగంగా లోనికి ప్రవేశించాడు.

అక్కడి దృశ్యాన్ని చూచి తన కళ్ళను తానే నమ్మలేక పోయాడు. మణులు, మాణిక్యాలు, రత్నాలు,



వజ్రాలు గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. తన జన్మ ధన్య మైందని భావించాడు జమీందారు. ఆ విలువైన రత్న రాశులను తొందర తొందరగా పంచెలో కట్టుకొని బయటకు తెచ్చు కున్నాడు. వాటిని మరొక వస్త్రంలో మూట కట్టి కొండ బయట ఉన్న తన అశ్వం పైకి ఎక్కించాడు. ఇప్పటికే ఎంతో మూట కట్టేశాడు. ఈ లోగా అతనికి కథ లోని ప్రధానాంశము జ్ఞాపక మొచ్చింది. తెరుచుకొనిన గిరి ద్వారము కొంత సమయం తరువాత మూసుకు పోతుందనే విషయం స్మృతికి వచ్చి, ఇక ప్రాప్తించింది చాలు అని నిర్ణయించు కున్నాడు. గ్రామానికి తిరిగి బయలుదేరే సమయంలో, ఇక తృప్తిగా నస్యం పీల్చుకుందా మని జేబు తడవు కున్నాడు. నస్యం డబ్బీ కొండ లోపలే మరచి పోయాడు. వెంటనే దానిని తెచ్చుకుందామని పరుగు పరుగున మళ్ళీ కొండ లోకి వెళ్ళాడు. కొండ బిలము అదృశ్య మయ్యే కాలం సమీపించింది. అంతే. క్షణంలో కొండ ద్వారం మూసుకు పోయింది.

గ్రామస్థు లందరూ జమీందారు కొరకు అన్ని చోట్ల అన్వేషించారు. తీరా చూస్తే, జమీందారు గారి అశ్వం కనిపించింది. అశ్వంపై నున్న మూటలో అమూల్యమైన మణులు, మాణిక్యాలు ఉన్నాయి. సంవత్సరం పాటు గ్రామస్థులు జమీందారు కొరకు నిరీక్షిస్తూ, ఆ మణులు, మాణిక్యాలను రక్షిస్తూ ఉండినారు.

కాలం కళ్ళ ముందే కరిగి పోయింది. ఆశలు ఆవిరై పోయాయి. ఇంకేం చేస్తారు? దురదృష్టవంతు డైన జమీందారు గారి అదృష్టాన్ని గ్రామస్థు లందరూ పంచుకున్నారు.

రత్న రాశుల మూటలు వెంటే ఉన్నా, ప్రాణాలను పట్టుకు పోవడానికి ముక్కు పొడుం డబ్బీ చాలు. భూమి విశాల మైందే కావచ్చు. కాని మనిషి నివసించ డానికి ఎంత స్థలం అవసరం? ఆకాశం అనంతం కావచ్చు. అలాగని పక్షి ఎంత ఎత్తుకు ఎగర గలుగుతుంది? సముద్రంలో జలం అగాధంగా ఉండ వచ్చు. కాని చేప చరించ డానికి ఎంత జలం కావాలి? మనిషి ఈ ప్రపంచంలో ఎంత కాలం బ్రతుకుతాడు? పూర్ణాయుష్షు కల వాడి కైనా సుఖ పడటానికి ఎంత ఐశ్వర్యం అవసరం?

**కల లున్నాయి అంధునికి**
**కలవర ముంది అందరికి**
**కళ్ళున్నాయి మూత పడుటకు**
**మనసుంది మూగ బోవుటకు**
**ఉన్నవి ఉండవు కలకాలం**
**కాలము కదిపే మాయాజాలం**
**రామ రామ జయ రాజారామ్**
**రామ రామ జయ సీతారామ్**

అని రామజోగి చిట్కా.

**హింసాత్మకుడు**

హింసాత్మకుడు అంటే పరులను పీడించే స్వభావం కల వాడు (**హింసాత్మకః పర పీడా స్వభావః**). వెలిగే దీపం వెలుగును విరజిమ్ముతుంది. మల్లె వాసన మల్లె కుంది. ఉల్లి వాసన ఉల్లి కుంది. ఎవరు ఏది పంచినా, వారి వద్ద ఉన్నదే పంచుతారు. ఎవడు తనను తాను హింసించు కుంటాడో, వాడు పరులను కూడా హింసిస్తాడు. ఇది కాస్త లోతుగా అధ్యయనం చేయ వలసిన విషయము. రాజస కర్త రాగద్వేషాల మధ్య ఊగిస లాడే స్వభావం కల వాడు అయినందున, శాంతి లేని జీవితాన్ని గడుపుతూ ఉంటాడు. తాను అశాంతిలో మగ్నమై ఉండటమే గాక, ఇతరులను కూడా అశాంతికి గురి చేస్తాడు.

**అశుచిర్భూతుడు**

శుచి అంటే శౌచము. శుభ్రత. పవిత్రత. శుచి లేని వాడు ***అశుచిః*** అని చెప్ప బడ్డాడు. అంటే శుభ్రత లేని వాడు. అపవిత్రుడు. బాహ్య శౌచము, అంతః శౌచము రెండూ లేని వాడు ***( అశుచిః బాహ్యాన్తః శౌచ వర్జితః ).***

బాహ్యంలో దేహ శుచి, ఆంతర్యంలో అంతఃకరణ శుచి రెండూ లేని వాడు. రాజస కర్త యొక్క దేహము, మనస్సు రెండూ అశుద్ధం గానే ఉంటాయి. అశుద్ధాన్ని దాచడం ఎవ్వరికీ సాధ్యం కాదు. అది బహిర్ముఖ మవుతూనే ఉంటుంది. కాకపోతే, రాజస కర్త బాహ్య అశుచిని దాచుకో గల డేమో గాని అంతః అశౌచాన్ని దాచ లేడు.

స్నానాదులు లేక మలినంగా ఉన్నా, అత్తరు పన్నీరులను పైన చల్లుకొని శుచిర్భూతుల కన్నా ఎక్కువ శుచిగా ఉన్నట్లు ప్రకటించు కుంటాడు. లోగుట్టు పెరుమాళ్ళ కెరుక. ఇలాంటి వారి కొరకే నేమో ఉర్దూలో ***బాహర్ శేర్వాని - అందర్ పరేషాని*** అనే నానుడి ఒకటి వినిపిస్తూ ఉంటుంది.

బాహ్య అశౌచాన్ని అత్తరు పన్నీరులతో తాత్కాలికంగా ఆప గల డేమో గాని అంతః అశౌచాన్ని ఆపడం సాధ్యం కాదు. అంతఃకరణ లోని మాలిన్యమే లోపల అశౌచము. క్రోధము, ద్వేషము, అసూయ మొదలైన వన్నీ ఆంతరంగిక అశౌచాలే. ఇవన్నీ రాజస కర్త యొక్క లక్షణాలు.

**హర్ష శోకాన్వితుడు**

ఇష్ట మైనది ప్రాప్తించి నపుడు హర్షమును, ఆ ఇష్ట మైనది దూరమైనా, లేదా అనిష్ట మైనది సమీపించినా శోకమును అనుభవించే కర్త రాజస కర్త ***( ఇష్ట ప్రాప్తౌ హర్షః అనిష్ట ప్రాప్తౌ ఇష్ట వియోగే చ శోకః తాభ్యాం హర్ష శోకాభ్యాం , అన్వితః సంయుక్తః ).*** ఇష్టాయిష్టాలకు అతీతంగా ధర్మాధర్మాలను అవలోకిస్తూ, శాస్త్ర విహిత కర్మలను కర్తవ్యంగా చేసే వాడు అయినందున, సాత్త్విక కర్త నిర్వికారంగా ఉంటాడు. కాని, అందుకు భిన్న మైన ప్రవృత్తి, ప్రవర్తన కల వాడు కావడం చేత, రాజస కర్త సుఖదుఃఖాలలో పడి అలమటిస్తూ ఉంటాడు.

*ఇక తామస కర్తను గూర్చి చెబుతున్నాడు.*

**అయుక్తః ప్రాకృతః స్తబ్ధః శఠో నైష్కృతికోఽలసః ।**
**విషాదీ దీర్ఘసూత్రీ చ కర్తా తామస ఉచ్యతే ॥** 28

***అయుక్తః-ప్రాకృతః-స్తబ్ధః-శఠః-నైష్కృతికః-అలసః***
***విషాదీ-దీర్ఘసూత్రీ-చ-కర్తా-తామసః-ఉచ్యతే***

| | | | |
|---|---|---|---|
| అయుక్తః | = యుక్తుడు కాని వాడు | విషాదీ | = దుఃఖ స్వభావము గలవాడు |
| ప్రాకృతః | = పామరుడు | దీర్ఘసూత్రీ చ | = కాలయాపన చేయువాడు |
| స్తబ్ధః | = జడుడు | కర్తా | = కర్త |
| శఠః | = వంచకుడు | తామసః | = తామసుడని |
| నైష్కృతికః | = ఇతరులను మోసగించి నష్టపరచు వాడు | ఉచ్యతే | = చెప్పబడు చున్నాడు |
| అలసః | = సోమరియు | | |

**యుక్తుడు గాని వాడు, పామరుడు, జడుడు, వంచకుడు, మోసగాడు, సోమరి, దుఃఖించే వాడు, కాలయాపన చేసే వాడు తామసకర్త.**



**వ్యాఖ్య**

సాత్త్విక, రాజస కర్తల కన్నా విలక్షణ మైన వాడు తామస కర్త. చావు రానంత వరకు బ్రతుకుతూనే ఉంటాడు. మానవ రూపంలో ఉండే మృగము. భూమికి భారంగా, గాలికి అడ్డంగా తిరుగుతూ ఉంటాడు. వాడే తామస కర్త.

వ్యాఖ్యానానికి యుక్తం కాని వాడు. కారణం, అతడు అయుక్తుడు. ఇది అతని ప్రథమ లక్షణము. అయుక్తుడు అంటే నిలకడ లేని వాడు. మనస్సును ఒక చోట క్షణమైనా ఉంచ లేని వాడు. అస్థిర చిత్తుడు. పాదరసం లాంటి వాడు ***( అయుక్తః అసమాహితః ).***

అయుక్తుడే కాదు, ప్రాకృతుడు కూడా. అంటే, సంస్కార హీనుడు. పరిపక్వత లేని వాడు ***( ప్రాకృతః అత్యన్త అసంస్కృత బుద్ధిః ).*** సాధారణంగా ఇలాంటి బుద్ధిహీనులు సుజనుల ముందు సిగ్గుతో తలవంచు కోవాలి. వినమ్రులై ఉండాలి. కాని, ఈ ఘటం అలాంటి వాడు కాదు. పొగరుబోతు. స్తబ్ధుడు.

స్తబ్ధత అంటే వంగని స్వభావము. కట్టె లాగా బిగుసుకొని ఉంటాడు అన్నారు ఆచార్యులు ***( స్తబ్ధః దండవత్ న నమతి కస్మై చిత్ ).*** కట్టకు దండము అని పేరు. కాని, దండం పెట్టడం దండానికి తెలుసా? అది వంగి నమస్కరిస్తుందా? స్తబ్ధుడు కూడా అంతే. పేరుకు మానవుడే కాని, అన్నీ రాక్షస గుణాలే.

స్తబ్ధుడుగా ఉంటాడే గాని, కట్టెలో అగ్ని ఉన్నట్లే, ఈ ఉలిపి కట్టెలో కపటము దాగి ఉంటుంది. కొంపలు ముంచే స్వభావం ఉంటుంది. మాయ లన్నీ మనస్సు లోనే ఉంటాయి. అందుకే తామస కర్త శఠుడు ***( శఠః మాయావీ ).*** తన స్వభావాన్ని వ్యక్తం కాకుండా కప్పి పుచ్చుకొనే వాడు.

తాను ఒక మంచి పనిని చేయలేక పోయినా, పరుల కార్యాలను పాడు చేయడమే తన కార్యంగా భావించి నిర్వర్తించే వాడు. కనుక నైష్కృతికుడు ***( నైష్కృతికః పరవృత్తి ఛేదన పరః ).***

సోమరిపోతు ***( అలసః ).*** ఏడుపే వేడుకగా కలిగిన వాడు ***( విషాదీ ).*** పైగా దీర్ఘసూత్రీ. అంటే పొడవైన దారం కల వాడు. ఎంత దూరమైనా సాగదీయ గలడు. ఈ రోజు బ్రతుకుతూ ఉంటాడు గాని, ఏది మాట్లాడినా రేపు, రేపు అంటూ ఉంటాడు. ఆ రేపుకు రూపే రాదు. నేడో, రేపో చేయ వలసిన కార్యాన్ని మాసం దాటినా చేయని వాడు దీర్ఘసూత్రీ ***( దీర్ఘ సూత్రీ చ కర్తవ్యానాం దీర్ఘ ప్రసారణః , యత్ అద్య శ్వః వా కర్తవ్యం తత్ మాసేనాపి న కరోతి ).*** ఈ విధమైన ప్రవృత్తి కల వాడు తామస కర్త. ఇలాంటి వాడు ఏమి సుఖ పడతాడు? అందుకే అష్ట లక్షణాలను అష్ట దరిద్రాలుగా చెప్పిన భగవానుడు, ఏడవ లక్షణంలో ఏడుపును పెట్టాడని నా భావం ***( విషాదీ ).*** మనం చిన్నతనంలో చిన్నయ్యసూరి దగ్గర నేర్చుకొనిన షడ్వికార శోక మూర్తులు, మీరు బాగా పరీక్షించి చూస్తే, ఈ ఒక్క దౌర్భాగ్యుడి లోనే దర్శన మిస్తారు. దుఃఖభాగులు ఆరు మంది అని బాల్యంలో మనం నేర్చుకున్నాం. **ఈర్ష్యాళువు, జుగుప్సావంతుడు, నిస్సంతోషి, క్రోధనుడు, నిత్య శంకితుడు, పరభాగ్యోప జీవి** - వీరు ఆరుగురు దుఃఖ భాగులని నీతి కోవిదులు చెబుతారు అన్నాడు చిన్నయ్యసూరి. కాని, ఆ ఆరుగురు ఈ ఒక్కడి లోనే ఉన్నా రంటున్నాడు శ్రీకృష్ణ పరమాత్మ.

*ఇప్పటి వరకు త్రివిధ జ్ఞానమును, త్రివిధ కర్మలను, త్రివిధ కర్తలను గూర్చి చెప్పుకున్నాం. ఇక, ఇప్పుడు జ్ఞాన స్థానమైన బుద్ధి త్రివిధంగా ఎలా ఉందో చెప్పి, ఆ తరువాత, సాత్త్విక కర్తలో మనం చూచిన 'ధృతి' ఎలా త్రివిధంగా ఉందో చెబుతాను. అక్కడే నేను ఒక్క విషయాన్ని మీ దృష్టికి తెచ్చాను (26 వ శ్లో). ధృతి, లేదా ధైర్యము సాత్త్వికం గానే ఉంటుందని చెప్ప లేము అని కౌరవ పాండవులను ఉదహరించాను. వాటి అంతరాన్ని కూడా త్రివిధ ధృతిలో పరమేశ్వరుడు వివరిస్తాడు. ప్రస్తుతం బుద్ధిని స్పృశిస్తున్నాడు.*

బుద్ధే ర్భేదం ధృతే శ్చైవ గుణత స్త్రివిధం శృణు ।
ప్రోచ్యమాన మశేషేణ పృథక్త్వేన ధనఞ్జయ ॥ 29

*బుద్ధేః-భేదం-ధృతేః-చ-ఏవ-గుణతః-త్రివిధం-శృణు*
*ప్రోచ్యమానం-అశేషేణ-పృథక్త్వేన-ధనంజయ*

| | | | | | |
|---|---|---|---|---|---|
| ధనంజయ | = | అర్జునా! | అశేషేణ | = | సంపూర్ణముగ |
| గుణతః | = | గుణములను బట్టి | ప్రోచ్య మానం | = | చెప్ప బడిన |
| బుద్ధేః | = | బుద్ధి యొక్క | త్రివిధం | = | మూడు విధములైన |
| ధృతేః చ ఏవ | = | ధైర్యము యొక్క | భేదం | = | భేదమును |
| పృథక్త్వేన | = | వేరువేరుగా | శృణు | = | విను |

**అర్జునా! గుణ భేదము వల్ల బుద్ధి, ధైర్యము మూడు విధాలుగా ఉన్నాయి. వాటిని వేరు వేరుగా పూర్తిగా చెబుతాను. విను.**

### వ్యాఖ్య

పందొమ్మిదవ శ్లోకంలో జ్ఞానము, కర్మ, కర్త అని ప్రతిపాదించ బడిన విషయాన్ని గుణ భేదాన్ని బట్టి త్రివిధముగా వ్యాఖ్యానించడం జరిగింది. ఇరవై ఆరవ శ్లోకము నందు **ధృత్యుత్సాహ సమన్వితః** అనే చోట అంతఃకరణ వృత్తిని సూత్ర ప్రాయంగా చెప్పడం జరిగింది.

కర్త ఆలోచించడానికి బుద్ధి కరణము. బుద్ధిలో ఏర్పడే వృత్తియే జ్ఞానము. కనుక బుద్ధి లేకుండా జ్ఞాన వృత్తి ఉత్పన్నం కాదు. వృత్తి లేకుండా బుద్ధిలో ఆలోచన జరగదు. కనుక జ్ఞాన నిలయమైన బుద్ధికి, బుద్ధి వృత్తి అయిన ధృతికి గుణ భేదాన్ని బట్టి త్రివిధ వ్యాఖ్యానము చేయ వలసి ఉంది.

వృత్తిమంత మైన బుద్ధికి, ధృతి అనే బుద్ధి వృత్తికి గుణ భేదాన్ని మూడు విధాలుగా వ్యాఖ్యానించ డానికి ఉపక్రమించిన భగవానుడు, ముందుగా త్రివిధమైన బుద్ధి విషయాన్ని గూర్చి ప్రసంగిస్తూ, 'ధనంజయా!' అని అర్జునుని సంబోధించాడు. దిగ్విజయ యాత్ర సందర్భములో సుర నర లోకాలకు సంబంధించిన విశేష ధనాన్ని ఆర్జించిన వాడు కావడం చేత అర్జునుడు ధనంజయుడని ఖ్యాతి వహించాడు. అది ధనమే అయినా, అక్షయ ధనము జ్ఞానమే అనే అర్థాన్ని సూచిస్తూ అర్జునుని 'ధనంజయా!' అని పిలిచాడు గీతాచార్యుడు. **శృణు** - విను అని ప్రత్యేకించి చెప్పడం కూడా జ్ఞాన వైశిష్ట్యాన్ని స్తుతించుటయే.

*గుణ భేదాన్ని బట్టి త్రివిధముగా చెప్ప బడుతున్న బుద్ధి విషయములో ముందుగా సాత్త్విక బుద్ధిని గూర్చి చెబుతున్నాడు.*

ప్రవృత్తిం చ నివృత్తిం చ కార్యాకార్యే భయాభయే ।
బన్ధం మోక్షం చ యా వేత్తి బుద్ధిః సా పార్థ సాత్త్వికీ ॥ 30

*ప్రవృత్తిం-చ-నివృత్తిం-చ-కార్యాకార్యే-భయాభయే*
*బంధం-మోక్షం-చ-యా-వేత్తి-బుద్ధిః-సా-పార్థ-సాత్త్వికీ*

| | | | | | |
|---|---|---|---|---|---|
| పార్థ | = | అర్జునా! | బుద్ధిః | = | బుద్ధి |
| యా | = | ఏ | ప్రవృత్తిం చ | = | ప్రవృత్తి విషయమును |



| | | | | | |
|---|---|---|---|---|---|
| నివృత్తిం చ | = | నివృత్తి విషయమును | వేత్తి | = | గ్రహించు చున్నదో |
| కార్యాకార్యే | = | కార్యమును, అకార్యమును | సా | = | ఆ |
| భయాభయే | = | భయమును, అభయమును | బుద్ధిః | = | బుద్ధి |
| బంధం | = | బంధమును | సాత్త్వికీ | = | సాత్త్విక మైనది |
| మోక్షం చ | = | మోక్షమును | | | |

**అర్జునా! ప్రవృత్తి నివృత్తి విషయాలను, కార్యాకార్యాలను, భయాభయాలను, బంధ మోక్షాలను తెలుసుకునే బుద్ధి సాత్త్విక బుద్ధి.**

### వ్యాఖ్య

వృత్తి విశేషం చేత బుద్ధిలో జ్ఞానము కలుగుతూ ఉంది. ఏ విధమైన జ్ఞానము బుద్ధిలో ఏర్పడటం చేత ఆ బుద్ధి సాత్త్విక మని చెప్ప బడుతుందో దానిని వివరిస్తున్నాడు.

ప్రవృత్తి నివృత్తులను ***(ప్రవృత్తిం చ నివృత్తిం చ)***, కార్యాకార్యాలను ***(కార్యాకార్యే)***, భయాభయాలను ***(భయాభయే)***, బంధమోక్షాలను ***(బంధం మోక్షం చ)*** ఏది తెలుసుకుంటూ ఉందో ***(యా వేత్తి)*** అది సాత్త్విక మైన బుద్ధి ***(సా బుద్ధిః సాత్త్వికీ)***. ఇది శ్లోకార్థము.

ఈ విధమైన భేదమును, దానికి సంబంధించిన జ్ఞానమును తెలుసుకునే బుద్ధి సాత్త్విక మైనది అంటున్నాడు. బుద్ధి అనేది కరణమే గాని కర్త కాదు. కరణము నందు కర్తృత్వము అనేది కేవలం ఔపచారికమే కనుక, కర్తయే బుద్ధి చేత తెలుసుకుంటున్నా డని భావము.

**ప్రవృత్తి నివృత్తులు**

మొదట ప్రవృత్తి నివృత్తుల విషయం. ప్రవృత్తి అంటే కర్మ మార్గము. నివృత్తి అంటే జ్ఞాన మార్గము. కర్మ మార్గము బంధ హేతువు. జ్ఞాన మార్గము మోక్ష హేతువు ***(ప్రవృత్తిః ప్రవర్తనం బంధ హేతుః కర్మ మార్గః నివృత్తిః మోక్ష హేతుః సంన్యాస మార్గః)***.

అలా ఎందుకు భావించాలి? ప్రవృత్తి అంటే ఆచరించ దగిన దని, నివృత్తి అంటే ఆచరించ దగనిది అని గ్రహించ వచ్చు కదా! గ్రహించ వచ్చు. కాని, బంధమోక్షాలను గూర్చి ప్రసంగించిన శ్లోకం లోనే ప్రవృత్తి నివృత్తులను ప్రస్తావించడం చేత బంధ హేతువైన కర్మ మార్గము ప్రవృత్తి అని, మోక్ష హేతువైన జ్ఞాన మార్గము నివృత్తి అని తెలుస్తూ ఉంది. ఆచరణీయము, అనాచరణీయము అనే అర్థం సముచితమే అయినా, ఆ అర్థాన్ని ప్రత్యేకంగా సూచిస్తూ కార్యాకార్యములు కూడా ఈ శ్లోకం లోనే ప్రతిపాదించబడి ఉన్నందున, ఈ విషయంలో మీమాంస అవసరము లేదు. ఈ ప్రవృత్తి నివృత్తుల భేదమును గుర్తించి గ్రహించే జ్ఞానము ఏ బుద్ధికి ఉందో అది సాత్త్విక బుద్ధి.

**కార్యాకార్యాలు**

తరువాత అంశము కార్యాకార్యాలు. అంటే, కార్యము, అకార్యము. కార్యము అంటే చేయ దగినది; విహిత కర్మ. అకార్యము అంటే చేయ కూడనిది; నిషిద్ధ కర్మ, లేదా ప్రతిషిద్ధ కర్మ. విహిత కర్మను ఆచరించ డము, ప్రతిషిద్ధ కర్మను ఆచరించకుండా ఉండటము కార్యాకార్యములు ***(కార్యాకార్యే, విహిత ప్రతిషిద్ధే కర్తవ్యా కర్తవ్యే, కరణా కరణే ఇత్యేతత్)***.

ఇక్కడ, ఈ చేయడము, చేయక పోవడము అనేది దేని విషయంలో అనే ప్రశ్న ఉత్పన్న మవుతుంది ***(కస్య?)***. లౌకికంగా, అంటే వ్యావహారికంగా కూడా మనకు కొన్ని కార్యాకార్యాలు ఉన్నాయి.

మద్యపాన నిషేధ చట్టమును ప్రభుత్వము ప్రవేశ పెట్టి నపుడు దానిని ప్రజ లందరూ ఆచరించి తీరాలి. మద్యపానము చేయడానికి వీలు లేదు. నేడు మద్యపానమును సేవించడం అకార్యము కావచ్చు. కాని, రేపు ప్రభుత్వము చట్టాన్ని మార్చి, మద్యపానాన్ని స్వేచ్ఛాపానీయం చేయ వచ్చు. అప్పుడు, ఇంత వరకు ఏది అకార్యమో, అది క్షణాల్లో కార్యంగా మారి పోతుంది. ఒక కాలంలో అకార్యంగా ఉన్నది మరొక కాలంలో కార్యంగా కనిపిస్తుంది. అంతే కాదు. ఒక కాలం లోనే, ఒక రాష్ట్రంలో కార్యం గాను, మరొక రాష్ట్రంలో అకార్యం గాను ఉండ వచ్చు. ఈ విధంగా కార్యాకార్యాలు దేశ కాలాదులను బట్టి మారుతూ ఉంటాయి ( ***దేశ కాలాద్యపేక్షయా దృష్ట అదృష్టార్థానాం కర్మణామ్*** ).

కనుక, కేవలం దేశ కాలాదులనే కాకుండా, సాధకులు దృష్ట అదృష్ట ఫలాలను కూడా దృష్టిలో ఉంచుకొని కార్యాకార్యాలలో ప్రవర్తించాలి. మనం ఆచరించే కార్యాలకు ప్రత్యక్షంగా కనిపించేది దృష్ట ఫలం. ప్రత్యక్షంగా కనిపించనిది అదృష్ట ఫలం.

ఒక వ్యక్తి కోటి రూపాయలు ఒక సేవా సంస్థకు దానం చేస్తాడు. అలా చేయడం వల్ల అతను ఎంత గానో తృప్తి చెందుతాడు. అది దృష్ట ఫలం. కాని, అతడు చేసిన సత్కర్మకు పుణ్యఫలం కూడా ఉంది. అది కంటికి కనిపించదు. అది అదృష్ట ఫలం.

కనుక, ఈ దృష్టా దృష్ట ఫలాలు ఎలాంటివై ఉండాలి అనేది సాధకులు నిర్ణయించుకొని కార్యాకార్యాలలో ప్రవర్తించాలి. ఫలార్థి అయితే స్వర్గాది ఫలభోగాన్ని ఆశిస్తాడు. మోక్షార్థి అయితే, చిత్తశుద్ధిని, తద్వారా జ్ఞానప్రాప్తిని అభిలషిస్తాడు. కార్యాకార్యాలలో ఈ అంతరాన్ని గ్రహించే సూక్ష్మత్వము సాత్త్విక బుద్ధికే ఉంటుంది.

**భయాభయాలు**

దేని వలన మనిషి భీతి చెందుతాడో అది భయము ( ***బిభేత్యస్మాదితి భయమ్*** ). అంటే, భయ కారణము భయమే అని దాని అర్థం. ప్రవృత్తి మార్గము, లేదా కర్మమార్గము దుర్భరమైన సంసారానికి కారణ మవుతూ ఉంది కనుక, ప్రవృత్తి భయ హేతువు. అలాగే అకార్యము పాపానికి, నీచజన్మలకు కారణం కావడం చేత, అకార్యము కూడా భయ హేతువే.

దీనికి విరుద్ధ మైనది అభయము ( ***తద్విపరీతమ్ అభయమ్*** ). భయ రూపమైన సంసారము నుండి విముక్తిని కలిగిస్తూ ఉంది కనుక, నివృత్తి మార్గము, లేదా జ్ఞాన మార్గము అభయ హేతువు. అలాగే కార్యము చిత్తశుద్ధికి, జ్ఞాన యోగ్యతకు కారణం కావడం చేత కార్యము కూడా అభయ హేతువే.

ఈ విధంగా దృష్టా దృష్ట ఫలాలు భయాభయ హేతువులుగా తెలుస్తూ ఉన్నాయి ( ***దృష్టా దృష్ట విషయోః భయా భయయోః కారణే ఇత్యర్థః*** ). కనుక ఏది బంధమో, ఏది మోక్షమో; బంధమును, దాని కారణాన్ని; అలాగే మోక్షమును, దాని హేతువును ఏ బుద్ధి తెలుసుకుంటూ ఉందో అది సాత్త్విక బుద్ధి.

*ఇక రాజస బుద్ధిని గూర్చి వివరిస్తున్నాడు.*

**యయా ధర్మ మధర్మం చ కార్యం చాకార్య మేవ చ ।**
**అయథావ త్ప్రజానాతి బుద్ధిః సా పార్థ రాజసీ ॥** 31

**యయా-ధర్మం-అధర్మం-చ-కార్యం-చ-అకార్యం-ఏవ-చ**
**అయథావత్-ప్రజానాతి-బుద్ధిః-సా-పార్థ-రాజసీ**

పార్థ = అర్జునా!



| | | | | | |
|---|---|---|---|---|---|
| యయా | = | ఏ బుద్ధి చేత | అయథావత్ | = | యథార్థము కానట్లు |
| ధర్మం | = | ధర్మమును | ప్రజానాతి | = | తెలుసుకుంటూ ఉందో |
| అధర్మం | = | అధర్మమును | సా | = | ఆ |
| కార్యం చ | = | కార్యమును | బుద్ధిః | = | బుద్ధి |
| అకార్యం ఏవ చ | = | అకార్యమును | రాజసీ | = | రాజసిక మైనది |

**అర్జునా! ధర్మాధర్మాలను, కార్యాకార్యాలను ఉన్న దున్నట్లు కాకుండా భిన్నంగా గ్రహించే బుద్ధి రాజసబుద్ధి.**

**వ్యాఖ్య**

శాస్త్ర విహిత మైనది ధర్మము. శాస్త్ర నిషిద్ధ మైనది అధర్మము. ఏది శాస్త్ర ప్రతిపాదితమో అది కర్తవ్య కర్మ. చేయ దగినది. ఏది శాస్త్ర విరుద్ధమో అది నిషిద్ధ కర్మ. చేయ కూడనిది ( ***ధర్మం శాస్త్ర చోదితమ్, అధర్మం చ తత్ప్రతిషిద్ధం*** ).

ఈ విధమైన ధర్మాధర్మాలను, కార్యాకార్యాలను సాత్త్విక బుద్ధి గ్రహిస్తుంది. రాజస బుద్ధి కూడా గ్రహిస్తుంది. కాకపోతే, ఉన్న దున్నట్లుగా సాత్త్విక బుద్ధి గ్రహిస్తుంది ( ***యథావత్*** ). రాజస బుద్ధి ఉన్నది ఉన్నట్లుగా గ్రహించ లేదు. ఉన్నది ఉన్నట్లు కాకుండా గ్రహిస్తుంది ( ***అయథావత్*** ). అది సందిగ్ధంతో కూడిన బుద్ధి. అదే రాజస బుద్ధి.

రాజస బుద్ధికి ఏదీ ఉన్న దున్నట్లు అర్థం కాదు. పోనివ్వండి. ఉన్నది ఉన్నట్లు అర్థం కాక పోయినా, ఏదో విధంగా అర్థ మవుతుంది కదా! అవును. అవుతుంది. అదే, ఎలా అర్థ మవుతుంది?

ఎలాగైనా అర్థం కావచ్చు. ***యథావత్*** అర్థమైతే సమస్య లేదు. ***అయథావత్*** అర్థం కావడ మంటే, ఇక అక్కడ అర్థమైంది ఏముంది? ఏది అర్థమైనా, అది మాత్రం ఉన్నది కాదు. అలాగని, లేనిదీ కాదు. ఎందుకని? అర్థమైంది అంటున్నాడు కనుక.

కనుక, అర్థమైంది. కాని, ఆ అర్థమైంది ఏదో వాస్తవంగా ఉన్నది మాత్రం కాదు. అలాగని లేనిదీ కాదు. ఏది తన బుద్ధిలో ఉందో, అదే అర్థమైంది; అర్థ మౌతుంది. ఈ విధంగా ఏ జ్ఞానమును సందిగ్ధంగా గ్రహిస్తుందో, ఆ బుద్ధి రాజస బుద్ధి.

యథార్థాన్ని చూడకుండా బుద్ధిలో ఉన్న దానిని చూస్తుంది అంటే, ఆ దృష్టి వెనుక సత్యం లేదు. రాగద్వేషాలే ఉన్నాయి. కనుక సాత్త్విక బుద్ధి ఏర్పడితేనే శాస్త్రం అర్థ మవుతుంది. రాజస బుద్ధి రాగద్వేషాల కోణం నుండి చూస్తుంది కనుక శాస్త్రం ఉన్న దున్నట్లుగా కాకుండా, వ్యక్తి మనస్సుకు అనుగుణంగా అర్థ మవుతుంది. కనుక, రాజస బుద్ధి గల వారు శాస్త్రాన్ని అధ్యయనం చేస్తారే గాని శాస్త్ర హృదయాన్ని పట్టుకో లేరు. పట్టుకోలేరు సరి గదా, వారి పైత్యాన్నంతా శాస్త్రానికి ఆపాదిస్తారు.

***దృశ్యన్తేహి పురుషాః రాగాది గౌరవాత్ శాస్త్రం అతిక్రామన్తః*** - రాగద్వేషాలు కల వారు శాస్త్రాన్ని వ్యతిరేకిస్తారని ఆచార్యులు భాష్యంలో అభిప్రాయ పడ్డారు. లేని దానిని ఉన్నట్లు చూడటము అంటే, ఉన్న దానిని నిరాకరించడమే కదా! అదే రాజస బుద్ధి.

*ఇక తామస బుద్ధిని గూర్చి చెబుతున్నాడు.*

**అధర్మం ధర్మమితి యా మన్యతే తమసావృతా ।**
**సర్వార్థా న్విపరీతాంశ్చ బుద్ధిః సా పార్థ తామసీ ॥** 32

**అధర్మం-ధర్మం-ఇతి-యా-మన్యతే-తమసా-ఆవృతా**
**సర్వార్థాన్-విపరీతాన్-చ-బుద్ధిః-సా-పార్థ-తామసీ**

| | | | |
|---|---|---|---|
| పార్థ | = అర్జునా! | ధర్మం ఇతి | = ధర్మ మనియు |
| యా | = ఏ | సర్వార్థాన్ | = సర్వ విషయములను |
| బుద్ధిః | = బుద్ధి | విపరీతాన్ చ | = విపరీత భావము గల వానినిగ |
| తమసా | = అజ్ఞానము చేత | మన్యతే | = భావిస్తుందో |
| ఆవృతా | = కప్పు బడినదై | సా బుద్ధిః | = ఆ బుద్ధి |
| అధర్మం | = అధర్మమును | తామసీ | = తామసిక మైనది |

**అర్జునా! అజ్ఞానము చేత కప్పబడింది, అధర్మమును ధర్మము గాను, సమస్త విషయాలను విపరీతంగా భావించేది తామస బుద్ధి.**

### వ్యాఖ్య

ఏ బుద్ధికి ధర్మం అధర్మం గాను, విహితం ప్రతిషిద్ధం గాను, కార్యం అకార్యం గాను, అర్థము అనర్థము గాను, యుక్తము అయుక్తము గాను గోచరిస్తుందో, ఆ బుద్ధి తామస బుద్ధి. ఏవేవి స్పష్టంగా జ్ఞేయములో అవన్నీ విపరీతాలు గానే గోచరిస్తాయి.

తామస బుద్ధికి విషయానందమే గాని ఆత్మానందము గిట్టదు. ఆచార్యోపదేశాన్ని ***యథావత్*** తామస బుద్ధి గ్రహించదు. అందుచేత సంశయ విచ్ఛేదనము జరగదు. శాస్త్రం విషయంలో శ్రద్ధ లేని కారణంగా జ్ఞానం వంట పట్టదు. అందుచేత విపరీత దృష్టి, విపర్యయ జ్ఞానం బుద్ధిని కప్పేసి ఉంటాయి. ఆ బుద్ధిలో చీకటే గాని వెలుగు ఉండదు. అదే తామస బుద్ధి.

ఉన్న దున్నట్లు గ్రహించేది సాత్త్విక బుద్ధి. ఉన్నది ఉన్నట్లు గ్రహించనిది రాజస బుద్ధి. లేనిది ఉన్నట్లు గ్రహించేది తామస బుద్ధి.

సాత్త్విక, రాజస, తామస బుద్ధులను గూర్చి వివరంగా చెప్పుకున్నాం. ఇదేమీ కథ కాదు. శాస్త్రం. శ్రేయస్సును ప్రసాదించే ప్రమాణము. బుద్ధి భేదాన్ని గ్రహించిన తరువాత ప్రయత్నాన్ని ముమ్మరం చేయాలి. తమోగుణం నుండి రజో గుణానికి, రజోగుణం నుండి సత్త్వ గుణానికి చేరాలి. ఆ తరువాత త్రిగుణాలను అధిగమించి గుణాతీతులమై తరించాలి. అందుకే, ఈ గుణత్రయ విశ్లేషణ మంతా.

*బుద్ధిని త్రివిధంగా వివరించి బోధించిన భగవానుడు, ఇక త్రివిధమైన ధృతిని వివరించే కార్యంలో ముందుగా సాత్త్విక ధృతిని గూర్చి చెబుతున్నాడు.*

ధృత్యా యయా ధారయతే మనః ప్రాణేన్ద్రియ క్రియాః ।
యోగే నావ్యభిచారిణ్యా ధృతిః సా పార్థ సాత్త్వికీ ॥ 33

**ధృత్యా-యయా-ధారయతే-మనః ప్రాణేంద్రియక్రియాః**
**యోగేన-అవ్యభిచారిణ్యా-ధృతిః-సా-పార్థ-సాత్త్వికీ**

| | | | |
|---|---|---|---|
| పార్థ | = అర్జునా! | మనఃప్రాణేంద్రియక్రియాః | = మనస్సు, ప్రాణము, ఇంద్రియ చేష్టలు |
| యయా | = ఏ | అవ్యభిచారిణ్యా | = వ్యభిచరించనట్టి |
| ధృత్యా | = ధృతి చేత | యోగేన | = యోగము చేత |
| ధారయతే | = ధరింప బడుచున్నవో | ధృతిః | = ధైర్యము |
| సా | = ఆ | సాత్త్వికీ | = సత్త్వగుణ ప్రధాన మైనది |



**అర్జునా! మనస్సు, ప్రాణము, ఇంద్రియ చేష్టలు - వీటిని నిశ్చలమైన యోగము చేత నియమించేది సాత్త్విక ధృతి.**

### వ్యాఖ్య

ధృతి అంటే ధారణము. నియమించడము. నిలకడ. చిత్తము లోని పటుత్వము. బుద్ధి లోని దృఢత్వము. మనస్సు సంకల్ప వికల్పాల మధ్య చిందు లేస్తూ ఉంటుంది. బుద్ధి నిశ్చయాత్మకమై, మనస్సు లోని విషయాన్ని నిశ్చయిస్తుంది. బుద్ధి నిశ్చయించిన విషయాన్ని ధృతి స్థిర పరుస్తుంది.

అనన్యమైన యోగం చేత స్థిరమైన ధైర్యము నవలంబించి, ఏ స్థిరమైన ధృతి చేత మనః ప్రాణేంద్రియ వ్యాపారాలను శాస్త్రమును అతిక్రమించకుండా నిరోధించి నిలపడం జరుగుతూ ఉందో, అదే సాత్త్విక ధృతి.

విషయాల సన్నిధిలో మనస్సు చలిస్తుంది. బాహ్య విషయాల వైపు సహజం గానే మనస్సు పరుగులు తీస్తుంది. మనస్సు అలా బహిర్ముఖం కావడానికి విషయాలు ప్రేరేపించడం కారణం కావచ్చు. లేదా, మనస్సు లోని వాసనల సహజ ప్రేరణ కావచ్చు. ప్రేరేపించ బడిన చిత్తము ఇంద్రియ ప్రాణాలను ఏకోన్ముఖం చేసి విషయానుభవానికి సిద్ధ పరుస్తుంది. నరాలతో, కండరాలతో నిండి ఉన్న దేహాన్ని ప్రాణం శక్తివంతం చేస్తుంది.

ఎలాగైతే విద్యుచ్ఛక్తి యంత్రములో వ్యాపించి యంత్రాన్ని శక్తివంతం చేస్తుందో, అలాగే ప్రాణ శక్తులు దేహాన్ని శక్తివంతం చేస్తాయి. చలింప చేస్తాయి. ప్రాణ శక్తితో కూడి చేతన మైన దేహము విషయ ప్రపంచంలో రమించ గలుగుతుంది. దేహము శక్తివంతంగా ఉందంటే, ప్రాణశక్తి దేహంలో అణువణువున వ్యాపించి ఉందని అర్థము. ప్రాణం దేహంలో చలించని క్షణం దేహం మృత కళేబరమే.

కనుక, అంతరంగంలో ఉన్న చిత్తానికి, జడ రూపమైన దేహానికి అనుసంధానంగా ప్రాణం కదుల్తూ ఉంది. యంత్రములో శక్తి వ్యాపించి ఉన్నా, యంత్రాన్ని నడిపే చేతుల మీదనే ప్రయాణం ఆధారపడి ఉన్నట్లు, దేహేంద్రియ ప్రాణ చేష్టల్ని మనస్సు నడుపుతూ ఉంది. అట్టి మనస్సులో దృఢమైన స్థైర్యం ఉన్నప్పుడే, అశాస్త్రీయ మార్గాలలో పయనించే దేహేంద్రియాలను నియంత్రించి, శాస్త్ర విహితమైన మోక్షమార్గంలో నియమించడం జరుగుతుంది. బుద్ధి లోని స్థిరమైన అట్టి ధైర్యమే సాత్త్విక ధృతి అని చెప్ప బడింది ***(సా ధృతిః సాత్త్వికీ)***.

*ఇక రాజస ధృతిని గూర్చి చెబుతున్నాడు.*

యయా తు ధర్మకామార్థా న్ధృత్యా ధారయతేఽర్జున ।
ప్రసఙ్గేన ఫలాకాంక్షీ ధృతిః సా పార్థ రాజసీ ॥ 34

**యయా-తు-ధర్మకామార్థాన్-ధృత్యా-ధారయతే-అర్జున**
**ప్రసంగేన-ఫలాకాంక్షీ-ధృతిః-సా-పార్థ-రాజసీ**

| | | | |
|---|---|---|---|
| పార్థ | = అర్జునా! | ధర్మకామార్థాన్ | = ధర్మకామములను |
| అర్జున | = పార్థా! | ధారయతే | = ధరించు చున్నాడో |
| యయా | = ఏ | సా | = ఆ |
| ధృత్యా తు | = ధృతి చేత | ధృతిః | = ధృతి |
| ఫలాకాంక్షీ | = ఫలము నాశించు వాడు | రాజసీ | = రాజసిక మైనది |
| ప్రసంగేన | = కోరికతో | | |

**అర్జునా! ఫలాపేక్ష కల వాడు ఏ ధృతి చేత ధర్మార్థ కామాలను కోరుతున్నాడో అది రాజస ధృతి.**

**వ్యాఖ్య**

విషయ సుఖాల వెంట పడి పరుగులు తీసే ఇంద్రియ మనస్సులను నియమించి, మోక్ష మార్గంలో వినియోగించ దానికి ఉపకరించే ధృతి సాత్త్విక ధృతి అని పూర్వ శ్లోకంలో అర్థం చేసుకున్నాం.

మోక్ష ప్రస్తావనే లేకుండా, కేవలం త్రివర్గముల విషయము నందే, అంటే అర్థకామాల విషయం లోనే సహకరించే, ఉపకరించే ధృతి రాజసధృతి. ధర్మార్థ కామాలలో ఎప్పుడెప్పుడు, ఎక్కడెక్కడ దేని యందు అవసరమైతే, దాని యందే ధృతిని వినియోగిస్తూ, ఫలాకాంక్షతో కార్యాలను నిర్వహించే వాని ధృతి రాజస ధృతి.

సాత్త్విక ధృతి మోక్ష ప్రధానంగా వ్యవహరిస్తూ ఉంటుంది. రాజసధృతిలో మోక్షము అముఖ్యంగా ఉంటుంది. త్రివర్గాలే ప్రధానంగా ఉంటాయి. సంపాదనే ప్రధానంగా ఉంటుంది. కనుక, కర్మలలో ఫలాసక్తి ఉంటుందే గాని చిత్తశుద్ధి అనే ప్రసక్తి ఉండదు.

సాత్త్విక ధృతి కల వాడు ఎలాగైతే దేహేంద్రియ ప్రాణ మనస్సులను నిగ్రహిస్తూ ఉంటాడో, రాజసధృతి కల వాడు కూడా అలాగే నియమిస్తాడు. కాకపోతే, సాత్త్విక ధృతి గల సాధకుడు అనన్య యోగానికి ధృతిని ఉపయోగ పెట్టుకుంటూ మోక్ష మార్గంలో చరిస్తే, రాజసధృతి గల లౌకికుడు అర్థకామాల అన్వేషణలో ఫలాభిసంధితో ప్రవర్తిస్తూ ఉంటాడు. అతని మనస్సులో ధనానికే ప్రాధాన్యం కాని జ్ఞానానికి కాదు. నిరంతరం శ్రమిస్తాడు. ధృత్యుత్సాహాలను తోడు చేసుకొని ధనార్జనలో నిమగ్నమై ఉంటాడు. తరించాలనే ధ్యాసే ఉండదు. అనర్థ మార్గాలలో చరించడం వల్ల ధృత్యుత్సాహాలు సత్ఫలితాలను ఇవ్వ లేక పోగా బ్రతుకును తిమిరం లోకి తోసేస్తాయి. దారి తప్పిన శ్రమలు ఎవరి నైనా దగా చేస్తాయి. మతి లేని మార్గాలు గతిని నిరోధిస్తాయి.

**ఆఖ్యాయిక**

అచంచల మైన దీక్షతో, రాజస ధృత్యుత్సాహాలను తోడు చేసుకొని ఒక వ్యక్తి దివారాత్రులు శ్రమించి ధనాన్ని ప్రోగు చేశాడు. సుమారు పది కోట్ల రూపాయలను ఆర్జించాడు.

ఇక మీదట ఎలాంటి శ్రమ లేకుండా ఆర్జించిన ధనంతో హాయిగా కాలు మీద కాలు వేసుకొని బ్రతికేయ వచ్చు అనుకున్నాడు. ఊహల కేముంది? అవి పెట్టుబడి లేని వ్యాపారా లాయె. అలా అలా ఆలోచిస్తూ ఉన్నాడు. ఈ లోగా ఎవరో అపరిచితమైన వ్యక్తి వచ్చి ముందు నిలవడం జరిగింది.

ఎవరు మీరు? అని ప్రశ్నించాడు ధనికుడు. ఆ వచ్చిన వ్యక్తి తాను మృత్యువును అని సమాధాన మివ్వడం జరిగింది. ఇంత లోనే, వచ్చిన పని పూర్తి చేసుకుని వెళ్ళే ప్రయత్నంలో మృత్యువు కనిపించాడు.

ధనికుడు దిగ్భ్రాంతి చెందాడు. మృత్యువును ప్రాధేయ పడ్డాడు. తాను ఎంతగా శ్రమించి పది కోట్లు ప్రోగు చేశాడో మృత్యువుకు వివరించాడు. తన సంపాదనలో సగ భాగము సమర్పించ డానికి సంసిద్ధతను వ్యక్తం చేస్తూ, కనీసం రెండు రోజులు బ్రతికే అవకాశము ఇవ్వమని అర్థించాడు. అభ్యర్థన లన్నీ అరణ్య రోదన లయ్యాయి. చివరగా, తన ఆస్తి నంతా సమర్పించి, ఒక గంట కాలము నివసించే అవకాశానికి ప్రయత్నించాడు. అదీ విఫల మైంది. ఎట్టకేలకు ఒక్క వాక్యాన్ని కాగితం పై వ్రాసి పెట్టి నిష్క్రమించడానికి అనుమతిని కోరాడు. మృత్యువు అంగీకరించాడు. ఒక వాక్యాన్ని వ్రాసి కాగితం బల్లపై పెట్టాడు. మరు క్షణం కళ్ళు మూత పడి పోయాయి. దేహం నేలకు ఒరిగి పోయింది. అతడు ఏమి వ్రాసి పెట్టాడు? వీలునామా అయి ఉంటుందా? మీరే చదవండి. తెలుస్తుంది.





*ఈ వాక్యాన్ని చదివే వారు ఎవరైనా, వారికి నా మనవి ఒక్కటే. భుక్తికి కొరత లేకుండా మీ బ్రతుకు సాగి పోతూ ఉంటే, అంతటితో తృప్తి పడి పొండి. సంపదల్ని ప్రోగు చేసుకొనే పనిలో జీవితాన్ని ధారబోసుకోకండి. నా పది కోట్ల రూపాయలు నాకు పది నిమిషాల జీవితాన్ని ప్రసాదించ లేక పోయాయి. . . . . . . .* ఇదే అతని మరణ సందేశము.

పోయిన వాళ్ళు ఏం పట్టుకు పోయారు? ఏమీ పట్టుకు పోలేక ఊరకే పోయారు. ఏమి విడిచి పెట్టి పోయారు? అంతా విడిచి పెట్టి ఖాళీగా పోయారు. పోయిన వాళ్ళను చూచి ఉన్న వాళ్ళు ఏమి నేర్చుకోవాలో ఆలోచించండి. ఎందుకని? ఉన్న వాళ్ళు ఒకనాడు లేకుండా పోయే వాళ్ళే కనుక.

*దీనబాంధవుడవు కదా నీవు దీననాథా!*
*నాకు మించిన దీను లెవ్వరు ధరణి లోన*
*నన్ను కడతేర్చి నీ పేరు నిలుపుకోరా!*
*నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా !*

అని నీలకంఠ శతకంలో ఒక విబూది పండు.

*తామస ధృతిని గూర్చి చెబుతున్నాడు.*

**యయా స్వప్నం భయం శోకం విషాదం మద మేవ చ ।**
**న విముఞ్చతి దుర్మేధా ధృతిః సా పార్థ తామసీ ॥ 35**

*యయా-స్వప్నం-భయం-శోకం-విషాదం-మదం-ఏవ-చ*
*న-విముంచతి-దుర్మేధాః-ధృతిః-సా-పార్థ-తామసీ*

| | | | | | |
|---|---|---|---|---|---|
| పార్థ | = | అర్జునా! | విషాదం | = | విషాదమును |
| దుర్మేధాః | = | దుర్బుద్ధి గల వాడు | మదం ఏవ చ | = | మదమును |
| యయా | = | దేని చేత | న విముంచతి | = | విడిచి పెట్టడో |
| స్వప్నం | = | నిద్రను | సా | = | ఆ |
| భయం | = | భయమును | ధృతిః | = | ధృతి |
| శోకం | = | శోకమును | తామసీ | = | తామసిక మైనది |

**అర్జునా! దుర్బుద్ధి గలవాడు ఏ ధృతి చేత స్వప్నమును, భయమును, శోకమును, విషాదమును, మదమును విడిచి పెట్టడో అది తామస ధృతి.**

**వ్యాఖ్య**

సాత్త్విక ధృతి సన్మార్గము. రాజసధృతి వక్ర మార్గము. తామసధృతి దుర్మార్గము. సాత్త్విక ధృతితో సన్మార్గంలో చరించే సాత్త్విక కర్త పొందేది సద్గతి. రాజస ధృతితో వక్ర మార్గంలో చరించే రాజస కర్త పొందేది మిశ్రమ గతి. తామస ధృతితో దుర్మార్గంలో చరించే తామస కర్త పొందేది దుర్గతి. ప్రస్తుత శ్లోకంలో తామస ధృతిని తెలుసుకుంటాము.

ముప్పై మూడు, ముప్పై నాలుగు శ్లోకాలలో సాత్త్విక ధృతి, రాజస ధృతిని గూర్చి చెప్పుకున్నప్పుడు ఏ విధమైన ఆచరణ ఉంటే వాటిని అలా అంటారో చెప్పుకున్నాం. కాని, ప్రస్తుత శ్లోకంలో ఆచరణ అనే ఊసే లేదు. ఏవి విడవడం జరగదో అది తామస ధృతి అని విచిత్రంగా వింటున్నాము. చూడండి. పైగా, ఈ తామస

ధృతి గల పెద్ద మనిషికి దుష్టుడు అని భగవంతుడే బిరుదు ప్రదానం చేశాడు (**దుర్మేధాః కుత్సిత మేధాః పురుషః**). దుష్ట బుద్ధి కల తామస కర్త యొక్క ధృతి తామసధృతి.

ఏ ధృతి చేత స్వప్నము, భయము, శోకము, విషాదము, మదము అనే పంచ దోషాలను వ్యక్తి త్యజించడో, అట్టి వాని ధృతి తామస ధృతి. బ్రతుకును దుర్గతి పాలు చేసే ఈ పంచ దోషాలను ఎందుకని విడిచి పెట్టడు? ఇవన్నీ గొప్ప సేవా విషయాలని, విడువ దగినవి కావని అతని దురభిప్రాయము. అందుచేత వీటిని విడిచి పెట్టడు (**విషయ సేవామ్ ఆత్మనః బహు మన్యమానః**). విడిచి పెట్టడం అలా ఉంచి అవన్నీ అవశ్యం ఆచరించ దగిన కర్తవ్యాలని కూడా నిత్యం మనస్సులో భావిస్తాడు. ఇంకేమి వదుల్తాడు? (**మనసి నిత్య మేవ కర్తవ్య రూపతయా కుర్వన్ న విముంచతి**). ఇక్కడే తామస ధృతి దృఢ పడుతూ వజ్రతుల్యంగా మారుతూ ఉంది.

ధృతి అనేది స్వభావతః చాలా గొప్పది. శ్రేష్ఠ మైనది. దానిని నికృష్ట విషయాలలో ప్రవేశ పెట్ట కూడదు. అలా చేయడం వల్ల ఏదీ సఫలం కాదు సరి కదా, అంతా నిష్ఫలమే అవుతుంది.

దుష్టము, తమో దూషిత మైన తామస బుద్ధి తామస ధృతి సహాయంతో చెలరేగి స్వప్నిస్తూ ఉంటుంది (**స్వప్నం**). స్వప్నం అంటే నిద్ర అని అర్థం. కాని, నిద్ర అని అనకుండా స్వప్నం అని భగవంతుడు వెటకారంగా వ్యాఖ్యానించడం జరిగింది.

తామస ధృతి వల్ల ఏదీ ఆచరించక పోగా, పంచ దోషాల నుండి విడి పడటానికి కూడా ఇష్ట పడని దుష్ట శిఖామణి స్వప్న విహారమే మహాకార్యంగా నిర్వహిస్తూ ఉంటాడు. అంటే, నిద్ర పోయాడా, నిద్రలో కలలు గంటూ ఊరేగుతూ ఉంటాడు. ఎందుకంటే, కలలో కర్త లేడు. ఉండేది భోక్త. కనుక స్వప్నానుభవంలో తన్మయుడై ఉంటాడు. మేలుకున్నాడా, అప్పుడు కూడా చేసేది ఏమీ లేదు కనుక, మేలుకొనిన తరువాత కూడా పగటి కలలు కంటూ ఉంటాడు. అంటే, గాలిమేడలు నిర్మించుకొని వాటిలో విహరిస్తూ ఉంటాడు. ఈ విషయంలో గొప్ప పట్టుదల తోనే వ్యవహరిస్తూ ఉంటాడు. అందుచేత, దానిని ధృతి అనవలసి వచ్చింది. అదే తామస ధృతి.

ప్రశస్తమైన మానవ జన్మను పొంది, పురుషార్థ సాధనకు అనువైన మనోబుద్ధులను కలిగి ఉండి కూడా, సన్మార్గంలో చరించ లేక గాలిమేడలలో కులికే దురదృష్టము మానవ జన్మకే కళంకము. ఇలాంటి నికృష్టులు ఉత్కృష్ట మార్గంలో చరించే లాగా, వారి పక్షాన నిలబడి పరమేశ్వరుని వేడుకుంది చైతన్య గీతిక.

పల్లవి : **సాధన సాగనీ స్వామీ**
**వేదనలన్నీ ఆగిపోనీ** ॥ సాధన ॥

చరణములు : (1) **గాలిమేడలు కట్టు గాలిమనసు**
**గాలి పోగానే జాలి బ్రతుకు**
**నిలకడ లేని నీటి బుడగిది**
**కడకు నిలువునా కాలిపోతది** ॥ సాధన ॥

(2) **అడుగంటు చుండె ఆయువు తైలము**
**కొడిగట్టు చుండె జీవన దీపము**
**సమయము కాదిది ఏమరుపాటుకు**
**కాలము కాదిది ఏ పొరపాటుకు** ॥ సాధన ॥

తామస ధృతి అంటే ఏమిటో అర్థం చేసుకున్నాం. ఈ విధమైన ధృతి చేత పంచ దోషాలుగా కనిపిస్తున్న



కర్మలలో వ్యవహరించే దుష్టుడైన తామసకర్త, తన ప్రవృత్తిని తాను ప్రశంసించుకుంటూ అందరినీ అప్రయోజకులుగా భావిస్తాడు. ఈ విధమైన నిర్ణయము కూడా అతనిలో చాలా దృఢంగా ఉంటుంది. అందుకే అది తామసధృతి (**సా ధృతిః తామసీ**).

ఇంత వరకు గుణ భేదాన్ని బట్టి త్రివిధ త్యాగము, త్రివిధ కర్మలు, త్రివిధ కర్తలు, త్రివిధ జ్ఞానము, త్రివిధ బుద్ధి, త్రివిధ ధృతిని గూర్చి చెప్పుకున్నాం. కర్మాచరణము చేసి నపుడు కర్మఫలాలు మనకు అందుతూ ఉంటాయి. కర్మఫలాన్ని ఆశించే మనం కర్మ చేస్తాము. ఆ ఫలం సుఖమై ఉండా లనుకుంటామే గాని దుఃఖంగా ఉండాలని కోరుకోము. వచ్చే వన్నీ సుఖాలు కాక పోవచ్చు. కాని, సుఖం అంటూ వస్తే మాత్రం అది కూడా త్రివిధం గానే ఉంటుంది. సాత్త్విక సుఖము, రాజస సుఖము, తామస సుఖముగా ఉంటుంది. ఆ సుఖం యొక్క స్వభావము, దానిని మనం పొందిన విధానము, అది ఉండే కాలము - వీటిని బట్టి అది ఎలాంటి సుఖమో నిర్ణయించ వచ్చు. ఇప్పుడు త్రివిధ సుఖాలను గూర్చి ప్రసంగిస్తున్నాడు పరమేశ్వరుడు.

*సుఖ విషయాన్ని ప్రస్తావిస్తున్నాడు.*

**సుఖం త్విదానీం త్రివిధం శృణు మే భరతర్షభ ।**
**అభ్యాసా ద్రమతే యత్ర దుఃఖాన్తం చ నిగచ్ఛతి ॥** 36

***సుఖం-తు-ఇదానీం-త్రివిధం-శృణు-మే-భరతర్షభ***
***అభ్యాసాత్-రమతే-యత్ర-దుఃఖాంతం-చ-నిగచ్ఛతి***

| | | | | | |
|---|---|---|---|---|---|
| భరతర్షభ | = | అర్జునా! | మే | = | నా చేత |
| యత్ర | = | ఎక్కడ | ఇదానీం | = | ఇప్పుడు |
| అభ్యాసాత్ | = | అభ్యాసము వలన | త్రివిధం | = | మూడు విధములైన |
| రమతే | = | రమిస్తున్నాడో | సుఖం తు | = | సుఖమును |
| దుఃఖాంతం చ | = | దుఃఖనాశమును కూడ | శృణు | = | వినుము |
| నిగచ్ఛతి | = | పొందుతున్నాడో | | | |

**భరత శ్రేష్ఠా! అర్జునా! సుఖము కూడా మూడు విధాలుగా ఉంది. చెబుతాను, విను. అభ్యాసము వల్ల మనిషి ఆ సుఖంలో రమిస్తూ దుఃఖాన్ని పోగొట్టు కుంటున్నాడు.**

## వ్యాఖ్య

గుణ భేదం చేత క్రియ కారకాదులకు త్రివిధ భేదాన్ని చెబుతూ, త్యాగము వద్ద ప్రారంభమైన త్రివిధ గుణ విశ్లేషణము జ్ఞానము, కర్మ, కర్త, బుద్ధి, ధృతి అనే ఆరు విషయాలను విశ్లేషణాత్మకంగా వివరించి, చివరగా సుఖ మనే చోట ఈ త్రివిధ ప్రకరణం ఆగింది.

ఏదైనా చివరగా ఆగ వలసింది సుఖప్రాప్తి తోనే. నదు లన్నీ పారి పారి సముద్రంలో విలీనమై శాంతించి నట్లు, కర్మ లన్నీ సాగి సాగి ఒక దశలో సుఖాంబోధిలో ప్రవేశించి విలీనమై పోతాయి.

జీవితంలో ఎవరెన్ని అనుభవించినా, వాస్తవానికి ఉన్నవి రెండే. ఒకటి సుఖము. రెండవది దుఃఖము. మొదటిది ఎప్పుడూ ఉండాలని, ఎప్పటికీ పోకూడ దని అందరూ ఆలోచిస్తారు. రెండవది ఎప్పుడూ ఉండ కూడదని, ఎప్పటికీ రాకూడ దని అందరూ ఆశిస్తారు. అలాగే జరిగితే అందరూ శాంతిని పొందుతారు. కాని, మన అనుభవం అందుకు భిన్నంగా ఉంది.

సుఖాలు మనకు తెలియనివి కావు. సుఖాలు వస్తాయి. ఉంటాయి. మరొక దశలో లేకుండా పోతాయి. అలాగే దుఃఖాలు లేని దశ కూడా మన అనుభవంలో ఉంది. ఉన్న దుఃఖాలు దూరం కావడం మనం చూశాము. అలా దూరమైన దుఃఖాలు మనకు ఇష్టం లేక పోయినా, మనం పిలవక పోయినా తిరిగి వస్తూనే ఉంటాయి. ఇక్కడే మన ఆశలకు రూపం రావడం లేదు. సుఖానికి ప్రాణం పోయలేక మానవాళి అలసి పోతోంది. మనిషి ఆశించే నిత్య సుఖాన్ని తెలుసుకునే ముందు గుణ భేదాన్ని బట్టి త్రివిధ సుఖాన్ని అర్థం చేసుకుందాము.

అర్జునా! దేని యందు ***(యత్ర)*** అభ్యాసం వల్ల మనిషి క్రీడించడం జరుగుతుందో ***(అభ్యాసాత్ రమతే)***, దుఃఖాంతమును పొందడం జరుగుతుందో ***(దుఃఖాన్తం నిగచ్ఛతి)***. అట్టి సుఖము త్రివిధ మని ***(త్రివిధం సుఖం)*** నా నుండి ఆలకించు ***(శృణు మే)*** అంటున్నాడు భగవంతుడు.

అభ్యాసము అంటే ఆవృత్తము. అభ్యాసం వల్ల, అంటే ఆవృత్తము వల్ల కలిగే సుఖం. ఆవృత్తము అంటే 'మరల కలిగిన దాని యందు' అని అర్థము. మన అనుభవములో ఉన్నదే, తిరిగి కలిగిన దాని యందు సుఖాను భూతిని పొందడము అభ్యాసము. ఈ విధమైన అభ్యాసము వల్ల ఏర్పడే సుఖానుభూతిలో దుఃఖం నశిస్తుంది; శాంతిస్తుంది అని అర్థము. పెరుగును చిలికితే వెన్న పుట్టినట్లు, అభ్యాసం చేత ఆనందానుభూతిని, దుఃఖ శాంతిని పొందడం జరుగుతుంది.

*ఇక త్రివిధ సుఖాలలో ముందుగా సాత్త్విక సుఖాన్ని గూర్చి చెబుతున్నాడు.*

యత్త దగ్రే విష మివ పరిణామేఽ మృతోపమమ్ ।
తత్సుఖం సాత్త్వికం ప్రోక్త మాత్మబుద్ధి ప్రసాదజమ్ ॥ 37

***యత్-తత్-అగ్రే-విషం-ఇవ-పరిణామే-అమృతోపమం***
***తత్-సుఖం-సాత్త్వికం-ప్రోక్తం-ఆత్మబుద్ధి ప్రసాదజం***

| | | | |
|---|---|---|---|
| యత్ తత్ | = ఏ సుఖము | ఆత్మబుద్ధిప్రసాదజం | = తన యొక్క బుద్ధి ప్రసన్నత చేత కలిగే |
| అగ్రే | = మొదట | తత్ | = ఆ |
| విషం ఇవ | = విషము లాగా | సుఖం | = సుఖము |
| పరిణామే | = అంతము నందు | సాత్త్వికం | = సాత్త్విక మని |
| అమృతోపమం | = అమృతతుల్యము గాను | ప్రోక్తం | = చెప్పబడినది |

**అర్జునా! ఇది బుద్ధి ప్రసన్నత వల్ల కలిగే సుఖము. మొదట విషం లాగా ఉంటుంది. ఆ తరువాత అమృత తుల్యంగా ఉంటుంది. అదే సాత్త్విక సుఖము.**

### వ్యాఖ్య

మనిషి సుఖాభిలాషి. సుఖ పిపాసి. ఆనందాభిలాషి. ఒకరు ఆశించింది మరొకరు ఆశించక పోవచ్చు. ఒకరికి ఇష్టమైంది మరొకరికి ఇష్టం కాక పోవచ్చు. కాని, సుఖాన్ని అందరూ ఆశిస్తారు. అందరూ సుఖాన్నే వాంఛిస్తారు.

ఎక్కడైతే ఒకరికి సుఖం లభిస్తుందో అక్కడ మరొకరికి సుఖం లభించక పోవచ్చు. అంతే కాదు. ఎక్కడ ఎవరికి సుఖం లభించినా, వారికి ఎప్పుడూ అక్కడే సుఖం లభిస్తుంది అని కూడా చెప్ప లేము. అందుకే, సుఖాభిలాషి ప్రదేశాలు మారుస్తూ ఉంటాడు.



ఒక వ్యక్తి వల్ల అందరికీ సుఖం కలుగుతుందనే దాఖలాలు లేవు. ఒక వ్యక్తి వల్ల ఎవరి కైనా సుఖం కలుగ వచ్చు. అలాగని వారికి కూడా ఆ వ్యక్తి నుండి సదా సుఖం కలుగుతుందని చెప్ప లేము. అందుచేత, వ్యక్తి మనుషులతో సంబంధాలను మార్చుకుంటూ ఉంటాడు.

అనుభవ సుఖాలు ఏవయినా అనిత్యాలే. అనిత్యాలు అంటే రాకపోకలు గలవి. వచ్చిపోయే సుఖాలు. మనిషి ఆశించేది నిత్యసుఖం. అదే స్వరూప సుఖం. రాక తెలియని, పోక అర్థం కాని నిత్యసుఖం.

ఒక కారణంగా ప్రాప్తించే సుఖం ఏదయినా అనిత్యమే. కారణం పోగానే కార్యమైన సుఖం కూడా పోతుంది. మనం ఆనందంగా ఉండే టప్పుడు మనలో ఏముంది? ఎప్పుడైనా ఆలోచించారా? ఆనందం ఉందా, ఆనంద హేతువు ఉందా? సుఖం ఉందా, సుఖహేతువు ఉందా? సుఖం ఉందే గాని సుఖహేతువు లేదు.

కనుక నీవే సుఖం. నీవే ఆనందము. నీవే నీకు ప్రియం. ఏదైనా నీకు అప్రియం కావచ్చు. నీవు నీ కెప్పుడూ అప్రియంగా లేవు. నాకు నే నెప్పుడూ అప్రియంగా లేను ***(కదాచిన్నాహ మప్రియః)***. నేను నాకు ప్రియం కనుకనే సర్వం ప్రియంగా ఉంటుంది. అదే ఆత్మసుఖము.

ఆ వైపు సాగే ప్రయాణంలో లభించే సుఖం సాత్త్విక సుఖం. ఏ మనస్సులో ఆత్మకు సంబంధించిన జ్ఞానము కలుగుతుందో, ఆ మనస్సు విశుద్ధంగా, ప్రసన్నంగా ఉంటుంది. అట్టి ప్రశాంత చిత్తములో స్ఫురించే సుఖము సాత్త్విక సుఖము. ఇది ఆత్మ సంబంధమైన సుఖము.

వివేక వైరాగ్యాదుల కారణంగా నిర్మలమైన బుద్ధిలో ఏ సుఖం అనుభవింప బడుతుందో, అది సాత్త్విక సుఖం. ప్రారంభంలో ఈ సుఖం విషం లాగా గోచరించి పరిణామ క్రమంలో అమృతానుభవమును ప్రసాదిస్తుంది.

ఆత్మ సంబంధమైన సాధనలు అనుభవంలో లేనివి కావడం చేత, వివేక, వైరాగ్య, ధ్యాన, సమాధులు ప్రారంభంలో చాలా శ్రమతో కూడుకొని ఉంటాయి ***( అగ్రే ప్రథమ సంనిపాతే జ్ఞాన వైరాగ్య సమాధ్యారంభే అత్యంత ఆయాస పూర్వకత్వాత్ విష మివ దుఃఖాత్మకం భవతి )***. చాలా శ్రమతో కూడినట్లు ఉంటాయి కనుక అవి విషం లాగా గోచరిస్తాయి. పరిణామంలో సాధనలు పక్వ దశకు రావడం చేత, అంతవరకు విషం వలె తెలిసింది, ఆ తరువాత అమృత తుల్యంగా ఉంటుంది ***( పరిణామే జ్ఞాన వైరాగ్యాది పరిపాకజం సుఖం అమృతోపమమ్ )***. దీనినే సాత్త్విక సుఖం అంటారు ***( తత్ సుఖం సాత్త్వికం ప్రోక్తం )***.

వాస్తవానికి అది ప్రారంభంలో విషమే అయితే పరిణామంలో అమృత రూపాన్ని పొందే అవకాశమే లేదు. విషం విషమే. అమృతము అమృతమే. విషము అమృత మయ్యే ప్రసక్తే లేదు. అందుకే పరమాత్మ **విష మివ** అన్నాడు. 'ఇవ' అంటె 'వలె' అని అర్థం. విషం వలె అనిపించింది కాని విషం కాదు.

కనుక అన్ని సుఖాల లోకి ఉత్తమ మైన సుఖం సాత్త్విక సుఖం. ఇది అనుభవానికి అందింది అంటే, ఆ తరువాత స్వరూప సుఖము అనుభూత మవుతుంది. సాత్త్విక సుఖము కేవలం అంతరంగ సుఖము. బాహ్యంతో సంబంధము లేనిది. అది బుద్ధికి లభించే సుఖం కాదు. బుద్ధిలో లభించే సుఖం.

*ఇక రాజస సుఖాన్ని వివరిస్తున్నాడు.*

విషయేన్ద్రియ సంయోగా ద్యత్త దగ్రేఽ మృతోపమమ్ ।
పరిణామే విషమివ తత్సుఖం రాజసం స్మృతమ్ ॥ 38

***విషయేంద్రియ సంయోగాత్-యత్-తత్-అగ్రే-అమృతోపమం***
***పరిణామే-విషం-ఇవ-తత్-సుఖం-రాజసం-స్మృతం***

యత్ తత్ = ఏ సుఖము
విషయేంద్రియ సంయోగాత్ = విషయేంద్రియ సంయోగము వలన
అగ్రే = మొదట
అమృతోపమం = అమృతతుల్యము గను
పరిణామే = అనంతరము
విషం ఇవ = విషతుల్యము గను
తత్ = ఆ
సుఖం = సుఖము
రాజసం = రాజసిక మైనదిగ
స్మృతం = చెప్పబడినది

**అర్జునా! ఇది ఇంద్రియాలు విషయాలతో కలవడం వల్ల ఏర్పడే సుఖము. మొదట అమృత తుల్యంగా ఉంటుంది. ఆ తరువాత విషం లాగా మారుతుంది. అదే రాజస సుఖము.**

**వ్యాఖ్య**

ఇంద్రియాలు ఇంద్రియ విషయాలతో కలిసి నపుడు ఏర్పడే సుఖము రాజస సుఖము ***(విషయేన్ద్రియ సంయోగాత్ యత్, తత్ సుఖం జాయతే)***. ఇది మొదట అమృతం వలె ఉండి, పరిణామంలో విషం లాగా అనిపిస్తుంది ***(అగ్రే అమృత సమం, పరిణామే విష మివ)***. సాత్త్విక సుఖానికి పూర్తిగా భిన్న మైనది. సాత్త్విక సుఖము అంతరంగమునకు సంబంధించింది కాగా, రాజస సుఖము బాహ్యమునకు సంబంధించింది. విషయ సంబంధ మైనది.

బాహ్య విషయాలతో ఇంద్రియ సంయోగము వల్ల ఏర్పడే సుఖము సుఖము కాదు. వాస్తవానికి అది దుఃఖము యొక్క ప్రతిరూపమే. అది భోగానందమే కనుక మనిషిని రోగాల వాత పడేస్తుంది.

విషయ భోగాలు ఆద్యంతాలు కలిగి ఉంటాయి. వాటి వల్ల కలిగే సుఖాలు కూడా ఆద్యంతాలు కలిగి ఉంటాయి కనుక, అవి అనిత్యాలు.. అధిక శ్రమతో ప్రాప్తిస్తాయి. ప్రాప్తించి శ్రమింప చేస్తాయి. దుఃఖాన్ని పంచి, మనిషిని దుర్భరంగా పీడించి నిష్క్రమిస్తాయి. ఈ సత్యాన్ని గ్రహించ లేని అవివేకులు, విషయ భోగాల యందు నిత్య సుఖ ముందని భ్రమించి వాటి యందు రమిస్తూ ఉంటారు. వీరు పశు జీవనానికి భిన్నంగా లేరు అన్నారు భాష్యంలో శ్రీ శంకరాచార్య స్వామి ***(అత్యన్త మూఢానాం ఏవ హి విషయేషు రతిః దృశ్యతే, యథా పశు ప్రభృతీనామ్)***. కనుక ఈ విషయేంద్రియ సుఖాన్ని రాజస సుఖము అన్నారు.

విషయ సుఖాలలో సుఖం అసలే లేక పోలేదు. సుఖము అసలే లేకపోతే, వాటి నెవ్వరూ వాంఛించరు. కనుక విషయాలలో సుఖం అసలే లేదని కాదు, అసలైన సుఖం లేదు. స్వల్ప సుఖాలు, అల్ప సుఖాలు ఉంటాయి. అందుకే అవి అనిత్య సుఖాలు. ఆదిలో అమృతాన్ని పంచి, ఆ తరువాత విషాన్ని దించడమే విషయంగా పెట్టుకుంటాయి. అట్టి అనిత్య సుఖాన్ని రాజస సుఖము అంటారు ***(తత్సుఖం రాజసం స్మృతమ్)***.

ఇక తామస సుఖాన్ని గూర్చి చెబుతున్నాడు.

**య దగ్రే చానుబన్ధే చ సుఖం మోహన మాత్మనః ।**
**నిద్రాలస్య ప్రమాదోత్థం త త్తామస ముదాహృతమ్ ॥** 39

***యత్-అగ్రే-చ-అనుబన్ధే-చ-సుఖం-మోహనం-ఆత్మనః***
***నిద్రాలస్య ప్రమాదోత్థం-తత్-తామసం-ఉదాహృతం***

యత్ = ఏ సుఖము
అగ్రేచ = మొదట
అనుబంధే చ = అంతము నందు
ఆత్మనః = తనకు
మోహనం = మోహమును కలుగ జేయునది



నిద్రాలస్యప్రమాదోత్థం = నిద్ర, అలసత్వము, ప్రమాదము, వీటి వలన జనించినది యైన
తత్ = ఆ
సుఖం = సుఖము
తామసం = తామస మని
ఉదాహృతం = చెప్పబడినది

**అర్జునా! ఇది తామస సుఖము. ఆద్యంతం మనిషికి మోహాన్ని కలిగిస్తుంది. నిద్ర, సోమరితనము, ప్రమాదము వల్ల కలుగుతుంది.**

**వ్యాఖ్య**

ప్రారంభంలో విషం లాగా కనిపించి, పరిణామ క్రమంలో అమృత రూపంగా అనుభవానికి అందేది సాత్త్విక సుఖము. ప్రారంభంలో అమృత మనిపించి, పరిణామంలో విషం లాగా కనిపించేది రాజస సుఖము. ప్రారంభము లోను ***(అగ్రే)***, అంతము నందును ***(అనుబన్ధే)*** తనకు ***(ఆత్మనః)*** మోహాన్ని కలిగించేది ***(మోహనమ్)*** తామస సుఖము.

**ఇదీ ఒక సుఖ మేనా?**

ఆద్యంతాల యందు మోహముతో నిండింది, అజ్ఞానంతో కూడింది కూడా ఒక సుఖ మేనా? అంతా మోహమయం. కనుకనే దానిని నిద్రాలస్య ప్రమాదోత్థ మంటున్నాడు.

దాని పుట్టుకే మహా భయంకరంగా ఉంది. అలాంటిది సుఖాన్ని ప్రసాదిస్తుందా? మోహ రూపమైన ఈ తామస సుఖం నిద్ర నుండి, సోమరితనం నుండి, పొరపాటు నుండి పుడుతుంది ***(నిద్రా చ ఆలస్యం చ ప్రమాదశ్చ ఇతి ఏతేభ్యః సముత్తిష్ఠతి)***.

నిద్రలో సుఖ ముందా? సుఖం అనేది అనుభవింప బడాలి. నిద్రలో అనుభూతి ఎక్కడుంది? అనుభవాన్ని పొంద వలసిన వాడే కదా నిద్రలో కూరుకు పోయింది? అనుభవించే వాడే లేనపుడు ఇక అనుభూతి ఎక్కడిది? కనుక నిద్రలో ఉండేది సుఖం కాదు. సుఖాభాస. అలాంటి నిద్ర నుండి పుట్టే సుఖము కూడా ఒక సుఖ మేనా?

సుఖ మనేది ప్రయత్నం వల్ల నైనా కలుగుతుంది. లేదా సహజంగా నైనా అనుభవానికి అందుతుంది. అంతేగాని, పొరపాటు వల్ల కూడా కలుగుతుందా? కాని, తామస సుఖం పొరపాటు వల్ల ***(ప్రమాదం)*** కలుగుతుందట. పొరపాటు వల్ల సుఖ మెలా కలుగుతుంది? పొరపాటు వల్ల సుఖం కలిగినట్లు అనిపిస్తుంది. అంతే.

జన్మలో జరిగిన అతి పెద్ద పొరపాటు జీవభ్రాంతి. అదెలా పోతుందో అర్థం గాక జన్మలే దొర్లి పోతున్నాయి. అది చాలదు అన్నట్లు మధ్యలో పొరపాట్లు, గ్రహపాట్లూను.

అయోమయంగా, మోహమయంగా, కళ్ళు మూసి మత్తు లోకి జారి పోవడం సుఖ మని భ్రమించడం, అలాగే పొరపాట్లు సుఖోత్పత్తి స్థానా లనుకోవడం అజ్ఞానానికి పరాకాష్ఠ. తమస్సు అంటే మరి అజ్ఞానమే కదా!

తమస్సులో తారాడుతూ, పొరపాట్లు, ఏమరుపాట్లు చేస్తూ అదే తేజస్సు అని భ్రమించడం కాకుండా, నిజమైన తేజస్సులో జీవించేటట్లు అనుగ్రహించ మని భగవంతుని ప్రార్థిస్తే, ఈ మోహ జాడ్యం మెల్ల మెల్లగా తొలగి పోయే అవకాశం ఉంది.

పల్లవి : **ఎటులనో? ఏగుటేలనో!**
**ఆ పొరపాటు - ఈ గ్రహపాటు** ॥ **ఎటులనో** ॥

చరణములు : (1) ఇచ్చినట్లే బ్రతుకు నిచ్చి
నిద్రలో సగమును దోచినావా?
వద్దీ బుద్ధిని వదలని వరదా!
అసలు ఏమిటో తెలుపవా! ॥ ఎటులనో ॥

(2) శరధిని దాటిన దాశరథి
భవ జలధికి వారధి
నాకమైనా నరకమైనా
ఆ సన్నిధి అక్షయనిధి ॥ ఎటులనో ॥

అని తమస్సు నుండి బయట పడే మార్గాన్ని గానం చేసి చూపింది చైతన్య గీతిక.

నిద్ర నుండి, ప్రమాదం నుండి కలిగింది అనడం ఎంత విడ్డూరమో, సోమరితనం నుండి పుట్టింది అనడం అంత కన్నా ఆశ్చర్యం (*ఆలస్యః*). ఏ అనుభవానికీ నోచుకోనిది సోమరితనము. దాని నుండి పుట్టే సుఖము ఎలాంటిదో ఊహించడం ఎంతటి సోమరి కైనా సాధ్యమే. అందుకే దానిని తామస సుఖము అన్నారు.

**ఆఖ్యాయిక**

ఒక గ్రామంలో ఇద్దరు మిత్రులు ఉండే వారు. ఒకడిని మించిన సోమరి ఇంకొకడు. ఊరిలో అదే పనిగ పగటి పూట కూడా నిద్రిస్తూ ఉంటే గ్రామస్థులు, కుటుంబీకులు గొడవ చేస్తారని, ఇద్దరు మిత్రులు పరస్పరం మాట్లాడుకొని, ఊరు బయటకు ఏదో కార్యార్థము వెళ్ళినట్లు వెళ్ళి, ఒక చెట్టు నీడను చూసుకొని నిద్ర పోతూ ఉండే వారు.

ఒకనాడు రహదారి ప్రక్కనే ఉన్న నేరేడు చెట్టు నీడలో ఇద్దరూ ప్రక్క ప్రక్కనే వెలికిల పడుకున్నారు. పైన చెట్టుకు నేరేడు పండ్లు గుత్తులు గుత్తులుగా వేళ్ళాడున్నాయి. అవి తిని పడుకుంటే బాగుణ్ణు అనుకుంటాడు అందులో ఒకడు. మరి, వాటిని తినాలి అంటే లేవాలి. చెట్టెక్కాలి. ఇదంతా చేయాలంటే, సోమరితనాన్ని ఏ ఉట్టి కెక్కించాలి? పడుకొని అలా ఆలోచిస్తూ ఉంటే, ఈ లోగా చెట్టుపై నుండి నేరేడు పండు ఒకటి జారి అతని ప్రక్కనే పడింది. సోమరికి నోరూరింది.

అదే సమయానికి ఒక బాటసారి ఆ దారిన పోతున్నాడు. ఇదే మంచి అవకాశం అని భావించిన సోమరి, 'అయ్యా! అయ్యా! దయ చేసి ఇటు రండి' అని బాటసారిని అర్థించాడు. బాటసారి పాపం, ఏమైందో అనుకుంటూ ఆదుర్దాగా దగ్గరకు వచ్చాడు. అతడితో ఈ సోమరి, 'మరోలా అనుకోకండి. నా ప్రక్కనే పడి ఉన్న నేరేడు పండును కాస్త నా నోట్లో పడేసి పొండి, పుణ్య ముంటుంది' అన్నాడు.

ఆ మాటలకు బాటసారి కోపోద్రిక్తు డయ్యాడు. 'ఛీ! నువ్వసలు మనిషేనా? నీదీ ఒక బ్రతుకేనా?' అంటూ, తిట్టిన తిట్టు తిట్టకుండా, మొహం వాచేటట్లు చీవాట్లు వేసి తన దారిన తాను పోయాడు.

ప్రక్కనే పడుకొని ఉన్న రెండో సోమరి, 'అలాగే కావాలి, వెధవకి. బాగా పడ్డాయి. లేకపోతే, నిన్న నా ముఖం మీద కాకి రెట్ట వేస్తే, కాస్త తుడవరా అంటే, లేచి తుడిస్తేనా! ఈ రోజు బాగా పూజ అయిందిలే' అని మహా సంతోష పడిపోయాడు.

ఇవి కూడా సుఖాలే అయితే, ఇక మాట్లాడే దేముంటుంది? ఇంతటితో, గుణ భేదాన్ని స్పృశిస్తూ సాగిన త్రివిధ గుణ విశ్లేషణము సమాప్త మైంది.

ప్రకరణ ఉపసంహారాన్ని సూచిస్తూ తరువాత శ్లోకం చెబుతున్నాడు.



**న తదస్తి పృథివ్యాం వా దివి దేవేషు వా పునః ।** 40
**సత్త్వం ప్రకృతిజై ర్ముక్తం య దేభిః స్యా త్త్రిభి ర్గుణైః ॥**

*న-తత్-అస్తి-పృథివ్యాం-వా-దివి-దేవేషు-వా-పునః*
*సత్త్వం-ప్రకృతిజైః-ముక్తం-యత్-ఏభిః-స్యాత్-త్రిభిః-గుణైః*

| | | | | | |
|---|---|---|---|---|---|
| ప్రకృతిజైః | = | ప్రకృతి వలన జనించిన | స్యాత్ | = | కలదో |
| ఏభిః | = | ఈ | తత్ | = | అది |
| త్రిభిః | = | మూడైన | పృథివ్యాం వా | = | భూలోకము నందు గాని |
| గుణైః | = | గుణముల చేత | దివి | = | స్వర్గలోకము నందు గాని |
| ముక్తం | = | విడువ బడిన | పునః | = | మరల |
| సత్త్వం | = | సత్త్వము | దేవేషు వా | = | దేవతల యందు గాని |
| యత్ | = | ఏది | న అస్తి | = | లేదు |

**అర్జునా! త్రిగుణాలు ప్రకృతి నుండి పుట్టాయి. ఈ గుణాల నుండి విడి పడిన ప్రాణి భూలోకంలో లేదు. స్వర్గంలో లేదు. దేవలోకం లోనూ లేదు.**

**వ్యాఖ్య**

మానవుల స్వభావంలో, ప్రవర్తనములో ప్రధాన పాత్రను పోషిస్తున్న సత్త్వ రజ స్తమో గుణాలను, స్వరూప స్వభావ ప్రభావాలను విస్తరించి చెప్పుకున్నాం. ఇంతగా చెప్పు కున్నది ఏదో పొందాలని కాదు, పోగొట్టు కోవాలని. గుణాల నుండి విడి పడాలని, గుణాతీత స్థితిని చేరుకోవాలని.

గుణాలు - గుణాలు అంటూ చెప్పుకోవడమే గాని, బాగా పరిశీలించి అర్థం చేసుకుంటే, అక్కడ గుణా లంటూ ఏమీ లేవు. అన్నీ దోషాలే. దోషాలు లేని సమస్థితి పరమాత్మలో ఉంటుందే గాని (*5 వ అ - 19 వ శ్లో*), ప్రకృతిలో ఉండదు. గుణా లన్నీ ప్రకృతి నుండే పుట్టాయి. మాయ నుండే ఉద్భవించాయి. అందుకే వాటిని ప్రకృతి సంభవాలని పద్నాల్గవ అధ్యాయం లోనే చెప్పుకున్నాం (***సత్త్వం రజ స్తమ ఇతి గుణాః ప్రకృతి సంభవాః :*** *14 వ అ - 5 వ శ్లో*).

గుణాలకు ఉత్పత్తి స్థానం ప్రకృతి. ప్రకృతి మోహంలో పడటం వల్లనే జీవత్వం ప్రాప్తించింది. జీవత్వమే బంధం. అది గుణ సంబంధము. జీవబంధం నుండి విడి పడాలి అంటే, గుణ బంధం నుండి విడి పడాలి. గుణాతీత స్థితికి చేరి పోవాలి. అలా చేర్చే ప్రయత్నంలో భాగం గానే భగవద్గీత ఇంతగా విస్తరించి గుణ ప్రసంగం చేసింది. వాస్తవానికి గుణ ప్రాధాన్యాన్ని ప్రవచించడం భగవద్గీత ఉద్దేశం కాదు. నిర్దోషమై, గుణాతీత మైన పరబ్రహ్మ విషయమును నిర్ధారించడమే గీతా తాత్పర్యము. కనుకనే, ప్రారంభం లోనే శ్రీకృష్ణ పరమాత్మ తన హృదయం లోని మాటను సూటిగా చెప్పడం జరిగింది. ***నిస్త్రైగుణ్యో భవార్జున !*** - అర్జునా! త్రిగుణాల నుండి విడిపడు. గుణాతీతుడివి కా! అని సాంఖ్యయోగం లోనే ప్రవచించాడు (*2 వ అ - 45 వ శ్లో*).

నిర్దోషము, గుణ రహితము అయిన బ్రహ్మమును విడిచి పెడితే, సృష్టి అంతా త్రిగుణ మిళితమే. ప్రకృతి స్వరూపమే. మాయామయమే. కనుక, మానవులే కాదు, స్వర్గాది లోకాల లోని పుణ్య పురుషులు గాని, సురాది లోకాల లోని దేవతలు గాని, ఎవ్వరూ త్రిగుణాల నుండి విడిపడిన వారు కారు. అలాంటిది ప్రకృతి లోనే, లేదా సృష్టి లోనే ఎక్కడా కనిపించదు (***న తదస్తి***) అని చెబుతూ గుణ ప్రకరణాన్ని ఇక్కడ ఉపసంహరిస్తున్నాడు.

## వర్ణ విభాగము - ఆచార వ్యవహారము

సృష్ట్యాదిలో ధర్మ స్థాపన కొరకు పరమేశ్వరుడు ఒక వ్యవస్థను ఏర్పాటు చేయ వలసి వచ్చింది. అదే వర్ణ వ్యవస్థ. గుణ ప్రధానం గాను, కర్మ ప్రధానం గాను, సమాజ అభ్యుదయాన్ని ఆకాంక్షిస్తూ నియమించిన వర్ణ వ్యవస్థ. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర విభాగము. ఇది భేదంలో అభేదాన్ని దర్శించే పవిత్ర మార్గం.

ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగము కీలకపాత్రను పోషిస్తుంది. అందులోని నియమా లన్నీ ప్రజాస్వామ్య పరిరక్షణ కొరకే గాని విధ్వంసం కొరకు కాదు. ఎవరైనా, ఎక్కడైనా రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తిస్తే, దాని వల్ల రాజ్యంలో సంక్షోభం ఏర్పడితే, అది వ్యక్తుల దోషమే గాని, రాజ్యాంగ లోపము కాదు. ఏ వ్యవస్థలో నైనా, చివరికి సృష్టి కార్యంలో కూడా, ఈ నియమ నిబంధనలు విలక్షణంగా లేవు.

వర్ణ వ్యవస్థ అలాగే ఏర్పడింది. అది గుణకర్మ ప్రధానంగా ఉంటుంది. వర్ణ విభాగము స్వభావం వల్ల పుట్టిన గుణాల కారణంగా ఏర్పడింది. కనుక స్వభావాన్ని ముందుగా అర్థం చేసుకోవాలి.

స్వభావము అంటే త్రిగుణాత్మక మైన మాయ, లేదా ప్రకృతి. గుణాలకు ప్రభవ స్థానం మాయ కనుక, గుణాలు స్వభావ ప్రభవములు ***( స్వభావ ప్రభవై ర్గుణైః )***. ఈ విధంగా, అంటే గుణానుసారంగా కర్మలు నిర్ణయింప బడతాయి. ఎవరి గుణానికి అనుగుణమైన కర్మలో వారు ప్రవర్తించ వచ్చు. వైద్య వృత్తిపై ఆసక్తి ఉండి, వైద్య కళాశాలలో స్థానం లభించ లేదని, సాంకేతిక పరమైన విద్యల లోకి అనాసక్తితో ప్రవేశించ నవసరం లేదు.

గుణాన్ని బట్టే కర్మ ఉంటుందని ఈ దశలో నేను చెప్ప నవసరం లేదనుకుంటాను. కనుక, ఎవరిలో ఏ గుణం ప్రధానంగా ఉంటే, ఆ గుణానికి అనుగుణమైన కర్మను ఈశ్వరార్చనగా ఆచరించి అంతఃకరణ శుద్ధిని పొంది, జ్ఞానానికి సిద్ధపడ వచ్చు. నాలుగు వర్ణాల వాళ్ళు అలా తరించ వచ్చు. అభేద దర్శనమునే పరమార్థంగా భావించి ప్రమాణంగా శోభిస్తున్న వేదాంత శాస్త్రము భేదాన్ని అంగీకరించదు. భేదానికి శాస్త్రంలో చోటే లేదు.

ఈ వర్ణ వ్యవస్థ అంతర్జాతీయంగా, ప్రతి దేశం లోను, ప్రతి కాలం లోను తెలియకనే కొనసాగుతు న్నప్పటికీ, భారతదేశంలో దానికి సంబంధించిన స్పృహ ఉండటం లోపం కాదు, శాపం కాదు; ఒక గొప్ప వరం. వరణీయం.

కాలం మారింది. పరిస్థితులు మారాయి. వర్ణ వ్యవస్థ ఏ సమాజాని కైనా అతికినట్లు సరి పోతుంది. కాని, మానవుల మస్తిష్కాల నుండి విరజిమ్మ బడుతున్న విషం నేటి సమాజంలో వర్ణ వ్యవస్థను భయంకరంగా చూస్తోంది.

విషయం ఎవరికీ పట్టడం లేదు. అందరికీ పేర్లతో, పదాల తోనే పేచీ లొస్తున్నాయి. అవసరం లేదనుకుంటే పదాలను ప్రక్కన పెట్టండి. దోషం లేదు. పేర్లు తలలో పేలు లాగా కుడుతూ ఉంటే, వాటిని కూడా మరొక ప్రక్కన పెట్టేయండి. కొన్ని పండ్లు తొక్కలు తీసి తిన వలసి ఉంటుంది. కొన్ని పళ్ళను తొక్కలతో తింటేనే మంచిది. తొక్క, పిక్కల జోలికి పోకుండా, రసపానం చేసి రసానుభూతిని (ఆనందానుభూతిని) పొందమని చెప్పేందుకే చైతన్య భగవద్గీత. ఇక చదవండి.

**బ్రాహ్మణ క్షత్రియవిశాం శూద్రాణాం చ పరంతప ।**
**కర్మాణి ప్రవిభక్తాని స్వభావ ప్రభవై ర్గుణైః ॥** 41

*బ్రాహ్మణ-క్షత్రియవిశాం-శూద్రాణాం-చ-పరంతప*
*కర్మాణి-ప్రవిభక్తాని-స్వభావ-ప్రభవైః-గుణైః*

పరంతప = అర్జునా!
బ్రాహ్మణక్షత్రియవిశాం = బ్రాహ్మణక్షత్రియ వైశ్యులకు
శూద్రాణాం చ = శూద్రులకు
స్వభావ ప్రభవైః = స్వభావముచే గలిగిన
గుణైః = గుణముల చేత
కర్మాణి = కర్మములు
ప్రవిభక్తాని = వేర్వేరుగ విభజింప బడినవి

**అర్జునా! నాలుగు వర్ణాల వారికి వారి వారి స్వభావాన్ని బట్టి గుణాలు ఏర్పడతాయి. వాటి ననుసరించి కర్మలు నియమింప బడతాయి.**

### వ్యాఖ్య

కర్మలు, కర్మ సాధనాలు, కర్మఫలాలు - ఈ మూడిటి యొక్క స్వరూపమే సంసారము. ఇది త్రిగుణాత్మకము. అవిద్యా కల్పితము. సత్త్వ రజ స్తమో గుణాత్మకమైన సమస్త సంసారము, కారణంతో సహా అనర్థ దాయకము అని ప్రతిపాదిస్తూ, పదిహేనవ అధ్యాయారంభం లోనే ***ఊర్ధ్వమూలం*** అంటూ సంసారానికి వృక్ష రూపకాన్ని కల్పించడం జరిగింది.

వృక్ష రూప సంసార వర్ణనము సంసార వృక్ష ఛాయలో విశ్రమించ డానికి కాదు. అసంగ మనే దృఢమైన ఖడ్గం చేత దానిని సమూలంగా ఖండించి, అంతకు మించిన, పరమోత్కృష్ట మైన స్థానాన్ని, తిరిగి రావడ మనేది లేని పరంధామాన్ని ***( యద్గత్వా న నివర్తన్తే తద్ధామ పరమం మమ)*** అన్వేషించి పొందడానికి అనే విషయాన్ని అక్కడే నిర్దేశించడం జరిగింది.

ఇదిలా ఉండగా, సర్వమూ త్రిగుణాత్మక మని, ప్రకృతి పరిణామమే నని నిర్ణయమై పోయింది కనుక, సంసార ప్రవృత్తికి త్రిగుణాలే కారణ మని నిర్ణయించడం జరిగింది. అలాంటప్పుడు సంసార కారణ నివృత్తి ఎలా జరుగుతుంది? అనే సందేహము అనివార్యంగా తలెత్తుతుంది. దానిని కూడా నివారించ వలసి ఉంది. అలా నివారించడం జరిగితే, సమస్త గీతాశాస్త్రాన్ని ఉపసంహరించి నట్లు అవుతుంది. శ్రుతుల, స్మృతుల యొక్క తాత్పర్యం ఇదే నని ***(ఏతా వానేవ చ సర్వ వేద స్మృత్యర్థః)***; ఇదే పురుషార్థ సిద్ధికి ప్రయత్నించు వారు ఆచరించ దగినది ***( ఇచ్ఛద్భిః అనుష్ఠేయః )*** అని కూడా చెప్ప వలసి ఉంది. అందుచేత ***బ్రాహ్మణ క్షత్రియ విశాం*** అనే నూతన ప్రకరణమును ఆరంభించి ప్రసంగించడం జరుగుతోంది.

*__జ్ఞానాత్ మోక్షా ఇతి -__ జ్ఞానం ద్వారానే ముక్తి సిద్ధిస్తుంది. జ్ఞానం సిద్ధించాలంటే అంతఃకరణ శుద్ధి ఉండాలి. దానికి కర్మయోగమే సాధనము. కనుక, తన స్వభావానికి అనుగుణ మైన కర్మల ద్వారా పరమేశ్వరుని ఆరాధించి చిత్తశుద్ధిని పొందాలి. ఆయా వర్ణాల వారి గుణాలకు అనుగుణమైన కర్మలను గూర్చి భగవానుడు చెబుతున్నాడు.*

**శమో దమ స్తప శ్శౌచం క్షాన్తి రార్జవ మేవ చ ।**
**జ్ఞానం విజ్ఞాన మాస్తిక్యం బ్రహ్మకర్మ స్వభావజమ్ ॥** 42

*శమః-దమః-తపః-శౌచం-క్షాంతిః-ఆర్జవం-ఏవ-చ*
*జ్ఞానం-విజ్ఞానం-ఆస్తిక్యం-బ్రహ్మకర్మ-స్వభావజం*

శమః = మనో నిగ్రహము

| | | | | | |
|---|---|---|---|---|---|
| దమః | = | ఇంద్రియ నిగ్రహము | జ్ఞానం | = | శాస్త్ర జ్ఞానము |
| తపః | = | తపస్సు | విజ్ఞానం | = | అనుభవ జ్ఞానము |
| శౌచం | = | శుచిత్వము | ఆస్తిక్యం | = | ఆస్తిక్య బుద్ధి |
| క్షాంతిః | = | సహనము | స్వభావజం | = | స్వభావము వలన కలిగిన |
| ఆర్జవం ఏవ చ | = | ఋజుత్వము | బ్రహ్మకర్మ | = | బ్రాహ్మణుల కర్మ |

**అర్జునా! మనో నిగ్రహము, ఇంద్రియ నిగ్రహము, తపస్సు, శుచిత్వము, ఋజుత్వము, సహనము, జ్ఞానము, విజ్ఞానము, ఆస్తిక్యము - ఇవన్నీ బ్రాహ్మణులకు స్వభావం చేత ఏర్పడిన కర్మలు.**

వ్యాఖ్య

పూర్వాధ్యాయాలలో మనం విస్తారంగా చెప్పుకున్న సత్త్వగుణ ప్రధానమైన ఈ తొమ్మిది లక్షణాలు బ్రాహ్మణుని కర్మగా చెప్ప బడ్డాయి.

అంతఃకరణమైన మనస్సును నిగ్రహించి, అది బహిర్ముఖం కాకుండా చూసుకోవడం శమము, లేదా అంతరేంద్రియ నిగ్రహము. అలాగే శ్రోత్రాది ఇంద్రియాలు శబ్దాది విషయాల వైపు పరుగులు పెట్టకుండా నియమించడము దమము, లేదా బాహ్యేంద్రియ నిగ్రహము. ఇవే శమదమాలు. ఇవి పూర్వాధ్యాయాలలో వ్యాఖ్యానించ బడ్డాయి *(16 వ అ - 1 & 2 శ్లో).*

శరీరాన్ని, వాక్కును, మనస్సును నియమాలను పాటిస్తూ నిగ్రహించడం తపస్సు అనబడుతుంది. ఇది వ్యాఖ్యాతమే *(17 వ అ - 14 - 16 శ్లో).*

బాహ్యాభ్యంతరాలలో దేహమును, మనస్సును శుచిగా ఉంచుకోవడమే శౌచము, లేదా శుచిత్వము. దీనిని పదహారవ అధ్యాయంలో చెప్పుకున్నాం *(16 వ అ - 3 వ శ్లో).*

క్షాంతి అనేది క్షమా గుణము. ఓరిమి. తనకు అపకారము చేసిన వారికి తిరిగి అపకారం చేయకుండా ఉండటమే గాక, తనకు పరులు చేసిన అపకారమును మనస్సులో కూడా పెట్టుకోకుండా మరచి పోవడము ఏదైతే ఉందో, అది కూడా క్షాంతి క్రిందికే వస్తుంది. బాధలలో నిర్వికారంగా ఉండే స్వభావము *(16 వ అ - 3 వ శ్లో).*

ఆర్జవము అంటే సరళ స్వభావము. కుటిలత్వము లేని ప్రవర్తనము. ఋజు వర్తనము. మాటకు, మనస్సుకు అభేదంగా ఉండే ఋజు స్వభావము ఆర్జవము *(16 వ అ - 1 వ శ్లో).*

జ్ఞానము అంటే శాస్త్ర జ్ఞానము. విజ్ఞానము అంటే అనుభవ జ్ఞానము. ఇవే జ్ఞాన విజ్ఞానాలు. బంధ విముక్తిని కలిగించేవి. మోక్షాన్ని ప్రసాదించేవి *(9 వ అ - 1 వ శ్లో).*

ఇక చివరిది ఆస్తిక్యం. శాస్త్ర విషయము నందు గల శ్రద్ధను ఆస్తిక్య మంటారు ***(ఆస్తిక్యమ్ అస్తి భావః శ్రద్ధధానతా ఆగమార్థేషు).*** భగవంతుని అస్తిత్వము నందు అకుంఠిత మైన విశ్వాసమును, భగవ దైశ్వర్యమును నిర్ణయించే శాస్త్రము నందు, శాస్త్రమును విప్పి చెప్పే ఆచార్యుని యందు అచంచల మైన విశ్వాసమును కలిగి ఉండటము కూడా శ్రద్ధ అనే ఆస్తిక్యము.

ప్రస్తుత శ్లోకం లోని శమాది నవకము (తొమ్మిది) బ్రాహ్మణునికి సత్త్వగుణము వలన ప్రాప్తించిన స్వభావము. పూర్వ శ్లోకంలో **స్వభావ ప్రభవైః గుణైః ప్రవిభక్తాని** అని చెప్ప బడినదే ప్రస్తుత శ్లోకంలో **స్వభావజమ్** అని చెప్ప బడింది.



*ఇక, క్షత్రియ విహితమైన కర్మను గూర్చి చెబుతున్నాడు.*

**శౌర్యం తేజో ధృతి ర్దాక్ష్యం యుద్ధేచా ప్యపలాయనమ్ ।**
**దాన మీశ్వరభావశ్చ క్షాత్రం కర్మ స్వభావజమ్ ॥** 43

***శౌర్యం-తేజః-ధృతిః-దాక్ష్యం-యుద్ధే-చ-అపి-అపలాయనం***
***దానం-ఈశ్వరభావః-చ-క్షాత్రం-కర్మ-స్వభావజం***

| | | | | | |
|---|---|---|---|---|---|
| శౌర్యం | = | శూరత్వము | దానం | = | దానగుణము |
| తేజః | = | తేజస్సు | ఈశ్వర భావః చ | = | స్వామి భావము |
| ధృతిః | = | ధీరత్వము | స్వభావజం | = | స్వభావ సిద్ధమైన |
| దాక్ష్యం | = | సామర్థ్యము | క్షాత్రం | = | క్షత్రియ నియమిత మైన |
| యుద్ధే | = | యుద్ధము నందు | కర్మ | = | కర్మము |
| అపలాయనం అపి చ | = | పారిపోకుండుట | | | |

**అర్జునా! శూరత్వము, తేజస్సు, ధీరత్వము, సామర్థ్యము, యుద్ధములో పారి పోకుండా ఉండటము, దానము, స్వామి భావము - ఇవన్నీ క్షత్రియులకు స్వభావం చేత ఏర్పడిన కర్మలు.**

వ్యాఖ్య

సాత్త్విక స్వభావము గల బ్రాహ్మణునికి స్వభావము చేత ఏర్పడిన తొమ్మిది కర్మములను గూర్చి తెలుసుకున్నాం. ప్రస్తుత శ్లోకంలో రాజస స్వభావము గల క్షత్రియునికి స్వభావము చేత ఏర్పడిన ఏడు కర్మములను గూర్చి వింటున్నాము. అవి (1) శౌర్యము (2) తేజస్సు (3) ధృతి (4) దాక్ష్యం (5) యుద్ధము నుండి పారి పోకుండా ఉండటము (6) దానము (7) ఈశ్వర భావము. ఈ సప్తకము క్షత్రియునికి స్వభావము వలన ఏర్పడిన కర్మములు.

శౌర్యము అంటే శూరుని లక్షణము ***(శౌర్యం శూరస్య భావః).*** తన కన్నా బలహీనుడిపై పరాక్రమాన్ని చూపడానికి శూరుడు కా నవసరం లేదు. భీరువైనా చాలు. తనతో సమానుడిపై పోరాడటము వీరుడికే సాధ్యం. కాని, తనను మించిన బలవంతుణ్ణి కూడా ఎదుర్కొని పోరాడాలి అంటే, అది శూరునికే సాధ్యం. ఈ విధమైన శూరత్వము రాజస ప్రవృత్తి గల క్షత్రియునికే ఉంటుంది.

శూరత్వమును ప్రదర్శించుట శౌర్య మైతే, తనపై ప్రదర్శింప బడే శౌర్యమును ఎదిరించి నిలబడటం తేజము. ఎదుటి వాడు ఎంతటి పరాక్రమవంతు డైనా జంకని స్వభావము. దానినే ప్రాగల్భ్యము అంటారు. నిర్భయంగా ఎదుర్కొనే స్వభావము ***(తేజః ప్రాగల్భ్యం).*** శత్రువుల చేత నిగ్రహింప బడని ఈ తేజము క్షత్రియ స్వభావము.

అపాయాలు చుట్టు ముట్టినా, ఆపదలు ముంచు కొచ్చినా, కదలని, చెదరని మొక్కవోని ధైర్యము ధృతి. ధృతి అంటే ధారణము, లేదా నిలబెట్టుకొనే గుణము. ఎట్టి పరిస్థితుల లోను జంక కుండా, క్రుంగి పోకుండా, తనను తాను నిలబెట్టుకొనే ధైర్యమే ధృతి ***(ధృతిః ధారణమ్ సర్వావస్థాసు అనవ సాదః భవతి యయా ధృత్యా ఉత్తమ్భితస్య).*** పోరాటంలో దేహేంద్రియాలు అశక్త మౌతున్నా, వాటిని నిర్వీర్యం కానివ్వకుండా ఉత్తేజ పరచే చిత్త వృత్తియే ధృతి.

దక్షుని యొక్క లక్షణం దాక్ష్యము ***(దాక్ష్యం దక్షస్య భావః).*** కార్య నిర్వహణము నందు సామర్థ్యము

దాక్ష్యము. కర్మల యందు నైపుణ్యము. ఊహించని విధంగా ఎదురైన సంక్లిష్ట పరిస్థితులలో ఏ మాత్రం జడవకుండా, చెదరకుండా కార్యాలలో శీఘ్రంగా ప్రవేశించి వాటిని నిర్వహించడము దాక్ష్యము **(సాహసా ప్రత్యుత్పన్నేషు కార్యేషు అవ్యామోహేన ప్రవృత్తిః )**.

యుద్ధరంగము నందు వెన్ను చూపని, మడమ తిప్పని పోరాటమును సాగించడమే కర్తవ్యము గాని, వెను దిరిగి పలాయనము చిత్తగించడం క్షత్రియుని స్వభావము కాదు **(యుద్ధేచ అపి అపలాయనమ్ అపరాఙ్ముఖీ భావః శత్రుభ్యః )**.

ఇచ్చే చోట కనబరచే చేతి విడుపు దానం. ముందు వెనుక చూడకుండా దానం చేసే త్యాగబుద్ధి. చేతిని ముడుచుకొనే అలవాటు లేని దాన గుణము **(దానం దేయేషు ముక్త హస్తతా )**.

చివరిది ఈశ్వర భావము. ప్రభు శక్తిని ప్రదర్శించే లక్షణము ఈశ్వర భావము. పరిపాలించ బడే వారి విషయంలో ప్రభావమును అతిశయించి ప్రదర్శించడము ఈశ్వర భావము, లేదా ఈశ్వర వైభవము **( ఈశ్వర భావః ఈశ్వరస్య భావః ప్రభు శక్తి ప్రకటీకరణమ్ ఈశితవ్యాన్ ప్రతి )**. ఈ కర్మ సప్తకము క్షత్రియునికి పూర్వ కర్మ సంస్కార జనిత కర్మలు, లేదా స్వభావజములు.

*వర్ణ చతుష్టయంలో బ్రాహ్మణ, క్షత్రియులను చెప్పిన తరువాత, మిగిలిన ఇరువురిని - అంటే వైశ్య, శూద్రులను తరువాత శ్లోకంలో చెబుతున్నాడు.*

**కృషి గోరక్ష్య వాణిజ్యం వైశ్యకర్మ స్వభావజమ్ ।**
**పరిచర్యాత్మకం కర్మ శూద్ర స్యాపి స్వభావజమ్ ॥** 44

***కృషిగోరక్ష్య వాణిజ్యం-వైశ్యకర్మ-స్వభావజం***
***పరిచర్యాత్మకం-కర్మ-శూద్రస్య-అపి-స్వభావజం***

| | | | |
|---|---|---|---|
| కృషిగోరక్ష్య వాణిజ్యం | = వ్యవసాయం, పశుపాలనము, వ్యాపారము | శూద్రస్య అపి | = శూద్రునకు |
| స్వభావజం | = స్వభావ జనితమైన | పరిచర్యాత్మకం | = పరిచర్య రూపమైన |
| వైశ్యకర్మ | = వైశ్యుల కర్మము | కర్మ | = కర్మము |
| | | స్వభావజం | = స్వభావసిద్ధ మైనది |

**అర్జునా! వ్యవసాయము, గోవులను రక్షించడం, వ్యాపారము వైశ్యులకు స్వభావం చేత ఏర్పడిన కర్మలు. సేవా కార్యాలు శూద్రులకు స్వభావం చేత ఏర్పడిన కర్మలు.**

### వ్యాఖ్య

వ్యవసాయము చేయడము, గోరక్షణము, వ్యాపారము చేయడము - ఈ మూడు వైశ్యునికి స్వభావంతో ఏర్పడిన కర్మలు. పరిచర్యలు చేయడ మనేది శూద్రునికి స్వభావంతో కలిగిన కర్మ. ఇది సేవా జీవనము.

వ్యవసాయము చేయడము అంటే, తాను భూస్వామిగా నిలబడి సేవకుల చేత వ్యవసాయము చేయించడము కాదు. తానే స్వయంగా చేయడం. అదే కృషి శబ్దార్థము. 'కృషి' అంటే భూమిని దున్నడము అని అర్థము **( కృషిః భూమేః విలేఖనమ్ )**. అంటే దున్నే వాడిదే భూమి. భూమి ఉన్న వాడే వ్యవసాయం చేస్తాడు.

అలాగే వాణిజ్యము. వణిజుని కర్మము వాణిజ్యము. అంటే కొనడము, అమ్మడము అనే ధర్మము. క్రయ విక్రయాది లక్షణము **(వణిక్కర్మ క్రయ విక్రయాది లక్షణమ్ )**. క్రయ విక్రయాదు లన్నప్పుడు 'మిత్తి', అంటే



వడ్డీ వ్యాపారము కూడా అందులో అంతర్భూతమే నని గ్రహించాలి **( కుసీదం చేతి )**. కుసీదము అంటే వడ్డీ వ్యాపారము. ప్రపంచ బ్యాంక్ కూడా అందు లోనే చేరి పోతుంది.

***శుశ్రూషా శూద్రస్య*** - శూద్రునకు సేవ చేయడము స్వభావజ కర్మగా చెప్ప బడింది. సేవ అనేది మహోన్నత మైన కార్యము. మహోత్కృష్టమైన జీవనము. లేకపోతే, లెక్కపెట్ట లేనన్ని సేవా సమాజాలు లోకంలో ఎందుకు పుట్టు కొస్తాయి? ఈ విషయంలో శాస్త్రానికి పూర్ణ అవగాహన ఉంది.

***శూద్రః చతుర్థో వర్ణ ఏకజాతిః తస్యాపి సత్య మక్రోధః పరిచర్యా చేతరేషాం*** - సత్యము, అక్రోధము మొదలైనవి నాల్గవ వర్ణానికి సంబంధించిన శూద్రునకు ఎలా అనుష్ఠేయాలో, అలాగే ఇతర వర్ణాలకు పరిచర్య, అంటే సేవ కూడా అనుష్ఠేయమే అనేది శాస్త్ర హృదయము.

శ్లోకంలో కూడా ***పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజమ్*** అని ఉంది. కనుక, సేవ చేయడం శూద్రునకు కూడా అనుష్ఠేయ మైన కర్మే నని అర్థము. దాని అర్థము, సేవ అనేది ఒక్క శూద్రునికే కాదు. వర్ణ చతుష్టయానికి మొత్తానికి సంబంధించిన విషయము. కాకపోతే, శూద్రునికి పూర్వ సంస్కార యోగ్యత కూడా కలిసి రావడం చేత, పరిచర్య అనేది స్వభావజం కావడం వల్ల, సేవా కార్యాలలో అతడు అసమానంగా శోభిస్తాడు. అంతే.

*కర్మ లన్నీ స్వభావజాలే అయినపుడు, ఏదైనా గమ్యానికి మార్గమే. అదే చెబుతున్నాడు.*

**స్వే స్వే కర్మ ణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః ।**
**స్వకర్మనిరత స్సిద్ధిం యథా విన్దతి తచ్ఛృణు ॥** 45

***స్వే-స్వే-కర్మణి-అభిరతః-సంసిద్ధిం-లభతే-నరః***
***స్వకర్మనిరతః-సిద్ధిం-యథా-విందతి-తత్-శృణు***

| | | | |
|---|---|---|---|
| నరః | = నరుడు | స్వకర్మనిరతః | = తన కర్మమందు నిరతుడైన వాడు |
| స్వేస్వే | = తన తన | సిద్ధిం | = సిద్ధిని |
| కర్మణి | = కర్మము నందు | యథా | = ఎలా |
| అభిరతః | = ఆసక్తి గలవాడై | విందతి | = పొందుచున్నాడో |
| సంసిద్ధిం | = సిద్ధిని | తత్ | = దానిని |
| లభతే | = పొందుచున్నాడు | శృణు | = విను |

**అర్జునా! స్వభావం చేత ప్రాప్తించిన కర్మలను ఆసక్తితో ఆచరించే వారు సిద్ధిని పొందుతారు. అదెలాగో చెబుతాను. విను.**

### వ్యాఖ్య

స్వభావము వలన ఏర్పడిన కర్మలు స్వభావజాలు. సంస్కార జనితాలు. ఆ స్వభావాలు మనం కోరి వరించినవే గాని ఎవరో తగిలించినవి కావు. ప్రారబ్ధ రూపంలో మన జీవితంలో తొంగి చూచే మన కర్మల్ని మనం ఆదరించకుంటే మరెవరు ఆదరిస్తారు? మనం కాకపోతే మరెవరు ఆచరిస్తారు?

పూర్వ శ్లోకంలో మనం చెప్పు కున్నట్లు స్వభావ భేదం వల్ల తన తన కర్మము నందు **( స్వే స్వే కర్మణి, యథోక్త లక్షణ భేదే కర్మణి )** ఆసక్తుడై ఆచరించే మానవుడు **( అభిరతః తత్పరః నరః )**, సిద్ధిని పొందుతాడు **(సంసిద్ధిం లభతే)**. అదెలాగో భగవంతుడు చెబుతాడట. శ్రద్ధగా విందాము.

యోగ్యత కొద్ది ప్రాప్తించిన స్వభావజ కర్మను ఎవడైతే శ్రద్ధతో, ఆసక్తితో, ప్రేమతో ఆచరిస్తాడో, అలా ఆచరించడం చేత దేహేంద్రియ మనస్సులలో ఏర్పడి ఉన్న మాలిన్య మంతా తొలగి పోతుంది. దేహేంద్రియా దుల లోని అశౌచము ప్రక్షాళనం కాగానే అతడు జ్ఞాన నిష్ఠా యోగ్యతకు కావలసిన అంతఃకరణ శుద్ధిని సిద్ధింప చేసు కోవడం జరుగుతుంది ***( స్వకర్మానుష్ఠానాత్ అశుద్ధి క్షయే సతి కాయేన్ద్రియాణాం జ్ఞాన నిష్ఠా యోగ్యతా లక్షణం ప్రాప్నోతి పురుషః ).***

స్వభావజము లైన కర్మలను ఆచరించడానికి అనువైన ప్రదేశాలలో, వర్ణాలలో మనిషి ఆవిర్భవించి, తన తన ***(స్వే స్వే)*** నియమిత కర్మలను ఆచరించడం వల్ల, అతడు గృహస్థుడే అయినప్పటికి, స్వకర్మానుష్ఠానాన్ని చక్కగా ఆచరించడం చేత, వర్ణ బంధము నుండి, స్వభావజ కర్మ బంధం నుండి కూడా విడిపడి, మరణా నంతరము ఉత్తమ లోకాలను పొందుతాడు అని శాస్త్రం చెబుతూ ఉంది ***( యస్తు సమ్యక్కరోతి ఏవం గృహస్థః పరమం విధిమ్ ! తద్వర్ణ బంధ ముక్తోఽ సౌ లోకా నాప్నో త్యనుత్తమాన్ ! ).***

బాగుంది. స్వభావజ కర్మానుష్ఠానం వల్ల వర్ణ బంధ విముక్తుడై ఉత్తమ లోకాలను పొంద వచ్చు. అలాగని, అతనికి పునర్జన్మ లేకుండా ఉంటుందా? జ్ఞానము లేనందున మోక్షము ప్రాప్తించదు కదా! మరి అతడు, ఆ తరువాత ఏమౌతాడు? దీనికి గౌతముని ధర్మశాస్త్రము స్పష్టంగా సమాధానం చెప్పింది.

***వర్ణా ఆశ్రమాశ్చ స్వకర్మ నిష్ఠాః ప్రేత్య , కర్మఫలం అనుభూయ తతః శేషేణ విశిష్ట దేశ జాతి కుల ధర్మాయుః శ్రుత విత్త సుఖ మేధసః జన్మ ప్రతి పద్యన్తే -*** తమ తమ స్వభావజ కర్మల యందు నిష్ఠ గల వర్ణాల వాళ్ళు, ఆశ్రమాల వాళ్ళు, మరణానంతరము, వారి వారి కర్మఫలాలను ఉత్తమ లోకాలలో అనుభవించి, మిగిలిన కర్మ విశేషం చేత విశిష్టమైన ప్రదేశము, జాతి, కులము, ధర్మము, ఆయుర్దాయము, విద్య, విత్తము, సుఖము, బుద్ధి బలము కల వారై జన్మిస్తుంటారు *(గౌతమ ధర్మ సూత్రాలు ; 11 - 29).*

*మరి, స్వభావజమైన స్వకర్మానుష్ఠానం వల్లనే సిద్ధి లభిస్తుందా? అలా కాదు. వినండి.*

యతః ప్రవృత్తి ర్భూతానాం యేన సర్వమిదం తతమ్ ।
స్వకర్మణా త మభ్యర్చ్య సిద్ధిం విన్దతి మానవః ॥ 46

***యతః-ప్రవృత్తిః-భూతానాం-యేన-సర్వం-ఇదం-తతం***
***స్వకర్మణా-తం-అభ్యర్చ్య-సిద్ధిం-విందతి-మానవః***

| | | | | | |
|---|---|---|---|---|---|
| భూతానాం | = | ప్రాణుల యొక్క | తం | = | వానిని |
| ప్రవృత్తిః | = | పుట్టుక | మానవః | = | మానవుడు |
| యతః | = | ఎవని వలన కలిగినదో | స్వకర్మణా | = | తన కర్మ చేత |
| యేన | = | ఎవని చేత | అభ్యర్చ్య | = | ఆరాధించి |
| ఇదం | = | ఈ | సిద్ధిం | = | సిద్ధిని |
| సర్వం | = | సమస్తమును | విందతి | = | పొందుచున్నాడు |
| తతం | = | వ్యాపింపబడి యున్నదో | | | |

**అర్జునా! ప్రాణుల పుట్టుకకు కారణ మైన వాడు ఈ సమస్త ప్రపంచములో వ్యాపించి ఉన్నాడు. స్వభావము వల్ల ప్రాప్తించిన కర్మతో అతణ్ణి ఆరాధించే వాడు సిద్ధిని పొందుతాడు.**



## వ్యాఖ్య

సృష్టికి పరమేశ్వరుడు అభిన్న నిమిత్త ఉపాదాన కారణంగా ఎలా ఉన్నాడో విజ్ఞాన యోగంలో మనం విస్తరించి చెప్పుకున్నాం. సృష్టి, సృష్టికర్త కన్నా వేరుగా లేదని కూడా గ్రహించాము. సృష్టిలో నియతి రూపంలో ఉన్నది నియంతయే నని తెలుసుకున్నాం.

***యతః -*** ఎవరి నుండి ఈ భూతాలకు ఉత్పత్తి ***( ప్రవృత్తిః )*** కలిగిందో, ***యేన -*** ఎవరి చేత ఈ ప్రపంచం అంతా పరివ్యాప్తమై ఉందో ***( సర్వ మిదం తతం ),*** అతడిని పూర్వ శ్లోకం వరకు మనం చూచిన స్వభావజ కర్మల చేత ***( స్వకర్మణా )*** అర్చించి నట్లైతే, జ్ఞానయోగ్యతా లక్షణమైన సిద్ధిని పొందడం జరుగు తుంది ***( సిద్ధిం విన్దతి మానవః ).*** ఇదీ, శ్లోక హృదయం.

పరమేశ్వరుని నుండి ఆవిర్భవించిన ఈ విశ్వము ***( యతః యస్మాత్ ఈశ్వరాత్ ),*** పరమేశ్వరుని చేతనే పరివ్యాప్తమై ఉంది ***( ఈశ్వరేణ ఇదం జగత్ తతం వ్యాప్తం ).*** ఈ సృష్టి నడవ డానికి ఆధారమైన నియతి రూపంలో ఉన్నది నియంతయే. ధర్మ రూపంలో ఉన్నది దైవమే. దైవం ధర్మ రూపంలో ఉన్నాడు అని తెలిసి ధర్మ జీవనాన్ని సాగిస్తే, అది ధర్మ రూపంలో ఉన్న దైవాన్ని అర్చించినట్లే అవుతుంది. పను లన్నీ పూజలుగా మారుతాయి. ధర్మ జీవనం దైవారాధనగా మారుతుంది. మనం ఆచరించే కర్మలలో పరమేశ్వరుడు ఎప్పుడైతే ప్రవేశించాడో, ఆ కర్మ అర్చనగా మారుతుంది. ఆరాధనగా రూపుదిద్దు కుంటుంది. ఏ కర్మ చేస్తున్నాము అనేది ప్రధానం కాదు. ఏ కర్మ చేసినా అది పూజే.

***యద్య త్కర్మ కరోమి తత్త దఖిలం శంభో తవారాధనమ్ -*** ఏ కర్మ చేసినా దానిని నైవేద్యంగా మార్చుతాడు కర్మయోగి. తన దేహమే పూజాగది అవుతుంది. గుండె గుడిగా మారుతుంది. భావాలన్నీ సుమా లవుతాయి. ఇదే భక్తి. కర్మయోగానికి ప్రాణం లాంటిది. ఇదే ఈశ్వరారాధన. కర్మ లన్నీ నైవేద్యా లవుతున్నాయి కనుక, కర్మఫలా లన్నీ ప్రసాదా లవుతాయి. ***భావగ్రాహి జనార్దనః -*** నీ భావాన్ని గ్రహించే వాడు జనార్దనుడు. కర్మ ఎలా వేద్యమో అర్థమైతే, ఆ తరువాత ఏది సమర్పించినా అది నైవేద్యమే అవుతుంది.

***ఆశతో కదిలాను శ్వాస నీవు కాగా***
***శ్వాస మిగిలింది ఆశ ఎటో పారిపోయె***
***శ్వాస లాగు వరకు నీ సేవ ఆపనయ్యా !***
***నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా !***

అని చిన్నికృష్ణ శతకంలో ఒక వెన్నముద్ద. ఇదే కర్మయోగి చల్లని యెద.

*అందుచేత స్వభావజ మైన స్వధర్మమే శ్రేష్ఠ మని చెబుతున్నాడు భగవంతుడు.*

శ్రేయా న్స్వధర్మో విగుణః పరధర్మా త్స్వనుష్ఠితాత్ ।
స్వభావ నియతం కర్మ కుర్వ న్నాప్నోతి కిల్బిషమ్ ॥ 47

***శ్రేయాన్-స్వధర్మః-విగుణః-పరధర్మాత్-స్వనుష్ఠితాత్***
***స్వభావ నియతం-కర్మ-కుర్వన్-న-ఆప్నోతి-కిల్బిషం***

| | | | | | |
|---|---|---|---|---|---|
| స్వధర్మః | = | స్వధర్మము | పరధర్మాత్ | = | పరధర్మము కంటెను |
| విగుణః | = | గుణహీన మైనను | శ్రేయాన్ | = | శ్రేయస్కరము |
| స్వనుష్ఠితాత్ | = | చక్కగా ఆచరించబడిన | స్వభావ నియతం | = | స్వభావ సిద్ధమైన |

| | | | | | |
|---|---|---|---|---|---|
| కర్మ | = | కర్మమును | కిల్బిషం | = | పాపమును |
| కుర్వన్ | = | చేయువాడు | న ఆప్నోతి | = | పొందదు |

**అర్జునా! బాగా ఆచరింప బడే పరధర్మము కంటే కూడా, లోపాలు ఉండినా స్వధర్మమును ఆచరించడమే మేలు. స్వభావం వల్ల ఏర్పడిన కర్మను చేసే వాడు పాపాన్ని పొందదు.**

**వ్యాఖ్య**

**పొరుగింటి పుల్లగూర**

ఉన్నది బాగా లేదు అనే అభిప్రాయం గనుక ఏర్పడితే, ఇక ఆ తరువాత, లేనిది ఏదో, అది బాగున్నట్లు అనిపిస్తు ఉంటుంది అనేది మనస్తత్త్వ శాస్త్ర విశ్లేషణము. అది వాస్తవమా, కాదా అనేది ప్రక్కన పెడితే, 'పొరుగింటి పుల్లగూర రుచి' అనే సామెత ఎందుకు వచ్చిందో అర్థ మవుతుంది. తన ఇంటి కూర ఎప్పుడూ తింటూ ఉండేదే కనుక, క్రొత్త రుచు లీనే పొరుగింటి పుల్లగూరలో పులుపు కాస్త ఎక్కువే అయినా, క్రొత్తదనాన్ని ఆశించే నాలుకకు అది రుచికరం గానే ఉంటుంది.

ఏది రుచి - ఏది అరుచి అనేది అలా ఉంచండి. ఏది యుక్తము - ఏది అయుక్తము అనే కోణంలో ఆలోచిస్తే మాత్రం ఇంటి వంటకమే నయ మనిపిస్తుంది. రుచి కాస్త తక్కు వైనా, ఎక్కువ రుచి కలిగిన పొరుగింటి వంట కంటే ఇంటి వంటే నయం.

ఎప్పుడూ ఉండేది ఇంటి వంట. ఎప్పుడో గాని దొరకనిది పొరుగింటి వంట. ఏ నెలకో, రెండు నెలలకో ఒకసారి లభించే ప్రక్కింటి వంట కన్నా, రోజూ లభ్య మయ్యే ఇంటి వంటే శ్రేష్ఠము కదా! నిత్యము భుజిస్తే గాని మనిషి బ్రతక లేడు. నెల కొకసారి దొరికే పొరుగింటి వంటతో బ్రతికే దెలా? ప్రాణానికే ముప్పు తెచ్చే రుచికర మైన పొరుగింటి వంట కన్నా అంత రుచి లేని దైనా, మనిషిని నిత్యము పోషించి రక్షించే ఇంటి వంటే మేలు కదా!

లేదండీ! ప్రక్కింటి వంట మాకు రోజూ లభిస్తుందండీ! అని మీరు చెప్పినా, ఇంటి వంటే శ్రేయస్కరము అనేది నిత్య సత్యం. మన ఇల్లే మనది. పొరుగిల్లు మన దెలా అవుతుంది? ఒకవేళ మనదే అని పైకి చెప్పు కున్నా, ఆ తరువాత ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోవడానికి మనం సరిపోము.

**స్వధర్మమే శ్రేయస్కరము**

స్వభావం వల్ల కలిగిన స్వధర్మము గుణము లేని దని మనకు అనిపించ వచ్చు. మనస్సుకు ప్రియంగా గోచరించక పోవచ్చు. కర్కశంగా అగుపించ వచ్చు.

మనది కాని పరధర్మము గుణయుతంగా, ప్రియంగా, మనోహరంగా కనిపించ వచ్చు. అయినా, దోష రహితమైన, శ్రేష్ఠమైన పరధర్మము కన్నా, దోషయుత మైనా, నికృష్ట మైనా స్వధర్మమే మనిషికి మేలు చేస్తుంది.

నీళ్ళతో పోలిస్తే పాలు శ్రేష్ఠమైన పానీయము. జలక్షీరాలను కలిపి ముందుంచితే, నీళ్ళను త్యజించి, హంస క్షీరాన్ని పానం చేస్తుంది అంటారు. కావచ్చు. నీరు సాధారణమైన జలము. కానీ క్షీరము సమీకృత ఆహారము. బలకర మైనది. పుష్టికర మైనది. ఆరోగ్యకర మైనది. ఈ విషయంలో ఎవరికీ ఎవరితో విభేద ముండదు.

చేప నీళ్ళల్లో బ్రతుకు తుంది. నీళ్ళల్లో ఆనందంగా జీవిస్తుంది. అదే చేపను నీళ్ళ నుండి తీసి పాలల్లో వేసి చూడండి. నీళ్ళల్లో హాయిగా బ్రతికిన చేప పాలల్లో ప్రాణాలను వదిలేస్తుంది.



స్వధర్మము బ్రతికిస్తుంది. పరధర్మము ప్రాణం తీస్తుంది. ప్రాణం తీసే పరధర్మము ఎంత శ్రేష్ఠమైన దైనా, శ్రేష్ఠము కాని దైనా బ్రతుకు నిచ్చే స్వధర్మమే మేలు.

**బిచ్చ కన్నా రచ్చ నయం**

స్వజనులను చంపుకొని రాజ్య సుఖాలు అనుభవిస్తూ, పంచ భక్ష్య పరమాన్నాలు భుజించడం కన్నా, భిక్ష మెత్తుకొని జీవించడమే శ్రేయస్కరము అనేది అర్జునుడు ప్రారంభములో వెలి బుచ్చిన అభిప్రాయము (*శ్రేయో భోక్తుం భైక్ష్య మపీహ లోకే : 2 వ అ - 5 వ శ్లో*). ఈ దశలో సూటిగా ప్రస్తావించక పోయినా, పరోక్షంగా అర్జునుణ్ణి భగవంతుడు ఈ శ్లోకం ద్వారా కుదిపేశా డనే చెప్పాలి.

అర్జునుడు క్షత్రియుడు. శౌర్యము, తేజము, ధృతి, యుద్ధము నుండి పరా ఙ్మఖుడు కాకుండా పోరాడటము - ఇవన్నీ క్షత్రియులకు స్వభావజాలు అని చెప్పుకున్నాం కదా! (*18 వ అ - 43 వ శ్లో*).

క్షత్రియునికి యుద్ధము స్వధర్మము. భిక్షాటనము పరధర్మము. ఎందుకనో, కురుక్షేత్రంలో అర్జునుడికి స్వధర్మము రుచించ లేదు. భిక్షాటనము పరధర్మ మైనా అది సుఖకరము, శ్రేయస్కరము, లాభదాయకము అనిపిస్తూ ఉందా? ఇది వాస్తవ మేనా?

భిక్షాటన చేయడానికి అక్షయ పాత్ర సరిపోతుంది. అక్షయ తూణీరాలు అవసరమా? ఎవరైనా పాశు పతాస్త్రాన్ని పట్టుకొని భిక్షకు పోతారా? అవన్నీ శ్రమించి సాధించు కున్నవి కావా? ఘోరమైన తపస్సు చేసి అస్త్ర శస్త్రాలు సాధించు కున్నది దేనికి? జాలి తలచి బిచ్చం పెట్టని వాళ్ళ మీద ప్రయోగించ డానికా?

సరే, అర్జునుడు చెప్పినట్లు భయంకరమైన యుద్ధ కర్మ కన్నా భిక్షాటనే శ్రేయస్కర మని భావిద్దాం. యుద్ధాన్ని విరమించుకొని, రేపు ధనంజయుడు భిక్షాటనకి వెళ్ళాడనే అనుకుందాం. ఒక ఇంటి ముందు నిలబడి, మాతా! భిక్షాం దేహి! అని పార్థుడు అడిగా డనుకుందాం. దుర్యోధనుడు లాంటి ఆ ఇంటి యజమాని వచ్చి, 'సిగ్గు లేదూ! సాలవృక్ష మంత ఉన్నావు. అడుక్కు తినక పోతే, అంట్లు తోముకొని బ్రతక రాదా!' అని ఛీ కొట్టాడనుకోండి. అప్పుడు అర్జునుడు ఊరుకుంటాడా?

ధర్మజ భీముల తమ్ముణ్ణి, నకుల సహదేవుల అన్నయ్యని, కుంతీ కుమారుణ్ణి, సుభద్రాపతిని, సాక్షాత్తు భగవంతుడైన గీతాచార్యుడికి బావమరిదిని, నన్ను అంట్లు తోముకో మంటావా? అని ఆ గృహస్థుడి ఒళ్ళు తోమి ఒంట్లో ఎముక లేకుండా చేయడా? అదేదో ఇప్పుడే కురుక్షేత్రంలో చేస్తే పోతుంది కదా! రేపు వీధుల్లో రచ్చ లాడటం కన్నా, గీత చెప్పినట్లు స్వధర్మాన్ని ఇక్కడే ఆచరిస్తే సరి పోతుంది కదా! రేపు గీతాచార్యుడి బావమరిదిని అంటూ అందరితో పేచీలు పడటం దేనికి? అనేది శ్రీకృష్ణుని అభిప్రాయము.

**విహితము - పాప రహితము**

యుద్ధము స్వధర్మమే అయినా, బంధువులను వధించడం విగుణము కాబట్టి యుద్ధము విహితము కాదని అర్జునుడు భావించి ఉండ వచ్చు. కానీ, యుద్ధకర్మ క్షత్రియునకు స్వభావ నియతము కనుక, దానిని ఆచరించడం వల్ల ఏ విధమైన పాపము అంటదు (**కిల్బిషమ్ న ఆప్నోతి**).

అంతే కాదు. స్వభావము వల్ల కలిగిన సంస్కారము బలీయంగా ఉంటుంది. దానిని ఎదిరించి నిల బడటం చాలా కష్టము. అలాంటి స్వధర్మాన్ని విడిచి పెట్టి పరధర్మాన్ని ఆశ్రయించినా, అది ఫలప్రదం కాదు. స్వభావం ఆంతర్యంలో స్థిరపడి ఉంటుంది కనుక, పరధర్మమును ఆశ్రయించి ప్రవర్తించాలన్నా, మనస్సు లోని స్వభావము మనిషి వెంటే ఉంటుంది. తాను ఆచరించే కర్మల ననుసరించే ఉంటుంది.

పరధర్మాన్ని ఆశ్రయించడం జరిగింది కనుక, స్వధర్మానుష్ఠానం లేని వాడు అవుతాడు. స్వభావము వెంట పడి ఉన్నందున పరధర్మమును సక్రమంగా ఆచరించ లేక పోతాడు. ఎటు చూచినా ధర్మభ్రష్టుడే అవుతాడు. ధర్మభ్రష్టు డైనందున పాపాన్ని పొందుతాడు.

స్వధర్మము ప్రతికూలంగా అనిపించినా, పరధర్మము అనుకూలంగా కనిపించినా, పరధర్మము నాశ్రయించి పాపాన్ని పొందడం కన్నా, పూర్వ శ్లోకంలో చూచినట్లు, స్వధర్మమును ఈశ్వరారాధనగా ఆచరిస్తే పాపము అంటదు సరి కదా, ఫలాసక్తి లేకుండా విహిత కర్మాచరణము జరిగి నందున చిత్తము ప్రసన్నమై, అంతఃకరణ శుద్ధి ఏర్పడుతుంది. అంతఃకరణ శుద్ధి ద్వారా జ్ఞానప్రాప్తికి బుద్ధి సిద్ధ పడుతుంది.

***అతః స్వధర్మే స్థితస్య మరణ మపి శ్రేయః పరధర్మే స్థితస్య జీవితాత్ -*** అందుచేత, పరధర్మము నాశ్రయించి బ్రతకడం కన్నా, స్వధర్మంలో మనిషి మరణించడమే మేలు.

*కనుక, స్వధర్మమును త్యజించ కూడదు అనే విషయాన్నే పునః ప్రసంగిస్తున్నాడు.*

సహజం కర్మ కౌన్తేయ సదోష మపి న త్యజేత్ ।
సర్వారమ్భా హి దోషేణ ధూమే నాగ్ని రివావృతాః ॥ 48

***సహజం-కర్మ-కౌంతేయ-సదోషం-అపి-న-త్యజేత్***
***సర్వారంభాః-హి-దోషేణ-ధూమేన-అగ్నిః-ఇవ-ఆవృతాః***

| | | | | | |
|---|---|---|---|---|---|
| కౌంతేయ | = | అర్జునా! | అగ్నిః | = | అగ్నిని |
| సహజం | = | సహజమైన | ధూమేన ఇవ | = | పొగ వలె |
| కర్మ | = | కర్మము | సర్వారంభాః | = | సకల కర్మలును |
| సదోషం అపి | = | దోషయుత మైనను | దోషేణ | = | దోషము చేతను |
| న త్యజేత్ | = | విడువరాదు | ఆవృతాఃహి | = | ఆవరింపబడి యున్నవి గదా! |

**కుంతీకుమారా! నిప్పును పొగ కమ్మినట్లు, కర్మలను దోషము కప్పి ఉంది. అందుచేత, స్వభావం వల్ల కలిగిన కర్మను విడిచిపెట్ట కూడదు.**

### వ్యాఖ్య

కర్మను కర్మయోగంగా ఎలా మార్చుకోవాలో తెలియ జేస్తూ, నలభై ఒకటవ శ్లోకం వద్ద కర్మ ప్రసంగాన్ని ఆరంభించిన పరమేశ్వరుడు, కర్మ విషయం లోను, ధర్మం విషయం లోను, స్వధర్మ నిష్ఠ విషయం లోను సుదీర్ఘంగా, సహేతుకంగా, సశాస్త్రీయంగా ప్రవచించి, చివరగా కర్మ ప్రసంగాన్ని ఈ శ్లోకంతో సమాప్తం చేస్తూ, జ్ఞాన యోగాన్ని మరల ఉపదేశించే ముందు, కర్మల విషయంలో తన నిశ్చితాభిప్రాయాన్ని స్పష్టం చేస్తున్నాడు.

**సహజ కర్మే సాకర్యము**

అర్జునా! సహజ కర్మ దోషయుతంగా కనిపించి నప్పటికి దానిని త్యజించ కూడదు ***(స దోష మపి సహజం కర్మ న త్యజేత్)***. పొగ చేత నిప్పు ఎలా కప్పబడి ఉంటుందో, ఏ కర్మ అయినా దోషయుతం గానే ఉంటుంది ***(ధూమేన అగ్నిః ఇవ సర్వారంభాః దోషేణ ఆవృతాః)***. కర్మ విషయంలో ఈ శ్లోకము ఈశ్వర శాసనము లాంటిది. దీనిని చక్కగా అర్థం చేసుకోవాలి.



కర్మ సహజ మైనది అని శ్రీ భగవానువాచ. సహజం అంటే కలిసి పుట్టింది అని భావము. జన్మతో కలిసి పుట్టిన కర్మ సహజ కర్మ; లేదా, స్వభావజం కర్మ. **సహజం సహ జన్మ నైవ ఉత్పన్నం సహజమ్ -** సహజమైన తన జన్మతో కలిసి పుట్టిన కర్మ కనుక, స్వభావ జనితమైన కర్మ స్వధర్మంగా మారింది. అలాంటి కర్మను త్యజించ కూడదు **(న త్యజేత్)**.

పైగా, కర్మ లన్నీ దోషయుతాలే. నివురు నిప్పును అంటుకొని ఉన్నట్లు, దోషము కర్మను అంటి పెట్టుకొని ఉంటుంది. కర్మ ఎందుకు దోషయుతము అంటే, అది త్రిగుణ యుతము కనుక **(త్రిగుణత్వాత్)**. కర్మ ఎలాగూ దోషయుతం కనుక, పరధర్మాన్ని ఆశ్రయించి భ్రష్టుడు కావడం కన్నా, స్వధర్మము గొప్పది కాక పోయినా, స్వధర్మానుష్ఠానము మనిషికి గొప్ప మేలు చేస్తుంది.

కర్మే దోషయుత మైనపుడు కర్మల మధ్య అంతరాన్ని చూడ వలసిన అవసరం లేదు. సహజ కర్మ కన్నా, పరధర్మానికి సంబంధించిన కర్మను విశిష్టంగా వీక్షించ నవసరం లేదు అనేది పరమేశ్వరుని అభిప్రాయము. కర్మ బంధం నుండి విడి పడటమే ముఖ్యం కాని, కర్మల మధ్య విశిష్టతను అన్వేషించడం కాదు.

ఏ కర్మ చేస్తున్నాము అనేది ప్రధానం కాదు. ఎలా చేస్తున్నాము అనేదే ముఖ్యము. స్వధర్మమునకు సంబంధించిన కర్మే ముక్తికి కారణ మయ్యే టప్పుడు, పరధర్మానికి సంబంధించి, ఆచరణ యోగ్యం కాని కర్మను ఆచరించ వలసిన అవసర మేముంది? ఇలాంటి అవగాహనా రాహిత్యం వల్ల అగచాట్లు, అనర్థాలు సంభ విస్తాయి.

స్వభావ కర్మ ఏ రూపంలో ఉందో పరిమితుల మైన మన కేమి తెలుసు? ప్రారబ్ధాన్ని మనం అంచనా వేయ గలమా? అంచనా వేసి మాత్రం సాధించే దేముంటుంది? దోషయుతం కనుక, ఏ కర్మ చేసినా ముక్తి రాదు. కర్మ ఈశ్వర భావంతో కలిసి నపుడే అది కర్మయోగమై అంతఃకరణ శుద్ధికి సహకరిస్తుంది. జ్ఞానార్హతను ప్రసాదిస్తుంది.

భావాన్ని బట్టే బ్రతుకు భవ్య మౌతుంది కాని, కర్మను బట్టి కాదు. పరమేశ్వరునితో పోరాడిన పార్థుడు పాశుపతాస్త్రాన్ని, పరమానుగ్రహాన్ని పొందాడే గాని, పాపాన్ని పొంద లేదు.

సద్గతిని పొందాడే గాని
శ్రీకృష్ణ పరమాత్మకు ఎదురుగా శత్రు పక్షంలో నిలబడి పోరాడినా భీష్ముడు దుర్గతిని పొంద లేదు.

కర్మలో స్వార్థం ఉంటుంది. కర్మయోగంలో త్యాగం ఉంటుంది. త్యాగం మనస్సును శుద్ధి చేస్తుంది. అంతఃకరణమును జ్ఞానానికి సిద్ధం చేస్తుంది. బ్రతుకును భవ్యంగా మార్చుతుంది. జీవుణ్ణి ధన్యుణ్ణి చేస్తుంది. భావశుద్ధి లేకుండా కర్మశుద్ధి రాదు. భావాన్ని శుద్ధి చేసేది, బ్రతుకును బాగు పరచేది, బుద్ధిని జ్ఞానానికి సిద్ధం చేసేది కర్మయోగమే.

*నిష్కామ కర్మయోగమే నైష్కర్మ్యానికి దారి తీస్తుంది. చదవండి.*

అసక్తబుద్ధిః సర్వత్ర జితాత్మా విగతస్పృహః ।
నైష్కర్మ్యసిద్ధిం పరమాం సంన్యాసే నాధిగచ్ఛతి ॥ 49

***అసక్తబుద్ధిః-సర్వత్ర-జితాత్మా-విగతస్పృహః***
***నైష్కర్మ్యసిద్ధిం-పరమాం-సంన్యాసేన-అధిగచ్ఛతి***

సర్వత్ర = అంతట

| | | |
|---|---|---|
| అసక్తబుద్ధిః | = | ఆసక్తి లేనివాడై |
| జితాత్మా | = | మనస్సును జయించిన వాడై |
| విగతస్పృహః | = | కోరికలు లేని వాడై |
| సంన్యాసేన | = | సన్యాసము చేత |
| పరమాం | = | ఉత్తమమైన |
| నైష్కర్మ్యసిద్ధిం | = | నిష్కామకర్మ సిద్ధిని |
| అధిగచ్ఛతి | = | పొందుచున్నాడు |

**అర్జునా! అంతట విషయాసక్తి లేని వాడు, మనో నిగ్రహం కల వాడు, ఆశలు లేని వాడు సన్యాసం చేత నైష్కర్మ్య సిద్ధిని పొందుతున్నాడు.**

## వ్యాఖ్య

కర్మయోగం వల్ల సిద్ధి లభిస్తుందని నలభై ఆరవ శ్లోకంలో చెప్పుకున్నాం. ధర్మ రూపంలో ఉన్న దైవాన్ని ధర్మాచరణం ద్వారా అర్చించడం వల్ల మానవులు సిద్ధిని పొందుతున్నారు అని తెలుసుకున్నాం ***(స్వకర్మణా తం అభ్యర్చ్య సిద్ధిం విన్దతి మానవః)***. ఇక్కడ సిద్ధి అంటే మోక్షము కాదు. మోక్షమును పొందడానికి ఏకైక సాధన మైన జ్ఞానమునకు యోగ్యతను సంపాదించడమే సిద్ధి. అదే జ్ఞాన నిష్ఠా యోగ్యతా లక్షణము. దీనికి ఫలంగా నైష్కర్మ్య సిద్ధి ప్రాప్తిస్తుంది అనేది చెప్ప వలసి ఉంది. నిష్కామ కర్మయోగ ఫలమే నైష్కర్మ్య సిద్ధి.

నైష్కర్మ్య సిద్ధి అంటే ఆత్మ స్వరూపము అనుభూతిగా నిలిచి పోవడమే. అదే సర్వ కర్మ సన్యాసము. కర్మయోగములో సన్యసించడము అనే త్యాగ లక్షణము ఉంది. సన్యాసము త్యాగమునే ప్రధాన లక్షణంగా కలిగి ఉంది. ఈ త్యాగ లక్షణము కర్మయోగంలో కూడా ఉంది.

కర్మఫలము నందు ఆసక్తిని విడిచి పెట్టడము త్యాగమే కదా! కర్మఫల త్యాగము అంటే వాస్తవానికి రాగద్వేషాలను త్యాగం చేయడమే. కనుక, ఈ త్యాగ లక్షణము ద్వారా కర్మయోగంలో ప్రసాద చిత్తమును సాధించిన కర్మయోగి, లేదా భక్తుడు పరిణామ క్రమంలో సన్యాసి అవుతాడు. సన్యాసము అనే జీవన విధానాన్ని స్వీకరించక పోయినా, బుద్ధిలో సన్యాసి గానే ఉంటాడు. ఈ విషయాన్నే ప్రస్తుత శ్లోకంలో చెబుతున్నాడు. వాస్తవానికి ఇక్కడి నుండి జ్ఞానయోగ విచారం ఆరంభ మవుతుంది. జ్ఞానయోగము నందు పరిపక్వమైన వాడు నైష్కర్మ్య సిద్ధిని పొందుతున్నాడు.

### అసక్త బుద్ధి

అతడు అంతట అసక్త బుద్ధిని కలిగి ఉన్నాడు ***(అసక్త బుద్ధిః సంగరహితా బుద్ధిః)***. సంగము లేక పోవడమే అసక్తము. అట్టి బుద్ధిని కల వాడు అసక్త బుద్ధి. సంగము లేని వాడు. ఎవరితో సంగము లేని వాడు? భార్యాపిల్లల యందు ఆసక్తి లేని వాడు ***(అసక్త బుద్ధిః పుత్ర దారాదిషు)***. 'వీళ్ళు నాకు సంబంధించిన వాళ్ళు. నేను వీళ్ళకి సంబంధించిన వాడను' అనే సంగము లేని వాడు.

గృహము కాని, గృహం లోని దారా పుత్రాదులు గాని సుఖ హేతువులు కారు. సంసారాలు శిక్షా నిలయాలు. అవగాహన ఉన్న వారికి శిక్షణా నిలయాలు. అంతేగాని, రక్షణా నిలయాలు కావు. సంసారాలలో కుటుంబీకుల మధ్య ఉన్న సంబంధాలకు, కారాగృహాలలో ఖైదీల మధ్య ఉన్న సంబంధాలకు పెద్ద తేడా లేదు.

శిక్షలు పడ్డ వాళ్ళే ఖైదీలుగా ఉంటారు. కారాగృహాలలో ఉంటారు. ఎవరి శిక్షా కాలము పూర్తి అయితే, వారు విడుదలై వారి దారిన వారు పోతారు. అందరూ కారాగృహం లోకి ఒకేసారి ప్రవేశించ లేదు. అందుకని ఒకేసారి విడుదల కారు.

ప్రారబ్దాలు ఉన్న వాళ్ళే సంసారులుగా ఉంటారు. సంసారాలలో ఉంటారు. ఎవరి ప్రారబ్దం తీరిపోతే,





వారి దారిన వారు విడుదలై పోతూ ఉంటారు. సంసారాలలో అందరూ ఒకేసారి ప్రవేశించ లేదు. అందుకే ఒకేసారి విడుదల సాధ్యం కాదు.

సంసారంలో నాన్న ప్రవేశించి నపుడు అమ్మ లేదు. రెండు పదులు నాన్న సంసారంలో ఉండి, ఆ తరువాత వివాహం చేసుకున్నాడు. అప్పుడు అమ్మ వచ్చింది. ఆ తరువాత ఒక సంవత్సరము అన్న, మరొక సంవత్సరము అక్క, మరి కొంత కాలానికి నేను, ఇలా అందరూ, ఖైదీలు కారాగృహంలో ప్రవేశించినట్లు , కుటుంబంలో ప్రవేశించాము.

అందరూ ఒకే కుటుంబంలో ఉంటూ ఉన్నా, అందరూ ఒకే పనిని చేసి ఇక్కడకు చేర లేదు. ఎవరి కర్మలు వారివి. ఎవరి ప్రారబ్దాలు వారివి. ఇది అర్థమైతే, సంసారంలో అందరూ కలిసి ఉంటారు. కాని, మనస్సులు కలుపుకొని కలిసిపోరు. కల్లోలం చెందరు. అలాంటి వారే అసక్తులు. సంగబుద్ధి లేని వారు. విచార జనిత విచక్షణా చిత్తము కల వారు.

***కాతే కాంతా కస్తే పుత్రః సంసారోఽయ మతీవ విచిత్రః -*** నీ భార్య ఎవరు? నీ కుమారు డెవరు? ఇది చాలా విచిత్రమైన సంసారము అన్నారు భజగోవిందం శ్లోకాలలో శ్రీ శంకరాచార్య స్వామి. ఇదే విచారము. విచారం చేయనంత వరకు ఉన్న దంతా సంసారమే. విచారం మొదలైందా, ఆ తరువాత ఏదైనా ఉంటుంది గాని, సంసారము మాత్రము ఉండదు ***(విచార్య మాణే తత్త్వదృష్ట్యా పుత్రాదయో న సన్తి)***. ఆ మాత్రానికి నా భార్య! నా బిడ్డలు! నా సంసారము! ఒకటే కలవరింత. మేలుకుంటే, కలలు ఉండవు; కలవరింతలూ ఉండవు.

*పల్లవి :* **మేలుకోరా జీవ! మేలుకో జీవ!**
**మేలుకో సంజీవ! మేలుకో!**

*పల్లవి :* **మాయదారి యముడు మార్గాన యున్నాడు**
**మగత వీడి నీవు మేలుకో!** ॥ మేలుకోరా ॥

*చరణము :* **ఆలు బిడ్డలంచు అల్లాడుతున్నావు**
**కలసి ఎవరొచ్చారు మేలుకో!**
**కర్మము కలిసొచ్చి జీవి పోయేనాడు**
**తనువు కూడా రాదు మేలుకో!** ॥ మేలుకోరా ॥

అని మేలు తెలుపుతూ, మేలు కొలిపింది చైతన్య గీతిక.

ఈ విధమైన సంగము లేని వాడు అసక్త బుద్ధి. అతడు జితాత్ముడు. 'జిత' అంటే జయించిన వాడు. 'ఆత్మా' అంటే ఇక్కడ మనస్సు. జితాత్మా అంటే మనస్సును జయించిన వాడు ***(జితః వశీకృతః ఆత్మా అన్తః కరణం యస్య సః జితాత్మా)***. సంగత్వము లేని వాడు జితాత్ముడు. అంటే, తాను - తన వారు అనేది లేని వాడు. కోరికల నుండి విడి పడిన వాడు. కనుక అతడు విగత స్పృహుడు. వాంఛా రహితుడు.

కర్మల యందు కోరికలు లేని వాడు నిష్కర్మి. అంటే నిష్క్రియుడు. అతడు నిష్కర్ముడు కనుక, నైష్కర్మ్యమును పొందుతాడు. నిష్కర్ముని ధర్మమే కదా నైష్కర్మ్యము? ***(సః నిష్కర్మా, తస్య భావః నైష్కర్మ్యమ్)*** నైష్కర్మ్యము యొక్క సిద్ధియే నైష్కర్మ్య సిద్ధి. సర్వ కర్మ సన్యాసం వల్ల నైష్కర్మ్యసిద్ధి ప్రాప్తిస్తుంది.

*మరి, నలభై ఆరవ శ్లోకంలో చర్చించు కున్నట్లు ధర్మాచరణం వల్ల దైవారాధన చేసే కర్మయోగికి ఈ సర్వకర్మ సన్యాసము, లేదా నైష్కర్మ్య సిద్ధి ఎలా ప్రాప్తిస్తుంది? చెబుతున్నాడు.*

సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ తథాప్నోతి నిబోధ మే ।
సమాసే నైవ కౌన్తేయ నిష్ఠా జ్ఞానస్య యా పరా ॥ 50

సిద్ధిం-ప్రాప్తః-యథా-బ్రహ్మ-తథా-ఆప్నోతి-నిబోధ-మే
సమాసేన-ఏవ-కౌంతేయ-నిష్ఠా-జ్ఞానస్య-యా-పరా

| | | | | | |
|---|---|---|---|---|---|
| కౌంతేయ | = | అర్జునా! | జ్ఞానస్య | = | జ్ఞానము యొక్క |
| సిద్ధిం | = | సిద్ధిని | పరా | = | ఉత్తమమైన |
| ప్రాప్తః | = | పొందిన వాడు | నిష్ఠా | = | నిష్ఠ |
| యథా | = | ఎటుల | యా | = | ఏదియో |
| బ్రహ్మ | = | బ్రహ్మమును | సమాసేన ఏవ | = | సంక్షిప్తముగా |
| ఆప్నోతి | = | పొందుచున్నాడో | మే | = | నా వలన |
| తథా | = | అటులనే | నిబోధ | = | తెలిసికొనుము |

**అర్జునా! అంతఃకరణ శుద్ధిని సిద్ధించుకున్న వాడు ఉత్తమ మైన బ్రహ్మమును పొందుతున్నాడు. దానిని సంక్షిప్తంగా చెబుతా. తెలుసుకో!**

**వ్యాఖ్య**

కర్మయోగము ద్వారా చిత్తశుద్ధిని పొందిన వాడు బ్రహ్మమును ఎలా పొందుతాడో చెబుతాను అంటున్నాడు. అలాగే శ్రేష్ఠ మైన జ్ఞాన నిష్ఠను కూడా సంక్షేపంగా చెబుతాను అంటున్నాడు.

ప్రవృత్తి నివృత్తి లక్షణ మైన వేద ధర్మాన్ని, అభ్యుదయ నిశ్శ్రేయస హేతువు లైన కర్మయోగ, జ్ఞానయోగా లను సంక్షేపంగా చెబుతాను అని అంటున్నా డంటే, గీతాజ్ఞానాన్ని సమాప్తం చేస్తున్నాడని అర్థము. అలాగే గీతా తాత్పర్యమును, అంటే సర్వవేద సారమైన కర్మయోగ, జ్ఞానయోగాలను రెండిటిని సమన్వయించి ఏక వాక్యతను అందిస్తున్నాడు.

వేదార్థము ఏం చెబుతుంది? వేదార్థము ఏమి చెబుతుందో గీతార్థం అదే చెబుతుంది. గీతార్థం ఏదో కాదు, సమస్త మైన వేదార్థము గీత యందే సమాప్త మైంది.

బాగుంది. ఇంతకీ వేదార్థ మన్నా, గీతార్థ మన్నా ఒక్కటే అంటున్నారు కనుక, రెండూ ప్రమాణాలే నని స్వీకరించడం చేత, ప్రమాణమైన శాస్త్ర తాత్పర్యం ఏమిటి? అనేది సూటి ప్రశ్న.

ఈ సందర్భములో నేను కూడా ఒక సూటి ప్రశ్నను సంధిస్తున్నాను. ప్రమాణమైన శాస్త్రము ఏం చెబు తుంది? వేదాంత సందేశ మేమిటి?

ఇది చెయ్యండి అని చెబుతుందా? లేక, ఇది తెలుసుకోండి అని చెబుతుందా? ఇది అసలైన ప్రశ్న.

**జ్ఞాతే హి అనర్థ మూలే తదుచ్ఛేదాయ కర్మ కుర్యాత్**

అనర్థము యొక్క మూల మెక్కడో తెలిసిం దంటే, ఆ అనర్థాన్ని పోగొట్టుకోవ డానికి కర్మ చేయాలి. వీరు మొదటి వారు.

*న మోక్షార్థాని కర్మాణి ఇతి సిద్ధమ్ ! జ్ఞానాత్ మోక్షా ఇతి!*
*శాస్త్ర విహిత విషయః కర్మమార్గః బంధహేతుః !*



కర్మల వల్ల మోక్షము రాదు. జ్ఞానం వల్లనే మోక్షం వస్తుంది.
శాస్త్ర విహితమైన దైనా, కర్మ మార్గము బంధ హేతువే. వీరు రెండవ వారు.

మోక్షము అనేది పొంద వలసిందే కదా! తెలుసుకున్నంత మాత్రాన ఏం జరుగుతుంది? ఏదైనా చేస్తేనే వస్తుంది. ఏదీ చెయ్యక పోతే ఏదీ రాదు అనేది కర్మ మార్గానుయాయుల అభిప్రాయము.

ఏది చేసినా కాలం లోనే చేస్తాము. దేని ఫలం వచ్చినా కాలం లోనే వస్తుంది. కాలంలో ఏ దొచ్చినా, అది కాలం లోనే పోతుంది. కనుక నిత్యమోక్షము కర్మల వల్ల వచ్చేది కాదు. అది తెలుసుకోవలసిందే గాని, చేసి పొంద దగింది కాదని జ్ఞాన మార్గానుయాయుల మతము.

గీతోపనిషత్తులు ఈ విషయంలో సుస్పష్ట మైన అవగాహనను అందిస్తాయి. మోక్షము అనేది ఉన్నదే కనుక, ఉన్న దానిని ప్రయత్నించి పొందే దేముంటుంది? ఉన్న దానిని తెలుసుకోవాలి. తెలుసుకోవాలి అని ప్రయత్నించినా తెలియడము లేదు అంటే ప్రతిబంధకాలు ఉన్నాయి. ప్రతిబంధకాలను తొలగించుకొని విచారము చేస్తే ఉన్నది ఉన్నట్లు తెలుస్తుంది (*వస్తు సిద్ధి విచారేణ*). విచారము చేయడానికి ప్రతిబంధకా లున్నాయి కదా! అవును. ఏమిటి ఆ ప్రతిబంధకము? చిత్తశుద్ధి లేక పోవడమే. మరి, చిత్తశుద్ధి ఎలా వస్తుంది? కర్మయోగము ద్వారా వస్తుంది (*చిత్తస్య శుద్ధయే కర్మ*).

కర్మయోగము ద్వారా అంతఃకరణ శుద్ధిని పొంది, జ్ఞానమార్గము ద్వారా విచారము కొనసాగించి, బ్రహ్మాత్మ జ్ఞానమును పొందాలి. ఇదే వేదార్థము. ఇదే సంక్షేపంగా గీతా తాత్పర్యము.

*ఇక, పరమాత్మ ప్రాప్తి విధానాన్ని వరుసగా మూడు శ్లోకాలలో చెబుతున్నాడు. దీనిని గీతా సారమని, సంక్షిప్త గీత అని అంటారు. చదవండి.*

బుద్ధ్యా విశుద్ధయా యుక్తో ధృత్యాఽఽత్మానం నియమ్య చ ।
శబ్దాదీ న్విషయాం స్త్యక్త్వా రాగద్వేషౌ వ్యుదస్య చ ॥ 51

బుద్ధ్యా-విశుద్ధయా-యుక్తః-ధృత్యా-ఆత్మానం-నియమ్య-చ
శబ్దాదీన్-విషయాన్-త్యక్త్వా-రాగద్వేషౌ-వ్యుదస్య-చ

| | | | | | |
|---|---|---|---|---|---|
| విశుద్ధయా | = | విశుద్ధమైన | శబ్దాదీన్ | = | శబ్దాదులైన |
| బుద్ధ్యా | = | బుద్ధితో | విషయాన్ | = | విషయములను |
| యుక్తః | = | కూడిన వాడు | త్యక్త్వా | = | విడచి |
| ధృత్యా | = | ధైర్యముతో | రాగద్వేషౌ | = | రాగద్వేషములను |
| ఆత్మానం | = | తనను | వ్యుదస్య చ | = | విడచి |
| నియమ్య చ | = | నియమించి | | | |

**అర్జునా! విశుద్ధమైన బుద్ధిని కలిగి, ధైర్యముతో మనస్సును నిగ్రహించి, శబ్దాది విషయాలను విడిచి, రాగద్వేషాలను వదలి,**

వివిక్తసేవీ లఘ్వాశీ యత వాక్కాయమానసః ।
ధ్యానయోగ పరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః ॥ 52

**వివిక్తసేవీ-లఘ్వాశీ-యత వాక్కాయమానసః**
**ధ్యానయోగపరః-నిత్యం-వైరాగ్యం-సముపాశ్రితః**

| | | | |
|---|---|---|---|
| వివిక్తసేవీ | = ఏకాంతవాసియు | నిత్యం | = ఎల్లప్పుడు |
| లఘ్వాశీ | = మితాహారియు | ధ్యానయోగపరః | = ధ్యానయోగ పరాయణుడై యుండు వాడు |
| యత వాక్కాయమానసః | = స్వాధీన మైన మనోవాక్కాయములు కలవాడు | వైరాగ్యం | = వైరాగ్యమును |
| | | సముపాశ్రితః | = చక్కగా ఆశ్రయించిన వాడు |

**ఏకాంత ప్రదేశములో వసిస్తూ, మితాహారం చేస్తూ, వాక్కును, మనస్సును, దేహమును నియమించి, సదా ధ్యానయోగ పరుడై, వైరాగ్యమును పొంది,**

అహంకారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్ ।
విముచ్య నిర్మమః శాన్తో బ్రహ్మభూయాయ కల్పతే ॥ 53

**అహంకారం-బలం-దర్పం-కామం-క్రోధం-పరిగ్రహం**
**విముచ్య-నిర్మమః-శాంతః-బ్రహ్మభూయాయ-కల్పతే**

| | | | |
|---|---|---|---|
| అహంకారం | = అహంకారమును | విముచ్య | = విడచి |
| బలం | = బలమును | నిర్మమః | = మమకార రహితుడు |
| దర్పం | = దర్పమును | శాంతః | = శాంతుడు |
| కామం | = కామమును | బ్రహ్మభూయాయ | = బ్రహ్మత్వమును పొందుటకు |
| క్రోధం | = క్రోధమును | కల్పతే | = కల్పింపబడు చున్నాడు |
| పరిగ్రహం | = సంగ్రహమును | | |

**అహంకారము, బలము, దర్పము, కామము, క్రోధము, పరిగ్రహమును విడిచి పెట్టి, మమకారము లేకుండా, శాంతుడైన వాడు బ్రహ్మత్వాన్ని పొందడానికి సమర్థుడు.**

## వ్యాఖ్య

ప్రతిజ్ఞా వాక్యాన్ని అర్థవంతం చేస్తూ గీత యొక్క సారాన్ని వరుసగా మూడు శ్లోకాలలో సంక్షేపంగా వినిపిస్తున్నాడు. ఈ మూడు శ్లోకాలను **సంక్షిప్త గీత** అంటారు. దీనినే 'గీతా సారము' అని కూడా అంటారు. ఈ మూడు శ్లోకాలను విడగొట్టకుండా మూడిటిని ఏకంగా అర్థం చేసుకోవాలి. సాధ్య సాధనాలను సమన్వయం చేస్తూ గీతార్థా న్నంతా ఈ మూడు శ్లోకాలు ప్రతిఫలింప చేస్తాయి. ఈ మూడు శ్లోకాల లోని విషయాల నన్నిటినీ పూర్వాధ్యాయాలలో మనం విస్తరించి చెప్పుకున్నాం. అయినా, సింహావలోకనంగా, మనన పూర్వకంగా, మళ్ళీ మనస్సుకు తెచ్చుకుందాం.

సాధకుడు విశుద్ధమైన, అంటే మాయా రహితమైన, నిర్మలమైన బుద్ధితో కూడి ఉండాలి ( **బుద్ధ్యా విశుద్ధయా, మాయా రహితాయా యుక్తః** ). శుద్ధయా అనకుండా **విశుద్ధయా** అని చెప్పడంలో, ఏ మాత్రం మలినం లేని బుద్ధి యందే జ్ఞానం ప్రతిఫలిస్తుంది అనే భావం ధ్వనిస్తూ ఉంది.

కేవలం బుద్ధిని మాత్రమే కాకుండా ధైర్యముతో కూడి ఇంద్రియ మనస్సులను కూడా నియమించాలి.





***ధృత్యా ఆత్మానం నియమ్య*** - ధృతితో ఆత్మను నియమించాలి అంటున్నాడు. ఇక్కడ ఆత్మ అంటే, దేహేంద్రియాలు అయిన కార్యకరణాలు అని అర్థము ( ***ఆత్మానం కార్యకరణ సంఘాతం*** ).

శబ్దాది విషయ సంగము లేకుండా ఉండాలి. అదే శబ్దాది విషయ త్యాగము. శ్రోత్రాది ఇంద్రియాలను శబ్దాది విషయాల నుండి వెనుకకు మరల్చి అంతర్ముఖం చేయాలి ( ***శబ్దాదీన్ విషయాన్ త్యక్త్వా*** ). ఇదే ఇంద్రియ విషయ త్యాగము.

విషయాలను త్యజించినట్లే రాగద్వేషాలను కూడా త్యజించాలి ( ***రాగద్వేషౌ వ్యుదస్య చ*** ). రాగద్వేషాలను దూరం చేసుకోవడం అనుకున్నంత సులభం కాదు. వాస్తవానికి రాగద్వేషాలు ఉంటే నష్టం లేదు. కాని వాటికి వశ పడకుండా ఉండమని బోధించాడు గీతాచార్యుడు ( ***తయోర్న వశమాగచ్ఛేత్*** ). శత్రువులకు లొంగిన వాని పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాలా? సాధకునికి రాగద్వేషాలను మించిన శత్రువులు లేరని కదా గీత అభిప్రాయము ( ***తౌ హ్యస్య పరిపన్థినౌ*** )! రాగద్వేషాల వల్లనే కర్మలు బంధహేతువులు అవుతున్నాయి. రాగద్వేషాలను పీకి దూరంగా పడేస్తే, కర్మలు కోరలు తీసిన పాము ల్లాగా పడి ఉంటాయి.

ఆ తరువాత సాధకుడు ఏకాంత వాసియై ఉండాలి. అదే వివిక్త సేవిత్వం. ఏకాంత ప్రదేశమున నివసిస్తూ ఉండే అలవాటును చేసుకోవాలి ( ***వివిక్తాన్ దేశాన్ శీలమ్ ఇతి వివిక్త సేవీ*** ). జన సంసర్గము వల్ల చిత్త విక్షేపము కలిగే అవకాశం ఉంటుంది. కాలాన్ని సద్వినియోగం చేసుకోవడానికి, మనస్సును నియమించ డానికి ఏకాంతము అనువైన వాస స్థానము. కేవలం ఒంటరితనాన్ని ఏకాంత మని భావించడానికి వీలు లేదు. ఎక్కడ ఉంటే విషయా లనే అయస్కాంతాలు ఆకర్షించవో అదే నిజమైన ఏకాంత ప్రదేశము. ప్రారంభంలో ఒంటరితనము కూడా ఇందుకు కొంత ఉపయుక్తం గానే ఉంటుంది.

విహారాన్ని గురించి చెప్పుకున్నాం. ఆహారం విషయంలో కూడా సాధకులు నియమాలను అవశ్యం పాటించాలి. అదే ***లఘ్వాశీ*** అంటే ( ***లఘ్వాశీ లఘ్వాశన శీలః*** ). యుక్తాహార విహారాదులు, నిద్ర మొదలైన దోషాలను మనస్సు నుండి దూరం చేసి, చిత్త ప్రసాదాన్ని కలిగిస్తాయి. కనుక, సాధకులు ఆహార విహారాదుల యందు నియమవంతులై ఉండాలి.

ఆ తరువాత, మనోవాక్కాయా లనే త్రికరణాలను అదుపులో పెట్టుకోవాలి. కాయక తపస్సు ద్వారా శరీరాన్ని, వాచిక తపస్సు ద్వారా వాక్కును, మానస తపస్సు ద్వారా మనస్సును నిగ్రహించాలి. కాయంతో పూజ, వాక్కుతో జపము, మనస్సుతో ధ్యానములను ఆచరించడం వల్ల బుద్ధి శుద్ధి పడుతుంది. అదే ముక్తి సాధక మవుతుంది.

నిత్యము ధ్యానమును అనుష్ఠించాలి. ధ్యానయోగ పరుడై ఉండాలి. ధ్యానయోగము అంటే, గీతా భక్తుడు ధ్యాన యోగమును అనుష్ఠించే వాడై ఉండాలి. అంతేకాని, యోగధ్యానాన్ని ఆచరించే వాడుగా ఉండ కూడదు.

***యోగః చిత్తవృత్తి నిరోధః*** - మనస్సు లోని చిత్తవృత్తులను శూన్యం చేయడం యోగము. అదే యోగ ధ్యానము. కాని, భగవద్గీత బోధించే ధ్యానము వేరే. అది వృత్తి శూన్యమైన యోగ ధ్యానము కాదు. వృత్తిని పరమేశ్వర స్వరూపంగా మార్చే ధ్యానయోగము. ***సగుణ బ్రహ్మ విషయ మానస వ్యాపారః*** - సగుణ రూపుడైన పరమేశ్వరునికి సంబంధించిన విషయ సంకల్పాన్ని తదేకంగా ధ్యానించడం. అనన్య యోగంతో సేవించడం. ***విజాతీయ రహిత సజాతీయ వృత్తి ప్రవాహ సగుణ బ్రహ్మ విషయ మానస వ్యాపారః*** - పరమేశ్వరుని కన్నా అన్యమైన విషయాలను చింతించకుండా, అంటే విరళ చింతనము కాకుండా సరళ చింతనము సాగే లాగా సాధకులు నిరంతరం జాగ్రత్త పడాలి.

రాగయుత మైన బుద్ధి ధ్యానం చేయ లేదు. విరాగ మైనపుడే బుద్ధి పరమేశ్వరుని యందు లగ్న మౌతుంది. కనుక, వైరాగ్యాన్ని నిరంతరము మనస్సులో కలిగి ఉండాలి. ఈ ప్రపంచం లోని వ్యక్తులు, వస్తువులు, విషయాలు ఎంత అనిత్యమో ప్రతిక్షణం మనస్సులో అవధరించి ఉండాలి. దృష్టా దృష్ట విషయాల యందు ఆసక్తి లేక తృష్ణ లేకుండా ఉండటమే వైరాగ్యము ***(దృష్టా దృష్టేషు విషయేషు వైతృష్ణ్యం సముపాశ్రితః).*** అట్టి వైరాగ్యాన్ని నిరంతరము ఆశ్రయించాలి.

వైరాగ్యాన్ని ఆశ్రయించాలి. ఆదరించాలి. తద్వారా వినాశ హేతువైన అహంకారాన్ని దూరం చేసుకోవాలి. ఈ దేహము నేను. నేను గొప్ప వంశంలో పుట్టాను. ఉన్నత కులస్థుణ్ణి. జ్ఞానం కల వాణ్ణి. గాయకుణ్ణి. కవిని. నాతో సమానులు లేరు. నా కంఠం మధురంగా ఉంటుంది. నా మాటలు అందరిని మంత్రముగ్ధుల్ని చేస్తాయి అని విర్రవీగుతూ, దేహేంద్రియాలు తానని భ్రమించి అనర్థ ప్రలాపాలు చేయడం అహంకారము. ఆత్మ కాని విషయాల యందు ఆత్మ అనే భావమే అహంకారము ***(అనాత్మని అహ మితి మతిః అహంకారః).***

అహంకారానికి ఊత మిచ్చే వాసనా రూపమే బలము. గట్టి దైన అభిమానము దర్పము. దర్పములో సర్వత్ర దౌర్జన్యమే గాని సౌజన్య ముండదు.

***దర్పః - హృష్టో దృప్యతి. దృప్తో ధర్మ మతి క్రామతి....*** తృప్తి చెందిన అహంకారి దర్పముతో విర్ర వీగుతాడు. దర్పము చేరిందంటే, శాస్త్రాన్ని ధిక్కరిస్తాడు. సంతృప్తిలో, సంతోషములో మానవులు ధర్మాన్ని అతిక్రమించ డానికి ఈ దర్పమే కారణము. కనుక సాధకులు ప్రయత్నశీలురై వీటిని త్యజించాలి.

కామము అనేది కోరిక. అది తీరనపుడు కలిగేది క్రోధము. ధనాన్ని ప్రోగు చేసుకునే మనస్తత్త్వము పరిగ్రహము. వీటన్నిటిని త్యజించాలి. ఇవన్నీ అనాత్మ రూపాలు కనుక అనర్థ దాయకాలు. ఇలాంటి అనాత్మ విషయాల నుండి విముక్తులై, శాంతరూపులై, బ్రహ్మభూతులు కావడానికి సమర్థులు కావాలి అంటూ గీతా హృదయాన్ని సంక్షిప్తంగా ఈ మూడు శ్లోకాలలో విస్పష్టం చేశాడు వాసుదేవ భగవానుడు.

*ఈ సాధనల పర్యవసానంగా ఏర్పడే భక్తిని సమన్వయం చేస్తున్నాడు.*

**బ్రహ్మభూతః ప్రసన్నాత్మా న శోచతి న కాంక్షతి ।**
**సమ స్సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్ ॥ 54**

***బ్రహ్మభూతః-ప్రసన్నాత్మా-న-శోచతి-న-కాంక్షతి***
***సమః-సర్వేషు-భూతేషు-మద్భక్తిం-లభతే-పరాం***

| | | | |
|---|---|---|---|
| బ్రహ్మభూతః | = బ్రహ్మభావమును పొందిన వాడు | భూతేషు | = ప్రాణుల యందు |
| ప్రసన్నాత్మా | = ప్రసన్నచిత్తుడు | సమః | = సమబుద్ధి కలిగి |
| న శోచతి | = దుఃఖించడు | పరాం | = ఉత్తమమైన |
| న కాంక్షతి | = ఆశించడు | మద్భక్తిం | = నా భక్తిని |
| సర్వేషు | = సమస్త | లభతే | = పొందుచున్నాడు |

**అర్జునా! బ్రహ్మమును పొందిన ప్రసన్న చిత్తుడు దేనికీ దుఃఖించడు. దేనినీ ఆశించడు. సర్వుల యందు సమబుద్ధి కలిగి, ఉత్తమ మైన భగవద్భక్తిని పొందుతాడు.**

**వ్యాఖ్య**

వేదార్థమును, గీతార్థమును సంపూర్ణం చేసే ఉద్దేశంతో భగవంతుడు మూడు శ్లోకాలలో ముక్తసరిగా





శాస్త్రాన్ని సారభూతంగా, సంక్షేపంగా అందించాడు. సాధకులు అనునిత్యము అభ్యసించ వలసినవి, అలాగే త్యజించ వలసినవి రెండూ చెప్పడం జరిగింది. అనుష్ఠానమునే ప్రధానంగా చేసుకొని బోధించడం చేత, సాధ్య సాధనాలను అనుసంధానం చేస్తూ అందించడం జరిగింది.

అర్జునా! బ్రహ్మమును పొందిన వాడు ***(బ్రహ్మభూతః బ్రహ్మ ప్రాప్తః)*** ప్రసన్నమైన బుద్ధి కల వాడు అవుతున్నాడు ***(ప్రసన్నాత్మా లబ్ధ అధ్యాత్మ ప్రసాద స్వభావః).*** సమస్తము లైన అనర్థములు తొలగుట చేత బుద్ధిలో నిర్మలమైన పరమానందము ఆవిర్భవించిన వాడు. ఇది ఆనందమును అనుభవించడం కాదు. పున్నమి నాడు లోక మంతా వెన్నెల పరచు కున్నట్లు, బ్రహ్మభూతుని బుద్ధిలో ఆనందము అలరారుతూ ఉంటుంది. బ్రహ్మభూతు డైన సాధువు ఎవరో కాదు, బ్రహ్మమే. **సాధవో హృదయం మమ** - 'ఆ సాధువు ఎవరో కాదు; నా హృదయమే' అన్నాడు భగవంతుడు. భగవంతు డైన బ్రహ్మభూతునికి కొరత ఉంటుందా? వెలితి ఉంటుందా? ***ఆత్మనా విందతే వీర్యం*** - ఆత్మే తానని తెలుసుకున్న బ్రహ్మవిదుడు, అనంత శక్తిని పొందుతున్నాడు, అనంత ఐశ్వర్యాన్ని పొందుతున్నాడు అన్నది కేనోపనిషత్. అలాంటి వాడు తనకు ఏమి లేదని దుఃఖిస్తాడు? ఏది దూర మైందని బాధ పడతాడు? అందుచేత అతడు శోకము తెలియని వాడు. కోరిక లేని వాడు ***(న శోచతి న కాంక్షతి).***

ఇక్కడ ఒక సూక్ష్మమైన విషయాన్ని గుర్తించాలి. శోకము లేని స్థితి, కోరిక అర్థం గాని పరిస్థితి - ఈ లక్షణాలు రెండూ బ్రహ్మభూతుడైన ప్రసన్నాత్ముని స్వరూపంగా అనువదింప బడుతున్నాయే గాని, ఇవి సాధన పరమైన లక్షణాలు కావు. బ్రహ్మభూతునిలో సిద్ధించి ఉన్నవే, చంద్రుడి నుండి వెన్నెల లాగా వ్యక్త మవుతూ ఉన్నాయి. ఇది జాగ్రత్తగా అర్థం చేసుకోవలసిన విషయము. బ్రహ్మభూతుడు అంటే బ్రహ్మ భావంలో ఉండే వాడు. మోక్ష రూపుడు. ***బ్రహ్మ భావశ్చ మోక్షః*** - బ్రహ్మభావమే మోక్షము అన్నారు బ్రహ్మసూత్ర భాష్యంలో శ్రీశంకరాచార్య స్వామి. ఇదే ఆత్మ భావము. ఆత్మస్థితి. బ్రహ్మాత్మ భావ స్థితి. 'ఈ ఆత్మయే బ్రహ్మము' అనే అఖండ అద్వయానుభూతి.

***ఆనందాబ్ధిః యత్పరః సోఽహమస్మి*** - 'ఏది ఆనంద సాగరమో అది నేనే అయి ఉన్నాను' అని ప్రసన్నాత్మ డైన బ్రహ్మవిదుని దివ్యానుభూతిని ఉపనిషత్తు అభివర్ణించింది. సమస్థితిలో ఓలలాడే బ్రహ్మవిదుడు సమమైన బ్రహ్మమును తప్ప మరొక దానిని ఎలా వీక్షిస్తాడు?

అర్జునా! బ్రహ్మభూతుడు సర్వ భూతముల యందు సముడై ఉన్నాడు ***(సమః సర్వేషు భూతేషు).*** సముడైన వానికి విషమత్వ మెలా అర్థ మవుతుంది? భేదా లెలా గోచరిస్తాయి? బ్రహ్మము నిర్దోషము కనుక సమము *(5 వ అ - 19 వ శ్లో).* సముడైన బ్రహ్మభూతుడు సమ రూపమైన బ్రహ్మమునే దర్శిస్తాడు. ఆ దివ్యానుభూతిలో శోకాలు, కాంక్షలు, వాంఛలు, వరాలు అన్నీ వాటంతటవే రాలి పోతాయి. నిద్రించిన వాని చేతి లోని వస్తువు అప్రయత్నంగా జారి పోయినట్లు, అద్వైతానుభూతిలో ద్వైత మంతా వడపోతకు గురై అదృశ్య మవుతుంది.

*మనసు కట్టింది భావాల పూల మాల*
*వేయ మన్నది నువ్వు నన్ను చేరువేళ*
*నిన్ను గాంచిన మత్తులో మరచి పోతి*
*నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా!*

అని నీలకంఠ శతకంలో ఒక విబూది పండు.

ఇక్కడ ఏదయితే పరమ జ్ఞానముగా ప్రకాశిస్తూ ఉందో, అదే పరాభక్తి. ఈ రెండిటి మధ్య భేదము చూడ నవసరం లేదు. అందుచేత, అర్జునా! సమస్త భూతముల యందు సముడైన ప్రసన్నాత్ముడు నా భక్తిలో రమిస్తాడు ***( మద్భక్తిం లభతే పరామ్ ).***

అర్జునా! నాలుగు విధాలైన భక్తులు నన్ను ఆరాధిస్తున్నారు. వారు ఆర్తులు, జిజ్ఞాసువులు, అర్థార్థులు, జ్ఞానులు *(7 వ అ - 16 వ శ్లో).* నాల్గవ వాడైన జ్ఞానియే ప్రస్తుత శ్లోకంలో బ్రహ్మభూతు డైన ప్రసన్నాత్ముడు. భక్తుడిగా భజిస్తాడు. జ్ఞానియై బ్రహ్మమును పొందుతాడు. రెండూ ఒక్కటే. ఇది సూక్ష్మమైన విషయం. వాదాలకు, వివాదాలకు చిక్కేది కాదు. హృదయంతో పట్టుకోవాలి.

*అదెలాగో, తరువాత శ్లోకం అద్దం పడుతుంది.*

**భక్త్యా మా మభిజానాతి యావా న్యశ్చాస్మి తత్త్వతః ।**
**తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనన్తరమ్ ॥** 55

***భక్త్యా-మాం-అభిజానాతి-యావాన్-యః-చ-అస్మి-తత్త్వతః***
***తతః-మాం-తత్త్వతః-జ్ఞాత్వా-విశతే-తదనంతరం***

| | | | |
|---|---|---|---|
| భక్త్యా | = భక్తి చేత | తతః | = ఆ తరువాత |
| మాం | = నన్ను | మాం | = నన్ను |
| తత్త్వతః | = యథార్థముగ | తత్త్వతః | = యథార్థముగ |
| యావాన్ | = ఎంతటి వాడనో | జ్ఞాత్వా | = తెలిసికొని |
| యః చ అస్మి | = ఎట్టి వాడనో | తదనంతరం | = అటుపిమ్మట |
| అభిజానాతి | = గ్రహించు చున్నాడు | విశతే | = ప్రవేశించు చున్నాడు |

**అర్జునా! నే నెవరో, ఎలాంటి వాడనో, నా యథార్థ స్వరూపాన్ని అతడు భక్తి చేత తెలుసు కుంటున్నాడు. అలా యథార్థంగా తెలుసుకున్న తరువాత నా లోనే చేరి పోతున్నాడు.**

**వ్యాఖ్య**

గంగా యమునలు సంగమించినట్లు భక్తి జ్ఞానాలు సంగమించే పవిత్ర సన్నివేశంలో మనం నిలబడి ఉన్నాము. అనంతుడైన వాడు లేని దెక్కడ? ఆ మాట కొస్తే ఉన్న దెక్కడ? అక్కడ ఉన్నాడు అని చెప్పగానే, ఇక్కడ లేడా? అనే ప్రశ్న ఉదయిస్తుంది. పుట్టుక లేని వాణ్ణి పుట్టే ప్రశ్నలు ఏమి తెలుసుకోగలవు? అతడు ఉదయించడు. కనుక, అస్తమించడు. అతనిలో ఉదయాలు లేవు. అస్తమయాలూ లేవు ***( నోదేతి నాస్త మేతి ).*** ఉదయాస్తమయాలే లేని వానిలో ఏది వృద్ధి? ఏది క్షయం? ***( న వృద్ధిం యాతి న క్షయమ్ ).*** ఉదయాస్తమయాలు లేనిది, వృద్ధిక్షయాలు ఎరుగనిది, భానుని వలె స్వప్రకాశమై భాసించేది ఆత్మస్వరూపం. అదే బ్రహ్మ స్వరూపము. ఆత్మయే బ్రహ్మము అనే బ్రహ్మాత్మ స్వరూపము.

సూర్యునిలో ఉదయాస్తమయాలు లేవు. సూర్య భగవానుని దర్శించే మన కున్నాయి. బ్రహ్మములో ద్వైతమే లేదు. జగత్తును దర్శించే మనలో ద్వైత ముంది. మసక చీకటి తెలుస్తూ ఉంది. అదే సంధ్య. ఉదయ సంధ్యయా? సాయం సంధ్యయా? సంధ్య ఒక్కటే. అర్థ మైతే అది సంగమము. భక్తి జ్ఞానాల అపూర్వ సమ్మేళనము.





*భాను డుదయించుట తూర్పు పుణ్య మేమో*
*పడమట పాపమేమి అస్తమించు నచట*
*అందుకో స్వామి సంధ్యలో వందనములు*
*నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా !* అని నీలకంఠ శతకంలో ఒక విబూది పండు.

అర్జునా! నేను ఎంతటి వాడినో ***( యావాన్ అహం ),*** నేను ఎవడనో ***( యః చ ),*** భక్తుడైన వాడు నా యథార్థ స్వరూపమును ***( తత్త్వతః మాం )*** భక్తి చేత గుర్తిస్తాడు ***( భక్త్యా అభిజానాతి ).*** తరువాత నన్ను యథార్థ రూపంలో తెలుసుకొని ***( తతః మామ్ తత్త్వతః జ్ఞాత్వా ),*** అనంతరం నా లోనే ప్రవేశిస్తాడు ***( విశతే తదనంతరం ).***

భక్తి జ్ఞానాలు ఏకం కావడం సంగమ మని చెప్పుకున్నాం. ముందుగా భక్తి విషయాని కొస్తే, మూడు విధాలుగా తెలిసే భక్తి ఏకమైన దివ్య స్థితిలో, యమున గంగతో కలిసినట్లు, భక్తి జ్ఞానంతో ఏక మవుతుంది.

భక్తి ప్రారంభంలో మాధుర్య ప్రధానంగా ఉంటుంది. అభివృద్ధి సాధించే దశలో అది ఐశ్వర్య ప్రధాన భక్తిగా మారుతుంది. ఆ రెండిటి స్వరూపము తత్త్వత: ఒకటే అని అర్థమయ్యే దశలో అది ఏకాంత భక్తి అవుతుంది. అదే ముఖ్య భక్తి. దాని అసలు పేరు పరాభక్తి. పరమ మైన జ్ఞానము, పరమ మైన భక్తి, రెండూ ఒక్కటే అనే అనుభూతి ఇక్కడే ప్రాప్త మవుతుంది.

లోక వ్యవహారాలను సాగిస్తూ కూడా భగవంతుని యొక్క అనంత కళ్యాణ గుణాలను శ్రవణ కీర్తనాదుల ద్వారా మనస్సులో నింపుకొనే ప్రయత్నం చేయడము ప్రథమంగా గౌణభక్తి ; అంటే గుణయుత మైన భక్తి ***(లోకేఽ పి భగవద్గుణ శ్రవణ కీర్తనాత్ )*** అని నారద భక్తి సూత్ర ప్రబోధము.

ప్రహ్లాదుడు బోధించినట్లు, ఈ విధమైన గౌణభక్తిలో, నవవిధ భక్తి మార్గాలలో పరమేశ్వరుని ఆరాధించ డము జరుగుతుంది. మాధుర్య ప్రధానమైన భక్తి ఐశ్వర్య ప్రధానమైన భక్తిగా మారేది ఈ స్థితి లోనే ***(ఈశ్వరస్య భావః ఐశ్వర్యం) .*** పరమేశ్వరుని షడ్గుణైశ్వర్యాలను అర్థం చేసుకొని, మాధుర్య ప్రధాన భక్తిలో ప్రభువుగా తెలిసిన పరమేశ్వరుని సర్వైశ్వర్యమయుడుగా, భగవ త్స్వరూపంగా బుద్ధిలో నిలుపుకోవడమే ఐశ్వర్య ప్రధాన భక్తి.

సమగ్ర మైన ఐశ్వర్యము, సమగ్ర మైన ధర్మము, సమగ్ర మైన యశస్సు, సమగ్ర మైన సంపద, సమగ్ర మైన జ్ఞానము, సమగ్ర మైన వైరాగ్యము - ఈ ఆరు లక్షణాలు ఎవరిలో ఉంటాయో అతడే భగవానుడు. ఈశ్వరుడు అని గ్రహించడం, లేదా ఈశ్వర భావాన్ని బుద్ధి లోకి తెచ్చుకోవడం ఐశ్వర్య ప్రధాన భక్తి. ఇది సోపాధిక ఐశ్వర్యం. ఉపాధి ద్వారా తెలిసే ఐశ్వర్యము.

నే నెంతటి వాడినో ***( యావాన్ అహం )*** భక్తుడు తత్త్వత: తెలుసు కుంటాడు అని అంటున్నాడు. అంటే, ఉపాధులతో కలిసి, ఉపాధులలో భాసించే చైతన్యమూర్తిగా నన్ను తెలుసు కుంటాడు అని అర్థం. ఇదే సోపాధిక ఐశ్వర్యం.

ఆ తరువాత, నే నెవడనో ***( యః చ )*** కూడా తత్త్వత: భక్తుడు తెలుసు కుంటాడు అని అంటున్నాడు. అంటే, ఇక్కడ నిరుపాధిక చైతన్య స్వరూపాన్ని అర్థం చేసు కుంటున్నాడు అని భావం. సోపాధిక ఐశ్వర్యంతో శోభించే ఈశ్వరుణ్ణి ***( తం ఈశ్వరం ),*** నిరుపాధిక సత్తా స్వరూపంగా దర్శిస్తున్నాడు. ఇదే నిరుపాధిక ఐశ్వర్యం. పుట్టుక లేని, వృద్ధాప్యం తెలియని, మరణము ప్రాప్తించని, భయము అర్థం గాని, నాశ మేమిటో ఊహ కందని అద్వైత చైతన్య స్వరూప మూర్తిని పొందుతున్నాడు అని అర్థం ***( మాం అద్వైత చైతన్య మాత్రైక రసమ్ , అజమ్ , అజరమ్ , అమరమ్ , అభయమ్, తత్త్వతః అభిజానాతి ).*** సోపాధిక స్వరూపాన్ని యథార్థంగా

గ్రహించాడు (***తత్త్వతః***). రెండు చోట్ల ***తత్త్వతః***, 'యథార్థంగా' అనే ఒకే పదాన్ని ఉపయోగించడం గమనార్హం. ఉపాధి భేదమే గాని, స్వరూపతః అంటే తత్త్వతః అభేదమే అని తెలియ చేయడమే అందులోని ముఖ్యోద్దేశము.

పరమేశ్వరుని నిరుపాధిక ఐశ్వర్యంలో రెండవ వస్తువు లేదని ***తత్త్వతః*** బ్రహ్మభూతుడు అర్థం చేసుకుంటాడు. ఇది మాధుర్య ప్రధాన భక్తిని, ఐశ్వర్య ప్రధాన భక్తిని అధిగమించిన దశలో భక్తి పరాభక్తిగా రూపాంతరం చెందడము. ఇక్కడ పరాభక్తి, పరమ జ్ఞానము రెండూ ఒక్కటే. భక్తిలో పరాభక్తిగా భాసించే తత్త్వమే జ్ఞానంలో అఖండ బ్రహ్మాకారంగా శోభిస్తూ ఉంది.

ఈ దశలో, భగవంతుని సత్య జ్ఞానానంద స్వరూపమైన నిరుపాధిక సత్తా స్వరూపమును తత్త్వతః ఎరిగిన కారణంగా (***తతః మాం ఏవం తత్త్వతః జ్ఞాత్వా***), అతడు పరమాత్మ యందే ప్రవేశిస్తున్నాడు (***విశతే తదనంతరం మాం ఏవ***).

ఇక్కడ, ముందుగా పరమాత్మను తెలుసుకోవడం (***జ్ఞాత్వా***), తరువాత, పరమాత్మను పొందడము (***విశతే***) అని చెప్పడంలో రెండు క్రియలు ఉన్నా యనేది ఉద్దేశం కాదు. పొందడ మనేది మరొక ఫలంగా, వేరుగా లేదని తెలియ చేయడమే (***ఫలాన్తరాభావ జ్ఞాన మాత్ర మేవ***). ముందు పరమాత్మను తెలుసుకోవడం, ఆ తరువాత ప్రవేశించడము అనే రెండు పనులు అక్కడ లేవు. తెలుసుకోవడమే ప్రవేశించడము. అది జరిగిన తరువాత కర్తవ్యం అనేది ఇక ఉండే అవకాశమే లేదు.

పరమాత్మను తెలుసుకోవడము అంటే తాను క్షేత్రజ్ఞ స్వరూప మని తెలుసుకొని, ***అయమాత్మా బ్రహ్మ*** - ఈ ఆత్మయే బ్రహ్మ అనే మహావాక్యాన్ని అనుభూతం చేసుకోవడమే. అంతేగాని, తెలుసుకొని ప్రవేశించడము (***జ్ఞాత్వా విశతే తదనన్తరమ్***) అంటే సింహము గుహలో ప్రవేశించినట్లో, లేక గువ్వ గూటిలో ప్రవేశించినట్లో కాదు. ఉపనిషత్తు చెప్పినట్లు, ***క్షీరం క్షీరే జలం జలే*** - పాలు పాలల్లో, నీళ్ళు నీళ్ళల్లో కలిసి పోవునట్లు అని అర్థము. ఇంకా స్పష్టత కావాలి అంటే ప్రతిబింబము బింబములో ఐక్య మైనట్లు అని అర్థము.

అనంత జ్ఞాన స్వరూపములో ప్రవేశ మెక్కడ? నిష్క్రమణ మెక్కడ? అంతా బ్రహ్మ స్వరూపమే. పూర్వ శ్లోకంలో జ్ఞానంలో మునక వేసి భక్తిగంగలో తేలాం. ప్రస్తుత శ్లోకంలో భక్తి గంగలో మునకేసి జ్ఞాన సాగరంలో విలీన మవుతున్నాం. భక్తి జ్ఞాన ప్రవాహాన్ని అఖండంగా అనుభూత మొనర్చుకుంటున్నాం.

స్వభావజా లైన కర్మల చేత పరమేశ్వరుణ్ణి ఆరాధించే వారు జ్ఞాన నిష్ఠా యోగ్యతా లక్షణమైన సిద్ధిని పొందుతారు. ఈ విషయాన్ని విస్పష్టం చేసేందుకు ***స్వే స్వే కర్మణ్య భిరతః*** అనే శ్లోకంలో స్వకర్మను ఈశ్వరార్చనగా మార్చుకొనే కర్మయోగ నిష్ఠను, తద్వారా ప్రాప్తించే జ్ఞాన నిష్ఠా యోగ్యతను (అంతఃకరణ శుద్ధిని) తెలిపిన పరమేశ్వరుడు, ఈ శ్లోకం వద్ద ప్రకరణాన్ని ఉపసంహరిస్తున్నాడు. సోపాధిక పరమాత్మ తత్త్వమును భక్తి చేయడం ద్వారా జ్ఞాన నిష్ఠా యోగ్యత, నిరుపాధిక భగవ తత్త్వమును అర్థం చేసుకోవడం చేత బ్రహ్మానుభూతి కలుగుతా యనేది విస్పష్ట మైంది.

*భగవద్భక్తి భగవత్కృపను వర్షింప చేసి భగవత్స్వరూపంతో ఏకం చేస్తుంది. ఎలాగో వినండి.*

**సర్వకర్మా ణ్యపి సదా కుర్వాణో మద్వ్యపాశ్రయః ।**
**మత్ప్రసాదా దవాప్నోతి శాశ్వతం పద మవ్యయమ్ ॥** 56

**సర్వకర్మాణి-అపి-సదా-కుర్వాణః-మద్వ్యపాశ్రయః**
**మత్ప్రసాదాత్-అవాప్నోతి-శాశ్వతం-పదం-అవ్యయం**





| | | | |
|---|---|---|---|
| సర్వకర్మాణి | = సర్వ కర్మలను | అవ్యయం | = నాశరహిత మైన |
| సదా | = ఎల్లప్పుడు | శాశ్వతం | = శాశ్వతమైన |
| కుర్వాణః అపి | = చేయుచున్న వాడైనా | పదం | = పదమును |
| మద్వ్యపాశ్రయః | = నన్నే శరణు పొందిన వాడు | అవాప్నోతి | = పొందు చున్నాడు |
| మత్ప్రసాదాత్ | = నా అనుగ్రహము వలన | | |

**అర్జునా! నన్ను ఆశ్రయించిన వాడు సదా కర్మలు చేస్తూ ఉండినా, నా అనుగ్రహం వల్ల నాశము లేని మోక్షమును పొందు చున్నాడు.**

### వ్యాఖ్య

శాస్త్రార్థాన్ని ఉపసంహరించే చివరి ప్రకరణం లోకి మనం ప్రవేశించాం. జీవికి మోక్షమే ఏకైక పరమ పురుషార్థం. మోక్షం జ్ఞాన రూపంలో ఉన్నందున జ్ఞాన నిష్ఠ సాధన తోనే మోక్షం సిద్ధిస్తుంది.

జ్ఞాన నిష్ఠ మోక్ష రూప ఫలాన్నే లక్ష్యంగా కలిగి ఉంది కనుక, జ్ఞాన నిష్ఠకు ఏది నిమిత్తంగా ఉందో అట్టి అంతఃకరణ శుద్ధి, స్వకర్మ చేత ఈశ్వరుణ్ణి ఆరాధించడ మనే కర్మయోగానికి ఫలంగా ఉంది (***స్వకర్మణా భగవతః అభ్యర్చన భక్తి యోగస్య సిద్ధి ప్రాప్తిః ఫలం, జ్ఞానయోగ నిష్ఠతా***). కనుక, భక్తియోగం అనే ఈ కర్మయోగ నిష్ఠ జ్ఞానయోగ నిష్ఠకు నిమిత్తంగా ఉండటం చేత, శాస్త్రార్థాన్ని సమాప్తం చేసే ఈ చివరి ప్రకరణంలో శాస్త్రార్థ నిశ్చయం దృఢ పడటం కోసం భగవద్భక్తిని స్తుతించడం జరుగుతూ ఉంది.

పరమేశ్వరుని ఆశ్రయించుకొని, సమస్త మైన కర్మలను ఆచరిస్తూ ఉన్న భక్తుడు పరమేశ్వరుని అనుగ్రహం చేత మోక్ష పదాన్ని పొందుతాడు. ఇది శ్లోకార్థం.

శాస్త్రార్థాన్ని, వేదార్థాన్ని విస్పష్టం చేసిన గీతామాత, ప్రారంభం లోనే ప్రవృత్తి నివృత్తులను ప్రవేశ పెట్టి, కర్మయోగ, జ్ఞానయోగా లనే నిష్ఠా ద్వయంగా పేర్కొనడం జరిగింది. అధ్యాయాలను సోపానక్రమంగా మనం అధిరోహిస్తూ వచ్చినా, సూత్రార్థంగా నిష్ఠాద్వయము మనతో కలిసి పయనిస్తూనే వచ్చింది. ఇక చివరగా, శాస్త్రాన్ని ఉపసంహరించే ఈ ఆఖరి ప్రకరణంలో కూడా ఆ విషయాన్నే ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ఉపేయమైన జ్ఞాన నిష్ఠకు, కర్మనిష్ఠ ఎలా ఉపాయంగా ఉందో వివరిస్తున్నాడు.

జ్ఞానయోగి, లేదా సన్యాసి జ్ఞాననిష్ఠయే ప్రధానంగా కలిగిన వాడు. మరొక కర్తవ్యము, ధర్మాచరణము సన్యాసికి లేవు.

ఇక కర్మయోగి స్వధర్మాన్ని ఈశ్వరార్పనగా భావించి ఆచరిస్తాడు. తాను కర్మలను ఆచరిస్తున్నా, వాసుదేవుడే తనకు ఆశ్రయము అనే అభిప్రాయాన్ని దృఢంగా కలిగి ఉంటాడు.

సమస్తాన్ని పరమేశ్వరునికే సమర్పించి, సర్వేశ్వరుణ్ణే ఆశ్రయించుకొని, ఆయన అనుగ్రహం చేత ముక్తిని పొంది భక్తుడు తరిస్తాడు.

ఈ ప్రపంచం లోకి మనం వచ్చాము. ఇంద్రియ మనోబుద్ధులను కలిగిన దేహ మొక్కటే మనతో కలిసి ఉంది. ఏ ప్రపంచంలో అయితే మనం నివసిస్తున్నామో, ఆ ప్రపంచం పరమేశ్వరుని కన్నా అన్యంగా లేదు.

విశ్వంలో ఎక్కడ చూచినా నియతి ఉంది. ధర్మమే ఉంది. నియతి రూపంలో నియంతే ఉన్నాడు. ధర్మ రూపములో ఉన్నది దైవమే. ఇది అర్థమైన భక్తుడు తాను ఎక్కడున్నా, ఎలా ఉన్నా, ధర్మరూపంలో ఉన్న దైవానికి మాత్రం దూరంగా లేడు.

పరమేశ్వరుడు సర్వజ్ఞుడు. సర్వ శక్తిమంతుడు. సర్వవ్యాపి. విశ్వంలో ధర్మ రూపంలో ఉన్న భగవంతుడే వ్యక్తిలో కూడా ధర్మరూపంలో ఉన్నాడు. ఇది అర్థమైన మరు క్షణాన తన మనుగడకు ఆధారమైన వాడు ఈశ్వరుడే అని తెలిసి పోతుంది.

ఆ క్షణం నుండి ఒక్క పరమేశ్వరుణ్ణే ఆశ్రయించుకొని ఈశ్వరార్చన ప్రారంభ మవుతుంది. దాని ఫలంగా ఈశ్వర కృప కలుగుతుంది. అదే ముక్తి సాధక మవుతుంది.

***అలల వోలె నే గన్న కలల వోలె***
***కరిగి పోయాయి కల్పిత బంధనాలు***
***నా కంటి పాపగా నిలిచినావు***
***నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా !***

అని చిన్నికృష్ణ శతకంలో ఒక వెన్నముద్ద.

*భక్తిని అంతరంగ సాధనంగా చూపిస్తున్నాడు.*

**చేతసా సర్వకర్మాణి మయి సంన్యస్య మత్పరః ।**
**బుద్ధియోగ ముపాశ్రిత్య మచ్చిత్త స్సతతం భవ ॥** 57

**చేతసా-సర్వకర్మాణి-మయి-సంన్యస్య-మత్పరః**
**బుద్ధియోగం-ఉపాశ్రిత్య-మచ్చిత్తః-సతతం-భవ**

| | | | | | |
|---|---|---|---|---|---|
| చేతసా | = | మనస్సు చేత | బుద్ధియోగం | = | బుద్ధి యోగమును |
| సర్వకర్మాణి | = | సర్వ కర్మలను | ఉపాశ్రిత్య | = | అవలంబించి |
| మయి | = | నా యందు | సతతం | = | ఎల్లప్పుడును |
| సంన్యస్య | = | ఉంచి | మచ్చిత్తః | = | నా యందు చిత్తము గల వాడవు |
| మత్పరః | = | మత్పరాయణుడై | భవ | = | కమ్ము |

**అర్జునా! బుద్ధితో సర్వ కర్మలను నా యందు ఉంచు. నన్నే ఉత్తమ గతిగా భావించు. బుద్ధి యోగాన్ని ఆశ్రయించి సదా నా యందే మనస్సు కల వాడివి కా!**

## వ్యాఖ్య

***మచ్చిత్తః సతతం భవ*** - సదా నా యందే చిత్తము కల వాడవు కా! ***( మచ్చిత్తః మయ్యేవ చిత్తం యస్య తవ సః త్వం మచ్చిత్తః సన్ సతతం సర్వదా భవ! ).*** ఈ శ్లోకంలో అష్టాక్షరీ మహామంత్రం లాగా శోభిస్తున్న ఈ వాక్యము భక్తి యోగానికి గుండె లాంటిది. ప్రాణ వాయువు లాంటిది.

మనస్సు అందరికీ ఉంది. కాని అందరి మనస్సులు భగవంతుని మీద ఉండవు. ఉండ లేవు. మనస్సులో ఉండే ప్రాధాన్యతలే మనో చేష్టలను, మనో మార్గాలను నిర్ణయిస్తూ ఉంటాయి. ఎవరికి ఏది ప్రియమో, దాని మీదికి వారి మనస్సు పరుగు లెత్తుతూ ఉంటుంది. సర్వులకు ప్రియం కావలసిన వాడు పరమాత్మ ఒక్కడే అయినా, ఎందుకనో అందరికీ ఆ వైపు మనస్సు మరలదు.

భగవంతునికి సంబంధించిన ఆలోచనలే కదలని మనస్సులు కూడా ఉంటాయి. భగవంతుణ్ణి విశ్వసించి ఆరాధించే భక్తులలో కూడా సతతము వారి మనస్సులు పరమాత్మపై ఉండవు. ఉండ లేవు.

అవసరాలు, ఆపదలు చుట్టు ముట్టి నపుడు కొందరు పరమేశ్వరుని ప్రార్థిస్తారు. కొన్ని ప్రత్యేక సందర్భాలలో,





పర్వదినాలలో మాత్రమే భగవంతుని కొందరు పూజిస్తూ ఉంటారు. కొందరికి నిత్య కర్మలలో భగవదర్చన కూడా యాంత్రికంగా సాగే ఒక క్రియ లాగా ఉంటుంది. భగవంతు డంటే ఏమిటో తెలిసి, భగవంతునితో తమ కుండే నిత్య సంబంధాన్ని గుర్తించి, పరమేశ్వరుని పొందడమే జీవితంలో ఏకైక లక్ష్యంగా భావించి జీవించే భక్తులు మాత్రమే నిరంతరము తమ చిత్తాన్ని భగవంతుని యందు లగ్నం చేయ గలరు.

పరమేశ్వరుడు తనకు ఏకైక గమ్యము కావడం చేత, భక్తుడే మనస్సును సతతం భగవంతునిపై ఉంచ గలడు. అలా కానపుడు భక్తి చేయాలని పూజాగదిలో కూర్చున్నా, మనస్సు ప్రపంచంలో పచార్లు చేస్తూ ఉంటుంది. జీవితంలో గమ్యాలు అనేకంగా ఉండే టప్పుడు, మార్గాలు కూడా అగమ్య గోచరంగా ఉంటాయి.

మనస్సును పరమేశ్వరునిపై సదా ఉంచడ మనేది అనుకున్నంత సులభమైన విషయం కాదు. భారాన్నంతా పరమేశ్వరునిపై ఉంచి, ఉద్వేగము లేకుండా, ఫలాసక్తి లేకుండా కర్మలు ఆచరించ గలిగిన భక్తులు మాత్రమే సర్వ కర్మల్ని పరమేశ్వరుని యందు సమర్పించి నిశ్చింతగా ఉండ గలరు.

***రక్షిష్య తీతి విశ్వాసః*** - భగవంతుడే నన్ను రక్షిస్తాడు. భగవంతుని అమృత హస్తాలలో నా బ్రతుకు దివ్యంగా ఉంటుంది అని భావించి జీవించ గలిగితే, విశ్వామిత్రుని యాగశాల వద్ద కోదండముతో నిలబడి రక్షించిన రాముడు, మన జీవితాలలో కూడా ప్రవేశిస్తాడు.

సదా భగవంతుణ్ణే మనస్సులో పెట్టుకొని జీవించే భక్తుడు ***( మచ్చిత్తః సతతం భవ )*** పనులు ఎలా చేస్తాడు? అనే సంశయం కలుగుతుంది. భక్తి భావప్రధాన మైంది. భావము బుద్ధికి సంబంధించింది. పని ఉన్నా, లేక పోయినా, భక్తుని మనస్సు మాత్రం భగవంతుని యందే ఉంటుంది. ఏది చేసినా, దాని వెనుక మనో భావము భగవంతుడే. ఏది సమర్పించినా, అందులో అంతా భగవద్భావనే. కనుక, బుద్ధియోగాన్ని ఆశ్రయించుకొని ***( బుద్ధి యోగం ఉపాశ్రిత్య ),*** సర్వ కర్మలను భావన చేత పరమేశ్వరుని యందు సమర్పించి భక్తుడు నిశ్చింతగా ఉంటాడు. ఎలా ఉండ గలుగుతాడు? అతనికి అదెలా సాధ్యం? అతడు మత్పరుడు కనుక, అంటున్నాడు భగవంతుడు. మత్పరుడు అంటే, వాసుదేవు డైన పరమేశ్వరుణ్ణే పరుడుగా స్వీకరించిన వాడు ***(మత్పరః అహం వాసుదేవః పరః యస్య తవ సః త్వం మత్పరః సన్ ).***

మత్పరత్వము అనేది సామాన్యమైన విషయం కాదు. జీవితంలో పరమాత్మ కన్నా రెండవది అవసరం లేనపుడే మత్పరత్వం సిద్ధిస్తుంది. అన్య విషయాలను సాధించు కోవడం కోసం పరమేశ్వరుని ఆశ్రయించడం కాకుండా, పరమేశ్వరుని పరమేశ్వరుని కొరకు ప్రార్థించడమే మత్పరత్వము.

అన్యము లన్నీ అనిత్యాలే నని మత్పరునికి తెలుసు. అన్నీ పోయేవే నని తెలుసు. అందుచేత, భగవంతుడే అతని బ్రతుకులో పరమ మయ్యాడు. భగవత్సేవే ప్రధాన కర్తవ్య మైంది.

**నదులు ఉన్నవి ఉన్నవి గిరులు**
**నరులు మృగాలు వనములు తరువులు**
**ఉన్న వన్నీ పోయిన నాడు**
**మిగిలిన దేదో సత్య మదే**
**అన్ని పోయినా ఉండును దైవము**
**అతని స్మరణమే శుభకరము**
**రామ రామ జయ రాజారామ్**
**రామ రామ జయ సీతారామ్** అని రామజోగి చిట్కా.

*భక్తి ఎంత ఉత్కృష్టమో, అభక్తి అంత నికృష్టము. వినండి.*

మచ్చిత్త స్సర్వదుర్గాణి మత్ప్రసాదా త్తరిష్యసి ।
అథ చేత్త్వ మహంకారా న్న శ్రోష్యసి వినజ్క్ష్యసి ॥ 58

**మచ్చిత్తః-సర్వదుర్గాణి-మత్ప్రసాదాత్-తరిష్యసి**
**అథ-చేత్-త్వం-అహంకారాత్-న-శ్రోష్యసి-వినంక్ష్యసి**

| | | | |
|---|---|---|---|
| మచ్చిత్తః | = నా యందు చిత్తము గల వాడవై | త్వం | = నీవు |
| మత్ప్రసాదాత్ | = నా అనుగ్రహము వలన | అహం కారాత్ | = అహంకారము వలన |
| సర్వ దుర్గాణి | = సర్వ సంకటములను | న శ్రోష్యసి చేత్ | = వినక పోతే |
| తరిష్యసి | = దాటగలవు | వినంక్ష్యసి | = నశించి పోతావు |
| అథ | = ఒకవేళ | | |

**అర్జునా! నాపై మనస్సు ఉంచిన నీవు నా అనుగ్రహం వల్ల సమస్త దుఃఖాలను దాటి పోతావు. ఒకవేళ అహంకారంతో పెడ చెవిని పెడితే చెడి పోతావు.**

**వ్యాఖ్య**

భగవంతుడు దయామయుడు. కరుణా సముద్రుడు. అది వాస్తవమా, కాదా అనే విషయాన్ని అనుభవములో దర్శించడమే భక్తి సాధన.

వాడి పోవడానికే ఏదైనా వికసిస్తుంది. కూలి పోవడానికే భవంతులు లేస్తాయి. గిట్టేందుకే దేహాలు పుడుతాయి. విరిగేందుకే ఏదైనా పెరుగుతుంది.

నమ్మిన మనుషులు వమ్ము చేస్తే, ఆయుష్షును కాలం సొమ్ము చేసు కుంటుంది. అందరి బ్రతుకులు ఆపదలలో మగ్నమై ఉన్నాయి. మరణంతో ముగిసి పోయే బంధాలను, బాంధవ్యాలను నమ్ముకొని మనిషి మురిసి పోతున్నాడు. ఎన్నున్నా, ఎందరున్నా, ఎవ్వరూ తోడు రారు అనే జ్ఞానం మనిషికి రావడం లేదు.

అర్జునా! నీ మనస్సును నా యందు ఉంచు ( ***మచ్చిత్తః*** ). నా అనుగ్రహం వల్ల ( ***మత్ప్రసాదాత్*** ) సమస్తము లైన కష్టాలను, సర్వ దుఃఖాలను (***సర్వదుర్గాణి***) దాటి పోతావు. ఇది భగవంతుని ప్రతిజ్ఞ. తరించా లనుకొనే వారికి ఇదే మంగళా శాసనము.

**తరించే వాళ్ళు**

పరమాత్మ అనుగ్రహం ప్రత్యేకంగా అవసరమా? మనం బ్రతుకు తున్నది ఆయన అనుగ్రహంతో కాదా? ఆయన కృప తోనే ఉంటున్నాము. తింటున్నాము. వింటున్నాము. తిరుగు తున్నాము. శ్వాసిస్తున్నాము. పలుకు తున్నాము. పిలుస్తున్నాము.

ఈ ప్రపంచంలో మనవిగా ఏవి ఉన్నాయి? ఎవరు ఉన్నారు? నిత్యం మన కూడా ఉండే వారెవరు? అలా చూచి నపుడు చివరికి దేహం కూడా మనది కాదు. దేహం మనకు తోడు ఉండి సహకరించ వచ్చు. కాని, దేహం మనది కాదు. కనుకనే రోగాలతో వేధిస్తుంది. చివరికి శ్మశానంలో తగలబడి పోతుంది.

ఇంతకాలం విశ్వాన్ని విశ్వసించి కృంగి పోయాము. ఇక ఇప్పుడు భగవంతుణ్ణి విశ్వసించి చూడండి. ఆయన చల్లని నీడలో ఎవ్వరూ కష్టాల పాలు కారు. కన్నీళ్ళను పానం చేయరు. యుగాలు దాటిన విశ్వ మానవ చరిత్రలో భగవంతుణ్ణి నమ్మి చెడ్డ వాళ్ళు లేరు. ఒకనాడు లోకం మనల్ని విడిచి పెట్టేస్తుంది. కాని, భగవంతుడు జన్మాంతరాలలో కూడా మనకు తోడు ఉంటాడు.



అర్జునా! నీ మనస్సును నా కిచ్చేయ్! కష్టాలను, కడగండ్లను దాటి పోతావు ( ***సర్వ దుర్గాణి తరిష్యసి*** ) అంటున్నాడు.

దుర్గములు అంటే కష్టాలు. బాధలు. దాట శక్యము కానివి. దేనిని సులభంగా దాటడం శక్యం కాదో, దానిని దుర్గము అంటారు.

***దుర్గా - దుఃఖేన గమ్యతే, దుఃఖేన గంతుం శక్యతే -*** దేనిని దాటడము దుస్సాధ్యమో అది దుర్గము. అది అరణ్య ప్రయాణము కావచ్చు. గిరి ప్రయాణము కావచ్చు (***వన గిరి రూపం ఆవాసః యస్యాః సా దుర్గా***). వాటి నైనా దాట వచ్చు నేమో గాని, దుస్తర మైన సంసారాన్ని దాటడము ఎవ్వరికీ శక్యం కాదు.

మన మనస్సులలో సంసార భారం పెరిగి పోయింది. సంసార బరువును బుద్ధి మోయ లేక పోతోంది. అందుకే భవ సాగరంలో మునిగి పోతున్నాము. మన లోని భారమే మనల్ని ముంచేస్తూ ఉంది. ఆంతర్యంలో సంసారాన్ని విడిచి పెడితే చాలు. బాహ్యంలో సంసార సాగరాన్ని దాటించ డానికి పరమేశ్వరుడు సిద్ధంగా ఉన్నాడు. నన్ను నమ్ముకున్న భక్తులు భవ సాగరంలో మునిగి పోరు. వాళ్ళకు అగాధ మైన సంసార జలాలు నడుము లోతే; అని తన రెండు చేతులను నడుంపై ఉంచుకొని ప్రామాణికంగా ప్రదర్శించి మరీ ప్రతిజ్ఞ చేశాడు పాండురంగ స్వామి.

కనుక, భగవంతునిపై మనస్సు నుంచితే ( ***మచ్చిత్తః*** ), సమస్త మైన దుస్తరాలను ( ***సర్వ దుర్గాణి సర్వాణి దుస్తరాణి సంసార హేతు జాతాని*** ), సంసార కారణాలైన సమస్త అవరోధాలను, ఆయన అనుగ్రహం చేత (***మత్ప్రసాదాత్***) దాటి పోతాము ( ***తరిష్యసి అతిక్రమిష్యసి*** ).

పల్లవి : **రాధా రమణ - రాదేల కరుణ!**
**దేవకీనందన - మాకేల వేదన! ॥ రాధా ॥**

అనుపల్లవి : **జీవుల గమ్యము నీవే కావా!**
**బ్రతుకు సంద్రమున నీవే నావ! ॥ రాధా ॥**

చరణములు : **(1) నాదనుకుంటే అంతా నరకము**
**కాదనుకుంటే ఎంతో సుఖము**
**లేదనుకుంటే ఎక్కడి బంధము?**
**తోడు నీవుంటే అదియే అందము ॥ రాధా ॥**

**(2) నను కరుణించిన భక్తివి నీవే**
**నేను వరించిన ముక్తివి నీవే**
**నీ వెంట పడితే మిగలదు మోహము**
**నీవు వెంట రాగా వెలుగును మోక్షము ॥ రాధా ॥**

అని మనసును, మనుగడను మాధవుని వైపు త్రిప్పింది చైతన్య గీతిక.

**అంతరించే వాళ్ళు**

దీనదయాళుడు, భక్తవత్సలు డైన భగవంతుని నమ్మినోళ్ళు తరించి పోతూ ఉంటే, అహంకారాన్ని పట్టుకొని భగవంతుని నమ్మలేని వాళ్ళే చెడి పోతున్నారు. పాడై పోతున్నారు. నశించి పోతున్నారు.

తరించే మార్గాన్ని తెలియ జేస్తూ, భగవంతుడు హిత వచనాన్ని వినిపించినా, అహంకారం చేత నేనే పండితుణ్ణి అని విర్రవీగుతూ, పరమాత్మ మాటను వినని వారు ( ***అహంకారాత్ పండితం అహ మితి న***

శ్రోష్యసి చేత్ ). తప్పక నశించి పోతారు అంటున్నాడు భగవంతుడు ( *వినంక్ష్యసి వినాశం గమిష్యసి* ).
అహంకారంతో మనిషి ఏమి పొంద గలడు, వినాశము తప్ప?

మరి, కురుక్షేత్రంలో 'నేను యుద్ధము చేయను' అని అర్జునుడు పలికింది అహంకారం కాదా? దానికి శ్రీకృష్ణుడు ఏమి చెబుతాడు? మీరే వినండి.

యు దహంకార మాశ్రిత్య న యోత్స్య ఇతి మన్యసే ।
మిథ్యైష వ్యవసాయ స్తే ప్రకృతి స్త్వాం నియోక్ష్యతి ॥ 59

*యత్-అహంకారం-ఆశ్రిత్య-న-యోత్స్య-ఇతి-మన్యసే*
*మిథ్యా-ఏషః-వ్యవసాయః-తే-ప్రకృతిః-త్వాం-నియోక్ష్యతి*

| | | | | | |
|---|---|---|---|---|---|
| యత్ అహంకారం | = | ఏ అహంకారమును | వ్యవసాయః | = | ప్రయత్నము |
| ఆశ్రిత్య | = | ఆశ్రయించి | మిథ్యా | = | వ్యర్థము |
| న యోత్స్య ఇతి | = | యుద్ధము చేయనని | త్వాం | = | నిన్ను |
| మన్యసే | = | తలచు చున్నావో | ప్రకృతిః | = | స్వభావము |
| తే | = | నీ యొక్క | నియోక్ష్యతి | = | నియోగింప గలదు |
| ఏషః | = | ఈ | | | |

**అర్జునా! అహంకారాన్ని ఆశ్రయించి, 'నేను యుద్ధము చేయను' అని నువ్వు అనుకున్నా, నీ ప్రయత్నము జరగదు. నీ స్వభావమే నీ చేత ఆ పని చేయిస్తుంది.**

స్వభావజేన కౌన్తేయ నిబద్ధః స్వేన కర్మణా ।
కర్తుం నేచ్ఛసి యన్మోహా త్కరిష్య స్యవశో౽పి తత్ ॥ 60

*స్వభావజేన-కౌంతేయ-నిబద్ధః-స్వేన-కర్మణా*
*కర్తుం-న-ఇచ్ఛసి-యత్-మోహాత్-కరిష్యసి-అవశః-అపి-తత్*

| | | | | | |
|---|---|---|---|---|---|
| కౌంతేయ | = | అర్జునా! | స్వభావజేన | = | స్వభావ సిద్ధమైన |
| యత్ | = | దేనిని | స్వేన | = | నీ దైన |
| కర్తుం | = | చేయుటకు | కర్మణా | = | కర్మ చేత |
| మోహాత్ | = | మోహము వలన | నిబద్ధః | = | బంధింపబడిన వాడవై |
| న ఇచ్ఛసి | = | ఇచ్ఛగింపవో | అవశః అపి | = | పరవశుడవై కూడా |
| తత్ | = | దానిని | కరిష్యసి | = | చేయుదువు |

**అర్జునా! అజ్ఞానము చేత ఏ పనిని చేయడానికి నువ్వు ఇష్ట పడటం లేదో, నీ స్వభావమునకు సంబంధించిన ఆ కర్మను నీకు తెలియకనే నీ స్వభావము నీ చేత చేయిస్తుంది.**

### వ్యాఖ్య

పూర్వ సంస్కార జనితమైన స్వభావము చేత స్వకర్మలు స్వధర్మంగా నిర్ణయింప బడుతున్నా యని స్పష్టంగా అర్థం చేసుకున్నాం. స్వభావం మనతో కలిసి పుట్టింది. స్వభావాన్ని ఎవ్వరూ అతిక్రమించ లేరు. స్వధర్మాచరణం ప్రవాహానికి అనుకూలంగా ఈదడ మైతే, పరధర్మాచరణం ఎదురీత లాంటిది. ఎంత ప్రయత్నిస్తున్నా ప్రమాద భరితం గానే ఉంటుంది.



కనుక స్వకర్మను, స్వధర్మాన్ని అనుసరిస్తూ, ఫలాభిసంధి లేకుండా, శాస్త్ర విహిత కర్మలను ధర్మబద్ధంగా ఆచరిస్తే, చిత్తశుద్ధి కలిగి జ్ఞాననిష్ఠా యోగ్యత సిద్ధిస్తుందని పరమేశ్వరుడు సశాస్త్రీయంగా, సలక్షణంగా వివరించాడు.

సందర్భాన్ని దృష్టిలో ఉంచుకొని అర్జునుని ఉద్దేశించి, సర్వ మానవాళికి ఉపయుక్త మైన ఒక సూచనను భగవంతుడు ఇస్తున్నాడు.

'అర్జునా! నేను ఇంత చెప్పినా, ఇదంతా నేను ఎందుకు చేయాలి? నాకు కర్మ స్వేచ్ఛ ఉంది. నేను స్వతంత్రుణ్ణి. నా ఇష్ట మొచ్చినట్లు చేస్తాను. యుద్ధం నాకు ఇష్టం లేదు. నేను యుద్ధం చెయ్యను అని (*న యోత్స్య ఇతి*) నీవు అనుకున్నా, నీ నిర్ణయము సముచిత మైనది కాదని, నిస్సార మైనదని, మిథ్యా మాత్ర మని (*ఏషః వ్యవసాయః మిథ్యా*) చెబుతున్నాను. నీ స్వభావమే నీ చేత యుద్ధం చేయిస్తుంది' అంటున్నాడు భగవంతుడు. ఇక్కడ ఒక్క విషయాన్ని గమనించాలి. ***న యోత్స్య ఇతి*** - అని పరమేశ్వరుడు ఈ శ్లోకంలో ప్రయోగించిన మాట, అంటే, 'నేను యుద్ధము చేయను' అనే మాట, అర్జునుడు మునుపు రెండవ అధ్యాయంలో పలికిందే (*2వ అ - 9 వ శ్లో*). అదే మాటను గనుక అర్జునుడు ఈ దశలో కూడా పలికితే, గీతా ప్రబోధ ప్రభావం పార్థునిపై లేనట్లే. ప్రమాణం ఫలించనట్లే.

అహంకారాన్ని పట్టుకొని, గాండీవాన్ని పడేసి, యుద్ధము చేయను అని ప్రారంభంలో అన్నాడు. గీతార్థం సమాప్త మైంది. ఇప్పుడు కూడా అహంకారం చేతిలో పనిముట్టుగా మారుతాడా? లేక అహంకారాన్ని విడిచి, అచ్యుతుని వాక్యానుసారం శాస్త్ర విహిత కర్మను ధర్మబద్ధంగా ఆచరిస్తాడా?

భగవంతుడు స్వధర్మాచరణమునకు హేతువును కూడా చెబుతున్నాడు. అర్జునా! నేను చెయ్యను అని నువ్వు భీష్మించుకున్నా, నీది క్షత్రియ స్వభావం కనుక (***శౌర్యం తేజో ధృతిః*** - *43 వ శ్లో*), నీ స్వభావజ కర్మ మైన యుద్ధమును పట్టు తప్పి, ప్రకృతిచే నెట్టబడి మరీ ఆచరిస్తావు. యుద్ధం మానాలి అన్న నీ ప్రయత్నాలు ఫలించవు. నీ నిర్ణయం మిథ్యే కనుక తప్పక వ్యర్థ మౌతుంది. ఆకాశంలో కాలి నడకన ప్రయాణం చేయా లనుకునే వాడి ప్రయత్నానికి, ***న యోత్స్య ఇతి*** అనే నీ నిర్ణయానికి పెద్ద తేడా లేదు.

అర్జునా! చివరగా ఒక్క మాట చెబుతున్నా. విరాట నగరంలో నువ్వు చేసిన నిర్వాక మేమిటి? నా నిర్వాకమే కదా! ఈ రోజు నేను నీ బండిని తోలుతున్నట్లు, ఆ రోజు నువ్వు ఉత్తర కుమారుని రథం నడప డానికి కులుకుతూ మరీ వెళ్ళావు. ఆ పని చేసి తిరిగి రావడం నీ కర్తవ్యము. అలా చేయకుండా, కౌరవులను అభిముఖంగా చూడగానే వాళ్ళ మీదికి రెచ్చిపోయా వెందుకని? వారిపై విరుచుక పడి వీర పోరాటం చేశా వెందుకని? ఇప్పు డర్థ మైందా? స్వభావం అలా మెడ పట్టి ముందుకు నెట్టుతుంది! వెను దిరిగి చూడ నివ్వదు. స్వభావాన్ని మార్చడం దేహంపై వస్త్రం మార్చినట్లు కాదు. శరీరంపై ఉన్న చర్మాన్ని ఒలిచినట్లే ఉంటుంది.

***ప్రాక్సంసార పరంపరా పరిణతం ప్రాయో మనః ప్రాణినాం కస్తస్య ప్రకృతిం నిరస్య సహజాం కర్తా౽న్యథా స్యాన్నరః। దౌర్గన్ధ్యం లశునాది కస్య సహజం యత్నా త్సముత్సారయన్ సౌరభ్యం వితనోతి కో౽ సురభితాం కర్పూర ముఖ్యస్యవా*** - సాధారణంగా ప్రాణుల మనస్సు పూర్వ సంస్కార పరంపర చేత పరిణతమై ఉంటుంది. సహజ మైన తన స్వభావాన్ని విడిచి పెట్టి మనిషి ఎప్పుడూ మరో విధంగా ప్రవర్తించ లేడు. లశునాదులకు (వెల్లుల్లి) సహజ వాసనను తొలగించడం గాని, కర్పూరాదుల సువాసనను వాటికి లేకుండా చేయడం గాని ఎవరికి సాధ్య పడుతుంది? స్వభావం కూడా అంతే - అని **పరమార్థ ప్రప** వ్యాఖ్యానంలో దైవజ్ఞ పండిత సూరి అభిప్రాయ పడ్డారు.

*స్వభావాన్ని తయారు చేసుకోవడం మన చేతిలో ఉంది. కాని, ఆ తరువాత దానిని నిరాకరించడం మన చేతిలో లేదు. అది నియంత చేతి లోకి చేరి పోతుంది. ఆ తరువాత, మరో విధంగా ప్రవర్తించడం ఎవ్వరికీ వీలు కాదు. ఎందుకని? అక్కడ మనం కీలుబొమ్మలం కనుక. చదవండి.*

**ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి ।**
**భ్రామయ న్సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా ॥** 61

***ఈశ్వరః-సర్వభూతానాం-హృద్దేశే-అర్జున-తిష్ఠతి***
***భ్రామయన్-సర్వభూతాని-యంత్రారూఢాని-మాయయా***

| | | | |
|---|---|---|---|
| అర్జున | = అర్జునా | భ్రామయన్ | = త్రిప్పుచు |
| ఈశ్వరః | = ఈశ్వరుడు | సర్వభూతానాం | = సమస్త ప్రాణుల యొక్క |
| యంత్రారూఢాని | = యంత్రము నధిష్ఠించిన వారి వలె | హృద్దేశే | = హృదయ ప్రదేశము నందు |
| సర్వభూతాని | = సమస్త ప్రాణులను | తిష్ఠతి | = ఉన్నాడు |
| మాయయా | = మాయాశక్తి చేత | | |

**అర్జునా! పరమేశ్వరుడు సర్వ జీవుల హృదయాలలో నెలవై ఉన్నాడు. యంత్రము నెక్కిన వాడు త్రిప్పునట్లు, జీవు లందరినీ తన మాయా శక్తి చేత త్రిప్పు చున్నాడు.**

### వ్యాఖ్య

స్వభావాలు మనం తయారు చేసుకుంటాం. కర్మలను మనం ఆచరిస్తాం. కాని, వీటి ఫలితాలు మన చేతుల్లో ఉండవు. సర్వ నియంత అయిన సర్వేశ్వరుని చేతి లోకి చేరి పోతాయి. ఆ క్షణం నుండి మనం ఆయన చేతిలో కీలు బొమ్మలం. జీవన రంగుల రాట్నం లోకి ప్రవేశిస్తాం. ఆ తరువాత, మాయను తన వశంలో ఉంచుకున్న ఈశ్వరుడు, జీవన చక్రాన్ని త్రిప్పు తుంటాడు.

**రంగుల రాట్నం**

అర్జునా! సర్వ ప్రాణులను నియమించే ఈశ్వరుడు సర్వ ప్రాణుల హృదయాలలో ఉన్నాడు (***ఈశ్వరః ఈశన శీలః నారాయణః సర్వప్రాణినాం హృదయ దేశే తిష్ఠతి***). రంగుల రాట్నమును ఎక్కిన వారిని యంత్రాన్ని నడిపే వాడు ఎలా త్రిప్పుతాడో, అలాగే దేహాలనే బొమ్మలను ఎన్నుకొని, వాటిని అవధరించిన జీవులను భగవంతుడు తాను అకర్తే అయినా, నిష్క్రియుడే అయినా, మాయను అదుపులో ఉంచుకొని ఈ జగచ్చక్రాన్ని, జీవన చక్రాన్ని త్రిప్పుతూ ఉంటాడు.

రంగుల రాట్నంలో రకరకాల బొమ్మలు ఉంటాయి. ఎవరికి ఏ బొమ్మ ఇష్టమో - అది ఏనుగో, గుఱ్ఱమో, ఆవో, సింహమో - దానిపై ఎక్కి కూర్చుంటారు. త్రిప్పే వాడు అందరిని సమానంగా త్రిప్పు తుంటాడు.

సర్వ ప్రాణులు, అంటే మానవులే కాదు, జీవు లన్నీ వాటి వాటి ఉపాధులను, దేహాలను ధరించి ఉన్నాయి. పరమాత్మ జీవన యంత్రాన్ని త్రిప్పుతున్నాడు. యంత్రాన్ని త్రిప్పే వాడు కూడా యంత్రం లోనే ఉన్నాడు.

***యః పృథివ్యాం తిష్ఠన్ పృథివ్యా అన్తరోఽ యం పృథివీ న వేద యస్య పృథివీ శరీరం యః పృథివీ మన్తరో యమయతి!*** - ఎవడు భూమి వంతా వ్యాపించి ఉన్నాడో, ఎవడిని భూమి తెలుసుకో లేదో, ఎవనికి ఈ పృథివి





ఉపాధిగా ఉందో, పృథివిలో ఉంటూ ఎవడు పృథివిని నియమిస్తున్నాడో, అతడే పరమేశ్వరుడు, ఆదినారాయణ మూర్తి అని బృహదారణ్యక శ్రుతి.

రంగుల రాట్నంలో ఎక్కిన వాడికి త్రిప్పట తప్పదు. బొమ్మను ఆశ్రయించి ఉన్నంత వరకు తిరుగుతూ ఉండ వలసిందే. దిగి పోవాలి అనుకుంటే మాత్రం త్రిప్పే వాణ్ణి ఆశ్రయించాలి.

దేహాభిమానం ఉన్నంత వరకు జీవులు జనన మరణ చక్రంలో తిరుగుతూ ఉండ వలసిందే. ఈశ్వరుణ్ణి ఆశ్రయిస్తే త్రిప్పట తప్పుతుంది. హృదయం శాంతిస్తుంది. 'దురదృష్టాలలో అదృష్టం' అనే నానుడి ననుసరించి, మనం చేసుకున్న కర్మలు విధి రూపంలో బాధిస్తున్నా, వాటిని దూరం చేసి మనల్ని రక్షించే పరమేశ్వరుడు మన హృదయం లోనే ఉండటం మన అదృష్టం. జగ చ్చక్రాన్ని, జీవి ప్రారబ్ధాన్ని నియంత్రించే నేత మన హృదయం లోనే ఉన్నాడు (***నేతా - జగద్యంత్ర నిర్వాహకః నేతా*** - *విష్ణుసహస్రనామం ; 222 వ నామం*). ఇక, మనం అనాథుల మెలా అవుతాము? తెలియక పోతే అనాథులము. తెలిస్తే సనాథులము.

*మరి, ఈ మాయా నిర్మిత జగద్యంత్రము నుండి, ఈ రంగుల రాట్నం నుండి విముక్తిని పొందే దెలా? పరమేశ్వరునికి శరణాగతులం కావడమే. చదవండి.*

**తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత ।**
**తత్ప్రసాదా త్పరాం శాన్తిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్ ॥** 62

***తం-ఏవ-శరణం-గచ్ఛ-సర్వభావేన-భారత***
***తత్ప్రసాదాత్-పరాం-శాంతిం-స్థానం-ప్రాప్స్యసి-శాశ్వతం***

| | | | |
|---|---|---|---|
| భారత | = అర్జునా! | పరాం | = ఉత్తమమైన |
| సర్వభావేన | = సర్వ భావముల చేత | శాంతిః | = శాంతిని |
| తం ఏవ | = అట్టి పరమేశ్వరునే | శాశ్వతం | = శాశ్వతమైన |
| శరణం | = శరణును | స్థానం | = మోక్షమును |
| గచ్ఛ | = పొందుము | ప్రాప్స్యసి | = పొందగలవు |
| తత్ప్రసాదాత్ | = అతని అనుగ్రహము వలన | | |

**అర్జునా! అన్ని విధాల పరమేశ్వరునే శరణు బొందు. అతని అనుగ్రహం చేత పరమశాంతిని, నిత్య మోక్షాన్ని పొందుతావు.**

### వ్యాఖ్య

భక్తి పవిత్ర మైంది. శరణాగతి రూపంలో శోభిస్తుంది. భక్తి హృదయాన్ని పవిత్రంగా మార్చుతుంది. భగవంతుడు ఉండేది హృదయం లోనే నని తెలుసుకున్నాం కదా! చిద్విలాసుని చిరునామా తెలిసి పోయింది. ఇక అది గుండె ఎలా అవుతుంది? గుడి అవుతుంది. భక్తి గుండెను గుడిగా మార్చుతుంది. బాహ్యంలో ప్రపంచాన్ని చూస్తే దుఃఖ మంతా మనదే. ఆంతర్యంలో అచ్యుతునికి శరణాగతుల మైతే సుఖా లన్నీ మనవే. శాంతి మన సొంతం. మనమే శాంతి. మనస్సులను మల్లెల లాగా తెల్లగా, చల్లగా మార్చుకొని, సంపూర్ణ శరణాగతులమై గుండె గుడి వైపు నడక సాగిద్దాం. గోవిందుని సన్నిధిలో ఒదిగి పోదాం. హృదిలో హృదయేశ్వరునితో చేరి పోదాం.

ఎవరు లేక మిగిలి యున్నా నిన్నే నమ్ముకున్నా
వమ్ము చేసి పోకురా బ్రతక లేను కన్నా!
మల్లె కన్నా తెల్ల నైన మనసు నాకుందిరా!
మనసు లేని స్వామి నా మనసు నేలరా! ॥ మల్లె ॥

అంటూ మన వెంట నేపథ్య సంగీతంలా నడుస్తూ ఉంది చైతన్య గీతిక.

అర్జునా! అన్ని విధాల *(సర్వ భావేన సర్వాత్మనా)* ఈశ్వరుణ్ణే *(తం ఏవ)* శరణు పొందు *(శరణం గచ్ఛ)* అంటున్నాడు భగవంతుడు. సంసార దుఃఖాన్ని పోగొట్టుకోవడానికి *(సంసారార్తి హరణార్థం)* పరమేశ్వరుని ఆశ్రయించాలి. ఇదే శరణాగతి.

వట్టి చేతులతో, ఓటి చేతులతో ప్రపంచం లోకి వచ్చాం. ఇక్కడ ఎలా బ్రతకాలని వచ్చాము? ఎంత గుండె నిబ్బరంతో వచ్చాము? ఎవరి ధైర్యంతో వచ్చామో, ఆ దయామయుడు ఇక్కడే ఉన్నాడు. మనం ఎక్క డుంటే అక్కడున్నాడు. మనం చూచే ప్రతి విషయంలో తానే ఉన్నాడు. మన చూపులో కూడా తానే ఉన్నాడు. మన దేముంది? అంతా అతనిదే. అన్నీ తానే. ఇదే శరణాగతి.

భగవాన్! నువ్వు ఇచ్చిన దేహం ఇది. నేను పీల్చే గాలిలో ప్రాణం నువ్వే. నేను తినే ఆహారంలో శక్తి నువ్వే. నేను పానం చేసే జలములో ప్రాణాధారము నువ్వే. నేను తిరిగేది నీ లోనే. నీ వల్లనే నా దేహంలో వేడి. నీ వల్లనే నా మనస్సులో వాడి.

ఇవే భావ సుమాలు. గుండె గుడిలో నిరంతరం భావ సుమాలను భగవంతునికి సమర్పిస్తూ ఉండాలి. అదే శరణాగతి. శరణాగతిలో బుద్ధి వికసిస్తుంది. హృదయం నిర్మల మవుతుంది. సంసార దుఃఖా లన్నీ తీరి పోతాయి. అందుకే భక్తిలో శరణాగతి మహోత్కృష్ట మని చెప్ప బడింది.

**ఈశ్వరునే శరణంబు వేడెదన్** అన్నాడు గజేంద్రుడు. మనమూ అదే అనాలి. అలాగే ప్రార్థించాలి. అలాగే శరణాగతులం కావాలి.

**సర్వదా సర్వ భావేన నిశ్చింతితైః భగవానేవ భజనీయః**

అంతట, అన్ని విధాల మరో చింత లేకుండా పరమేశ్వరుణ్ణే భజిస్తూ ఉండాలి అని నారద భక్తి సూత్ర ప్రబోధము.

హే భారతా! అర్జునా! ఇలా శరణాగతు లైన వారు ఈశ్వరానుగ్రహం చేత ఉత్తమ మైన శాంతిని, మోక్షాన్ని పొందుతారు.

***స కీర్త్యమానః శీఘ్ర మేవ ఆవిర్భవతి అనుభావయతి చ భక్తాన్*** - భగవంతునికి శరణాగతులమై భక్తి చేస్తే, శీఘ్రముగా భగవంతుడు మనకు దర్శన మిచ్చి, దివ్యానుభూతిని అనుగ్రహిస్తాడు.

*చెప్పవలసిం దంతా భగవంతుడు చెప్పేశాడు. ఇక మనం చెయ్య వలసిందే మిగిలి ఉంది.*

**ఇతి తే జ్ఞాన మాఖ్యాతం గుహ్యా ద్గుహ్యతరం మయా ।**
**విమృశ్యైత దశేషేణ యథేచ్ఛసి తథా కురు ॥ 63**

**ఇతి-తే-జ్ఞానం-ఆఖ్యాతం-గుహ్యత్-గుహ్యతరం-మయా**
**విమృశ్య-ఏతత్-అశేషేణ-యథా-ఇచ్ఛసి-తథా-కురు**



| | | |
|---|---|---|
| ఇతి | = | ఇట్లు |
| గుహ్యాత్ | = | గుహ్యమైన దాని కంటె |
| గుహ్యతరం | = | రహస్య మైనది |
| జ్ఞానం | = | జ్ఞానము |
| మయా | = | నా చేత |
| తే | = | నీ కొరకు |
| ఆఖ్యాతం | = | చెప్పబడినది |
| ఏతత్ | = | దీనిని |
| అశేషేణ | = | పూర్తిగ |
| విమృశ్య | = | విచారణ చేసి |
| యథా | = | ఏ విధముగ |
| ఇచ్ఛసి | = | అభిలషింతువో |
| తథా | = | అలాగున |
| కురు | = | చేయుము |

**పార్థా! రహస్యాల లోకి రహస్య మైన జ్ఞానాన్ని నీకు బోధించాను. బాగా విచారం చెయ్యి. ఆ తరువాత, ఏది నీ కిష్టమో అది చెయ్యి.**

**వ్యాఖ్య**

భగవంతుడు గీతా శాస్త్రాన్ని ఉపసంహరిస్తున్నాడు. అర్జునా! రహస్యాల లోకి రహస్యమైన జ్ఞానాన్ని నీకు బోధించాను అన్నాడు *(గుహ్యాత్ గుహ్యతరం అతిశయేన గుహ్యమ్ రహస్యం ఇత్యర్థః)*.

రహస్యం అంటే లేనిది కాదు. ఉండి తెలియనిది. ఒక వ్యక్తి పిడికిలి బిగించి, 'నా చేతిలో ఏముందో చెప్పండి' అన్నా డనుకోండి. అతని చెయ్యి మన ముందే ఉన్నా, మనం చెప్ప లేము అనే నమ్మకం ఉండ బట్టే అతడు ఆ ప్రశ్న వేశాడని అర్థం. అదే రహస్య మంటే. ఒకవేళ పిడికిలి విప్పేస్తే, ఆ వస్తువు ఏదో కాదు, చింత పిక్క అని తెలిసి పోతుంది. ఆ క్షణం నుండి రహస్యం లేదు. చింత లేదు.

అలా కాకుండా, పిడికిలి విప్పి చూపినా, అది రహస్యం గానే ఉందంటే, దాని నే మనాలి? చెప్పనా! వేదాంతం అనాలి. వింటూనే ఉంటారు. అర్థం గాక తికమక పడుతూనే ఉంటారు *(శృణ్వన్తః అపి న జానన్తి)*. అందుకే అది రహస్యం కాకుండా రహస్యాల లోకి రహస్య మైంది *(గోప్యాత్ గోప్యం)*.

ఇది ప్రమ. అంటే జ్ఞానానికి సంబంధించిన విషయం. ప్రమాణము ఉంటేనే అర్థ మౌతుంది. అది కూడా బోధనా విధి తెలిసిన వాడు బోధించి నపుడే అర్థ మవుతుంది. అంతే గాకుండా, శ్రోత కూడా అర్హుడై ఉండాలి. శిక్షణ యోగ్యుడై ఉండాలి. ఇన్ని విషయాలపై ఆధారపడి ఉన్న ఈ ప్రామాణిక జ్ఞానము వ్యక్తి స్వరూపమే అయి ఉండటం కూడా ఒక కారణం. ఇన్ని కారణాల చేత బ్రహ్మవిద్య రహస్య జ్ఞాన మైంది. భగవత్ప్రసాదంగా అర్జునునికి, అర్జునుని కారణంగా మనకు లభ్య మైంది.

అంతా చెప్పి, చివరగా ఒక్క వాక్యాన్ని భగవంతుడు మహోన్నతంగా పలికాడు. 'అర్జునా! నేను చెప్పిన ఈ రహస్య మైన జ్ఞానాన్ని బాగా విమర్శించుకొని *(అశేషేణ విమృశ్య)*. ఆ తరువాత, నీకు ఎలా చెయ్యా లనిపిస్తే అలా చెయ్యి!' *(యథేచ్ఛసి తథా కురు!)*. ఎంత అందమైన మాట! ఎంత అర్థవంత మైన మాట! ఆర్ష సంస్కృతీ వైభవాన్ని అంబారీ ఎక్కించి ఊరేగించిన రతనాల మూట.

ఇంత జ్ఞానాన్ని సాక్షాత్తు భగవంతుడే సహేతుకంగా అందించిన తరువాత, అర్జునుడు ఆలోచించ డానికి ఏమి మిగిలుంది గనుక? 'శాస్త్రాన్ని పూర్ణంగా చెప్పాను. అర్జునా! నేను చెప్పినట్లు చెయ్యి' అని శ్రీకృష్ణుడు ఎందు కనలేదు?

ఎందుకో చెప్పనా! శ్రీకృష్ణుడు మత బోధకుడు కాదు కనుక. నమ్మకాలను ఫణంగా పెట్టి సొమ్ము చేసుకోవడం, బ్రతుకుల్ని వమ్ము చేయడం తెలియని వాడు కనుక. తన జ్ఞానం మీద తనకు అకుంఠిత మైన

నమ్మకం ఉన్న వాడు కనుక. ఇంత బోధించిన తరువాత, 'ఇలా ఆచరించు' అని చెప్పడం అంటేనే గురువుకు తన మీద, తన జ్ఞానం మీద నమ్మకం లేదని అర్థము. అలా గాక, ఇతడు ఆచరిస్తాడో లేదో అనే అవిశ్వాసం గురువుకే గనుక శిష్యుడి మీద ఉంటే, ఇక అత డెలాంటి శిష్యుడై ఉండాలి?

అందుకే, ***యథేచ్ఛసి తథా కురు*** - నీకు ఎలా ఇష్టమో అలా చేసుకో! శ్రీకృష్ణుడే కాదు, ఏ గురువైనా ఆర్ష ధర్మంలో అదే చేస్తాడు. అదే చేయాలి. అంతేగాని, వ్యక్తి స్వేచ్ఛను భగ్నం చేయ కూడదు. ఎవరి స్వేచ్ఛను వారికి ఉండ నివ్వాలి. కారణం, ఎవరి మనస్సుతో వారు తరించాలి కనుక.

***శాస్త్రం దృష్టం గురోర్వాక్యం తృతీయం ఆత్మ నిశ్చయం*** - శాస్త్ర ప్రమాణం మొదటిది. సంప్రదాయంలో ప్రాప్తించిన గురుబోధ రెండవది. స్వాభిప్రాయం మూడవది. మొదటి రెండు గురువు చేయ వలసిన పనులు. మూడవది శిష్యునికి సంబంధించిన విషయం. ఈ ఉత్కృష్ట మైన సంప్రదాయమే గీత లోనూ అనుసరించ బడింది. శ్రీకృష్ణుడు గురువుగా తాను చేయ వలసింది చేశాడు. తరువాత నిర్ణయాన్ని శిష్యుడికే విడిచి పెట్టాడు.

**ఆర్ష సంస్కృతికీ జై!**

*చివరగా హితబోధ చేస్తున్నాడు.*

**సర్వగుహ్యతమం భూయః శృణు మే పరమం వచః ।**
**ఇష్టోఽసి మే దృఢ మితి తతో వక్ష్యామి తే హితమ్ ॥** 64

**సర్వగుహ్యతమం-భూయః-శృణు-మే-పరమం-వచః**
**ఇష్టః-అసి-మే-దృఢం-ఇతి-తతః-వక్ష్యామి-తే-హితం**

| | | | |
|---|---|---|---|
| భూయః | = మరల | దృఢం | = నిశ్చయముగ |
| సర్వగుహ్యతమం | = పరమ రహస్య మైనది | ఇష్టః | = ఇష్టుడవు |
| పరమం | = ఉత్తమ మైనది అగు | అసి ఇతి | = అయి ఉన్నావని |
| మే | = నా యొక్క | తతః | = అందువలన |
| వచః | = వాక్కును | తే | = నీ కొరకు |
| శృణు | = విను | హితం | = హితమును |
| మే | = నాకు | వక్ష్యామి | = చెప్పు చున్నాను |

**అర్జునా! పరమ రహస్య మైన నా మాటను మళ్ళీ విను. నువ్వు నాకు మిక్కిలి ఇష్టమైన వాడివి. అందువల్ల నీ మేలు కోరి చెబుతున్నా.**

**వ్యాఖ్య**

అతి రహస్య మైన ఈ గీతా శాస్త్రమును సారభూతంగా చెప్పి, ఉపసంహరించా లని భగవంతుడు భావిస్తున్నట్లుంది. అందుచేత, 'మళ్ళీ విను' (***భూయః శృణు***) అంటున్నాడు.

ఇలా మళ్ళీ చెప్పడానికి హేతు వేమిటి అంటే, రెండు కారణాలు చెబుతున్నాడు. శాస్త్రము సర్వ గుహ్యతమం కావడము ఒక కారణ మైతే, అర్జునుడు తనకు అత్యంత ఇష్టుడు కావడం చేత, హితకర మైన గీతాబోధను స్పష్టత కోసం మళ్ళీ చెప్పాలను కోవడం రెండవ కారణం. ప్రారంభం నుండి ఏకబిగిన ప్రవచిస్తున్న నిష్ఠాద్వయమును చివరగా స్పృశించి సమాప్తం చేస్తున్నాడు.





*ఇంతకీ, పరమేశ్వరుడు చెబుతా నంటున్న హిత మేమిటి?*

**మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।**
**మామే వైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే ॥** 65

**మన్మనాః-భవ-మద్భక్తః-మద్యాజీ-మాం-నమస్కురు**
**మాం-ఏవ-ఏష్యసి-సత్యం-తే-ప్రతిజానే-ప్రియః-అసి-మే**

| | | | |
|---|---|---|---|
| మన్మనాః | = నా యందు మనస్సు కల వాడవు | ఏష్యసి | = పొందగలవు |
| మద్భక్తః | = నా యందు భక్తి కల వాడవు | మే | = నాకు |
| మద్యాజీ | = నన్ను అర్చించు వాడవు | ప్రియః | = ఇష్టుడవు |
| భవ | = కమ్ము | అసి | = అయి ఉన్నావు |
| మాం | = నన్ను | తే | = నీకు |
| నమస్కురు | = నమస్కరింపుము | సత్యం | = సత్యమును |
| మాం ఏవ | = నన్నే | ప్రతిజానే | = ప్రతిజ్ఞ చేసి చెబుతున్నాను |

**అర్జునా! నీ మనస్సును నాపై ఉంచు. నా భక్తుడివి కా. నన్నే అర్చించు. నాకే నమస్కరించు. నువ్వు నన్నే పొందుతావు. నువ్వు నాకు ప్రియమైన వాడివి. అందుచేత ప్రతిజ్ఞ చేసి సత్యం చెబుతున్నా.**

**వ్యాఖ్య**

జ్ఞానయోగము సన్యాసులకు, కర్మయోగము యోగులకు అని మూడవ అధ్యాయ ఆరంభంలో నిష్ఠా ద్వయమును ప్రతిపాదించిన గీతాచార్యుడు, ప్రస్తుత శ్లోకంలో కర్మయోగ సారాన్ని సమాప్తం చేసి, తరువాత శ్లోకంలో జ్ఞానయోగ సారాన్ని సమాప్తం చేస్తాడు.

ఈ శ్లోకానికి ఒక విశిష్టత ఉంది. భగవద్గీతలో కొద్దిపాటి మార్పుతో రెండు సార్లు దర్శన మిచ్చిన శ్లోకం ఇదే. అది కూడా గీత పూర్వార్ధం సమాప్త మయ్యే తొమ్మిదవ అధ్యాయం లోను, ఉత్తరార్ధం సమాప్త మయ్యే పద్దెనిమిదవ అధ్యాయం లోను రెండు సార్లు భగవానుని ముఖ కమలము నుండి వెలువడింది. అందమైన ఈ శ్లోకంలో అద్భుతమైన నాలుగు సాధనలు తెలుప బడ్డాయి.

**మన్మనా భవ !**

అర్జునా! నా యందే మనస్సును నిలుపు (***మన్మనాః భవ మచ్చిత్తః భవ!***). మనస్సు జలం లాగా ఒక చోట నిలవదు. పైగా, నీళ్ళు ఎలాగైతే పల్లానికే ప్రవహిస్తాయో, మనస్సు కూడా ఎప్పుడూ అధోముఖంగా అనిత్య మైన విషయాల మీదికే పరుగులు తీస్తూ ఉంటుంది. నీరు ఏ పాత్రలో పోస్తే, ఆ పాత్ర ఆకారమునే పొందు తుంది. నీరు దేనితో నైనా కలిసి పోతుంది. మనస్సూ అంతే.

మనస్సును ఎవరి కైనా ఇవ్వ వచ్చు. కానీ ఎవరి కిచ్చినా దానిని పాడు చేసే వారే. పగుల గొట్టే వారే. కనుక మనస్సును ఇవ్వ దగిన వాడు పరమాత్మ ఒక్కడే. అక్కడే మనస్సుకు పూర్ణత్వము ప్రాప్తిస్తుంది.

**మద్భక్తో భవ !**

అర్జునా! నా భక్తుడివి కా! (***మద్భక్తః భవ మద్భజనః భవ!***). నన్ను సదా పూజించు. ధ్యానించు. కీర్తించు.

భగవంతుని పొందుటకు చేయు ప్రయత్నమే భక్తి. భక్తికి లోటు
భక్తి బ్రతుకును భగవన్మయం చేస్తుంది.
తెలియదు. వెలితి అర్థం కాదు. భక్తి నిత్య సుఖమును అనుగ్రహిస్తుంది. పరమ శాంతిని ప్రసాదిస్తుంది.

**మద్యాజీ భవ !**

నన్నే పూజించు. నన్నే పూజించే స్వభావం కలవాడివి కా! ***(మద్యాజీ మద్యజన శీలః భవ !).*** పూజ అనేది ఉత్కృష్ట మైన ఉపాసన. భక్తి ఆంతర్యంలో భావనా రూపంలో ఉంటుంది. బాహ్యంలో క్రియా రూపంలో సాగుతుంది. క్రియా రూపంలో జరిగే వాటిలో కాయక మైనది పూజ. వాచిక మైనది జపం. ప్రారంభ సాధకు లకు దేహేంద్రియ మనస్సులను నిగ్రహించ డానికి పూజ విశిష్ట మైన సాధన.

**మాం నమస్కురు భవ !**

నమస్కారం కూడా నాకే చేయాలి ***(నమస్కార మపి మమైవ కురు !).*** ***'నమ' ఇతి ద్వే అక్షరే*** అన్నది శాస్త్రం. **మ** అంటే నాది. **న** అంటే లేదు అని అర్థము. **నమః** అంటే నా దంటూ ఏమీ లేదు అని అర్థం. కనుక, అంతా పరమాత్మే అనే శరణాగతికి ప్రతిరూపమే నమస్కారము. ఇదే వందనము. భక్తుని వందనము - భగవంతునికి బంధనము.

ఈ విధంగా, సర్వమును పరమాత్మ యందే సమర్పించి ప్రవర్తించే వారు పరమాత్మనే పొంద గలుగు తారు. ఇదే భక్తి వైశిష్ట్యము.

భక్తులను ఉద్ధరిస్తా నని ఈ శ్లోకంలో పరమాత్మ ప్రతిజ్ఞ చేసి చెప్పడము విశేషము.

*కర్మయోగ నిష్ఠా సారమును వివరించిన భగవానుడు, జ్ఞానయోగ నిష్ఠా సారమును వివరిస్తున్నాడు.*

సర్వధర్మా న్పరిత్యజ్య మా మేకం శరణం వ్రజ ।
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥ 66

***సర్వధర్మాన్-పరిత్యజ్య-మాం-ఏకం-శరణం-వ్రజ***
***అహం-త్వా-సర్వపాపేభ్యః-మోక్షయిష్యామి-మా-శుచః***

| | | | | | |
|---|---|---|---|---|---|
| సర్వధర్మాన్ | = | సమస్త ధర్మములను | అహం | = | నేను |
| పరిత్యజ్య | = | విడిచి పెట్టి | త్వా | = | నిన్ను |
| మాం | = | నన్ను | సర్వపాపేభ్యః | = | సకల పాపముల నుండి |
| ఏకం | = | ఒక్కడినే | మోక్షయిష్యామి | = | విడిపిస్తాను |
| శరణం | = | శరణమును | మా శుచః | = | దుఃఖించకు |
| వ్రజ | = | పొందు | | | |

**అర్జునా! ధర్మా లన్నిటినీ విడిచి పెట్టేయ్! నన్నొక్కణ్ణే శరణు బొందు. నిన్ను సమస్త పాపాల నుండి విడిపిస్తాను. బాధ పడకు.**

**వ్యాఖ్య**

కర్మయోగ నిష్ఠ యొక్క పరమ రహస్య మైన ఈశ్వర శరణత్వాన్ని ఉపసంహరించి, కర్మ యోగ నిష్ఠకు ఫలమైన ఉపనిష త్ప్రతిపాదిత అధ్యాత్మ జ్ఞానాన్ని చెప్పడానికి ప్రస్తుత శ్లోకాన్ని వినిపిస్తున్నాడు గీతాచార్యుడు.





ఈ శ్లోకం లోని ***సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ*** అనే ప్రథమ పాదాన్ని శక్తి గాను, ***అహం త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః*** అనే ద్వితీయ పాదాన్ని కీలకం గాను గీతా పారాయణ పాఠ విధిలో పొందు పరచడం ఈ శ్లోక వైశిష్ట్యాన్ని తెలుపుతూ ఉంది.

భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ దివ్య బోధ ఈ శ్లోకం వద్ద సమాప్త మైంది. మొదటి అధ్యాయము - అర్జున విషాద యోగము లోని నలభై ఏడు శ్లోకాలు, రెండవ అధ్యాయం లోని మొదటి పది శ్లోకాలు - మొత్తం యాభై ఏడు శ్లోకాలను గీతకు పూర్వ పీఠిక గాను, పద్దెనిమిదవ అధ్యాయంలో ప్రస్తుత శ్లోకమైన ***సర్వ ధర్మాన్ పరిత్యజ్య*** అనే శ్లోకం తరువాత వచ్చే పన్నెండు శ్లోకాలను ఉత్తర పీఠిక గాను చాలా మంది భావిస్తారు. అలా చూచి నపుడు ప్రస్తుత శ్లోకాన్ని చరమ శ్లోకం అని చెప్పాలి.

ఇదొక అద్భుతమైన శ్లోకం. అర్జునుని విషాదం తరువాత, రెండవ అధ్యాయం పదకొండవ శ్లోకంలో, ***అశోచ్యాన్ అన్వశోచస్త్వం*** - 'ఏడవ కూడని వాళ్ళ కోసం ఏడుస్తున్నావు' అని భగవంతుడు బోధను ప్రారంభించి, ప్రస్తుతం ఈ శ్లోకంలో ***మా శుచః*** - ఏడవకు అని సమాప్తం చేయడము మహాద్భుతము. ఉపక్రమ, ఉపసంహారా లలో శ్రీకృష్ణ పరమాత్మ విషయాన్ని ప్రదర్శించిన తీరు ఆయన జగద్గురుత్వానికి నిలువెత్తు నిదర్శనంలా గోచరిస్తూ ఉంది.

***సర్వ ధర్మాన్ పరిత్యజ్య*** అంటూ ఈ ఒక్క శ్లోకంలో సర్వ మానవాళికి, సర్వ కాలాలలో, సమస్త దేశాలకు అవసరమైన దంతా పుష్కలంగా వితరణ చేయడం ఒక్క గీతాచార్యునికే సాధ్య మైంది. (1) సర్వధర్మ పరిత్యాగము (2) సాక్షాత్తు భగవంతుని దివ్యాశ్రయము (3) సర్వపాప విముక్తి (4) మోక్షప్రాప్తి (5) సర్వదుఃఖ వినాశము - అన్నీ కలిపి చరమ శ్లోకంలో ఉదారంగా వితరణ చేశాడు.

**సర్వధర్మ పరిత్యాగము**

ఇక్కడ సర్వ ధర్మ పరిత్యాగము అంటే సర్వ కర్మ పరిత్యాగము అని అర్థం. సర్వ కర్మములు అంటే సత్కర్మలే కాదు, దుష్కర్మలు కూడా అని అర్థం. అలా చూచి నపుడు సర్వ ధర్మములు అన్నప్పుడు, ధర్మ శబ్దం చేత అధర్మం కూడా గ్రహించ బడుతుంది ***(సర్వ ధర్మాన్ - సర్వే చ తే ధర్మాశ్చ సర్వధర్మాః తాన్ ధర్మ శబ్దే నాత్ర అధర్మః అపి గృహ్యతే).*** ఎందువల్ల నంటే, ఇక్కడ నైష్కర్మ్యం చెప్ప బడింది. ఆత్మజ్ఞానమును ఉద్దేశించి ప్రవచింప బడింది. ***నావిరతో దుశ్చరితాత్*** - దుష్కర్మల నుండి ***(దుశ్చరితాత్)*** మరలని వాడు ***(అవిరతః)*** ఈ ఆత్మను ***(ఏనం)*** పొంద లేడు ***(న ఆప్నుయాత్)*** అని కఠోపనిషత్తు. ధర్మముతో పాటు అధర్మమును కూడా త్యజించాలి అని మహాభారతము - శాంతిపర్వము *(329 - 40, 331 - 44).* శ్రుతి స్మృతులు సర్వ ధర్మ పరిత్యాగాన్నే చెబుతున్నాయి. కనుక ***సర్వ ధర్మాన్ పరిత్యజ్య*** - సర్వ ధర్మాలను పరిత్యజించి, అంటే సర్వ కర్మములను సన్యసించి అని అర్థం.

**ఏకైక ఆశ్రయము**

సర్వ ధర్మములను, అంటే సర్వ కర్మములను సన్యసించి, నన్నొక్కడినే శరణుబొందు ***(మాం ఏకం శరణం వ్రజ).*** 'నన్నే శరణు బొందు' అంటే, పరమాత్మ ఈశ్వరుడు, ఆయన కంటే అన్య మైనది లేదు అని నిర్ధారణ చేసుకొని, సముడు, సర్వాత్మ స్వరూపుడు అయిన ఈశ్వరుణ్ణి శరణు బొంద మని అర్థం.
సర్వ కర్మములను సన్యసించి, నన్నే శరణు బొందితే సర్వ పాపముల నుండి విడిపిస్తాను అంటున్నాడు.
సర్వ పాపాలు అంటే, ధర్మాధర్మ రూప బంధాలని అర్థం. వాటి నుండి విడిపిస్తాడు అని భావము. ఎలా విడిపిస్తాడు అనేది శంక.

**నాశయామి ఆత్మ భావస్థః జ్ఞాన దీపేన భాస్వతా** - ప్రకాశించే జ్ఞానదీపం చేత వారిలో అజ్ఞానం సృష్టించిన అంధకారాన్ని అదృశ్యం చేస్తాను అని గీత - విభూతి యోగంలో పరమాత్మ తెలిపిందే శంకకు సమాధానము (*10 వ అ - 11 వ శ్లో*).

**మా శుచః** - అర్జునా! దుఃఖించకు. పరమేశ్వరుని **విశోకః** అని అభివర్ణించింది ఛాందోగ్యోపనిషత్తు (**విమృత్యు ర్విశోకో** ... *8 - 1 - 5*). విశోకుడని, శోకనాశను డని పరమేశ్వరుని కీర్తించింది విష్ణుసహస్రనామం (*631, 632 నామములు*). అట్టి శోక రహితుడు, శోక వినాశకుడు అయిన పరమేశ్వరుని, సర్వ ధర్మములను పరిత్యజించి ఆశ్రయించిన వారు, పాపాల నుండి, శోకాల నుండి విముక్తులై మోక్షాన్ని పొందుతారు.

చరణములు : **అభమూ శుభమూ తెలియని నేను**
**అభయము కోరి నిను చేరినాను**
**నీకు లేదులే కన్నతల్లి**
**ఉన్నది నీవే మము గన్న తండ్రీ** ॥ వెన్నెల ॥

పల్లవి : **వెన్నెల నవ్వుల గోపాలా!**
**వెన్నెలు తినను రావేల ?**

అనుపల్లవి : **పువ్వుల సొగసు గాలికి తెలుసు**
**విరిసిన నా మనసు నీకే తెలుసు** ॥ వెన్నెల ॥

అని చరమ శ్లోక చరణాలను అనుసరించి సాగింది చైతన్య గీతిక.

*శాస్త్రం సమాప్త మైంది కనుక, శాస్త్ర సంప్రదాయ విధిని గూర్చి ప్రసంగిస్తున్నాడు.*

**ఇదం తే నాతపస్కాయ నాభక్తాయ కదాచన ।**
**న చాశుశ్రూషవే వాచ్యం న చ మాం యోఽభ్యసూయతి ॥** 67

*ఇదం-తే-న-అతపస్కాయ-న-అభక్తాయ-కదాచన*
*న-చ-అశుశ్రూషవే-వాచ్యం-న-చ-మాం-యః-అభ్యసూయతి*

| | | | | | |
|---|---|---|---|---|---|
| తే | = | నీ కొరకు | అశుశ్రూషవే చ | = | శుశ్రూష చేయని వానికి |
| ఇదం | = | ఈ బోధ | న వాచ్యం | = | చెప్పదగదు |
| కదాచన | = | ఒకప్పుడును | యః | = | ఎవడు |
| అతపస్కాయ | = | తపస్వి గాని వానికి | మాం | = | నన్ను |
| న వాచ్యం | = | ఉపదేశింప దగదు | అభ్యసూయతి చ | = | ద్వేషించు చున్నాడో |
| అభక్తాయ | = | భక్తుడు గాని వానికి | న వాచ్యం | = | చెప్పగూడదు |

**అర్జునా! నేను బోధించిన ఈ జ్ఞానాన్ని తపస్సు లేని వారికి చెప్ప కూడదు. భక్తులు కాని వారికి బోధించ కూడదు. శుశ్రూష చేయని వారికి వినిపించ కూడదు. నన్ను ద్వేషించే వారికి అసలు చెప్ప కూడదు.**

**వ్యాఖ్య**

గీతాశాస్త్రాన్ని ఉపసంహరించిన శ్రీ భగవానుడు, చివరగా శాస్త్ర సంప్రదాయ విధిని తెలుపు తున్నాడు (**శాస్త్ర సంప్రదాయ విధిమ్ ఆహ**). సంప్రదాయ విదుడైన వక్త శాస్త్రమును బోధించు నపుడు అనుసరించ వలసిన విధిని శాస్త్ర సంప్రదాయ విధి అంటారు. ప్రథమంగా శాస్త్రాన్ని ఎలాంటి వారికి బోధించాలి, ఎలాంటి వారికి బోధించ కూడదు అనేది ప్రస్తుత శ్లోకంలో చెబుతున్నాడు.





మోక్ష శాస్త్ర మైన గీతా శాస్త్రాన్ని తపస్సు లేని వానికి (***అతపస్కాయ తపో రహితాయ***), భక్తుడు కాని వానికి (***అభక్తాయ గురు దేవ భక్తి రహితాయ***), వినాలనే కోరిక లేని వానికి (***అశుశ్రూషవే న శుశ్రూషుః***), భగవంతుని ద్వేషించు వానికి (***మాం వాసుదేవం ప్రాకృతం మనుష్యం మత్వా అభ్యసూయతి***) చెప్ప కూడదు. ఇది శాస్త్ర విధి.

ఉత్కృష్ట మైన జ్ఞానాన్ని నికృష్ట మైన వ్యక్తులకు పంచ కూడదు. అయోగ్యులకు పంచిన జ్ఞానము నిరుపయోగ మవుతుంది.

***తపసా విజిజ్ఞాసస్వ*** అన్నది తైత్తిరీయ శ్రుతి. ***తపః స్వాధ్యాయ నిరతం*** అంటూ ప్రారంభ మైంది శ్రీమద్రామాయణము. దాహము లేని వారికి జలపాన మెందుకు? తపస్సు లేని వారికి జ్ఞాన దాన మెందుకు? తపించిన వారే గ్రహించి తరిస్తారు. తాపానికి కాగిన భూమి జలాన్ని పీల్చేసినట్లు, తపస్సు గల వారే జ్ఞానాన్ని అమాంతం సొంతం చేసుకుంటారు. తపస్సు లేని వారికి జ్ఞానం యొక్క విలువ తెలియదు. విలువ తెలియని వారు విలువ కట్టడానికి పనికి రారు. పనికి రాని వారికి చెప్ప కూడదు.

తపస్సు ఉండినా, భక్తులు కాని వారికి చెప్ప కూడదు. భక్తి లేని తపస్సు అహంకారానికి దారి తీస్తుంది. వర్షపు జలం పల్లపు ప్రదేశాలలో నిలిచినట్లు, నమ్రత గల వారి మస్తకాల లోనే జ్ఞానం నిలుస్తుంది. వర్షపు జలం కొండలపై పడినా, క్రిందికి కారి పోవునట్లు, జ్ఞాన జలం అహంకారుల మస్తిష్కాల నుండి జారి పోతుంది. ఇక్కడ భక్తి అంటే ఆదిదేవుని యందు, ఆచార్యదేవుని యందు అచంచల మైన భక్తిని కలిగి ఉండటము అని ఆచార్యుల వారి భాష్యము.

తపస్సు, భక్తి ఉండినా, శుశ్రూష లేని వారికి చెప్ప కూడదు. శుశ్రూష అంటే రెండు అర్థాలు. వినాలనే కోరిక శుశ్రూష (***శ్రోతుం ఇచ్ఛ***). రెండవ అర్థము ఆచార్య సేవ. వినాలనే కోరిక లేని వారికి, గురుసేవ చేయని వారికి బోధించ కూడదు.

చివరిగా భగవంతుని యందు విశ్వాసము లేని వారికి, రామ, కృష్ణాది అవతార పురుషులను సామాన్య మానవులుగా గుర్తించి, భావించి, ద్వేషించే వారికి చెప్ప కూడదు. అహితులైన వారికి హితబోధ చేసి సాధించే దేముంటుంది? పోనీ, ఫలితం రాకపోతే పోతుంది. బోధిస్తే ఏమౌతుంది? అని పిడివాదాలు చేసే వారూ లేక పోలేదు. సారవంతమైన బీజాలను రాళ్ళ గుట్టలపై ఎవరైనా చల్లుతారా? ఇదీ అంతే.

*సంప్రదాయానుసారం బోధించే వారికి ఫల మేమిటి? చెబుతున్నాడు.*

**య ఇమం పరమం గుహ్యం మద్భక్తే ష్వభిధాస్యతి ।**
**భక్తిం మయి పరాం కృత్వా మా మే వైష్య త్యసంశయః ॥** 68

*యః-ఇమం-పరమం-గుహ్యం-మద్భక్తేషు-అభిధాస్యతి*
*భక్తిం-మయి-పరాం-కృత్వా-మాం-ఏవ-ఏష్యతి-అసంశయః*

| | | | | | |
|---|---|---|---|---|---|
| | | | అభిధాస్యతి | = | చెప్పునో |
| యః | = | ఎవడు | సః | = | వాడు |
| పరమం | = | ఉత్తమ మైన | మయి | = | నా యందు |
| గుహ్యం | = | రహస్యమైన | పరాం | = | ఉత్తమమైన |
| ఇమం | = | దీనిని | భక్తిం | = | భక్తిని |
| మద్భక్తేషు | = | నా భక్తుల యందు | | | |

| | | | | | |
|---|---|---|---|---|---|
| కృత్వా | = | చేసి | మాం ఏవ | = | నన్నే |
| అసంశయః | = | సంశయ రహితుడై | ఏష్యతి | = | పొందగలడు |

**అర్జునా! పరమ రహస్యమైన ఈ జ్ఞానమును ఎవడు నా భక్తులకు చెబుతాడో వాడు గొప్ప భక్తి చేసి నన్నే పొందుతాడు. ఈ విషయంలో సందేహం వద్దు.**

న చ తస్మా న్మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః ।
భవితా న చ మే తస్మా దన్యః ప్రియతరో భువి ॥ 69

*న-చ-తస్మాత్-మనుష్యేషు-కశ్చిత్-మే-ప్రియకృత్తమః*
*భవితా-న-చ-మే-తస్మాత్-అన్యః-ప్రియతరః-భువి*

| | | | | | |
|---|---|---|---|---|---|
| మనుష్యేషు | = | మనుష్యుల యందు | మే | = | నాకు |
| తస్మాత్ | = | వాని కంటెను | తస్మాత్ | = | వాని కంటె |
| మే | = | నాకు | అన్యః | = | ఇతరుడు |
| ప్రియకృత్తమః | = | మిక్కిలి ఇష్టమొనర్చు వాడు | ప్రియతరః | = | మిగుల ప్రియమైన వాడు |
| కశ్చిత్ | = | ఒకడును | భువి | = | భూమి యందు |
| న చ | = | లేదు | న చ భవితా | = | కలుగబోడు |

**అర్జునా! అతని కంటే నాకు ప్రియం చేసే వాడు మరొకడు ఉండడు. అతని కంటే నాకు ప్రియమైన వాడు ఈ ప్రపంచంలో మరొకడు ఉండబోడు.**

### వ్యాఖ్య

గీతను బోధించే ఆచార్యునికి ప్రాప్తించే ఫలాన్ని ఈ రెండు శ్లోకాలలో చెబుతున్నాడు. కేశవార్జున సంవాద రూపంలో సాగిన గీతాశాస్త్రము ఉత్కృష్ట మైనది ***(పరమమ్ నిఃశ్రేయసార్థం)***, అంటే మోక్షమే ప్రయోజనముగా గలది. అట్టి రహస్య విషయమును భగవ ద్భక్తులకు ఎవడైతే చెబుతాడో ***(అభిధాస్యతి)*** - ఇక్కడ చెప్పడ మంటే గ్రంథ రూపం లోను, అర్థ రూపం లోను ***(గ్రంథతః అర్థతః)*** బోధించి భక్తుల హృదయాలలో సుస్థిర పరచడం అని అర్థం - అట్టివాడు నన్నే పొందుతాడు ***(మామేవ ఏష్యతి)***, ఈ విషయంలో సంశయము లేదు అంటున్నాడు ***(న సంశయః)***.

గీతను బోధించడము అంటే గీతా జ్ఞానమును బోధించడము అని అర్థము. గీతాజ్ఞానము, గీతాచార్యుడు ఒక్కటే. జ్ఞానము, జ్ఞాని వేరుగా లేరు. జ్ఞానమును బోధించే వాడు కూడా జ్ఞాన పూర్ణుడే. **జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్** - జ్ఞాని నా ఆత్మయే, జ్ఞానికి నాకు భేదం లేదు అని గీతాచార్యుడే ఏడవ అధ్యాయంలో చెప్పాడు *(7వ అ - 18 వ శ్లో)*. అందుచేతనే, జ్ఞాని నన్నే పొందుతాడు, సందేహము లేదు అంటున్నాడు.

గీతను బోధించే వాడు సంప్రదాయ విదుడు. సంప్రదాయ రక్షకుడు. సంప్రదాయ రక్షణే విశ్వ కళ్యాణాన్ని ఆవిష్కరిస్తుంది. భగవంతు డనే పేరు చెప్పుకుంటూ, మతి లోని భావాలను పలికి, మానవాళిని మభ్య పెట్టి, మాయం చేయడం సులభం. సంప్రదాయ గాడిలో నిలబడి శాస్త్రాన్ని యథాతథంగా బోధించడం అందరికీ సాధ్య పడే విషయం కాదు. అట్టి సంప్రదాయ కర్త యైన ఆచార్యుడే జ్ఞానాన్ని బోధించ గలడు. అట్టి వాడే పరమేశ్వరునికి పరమ ప్రియుడు. అతనికి మించిన ప్రియుడు మరొకడు ఉండబోడు అని స్వయంగా భగవానుడే చెబుతున్నాడు.





ఆత్మబంధువులారా! ఈ సందర్భంలో నాతో పరిచయం లేని వారిని, నన్ను తెలియని వారిని ఉద్దేశించి నా స్వవిషయానికి సంబంధించి రెండే రెండు మాటలు చెబుతాను. నాలుగు దశాబ్దాల క్రితం నాకు స్ఫూర్తి నిచ్చినవి ఈ రెండు శ్లోకాలే. రెండు వందలకు పైగా నేను జ్ఞాన యజ్ఞాలను నిర్వహించడం వెనుక ఈ రెండు శ్లోకాలే స్ఫూర్తి దాయకాలు.

గంగాజలంలో ముంచిన తులసి దళాలను చేత పట్టుకొని, ఐదు పది చేసి, ఒక సత్యం మీకు చెబుతున్నా! బాల్యం నుండి శ్రీకృష్ణు డంటే నాకు మాటల్లో చెప్ప లేనంత భక్తి. ముక్కు పచ్చలారని పూప వయస్సులో అర్థం కాకపోయినా, గీతను చేత పట్టుకొని చదువుతూ ఉంటే, ఈ రెండు శ్లోకాలు నన్ను కట్టి పడేశాయి. పరవశింప చేశాయి. ఈ పని చేయ గలిగితే, నేను నా దైవానికి దగ్గ రవుతానా! అని మనస్సు పిచ్చి దైంది. అలాగే చేయా లని నిశ్చయించు కున్నాను. దివారాత్రాలు దైవాన్ని ప్రార్థించాను. ఫలితం వచ్చిందో, లేదో నాకు తెలుసు. మీకూ తెలుసు. నేడు ఈ మహత్తర గ్రంథాన్ని మీ చేతులలో పెట్టడం అనే అద్భుత కార్యానికి ఈ రెండు శ్లోకాలలో భగవంతుడు పలికిన మాటలే ఆధార మని సవినయంగా చెప్పు కుంటున్నాను.

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

*మోక్ష శాస్త్ర మైన గీతా శాస్త్రాన్ని చెప్పిన వాడే కాదు, చదివిన వాడు కూడా ధన్యుడే. చదవండి.*

అధ్యేష్యతే చ య ఇమం ధర్మ్యం సంవాద మావయోః ।
జ్ఞానయజ్ఞేన తే నాహ మిష్టః స్యా మితి మే మతిః ॥ 70

*అధ్యేష్యతే-చ-యః-ఇమం-ధర్మ్యం-సంవాదం-ఆవయోః*
*జ్ఞానయజ్ఞేన-తేన-అహం-ఇష్టః-స్యాం-ఇతి-మే-మతిః*

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆవయోః | = | మన యొక్క | జ్ఞానయజ్ఞేన | = | జ్ఞానయజ్ఞము చేతను |
| ధర్మ్యం | = | ధర్మప్రయోజన మైన | అహం | = | నేను |
| ఇమం | = | ఈ | ఇష్టః | = | పూజితుడను |
| సంవాదం | = | సంవాదమును | స్యాం | = | అగుదును |
| యః | = | ఎవడు | ఇతి | = | అని |
| అధ్యేష్యతే చ | = | చదువ బోవుచున్నాడో | మే | = | నా యొక్క |
| తేన | = | వాని చేత | మతిః | = | నిశ్చయము |

**అర్జునా! ధర్మ రూపమైన మన సంవాదమును ఎవడు చదువుతాడో, వాడు జ్ఞాన యజ్ఞముతో నన్ను పూజించిన వాడు అవుతాడు. ఇది నా నిశ్చితాభిప్రాయము.**

### వ్యాఖ్య

మోక్ష శాస్త్రమైన గీతను పఠించే వాడు పరమేశ్వరుని జ్ఞానయజ్ఞము చేత ఆరాధించిన వాడు అవుతాడు అంటున్నాడు భగవంతుడు. ఇది గీతా శాస్త్రాధ్యయన స్తుతి. ఇది అధ్యయన ఫలశ్రుతి.

ప్రచారం చేసే వాడు పది మందిని తరింప చేస్తాడు. ప్రచారం చేయలేక పోయినా, ఇతరులను తరింప చేయలేక పోయినా, స్వాధ్యాయం చేసే వాడు తానైనా తరిస్తాడు. ఎందరు తరించా రనేది విషయం కాదు. తరించడమే విషయం.

*గీతా శాస్త్రాన్ని బోధించ లేక పోయినా, పఠించలేక పోయినా, శ్రద్ధగా ఆలకించే వానికి కలిగే ఫలశ్రుతిని చెబుతున్నాడు.*

శ్రద్ధావా ననసూయశ్చ శృణుయా దపి యో నరః ।
సోఽపి ముక్తః శుభాన్ లోకా న్ప్రాప్నుయా త్పుణ్యకర్మణామ్ ॥ 71

**శ్రద్ధావాన్-అనసూయః-చ-శృణుయాత్-అపి-యః-నరః**
**సః-అపి-ముక్తః-శుభాన్-లోకాన్-ప్రాప్నుయాత్-పుణ్యకర్మణాం**

| | | | |
|---|---|---|---|
| యః | = ఏ | ముక్తః | = ముక్తుడై |
| నరః | = నరుడు | పుణ్య కర్మణాం | = పుణ్యకర్మల యొక్క |
| శ్రద్ధావాన్ | = శ్రద్ధావంతుడు | శుభాన్ | = శుభకరమైన |
| అనసూయః చ | = అసూయ లేని వాడు | లోకాన్ | = లోకములను |
| శృణుయాత్ అపి | = వినినా కూడా | ప్రాప్నుయాత్ | = పొందుతాడు |
| సః అపి | = వాడు | | |

**అర్జునా! ఈ గీతా జ్ఞానమును ఆలకించిన వాడు పాపము నుండి ముక్తు డవుతాడు. ప్రశస్తమైన పుణ్య లోకాలను పొందుతాడు.**

### వ్యాఖ్య

ఈ శ్లోకంలో గీతా శాస్త్ర ప్రశంస జరుగుతూ ఉంది. దీనినే ఫలశ్రుతి అంటారు. శాస్త్రాన్ని వినడం వల్ల కలిగే ఫలమే ఫలశ్రుతి. శ్రద్ధ కలవారై ***(శ్రద్ధావాన్ శ్రద్ధధానః)***, అనసూయులై, అంటే అసూయ లేని వారై ***(అనసూయః అసూయా వర్జితః)***, ఈ గీతా శాస్త్రాన్ని ఆలకించినా కూడా ***(శృణుయాదపి)*** ప్రశస్త మైన పుణ్య లోకాలను పొందుతారు అని భగవంతుడు ఫలశ్రుతిని వినిపిస్తున్నాడు.

ఇక్కడ **శృణుయాదపి** - 'అపి' అంటే కూడా అని అర్థము. శాస్త్రాన్ని కేవలం వింటే కూడా పుణ్య లోకాలను పొందుతారు అంటే, శాస్త్రార్థాన్ని గ్రహించి జీవించే వారి మాట వేరే చెప్పాలా? అనే అర్థం అందులో ధ్వనిస్తోంది.

*చివరగా గీతాచార్యుడు శిష్యుడైన అర్జునుని ప్రశ్నిస్తున్నాడు.*

కచ్చి దేత చ్ఛ్రుతం పార్థ త్వ యైకాగ్రేణ చేతసా ।
కచ్చి దజ్ఞాన సమ్మోహః ప్రనష్టస్తే ధనఞ్జయ ॥ 72

**కచ్చిత్-ఏతత్-శ్రుతం-పార్థ-త్వయా-ఏకాగ్రేణ-చేతసా**
**కచ్చిత్-అజ్ఞానసమ్మోహః-ప్రనష్టః-తే-ధనంజయ**

| | | | |
|---|---|---|---|
| పార్థ | = అర్జునా! | శ్రుతం కచ్చిత్ | = శ్రవణము చేయబడినది గదా |
| ఏతత్ | = ఇది | ధనంజయ | = అర్జునా! |
| త్వయా | = నీ చేత | తే | = నీ యొక్క |
| ఏకాగ్రేణ | = నిశ్చలమైన | అజ్ఞాన సమ్మోహః | = అజ్ఞానము వలన కలిగిన మోహము |
| చేతసా | = మనస్సుతో | ప్రనష్టః కచ్చిత్ | = పోయినది గదా! |





**పార్థా! గీతా శాస్త్రాన్ని నిశ్చలమైన బుద్ధితో శ్రద్ధగా విన్నావు కదా! ధనంజయా! అజ్ఞానము వల్ల ఏర్పడిన మోహం నశించిందా?**

### వ్యాఖ్య

ఇది భగవద్గీతలో ఆచార్యుడైన శ్రీకృష్ణ భగవానుని చివరి మాటలు. అర్జునా! నా ఉపదేశాన్ని ఏకాగ్ర చిత్తంతో శ్రవణం చేశావు కదా! ధనంజయా! అజ్ఞానం వల్ల కలిగిన నీ మోహం నశించిందా? అని ప్రశ్నించాడు భక్తవత్సలు డైన భగవానుడు, శిష్యవత్సలు డైన గీతాచార్యుడు.

గీతాచార్యుడు భగవంతుడు. మనకు తండ్రి. భగవద్గీత భగవతి. మనకు తల్లి. గీతలో ప్రశ్న రూపంలో ఉన్న ఈ చివరి మాటలలో తండ్రి పాలనము ఉంది. తల్లి లాలనమూ ఉంది.

'అమ్మా! ఆకలిగా ఉంది' అని బిడ్డ అనగానే, కడుపారా తినిపించి, 'నాయనా! తృప్తిగా తిన్నావా? నీ ఆకలి తీరిందా?' అనే కన్నతల్లి చల్లని లాలనము గీతామాత చివరి మాటలుగా హృదయాన్ని స్పృశిస్తోంది.

నాయనా! శ్రద్ధతో ఆలకించావా? అజ్ఞానం వల్ల ఏర్పడిన నీ మోహం నశించిందా? అనే కన్నతండ్రి వెచ్చని పాలనము గీతాచార్యుని చివరి మాటలుగా మనస్సును పరవశింప చేస్తోంది.

ఆకలి తీరక పోతే ఇంక కాస్త తినిపిద్దా మనే తల్లి ఆలోచన; ఒకవేళ అర్థం కాకపోతే, మరొక ఉపాయం చేత నైనా మళ్ళీ బోధించి, కృతార్థుణ్ణి చేయాలనే తండ్రి ఉద్దేశము ***( తదగ్రహణే జ్ఞాతే పునః గ్రాహయిష్యామి ఉపాయాన్తరేణాపీతి ప్రష్టుః అభిప్రాయః )*** ఈ ప్రశ్నలో ఒదిగి ఉన్నాయి. వక్త, శ్రోతల శ్రమలు ఫలించాయో, లేదో తెలుసుకుందా మని చివరగా అర్జునుణ్ణి ప్రశ్నించాడు శ్రీకృష్ణ పరమాత్మ.

*అర్జునుడు సమాధానం చెబుతున్నాడు.*

**అర్జున ఉవాచ :**

నష్టో మోహః స్మృతి ర్లబ్ధా త్వత్ప్రసాదా న్మయాఽచ్యుత ।
స్థితోఽస్మి గతసన్దేహః కరిష్యే వచనం తవ ॥ 73

**నష్టః-మోహః-స్మృతిః-లబ్ధా-త్వత్ప్రసాదాత్-మయా-అచ్యుత**
**స్థితః-అస్మి-గతసందేహః-కరిష్యే-వచనం-తవ**

| | | | |
|---|---|---|---|
| అచ్యుత | = కృష్ణా! | గతసందేహః | = సందేహములు తొలగి |
| త్వత్ప్రసాదాత్ | = నీ అనుగ్రహము వలన | స్థితః | = ఉన్న వాడను |
| మోహః | = మోహము | అస్మి | = అగుచున్నాను |
| నష్టః | = నశించినది | తవ | = నీ యొక్క |
| మయా | = నా చేత | వచనం | = ఆజ్ఞను |
| స్మృతిః | = స్మృతి | కరిష్యే | = ఆచరింతును |
| లబ్ధా | = పొంద బడింది | | |

**అర్జునుడు చెబుతున్నాడు :**

**అచ్యుతా! నా మోహం నశించింది. అంతా నీ అనుగ్రహము. ఆత్మ విషయం స్మృతికి అందింది. సందేహా లన్నీ తొలగి పోయాయి. నీ మాటే నా బాట.**

## వ్యాఖ్య

సర్వ వేదార్థ సారమైన గీతా శాస్త్రాన్ని సమాప్తం చేసిన భగవంతుడు, 'నేను చేసిన ఉపదేశాన్ని ఏకాగ్ర చిత్తంతో శ్రవణం చేశావా?' అంటూ మొదటి ప్రశ్నను సంధించాడు. ఈ ప్రశ్న వెనుక భగవంతుని హృదయం ఆవిష్కరింప బడుతూనే ఉంది. తాను ఏమి బోధించాడో, ఎలా బోధించాడో తనకు తెలుసు. బోధించిన వ్యక్తి సర్వజ్ఞత్వం కలిగిన పరమేశ్వరుడు. ఇక, బోధనావిధి సంప్రదాయ వైభవము. కనుక, అర్జునుడు అవధానం చెడకుండా శ్రవణం చేసి ఉంటే, జ్ఞానం కలగకుండా పోయే అవకాశం లేదు. అందుకని, ఏకాగ్ర చిత్తంతో ఆలకించావా? అని మొదటి ప్రశ్నను సంధించాడు.

ఇకపోతే, శ్రవణం సక్రమంగా సాగి ఉంటే, జ్ఞానం కలిగి తీరాలి. అజ్ఞానం నశించి ఉండాలి. అజ్ఞాన జనిత మోహం అదృశ్యమై ఉండాలి. కనుక, రోగ నిధానం చేసి అమృత తుల్యమైన ఔషధాన్ని ఇచ్చిన వైద్యుడు, చికిత్స పూర్తి అయిన తరువాత, 'నువ్వు చక్కగా మందు తీసుకున్నావా? నీ అనారోగ్యం పోయిందా?' అని అడిగి నట్లు, 'ఏకాగ్ర చిత్తంతో శ్రవణం చేశావా? అజ్ఞాన జనితమైన నీ మోహం నశించిందా?' అని భగవంతుడు అర్జునుణ్ణి ప్రశ్నించాడు. అర్జునుడు ఏం చెప్పాడు?

### మోహ నాశము - స్మృతి ప్రాప్తము

అచ్యుతా! నా మోహం నశించింది ***(నష్టో మోహః)*** అనేశాడు. బాగుంది. ఇంతకీ ఏ మోహం నశించింది? అజ్ఞానం వల్ల కలిగింది, సమస్త సంసార రూప అనర్థానికి కారణ మైనది, భయంకరమైన సాగరము వలె దాట శక్యము కానిది అయిన మోహము నశించింది ***(నష్టః మోహః అజ్ఞానజః సమస్త సంసారానర్థ హేతుః సాగరః ఇవ దుస్తరః)***. పోగొట్టు కున్నది సరే, రాబట్టుకున్న దేమైనా ఉందా? ఉంది. అదే చెబుతున్నాడు.

స్మృతి పొంద బడింది అంటున్నాడు ***(స్మృతిర్లబ్ధా)***. బాగుంది. ఇంతకీ ఆయనకు ప్రాప్తించిన స్మృతి ఏమిటి? ఆత్మతత్త్వాన్ని గూర్చిన స్మృతి లభించింది. ఏ స్మృతి లభించడం చేత సమస్త హృదయ గ్రంథులు (అజ్ఞాన ముడులు) విడి పోతాయో, అలాంటి స్మృతి కలిగింది ***(యస్యాః లాభాత్ సర్వ హృదయ గ్రంథీనాం విప్ర మోక్షః)***. ఏ హృదయ గ్రంథులు సంసార హేతువులో అవి నశించాయి అంటున్నాడు.

### సందేహ నివారణము

అజ్ఞానము సమూలంగా నశించింది. జ్ఞానము కలిగింది. శాస్త్రబోధ ఫలించింది అని అర్థము. కనుక, సర్వ సంశయాలు విచ్ఛిన్న మయ్యాయి. ప్రమేయగత సంశయము, ప్రమాణ గత సంశయము, రెండూ నశించి పోయాయి. శాస్త్రము విషయము లోను, శాస్త్రము ప్రతిపాదించే సత్య వస్తు నిర్ధారణ లోను, సంశయా లన్నీ పటాపంచ లయ్యాయి. అదే శ్రవణ ఫలం. ఈ అనుభూతి గీతా శాస్త్రార్థానికి, వేద శాస్త్రార్థానికి అద్దం పడుతూ ఉంది.

***భిద్యతే హృదయ గ్రంథిః ఛిద్యన్తే సర్వ సంశయాః ।***
***క్షీయన్తే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే ॥***

పరమాత్మ జ్ఞానం కలగ గానే అజ్ఞాన ముడి విడి పోతుంది. జ్ఞానం కలగడం కారణంగా సర్వ సంశయాలు విచ్ఛిన్న మవుతాయి. కర్మ లన్నీ నశించి పోతాయి అని ముండకోపనిషత్తు *(2 - 2 - 9)*.

### అర్జునుని ఔన్నత్యము

నా ఉపదేశాన్ని ఏకాగ్ర చిత్తముతో విన్నావా? అని శ్రీకృష్ణ పరమాత్మ ప్రశ్నించాడు. కాని, అర్జునుడు





అవధాన చిత్తము తోనే ఆలకించాను అని చెప్ప లేదు. అచ్యుతా! నీ అనుగ్రహం వల్ల ***(త్వత్ప్రసాదాత్, మయా త్వత్ప్రసాదమ్ ఆశ్రితేన అచ్యుత!)*** అని వినమ్రుడై పలికాడు. వినయము ఉన్న వారి లోనే విద్య నిలుస్తుంది.

**అమృతము వంటి ఔషధమైనా**
**పథ్యము చెడితే విషమయము**
**ఎంత చదివినా ఎన్ని నేర్చినా**
**వినయము చెడితే వికృతము**
**ఫలవృక్షాలు వంగును క్రిందికి**
**మేఘజలాలు జారును అవనికి**
**రామ రామ జయ రాజారామ్**
**రామ రామ జయ సీతారామ్** - అని రామజోగి చిట్కా.

### కేశవార్జునులు - ఆదర్శ గురుశిష్యులు

శిష్యుని అజ్ఞానం సమూలంగా నశించే వరకు పట్టు వదలని ప్రయత్నం గల దయామయు డైన గురుదేవుడు, వినమ్రుడు, శాస్త్రాచార్యోపదేశము నందు అకుంఠిత మైన భక్తి శ్రద్ధలు గల శిక్షణ యోగ్యుడైన శిష్యుడు ఉన్న చోట జ్ఞానానికి కొరత ఎక్క డుంటుంది? శ్రీకృష్ణార్జునులు ఆదర్శ మైన గురుశిష్యులు.

జ్ఞానం కలగక ముందు అహంకారాన్ని పట్టుకొని, గాండీవాన్ని పడేశాడు. జ్ఞానం సిద్ధించిన తరువాత, అహంకారాన్ని పడేసి గాండీవాన్ని పట్టుకోవ డానికి సిద్ధ పడ్డాడు.

***యథేచ్ఛసి తథా కురు*** - బోధను ముగించి, 'నీకు ఎలా ఇష్ట మైతే అలా చెయ్యి!' అన్నాడు ఆచార్య దేవుడైన గురుదేవుడు. బోధను జీర్ణించుకున్న అర్జునుడు, ***కరిష్యే వచనం తవ*** - కృష్ణా! నువ్వు చెప్పినట్లే చేస్తాను అన్నాడు. ఆదర్శవంత మైన గురుశిష్యుల మధ్య ఇక్కడే శాస్త్రము జాజ్వల్యమాన మైంది.

***కరిష్యే*** అంటే ఆచరిస్తాను అని అర్థము. అదే కర్మయోగము. ఏమి ఆచరిస్తాడు? భగవంతుడు బోధించిన జ్ఞానము. అదే వచనము. వాక్యము. ***తత్త్వమసి*** మహావాక్యము ***(వచనం)***. అదే జ్ఞానయోగము.

కర్మయోగ మైనా, జ్ఞానయోగ మైనా, భక్తి హీనంగా, భక్తి శూన్యంగా ఉండటానికి వీలు లేదు. అందుచేత, ***తవ*** - నీ భక్తుడనై ***(తవ దాసోఽహం)*** ఆచరిస్తాను అంటూ పరమాత్మ బోధించిన గీతాశాస్త్రము నంతా, జ్ఞానయోగ, కర్మయోగాలను, భక్తి ప్రపత్తిని కలిపి, మూడు మాటల్లో చెప్పేశాడు అర్జునుడు ***(కరిష్యే వచనం తవ)***. అర్జునుని లాగా మనందరము కూడా ఈ వాక్యాన్ని భగవంతుడికి వినిపిస్తే, అర్జునుని చూచి సంతోషించి నట్లే, మన విషయంలో కూడా భగవంతుడు సంతోష పడతాడు.

శాస్త్రార్థము సమాప్త మైంది ***(పరి సమాప్తః శాస్త్రార్థః)***. మనం కురుక్షేత్రం నుండి వెనుదిరుగు తున్నాం. యుద్ధభూమి నుండి వెను దిరిగి కథా సంబంధాన్ని గుర్తు తెచ్చుకుంటూ ***(ఇదానీం కథా సంబంధ దర్శనార్థమ్)*** ధృతరాష్ట్రుని మందిరం లోకి ప్రవేశిస్తున్నాం. అంధకారాన్ని తోడు చేసుకొని ధృతరాష్ట్రుడు వింటున్నాడు. ఆశ్చర్యాన్ని ప్రదర్శిస్తూ సంజయుడు చెబుతున్నాడు.

**సంజయ ఉవాచ :**

**ఇత్యహం వాసుదేవస్య పార్థస్య చ మహాత్మనః ।**
**సంవాద మిమ మశ్రౌష మద్భుతం రోమహర్షణమ్ ॥** 74

***ఇతి-అహం-వాసుదేవస్య-పార్థస్య-చ-మహాత్మనః***
***సంవాదం-ఇమం-అశ్రౌషం-అద్భుతం-రోమహర్షణం***

అహం = నేను
ఇతి = ఇట్లు
వాసుదేవస్య = శ్రీకృష్ణుని యొక్క
మహాత్మనః = మహాత్ము డగు
పార్థస్య చ = పార్థుని యొక్క
అద్భుతం = అద్భుత మైనది
రోమహర్షణం = గగుర్పాటును కలిగించునది
ఇమం = ఈ
సంవాదం = సంవాదమును
అశ్రౌషం = విన్నాను

**సంజయుడు వినిపిస్తున్నాడు :**

**రాజా! శ్రీ వాసుదేవునికి, మహాత్ముడైన అర్జునునికి మధ్య జరిగిన సంవాదమును ఆలకించాను. ఎంత అద్భుతమో! మేను పులకరిస్తోంది.**

**వ్యాఖ్య**

ధృతరాష్ట్ర మహారాజా! పరమేశ్వరు డైన వాసుదేవుని యొక్క, మహాత్ముడైన అర్జునుని యొక్క సంవాదమును (సమీచీన మైన వాదమును) విన్నాను. అత్యంత విస్మయకర మైన ఆ సంవాదము గగుర్పాటును కలిగించింది.

రాజా! ఈ సృష్టిలో గతంలో ఎన్ని యుద్ధాలు జరిగి ఉంటాయి? ఇలాంటి సంవాదమును కదన రంగంలో ఎవరైనా చూచి ఉంటారా? విని ఉంటారా? నా భాగ్యానికి పొంగి పోతున్నాను.

వ్యాసప్రసాదా చ్ఛ్రుతవా నేత ద్గుహ్య మహం పరమ్ ।
యోగం యోగేశ్వరా త్కృష్ణా త్సాక్షా త్కథయత: స్వయమ్ ॥ 75

***వ్యాసప్రసాదాత్-శ్రుతవాన్-ఏతత్-గుహ్యం-అహం-పరం***
***యోగం-యోగేశ్వరాత్-కృష్ణాత్-సాక్షాత్-కథయతః-స్వయం***

వ్యాసప్రసాదాత్ = వ్యాసభగవానుని అనుగ్రహము వలన
గుహ్యం = గుహ్య మైనది
పరం = ఉత్తమ మైనది
ఏతత్ = ఈ
యోగం = యోగమును
స్వయం = స్వయముగ
కథయతః = చెప్పినటువంటి
యోగేశ్వరాత్ = యోగేశ్వరు డైనట్టి
కృష్ణాత్ = శ్రీకృష్ణుని వలన
అహం = నేను
సాక్షాత్ = ప్రత్యక్షముగ
శ్రుతవాన్ = విన్నాను

**రాజా! యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు పలికిన గీతా జ్ఞానము ఉత్కృష్ట మైనది. రహస్య మైనది. వ్యాసుని దయ వల్ల నేను ప్రత్యక్షంగా విన గలిగాను.**

రాజ న్సంస్మృత్య సంస్మృత్య సంవాద మిమ మద్భుతమ్ ।
కేశవార్జునయో: పుణ్యం హృష్యామి చ ముహుర్ముహు: ॥ 76

***రాజన్-సంస్మృత్య-సంస్మృత్య-సంవాదం-ఇమం-అద్భుతం***
***కేశవార్జునయోః-పుణ్యం-హృష్యామి-చ-ముహుర్ముహుః***





రాజన్ = రాజా!
పుణ్యం = పుణ్యకరమైన
ఇమం = ఈ
అద్భుతం = ఆశ్చర్యకరమైన
కేశవా ర్జునయోః = కృష్ణార్జునుల యొక్క
సంవాదం = సంవాదమును
సంస్మృత్య సంస్మృత్య = తలచి తలచి
ముహుర్ముహుః = మాటిమాటికిని
హృష్యామి చ = సంతసించు చున్నాను

**ధృతరాష్ట్ర మహారాజా! కృష్ణార్జునుల మధ్య నడచిన ఈ సంవాదము పుణ్య ప్రదము. ఆశ్చర్యకరము. దానిని తలచి తలచి మళ్ళీ మళ్ళీ తన్మయ మౌతున్నాను.**

తచ్చ సంస్మృత్య సంస్మృత్య రూప మత్యద్భుతం హరే: ।
విస్మయో మే మహాన్ రాజన్ హృష్యామి చ పున: పున: ॥ 77

***తత్-చ-సంస్మృత్య-సంస్మృత్య-రూపం-అతి-అద్భుతం-హరేః***
***విస్మయః-మే-మహాన్-రాజన్-హృష్యామి-చ-పునః-పునః***

రాజన్ = రాజా!
హరేః = శ్రీకృష్ణుని యొక్క
అత్యద్భుతం = మిక్కిలి అద్భుతమైన
తత్ = ఆ
రూపం చ = రూపమును
సంస్మృత్య సంస్మృత్య = తలచి తలచి
మే = నాకు
మహాన్ = గొప్ప
విస్మయః = ఆశ్చర్యము కలుగుచున్నది
పునఃపునః చ = మరల మరల
హృష్యామి చ = సంతసించు చున్నాను

**రాజా! శ్రీహరి ప్రదర్శించిన మహాద్భుత మైన విశ్వరూపమును స్మరించే కొద్ది నాకు విస్మయం కలుగుతోంది. మళ్ళీ మళ్ళీ పులకించి పోతున్నాను.**

**వ్యాఖ్య**

యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు పలికిన ఈ గీతా శాస్త్రమును ప్రత్యక్షంగా విన్నాను అనే సత్యాన్ని నమ్మలేక పోతున్నాను. ఇదంతా వ్యాస మహర్షి కరుణా కటాక్షమే. ఆ మహాత్ముని దయ వల్లనే నేను స్వయంగా విన గలిగాను. ఆ మాటలే నా వీనులలో మారుమ్రోగు తున్నాయి. మాటి మాటికి రోమహర్షణ మవుతూ ఉంది. రణరంగంలో వాసుదేవ పరబ్రహ్మము ప్రదర్శించిన దివ్యమైన విశ్వరూపము నా నేత్రాలలో కదులుతూనే ఉంది. నా మనస్సులో మెదులుతూనే ఉంది. మరపు రాని మధురానుభూతిగా వెలిగి పోతూ ఉంది.

యత్ర యోగేశ్వర: కృష్ణో యత్ర పార్థో ధనుర్ధర: ।
తత్ర శ్రీ ర్విజయో భూతి ర్ధ్రువా నీతి ర్మతి ర్మమ ॥ 78

***యత్ర-యోగేశ్వరః-కృష్ణః-యత్ర-పార్థః-ధనుర్ధరః***
***తత్ర-శ్రీః-విజయః-భూతిః-ధ్రువా-నీతిః-మతిః-మమ***

యత్ర = ఎచ్చట
యోగేశ్వరః = యోగేశ్వరుడగు
కృష్ణః = శ్రీకృష్ణుడు
యత్ర = ఎచ్చట
ధనుర్ధరః = ధనుస్సును ధరించిన
పార్థః = అర్జునుడు

| | | |
|---|---|---|
| తత్ర | = | అచ్చట |
| శ్రీః | = | లక్ష్మియు |
| విజయః | = | విజయము |
| భూతిః | = | ఐశ్వర్యము |
| ధ్రువా | = | స్థిరమగు |
| నీతిః | = | నీతియు |
| ఇతి | = | అని |
| మమ | = | నా యొక్క |
| మతిః | = | అభిప్రాయము |

**రాజా! యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు, ధనుర్ధరు డైన ధనంజయుడు ఎక్కడ ఉంటారో, అక్కడ లక్ష్మి కొలువై ఉంటుంది. విజయలక్ష్మిగా, ఐశ్వర్య లక్ష్మిగా, దృఢమైన ధర్మరూప లక్ష్మిగా ఉంటుంది. ఇది నా అభిప్రాయము.**

**వ్యాఖ్య**

గీతా శాస్త్ర శ్రవణమును, విశ్వరూప సందర్శనానుభూతిని పదే పదే తలచుకుంటూ, తనలో తాను తలపోసుకుంటూ తన్మయు డవుతున్న సంజయుడు, తన అభిప్రాయాన్ని **తత్ర** అంటూ, ఈ చివరి శ్లోకంలో ధృతరాష్ట్రునికి విన్నవించు కుంటున్నాడు.

యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు ఎక్కడ ఉంటాడో, అక్కడ సంపద, విజయము ఉంటాయి. ధనుర్ధారి అయిన అర్జునుడు ఎక్కడ ఉంటాడో, అక్కడ సంపద, విజయము ఉంటాయి. ప్రస్తుతం ఇద్దరూ ఒకే చోట, ఒకే పక్షంలో ఉన్నారు. సంపద మరొక చోట ఎలా ఉంటుంది? విజయము మరొకరిని ఎలా వరిస్తుంది? అని తన అభిప్రాయాన్ని సూటిగా చెప్పేశాడు సంజయుడు ***(మతిః మమ ఇతి)***.

ఈ దశలో ధృతరాష్ట్రునిలో మార్పును సంజయుడు ఆశిస్తున్నా డని నే నైతే అనుకోవడం లేదు. కాకపోతే, తనయుడి విజయముపై తండ్రి ఇక ఆశలు వదులు కోవచ్చని సూటి గానే చెప్పిన ట్లైంది.

**అర్జునుల మైతేనే ఆత్మజ్ఞానం**

'అర్జున' శబ్దానికి బుద్ధి కల వాడని అర్థము. పరిశుద్ధ మైన తెల్లని అంతఃకరణము కల వాడని శ్రీశంకరాచార్య స్వామి భాష్యంలో వ్యాఖ్యానించారు ***(శుక్లాన్త రాత్మ స్వభావః విశుద్ధాంతః కరణః ఇతి)***. ఇందుకు వేదాన్ని కూడా సహకారంగా ఉటంకించారు.

***అహశ్చ కృష్ణం అహ రర్జునం చ -*** ***అహః*** అంటే పగలు. ***అహశ్చ కృష్ణం*** అంటే ఒక పగలు నల్లని మేఘాలతో కప్పబడిన ఆకాశం లాగా ఉంది (శ్రీకృష్ణ పరమాత్మ). ***అహరర్జునం*** అంటే, ఒక పగలు స్వచ్ఛంగా, దివ్యంగా ప్రకాశిస్తూ ఉంది అని అర్థం. అదే శుద్ధ బుద్ధి. అర్జున బుద్ధి.

***యత్ర*** అంటూ సంజయుడు శ్లోకారంభం చేయడంలో ఇరువురు ఒకే చోట ఉన్నారు అనేదే స్థూలంగా తెలిసే భావ మైతే, ఇరువురు ఒక్కరే అనేది సూక్ష్మంగా దాగి ఉన్న అంతర్భావం. అదే నర నారాయణ స్వరూప వైభవం.

అందుకనే, ***పార్థస్య చ మహాత్మనః*** అంటూ అర్జునుణ్ణి ఆకాశానికి ఎత్తేశాడు సంజయుడు. అర్జును డెంతటి భాగ్యవంతుడో! లేకపోతే, సాక్షాత్తు భగవంతుడైన వాసుదేవ పరబ్రహ్మము స్వయంగా, అంతగా శ్లాఘిస్తాడా?

***ఇష్టోఽసి -*** అర్జునా! నువ్వు నాకు ఇష్టుడివి *(64 వ శ్లో)*. ***భక్తోఽసి -*** నువ్వు నా భక్తుడివి *(4 వ అ - 3 వ శ్లో)*. నువ్వు నాకు సఖుడివి. ప్రియుడివి అని భగవంతుని చేత ఎన్ని సార్లు అనిపించు కున్నాడో? ఎవరి కుంది ఆ భాగ్యం? దుఃఖ మొచ్చినా కృష్ణుణ్ణే ముందుంచుకొని ఏడ్చాడు. ఆనందం కలిగినా, కృష్ణుని సన్నిధి లోనే పరవశించాడు. అదే పార్థుని భక్తి. భగవంతుడు భక్త వశుడు. అందుకు అర్జునుడే నిదర్శనము. అర్జునుని భక్తి శ్రీకృష్ణుని ఎంతగా కదిలించిందో చెప్పడానికి మాటలు సరిపోవు. అదేదో అర్జునుని మాట ల్లోనే విందాం.





అది కూడా తియ్యని తెలుగుకే తేనెలు తాపిన పోతన పదాలలో విని తృప్తి చెందుదాము.

*సీ॥ చెలికాడ! రమ్మని చీరు నన్నొక వేళ మన్నించు నొక వేళ మఱఁది యనుచు*
*బంధు భావంబున బాటించు నొక వేళ దాతయై నొక వేళ ధనము లిచ్చు*
*మంత్రియై యొక వేళ మంత్ర మాదేశించు బోధియై యొక వేళ బుద్ధి సెప్పు*
*సారథ్య మొనరించు జన విచ్చి యొక వేళ గ్రీడించు నొక వేళ గేలి సేయు*

*తే॥ నొక్క శయ్యాస నంబున నుండు గన్న తండ్రి కైవడిఁ జేసిన తప్పు గాచు*
*హస్తములు వట్టి పొత్తున నారగించు మనుజ వల్లభ! మాధవ మరవ రాదు!*

మా కృష్ణయ్యకు నే నంటే ఎంత ప్రేమో! చెలికాడా! రా! రా! అని ఒకసారి పిలిచే వాడు. బావమరదీ! అని ముద్దుగా మరొకసారి సంబోధించే వాడు. బంధువై ఆదరిస్తాడు. ఔదార్యాన్ని ప్రదర్శిస్తూ నాకు సొమ్ము లిచ్చేశాడు. ఒక్కొక్కసారి మంత్రి లాగా సలహా లిచ్చే వాడు. ఒక్కొక్కసారి గురువు లాగా బుద్ధి చెప్పే వాడు. రథం నడిపే టప్పుడు చనువుతో భాషించే వాడు. ఒక్కొక్కసారి హాస్యానికి నన్ను ఆట పట్టించే వాడు. కొన్ని పర్యాయాలు నన్ను తన పడకపై కూర్చో బెట్టుకొని తండ్రి లాగా నా తప్పుల్ని ఎత్తి చూపి సరి చేసే వాడు. ఒక్కొక్కసారి నన్ను చేతులు పట్టుకొని, బలవంతంగా ఇంక కొద్దిగా, ఇంక కొద్దిగా అని తన చేత్తో తినిపించే వాడు. అన్నా! ధర్మరాజా! నా మాధవ బావను నేను మరచి పోగలనా? అన్నాడు ధర్మరాజుతో అర్జునుడు.

నా గుండె వ్రాయ లేనంత బరు వెక్కుతోంది. నీళ్ళను ఆపుకొనే శక్తి నా కళ్ళకు లేకుండా పోతోంది. ఇలా పులకరిస్తూ, పరవశిస్తూ చైతన్య భగవద్గీతను సమాప్తం చేస్తున్నందుకు పొంగి పోతున్నా! పారం తెలియని పరమేశ్వరుని పరమ ప్రేమకు తల వంచి, ఐదు పది చేసి, వందన మని వంగుతున్నా!

ఇక శ్లోక విషయం.

సంపద, విజయము, ఐశ్వర్యము, దృఢమైన ధర్మము - వీటిని అందరూ వాంఛిస్తారు. ఇవన్నీ అందరికీ లభ్యం కావు. కాని, అందరూ వీటిని అభిలషిస్తూ ఉంటారు. ఎవరికి ఏది అవసరమో దాని కొరకు ప్రయత్నిస్తూ ఉంటారు. కాని, లభ్యం కావచ్చు. కాక పోవచ్చు. ఒకటి లభ్యమైతే మరొకటి లభ్యం కాక పోవచ్చు.

కాని, ఒక్క దానిని పొంద గలిగితే, అన్నీ పొందినట్లే అవుతుంది. ఏమిటది? మోక్షము. అది ఎక్క డుంటుంది? ఎక్కడైతే యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు, ధనుర్ధారి అయిన అర్జునుడు ఉంటారో, అక్కడ మోక్షము, ఆ మోక్షము లోనే ధర్మార్థ కామాలు సిద్ధిస్తాయి. యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు జ్ఞానయోగానికి ప్రతిరూపము. ధనుర్ధారి యైన అర్జునుడు కర్మయోగానికి ప్రతిరూపము. కర్మయోగం ద్వారా అంతఃకరణ శుద్ధిని పొంది, జ్ఞాన నిష్ఠా యోగ్యతా లక్షణాన్ని సిద్ధింప చేసుకుంటే, ఆ తరువాత జ్ఞాన నిష్ఠ ఫలంగా అద్వైతామృత రూపమైన మోక్షము సిద్ధిస్తుంది. ***అస్తు.***

**కైవల్య ప్రాప్తి రస్తు!**

## ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే మోక్షసంన్యాస యోగోనామ అష్టాదశోఽధ్యాయః

**ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు మోక్షసన్యాస యోగ మనే పద్దెనిమిదవ అధ్యాయము.**



# అకారాది శ్లోకానుక్రమణిక




## చతుర్దశాధ్యాయము


| శ్లోకము | శ్లోక సంఖ్య | పుట |
|---|---|---|
| **అ** | | |
| అప్రకాశోఽ ప్రవృత్తిశ్చ | 13 | 38 |
| **ఇ** | | |
| ఇదం జ్ఞాన ముపాశ్రిత్య | 2 | 14 |
| **ఉ** | | |
| ఉదాసీనవ దాసీనః | 23 | 62 |
| ఊర్ధ్వం గచ్ఛన్తి సత్త్వస్థాః | 18 | 47 |
| **క** | | |
| కర్మణః సుకృత స్యాహుః | 16 | 44 |
| కైర్లిఙ్గై స్త్రీన్గుణా నేతాన్ | 21 | 57 |
| **గ** | | |
| గుణా నేతా నతీత్య త్రీన్ | 20 | 52 |
| **త** | | |
| తత్ర సత్త్వం నిర్మలత్వాత్ | 6 | 25 |
| తమ స్త్వజ్ఞానజం విద్ధి | 8 | 30 |
| **న** | | |
| నాన్యం గుణేభ్యః కర్తారం | 19 | 51 |
| **ప** | | |
| పరం భూయః ప్రవక్ష్యామి | 1 | 10 |
| ప్రకాశం చ ప్రవృత్తిం చ | 22 | 59 |
| **బ** | | |
| బ్రహ్మణో హి ప్రతిష్ఠాఽహం | 27 | 77 |
| **మ** | | |
| మమ యోని ర్మహద్బ్రహ్మ | 3 | 17 |
| మాం చ యోఽవ్యభిచారేణ | 26 | 73 |
| మానాపమానయో స్తుల్యః | 25 | 70 |
| **య** | | |
| యదా సత్త్వే ప్రవృద్ధే తు | 14 | 40 |
| **ర** | | |
| రజసి ప్రలయం గత్వా | 15 | 42 |
| రజ స్తమ శ్చాభిభూయ | 10 | 34 |
| రజో రాగాత్మకం విద్ధి | 7 | 28 |
| **ల** | | |
| లోభః ప్రవృత్తి రారమ్భః | 12 | 36 |
| **స** | | |
| సత్త్వం రజ స్తమ ఇతి | 5 | 21 |
| సత్త్వం సుఖే సంజయతి | 9 | 32 |
| సత్త్వా త్సంజాయతే జ్ఞానం | 17 | 45 |
| సర్వద్వారేషు దేహేఽస్మిన్ | 11 | 35 |
| సమదుఃఖసుఖః స్వస్థః | 24 | 65 |
| సర్వయోనిషు కౌన్తేయ | 4 | 19 |





# అకారాది శ్లోకానుక్రమణిక



## పంచదశాధ్యాయము


| శ్లోకము | శ్లోక సంఖ్య | పుట |
|---|---|---|
| **అ** | | |
| అధ శ్చోర్ధ్వం ప్రసృతా స్తస్య శాఖా | 2 | 96 |
| అహం వైశ్వానరో భూత్వా | 14 | 150 |
| **ఇ** | | |
| ఇతి గుహ్యతమం శాస్త్రం | 20 | 165 |
| **ఉ** | | |
| ఉత్క్రామన్తం స్థితం వాఽపి | 10 | 140 |
| ఉత్తమః పురుష స్త్వన్యః | 17 | 162 |
| ఊర్ధ్వమూల మధః శాఖం | 1 | 87 |
| **గ** | | |
| గా మావిశ్య చ భూతాని | 13 | 147 |
| **త** | | |
| తతః పదం త త్పరిమార్గితవ్యం | 4 | 110 |
| **ద** | | |
| ద్వా విమౌ పురుషౌ లోకే | 16 | 160 |
| **న** | | |
| న త ద్భాసయతే సూర్యః | 6 | 122 |
| న రూప మస్యేహ త థోపలభ్యతే | 3 | 102 |
| నిర్మానమోహా జితసఙ్గదోషాః | 5 | 118 |
| **మ** | | |
| మమైవాంశో జీవలోకే | 7 | 131 |
| **య** | | |
| యతన్తో యోగిన శ్చైనం | 11 | 143 |
| య దాదిత్యగతం తేజః | 12 | 145 |
| యస్మాత్ క్షర మతీతోఽహం | 18 | 163 |
| యో మామేవ మసమ్మూఢః | 19 | 164 |
| **శ** | | |
| శరీరం య దవాప్నోతి | 8 | 135 |
| శ్రోత్రం చక్షుః స్పర్శనం చ | 9 | 138 |
| **స** | | |
| సర్వస్య చాహం హృది సన్నివిష్టః | 15 | 153 |

# అకారాది శ్లోకానుక్రమణిక

## షోడశాధ్యాయము


| శ్లోకము | శ్లోక సంఖ్య | పుట |
|---|---|---|
| **అ** | | |
| అనేక చిత్త విభ్రాన్తాః | 16 | 229 |
| అభయం సత్త్వసంశుద్ధిః | 1 | 175 |
| అసత్య మప్రతిష్ఠం తే | 8 | 210 |
| అసౌ మయా హత శ్శత్రుః | 14 | 225 |
| అహంకారం బలం దర్పం | 18 | 232 |
| అహింసా సత్య మక్రోధః | 2 | 184 |
| **ఆ** | | |
| ఆఢ్యోఽభిజనవా నస్మి | 15 | 227 |
| ఆత్మసమ్భావితాః స్తబ్ధాః | 17 | 230 |
| ఆశాపాశ శతై ర్బద్ధాః | 12 | 219 |
| ఆసురీం యోని మాపన్నాః | 20 | 237 |
| **ఇ** | | |
| ఇద మద్య మయా లబ్ధం | 13 | 223 |
| **ఏ** | | |
| ఏతాం దృష్టి మవష్టభ్య | 9 | 213 |
| ఏతై ర్విముక్తః కౌన్తేయ | 22 | 241 |
| **క** | | |
| కామ మాశ్రిత్య దుష్పూరం | 10 | 215 |
| **చ** | | |
| చిన్తా మపరిమేయాం చ | 11 | 217 |
| **త** | | |
| తస్మా చ్ఛాస్త్రం ప్రమాణం తే | 24 | 243 |
| తా నహం ద్విషతః క్రూరాన్ | 19 | 234 |
| తేజః క్షమా ధృతిః శౌచం | 3 | 195 |
| త్రివిధం నరక స్యేదం | 21 | 238 |
| **ద** | | |
| దమ్భో దర్పోఽభిమాన శ్చ | 4 | 199 |
| దైవీ సమ్ప ద్విమోక్షాయ | 5 | 204 |
| ద్వౌ భూతసర్గౌ లోకేఽస్మిన్ | 6 | 206 |
| **ప** | | |
| ప్రవృత్తిం చ నివృత్తిం చ | 7 | 208 |
| **య** | | |
| య శ్శాస్త్రవిధి ముత్సృజ్య | 23 | 243 |






# అకారాది శ్లోకానుక్రమణిక

## సప్తదశాధ్యాయము


| శ్లోకము | శ్లోక సంఖ్య | పుట |
|---|---|---|
| **అ** | | |
| అదేశకాలే యద్దానం | 22 | 311 |
| అనుద్వేగకరం వాక్యం | 15 | 289 |
| అఫలాకాంక్షిభి ర్యజ్ఞో | 11 | 278 |
| అభిసన్ధాయ తు ఫలం | 12 | 280 |
| అశ్రద్ధయా హుతం దత్తం | 28 | 320 |
| అశాస్త్రవిహితం ఘోరం | 5 | 261 |
| **ఆ** | | |
| ఆయుః సత్త్వ బలారోగ్యం | 8 | 267 |
| ఆహార స్త్వపి సర్వస్య | 7 | 265 |
| **ఓ** | | |
| ఓం తత్స దితి నిర్దేశః | 23 | 313 |
| **క** | | |
| కట్వమ్ల లవణాత్యుష్ణః | 9 | 268 |
| కర్షయన్తః శరీరస్థం | 6 | 262 |
| **త** | | |
| తది త్యనభిసంధాయ | 25 | 316 |
| తస్మా దోమిత్యుదాహృత్య | 24 | 315 |
| త్రివిధా భవతి శ్రద్ధా | 2 | 252 |
| **ద** | | |
| దాతవ్యమితి యద్దానం | 20 | 303 |
| దేవ ద్విజ గురు ప్రాజ్ఞ | 14 | 285 |
| **మ** | | |
| మనఃప్రసాదః సౌమ్యత్వం | 16 | 294 |
| మూఢగ్రాహేణాత్మనో | 19 | 301 |
| **య** | | |
| యజన్తే సాత్త్వికా దేవా | 4 | 260 |
| యజ్ఞే తపసి దానే చ | 27 | 318 |
| యత్తు ప్రత్యుపకారార్థం | 21 | 307 |
| యాతయామం గతరసం | 10 | 270 |
| యే శాస్త్రవిధి ముత్సృజ్య | 1 | 250 |
| **వ** | | |
| విధిహీన మసృష్టాన్నం | 13 | 282 |
| **శ** | | |
| శ్రద్ధయా పరయా తప్తం | 17 | 298 |
| **స** | | |
| సత్కారమాన పూజార్థం | 18 | 300 |
| సత్త్వానురూపా సర్వస్య | 3 | 256 |
| సద్భావే సాధుభావే చ | 26 | 317 |



# అకారాది శ్లోకానుక్రమణిక



## అష్టాదశాధ్యాయము


| శ్లోకము | శ్లోక సంఖ్య | పుట | శ్లోకము | శ్లోక సంఖ్య | పుట |
|---|---|---|---|---|---|
| **అ** | | | **జ** | | |
| అధర్మం ధర్మమితి యా | 32 | 393 | జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా | 18 | 364 |
| అధిష్ఠానం తథా కర్తా | 14 | 357 | జ్ఞానం కర్మ చ కర్తా చ | 19 | 365 |
| అధ్యేష్యతే చ య ఇమం | 70 | 447 | **త** | | |
| అనిష్ట మిష్టం మిశ్రం చ | 12 | 354 | తత్రైవం సతి కర్తారం | 16 | 361 |
| అనుబన్ధం క్షయం హింసా | 25 | 375 | తమేవ శరణం గచ్ఛ | 62 | 437 |
| అసక్తబుద్ధిః సర్వత్ర | 49 | 417 | తచ్చ సంస్మృత్య సంస్మృత్య | 77 | 453 |
| అయుక్తః ప్రాకృతః స్తబ్ధః | 28 | 388 | త్యాజ్యం దోషవదిత్యేకే | 3 | 337 |
| అహంకారం బలం దర్పం | 53 | 422 | **ద** | | |
| **ఇ** | | | దుఃఖమిత్యేవ యత్కర్మ | 8 | 346 |
| ఇతి తే జ్ఞాన మాఖ్యాతం | 63 | 438 | **ధ** | | |
| ఇదం తే నాతపస్కాయ | 67 | 444 | ధృత్యా యయా ధారయతే | 33 | 394 |
| ఇత్యహం వాసుదేవస్య | 74 | 451 | **న** | | |
| **ఈ** | | | న ద్వేష్ట్యకుశలం కర్మ | 10 | 351 |
| ఈశ్వరః సర్వభూతానాం | 61 | 436 | న హి దేహభృతా శక్యం | 11 | 353 |
| **ఏ** | | | నియతం సంగరహితం | 23 | 372 |
| ఏతాన్యపి తు కర్మాణి | 6 | 341 | నియతస్య తు సంన్యాసః | 7 | 343 |
| **క** | | | నిశ్చయం శృణు మే తత్ర | 4 | 339 |
| కామ్యానాం కర్మణాం న్యాసం | 2 | 336 | న తదస్తి పృథివ్యాం వా | 40 | 405 |
| కార్య మిత్యేవ యత్కర్మ | 9 | 348 | న చ తస్మా న్మనుష్యేషు | 69 | 446 |
| కృషి గౌరక్ష్య వాణిజ్యం | 44 | 410 | నష్టో మోహః స్మృతి ర్లబ్ధా | 73 | 449 |
| కచ్చి దేత చ్ఛ్రుతం పార్థ | 72 | 448 | **ప** | | |
| **చ** | | | పఞ్చైతాని మహాబాహో | 13 | 356 |
| చేతసా సర్వకర్మాణి | 57 | 430 | పృథక్త్వేన తు యజ్ఞానం | 21 | 368 |
| | | | ప్రవృత్తిం చ నివృత్తిం చ | 30 | 390 |








# అకారాది శ్లోకానుక్రమణిక



## అష్టాదశాధ్యాయము


| శ్లోకము | శ్లోక సంఖ్య | పుట | శ్లోకము | శ్లోక సంఖ్య | పుట |
|---|---|---|---|---|---|
| **బ** | | | యస్య నాహంకృతో భావో | 17 | 363 |
| బుద్ధేర్భేదం ధృతేశ్చైవ | 29 | 390 | **ర** | | |
| బ్రాహ్మణక్షత్రియవిశాం | 41 | 406 | రాగీ కర్మఫలప్రేప్సుః | 27 | 385 |
| బుద్ధ్యా విశుద్ధయా యుక్తో | 51 | 421 | రాజ న్సంస్మృత్య సంస్మృత్య | 76 | 452 |
| బ్రహ్మభూతః ప్రసన్నాత్మా | 54 | 424 | **వ** | | |
| **భ** | | | వివిక్తసేవీ లఘ్వాశీ | 52 | 421 |
| భక్త్యా మా మభిజానాతి | 55 | 426 | విషయేన్ద్రియ సంయోగాత్ | 38 | 401 |
| | | | వ్యాసప్రసాదా చ్ఛ్రుతవాన్ | 75 | 452 |
| **మ** | | | **శ** | | |
| ముక్తసఙ్గో౽ నహంవాదీ | 26 | 379 | శమో దమస్తపః శౌచం | 42 | 407 |
| మచ్చిత్తః సర్వదుర్గాణి | 58 | 432 | శ్రద్ధావా ననసూయశ్చ | 71 | 448 |
| మన్మనా భవ మద్భక్తో | 65 | 441 | శ్రేయా న్స్వధర్మో విగుణః | 47 | 413 |
| **య** | | | శరీర వాఙ్మనోభి ర్యత్ | 15 | 358 |
| య ఇమం పరమం గుహ్యం | 68 | 445 | శౌర్యం తేజో ధృతి ర్దాక్ష్యం | 43 | 409 |
| యత్త దగ్రే విషమివ | 37 | 400 | **స** | | |
| యదగ్రే చానుబన్ధే చ | 39 | 402 | సంన్యాసస్య మహాబాహో | 1 | 332 |
| యదహంకార మాశ్రిత్య | 59 | 434 | సర్వభూతేషు యేనైకం | 20 | 367 |
| యతః ప్రవృత్తి ర్భూతానాం | 46 | 412 | సహజం కర్మ కౌన్తేయ | 48 | 416 |
| యత్తు కృత్స్న వ దేకస్మి | 22 | 370 | సర్వకర్మాణ్యపి సదా | 56 | 428 |
| యత్తు కామేప్సునా కర్మ | 24 | 374 | స్వభావజేన కౌన్తేయ | 60 | 434 |
| యజ్ఞదాన తపః కర్మ | 5 | 340 | సర్వగుహ్యతమం భూయః | 64 | 440 |
| యయా ధర్మ మధర్మం చ | 31 | 392 | సర్వధర్మా న్పరిత్యజ్య | 66 | 442 |
| యయా తు ధర్మకామార్థాన్ | 34 | 395 | సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ | 50 | 420 |
| యయా స్వప్నం భయం శోకం | 35 | 397 | సుఖం త్విదానీం త్రివిధం | 36 | 399 |
| యత్ర యోగేశ్వరః కృష్ణో | 78 | 453 | స్వే స్వే కర్మణ్యభిరతః | 45 | 411 |

# గీతామతా! హారతి గైకొనుమా!

స్వామి సుందర చైతన్యానంద

ఓం జయ గీతామాతా! ఓం జయ గీతామాతా
భవబంధము తొలగించి ముక్తి నొసగు దాత || ఓం ||

కర్మ భక్తి జ్ఞాన యోగములు
నీ ఆభరణాలు - అమ్మా నీ ఆభరణాలు
ముక్తి నొసగు నీ సన్నిధి కరుణించుము మాతా || ఓం ||

1. సీతవు నీవే సావిత్రివి నీవే
గాయత్రివి నీవే - అమ్మా గాయత్రివి నీవే
గంగాయమునా సరస్వతులలో పవిత్రతవు నీవే || ఓం ||

2. జాగ్రత్స్వప్న సుషుప్తులలో సాక్షివై యుండి
దివ్య సాక్షివై యుండి
తురీయాతీత బ్రహ్మవు నీవే చిన్మయ స్వరూపిణి || ఓం ||

3. విషాదమును దాటించి సాంఖ్యము బోధించి
అమ్మా సాంఖ్యము బోధించి
కర్మ జ్ఞాన సంన్యాసము ధ్యానమును తెలుపు
మమ్ము ఆత్మలో నిలుపు || ఓం ||

4. విజ్ఞానమును తెలిపి అక్షర బ్రహ్మమును పలికి
రాజగుహ్య విభూతి దర్శన భక్తిని అందించు
మాకు ముక్తి ప్రసాదించు || ఓం ||

5. క్షేత్రము కాదని, క్షేత్రజ్ఞుడ నేనని
గుణత్రయము వివరించు,
పురుషునిలో మమ్ముంచు,
దైవాసుర సంపత్తి శ్రద్ధను బోధించు
మోక్షరూపముగా ఉంచు || ఓం ||

6. అమ్మవు నీవు ఆత్మవు నీవు
అంతయు నీవేలే! ఉన్నదంతయు నీవేలే
సుందరమగు చైతన్యము నీవు
లక్ష్మివి నీవేలే! మోక్షలక్ష్మివి నీవేలే || ఓం ||



# నిరుపమ వేదమ్మకు నిజపద నీరాజనం

కాల ప్రవాహానికి ఎదురీది, కలకాలం నిలిచే కాలాతీత జ్ఞాన పుష్పాన్ని జడలో తురుముకొని శోభించే వేదమ్మకు

**మనసైన నీరాజనం.**
**మంగళకరమైన నీరాజనం.**

అబ్ధి మథనంలో అమృతము ప్రాప్తిస్తే, అంతరంగ మథనంలో అద్వైతం సిద్ధిస్తుందని బోధించిన శ్రుతిమాతకు

**కవితా కెంపుల నీరాజనం.**
**మమతా మాణిక్య నీరాజనం.**

ముందు నిలిచిన మనుగడే అర్థం గాని మనిషికి వెనుక నడిపే వెన్నుని మురళీరవాన్ని వినిపించిన వేదనాద కుమారికి

**చరాచర సార నీరాజనం.**
**అమృత స్వరసార నీరాజనం.**

భవ సంతప్త హృదయాలకు శివజ్ఞానామృతమును పోయుటలో చలివేంద్రమై విలసిల్లిన ఉపనిషత్కుమారికి

**గీర్వాణ నీరాజనం.**
**స్వరూప నిర్వాణ నీరాజనం.**

మతి కందని గతి తానై, జత నోర్వని ద్యుతి తానై, యతిమదిలో శ్రుతిని మీటి పలుకు నేర్పిన ప్రభావతికి, పలుకు కందని జ్ఞానకళావతికి

**చిన్ముద్ర నీరాజనం.**
**రుద్రుని యెద భద్ర నీరాజనం.**

లేని వాటిని ఉన్నవంటూ ఉట్టికెక్కించే ఉన్మాదంలో మతాలు ఉల్లి పువ్వుల్ని ఊరేగిస్తుంటే, ఉన్న వాటిని లేవంటూ 'ఉనికి'ని వాడని మల్లెపువ్వులా ఉర్విపై ఊరేగించిన వేదవతికి

**భావుక నీరాజనం.**
**బలమైన తార్కిక నీరాజనం.**

బండరాతి గుండెలను కరిగించి, మనసులలో మల్లెలను పూయించి, హృదయాలలో వెన్నెలను కాయించే ఋషి బిడ్డలను ప్రసవించిన వేదాంత జననికి

**ప్రామాణ్య నీరాజనం.**
**బహుముఖ ప్రావీణ్య నీరాజనం.**

అమృతాన్ని పానం చేసిన రాహువు రాక్షసుడుగనే మిగిలిపోయినా జ్ఞానామృతాన్ని పానం చేసిన మానవుడు మానవుడుగా మిగలక పోవుటయే గాక మాధవుడుగా వెలిగి పోతాడని ప్రమాణ మందించి నిరూపించిన శ్రుతి శిఖర సంచారిణికి, వేదవిద్యావతికి ....

**శ్రుతిరేవ శరణ మితి నీరాజనం.**
**అఖండ రూప స్థితి రేవ నీరాజనం.**

స్వామి సుందర చైతన్యానంద

# అమ్మా! భారతీ! అందుకో హారతి!

స్వామి సుందర చైతన్యానంద

ఎత్తైన భావ సంపదలో, లోతైన హృదయ సౌందర్యంలో నాకు మించిన వారు లేరంటూ, హిమాలయాలను, సాగర జలాలను అటు ఇటు ఉంచుకొని శోభించే జననీ! భరతావనీ! జోహారు!

శతాబ్దాల సంకెళ్ళతో చేతులు చలించక పోయినా, జ్ఞాన రుధిర ప్రవాహం క్షణమైనా ఆగని చైతన్య సంజీవనీ! పరమ పావనీ! జోహారు!

గంగా తరంగాల సంగీత పొంగులు, యమునా జలాలలో కన్నయ్య నవ్వులు కలబోసి కులికేటి సుకుమార జననీ! మంగళకళ్యాణీ! జోహారు!

హింసాయుత దుండగులను అహింసతో నిలదీసి సమతా సందేశంతో సంబర మొనరించిన సహన ప్రియా! సేవామయా! సదాశయా! జోహారు!

అమ్మా!

కర్మయోగులను కన్నావు. ధర్మవీరులను పెంచావు. త్యాగధనులను పెంపొందించావు. బుద్ధుని మొదలు వివేకానందుని వరకు శాంతిదూతలను, జ్ఞానప్రదాతలను ప్రపంచాని కందించావు. బాహ్యంలో మండుటెండలు రగులుతున్నా, ఆంతర్యంలో పండు వెన్నెలలు పూయించుకొనే విద్యను ఉగ్గుపాలతో నీ బిడ్డలకు నేర్పావు.

అమ్మా! నీ కొంగు పట్టుకొని తిరిగిన నీ బిడ్డలు శాంతికపోతాలు. నీ కీర్తి రథానికి అమర్చిన చక్రాలు.

అమ్మల గన్న అమ్మకు అఖిల జగతి శిరమొడ్చి నీరాజన మిచ్చే రోజు ఎంతో దూరంలో లేదు. ఆ కలలు పండేరోజు, ఆ కళల పండుగరోజు ఇక ఎంతో కాలం పట్టదు.

విబుధావని విమలకీర్తి విశ్వగగనంలో ఊరేగే సమయం మరెప్పుడో కాదు. దివి నుండి దివ్యాత్ములు భువికి బయలు దేరారు.

ఆర్షసంస్కృతీ జగతిలో ఆశాదీపికలు వెలిగాయి.

వేదాంత వెన్నెల విశ్వాన్ని తడుప బోతోంది.

జ్ఞాన శంఖాన్ని పూరిస్తూ శాంతిజ్యోతుల్ని వెలిగించ బోతోంది.

రేబవలు ఋషికీర్తిని సంద్రము కీర్తిస్తుంటే, ఋషి వాణిని హృదిలో నిలుపుకొని, మసి తుడిచే ప్రయత్నంలో పవిత్రాత్ములు పావురాలై విహరించే రోజులు దగ్గరి కొస్తున్నాయి.

ఇక,

హింసపై అహింస దండయాత్ర చేస్తుంది. ద్వేషాన్ని ప్రేమ కాల రాచేస్తుంది. లోభాలను త్యాగాలు



చుట్టు ముట్టేస్తాయి. స్వార్థాన్ని సేవలు నిలదీస్తాయి. అధర్మాన్ని ధర్మం జయిస్తుంది. కామాన్ని ప్రేమ దగ్ధం చేస్తుంది.

జ్ఞాన పవనాలు వీచేందుకు సిద్ధంగా ఉన్నాయి. ప్రేమ తరంగాలు లేచేందుకు ఉరక లేస్తున్నాయి. ఇక నడువ లేనంటూ మంచి పరుగెత్త బోతోంది. ఇక చలించ లేనంటూ శాంతి కూర్చోబోతోంది.

ఆకాశంలో ప్రతి తార అంబరానికి అలంకారమే. భారతావనిలో ప్రతిబిడ్డ అమ్మ ఖ్యాతికి ఆభరణమే.

జయభేరిని మ్రోగించే అలలే అమ్మ బిడ్డలు.

జైత్రయాత్ర సాగించే కళలే అమ్మ తనయులు.

మా అమ్మ శారదను ధనమ్మకు అమ్మలేనంటూ కాయలు కాచిన చేతులతో కవితా పంటను పండించిన కవికృషీవలుడు పోతన మాకు స్పందన.

'నిధి చాల సుఖమా! రాముని సన్నిధి సేవ సుఖమా?

నిజముగ బల్కు మనసా!' అని మనస్సునే నిలదీసిన త్యాగానికి రాజు మా త్యాగరాజు మీదే మాకు మోజు.

అమ్మా! మము గన్న తల్లి! మా కల్పవల్లి!

మనస్సులను పరిమళింపచేసే మంచి మల్లెల మాటలను మాచే పలికించు.

గుండె గుండెను గుడిగా మార్చే వెన్నెల పాటలు పాడించు. వేదాంత వెన్నెల పాటలు పాడించు.

తీపిగుండెలో నాలుకను తడిపి రాగసుధను ఒలికించే శక్తిని ప్రసాదించు.

ముళ్ళు చుట్టు ముట్టినా మృదువుగా నవ్వే గులాబీల గుట్టు మాకు నేర్పించు. లోతుల కెళ్ళి తురుముతున్నా తుమ్మెదలకు తీపి తేనెలను తినిపించిన మందారాలుగా మము దీవించు.

జై భారత్!



# పరమహంసల పుటలు
## మహాత్ముల అభినందనలు - ఆశీస్సులు

స్వామి సుందర చైతన్యానందులు ఏకత్వానికి, దివ్యత్వానికి, పవిత్రతకు ప్రతిరూపము. నేడు మనకున్న మహాత్ములలో, ప్రమాణ పురుషులలో వీరు ఒకరు. ఆత్మజ్ఞానమును పంచుతూ, నిత్యశాంతి వైపుకు మానవాళిని మరలిస్తున్న మహనీయులు వీరు. సనాతన ధర్మమునకు వీరు చేస్తున్న సేవ అమోఘము.



స్వామీజీ శ్రీకృష్ణ భగవానుని పరమ భక్తులు. కృష్ణ చైతన్యమునకు విశ్వకేంద్రంగా ఈ ఆశ్రమమును తీర్చి దిద్దుటలో నేనూ మీలో ఒకడినై ఉంటాను. 'శుద్ధ' - 'సుందర' కృష్ణ తత్త్వములో సదా ఏకమై ఉండెదరు.

**మహర్షి శుద్ధానంద భారతి**

**యోగ సమాజ్ స్థాపకులు**



సుందర చైతన్యానంద స్వామికి పాండిత్యము ఉంది. ఆధ్యాత్మిక జీవితము ఉంది. ఆధునిక విద్యను, సంస్కృతాన్ని సమున్నతంగా పొంది, తమ అద్భుతమైన శక్తిని, సంగీత వైదుష్యమును మన రాష్ట్రంలో సనాతన ధర్మ ప్రచారానికి వినియోగించారు.

**స్వామి రంగనాథానంద**

**అధ్యక్షులు, రామకృష్ణ మిషన్**






సుందర చైతన్యానంద స్వామి ఆంధ్రదేశంలో విస్తృతంగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను గూర్చి తెలుసుకొని అమితానందమును పొందుతూ ఉన్నాను.

మహోన్నత దృక్పథంతో వారు చేపట్టే పవిత్ర కార్యాలు నన్ను పులకాంకితుడను చేస్తూ ఉన్నాయి. వేదాంత ప్రబోధముల ద్వారా ఆర్షసంస్కృతిని పునరుద్ధరించేందుకు ఈ విధమైన నిశ్శబ్ద ఆధ్యాత్మిక ఉద్యమాలే ఏకైక మార్గము.

శక్తివంతమైన వారి యజ్ఞకార్యములు ఎడతెగక నిత్యము కొనసాగాలని ప్రార్థిస్తూ ఉన్నాను.

**స్వామి చిన్మయానంద**

**చిన్మయ మిషన్**




శ్రీ శంకరాచార్య స్వామి ఏ ధర్మం కొరకు పాటు పడ్డారో, సుందర చైతన్యానంద స్వామి కూడా ఆ ధర్మం కొరకే శ్రమిస్తున్నారు. శంకర సిద్ధాంతాన్ని, వేదాంత వైభవాన్ని వినిపించేందుకు కంకణం కట్టుకున్నారు. మా పీఠము తరఫున వారికి 'సత్సంగ ప్రచారమణి' అనే బిరుదును ఇచ్చాము.

**స్వామి జయేంద్ర సరస్వతి**

**కంచి కామకోటి పీఠాధిపతులు**

భగీరథుడు ఆకాశగంగను భూలోకంలో ప్రవహింప చేసినట్లు, శ్రీ సుందర చైతన్యానంద స్వామి అపర భగీరథులై వారు వెళ్ళిన చోటల్లా జ్ఞానగంగను ప్రవహింప చేశారు. సంసార జీవనయాత్రలో విసిగి వేసారిన మానవ హృదయాలపై భక్తి అనెడి అమృతాన్ని చిందింప చేసి వారిని కడతేర్చిన మహానుభావులు శ్రీసుందర చైతన్యానందుల వారు. ఒక మహాసభలో వారికి 'జ్ఞానబ్రహ్మ' ప్రశస్తిని మేము ఇచ్చినాము.



**స్వామి విశ్వేశ తీర్థులు**

**పెజావరు పీఠాధిపతులు**

**ఉడిపి**



సుందర చైతన్యస్వామి కలకాలము జీవించు గాక! పూర్ణ ఆయురారోగ్యాలతో ఈ ధర్మ ప్రచార ఉద్యమములో, జన జాగరణ కార్యములో వర్ధిల్లు గాక! వేదాలలో, రామాయణ భాగవతాది పురాణ ఇతిహాసము లలో నిక్షిప్తమై ఉన్న జ్ఞానమణులను వెలికి తీసి వితరణ చేయుటలో వారికి వారే సాటి. వారి జీవన విధానము, వారి ప్రచారోద్య మము అంతులేని కళలతో, విశేష జ్ఞాన వైభవంతో విరాజిల్లుతూ ఉన్నాయి.

గహనమైన విషయాలను సరళమైన శైలిలో అక్షర రూపంలో లిఖించి అలరించే నేర్పు పరమాత్మ వారి కిచ్చిన అపురూపమైన వరము. సరస్వతీ కటాక్షం వారిపై పూర్ణంగా ఉంది.

**స్వామి చిదానంద**
***అధ్యక్షులు, దివ్యజీవన సంఘము, ఋషీకేశ్***



శ్రీ స్వామి సుందర చైతన్యానందజీతో మాకు 1965 వ సంవత్సరము నుండి, అనగా వారు వేంకటగిరిలో విద్యార్థిగా ఉన్నప్పటి నుండి పరిచయ మున్నది. విద్యార్థిగా ఉన్నప్పుడే వారు మా దివ్యజీవన సంఘ కార్యక్రమాలలో తరచుగా పాల్గొను చుండెడి వారు. వారు మేము అనేక సార్లు భజనలు - సంకీర్తనలు కలిసి చేసితిమి.

శ్రీ సుందర చైతన్యానంద స్వాముల వారు అనేక చోట్ల గీతా యజ్ఞములను నిర్వహించినారు. మంచి పేరును గడించినారు. ఆశ్రమమును స్థాపించి వారి ప్రచార కార్యక్రమములను విరివిగా సాగించుచున్నారు. వారి సంకీర్తనా మాధుర్యమును చవిగొన్నవారు, వారి ప్రవచనములను విని ఆకర్షింపబడిన వారు అనేకమంది భక్తులు మమ్ములను కలిసి చెప్పునప్పుడు ఎంతో ఆనందించు చుందుము.

కరుణాసాగరుడైన శ్రీకృష్ణ పరమాత్మ శ్రీ సుందర చైతన్యానంద స్వాముల వారు విరివిగా ఆధ్యాత్మిక ప్రచార, ప్రసారము లొనర్చుటకు వలయు ఆయురారోగ్యములను, బలమును ప్రసాదించి రక్షించు గాక!

**స్వామి దేవానంద**
**శివానందాశ్రమము, ఋషీకేశ్, హిమాలయములు.**





**"సత్పురుషులకు జన్మ నిచ్చిన వంశము ధన్యము, తల్లిదండ్రులు ధన్యులు, దేశము ధన్యము"** - ఇది శాస్త్ర వచనము. భారతమాత నిరంతరం సద్గురువులకు, సంత పురుషులకు జన్మ నిస్తూనే ఉంది. వారిలో కొందరు మన సమకాలీనులుగా జీవించడం మన భాగ్యం. అటువంటి ఉత్తమ కోవకు చెందిన మహనీయులే మన ప్రియతమ స్వామి సుందర చైతన్యానందజీ మహరాజ్.

చిరుతప్రాయము లోనే అంకిత భావము, సనాతన ధర్మశాస్త్రము నందు అకుంఠిత దీక్ష, బహుముఖ ప్రావీణ్యములతో ఆంధ్రదేశ మంతటా లక్షలాది మందిని ఆకర్షించి దైవోన్ముఖులను గావిస్తూ ఉన్నారు.

మృదు మధుర స్వరముతో, హృదయ లోతుల నుండి పెల్లుబుకు గాన మాధుర్యముతో శ్రోతల హృదయాలను భక్తి పారవశ్యంలో ముంచెత్తు తున్నారు.

దేశ సమైక్యత మరియు ఆధ్యాత్మికత వైపుకు మానవాళిని నడుప గల శక్తిని శ్రీ పాండురంగడు, రుక్మిణీదేవి వారికి అనుగ్రహింతురు గాక!

**సంత్ కేశవదాస్**
**దాసాశ్రమం, బెంగుళూరు**



**జగత్పిత పపా!**

**ప్రియతమ సుందర రాజన్,**

పూజ్య పపా జ్ఞానమయ పలుకులు మీకు సదా స్ఫూర్తి దాయక మగుగాక. . . .

"సత్య జ్ఞానము అజ్ఞానమును నిర్మూలించి అహంకారమును విలీన మొనర్చును. విశ్వ కారణము, సర్వవ్యాపి అయిన చైతన్యాత్మయే నేను అన్న ఎరుకయే సత్యజ్ఞానము."

మీ ప్రేమపూరిత మైన ఉత్తరముతో పాటు ఈ నెల 14 నుండి 29 వ తేది వరకు మీరు నిర్వహించనున్న గీతా జ్ఞానయజ్ఞ ఆహ్వానము అందినది. ఈ పవిత్ర యజ్ఞకార్యము, అందు పాల్గొను సమస్త భక్తజనులపై పూజ్య పపా పూర్ణ ఆశీస్సులు వర్షించుగాక!

**మాతా కృష్ణాబాయి**
***9-8-74***
**ఆనందాశ్రమం, కన్హన్‌గాడ్, కేరళ**



శ్రీ స్వామి దయానందజీతో పూజ్య స్వామీజీ




శ్రీ స్వామి బాలగంగాధరనాథ్‌జీతో పూజ్య స్వామీజీ



రామకృష్ణ మఠాధ్యక్షులు
శ్రీ స్వామి అనన్యానందజీతో పూజ్య స్వామీజీ








భగవాన్ శ్రీ మురళీకృష్ణ ఆలయం - సుందర చైతన్యాశ్రమం, హైదరాబాద్




ధవళేశ్వరం
తూర్పు గోదావరి జిల్లా




విశాఖపట్నం



కడప




నెల్లూరు



రాజమండ్రి
తూర్పు గోదావరి జిల్లా




ఆదిలాబాద్




కోరుట్ల
కరీంనగర్ జిల్లా







మెహబూబ్‌నగర్





ఖమ్మం



ఒంగోలు



కరీంనగర్





వరంగల్



నిజామాబాద్



సిద్దిపేట
మెదక్ జిల్లా


మెట్‌పల్లి
కరీంనగర్ జిల్లా




నిర్మల్
ఆదిలాబాద్ జిల్లా


గజ్వేల్
మెదక్ జిల్లా




తొర్రూరు
వరంగల్ జిల్లా




వాఘాపూర్
ఆదిలాబాద్ జిల్లా





సిరిసిల్ల
కరీంనగర్ జిల్లా




ఎల్లారెడ్డిపేట
మెదక్ జిల్లా



పొచ్చెర
ఆదిలాబాద్ జిల్లా

# సుందర చైతన్యం

అఖిలాంధ్ర దేశంలో తమ గంభీరోపన్యాసముల ద్వారా, విశేష గ్రంథ రచనల ద్వారా, సుమధుర సంకీర్తనము ద్వారా లక్షలాది భక్త జన హృదయాలలో జ్ఞాన జ్యోతులను వెలిగించిన మహా మనీషి, సంప్రదాయ మహర్షి,

ఆర్ష సంస్కృతీ పునర్వైభవానికి పిలుపు నిచ్చి, అరవై రెండు సంవత్సరాల జీవిత కాలములో నలభై రెండు సంవత్సరాలు భక్త జన క్షేమానికి వినియోగించిన అనుభవ వేదాంత ప్రవక్త, ఆర్ష విజ్ఞాన కంఠీరవము,

మంజులామృత భాషణంలో మహిని పులకింప చేసిన మహాయతి, వేద వేదాంత శాస్త్ర పురాణేతిహాస రహస్యార్థ సారమతి, అపర సరస్వతి, ఆదర్శ పుణ్యమూర్తి,

అజ్ఞాన చీకట్లు ముసిరిన హృదయాలలో నిత్య వెలుగులను నింపి, సనాతన ధర్మ జీవన బాటను అద్భుతంగా తీర్చి దిద్దుతూ, వక్తగా, రచయితగా, గాయకుడుగా, బోధకుడుగా, గురువుగా అశేష భక్త జనుల హృదయ మందిరాలలో ప్రతిష్ఠింప బడి ఉన్న పరమ పూజ్య గురుదేవులు,

**శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానందుల** వారు.

**శ్రీ చైతన్య జయ ధ్వజం**

*సర్వజిత్ - మార్గశీర్షశ్రీః*
*గీతా భాగవతో దయః*
*జ్ఞానబ్రహ్మర్ష సర్వజ్ఞ*
*శ్రీ చైతన్య జయ ధ్వజః*

శ్రీ సర్వజిత్ వైకుంఠైకాదశి గీతా జయంతీ పరోషస్సున 1947 డిసెంబరు 25 వ తేది ఉదయం 4.30 గంటలకు శ్రీ స్వామీజీ వారి *ఆవిర్భావ విజయం.*

శ్రీ ప్లవంగ వినాయక చతుర్థి 1967 డిసెంబరు 8 వ తేది శ్రీ స్వామీజీ వారి *వాగావిష్కార విజయం.*

శ్రీ రక్తాక్షి కార్తీక కృష్ణ తృతీయ తదియ 1984 నవంబరు 11 వ తేది శ్రీ స్వామీజీ వారి *ఆశ్రమ స్వీకార విజయం.*

శ్రీక్రోధి ఆశ్వయుజ కృష్ణ తృతీయ చవితి 1985 నవంబరు 14 వ తేది స్వామీజీ వారు స్థాపించిన ఆధ్యాత్మిక మాసపత్రిక *గిరిధారి ప్రసార విజయం.*

శ్రీ ప్రజాపతి మార్గశీర్ష శుక్ల షష్ఠి 1991 డిసెంబరు 12 వ తేది శ్రీ స్వామీజీ వారి *జ్ఞాన శతక్రతు విజయం.*

శ్రీ ఈశ్వర మార్గశీర్ష శుక్ల సప్తమి 1997 డిసెంబరు 6 వ తేది శ్రీ స్వామీజీ వారి *భాగ్యనగర - ఆశ్రమ ప్రవేశ విజయం.*

శ్రీ చిత్రభాను జ్యేష్ఠ శుక్ల నవమి 2002 జూన్ 19 వ తేది శ్రీ స్వామీజీ వారి *విశాఖ సాగర తీరాశ్రమ స్థాపన విజయం.*



శ్రీ వికృతి నామ చైత్ర శుక్ల అష్టమి 2010 మార్చి 23 వ తేది శ్రీ స్వామీజీ వారి *చైతన్య భగవద్గీతా గ్రంథావిష్కరణ విజయం.*

ఇంకా

అయుత పత్ర (10,000) *రచనాపూర్తి విజయం.*

పంచ సహస్ర (5,000) *ప్రవచనా పూర్తి విజయం.*

ద్విశతతమ (200) *జ్ఞానయజ్ఞ విజయం.*

ఇది శ్రీ సుందర చైతన్యానంద స్వామి *విజయానుభూతి.*

## అవతార విశేషం



1947 వ సంవత్సరం డిసెంబరు 25 వ తేదిన నెల్లూరు జిల్లా లోని కట్టుబడిపాళెం అనే గ్రామంలో బ్రహ్మముహూర్తమున వైష్ణవ కుటుంబంలో **శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానందుల** వారు జన్మించారు. అది పరమాత్మ స్వరూపమైన మార్గశీర్ష మాసం. ఆ రోజే వైకుంఠ ఏకాదశి, గీతా జయంతి కలిసి రావడం విశేషం కాదు, వైభవం. సనాతన ధర్మ పునర్వైభవ ప్రాప్తికి సంకేతం.

శ్రీ పెరుంబుదూరు వేంకట శేషాచార్యులు, రంగనాయకమ్మ అను పుణ్య దంపతులకి శ్రీ స్వామీజీ అష్టమ గర్భ సంజాతులుగా జన్మించారు. స్వామీజీ పూర్వాశ్రమం పేరు శ్రీ సుందర రాజన్. స్వామీజీ పూర్వీకులు ద్రవిడ దేశము వారు. వీరి తాత గారు బాల్య దశలో ఆంధ్రదేశానికి వచ్చారు. చంగల్పట్టు జిల్లా లోని రామానుజాచార్యుల వారి జన్మస్థల మైన శ్రీ పెరుంబుదూరు వీరి స్వగ్రామము. స్వామి వారి తాతలు విద్వత్తు గల వారై గ్రంథ రచనలు చేశారు. దేవాలయార్చకులుగా, తోమాల సేవకులుగా, గాయకులుగా, భక్తి ప్రబంధ రచయితలుగా వన్నె కెక్కారు. కవిబ్రహ్మ తిక్కన, కవయిత్రి మొల్ల, జ్ఞానబ్రహ్మ సుందర చైతన్యులు-ఈ ముగ్గురు సింహపురి సీమలో విరబూసిన జ్ఞాన మందారా లని స్తుతిస్తూ నెల్లూరు పట్టణంలో 15-6-94 నుండి 24-6-94 వరకు పూజ్య స్వామీజీ నిర్వహించిన 118 వ జ్ఞానయజ్ఞంలో పూజ్య స్వామీజీకి కనకాభిషేకం చేసిన సందర్భంలో సింహపురీయులు సమర్పించిన పద్య మందారాలు.

కం॥ భారత సంహితఁ దెన్గున
సారమతుల్ పొగడ నుడివి జగతికి మేలున్
గూరిచిన, యజ్వతిక్కన
పొరుండీ సింహపురికి బ్రహ్మయు కవితన్ ॥



కం॥ మొల్లల జాజుల తావులు
వల్లవ మృదుశోభలొప్పఁ బల్కెను కావ్యం
బుల్లములు పల్లవింపగ
మొల్ల యనఘ సింహపురికి ముద్దుల పడుచై ॥





కం॥ సుందరుడౌ చైతన్యా
నందుండాంధ్రమ్మునందు నాణ్యత మీరన్
పొందించి భాగవత సుధ
నందించెను సింహపురికి యశముం గూర్చెన్ ॥

శ్రీ స్వామీజీ బి.ఎ.లిట్ పట్టమును పొందారు. పూవ వయస్సు నందే వేదాంత గ్రంథాలను రాత్రింబవళ్ళు అధ్యయనం చేశారు. చేతిలో వేదాంత గ్రంథం లేకుండా బాల్యంలో వారు ఎవ్వరికీ కనిపించి ఉండరు. నిత్యము నియమంతో ధ్యానం చేసే వారు. భక్తుల కోర్కె మేరకు యజ్ఞాలు ప్రారంభించారు. ప్రతి యజ్ఞంలో వేలాది సంఖ్యలో వచ్చి భక్తులు వారి ఉపన్యాసాలను ఆలకించే వారు, ఆలకిస్తూ ఉన్నారు. స్వామి వారిది అద్వైత మార్గము. ఆ విషయంలో రాజీ పడకుండా బోధిస్తారు. జ్ఞానమునకు భక్తిని సమన్వయం చేసి బోధించడం వారి ప్రత్యేకత.



సనాతన ధర్మ మహాసాగరంలో ఉత్తుంగ తరంగాలై ఎగసిన భక్తుల, మహాత్ముల గాథలు చదువుతూ 'ఇవి నిజాలా!' అని సందేహించే ఆధునిక యువతరానికి చక్కని సమాధానం చెబుతుంది స్వామి వారి సున్నిత హృదయం, అద్భుత జీవన విధానం.

## ఆధ్యాత్మిక స్ఫూర్తి - అఖండ కీర్తి

నలభై అయిదు సంవత్సరాల క్రితం మాట . . .

సత్య సందేశా లందించే సద్గ్రంథాలు అక్కడక్కడ లభించేవి. కాని అవి ఎక్కువ శాతం పండితుల బరువు పెంచడానికి మాత్రమే ఉపయోగ పడేవి. సమాజానికి వాటిని అందిద్దా మనే పుణ్యాత్ములు ఉన్నా, సామాన్యుని స్థాయిని గ్రహించ లేని కారణంగా అట్టి ఎందరివో ప్రయత్నాలు వ్యర్థంగా మిగిలి పోయాయి. అభివృద్ధి చెందిన విజ్ఞాన శాస్త్రం నూతన తరాన్ని వినూత్న సంశయాలలో ముంచెత్తింది. అర్థం లేని భౌతిక వాదం, జనులలో పెరిగిన అలసత్వం - అన్నీ కలిసి జీవితాన్ని శోభింప చేసే విజ్ఞాన మణులను వెదజల్లే వేదాంత శాస్త్రాన్ని కాలక్షేపం స్థాయికి దించాయి.



ఇవన్నీ పరిశీలించిన శ్రీ స్వామీజీ యువ హృదయం తీవ్రంగా స్పందించింది. జ్ఞాన ప్రకాశంలో రమించ వలసిన భారతదేశం 'దరిద్రులున్న సంపన్న దేశం'గా మిగలడం ఆ చిన్ని హృదయం భరించ లేక పోయింది. కుదురుగా, మెళకువతో, అద్వితీయ సామాజిక స్ఫూర్తితో, అవగాహనతో అక్కడ ఓ బృహద్యత్నానికి అంకురార్పణ జరిగింది. సామాన్యునికి, సత్యానికి మధ్య నున్న



అగాధాన్ని పూడ్చడానికి ఆ చిన్నారి చేతులు నడుం బిగించాయి. నేటి ఈ సుందర చైతన్య మహోద్యమాన్ని మన ముందుంచాయి. ఈ రోజు సమాజానికి ఏమి అందించాలి అన్న విషయంతో పాటు ఎలా అందించాలి అన్న విషయంలో సుస్పష్టమైన, సశాస్త్రీయ మైన అవగాహనతో ప్రారంభమై, అందుకు భగవత్కృపను తోడు చేసుకొని రేయింబవళ్ళు శ్రీ స్వామీజీ శ్రమించారు. ఇంతింతై ఎదిగి ఎదిగి గుండె గుండెను మీటుతూ, గడప గడపను తాకుతూ మహా ప్రవాహమై - దరి చేరిన వారిని పావనులను గావించే పుణ్యసలిలగా, మహోన్నత జ్ఞానగంగా ప్రవాహంగా నేడు **సుందర చైతన్యోద్యమం** రూపు దాల్చింది.

శ్రీ స్వామీజీ మాటల మధ్య మానవ జీవితానికి అర్థం చెబుతూ, పాటలలో తియ్యగా పరమార్థాన్ని విప్పి చూపుతూ, నిర్జీవ మవుతున్న సమాజానికి జీవిత పాఠాలను సహనంతో నేర్పుతూ 200 కు పైగా జ్ఞాన యజ్ఞాలను నిర్వహించి, తెలుగు లోను, ఆంగ్లం లోను 150 గ్రంథాలను రచించి, 200 సత్సంగ శాఖలను రాష్ట్ర మంతటా నెలకొల్పి, 22 మురళీ కృష్ణాలయాలను, ధ్యానమందిరాలను నిర్మించి, 'గిరిధారి' మాసపత్రిక ద్వారా, టి.వి. ద్వారా, ఆడియో, వీడియో సి.డి.ల ద్వారా ఆర్షవిద్యా వాణిని జనావళికి వినిపిస్తూ ఉన్నారు.

## ఆశ్రమ స్వీకారం

గత నలభై ఐదు సంవత్సరాలుగా పూజ్య స్వామీజీ ఆంధ్రావనికి అందించిన ఆధ్యాత్మిక సేవలు అనితర సాధ్యాలు. ఈ మహత్తర కార్యక్రమానికి కార్యక్షేత్రంగా 1984, మే 11 వ తేది ప్రథమంగా ధవళేశ్వరం సుందర చైతన్యాశ్రమం రూపు దిద్దుకుంది. తపోవనంలా, సుందర నందనోద్యాన వనంలా శోభించే ఆశ్రమం వేలాది సత్సంగీయులకు, భక్తులకు స్ఫూర్తి కేంద్రంగా దినదినాభివృద్ధి చెందింది. అద్భుత కళాఖండమైన ఈ ఆశ్రమం ప్రస్తుతం వానప్రస్థాశ్రమంగా అలరారుతోంది.

1997 డిసెంబరు 25 వ తేది అభినవ ఆనంద బృందావనంగా హైదరాబాద్ సుందర చైతన్యాశ్రమం



మహర్షి శ్రీ శుద్ధానంద భారతి, మాజీ రాష్ట్రపతి శ్రీ శంకర దయాళ శర్మ దంపతులతో పూజ్య స్వామీజీ

వెలసింది. దేశ విదేశాలలో ఆధ్యాత్మిక సేవ లందించేందుకు శ్రీ స్వామీజీ వారికి ఆశ్రమం ఒక పనిముట్టు అయింది. పచ్చని పొలాల మధ్య పదమూడు ఎకరాల స్థలంలో నిర్మింపబడిన ఈ సువిశాలమైన ఆశ్రమం భక్తుల పాలిటి కల్పవృక్షం. భక్తి భావ పరంపరలలో ముంచెత్తే 76 అడుగుల ఎత్తు గల మురళీకృష్ణ భగవానుని ఆలయం, నిరంతరం గురుదేవుల జ్ఞాన ప్రబోధాలతో ప్రతిధ్వనించే శ్రుతి మందిరం - ఈ రెండూ భక్తి జ్ఞాన సమ్మేళన మైన సుందర చైతన్య మహోద్యమానికి సంకేతాలు.

2002 జూన్ 19 వ తేదిన విశాఖ సాగర తీరంలో మూడవది అయిన సుందర చైతన్య ఆశ్రమం నెలకొల్ప బడింది.

## చైతన్య శంఖారావం

ఒక యుద్ధం రణరంగంలో ముగిసి ఉండ వచ్చు. కాని, అది పుట్టింది మాత్రం ఒక వ్యక్తి మనస్సు లోనే. మార్పు అనేది సంభవ మైతే అది సమాజంలో కాదు. వ్యక్తిలో. వ్యక్తి ఆలోచనా సరళి మారితే వ్యక్తి ప్రవర్తనలో పరివర్తన వస్తుంది. మనసు మారితేనే మనుగడ మారుతుంది. మనిషి మారితేనే సమాజం మారుతుంది.

**సుందర సత్సంగాలు :**

మాది గొప్ప అంటే మాది గొప్ప అంటూ అందించ బడే పలు రకాల సిద్ధాంతాలు, సందేశాలు, మాయలు, మహిమలు మనిషిని చుట్టు ముట్టి మభ్య పెడుతున్న ఈ గందరగోళ పరిస్థితులలో, 'అసలు ఇన్ని రకాల ఆలోచనల వెనుక ఉన్న ఆంతర్య మేమిటి? అది పుట్టిన దెక్కడి నుంచి? పయనిస్తున్నదే తీరానికి? ఇంతకీ మోక్ష మంటే ఏమిటి? దానికి మార్గ మేది? - ఇటువంటి సహజ, అనివార్య సంశయాలకు సహేతుకమైన సశాస్త్రీయ మైన సమాధానాలను అందిస్తూ, **విచారము - అనుభవము - ప్రచారము** - ఈ మూడింటిని లక్ష్యంగా కలిగిన సుందర సత్సంగాలను శ్రీ స్వామీజీ నలభై సంవత్సరాల క్రితమే రాష్ట్ర మంతటా నెలకొల్పారు. కుల తత్త్వాల నధిగమించి, 'నా కులం ఒక్కటే - సానుకూలం' అనే గురుదేవుని అడుగుజాడల్లో ఏకాత్మ భావంతో సత్సంగీయు లందరూ జీవిస్తున్నారు.

**చైతన్య మాతృమండలి :**

గృహలక్ష్మి గృహానికి మూల స్తంభం వంటిది. ఆ కల్పవల్లి నీడ లోనే గృహం సుఖశాంతులతో వర్ధిల్లు తుంది. బిడ్డలకు అమ్మ ఒడి ప్రథమ బడి. అవగాహన గల తల్లులు ఇంటిని శాంతి నిలయం చేయగలరన్న మహోన్నత ఆశయంతో ముందు మాతృమూర్తులను తీర్చి దిద్దే ప్రయత్నంలో శ్రీ స్వామీజీ అన్ని గ్రామాలలో, పట్టణాలలో 'చైతన్య మాతృమండలి' స్థాపించారు. నిత్యము స్వాధ్యాయంతో, సేవా కార్యక్రమాలతో చైతన్య మాతృమండలి ఆదర్శవంతంగా సమాజంలో శోభిస్తూ ఉంది.

**చైతన్య యువత :**

గోడ యొక్క గట్టిదనం ఇటుకల మీద ఆధారపడి ఉన్నట్లు, దేశం యొక్క స్థిరత, ఐక్యత, పురోగతి యువత మీద ఆధారపడి ఉంది అన్న ఉద్దేశ్యంతో 'చైతన్య యువత' విభాగాన్ని శ్రీ స్వామీజీ నెలకొల్పి యువతను క్రమశిక్షణతో, సంయమనముతో, ఆధ్యాత్మిక స్ఫూర్తితో ప్రగతి మార్గంలో నడుపుతూ ఉన్నారు. ప్రేమతో, సేవా భావంతో చరిస్తూ, వారు నమ్ముకున్న విలువల వైశిష్ట్యాన్ని, ఈ



మార్గంలో వారికి కలిగిన సంతృప్తిని అందరికీ అందించాలని పూర్ణ హృదయంతో ప్రయత్నించడమే కర్తవ్యంగా పెట్టుకొని, భావి తరాలకు ఆశాజ్యోతులుగా చైతన్య యువత వెల్గొందుతూ ఉంది.

**గిరిధారి :**

సర్వ వేదాంత సారంగా, సర్వ సమస్యలకు ఏకైక పరిష్కారంగా, అనుభవామృతాన్ని చక్కటి వ్యాసాల రూపంలో, కథల రూపంలో కవితల రూపంలో, ప్రశ్నోత్తర రూపంలో నింపి శ్రీ స్వామీజీ గత 25 సంవత్సరాలుగా ఆంధ్రావనికి మాసం మాసం అందిస్తున్న అమృత కలశమే గిరిధారి. 20,000 మంది జీవిత సభ్యులను కలిగిన గిరిధారి ఆధ్యాత్మిక మాస పత్రిక పాఠకులను నిత్యము చైతన్య వంతం చేస్తూ, ఆనంద తీరాలకు తరలిస్తూ ఉంది.



**1985 లో 'గిరిధారి' మాసపత్రిక ప్రథమ సంచికను ఆవిష్కరిస్తున్న శ్రీ రంగనాథానంద స్వామి**

## పశ్చిమంలో యతి పాదం

అమెరికా లోని భక్తుల ఆహ్వానాన్ని మన్నించి పూజ్య స్వామీజీ 1998 సెప్టెంబరులో ప్రథమంగా అమెరికా దేశం పర్యటించారు. సనాతన ధర్మ వైభవ కేతనాన్ని అమెరికాలో రెపరెప లాడించారు. చికాగో, డెట్రాయిట్, క్లీవ్‌లాండ్, ఓర్లాండో మొదలైన నగరాలలో జ్ఞానయజ్ఞాలను నిర్వహించి జనులను అమితంగా స్పందింప చేశారు. 'Chicago Audience get another Vivekananda-like saint to expound Advaita Vedanta.' 'Saint thrills Chicago Audience with mesmerizing philo-sophical discourses.' 'Advaita Vedanta delivered to the common man in simple, pal-atable terms' - అనే శీర్షికలతో దిన పత్రికలు పూజ్య స్వామీజీని శ్లాఘించాయి.

## అపురూప విజ్ఞాన వేది - అసమాన కవితా పయోనిధి

శ్రీ స్వామి వారు తమ దివ్య బోధలతో అలసిపోయిన జీవితాలలో ఆశాలతలను పూయిస్తున్నారు. అలుపెరుగని కంఠంతో మానవాళి అశాంతి తలుపులను మూయిస్తున్నారు. వారికున్న శ్రావ్యమైన గాత్రం, గాన గంధర్వ వైదుష్యం అసమానము, అనితర సాధ్యము. మైదానాలనే తరగతి గదులుగా మార్చి లోతైన ఉపనిషత్ రహస్యాలను శ్రోతల హృదయాలలో నిక్షిప్తం చేసిన ఖ్యాతి శ్రీ స్వామీజీది. వారి భాష, బాణి అద్భుతం. వారి గళం, కలం ఒక దానితో మరొకటి పోటీ పడుతూ ఉంటాయి. ఒక దాని నొకటి మించి పోవాలనుకుంటాయి.

వేదాంత సాహితీ ప్రపంచంలో, తాత్త్విక భావనా జగత్తులో పూజ్య స్వామీజీ అపురూప విజ్ఞాన వేది. అసమాన కవితా పయోనిధి. గహనమైన వేదాంత విషయాలను సాధారణ మానవులకు కూడా

అవలీలగా, అలవోకగా అందించే వారి అసాధారణ వైదుష్యం అనుపమానము, అద్భుతము. అసామాన్య పాండిత్యంతో, అద్భుత రచనా పటిమతో శతాధిక గ్రంథాలతో పాటు **చైతన్య భాగవతం, చైతన్య రామాయణం, చైతన్య మహాభారత** గ్రంథాలను ప్రసాదించిన శ్రీ సుందర చైతన్యానందుల వారు ఎప్పుడెప్పుడా అని ఆంధ్ర ప్రజానీకం ఎదురు చూసిన **చైతన్యభగవద్గీత** గ్రంథాన్ని వాసుదేవుని ప్రసాదంగా సహృదయ లోకానికి సమర్పించి సంతర్పణం చేశారు. వేదమాతకు నీరాజనాలు అర్పించారు.

## చైతన్య దీప్తి

జ్ఞానబ్రహ్మ, ఆర్షవిద్యా వాచస్పతి, సత్సంగ ప్రచారమణి, సనాతన ధర్మ దీపికాధారి అను పలు బిరుదములతో యోగి పుంగవులు పూజ్య స్వామీజీని సత్కరించగా, సువర్ణ కంఠాభరణాలతో, హస్త కంకణాలతో, సువర్ణ కిరీటాలతో, గండపెండేర పురస్కారాలతో, గజారోహణలతో, కనకాభిషేకాలతో వివిధ ప్రాంతాల లోని భక్తులు, అనేక సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంస్థలు వీరిని సన్మానించాయి.

శ్రీ స్వామి వారిది ప్రచారోద్యమం. జన జాగరణోద్యమం. సమాజాన్ని చైతన్యవంతం చేసే సుందర సముద్యమం. ఆయన భారతీయ విజ్ఞాన సర్వస్వం. సనాతన ధర్మ పరిమళం. ఆర్ష సంస్కృతీ సభ్యతల భాండాగారం. ఇది ఆంధ్రుల భాగ్యం. శ్రీ స్వామి సుందర చైతన్యానందుల వారికి మనం సమకాలీనులం కావడం మన పురాకృత పుణ్యఫల విశేషం. శ్రీ స్వామి వారి అవిరళ కృషికి, త్యాగ జీవనానికి, జనులపై వారి కున్న అపార కృపకి ఆంధ్రావని భక్తి భావంతో, కృతజ్ఞతా భారంతో శిరమొడ్చి, కరములు జోడించి స్వామి వారి పాదపద్మాలకు నమస్కరిస్తూ ఉంది.



కురుక్షేత్రంలో గీతాచార్యుడు బోధ చేసిన పవిత్ర పుణ్యస్థలిలో 'చైతన్య భగవద్గీత' రచనకు శ్రీకారం చుడుతున్న పూజ్య స్వామీజీ



మేము చేస్తున్న భక్తి ప్రచారం ఈ **web sights** ద్వారా చేస్తున్నాము

**www.telugudevotionalswaranjali.blogspot.in**
**www.gitamakarandam.blogspot.in**
**www.sundaravignanagrandalayam.blogspot.in**
**www.hindudevotionalswaranjali.blogspot.in**
**OUR VIDEO CHANNELS:**
**www.youtube.com/user/hindudevotional0**
**www.youtube.com/user/Shruthimandiramu**
**www.youtube.com/user/devotionalswaranjali**
**PDF BOOKS CHANNEL: www.scribd.com/ysreddy94hyd**
**E mail ID: ysreddy94hyd@gmail.com**
**FACEBOOK: YEDAVALLI SUDARSHAN REDDY**
**pl forward the above links to your friends&relatives**
**our mediafire folderlinks**
**www.mediafire.com/?86epi81waeayl**
**www.mediafire.com/?7900suod857zc**
**www.mediafire.com/?45h5fdfw4igzi**
**www.mediafire.com/?606gdhk35zvbc**
**www.mediafire.com/?0t92f0wb91g18**
**www.mediafire.com/?xw75pfuld2dyy**
**our uploaded folder links:**
**www.4shared.com/account/dir/7389418/29f7347/sharing.html**
**www.4shared.com/account/dir/17611451/d787ef46/sharing.html**
**www.4shared.com/account/dir/10277723/80937010/sharing.html**
**www.4shared.com/account/dir/8542654/5e21d7f2/sharing.html**
**www.4shared.com/account/dir/13927785/d05881/sharing.html**
**www.4shared.com/account/dir/7389329/5bfa0697/sharing.html**
**www.4shared.com/account/dir/0R3Tnd0Y/sharing.html**
**www.4shared.com/dir/F2rw-Nf_/sharing.html**
**www.4shared.com/account/dir/WNtoWpN7/sharing.html**
**www.4shared.com/account/dir/nxtsJpm4/sharing.html**
**www.4shared.com/dir/gaxNSDyA/sharing.html**
**www.4shared.com/account/dir/0R3Tnd0Y/sharing.html**

# సుందర చైతన్యాశ్రమ ప్రచురణలు

## గ్రంథములు

1. చైతన్య మహాభారతం ( 2 సంపుటములు)
2. చైతన్య రామాయణం ( 2 సంపుటములు)
3. *చైతన్య భాగవతం ( 2 సంపుటములు)
4. చైతన్య భగవద్గీత ( 4 సంపుటములు)
5. చైతన్య పాంచజన్యం
6. *చంద్రభాగాతరంగాలు
7. విష్ణుసహస్రనామం
8. *శ్రీకృష్ణ కర్ణామృతం
9. *నిత్యసాధన చైతన్యం
10. చైతన్య భగవద్గీత ( చిన్న సైజు )
11. *అపరోక్షానుభూతి
12. అయితే విను
13. ఆత్మవిద్యావిలాసం
14. ఆనందలహరి
15. ఆనంద తీరాలు
16. *ఆత్మబోధ
17. అద్వైతానుభూతి
18. అవధూత గీత
19. భాస్కర శతకం
20. *భజనావళి
21. *భజగోవిందం
22. *బాలముకుందం
23. *బ్రహ్మసూత్ర దీపిక
24. చైతన్య లేఖలు - 3
25. చైతన్య సమీరాలు
26. చైతన్య భావసుమాలు
27. చైతన్య ప్రసంగాలు
28. *చైతన్య గీతికలు
29. దాశరథీ శతకం
30. ధన్యాష్టకం
31. *ద్వాదశ జ్యోతిర్లింగములు
32. *ఈశావాస్యోపనిషత్తు
33. *గురు గీత
34. గీతాంజలి
35. గోపీ హృదయం
36. జగద్గుర్వష్టకం
37. జ్ఞానదేవ్ అభంగాలు
38. జీవన్ముక్త గీత
39. హరివిల్లు
40. కీర్తనాంజలి
41. కృష్ణ లీలలు
42. కబీర్ గీతావళి
43. కేనోపనిషత్తు
44. కృష్ణకథా గానము
45. లక్ష్మీనృసింహా స్తోత్రము
46. మలయ మారుతం
47. మహిష్మతిలో శంకరయతి
48. *ముండకోపనిషత్తు
49. ముక్తికోపనిషత్తు
50. మువ్వల సవ్వడి
51. *ముకుంద మాల
52. నరసింహ శతకం
53. నారద గాన రామాయణము
54. న్యాయ దీపిక
55. *నారాయణ స్మరణం
56. నిర్వాణషట్కం
57. *నిగ్రహం
58. నిర్గుణ మానస పూజ; సదాచారం
59. *పురుషసూక్తం
60. *పూజావిధానం
61. ప్రపంచసారము
62. *పండుగలు - ప్రాశస్త్యము



63. ప్రబోధ సుధాకరం; వేదాంతడిండిమం
64. ప్రశ్నోత్తర రత్నమాలిక
65. ప్రశ్నోపనిషత్తు
66. ప్రాతఃస్మరణ స్తోత్రం
67. *రామ గీత
68. రామజోగి చిట్కాలు
69. శ్రీరుద్రమ్
70. *సాధువాక్యం
71. సదాశివబ్రహ్మేంద్ర కీర్తనలు
72. సుందర సంపాదకీయాలు - 1
73. సుందర సంపాదకీయాలు - 2
74. సుందర పారిజాతాలు
75. సనాతన స్రవంతి
76. సంక్షిప్త రామాయణము
77. *స్వామియే శరణం అయ్యప్ప
78. *సాధన సోపానాలు
79. *సాధన పంచకం
80. *సుందర మందారాలు
81. శ్రీరామ అష్టోత్తర శతనామ స్తోత్రం
82. శివ గీత
83. శివస్తోత్రం
84. * శివ దర్శనం
85. శ్రీకాళహస్తీశ్వర శతకం
86. సువర్ణమాలా స్తుతి
87. శతశ్లోకీ
88. స్వాత్మప్రకాశిక
89. శివానంద లహరి
90. షట్పదీస్తోత్రం; పారతత్త్వోపదేశం
91. కనకధారా స్తోత్రం
92. శ్రీ శంకరాచార్యస్వామి జీవితము
93. శివాపరాధ క్షమాపణ స్తోత్రం
94. శివ మహిమ్నః స్తోత్రం
95. *సౌందర్య లహరి
96. *తత్త్వబోధ
97. విజ్ఞాన నౌక
98. *విజ్ఞాన కదంబం
99. వేదాంత పంచదశి
100. వేదాంత వెన్నెల
101. *వేమన యోగి
102. వ్యాసప్రసాదం
103. విబూది పండ్లు
104. విచారబిందు ఉపనిషతు
105. *వేదాంతసార ఉపనిషత్తు
106. యోగసారోపనిషత్తు
107. యక్షప్రశ్నలు
108. జీవన సత్యాలు

## ENGLISH BOOKS

1. Chaitanya Panchajanyam
2. *Aatma Bodha
3. Bhaja Govindam
4. Bhagavatam (1st canto)
5. A Peep into vedantic lore
6. Hymns unto Him
7. Hints on practical vedanta
8. The Milky way
9. Wings of the wind
10. Voice of Valmiki (Balakanda)
11. Voice of Valmiki (Ayodhyakanda)
12. Voice of Valmiki (Aranyakanda)
13. Voice of Valmiki (Kishkindakanda)
14. Voice of Valmiki (Sundarakanda)
15. Voice of Valmiki (Yudhakanda)
16. Break The Shackles

## ఆడియో సి.డి.లు

1. చైతన్య భజనలు - 1
2. చైతన్య భజనలు - 2
3. చైతన్య భజనలు - 3
4. చైతన్య భజనలు - 4
5. చైతన్య భజనలు - 5
6. చైతన్య భజనలు - 6
7. చైతన్య భజనలు - 7
8. చైతన్య భజనలు - 8
9. చైతన్య గానం - 1
10. చైతన్య గానం - 2
11. చైతన్య గానం - 3
12. చైతన్య గానం - 4
13. చైతన్య గానం - 5
14. చైతన్య గానం - 6
15. చైతన్య గానం - 7
16. చైతన్య గానం - 8
17. చైతన్య గానం - 9
18. చైతన్య గానం - 10
19. చైతన్య గానం - 11
20. నా కవితే కోవెల
21. సుందర స్తోత్రమంజరి
22. ఆనందవర్షిణి
23. గోపికా గీతం
24. అందరికీ వందనములు
25. నమః పార్వతీ పతయే
26. జై జై మహాదేవ
27. శివకుటుంబం
28. రామమ్
29. శ్యామమ్
30. విష్ణుసహస్రనామం
31. చైతన్య మురళి
32. సంకీర్తనా లహరి
33. సుందర రవళి
34. శివానంద లహరి (2 సి.డి.లు)
35. నిత్యమంగళం (7 సి.డి.లు)
36. శివశివ
37. రామనామసుధ
38. కీర్తనాంజలి
39. భజగోపాలం
40. దివ్యౌషధము
41. కొండదేవుని కొలువు
42. కృష్ణకథాగానము (2 సి.డి.లు)
43. వెన్నముద్దలు (2 సి.డి.లు)
44. రామజోగి చిట్కాలు (2 సి.డి.లు)
45. చైతన్య సంకీర్తనం (6 సి.డి.లు)
46. మేలుకొలుపులు

## డి.వి.డి.లు (వీడియో)

1. ఎక్కడున్నాడు దేవుడు?
2. ముకుందమాల (10 డి.వి.డి.ల సెట్)
3. సాధ్యము - సాధన (6 డి.వి.డి.ల సెట్)
4. చైతన్య ప్రస్థానం (10 డి.వి.డి.ల సెట్)
5. శ్రీ వాసుదేవ ద్వాదశాక్షరీ మహామంత్ర స్తోత్రం (5 డి.వి.డి.ల సెట్)
6. పురుషసూక్తం (6 డి.వి.డి.ల సెట్)
7. జీవన జ్యోతి (6 డి.వి.డి.ల సెట్)
8. రామాయణము (బాలకాండ) (6 డి.వి.డిల సెట్)
9. రామాయణము (అయోధ్యకాండ) (7 డి.వి.డి.ల సెట్)
10. రామాయణము (అరణ్యకాండ) (4 డి.వి.డి.ల సెట్)
11. రామాయణము (కిష్కింధకాండ) (3 డి.వి.డి.ల సెట్)
12. రామాయణము (సుందరకాండ) (4 డి.వి.డి.ల సెట్)
13. రామాయణము (యుద్ధకాండ) (4 డి.వి.డి.ల సెట్)
14. ముండకోపనిషత్తు ప్రథమ ముండకం (ప్రథమ ఖండము) (4 డి.వి.డి.ల సెట్)
15. ముండకోపనిషత్తు ప్రథమ ముండకం (ద్వితీయ ఖండము) (3 డి.వి.డి.ల సెట్)
16. ముండకోపనిషత్తు ద్వితీయ ముండకం (ప్రథమ ఖండము) (3 డి.వి.డి.ల సెట్)
17. ముండకోపనిషత్తు ద్వితీయ ముండకం (ద్వితీయ ఖండము) (3 డి.వి.డి.ల సెట్)
18. ముండకోపనిషత్తు తృతీయ ముండకం (ప్రథమ ఖండము) (3 డి.వి.డి.ల సెట్)
19. ముండకోపనిషత్తు తృతీయ ముండకం (ద్వితీయ ఖండము) (2 డి.వి.డి.ల సెట్)
20. రామాయణ ప్రవచనములు (28 డి.వి.డి.ల సెట్)
21. ముండకోపనిషత్తు (18 డి.వి.డి.ల సెట్)
22. ఆత్మబోధ (18 డి.వి.డి.ల సెట్)
23. ఈశావాస్యోపనిషత్తు (7 డి.వి.డి.ల సెట్ )
24. చైతన్య భజనలు
25. చైతన్య రామ భజనలు



## వీడియో సి.డి.లు

1. ఈశ్వర వైభవం
2. భక్తి వైభవం
3. తరించే ఉపాయం
4. చింత తీరే మార్గం
5. చైతన్యాత్మ
6. సాధన చైతన్యం
7. సద్గురు మహిమ
8. విజయదశమి
9. పాడినా నీ పాటలే
10. త్రివర్గములు
11. అవస్థాత్రయ ప్రక్రియ
12. ప్రగతికి ప్రతిబంధకాలు
13. ధ్యాన సాధన
14. జ్ఞాన సరస్వతి
15. మహాగణపతి
16. నిర్గుణ ధ్యానం
17. ఇది చాలు
18. ఎక్కడున్నాడు దేవుడు?
19. గుడిమెట్లు (పుస్తకంతో పాటు)
20. జ్ఞాన దీపం (2 వి.సి.డి.ల సెట్)
21. బంధమోక్షాలు (2 వి.సి.డి.ల సెట్)
22. కర్మయోగము (2 వి.సి.డి.ల సెట్)
23. రామజోగి చిట్కాలు (2 వి.సి.డి.ల సెట్)
24. వెన్నముద్దలు (2 వి.సి.డి.ల సెట్)
25. కృష్ణకథాగానము (2 వి.సి.డి.ల సెట్)
26. మనీషా పంచకం (5 వి.సి.డి.ల సెట్)
27. సాధన పంచకం (7 వి.సి.డి.ల సెట్)
28. దక్షిణామూర్తి స్తోత్రం (8 వి.సి.డి.ల సెట్)
29. ఈశావాస్యోపనిషత్తు (11 వి.సి.డి.ల సెట్)
30. భజగోవిందం (11 వి.సి.డి.ల సెట్)
31. ఉపదేశసారం (14 వి.సి.డి.ల సెట్)
32. కైవల్యోపనిషత్తు (14 వి.సి.డి.ల సెట్)
33. విష్ణుసహస్రనామం (17 వి.సి.డి.ల సెట్)
34. భగవాన్ శ్రీకృష్ణ (21 వి.సి.డి.ల సెట్)
35. శ్రీ రుద్రమ్ (22 వి.సి.డి.ల సెట్)
36. కఠోపనిషత్తు (26 వి.సి.డి.ల సెట్)
37. తైత్తిరీయోపనిషత్తు (శిక్షావల్లి) (15 వి.సి.డి.ల సెట్)
38. తైత్తిరీయోపనిషత్తు (బ్రహ్మవల్లి) (21 వి.సి.డి.ల సెట్)
39. తైత్తిరీయోపనిషత్తు (భృగువల్లి) (12 వి.సి.డి.ల సెట్)
40. బ్రహ్మసూత్రములు (అధ్యాసభాష్యం) (8 వి.సి.డి.ల సెట్)
41. బ్రహ్మసూత్రములు (జిజ్ఞాసాధికరణం) (9 వి.సి.డి.ల సెట్)
42. బ్రహ్మసూత్రములు (జన్మాద్యధికరణం) (8 వి.సి.డి.ల సెట్)
43. బ్రహ్మసూత్రములు (శాస్త్రయోనిత్వాత్) (5 వి.సి.డి.ల సెట్)
44. శ్వేతాశ్వతరోపనిషత్తు (1వ అధ్యాయం) (9 వి.సి.డి.ల సెట్)
45. శ్వేతాశ్వతరోపనిషత్తు (2వ అధ్యాయం) (5 వి.సి.డి.ల సెట్)
46. శ్వేతాశ్వతరోపనిషత్తు (3వ అధ్యాయం) (5 వి.సి.డి.ల సెట్)
47. శ్వేతాశ్వతరోపనిషత్తు (4వ అధ్యాయం) (6 వి.సి.డి.ల సెట్)
48. శ్వేతాశ్వతరోపనిషత్తు (5వ అధ్యాయం) (5 వి.సి.డి.ల సెట్)
49. శ్వేతాశ్వతరోపనిషత్తు (6వ అధ్యాయం) (6 వి.సి.డి.ల సెట్)
50. శ్రీరామాష్టకం (6 వి.సి.డి.ల సెట్)
51. దృగ్దృశ్యవివేకం (7 వి.సి.డి.ల సెట్)
52. అద్వైత మకరందము (8 వి.సి.డి.ల సెట్)
53. అన్నపూర్ణా స్తోత్రమ్ (6 వి.సి.డి.ల సెట్)
54. హనుమాన్ చాలీసా (9 వి.సి.డి.ల సెట్)
55. భగవద్గీత (14 వి.సి.డి.ల సెట్)
56. విజ్ఞాన నౌక (8 వి.సి.డి.ల సెట్)
57. ముకుందమాల (15 వి.సి.డి.ల సెట్)
58. సాధ్యము - సాధన (9 వి.సి.డి.ల సెట్)
59. చైతన్య ప్రస్థానం (13 వి.సి.డి.ల సెట్)
60. శ్రీవాసుదేవ ద్వాదశాక్షరీ మహామంత్ర స్తోత్రం(6 వి.సి.డి.ల సెట్)
61. పురుషసూక్తం (8 వి.సి.డి.ల సెట్)
62. జీవనజ్యోతి (8 వి.సి.డి.ల సెట్)